# వావిలాల సోమయాజులు

## సాహిత్యం-4

### వ్యాసాలు

ఎమెస్కో

**Vavilala Somayajulu Saahityam- 4**
**VYAASAALU**
**వావిలాల సోమయాజులు సాహిత్యం - 4**
**వ్యాసాలు**

సంపాదకులు: **డా. డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ: **మార్చి, 2018**

మూల్యం: రూ. **500/-**

ISBN: 978-93-86763-69-3

ముఖచిత్రం: **స్టార్ మీడియా సర్వీసెస్,** హైదరాబాద్

టైటిల్ డిజైన్: **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్-500029, తెలంగాణ.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు
**ఎమెస్కో బుక్స్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట
విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail : emescovja@gmail.com

# ముందుమాట

శ్రీ వావిలాల సోమయాజులు (19.1.1918 – 9.1.1992) గుంటూరు జిల్లా విప్రులపల్లె అగ్రహారంలో జన్మించారు. తండ్రి సింగరావధానులుగారు, తల్లి మాణిక్యాంబ గారు. నరసరావుపేట, గుంటూరులో వారి విద్యాభ్యాసం జరిగింది. భార్య కైకమ్మగారు.

సోమయాజులుగారు 1940–46 మధ్య గుంటూరులోని శ్రీ శారదానికేతన ప్రాచ్య కళాశాలలో ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆ తర్వాత 1976లో పదవీవిరమణ పొందేవరకు గుంటూరు హిందూ కళాశాలలో ఆంధ్రభాషోపన్యాసకులుగా పనిచేశారు.

సోమయాజులుగారి జీవితం పూర్తిగా సాహిత్య రచనకు, సాహిత్య ప్రచారానికే అంకితమై పోయింది. తనకు ఇరవయ్యేళ్లు నిండీ నిండకముందే సాహిత్య సంస్థలలో సభ్యుడిగా సాహిత్య సేవ ప్రారంభించారు. 1939 నుండి సాహితీ సమితి సభ్యులు. ఈ సమితికి సహాయ కార్యదర్శిగా, కార్యదర్శిగా వ్యవహరించారు. నవ్యసాహిత్య పరిషత్తుకు సహాయ కార్యదర్శి. 'ప్రతిభ' పత్రికకు రచనలను ఎంపిక చేసే నిర్ణాయక సంఘంలో సభ్యుడు. 1963–73 మధ్య ఒక దశాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులు.

సోమయాజులుగారు సంస్కృతాంధ్రాంగ్లాలలోను, హిందీలోను గొప్ప పండితులు. ఒక భాష నుండి మరొక భాషలోనికి అనువాదం చేయగలిగిన సమర్థత కలిగినవారు. వచనాన్నే కాదు పద్యాన్ని పద్యరూపంలోనే అనువదించడంలో సిద్ధహస్తులు. ఆయన సహజంగానే కవి కావడంవల్ల అనువాదంలోనూ మూలకావ్యం లోని కవిత్వాంశను సంపూర్ణంగా ప్రదర్శించగలిగిన కవితా హృదయాన్ని సొంతం చేసుకున్నారు.

సోమయాజులుగారి సాహిత్య సృజనా జీవితం బహువిపులమైంది. ఇరవై ఏళ్ల వయస్సులోనే ప్రారంభమైన వారి సాహిత్య సేవ జీవితాంతం కొనసాగింది. ఇంత బహుళంగా రచనలు చేసిన వారి సంఖ్య చాలా తక్కువ. అందులోనూ ఇన్ని ప్రక్రియలలో రచనలు చేసినవారు మరీ అరుదు. ఆయన కవిత్వం రాశారు. అందులో పద్యరచనలూ ఉన్నాయి, గేయ రచనలూ ఉన్నాయి. అతిసాధారణ వచనాన్ని కూడా అటు పద్యంలోనూ, ఇటు గేయంలోనూ ఇమిడ్చి మనోహరంగా రచింపగలిగిన శక్తి వారిది. నాటకాలు రాశారు, నాటికలు రాశారు. పద్య నాటికలు రాశారు, గేయనాటికలు రాశారు, సంగీత రూపకాలు రచించారు. శ్రవ్య నాటికలు రాశారు. నవలలు రాశారు. ఆంగ్లం నుండి నాటకాలూ, నవలలూ అనువదించారు. వీటిలో షేక్స్పియర్ నాటకానువాదాలు తెలుగులో వావిలాల వారివే బహుజనాదరణ పొందాయి. హిందీ నుండి మహాకవి జయశంకర ప్రసాద్ కావ్యాలు ‘కామాయని’, ‘ఆంసూ’ లను అతిమధురంగా పద్యకావ్య రూపంలో అనువదించారు.

ప్రౌఢ కవి అయిఉండీ పిల్లలకోసం సరళవచనంలో నవలలూ, దేశనాయకుల, దేశభక్తుల, చారిత్రక వ్యక్తుల, కవుల జీవిత గాథలూ రచించారు.

ఆయన పద్యరచన ఎంత విపులమో గద్యరచనకూడా అంతే విపులం. కథలు, జీవితగాథలు, నాటకాలు, నవలలను పక్కన బెడితే ఆయన సృష్టించిన వ్యాస సాహిత్యం అపారం. పరిశోధనాత్మక వ్యాసాలెన్నో రచించిన సోమయాజులుగారు సృజనాత్మక వ్యాసాలూ విస్తృతంగా రాశారు. ఆయన ఎంపిక చేసుకున్న విషయాలే మనల్ని విస్మయ పరుస్తాయి. డజనుకు పైగా వ్యాసాలు వివాహం పైనే అంటే ఆయనకు ప్రజల సాంఘిక జీవనం మీద, ఆచార వ్యవహారాల మీద ఉన్న పట్టును, అవగాహనను మనం అర్థం చేసుకోవచ్చు, మూడుపదుల వయస్సులో ఆయన వాత్స్యాయన కామసూత్రాలపై సాతవాహన సంచికలో రాసిన బృహద్వ్యాసం నేటికీ పరిశోధన వ్యాసానికి ఉదాహరణ ప్రాయంగా నిలుస్తుంది. ఆయన ఏమి రాసినా అది ప్రామాణికమే. తాను చెప్పే ప్రతి విషయానికీ ఆయన ఆధారం చూపుతారు.

సోమయాజులు గారి రచనలకు మరోపార్శ్వం కూడా ఉంది. ఆధ్యాత్మికంగా భారతీయ దార్శనికతా ప్రియుడైన ఆయన బహాయీ సాహిత్యాన్ని అనువదించారు. క్రైస్తవ రచనలను అనువదించారు.

సోమయాజులుగారు ఇంగ్లీషులో కూడా కొన్ని వ్యాసాలు రచించారు.

సాహిత్యాచార్య, సాహిత్యరత్న, సాహిత్య బంధు, మధురకవి, కవి భూషణ, కుమార ధూర్జటి, పద్యవిద్యాధర వంటి అనేక బిరుదాలతో ఆంధ్ర సాహిత్యలోకం వావిలాల సోమయాజులు గారిని సమ్మానించింది. ఈ బిరుదులు ఆయన రచయితగా ఒకవైపు, సాహిత్య సేవకుడుగా మరోవైపు చేసిన కృషికి అద్దం పడతాయి.

ఐదు దశాబ్దాలకు పైబడిన సాహిత్య జీవితంలో సోమయాజులుగారు చేసిన అసంఖ్యాక రచనల్లో ఎన్నో అలభ్యంగా ఉండిపోయాయి. కొన్ని అముద్రితాలుగా ఉండిపోయాయి. లభించిన రచనల్లో ముద్రితా ముద్రితాలన్నింటిని కలిపి ఇప్పుడు ఆయన లభ్యరచనల సమగ్ర సంపుటాలను ప్రచురించే ప్రయత్నం చేస్తున్నాం.

ఈ సంపుటులలో ఇది నాల్గవది.

ఈ సంపుటిలో వావిలాల సోమయాజులుగారు తమ సుదీర్ఘ రచనా జీవితంలో రచించిన అనేక వ్యాసాలున్నాయి. వ్యాసరచనలో సోమయాజులు గారిది విశిష్టమైన శైలి. ఆయన ప్రామాణికతకు పెద్దపీట వేస్తారు. ఆయన వ్యాసంలో శాస్త్రీయత, ప్రామాణికతతో పాటు సృజనాత్మకత, చక్కగా చదివించే శైలి, సమగ్రతా లక్షణాలుంటాయి. ఒక విషయానికి ప్రామాణికత పూర్వవిద్వాంసుల నిష్కర్షల నుండి వస్తుంది. బహుగ్రంథ పఠనం, ఆ చదివిన విషయాలను తాను చెప్పదలచుకున్న విషయానికి సమన్వయించడం వారి పరిశోధన వ్యాసాలలో అడుగడుగునా గోచరిస్తుంది. శాతవాహన సంచికలో ప్రచురితమైన వాత్స్యాయనుడు – కామ సూత్రాలు అన్న వ్యాసానికి 103 అధోజ్ఞాపికలున్నాయి. అధోజ్ఞాపికలలో వారు ఉటంకించిన గ్రంథాలు, వ్యాసాలు చూసినప్పుడు ఒక్క వ్యాసరచనకు ఆయనెంత శ్రమించిందీ మనకర్థమవుతుంది. 'మణిప్రవాళము' లోని 8 వ్యాసాలకు 151 అధోజ్ఞాపికలున్నాయి.

సాహిత్య విద్యార్థులకోసం ఆయనెన్నో వ్యాసాలు రాశారు. ఒక కావ్యఘట్టాన్ని పరిచయం చేసేటప్పుడు కూడ మూలగ్రంథం, మూలరచయిత, అనువాదకుడు, కావ్యతత్వం, కథ, పాత్రచిత్రణ, విశేషాలు వంటి విషయాలతో వ్యాసం సమగ్రంగా ఉంటుంది. పాఠకుడు సమాచారం కోసం మరొక చోటికి పోవలసిన అవసరముండదు. ఒక నాటకం గురించి రాస్తే సంపూర్ణంగా నాటక లక్షణంతో అన్వయించి చెప్తారు.

ఆయన కవి, నాటకకర్త, సహజంగా భావుకుడు కాబట్టే ఆయన హృదయం ఒక రచనను చూడగానే రసార్ద్రం అవుతుంది. దానిపై అపారమైన ఆదరం కలుగుతుంది. ఆ కవి లేదా రచయితపై స్నేహభావం జనిస్తుంది. ఆ రచన లేదా రచయిత గురించి ఆయన రాయడం ప్రారంభించగానే ఈ లక్షణాలన్నీ ఒక్కసారిగా ఆయనను ఆవరిస్తాయి.

వావిలాల సోమయాజులుగారు పుంఖానుపుంఖంగా వ్యాసాలు రచించినా, వారి వ్యాసాల సంపుటి 'మణి ప్రవాళము' ఒక్కటే గ్రంథరూపం ధరించింది. దీనిలోని ఎనిమిది వ్యాసాలూ సృజనాత్మక వ్యాసాలే.

ఈ సంపుటిలోని పది వ్యాసాలు వివాహం గురించేనంటే ఆయన ఏ విషయాన్నయినా ఎంత విపులంగా పరిశీలిస్తారో మనం అర్థం చేసుకోవచ్చు.

వావిలాల సోమయాజులుగారు తమ సాహిత్యవ్యాసాలలో ప్రాచీనాధునిక తెలుగు సాహిత్యాలు రెండింటినీ సమదృష్టితో చూశారు.

సాహిత్యాన్ని, సంస్కృతిని, లోకం తీరును అర్థం చేసుకోవడానికి ఉపయోగపడడమే కాక వాటిని చూడవలసిన దృష్టిని కూడా మనకు సోమయాజులు గారు అందించారు.

ఈ వ్యాసాలను చదవడం ద్వారా ఆ దృష్టిని అందుకోవడమే పాఠకునికి కలిగే మహోపకారం.

**డి. చంద్రశేఖర రెడ్డి**

## ఇందులో....


| | | |
|---|---|---|
| 1. | మణిప్రవాళము | 9–106 |
| 2. | సంస్కృతి | 107–424 |
| 3. | సాహిత్య విమర్శ | 425–832 |
| 4. | ఇతర వ్యాసాలు | 833–855 |

# మణిప్రవాళము

## విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | పుష్పలోకము | 17 |
| 2. | చంద్రుఁడు – చంద్రిక | 26 |
| 3. | మలయానిలుఁడు | 39 |
| 4. | భ్రమరాన్వేషణము | 47 |
| 5. | నిద్రావైచిత్రి | 58 |
| 6. | స్తోత్రపాఠము | 70 |
| 7. | శత్రువులు – శత్రుత్వము | 79 |
| 8. | నవ్వు | 88 |

# నవమణి

## మాతృశ్రీ మాణిక్యాంబిక పవిత్ర స్మృతికి

తే. ఏడుపే నీకు నేనాఁడు తోడు కాఁగఁ
బదియు నార్నెల లేనియుఁ బైనఁబడని
నన్ను నీ చేత నిడి చనినాఁడు నాన్న
సాకినావు శిక్షించి ప్రశస్తగతిని.

తే. అకట! దారిద్ర్య మొక్కట, వ్యాధి యొకట
బాధ వెట్టఁగ నెట్టులో పడుచు నన్నుఁ
గనుచు జీవించినావు రాక్షసపుఁదమిని
ననుభవించిన దణుమాత్రమేని లేక.

తే. నేనె యన్నను, దమ్ముఁడ నేనె, చెల్లి
యలును నక్కయు నైన నా కైతి వమ్మ
విందరను జూచుకొన్నాఁడ యేను నీలో;
ఈవు లేకున్న నాకు వీ రేరు లేరు.

తే. శబ్దములయర్థ మొక్కింత, చదువనేర్తు
నైన నప్పుడు తల్లిప్రేమనిన నేమొ
యెఱుకపడనిది నేఁటి యా రేండ్లలోన
నెన్ని రూపాలతోఁ దోఁచి నన్నుఁ గలఁచె.

తే. లోకమున కేమి కాకులమూఁక కాదె?
ప్రథలఁ గల్పించె మఱచె నిన్ పరమచరిత !
యెఱుఁగు దేగతి భక్తి సేవించినామొ
యీవు లేని లోపాన మా కెంత దిగులొ!

తే. ఎవరిఁ గనుఁగొన్న నేమిటో యెఱుఁగ నమ్మ!
యేను ఋణపడి నట్లుగా నెంతు రేల ?
రక్తమును బిండి యిచ్చిన రక్తిఁ గొనని
చెడుగు సాహుల కడ నప్పుఁ జేసినామె!

తే. అమ్మ! అపుడు నీ వేఁగినయంతనుండి
చిన్ని మనతోఁటలోనఁ దోఁచినవి మూఁడు
లేగులాబీలు; ఏ రేయొ యేఁగుదెంచి
విరిసి వాసనలలమ దీవించి పొమ్మ!

తే. అప్పు డప్పుడు స్వప్నాల నవతరిల్లి
మనసుపడి నీదు మనుమల మనుమరాండ్ర
నెత్తి ముద్దాడి శీలమ్ము నింతనేర్పి
యరుగు మోతల్లి ! యదియె మా కౌను మేలు.

తే. సప్త సంతానములఁ గృతి శాశ్వతంబు
స్వర్గసౌఖ్యప్రదం బన్నపలుకు నమ్మి
యమ్మ! నీ కిచ్చుచున్నాఁడ నంకితమును
జెప్పి స్వర్గనిత్యనివాససిద్ధి కొఱకు.

# కృత్యాది

ఛందోబద్ధములైన కావ్యము లవతరించిన పిమ్మటనే సాహిత్య లోకమున గద్యకృతు లుత్పన్నములైనవి. ఈ వాక్యము ప్రపంచము నందలి సర్వసాహిత్యముల పట్ల నన్వయించు నొక సుసత్యము. దీనినిబట్టి నిత్యవ్యవహారమున గద్యము లేదని కాదు. కళా విన్యాసాత్మకములైన రసవద్రచన లీసాహిత్యవిభాగము నందుఁ బద్యమయ కృతులకంటెఁ బూర్వము పుట్టలేదని యభిప్రాయము.

'గద్యం కవీనాం నికషం వదంతి' – ఇది దేవభాషాగద్యను గూర్చిన యొక సూక్తి. ప్రాచీన భారతమున గీర్వాణవాణి యందు గద్యము బహువిధగతుల విలసిల్లినది. అలంకార శాస్త్ర గ్రంథముల వలన నాఖ్యాయి కాది పంచవిధ గద్యములుఁ బ్రవర్తిల్లి నట్లవగత మగుచున్నది. 'బాణోచ్ఛిష్ట మిదం జగ' త్తను నాభాణకమునకు స్థానమై కాదంబరీ, హర్షచరిత్రల విశేషవిఖ్యాతి గడించుకొనిన మహాకవి బాణభట్టారకుఁ డన్యకవి పాంథగమ్యములు కాని మనోహర మార్గముల విలసిల్లి గద్యప్రపంచ స్వర్ణసింహాసన మధిష్ఠించియున్నాఁడు.

నన్నయ భట్టారక మహాకవిముఖమున నాంధ్రభాషయందాది కావ్యము చంపువుగ జన్మించినది. చంపూసరణినే పురాణ, ప్రబంధకవు లభిమానించిరి. అందుచే బహుకాలమునకుఁ బిమ్మటఁ గాని ప్రత్యేక గద్య కావ్యములు పుట్టుటకు వీలు కలుగలేదు. నేఁటికిని మహాకావ్య లక్షణములు కలిగి ప్రాచీన ప్రబంధ సరణి ననుసరించుచు శ్రవణ బెళగొళలోని గోమతేశ్వరునివలె గుండె లవియఁ గన్పించుఁ గద్యప్రబంధము జన్మింపలేదనుట సాహసోక్తి కాదేమో! అట్టి కృతి వినిర్మింప నొక బాణ భట్టారకుఁ డాంధ్రసాహిత్యావని కే నాఁ డవతరిల్లునో!!

ఆంగ్లసాహిత్యమున గద్యము బహువిధ వస్తు విన్యాస వైభవములతో విలసిల్లి విస్తరిల్లినది. దేశీయ సాహిత్యముల కా సాహిత్యముతో సన్నిహితసంబంధ మేర్పడిన పిమ్మట వీని యందును గద్యము బహువిధగతుల నొప్పుచున్నది. ఒకనాఁటి యాంధ్రగద్యకావ్యతరువు నేఁడు వివిధ శాఖోపశాఖలతో విస్తృతమై మహావృక్షరూపము నొందుచున్నది. నవలాశాఖయందు జన్మించిన 'చెలియలికట్ట' 'వేయిపడగలు' 'ఏకవీర' 'హిమ బిందు' 'నారాయణభట్టు' 'రుద్రమదేవి' విశ్వసాహిత్యమున విశిష్టస్థాన మాక్రమింపదగిన యుత్కృష్టకృతులు. అనతికాలమున నిందుఁ గథాశాఖికను బుట్టిన పూవు ప్రపంచ ప్రథమ గణ్యమగుట యాంధ్రుల కతిముదావహమైన యంశము, విమర్శ, వ్యాస శాఖలు బహుముఖవ్యాప్తములై వర్ధిల్లుచుండుట గన నచిర కాలమున నిం దమోఘరచన లుద్భవిల్లఁగల వనుట యత్యుక్తి కాఁజాలదు.

కొలఁది కాలమునుండి నా లేఖిని గద్య మహావృక్షము నందలి వ్యాసశాఖపై నభిమానము వహించినది. అది యా శాఖ యందలి సర్వసామాన్యవిలాసముతోఁబాటు వినూతనము లైన విన్నాణముల వెదకుచున్నది. ఆ యన్వేషణఫలితములఁ దొలుదొల్తఁ బత్రికా ముఖమునఁ బ్రకటించి యాంధ్ర రసజ్ఞలోక మొసఁగిన యపూర్వప్రోత్సాహ దోహదమున నేఁడు 'మణిప్రవాళ' రూపమునఁ బ్రకటించుచున్నాఁడను.

నామకరణము కృత్యాద్యవస్థలలో నాద్యము. తొలుత నప్పుడప్పుడు నీ వ్యాసముల నొక సమాహారముగఁ బ్రకటించు కోర్కెలు వొడమి నపుడు 'శక్రచాపము', 'పుష్పలోకము', 'మణిమేఖల' మొదలగు విచిత్ర నామములు తోఁచినవి. ఈ సమాహృతి యందుఁ గొన్ని వ్యాసములలోఁ గిమ్మీర కాంతులు కన్పింపక పోవుటచే 'శక్రచాపము'ను గ్రహింపలేదు. పుష్పలోకమున నిర్గంధకుసుమము లుండుట పరిపాటి యైనను గొన్ని వ్యాసము లట్టివగుట 'పుష్పలోకము'పై బుద్ధి పోలేదు. మణులు కొన్ని మాత్రమగుట వలనను, మేఖలలు మోటగుట వలనను నది తృప్తియొసఁగలేదు. తుదకు బహుకారణముల వలన

‘మణిప్రవాళము’పై మనసు పడితిని. నా కావ్య నేపథ్య గృహభాగము నీ రీతి మీ ముందుఁ బ్రదర్శించుచున్నందుకు రసికలోకము మన్నించుఁ గాక!

గ్రంథచౌర్యబుద్ధితోఁ గాక మధ్యమమణిన్యాయము ననుసరించి ప్రాచీనార్వాచీన భావుకుల మనోహరభావములను మనోజ్ఞచిత్రముల నెడనెడ గ్రహించి పొదిగి స్వాయత్త మొనర్చుకొనుట యీ సమాహారమునందుఁ గన్పించును. అవి యన్నియును మణులు, నా యల్పబుద్ధికిఁ దోఁచినవి ప్రవాళములు. ఈ కారణమునను నీ సమాహృతి మణిప్రవాళము.

మణిప్రవాళము ప్రాచీనమలయాళ భాషయందు మహాకవుల నాకర్షించిన మనోహర రచనా మార్గము, సంస్కృతపద ఘటిత సమాసభూయిష్ఠమై తుదిని దేశీయ ప్రత్యయములఁ జేర్చుట దీనికి లక్షణము. ఇట్టి కలఁగలపు మెలపులతోఁ గర్ణాటక సంగీతమున ‘మణిప్రవాళ’ మను నొక శైలియున్నది. ఇట్టి భాషాశైలీ విశేషములను గొన్ని వ్యాసముల నిరూపించుటకు యత్నించితిని.

అలంకార శాస్త్రముల సమాసబహుళమగు నుత్కళికాప్రాయము, నల్పసమాస యుతమైన చూర్ణిక, ఛందోనిబద్ధ వృత్తవాసనలు గల వృత్తగంధి, సమాసరహితమైన ముక్తకము గద్యశయ్యావిభేదములుగఁ జెప్పఁబడినవి. ప్రకరణానుకూలముగ నీ మణిప్రవాళమున నీ చతుర్విధ గద్యరచనావిచ్ఛిత్తిని జూపించుటయే నా సంకల్పము.

మణిప్రవాళమున గొన్ని వ్యాసములు లూతాతంతు సద్మ సదృశములు, కొన్ని ‘బహులోద్యాన సంచారణ చణ షట్చరణసమానీత పుష్పాసవ సంభృత మధుకోశ సదృశములు.’ కొన్ని స్వర్ణకార సామర్థ్య నిరూపణములు. ఈ యూర్ణనాభ, సారంగ, కళాదులకుఁ గల ప్రతిభావ్యుత్పన్నతలలో నే సహస్రాంశము లీ రచనయందున్నట్లు రసజ్ఞలోకము గుర్తించినచో నేను ధన్యుఁడను!

ప్రాచీనములకుఁ బ్రతిబింబములను గాని, యాధార రహితములైన కేవలోత్పాద్యములను గాని యామోదింపని బుద్ధి యిట్టి

మిశ్రరచనామార్గనూత్నతలకు వేడుక పడినది. ఇందుఁబురాత నాధునాతన భావుకుల రచనా స్వీకారమునఁ బ్రకరణానుకూలముగ నేనొనర్చిన చేర్పు కూర్పులకు, మార్పులకు విజ్ఞులు మన్నించెదరుగాక!

నిద్రాళువునై యున్న నన్ను మేల్కొల్పి యిట్టి రచనలకుఁ బురికొల్పి నాచే నీ మణిప్రవాళమును బ్రకటింపఁజేయుటకు బహురీతుల దోహద మొసఁగిన గురువర్యులకు, నాప్తమిత్రులకు నా ప్రణామములు, నమోవాకములు!!

హిందూ కళాశాల **వావిలాల సోమయాజులు**
గుంటూరు ఆంధ్రభాషా పండితుఁడు

# పుష్పలోకము

ఆదిత్యవర్ణే తప సోఽ ధి జాతో
వనస్పతి స్తవ వృక్షోఽ థ బిల్వః ।
తస్య ఫలాని తపసానుదన్తు
మాయా న్తరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః ॥ (శ్రీ సూక్తము)

(సూర్యుని వంటి వన్నెగల్గిన లక్ష్మీ! మొదట నీ యనుగ్రహమువలన నీ హస్తమునుండి పువ్వులు లేకుండఁగ నే ఫలించునట్టి బిల్వవృక్షము జన్మించినది. ఆ పాదపము బాహ్యాంతరింద్రియ సంబంధమగు దారిద్ర్యమును బోఁగొట్టుఁగాక!)

ప్రతిభాభియోగ్యతచే స్వర్గమునందలి సౌవర్ణ రూపముల ద్రష్టయై దర్శించువాఁడు కవి. దర్శితములైన యేతచ్చాంపేయ రూపములకుఁ ద్వష్టయై బాహ్యాకృతులఁ గల్పించి రసమయ జగత్సృష్టిఁ గావించువాఁడు కవి! కవి సౌందర్య రసమునం దావిర్భూతుఁ డగును. అతని[1] సరసహస్తమునుండి మధువు స్రవించును.

జగద్రష్టయుఁ, ద్వష్టయు నగు హిరణ్యగర్భుఁ డాదికవి కాదికవి. అతని హస్తద్వారమున వెల్లివిరిసి లోకమును మధుమంతముగ నొనర్చిన కృతులలోఁ బుష్పలోకము రమ్యాతి రమ్యమైనది. సమాధినిష్ఠుఁడై సృష్టికావ్య 'కృత్యాది'ని దానె కోమలకుసుమమై స్రష్ట నారాయణ నాభీసరోజ ద్వితయమన నొప్పి యుండును. ఆదిత్య ప్రథముఁడైన యా విష్ణుని యమృతావలోకనము నర్థించి యుండును.

పరమేష్ఠి ప్రకటించిన యపూర్వభావభంగిమలే ప్రసూనములు. ఈ జగచ్ఛిల్పి కవి! 'కవి సత్యరథమునకుఁ గట్టఁబడిన యశ్వము!!' ఇది సూనృతమార్గమునఁ బరుగిడి యానందధామమును జేర్చును. ఈ కారణముననే స్రష్ట మానవ నయన మనోనయనాహ్లాదనమే సుమసృష్టికి పరమప్రయోజనముగ భావించి యుండునని భావుకలోక మూహించినది. శాబ్దికు లీ రసవద్రహస్యమును గుర్తించి తొలి యుషస్సులు తోఁచిననాఁడే పుష్పమునకు సుమన మనియు, నాకాధిపతి వనమునకు నందనమనియు నామకరణమొనర్చిరి.

పూలు లేని దేశము సకల సద్గుణశోభిత యగు నాలు లేని సంసారము ముగ్ధహాసము లేని ముఖము. సిత శార వర్ణములతో నవరసోల్లాసములతో ననంత భావనల కాధారభూతములైన సుమసంతానములపై నే దేశమం దెవ్వరి కెక్కాలమునఁ గోర్కె వొడుమదు? కాలోచిత సమస్తైశ్వర్యముల నయ్యవి విలసిల్లుట వెంగలులు కాని యే దేశీయు లర్థింపరు? మంగళ ప్రదములు మహిమాఢ్యములు నైన వాని సౌభాగ్యగరిమఁ గని యే దేశీయులు ప్రహర్షహృదయులు కారు?

పుష్పములు పరమేశ్వరహాసస్వరూపములు. మాతృశ్రీ ప్రకృతి రుచిరాభరణాంగ రాగములు. ఇట్టి వీనితోఁ బరిచయము లేక [2]"బుద్ధత్వ'మబ్బదు. పురు షోత్తమప్రాప్తి కలుగదు. ఇంతయేల? ఆ హిరణ్యగర్భుఁడే జగత్కారణనాభీసరోజ సంభవుఁడు కదా! ఊహింప సర్వసృష్టి యొక సుమనమగుటయు గోచరింపకపోదు.

రసలుబ్ధమైన లోకమున ననురాగాభిమానములు [3]సాత్త్వములు. సామాన్య వ్యక్తి మొదలుగ సర్వసంగపరిత్యాగులై మునివృత్తిఁ జేకొనిన మహర్షులవఱ కియ్యది తరతమ భేదములతో నొప్పుచున్నది. కాలదేవతాదుహితలగు ఋతుకన్యలకు నిట్టి యనురాగాభిమానములున్నవి. ఒక ఋతుకన్యకు నచ్చిన కుసుమవిభేదము మఱియొక ఋతుకన్యకమానసమును మఱల్పఁలేదు. ఒక ఋతుకన్య పెంచి పాలించిన పూఁదోఁటను మఱియొక ఋతుకన్య చీకాకు పఱచి చిత్తమున నానందానుభూతి నొందును.

శతపత్రములపై శరత్తునకు మక్కువ మిక్కుటము. బాలకుందములపై హేమంతమున కనురాగ మధికము. లోధ్రములఁ గని శిశిరము రోమాంచకంచుక యగుచున్నది. శిరీషములన గ్రీష్మము పడిచచ్చును. కదంబములపై వర్షమునకు గాఢవాంఛ. ఆయా ఋతుకన్యల యభిమానానురాగములఁ జూఱఁగొనిన పుష్పము లాయా కాలముల నవనవోన్మేషశాలినులై నిత్యనవ్యావతారములఁ బ్రవర్తిల్లుచుఁ గొన్ని ప్రయోజనముల సాధించి నిర్యాణము నొందును.

అల్పముగ నైననేమి, యనల్పముగ నైననేమి సకలర్తువులును బుష్పసమయములే. అయ్యు నీ కమనీయకీర్తి వసంతకాలమున కబ్బినది. వసంతము మల్లియలది. ఇది మల్లికామాసమగుట మహాకవులెఱింగి యుండుటచే వసంత పుష్పావిర్భూతిని వర్ణించుపట్ల 'స్థాలీపులాకము'గ మల్లికావిలాసముల నిరూపించుటయందు మనసు గొందురు. [4]"నిబుతి దిగ్వాయుపతి వసంత ఋతుశోభ లీను చూలాం' ద్రగు మల్లియల మనోహరవిన్యాసముల దర్శించిన మహాకవి కందు సారవదాంధ్ర సాహిత్య సౌమనస్యము లిట్లు గోచరించినవి.

సీ. 'దీప్తిమాధుర్యావధిశిరస్సుధాంశుభా
స్వన్మనోహర విలాసమ్ములగుచు
క్లిష్టబంధవిచిత్ర కేళీప్రశస్తిర
హఃకళాపూర్ణోదయమ్ము లగుచు
కృష్ణపదాగ్రభక్తి సుగృహితాముక్త
మాల్యదాచ్ఛ ప్రౌఢమధువు లగుచు
ననితరలభ్యవర్ణా త్తశయ్యాహేతు
వై పాండురంగమహత్తు లగుచుఁ

తే. దీయఁదనములు మెఱుఁగులుఁ దెచ్చుకొన్న
ప్రియలు ప్రియులు కూడి మనుచరిత్ర లగుచుఁ
దెలుఁగు రసికలోకముల కందిచ్చె నసువు
లత్తుకొని మల్లెపూల్ క్రొత్త క్రొత్తరుచులు.'

సాధకుని శక్తిసామర్థ్యముల ననుసరించి వసంతమల్లికామతల్లికల లీలా విలాసములు ద్యోతకములగుట నిస్సంశయము.

'బ్రహ్మ విష్ణు మహేశ్వరులఁ దమ హరిణేక్షణలకు గృహకుంభదాసులఁ గావించి వర్ణనాసీమ నతకరించు చరిత్రచే విచిత్రితుఁడైన కుసుమాయుధునకు నమస్కరింతు' నని మహానుభావుఁడగు నొక కవివతంసుఁడు కావ్యారంభ మొనర్చి యున్నాఁడు. ఇట్టి మహత్తరశక్తి యా మదనునకుఁ బుష్పసాయకుఁ డగుటచే నబ్బిన దనుట యతిశయోక్తి కాదు.

పుష్పముల కింతటి ప్రౌఢప్రభావము కలదని యంగీకరించుటకు బుద్ధివోని [5]శంకర పూజ్యపాదులవంటి శివోపాసకులు "తల్లీ! పుష్పధన్వియు, మధుకర మౌర్వియు, మలయమరుదా యోధనరథియు, వసంత సామంతుఁడునైన యనంగుఁడు త్వదీయాపాంగావలోకనశ్రీ వహించి యెక్కటివీరుఁడై జైత్రయాత్ర సాగించుచున్నాఁ' డని సమస్తకీర్తి నా సౌందర్యలహరీ కటాక్ష వీక్షణములకుఁ గట్టిపెట్టిరి.

కవికుల గురువు కాళిదాసు పరమేశ్వర సాన్నిధ్యమున కా యగధర రాజపుత్రికను [6]నిర్భర్త్సిత పద్మరాగాశోక పుష్పగను నాకృష్ట హేమద్యుతి కర్ణికారగను, ముక్తాకలాపీకృత సింధువారగను నలంకరించి లేఁబ్రొద్దు వన్నెగల వలిపమును ధరింపఁజేసి పూగుత్తులచే వంగిన జంగమలతవలెఁ గొనివచ్చి యుచితజ్ఞుఁడై పుష్ప ప్రాభవమును గాపాడినాఁడు.

అంతటితోఁ దనివినొందక సారెసారెకు ప్రస్తమగుచు స్మరకార్ముక మౌర్వీద్వితయమో యన నొప్పు కేసర దామకాంచిక నామె కవలంబమాన మొనర్చి నాఁడు.

ఒక యువకవి గులాబీలకుఁ గోమలకంత మొసఁగలేదని పరమేష్ఠిని నిందించుటకుఁ బాల్పడినాఁడు. కాని మఱియొక సరస సాహిత్యప్రియంభావుకుఁడు [7]'ప్రౌఢ భావప్రపూర్ణలౌ నో పుష్పకన్యలారా! మీరు పిలువనైన నెఱుఁగని ప్రవక్తలు; నిత్య నిర్మలానందమును బ్రసాదించు నమృతచషకము' లని యుజ్జ్వలముగ నూహించి నాఁడు, [8]'వినఁబడెడు సంగీతము మధురమైనది; వినఁబడని సంగీతము మధురాతి మధురమైనది.' ఆమంత్రణము లేకయే యమలిన భావములఁ బంచి పెట్టుచుఁ గుసుమములు కోమల కలస్వనములు వినిపింపఁగలవు. రసగుంఫిత కావ్యాలాపముల రసిక హృదయముల దోఁచుకొనగలవు. 'కాశపుష్పమొందు కదలిన కన్నీటి జడులకుఁ గారణభూతములగు గంభీరభావములు నాలో స్పందించు' నని యొక యాంగ్లమహాకవి ప్రవచనము. ఐన నా ప్రసవభాషల, సుమగీతముల నవగతమొనర్చుకొని, యాహ్లాదించుటకు గుసుమసుకుమార హృదయముండ వలెనన్నమాట!

ప్రాచ్యులకు బ్రసవకులముపైఁ బ్రణయము. వారికిఁ బూలతో వియ్యములు; పూలతోఁ గయ్యములు, వారు కుసుమ హృదయ మెఱుఁగుదురు; సుమసృష్టి రహస్య మెఱుఁగుదురు. ప్రాచ్యుఁడైన యొక 'త్సిన్' చక్రవర్తి ప్రమదవనమునందలి ప్రసవలతలు విహంగదంపతుల విశృంఖలవిహారములకు గుఱి కాకుండుటకై కాంశ్యకింకిణులఁ గట్టించియు, ఋతుసమయముల నాస్థానగాయకులచే మనోజ్ఞ రాగాలాపముల విన్పించియు నానందాబ్ధి నోలలాడినాఁడు. బౌద్ధధర్మావలంబి మఱియొక 'త్సిన్' సార్వభౌముని కరుణాహృదయము పుష్పలోకము నుద్దేశించి : "కొనగోఁట గిల్లఁ గన్నీటఁ దడిసిన మిమ్ము తథాగతులకుఁ గాన్క యొసఁగలే నో లలితలతాంతములారా! నా కొఱకి ట్లీ లతల లీలావిలాసములతో నిల్చి భూత భవిష్యద్వర్తమాన బుద్ధులను జేరుకొనుఁ" డని యర్థించినాఁడు. అహో! ఎట్టి హృదయార్ద్రత! ఎంత రసికత!!

పుష్పములతోఁ బుట్టినది పుణ్యభూమి భరతావని. అందు ప్రమదవనములు లేని ప్రాచీన పట్టణమే లేదు.

మ. [9]"పురిపూఁదోఁటల తావి మి న్నలమ వేల్పుల్ మెచ్చి తద్భూజభా
స్వరసంతానములన్ దివిం బెనుప నా సంతానముల్ దివ్యని
ర్ఝరిణీనిర్మల వారిపూరపరిపోషం బందియుం దన్మహో
తరలక్ష్మీ పరిపూర్తిగాన కెసఁగెం దత్కల్పశాఖిప్రథన్."

యను వసుచరిత్రకారుని నిరుక్తికిఁ బ్రతిష్ఠాన పురోపవనములు నిలయములై యొప్పినవి. ద్వారకానగరము నందలి పూఁదోఁటల యౌత్కృష్ట్యము ననిమిషనేత్రములఁ గని కృష్ణ సందర్శనార్థమై వేంచేయు మేఘవాహనునితో మాతలి:

చ. [10]'తను ధరణీతటిద్విహృతి ధన్యవనావళి యింత మీరుటల్
కనియును మేఘ మిచ్చటి కలజ్జతఁ జేరెడుఁ గాక చేరకేఁ
గినను గొఱంత యేమి పురికిం బువుఁదేనియ సోనకాలువల్
జనముల పైరుపంటలకుఁ జాలవె యెన్నఁటికైన నెన్నఁగన్.'

అని వర్ణించియున్నాఁడు. ఆదర్శప్రభువగు నా భగవానుని మార్గము ననుసరించియే మన ప్రాచీన రాజన్యులు వనపాలన జేసి వినుతికెక్కిరి. ఉపవనాంత లతికాశైలూషికలు పవనాహతుల తోడను శ్రుతిసుఖభ్రమరగీతముల తోడను గుసుమకోమల దంతరుచుల తోడను నాటపాటల నొప్పుచుండఁ గని ప్రమోదమగ్న మానసులైరి. అసూర్యంపశ్యలును హంసయానలు నైన ప్రమదాజన మా వనవీథుల [11]వృషభగతిరగడలతో విశృంఖల విహారముల నొనర్పఁగని వారు కన్నుల కామెతలొసఁగి గర్వించిరి.

శుభాశుభములకు సుమసంబంధ మార్యోపదిష్టమార్గము. ఇష్టదైవతముల ప్రణయానురాగములఁ జూఱఁగొనిన ప్రసవముల నిచ్చి కొల్చిననాఁడే పురాతన భారతీయ భక్తుఁడు పరమానందభరితుఁడైనాఁడు. కుతపవేళ గృహవీథి కరుఁగుదెంచిన యతిథి నాహ్వానించి కాశపుష్పార్చనఁ గావింపఁ గలుగునెడ గేస్తు 'ధన్యోస్మి' యని తలంచినాడు. స్వయంవర వేళలందు పరీక్షానంతరము మరందబిందు తుందిలమ్మగు సురభిళ పుష్పమాలికచే రాకుమారి వరుని గళసీమ నలంకరించిన పిమ్మటనే యతని మందాక్షవీక్షణ మాలికాద్వితయోద్దీప్తుఁ గావించినది. పరిణయ వేళఁ బ్రసవరథములఁ బర్యటించి నవవధూవరులు వృద్ధదంపతుల శుభాశీస్సుల నందికొనిరి. మూఁగనోము పట్టిన ముగ్ధ [12]'దూసిన నాగమల్లికల దోసిళులతో' ముత్తైదువుల మంగళాకాంక్షల నర్థించినది. ప్రసవశయ్యల శయనించి ప్రసవాసవముల సేవించిన పిమ్మటనే మదన మహాసామ్రాజ్య పట్టభద్రులై మహారాజులు నిశాసమయములఁ బ్రవర్తిల్లిరి. వారి కొల్వుకూటములఁ గళాభిజ్ఞులైన నట్టువరాండ్రు మున్ముందుఁ బుష్పాంజలులఁ బ్రరోచనఁ గావించిన పిమ్మటఁ జతుర లాస్యోల్లాసితలైరి. రాజసూయానంతరము జైత్రయాత్రాతత్పరులై శత్రుదేశములపై దండయాత్ర సాగించి రణవీథుల శాత్రవశిరః కందుకక్రీడావినోదులై విజయమునఁ దిరిగివచ్చు రాజన్యులకుఁ బురలక్ష్మి చత్వర

రాజమార్గ ప్రతోళికా సౌధాగ్రముల ధరించిన కలువదములతోఁగాని కమనీయ సుస్వాగత మొసఁగ లేదు. శ్వేతవసనాంగరాగములతో శుభ్రనవ మల్లికాకుసుమ కుట్మలాలంకృతయైగాని శుక్లాభిసారిక కాంతునభిసరింపలేదు. సహగమనసమయము లందుఁ బితృవనవిహారమున కేఁగుచున్న పుణ్యవనితలఁ బుష్పలోకము ప్రణయాభిభూతయై యనుసరించినది. 'శ్మశానకుసుమన్యాయ' మబ్బినను గణుతింపక ప్రసవకులము స్నేహస్వరూపనిరూపణ మొనర్చి కీర్తిగడించి లోకమునకు గుణపాఠము నేర్పినది.

చతుర్విధాలంకరణములలోఁ గుసుమాలంకరణ మమలినమైనది. ఇయ్యదియే యాద్యమైనది. నేఁటి భూషాలంకరణముల చరిత్ర నన్వేషింప నవి యన్నియు నొకనాఁటి పౌష్పాలంకరణములని వెల్లడి యగుచున్నది. ఈ సహజ సుమాలంకరణ సౌభాగ్యగరిమను గూర్చి సకలర్తుసంపదలు గల యలకాపుర మందలి పురంధ్రీమణుల నడిగిన వీనుల విందుగ వినిపింతురు. [13]'వారు లీలాకమలహస్తలు, బాలకుందాను విద్ధలు, లోధ్రప్రసవ పరాగముచేఁ బిశంగిమశ్రీ వహించిన మనోహరాబ్జముఖలు, నవకురవక కేశపాశలు, చారుశిరీషకర్ణలు, ఆషాఢప్రథమ దివసమేఘదర్శనాయత నీపసుమాలంకృత సీమంతినులు'.

'స్త్రీల చిత్తము కుసుమసుకుమార' మని [14]మహాకవి భవభూతి ప్రవచనము. వారికి నుద్యానపుష్పములకును సన్నిహిత స్నేహము, పుష్పవనవిహారసమయములఁ బ్రబంధనాయికలును బూఁదీవలు నన్యోన్యము మార్పునొందుట కవిలోక సిద్ధము. లతావనితలకు దోహద సేవ యొనర్చుట వా రెఱిఁగినట్లు వన్నె కెక్కిన వనపాలకు లైన నెఱుఁగ రనుటలో నతిశయోక్తి యిసుమంతయైన లేదు. లేకున్న కమలహస్తల కరస్పర్శతోఁగాని మాకందము పల్లవింపకుండుట, కోమలాంగుల యాలింగనకళా ప్రక్రియలతోఁ గాని కురవకము కుట్మలింప కుండుట లెట్లు పొసఁగును? అలివేణుల వీక్షణములో నే యమృత మున్నదో, తిలకము కులికి పుష్పించుచున్నది. అశోక మంత కంటెను జాణ; చరణాహతి కలుగు వఱకును జలింపదు. కంబుకంఠి గీతామృతమునఁగాని కిసలయింపని ప్రియాళువు కళాప్రియ యనుటలో నౌచిత్య మున్నది కదా! ముగ్ధహాసల ముఖరాగమున జంపకము, నర్మభాషిణుల సరసహాసమున మేరువు, సీమంతినుల సీధురసముచే వకుళ, పద్మనేత్రల ప్రౌఢముఖవిలాసశ్రీల సింధువారము, కామినీమణుల కమనీయసల్లాపములఁ గర్ణికారము కుసుమించుటలు చూడ, నా లతాతరువుల రసికత యన్యప్రాణిలోకమున కతీతమైన దని తోఁచకమానదు.

పుష్పాలంకరణపట్టభద్రలైన పుష్పలావికలు పూర్వ పట్టణములకుఁ బెట్టని యలంకారములు. నర్మ సరసోక్తులకు వా రేడుగడలు. వారి నిశితసంభాషణలకుఁ గుసుమములు సంకేతములు. [15]'పొన్న పూవొడి నేల పొదివితివే చెలి' యని పుష్పముల విలిచికొనవచ్చిన పల్లవశిఖామణి యొకఁడు ప్రశ్నింపఁ బుష్పలావిక యొకర్తుక 'పొడమె బల్దీవిపై పొదువవలదె' యని సరసమగు సమాధాన మొసఁగి యతని హృదయమును ముప్పిరిఁగొనఁ జేయుచున్నది. మధురానగరి యందు –

చ. [16]"సరసులనర్మ మింపుల నొసంగఁ గదంబఁపు దండఁగట్టుచోఁ
గరగుటఁదెల్పుదృక్తరళ కాంతులు నుత్తరమిచ్చు నంతరాం
తరములనవ్వులు న్గలువతండము మొల్లలు నుంచు మిన్నుగ్రు
చ్చి రహిని రిత్తనూలొసఁగి సిగ్గువహింతురు పుష్పలావికల్."

ప్రియులు సంకేతస్థానములఁ జెప్పికొనుటకును బుష్పములు చిహ్నములై యెప్పుచున్నవి. నీలోత్పలముపైఁ దుమ్మిపూవును నిల్పిచూపిన 'నర్ధనిశా సమయమున శివాయతనమునందు మన యిరువుర సమాగమ' మని వారి పరిభాష.

క. [17]'కలపములు గూర్చ బహువిధ
తిలకంబులు వెట్ట వింత తెరువునఁ బలు పు
వ్వులు గట్టి కట్టి ముద్దుగఁ
దల ముడువఁగ సరులుగ్రువ్వఁ దద్దయునేర్తున్'

సైరంధ్రులు రాజప్రాసాదముల [18]వావాతలకుఁ బ్రణయపాత్రలై వారి శీలసౌభాగ్యములఁ గాపాడుటయందుఁ 'గర్కటిగర్భము ధరించినట్లు' జాగరూకత వహింప నెంతయు విలసిల్లుట ప్రసవకులకీర్తి నుగ్గడించుచున్నది.

'పరమేష్ఠి రమ్యాతిరమ్యముగఁ బుష్పసృష్టి యొనర్చినాఁడు; కాని వాని కాత్మను బ్రసాదింప మఱచె' నని యొక తాత్త్వికుఁ డనినాఁడు. ఇతఁడు దేవత లగ్నిముఖు లైనట్లు పుష్పములు కవిముఖములని మఱచెనేమో! కవిముఖముల నే నాఁటి కా నాఁ డవి తమ భావపరంపరల వెల్లడించుచునే యున్నవి. 'ఏ కోవ పూవువే నీవు, నీ తావి పూవులకు రా' దని స్తుతిపాఠకుఁడై భ్రమరయువకుఁడు ముగ్ధకన్యకల మిథ్యాప్రణయమున మోసగింపఁ బూనుకొనిన వేళలఁ గనిపెట్టి 'నెమ్మదికి రావె యీ తుమ్మెదకు నో పూవ! అమ్ముకోఁబోకె నీ నెమ్మనము నో పూవ!!' యని

పుష్పలోకము హితవాక్యములఁ బలికినది. నీచపు దాస్యవృత్తి మనలేక దేశము స్వాతంత్ర్య జైత్రయాత్రల సాగించు సమయమున –

ఉ. [19]'ఈ సుమజన్మ మెట్లు ఘటియిల్లెనొ నా కొకనాఁటి పాటిదై
వాసనలీను సోయగము వాయని తీయని పోడుముల్ క్షణం
బో సగమో విచారపడఁబో నయినన్ విడివడ్డ నా యెద
న్నోసులువారు నూతనమనోరథ మామని వేడిపొంగులన్.'

అని పుష్పలోకప్రతీకయైన యొక సుమము నిజకాంక్ష నిట్లు వెల్లడించినది. "ఓ వనమాలీ! పేదల రక్తమాంసములఁ బెంపు వహించి దయారసామృతాస్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దఱికమ్ము కై మతోన్మాదము పెంచు దేవునికి మాఱుగ నిల్పిన రాతిబొమ్మలం దూదరవోవు జన్మ మిఁక యొక్క నిమేషముసైప నాయెదన్. లలనాజనతా కబరీభరైకభూషాకలనలందుఁ దల్పోపగూహబిబ్బోకములందును నాకుఁ దలంపు లేదు. చక్రవర్తుల శవపేటికలఁ జిరనిద్రనొందుఁ చిత్తము లేదు. నన్నుఁ ద్రుంచి మాతృసేవాచరణమ్ములం దసువు లర్పణఁ జేసెడివారి పార్థివశ్రీ చెలువారుచోటఁ బడవేయుము. వారి యుదాత్త సమాధి మృత్తికలో వాసనలీనుచు రాలిపోయెదను."

పుష్పలోకమునఁ బ్రవేశించిన మహాకవులకు మహనీయ దర్శనభాగ్యములు లభించినవి. ఆదికవి వాల్మీకి పుష్పతరువుల నొక మాఱుష్ణీషధారుల వలెను, మఱియొకమాఱు పీతాంబరధారులవలెను దర్శించినాఁడు. శివతపోభంగ కార్యనిర్వహణార్థమై సుమసాయకదేవుఁడు త్రిలోకాధిపతియగు నింద్రుని కడ తాంబూల మందుకొని రతీద్వితీయుఁడై వాసంత విలాసశ్రీ వహించిన తపోవనమునఁ బ్రవేశించువేళ మహాకవి కాళిదాసునకుఁ బుష్పలోకము ప్రియదర్శన మొసఁగినది.

[20]లగ్నద్విరేఫాంజన భక్తికిమ్మీరిత తిలకముఖియై మధుశ్రీ బాలారుణకోమల లాక్షారసముచేఁ జూతప్రవాళోష్ఠము నలంకరించుచున్నది. ప్రియాళుద్రుమమంజరీరజః కణములు విశాలనేత్రములఁ బడుటచే దృష్టిపాతమునకు విఘ్న మాపాదింప మృగములు మదోద్ధతిచే మర్మరపత్రమోక్షములైన వనస్థలములఁ బర్వు లెత్తుచున్నవి. చూతాంకురాస్వాద కషాయకంఠమగు పుంస్కోకిలాకూజితము మనస్వినీమాన విఘాతదక్షమై యొప్పుచున్నది. వర్ణప్రకర్షనే కాని బ్రహ్మ తనకుఁ దావి నీయలేదని కర్ణికారము నొచ్చుకొనుచున్నది. మధుద్విరేఫరాజు కుసుమైక పాత్రలోఁ బ్రియాను వర్తమానుఁడై యాస్వాదించుచున్నాఁడు. గీతాంతర వేళఁ గిన్నరుఁ డొకఁడు

శ్రమవారిలేశముల నించుక సముచ్ఛ్వసిత పత్రలేఖలు గలిగి పుష్పాసవాఘూర్ణిత నేత్రశోభియగు ప్రియాముఖమును జుంబించుచున్నాఁడు. నిండు పూగుత్తులే పాలిండ్లుగఁ జిత్తమును హరించుచున్న తీఁగబోటులవలన తరువరులు వినమ్రశాఖా భుజబంధనముల నొందినవారగుచున్నారు.

[21]మురారి మహాకవి యస్తమించు సూర్యకిరణములనే యొకటి, రెండు, మూఁడు, నాలుఁగని లెక్కించుచుఁ దన కమలదళముల ముడిచెనో మఱల నుదయించు నట్టి యా కిరణములనే యుదయవేళ కమలలత సంతోషముతోఁ దిరిగి లెక్కించుచుఁ గ్రమముగాఁ దనదళములను విప్పు మనోజ్ఞ దృశ్యమును దర్శించినాడు.

మ. [22]"తనకుం గౌఁగిలి యీ వొకప్పుడును నాథా! నీ కరస్పర్శనం
బున గిల్గింతలె యంచుఁ బద్మిని కరాంభోజంబునన్ మందమం
దనటద్వాయుచలద్దళాంగుళులు గన్పట్టంగ నవ్వేల్గురా
యని రారా యనిపిల్చె నాఁదగు ద్విరే ఫాద్యంతదీర్ఘధ్వనుల్."

చేమకూర కవిరాజు వీనులొగ్గి విని యానందించినాఁడు. 'నానాసూనవితాన వాసనల నానందించు సారంగ మేలా నన్నొల్లదటంచుఁ దీవ్రతపమొనర్చి గిరికాదేవి నాసికయై ప్రేక్షణ మాలికా మధుకరీపుంజముల నిర్వంకలం బూనిన' గంధఫలిని భట్టుమూర్తి కన్నులారఁ గాంచి తనివినొందినాఁడు. [23]కవయిత్రి విజ్జికాదేవి యుదయ సంధ్యాదేవి నర్చించుటకై ప్రాక్సముద్రమున స్నానమాడి నభోద్రుమ శాఖికలం దున్న నక్షత్రపుష్పములఁ గోయ నంశుమాలి యసంఖ్యాకము లైన కరములఁ జూచు రమణీయదృశ్యమును జూచినది.

[24]'చక్షుర్గోచర మగు పుష్పము సాధకుని దృష్టియందు హృదయపుష్పమునకు బాహ్యచిహ్నము. అది శుద్ధపుష్పము కాదు. విశ్వేశ్వరుని ప్రాణకళిక! అనంతుని లీలారూపము!! ఇట్టి పుష్పరూపమున మునిఁగి తన్మయత్వముతోఁ జూచి సాధకుఁడు దానిని ధ్యానధారణలకు లక్ష్యముగ నొనర్చుకొనుచున్నాఁడు. అట్టి స్థితి యందుఁ బుష్పము వలనఁ గలిగిన రసానుభవము సాధన కాలంబమగుటయే కాక మూర్తిమంతమగును. అందుఁ బ్రాణసాక్షాత్కారమగును. పుష్పము చిద్రూపమున ననంతమై యనంతమగు ప్రాణవాహినియందు దివ్యసౌరభముతో వికసించు చున్నది. సాధకుని ప్రాణమునకు నా పుష్పమునకు జరుగు నాదానప్రదానమే రాసలీల! రూపాంతరము!!'

# చంద్రుఁడు - చంద్రిక

సీ. [25]“తిమిరభూతము సోఁకు దెలియ జగత్త్రయీ
లలన దాల్చిన రక్తతిలక మనఁగ
సఖ్యంబునకు నిశాశబరి యిచ్చినఁ బ్రాచి
పాటించు గురివెందబంతి యనఁగఁ
దోయధి వెడ గ్రుంకఁ దోఁచు పురందర
కుంభినీసింధూరకుంభ మనఁగఁ
గులిశాయుధుని పెద్దకొలువునఁ జెన్నొంద
దీపించు మాణిక్యదీప మనఁగఁ

తే. గుముదినీ రాగరససిద్ధగుళిక యనఁగఁ
గామజనరంజనౌషధికబళ మనఁగఁ
బొడుపుఁ గెంపున బింబంబు పొలుపు మిగులఁ
జంద్రుఁ డుదయించెఁ గాంతినిస్తంద్రుఁ డగుచు.”

ప్రాచీనకవీంద్రుని ప్రౌఢభావనాబలమున కువ్విళ్ళూరుచు బై పద్యమును మఱల మఱలఁ జదువుకొనుచుండ నొకనాఁటి వెన్నెలరేయి నా మానసమునఁ సాహిత్యవీథులఁ జంద్రాన్వేషణ మొనర్పఁ గోర్కె వొడమినది. మున్ముందనాది మానవులకుఁ బ్రతినిధులై యొప్పు జాతులలోని చంద్రకథనములు ప్రతిఫలించినవి.

“లోకమునకు నే ననినఁ బ్రాకట ప్రణయము. చంద్రికాప్రదాత్రినని జనులు నన్ను వేనోళ్ళఁ బొగడుదురు. వెన్నెల రేల ‘సూత్రయజ్ఞ’ మొనర్చుచు నే నొనర్చు విశ్వశ్రేయస్సును వారు వినుతింతురు. కౌముదీమహోత్సవముల విశృంఖలవిహారము లొనర్చుచుఁ బ్రజలు నా నిత్యాభ్యుదయము నాకాంక్షింతురు.”

“నా తేజమును బంచి యీకున్న నీ కీ కీర్తి యెక్కడిది? నీ స్థితికి జ్యోతిర్మ యుండ నగు నేను కారకుఁడను. నేను జగత్కారణుఁడను; జగజ్జేతను. అకారణముగ గర్వించి నా యాగ్రహమునకుఁ బాత్రురాలవు కాఁబోకుము.” ఆకాశనదీ సైకతవేదికల యౌవనప్రాదుర్భావముచేఁ జంద్రసూర్యు లిరువును బరస్పరాధిక్యములఁ గూర్చి

వాదోపవాదము లొనర్చుకొని తుదకుఁ గలహించిరి. స్త్రీ జనసహజమగు రోషోద్రేకము హెచ్చి చంద్రాదేవి యంజలితో నెత్తి యాదిత్యుని ముఖముపై వాలుకాకణములఁ జల్లినది. సహస్రకరుఁడు దానిని భరింపఁజాలక వేయి చేతులతో సైకతమును గ్రహించి యామెపై మహత్తరశక్తితోఁ గొట్టినాఁడు. చంద్రముఖమున నీ నాఁటికి నవి నీలాంకములై నిలచియున్నవి.

చంద్రసూర్యుల కలహము తుద కెట్లో సమసి యిరువురకును సంధి జరిగినది. పరస్పర పాణిగ్రహణానంతర మా నూతనవధూవరులు గాఢానురాగముతోఁ గొంత కాలము కాఁపుర మొనర్చిరి. మఱల మనఃస్పర్ధ లేర్పడఁ జంద్ర సౌందర్యగర్వగా వునఁ దీక్ష్ణమయూఖుని మైత్రి నసహ్యించుకొని యాతనికి విడాకులిచ్చినది. సూర్యుని వలనఁ దనకుఁ గలిన సంతానము జూడఁజాలక యామె ఖడ్గముతో ఖండించి యా ముక్కలను గగనవీథి కెగురవైచెను. అం దాకసమున నిల్చినవి నక్షత్రములై భాసించు చున్నవి. నేలపైఁ బడినవి జలచరములై జీవించుచున్నవి. ఇది [26]ఫిలిప్పైన్ జాతివారి చంద్రసూర్య కథనము.

నీగ్రోజాతి పుక్కిటిపురాణములందు సూర్యచంద్రలిరువురును స్త్రీమూర్తులు. వారొకరి సంతానము నొకరు చంపుకొని తినుటకు సంధి జేసికొనిరి. ఇందుకు విరుద్ధముగ మాతృహృదయము గల చంద్ర మమకారముతోఁ దన సంతానమును సూర్యదేవి కంటఁ బడకుండునట్లు పవలెల్ల దాచియుంచి రేలు వారితో ముద్దుముచ్చటలు తీర్చుకొనుచున్నది. రాత్రులం దాకాశమున మిలమిలలాడు నక్షత్రములే యాచంద్రాదేవి సంతానము.

ఆదిమయుగముల రవి భూమి మీఁద నివసించెడివాఁడు. 'టిట్రిరే' యను నాఖేటశ్వానమొం డతని నొకనాఁడు వెంబడించి పట్టుకొని మ్రింగివేసినది. అతని శల్యమొకటి వాయుపథమున కెగసి యట నేఁడు లవిత్రాకారమున గగ నాంగణమునందు మెఱయు చున్నది. ఇదియే పున్నమినాఁడు షోడశ కళాపరిపూర్ణుఁడైన చంద్రునివలెఁ బ్రకాశించుచున్నదనియు రెడ్ [27]యిండియన్ జాతివారి నమ్మకము. వారి నాయకుని డాలుపైఁ జిత్రితమైన చంద్రరూపమే నిశాసమయముల నభోవీథి కెగసి చంద్రికాప్రసార మొనర్చునని యొప్వోజా జాతివారి గ్రామ వృద్ధులు జానపద సాహిత్యమునఁ జంద్రునిఁ గీర్తించు చున్నారు.

[28]షింటోల చంద్రదేవతకు 'త్సుకియోమి' యని పేరు. అతఁడు వారి పరమాత్మ యగు 'ఇజానగి' దక్షిణనేత్రము నుండి యుద్భవిల్లినాఁడని వారి నిశ్చితాభిప్రాయము.

హైంగోయనుల (చైనీయులలో నొక జాతి) చంద్రుఁడు వారి సహస్రమయూఖుని వలె నమృతపాన మొనర్చుటయందు సమర్థుఁడు కాకపోవుటచే స్వర్గమున కేఁగుచు మార్గమధ్యమున నిలచిన త్రిశంకువు. రాత్రులందు మాత్రమే కాంతినొసఁగు క్షపాకరుని బట్టి కట్టి, సర్వకాల సర్వావస్థలఁ కౌముదీప్రదాన మొనర్పుమని నిర్బంధించుటకై 'త్సిన్' జాతివారి పూర్వులు మిన్నందుకొను సౌధముల నిర్మింప, నది గని యా 'త్సుకియోమి' యుగ్రుఁడై యొక ప్రళయకాలవర్షమును గల్పించి యవ్వానిని నేలమట్టము గావించె నఁట!

'షాహూర్' మహమ్మదీయుల చంద్రదైవతము, జారచోర గూఢచారుల కితఁ డిష్టప్రదాత. గ్రీకుల చంద్రుఁడు హెలియస్ (సూర్యుఁడు), ఇవోయస్ (ఉషస్సు) లకుఁ దోఁబుట్టువు.

సీ. [29]'ఒక వేయి తలలతో నుండ జగన్నాథు
బొడ్డుదమ్మిని బ్రహ్మ పుట్టె మొదట
నతని గుణమ్ముల నతనిఁ బోలిన దక్షుఁ
డగు నత్రి సంజాతుఁ డయ్యె నత్రి
కడగంటి చూడ్కులఁ గలువల సంగడీఁ
డుదయించి విప్రుల కోషధులకు
నమర ధరాతతి కజుని పన్పున నాథుఁ
డై యుండి రాజసూయంబు సేసి' –

మూఁడులోకముల జయించినట్లు మన భాగవత పురాణము పల్కుచున్నది. చంద్రుని యసమానాభిజాత్యసౌభాగ్యములఁ బరికించి దక్షప్రజాపతి తన కుమార్తెల నిర్వది యేడ్వురఁ దారకల నతని కిచ్చి యుద్వాహము గావించెను. కాని క్షపాకరుఁడందు రోహిణీదేవి యెడ గాఢానురాగము గలవాఁడై మెలంగ మొదలిడినాఁడు. అట్టి సమయమున మిగిలినవారు తండ్రికడకేఁగి తమ దుఃస్థితిని విన్నవింప దక్షుఁడు రోహిణీప్రియుని [30]రాజక్షయవ్యాధిగ్రస్తుండవు కమ్మని శపించినాఁ డఁట!

భారతీయుల యాచారవ్యవహారము లనేకములు చంద్రునిపై నాధారపడి యున్నవి. చాంద్రమానము కర్మిష్ఠుల క్రతుదీక్షల కాధారము. కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతవిధానముల యోగిపుంగవులు మహత్తర శక్తిసామర్థ్యముల సంపాదింతురు. సంక్రాంతిద్వయమధ్యమున గౌణచంద్రుఁడు, ముఖ్యచంద్రుఁడు నిరువురును గన్పట్టిన శుభకర్మల కెన్నిఁటికో హంసపాదులు. కుముదాప్తు కొమ్ము తటిఁగినఁ గాటకము

తప్పదని గదా కర్షకలోకపు గాఢవిశ్వాసము! విద్యారంభ, వివాహాదికముల జ్యోతిష శాస్త్రాభిజ్ఞులు చంద్రలగ్నమున కత్యధిక ప్రాముఖ్యము నిచ్చుచున్నారు. రాజవైద్యులకు శ్రుతిమించిన హృద్రోగముల భూతవైద్యులు చంద్రదేవతకు జపమొనర్చి నవోదనదానమున నా గ్రహదుర్వీక్షఁ దొలఁగించుచున్నారు.

చంద్రలోకము పితృలోకము. సప్తసంతానాదికముల యథావిధిఁ దీర్చిన పుణ్యపురుషులు చంద్రలోకమును జేరుదురు. [31]ఉత్క్రాంతి వేళ జీవుఁడు రజనిని జేరునఁట! రాత్రి యాతనిఁ గృష్ణపక్షము కడకును గృష్ణపక్షము దక్షిణాయనము కడకును దీసికొని పోవునఁట!! అటనుండి భౌతికాకాశమునకుఁ బిమ్మట జంద్రలోకమునకుఁ జేరి పూర్వసంచిత పుణ్యవిశేషమున నా లోకమునం దుదకశరీరము నొంది జీవి కర్మక్షయ మగువఱ కటనుండు నఁట!! తఱువాత నా జలశరీరధారి గగనమార్గమున వాయుపథమును జేరుకొని వారిదద్వారమున వర్షాకృతితో మఱల నవని జన్మించు నఁట!!

ప్రణయవిహ్వలులైన నాయికానాయకులు ప్రణయవార్తావహులుగఁ బ్రవర్తింపఁ జేతనాచేతనముల నర్థించుటలు కవిలోక ప్రసిద్ధములు. మేఘశుకపికాదుల కనంతవాక్ప్రౌఢిమను బ్రసాదించి దూతకృత్యములఁ దీర్చుటచే సమస్త చరాచరప్రకృతి నేకసూత్రమున బంధించి దర్శించిన మహాకవులు ద్రష్టలు, రసజ్ఞశేఖరులు. కవికులగురువు కాళిదాసుని మేఘసందేశము జగద్విదితము కదా! దమయంతికై దౌత్యము నెఱపిన సురజ్యేష్ఠ వాహనమగు జాలపాదమును మఱచుటెట్లు? చిలుక రాయబారము లాంధ్రసీమంతినీ సాహిత్యమున సుప్రసిద్ధములు. సీతారామచంద్రులకు దౌత్యమును శ్రీకృష్ణచంద్రతర్కాలంకారుఁడునుం జంద్రుని మూలమున నడపినాఁడు. శ్రీ విశ్వనాథ మానినీపరాఙ్ముఖతను మాన్పి ప్రసన్నను జేయుమని [32]శశి నర్థించినాఁడు. మహాకవి కాళిదాసుని మేఘ సందేశమున మేఘసౌభాగ్య సమస్తమును గన్పట్టునట్లు వీరి శశిదూతమున చంద్రసర్వస్వము గోచరించును.

చంద్రునిపైఁగల యనంతాభిముఖ్యముచే శాస్త్ర కర్తలు తమ గ్రంథములకుఁ జంద్రిక, కౌముది, చంద్రాలోకాది స్నిగ్ధ నామములఁ బ్రసాదించినారు. [33]మేఘవిజయ కవి హైమ కౌముది, భట్టోజి దీక్షితుని కౌముది, జయదేవుని చంద్రాలోక మిందుకు నిదర్శనములు.

నక్షత్రములు తమస్వినుల భాసించుటయుఁ గౌముదీ రాత్రులఁ గన్పింపక పోవుటయుఁ జూచి కాలమను కళాదుఁడు గగనమూషిక నుడురౌప్య ఖండములఁ

గరంగించి చంద్రుండను వెండిదిమ్మను బోయుటతో నిట్లైనదని వర్ణించుటచే మురారి 'ఇందుమురారి' యైనాఁడు.

ఇందుఁ డనిన భారతీయశబ్దవేత్తల కెంత యభిమానము! శశి సహజశీత లత్వమును గమనించి వారు చంద్రుఁడని (ఆహ్లాదనకరుఁడు) నామకరణమొనర్చినారు. అబ్జ శబ్ద మిచ్చి యతనిని నీటఁ బుట్టించియు, జైవాతృకుని గావించి యతనిచేఁ బైరుపచ్చలఁ బ్రతికింపఁ జేసియు నానందించినారు. మంత్రద్రష్టలైన వేదకాల మహర్షు లమృతతుల్యమగు సోమరస ప్రదానగుణముచేఁ జంద్రుని సోమునిగ దర్శించినారు. 'సూర్యాచంద్రమసు'లను దేవతా ద్వంద్వమున శశినొకనిగ నిల్పి యతని తర్పణమునకై సోమయాగమును గల్పించిరి. అందు వారు వాగ్దేవతకై స్థూలశరీరమైన పశువు నుపయోగించి ప్రాణపంచకమును వరుణునకును, మనస్సు చంద్రునకు, శ్రోత్రముల దిక్కులకు, జీవాత్మను బ్రజాపతికి నీయవలయునని శాసించినారు. చంద్రుఁడు గంధర్వుఁడు, [34]"సుషుమ్నః సూర్యరశ్మి శ్చంద్రమా గంధర్వః' యని శ్రుతి. 'గాం' ధరిత్రేతి గంధర్వః.' రవికిరణ మిట గోవు. సుషుమ్న యను సూర్యకిరణమును ధరించుటచేఁ జంద్రుఁడు గంధర్వుఁడు. నక్షత్రము లప్సరసలు. అట్టి నక్షత్రములతో మిథునభావము నొంది చంద్రుఁడు క్రీడించు చున్నట్లొక [35]శతపథబ్రాహ్మణ మహర్షి దర్శించినాడు.

సూర్యచంద్రు లిరువురు నశ్వినీదేవతలు. ఇట నశ్వ శబ్దమునకు జలము, కిరణము, కాంతి యనువానిలో నే యర్థము నైన గ్రహింపవచ్చును.

లోకము చంద్రునికిఁ దారాజారత్వ మాపాదించినది. జారశబ్దమునకు లయించువాఁడని సంప్రదాయజ్ఞు లెఱిఁగిన యర్థము; యాస్కుని నిర్వచనము. సూర్యునకుఁ దల్లి రజని. రాత్రి యందు జన్మించి రవి రాత్రి యందు లయించు చున్నాఁడు. నక్షత్రాధీశుని తారాజారత్వము నిట్టిదే. ఇట్టి వైదిక సాహితీహృదయ సౌశీల్య మూహింపఁజాలని కవులు కొంద ఱిట్టి మార్మిక కల్పనలఁ గైకొని, పరకీయాప్రణయరస నిషణ్ణచిత్తులైన ప్రభువుల ప్రార్థనల నంగీకరించి యసభ్య శృంగార కావ్యరచనకుఁ బూనుకొనిరి. ఇట్టి యసత్యకల్పనలు కన్పట్టుట వలననే సుమేధులు "నా నృషిః కురుతే కావ్య" మ్మని యనుశాసింపవలసివచ్చినది.

చంద్రోదయాదికము ప్రకృతి పుస్తకమున నొక రమణీయ ప్రపాఠకము. దార్శనికులు తత్సౌందర్య రసవత్సన్నివేశములఁ దిలకించి యనేకాద్భుత విషయములఁ బ్రకటించిరి. యామవతీకళత్రు నుదయమునకుఁ బూర్వమతని కిరణము లుదయించుటఁ గని యొక మహాకవి –

సీ. [36]'కెరలి చీఁకటిగ్రాను గెడపంగ నిక్కిన
సమయగజంబుదంతము లనంగఁ
జదలు గేదఁగి తూర్పుతుదకొమ్మ నరవిరి
యై కానిపించు పూరేకు లనఁగఁ
బొడుపుగుబ్బలి నెలపురిటింటి యిడుపునఁ
జఱచిన గందంపుఁ జట్ట లనఁగ
మరుని ముందఱ బరాబరిసేయు కంచుకి
కులముచేతుల వెండిగుదె లనంగఁ

తే. గైరవములకు వెన్నెల నీరు వఱపఁ
బూని చేర్చిన పటికంపు దోను లనఁగఁ
గ్రమముతో శీతకరమయూఖములు గగన
భాగమునఁ గొన్ని యల్లనఁ బ్రాకుదెంచె.'

నని వర్ణించియున్నాఁడు.

మఱియొక మహాకవి యుదయకాల చంద్రకాంతిని 'యభినవ ఖరయోషిత్కషాయకంఠకాంతి' తో నుపమించినాఁడు. బాలచంద్రునిఁ బ్రాక్సతీలలాటతిలకముగ నొకరు, నభస్సీమంతినీ సిందూరరేఖగ నొకరు దర్శింప, నొక రప్సరఃప్రణయినీ కరసరోజచషకముగను, మఱియొకరు కబరీచ్యుత మాలగను జూచినారు. ఒక రత్రిమునిలోచన భూషికగా భావించినారు. ఒకరు త్రినయన జటావల్లీ పుష్పముగ నూహించినారు.

శుక్లపక్ష క్షపాకరుఁడొక సురుచిరుని మనోవీథి –

సీ. [37]"మన్మథదివ్యాగమమున కోంకారంబు
భూ తేశు నౌదల పువ్వుదండ
యల్పశృంగార రేఖార్గళకుంచిక
యధికతమోదంతి కంకుశంబు
విరహిణీజనమర్మవిచ్ఛేదకర్తరి
యంబర క్రోడ దంష్ట్రాంకురంబు
తారకామౌక్తిక తతికినంచితశుక్తి
దగు నంబునిధికి ముత్యాలజోగు

తే. మారుపట్టాభిషేకాఖ్య వారికుంభి
చిత్తజుని కోట లగ్గ దంచనపు గుండు"

అనఁగ కాంతి నిస్తంద్రుఁ డగుచు నానాఁటి కభివృద్ధి నారుకొనుచుఁ గన్పట్టినాఁడు. [38]'విరహుల కెల్ల సంధ్యవతి వేడుక జోతము సెప్పవచ్చుచో నిరతము తోడ నక్షతలు నించి తగన్ గరపంకజంబునన్ మురియుచుఁ బట్టు నా మెఱుఁగు ముత్తెఁపుఁ జిప్పన' నొప్పు విదియచంద్రు నొక కవిరాజు గమనించినాఁడు. జాబిల్లి యొకానొక [39]యద్యతనాంధ్ర కవి కుమారున 'కాకాశపు టెడారిలోఁ గాళ్లు తెగిన యొంటరి యొంటె' వలెఁ గన్పించినాఁడు. మిన్నువ్రాకు శీతరోచినిఁ జూచియొక భావుకుఁ డమృతసముద్రములోని పీయూషమును జేదుకొనుచున్న దివ్యాంగన లుపయోగించు వెండి చేరులకుఁ (కిరణములు) గట్టఁబడిన స్ఫటికకుంభముగఁ గనుఁగొనినాఁడు.

ఒక మహాకవి చూచుచుండ :

చ. [40]"దిన పరిణామ లక్ష్మికిఁ బ్రతీచి తగం గయి సేయు వేడుక
న్వనరుహమిత్త్రబింబ మను వర్తులలాక్షికపట్టికం బయో
ధి నడుమఁదోఁచి సాంధ్యనవ దీప్తిరసంబు హరించి పాఱవై
చిన వెలిదూదియో యనఁగ శీతకరుం డుదయించె నత్తఱిన్."

[41]కాలమనియెడు విలాసి కెంపులతోను ముత్యములతోను నొక సరమును గ్రుచ్చుచుండ సాంధ్యకిరణవిశిష్టుఁడైన సూర్యుఁడు సూత్రమునఁ గ్రుచ్చఁబడిన కెంపు వలె నుండ వరుస తప్పుటచేఁ ద్రోచి పిఱుందఁ జేర్చు ముత్తెము క్రియ లాంఛన రంధ్రసంగతిచే నయ్యమృతదీధితి యా మహనీయునకు మఱల నొకమాఱు దర్శన మొసఁగెను.

భక్తశిఖామణి యగు నొక మహాకవిప్రౌఢునకు –

మ. [42]"ఉదయ గ్రావము పానవట్ట మభిషే కోదప్రవాహంబు వా
ర్ధి దరధ్వాంతము ధూపధూమముజ్వ లద్దీపప్రభారాశి కౌ
ముది తారానివహంబు లర్చిత సుమంబుల్గాఁ దమోదూరసౌ
ఖ్యదమై శీతగభస్తి బింబ శివలింగం బొప్పెఁ బ్రాచీదిశన్."

ఇది యిట్లుండ నొక మహాకవి జాబిల్లిని ముక్కంటియా యను భ్రాంతి వహించి దర్శించి, తెప్పరిల్లి,

మ. [43]“కడఁక న్రేచలిగట్టుపట్టిఁ దను వేడ్కం గూర్ప నే తెంచి పై
జడిగాఁ జుక్కలతూపు లేయ గినుక న్జాబిల్లిముక్కంటి దాఁ
బొడుపుం గెంపను వేఁడికంట నిరుల న్పూవిల్తు మే నేర్చి చొ
ప్పడఁ దద్భూతి యలందెనా నపుడు బింబం బొప్పెఁ బాండుద్యుతిన్.”

అని ప్రహర్షహృదయముతోఁ బలికినాఁడు.

శశికిని, శివునకు సన్నిహిత సంబంధము. అది యతఁ [44]“దనలాక్షు ఘనజటా వనవాటికి వన్నె వెట్టు ననార్తవంపుఁ బూ’ వగుటయే యనుట నిస్సంశయము!

పరిపూర్ణ చంద్రబింబమును గని ప్రౌఢభావుకులు పరిపరివిధముల నూహించిరి. అందు శకునజ్ఞుఁడు దేశసుభిక్షార్థియు నగు నొక మహాకవి :

ఉ. [45]“పొందుగఁ బశ్చిమాబ్ధి తటభూస్థలి నంశుమదంశుమత్ఫలా
కందము వాసరాంతహలికప్రవరుం డిడ సాంధ్యవారిభృ
త్కందళము ల్తమోదళ యుతంబులునై గెల పండి వ్రాలెఁ బూ
ర్ణేందుని పేరఁ బ్రాచి నది హేతువు వెన్నెల కల్మి కల్మికిన్.”

అని సప్రమాణముగఁ బల్కినాఁడు.

చ. [46]“పనుపడ వేణునాళములఁ బగ్గములం బలెఁ గ్రిందఁ బర్వు శో
భన కిరణ ప్రకాండములు భాసిలఁ జందురుఁ (డొప్పి యెం) తయు
న్మనసిజుఁ డెల్ల ప్రాణుల మనంబులు చేలుగ రాగబీజముల్
పెను జతనంబుతోడ వెదఁ బెట్టెడు రౌప్యపు జడ్డిగం బనన్.’

గనుపట్టిన నొక మహాకవి చూచి సంతోషభరితాంతఃకరణుఁ డైనాఁడు.

[47]‘తుహినకరమండలంబునం గురియు నప్పండు వెన్నెలలు సాయంతననటన చటుల మహానట వికటాట్టహాసంబుల కను ప్రాసంబులు. పూర్వపారావార పులినతల విహర ణైరావణ కరపుష్క రోద్ధూత వాలుకాధూళికలకుం బ్రత్యా దేశంబులు. అంధకార బలీంద్ర నిర్బంధన ధురంధర సమయ మధుమథన చరణాంగుష్ఠ నిష్ఠ్యూత గగనసరి దంబుపూర్వంబుల కనుబింబంబులు.’

‘శరత్తు చంద్రికలది’ [48]‘ఋణ మపరిహార్యమైన పాపము గనుక నట్టి పాపము చేత విముక్తుఁడైన మనుజునిమాడ్కిఁ జంద్ర గర్భితములైన మేఘము లీ శరత్తున నొప్పారును.’

సీ. [49]'పొల పొల విరిసి పోవుచు నల్పు విఱుఁగుచు
మొల్లమ్ము చెడిన మొగిళ్ల వలన
పసి పసరేదు మవ్వఁపు సన్నజాజి మొ
గ్గల తొలివిప్పు నా వెలఁదు లగుచు
నెడ పడ్డ వానల జడులచేఁ జెమ్మ లా
రిన లేఁత పొరగాలి పసల వలన
మరు సెలకట్టె మాదిరి దూసి చను కమ్మ
గేదఁగి తావులై స్వాదులగుచు

తే. చివర తెలిదారముల నూఁగు జిలుఁగులొలయ
పొట్లపూవలెఁ బెరఁటిలోఁ బొలుపు లగుచు
నలరు నేడాకులనఁటి మొవ్వాకు జిగికి
నెలవులు శరత్తు తలిరు వెన్నెలలు ...'

[50]సాంద్రచంద్రికలు 'నెలయను వెండికుండఁ గడు నించి నిశాచకోరనేత్ర యంబరాహ్వయ మహానటమూర్తి మహాభిషేక మొనర్పఁగ నెల్లదిక్కులఁ బ్రవహించెడు పాలవెల్లి' యననొప్పును. అంతియ కాదు. కొన్ని సమయముల :

మ. [51]"అమృతం బాసవ మంగ రాగ ముదయో ద్యత్కాంతిచేలంబు చి
హ్నామునుంగా శశిరేవతీరమణుఁ డున్మాదంబు మీఱం దమో
యమున న్భంగము నొంది పాఱఁ గరసీరాలోడితం జేయ వ
చ్చె మరుద్వాహిని దాని దేర్పనన మించెం జంద్రికాపూరముల్.'

చంద్రికావిశిష్టములైన రాత్రులందు చకోరలీలలు చిత్రాతిచిత్రములైనవి. ఈ పులుఁగుల చేష్టలఁగని మహాకవులు మనోహరవర్ణన లొనర్చినారు. వాని భోజన ప్రియత్వమును గన్నులారఁ గాంచిన యొక కవిచంద్రుఁడు:

సీ. [52]"నునులేఁత వెన్నెల కొనలు మెల్లనఁ ద్రుంచి
పిల్లతండములకుఁ బెట్టు నవియుఁ
జవియైన వెన్నెల చంచులఁ గబళించి
యింపారఁ బ్రియుల కందిచ్చు నవియుఁ
గడఁగి యింతటఁగాని వడఁదేర దనుభంగిఁ
దనర వెన్నెలవెల్లి మునుఁగు నవియుఁ
బగలింటి యాఁకలి పాయఁ బైపైఁబడి
ముదురు వెన్నెలఁ గ్రోలి పొదలు నవియు

తే. గడుపునిండినఁ గసికాటు కఱచునవియు
గూడి యొండొంటితోఁ జెఱలాడు నవియు
నగుచు వెన్నెల తమ సొమ్మె యనిన యట్లు
కోరి చరియించెఁ జదలఁ జకోరచయము."

అని యందలి విభేదముల వీనులలర వినిపించినాఁడు. కౌముదీమహోత్సవములతోఁ బాటు మదనోత్సవములును జరుగుచుండుట భారత రసిక లోక మెఱిఁగినదే. 'కొలము సాముల నందఱఁ గూడఁ బెట్టి చిగురు విలుకాని జాతర సేయువేళఁ జకోరపుఁ బేరటాండ్రు :

సీ. [53]"విరహుల మైసోకి వేడియౌ వెన్నెల
బచ్చి వెన్నెల నులివెచ్చఁ జేసి
కలువ పుప్పొళ్లచేఁ గసటైన వెన్నెల
వలిపవెన్నెలలోన వడిచి తేర్చి
చంద్రకాంతపు నీట జాలైన వెన్నెల
ముదురు వెన్నెల జుఱ్ఱఁ బదును చేసి
సతుల మైపూఁతం బిసాళించు వెన్నెలఁ
దనుపు వెన్నెల రసాయనము గూర్చి"

వంతుగలియఁగ బువ్వంపుబంతివిందుఁ బెట్టుట లొక మహాకవి దర్శించి చకోరకులముల యన్నరసాస్వాదనా శేముషికి జోహారు లర్పించినాఁడు.

ఒక మహాకవి కౌముదీ మహోత్సవమున కాదంబరీ పాన మదఘూర్ణిత నేత్రయై గోత్రమునం దున్న యొక యుజ్జ్వలవిలాసిని యున్మత్తయై పల్కిన "చంద్రా! ఏల యీ సురాచషకమునఁ బ్రతిఫలింతువు? రోహిణీదేవి ధమ్మిల్లముతోఁ బాటు విరుల నెత్తావికి వీడ్కోలు సుమా! ద్విజరాజువై యుండి యీ మధువుతో నీకేమి పని? మద్యముతోఁ బాటె నిన్నును ద్రాగి వైచెదను. మా యందెవ్వరినో కామించి యిట్లు తట్టాడు చున్నట్లున్నావు. ఇది నిజము. లేకున్న నీపై నీ తారకల కనుమానమెందులకు? వారు నిన్నేల యనుసరింతురు? పశ్చిమ దిశను నీకెవరో ప్రణయిని యున్నట్లున్నది; కాదేని నిశాంతమున నీ వా దెస కేల పయనింతువు?" అను ప్రలాపముల వీనులలర విని రసానందానుభూతి నొందినాఁడు.

చంద్రునకు నూలుపో గర్పించు వేళ నొక భావుకుఁడిట్లు దర్శించి

మ. [54]"చరమక్ష్మాధరసింహచారుముఖదంష్ట్రాకోటియో నాఁగ నం
బరశార్దూలనఖంబు నాఁగఁ దిమిరేభ ప్రస్ఫురద్గర్వసం

హరణక్రూరతరాంకుశం బనఁగ నుద్యల్లీల మీ రేఖ ని
త్యరుచిన్ బోల్పఁగఁ బెంపగున్ విదియచంద్రా! రోహిణీవల్లభా!!"

యని యా దైవతమును గృతాంజలియై బ్రార్థించినాఁడు.

జంద్రుని యందలి నైల్యమునకు భావుకలోకము బహువిధ కారణములఁ బలికినది. ఒకరు తిమిరచయమును మ్రింగ నది జీర్ణింపక యిట్లు కడుపున గడ్డకట్టిన దనినారు. తమ యమృతంపు బావి యగు శీతకరమండలము నుండి దేవతలు పీయూషమును జేదుకొన నది యడుగు దగులుటచే నందలి ప్రౌఢపంక మీ రీతిగఁ గన్పించుచున్నదని యొకరు భావించినారు.

మ. [55]"రతినాథుం డను మాయజోగి చదలం ద్రైలోక్యవశ్యాంజనం
బతియత్నంబునఁ గూర్చి మౌక్తికమయం బైయున్న పాత్రంబునన్
మతకం బేర్పడఁ బెట్టి దాఁచె నన నీ మధ్యంబునన్ మచ్చ సం
తతమున్ గన్నుల పండువై వెలయుఁ జంద్రా! రోహిణీవల్లభా!!"

యని నీలాంకమున నింగిఁదోఁచి వెలుఁగు వెలుఁగురాయని గీర్తించినాఁడు. ఇది చంద్రుని యందలి కృష్ణసారమని కొందఱి నమ్మకము. అందుచేతనే యతఁడు కురంగలాంఛనుఁ డైనాఁడని వారి యభ్యూహము. ఈ కారణముననే యొక కవి 'చంద్రునిలో నిట్టి నేల చంగలి మేసెన్" అను సమస్యను బూరింప నొక ప్రాచీనాష్టావధాని కొసఁగ నతఁడు పాశుపతాస్త్ర ప్రదాన సమయమున ఫాలాక్ష ఫల్గును లొకరితో నొకరు పోరాడువేళ నర్జునుని తపోభూమిఁ బుట్టిన పచ్చికను గ్రిందైన చంద్రశేఖరుని శిరమందున్న శశిఖండ మందలి మృగశాబకము భక్షించె ననుభావము వచ్చునట్లు పూరించినాఁడు. ఈ మచ్చ రోహిణీవల్లభునకుఁ దారాజారత్వమున వచ్చిన దుష్కీర్తియని కొందఱ యభిమతము. అది దోషమైన నగుఁగాక! మహాకవి కాళిదాసు వంటివాఁడే [56]"అనంతరత్న ప్రభవుఁడగు నా శైలాధిపునకు హిమము సౌభాగ్యవిలోపి కాదు, లోకములో ననేక గుణములలో నొకదోషము లెక్కకు రాదు. చంద్రుని కిరణములందు నీలాంకము వలె మునిఁగి పోవును" అని ప్రవచించినాఁడు.

పద్మినీ కమలాప్తుల బాంధవమును బోలినదే కుముదినీ కైరవమిత్రుల మైత్రి. తారకాధీశు కిరణకదంబకము చిలుకు పలుచని వలిపంపు జిలుఁగుమంచు గైరవశ్రీ వధూకరగ్రహణ వేళ వెలికిఁ గ్రమ్మిన సాత్త్విక స్వేదము.

కావ్యలోకమున నాయికానాయకు లీ మైత్రి నాధారముగ గ్రహించి గర్భితోక్తుల సంభాషింతురు. ఒక [57]నాయకుండు నాయిక నుద్దేశించి 'తుహినాంశు బింబమును గనని నళినీ జన్మము నిరర్థకము గదా!' యన నాయికయు 'నళినీ సౌభాగ్యావలోకన మొనర్పని చంద్రోత్పత్తియు నిష్ఫల' మని సాభిప్రాయయై సమాధాన మొసంగినది. ఆకసముననున్న చంద్రుండు కేవల[58] పరోపకార బుద్ధితోఁ గుముదావబోధన మొనర్చుచున్నాండని చెప్పుచు నీ మైత్రి లక్షణము నెఱుంగని యొక కవిశేఖరుం డున్నత చేతసులు పరోపకారవ్యసనజీవితు లను నర్థాంతరమును నిరూపించినాండు.

కుముదినీప్రణయముతోఁబాటు శశాంకునకుఁ బద్మవైరమును గవి లోకసిద్ధము. దీనిని గ్రహించిన యొక మహాకవి –

తే. [59]తామరసలక్ష్మి లాచందమామ రాకఁ
గలంగుచును గుముదాలికై తొలంగు నపుడు
తొలంగు బావయె కాండె తమ్ముల వరించు
నట్టి సతులకు నతండు మున్నెట్టిఁ డైన

యని పల్కినాండు. ఈ యంశమునే సమ్మోహనముగ మఱియొక మహాకవి:

శా. [60]"ఈ వబ్జుండవు నీటఁ బుట్టితి సుమీ యే నంచు మోమోటపుం
ద్రోవ ల్సెప్పంగ సిగ్గుగాదె మఱి నీ తోఁబుట్టు శ్రీదేవి లీ
లావాసంబుసిరుల్ హరింతు వనుచో నయ్యో కళాదుండు చే
తోవీథిన్ సహజాధనాపహరణో ద్యోగంబు నెగ్గించునే!"

యని నిరూపించినాండు.

విరహిణులకు విధుమండలమునకుఁ జుక్కెదురు. తాపాపనోదనమునకై తరిపి వెన్నెలల సుధాంశుని శైత్యమును నమ్మి విహరింప శీతకరుండుఁ ఘృతకోశాతకి యగుట పరిపాటి. ఈ విషమ ప్రకృతిని భరింపలేక ప్రతిప్రబంధ నాయికయును జంద్రోపాలంభనకుఁ గడంగినది. ఒక యింతి చంద్రుని 'నింతుల నేఁచు పాతకము నీకజహత్యకళంక' మని పల్కినది.

సీ. [61]"శ్యామకంఠలలాటసామీప్యపరితప్త
మౌనంబులుగఁ గళల్ మార్చి మార్చి
సింధూదకాంత స్సమింధన బడబాన
లోగ్రకీలల సెగ నూని యూని

ప్రత్యమావాస్య సంభవ దర్కసంయోగ
కలితాధికోష్ణిమఁ గ్రాఁగి క్రాఁగి
విప్రయోగోష్ణ పాంథ ప్రాణపరిపాన
ఘూమజంబగు కాఁక పొంది పొంది

తే. కాలకూటాహ్వయభ్రాత పాలుపట్టి
పుచ్చుకొను దాహకత్వంబు ప్రోచి ప్రోచి
యింత వేఁడిమి సాధించి తేమొ చంద్ర!
నన్ను నేఁచుటకే ప్రయత్నంబుతోడ!"

యని యొక విరహిణి నిశాకరుని 'వేండ్రపుం బ్రకృతికి' వింత వింత కారణముల వెదకి చెప్పినది. చంద్రికాతాపమును సహింపఁ జాలక [62]"కురంగము నీయం దున్నను శక్రచాపమునకుఁ గుఱికాకుండుట, విద్యుదుష్ణమునకు వెఱచి పర్వులెత్తకుండుట లెంత విచిత్రము'లని మఱియొక విరహిణి వాపోయినది. విసిగివేసారిన యొక గడుసరియైన విప్రయోగిని చంద్రుని చేతనైనంతగ నుపాలంభించి తుదకు :

తే. [62]"త్రిపురసంహార మొనరించు నపుడు హరుఁడు
బండి కల్లుగ నీ మేను గండి సేసె
నదియు సెలవారి తెగటార వైతి చంద్ర!
యకట! రోహిణియెడ నపథ్యమునఁ జేసి"

యని చంద్రక్షయము నాకాంక్షించినది.

చంద్రునియెడ నిట్టికోర్కె యెంతటి పాతకము! కాముకులకు విచక్షణజ్ఞాన మెక్కడిది? ప్రియులు చేకూరిన వేళ నీ చంద్రుఁడే ప్రియదర్శనుఁడు కాఁడా? అమరుల బోనపుట్టిక, సహస్రమయూఖుని జోడుకోడె, సంతమసము వేరువిత్తు, పుంశ్చలీసమితికిఁ జుక్క వాలునగు నమృతకరుని యనామయము లోకక్షేమమే కదా! వలరాజు మేనమామ, మధుకైటభారి మఱఁది వంటి మనోహరదైవత మెటనున్నాడు? ఓ చంద్రా!

ఉ. [63]"వెన్నెల పేరిదారముల వెండి హొరంగు పటంబు నల్లి మ
ధ్యన్నెఱిగూడు కట్టుకొని యాపెనుదారపు చిక్కులందు నీ
పున్నమదీప్తిచే నిరులపుర్వులుపట్టి పలార్చుచున్న నీ
యన్నువ వెన్నెలల్ చలువ లై మరి మాకుఁ బ్రసన్న మయ్యెడున్."

# మలయానిలుఁడు

సీ. [64]“లలనాజనాపాంగవలనావసదనంగ
తులనాభికాభంగదోఃప్రసంగ
మలయానిలవిలోలదళసాసవరసాల
ఫలసాదరశుకాలపనవిశాల
మలినీగరుదనీకమలినీకృతధునీ క
మలినీసుఖిత కోకకులవధూ క
మతికాంతసలతాంతలతికాంతరనితాంత
రతికాంతరణతాంతసుతనుకాంత

తే. మకృతకామోదకురవకావికలవకుల
ముకులసకలవనాంతప్రమోదచలిత
కలితకలకంఠకుల కంఠకాకలీవి
భాసురము వొల్చు మధుమాసవాసరములు”

ఋతుచక్రభ్రమణమునఁ గిమ్మీరితకాంతులతో ననుగమించుచున్న చైత్రమాస వాసరముల నొకమహాకవి యాంధ్రప్రబంధవనీవీథులకు సంగీత కళారహస్యనిధియై యాహ్వానించినాఁడు. విచ్చేసి యయ్యవి మనోహరులై తమ సమ్మోహన శక్తితో సమస్తచరాచరప్రకృతిని బులకింపఁ జేయుచు స్తుతిపాత్రము లగుచున్నవి.

‘కాలః కరోతు కార్యాణి’ యను ప్రాచీనార్యోక్తిపైఁ బరమాదరము గలవాఁడు.

సీ. [65]“కించిదుషఃపూర్వకించిదతఃపర
ప్రాలేయబిందుసంపాతవశత
మధ్యాహ్నవేళాక్రమప్రాప్తతీక్ష్ణతా
కలితాతపోగ్రసంక్రాంతివశత
సాయంసమాగతస్వచ్ఛచంద్రాతప
కుల్యాప్రసారణాకూతవశత

మధురనిశార్ధభాగధునీవిధాప్రియా
హేలామనోజసాహిత్యవశత

తే. శిశిరహేమంతశుచిశరత్సేవ్యమానుఁ
డై మహారాజవైభవోద్దామమూర్తి
కూడి ఋతురాట్సభానలకూబరుండు
మాధవుఁడు వచ్చె సుమసుకుమారమూర్తి."

చిలుకలతేరు నెక్కి చైత్రయాత్రకు బయల్వెడలు వేళ సేనాసమేతముగ వనవీథులఁ బయనింప[66] 'ప్రత్యగ్రసాలాగ్రహర్మ్య విటంకంబులు ప్రాఁకి వల్లివనజాస్యల్ సల్లిరుత్ఫుల్ల పల్లవహస్తంబుల భావిభావుక ఫలోల్లాసంబుతోఁ గ్రొవ్విరుల్.'

ఉత్కంఠాపనోదితకలకంఠకంఠములతో వనలక్ష్మి 'నందనవనసుందరిని న్నందగాని రానిచ్చెనె?' యని సాకూతముగఁ బ్రశ్నించినది. ఆమె 'శోభానవతరుణిమ నాశుష్క జీవతరువుల కిఁక, ఋతునేతా! వసంతా!!" యను ప్రమోదోన్మత్తమధుర గానమున మంజులముగ్ధనృత్య మొనర్చి యతని కాతిథ్య మిచ్చినది.

'మన సఖుఁడు, గురుఁడు దైవ' మీ మాధవస్వామియని మనసారనమ్మి మనోవాక్కాయకర్మల నాజ్ఞానువర్తియై మెలఁగు మలయమారుతుఁడు వసంతుని యభ్యుదయపరంపరాభివృద్ధి నర్థించుచు నానందాబ్ధి నోలాడుచు బహురూపముల ధరించి పొంపిళ్లు వోవుచున్నాడు. ఇతఁడు వనప్రియ కడకు వసంతాగమన వార్తఁ గొనిపోయి నపుడామె ముఖసమీరముతో గౌరవపురస్సరముగ నెదురురా 'నిలువెల్లఁ బొంగిపోయి యొడలెల్లఁ గాళ్లుగ వడిబారు నదియై' సకలచారీకరణాంగహారచతురనృత్య మొనర్చినాఁడు. ఇది గమనించిన మన ప్రబంధపరమేశ్వరుఁడు :

చ. [67]"ఇదె చనుదెంచెఁ జైత్రమని యెల్లవనంబులకుం బ్రమోదముల్
బొదలఁగ మేలివార్తఁ గొని బోరన వచ్చిన దాడికాఁ డనన్
మృదువనదేవతాముఖసమీర మెదుర్కొన నుల్లసిల్లె నిం
పొదవఁగ దక్షిణానిల మనూనమనోహరఖేలనంబునన్."

అని వర్ణించినాఁడు.

వసంతుఁ డతని యనుంగునెచ్చెలి యగుట నతఁడు వచ్చునపు డెదురేఁగి సుగంధసేకరణ మిచ్చి మిత్రునికెత్తని కీర్తిధ్వజమై మలయానిలుఁ డొప్పినాఁడు.

పుష్టివర్ధనమైన యీ నెత్తావిసంపుటి యొకనాఁటిదా! ఒక చోటిదా!! దీని సంపాదించువేళ:

సీ. "కేళీసరోవీథి నాళీక వాటీమ
ధూళీఝరీరాజి తేలి తేలి
చోళీమహాభోగచూళీనవప్రసూ
నాళీసుగంధంబు లాని యాని
లోలీభవత్పుష్పధూళీచరద్భృంగ
పాళీనిరోధాప్తిఁ దాళి తాళి
తాళీవనీనారి కేళీరసాలకం
కేళీహితచ్ఛాయఁ గెరలి కెరలి

తే.గీ. మెలఁగు నామని మణిధరావలయనిలయ
కనకనందనచందనాకలితలలిత
వలితలవలీనికుంజాబ్జవదనమదన
కదనఘర్మాప(హుం డయ్యె) గంధవహుఁడు."

వసంతప్రాదుర్భావమున మలయానిలుఁడు సమస్త ప్రపంచమునఁ దానెయై ప్రవర్తించి యాకర్షించినాఁడు. [68]'ఒనర హిమావకుంఠనము లూడ్చి తెమల్చిన పత్రభంగముల్ సన నసియాడుచు న్మొగుడి చెక్కుల పల్లవపాణిఁ గప్పు నూతనలతి కాలతాంగుల నుదారగతి న్జలివాపినాఁడు. వారికి నెయ్యంపుఁ బెనఁకువ నేర్పినాఁడు. నితాంతనూతనలతాంగా శ్లేషముల్ నిశ్చలలీల న్మధుపాంగనా సమితి కలరఁజేసినాఁడు. సంధించు తామ్రాక్షియౌ కలకంఠిని నేర్పు మెఱయఁ బలికించినాఁడు. లోక మతని భుజంగగ్రామధామైక సంకలనాభ్యాస విలాసపాటవునిగఁ గీర్తించినది. కొమ్మల డాసి పండుటాకుల మిషతో నిచోళావకుంఠనముఁ దొలగించు చిలిపితనమును గూర్చి లోకము పరిపరి విధములఁ జెప్పుకొనినది.

ఈ గంధవహుఁ డెవ్వఁడు? ఏ కడవాఁడు? ఈతని రాకకుఁ గారణ మెయ్యది? భావుకుల నీ ప్రశ్నలు కలఁతపెట్టినవి, అతని వంశాభిజాత్యముల గుర్తించినవా రతఁడు పుట్టుపూర్వోత్తరములు, మట్టుమర్యాదలు లేనివాఁడు కాఁడని నిర్ణయించి యతని చరిత్రనిట్లు సంక్షేపముగఁ బ్రవచించినారు.

సీ. [69]"దక్షిణాశావధూతనయుఁ డై వనలక్ష్మి
పెంపునఁ బొదరిండ్ల బెరిగి పెరిగి,
తేఁటిజోటుల జోలపాటలఁ బాటిల్లి
తీఁగయుయ్యాలలఁ దూఁగి తూఁగి
కమలాకరంబులఁ గమ్మ పూఁదేనెల
నానుచుఁ జల్లు పోరాడి యాడి
కమలధూళీపాళికాకేళికలఁ బొల్చి
మందమందవిహార మొంది యొంది

తే. యాగమస్థితి యెఱిఁగి బాల్యంబుతఱిని
మల్లుల బెనంగి పాంథుల మర్మ మెఱిఁగి
సాముఁ జేయుచు మాధవస్వామి యాజ్ఞ
కంతుజోడై మెలంగు లేగాడ్పుకుఱ్ఱ."

ఇందువలన మలయానిలుఁ డుదాత్తమైన జన్మకలవాఁడగుటయే కాక యుత్తమసంస్కారముల నొందిన యుదాత్త చరిత్రుఁడని యభివ్యక్తమగుచున్నది.

[70]గండాభోగప్రతిఫలితతాటంకయుగళముచేఁ జతుశ్చక్రమై యొప్పు సౌందర్య లహరీముఖరథమును బూన్చికొని యర్కేందుచక్రమగు నతనిరథమెక్కి ప్రమథపతి వచ్చిన నెవఁ డళుకు బెళుకు లేక ప్రతిఘటించుచున్నాఁడో యట్టి మన్మథుఁడు తన కాప్తమిత్రుఁ డను గర్వము గంధవహునికి లేకపోలేదు.

ఒకనాఁడు మలయానిలుఁడు 'మహిళామండలమంజుల భ్రమరకామర్దుండును, శ్యామాముహుర్ముహురున్మీలితపత్త్ర ఖేదనిపుణుండును, పద్మినీకంకణ గ్రహణాపాదియు నై సగంధ విటపప్రాప్తితో విజృంభించియుండ' నతని మన భట్టుమూర్తి దర్శించినాఁడు, మఱియొక ప్రబంధకవి విచ్చలవిడిగా నతఁడు విఱ్ఱవీగి సంచరించుచు 'మల్లికాసు మగళన్మకరందహేరాళ ధారాజలంబులఁ దడిసి తడిసి, సరసిజకైరవ సంతానసంక్రాంత వీచికావళుల మీఁద విడిసి విడిసి, ప్రత్యగ్రప్రసవ సంపూరిత చూతమంజరులపై సుడిసి, సుడిసి, తతవియోగశ్రాంత తరుణీ జనస్వాంత జనిత ఖేదములలో జడిసి జడిసి, బహుళకోరక కుసుమసంభరిత మంజుపట విహరణ ముదిత బంభర వితాన మధుర తరగీతికాసంస్తూయమానుఁ డగుచు' విశ్వవిఖ్యాతి గడించుకొను మనోహరదృశ్యములఁ గన్నులారఁగని ముదితాంతఃకరణుఁ డైనాఁడు.

వసంతవేళ మ్రాను పట్టుచున్నది; తలిరులు పుట్టుచున్నవి. ఈ విషమస్థితికిఁ గారణము 'రవి గాననిచోఁ గాంచు కవికి' గోచరించినది.

ఉ. "చిలువసుధారసాధరల చెల్వపుఁ బుక్కిటి తావిఁ దీయనై
వలపులయందుఁ దత్ప్రియుల వక్త్రవిషజ్వలనోష్మ నెట్టనై
వెలువడి తద్గుణద్వితయ వేధ సుమీ యన మ్రానుపట్టుటల్
దలిరులు బుట్టుటల్ కనఁగఁ దార్కొనెఁ జందనశైలవాయువుల్."

అని యొక కవిశ్రేష్ఠుఁడు తాఁగనిన సత్యమును బ్రకటించి సృష్టి నిర్మోకమును దొలఁగించి యొక రహస్యమును వెల్లడించినాఁడు.

'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' యని కృష్ణభగవానుఁడు గీతలోఁ బ్రవచించినాఁడు. అతఁడేమిహికాఁ జలధుల మునిఁగిపోవు వన భువనము నుద్ధరింప మలయానిలుఁడై యవతరించినాఁడు. లేకున్న మిహికా జలధు లేమగుచున్నట్లను ప్రశ్నకుఁ దగిన సమాధానము రామి, విజ్ఞులిట్లు నిర్ణయించిరి. రాయలవారు 'భువనవిజయము'న 'నిండుపేరోలగంబుండి యొకపరి యష్టదిగ్గజముల నీ విషయమై పృచ్ఛయొనర్చిరి. సంతృప్తికరమగు సమాధానము రాకపోవుటచే నారాజకవి శిఖామణి యధ్యక్షపీఠము నుండి తామే యిట్లు ఛిన్న సంశయముగ సెలవిచ్చిరి.

కం. [71]"మలయకటకోటజస్థిత
కలశీసుతసేవ నిట్లు కనెనొ తదాశా
నిలుఁ డనఁగ నలసవృత్తిన
మెలఁగుచు నాపోశనించె మిహికాజలధిన్."

సకల జనానుమోదకరణదక్షుఁ డగు మలయానిలుని యవతారము లెన్నియైనఁ గలవు. అతఁడు 'చంచరీకంబురీతి వికచారవిందదీర్ఘికల వినోదించును; పర్జన్యుభాతి కుసుమితనవ లతావిసరంబులఁ గదలించి వలిదేనియల సోనఁ దలము గొల్పును; ప్రణయవేళల సురటియై రంజిల్లును.

అప్పుడప్పుడు మలయానిలబాలుఁడు 'బొండుమల్లెల పరాగము రేఁచి నిబిడంబు సేసె వెన్నెలరసంబు, తుమ్మెదలకు నోగిరమ్ములౌ నలరుల కమ్మ తేనియ లెల్లఁ గ్రుమ్మరించె, కీరవారంబుల కారివేరంబుగా ఫలజాలముల నేల పాలు సేసె, దొరల నంటిన జాఱు తరుల నంటి పెనంగు నల లతకూనలఁ దొలంగఁద్రోసె, వనిఁ దమ యిచ్చవర్తిలు ఖగములపై, బరాగములు సల్లె.'

వీనిని బాల్యచేష్టలుగఁ బరిగణించుటకు బదులుగఁ బెద్దలు కొందఱు జాడ్యచిహ్నములుగ లెక్కించిరి. వసంతభిషగ్వరుఁడున్నాఁడు కదా యని కొంద ఱూహించిరి. మఱికొందఱు 'మహానుభావులు' –

చ. "తెగిన మనోభవు న్దిరుగఁ దెచ్చి కుజంబుల కెల్లఁ బ్రాయమున్మ
నుగడ నిచ్చి యన్యభృత మండలి మూఁగతనమ్ము వుచ్చి ము
జ్జగముల వార్తకెక్కినవ సంతభిషగ్వరుఁ డాప్తుఁ డయ్యునున్
దగు గతి మాన్పలేఁడ మఱి దక్షిణవాయువునందు జాడ్యమున్?"

అని నిశ్చయించి తీరినారు. ఇవి జాడ్యలక్షణములా? కావు. మారమాధవ కైంకర్యమునకై మలయానిలుఁడొనర్చు నున్మత్త కృత్యములు. వారు ప్రభువులై ప్రవర్తించి ప్రఖ్యాతి నొందఁ గలిగెడిది యాతఁ డిట్టియున్మాదకృత్యము లొనర్చిననాఁడే కదా! 'కారయితుః కర్తృత్వమ్.' ఇందలి దోషము లన్నియు నా మన్మథమాధవులవే!

విరహిణుల దృష్టిలో నితఁడు 'కాలాంతఃపురకామినీకుచ తటీకస్తూరికాసౌరభశ్రీ లుంటాకము; చందనాచలతటీ శ్రీఖండ సంవేష్టిత వ్యాళస్ఫారఫణాకఠోర విషనిశ్వాసాగ్ని పాణింధమము.' ఇతనియందు శైత్యమున్నదా యనుశంక వొడమి యొక వియోగిని యన్వేషించినది. అంతకాశాసమాయాతత్వము, రౌద్రమూర్తిత్వవార్తలు, దహనసారథ్యతత్పరత, శ్రీఖండవిషధరోచ్ఛిష్టతలు నరసి, విచారించి, భావించి, 'మలయపవన! నీ యందుఁ జలువగల దనునట్టి సంశయము తగదు. చండాలవాటిలో బ్రాహ్మణగృహముకై వెదకుట భ్రాంతి కదా!' యని యామె నిశ్చయించినది. వియోగాగ్నిని భరింపఁజాలక 'తలఁప జగత్ప్రాణుఁడవై వెలసిన నీవిట్లు నన్ను వేఁచుట తగునే? చింతింప నిల వెలుగు చేను మేసిన నెద్ది కాఁ' పని యామె మలయానిలునితో మొఱపెట్టుకొనినది. అతని నుద్దేశించి :

ఉ. "దక్షిణగంధవాహ! నిను దన్మలయద్రుమరూఢగూఢపా
ద్భక్షణనింత కెంతయు నపాయము పొందదె పొందకుండఁగా
నిక్షుశరాసనుండు విరహిశ్వసితోపచయక్రియ న్విము
క్తక్షయుఁ జేసెఁ గావలయుఁ గాక తదుష్ణత నుష్ణమెక్కఁగన్."

అని యుపాలంభించినది.

ఇంత కంటె జాణ యగు నొక విరహిణి మలయానిలుని రాకనే యరికట్ట నుద్దేశించి, యతని లోకయాత్రకు భంగకరమగు ననియైన నూహింపక –

మ. [72]“అది కాదే చెలి! నీవు కేరళమహా హార్యంబుపై నున్న యా
మదిరోన్మత్త పుళిందనాయకులతో మాటాడి చంపింపవే
కదనుల్ ద్రొక్కుచు వాని వాహనములై కాఱ్ఱుద్దువ్వు నేణీమదో
న్మదసంఘంబులఁ జూత మింక నెటు దు ర్మార్గుండు రానేర్చునో!”

యని యూహించినది. పిమ్మటఁ బర్యాలోచనమున ‘నీయవి వెఱ్ఱియూహలు కదే! శబరపల్లవుల న్స్మరకేళిలోలురం జేయుచు నీగంధవహుఁడు చెల్వుఁడై మెలఁగుఁ గదా! అట్టివానికి వారెట్లపకార మొనర్పఁగల’ రని దైన్యము వహించినది.

విరహిణీలోక మేమనుకొన్న నేమి? అతని నేమన్న నేమి? వారు సన్మార్గుఁ డనినను దుర్మార్గుఁ డనినను మలయానిలుఁడు మనసునఁ బెట్టుకొనుట లేదు. చైత్రభూమీకళత్రచామర చాలనము వలనను, బటుఘర్మజలకణ పశ్యతోహరవృత్తి వలనను వారికి వలపు మెలపుల బ్రసాదించుచునే యున్నాఁడు.

‘కామీ స్వతాం పశ్యతి’. తాము దుష్టులు. మలయానిలుని మంచి యెఱుఁగక విరహు లతనిపై నెన్ని నీలాపనిందలుఁ గల్పించినారు! అతని పరోపకారపరత నణుమాత్రమైన వారంగీకరింప నిచ్చగించుట లేదు.

గంధవహుని ప్రత్యుపకారబుద్ధినిఁగూర్చి శుభ్రజ్యోత్స్నికలలో నెచ్చెలులఁ గూడి శుక్తిమతీనదీతీరమున ‘గూఢమణు’ లను దాఁగిలిమూఁతల నాడు గిరిక చెప్పఁగలదు. ఆమె దాఁగు కొనినవేళ శరీరపరిమళమును గ్రహించినవాఁ డగుటచేఁ బ్రతిక్రియగఁ గన్నులఁ గపురంపు దుమారమును జల్లి చెలికత్తియల కన్నులకుఁ గనఁబడకుండున ట్లితఁడు మేలొనర్చినాఁడు. దూతకృత్యమునఁ బ్రథమగణ్యుఁ డనిపించుకొనిన వాయునందనుని లక్షణములు గల మలయానిలు నొకమాఱు దర్శించి భట్టుమూర్తి యతని పరోపకారపారీణతను :

చ. [73]“అనిలకుమారకుండు మరుదధ్వనిరోధి పలాశిమండలీ
ఘనవనరాశిలోఁ బుడమి కానుపు పద్మిని చిక్కి స్రుక్కఁగా
నినకరముద్రఁ జూపి వెలయించి తదంబుజ రాగపాళిఁ గై
కొనుచుఁ బ్రవాళతేజమునఁ గూరిచెఁ గంటె పలాశవీథులన్.”

అని యుగ్గడించినాఁడు. అనాఘ్రాతపుష్పమగు గిరికా శరీర పరిమళముల గ్రహించుట గౌరవసూచకమే కాని యన్యము కాదు. లేకున్న స్త్రైణపరిమళముల ముల్లోకపాంథుఁడై యతఁ డెన్ని మారు లనుభవింపలేదు! అంతియకా దనేక పర్యాయములతఁడు :

‘అమరాంగనాతుంగ
సంగతోన్నతవక్ష
ఘనసారకాశ్మీర
చర్చాసుగంధముల సొలసి,

వెట్టి నైనాను నేను – ఇఁక
విశ్వచాలన చేయలేను

ఖేచరీముఖసక
ర్పూరతాంబూలాది
వాసనానిఃశ్వాస
పవనచాలనలకున్ భ్రమిసి,

వెట్టి నై నాను నేను – ఇఁక
విశ్వచాలన చేయలేను’

అని జగత్ర్ప్రాణుఁడై సదాగతి యగుట బాధపడిఁనాడు. కొన్ని సమయముల నెత్తావుల మునిఁగి యున్మత్తనృత్య మొనర్చు నాతనిఁగని పెద్దలు వినయవిధేయత లితనికి లేవని పలుకవచ్చును. ఇది పొరబాటు. అతని యణఁకువను గూర్చియు, వృద్ధగౌరవాభిజ్ఞతను గూర్చియు మన మహాకవి కాళిదాసు నడుగుఁడు, కులపతియగు వసిష్ఠాశ్రమమున కేఁగుచున్న సుదక్షిణాదిలీపుల మలయానిలుఁడు సేవించిన రీతి నా మహానుభావుఁడు తిలకించి యిట్లు కలకాలము వినఁ బల్కినాడు :

‘సేవ్యమానౌ సుఖస్పర్శైః
సాలనిర్యాస గంధిభిః
పుష్పరేణూత్కిరై ర్వాతై
రాధూత వనరాజిభిః’

(చల్లనైనవియు, సాలతరు రసపరిమళమిళితము లైనవియు, కుసుమరజస్సుల రాల్చునట్టివియు సుఖస్పర్శగలవియు నగు తెమ్మెరలచే సేవింపఁబడువారై వారు తరలిపోయిరి.)

# భ్రమరాన్వేషణము

“శివ, శివా! యనమేలు తుమ్మెదా!
శివయన్న వినమేలు తుమ్మెదా!!
శ్రీకంఠుఁ డనుపూవు తుమ్మెదా!
మూఁడులోకమ్ము లయ్యెనే తుమ్మెదా!
ఆఱు రేకులపూవు తుమ్మెదా!
యది మీఱునే వాసనల తుమ్మెదా!
వేఱు సేయక నీవు తుమ్మెదా! శివుఁ
జేరి భజియింపవే తుమ్మెదా!!
అష్టదళముల మీఁద తుమ్మెదా! నీ
వంటి చరియింపవే తుమ్మెదా!!
సాకారమైయుండు తుమ్మెదా! పర
మైకాంతమునఁ జూడు తుమ్మెదా!!”

భిక్షుకుని కోమలకంఠము నుండి విడివడి సమీరసమీరిత మగుచు నీ భ్రమర గీతి శ్రుతిపుటములఁ బ్రవేశించి నా స్నిగ్ధచిత్తమును ద్విరేఫాన్వేషణకుఁ బురికొల్పినది.

అది యుజ్జ్వల కావ్యోపవనవాటి. సాకూతమధుర కోమలవిలాసినీకలకంఠ కూజితప్రాయము. [74]శివతపోభంగ సమయము. హుతాశనునకుఁ దోడ్పడు మని వాయువు నెవరు ప్రేరేపింపవలయును? మన్మథునకు మాధవుఁడు సర్వ ప్రావీణ్యము మెఱసి తోడ్పడుచున్నాఁడు. మహాకవి కాళిదాసు వాసంత విలాసశ్రీ వహించియున్న పరమేశ్వరాశ్రమమునందు మదనుని రతిద్వితీయునిగఁ బ్రవేశపెట్టి యొక పొదరింట నుపవిష్టుఁడై సమస్తమును రసనిష్ణచిత్తముతోఁ దిలకించుచున్నాఁడు. స్థాణ్వాశ్రమమున మదనాగమానంతరము చరాచరమైన సమస్త ప్రకృతియు నుజ్జ్వల రసప్రపూర్ణమై యొప్పుచున్నది. మిథునము లుత్కృష్ట ప్రేమరసావేశము గలవై యొప్పు దృశ్యములు భ్రమరాన్వేషణకై పర్యటించు నా కంటఁబడినవి.

అట గండుతేఁటి పూవనెడు నొంటికోరలో ముందుగ నెచ్చెలికిం ద్రాగనిచ్చి యది త్రావమిగిలిన పుష్పరసము నానందరసోత్కరుఁడై త్రావుచున్నాఁడు. నా దృష్టి

యా రమణీయ దర్శనముపై నిల్చినది. కొంతకాలమైన పిమ్మట బుద్ధి యా రసిక దాంపత్యమున కత్యామోదము నొందినదయ్యు నిది రసాభాసము కదా యను శంక నొందినది. అప్రయత్నముగ నా యభిప్రాయము నా నోఁటినుండి బయటపడినంత నెటనుండియో 'రసాభాసమును రసమే' యగు నను నొక కమనీయకంఠము విన్పించినది.

'అది యెచట నుండి?' యని యొక వంకకుఁ జూతునుగదా యట లతా గృహద్వారమున వామప్రకోష్ఠార్పిత హేమవ్రేతుఁడై ముఖార్పితైకాంగుళి సంజ్ఞచే 'నల్లరి జేయకుఁ' డని గణముల శాసించు నందీశ్వరుఁడు నా కంటఁబడినాడు. మఱుక్షణమున వనమంతయు నతని యనుశాసనమున నిష్కంపవృక్షము, నిభృత ద్విరేఫము, మూకాండజము, శాంతమృగ ప్రచారము నైనది. మున్ను పొడకట్టిన ద్వి రేఫప్రియుఁడు ప్రియావియోగము నొంది యొంటిగ నొక యామ్రశాఖికపై నిలచియున్నాఁడు. ఇట షట్పదాన్వేషణ మిఁక సాఁగ దను బుద్ధితో సాఁగిపోవుచుండఁ బర్యంకబంధ స్థిర పూర్వకాయము, ఋజ్వాయత సన్నమితో భయాంసము, ప్రఫుల్ల రాజీవభ్రమకృ దుత్తాపాదద్వయ సన్నివేశము నగు పరమేశ్వరరూపము గోచరించినది. నా చూపు ప్రాణాపానాది మరుత్పంచకమును నిరోధించిన మహేశ్వరుని భుజంగమోన్నద్ధ జటాకలాపముపై నిల్చి కర్ణావసక్త ద్విగుణాక్ష సూత్రమును గని కంఠప్రభాసంగ విశేషనీల కృష్ణాజినముపైఁ బర్విన్నది. వృష్టిసంరంభము లేని యంబువాహము వలెఁ, దరంగ రహితమైన నీరాధారము వలెఁ నివాతనిష్కంపప్రదీపము వలెఁ, బరమశివుఁ డటనుండఁ గని యిట భ్రమరములకై వెదకుట 'వెట్టియన్వేషణ' మని నిశ్చయించి తిరోగముఁడ నగుచున్నాను.

అందుకు వ్యతిరిక్తముగ నా హిమగిరి రాజపుత్రి నిత్యకైంకర్యమునకై సమ్మోహనరూపమున సదాశివుని సన్నిధానమునకు వచ్చుచున్నది. సుగంధ నిశ్వాస వివృద్ధతృష్ణుఁడై యొక సారంగాధీశ్వరుఁడు గిరిసుతాబింబాధరాసన్న సీమఁ జరింపనామె ప్రతిక్షణ సంభ్రమలోలదృష్టితో విలోకించుచు లీలారవిందమున నివారించు దృశ్యమును జూచియు నిట నింక భ్రమరాన్వేషణము పొసంగు టెట్లనుకొంటిని. ఆ మాట పూకుటీరమున నున్న కవికులగురువు చెవిఁబడెనేమో! 'అలక కేఁగుము,[75]అట పాదపములు నిత్య పుష్పములు, నున్మత్తభ్రమర ముఖరములు' నని సెలవిచ్చినాఁడు.

సీ. [76]"గగన స్రవంతిలోఁ గల సువర్ణాబ్జంబు
లందు మే లేర్చి తా నపహరించి,
మానసంబు శఠాత్మమానసంబునుబోలె
నిస్సారసత్త్వంబు నెఱయఁ జేసి
బిందుసరమ్ములోఁ గుందనపుం దమ్మి
పేరులేకుండంగఁ బెల్లగించి
సౌగంధికాఖ్యకాసారంబు జలమాత్ర
శేషమై దీనతఁ జెందఁ జేసి"

వజ్రనాభుని వంటి రక్కసులే కేళాకూళులఁ బోషించి రసికజన రాజేంద్రు లనిపించుకొనినారు. అట్టి యెడ నార్యధర్మాభినిష్ఠ గల [77]శ్రీహర్ష చక్రవర్తి వనపాలన దక్షుఁడై యుంట తప్పదను నాశతో నతని సాహిత్యోద్యానమునఁ బ్రవేశించితిని. అప్పు డందొక పద్మాకరమున భ్రమరయువకుఁ డొక్కఁడు కమలమును జేరి మరందపాన మొనర్చుచుండ హిమానీవర్షము కురిసినది. అతఁడు మంచుదెబ్బ తగిలి పడిపోయినాడు. అంతకుమున్నే వారి పరిచయ మొనర్చుకొని ప్రక్క నిలచియున్న నాతో నా కవిచక్రవర్తి యా కరుణదృశ్యమును జూపి 'వామే విధౌనహి ఫలం త్యభివాంఛితాని' (దైవము ప్రతికూలముగా నుండఁగా గోర్కెలు ఫలింపవు కదా!) యనినారు.

పిమ్మటఁ గొంత కాలమునకు [78]బిల్హణభట్టు విక్రమాంక వనమునఁ బ్రవేశించితిని. అప్పు డట నొక పెనుగాలి పుష్పలోకప్రళయమై యొప్పినది. పుష్పధూళి చెలరేఁగి కన్నులఁ గప్పుటచే రెప్ప లల్లార్చుచు నాకాశపథమున కెగయుచున్న యళిసంతానములు బహుళ పౌరందరచాపవిభ్రాంతులఁ గల్పించి యనతికాలములోఁ గారుచీఁకట్ల గగనవీథిఁ గప్పినవి.

ఇఁక సంస్కృతసాహిత్యవనీవీథుల షట్పదాన్వేషణ మొనర్ప బుద్ధి వోకుండుటచే నాంధ్రసాహిత్య పుష్పకాననములఁ బ్రవేశించితిని. ఆదిలో నది 'సంహితాభ్యాసి' వనము. ఛందోముఖరితమై యొప్పు నిందుఁ గేవలము శుకానువాదములు తప్ప విన్పింపవేమో యను సందేహము కలిగినది. కాని యదృష్టవశమున నాదియందే నన్నయ 'కమ్మని లతాంతమ్ములకు మ్మొనయు మధుప సంతానముల' మధురఝంకరణములు విన్పించినవి.

తదుపరి నే ప్రవేశించినది తిక్కనార్యుని 'రామాయణ వనము'. తొలుదొల్తఁ బ్రభువగు శ్రీరామచంద్రమూర్తికి [79]'వనపాలిక మత్తమధుపములకుఁ దప్పి

మధుభరితంబై క్రొత్తావిఁ గ్రమ్ము నరవిరి గుత్తి నొకదానిని వినయ వికుంచిత తనువై యర్పించుచు నొప్పినది. అనతికాలమునకుఁ దీఁగెయుయ్యలల నెక్కి తూఁగియాడుచుఁ గూడిపాడెడి మత్తాళిబాలికలను గని యొండొరులకుఁ జూపించుచు నలరులఁ గోయుచోట మధుపాళి మ్రోఁతకు ముగ్ధ లులిక్కినం గలకల నవ్వుచున్న వారివిహార ప్రియుఁడగు రామచంద్రుఁడు' కన్పించెను. మఱియొక చోట

ఉ. [80]"తుమ్మెద పిండు మెండుకొని త్రొక్కిన రేకుల సందు సందులం
గ్రమ్మి చలత్తరంగ శిఖరంబులఁ దూలెడి తమ్మి పుప్పొడుల్
క్రొమ్ముడులూడఁ గ్రమ్ము పొది లోపల నొక్కొకచోటఁ గెంపుచం
దమ్మునఁ జెన్నుచేసె వనితల్ కమలాకర కేళి సల్పగన్."

ప్రబంధ పరమేశ్వరుని యారామవీథిఁ బ్రవేశించి చూడ నట [81]జైత్రారూఢిఁ జిగురుం గెంజెడ లొప్పఁ బుష్పరజముల్ సెల్వార నున్భూది పూఁతగ లేదేఁటుల చుట్టుకోలు జపసూత్రశ్రీలుగాఁ గోకిల ప్రగుణాత్తాధ్యయనంబుతో శాంభవంబగు దీక్షావిధి నొంది యొప్పుచున్నది. మఱియొక దిక్కున వాగర్థ ప్రణయమూర్తులైన యుమామహేశ్వరులు కేళీవిలాసములఁ దేలియాడుచున్నారు. పరమేశ్వరీ లీలారవిందము నందలి భ్రమరబాలుఁడు మన్మథమథనుని మానసవీథిని జిరనిద్ర నొందుచున్న చిత్తజాగ్నిని మేల్కొల్పుచున్నాఁడు. ఇది యనంగ విజయము అమ్మవారి కైంకర్యసమయ మని ముందున కేఁగ నిచ్చగింపక యందుండి యన్యవనములకుఁ బయనమైతిని.

'ఉల్లల దలకాజలకణ పల్లవిత కదంబముకుళ పరిమళ లహరీ హల్లోహల మదబంభర మల్లధ్వను లెసఁగ మరుదంకురములు' నన్నాహ్వానించుచున్నవి. 'ఆవాత పరంపరా పరిమళ వ్యాపార లీల నజ్ఞానాన్విత మిచ్చోటని చేరఁబోయి' యట నొక్కచో నిల్చి 'ఈ రమ్యవృక్షవాటిక లెవ్వరివి చెప్పుమా!' యని ప్రశ్నించుకొంటిని. 'నభో వాహినీలహరీ శీతలగంధవాహ పరిఖేలన్మంజరీ సౌరభగ్రహణేందిందిర తుందిలమ్ము లివి మత్కాం తార సంతానముల్' అనునొక కామినీకలస్వనము విన్పించినది. చకితుఁడ నగుచుండ మఱుక్షణమున నొక చంచల్లతావిగ్రహ, శతపత్త్రేక్షణ, చంచరీక చికుర, చంద్రాస్య, చక్రస్తని, నతనాభి, నవల నా యెదుట నిల్చినది. జ్ఞప్తి కెలయించుకొని 'ఓహో! నీవు మా యాంధ్ర కవితా పితామహుని యమృత దుహితవు నమరనర్తకివి, యా వరూథినివి కావా?' యని ప్రశ్నించి యేమో సంభాషింప నూహించు చున్నంతలోనే యటకుఁ 'జెప్పకు మిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపైఁ దేనియల్' అనుకొనుచుఁ బోవుచున్న తరుణాగ్నిహోత్రి ప్రవరుఁడు స్వాహావధూవల్లభుని యింటికిఁ జేర్పుమని

ప్రార్థించుట విన్పించినది. మున్ను వరూథిని ప్రవరునితో నన్న 'వనిత తనంతఁ దా వలచివచ్చినఁ జుల్కనగాదె యేరికిన్' అన్న సాకూతాభిభాషణము వినఁబడియెనేమో!

ఉ. [82]"తరుణి ననన్య కాంత నతి దారుణపుష్ప శిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవు బారికి నగ్గముసేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి తాల్చెఁ గషాయదీధితిన్."

కంపించి మఱల నే వరూథినికైనఁ గన్పింపక బయటఁ బడితిని.

అది 'గగనధునీ శీకరముల' చెమ్మ, నంది తిమ్మయ్య పారిజాతోద్యానము. ప్రవేశింపనొక షట్పదకుమారుఁ 'డే వియోగశాలినీ హృదయ రేఖగ' నో కన్పట్టుచు నా వలె నొక వెట్టియన్వేషణ మొనర్చుచుఁ గన్పించినాఁడు. అతని యవ్యక్త కంఠధ్వని యందామె సొగసు రేకుల విప్పి యమృత నటనఁ గానుపింపఁబోదు; [83]నా కుగాదులు లేవు నా కుషస్సులు లేవు' మొదలగు ననేక విరహవిధుర భావములు పొడకట్టుచున్నవి. 'పాపము! ఈ మధువ్రతుని బాధ యేమిటి? వాడిపోయిన సుమసౌరభమ్ము కొఱకుఁ గను మొఱంగిన ప్రతిహిమకణమ్ము కొఱకు బ్రతుకు బ్రతుకెల్ల నెదియొ యొక బాష్ప గీతిక వలె' నున్నదే!

ఈ రీతి భావించుచుండ నట నొక గిరిపొంతఁ జక్కగఁ దీర్చి దిద్దిన పూఁదేనియ యేటికాలువ దరిఁ జెంగల్వ పుప్పొళ్లు నించిన సాంద్రోపల వేదిపై నధివసించి యీషత్కషాయ సౌరభమై స్వర్గమునుండి తన సత్య కొనితెచ్చి యిచ్చిన పారిజాత కుసుమ సౌరభ మాఘ్రాణించుచు తిమ్మన్న మహాకవి యా సత్యాదేవికి నూతన ప్రహేళికల నేఱ్చుచున్నాఁడు. వినమ్రభావముతో వారి దరిఁ జేరిఁ మహానుభావా! ఈ బంభరకుమారుని బాధ యే?' మని మున్ను నేఁ జూచినవానిఁ జూపించుచుఁ బృచ్ఛ యొనర్చితిని.

మ. [84]"ఒక భృంగంబు పరాళినీమదనతంత్రోన్మాదిఁ బ్రాణేశ్వరిన్
మకరందాసవమత్త మజ్జగృహసీమం బెట్టి తాఁబోయి సం
జకడ న్వచ్చి తదానమన్ముకుళ మే జాడం జొరంరాక యా
మికుఁడో నాఁ దిరుగున్ – గొలంకు రమకు న్మేలెంత హీనంబొకో!"

యని తిమ్మనవారు సమాధానము చెప్పి తుదకర్థాంతరము నుంచినారు. భ్రమరకుల విచిత్ర చేష్టలను గూర్చి మఱి యొక విశేషాంశమును గూడ వినిపించినారు.

సత్యభామమ్మవారు పారిజాతాపహరణ సందర్భమున స్వర్గమునందలి మందాకిని యందు జలక్రీడ లొనరించుచుండ –

మ. [85]"ఎల దేఁటుల్ దమ వాలుఁ గన్గవలపై నిందీవరభ్రాంతిచే
మెలఁగన్ జేరలఁ గప్పుకో నలవిగామిం జీదరం జెంది యి
చ్చులఁ గాంక్షించిరి నిర్నిమేష జలజాస్యల్ మానుషత్వంబు న
య్యళిభీతి న్ముకుళీకృతాక్షి యగు సత్యాకాంత నీక్షించుచున్."

[86]'ప్రతివర్ష వసంతోదయ కుతుకాగత సుకవినికర గుంఫిత కావ్యస్మృతిరోమాంచ విశంకిత చతురాంతఃపుర వధూప్రసాధన రసికుఁ' డగు శ్రీరాయలవారు గావ్యోప వనవిహార మొనర్చుచు 'వాణీకుంభవక్షోజ నాట్యాయత్తంబగు భీమతంత్రిపయి బాహాటించు' నాముక్తమాల్యద వాసనలకుఁ దాని చొక్కుచుఁ నున్నవేళ 'నప్పాజీ' యనుమతితో వారినిఁ గలసికొంటిని.

అప్పుడు వారు విలిబుత్తూరు వీథులలో జరించుచు నొక నాఁడు గన్గొనిన విచిత్ర చిత్రమును గూర్చి తాము చెప్పికొనిన :

ఉ. [87]"వేవిన మేడపై వలభి వేణికఁ జంట వహించి విప్పగాఁ
బూవులు గోట మీటుతఱిఁ బోయెడు తేఁటుల మ్రోఁత కామి శం
కావహమౌ కృతాభ్యసన లౌటను దంతపు మెట్లవెంబడి
న్జేవడి వీణ మీటుటలు జిక్కెడలించుటలు న్సరింబడన్."

యను కావ్యమును సాభిలాషముగఁ జదివికొనుచు నానందించుచున్నారు. అప్పుడట కొక వేత్రపాణి వచ్చి చిన్నా దేవమ్మగారి రాక నెఱింగించినాఁడు. నేను వారి యుత్ప్రేక్షకు హృదయమొగ్గి యనుజ్ఞఁగైకొని ప్రాసాదమునుండి బయల్వెడలితిని.

భ్రమరాన్వేషణమును జీవితాదర్శములలో నొక్కటిగఁ బెట్టుకొనిన నేనొకనాఁటి బ్రాహ్మీముహూర్తమున నేకాంతముగ నొక రమణీయ మార్గమునఁ బయనించుచుండ నన్నిరువురు పాంథులు వచ్చి కలిసికొనిరి. వారి సంభాషణమున నిరువురును మహాకవు లైనట్లు నా కవగతమైనది.

'సఖ్యం సాప్తపదీన' మని పెద్ద లనినారు గదా! అనతికాలములో వారికిని నాకును గాఢమైత్రి యొదవినది. అందొకరు పింగళివారు; రెండవవ్యక్తి భట్టుమూర్తి. కుశలప్రశ్నాదికము ముగిసిన పిమ్మటఁ గైమోడ్చి కుతూహలముతో వారిని 'స్వామీ! తమ కావ్యవనవాటికల మా భ్రమరము లెట్లున్న' వని ప్రశ్నించితిని.

భట్టుమూర్తి కళాదుఁడు. పోగరపనితనము మెఱయు నేమేమో ప్రవచించి గిరికాదేవి యందచందముల వర్ణించి యపుడు :

శా. [88]"నానాసూన వితాన వాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్ల దటంచు గంధఫలి బల్కాకం దపంబంది యో
షానాసాకృతిఁ బూని సర్వసుమన స్సౌరభ్యసంవాసియై
పూనెం బ్రేక్షణమాలికామధుకరీ పుంజంబు నిర్వంకలన్."

అని చెప్పినాఁడు. వెంటనే పింగళివా రందుకొని "ఒహో! బాగున్నది. [89]శ్రీహర్షులవారి పద్మము తపస్సుచేసి దమయంతీ పాదరూప మైనదని మీ గంధ ఫలి గిరికానాసిక యైనట్లున్న' దని సాభిప్రాయముగఁ బలికినారు.

దృష్టి నాపై నిల్పి పింగళివారు మా కావ్యవనమున మఱియొక వైచిత్రి పొడకట్టినది. [90]'నిజాన్వయశత్రువుఁ జంపక ప్రసూనంబుఁ గరంబు గెల్చుట మనంబునఁ బెట్టి మా ప్రభావతీదేవి నాసికాపార్శ్వయుగ్మంబున నిత్యసేవకతఁ గ్రాలెడు నీక్షణతారకాఖ్య రోలంబకదంపతుల్ పెనువళావళి నెంతయు సంభ్రమంబునన్' అని సెలవిచ్చినారు.

భట్టుమూర్తి, పింగళివారి సెలవు గైకొని నాపై నొక మందస్మితమును బాఱవైచి ప్రక్కదారినఁ బయనించిరి. పిమ్మట సూరనార్యునితోఁ గలసి నే 'నపూర్వలక్షణలక్షితమైన' కళాపూర్ణోదయోద్యానమునకు వెడలితిని. అట మధురలాలసను నెచ్చెలి పిండుతో సరససల్లాపములఁ బ్రొద్దుపుచ్చు చుండఁ గని వారి చమత్కృతుల జిత్తమునకు బరిపుష్టిఁ జేకూర్చుకొంటిని. వారికి జలక్రీడకు సమయమైనది. సరసిలోఁ బ్రవేశించినారు. "తత్కారణవీచికాచలితకంజముల న్మధులోలభృంగముల్ వారక సారెకు న్నెగసి వ్రాలుచు నొప్పెఁ దదంబు దేవతల్ నేఱుపుతోడ నాఁడు హరినీలఁపు టచ్చునగండ్ల కైవడిన్." అంతటితో నే నట నుండుటకు వీలుగా లేదు.

అది యొక విచిత్రవనము. అట మన మల్లెలు మొల్లలు, కుందక కురవకములు, క్రముకపున్నాగములు కనుపింప లేదు. అతి వినూతనముగ నున్నది. 'నవ మిత్యవద్యమ్' ప్రవేశించి పర్యటన మారంభించితిని. మరందలుబ్ధ షట్పదపాళి సేకరించిన యొక మధుకోశముపై నా దృష్టిపడి యట్టె నిరవధికానందమున నిల్చిపోయినది. నన్నుఁ గని యట దూరముగ ధ్యానోపవిష్టుఁడై యున్న యొకజిజ్ఞాసువు[91] నిమీలిత నేత్రముగలఁ బొడకట్టితినేమో! 'ఎవరది స్వామీ! తదేకదృష్టితోఁ దా మా మధుకోశము నట్లు పరీక్షించుచున్నా' రని ప్రశ్నించినాఁడు.

"మహాత్మా! నాకు మధుకరము లన్న మహాభిమానము. మనసు గొని బహువనములఁ బర్యటించి వాని జీవిత విశేషముల సేకరించుకొనుచున్నాఁడ"నని వినయపూర్వకముగఁ బల్కితిని. అంత నా మహాత్ముఁడు 'నాయనా! రమ్ము. నేనును నీవలెనే బంభరాభిమానమును జేకొని పరమప్రీతితోఁ బుష్పవనములఁదిరిగి తిరిగి షట్పద జీవితచరిత్ర నాఁకళించుకొన యత్నించితి" నని యాదరాభిమానములతో నన్నాహ్వానించినాఁడు. భక్తి తాత్పర్యములతో నే నా యనుభవజ్ఞుని వేడుకొని నంత నతఁడు భ్రమరజీవితచరిత్ర నిట్లు సంగ్రహస్వరూపమున నిరూపించినాఁడు.

"ప్రతిమధుకోశము నొక భ్రమరమహాసామ్రాజ్యము, ఇవి మాతృస్వామిక రాజ్యములు. దీనిని బాలించునది మహారాజ్ఞి. అన్యభ్రమరము లామె కొల్వున్న వేళల 'జయ! మధు కోశోద్ధర్త్రీ! జయ! ఉన్మదమధుగణహంత్రీ!! జయ! అళిలోక సృష్టీ' యని నిత్యకైవారము లొనర్చుచుందురు. పురుషజాతి పుష్పంధయముల కీ రాజ్యమునఁ బ్రాభవము శూన్యము, నిత్యము నవి సుషుప్త్యవస్థ ననుభవించుచుండును. రాజ్ఞి, గర్భవతి యగుట తప్ప వానివలన భ్రమర రాజ్యమునకుఁ గలుగు ప్రయోజన మెద్దియును లేదు. మిగిలినవారందఱుఁ జక్రవర్తినీ పరివారము. వారు స్త్రీలు కారు, పురుషులును కారు...

"భ్రమర రాజ్యమును బాలించు రాజ్ఞి మరణింపఁ దక్షణమే మధుకోశము నుండి యువరాజ్ఞి యొకతె మంగళ మధురఝుంకారముతో బయల్వెడలును.

'అసూర్యం పశ్య' యు 'ననాఘ్రూత పుష్పము' నగు నా నూతన రాజ్ఞి యౌవన సౌందర్యములఁ గనినంతనే యింతకు మున్ను నిద్రాళువులై యున్న పోఁతుటీఁగల ముఖములం దపూర్వోజ్జ్వల వికాసవిలాసములు గోచరించును. రాజ్ఞి మేఘమండల యాత్ర నారంభింప నవియన్నియుఁ దమలోఁ దాము తుముల యుద్ధము లొనర్చుచు నామెను వెంబడించును. ఈ కలహము లందుఁ జిక్కు కొనుచున్న భ్రమరయువకుల బాహుపరిధిలోనికి వచ్చినట్లే వచ్చి రాజ్ఞి తప్పించుకొని పోవుచుండును. రాజ్ఞి యొనర్చుకొను నీ వరపరీక్షయందుఁ దుదకొక భ్రమర యువకుఁడే బ్రతికి బయటఁబడఁగలడు.

"అతఁడు రాజ్ఞితోఁ గొంతకాలము మేఘమండలమున విహరించిన పిమ్మట రాణి గర్భమును ధరించును. తుద కంబుద మండలమునుండి రాజ్ఞి పతి మృతశరీరముతోఁ దిరిగి వచ్చును. మఱల నామెఁ ప్రజల యందుబాటులోనికి వచ్చినపుడు వారును బరివారమును బొందు నానందమునకు మేర లేదు.

"మున్ముందామెకు ముకుపుటమ్ములఁ బుష్పాసవ మొంసగి సేదఁదీర్చెదరు. భర్త కళేబరమును శరీరము నుండి తొలగించి యామెచే మంగళస్నానముఁ జేయింతురు. అటు పిమ్మట రాజ్ఞి వారందఱతోఁ "బునఃసృష్టి నారంభించి మఱియొక మధుకోశ రాష్ట్రమును నేఁ బరిపాలింతు" నని ప్రకటించును. మఱుక్షణము నుండి పరివారము నిమేషమైనఁ గాలహరణ మొనర్పక వనములెల్లఁ దిరిగివచ్చి మధూచ్ఛిష్టముతో నొక కోశమును నిర్మింతురు. రాజ్ఞి యందుఁ దన కక్ష్యను జేరియండముల నిడుచుఁ జంచరీకసృష్టికిఁ బూనుకొని నాల్గుశరత్తులు జీవించి పాలించును."

భ్రమర జీవిత మీ రీతిగ నా జిజ్ఞాసువు విన్పింపఁ జెవియొగ్గి వింటిని. కాని నా బుద్ధి యీ కథనము నందలి సత్యాసత్యములఁ గూర్చి యోజింపలేదు. నా మానసమున ననంత భావబంభరములు తిరిగియాడ నారంభించినవి.

అవి : 'పూలకడుపునఁ దేనియఁబోసె నెవఁడొ దానిఁ దీయు నేర్పు తుమ్మెదలకు లభించె. ఇందుకుఁ గారణము పుష్ప కోమలులకు భ్రమర యువకులపైఁ గల ప్రణయమేనా? భ్రమర కులప్రణయము లోకమున 'షట్పదప్రణయ' మని పరిహాసపాత్ర మగుచున్నది. 'నెమ్మదికి రావె యీ తుమ్మెదకు నో పూవ! అమ్ముకోఁబోకె నీ నెమ్మనము నో పూవ!' యని వనపురంధ్రీమణు లెంతగఁ జెప్పినను బాటింపక :

చ. [92]"ఇది యొక కన్నెపూవు హృదయేశ! మధూదయవేళ నేరికి
న్మదము దలిర్పఁగా మనసు ముచ్చిల నీయఁగ లేదు మున్ను నీ
కొదమతనమ్ముపై ననుఁగు కూరిమిపై నభిమాన ముంచి కో
విదమధులిట్ప్రభూ! యనుభవింపుము దీని రసప్రలోభివై."

యని ప్రతికుసుమకన్యయును మందాక్రాంత మధురిమ లొలికింప పాప మా మధుకరకుమారు లే మొనర్పఁగలరు? వారికి దక్షిణ నాయకత్వమును తప్పదేమో యనిపించును. ఈ రహస్య మెఱుఁగని లోక మా దోషమును షట్పద కుమారులపై మోపినది.

భ్రమరయువకులు పరార్థతత్పరులు.

ఉ. [93]"హ్రస్వతరమ్ము జీవము రహస్తృష దీర్ఘతరమ్ము నైన యీ
నశ్వరమైన జీవితమునన్ క్షణమొక్క యుగమ్ము కాఁగ స
ప్తస్వర మాతృకాయిత భవన్మృదుగాన సుధాప్రవాహ స
ర్వస్వము నారగించు ప్రబలత్వర నుంటిని నీకునై ప్రియా!"

యని యాక్రోశించు ప్రసవములఁ గాదను టెట్లు పొసఁగును?

ఈ పరార్థత వలననే గదా భ్రమరయువకుఁడు కృష్ణభగవానుని దూతగ నేఁగి వల్లవీసంఫుల్లాబ్జనేత్రల వలన నపూర్వావమానము నొందినది! ఇందులకు సాక్షి మఱియొకరు మఱియొకరు కాదు మన మహాభక్తకవి పోతనామాత్యుఁడు!

మ. [94]"భ్రమరా దుర్జనమిత్ర! ముట్టకుము మా పాదాబ్జముల్ నాగర
ప్రమదాళీకుచకుంకుమాంకిత లసత్ర్పాణేశ దామప్రసూ
నమరందారుణితాననుండ వగుటన్ నాథుండు మన్నించుఁ గా
క మము న్నేపుచుఁ బౌరకాంతల శుభాగారంబున న్నిత్యమున్."

ఇవి కదా వారన్న మాటలు! పాదముల నంటి దౌత్యమును నెఱపిన నెఱజాణతనము స్నేహార్ద్రత భ్రమరుని కడఁగాక యే దూతయం దున్నవి?

నలుఁ డేమొనర్చినాడు? దమయంతికడకుఁద్రిదశేశుల దూతగ నేఁగి 'యెన్ని చెప్పిన నామె యన్నిఁటి కన్ని చెప్పి' కన్నీరు వెట్టునంతకు 'దివిజోపకారసంస్తంభితవిప్రలంబ వేదనాభరుండై' సంభాషించుట మెచ్చుకొనఁ దగినదే! కాని యా విదర్భ రాజపుత్రి 'యప్రతివిధానంబైన ప్రియావాప్తి విఘాతంబున... వేడియశ్రుల నిగుడంగ వెక్కి వెక్కి యేడ్వఁ (ధీరోదాత్తుఁడైన తాను) దన్నును, దన వచ్చిన కార్యంబును దన్నుఁ బుత్తెంచిన వేల్పులను మఱచి యవస్థావశంబున నుచితానుచిత వివేకంబులు దప్ప భావనానిరూఢంబులైన ప్రియావికల్పంబులు వికల్పించుచు :

కం. [95]'ఏమిటి కేడ్చెద వానన
తామరసం బెత్తి చూడు తరుణీ! నన్నున్
గోమలకటాక్షవీక్షా
దామకముల వీరసేనతనయుని నలునిన్.'

అని బయటఁబడిపోవచ్చునా? ఎంత విస్పష్టముగఁ బలికినాఁడు! మఱియొక నలుఁ డెవ్వరైన నుండవచ్చు నేమో! 'వీరసేన తనయుఁ' డఁట! కేవలము 'గోత్రస్ఖాలిత్యము'తో నూరకొనిన నదియుఁ గొంత మేలై యుండెడిది.

"కాంత యశ్రుబిందుచ్యుతి కైతవమునఁ
దివిరి బిందుచ్యుతక కేళిఁ దవిలె దీవు;
సారెసారెకు నాదు సంసారమును స
సారముగఁ జేయుచు మసారతారనయన!"

అని యతఁడు పల్కిన పల్కు నూహింప నెన్ని విశేషములు ద్యోతకము లగుచున్నవి! 'ఉన్మాదులు సంఘటింపగ సమర్థులె యెందును రాయబారముల్' అని తుద కతఁడెంత విలపించిన ప్రయోజన మేమున్నది?

దౌత్యమునకే కాదు, మైత్రికిని మధుకరకుమారునిది పెట్టిన పేరు. మిత్రులను దన పారిపార్శ్వకులలోఁ జేర్చుకొని తాను రిక్కల మధ్య వెలుఁగు రేవెలుఁగు వలె సంచరించుట యతని యభిమతము కాదు. అతని హితులు గ్రహములు గాని యుపగ్రహములు కారు. 'భయయోగమున నైనఁ' దనతో మైత్రియొనర్చు వారిఁ దనంత వారిఁ జేయుట యతనికిఁ బరిపాటి. దీనిఁగమనించియే కదా విజ్ఞులు 'భ్రమరకీటన్యాయ' మును లోక విఖ్యాత మొనర్చినది!.

భ్రమర ముదాత్తప్రకృతి; ఉన్నతసృష్టి. కాకున్న శంకరపూజ్యపాదులు [96]'కవుల సందర్భ స్తబక మకరందైక రసిక కర్ణయుగళమును విడువక నవరసాస్వాద తరళ కటాక్ష వ్యాక్షేప భ్రమరకలభములఁ జూచి భవదళికనయన మసూయాసంసర్గముచే నించుక యెఱ్ఱవారిన' దని యా సౌందర్యలహరిని వర్ణించునా! "ఓ భగవతీ! దీనుల కనిశ మాశానుసదృశశ్రీదాత్రియును, నమందవికిరన్మందార స్తబకసుభగమును నగు నీ చరణమందుఁ గరచరణములచే నేను షట్పదము నగుదును గాక!!' యని తానంబికాపాద మకరందలోలుప భ్రమరము గానాకాంక్షించునా!

మేఘమండలమున యాన మొనర్చు 'భ్రమరకుల రాజ్ఞి'ని గనినవేళ నెన్నెన్ని మనోజ్ఞ భావము లుత్పన్నము లగుచున్నవి? [97]'శాంకరీ! పల్కు మీ ఝుంకార మేమిటో, మంత్రమా? గీతమా? మఱి మాయయా? లీలయో, నాట్యమో లేక భ్రామరీ తెల్పు మీ భ్రమర విభ్రమ మేమొ! సాధకుని యాత్మలో జ్ఞానదీపము వోలెఁ గనుపించి మాయమై కనుపింతువే! తెలియలేమే మేము! ప్రణయమో, ప్రభవమో, లాస్యమో, తాండవమొ మముఁ దేల్చవే తల్లి!" ... ఈ రీతిఁ బొడము నూహ లనంతములు కదా!

సృష్టిస్వరూపుఁ డైన పరమాత్మ పరముగఁ 'ప్రళయావసానమునఁ బ్రహ్మాండ మవియఁగాఁ బ్రభవించు నాత్మభవుఁ డీ రీతిన్. చీఁకటుల సృష్టించి లోకముల శ్రీమించు నాత్మభవుఁ డీరీతిన్' మొదలైన యూహ లెన్నెన్నియో సాధకునకుఁ దోఁచును. భ్రమరశిల్పమున జగత్స్రష్ట యింతటి భావగోపన మెందుల కొనర్చినాఁ డను ప్రశ్న యుదయింప నించుక తర్కింప సమస్త సృష్టియు నరసికుల కైనది కాదని యభివ్యక్త మగును. 'రసోవై సః', 'నేహ నానాస్తి కించన్'.

# నిద్రావైచిత్రి

అది యాముక్తమాల్యద పాఠము. నాకు వెఱ్ఱి నిదుర వచ్చుచున్నది. సర్వావయవము లనెడి సంకెలలనుండి జారుచు నే నెటకుఁ బోవుచున్నాఁడనో నాకె యెఱుక లేకుండెను. [98]శ్రీకుప్పయాచార్యులవారు పాఠమునాపి కుదురైన గొంతుకతో 'నిద్రాదేవత నిన్నుఁ బూనెఁ గదరా నిర్భాగ్యదామోదరా!' అను పద్యపాదమును ఘనజటవైచి చదువుచుండ మిత్రుడు నన్నుఁ దట్టి మేల్కొల్పినాఁడు. మఱియొక సహాధ్యాయి నేఁ దెప్పరిలి స్వస్థితికి వచ్చునంతలో నాచార్యులవారిని "ఆర్యా! నిద్రకును నొక దేవత యున్నదా?" యని వినయముతోఁ బ్రశ్నించినాఁడు. ఆ దొడ్డపండితుఁడు "ఔను. జ్యేష్ఠాదేవి అలక్ష్మి... జగదేక మాతకు జ్యేష్ఠభగిని" యని సమాధానము చెప్పినారు. నిదుర మబ్బులు నన్నుఁ బూర్తిగ విడిపోయినవి.

సహపాఠి మఱల నాచార్యులవారిని జ్యేష్ఠాదేవి రూపాదికమును గూర్చి ప్రశ్నింప వారు 'అలక్ష్మీం త్వం కురూపాసి కుత్సిత స్థానవాసినీ... అలక్ష్మీం కృష్ణవర్ణాం, ద్విభుజాం కృష్ణ వస్త్రపరిధానాం లౌహాభరణ భూషితాం శర్కరా చందన చర్చితాం గృహసమ్మార్జనీహస్తాం, గర్దభారూఢాం, కలహ ప్రియాం' అని యేమేమో పఠించుచు నాపై దృష్టి నిల్పుచు మందస్మిత మొనర్చినారు.

"ఏమీ దామోదరా! తామీలోకమునకుఁ దిరిగి వచ్చినట్లేనా?" అను వారి ప్రశ్న కవనత శిరస్కుఁడనుగాక ప్రౌఢముగ బ్రతిస్మిత మొనర్చి 'ఇట దామోదర శబ్దౌచిత్య మేమియో సెలవిం' దని వారిని వేడుకొంటిని. వారొక చిరునవ్వుతో నా చిలిపితనమును గమనించి 'ఉదరే దామ యస్యేతి దామోదరః' యశోద మృద్భక్షణ మొనర్చిన బాలకృష్ణుని నడుమున బలుపుతోఁ గట్టినది కనుక దామోదరుఁడైనాఁడు. మన్నుఁ దినినట్లు నిద్రవోవు మిమ్ము నిద్రాదేవత పాశబద్ధులఁ గావించుటచే మీరును దామోదరులే!" అని సెలవిచ్చినారు. ఆ నాఁడు భారతీయులు నిద్రకు నొక దేవతను సృష్టించుకొని నారని నాకుఁ దెలిసినది.

ప్రాచీన కాలమున బాబిలోనియను జాతివారు నిద్రపట్టకున్న 'లోహర్' అను నిద్రాదేవతను బూజింతు రనియు, నేఁటి [99]'ఫిన్నిష్' జాతివారికి 'ఉని' యను నిద్రా

దేవత 'ఉంటామో' యను స్వప్నదేవతలుండియున్నారని మఱికొంత కాలమునకుఁ జదివి నేర్చుకొంటిని. నిజము! సమస్తశక్తులును దేవతలు కదా! నిద్ర యొక శక్తి! ఒక దేవత!!

నిద్ర సృష్టియందొక విచిత్రమైన సృష్టి. 'అది దుప్పటి వంటిది. దానిఁగప్పుకొన నవసరము లేని వ్యక్తి యెవఁడు? నిద్రయన్నాతురున కాహారము, తృష్ణాతురునకు దాహము, శీతోష్ణబాధితుల కది యుష్ణము, శీతము; మిత్రరహితులకు మిత్రము, నిలయవిహీనులకు నీడము, మనోబాధితులకు మహనీయాంజనము. ఇన్ని సుగుణములు గల్గియు నిది మృత్యువును బోలి యుండుట యొక్కటియే యిందలి దోష' మని యొక జిజ్ఞాసు వభిప్రాయ మిచ్చినాఁడు.

చంపుట తప్ప మృత్యువొనర్చు సర్వకృత్యములఁ గావించుటకు నిద్ర సమర్థమైనది. మృత్యువుతో నిద్ర కున్న సహజ బాంధవ్యమును గుర్తించిన యొక భావుకుఁడు 'నిద్ర యొక జాతి మృత్యువు; నిరయము దాని జన్మభూమి; అయ్యు నరకము దీనిని దఱిమి వేసినది స్వర్గము చేరనీయలేదు' అని పలికినాఁడు. దీనిని బట్టి నిద్రకు నివాసభూమి 'త్రిశంకు స్వర్గ' మన్నమాట!

నిద్రామృత్యువుల కొక ధర్మసామ్యమున్నది. ఇవి రెండు నావహించి నపు డాత్మకు స్వాతంత్ర్యము లభించును. రెంటియందును శరీరి విముక్తుఁడగును. ఈ కారణముననే పెద్దలు నిద్రామృత్యువులఁ గూర్చిన నిండు విజ్ఞానము కలవాఁడు పరమ వివేకియని పలికినారు.

'మన జన్మమే యొక నిద్ర; ఒక విస్మృతి' జన్మయను నిద్రలో నాత్మ నిజదేశమును వదలి సుదూరము వచ్చుచున్నాఁ'డని యాంగ్ల తాత్త్విక మహాకవి వర్డ్సు వర్తు ప్రవచించినాఁడు. ఇట్లు వచ్చిన ప్రాణి విజ్ఞానియును గాఁడు; అజ్ఞానియును గాఁడు. సర్వకాలములందతనికిఁ తన నిజస్వరూపమును గుర్తించుటకుఁ దగు నవకాశము లున్నవి. అన నతనికిఁ బ్రత్యభిజ్ఞావకాశమున్న దన్నమాట!

'నిద్ర తంద్ర భయము క్రోధ మాలస్యము దీర్ఘసూత్రతల వలన లక్ష్మి సంప్రాప్తింప' దని యార్యోక్తి. దీనినిబట్టి దురదృష్ట హేతువులలో నిద్ర యొకటగు చున్నది. అంత మాత్రమున నిద్ర దరిద్ర హేతువని నిర్ణయింప వీలుకాదు; పనికిరాదని పరిహరింపఁ బొసఁగదు. నిద్ర ప్రాణాధారమనియు నది లేకున్న నారోగ్య వినాశన మగుననియు[100] నార్యక్షేమేశ్వరుని యభిప్రాయము. "నిద్ర మనోమాలిన్యమును క్షాళన

మొనర్చును; అవయవముల కౌజ్జ్వల్యము సేకూర్చును, శరీర దోషములను రూపుమాపును. ధాతువులను సుస్థితిలో నిల్పును. యోగ గమ్యమైన యానందమును బ్రసాదించును" అని యీ విద్వద్వరేణ్యుని సూక్తి.

నిద్రాశబ్దార్థమే యీ యర్థమును నిరూపించుచున్నది. 'నియతం ద్రాన్తి ఇంద్రియా ణ్యత్రేతినిద్రా' ఇంద్రియములు నియతముగ దీనియం దంతరితములై యుండుటచే నిద్ర నిద్రయైనది. దీని కొక రీతిగఁ బర్యాయపదము లైన స్వప్న సంవేశనములకును నర్థమిదియే.

శ్రీనాథ మహాకవి - [101]'కంటికి నిద్ర వచ్చునె.... జిహ్వకు న్వంటక మిచ్చగించునే... శాత్రవుఁడొకఁడు తనంతటి వాఁడు కల్గినన్'' అని స్వర్ణ నగౌద్ధత్యమును సహింపఁజాలని వింధ్య పర్వతముచేఁ బలికించినాఁడు. ఈర్ష్య నిద్రాభంగకారణము. అంతియు కాదు. 101బి 'అలుక యెత్తిన వానికి, నర్థచింతకునకు, నాతురునకుఁ గామ గోచరాత్మకునకును వచ్చునే? ఎన్నఁబడి జనులెఱింగిన యిన్నాలుఁగు తెఱఁగులందు నెయ్యది. యైన నన్ను మొగుడ నీదటె నా కిన్నియుఁ గలుగంగ నిద్ర యేటికి వచ్చున్' అని కవిబ్రహ్మ తిక్కన సోమయాజి సౌప్తికవధోద్యోగ పూర్వరంగమున వికలమానసుఁడైయున్న యశ్వత్థామచేఁ బలికించినాఁడు.

నిద్రాభావమున కివి కొన్ని కారణములు. కోపి పగ సాధించుకోర్కెతో నిద్రఁ జెందఁడు. శత్రు నిరాసక్రియా మార్గాన్వేషణమున మనసు లగ్నమై యుండుట వలనను నిద్ర కలుగక పోవచ్చును. అర్థచింతకుని యాలోచనాతత్పరత నిద్రాశూన్యునిఁ గావించుచున్నది. ఆతురునకుఁ గామగోచరునకు శరీర స్వాస్థ్యావస్థా భేదాదులవలన నిద్రరాదు.

నిద్ర కలుగక పోవుటకుఁగల కారణములు స్వాస్థ్య, శారీరక, మానసికము లని త్రివిధములుగ వైద్యశాస్త్రజ్ఞులు నిర్ణయించినారు. శరీరమునందు 'బ్రొమైన్' అను పదార్థము తక్కువగుటవలన నిద్రకు భంగము కలుగుననియు నది ప్రత్యేకముగ నొక వ్యాధి కాదనియు, నొక వ్యాధికి బాహ్యచిహ్నమనియు జోన్‌డక్ వంటి విజ్ఞుల యభిప్రాయము. 'నిద్ర మన కెందులకుఁ గల్గుట లేదను నాలోచనతో నిద్రాసమయమును బోఁగొట్టుకొని పిమ్మట రేయెల్లయు జాగరణ మొనర్చువారు నేఁటి ప్రపంచమునఁ బెక్కు రున్నా' రని యిటీవల నొక శాస్త్రజ్ఞుఁడు పత్రికాముఖమునఁ బ్రకటించినాఁడు.

దీర్ఘ నిద్రఁగలవానిఁ జూచి కుంభకర్ణుఁ డను బిరుదమును బ్రసాదించుట పరిపాటి. కుంభకర్ణుఁడు లంక కంపించు నంతటి కోలాహల మొనర్చినఁ గాని మేల్కొనెడివాఁడు కాఁడఁట! పురాణ స్త్రీ లోకమున నూర్మిళాదేవి నిద్రలో నుత్తమశ్రేణి గడించుకొనినది. పౌరాణిక వ్యక్తుల మాట దూరముగ నుంచి చారిత్రక కాలమునకు వత్తము. సుప్రసిద్ధుఁడగు గ్రీకు చరిత్రకారుఁడు [102]హెరడోటస్ తా నారుమాసములు నిద్ర మేల్కొని యారుమాసములు నిదురించు జాతులఁ జూచినట్లు రచనలలోఁ బేర్కొనినాఁడు. ఇది సత్యమో! మఱి యసత్యమో!!

కొలఁది కాలము క్రిందట 'అన్నా స్వాన్ పోవెల్' అను అమెరికా దేశస్థురాలు భర్త మరణవార్త వినిన వెను వెంటనే నిద్రావస్థ నొంది, ముప్పది యొక్క సంవత్సరములు గడచిన తఱువాత మేల్కొనినట్లు వార్తాపత్రికలఁ బ్రకటితమైనది. ఇది యభూతకల్పన మనుటకు వీలులేదు. ఇట్టి విచిత్రములు సకృత్తుగనైనఁ గొన్ని బ్రపంచమున జరుగుచునేయున్నవి.

జంతుకోటికి దీర్ఘనిద్ర యొక విశేషగుణము. వానికది సహజావబోధము. 'ఆకులపాటు' ప్రారంభము కాఁగా నాస్ట్రేలియాలోని ఒపోస్సుం, డింగో, యాంటీటరు వంటి జంతువులు, కొన్ని సర్పజాతులు, క్రిమికీటకములు దీర్ఘనిద్రకు సిద్ధపడుచుండును. ప్రతి సంవత్సరము నిది తప్పదు. ఎవరో ప్రబోధించి నట్లాపని కాయా ప్రాణికోటులు పూనుకొనును. ఈ దీర్ఘనిద్ర యందొక వైచిత్రి యున్నది. ప్రాణుల యవయవములన్నియు నొకమారుగ నిద్రావస్థ నొందవు. ఒక క్రమము ననుసరించి యొక్కొక్క యవయవమే నిద్ర నొందును. కొన్ని యవయవములు నిద్రించుచున్నప్పుడు మేల్కొనిన నన్యావయవములు మత్తుపదార్థమును జేకూర్చుకొనుచుఁ గొంతకాలము బహుభారముతో జీవయాత్ర సాగించుచుఁ గన్పించును. ఈ స్థితిలో వాని శరీరోష్ణత యర్థమగును.

దీర్ఘ నిద్ర నొందుచున్న దివాంధమును నీట ముంచినను, జుంచును జావ మోదినను మేల్కొనవఁట! 'మొంబా' జాతి సర్పము జాగ్రదవస్థలో నతి భయంకరమైనది. 'లాన్సుకోలమ్' అను శాస్త్రజ్ఞుఁ డది దీర్ఘనిద్రయం దున్నప్పుడు మేల్కొల్ప "నన్ను నిద్రింప" నిమ్మని బతిమాలుకొనినట్లుగఁ బ్రవర్తించినదఁట! ఎలుఁగుబంట్లు కొన్ని ప్రదేశములం దిట్టి దీర్ఘనిద్రావస్థలోనే ప్రసవించి మేల్కొనిన పిమ్మట రెండు మూఁడు నెలల వయస్సుగల బిడ్డలతో నాడుకొనును. ఈజిప్టుదేశమునందలి నత్త లైదారేండ్లు నిదురించు చుండునఁట! అందముగనున్న యొక నత్తగుల్లను దెచ్చి బ్రిటిష్ వస్తు

ప్రదర్శనాలయమునఁ బ్రదర్శింప నయిదు సంవత్సరములు గడచిన పిమ్మట నందలి నత్త మేల్కొని నడువసాగి యధికారుల నాశ్చర్యచకితుల నొనర్చిన ట్లా మ్యూజియము చరిత్ర వలనఁ దెలియుచున్నది.

ఈ రీతిగఁ గ్రిమికీటకములు జంతువులు నిద్రవోవుటకుఁ గారణ మాయా కాలముల వాని కాహారములైయుండు క్రిమికీటకములు నిద్రించుటయే. శీతకాలపు బాధను దొలగించుకొనుటకుఁ దనసంతానమగు వీనికిఁ దల్లియగు ప్రకృతి దీర్ఘనిద్రను బ్రసాదించినది. ఆకాశ వీథుల నెగసి యుష్ణమును బడయఁగల పక్షులు, తేనియను సేకరించుకొని రెక్కలాడించుచుఁ బట్టునకు 'వెట్టతనము గల్పింపఁగల తేనెటీఁగలు నిట్టి దీర్ఘనిద్ర నొందవు.

మానవ జీవితచరిత్రయందు నిద్రకు సంబంధించిన విచిత్రాంశములు కొన్ని కన్పించుచున్నవి. జగజ్జేత అలెగ్జాండరు పర్షియా చక్రవర్తి డెరయస్ మీఁదఁ బ్రచండయుద్ధమును బ్రకటించునాఁడు సుదీర్ఘమగు నిద్ర నొందినాఁడఁట! ఒకానొక యత్యవసరమైన రాచకార్యమునకై యతనిని మేల్కొల్ప సేనా నాయకుఁడగు 'పర్మీనియస్' ఎంతయో యత్నించి విఫలమైనట్లు గ్రీసు దేశచరిత్రల వలన వ్యక్తమగుచున్నది.

ఆత్మహత్యఁ జేసికొన నిశ్చయించుకొనిననాఁడు [103]కేటో చక్రవర్తికి దీర్ఘనిద్ర పట్టినదఁట!

సెక్టస్ పాపేను జయింప వలసిన సమయము. సముద్ర యుద్ధ మతి తీవ్రతరముగ సాగుచున్నది. తాను నాయకత్వము వహింపవలయును. లేకున్న సమస్తమును దారుమారై తీవ్రతమ ప్రమాదము సంభవించును. అట్టిస్థితిలో [104]'అగస్టస్ సీజరు' మృత్యువుతోఁ దుల్యమైన నిద్ర నొందినాఁడు. ధైర్యమొనర్చి తానే సర్వసేనాధిపత్యమును స్వీకరించి, శత్రువుల హతమార్చి విజయముతోఁ దిరిగి వచ్చిన మహాసేనాని 'ఎగ్రిపా', బహుకాలము విజయవార్తను దెల్పుటకై యీ సీజరు మేల్కొను నంతవఱకు వేఁచియుండవలసి వచ్చినది.

దీర్ఘ నిద్రయం దుండియే కొందఱితరులు జాగ్రదవస్థలోఁ జేయఁగల కార్యకలాపములను నిర్వర్తింపఁ గలరు. జేన్ రైడర్ – అను పదునైదేండ్ల కన్యక నిద్రావస్థలో నెన్నియో గ్రంథములఁ జదివినది. ఆమెకు జాగ్రదవస్థయందును నందలి విశేషము లన్నియు జ్ఞప్తియుండుట విశేషము. ఆమె నిదురింప నారంభింప నదే

పనిగ నిద్రించునంట! ఆమెను బరిశీలింప బంధువులు మసాచ్యు సెట్సులోని ఓల్డెన్ వైద్య శాస్త్రజ్ఞున కొప్పజెప్పిరి. అతఁడు బహువిధ పరిశోధనలు జరిపి 'యిదమిత్థ మని నిర్ణయింప లేకున్నాను. నా మతి చెడుచున్న' దని నివేదించినాఁడు. అమెరికా దేశమునందలి యొక సుప్రసిద్ధ రచయిత నిద్రాసమయముననే నిజరచనల 'టైపు' జేసెడివాఁడు. జాగ్రదవస్థ నొందిన పిమ్మట నవి తన రచనలేనా యను ననుమానమతనికిఁ గలుగుచుండెడి దఁట! 'ఇట్టి దీర్ఘ నిద్రావస్థలందుఁ దాను బూర్వము భావించిన రూపకము లందలి పాత్రలు కన్పించి సంభాషణమును సాగింపఁ దన రచనలు సాగుచున్నవని చెప్పు కవి యున్నాఁడని' స్వాన్సు విశ్వవిద్యాలయ తత్త్వశాస్త్రో పాధ్యాయుఁడు 'హీత్' ఒక విశిష్టోపన్యాసమునఁ బేర్కొనినాఁడు. నిదురించుచుఁ గొన్ని గృహకృత్యములొనర్చుట ప్రపంచమునందన్ని దేశములందును సర్వసామాన్యమైన నిద్రావైచిత్ర్యము!

నిద్రాసమయ పరిమితిని గూర్చి లోకమున భిన్నాభిప్రాయములున్నవి. నెపోలియను చక్రవర్తి 'పురుషుల కారు గంటలు, స్త్రీల కేడుగంటలు, బుద్ధిహీనుల కెనిమిదిగంటలు నిద్ర చాలు' నని పల్కినటులఁ దెలియుచున్నది. కాని యా చక్రవర్తి [105]వాటర్లూ యుద్ధానంతరము హెలీనాద్వీపమున దినమునకుఁ దొమ్మిది గంటలు దీర్ఘనిద్ర ననుభవించినట్లు జీవిత చరిత్ర చెప్పుచున్నది. [106]బిస్మార్కు, హంబోల్టు, చర్చిలు వంటి ప్రసిద్ధ రాజకీయ వేత్తలు నాల్గుగంటల కంటె నిద్రవోనివారు కన్పించుచున్నారు. 'నలుబది యెనిమిది గంటలు తీక్ష్ణమైన కృషి యొనర్చిన పిమ్మట నెనిమిది గంటల నిద్ర చాలు' నని శాస్త్రజ్ఞుఁడు ఎడిసన్ మహాశయుఁ డభిప్రాయపడినాఁడు.

'ప్రాణికోటికి నిద్ర యత్యవసరము కా' దని నిరూపింపఁగల ననెడు స్థిరనిశ్చయముతో హార్వర్డు పరిశోధనాలయమునఁ బ్రవేశించిన యొక యువకుఁడు రెండు వందల ముప్పది యొక్క గంటలు మేల్కొనిన తరువాత నిఁక దానిని గొనసాగింప లేక బాధపడి యట్టె విరమించినాడు. మిగిలిన జీవితమున నతఁ డున్మత్తుఁడైనాఁడు.

నిద్రాకాలనిర్ణయము దేశకాలవయోనుకూలము లని నిశ్చయింప వచ్చును. పసిపిల్లలకుఁ బదియు నారు గంటలు నిద్ర యత్యవసరము. మహాకవి కాళిదాసు 'పద్మినీజాతి స్త్రీ జాము కాలము కంటె మించి నిద్రింప' దని పలికియున్నాఁడు. అల్పకాలనిద్ర నారోగ్య శాస్త్రవేత్త లంగీకరింపరు. నిద్రాసమయము నెనిమిది గంటలనుండి యారుగంటలకుఁ దగ్గించుకొనుటచే 'కలొరిక్' శక్తిని బాతికపాళ్ళు విస్తారముగ నుపయోగింపవలసి యుండునని వారి నిర్ణయము. నిద్ర నీ రీతిఁ

దగ్గించుకొనుట వలనఁ జర్మవ్యాధులు, శరీర దౌర్బల్యము, మనోమాంద్యము కలుగునని వారందురు.

పరిశోధింపఁ దగిన యంశములలో నిద్ర నతి ప్రముఖమైన దానినిగ శాస్త్రజ్ఞులు పరిగణించినారు. వారు కడుశ్రద్ధతోఁ బరిశోధనలు సాగించుచున్నారు. నిద్రను గూర్చిన యే యొక యంశమునైన 'నిది నిర్ణయ' మని చెప్ప వీలుకల్గక పోవుటచేఁ జమత్కారగర్భితముగ నొక శాస్త్రజ్ఞుఁడు "నిద్రనుగూర్చిన మా పరిశోధనల సారాంశము రాత్రి శయనించుట, యుదయము మేల్కొనుట" యని యభిప్రాయ మిచ్చినాఁడు.

[107]నెబ్రాస్కా విశ్వవిద్యాలయమునందలి వైద్యకళాశాలలో, జహార్ అను నాచార్యుఁడు నిద్రను గూర్చి దీర్ఘ పరిశోధన లొనర్చి కొన్ని విశేషాంశములఁ బ్రకటించి యున్నాఁడు. ఆధునిక ప్రపంచమున నిద్ర పట్టనివారు విశేషముగ నున్నారు. వారు రెండు తెగలవారు. శాంతియుతమైన నిద్ర కావలయునని కోరుకొనుచు నిద్రాసమయమును దప్పించుకొని పిమ్మట బాధపడువారు మొదటి తెగవారు. వ్యాధిగ్రస్తులు రెండవ తెగవారు. వయసు మరలినవారికి నిద్రపట్టక పోవుటకుఁ గారణము చిన్నతనమున వారిని దల్లిదండ్రులు బలవంతముగ నిద్రపుచ్చుటయే యని యొక యభిప్రాయము. నిద్ర కొఱకను నుద్దేశముతో మనస్సును గాని, శరీరమును గాని శిక్షింపయత్నించుట మంచిది కాదు.

"జంతువులు త్వరితముగ మృతినొందుటకుఁ గ్రమమైన నిద్ర లేకుండుటయే గారణము. కళాశాల విద్యార్థులు ముప్పది యెనిమిది మారులు, మధ్యమ వయస్సు గలవా రేబది మూఁడు మాఱులు నిద్రలోఁ గదిలెదరు" – ఇవి జహార్ అను శాస్త్రజ్ఞుని పరిశోధనమువలనఁ దేలిన కొన్ని యంశములు.

"శయ్యమీఁదఁ జేరి సున్నితముగ సుఖనిద్ర నొందుటకంటె నదృష్టవంతులకు వేఱొక శుభలక్షణము లే' దని యొక తాత్త్వికుఁడనినాఁడు. అలసిపోయిన యవయవములు కష్టపడుట కిచ్చగింప నపుడు క్రమముగా విశ్రాంతినొందు యత్న మారంభించును. తొలుదొల్త ఘ్రాణశక్తి, తరువాత రసన, పిమ్మట క్రమముగ స్పర్శజ్ఞానము, శబ్దగ్రహణశక్తి తప్పిన పిమ్మట మనస్సు వ్యవహరించుట మానివైచును. జోషువా రోసెట్ అను విజ్ఞాని "నిద్రారంభదశలో నిత్య జీవితము నందలి కొన్ని విశేషాంశములు జ్ఞప్తికి వచ్చుట, పిమ్మటఁ గొన్ని మధురములైన కోర్కెలు జన్మించుట, యటుతరువాత సుఖాభిలాషలు కలుగుట, భ్రమలు కొన్ని పుట్టి తదుపరి నిదురమంపు, స్వప్నావస్థ యేర్పడు' నని నిరూపించినాఁడు.

అందఱకును నిద్ర కలుగు కాలము సమము కాదఁట! కళాశాల విద్యార్థులకిరువది యెనిమిది నిమిషములు, నడివయసున నున్నవారి కిరువదియైదు నిమిషములు కాలము కావలయు నఁట! స్త్రీలకుఁ బదునైదు నిమిషముల కాలము చాలునఁట!

నిద్రలోఁ గదలి నంత మాత్రమునఁ గలఁత నిదుర కాఁజాలదు. పసిబిడ్డ వలె నిద్ర వోవుట పరమప్రయోజనకారి. 'మొద్దువలె నిద్రించినవాఁ డెద్దు వలెఁ బనియొనర్చు' నను సామెత యున్నది.

ఏకాదశినాఁడు సంపూర్ణ జాగరము వ్రతవిధానములందును శాసింపఁ బడినది. దశమి యేకభుక్తము; ద్వాదశి పూర్ణ భోజనము. 'దివానిద్ర యోగభంజక' మని [108]యోగకుండ ల్యుపనిషత్తు పలుకుచున్నది. పూర్వరాత్రి నిద్ర సౌందర్యసంవర్ధక మని పాశ్చాత్యులలో నొక ప్రథ యున్నది.

పూర్వము టర్కీ దేశములలోని అంకారా విశ్వవిద్యాలయ విద్యార్థిలోకము పగటి నిద్దురను గూర్చి కొన్ని పరిశోధనలు సాగించినది. వారి పరిశోధనల ఫలితాంశములు రాత్రి నిద్ర మానవునకుఁ బనికిరాదనియు, దీర్ఘ నిద్ర నిష్ప్రయోజనకరమైనదనియును, ప్రతి వ్యక్తియును బగ లొకమాఱు మూఁడు గంటలు మఱల నొకమాఱు రెండుగంటలు నిద్రించుట కలవాటు పడిన, మిగిలిన కాలమంతయు శ్రమ యనుకొనకుండఁ బనిఁ జేయవచ్చునని సిద్ధాంతీకరించినారు. వారి పరిశోధనలవలన రాత్రి పదియును రెండు గంటలు నిదురించు వారి మించి పైరీతిగ నిదురింప నలవాటు పడినవారు పని చేయవచ్చుననియు, వారలకే విశేష విశ్రాంతి చేకూరునట్లును వెల్లడియైనది. పరీక్షాఫలితములందును పగటి నిద్ర నొందువారే ప్రథమగణ్యు లైనారట. వీరి పరిశోధనలయందలి సత్యాసత్యము లెట్లున్నను వీరి మార్గము వైద్యశాస్త్రమునకు, సామాన్య ప్రకృతికి విరుద్ధమగుటచే నీ విద్యార్థులకు 'ఉలూక' ములను నామము కొంతకాలము ప్రపంచమున విశేషప్రాచుర్యము వహించినది.

"నిద్ర సుఖ మెఱుఁగదు, ఆఁకలి రుచి నెఱుఁగదు" ఈ సామెత యాంధ్రభూమి నతి ప్రసిద్ధ మైనది. అయినను సుఖనిద్రకును సుందరమగు శయ్యకును సన్నిహితమగు సంబంధమున్నది. శయ్యాప్రాముఖ్యమును గుర్తించిన నెపోలియను చక్రవర్తి 'జగత్తు నందలి సమస్త సింహాసనము లిచ్చినఁ బ్రతిగ నా శయ్యను విడువలే' నని పలికినాఁడు. మానవుఁడు శయ్యయందు బెరుగుచున్నాఁడు శయ్యయందు మరణించు చున్నాఁడు. దేశకాల పాత్రముల ననుసరించి శయ్యావిభేదము లెట్లు మార్పునొందినను శయ్య తప్పదు. అర్జునుని గౌరవానురాగములఁ జూఱఁగొనిన భీష్ములవారి కుత్క్రాంతి వేళ

నుజ్జ్వలమగు నంపశయ్య పర్యంకమైనది. మఱియొక మహారాజునకుఁ బట్టజశయ్య శయనీయమై యెప్పియుండును. జగత్కారణుఁడు వటపత్రశాయి శేష తల్పశాయి. ప్రాచీన భారతీయ చక్రవర్తులలో సౌవర్ణ పట్టజ కీటజాండజశయ్యల నిర్మించుకొని యనుభవించినటులఁ దెలియుచున్నది. శయనసంవేశనము ప్రాచీన శృంగార చతుష్షష్టిలో నొకటైనను 'నాగరకవృత్తము' వలన నభివ్యక్త మగుచున్నది. మాగధ, వైతాళిక, సౌఖశాయనికాది భృత్యుల వనలఁ గల పరమ ప్రయోజనము నర్థ శాస్త్రాభిజ్ఞు లెఱిఁగి యుండుటచే, రాజ ప్రాసాదములందు వారి యావశ్యకతను నిరూపించి యున్నారు.

నిద్రకును గొన్నినియమములున్నవి. 'భుక్త్వాశతపదం గచ్ఛేత్, వామపార్శ్వేన సంవిశేత్' అని [109]సుశ్రుతము. దక్షిణపుఁ దలాపి యొకధర్మము. నిద్రారంభవేళ నది మృత్యుతుల్య మగుటచే అగస్త్య కపిలాస్తీకాది పుణ్యపురుష స్మరణము, ప్రహ్లాద నారద పరాశర పుండరీకాది చిరంజీవుల పరిగణనము లావశ్యకములని యార్యుల నమ్మకము. ఆంజనేయ దండకమును బఠించుచుఁ గాక నిదురింప నిచ్చగింపని ప్రాచీన మర్యాదను బాటించు నాంధ్రులు నేఁటికిని గన్పించు చున్నారు. పాశ్చాత్య దేశములందు నిట్టి యాచారము లేకపోలేదు. థామస్ బ్రౌన్ "భగవత్ప్రార్థనము లేక నేనెన్నఁడును నిదురింప"నని పలికినాఁడు. వామనస్తుతి పరత్వమున నిదురలేఁచుట యే నాఁటి యాచారమో యేమో! 'ఇంతింతై వటుఁడింతయై మఱియుఁదా నింతై' తుదకుఁ ద్రిజగముల నిండిన త్రివిక్రముఁడు వామనుఁడు, ఆయనను స్తుతించుటవలన నా రీతి వృద్ధినొందు కోర్కె యీ స్తోత్ర పాఠకులందును ద్యోతకమగుచున్నది.

పొడగరితనమునకు, నిద్రకును సన్నిహిత సంబంధ మున్నదని శాస్త్రజ్ఞు లంగీకరించినారు. ఆర్థరు రేనాల్డు అనునొక పరిశోధకాగ్రేసరుఁడు "నూరు దినములు నిద్రపోకుండునట్లుగ నిల్పుటచే విద్యార్థుల రయంగుళము తగ్గిపోవుట తటస్థించిన" దని చెప్పినాఁడు. నీల్ జహార్ అను శాస్త్రజ్ఞుఁడు "నిద్రాసమయమున మస్తిష్కము తగ్గుటయును, శరీరము వృద్ధి నొందుటయు జరుగు" నని తన పరిశోధన ఫలితమును వెల్లడించినాఁడు.

కళాకారులను నిద్రాసౌందర్య మాకర్షించినది. సాహిత్యోపాసకులు తమ కావ్యముల "స్వప్న సుందరులఁ" జిత్రించినారు. [110]అవంతి సుందరి యందగ్రగణ్య. విఖ్యాతరచయితల యమూల్యకల్పనా విన్యాసములకు నిద్రావస్థ యుపోద్బలక మైనది. పురాణ కవులకుఁ గృతిపతులైన దేవతా మూర్తులు నిద్రాసమయములందుఁ గన్పించి

కృతినర్థించినారు. ఇందుల కాంధ్ర సాహిత్య ప్రపంచమున హరిహరనాథుఁ డక్కవిబ్రహ్మ తిక్కన సోమయాజికి దర్శనభాగ్య మొసఁగుట ప్రబల తార్కాణము. 'జోల – లాలి' ఇత్యాది నిద్రా సాహిత్యము ప్రతి దేశమున నొక సాహిత్య శాఖయై విలసిల్లుటఁ గన నిద్రకు నిత్య జీవితమున నెట్టి ప్రాముఖ్యమున్నదియు వెల్లడియగుచున్నది. ఈ ప్రాముఖ్యమును గుర్తించియే యొక మాఱు వర్డ్సు వర్తు మహాకవి నిద్రాదేవి కటాక్షము తొలఁగినపుడొక కావ్యమిట్లు చెప్పినాఁడు.

[111]"ఒకదాని వెనుక నొకటి ప్రశాంతముగ గమించునవిగణమును, ఝంకార మొనర్చు తుమ్మెదలను, గ్రిందికిఁ దుముకు వాహినులను, మందమందవాయువు లను, సముద్రమును, మృదులమగు సస్య క్షేత్రములను, నీరపటలములను, స్వచ్ఛమగు నాకాశము నొకదాని వెనుక నొకదానినిఁ గ్రమముగ నూహించితిని. అయినను నిద్రావిహీనుఁడనై నిలువవలసి వచ్చినది. నా పుష్పోద్యానవన తరువులపై నిల్చి కూయు పులుఁగుల కలధ్వనులు కోకిలా కరుణార్ద్రగీతములను వినవలసివచ్చినది. ఈ రీతిగ నిన్నటి దినమును మఱియు రెండు దినములు గడిచినవి. కాని నేను నీపై నే మార్గమున నైన విజయము నొందజాలక పోయినాఁడను. దేవీ! ఈ రాత్రియు నన్నిట్లె వాడిపోనీయకుము. నీవు లేని యుదయకాల సౌభాగ్య మేమున్నది? దినమునకును దినమునకును మధ్య దివ్యమగు నో యంతరమా! నూతన భావములకు నానందకరముగ నారోగ్యమునకుఁ దల్లివగు నో ప్రియమాతా!! రమ్ము!"

వైతాళికుల సాహిత్య మంతయు నొకచోఁ జేర్చిన యందుఁ గొన్ని విశేషములు లుండకపోవు. భారతగాయకలోకము ప్రాభాతిక రమణీయ రాగఫణితుల, నందు ముఖ్యముగ దేశాక్షి భూపాల మలయమారుతాది రాగముల, నిష్టదైవతముల నీ నాఁడును మేల్కొల్పుట యాచారముగనే యున్నది.

ప్రపంచ శిల్పులు యోగనిద్రాముద్రితులైన మూర్తుల శిల్పించినారు. [112]'ధ్యానీబుద్ధ' 'ప్రజ్ఞాపారమిత' ప్రతిమాశిల్పము లిందు జగద్విఖ్యాత కృతులు. పాశ్చాత్య ప్రపంచమున లీచ్ ఫీల్డు కెథిడ్రలులోని నిద్రాదంపతుల శిల్పఫలకము నిద్రాశిల్పమునకు నిస్తులమైన నిదర్శనము.

నిద్ర తాత్త్వికుల దృష్టి నాకర్షించినది. భారతీయద్రష్టలు దీనిని స్వప్నయోని, స్వప్నజన్మభూమిగ దర్శించినారు, నిద్రాసమయమున ప్రత్యగాత్మ బుద్ధ్యంతఃకరణతో నుండునఁట! 'ఓ జననీ! నిద్రా! నీవు మా యొద్దనుండి తొలగిపొమ్ము. అశ్వినీదేవతలు నిన్నతి జాగరూకతతోఁ బరిశీలించుచున్నారు. వారి కంటఁ బడక నీవెట్లు

రాఁగలిగితివి?' మొదలగు నర్థములు గల సూక్తము లథర్వ వేదమున నకాలమునందు విచ్చేసిన నిద్రాదేవి నుద్దేశించి కన్పించుచున్నవి. ఆ శ్రుతి యందే నిద్ర దేవపత్నుల గర్భాండమనియును, గలలు దేవతలనియును చెప్పఁ బడియున్నది.

నిద్రాతత్త్వమును గూర్చి ప్రవచింపవలసినదని గార్గ్య సౌరాయణి, మహర్షి పిప్పలాదు నీ భరతభువియం దెన్ని సహస్ర వర్షములకుఁ బూర్వమో యిట్లర్థించినాఁడు.

"భగవంతుఁడా! పురుషుని యందు నిద్రవోవునవి యెయ్యవి? మేల్కొనున వెయ్యవి? ఇందు స్వప్నావస్థను బొందు దేవత (ఇంద్రియము) యెవ్వఁడు? నిద్రా సుఖమెవ్వరిది? దేనిపై నియ్యవి సంప్రతిష్ఠితములైయున్నవి?"

ఈ ప్రశ్న పరంపరకుఁ బిప్పలాద మహర్షి యొసఁగిన సమాధానమునందు భారతీయ నిద్రావిజ్ఞానము నిరూపితమై యున్నది.

[113]"సంధ్యాసమయ సూర్యుని కిరణము లే రీతి యతని తేజోమండలమును జేరుకొనుచున్నవో యటులనే సర్వేంద్రియములును నిద్రాసమయమున మనస్సుతో నేకీభవించుచున్నవి. అందువలన నింద్రియ వ్యాపారముండదు. ఈ కారణముననే పురుషుఁడు నిద్రించుచున్నాఁడని చెప్పెదరు. ఆ మనస్సు తేజసాభిభూతమైనపుడు సుఖానుభూతి నొందును."

"యయేష సుప్తేషు జాగ్రత కామమ్ కామమ్ పురుషో నిర్మిమానః దదేవ శుక్రమ్ దద్బ్రహ్మ" ఈ కఠోపనిషద్వాక్యము వలన 'నిద్రితుని యందు మేల్కొనునది బ్రహ్మ' యని భారతీయ తాత్త్వికుల నిశ్చయమైనట్లు వ్యక్తమగుచున్నది.

సృష్టికి నిద్ర యత్యవసరము. జగత్కారణుఁడగు విష్ణువు నిద్రాముద్రితుఁడై శరదారంభమున మేల్కొని పునఃసృష్టి నారంభించును. ఆ మహామహుని జాగ్రదవస్థారంభ వేళాసౌందర్యముఁగనిన మహాకవి యాంధ్ర నిద్రాసాహిత్యమున నిరుపమాన రత్నమగు నీ పద్యములో దానినిట్లు వర్ణించినాఁడు.

సీ. [114]"అభినవో న్మేషచిహ్నంబైన తొలిచూపు
కౌస్తుభాలోక రేఖలకు నలగఁ
సాంగభంగంబైన యావులింతకు వేల్పు
లంగుళీస్ఫోటంబు నాచరింప
సౌఖశాయనికులై సంవర్తభృగ్వాది
మునులు హస్తాంభోజములు మొగుడ్ప

ధృతచేతనంబులై దివ్యాయుధంబులు
జయ జయ ధ్వనులతో సంస్తుతింపఁ

తే. గలువ రేకులు వోని పెంజిలువరేని
యరఁటి కుబుసంబు పొరలు మై నంటియుండ
నిదుర మేల్కాంచి కూర్చుండు నుదధి నడుమ
విష్ణుఁ డఖిలేశ్వరుఁడు శరద్వేళయందు."

నిదురమేల్కొను వేళ నీరాజన మెత్తుట భారతదేశమున రాజప్రాసాదముల యందలి ప్రాచీనాచారము. తాననుభవించిన యీ యాచారము స్మృతికి వచ్చిన [115]శ్రీరాయల కిట్టి దర్శనము కల్గినది.

ఆ.వె. "సాంధ్యరాగలహరి సామి రంజితములై
తిరిగి మింట నిదురఁ దెలసి నట్లె
యిందిరాధిపతికి నెత్తు కర్పూర నీ
రాజనంబు లన శరద్ఘనములు."

# స్తోత్రపాఠము

స్తోత్రపాఠము నొక విజ్ఞాని వన్యమృగముతోఁ బోల్చినాఁడు. నిత్య పరిచయము కలిగినపుడు డెంతటి క్రూరసత్త్వమైనను దాని క్రౌర్యమును గోల్పోయి కనుపించును. సహజ క్రౌర్యముగల జంతువుల నలవాటు చేసికొనుట యందును నేర్పు గోచరించును. మహర్షుల యాశ్రమ వీథులందు సహజ శత్రుత్వము గల వన సత్త్వములు పరస్పర సఖ్యముతో సంచరించుట కా మహనీయుల యనంత ప్రతిభావిశేషమే కారణము. మహాకవు లెపుడు ఋష్యాశ్రమముల దర్శించినను "గండూయనము సేయు కరటి శుండాదండ పుష్కరమ్మున సింహపోతకమ్ము" ఇత్యాది మనోజ్ఞ ప్రకృతి చిత్రణములు వారికిఁ బొడకట్టుట లీ కారణముననే.

స్తోత్రపాఠము శ్రోతకుఁ బ్రప్రథమమున నెట్టి మహాభయంకర మృగముగ గోచరించినను గాలక్రమమున దానితోఁ బరిచయము వృద్ధియగు కొలఁదిని నొకవిధమగు ప్రేమాభిమానములు వెల్లివిరియుట తటస్థించును. అవి యభూత కల్పనలుగఁ గాక సుసత్యస్వరూపములై నిరూపితము లగుచుండును.

స్తుతి పాఠముల విన నలవడిన శ్రవస్సులు సత్యములైన నప్రియ వాక్యముల వినలేవు. ఇట్టియెడ సత్యవ్రతులకు స్థానము లేకపోవుటయే కాక యట్టి సత్యము లసత్యములనియు నిరూపితము లగును. అందువలనే "అప్రియస్యచ పథ్యస్య శ్రోతా వక్తా చ దుర్లభా" అను నార్యోక్తి జన్మించినది. సత్యము! 'పదుగురాడు మాట పాటియై ధరఁ జెల్లు నొక్కఁడాడు మాట యెక్క దెందు.'

'ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్ నొప్పింపక తానొవ్వక తప్పించుకఁ దిరుగువాఁడు ధన్యుఁ' డని యొక సుమతి సెలవిచ్చినాఁడు. లోకమున జనసామాన్యము సర్వసాధారణముగ నీ నీతి మార్గమునే యనుసరించు చున్నది. ఆ కారణము వలననే లోకము విశేషముగ స్తుతిపాఠమునకుఁ జెవి యొగ్గుట సంభవించుచున్నది.

అయిన నొక యంశము సుసత్యము. స్తోత్రపాఠమొనర్పఁ బూనుకొనిన ప్రతివ్యక్తికిని దీని తత్త్వము తెలియుననుకొనుట భ్రమ. స్తోత్రపాఠమొక కళ! అసామాన్యమైన కళ!! ఉక్తివిశేషోద్భూత మగు కళ!!

కళకు వస్తువుకంటె విన్యాసవైభవము ప్రధానము. ఇందందెవేసిన చేతులు కావలయునన్న వారికిఁ బ్రతిభావ్యుత్పన్నతలు రెండును గుణములై యొప్పవల యును. అందుచే స్తోత్రపాఠకునకైనఁ బ్రతిభయు వ్యుత్పన్నతయు నత్యావశ్యకములైన గుణములని చెప్పుట యవసరము.

కళాకారుఁడు నిజసామర్థ్యమును వ్యక్తీకరించుటకుఁ బ్రతి వస్తువును స్వీకరింపఁడు. తాను స్తుతింపఁదలచిన వ్యక్తి యుత్తమ లక్షణములం దభిమానముఁ గొనిన వస్తువును గ్రహించి తన్మూలమున నిజదర్శనములకు బ్రతిబింబమును రూపించును. స్తోత్ర పాఠకుఁడు నిటులనే తా స్తుతింపఁదలఁచిన వ్యక్తి యందలి సమస్త గుణముల గ్రహింపఁడు. అతనిలోపములపై బుద్ధిని బ్రసరింపనీయఁడు.

ఉత్తమ స్తోత్ర పాఠకుఁడు మానవ స్వభావానుభావమున ఘటికుఁడు, మానవ హృదయ సాగరములఁ బ్రవేశించి యతఁడందు దాఁగియున్న పులిముత్తియములఁ బైకిగొనిరాఁగల చతురుఁడు. ఎంతటి సహనశీలము గల వ్యక్తియైనను దన లోపముల విననిచ్చగింపఁడని యతఁ డెఱుఁగును. ఎట్టి యధమునకైనను నెట్టి నిర్భాగ్య దామోదరునకైనను 'నీ వింద్రుఁడవు, చంద్రుడ" వని పొగడించుకొన వలయునను కోర్కె జితించిన పురాణవ్యాధివలెఁ బట్టి బాధించుచుండునని యతఁ డెరుఁగును. తగిన సమయమున [116]షోడశోపచారము లొనర్చి యా వ్యాధి నాహ్వానించి భక్తి శ్రద్ధలతోఁ బ్రజ్ఞావంతుఁడైన స్తుతి పాఠకుఁడు తగిన చికిత్స యొనర్చిగాని మఱి యూఱుకొనఁడు.

స్తోత్రపాఠక కళాతత్త్వ మెఱిఁగిన కళోపాసి నెవరిని బ్రశ్నించిన "నాత్మస్తుతిని వినుటకంటె మానవునకు మించిన తృప్తి మఱియొకటి లే"దని సిద్ధాంతీకరించి పలుకును.

ప్రయోజనరహితమైన దానిని బ్రపంచ మెన్నఁడు నాదరింపదు. స్తుతిపాఠము బహుయుగములనుండి లోకగౌరవమును బొందుచున్నది. అందుచే దీనివలన నొకకొంతగఁ బ్రయోజనమున్నట్లభివ్యక్తమగుచున్నది. ఇతర ప్రయోజనముల మాట యెట్లున్నను స్తుతిపాఠమును బడసిన వారి కీర్తి లోకమున వ్యాపించుచున్నది. స్తుతియం దించుకశక్తి యున్న చిరస్థాయియునగుచున్నది. నిత్యమగు నిట్టి కీర్తి లభింపవలయు నన్న స్తోత్ర పాఠ మక్షరరూపమును బొంద వలయును.

కీర్తి కాములందఱును సప్తసంతానముల మూలమున వారి కీర్తిని లోకమున సుప్రతిష్ఠిత మొనర్చుకొనఁ జూతురు. సప్తసంతానము లందును సాహిత్యము

ప్రశస్తమైనది. శాశ్వత మైనది. జంగమ రూపమున సాహిత్యము కృతిభర్తకీర్తిని బహుముఖముల వ్యాపింపఁ జేయుటయే కాక సురుచిర సుస్థితిని జేకూర్చును. ఈ కారణము వలననే కీర్తి కాములకు సాహిత్యకు లాత్మబంధువు లగుచుందురు. [117]సాహిత్యకు లందు వ్యాకరణజ్ఞుని బితరుని వలెను, తార్కికుని భ్రాతవలెను, వేదజ్ఞుని చండాలుని వలెను జూచుచుఁ గవిత యలంకరణజ్ఞుఁడగుటచేఁ గవిని వరించినది. కవికి వాఙ్మయకళా వైదగ్ధ్యము వెన్నతోఁ బెట్టిన విద్య.

పూర్వ రాజన్యులలోఁ గొంద రీ రహస్యము నెఱింగిన వారగుటచే నుచితజ్ఞులై విశేషముగఁ గవి సంగ్రహణ మొనర్చిరి. ఎంతటి శ్రమకైన నోర్చి కవుల సంగ్ర హించుటకు మూలకారణము స్తోత్రపాఠాభిమానమే యని మా మతము, కవులు వారి పోషకునికిఁ బుష్టిగల కీర్తి శరీరమును గల్పించి యుగ యుగముల ఖ్యాతిఁ గల్గించినారు.

సమర్థత గల చక్రవర్తుల కిట్టి యపూర్వ ప్రాభవమును జేకూర్చుట సహజమును సమంజసమును నైయున్నది. అయ్యుఁగొందఱు కవులు తాము 'సత్యరథములకుఁ గట్టిన యశ్వము'లను శ్రుతిప్రమాణముల మఱచి, తమ పోషకులకుఁ గేవలకీర్తి కాయ నిర్మాతలై వారి తుచ్ఛ శృంగారాభిమానమునకుఁ దోహదకారులగుచు తమ యనంత వాగ్వైచిత్ర్యములతో లోకమును మభ్య పెట్టుచు వచ్చినారు. దీనిని గమనించి యుత్తమ ద్రష్ట లొకానొక కాలమున 'కావ్యాలాపాంశ్చ వర్జయే'త్తని యనుశాసింపవలసివచ్చినది.

ఉత్తమశ్రేణికిఁ జెందిన కొందఱు మహాకవులు తాము స్తోత్రపాఠమొనర్చుట కంగీకరింపక మడిదున్నుకొని బ్రతుకఁదలఁచిరి; చారుచరిత్ర, ధర్మచరిత్ర లేని రాజశబ్దవాచ్యులపై నేహ్యభావమును బ్రకటించిరి. అట్టివారిలోఁ బ్రముఖుఁడగు నొక కవీంద్రుఁ డొక సందర్భమున రాజదర్శన మొనర్చి తిరస్కృతుఁడైనపుడు [118]'బండిగురివింద పూల పేరులతోఁ దృప్తినందు కిరాతకాంతలకు స్వర్ణ కారునితోఁ బనిలేనట్లు సాధుచరిత్ర లేని రాజులకుఁ గవులతో ఁబని యేమున్న'దని ప్రాగల్భ్యము మెఱయఁ బలికివచ్చినాఁడు.

కొందఱు ముష్టికవులు 'ముష్టికి నష్టి' లేదని నమ్మి యపాత్రుల కడకైన నేఁగి యాశుకవితఁజెప్పి యింతయో యంతయో పుచ్చుకొనకపోలేదు. కవి ప్రాశస్త్యమును గుర్తింపలేని వారు వీరిని వందిమాగధ వైతాళికాది గణమునఁ బరిగణించుట పరిపాటియైనది. ఇట్టి భట్టుకవులలో నుద్దండులును గొందఱున్నారు. అల్పదేశ పాలకుడైనను దానొక త్రిలోకాధిపతి నను భావముతోఁ బ్రియఁగూడి రాజ్యమేలు నొక యేకాక్షి ప్రభువును దర్శించి శుష్కప్రియముల శూన్యహస్తములని

గ్రహించువాఁడగుటచే 'అన్నాతిఁ గూడ హరుఁడవు, అన్నాతిం గూడకున్న నసుర గురుండౌ, దన్నా! తిరుమలరాయా!, కన్నొక్కటి లేదుగాని కంతుఁడవయ్యా!' యని యొకడు స్తోత్రపాఠమును విసిరినాఁడు. అంతటితో నా రాజు తబ్బిబ్బై బహుళ పారితోషికమును దుశ్శాలువల నిచ్చి పంపించినాఁడు.

స్తోత్రపాఠకుఁడు కొన్ని వేళలందు స్తుతించెడివారి యుత్కర్షను నిరూపించుటకుఁ దన్నల్పునిగ జిత్రించుకొనును. [119]చౌడప్ప వంటి వాచాప్రాగల్భ్యముగల భట్టుకవి తంజావూరు రఘునాథ రాయలవారి యొద్ద 'నేరుతు నని మాటాడఁగ, వారిజభవు నంత వాని వశమా తంజా, వూరి రఘునాథ రాయలుగా, రెఱుఁగఁగఁ గుందవరపుకవి చౌడప్పా!' యని తన్నుద్దేశించి చెప్పుకొనినాఁడు.

'అంతవాఁడినైన నేనే నిన్ను స్తుతించుచున్నాను నీవెంత వాఁడవో చూచుకొ'మ్మనట్లు కొన్ని సందర్భముల స్తోత్రపాఠకులు తమ యాధిక్యమును వర్ణించుటయు సహజము. ఇట్టివారు స్తోత్రపాఠ కులపతులు.

'ఉదయం బస్తనగంబు సేతువు హిమవ్యూహంబునుం జుట్టిరా విదితంబైన మహిన్మహాంధ్ర కవితా విద్యాబలప్రౌఢి నీకెదు రేరీ?' యని సామాన్యస్తోత్ర పాఠకులు తమ్ముఁగూర్చి చెప్పికొనుట పరిపాటి. ఒక సామాన్యమైన సామంతుని పట్టుకొని మహాకవి తిక్కనవలె[120] 'ఎవ్వాని వాకిట నిభమద పంకంబు రాజభూషణ రజోరాజి నడఁగు... నెవ్వాని గుణలత లేడు వారాశుల కడపటి కొండపైఁ గలయఁ బ్రాకు' – ఇత్యాదిగ స్తోత్రపాఠ పరంపరలఁ గురిపించుటయును లోక సహజము. ఈ యసత్యస్తుతులు ప్రాఁత కాలపునాఁటి వని పరిహసింప వీలులేదు; ఈ శతాబ్ది యందును వినిపించుచున్నవి.

అట్టి స్థితిలో గీర్తికాములైన పూర్వరాజన్యులు కొంద రప్రశస్తము లయ్యు నగ్నములైన యసత్యములు కాని యిట్టిస్తుతులకు మురిసి యే సంక్రాంతి పుణ్యకాలముననో పెద్దల పుణ్యమునకని పేరుపెట్టి [121]'సర్వబాధా పరిహారముగ' దేవమాతృకలు పండు కేదార ఖండముల స్తుతి పాఠకులకు దానమిచ్చిరని యీ నాఁడు మనము బాధపడుట యెందులకు?

స్తుతి పాఠకులు పరస్తుతి పరాయణులు కాని పరదూషకులు కాదు. అయినను పరవంచకులు. వీరివలన వినువారు చెడిపోవుట నిస్సంశయము. వీరు లోకమున స్తుతిగీతా ప్రియత్వమును బెంపొందితురు. వీరి స్తోత్రములకుఁ దగినవార మను

భావము నిగూఢముగనో, యీషత్స్పష్టముగనో వినువారియందుఁ బొడకట్టును. లేకున్న వీరిస్తుతుల వినుటయెట్లు? ఇది యహంకృతి యైనను నాత్మవిశ్వాసమైనను దీనికి మూలకారకులు స్తుతిపాఠకులు. వ్యక్తిద్రోహులైన వీరు రాజద్రోహులు! రాష్ట్రద్రోహులు! జాతిద్రోహులు! ప్రపంచ ద్రోహులు! విశ్వ ద్రోహులు!!! [122]'అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దుష్టాంగంబు ఖండించి శేషాంగ శ్రేణికి రక్షసేయుక్రియ' సంఘమునందొకరైన వేరుపురుఁగులగు వీరిని పట్టి శిక్ష చెప్పించుట 'సంఘనీతి'.

'స్తోత్రపాఠము చేయువారి, నది విని నిజమని భ్రమించువారి నిరువురఁ జెడగొట్టు శక్తి దానియందున్న' దని యొక తాత్త్విక మహాశయుని సుసత్య ప్రవచనము. వస్తుతః స్తుతి పరాయణత్వము లేకున్న నది గల్పించి పోషించును. ఆత్మవిశ్వాస మణుమాత్రమైన లేక నణగారిపోవు వారి కది మహాంజనమై వర్తిల్లుటయును సత్యమగుటచేఁ బండితాగ్రగణ్యుఁడు జాన్సను 'పొగడ్త పొందుటయును నొకరీతి శ్రేయస్కర'మని ప్రవచించినాఁడు. 'లోక మీ రీతిగ నన్నుఁ గూర్చి భావించుచున్నది కాఁబోలు. నేనీ ప్రథకుఁదగిన శక్తిసామర్థ్యముల సంపాదించెదను గాక' యని నిశ్చయించుకొని కొందఱు తమలో నిద్రించుచున్న శక్తిని మేల్కొల్పుటకు శతవిధ యత్నము లొనర్ప స్తోత్రపాఠము సాయపడవచ్చు నన్నమాట!

ఆత్మబంధువుల మధ్య స్తుతిపాఠములు వినిపించిన లోకము సహింపదు. అందెంతటి సత్యమున్నను బ్రయోజనము లేదు. ఇట్టిస్తుతులకు మూలకారణముల వెదకుట దాని లక్షణము. కుమారుఁడు తండ్రి నే ప్రతిభావిశేషమునకో హృదయపూర్వకముగ నమ్మి స్తుతించిన స్వార్జితమైన సంపదను దండ్రి యన్యాక్రాంత మొనర్చునేమోయను భీతి యిందులకుఁ గారణమని లోకము శంకించును. పితరులే పుత్రునిఁ బొగడిన నివి మేనకోడలిని వివాహమాడఁజేయ బన్నుచున్న వాగురు లని యతని మది నిశ్చయించును.

అల్లుఁడు మామలమధ్య పరస్పరోత్కర్ష కనుపించిన గొడుకులతోఁ బాటు పాలుపంచఁడను భయమునో, కుమార్తె కురూపియగుట నల్లుఁడు పరిత్యజించు నను భయమునో కల్పించి [123]'ఓడిపస్ కాంప్లెక్సు'ను దలఁ దన్నఁగల యొక 'శ్వశ్రుజామాతా – కాంప్లెక్సు'ను సృష్టించుటకు వెనుదీయని మానసిక శాస్త్రవేత్తలు మానవలోకమున నుండకపోరు.

భార్యాభర్తల మధ్య స్తుతిపాఠ మంతకంటె నతి ప్రమాదకరమైనది. 'అన్యోన్యము ప్రేమించుకొనినవారు పొగడుకొనరు. సామాన్యస్త్రీ భర్తను పొగడవలసిన యగత్యము

లే'దనునవి యన్య దేశీయ జిజ్ఞాసువులు చెప్పిన సూక్తి విశేషములు. ఇట్టి యభిప్రాయముల నాధారముగఁ గొని మిథ్యాభిమాన ప్రకటన మనియో, శీలసంబంధ మగు భీతియనియో సిద్ధాంతీకరింప వచ్చును.

సామితేయులు కొందఱు కొన్ని సందర్భముల సభావేదికలఁ నన్యోన్య గుణకీర్తన మొనర్చుకొనినచో వారిని యజ్ఞాహ్వానితులైన దేవతలవలె నింద్రుఁడగ్ని, నగ్ని వరుణుని, వరుణుడు ధర్ముని, ధర్ముఁడు వాయువును హవిర్భాగములఁ గైకొన స్తుతిపాఠము లొనర్చుకొనుచుఁ బరస్పర మాహ్వానించుకొను రీతిగఁ బ్రవర్తించు నొక స్తుతి పాఠక గణముగఁ బరిగణింపని వ్యక్తులు, సమాజములు లోకమున నరుదు కాదు. అట్టి యవసరముల స్తుతి తప్పదు జన మనుకొనుటయుఁ దప్పదు.

కొందఱాత్మ బంధువుల కంటెను, కొందఱు సామితేయుల కంటెను, ప్రేయసీ ప్రియులలో స్తోత్ర పాఠములు విశేషముగ విన్పించును. 'తావలచినది రంభ తామునిఁగినది గంగ.' కవి, [124]ఉన్మత్తుడు, ప్రియుఁడు నేకకోటిలోని వారని మహాకవి షేక్స్పియరు పలుకనే పలికినాఁడు. ఇట్టి స్థితిలో వారి స్తోత్రపాఠము లెట్లుండునో యూహించుట కష్టముకాదు. ప్రియాప్రియుల మధ్య నడచు స్తోత్రపాఠములకు మధ్య 'ప్రణయంపు మేలిముసుఁ' గొకటి కన్పించును. ప్రేమికుఁడు ప్రియనుగూర్చి [125]'నీవు గంధర్వలోక మధుర సుషమా సుధాగాన మంజురేఖ' వనినను, బ్రియురాలు ప్రియునిగూర్చి నీవు కంతుఁడవొ, జయంతుఁడవొ' యనినను, [126]ప్రియ పాదచిహ్నా ములున్న స్థలముల మఱియొకరు ప్రయాగ క్షేత్రములుగ విధురభక్తి భావమున భావించినను వీని నుత్తమ కవితోక్తుల క్రింద మన్నించి వారి యనురాగమును ధర్మేతరమైనను నార్ద్రహృదయముతో లోకము పరిగణించుచున్నది.

అర్థమునకు స్తుతికి నవినాభావసంబంధము. '.......అతఁడు మహాకులీనుఁ డాతండు కళావిదుండతఁడు ధన్యుఁ డతండు మనోజ్ఞమూర్తి యెవ్వండు భవత్కృ పాకలన వైభవలక్ష్మికిఁ బాత్రుఁడిందిరా!' యని కవి చెప్పనే చెప్పినాఁడు. ఇట్టి ధనవంతునిపై స్తోత్రపాఠపుష్పవృష్టి గురియుటలో సందేహ మేమున్నది? ఇతర విద్యావిశేషములులేని కేవలధనికుఁడు నుతికిమించి స్తుతించెడు స్తోత్రపాఠకునిఁజేరరానీయఁడు. ఇందుకుఁ గారణము స్తోత్రపాఠముపై నభిమానము లేక కాదు; 'అతి సర్వత్ర వర్జయే' త్తను నార్యోక్తిపై నభిమానమును కాదు. మఱియొక 'కొంటె కోణంగి' స్తోత్రపాఠకుఁడై వచ్చి యిచ్చిన దానితోఁ దృప్తినొందక తన 'బ్రతుకు బండారము'ను బయటపెట్టు నను భయమిందుకు మూలమని విబుధుల యభ్యూహము.

ధనికుల కడకు స్తోత్రపాఠకులై వెడలు వారీ రహస్యమును మున్నె గుర్తించి తగినరీతి వర్తించి రసవంతముగఁ దప్పించుకొని వత్తురు.

[127]'గడచిన ప్రపంచ మహా యుద్ధమునఁ బ్రథమ నష్టము సత్య'మని మహాత్ముఁడు ప్రవచించినాఁడు. అయిన నేమి? ప్రపంచ మే కడ మాటినది. ఎవరి ప్రచారము వారిది. ప్రచారము లేకున్న బలప్రాభవము లుండవు బ్రతుకుట కష్టము. అసత్యమున కింతటి ప్రాపకమున్న యీ దినములలో మహాత్ముని వంటి కారణజన్ములు మఱల నవతరించి స్తుతిపాఠము జాతి విద్రోహము, దేశ విద్రోహ మని ప్రకటించి యందులకై బ్రచార మొనర్చి యెన్ని వ్యక్తి సత్యాగ్రహములు సాగించినను నీ నాణెమునకుఁ గల చలామణినిఁ జెఱిపి వేయలేరు. ఇది మహత్తర సత్యము. భూతవర్తమానముల దీని చెల్లుబాటు కన్పించుచున్నది. భవిష్యత్తున నొకవేళ రూపాంతరమును బొందినఁ బొందవచ్చును. కాని నశించు ననుకొనుట భ్రమ. దీనిని కేవలము బానిస యుగ చిహ్నముగఁ బరిగణించి భావికాలమున మన ప్రజాగణతంత్ర రాష్ట్రమున సమూలముగ నిది పరిభ్రష్టమగు ననుకొనుచున్న వారు భ్రమప్రమాదమునకు లోనైనారని ఘంటాపథముగఁ బలుకవచ్చును.

లోకమున గొందఱకు స్తోత్రపాఠ మనిన గిట్టదని వినుచుందుము. కుశాగ్ర బుద్ధితో నాలోచింప నిది గగనకుసుమమని యవగతమగుచున్నది. అట్టివారి జీవిత [128]'వ్యాసఘట్టము' లెఱిఁగి ముగ్గున కెట్లు దింపవలయునో సిద్ధహస్తులైన [129]'కారంధమ – స్తోత్ర పాఠకు' లెఱుఁగుదురు. స్తుతిపాఠ మనిన నాకిష్టము లేదని ప్రకటించు వ్యక్తి భంగ్యంతరముగ నద్దాని నభిలషించుచున్నాఁడన్నమాట! అతగాని దర్శన మొనర్చి జగజెట్టి స్తోత్రపాఠకుఁ [130]'డడియఁడై' ద్రావిడ ప్రాణాయామముగ 'మహాప్రభో! [131]నభోగాయకు లందఱకువలెఁ దమకు స్తోత్రపాఠ మనిన సుతరమును గిట్టదు. దానికిని మీకును ధ్రువముల రెంటికున్నంత దూరము, తాము కేవలము 'స్తోత్రపాఠ వరూథినీప్రవరు'! లని నాతిదీర్ఘ బిరుదమును ప్రసాదించి పని నెగ్గించుకొని మఱి బయటఁబడ గలఁడు. అనిన స్తుతిపాఠ మనిన నేవగింపును బ్రకటించువారికి నేఁటి విధానము సంతృప్తినొసఁగుట లేదన్నమాట! వారు కాంక్షించుచున్నది నవ్యత. అది పొడకట్టిన మఱుక్షణముననే వారు [132]'త్రిశరణములఁ' జెప్పి తీఱెదరు.

మూర్ఖుఁడు స్వగృహపూజ్యుఁడు కనుక తన్నుఁ దానె పొగడుకొనును. వివేకి సహచరుల స్తుతించును. అంతటివారికి మిత్రుఁడనైన నే నెంతటివాఁడనో గ్రహింపుఁ డనుట కింతటి కంటె 'శృంగగ్రాహిక' యింకేమి కావలయును? ఒకప్పుడు వేత్తలును

'స్థూలారుంధతీన్యాయము'నఁ దమ్ము గీర్తించుకొని వ్యంగ్యగర్భితముగ నాకు మిత్రులు వారని సహచరుల నితరులకుఁ బరిచయ మొనర్చి వారిపనులు చక్కబెట్టుటయుఁ గలదు.

'ఇరువురు స్తోత్రపాఠకు లొకచోఁజేరిన వాక్పిశాచములు విందొనర్చుకొను' నని యొక తాత్త్వికుఁ డనినాఁడు. నిజము. ఇరువురి జిహ్వలు వాక్కులకు వాతరాయణములు. తేనెబూసిన కత్తులు. ఇట్టి రసనలు బాహ్యప్రపంచముపై జైత్రయాత్రలు వెడలుట నిత్యమును మన కనుభూత మగుచున్న యంశము.

స్తోత్రపాఠముల నెల్ల నుత్తమోత్తమమైనది వ్యక్తియభి భాషణము. ఔను కాదనక శిష్యభావముతో [133]ఋషభములు నిండ వినుటయే. ఈ ధర్మ సూక్ష్మమును గ్రహించిన స్తోత్రపాఠకుఁడు 'స్తుతిప్రియ – [134]క్షేత్రియోవ్యాధి' గ్రస్తమైన యెట్టి నివాతశిలాకంధ హృదయ క్షేత్రములోనైనఁ బ్రవేశించి విజయమును గరతలామలకము గావించుకొనఁ గలఁడు.

వీరు మాటల పెట్టుబడియైన లేక విశేష లాభముల గ్రహించు 'విచిత్రధనిక వాదులు. వీరు పొందు లాభముల 'కంచనాలు' వేసి యెంతటి చారదక్షమైన ప్రభుత్వమును దగిన [135]'దండుగు' బుచ్చుకొన నేరదు.

'స్తోత్రపాఠ మొక వ్యసనము' అత్యనారోగ్యకరమైన వ్యసనము. మద్యముల వలెఁ గొన్ని యౌషధసంబంధములైన ప్రయోజనములున్నవని కొందఱు వాదించినను నిశిత హృదయ మంగీకరింపని వ్యసనము. మద్యపానమువలెఁ బ్రభుత్వములు నిషేధింపలేని వ్యసనము.

బాల్య యౌవన కౌమారములలో నున్న యెవరైనను స్తోత్రపాఠవ్యసనాయో మయ కలుషశృంఖలములనుండి విడివడలేకున్నారు. బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ సన్న్యాసాశ్రమవాసులలో తురీయులైన దీనిఁ బరిత్యజింపలేకున్నారు. నేఁడు [136]పాలమోర్ వంటి ప్రసిద్ధ ఖగోళ శాస్త్ర పరిశోధనాలయము నందలి రెండు వందల యంగుళముల వెడల్పు గల 'భూతదర్పణము' లున్న యంత్రముల వలనైన యందుకొని దర్శింప రాని నక్షత్రములఁ [137]దురీయయంత్ర, రామయంత్రములఁ గనుఁగొన నేర్చిన మహర్షులైన దీనిపై మనసుగొనినారు. బ్రహ్మజిజ్ఞాసువుల నైననిది పట్టి బాధించినది.

ఇంతకు నిట్టి లోపము దేవతలలోనే యున్నది. స్తోత్రపాఠ ప్రియత్వము లేని దేవత ముక్కోటి దైవతములం దొక్కరైనఁ గన్పింపరు. త్రయీవేదముల విధ్యుక్తముగ

నాహ్వానించినను సామమంత్రములు శ్రుతిపుటములఁ బడునంతకు దేవతలు యజ్ఞభాగములనైన గ్రహింపఁ బయల్వెడలరఁట! ఇట్టి దేవతల స్తుతించుట కాదిద్రష్టలు పలికిన ప్రపాఠములు చాలక, స్తోత్రహిత బుద్ధులైన కవు లెన్నెన్ని స్తుతులు గల్పించినదియు స్తోత్రరత్నాకరములఁ బరిశీలించిన సువ్యక్తము కాఁగలదు. అయ్యు వీనిఁగని బ్రహ్మ మేకము కాదనుకొనుట యద్వైతు లంగీకరింపనిది. 'ఏక మే వాద్వితీయమ్ బ్రహ్మ' స్తోత్రపాఠ మొక లీల! ఒక చిదంబర రహస్యము!!

# శత్రువులు - శత్రుత్వము

శత్రువులా! - అయిన నేమి? ఇంత భయమేల? శత్రువు లనినను, శత్రుత్వ మనినను నింత భయపడ నగత్యమేమున్నది? సత్త్వచిత్తముతో నాలోచించిన శాత్రవు లన నంతగ భయ మొందఁ బనిలేదని నానిశ్చయము.

'శత్రువుల వలన నెన్ని ప్రయోజనము లున్నవి! పాశ్చాత్యవిజ్ఞానమునకు మూలపీఠమగు [138]ప్లూటార్కు మహాశయుఁడు శత్రువులఁ గూర్చియు శత్రుత్వమును గూర్చియు మేధాసుసంపన్నత నభివ్యక్త మొనర్పఁగల యొక సుందర జిజ్ఞాసను బ్రకటించినాఁడు. దానిని బఠింపుము. నీ విభ్రాంతి సమస్తమును నశించు'నని యొక యనుభవజ్ఞుఁడు సందర్భవశమున నాతోఁ బలికినాఁడు. నాఁటినుండి నాలో 'శాత్రవమథనము' జరిగినది.

లోకమునఁ బ్రతివ్యక్తియు శత్రువనిన జంకుచున్నాఁడు వలదన్నను మైత్రి నాశించుచున్నాఁడు. ఈ మార్గమునే కుటుంబములును, సంఘములు, దేశములు ననుసరించుచున్నవి. సర్వసామాన్యముగ శత్రువులు కావలయునని కోరుకొను వ్యక్తియును, కుటుంబమును, సంఘమును, దేశమును గన్పించుట లేదు. ఇందుకు భిన్నముగఁ బరిపంథు లేర్పడినఁ జతుర్విధోపాయముల జయించి 'జితశత్రుల' మని 'యజాతశత్రుల'మని 'సర్వలోక మిత్రుల'మని యును బ్రకటించుట ప్రస్ఫుటమగు చున్నది.

ఉ. "కంటికి నిద్ర వచ్చునె, సుఖంబగునే రతికేళి, జిహ్వకున్
వంటక మిందునే, యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె, మానుషంబు గలయట్టి మనుష్యున కెన్నఁ డేనియున్
గంటకుఁడైన శాత్రవుఁ డొకండు దనంతటివాఁడు గల్గినన్"

అని కవిసార్వభౌముడు శ్రీనాథుడు తపనీయనగదర్పోద్ధతిని సహింపక మాత్సర్యము వహించిన వింధ్యముచేఁ బల్కించినాఁడు. ఈ కావ్యమునం దా మహాకవి యాత్మీయత నిక్షేపితమై యున్నదని యెల్ల రంగీకరించినారు. మేరువు లేక వింధ్యకుఁ గీర్తి యెక్కడిది? దేవరాయల యాస్థానమునఁ గనకాభిషేక సన్మానము నొందుటకుఁ గారణభూతులైన

డిండిమ భట్టారకాది కవీంద్రులు లేకున్న శ్రీనాథుని కీర్తి మేఘములా నాఁటి యాంధ్రలోక విమానవీథుల విహరింప వీలెక్కడిది?

శత్రువును గూర్చి యంతరంగమునఁ దీవ్రవ్యథాప్రాచుర్యము వహింప నవసరము లేదు. అనుగుణమైన మానసిక ప్రబోధమొందిన శత్రుత్వ మే నాఁడును హృదయమునఁ బ్రవేశించి యతిఘోరదవానలముగఁ బరిణమించి పరశురామప్రీతి గావింపలేదు. మహాకవి శ్రీనాథుని మాట నమ్మిన కొందఱుండ వచ్చును. సుఖనిద్ర కలుగుట మానినదగుటచేఁ గంటికి నిదుర రాకపోయినను, మద్యపానము నిషేధితమగుట మధుకేళులు తప్పుటచేతను, బ్రమాదము లేదు. అయినను 'ఋణంకృత్వా ఘృతం పిబేత్' నేఁడు కాలలక్షణ మగుట వంటకము లిందకున్న నెట్లను భయముచే నట్టివారు శత్రువులతో సంధి గావించుకొన వచ్చును.

శత్రువును గూర్చిన యాలోచనామార్గమే ప్రాచ్యదేశముల విచిత్రగతి నడచినది. వారికి సపత్ను లని భారతీయులు నామకరణ మొనర్చినారు. వారు సవతుల వలె దుఃఖహేతువులఁట! బహుభార్యాత్వమును జట్టమూలమున నిషేధింప బద్ధకంకణమైన భారతదేశమున సపత్నులు సౌఖ్యహేతువులని వాదించువారును నుండరు. వాదించిన నంగీకరించువారును నుండరు. అయ్యుఁ బ్రపంచమున నేఁడును, సపత్నులు సౌఖ్యహేతువులని యంగీకరించు లలనాజనముగల జాతులు లేకపోలేదు. 'తిరిపెమున కిద్దరాండ్రా పరమేశా! గంగవిడువు పార్వతి చాలున్' అని యడిగించుకొనుటకైన నంగీకరించినాఁడు కాని యా యాదిభిక్షువు శిరముపై నెక్కించుకొనిన గంగను దించుట కిష్టపడలేదు. గంగాగౌరుల కీర్తి యన్యోన్యము సపత్నులై యుండుటచే విశ్వవిఖ్యాత మైనదనుటలో విప్రతిపత్తి లేదు. అందువలన శత్రువులు సపత్ను లనుమాట యంగీకరింపవచ్చును కాని వారు దుఃఖహేతువు లని యొప్పుకొనుట వలను పడదు.

ప్రాచీనార్యరాజన్యులు 'శత్రురాయ వేశ్యాభుజంగ బిరుదాంకితులు.' ఈ భుజంగమత్వమును బరిపాటిగ సాగవలయునను గోర్కెతో నిరంతరమును రణ వీథివిహారమొనర్చినారు. వారి శిరముల ఖండించి బల్లెపుఁగొనలకెత్తి యూరేగించి యుజ్జ్వల కీర్తిధ్వజములుగ వీరుపయోగించినారు తుదకు వారి కపాల పాళికలఁ దమ్మపడిగలఁబొదిగించి తృప్తిఁజెందినారు. రాజన్యులా శత్రువిజయములఁ దెల్పు కీర్తి స్తంభముల నాటించి శత్రువిచ్ఛేదనా కథల భావియుగ శుభ్రచరిత్రల కెక్కించినారు. వారి యాస్థానకవులలో నగ్రగణ్యులును నా పూర్వరాజన్యులకు 'శత్రుశోణితమున శాత్రవకామినీ చారునయన బాష్పసలిలముల నవనిఁదడుపఁడేని యా రాజు లావును,

జీవనంబు వేఱఁజెప్పనేల?' యని సెలవిచ్చి పోషకులయందు శత్రుత్వాభిమానమునకు దోహదసేవఁ జేసినారు. శత్రునిరాసక్రియానంతరము వారి కీర్తి వ్యాపింపఁ బెద్దనార్యుఁడు 'అభిరతి కృష్ణరాయఁడు జయాంకముల న్లిఖియించి తాళసన్నిభముగఁ బొట్టునూరి కడనిల్పిన కంబము సింహభూధర ప్రభు తిరునాళ్లకుం దిగు సురప్రకరంబు కళింగ మేదినీవిభు నపకీర్తికజ్జలము వేమఱుబెట్టి పఠింతురిచ్చలున్' అని పలికినట్లు మధుర కావ్యములఁ జెప్పి శాశ్వతకీర్తి నాపాదించినారు. అట్టి కృత్యములే జరుగకున్న మహత్తర సామ్రాజ్యము లేర్పడియెడివి కావు. ఆటవిక జీవితమున నున్న యొకనాఁటి సంఘము నేఁటి నాగరకరూపమున రూపొందెడిది కాదు. సామ్రాజ్యముల స్థాపించినది శత్రుత్వము. సామ్రాజ్యములు భంగ్యంతరముగ సంఘవిస్తృతికి, సాంస్కృతిక పరివ్యాప్తికిఁ దోడుపడినవి.

'శక్తివిహీనుఁడై నీ శత్రువు తాత్కాలికముగ లొంగినను నమ్మవలదు. కుటిల మైన బాణాసనము వంగిన కొలఁదిని బలీయము కదా!'యని [139]జెబున్నీసా కవయిత్రి యనినది. ఇట్టి శత్రువుల వలనఁ బ్రయోజన మేమైనఁ గలదాయని ప్రశ్నింప నౌనని యే సమాధానము. నిద్రాళువులమై యున్న మనలో నిద్రించు శక్తిని బ్రబోధించువాఁ డిట్టి శత్రువే! ఇట్టి వైతాళికుని మఱచు టెట్లు?

'నీ శత్రువులతోఁ దిరిగెడి మిత్రునకు దూరముగనుండు' మని [140]సాదీకవి యుద్బోధించినాఁడు. శత్రురహస్యముల గుర్తించి మనకుఁ దెలియఁ జెప్పుటకు వారితోఁ జెలిమిఁ జేయు సఖుని గూర్చి భయమొంద నవసరము లేదు. అట్టివానిని మానసికముగఁ దూరముగ నుంచుట మర్యాదకాదు; అయిన దూరముగ నుంచుచున్నట్లు నటించుట యవసరము. అందువలన నతనిని మనము తమమూలమున నొక విరోధిగ భావించుచున్నామని భ్రమపడి వారాత్మ మైత్రినిఁ బ్రకటింపవచ్చును. వారు మనసు విప్పి చెప్పిన మాటల నతఁడు మన చెవి వేయవచ్చును. ఒకవేళ శత్రువులతో వర్తించు సఖుడిట్టివాఁడు కాకున్న నతనిని మిత్రుఁడని వ్యవహరించుటయే యనుచితము.

అల్పుడైన శత్రువు నెల్లవేళల నవజ్ఞఁ జేసి యూరుకొనవచ్చును. వియ్యమునకుఁ గయ్యమునకు సాటి కావలయునని పెద్దలనినారు. అందుచే సాటిశత్రువును గూర్చి విశేషముగ నాలోచింప వలయును. ఇట్టి శత్రువే భంగ్యంతరముగ మనకు మిత్రుఁడు! మిత్రులకంటె ననేక రీతుల సత్యమగు మిత్రుఁడు!! అట్టివానికిఁ బ్రాణభయము

సంభవించిన నాప్త బంధువునకుఁ బోలె సాయపడుట రాజనీతి. ఇట్టి తోడ్పాటతని కొఱకై కాదు; మన కొఱకు!

ఈ ధర్మసూక్ష్మమును గమనించినాఁడు 'మెత్తని పులి' ధర్మరాజు, అజాతశత్రువు. ఘోషయాత్రాసందర్భము 'నారలు కట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులో విపద్భారము నొంది వందురిన (వారల) నుజ్జ్వలరాజ్య వైభవోదారులరై కనుం గొను ముదంబున' కర్ణసచివుని మంతనమునకు లొంగి దుర్యోధనుఁడు పాండవులఁ బరాభవింప వచ్చినాఁడు. గంధర్వులచేఁతఁ విజితుడై చిక్కిపోయినాఁడు. 'సద్యస్కంధ' యజ్ఞదీక్షితుఁడై యున్న ధర్మజుని కడకు ప్రజలు వచ్చి తమ రారాజును విడిపింపుమని ప్రార్థించినారు. పూర్వవైరస్మరణ కలుషితుఁడు, ధీరోద్ధతుఁడు నైన భీముఁడు 'మనకుఁ జులుక నయ్యె మన చేయుపని గంధర్వవరులు కూడి తగ నొనర్చి రింతలెస్సయగునె యేభారమును లేక యూరకుండ నొందె మనల జయము' అని యన్నతోఁ బల్కినాఁడు. ఇది శత్రువులగూర్చి సర్వసామాన్యవ్యక్తి యొనర్చు నూహ. ధర్మజ్ఞుఁడిట్టి ప్రబల శత్రువునంత చులకనగఁ బోఁగొట్టుకొనఁ దలఁపలేదు. వారివలన నతని కీర్తి సకలలోక పరివ్యాప్తము కావలసియున్నది. అదియును గాక ప్రతిజ్ఞాపాలనానంతర మే ప్రజల నతఁ డేలుకొన వలయునో యట్టివారు వచ్చి ప్రభువును విడిపింపుఁడని ప్రాధేయపడినారు. ఇట్టి యపూర్వము, విశిష్టమునగు నవకాశమును బోఁగొట్టుకొనుటెట్లు? ఈ స్థితిలో దుర్యోధన శత్రువును విడిపించిన లోకమున, నందును ముఖ్యముగ, కురుసభయందు, నందును కురువృద్ధుల బుద్ధులందు నతనికి నీతిమంతుఁడని శౌర్యవంతుఁడని యెంతటి ప్రచారము జరుగును! పైకిఁ బలుకలేదు. కాని సర్వమును గమనించి తమ్ముల – నందఱను, కాదు, ముఖ్యముగ భీముని – బలవంతపెట్టియైన నొప్పించి గంధర్వుల పైకిఁ బంపి గెల్పించి దుర్యోధనాదుల విడిపించి వారిని మఱియొక సుసమయమునకై నిలుపుకొనినాఁడు.

సాటిశత్రువుల యెడ నిట్టిమార్గమే యార్యనీతి. శత్రువుల యెడ వహింపవలసిన యుత్తమమార్గమును సూచించుచు నొక యజ్ఞాత రాజనీతిజ్ఞుఁ డిట్లు పలికినాఁడు.

[141]'మయూరంబ పోలెఁ బ్రియోక్తుల బలుకుచు శత్రుసర్పముల నడంపవలయు; జలంబులఁబోలె భూభృద్విభేదనంబుసేయ నోపియు మృదువు గావలయు; కాలుపఁ దెచ్చు కాష్ఠంబులు దలమోచినట్లు వైరులయెడ నోరుపుగలిగి జయింపవలయు నదీప్రవాహంబు విడఁద్రోవవలయు తీరద్రుమతృణంబులకుఁ బాద ప్రక్షాళనంబు సేయునట్లు చెఱుచునంతకు శత్రునెడ సామంబులే పలుకవలయు'.

ప్రాచీనరాజన్యులకు శత్రుసంహారమొక మహాకృత్యము; కార్యసాధక నీతిశాస్త్రములు వారికిఁ గొన్ని గుణపాఠములు చెప్పినవి. అందొక యజ్ఞాతనీతిజ్ఞుడు పలికిన క్రిందివాక్యము లరినిషూదనక్రియల యందును నర్థవంతము లైనవి.

'రాజులకు సర్వకార్యంబులు మంత్రపూతంబులు కావున బుద్ధిసహాయులఁ గూడుకొని యుండవలయును. బుద్ధిసహాయులు ధనార్జకులు రణశూరులు నాదియగు కార్యపురుషులు కార్యకాలంబ కూర్తుమనుట గృహదాహం బగువేళ నూతి కుపక్రమించుట. వారికి వలయు ధనంబు లిచ్చుట సుక్షేత్రంబున విత్తనంబు బడినయట్లు. విభవం బెంతగల్గినను భోజన సహాయులు కల్గుదురుగాక కార్యసహాయులు కల్గనేర్తురే? మఱియు మూర్ఖుండు కార్యసహాయుఁడగుట యంధుం డంధునకుఁ దెరువు చూపిన యట్లు. వారివలన నొక కార్యంబు గల్గిన నది కాకతాళంబు, ఘుణాక్షర న్యాయంబును నగుగాని యథార్థంబు గాదు. రాజు చేపట్టిన మూర్ఖుడైనఁ గార్యవేది యగు ననందగదు. శివుండు గళంబున ధరియించిన కాలకూటం బమృత మగునె? మూర్ఖునందు కార్యంబిడుట తన్నుఁ జంపు రక్కసునిఁ దాన సృజియించుకొనుట. విఘ్న భయంబునఁ గార్యంబు విడచుట తొడుగు గలుగునని యారంభంబు విడచుట యజీర్ణంబగునని యాహారం బుజ్జగించుటయును...'

మన భారతీయ విజ్ఞాను లిట్టి సామాన్యధర్మములు గాక శత్రువుల యెడఁ బ్రయోగింపఁదగిన షాడ్గుణ్యములను, కూటప్రకాశ యుద్ధస్వరూపములను వ్యూహవిధానమును మిత్రనీతుల మూలమున నిరూపించి ప్రాచీన రాజన్యులకు శత్రుమారణతంత్రమున మహనీయ ప్రబోధమును కావించిరి.

[142]ఎరిస్టోఫాని సను గ్రీకుతత్త్వవేత్త శత్రుభయము మూలమున మానవజాతియం దంతియ కాదు సమస్త ప్రాణికోటియందును సృజనాశక్తి యభివృద్ధి నొందినదని ప్రవచించినాఁడు. ఈ ప్రవచనమున ననంతసత్య మభివ్యక్తమగుచున్నది. శత్రువుల మూలమున సముద్ర గర్భమునఁ జరించు జంతువులఁ గొన్ని ఖడ్గములవంటి దంతములఁ బెంపొందించుకొనినవి. 'సన్ ఫిష్' శత్రుభయమువలన నెంతయో బరువెక్కుచున్నది. క్రిమికీటకములు వాతావరణమును బట్టి వర్ణమును మార్చు కొనుటయును, వాయుపథాంచలముల కెగసిపో రెక్కలఁ బెంచుకొనుటయును, నూతనకంఠధ్వనులఁ గల్పించి మోసగించుటయును నేర్చుకొనినవి. సూక్ష్మదృష్టితోఁ బరిశీలించిన నేఁటి నాగరకతలో బహుళాంశము రిపుభయ మూలమున రూపొందినదని విస్పష్టముగఁ జెప్పవచ్చును. చైనావారికి శత్రుభయము లేకున్న జగద్విఖ్యాతి నొందిన

చైనాఘనకుడ్యము నిర్మితమై యుండెడిది కాదు. బౌద్ధాదిమతములు మనోహర శిల్పములతో మానవ హృదయముల నాకర్షించుటకు శత్రుభయమే కారణము. ఆంగ్లేయులు నౌకాయానమున నగ్రగణ్యులగుటకు వీలు కలిగెడిది కాదు. రాక్షసులు లేక దేవతలు భాసింపనట్లు శత్రువులు లేక శక్తిసంపన్నులు భాసింపరు. ఒకనికి శత్రువు లధికమనిన నతఁడు శక్తిమంతుఁడని వెల్లడి యగుచున్నది. దేశములు జాతులు నైననిట్లే.

'నీ కేఁబదిమంది మిత్రులున్నను జాలదు. ఒక శత్రువునైఁన దప్పకఁ జూచుకొను' మని యిటలీ దేశమునందొక నీతి. మన దేశమున శత్రుశేషములు ఋణశేషమును మిగుల్పరాదని మఱియొక నీతి. ఋణమొనర్చుటయె తగనిపని. అయినను ఋణశేషము వలన నొక ప్రయోజనమున్నది. వీనిని బూర్తిగఁ జెల్లించిన, బుట్టని ఋణము ఋణ శేషమువలనఁ బుట్టుచున్నది. దీని నివ్వకున్న మొదటి దాని కేమి మొప్పము కలుగునోయను భయమే యిట్టి ఋణము పుట్టుటకుఁ గారణమై యుండవచ్చును. శత్రుశేషము వలన నిట్టి విశిష్ట ప్రయోజనములు సూక్ష్మముగ నాలోచించినఁ గన్పింపకపోవు.

సాటిశత్రువుల విషయమున 'బ్రతికి బ్రతుక' నిమ్మనునది యత్యుత్తమ నీతి. అయిన నతని విషయమున నతిజాగరూకత వహింపవలసిన మాట సత్యము. కనులు మూసికొనిన నెంతటి చతురుఁడైన 'నష్టవిధ నిరయముల' లోని కష్టములకుఁ బాలగుట తప్పదు.

శత్రుగుణముల మెచ్చుకొనుట యుదాత్తుని లక్షణములు, 'శత్రోరపి గుణా వాచ్యా వాచ్యా దోషా గుణోరపి' అనునది దేవభాషాసూక్తి. ఇట్టియుదాత్తతకుఁ బురుషోత్తముఁడొక యుత్తమోదాహరణము. అనేకములతోఁబాటు శత్రుగుణముల మెచ్చుకొనఁగల 'సహస్రాక్షుఁ' డను సాహసముననే పూర్వము ముజ్జన్మల లభించు మోక్షమాసించి జయవిజయులు 'వైరభక్తు' లైనారు.

'సంశయాత్మా వినశ్యతి' యని భగవానుఁడు గీతలోఁ బ్రవచించినను సంశయించుట మానవజాతికి నైజమైనది. శత్రువు గర్హణయోగ్యుఁడు కాఁడని యెన్ని ప్రబోధముల వినినను మానవులొకరీతి 'మాయావరణము' నుండి బయటపడ లేకున్నారు. శత్రువును గూర్చి జిజ్ఞాస యొనర్చి 'నేతి నేతి' విధానమునఁ దర్కించిన శత్రువెవఁడు?

'ఈర్ష్యాపరుఁడైన శత్రు వర్థరహితుఁడైన మిత్రుని కంటె నధికుఁ' డని షిల్లరు మహాకవి సెలవిచ్చినాఁడు. ఇందలి మహార్థము సామాన్యదృష్టికి సహజముగ గోచరించకపోవచ్చును. శత్రుత్వమున కీర్ష్య మూలబీజము. ఇది జ్ఞాతముగ నైన నజ్ఞాతముగనైన వృద్ధిపొందుచున్న కొలఁది నుభయపక్షముల సృజనాశక్తి వృద్ధియగును కదా! ఏ యుగమునందైన నత్యుత్తమ కళాసృష్టి జరిగినదన్నను, శాస్త్రార్థవివేచన విజృంభించినదన్నను వాని కభివ్యక్తముకాని యీర్ష్య మూలాధారమై యుండును.[143] 'ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీ యుర్వి న్పురాణావళుల్ దెనుఁగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు తా నెట్టిదో తెనుఁగుం జేయరు మున్ను భాగవతము న్దీని న్దెనింగించి నాజననంబు న్సఫలంబు సేసెదఁ బునర్జన్మంబు లేకుండగన్" అని నిగర్వశిరోమణిగఁ బలికిన సహజ శేముషీ ధురంధరుఁడగు పోతనామాత్యుని యందైన నిట్టి యిర్ష్య యుదయించి యుండక పోదు. ప్రయోజనకరమగు నీర్ష్యకొక చరిత్ర పుట్టిన నెన్ని వైచిత్ర్యములున్నచో, దానివలనఁ బ్రపంచ మెట్టి ప్రయోజనములఁ బొందినదో వ్యక్తమైయుండెడిది. అయిన నట్టి చరిత్ర పుట్టుట కవకాశము లేదు.[144]'సత్యముతోఁ దాఁ జేసిన పరిశోధనలఁ' జెప్పఁగల ధైర్యసాహసములు మహాత్మునకు దప్ప మఱి యెవ్వరికిఁ గలవు! అర్థరహితుఁడైన మిత్రుఁడు మనకే రీతి నుపయోగకారి కాఁడు. అతని యర్థరహిత నిత్యసాంగత్యము వలన మనపైఁ బ్రభావము నెఱపఁబూనిన నిరుపమానమైన ప్రమాదము సంభవింప వచ్చును; మన యుదాత్తాశయములకు 'స్వస్తిఁ' జెప్పుట తటస్థింప వచ్చును. ఈ కారణములచే నర్థరహితుఁడైన మిత్రునికంటె నీర్ష్యాపరుఁడైన శత్రు వత్యధికుఁడను నంశము నిర్ధారితమగుచున్నది.

మిత్రు లెల్లవేళల మనలోని మంచి నాలోచించెదరు. శత్రువులు నిత్యమును లోపముల వెదకి లోకముఖమున బహిర్గత మొనర్చెదరు. భంగ్యంతరముగ దోషముల గ్రహించి సవరించుకొన నవకాశము కల్పించునది మన శత్రువులు. మనలో 'నేకలవ్యత్వ' మున్న శత్రువును 'ద్రోణగురువుగ' స్వీకరించి వారిమూర్తుల ధ్యానవరద ముద్రలతో [145]దక్షిణామూర్తి స్వరూపులుగ 'పర్యంకాసన' మున నిల్పి, పూజించి, శిరము మోడ్చి 'శక్తిపాతము' ను బొందుట చతురత, రసికత, యుదాత్తత, యుచితజ్ఞత!

'బలవంతుఁడ నాకేమని పలువురతో నిగ్రహించి పలుకుట మేలా!' యని నాఁడొక శతకకర్త. ఈ రీతిగ వ్యవహరించి యర్థరహితమైన శత్రుత్వములఁ గల్పించు

కొనుట యభ్యుదయ పరంపరలఁ జేకూర్చునని యెవఁడు చెప్పఁగలడు? ఇట్టి శత్రుత్వములును బ్రయోజనరహితములు. శక్తిసంపన్నుఁడైన శత్రువే ప్రయోజనకారి. అతఁడె మన 'మూలశక్తి'. అతఁడె మన కెత్తని కీర్తిధ్వజము! అతఁడె మన కీర్తిలతల 'నేడు వారాశుల కడపటి కొండపైఁ గలయఁ బ్రాకించు' దోహదకారుఁడు!!

తాత్కాలిక శత్రుత్వ మిత్రత్వములు గ్రహములకె కాక మనకు నున్నవి. ఇట్టి స్థితులలో సహజశత్రువును, సహజ మిత్రమును గమనించుట కష్టము. ఈ సంధిసమయములఁ గొన్ని సందర్భములలో మన [146]కస్తంగతత్వము పట్టుటయుఁ గలదు. 'అన్యోన్యవీక్షల' వలన లోకమున కనామయమగుటయుఁ గలదు; ప్రళయ మగుటయు కలదు.

'నీచేత నపకారమును బొందిన శత్రువుకంటె నీకపకారము చేసిన శత్రువు బలవత్తరమైనవాఁ' డని యొక తత్త్వవేత్త పలికినాఁడు. ఈ యిరువురి యందును మొదటివాని కట శత్రుత్వము స్వతస్సిద్ధ మైనది కాదు. అతని హృదయక్షేత్రమున నా బీజమును నాటినవాఁడవు నీవు. అది యటుపిమ్మటఁ బెటిఁగి యుండవచ్చును. రెండవాని యందు శత్రుత్వము దానియంత నది పడి మొలకెత్తి పెరుగుచున్నది. అట్టి శత్రువును గూర్చి శ్రద్ధాళువునై యున్న నీకెట్టి ప్రమాదమును లేదని పై తాత్త్వికుని భావము.

ఒకానొక యాంగ్లకవిపుంగవుఁడు 'శత్రువులు మన బాహ్యాత్మ' లని భావించి నాఁడు. ప్రేమార్ద్రతవలననో లేక స్వతస్సిద్ధముగ లోపముల గుర్తింప నశక్తులగుట వలననో మిత్రులు మేలుచేయలేక పోవుచుందురు. శత్రువులు వానిని బట్టబయలు గావించి విజయగర్వమునఁ బట్టము గట్టుకొనుచుందురు. అందుచే వారు మన గుణముల గ్రహించుటకు యత్న మొనర్పరని కాదు. ఈ విషయమున 'నీ గుణములఁ బైకి మెచ్చుకొనునది నీ మిత్రులు అంతఃకరణమున మెచ్చుకొనువారు నీ శత్రువులు' – అను రవీంద్రగురుదేవుని వాక్యమున ననంతసత్య మంతర్భూతమైయున్నది.

కావున శత్రువును గూర్చి జంక నగత్యము లేకుండుటట్లుండఁ గీర్తిప్రతిష్ఠలు గోరువా రరివర్గము నర్థమొనర్చుటకు యత్నింపవలయు ననియు, నాశన మొనర్చుతటి నానారీతు లవలంబింప వలయుననియు, నొక శత్రువైన లేనివాఁ డతని వలనఁ గలుగు ప్రయోజనముల గమనించి యెంత విలువనైన నిచ్చి విలిచికొన వలయు ననియు వ్యక్తమగుచున్నది.

శత్రువు మానవమానసరత్నాకరమున లభించు నొక యమూల్యరత్నము. సానఁబెట్టిన పిమ్మట నందుఁ దోఁచు ననంత కోణకాంతిచ్ఛటల దర్శించి యర్థమొనర్చుకొనఁ గలిగినవాని కాశ్చర్యము గాని, యావేదన గాని కలుగదు. దాని నొక యమూల్యవస్తువుగ గ్రహించి నిజమానస వస్తుప్రదర్శనశాల యందు భద్రపఱచి పరిశీలించుచుఁ బరమ ప్రయోజనమును బరమానందమును బొందు నతఁడొక మహత్తర సాధకుఁడగుట శంకాశూన్యమైన సత్యము.

# నవ్వు

'నవ్వు నాలుగందములఁ జేటు' – ఈ వాక్య మేనాఁడు పుట్టినదో! ఏ సందర్భమునఁ బుట్టినదో!! దీనివలన నవ్వవలదని మన వారి యనుశాసనము కాదు. 'బాలసఖత్వమ కారణ హాస్యం స్త్రీషువివాద మసజ్జన సేవా... షట్సు వరోలఘుతా ముపయాతి' అనిన నీతి వాక్యము వలన నకారణ హాస్యము ప్రమాదకరమైనదని యార్యులు పరిగణించిన ట్లర్థమగుచున్నది. బాలురతోఁ జెలిమి, కారణము లేని నవ్వు, స్త్రీలతో వాదులాడుట, దుష్టజనసేవ, గార్ధభయానము, సంస్కారవిరహితమైన భాష – యీ యారును మానవుని, జులుకనఁ జేయునఁట!

ఇతరములైన యైదింటి మాట యెట్లున్న నవ్వుమాట నమ్మఁదగినది. ప్రాకృతులు కొందఱు పెద్దపెట్టునఁ గారణవిరహితముగ నవ్వుచుండ వారిపై నర్థముగాని జాలిగలుగుట సహజము. దాని పర్యవసానమొక చిఱునవ్వు. భరింపరాని దుఃఖము ప్రౌఢమైన హాస్యముగ మారునని తాత్త్వికుల యభ్యూహము. ఈ కారణముననే మహాకవి బైరను 'నేనే ప్రాణిని గూర్చియైన నవ్వితినన నది యేడువలేక' యని యొక సందర్భమునఁ బలికినాడు.

జంతుకోటి దుఃఖ సమయముల నేడ్వగలవు; కాని సంతోష సమయముల నవ్వఁ జాలవు. సమస్త చరాచర ప్రకృతియందును నవ్వఁగలిగినది మానవుఁడొక్కడే. ఇతఁడొక్కఁడే యేల నవ్వఁగలుగుచున్నాఁడని ప్రశ్నించుకొని నీచే యను జర్మను తాత్త్వికుడు "లోకమున నతనివలె బాధపడు ప్రాణి మఱియొకటి లేదు కనుక" అని సమాధానము చెప్పుకొనినాఁడు.

ఇతర ప్రాణి లోకముకంటె మానవుని యాధిక్యమును నిరూపించు నుపపత్తులలో నవ్వు గణనీయము. ఇది మానవజాతికి సర్వసామాన్య మయ్యును దీని తత్త్వము నొక జాతివారు గమనించినట్లు మఱియొక జాతివారు గుర్తింపలేరు. చైనా జాతివారు చెడువార్త వినినపుడు చింతించుటకుఁ బ్రతిగ నవ్వెదరఁట! మరణవార్తలు వినినపుడు మిథ్యావిషాదమునైన బ్రకటింప వలసియుండ బంధువర్గములకు శవపేటికల నిచ్చి బహూకరించుచు విలాసములఁ దేలి యాడెదరఁట!! రష్యను జాతివారు తమ్ముఁ దాము పరిహాసమొనర్చుకొనఁ గలరఁట!!

వ్యక్తిపరముగ నాలోచింపఁ గొందఱు స్వల్పమునకైన నవ్వెదరు. కొందరెట్టి విశేషము గోచరించినను నవ్వలేరు. కొందఱు నవ్వుట తమ ప్రౌఢిమ కొక లోపమని భావింతురు. అట్టివారినిఁ గనినపుడు "అయ్యో! వీరు దుఃఖమును నిర్లక్ష్యము చేయఁగల హాస్యము నవగత మొనర్చుకొనుట లేదే!" యని కరుణ కలుగును. అతిగ నవ్విన వారిని గనినను, నవ్వనిచ్చగింపనివారు గనినను నిరువురకు దాని తత్త్వము బోధపడలేదని యర్థమగును.

నవ్వు హృదయ దుర్గమునకు ద్వారము. తన్మూలమున వ్యక్తి హృదయ మెట్టిదో తేటపడఁగలదు. ఈ కారణముననే మహాకవి గోథె "యెవ్వరినైన నవ్వదగ్గ వస్తువు లెవ్వియని ప్రశ్నించి యతఁడిచ్చు సమాధానములఁ బట్టి యతఁడెట్టి వాఁడో నిశ్చయింపవచ్చును. మానవ స్వభావ నిరూపణమునకు నవ్వుకంటె మఱియొక నమ్మకమైన సాధనము లే" దనినాఁడు.

ఈ సందర్భమునఁ 'బసిపిల్లల గులాబి లేనవ్వుల భరింపలేని వాని గుఱించి భద్ర' మనిన యొక తాత్త్వికుని ప్రవచనము విశేషముగ గమనింప యోగ్యమైనది. అట్టి మానసిక ప్రవృత్తిగల వాఁడెట్టి క్రౌర్య, నైచ్యములకైనఁ బాల్పడఁ గలఁడని యతని యభిప్రాయము.

నవ్వుకు విలువ కట్టుట కష్టము. అందుకుఁ గల కారణమది యనంతమగుటయే. ఈ విలువ నవ్వు వాని శక్తిని బట్టియు, సమయమును బట్టియు, స్వీకరించు రసికుని హృదయ సౌశీల్యమును బట్టియు మాటిమాటికి మారిపోవుచుండును. నవ్వునకుఁ జరిత్ర పుట్టియున్న నెంత బాగుండెడిది! ఆ చరిత్ర నించుక యూహించిన నెందఱు [147]క్లియోపాత్రల నవ్వులు స్నిగ్ధహృదయులైన సమ్రాట్టులఁ బ్రేమపాశబద్ధులఁ గావించినవో! ఎందఱు గురుదేవుల చిన్మయ హాసములు విజ్ఞానాభిలాషుల మనోంబుజముల వికసింపఁ జేసి యనంత జ్ఞానోపదేశ మొనర్చినవో!! ఒక న వ్వూషర క్షేత్రమున నుజ్జ్వలోజ్జ్వల మహా సామ్రాజ్యముగ దిద్దియుండును! ఒక నవ్వు మహిమోపేతోద్యానమును మరుభూమిగ మార్చియుండును!! ఒక దేవత శరదిందు వికాస మందహాస! మఱియొక దేవత కరాళ దంష్ట్రావికటాట్టహాస!!

చిఱునవ్వు చిన్మయమైనది. హాస మసహ్యాకరమైనది. అట్టహాసము భయంకరమైనది. వికటాట్టహాసము ప్రళయభీకరమైనది. నవ్వున షడ్విధ విభేదముల భారతీయులు గమనించినారు. 'స్మిత మిహ వికసిత నయనం, కించి ల్లక్ష్యద్విజంతు

హసితం స్యాత్, మధుర స్వరం విహసితం సశిరః కంపస్మిత ముపహసితం, అపహసితం సాక్షం విక్షిప్తాంగమ్' అని సాహిత్య దర్పణకారుcడు. అతని మతమున మొదటి రెండును నుత్తమములు, కడపటి రెండు నధమములు. బౌద్ధులు వీనికి మఱి రెంటిని చేర్చి నవ్వేనిమిదివిధము లనినారు.

వయస్సునుబట్టి, వారి సాంఘిక స్థితిగతులను బట్టి నవ్వు నెన్ని రీతులనైన విభజింపవచ్చును. స్థూలముగ నవ్వు సర్వసామాన్య మానవ సంఘమున నుదాత్తానుదాత్తములనెడి ద్వివిధ విభేదములతో నొప్పుచున్నది. సంభాషణ సందర్భముల నుదాత్త వర్గములం దుత్తమహాస్య మనుదాత్తమును జయించినట్లు కన్పించును. కాని సర్వసామాన్యముగ దీనికి వైపరీత్యమే లక్షణము. ఇందువలన నుత్తమ హాస్యము కరుణాత్మకమై యుండుననియును, నీచహాస్య మల్పత్వము వలన జన్మించు ననియు నొక తాత్త్వికుcడభిప్రాయమి చ్చినాcడు.

మంద యర్థము లేని నవ్వు నవ్వును, ఉదాత్తవ్యక్తి యుత్తమ హాస్యమునకే దీర్ఘముగ నిశ్శ్వసించును. ఘనహాసములకు నిశ్శ్వాసము తోcబుట్టువు. ఆనందకరమగు హాసమా భావుకుc దూహించినరీతి దయార్ద్రహృదయము నుండిగాని బహిర్గతము కాదు.

ప్రపంచమున నిత్యమును నవ్వు నవ్వులలో నుత్తమమైన జాతికిc జేరినవి మిక్కిలి యరుదుగ నుండును. ఇట్టి వైచిత్రి నెఱిcగినవాc డగుట వలననే థాకరీమహాశయుcడు 'ఒక మంచినవ్వు గృహమునకు భానూదయ' మని యనవలసి వచ్చినది. బుద్ధిని గిలిగింతలు వెట్టcగలిగిన నవ్వుకంటె రమణీయమైన వస్తు వే లోకమున నున్నది? 'లలితమైన హాస్యము జాతి కుపనిషత్తు వంటిది' ఇది సూత్రప్రాయముగ సునిశితముగ విజ్ఞానమును బ్రసాదింపcగలదు. దీనియందే జాతి మానమర్యాదలు నుచ్చనీచలు హావభావములు ప్రతిఫలించుచుండును. ఒక జాతి హయహేషితమును బోలి నవ్విన దాని హృదయకాఠిన్యమును గూర్చి, ప్రాకృతస్థితిని గూర్చి వేఱుగc బలుక నగత్యము లేదు. నవ్వలేక జంతుకోటివలెc గేవల మేడ్వcగలిగిన నా జాతి మరణస్థితి ననుభవించుచున్నదన్న మాట!

నవ్వునకు శబ్దమున్నది; రూపమున్నది. అందుచే నది కనుపించును; వినిపించును. నవ్వులలో మధురమైనది విమలమైనది కన్యకల ముగ్ధహాసము. ఇట్టి కమనీయహాసమును గని మనమునc జొక్కి డిక్విన్సీ యొకమాఱు 'సృష్టిలో నున్న మధుర కలధ్వనులలో మంజులమైనది కన్యకల కమనీయహాస' మనినాcడు.

కనుపించు నవ్వులలో 'నానందసూత్రార్థముల నన్వయించు తపస్వి' పసిపాప చారుస్మితహాస ముత్తమోత్తమమైనది. విందుసందర్భముల హాస్యచతురుల సంభాషణ నైపుణ్యమువలన వినిపించుచుఁ గనుపించు హాస్యములు కేవల 'స్వరమేళలు'. అన్నిటికి నేకాన్వయము గోచరించును.

నవ్వు వలనఁ గలుగు ప్రయోజనముల గుర్తించిన వ్యక్తి నవ్వుటకుఁగాని నవ్వించుటకుఁ గాని వెనుదీయఁడు; హాసమును దృఢీకరించి శిలాప్రతిమయై 'శిష్టుఁడ' ననుకొనఁడు. జగత్తత్త్వము నవగత మొనర్చుకొని యాలోచించువానికి విషాదాంత రూపకముగ ననుభవించువానికి నది యొక హాస్యనాటకముగ నెసఁగును.

మానసిక శాస్త్రవేత్తలు నవ్వునకు మూలకారణము సంతోషమనిరి. అగుచో మనకు నవ్వు గల్గించు నంశము లన్నియు సంతోషప్రదములు కావు. వికార వేషములు, విపరీత చేష్టలు, విరుద్ధభాషలు మనకు నవ్వు పుట్టించుట లోకానుభవము. నాటక రచయితలు విరూపములగు పాత్రల సృజించి వారి రూప చేష్టాదికముల మూలమునఁ బ్రేక్షకుల నవ్వింతురు. పరిహాసకులు నీ మార్గమునే యనుసరించి యన్యులకుఁ బ్రమోదము కల్గింతురు. కావున నవ్వు కలుగవలెనన్న నాంగి కాహార్య వాచి కాభినయముల నెటనో యొకట 'వికార' ముండి తీరవలయును. అందువలన సాహిత్యదర్పణకారుఁడు 'వికృతాకార వాగ్వేష చేష్టాదే ర్కుహకాభవేత్ హాస్య' మని హాస్యస్వరూపమును నిరూపించినాఁడు. వాగంగాది వికారాదులను జూపుటవలనఁ బ్రేక్షకులలోఁ బుట్టిన చిత్తవికారరూపమైన వృత్తివిశేషమే హాసమని [148]పండిత జగన్నాథరాయలు 'వాగంగాది వికార దర్శన జన్మా వికాసాఖ్యోహాసః' అనుచోట వ్యక్త మొనర్చినాఁడు.

కొందఱు మానసిక శాస్త్రవేత్తలు దీనికి భిన్నముగ వికృత వస్తువులను జూచుట వలనఁ గలుగు హృదయవేదనను వెలికి రానీయకుండుటకో, లేక మఱచుటకో నవ్వు పుట్టుచున్నదని నమ్ముచున్నారు.

మనస్సు క్లేశమునొంది యున్నవేళ నే చమత్కృతినో యొనర్చి నవ్వించెడి వ్యక్తి యెవరైన వచ్చిన నెంత బాగుండుననిపించును. అట్టిస్థితియందు నవ్వు పుట్టించు వస్తువులు కన్పించిన నొక్కించుక శాంతి చేకూరినట్లు తోఁచును. దీనినిబట్టి యొక విధమగు శారీరక మానసిక వ్యథలనుండి యుద్ధరింపగల శక్తి నవ్వునకున్నట్లు ద్యోతకమగుచున్నది. వాయుకోశములఁ బరిశుభ్ర మొనర్చుట, క్రమముగ రక్తప్రసరణము సాగునట్లు చూచుట, నవ్వునకుఁ దెలియునని వైద్యశిఖామణుల

యభిప్రాయము. నవ్వత్యద్భుతము నత్యావశ్యకమునైన వ్యాయామము. జీర్ణశక్తి నభివృద్ధినొందించు హరీతకి. 'మౌనేన భోక్తవ్యమ్' – అను సిద్ధాంతము ననుసరించి శిష్టులుకాని యితర సంపన్న గృహస్థు లీ కారణముననే భోజన వేళల హాస్యచతురులను బంక్తిపావనుల కిచ్చునంతటి గౌరవమిచ్చి ప్రక్కనఁ గూర్చుండబెట్టుకొనుచున్నారు. ఇట్టి యాచార మాంగ్లదేశము నందునున్నది. ఇది వైద్యశాస్త్ర సమ్మతమైనదని యొక యాంగ్లరచయిత యనినాఁడు. మౌనమున భోజనమొనర్చు శిష్టులితర వేళల విదూషక విప్రవినోద వికటకవుల హాస్యచతురోక్తుల నోలలాడి శరీరారోగ్య మును గాపాడుకొనెదరు.

హృదయపూర్వకముగఁ గొంతకాలము నవ్విన పిమ్మట నెంతటి తీక్ష్ణభారమునైన వహించుటకు శరీరముగాని, మనస్సుగాని వెనుదీయకుండుట యనుభవపూర్వకమైన యంశము. ఇందుకు మూలకారణము నవ్వునకుఁగల యప్రతిమాన శక్తి సామర్థ్యములగుట యనామృష్టమగు నభిప్రాయము.

శిశువులు భీతిని గుప్తమొనర్చుటకు నవ్వుదురఁట! ఇతఃపూర్వము వారనుభవింపని యనుభూతిని బొందుట వలనఁ గలుగు నవ్వు భయమూలక మని మానసికవేత్త లూహింతురు. బిడ్డలఁ దొలుత నిశ్రేణిక నెక్కించినను, బిల్లిమొగ్గల వేయించినను గలుగు నవ్విట్టిది. ఎట్టి యొడుదొడుకులు లేక జీవయాత్రలో మధుసాంయాత్రికుఁడై వ్యవహరించు వ్యక్తి ముఖము సర్వకాలసర్వావస్థలయందును వికసిత పుష్పాకృతిని విలసిల్లును. ప్రాప్యయోగ్య వస్తువులఁ బొందువేళఁ బడు నుత్కంఠయు నొక్కొక్కవేళ హసనకారణమగును. అల్పపరాభవముల, నల్పాపజయముల జితునకు, జేతకు నవ్వు కలుగుట సహజలక్షణము, ఒక పదమునకుఁ బ్రయోక్త యనుకొనిన యర్థముగాక భిన్నార్థము గోచరించినను, గౌణవృత్తిచేఁ శబ్దప్రయోగ మొనర్చినను నవ్వు గలుగుట కొన్ని సందర్భముల మనము గమనించుచుంటిమి. బాల్యచేష్టలు జ్ఞప్తికి వచ్చినయెడ నర్థరహితము లగు కృత్యములని వాని నవజ్ఞ యొనర్చుచుఁ బ్రౌఢవ్యక్తి యేకాంతమున మందస్మిత మొనర్చును. 'పిచ్చియద్దము'లఁ జిత్రవిచిత్రములైన నిజరూపములఁ దిలకించినపు డెంతటివానికైన హాసముద యింపకపోదు. విచిత్ర ధ్వనులు వినఁబడుటవలనను నవ్వు పుట్టును. అలవాటుపడిన యాకారప్రకారములు నలవాటులు కనిపించునపు డాశ్చర్యముతోఁబాటు మందహాసములు జన్మించుటయుఁ బరిపాటి.

పండితపరిషత్తులఁ బ్రసక్తి లేక ప్రవేశించిన వ్యక్తి 'బదరీఫలతరువు క్రిందఁ గూర్చొనిన యంధునివలె' నవ్వును. ఇట్టినవ్వు తన లోపమును గప్పిపుచ్చుకొను

యత్నమని మానసికవేత్తలందురు. మనను మనము గీరుకొనినపుడు హాస్య ముద్భవింపదు; ఇతరులు గీరిన నవ్వు పుట్టును. ఇది మానసికమైనది. శారీరకమైన సర్వకాల సర్వావస్థల నిది యుండితీరవలయును గదా!

నవ్వును గూర్చి నానాసిద్ధాంతములు బయలుదేరినవి. మానవుఁడు నిత్యజీవితమునకుఁ గొంతశక్తిని వినియోగించును. అంతకంటె మిక్కుటమైన శక్తి యతనియందు నిగూఢమై యున్నది. అట్టిశక్తి కొన్ని కారణముల వలనఁ బొంగిపొరలుటచే నవ్వు కలుగుచున్నదని [149]హెర్బర్టు స్పెన్సరను తాత్త్వికుని యభిప్రాయము. ఒక పట్టుపై వ్యవహరించు మనస్సునకుఁ గొంతగ శ్రమ తగ్గించుటయే దీని ప్రయోజనమని యతని యూహ. అన్న స్నాయువుల నించుక సడలించుటయే దీని ప్రాధాన్యమన్నమాట!

బాలబాలికలు స్వేచ్ఛానుభవములతోఁ గ్రీడించుచుఁగిలకిల నవ్వుచుందురు. ఇట్టి నవ్వుపై తాత్త్వికుని యభిప్రాయము ననుసరించి యధికశక్తిని బహిర్గత మొనర్చుట యనుట పొసఁగదు. మానవుడు కేవలము యంత్రమువలె శ్రమించు కాలమునను నవ్వు కలుగుచున్నది. ఇటువంటి నవ్వులవలన నొకనియమము, సాంఘికనీతి కలుగుచున్నదని [150]బెర్గసన్ అభిప్రాయము. ఇతని యభిప్రాయమును గ్రహణ యోగ్యమైనది కాదు. నవ్వు కేవల మధికశక్తి నిరూపకమనిగాని, సంఘనియమమని గాని, యంగీకరించిన దానిని సహజావబోధముగ గమనించుచున్నామన్నమాట!

నవ్వు సహజావబోధము కాదు. దీనికి సాంఘికమైన సమ్మతి యవసరము. ఒక సంఘము నవ్వినట్టు మరియొక సంఘము నవ్వదు. ఒక సంఘము చూచిన నవ్వువచ్చు వస్తువుల నాచారములఁ జూచి మఱియొక సంఘము నవ్వదు. పరిహాస యోగ్యములైన వస్తువులను, పాత్రలను నవ్వు బహుకాలానుభవమును బట్టి నిర్ణయించును. ఇందుకు జనశ్రుతి యాధారము. జనశ్రుతి మూలమున నర్థమొనర్చుకొనిన హాస యోగ్యమైన పాత్రలు వస్తువులు కనుపించి నపుడు పూర్వవిజ్ఞాన మూలమున నవ్వు కలుగును. హాస్యమును గూర్చి యెట్టి సిద్ధాంతమొనర్పవలసినను నాద్యముగ గమనింపవలసిన దీ సాంఘికాంగీకారము.

ఇతరుల యసభ్యతావ్యక్తతలఁ జూచిన మనకు హాస్యముదయించుటచే నవ్వు మన యాధిక్యమును నిరూపించునొక సాధనమని కొందఱి యభిప్రాయము. కొందఱు సామాన్య జనులకంటె నున్నతులమని నిశ్చయ మొనర్చుకొనినవారును, సత్యమున కధికులైనవారును బ్రాకృతజనముతోఁ బాటు సమస్త సందర్భముల శ్రుతిగలిపి

నవ్వలేరు. అట్టివారిని జూచి సామాన్యజనము భయపడుట, యసహ్యించుకొనుటయు సహజము.

శరీరమునకును నవ్వునకును సన్నిహిత సంబంధమున్నది. నవ్వు శారీరకమని నమ్మిన శాస్త్రజ్ఞులు నున్నారు. సాంఘికాంగీకార మననేమో యెఱుఁగని పసికందులు కపోలముల ముట్టినంతనే పెద్దపెట్టున నవ్వుదురు. ఇది నవ్వు శారీరకమని వాదించు వారికిఁ బ్రబలబలము. సంఘమువలనఁ గలుగు బాధలనుగాని, తదితరములైన వ్యక్తిగతబాధలనుగాని యపనయించుట నవ్వు సహజముగఁ జేయు పనికాదని వీరి వాదము.

అయిన వారు మానవుఁడు బాధను బోగొట్టుకొనుట కొకసాధనముగ నవ్వు నుపయోగించుకొనుచున్నాఁడను నంశమున నితరులతో నేకీభవింతురు. మానవుఁడు నవ్వను సాధనమునకు సురమ్యమగు రూపమును సృష్టించి దానికిఁ గళాత్మకమగు జీవనమును బోసి వివిధరీతులలో నుపయోగించు చున్నాఁడు. అందువలనఁ బ్రపంచమున వివిధదేశముల వివిధ సాంస్కృతిక ప్రవృత్తులలో నున్న మానవునకు సాధనమైన నవ్వను ననంతరూపముల నొందినది. ఒక్కొక్క విభేదమొక్కొక్క జాతికిఁ బ్రాణము పోయుచున్నది. నవ్వు ప్రాణినుండి ప్రాణికిఁ బ్రాకు నంటువ్యాధియైనను నా విభేదము నచ్చుకున్న వ్యక్తి నవ్వఁడు.

ఇతరులు నవ్వుట వినినను, కనినను సామాన్యవ్యక్తి యా ప్రవాహమునఁ బడి యందు బాల్గొనును. ఉత్తముఁడు, సుఖి పెద్దపెట్టున నవ్వదు; చిఱునవ్వులఁ జిలుకరించును; అందముగ నధరాస్ఫాలన మొనర్చును. కనీనికల మిలమిలలతోఁ దనకుఁ గలిగిన కమనీయానందమును వెల్లడిచేయును.

అందఱు గాఢముగనో లేక గూఢముగనో నవ్వగలరు. కాని యందఱును నవ్వింపఁజాలరు. ఇందుకుఁ జతురులు కాని వారు నిష్ప్రయోజకులు. తాను నవ్వులపాలగుచు నితరుల నవ్వింపఁగల నేర్పు హాస్యరసప్రియున కున్నది. ఉత్తమహాస్యరసజ్ఞుఁడు వికారరూపముల ధరించి వికృత చేష్టలనొనర్చి యితరుల నవ్వింప యత్నింపఁడు. వికారముల వలనఁ గలుగునవ్వు నవ్వుకాదు. కేవల వికారములసహ్యకరములు. సరసోక్తి, నర్మోక్తి, ఛలోక్తి – ఇత్యాది విశేషోక్తుల నుత్తమరసికుఁడై హాస్యరసప్రియుఁడితరుల కానందామృతమును బంచిపెట్ట యత్నించును. సంఘమునందలి లోపముల శక్తిమంతమైన తన చతురహాస్యములతో

విమర్శించి, సంస్కరించి నీతి నుపదేశింపఁ బూనుకొను హాస్యజ్ఞులును నుందురు. హాస్యప్రియులకుఁ బ్రతివస్తువును, బ్రత్యంశమును, హాస్యరసాంతర్భూతమై దర్శన మొసగును. అతని చమత్కార ప్రియమైన దృష్టిపడిన ప్రతి వస్తువును బ్రత్యంశమును హాస్యరసోత్కరమై యొప్పును.

ఉత్తమమైన హాస్యమున కుత్తమమైన సంఘ ముండితీరవలయును. సంఘమునందలి సంస్కృతి ననుసరించి హాస్యరసజ్ఞులుత్తమ మధ్యమాధమ హాస్యములతో సంతృప్తిఁ బొందించుచుందురు. తిట్టుకవితల, వికటకవిత్వములఁ బ్రాకృతమునఁ బరిభాషలఁ జెప్పుకొని యానందించు జాతు లనాగరకము లనుట యనుచితము కాదు.

వెక్కిరింపు నవ్వు కాఁజాలదు. 'లలితమైన హాస్యము జాతికి వ్యాఖ్యాన' మని యొక తాత్త్వికుఁ డూహించినాఁడు. నిజము. అది సంఘమునందలి సుఖదుఃఖముల మానమర్యాదల నాచారవ్యవహారముల సున్నితముగ విమర్శించును గదా! సరసోక్తి చతురుఁడైన హాస్యజ్ఞుఁడతని యుక్తి నెవనిపైఁ బ్రయోగించునో యతనిఁ బైకి నవ్వించినను హృదయమున గిలిగింతలు పెట్టి మార్పఁగల శక్తి సంపన్నుఁడై యుండును. 'హాస్య-గంధోళిగాఁ' డట్లుగాదు. ఎదుటివాని కెట్టి ప్రయోజనమును జేకూర్చ లేకుండుటయే గాక తనపైఁ గ్రోధము నసహ్యమును గల్పించుకొని యపకీర్తి పాలగును.

[151]భరతాచార్యుఁడు 'శృంగారానుకృతి ర్హాస్యం' అని ప్రవచించినాఁడు. శృంగారము ననుకరించుటయే హాస్యము. ఇట ననుకృతియన్న సాదృశ్యము కాదు; సాదృశ్యము ననుకరించుట వలన నేర్పడిన వైరూప్యము. సంస్కృతనాటకము లందు సర్వసామాన్యముగ శృంగారనాయకులైన ధీరలలితుల ననుకరింపఁబోయి విదూషకులు వైరూప్యమును బొంది ప్రేక్షకులకు నవ్వుఁ బుట్టించు చుందురు. 'విశేషేణ దూషయతీతి విదూషకః' అను వ్యుత్పత్తి మూలముననే వీరనుకృతులు గారనియు వైరూప్యులనియు వ్యక్తమగుచున్నది. వికృత వేషభాషా చేష్టాదుల వలన వీరు హాస్యరసపోషణమును జేయుచు నాయకులకుఁ బ్రతియోగవ్యక్తులై బ్రవర్తిల్లుచుందురు. సంస్కృత నాటకములలోని విదూషకులు సర్వసామాన్యముగ నాలస్యావహిత్థ నిద్రాదుల వలన నవ్వుబుట్టింప యత్నింతురు గాని, హృదయమును గిలిగింతలు పెట్టింపఁగల చిన్మయహాసముల సృజింపశక్తి గలవారు కారు.

కొందఱు సుప్రసిద్ధనాటక రచయితలు తమ విదూషకులకు విపరీతమగు మేధను బ్రసాదించినారు. ఇందుకుఁ బ్రథమ కారణము వారు సంఘవిమర్శకు లగుటయే యనవచ్చును. మహాకవి కాళిదాసు శాకుంతలములోని విదూషకునిచే 'నేను మృత్పిండ బుద్ధి' నని యనిపించినాఁడు. ఇట్టి యాత్మవిమర్శ విదూషకులకు సహజము. అందుమూలముననే వీరు తమ్ముఁదాము విమర్శించుకొని యవహేళనఁ జేసికొనఁ గలుగుట తటస్థించుచున్నది. ఈ కారణమున విదూషకులు లోక సామాన్యమైన భ్రమప్రమాదములకు లోనుగాని జిజ్ఞాసువులు. సత్యాన్వేషణపరులైన విజ్ఞానభిక్షార్థులు. విజ్ఞానాధి దేవతయైన విఘ్న రాజు హాస్యరసప్రియుఁడు. హాస్యరసాధి దేవత. సిద్ధి బుద్ధియను భార్యలఁ గలిగియు నస్ఖలిత బ్రహ్మచారి. తన తల్లిదండ్రుల వివాహ వేళయందును విఘ్న నాయకుఁడు తన్నుఁ గొల్పించుకొనిన విచిత్ర దైవతము !

జిజ్ఞాసువు నిత్య జీవితమున కించుక దూరమునఁ గూర్చుండి యోచనానిమగ్నుఁడై కనుఁగొనిన నది యొక హాస్యరూపకముగఁ గన్పించును. అందవహేళనలు నతనికి గోచరించును. అతనికి జీవయాత్ర సమస్తమును మందబుద్ధు లొనర్చుకొనునొక విందుగఁ గన్పట్టును. అతఁడు దీనిని బరిహరింపనుంకించును.

పరిహాసకుడందే యుండి విమర్శించుచు సత్యనిరూపణ మొనర్చుటకు శాయశక్తుల యత్నించును. ఈ మహత్తర కార్యమున నతనికి మనోజ్ఞ సాధనము లాశాభంగము నొందిన వ్యక్తులు, ప్రాణులు. వారి జీవితములు అనుకొనినట్లు జరుగక పోవుటయందును హాస్యముత్పన్న మగుచున్నది. జగమునఁ 'దానొకటి దలచిన దైవ మొకటి తలఁపకున్న' విమర్శనకు స్థానమెక్కడిది? హాస్యమున కాధార మెక్కడిది?

అనేక జాతులయందుఁ బుట్టిన హాస్యరూపకములలో నాయాజాతుల యాచారవ్యవహారములలోని కాఠిన్యము, నిర్దయ, నిష్ప్రయోజకత, వైరూప్యములు విదూషకుల మూలమునఁ బరిహాసపాత్రములగుచుండును. సత్యమునకు దూరదూరముగ గమించు వ్యక్తులిట్టి రూపకములఁ బాత్రలగుచుందురు.

'మొట్టమొదటి నాగరిక స్త్రీ ప్రియుని భుజబంధమున నొదిగి పిమ్మట తెలివి నొంది నా దుస్తులు నలి' గిపోయిన వనుకొనుటలో సాంఘిక హాస్యరూపకములు జన్మించియుండునని యొక నాటకసాహిత్యవేత్త పలికినాఁడు. ఇట హాస్యము శృంగార రసము నంటిపెట్టుకొని యుండుటచేఁ బుట్టినది.

భరతాచార్యుఁ డీ కారణముననే 'శృంగా రాద్ధి భవేద్ధాస్యం' అని ప్రవచించినారు. మిగిలిన రసములను హాస్యమంటిపెట్టుకొని యున్నట్లుఁ జూపుట కష్టము కాదు.

కాని హాస్యమునకు శృంగారముతో నున్నంత సన్నిహితసంబంధము తక్కిన రసములతో నున్నట్లు కన్పింపదు. శృంగారము రసరాట్టు. ఇది సమస్తవస్తు సమన్వయ మొనర్పఁ గలిగినది. ప్రకృతి పురుషుల యేకత్వము నీ రసమే నిరూపింపఁ గలుగుచున్నది. హాస్యము దానికి వైరూప్యము. పృథగ్భావము నాశ్రయించి యీ రసము సచ్చిదానందునైన విమర్శింపఁగలదు. 'హాస్యరస దృష్టితోఁ బరికించిన నుత్తమ విజ్ఞాననిలయములైన యుపనిషద్వాక్యములు సహితము పరిహాసపాత్రములు కావచ్చును. విమర్శ హాస్యమునకు జన్మభూమి. అందువలననే మహాకవి మిల్టన్ హాస్యము 'జ్ఞానప్రదాత్రి' యనినాఁడు.

## అనుబంధము

### పుష్పలోకము

1. **అతని సరస –** కవిర్హి మధుహస్త్యః అని శ్రుతి.
2. **సత్యరథమునకు –** కవి ఋతస్య పద్మభిః అని ప్రమాణము, బుద్ధత్వము – బౌద్ధులకు నిర్యాణము చరమసిద్ధి. ఇదియే బుద్ధత్వము.
3. **సాత్మ్యములు :** సహజలక్షణములు; శతపత్రములపై – కాళిదాసు మేఘ. సం. 1, శ్లో. 22
4. **నిఋతి దిగ్వాయుపతి –** శ్రీ విశ్వనాథ ఋతుసంహారము బ్రహ్మ విష్ణు మహేశ్వరులు – మహాకవి భర్తృహరి శతకత్రయిలోని శృంగార శతకమును "శంభు స్వయంభు హరయో హరిణేక్షణానాం, యేనా క్రియంత సతతం గృహ కుంభదాసాః, వాచామగోచర చరిత్ర విచిత్రితాయ తస్మై నమో భగవతే కుసుమాయుధాయ" అను శ్లోకముతో నారంభించినాఁడు.
5. **శంకరపూజ్యపాదులు :** అద్వైతమతస్థాపనాచార్యుఁడైన యాదిశంకరుఁడు
6. **నిర్భిర్త్సిత –** కాళిదాసు కుమార, సం. 3, శ్లో. 53
7. **ప్రౌఢభావ ప్రపూర్ణలౌ –** ఒకకూరా కాకుజా (జపాన్ రచయిత) Book of Tea నుండి గృహీతము
8. **వినఁబడెను సంగీతము :** Heard Melodies are sweet and those unheard off are sweeter still' - Keats 'ode to a Grecian Urn' ఒక యాంగ్లకవి – వర్డ్సు వర్తు (క్రీ.శ. 1770–1850). సుప్రసిద్ధాంగ్ల ప్రకృతి కవి; త్సిన్ చక్రవర్తి: చైనా సార్వభౌముఁడు
9. **పరిపూఁదోటలు :** వసుచరిత్ర ఆ.1, ప. 108

10. **తను ధరణీతటిద్విప్తూతి** – ప్రభా. ప్రద్యు. ఆ. 1, ప. 66

11. **వృషభగతి రగడ** – ప్రబంధములఁ బుష్పాచయముల నీ రగడలఁ గవులు వర్ణించినారు. ఇట వృషభగతి నడకను గూడ సూచించును

12. **'దూసిన నాగమల్లికల'** – శ్రీ విశ్వనాథ 'మూగనోము' నుండి

13. **వారు లీలాకమల** – కాళిదాసు మేఘసం. సర్గ 2, శ్లో. 2

14. **భవభూతి** (క్రీ.శ. 730 ప్రాంతము) మాలతీమాధవము, ఉత్తరరామచరిత్ర, మహావీరచరిత్ర లనెడి నాటకత్రయమునకుఁ గర్త; పదవాక్యప్రమాణజ్ఞుఁడు

15. **పొన్నపూవొడి** – వసుచరిత్ర ఆ. 1, ప. 109

16. **సరసులనర్మ** – ఆముక్తమా. ఆ. 2, ప. 20

17. **కలపములఁగూర్పు** – తిక్కన విరాటపర్వము ఆ. 1, ప. 320

18. **వావాత :** మహిషి, పరివృక్త, వావాత, పాలాగలి – ప్రాచీన రాజన్యులకుఁ బత్నీచతుష్టయము. వావాత రాజప్రణయమును జూఱఁగొనినది

19. **ఈ సుమజన్మ** – శ్రీ వేదుల 'కాంక్ష' నుండి

20. **లగ్నద్విరేఫ** – కాళిదాసు కుమారసం. సర్గ. 3, శ్లో. 30–54

21. **మురారి :** అనర్ఘ రాఘవకర్త (క్రీ.శ. 790–840) ఈ భావమునకు మూలము
"ఏక ద్వి త్రి చతుః క్రమేణ గణనా మేషామివాస్తం యతాం
కుర్వాణా సుమకోచయద్దశశతా న్యంభోజ సంవర్తికాః
భూయోశ క్రమశః ప్రసారయతితా స్సం ప్రత్య మానుద్యత
స్సంఖ్యాతుం సకుతూహ లేవ నళినీ భానో స్సహస్రం కరాన్"

22. **తనకుం గౌఁగిలి** – విజయవిలాసము ఆ. 1, ప. 130 చేమకూర తంజావూరు రఘునాథరాయల యాస్థానకవి నానాసూన – వసుచరిత్ర ఆ. 2, ప. 47

23. **విజ్జికాదేవి** – క్రీ.శ. 6, 7 శతాబ్దుల మధ్యకాలము. కౌముదీమహోత్సవ నాటకకర్త్రి – ఇందలి భాగమునకు మూలము : దీర్ఘై ర్దిగంతవిటపేషు కరైరసంఖ్యై నక్షత్ర పుష్పతరళేషు నభోద్రుమస్య, స్నాతో స్థితో జలనిధేరయ మంశుమాలీ, సంధ్యార్చనాయ కుసుమాపచయం కరోతి

24. **చక్షుర్గోచరమగు పుష్పము :** సమీక్ష – శ్రీ ముట్నూరి కృష్ణరావు పుట 84.

**చంద్రుడు – చంద్రిక**

25. **తిమిరభూతము సోకు** – ప్రబంధరత్నావళి – 557

26. **ఫిలిప్పైన్ జాతి :** ఫిలిప్పైన్ ద్వీపముల నివసించు నాదిమవాసులు

27. **రెడ్ ఇండియనులు** – కొలంబస్ ఇండియా యను భ్రాంతితోఁ గనుగొన్న యమెరికా ద్వీపములందలి యాదిమనివాసులు

28. **షింటోలు – జపానీయులు** 'Shintoism is the pure land school of Japan in its extreme form of Salvation by pure faith'

29. **ఒక వేయి తలలతో** – పోతన భాగవతము

30. **రాజయక్ష్మము** – కుమార్తెలు మొఱవిని క్రుద్ధుఁడైన దక్షునకుఁ జంద్రునకు సంధికుదిర్చి శివుఁడర్ధభాగమును శిరముపై ధరించినట్లు బ్రహ్మవైవర్తపురాణము

31. **ఉత్క్రాంతివేళ :** మరణవేళ

32. **శశినర్థించినాఁడు';** శ్రీ విశ్వనాథ సత్యనారాయణ 'శశిదూతము' కావ్యమున జెప్పినారు.

33. **మేఘవిజయకవి** (క్రీ.శ. 1660 ప్రాంతము) హైమకౌముది యనునితని వ్యాకరణ గ్రంథమును భట్టోజి దీక్షితు లనుకరించినారని కొందఱు, భట్టోజి (క్రీ.శ. 1640 ప్రాంతము, అద్వైతాగమ, తంత్రధర్మజ్యోతిషాదికములు ముప్పది రెండు గ్రంథముల రచించిన మహాపండితుఁడు.)

    సిద్ధాంత కౌముది సంస్కృత వ్యాకరణమును శబ్దరూప నిష్పత్తి క్రమమున మార్చి వ్రాసిన పన్నెండువేల గ్రంథము.

34. **సుషుమ్న** – సూర్యుని సప్తకిరణముల నొకటియని శ్రుతి

35. **శతపథ బ్రాహ్మణము** – యజుర్వేదీయ గ్రంథము

36. **కెరలి చీఁకటిమ్రాను** – తిమ్మన పారిజా. ఆ. 2, ప. 36

37. **మన్మథ దివ్యాగమమున** – మహాకవి పెద్దపాఁటి యెఱ్ఱన కుమార నైషధములోనిది (ప్రబంధ రత్నా. 84).

38. **విరహుల కెల్ల సంధ్యవతి** – ప్రబంధ రత్నా. 581

39. **అద్యతనాంధ్ర కవి కుమారుఁడు** – శ్రీ శ్రీ

40. **దినపరిణామలక్ష్మి** – పారిజా. ఆ. 2, ప. 44

41. **కాల మనియెడి** – పారిజా. ఆ. 2. ప.43

42. **ఉదయగ్రావము** – ధూర్జటి కాళహస్తీ... ఆ. 2. ప. 232

43. **కడక వ్రేచలి గట్టుపట్టి** – పారిజా. ఆ. 2. ప.45

44. **అనలాక్షు** – మనుచరిత్ర వంశావతార వర్ణనమున 'కలశపాథోరాశి' నుండి

45. **పొందుగఁ బశ్చిమాబ్ధితట** – పారిజా. ఆ. 2, ప. 42

46. **పనుపడ వేణునా** – సూరన ప్రభా. ప్రద్యు. ఆ. 4. 124

47. **తుహినకర మండ** – పారిజా. ఆ. 2, ప. 53

48. **ఋణ మపరిహార్యమైన** – శ్రీకృష్ణరాయలు ఆముక్త ఆ. 4. ప. 158

49. **పొలపొల** – విశ్వనాథ ఋతుసంహారము

50. **సాంద్రచంద్రికలు** – మూలము – ప్రభావతీ ప్రద్యు, ఆ. 4, ప. 125

51. **అమృతం బాసవ** – పారిజా. ఆ. 2, ప. 47

52. **నునులేఁత** – అనంతామాత్యుని భోజరాజీయము

53. **విరహుల మైసోకి** – పారిజా. ఆ. 2. ప. 49

54. **చరమక్ష్మాధర** – శ్రీనాథ యుగమందలి మఱియొక కవిసార్వభౌముఁడు రావిపాఁటి త్రిపురాంతకుని 'చంద్రతారావళి' నుండి (ప్రబంధరత్నాకరము 173)

55. **రతి నాథుండను** – పూర్వోదాహృతము 175

56. **అనంత రత్న ప్రభవుఁడు** – కాళిదాసు కుమార సం. సర్గ 1, శ్లో 3

57. **ఒక నాయకుఁడు** – బిల్హణయామినీపూర్ణతిలకల సంభాషణము

58. **కేవల పరోపకార బుద్ధితో** – భవభూతి కృతమైనట్లు గదాధరభట్టు రసిక జీవనమున నుదాహరించిన "కిం చంద్రమాః ప్రత్యుపకార లిప్సయా, కరోతి గోభిః కుముదావ బోధనమ్, స్వభావ ఏవోన్నతచేతసాం సతాం, పరోపకార వ్యసనం హి జీవితమ్"

59. **తామరసలక్ష్మ** – ప్రభావతీ ప్రద్యు. ఆ. 4, ప. 123

60. **ఈ వబ్జుండవు** – వసు చరిత్ర ఆ. 4, ప. 34

61. **శ్యామకంఠ** – ప్రభా. ప్రద్యు. ఆ. 4, ప. 153

62. **కురంగము నీయందు, త్రిపురసంహార** – మనుచరిత్ర

63. **వెన్నెల పేరిదారముల** – శ్రీ విశ్వనాథ 'శశిదూతము' నుండి.

**మలయానిలుఁడు**

64. **లలనాజనాపాంగ** – వసుచరిత్ర ఆ. 1. ప. 121

65. **కించి దుషః పూర్వ** – శ్రీ విశ్వనాథ ఋతుసంహారము – పుట 2

66. **ప్రత్యగ్ర సాలాగ్ర** – వసు చరి. ఆ. 1, ప. 132

67. **ప్రబంధ పరమేశ్వరుఁడు** – ఎఱ్ఱన నృసింహపురాణము ఆ. 2 ప. 60

68. **ఒనర హిమావకుంఠనము** – వసుచరి. ఆ. 1, ప. 127

69. **దక్షిణాశావధూ** – ప్రాచీన కవిప్రోక్తము

70. **గండాభోగ ప్రతిఫలిత –** ఆచార్య శంకరుని సౌందర్య లహరిలోని యీ శ్లోకము మూలము:

"స్ఫురద్గండాభోగ ప్రతిఫలిత తాటంక యుగళం
చతుశ్చక్రం మన్యే తవముఖ మిదం మన్మథరథమ్ ।
యమారుహ్య ద్రుహ్య త్యవనిరథ మర్కేందుచరణం
మహావీరోమారః ప్రమథపతయే సజ్జితవతే ॥"

71. **మలయ కటకో –** ఆముక్త ఆ. 5

72. **అదికాదే చెలి –** మదీయము

73. **అనిలకుమారకుండు –** వసుచరిత్ర ఆ. 3, ప. 139

## భ్రమరాన్వేషణము

74. **శివతపోభంగ సమయము –** ఇటనుండి 42వ పుట 1వ పంక్తి వరకు మహాకవి కాళిదాసు కుమారసంభవమునందలి 3 సర్గలోని శ్లోకముల విరివిగ గ్రహించితిని

75. **అట పాదపములు –** మేఘసందే. సర్గ 2, శ్లో 3

76. **గగనస్రవంతిలో** ప్రభా. ప్రద్యుమ్నము అ. 2

77. **శ్రీహర్షచక్రవర్తి –** నాగానందాది నాటకకర్త – ఇట నున్న భావమునకు మూలము ప్రియదర్శికలోని

"సంజాతసాంద్ర మకరందరసాం క్రమేణ
పాతుం గతశ్చ కళికాం కమలస్య భృంగః ।
దగ్ధా నిపత్య సహసైవ హిమేన చైషా
వామే విధౌ నహి ఫలం త్యభివాంచితాని ॥"

78. **బిల్హణభట్టు** (క్రీ.శ.శతాబ్ది) కర్ణ సుందరీ, విక్రమాంక దేవచరిత్రాది గ్రంథకర్త

79. **వనపాలక మత్త –** నిర్వ. ఉత్త. రామా. ఆ. 8, ప. 25

80. **తుమ్మెదపిండు –** పూర్వోదాహృతము ఆ. 8, ప. 52

81. **చైత్రారూఢిం –** ప్రబంధ పరమేశ్వరుని హరివంశము ఉత్తరభాగం ఆ. 7 ప. 68

82. **తరుణి ననన్యకాంత –** మనుచరిత్ర ఆ. 3

83. **"నాకుగాదులు" –** శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి – కృష్ణపక్షము

84. **ఒక భృంగంబు –** పారిజా ఆ. 2, ప. 33

85. **ఎలదేఁటుల్ –** పారిజా ఆ. 4. ప. 14

86. **ప్రతివర్ష వసంతోదయ –** పారిజా ఆ. 1 ప. 130

87. **వేవిన మేడపై –** ఆముక్త. ఆ. 1, ప. 62

88. **నానాసూన వితాన –** వసు. ఆ. 2, ప. 47

89. **శ్రీహర్షుని నైషధమున** పద్మము తపమొనర్చి దమయంతీపాదరూపము నొందినది. ఈ భావమునే గ్రహించి భట్టుమూర్తి యీ రచన కావించి యుండునని విజ్ఞుల యూహ

90. **నిజాన్వయ శత్రువు –** ప్రభావతి ఆ. 2, ప. 70 తత్కారణవీచికా – కళాపూర్ణోదయము ఆ. 6

91. **జిజ్ఞాసువు –** మారిస్ మేటర్ లింక్, భ్రమరజీవితమును గూర్చి ప్రత్యేక గ్రంథరచన మొనర్చినాఁడు

92. **ఇది యొక కన్నెపూవు –** మదీయము

93. **హ్రస్వతరమ్ము –** శ్రీ పాటిబండ మాధవశర్మ "మధువ్రత" నుండి

94. **భ్రమరా దుర్జనమిత్ర –** పోతనకృత భాగవతము – దశమస్కంధము – పూర్వ భాగము

95. **(పుట 69) ఏమిటి కేద్చెద –** నైషధము ఆ. 4, ప. 89

కాంతయశ్రు బిందుచ్యుతి – పూర్వోదాహృతము ఆ. 4, ప. 90

96. **"కవుల సందర్భ – ఓ భగవతీ" –** ఆచార్య శంకరుని సౌందర్యలహరిలోని క్రింది శ్లోకములు మూలములు :

"కవీనాం సందర్భస్తబక మకరందైకరసికః
కటాక్షవ్యాక్షేపభ్రమరకలభౌ కర్ణయుగళం ।
అముఞ్చంతౌ దృష్ట్వా తవనవరసాస్వాద తరళే
అసూయా సంసర్గా దలికనయనం కించి దరుణమ్ ॥"

"దదానే దీనేభ్యఃశ్రియ మనిశ మాశా సుసదృశీ
మమందం సౌందర్య ప్రకర మకరందం వికిరతి !
తవాస్మి న్మందారస్తబక సుభగే యాతు చరణే
నిమజ్జన్మజ్జీవః కరసుచరణైష్షట్చరణతామ్ ॥"

97. **"శాంకరీపల్కుమీ, ప్రళయావసానమున" –** శ్రీ నోరి నరసింహశాస్త్రి "తేనెతెట్టె" నుండి

98. **శ్రీ కుప్పయాచార్యులవారు –** పూర్వము ఆంధ్ర క్రైస్తవ కళాశాలా సంస్కృతాంధ్ర భాషా పండితులు,

99. **ఫిన్నిష్ జాతి –** యూరప్‌నందలి ఫిన్లండు దేశవాసులు

100. **ఆర్యక్షేమేశ్వరుఁడు** (క్రీ.శ. 10వ శతాబ్ది ప్రాంతము) నిద్ర మనోమాలిన్యము –

"చిత్తం ప్రసాదయతి లాఘవ మాదధాతి
ప్రత్యంగ ముజ్జ్వలయతి ప్రతిభావిశేషమ్ ।
దోషా నుదస్యతి కరోతి చ ధాతుసామ్యం
ఆనంమర్పయతి యోగవిశేష గమ్యం ॥"

101. **కంటికి నిద్ర –** కాశీఖండము ఆ. 1, ప. 108

101A. **అలుక యెత్తినవానికి –** భారతము సౌప్తికపర్వము ఆ.1

102. **హెరడోటస్** (క్రీ.పూ. 484 – 424) గ్రీకుచరిత్రకారుఁడు. ఆసియా మైనరులోని కపడోసియాలో జన్మము. గ్రీకులకును పారశీకులకును జరిగిన యుద్ధమును తొమ్మిది సంపుటముల చరిత్రగ అయోనిక్ మాండలిక భాషయందు వ్రాసినాఁడు. ఇతని చరిత్ర ప్రాచీన చరిత్రకొక యుత్తమ సాధనము

103. **కేటో –** (క్రీ.పూ. 183 ప్రాంతము) రోమను రాజనీతిజ్ఞుఁడు, సేనానాయకుఁడు, రచయిత, వ్యవసాయముపై 'డిరెరస్టికా' యను గ్రంథమును వ్రాసినవాఁడు.

104. **అగపస్టస్ సీజరు –** రోమక సామ్రాజ్య చక్రవర్తి. ఎగ్రిపా – క్రీ.పూ. 63 – జూలియస్ సీజరు వధానంతరము వచ్చిన యుద్ధములఁ బైకివచ్చిన సేనాని

105. **వాటర్లూ యుద్ధము –** (వాటర్లూ బ్రూసెల్సుకు 11 మైళ్ళదూరమున నున్న నగరము) బ్రిటిష్‌వారికి ఫ్రెంచివారికి 18 జూన్ 1815న యుద్ధము ప్రారంభమైనది. తుదకు నెపోలియన్ లొంగిపోవుటతో 15 జులై 1815లో నంత మొందినది. నెపోలియన్ హెలీనాద్వీపమున ఖైదీయైనాఁడు. నెపోలియన్ – (క్రీ.శ. 1769 – 1821) ఫ్రెంచి చక్రవర్తి. సామాన్య సేనాధికారి పదవినుండి చక్రవర్తియైనాఁడు. The greatest adventurer in the world.

106. **బిస్మార్కు –** క్రీ.శ. 1879లో నైరోపాయందు మహత్తర వ్యక్తి. బెర్లిన్ కాంగ్రెస్ అధ్యక్షుడు 'Man of Blood and Iron' రెమిని జెన్సెస్ – ఇతని యుత్తమరచన. హంబోల్డు (క్రీ.శ. 1769–1855) యువకుఁడుగ దేశయాత్రలు చేసి తుదకు ఖనన శాస్త్రప్రవీణుఁడై బహుదేశముల నా శాస్త్రమునకు వృద్ధి కల్పించినవాఁడు. తన యాత్రల చరిత్ర ముప్పది యుద్గ్రంథములుగ రచించినాడు. చర్చిలు – (క్రీ.శ. 30 నవంబరు 1874) క్రీ.శ. 1900లో బ్రిటిష్ పార్లమెంటున బ్రవేశించి

నేఁటివరకు నవిచ్ఛిన్నముగ సభ్యుఁడైన యాంగ్ల రాజకీయవేత్త, నేఁటి యాంగ్లేయ ప్రధానమంత్రి

107. **నెబ్రాస్కా** అమెరికా సంయుక్త రాష్ట్రములలో నొకటి. లింకన్ దీని ముఖ్య నగరము

108. **యోగకుండల్యుపనిషత్తు** – కృష్ణయజుర్వేదీయము లైన ముప్పది రెండు ఉపనిషత్తులలో నిది యొకటి

109. **సుశ్రుతము** – సుశ్రుతాచార్య రచితమైన వైద్యశాస్త్రము

110. **అవంతి సుందరి** – దండి దశ కుమారచరిత్రమున నొకపాత్ర

111. **ఒక దాని వెనుక నొకటి** – ఆంగ్లమహాకవి వర్డ్సు వర్తు (క్రీ.శ. 1770–1850) సుప్రసిద్ధ ప్రకృతికవి. క్రీ.శ. 1806లో నిద్రను గూర్చి మూఁడు కావ్యములఁ జెప్పినాఁడు. ఇది యందొక దాని కనువాదము

112. **ధ్యానీబుద్ధ** – జ్ఞానము నుపదేశించు బుద్ధమూర్తికి బేరు ప్రజ్ఞాపారమిత – జగత్ప్రసిద్ధి నొంది నేఁడు జావాయందున్న యొకానొక బుద్ధమూర్తి

113. **సంధ్యా సమయ సూర్యు** "యాథాగార్గ్య – మరీచయోஉర్క న్యాస్తం – ఇత్యాది" ప్రశ్నోపనిషద్వాక్యములు మూలము

114. **అభినవోన్మేష చిహ్నంబైన** – కాశీఖండము ఆ. 3, ప. 22

115. **రాయలు** క్రీ.శ. 1509–30ల మధ్య విజయనగర సమ్రాట్టు, ఆముక్తమాల్యద కర్త. సాంధ్యరాగలహరి – ఆముక్తమా. ఆ. 4, ప. 139.

## స్తోత్రపాఠము

116. **షోడశోపచారములు** – ధ్యానావాహనాదులు

117. **సాహిత్యకులందు** – బిల్హణీయములోని "నైవ వ్యాకరణజ్ఞమేవ పితరమ్" ఇందుకు మూలము

118. **బండి గురవింద పూలు** – బిల్హణుని విక్రమాంక చరిత్రలోని క్రింది శ్లోకము మూలము :

"కిం చారుచరిత్ర విలాస శూన్యాః
కుర్వంతి భూపాః కవి సంగ్రహేణ ।
కింజాతు గుంజాఫల భూషణానామ్
సువర్ణకారేణ వనేచరాణామ్ ॥"

119. **చౌడప్ప** – సుప్రసిద్ధాంధ్ర తిట్టుకవి

120. **ఎవ్వాని వాకిట** – ఇందు తిక్కన ధర్మరాజును వర్ణించినాఁడు – విరాట పర్వము ఆ. 2

121. **సర్వబాధా పరిహారము** – ఎట్టి పన్నులు లేనిది

122. **అంగవ్రాతములో** – పోతన భాగవతము – (ప్రహ్లాదఘట్టము )

123. **ఓడిపస్ కాంప్లెక్సు** – ఓడిపస్ స్ఫింక్సు రిడిల్ చదివినవాఁడు, పొరపాటున తల్లిని వివాహమాడినవాఁడు ఓడిపస్ కాంప్లెక్స్ అన Relation between parent and child of opposite sexes held by psycho - analysis to cause repressions.

124. **కవి యున్మత్తుఁడు** ''The poet, the lunatic and the lover are all in imagination compact''.

125. **నీవు గంధర్వలోక** – శ్రీ దేవులపల్లి కృష్ణపక్షము

126. **పాదచిహ్నము** – శ్రీ శివశంకరశాస్త్రి విరచితము

127. **గడచిన ప్రపంచ మహాయుద్ధమున** ''The first casuality of war is truth'' - Mahatma

128. **వ్యాసఘట్టము** – వ్యాసుఁడే మఱలవచ్చి వివరింపవలసిన గ్రంథగ్రంథి.

129. **కారంధమ** = కంచు

130. **అడియఁడు** = అడియేన్ దాసన్ (నేను నీ సేవకుఁడ) అనువాఁడు

131. **నభోగాయ** = భోగరహితుఁడు, తిట్టు.

132. **త్రిశరణములు** = బౌద్ధులు చెప్పు "సంఘం శరణం గచ్ఛామి, బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి" అనునవి

133. **ఋషభములు** = చెవి రంధ్రములు

134. **క్షేత్రియోవ్యాధి** = ప్రకృతి సహజమైన వ్యాధి

135. **దండుగు** = దోషములకుఁ బ్రభువులు పుచ్చుకొను నపరాధద్రవ్యము

136. **పాలమోర్** = అమెరికాయందలి సుప్రసిద్ధ ఖగోళశాస్త్ర పరిశోధనాలయ ముండుచోటు

137. **తురీయ యంత్రము** = ప్రాచీన వేదర్షులు దీనిమూలమున గ్రహవేధల నిర్ణయించిరి. రామయంత్రము = క్రీ.శ. 15వ శతాబ్ది భారతదేశమున ఖగోళ విజ్ఞానమున గ్రహింపనున్న యంత్రము.

**శత్రువులు – శత్రుత్వము**

138. **ప్లూటార్కు** – (క్రీ.శ. 48–122) గ్రీకు జీవిత చరిత్రకారుఁడు (Biographer) అతని 'Lives' ప్రముఖ గ్రంథము

139. **జెబున్నీసా** – ఉరుదు భాషలో కవయిత్రి

140. **సౌదీ** – పర్షియను కవి

141. **మయూరంబవోలె** – మడికి సింగన సకల నీతిసమ్మతము

142. **ఎరిస్టోఫానిస్** – (క్రీ.పూ. 445–385) ఏఁబదినాలుగు సుఖాంతనాటకముల రచించిన గ్రీకు నాటకకర్త – The World's Greatest Comic dramatist;

143. **ఒనరన్** – పోతన భాగవతకృత్యాదినిఁ జెప్పిన పద్యము

144. **సత్యముతో** – మహాత్ముఁడు తన యాత్మకథకు 'My experiments with truth' అని నామకరణము చేసినాడు

145. **దక్షిణామూర్తి** – శ్రుతి శాస్త్రార్థ వ్యాఖ్యాన మొనర్చు శివమూర్తి విభేదము

146. **అస్తంగతత్వము** – రవితోఁ జేరిన గ్రహముల కస్తంగతత్వదోషము కలుగుట జ్యోతిషశాస్త్ర ప్రసిద్ధము.

## నవ్వు

147. **క్లియోపాత్రా** – అంటోనీనిఁ బ్రేమపాశబద్ధునిఁ గావించిన సుందరి

148. **పండిత రాయలు** – రసగంగాధరాది గ్రంథకర్త; క్రీ.శ. 15వ శతాబ్ది సుప్రసిద్ధ పండితుడు

149. **హెర్బర్టు స్పెన్సర్** – (క్రీ.శ. 1820–1903) ఇకానమిస్టు సంపాదకుడు, ప్రత్యేకతత్త్వ నిరూపకుఁడు. His system of philosophy is based upon the principle that all organic development is a change from homogeneity to heterogeneity.'

150. **బెర్గసన్** – ఒకానొక యాధునిక యూరప్ దేశ తాత్త్వికుఁడు:

151. **భరతాచార్యుఁడు** – నాట్యశాస్త్ర కర్త.

# సంస్కృతి

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | వాత్స్యాయనుడు–కామసూత్రములు | 109 |
| 2. | వివాహము – స్త్రీ పురుషులు | 181 |
| 3. | హిందూ వివాహము – సంతానము | 189 |
| 4. | బహు భర్తృత్వం – బహు భార్యాత్వం | 201 |
| 5. | వివాహము – ఏకపత్నీత్వము | 213 |
| 6. | వివాహము – కూటాంతరత | 220 |
| 7. | బృంద వివాహము | 230 |
| 8. | వివాహము – జయాపజయాలు | 240 |
| 9. | వివాహము – వయస్సు | 249 |
| 10. | రాక్షస వివాహము | 257 |
| 11. | ఆసుర వివాహము | 266 |
| 12. | దేవీ నవరాత్రులు | 274 |
| 13. | భగవాన్ శ్రీకృష్ణ | 288 |
| 14. | శ్రీగణపతి | 299 |
| 15. | ఆంధ్రులు – సంగీత నాట్యాలు | 311 |
| 16. | దేవీ నవరాత్రాలు – ఆచార వ్యవహారాలు | 331 |
| 17. | దీపావళి | 339 |
| 18. | సంక్రాంతి – సూర్యోపాసన | 345 |
| 19. | శ్రీ వేదవ్యాస | 355 |
| 20. | సంవత్సరము, ఆది – ఆచారములు | 361 |
| 21. | పర్వదినాలు – సంస్కృతి | 384 |
| 22. | శరీరాలు – వాసనలు (సంస్కారాలు) | 389 |
| 23. | గడియారము | 393 |
| 24. | శబ్దమూ – శబ్ద సంపదా | 396 |
| 25. | సూర్యుడు – సూర్యోపాసన | 412 |
| 26. | తంత్రాలలోని స్త్రీ జనాలేఖ్యం | 420 |

# వాత్స్యాయనుడు–కామసూత్రములు

చతుర్విధ పురుషార్థములలో కామము తృతీయము. పరలోక సాధకమైనది ధర్మము. ఇహలోక సాధకమైనది కామము. మతిమంతులై మెలగినవారికి కామమును మోక్షసాధకమే అగునని 'ధర్మావిరుద్ధో లోకేస్మిన్ కామోస్మి భరతవర్షభ' అను గీతావచనమును బట్టి వ్యక్తమగుచున్నది. సర్వేంద్రియ తోషకమైన కామము సర్వార్థ సాధకమగుటచే దీనిని పరమ పురుషార్థముగ పరిగణించి, మహర్షి వాత్స్యాయనుడు 'ధర్మార్థ కామేభ్యో నమః' అని మంగళారంభమును పలికినాడు. త్రివర్గములందును ధర్మార్థములు పురుషార్థములని సూచించుటకే మున్ముందు అట్లు వచించినాడుగాని కేవలమగు పరమపురుషార్థము కామమే అని వాత్స్యాయనుని అభిప్రాయమై నట్లు నరసింహవృత్తి పలుకుచున్నది.

'పునీత భారతమున సమస్త తేజమును శ్వేతరక్తవర్ణ జలబిందు ద్వయమున నున్నది. ఈ రెంటిలో శ్వేతము పురుషకము, రక్తము స్త్రైణము, ఇవి భిన్నాభిన్నములు. కామదేవతా విద్ధములు. అందువలన కామము సృష్టి సమస్తమును బంధించు ఆంతరికశక్తి. కాని అది శక్తిశేఖరము కాదు. ఈ బిందుద్వయ సంయోగ వియోగములకు కారణభూతమైన పరమశక్తి కామాధిదేవత కంటె గొప్పది. స్త్రీ పురుష లింగద్వయ సంయోగమువలన కామకళాదేవి రూపకల్పన మొందినది. సూర్యచంద్రములు ఆ దేవత పయోధరములు. ఆమె సృజనేంద్రియములు హార్ద్రకళాయుతములు. వారి కామకథనమును గురించియు, జగదుత్పత్తి, స్థితిలయములను, తార్తీయ పురుషార్థ స్థానమును గురించియు ఒక వృద్ధ భారతీయవేత్త నాతో పలికినాడు' అని 'గోల్డు బెర్గు' పండితుడు అతని పవిత్రాగ్ని (Sacred Fire) అను గ్రంథమున వ్రాసి ఉన్నాడు.[1] ఇట్టి మహోన్నత దృష్టితోను, పరిపూర్ణ జ్ఞానముతోను కామమును ఉపాసించిన జాతి మరెచ్చటను లేదని చెప్పజూచుట అతిశయోక్తి కాజాలదు.

ప్రాచీన భారతీయుల కామతంత్ర లోలతకు ప్రధాన కారణము ప్రజ. గృహమేధులగుట సంతానము కొరకే. ప్రజాతంతు విచ్ఛేదము జరుగకుండునట్లు జూచుటకే కామకళా విజ్ఞాన మత్యావశ్యకముగ వారు పరిగణించిరి. ఏతద్విజ్ఞాన

విరహితులను ప్రజాతంతు విచ్ఛేదకులుగ నెంచిరి. పాశ్చాత్య లోకములందు వైజ్ఞానిక భానూదయమున కెన్ని సహస్రవర్షములకు మున్నో భారతీయులు కామకళా విజ్ఞానమున పారము ముట్టిన ద్రష్టలని చెప్పవచ్చును. ఏతద్విజ్ఞానము సమస్త జాతిని ఉత్తేజితమొనర్చి కావ్యనాటకాది సమస్తసాహిత్య విభాగములకును అంతర్విలీన జ్యోతిగా నిలచి ఔన్నత్యము నాపాదించినది.

భారతదేశమున కామకళా విజ్ఞానము బహుళముగ సృజితమైనది. కాని మన దురదృష్టకారణముగ అతిప్రాచీన కాలముననే ఉత్సన్నమైపోయినది. ఇతరములగు కళా శాస్త్రాదికములవలె దానిని అభ్యసనీయవిద్యగా ప్రాచీనులు పరిగణించి రనుటలో విప్రతిపత్తి లేదు. దేవాలయాదులలోను, శతాంగములమీదను కామకళా ప్రతిమల శిల్పులు స్థపతించుట, కారువులు చిత్రించుట ఇందుకు ప్రత్యక్ష నిదర్శనములు. ఇట్టివానిలో ఒరిస్సా దేశమునందలి కోణార్క్ అనుచోట సూర్యదేవుని రాతిరథముపైనున్న శిల్పములు సుప్రసిద్ధములు. వైదిక, జైన, బౌద్ధాది, విభేదములు లేక ఇటువంటి ప్రతిమలను చిత్రించుట, చెక్కించుట ఈ కళావశ్యకతను ద్యోతకమొనర్చు చున్నది.

భారతీయుల కామతంత్ర రచనము అనాది సిద్ధము. తదుత్పత్తిని గూర్చి మహర్షి వాత్స్యాయనుడు కొన్ని సూత్రములను చెప్పి ఉన్నాడు.[2] వాటి సారాంశము 'ప్రజాపతి ప్రజలను సృజించి త్రివర్గ సాధనార్థము శత సహస్రాధ్యాయి గ్రంథము నొకదానిని ప్రవచించినాడు. ఈ గ్రంథము కారణముగ ధర్మ, అర్థ, కామములను మూడు ఏకదేశములు ఏర్పడినవి. అందు స్వాయంభువమనువు ధర్మమును, బృహస్పతి అర్థమును, నందికేశ్వరుడు కామమును పృథక్కరించిరి.

నందికేశ్వరుని కామశాస్త్ర గ్రంథము సహస్రాధ్యాయి. దానిని ఔద్దాలకి శ్వేత కేతువు పంచశతాధ్యాయ గ్రంథముగ సంగ్రహించినాడు. బాభ్రవ్యుడను పాంచాల దేశస్థుడు ఈ గ్రంథమును నూటయేబది అధ్యాయములలోనికి సంక్షేపించి సాధారణము, సాంప్రయోగికము, కన్యాసంప్రయుక్తకము, భార్యా, పారదారిక, వైశిక, ఔపనిషదికములు అను సప్తాధికరణములు గల గ్రంథముగ నొనర్చినాడు. ఇందలి వైశికమును పాటలీపుత్ర నగరములో గణికల ఉపయోగార్థము వారి కోరికను అనుసరించి దత్తకుడు ప్రత్యేకించి ప్రవచించినాడు. తరువాత కొంతకాలమునకు చారాయణుడు సాధారణాధికరణమును, సువర్ణనాభుడు సాంప్రయోగికమును,

ఘోటకుడు కన్యా సంప్రయుక్తకమును, గోనర్దీయుడు భార్యాధికారమును, గోణికాపుత్రుడు పారదారికమును, కౌచుమారుడు ఔపనిషదికమును, పృథక్కరించినారు.

పై సూత్రములందు ఉటంకింపబడిన గ్రంథములు అతి విస్తృతములును అతిదీర్ఘములగుట వలననో, ప్రత్యేకాధికరణములగుటచే సంపూర్ణ జ్ఞానము నొసంగ ప్రత్యేకముగ శక్తిమంతములు కాకపోవుట వలననో, లేక ఉత్సన్నము లగుట వలననో వాత్స్యాయన మహర్షి ప్రత్యేకముగ తంత్రావాపముతో కూడిన కామకళను ఉపాసించి విజ్ఞుడై సంగ్రహ శాస్త్రగ్రంథ రచనమునకు పూనుకొన వలసి వచ్చినది. ప్రాచీన భారతమునందెన్ని అమూల్య కామకళా గ్రంథరచనములు జరిగినను వాత్స్యాయనునికి పూర్వరచనమని చెప్పదగిన దొక్కటియును నేడు మన కుపలభ్యమాన మగుట లేదు. నేడు లభించువానిలో వాత్స్యాయనుని 'కామసూత్రము'లే ప్రాచీనతమ గ్రంథము.

వాత్స్యాయనుని కాలమునాటికే బాభ్రవ్యుని గ్రంథమును సంపాదించుటకే అతికష్టసాధ్యమైన కార్యముగ నుండెడిదట. శ్వేత కేతు, నందికేశ్వరుల గ్రంథములు ప్రాచుర్యములో లేక రూపుమాసిపోయినవి. అందువలననే వాత్స్యాయనుడు సప్తాధికరణ సంక్షేపరూప కామశాస్త్ర గ్రంథ రచనమునకు కడంగ వలసిన వాడయ్యెనని కొందరి అభిప్రాయము.

నందికేశ్వరుడు ప్రమథగణాధిపతి యైన నంది అనియును, మహాదేవ శిష్యుడైన ఈతడు జగత్పితలు పార్వతీపరమేశ్వరులు సృష్టి కార్యమునకు పూనినపుడు కామకళా రహస్యములు వారివలన గ్రహించినాడనియును భారతీయుల విశ్వాసము. మధ్య వైదిక కాలమునుండి మాత్రమే కామశాస్త్ర విజ్ఞానము ప్రచలితముగ నున్నట్లు కన్పించుటచే నందికేశ్వరుడు కేవలము పౌరాణిక వ్యక్తి యని భావించుట కంటె మానవునివలె జన్మించి శాస్త్రగ్రంథ రచన మొనర్చిన వానివలె పరిగణించుట యుక్తమని ఒక విజ్ఞుని అభిప్రాయము[3]

ఔద్దాలకి శ్వేతకేతువు చరిత్రాత్మక వ్యక్తి. ఇతడు అరుణుని మనుమడు. కేకయ మహారాజు అశ్వపతికిని ఇతనికి జరిగిన వాకో వాక్యములు ఛాందోగ్యమున కనుపించు చున్నవి.[4] ఇతడు పాంచాలదేశమున కేగి పంచాగ్ని విద్యను గూర్చి ఒకానొక పరిషత్తులో ప్రసంగించినట్లు ఆ ఉపనిషత్తు వలన తెలియుచున్నది. బృహదారణ్యకోపనిషత్తున ఒక శ్వేత కేతువు కన్పించుచున్నాడు.[5] మహాభారతమున ఉద్దాలక మహర్షి కుమారుడైన ఒక శ్వేత కేతువు ప్రశంస ఉన్నది. అందు ఇతనిని గూర్చిన ఒక కథనము కనిపించుచున్నది.

ఒకనాడు ఉద్దాలకి కుమారుడు శ్వేతకేతువు, తల్లిని ఒక బ్రాహ్మణుడు కామతృప్తి కొరకై ఎత్తుకొని పోవుచుండగా తండ్రి వలన 'ఆ రీతిగా సంఘములలో సమస్త పురుష సంయోగము వలన స్త్రీలు అపవిత్రలు కా'రను మాటలు విని కోపించి, అది పాపమని నిశ్చయించి, భర్త అనుమతి లేనిది నియోగము నైన పొందరాదని నిర్ణయమొనర్చినాడు" అని భారత కథనము.[6] దీనిని పరికించినచో అతి ప్రాచీన కాలమున భారతదేశమున ఎట్టి వ్యవస్థయును లేక వివక్షారహిత కామోపభోగము (Sexual Promiscuity) లక్షణముగా నున్నప్పుడు, కొన్ని వైవాహిక నిబంధనలను (Marriage Laws) ఏర్పరచిన మహానుభావుడు శ్వేత కేతువని నిశ్చయింపవలసి ఉన్నది.

బాభ్రవ్యుని గ్రంథభాగములు వాత్స్యాయనుని నాటికి నిలచి ఉన్నట్లును, అతడు ఆ గ్రంథమునుండి కొన్ని సూత్రములను, విషయములను సేకరించినట్లు కామసూత్రముల వలన తెలియుచున్నది. కామసూత్రముల వలనను, తద్వ్యాఖ్యానమైన జయమంగళము వలనను దత్తకుడు మాతృమరణానంతరము దత్తుడైనాడని తెలియుచున్నది. ఇతడు మగధలో వీరసేనాది గణికలవలన అనేక విషయములను గ్రహించి శాస్త్ర కర్త ఐనాడు. 'వైశికము' ఇతని గ్రంథము. దత్తకాచార్యుని గ్రంథ మీ నాడుత్సన్నమైనది. కాని సంస్కృత భాణములందు ఇతని గ్రంథమునకు సంబంధించినవి కొన్ని సూక్తులు కానవచ్చుచున్నవి. నరేశ్వర దత్తుని ధూర్తవిట సంవాదము,[7] అతని కుమారుడగు శ్యామిలకుని పాద తాడితము[8]లకు భాణముల దత్తక సూత్రప్రశంస ఉన్నది. వేదములు 'ఓం' కారముతో నారంభించి ప్రారంభమైనవని వ్యంగ్యగర్భితముగ పలికిన పాదతాడితక వాక్యము గమనింప దగినది. క్రీ.శ. 380 ప్రాంతమున కళింగదేశ పాలకుడైన గాంగవంశ రాజన్యుడు రెండవ మాధవ వర్మ దత్తక సూత్రములకు శ్లోకమయ వ్యాఖ్యానము వ్రాసినాడు. అందు రక్త, విరక్త, వేశ్యలను గురించియు, శయనోపచారాదికములను గూర్చియు వ్రాసిన రెండు పాదముల గ్రంథము మాత్రమే ఉపలభ్యమాన మగుచున్నది. కామ కళాభిజ్ఞులు మాధవవర్మ గ్రంథము దత్తక సూత్రములకు సంగ్రహ గ్రంథముగాని వ్యాఖ్యానము కాదని అభిప్రాయ పడుచున్నారు.

చారాయణ, సువర్ణనాభ, ఘోటక ముఖ, గోనర్దీయ, గోణికాపుత్రులను గురించి ఎట్టి విశేషములును తెలియుట లేదు. కోసల దేశాధిపతి అగు దీర్ఘచారాయణుడొకడు అర్థశాస్త్ర రచయిత ఐనట్లు బౌద్ధుల మధ్యమనికాయము వలన తెలియుచున్నది.[9] ఘోటకముఖుడును అర్థ శాస్త్ర పండితుడైనట్లు కౌటిల్యుని గ్రంథము వలన

వ్యక్తమగుచున్నది.[10] స్త్రీలను చతుర్విధములుగ విభజింప నారంభించిన వాడితడే. కొక్కోక పండితుడు ఇతని గ్రంథమును చూచినాడు. కూచిమారుడు ఈ శాస్త్ర గ్రంథకర్తలలో ఉచ్చశ్రేణికి చెందినవాడు. అతని గ్రంథము ఉపనిషన్నామములతో విఖ్యాతమైనది. అతని మహర్షిగా పూర్వులు పరిగణించినారు.

దత్తకాచార్యుని తరువాత పేర్కొనదగిన కామశాస్త్ర ప్రణీత వాత్స్యాయన మహర్షి – వాత్స్యాయనుని కామసూత్రముల గురించి విపులముగ తదుపరి ప్రశంసించుటచే నిక అతని యనంతరము జన్మించిన కామశాస్త్రములను దిఙ్మాత్రముగ పేర్కొనుట అత్యావశ్యకము. అందు దామోదర గుప్తుని కుట్టనీ మతము ప్రప్రథమమున చెప్పదగినది. దీనికి శంభళీమతము అను నామాంతర మున్నది. ఇతడు కాశ్మీర దేశమును పాలించిన కర్కోటక వంశజుడగు జయాపీడదేవుని (క్రీ.శ. 779–813) మంత్రిసత్తముడు. ఇందు 1060 శ్లోకములున్నవి. ఈ గ్రంథము ప్రధానముగ వాత్స్యాయన మహర్షి షష్ఠాధికరణమును (వైశికము) విపులీకరించుచున్నది.

నాగర సర్వస్వకర్త పద్మశ్రీ అతని డెబ్బది రెండవ అధ్యాయమున కుట్టనీమత ప్రశంస ఒనర్చుటచే నితడు దామోదరగుప్తుని తరువాత వాడని తెలియుచున్నది. ఇతడు బౌద్ధ సన్యాసి. ఇతని గ్రంథము క్రీ.శ. 1351 నాడు జన్మించిన శార్ఙ్గధరపద్ధతిని ఉటంకించుటచే, పద్మశ్రీ క్రీ.శ. 10 – 11 శతాబ్దముల నాటివాడని పండిత ప్రకాండుల అభిప్రాయము.

క్రీ.శ. 1029–1064 మధ్య కాలమున కాశ్మీర రాజ్యము నేలిన అనంత దేవుని సభాసదుడైన క్షేమేంద్ర మహాకవి వాత్స్యాయన సూత్రసారమును, సమయమాత్రకమును వ్రాసి యున్నాడు. సమయ మాత్రకము కుట్టనీమతము ననుసరించిన శ్లోకమయ గ్రంథము.

తరువాత చెప్పదగిన కామకళాగ్రంథకర్త కొక్కోకుడు. ఇతడు అద్వితీయ పండిత వంశమున జన్మించిన సింహాళ దేశీయుడు. గద్య విద్యాధర, వైద్య విద్యాధర బిరుదాంచితుడగు తేజోకుని పుత్రుడు. పరాభద్రుని వంశస్థుడు. ఇతని రతిరహస్యము కామశాస్త్ర గ్రంథములలో విశేష ప్రాధాన్యము వహించినది. ఇది కల్యాణమల్లుని అనంగరంగమునకు మూలగ్రంథము. వాత్స్యాయన కామసూత్ర వ్యాఖ్య జయమంగళమున నీతని రతిరహస్య ప్రశంస కనుపించుచున్నది. అందువలన నతడు యశోధరునికంటె ప్రాచీనుడని నిశ్చయింపవచ్చును. క్రీ.శ. 1307 నాటి జనప్రభసూరి అతని కల్పసూత్రములలో జయమంగళ వ్యాఖ్యను పేర్కొనినాడు. అందువలన

కొక్కోకుడు క్రీ.శ. 12వ శతాబ్దికి పూర్వుడని నిశ్చయింపవలసి యున్నది. కాని పండిత లోకము ఇతడు పద్మశ్రీకి తరువాతి వాడని భ్రమ పడుచున్నారు.

కొక్కోకుడు రతిరహస్యమును జాత్యధికారాదులగు పదునేను ప్రకరణములుగ శ్లోక రూపమున వివరించి యున్నాడు. 'వాత్స్యాయనాది ప్రాచీన కామశాస్త్ర ప్రణేతలు 'ధర్మ మర్థం చ కామం చ ప్రత్యయం లోక మేవ చ' అని త్రివర్గములకును పరస్పరానుప ఘాతకముగ కామమును సేవింపవలసినదని చెప్పియుండగా, ఈయన 'అసాధ్యాయా స్సుఖంసిద్ధి సాధ్యాయా శ్చానురంజనం రక్తాయాశ్చ రతి సమ్యక్కామ శాస్త్ర ప్రయోజనం' అని చెప్పినాడు. తన్మూలమున తర్వాతి కాల కామశాస్త్ర గ్రంథకర్తలందరును ఇతడు తీసిన మార్గమునే అనుసరించి కేవలము జాత్యధికారము, బంధాధికారము, వశ్యౌషధ విధానములతో అవిచారితమున నారంభించినారు. కొక్కోకుని గ్రంథమునకు (1) కంచీనాథుడు (2) ఆవంచ రామచంద్రుడు (3) కవి ప్రభువు (4) హరిహరుడు అను నలువురు పండితులు వ్యాఖ్యానములు వ్రాసినారు. గీత గోవింద కావ్యమునకు టీక వ్రాసిన కుంభనృపతి, నైషధీయ చరిత్రమునకు వ్యాఖ్యాన మొనర్చిన నారాయణభట్టును, పంచకావ్య వ్యాఖ్యాతలలో ప్రసిద్ధుడును, దార్శనికాగ్రేసరుడు నగు కోలాచల మల్లినాథసూరి రఘువంశ కిరాతార్జునీయాది కావ్యవ్యాఖ్యానములలో కొక్కోకుని గ్రంథమునుండి ఉదాహరణముల నిచ్చినారు.

క్రీ.శ. 1422-40 మధ్యకాలమున విజయనగర సామ్రాజ్యమును పాలించిన ఆంధ్ర చక్రవర్తి ఇమ్మడి ప్రౌఢదేవరాయలు రతిరత్న ప్రదీపిక అనునొక కామకళా గ్రంథమును వ్రాసి ఉన్నాడు. అందు సాంప్రయోగాధికారము మాత్రమే నిలచియున్నది. భార్యాధికారము, పారదారికము, వైశికాది అధికరణములున్న గ్రంథము లుప్తమై పోయినది. ఇతడు ప్రధానముగ రతిరహస్య మార్గమును అనుసరించినాడు. ఇది ఒకరీతిగ నా గ్రంథమునకు వ్యాఖ్యానమని చెప్పవచ్చును!

కల్యాణమల్లుని అనంగరంగము తదుపరి పేర్కొనదగిన ప్రధాన గ్రంథము. ఇతడు ఒరిస్సా రాజగు లడదేవుని (అనంగ భీముడు) ఆస్థానకవి అని కవిచరిత్రల వలన తెలియుచున్నది. కాని ఇతడు అహమ్మదుఖానుని కుమారుడగు లడఖానుని కోరిక ననుసరించి అనంగరంగ రచనమునకు పూనుకొనినాడని ఏతద్గ్రంథ, ద్వితీయ, తృతీయ శ్లోకముల వలన తెలియచున్నది. ఇతడు గుజరాతు దేశ నాయకుడు. ఇతని తండ్రి క్రీ.శ. 1488-1517 మధ్య రాజ్యమొనర్చిన సికందరు సుల్తాను కాలముననున్న ఒక ప్రభువని తెలియుచున్నది.[11] అందువలన కల్యాణమల్లుడు క్రీ.శ. 15వ శతాబ్ది

చివరభాగముననో లేక 16వ శతాబ్ది ప్రథమ భాగముననో జీవించియున్నాడని నిశ్చయింపవచ్చును. భారతీయ కామకళా గ్రంథములలో దీనికున్నంత విశేష ప్రచారము మరి యే యితర గ్రంథమునకు లేదు. పర్షియా, టర్కీ, అరబ్బు దేశములు దీనిని ఆయా భాషలలోనికి అనువదించుకొన్నవి. ఆ దేశములందు దీనికి 'లజ్జత్ – అల్ – నిస్సా' అని నామము. ఈ గ్రంథమునకు నేడు ఆంగ్లేయ, ఫ్రెంచి, జర్మన్, అనువాదములును లభించుచున్నవి.

తరువాత కాలమున జన్మించిన కవిశేఖర జ్యోతీశ్వరాచార్యుని 'పంచసాయక' మే నాటిదో తెలియదు. ఇది శ్లోకరూప గ్రంథము. ఇతడు కొక్కోకుని మార్గమనుసరింపక వాత్స్యాయనుని మార్గము త్రొక్కినాడు. అతని చరిత్రాదికములను చెప్పు శ్లోకముల రెంటిని గ్రంథమున చెప్పి ఉన్నాడు. బికనీరు మహారాజు అనూపసింహుని (క్రీ.శ. 1674–1708) ఆస్థాన విద్వాంసుడు, వ్యాసజనార్దనుడు కామప్రబోధము అను గ్రంథమును వ్రాసినాడు. ఇది అనంగరంగమునకు తాత్పర్య గ్రంథము. క్రీ.శ. 1457 నాటి అనంతుని కామసమూహము, జయదేవుని రతిమంజరి, సర్వసామాన్య శాస్త్రగ్రంథములు. హరిభట్టార రహస్యము సంప్రదాయ శుద్ధముగను, కామ సూత్రోద్దేశ నిబద్ధముగను నున్నది. సౌమదత్తి విటవృత్తము వైశికాధికరణమునకు సంబంధించిన స్వతంత్రగ్రంథము, రామచంద్ర బుధేంద్రుని ప్రకాశిక రతిరహస్య వ్యాఖ్యానము. వీరణారాధ్యుని గ్రంథము స్వతంత్రము. ఈ పంచ రత్నమునకు రేవణారాధ్యుని స్మరతత్త్వ ప్రకాశిక వ్యాఖ్యానగ్రంథము. ఇతడు వేద వేదాంగములనుండి ప్రమాణములనిచ్చి కామము తప్పక సేవింపవలసిన దనియును, ధర్మ్యమనియును నిరూపించిన వీరశైవుడు. సిద్ధ నాగార్జునుడు వశీకరణ తంత్రము నొకదానిని వ్రాసినట్లు తెలియుచున్నది.

ఇట ఆంధ్ర కామశాస్త్ర గ్రంథ ప్రశంస యొనర్చుట అసమ్మతము కాదు. కామశాస్త్రమున కంతటికిని నాయిక వేశ్యయను భ్రాంతిని కల్పించునట్లు, కొక్కోకాది గ్రంథకర్తలవంటి విశేష కామలౌల్యముతో 'కొక్కోక' మను పేర ఆంధ్ర కామశాస్త్ర గ్రంథమును వ్రాసినవాడు ఎఱ్ఱయకవి. ఇది రతిరహస్యాంధ్రీకరణము, నెల్లూరి శివరామకవి తంజాపుర మహారాష్ట్ర నాయకుడు ప్రతాపసింహుని కోరికపై కామకళానిధి గ్రంథమును వ్రాసినాడు. ఇది స్వతంత్ర గ్రంథము. ముష్టిపల్లి సోమభూపాలుడు ఆంధ్ర రతిరహస్యమును రచించెను. ఇది గద్వాల ప్రభువు హరిభట్టు వ్రాసిన రతిరహస్యమునకు ఆంధ్రీకరణము. గోపీనాథ వెంకటకవి

(శ్రీమద్రామాయణము నాంధ్రీకరించిన వాడు) శృంగార పరాకాష్ఠను పొందిన బ్రహ్మానంద శతకమును వ్రాసి యున్నాడు. ఇంకను ఆంధ్రమున ననేకములైన చిల్లర గ్రంథములున్నవి.

ఉపలబ్ధ మానములగు సమస్త భారతీయ కామకళాగ్రంథ పరంపరలోను, అతి ప్రాచీనమును, ప్రామాణికమును అయిన గ్రంథము వాత్స్యాయన మహర్షి కామసూత్రములు. ఈ గ్రంథమునకున్న సమగ్రస్ఫూర్తిగాని, ప్రాగల్భ్య ప్రాశస్త్యములుగాని అన్యగ్రంథములకు లేవు. సమస్త కామకళా గ్రంథములకును నిదియే ఆదిభిక్ష వెట్టినది; అన్నియును దీని ననుసరించినవి అని ఘంటాపథముగ చెప్పవచ్చును. వాత్స్యాయనుడు పూర్వాచార్యులను కొందరిని పేర్కొని వారి మతములను విమర్శించుట వలన నితడు శాస్త్ర సంధాతయే గాని స్వతంత్ర రచయిత కాడని ఒక అభిప్రాయమున్నది. ఇది ఎంతయు సత్యదూరము. మన పూర్వులు ఇతనిని మహర్షిగ భావించినారు. ఇతడు కామకళాద్రష్ట, స్రష్ట, ఇతని కామసూత్రములను అవలోడన మొనర్చి ప్రపంచములోని ఉత్తమజాతి శాస్త్రవేత్తలును, కామశాస్త్ర వేత్తలును (Sex and Erotic Scholars) ఇతని 'కామశాస్త్ర విజ్ఞానమునకు బుద్ధినైశిత్యముతో రాజ్యతంత్రమును నడపి శాస్త్రరచన మొనర్చిన విశిష్ట పాశ్చాత్య రాజకీయవేత్త – మేకవెల్లీ' అని ప్రశంసించినారు.

మన ప్రాచీన సాహితీపరులు కామసూత్రములకు విశేష గౌరవమిచ్చినట్లు సంస్కృత కావ్యపఠనము వలన వ్యక్తమగుచున్నది. మల్లినాథాది వ్యాఖ్యాతలమాట అటుంచినను, మహాకవులు కాళిదాసు, భవభూతి, ఆచార్య దండి, ప్రభృతులు వారి కావ్యములందు సందర్భానుసారముగ వాత్స్యాయన కామసూత్రములను అనువదించినారు. వరాహ మిహిరాచార్యులవారును కొన్ని సందర్భములందు ఈ గ్రంథమునుండి ఉదాహరణములను గ్రహించినారు.

వాత్స్యాయనుని 'కామసూత్రములు' నేటికి ప్రపంచములోని 160 భాషలలోనికి వ్యాఖ్యాన టిప్పణి సహితముగ అనువదితములైనవి. దీనికి 11 ఆంగ్లానువాదములు, 20 ఫ్రెంచి అనువాదములు, 40 జర్మను అనువాదములు నున్నవి. ఫ్రెంచి వానిలో నుత్తమమైనది లామైరీ అనువాదము, రిచ్చర్డు స్కిమిడ్జ్ హైమన్, స్టీఫెనుల అనువాదములు జర్మను పరివర్తనములోని కెల్ల ముఖ్యమైనవి. నేటి జాతి శాస్త్రజ్ఞులలో కామసూత్రములను మెచ్చుకొననివారు లేరు. అతి ప్రాచీన కాలముననే వాత్స్యాయనుని ప్రభావము అరబ్బు దేశములలో పుట్టిన కామశాస్త్ర గ్రంథములపై బడినది. పూర్వ రోమక చక్రవర్తులనాటి జాతిశాస్త్రవేత్తలును భారతీయ కామశాస్త్రపు చవిచూచినవారే

ననుటలో అతిశయోక్తి లేదు. ఈ సందర్భమున వసు మహాశయుని వాత్స్యాయన ప్రశంసను పేర్కొనుట ఉచితము.

"The Kama-Sastra is written in brilliantly arranged and superbly pithy Sutra form in the style of many of the ancient and Mediaeval Hindu scriptural works. The foreign scholars, particularly authorities on sexual science in the nineteenth and twentieth centuries have justly appraised and recognised the value of such a supremely interesting and useful treatise on the art of love that had presumably attained wonderful perfection in India several centuries before CHRIST. It is acclaimed as the most precise but elucidating ancient work for all times and with a universal appeal by celebrities like Havelock Ellis, Kraft-Ebing, Kisch Forel, Mantegazza, Lombroso, Iwan Block and others ... It can be proved beyond doubt that almost all the Turkish, Arabic and Persian Books on Erotics have freely derived help from the precontemporaneous Hindu manuscripts - The KAMA SUTRA etc... It becomes very difficult to gain say if somebody presumes that Ovidus Nasso the Roman composer of A R S A Mooris who lived during the reign of first Imperial Caesar filled his cup at the fountain - head of Vatsyayana or his predecessors."[12]

ఇందు వాత్స్యాయనుని కామసూత్రముల గూర్చి 'వసు' మహాశయుడు చెప్పిన వాక్యములలో సత్యేతర మిసుమంత యైనను లేదు; నేటి కామతంత్ర రచయితల గ్రంథములను గాని అరేబియా, పర్షియా దేశములందును, రోమునగరమునను జన్మించిన పురాతన కామకళా గ్రంథములనుగాని పరికించిన నీ విషయము తేటపడగలదు.

కామసూత్రములకు వ్యాఖ్య లొనర్చిన వారిలో ప్రముఖుడు యశోధరమహారాజు. ఇతని వ్యాఖ్యానమునకు 'జయమంగళ' మని నామము. ఇతడు క్రీ.శ. 10వ శతాబ్ది వాడని చరిత్రజ్ఞుల అభిప్రాయము. వ్యాఖ్యాప్రారంభమునందు యశోధరుడు చెప్పిన –

"వాత్స్యాయనీయం కిల కామసూత్రం వ్యాఖ్యాయి తత్త్రైశ్చిది హాదేన్యథైవ, తస్మాద్విధాస్యే జయమంగళాఖ్యాం, టీకామిమాం సర్వ మిదం ప్రణమ్య" అను శ్లోకము వలన ఇతని నాటికి వాత్స్యాయనమునకు సంప్రదాయ విరుద్ధములైన కొన్ని వ్యాఖ్యానములున్నట్లును, ఇతడు సంప్రదాయార్థములను కొనివచ్చుటకై వ్యాఖ్యచేయ

పూనుకొనినట్లును అర్థమగుచున్నది. అందువలన నితని వ్యాఖ్యానము సమగ్రమును ప్రామాణికమునునని మన మంగీకరింపవచ్చును. సూత్ర హృదయము నెఱిగినట్లు వ్యాఖ్యానించు పట్ల నితని కామకళా విజ్ఞానము, తదితర శాస్త్ర విజ్ఞానము సర్వేసర్వత్ర గోచరించుచుండును. ఇతనికి కామకళ స్వానుభవ పూర్వకమైనట్లు గద్యలో చెప్పుకొనిన 'విదగ్ధాంగనా విరహకాతర' శబ్దము వలన మన కర్థమగుచున్నది. క్రీ.శ. 1577లో వీరభద్రుడు 'కందర్ప చూడామణి' అనుపేర ఆర్యావృత్తములలో కామసూత్రములకు వేరొక వ్యాఖ్యానము జెప్పినాడు. క్రీ.శ. 1789లో సర్వేశ్వరశాస్త్రి శిష్యుడును కాశీనివాసియు నైన ఆంధ్రుడు భాస్కర నృసింహుడు రాజా వ్రజలాల్ అనువాని ప్రోత్సాహమున వాత్స్యాయనీయమునకు ఒక వృత్తిని వ్రాసినాడు. అఖిల ప్రౌఢక్రియయైన వృత్తిని రచింపబూనినట్లు గ్రంథారంభమున చెప్పుకొనిన శ్లోకమునందున్నది. వాత్స్యాయన సూత్ర వ్యాఖ్యాతలలో మల్లదేవుడొకడు. ఇతనిని పంచసాయక కర్త జ్యోతీశ్వరాచార్యుడు మూలదేవుడని వ్యవహరించినాడు. క్షేమేంద్రమహాకవి ఔచిత్య విచారచర్చయను అతని గ్రంథమున నొక వాత్స్యాయన సూత్రసారమును పేర్కొనినాడు. కాని నేడది లభించుట లేదు.

భాస్కర నృసింహుడు కామసూత్ర వృత్తిని ఆరంభించుచు 'వత్సోపరి వాత్సల్యా వాత్స్యాయనీయ కామసూత్రం యః' అనినాడు. దీని కుపోద్బలకముగ వత్సరాజు వాత్స్యాయనుల మైత్రి కనుగుణములైన జనశ్రుతులున్నవి. మల్లనాగు డను ఆచార్యుడు వత్సదేశ పరిపాలకుడైన వత్సరాజుకు మిత్రుడై, అతని కుమారుడు లోకతంత్ర మెరుగని వాడగుటచే ప్రభువు పరితపింప, నాతడు కనికరించి ఈ కామసూత్రములను చెప్పినాడట! దీనికి ప్రమాణముగ 'మల్లనాగ ప్రబోధితో వత్సేశ్వర ఇవ' అను వాక్యములు ఉదాహృతములైనవి. ఇందలి సత్యాసత్యము లెట్లున్నను 'వాత్స్యాయన' శబ్దము బిరుదనామము. అయిన కామసూత్ర కర్త పేరేమి?

యాదవ ప్రకాశ హేమచంద్రులు వాత్స్యాయన శబ్దమునకు క్రింది శ్లోకముల పర్యాయ పదముల నిచ్చి ఉన్నారు.

"వాత్స్యాయనస్తు కౌటిల్యో విష్ణుగుప్తో వరాణకః ద్రమిళః పక్షిల స్వామీ మల్ల నాగోంగులోపి చ;

వాత్స్యాయనో మల్లనాగః కౌటిల్యశ్చ కాత్మజః, ద్రామిళః పక్షిల స్వామీ విష్ణు గుప్తోంగుళశ్చ సః"[13]

ఈ శ్లోకములు చరిత్రజ్ఞులు పరిగణింప తగినవిగా లేవు. లోకమున వాత్స్యాయన శబ్దవాచ్యులైన శాస్త్రకారులు ముప్వురు కనిపించుచున్నారు. (1) అర్థశాస్త్ర కర్త కౌటిల్యా పరనాముడు (2) న్యాయశాస్త్ర భాష్యకారుడు వాత్స్యాయనుడు (3) కామసూత్ర కారుడు వాత్స్యాయనుడు. అర్థశాస్త్ర వ్యాఖ్యాత లెవ్వరును కౌటిల్యుని వాత్స్యాయన శబ్దముతో వ్యవహరింపరు. అదే రీతి న్యాయశాస్త్ర వ్యాఖ్యాతలు కౌటిల్య శబ్దము న్యాయశాస్త్ర వ్యాఖ్యాతకు వాడుక చేయలేదు. లోకము నందున్న ఉపశ్రుతి ననుసరించి కొందరు విద్వాంసులు వాత్స్యాయన శబ్దము బిరుదనామ మనియు, అతడు మల్లనాగుడనియును అభిప్రాయపడుచున్నారు. మరికొందరు కామసూత్రకర్తను 'వాత్స్యాయన మల్లనాగు' డనుచున్నారు.

వాత్స్యాయనుని కాలనిర్ణయ మొనర్చుటకు ప్రబలములైన ఆధారము లెవ్వియును లేవు. పండితులు నానారీతుల అభిప్రాయములను వెల్లడించినారు. 1. కామ సూత్రములను ప్రప్రథమమున ప్రచురించిన కలకత్తా విద్వాంసుడు మహేశ చంద్రభట్టు "ద్వివేదాక్షి" అను ఒక శ్లోకభాగమున సూత్రకారుడు 1424 ను సూచించినాడనియును, అందువలన ఇతడు క్రీ.శ. 677 నాటివాడని నిశ్చయించినాడు 2. సంస్కృత వాఙ్మయ చరిత్రకారుడు కృష్ణమాచార్యులవారు 'కామ సూత్రము' లందు కుంతలస్వాతికర్ణి అను ఆంధ్ర శాతవాహనరాజు ప్రశంస ఉండుట వలన ఇతడు క్రీ.శ. 3, 4 శతాబ్దుల వాడని నిశ్చయించిరి. 3. ఇతడు మూడవ శతాబ్ది వాడని ఆచార్య చోరే అభిప్రాయము[14] 4. ఆంధ్ర వాత్స్యాయన కామసూత్ర వ్యాఖ్యాతలు కావ్యస్మృతి తీర్థశ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రులవారు, ప్రథమ ముద్రణమున ఇతడు పతంజలి మార్గముననుసరించి చర్చించుటచే, నించుమించు అతనికి సమకాలికుడై క్రీ.శ. 150 ప్రాంతమున జీవించి ఉండవచ్చునని అభిప్రాయపడినారు.[15] రెండవ ముద్రణమున ఆచార్య చక్కల్‌ధర్‌గారి వలె ఇతడు క్రీ.శ. 3వ శతాబ్ది మధ్య భాగమునకు చెందినవాడనినారు. 5. ఆచార్య చక్కల్‌ధర్ మహాశయుడు[16] వాత్స్యాయనుడు క్రీ.శ. 3వశతాబ్ది మధ్యభాగము వాడని కాళిదాస మహాకవి కాలనిర్ణయముననుసరించి, మరికొన్ని ఇతర ప్రమాణములను బట్టియు నిశ్చయించినారు. ఈ అభిప్రాయముతో డాక్టరు బార్నెట్టు మహాశయుడు సంపూర్ణముగ నేకీభవించినాడు. అందువలన కామసూత్ర కర్త క్రీ.శ. 3వ శతాబ్ది మధ్యభాగము వాడని మనము నిర్బాధకముగ నిశ్చయింపవచ్చును.

**కామసూత్రములు**

మహర్షి వాత్స్యాయనుడు కామసూత్రములను ఏడు అధికరణములుగ రచించినాడు. అందు మొదటిది సాధారణాధికరణము. తంత్రావాసాత్మికమైన కామమునకు సాధారణ నిర్వచనము, తదావశ్యకత మున్నగు సాధారణ విషయములందున్నవి. దశాంగములు గల కామమును ప్రయోగించు మార్గమును విశదీకరించుటచే రెండవదానికి సాంప్రయోగికాధికరణమని నామము. ఇది తంత్రభాగము. మిగిలిన గ్రంథము నాయికలను పొందు విధానమును నిరూపించును. అందువలన ఈ భాగమునకు శాస్త్రవేత్తలు ఆవాపమనినారు. ఈ ఆవాపభాగము నందు నాలుగధికరణములున్నవి. వాత్స్యాయనుని కాలము ననుసరించి నాయికలు చతుర్విధములుగనున్నారు. అందు ఏకచారిణీ వృత్తమును అవలంబించి కన్యకలుగా నుండి ప్రేరణ విధాన పూర్వకముగా నాయక పాణి గ్రహణము చేయునట్టివారు ఒక తెగవారు. వీరిని కన్యకలనుగా భావించి కన్యాసంప్రయుక్తాధికరణమున వీరికి సంబంధించిన సమస్త విషయమును మూడవ అధికరణమున మహర్షి నిబంధించినాడు. ఇది ఆ భాగమున తొలిపాదము. వరణ విధానము ననుసరించి నాయకుని పాణిగ్రహణము చేసుకొని భార్యాత్వమును అధిష్ఠించినది మొదలుకొని వారు నడువవలసిన రీతిని, జీవన విధానమును 'భార్యాధికరణ'మను పేర నాల్గవ యధికరణముగనున్నది. ఈ రెండవ పాదము తరువాత పారదారాధికరణము, కారణాంతరమున పరదారాభిగమనము నొనర్పవలసిన కారణములు ఆ నాటి సాంఘిక పరిస్థితుల ననుసరించి ఉండుట వలన, దానిని ప్రత్యేకాధికరణముగ ఆ మహర్షి పలికినాడు. ఇది అయిదవ అధికరణము. ఆరవ భాగమున మిగిలిన పాదము వైశికము. దీనిలో తంత్రావాపాత్మకమైన కామము పూర్ణమగును. ఈ అధికరణముతో అనగా నారు అధికరణములతోనే కామశాస్త్రము పూర్తికావలసి ఉన్నది. లోకమున కొందరకు తంత్రావాపముల మూలమున కామప్రాప్తి లేకుండుట సంభవించుటచే నట్టివారి నిమిత్తము, బలాత్కార వశమున నొందుటకు ఔపనిషదికాధికరణము చెప్పవలసి వచ్చినది. అందువలన నీ అధికరణమున – సుభగంకరణము, వాజీకరణము, మున్నగు విషయములున్నవి. ఈ రీతిగా కామశాస్త్రము ఏడధికరణముల, మహాశాస్త్ర గ్రంథమైనది. ఇందు అరువది నాలుగు అధ్యాయములు, దరిదాపుగ పదునేడు వందల సూత్రములు కనుపడుచున్నవి.

వాత్స్యాయనము కామశాస్త్ర గ్రంథము. కేవల రాగవశమూలకములైన బంధన చుంబనాదికములను నిరూపించినను యథాతథముగ ననుసరింపుమని అభిప్రాయము

కాదు. అందుకనియే "విపాకాహి శ్వమాంస స్యాపి వైద్య కే కీర్తితా ఇతి తత్కింస్యా భక్షణీయం విచక్షణైః" అని చెప్పినాడు. వైద్య శాస్త్రముల రసవీర్య విపాకములుగ కుక్క మాంసమును చెప్పినను విచక్షణులు భక్షింపని రీతిననే, ఇందును అనుసరింప వలయునని ఆయన అభిప్రాయము. 'బ్రహ్మచర్యమునకు పరమమైన సమాధిచే లోకయాత్ర సుఖముగ సిద్ధించి జగత్కల్యాణము జరుగవలెనని ఈ శాస్త్రము మావలన విహితమైనది' అని –

"తదేత బ్రహ్మచర్యేణ పరేణ చ సమాధినా, విహితం లోకయాత్రాయై నరాగార్థోస్య సంవిధిః" అను శ్లోకమున విస్పష్టముగ పలుకుటచే మహర్షి ఆర్ష హృదయము అభివ్యక్తమగుచున్నది.

మహర్షి జ్ఞాన విజ్ఞానములపారములు. ఈ రెంటి సమ్మేళనమూలమున త్రివర్గ ప్రతిపత్త్యాధ్యాయమున ధర్మార్థకామ స్వరూప నిర్ణయ మొనర్చినాడు. ఇతనికి స్మృతి, పురాణేతిహాస పరిచయమున్నట్లు అనేక సూత్రములు ప్రమాణము నొసగుచున్నవి. చతుష్షష్టి, నామము – ఏ రీతిగ ఏ శాస్త్రమునకు ఒప్పునది నిర్ణయమొనర్చు సందర్భమున 'ఋచాం దశత్రయీనాం చ సంజ్ఞతత్వా ది హాపి తదర్థ సంబంధాత్... (2–2–4) అని చెప్పుట వలన వైదిక విజ్ఞానము వెల్లడియగుచున్నది. పతంజలి మహాభాష్య పరిజ్ఞానమున్నట్లు ఆయన సూత్ర రచనావిధానము చెప్పక చెప్పుచున్నది. చార్వాకాది నాస్తిక తత్త్వములు ఆయన గ్రహించినట్లు త్రివర్గ ప్రతిపత్త్యధ్యాయము వలన తెలియగలదు. న్యాయ, తర్కాది శ్రుత్యంగ పరిజ్ఞానము సర్వేసర్వత్ర ప్రమాణస్వీకరణ సందర్భముల గోచరించుచున్నది. కన్యాసంప్రయుక్తమున వివాహ ప్రకరణమున చేసిన నిర్ణయములు స్మృతి పరిజ్ఞానమును, పారదారికము రాజకీయ పరిజ్ఞానమును వెల్లడి చేయుచున్నవి. విద్యాసముద్దేశాధ్యాయమున – ఆయన కళా పరిజ్ఞానము, నాగరక అనాగరక దేశాచార పరిజ్ఞానము పరిస్ఫుటముగ నిరూపితమైనది. దేశసాత్మ్యముల వెల్లడించు సందర్భమున భౌగోళిక విజ్ఞానమును, ఔపనిషదాధికరణమున వైద్యశాస్త్ర విజ్ఞానమును వ్యక్తమగుచున్నవి. ఇక కామశాస్త్ర పరిజ్ఞానమున నతడేకైక విజ్ఞాని. జగదేక శాస్త్రకారుడు.

సాధారణాధికరణమున శాస్త్ర సంగ్రహాధ్యాయము మొదటిది. అందు ప్రథమమున కామశాస్త్రావతరణ కథనమును విశదీకరించి, వాత్స్యాయనుడు ప్రకరణాధికరణ సముద్దేశ మొనర్చి, సంఖ్యానిర్దేశమును, సూత్రకర్తల సంప్రదాయ విశేషములను పేర్కొనినాడు. ద్వితీయాధ్యాయమైన త్రివర్గ ప్రతిపత్త్యధ్యాయమున ధర్మార్థ కామములు

పరస్పరానుబద్ధములగు రీతులను వ్యక్తమొనర్చి, శాస్త్రరచనావశ్యకతను నిరూపణ చేసినాడు. ఈ సందర్భమున మహర్షి నాస్తిక లోకాయతాది మత విమర్శన మొనర్చి ధర్మా చరణీయ సిద్ధాంతమును ప్రతిపాదించినాడు. కామమును సేవింపరాదనువారి వాదముల ఖండించు సందర్భమున ప్రతిపక్షులు సూపు అనర్థ జనసంసర్గ అసద్వ్యవసాయ అశౌచ అనార్య అనాయత్యాదులైన దోషములను త్రోసిరాజని 'శరీరస్థితి హేతుత్వాదాహార సధర్మాణోహి కామః' (1.2.46) అని కామమును శరీరస్థితికి హేతుభూతమనియును, ఆహారముతో తుల్యమైనదనియును నిర్ణయించినాడు. అంతేకాదు. 'ఫలభూతాశ్చ ధర్మార్థ యోః' (1.2.47) అని సూత్రీకరించి దానిని ధర్మార్థ సాధకముగ చెప్పియున్నాడు. అజీర్ణము మొదలగు దోషములందు ఏ విధమగు ప్రతీకారము నవలంబింతువో అట్టి ప్రతివిధానమును అవలంబించి కామమును సేవింపవలెననియును, దోషములున్నవని పరిత్యజింపరాదు, అని వాత్స్యాయనుని సిద్ధాంతము.

తదుపరి వచ్చు విద్యాసముద్దేశాధ్యాయమున త్రివర్గమును పొందినవానికి కామసిద్ధి కలుగవలెనన్న ప్రథమోపాయము విద్యాగ్రహణము. అందు మూలమున విద్యాసముద్దేశము మహర్షి పలికినాడు. ధర్మ (శ్రుతి స్మృతులు) అర్థ (వార్తా) విద్యలకు అడ్డురానిరీతిగ కామసూత్రమును తదంగ విద్యయైన చతుష్షష్టితో అధ్యయనము చేయవలెనని ఆయన నియమము.[17] 'ప్రాగ్యౌవనాత్స్త్రీ' (1.2.2) అను సూత్రమున పురుషులవలె స్త్రీలకును అంగసహిత కామవిద్య అధ్యయనమునకు కావలెనట! స్త్రీలకు శాస్త్రములు పఠించు అధికారము లేదనియును, ఒకవేళ పఠించినను గ్రహించు సామర్థ్యము లేదు కావున, శాసించుట నిరర్థకమను పూర్వాచార్యుల మతమును త్రోసిరాజని, వాత్స్యాయనుడు 'ప్రయోగ గ్రహిణం త్వాసామ్. ప్రయోగస్య చ శాస్త్ర పూర్వకత్వాత్' (1.3.5) అని స్త్రీలకు ఈ శాస్త్ర విషయమున ప్రవేశముండవలెనని శాసించుట నిరర్థకము, అనర్థకము కాజాలదని సిద్ధాంత మొనర్చెను. కొందరు స్త్రీలకు శాస్త్ర గ్రహణము కూడ కలదనియును, పురుషులవలె శాస్త్రములను జదివి, తత్పరిశ్రమ మూలమున బుద్ధి సంపాదించిన వేశ్యాజనము, రాజకుమార్తెలు, సామంతపుత్రికలు ఉన్నారనియును నిరూపణ మొనర్చినాడు (1. 3. 12)

స్త్రీలు కామసూత్రములను ఏకాంతముగ నభ్యసింపవలెనట. వారి కాచార్యత్వము వహింపదగిన వ్యక్తులను వారి గుణగణములను వ్యక్తమొనర్చిన తదుపరి చతుష్షష్టి సంప్రయోగాంత మగుటచే దానిని విపులముగ వివరించి, వేశ్య, రాకొమరిత,

మహామాత్ర దుహితాదులు దానిని నేర్చుకొనుట వలన కలుగు ఫలములు, పురుషులు నేర్చుకొనుట వలన కలుగు ఫలములను విశదీకరించినాడు. ప్రయోగశాస్త్ర గ్రహణముల రెంటిని నేర్చుకొనలేని పక్షమున కేవలము నొకదానినిగాని అందుకును చాలనపుడు సంప్రయోగాంగము నందలి భాగముగాని నేర్చుకొనవలెనని శాసించినాడు. (1.2.13)

నాగరక వృత్తము తదుపరి అధ్యాయము, ఇందు నాగరకుని గృహనిర్మాణ విధానము ప్రథమమున వివరించినాడు. గృహమున అంతర్గృహ, బాహ్యగృహ, బహిర్గృహములు, నందుండవలసిన వేదిక, అనులేపన, తాంబూల పాత్రికలు, వీణాదిస్థానములు, పతద్గృహము, చిత్రఫలకము, పుస్తకము, వర్తికా సముద్గకము, గోరింటమాలికలు, వృత్తాస్తరణము, ఆకర్ష ఫలకము, ద్యూత ఫలము, క్రీడాపంజరములు, ప్రేంఖాడోలిక, స్థండిల పీఠిక మున్నగు భవన విన్యాసములు చెప్పిన వెనుక నాగరకుల ప్రాతఃకాల కృత్యాదికములు వివరించినాడు. అటు పిమ్మట అపరాహ్ణ కాలకృత్యమును నిర్వర్తించిన వెనుక నాగరకు డొనర్పవలసిన కర్మలను చెప్పినాడు. అపరసంధ్యవేళ అలంకరించుకొని సంగీత వ్యాపారములు నిర్వర్తించి శయనరచన మొనర్చుకొని అభిసారికకై వేచి యుండవలెనట! తరువాత పర్వదినము లందొనర్పవలసిన గోష్ఠీవిభేదములు వివరించినాడు[18] అందలి ఆపానకవిధులు, కావ్య సంగీత నాట్యాది ప్రసంగములు గమనింపదగినవి. గ్రీష్మకాలమున జలక్రీడాదికములు, ప్రియులతో కూడి ఒనర్పవలెనని చెప్పి ఉన్నాడు. యక్షరాత్రి కౌముదీజాగరాది క్రీడలను తరువాత సంగ్రహముగ నిర్దేశించిన వెనుక నుపనాగరకుని గోష్ఠీ విధానమును గ్రామీణుల గోష్ఠీ విధానమును వ్యక్తమొనర్చినాడు. ఇట –

'నాత్యంతం సంస్కృతే నైవ నా అత్యంతం దేశభాషయా, కథాం గోష్ఠీషు కథయన్ లోకే బహు మతో భవేత్.' (1.4.50) అని నిబద్ధము చేసి గోష్ఠి సర్వజన విజ్ఞాన ప్రదముగ నుండునట్లు శాసించినాడు [19]

మహర్షి 'యాగోష్ఠీ లోక విద్విష్టా యాచ స్వైర విసర్పణీ పరహింసాత్మికా యాచ వతా మవత రేద్బుధః' అనుట వలన నా కాలమున వెలసిన కౌముదీ జాగరాది గోష్ఠులు లోక చిత్తానువర్తులని గ్రహింపవలసి ఉన్నది.

ఇక సాధారణాధికరణమున మిగిలినది నాయిక సహాయదూతకర్మ విమర్శాధ్యాయము. ఇందలి ప్రథమ సూత్రమును 'కామశ్చతుర్షు వర్ణేషు సవర్ణ తశ్శా నన్య పూర్వాయాం ప్రయుజ్య మానః పుత్రియో యశస్యో లౌకి కశ్చ భవతి' అను సూత్రము ననుసరించి కామము చతుర్వర్ణముల వారి యందును, సవర్ణముననుసరించి

శాస్త్రముననుసరించి అనన్యపూర్వమై కన్యాత్వమును కోల్పోవని నాయికయందు ప్రవర్తమైన నది పుత్రీయము, యశస్యము, లౌకికమయినది వశ్యమగుచున్నది. తద్విపరీత కామము ఆ నాడు ప్రతిషిద్ధము. అని వరసిద్ధులందును, వేశ్యాస్త్రీల యందును, పునర్భువులయందును ప్రయోగితమైన కామము సుఖార్థము కాన నిషిద్ధము కాదు, శాస్త్ర విహితము కాదు. అందువలన శిష్టము కాదు. దీనిని బట్టి ఆ నాడు అధమవర్ణ వివాహము లున్నను అవి కేవల సుఖార్థములని వక్తమగుచున్నది. వేశ్యా, పునర్భువులందు పుత్రాశలేదు. పునర్భువ పుత్రుడు పౌనర్భువుడు, పునర్భువ[20] కంటే వేశ్య స్థితి తక్కువ.

దీనిని బట్టి కన్యల వలన పుత్రుడు, అని వరసిద్ధులందును, పునర్భువ, వేశ్యలందు, సుఖము కామమును ప్రయోగించుట వలన కలుగుచున్నది. అంతేకాక ఇతర కారణముల వలన పరపరిగృహీత యైన స్త్రీ పాక్షికయగు నాల్గవ నాయిక అగుచున్నదని గోణికాపుత్రుని అభిప్రాయమును వాత్స్యాయన మహర్షి వెల్లడించినాడు.[21] పరపరిగృహీత యెడ కామము ధర్మవిరుద్ధము కాదా అని శంకించినచో, దానికి సమాధానముగ నామె ఉత్తమ వర్ణయైనను శీలము విడుచుట వలన ధర్మహాని కలుగదని చెప్పినాడు. ఆమె శీలభ్రష్ట కావున వేశ్యవంటిదట. అందువలన దోషము లేదట. దీనికి జయమంగళ వ్యాఖ్యాత 'జీవకార్ముక వస్త్రా వీన్దధ్యాదాత్మ విశుద్ధయే చతుర్ణామమి వర్ణానాం నారీర్త్వా వ్యవస్థితాః' అని ధర్మశాస్త్ర ప్రమాణము ఉటంకించినాడు.

విధవను పంచమ నాయికనుగా గ్రహింపమను చారాయణుని అభిప్రాయమును, ప్రవ్రజితను షష్ఠనాయికగా స్వీకరింపమను సువర్ణనాభుని మతమును, అనన్య పూర్వయైన వేశ్యాదుహితనుగాని, కన్యకయయ్యు పాణిగ్రహ ధర్మము లేనిదై నాయకునికి పరిచర్య చేయునట్టి పరిచారికను సప్తమనాయికగ పొందవలయునను ఘోటకముఖుని అభిప్రాయమును ఉత్క్రాంత బాలభావయైన కులయువతిని అష్టమ నాయికగ స్వీకరింపమను గోనర్దీయుని అభిప్రాయమును మహర్షి ఈ సందర్భమున పేర్కొనినాడు. (1. 5. 22, 23, 24, 24)

"కార్యాంతరాభావాదేతా సామసి పూర్వాస్వేవోపలక్షణం తస్మా దేతా ఏవ నాయికా ఇతి వాత్స్యాయనః" అని పై సమస్తమునకును తన అభిప్రాయమును స్పష్టీకరించినాడు. పై రీతిన నాయికలు అష్టవిధములు అని పూర్వాచార్యులు నిర్దేశించినను ఈ నాయికలును "కన్యకలు, పునర్భవలు, వేశ్యలు, పరదారలు" అను నల్వురు

చేయు కృత్యములనే చేయుట వలనను. తదితరములగు కృత్యములు వీరికి లేకుండుట వలనను వీరును నందే చేరుచున్నారని ఆయన అభిప్రాయము. నిజమునకును నంతే. విధవ, ప్రవ్రజికలు, పరదారలు, గణికాదుహితగాని పరదారగాని సుఖార్థమగుట వలన వేశ్యయందంతర్భూత లగుచున్నారు. కులయువతియైన నాయిక పుత్రమిత్రాది ఫలము కలిగినది కనుక, కన్యక కనుక నాయికలు నల్వురే.[22] అందువలననే వారిని గురించిన అధికరణములు మాత్రము వాత్స్యాయనమున ఒప్పుచున్నవి.

తదుపరి గమనింపవలసిన సూత్రము 'భిన్నత్వా త్తృతీయా ప్రకృతి పంచమీత్యేకే' అనునది. స్త్రీ ప్రకృతి పురుష ప్రకృతులకు భిన్నుడై ఔపరిష్టకాదులకు మైథున కర్మలకును, రూప వ్యాపారలాభ ముండుట వలనను నపుంసకుని అయిదవ నాయికగ పరిగణింపదగునని కొంద రాచార్యులు పలికిరని ఊరకొనినాడేగాని తన అభిప్రాయ వ్యతిరేకతను వ్యక్తపరుపలేదు.

నాయకుల విషయము వచ్చినప్పుడు 'ఏక ఏవతు సార్వలౌకికో నాయకః' (1.5.28) అని ఒక అర్థవాదమును పలికినాడు. కాని ఏకపత్నీవ్రత, బహుపత్నీ వ్రతాదులను బట్టియును, ప్రచ్ఛన్న బహిరంగాదులను బట్టియును, నాయకోప నాయకాది భేదములను బట్టియు, గుణములను బట్టియు, నాయక విభేదములున్నట్లు తదుపరి చెప్పియున్నాడు.

అగమ్యలను (సంప్రయోగము నెరపదగని వారు) గూర్చి తదుపరి ప్రసంగించినాడు. ఇట పరిశిష్ట న్యాయమున గమ్యలెవరో వాత్స్యాయన మహర్షి భంగ్యంతరముగ నిరూపించినాడనుట స్పష్టము. ఇట్టి నిరూపణ మొనర్చుటలో మహర్షి ధర్మ, మానసిక, శారీరకారోగ్యాది లక్షణముల ననుసరించి నియమించి నాడు. కుష్ఠరోగ, అతిశ్వేత, అతి కృష్ణాదులు ఆరోగ్య శాస్త్రసంబంధమున అగమ్యలు. సంబంధిని, సఖిప్రవ్రజిత రాజదారాదులు ధర్మమూలమున అగమ్యలు. ఉన్మత్త, దుర్గంధ ఇత్యాదులు మానసిక వికాస రహితలుగాను అగమ్యలు –[23] అగమ్యల విషయమున హిందూ, మహమ్మదీయ కామశాస్త్ర గ్రంథకర్తలు ఏకాభిప్రాయులై యున్నారు. గత యౌవనప్రాయను మహర్షి అగమ్యనుగ పేర్కొనినాడు. 'బాలార్కో ప్రేత ధూమశ్చ వృద్ధస్త్రీ పల్వ లోదకమ్ రాత్రౌ దధ్యన్న భుక్తిశ్చ ఆయుః క్షీణం దినే దినే' అను ఆర్యవచనమును దీని కానుగుణ్యముగ నున్నది. నఫోజైషేకు చిన్నదానితో రతి శక్తి నిచ్చుననియును, సమాన వయస్క వలన లాభముగాని నష్టముగాని లేదనియును, వృద్ధ స్త్రీ సంగమము విషసర్పము కాటు వంటిదనియును పలికినాడు.[24] వంధ్య, మృతశిశు ప్రసవ –

ఇరువురు స్త్రీలను ఆయుష్కాముడు చేరరాదని వాత్స్యాయన మహర్షి పలికినాడు. ఆధునిక వైద్యశాస్త్రజ్ఞు లెల్లరును నీ విషయములను అంగీకరింతురు. రాబిన్ సన్ అను ఒకానొక వైద్యమహాశయుడు తన "షండత్వము" (Sexual Impotence) అను గ్రంథమున

"శృంగార పురుషులు ఈ రెండుజాతుల వారిని వర్జింపవలసి యున్నది. వీరిలో ముఖ్యముగ గనోరియల్ సాల్ పింగిటిస్‌గాని, సిఫ్లిసు రక్తము గాని ప్రవహించుట వలన షండత్వము కలుగుననుట నిస్సంశయము." అని వ్రాసి యున్నాడు.[25] దుర్గంధను అగమ్యగ మహర్షి చెప్పి యున్నాడు. ఇట్టివారిని పరిత్యజించుటకు అమెరికా దేశమున విడాకుల చట్టములో నొక సూత్రమున్నట్లు "విడాకులలో శరీరస్థితి" (Sexual factor in Divorce) అను గ్రంథము వలన తెలియుచున్నది. బాల లక్షణములు గల స్త్రీయును అగమ్య. అట్టి స్త్రీని మానసిక శాస్త్రవేత్తలు 'బాలనారి' (Child Woman) అనినారు. 'ఆమెలో Electra Complex అను నొకానొక గుణమో లేక స్వజాతి ప్రణయ లక్షణమో (Homo-Sexual tendency) ఉండునని నిశ్చయించినారు' అని ఆ గ్రంథకర్త వ్రాసినాడు[26]

అగమ్యా ప్రసంగానంతరము నాయకునికి మిత్రులుగా నుండదగిన వారి లక్షణములను విశదీకరించి, వారికి కావలసిన దూత లక్షణములను "పటుతా ధార్ష్ట్య మింగితాకారజ్ఞతా అనాకులత్వం పర మర్మజ్ఞతా ప్రతారణం దేశజ్ఞానం కాలజ్ఞతా విషహ్యా బుద్ధిత్వం లఘ్వీప్రతిపత్తిః సోపాయా దూతగుణాః" (1. 5. 40) అను సూత్రమున నిబద్ధించినాడు.

త్రివర్గ విద్యాసముద్దేశముల మూలమున గుణములనొంది ఆత్మవంతుడై స్వరూప జ్ఞానము కలిగి 'ఆత్మవాన్ మిత్రవాన యుక్తః భావజ్ఞో దేశకాలవిత్, అలభ్యా మ ప్రయత్నేన స్త్రియం సంపాదయే న్నరః' అని ప్రథమాధికరణ ప్రయోజనమును సంక్షేపించినాడు.

సాంప్రయోగికము ద్వితీయాధికరణము వెనుకటి అధికరణమున "స్త్రియం సంసాధనయే న్నరః" అని చెప్పి ఆ ఆవాపమును వివరించుటకు ముందు సాంప్రయోగిక తంత్రమును మహర్షి వివరించినాడు. ఇది ప్రమాణాదుల మూలమున జ్ఞాతరూపము. లింగసంయోగాదుల కంటె ముందు భావకాలము అనునది కామశాస్త్ర ప్రమాణము. దీనిని బట్టి చేయదగిన రతావస్థాపనమును మున్ముందు విశదము చేయుటకై, సాంప్రయోగమున రతావస్థాపనమును ప్రథమాధ్యాయ మొనర్చినాడు.

ఈ అధ్యాయారంభమున మహర్షి వాత్స్యాయనుడు లింగప్రమాణముల ననుసరించి స్త్రీ పురుష విభేదముల నొనర్చి ఉన్నాడు. తరువాతి కాలమువారు ఇతని మార్గము ననుసరింపక నందికేశ్వర గోణికాపుత్రాదుల మతమున స్త్రీని పద్మిని, చిత్తిని, హస్తిని, శంఖిని – అని చతుర్విధ విభాగము లొనర్చిరి. ఈ విభాగమున కొంత శారీరక లక్షణము (Physical Nature), కొంత మానసిక స్థితి (Psychological Disposition), కొంత జాత్యము (Sexual Temperment) కననగును.

పాశ్చాత్య దేశములందును స్త్రీ జాతి విభాగము అనాదికాలముననే ప్రారంభమైనది. అది కేవలము వారి మానసిక స్థితిని, సౌందర్యాతిశయములను అనుసరించునది. ఒవిడ్ మహాశయుడు 'ఆర్స్ అమటోరియా' గ్రంథమున నిట్టి విభాగమునకు పూనుకొనినాడు. కాని అది విస్పష్టరూపమును పొందలేదు.[27] ప్లేటో, సోక్రటీస్‌లకు సమకాలికుడును వైద్య శాస్త్రజ్ఞుడు నైన, హిపోక్రేటిస్ స్త్రీ పురుష జాతులను రెంటిని వారివారి స్థితిననుసరించి (1) కంపనశీల (Nervous) (లేక) (2) వ్యాకుల (Meloncholic) (3) పైత్య (Bilous or Choleric) రక్తవర్ణ, ఉల్లాస (Sanguines) (4) శోషవాహిక (Lymphatic or Philematic) అని చతుర్విధ విభాగ మొనర్చి ఉన్నాడు.[28] కెట్ష్మెర్ మానవుల నందరిని (1) ఉద్వేగులు (Cyclothyme) (2) అనుద్వేగులు (Schizothyme) అని ద్వివిధ స్థూల విభాగ మొనర్చి, అందు రెంటను అనేక అవాంతర విభేదము లున్నవని పలికినాడు.[29] మీడియర్ అను ఒకానొక సాంఘిక శాస్త్రవేత్త (Sociologist) స్త్రీజాతిని వారి మానసికోద్దేశ లక్షణము (Emotional make up) ననుసరించి (1) మేహన లక్షణ లేక మాతృలక్షణ (Uterine or Maternal Type) (2) కామచ్ఛత్ర లక్షణ లేక జాత్యలక్షణ (Clitoroid or Sexual Type) అను ద్వివిధస్థూల లక్షణము నొనర్చి రెంటిలోను అనేక అంతర్విభేదము లున్నవని యున్నాడు.[30] ఈ విభాగము లన్నియు దాంపత్యానుకూలతను దృష్టియందుంచుకొని యొనర్చినవే. నేడు పాశ్చాత్య దేశమున విశేష పరిశోధన జరిగిన మాంసగ్రంథి శాస్త్రము (Endorinology) ననుసరించినవి. ఈ శాస్త్రానుసారముగ మానవజాతిలోని స్త్రీ పురుష విభేదములు, అందలి అంతర్విభేదములు – మానసిక జాత్యములు (Psycho - Sexual) రెండును – కొన్ని నాళరహిత మాంసగ్రంథులు (Ductless - Glands) కారణముగ నేర్పడినట్లు తెలియుచున్నది. ఈ శాస్త్రజ్ఞుల పరిశోధనల ననుసరించి స్త్రీ పురుష జాతులు రెంటను ప్రధానముగ చతుర్విధములు ఏర్పడినవి – (1) Pituitary Group (2) Thyroid Group (3) Thymus Group (4) Adrenal Group.[31] వీటినిబట్టి స్త్రీ పురుష జాతులు స్థూలముగ నాలుగు విధములని ఏర్పడుచున్నది. ఆధునిక జాతి

శాస్త్రజ్ఞుడు ఔస్ పెన్స్కీ ఇట్టి విభాగమునకు పూనుకొనక పోయినను, స్త్రీ పురుషులలో నాలుగు జాతులున్నవని అంగీకరించి విశ్వనవ్య రూపము (A new Model of the Universes) అను గ్రంథమున వ్యక్తమొనర్చిన అభిప్రాయములను 'ఆధునిక వివాహ' గ్రంథకర్త గ్రిఫ్ఫెత్ మహాశయుడు ఇట్లు సంగ్రహించినాడు.

''He says that in Sex-life men and women are devided in to four main types. Union between two wrongly assorted types produces discord and disharmony. Women of the first type, of whom there are few for each man, attract him irresistably, and, if the love is mutual' arouse the maximum of sensation. Women of the second type, of whom there are more, attract him also, but his feelings are more under the control of reason. This is a calmer love, and fits very well into the convensional pattern, passing more easily into friendship and sympathy. Women of the third type leave him indifferent. The feelings are weak, and the first satisfaction usually exausts all interest, and may even change to hostility. Women of the fourth type interest him still less and physical relationship with them contains a tragic element... Nothing is mere painful or immoral than sex - relationship without sensations.''[32]

మానవ వైవాహిక సంబంధము శారీరకము (Physical) ఉద్వేగయుతము (Emotional) విజ్ఞానయుతము (Intellectual) ఈ మూటయందును శారీరకము ప్రాథమిక ప్రాధాన్యమును వహించుచున్నది. మహర్షి వాత్స్యాయనుడు ఈ సత్యమును గమనించి స్త్రీలను మృగి (Doe) బడబ (Mare) కరిణి (She-Elephant) అని మూడు జాతులుగ విభజించినాడు. పురుషులును శశ, వృష, అశ్వజాతులు, స్త్రీ పురుష లింగ ప్రమాణ విభేదముల ననుసరించి నవవిధ రతిభేదములు ఏర్పడుచున్నట్లు 'అత్రాపి ప్రమాణ వదేవ నవరతాని' (2. 1. 16) అను సూత్రమున వెల్లడించినాడు. వాత్స్యాయన మహర్షి చేసిన విభాగము నందలి మృగి, వాడవ, కరిణుల, లక్షణమును తెలుపలేదు. కాని కొక్కోకుడు, పద్మశ్రీ, వ్యాసజనార్దనుడు దీనిని గమనించిరి. కాని వారు వేరుమార్గమును త్రొక్కిరి. వాత్స్యాయనుని మతము ననుసరించి చూచినచో తరువాత వారి పద్మిని, మృగి, వాడవ, కరిణులలో నేజాతికైన చెందవచ్చును. అదేరీతిగ హస్తిని, చిత్తిని, శంఖినులును.

పురుషులను శశ, మృగ, వృష, హయ జాతులుగను, స్త్రీలను పద్మిని (Lotous Woman), చిత్రిణి (Art-Woman) శంఖిని (Counch-Woman) హస్తిని (She-

Elephant Woman) అను విభాగము నందికేశ్వర మతము. ఈ మతము ననుసరించిన గ్రంథములలో స్మర దీపిక ప్రథమమున పేర్కొనదగినది. తరువాత కొంత కాలమునకు పుట్టిన శార్ఙ్గధర పద్ధతి, కందర్ప చూడామణులు ఈ మార్గము ననుసరింపక స్త్రీ పురుష జాతుల రెంటిని మేహన ప్రమాణముల ననుసరించి పంచవిభేదములతో పరిగణించిరి. స్త్రీలు : (1) హరిణ (She-Deer) (2) ఛాగి (She-Goat) (3) వాడవము (Mare) (4) కరిణి (She-Elephant) (5) కరభి (She-Camel). పురుషులు: (1) మృగ (Harst) (2) వర్కరము (He-Goat) (3) వృషము (Bull) (4) తురగము (Stallion) (5) రాసభము (Jack-Ass). వీరి మేహన ప్రమాణములు 6, 8, 10 12, 14 అంగుళములని వారి అభిప్రాయము.[32ఎ] స్త్రీభగ పరిధి లింగము పొడవును, మేహనము లోతును అనుసరించి ఉండునట. కాని అట్లుండని అవకాశములును కొన్ని సందర్భములందున్నవని కామసూత్ర వ్యాఖ్యాత యశోధరుడు (వ్యాఖ్య సూ. 2. 1. 2) అందు నిరూపించినాడు. దీర్ఘ లింగము పలుచగ నుండవచ్చును. కుబ్జలింగము మందముగ నుండవచ్చును. అట్టి సందర్భముల మొదటి దానికి వాంశిక మనియును (Bamboo Type), రెండవ దానికి ముసలకమనియును (Club-Type) రతిమంజరీ, స్మరదీపికలు నామకరణ మొనర్చినవి.

రతావస్థాపనాధ్యాయమున మహర్షి రతివిభేదములను కేవలము మేహనప్రమాణ వైవిధ్యము ననుసరించి మాత్రమే కాక విసృష్టి, వేగములను బట్టియును నవవిధములని నిర్ణయించుట వలన ఆయన మానసిక నైశిత్యము, శాస్త్ర వైశాల్యము వెల్లడి అగుచున్నవి. మానసికముగ గాని శారీరకముగ గాని మానవజాతి సమము కాదనియును అందు అనంత వైవిధ్యమున్నదనియును మహర్షి గ్రహించినాడనుటకు సందేహము లేదు. అందువలన మహర్షి మతము ననుసరించి 'ప్రమాణకాల భావజానాం సంప్రయోగాణా మేరైవేస్య నవవిధత్వా తేషాం వ్యతికరే సురతసంఖ్యా యానశ్యంతే కర్తు మతి బహుత్వాత్' (2. 1. 35) అను సూత్రమును బట్టి (9 × 9 × 9 = 729) ఏకోనత్రిశత్సప్త శతవిభేదములు ఏర్పడినవి. విసృష్టికి ఉపచారాది క్రియలొనర్ప వలసినదని చెప్పినాడే గాని వాత్స్యాయనుడు వాటి స్వరూపమును నిరూపించలేదు. కొక్కోకుడును వాని పొంత పోలేదు. అనంగరంగ కర్త కరికరక్రీడ (Tittilation) మొదలైనవానిని నిశ్చయించి తన్మూలమున నేర్పడిన నవభేదములను చేర్చినాడు. అందుమూలమున రతివిభేదములు 9 × 9 × 9 × 9 = 6561 విభేదములు ఏర్పడుచున్నవి. పాశ్చాత్యజాతి శాస్త్రవేత్త 243ను మాత్రమే పేర్కొనినాడు. ప్రమాణ (Size) విసృష్టి (Time of Orgasm) వేగము

# నవ విధ రతి విభేదములు

(ప్రమాణ, విసృష్టి, వేగ, క్రియల ననుసరించి)

| ప్రమాణము | | | | | విసృష్టి | | వేగము | | క్రియ | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| సంఖ్య | | పురుష | స్త్రీ | | పురుష | స్త్రీ | పురుష | స్త్రీ | పురుష | స్త్రీ |
| 1. | సమ (Equal-Fit) | శశ | మృగి | సదృశము | చిరసంభవ | చిరసంభవ | చండవేగ | చండవేగ | లఘూదయ | లఘూదయ |
| 2. | | వృష | వాడవము | | మధ్యసంభవ | మధ్యసంభవ | మధ్యవేగ | మధ్యవేగ | మధ్యోదయ | మధ్యోదయ |
| 3. | | అశ్వ | కరిణి | | శీఘ్రసంభవ | శీఘ్రసంభవ | మందవేగ | మందవేగ | చిరోదయ | చిరోదయ |
| 4. | ఉచ్చ (Tight-Fit) | వృష | మృగి | విదృశము | చిరసంభవ | మధ్యసంభవ | చండవేగ | మధ్యవేగ | లఘూదయ | మధ్యోదయ |
| 5. | | అశ్వ | వాడవ | | మధ్యసంభవ | శీఘ్రసంభవ | మధ్యవేగ | మందవేగ | మధ్యోదయ | చిరోదయ |
| 6. | నీచ (Hyper-Tight) | శశ | వాడవ | | మధ్యసంభవ | చిరసంభవ | మధ్యవేగ | చండవేగ | మధ్యోదయ | లఘూదయ |
| 7. | | వృష | కరిణి | | శీఘ్రసంభవ | మధ్యసంభవ | మందవేగ | మధ్యవేగ | చిరోదయ | మధ్యోదయ |
| 8. | అత్యుచ్చ (Loose-Fit) | అశ్వ | మృగి | | చిరసంభవ | శీఘ్రసంభవ | చండవేగ | మందవేగ | లఘూదయ | చిరోదయ |
| 9. | అతినీచ (Hyper-loose) | శశ | కరిణి | | శీఘ్రసంభవ | చిరసంభవ | మందవేగ | చండవేగ | చిరోదయ | లఘూదయ |

(ప్రమాణకాల భావజానాం సంప్రయోగాణా మే రైవేస్య నవవిధత్వాః తేషాం వ్యతికరే సురతసంఖ్యాయా శక్యంతే కర్తు మతి బహుత్వాత్ (2.1.66) అని వాత్స్యాయనుడు. సంక్షేపేణ శశస్యత్రీచత్వారింశ చ్ఛతద్వయం (243) తావదేవ వృషస్యాంశ్వస్యచ సముదాయేన చ ఏకోన త్రింశ త్సప్తశతాని – అని యశోధరుడు)

(Impulse) క్రియ (Amount of Stimulus) వీటినిబట్టి ఏర్పడిన రతివిభేదములను ప్రక్క పుటలోని పట్టికయందు విశదముగ కనవచ్చును.

ఈ రతావస్థానాధ్యాయముననే మహర్షి స్త్రీ పురుష విసృష్టి సంబంధమైన రతి (Orgasm) ని గురించి కొంత చర్చించి ఉన్నాడు. [33]పురుషునివలె స్త్రీ రతివిషయక విసృష్టి పొందదను పూర్వచార్యుల మతమును ఖండించి, స్త్రీకిని విసృష్టి సుఖమున్నదని నిరూపించినాడు. 'పురుషుడు విసృష్టి సుఖమును అనుభవించి కృతకృత్యుడై స్త్రీయెంత ప్రేరేపించినను మైథున కార్యమునుండి విరమించుచున్నాడు. స్త్రీకి స్వేచ్ఛగ విరమించుట యనునది లేదు. అందుమూలమున వారికి విసృష్టి సుఖప్రాప్తి పురుషునివలె లేదు. చిరకాలము భోగించి విసృష్టి సుఖమును పొంది భోగవ్యాపారమును శీఘ్రవేగుడగు నాయకుడు విరమించిన స్త్రీలు ద్వేషించుచున్నారు. దీనివలన వారికి భావప్రాప్తి ఉన్నదని వ్యక్తమగుచున్నది. కాని అది విసృష్టి సుఖానుభవము వలన కలిగినదా? లేక స్త్రీలకు సహజమగు కండూతి ప్రతీకారము వలన కలిగినదా? అని ప్రశ్నించుకొని 'తస్మాత్ సందిగ్ధత్వా దల క్షణ మితి' (2.1.30) స్త్రీ పురుషునివలె రతిని పొందుట లేదనియును సంయోగే యోషితః పుంసాం కండూతి రపనుద్యతే తచ్చాభిమాన సంపృష్టం సుఖమిత్యభిధీయతే (2.1.31) అను సూత్రమున కండూత్యపనోదము వలన కలుగునట్టి అభిమానయుతమైన సుఖస్పర్శనే కారణమునందు కార్యమునుపచరించి అభిమానిక విధమగు సుఖమని స్త్రీ చెప్పుచున్నదని ఔద్దాలకి అభిప్రాయము. ఆరంభము నుండి భావమును పొందుననియును, పురుషుడు రతాంతమున శుక్రనిసర్గమున భావమును పొందుననియు బాభ్రవ్యుడు దానిని ఖండించినాడు. 'ఏత దుపపన్నతరం' అని దానిని సమర్థించి, వాత్స్యాయనుడు భావప్రాప్తి వలన స్త్రీ తృప్తి, విసృష్టి సుఖప్రాప్తి వలన గర్భధారణ పొందుననెను. దీనికి జయమంగళ వ్యాఖ్యాత సుశ్రుతాచార్యులవారి 'యథా నా రీ చ నా రీ చ మైథునాయోపపద్యతే, అన్యోన్యం ముంచతః శుక్ర మవస్థ స్తత్రజాయతే' అను శ్లోకము నుదహరించి ఇరువురు స్త్రీలు మైథున మొనర్చుట కారంభించినపుడు పరస్పరము శుక్రము వదలుట వలన అవస్థి పుట్టునని అందువలన స్త్రీకి విసృష్టి సుఖమున్నదనియును వ్యాఖ్యానించినాడు. ఈ సందర్భమున 'సురతాంతే సుఖం పుంసాం స్త్రీ ణాంతు సతతం సుఖం ధాతుక్షయ నిమిత్తా చ విరామే చ్ఛోపజాయితే' (2,1.40) అను సూత్రమున స్త్రీకి సురతారంభము నుండి సుఖము కల్గును. ధాతుక్షయనిమిత్తముగా విరామేచ్ఛ కలుగును అని నిశ్చయించినాడు.

మహర్షి విసృష్టిని గురించి యొనర్చిన చర్చ యెంతయు సమంజసముగ నున్నది. ఆధునిక జాతిశాస్త్రజ్ఞుల అభిప్రాయముల కానుగుణ్యముగ నున్నది.[34] ఆధునిక వివాహమను గ్రంథమున గ్రిఫ్ఫిత్ మహాశయుడు ఇట్లు వ్రాసి ఉన్నాడు. "స్త్రీ పురుషులకు విసృష్టి సుఖము పరస్పరమున్న కాని పరిపూర్ణ సంభోగ రసానుభవము కలుగదు. మూఢులైన నాయకానాయికలు వ్యక్తిగతముగ స్వేచ్ఛగ విసృష్టి సుఖమును పొందగలుగుదురు, పురుషుని శుక్ర వినిర్గమమునకు పూర్వమే స్త్రీ ఒకటి రెండు మారులు స్యందనము పొందవచ్చునని నేను అంగీకరింతును. కాని ఏక కాలమున నిరువురును పొందిన విసృష్టితో నిది సమము కాదు. శుక్రబహిర్గమను సంభోగము (Coitus Interruptus) నొనర్చువారికి అట్టి విసృష్టి సుఖము లభ్యము కాదు."[35] ఈ అభిప్రాయమునే మహాశయుడు Havelock Ellis ఇట్లు చెప్పినాడు.

"The whole structure of the world is built upon the general fact that the intimate contact of the male and female who have chosen each other is mutually pleasurable. Below this general fact is the more specific fact that in the normal accomplishment of the act of sexual consummation the two partners experience the actual gratification of simultaneous orgasm. Herein it is said, lies the secret of love"[36]

స్త్రీలు వదులు నీ శుక్ర మెచ్చటిదను ప్రశ్న ఉదయించగా మనవారు అది రసధాతుజనితమై అసృగ్ధాతువే (రక్తధాతువు) ఒక స్థితిలో ఆర్తవమనిపించుకొను ననియును, అది మజ్జాధాతువు నుండి పుట్టినదని అభిప్రాయములో పడినారు.[37] పాశ్చాత్య శాస్త్రజ్ఞులలో వాన్‌డి వెల్డి ఈ విసృష్టి మూలకమైన స్త్రీ శుక్రము బర్తలోనియన్ గ్లాండులనుండి నరముల ఒత్తిడి మూలమున బయటకు స్రవించునని అభిప్రాయ మిచ్చినాడు.[38] కాని అనేకులు సుప్రసిద్ధ వైద్య శిఖామణులు దీనినంగీకరింపక, ప్రాచీనులు చెప్పినట్లు అది మజ్జాధాతు సంబంధమైన దనినారు.[39] స్త్రీ శుక్ర సంబంధమైన అనేక విశేషాంశములు వైద్యశాస్త్రజ్ఞులు వెల్లడించినారు.

'జాతే రభేదాద్దుపత్యోః సదృశం సుఖమిష్యతే, తస్మాత్తథోపచర్యా స్త్రీయథాగ్రే ప్రాప్నుయాద్రతిమ్' అను సూత్రము వలన వాత్స్యాయన మహర్షి జాతిభేద రహితమగు స్త్రీ పురుషులకు సదృశముగనే సుఖము కలుగునని చెప్పియున్నాడు. కండూతి నివారణమును బట్టియును, శుక్రక్షరణమును బట్టియును, స్త్రీలకు కలుగు సుఖము ద్వివిధము. అందును శుక్రక్షరణము స్యందనమని విసృష్టియని మరల ద్వివిధము.

స్యందనము వలన క్లిన్నత, విసృష్టి, మథనముల వలన సుఖము కలుగును. ఇది రతి మధ్యస్థితి. చివర విసృష్టి సుఖము పురుషునివలె స్త్రీకిని పూర్ణముగ లభించును అని ప్రాచ్యుల నిశ్చితాభిప్రాయము. విసృష్టి సంబంధమైన స్థితిని ముత్తెరగులుగ విభజించి దాని స్వరూపమును “The libido may be devided into 3 phases. The anti orgastic, orgastic and post-orgastic phases. During the anti-orgastic stage, the lustful sensation grows by degrees in intensity upto the moment of commencing ejaculation. The libido then remains relatively constant for sometime, the larget last swells then suddenly to the maximum and reaches its acme, the orgasm at the instant of emission” అని టాల్మీ మహాశయుడు ‘ప్రణయము’ అను గ్రంథమున వ్రాసియున్నాడు.[40]

ఈ అధ్యాయమున మహర్షి చెప్పిన ‘ప్రథమ రతే చండవేగతా శీఘ్రకాంతా చ పురుషస్య ముత్తరేషు యోషితః పునరేత వేవ విపరీత మాధాతుక్షమాత్’ అను సూత్రములోని అర్థము వలననే బంధవిభేదముల ఆవశ్యకత ఏర్పడినది.

తదుపరి వాత్స్యాయనుడు ప్రీతిలక్షణములను వివరించినాడు. ఆ ప్రీతి విభేదములు నాలుగు (1) అభ్యాసిక (2) అభిమానిక (3) సంప్రత్యయిక (4) విషయకములు. ఇందు అభిమానిక ప్రీతి విషయమున ‘ప్రకృతే ర్యాతృతీయస్యాః స్త్రియా శ్చైవోపరిష్టకే తేషు తేషు చ విజ్ఞేయా చుంబనాదిషు కర్మసు’ (2.1.74) గమనింపదగినది. స్త్రీ పురుష ప్రకృతుల రెంటను చేరని తృతీయా ప్రకృతులకును (నపుంసకులు) ముఖచాపల్యముగల స్త్రీకిని ఔపరిష్టక రతియందును, అట్టివేయగు చుంబనాదికములందును రాగసంకల్పము వలన కలుగు ప్రీతి అభిమానికము.[41]

సాంప్రయోగికమున ద్వితీయాధ్యాయమున ఆలింగన విచారాధ్యాయముల చుంబన వికల్పము, నఖరదన జాత్యాద్యధ్యాయములు, దశనచ్ఛేదాద్యధ్యాయములు తదితరములు.

రతావస్థాపనానంతరము వాత్స్యాయనుడు సంప్రయోగ స్వరూపమును నిరూపించినాడు. దీనికి చతుష్షష్టి యను నామాంతరమున్నట్లు చెప్పి అందుకు కారణముగ నొక సూత్రమును వ్రాసినాడు.[42] సంప్రయోగము – (1) ఆలింగనము, (2) చుంబనము, (3) దంతక్షతము, (4) నఖక్షతము, (5) సీత్కృతము, (6) పాణిఘాతములు, (7) సంవేశనము, (8) ఉపసృప్తము, (9) ఔపరిష్టకము (10) పురుషాయితములు.

ఇందు ఆది అగు ఆలింగనము బాహ్యరతి సమయమున – స్పృష్టక, విద్ధక, ఉద్ఘష్టక, పీడితములని నాలుగు విధములును, రతి సమయమున వృక్షాధిరూఢ, తిలతండుల, క్షీరనీర, లతావేష్టితములని నాలుగు విధములును (2.2.7–16), ఇందు సంప్రయోగ కాలము లందు లతావేష్టితక, వృక్షా దిరూఢకము కలదు. నాయిక ప్రయోక్తిగ నుండవలెనని యశోధరుని వ్యాఖ్యానము. ఈ ఉభయమునకు వాత్స్యాయనుడు స్థితకర్మ లనినాడు. (22.18) తదుపరి ఏకాంగోపగూహనములుగ ఊరు, జఘన, స్తన, లలాటికాలింగనములను సువర్ణనాభుని మతమును పేర్కొనినాడు. వీనిలో రతి పూర్వరంగమునకు (బాహ్యరతి) సంబంధించిన నాల్గింటిలో స్పృష్టక, ఉద్ఘట్టక, పీడితకములను వదలి తదుపరి వచ్చిన ఏకాంగోపగూహనములలోని ఊరు, జఘన, లలాటి కాలింగనములను గ్రహించి అనంగరంగాది కామశాస్త్రజ్ఞులు ఆలింగన షష్ఠమును మాత్రమే పేర్కొనినారు. కుట్టనీమత కర్త, దామోదరగుప్తుడు చక్రవాక, హంస, నకుల, పారావతాది ఆలింగన విధానములను పేర్కొనినాడు. కామసూత్రముల లోనే ఆమోద, ముదిత, ప్రేమ, ఆనంద, రుచి, మదన, వినోదాలింగనములను గూర్చి 'పృచ్ఛతాం, శృణుతాం వాపి తథా కథయతా మపి ఉపగూహనవిధిం కృత్స్నం రిరంసా జాయతేః శృణాం' (2.2.30) అను సూత్రమున ఉక్తి వైచిత్ర్యముతో వెల్లడించి మనుజులకు రిరంస (కామేచ్ఛ) కలిగించుటయే వీని ప్రయోజనమని స్పష్టముగ పలికినాడు.

ప్రణయ చుంబనము మానవుని కొకనాడు లభ్యమైన గుణము కాదని ఎల్లిస్ అభిప్రాయము. చుంబనమును ప్రపంచములలోని వివిధ జాతులు వివిధ రూపముల అనేక భావములకు వెల్లడి యొనర్చుట కుపయోగించు చున్నారు.[43] 'వివాహ గ్రంథకర్త వాన్ డి వెల్డి చుంబనమున రుచి, స్పర్శ, గంథములున్నవనినాడు.[44] ఈ అభిప్రాయమున కనుగుణముగ కెన్నెత్ వాకర్ "Kisses provide a fitting prelude to love, and all the great Eastern works on the subject devote much attention to the art of kissing. the lover's kiss the tongue often plays the part so that other special senses contribute their quota to it; Taste and smell are added to tacitile sensation. In this connection it will be remembered that it was said of the kisses of POPPAEA that they had about them the favour of wild berries. It is, however among the Mongolian Races that the olifactory component of the kisses enters so iargely into courtship. In the kiss of Europeans touch predominates over smell" (Physiology of sex - page 47) వాత్స్యాయన మహర్షి

స్త్రీ పురుషాది విభేదముల ననుసరించి చుంబన వికల్ప ప్రకరణమున స్థానక్రియా రూపాదికములను చక్కగ నిరూపించినాడు. చుంబనాది పంచకములో ముందు వెనుకలు లేవనియును (2. 3. 4) 'సర్వసర్వత్రరాద స్యాన పేక్షితత్వాదితి వాత్స్యాయనః' అనుచోట సమస్త శరీరమును ప్రయోగ యోగ్యస్థానమనియును పలికినాడు (23. 3.)

మహర్షి వాత్స్యాయనుడు అతి నిశిత విచక్షణతో చుంబనమును ముగ్ధయగు కన్యక యొనర్చు నిమిత్తము మొదలు ప్రౌఢ యగు నాయిక యొనర్చు జిహ్వాయుద్ధము వరకును పరిశోధించి విభజించినాడు. చుంబన యోగ్య స్థానముల విషయమున కామసూత్రములకును, రతిమంజరికిని విశేష విభేదము కనుపించుచున్నది. రతిమంజరీకర్త యోనిని చుంబన యోగ్య స్థానముగ నిరూపింప మహర్షి దానిని ఊరుసంధిగనే పలికినాడు.[45] తొడలు, క్రీగడుపుపై నొనర్చు చుంబనమునకు నాగరసర్వస్వకర్త పద్మశ్రీ సంహతోష్టము అని నామకరణమొనర్చెను. పాశ్చాత్యుల 'Brush and Bloom' అను చుంబనమును వాత్స్యాయనుడు నమితమని వ్యవహరించి నూతన వధూపరము గావించినాడు. కామసూత్రములలోని ఉద్భ్రాంతమును రతి రహస్యకారుడు ఉద్భ్రాంతక మనినాడు. దీనిని నాగరసర్వస్వము భ్రమిత మనియును, అనంగరంగము తిర్యక్కనియును వ్యవహరించినవి. కామ గ్రంథముల 'ప్రతిబోధ' మను పేరనున్న చుంబన విధానము చుంబన విధానము కాజాలదని నేటివేత్తల అభిప్రాయము. వాత్స్యాయనుని సూత్రముల కనిపించిన (1) సూచి, (2) ప్రతత (3) కరి అను చుంబన విభేదములను పద్మశ్రీ నిరూపించినాడు. కామసూత్రములందున్న చుంబన ప్రతిచుంబన విధానముల కాలస్థలజాతి విభేదములను పరిశీలించినచో ప్రాచీన భారతీయుల కామకళ ఎట్టి ఉచ్చస్థితి నొందినదో తేటపడగలదు. వాత్స్యాయన మతమున చుంబనములు 13. (1) నిమిత్తకము (Perfunctory kiss) (2) స్ఫురితము (Tremoulous) (3) ఘట్టితకము (Driving) (4) సమ (Straight) (5) వక్ర లేక తిర్యక్ (Oblique) (6) ఉద్భ్రాంతము (Errastic) (7) అవపీడితము (Compressed) (8) శుద్ధావ పీడితము (Soft-Pressed) (9) చూషణము లేక అధరపాన (The sucking or lip drinking) (10) ఆకృష్ట (Drawn-up) (11) ఉత్తర చుంబిత (Concurrent kiss) (12) సంపుటక (Cupping) (13) జిహ్వాయుద్ధ (Tongue tilting).[46] ఇంతేకాక ప్రాతిబోధ (Awaking kiss) ఆది చుంబన విభేదములును కామసూత్రములందు కనుపించుచున్నవి. కాఫ్ట్ ఎబ్బింగు, ఫ్రాయిడ్ మొదలగు ఆధునిక విజ్ఞానులకంటె నెంతో పూర్వము భారత, రోమకదేశ కామకళా శాస్త్రవేత్తలు కామతంత్రమున చుంబన స్థానమును గమనించి తదనుగుణముగ శాస్త్ర రచన చేసియున్నారు. ఇట్టి

విభాగావశ్యతకు స్త్రీ జాతిలోని అహంభావ పూర్వకమైన ఆర్ద్రరహితత (Mosochistic tendencies of a sex-conscious women) ప్రాచీనులు గుర్తించుటయే కారణము.[47] కామ ప్రేరణమున చుంబన శక్తిని గమనించుటయును మరియొక కారణము. ఆ శక్తిని గూర్చి ఆధునిక వివాహ కర్త గ్రిఫ్ఫిత్తు అన్న మాటలు సమంజసములు[48] ఈ వాక్యములకు మహర్షి అంగీకారమును నున్నది. గ్రిఫ్ఫిత్తు మహాశయుడు "నేటి ఆధునిక స్త్రీ చుంబన క్రియ పురుషకర్మయని భావించుట కానవచ్చుచున్నది. అది పొరబాటు. అతడెట్లు చుంబించినచో ఆమెయునట్లు చుంబింపవలెనని" ఈ నాడు పాశ్చాత్య దేశములకు చెప్పవలసి వచ్చినది.[49] మహర్షి రెండువేల వత్సరములకు మున్నే "కృతే ప్రతికృతం కుర్యా త్తాడితే ప్రతితాడితం, కరణేనచ తేనైవ చుంబితే ప్రతిచుంబితమ్" అని స్త్రీ లోకమునకు శాసనమొనర్చినాడు. (2.3.34)

స్మరదీపిక నాగర సర్వస్వాది కామగ్రంథములందు చూషణము (Sucking) అను మరియొక సంప్రయోగాంగము (Form of Love Play) కనుపించు చున్నది. పద్మశ్రీ ఇందలి – ఓష్ఠ విమృష్టకము, చుంబితకము, అర్ధ చుంబితకము, సంపుటకము – అని నాలుగు విభేదములను చెప్పినాడు. ఇవి వాత్స్యాయనుని చూషణ చుంబన విభాగములేగాని అన్యములు కావు.

తదుపరి కామసూత్రకర్త నఖాదానమును గురించి ప్రసంగించినాడు. ఉపయోగింపవలసిన సమయములను "తస్య ప్రథమసమాగమే ప్రవాస ప్రత్యాగమనే క్రుద్ధ ప్రసన్నాయాం మత్తాయాం చ ప్రయోగో ననిత్య మచండ వేగయోః" (2.4.2) అను సూత్రమున విశదీకరించినాడు. రాగోద్దీపన యైన తదుపరి స్థాన మస్థానమనిగాని సమయములని గాని నిబంధనలు లేనట్లు సువర్ణనాభుడు (2.4.6) సూత్రములందు 'కక్షౌ స్తనౌగళః పృష్ఠం జఘనమూరూచ స్థానాని' (2.4.5) అని స్థాన నిర్దేశమున్నది. స్మరదీపిక కారుడు ఇంత కంటె భిన్న స్థానముల పేర్కొనినాడు. కొక్కోకుడు మాసిక రజోదర్శనానంతర కాలమున కొన్ని దినములు నఖాదాన యోగ్యములని చెప్పినాడు. చండ, మధ్య, వేగల నఖలక్షణము లెట్లుండవలెనో వాత్స్యాయన యశోధరులు వెల్లడి చేసినారు. ఈ సందర్భమున మహారాష్ట్ర దాక్షిణాత్యుల నఖలక్షణములు నిరూపితములైనవి. (2.4,10,11) నవవిధములైన నఖాదాన రీతులు కామసూత్ర కర్త మతమున నేర్పడినవి. (1) ఛురితకము (Clasping of the Nails) (2) అర్ధచంద్రకము (Half Moon) (3) మండలకము (Circle) (4) రేఖా (Vertical Lines) (5) మయూరపాద (Peacock Foot Print) (6) వ్యాఘ్రపాద (Tigers

claws) (7) శశప్లుతకము (Poping of the Hare) (8) ఉత్పలపత్రకము (Lotus Petal) ఇందు రేఖ నెటనైన ప్రయోగింపవచ్చునని వాత్స్యాయనుని మతము. కేవలము చేతులు, తొడలు, స్తనములు, గుహ్యాంగము (Mons Veneris) నందును మాత్రమేనని అనంగరంగకర్త. వాత్స్యాయనుని వ్యాఘ్ర నఖస్థాన ములకు భిన్నముగ నాగరసర్వస్వకర్త తొడలు పిరుదులపై ప్రయోగింప వచ్చుననినాడు. ఉత్పలపత్రము విషయమునను కామసూత్రకర్తకును, అనంగరంగకర్తకును అభిప్రాయభేదమున్నది. అంతమున 'ఆకృతి వికార యుక్తాని చాన్యావ్యపి కుర్వత' (2. 4. 23) అని అనురాగము నేర్పు ననుసరించి నఖాదానమొనర్పవలెననియును, ఇందు చెప్పిన వికల్పములు మాత్రమే కాక అనంతభేదమున్నదని యను పూర్వాచార్యుల మతమైనట్లు పలికినాడు. (2. 4. 24) రాగ సంజననము కొరకు వైచిత్ర్యమును అపేక్షించుట లోకసహజ మగుటవలన నఖాదానములొనర్చినను పరదారల విషయమున రహస్య ప్రదేశములందు మాత్రమే ప్రయోగింప వలెనని చెప్పినాడు. (2. 4. 26) నఖక్షత దేహములు స్త్రీ పురుషుల కిరువురకును రాగవర్ధకములని ఆయన నిశ్చయము – అందువలననే ప్రాచీనులు 'సహసా నఖంపచ స్తన దత్త పరిరంభ' సంభోగులైనారు. వేశ్యలు 'గరజలేఖాలంకృత కుచయుగళ' లైనారు.

దశనచ్ఛేద్యమును (Morsification) అతి గాఢమైన చుంబన విధానముగ పాశ్చాత్యులు పరిగణించినారు. 'రదనములు పెదవులను ఒకచోట చేర్చుటకే కాక అవి ప్రీతి నచుంబన సమయముల రాగవృద్ధికరములుగ నుపకరించు చున్నవి. సంప్రయోగమున ప్రధాన అప్రధాన పాత్రలు (Active and Passive Partners) ఇరువురును నిశితములు, మధురములు అయిన రదనచ్ఛేద్యముల మూలమున శృంగారకానందము (Erotic Pleasure) ను పొందుదురు. కాని అట్టివారిని ఒకదాని వెనక ఒకదాని పరస్పరము ఏకస్థానీయము అగునట్లు ప్రయోగింపవలయును. నాయికా నాయకులు భావప్రాప్తి అత్యున్నత స్థాయిని పొందినప్పుడు వారు దంతముల నుపయోగించుదురు. అట్టి సమయముల వారికి ఎట్టి క్రియలును వైపరీత్యము (Abnormal) గ తోచవు' అని ఒక ఆధునిక శాస్త్రజ్ఞుడు దంతక్షత ఆవశ్యకతను గూర్చి పలికినాడు. [50] మరికొందరు శాస్త్రజ్ఞులు దీనిని వైపరీత్యముగ నెంచుటమాని, ఒక మతము దంతక్షతాదాన సహన గుణములు వివాహితులకు కొంతవరక వసరమనియు చెప్పుచున్నారు.[51] అన్య శాస్త్రకారాదృష్ట అధ్వగుడైన వాత్స్యాయనుడు రదనచ్ఛేదావశ్యకతను, కామతంత్రమున తత్‌స్థానమును గమనించి నిరూపించినాడు. జయమంగళకర్త 'ఆలింగనాదయో దేశ ప్రవృత్తి, మనిరూప్య ప్రయుజ్యమానా నరాగ

హేతవ' అని హెచ్చరించి ఉన్నాడు. 'గూఢక (Hidden) ముచ్ఛూనక (Swollen) బిందు (Spot) బిందుమాలా (Chain of spots) ప్రవాళమణి (Coral) ప్రవాళ మణిమాలా (Coral chain) ఖండాభ్రకం (Broken cloud) వరాహచర్వితక (Boars) మితి దశనచ్ఛేదన వికల్పాః' (2. 5. 4) అనుసూత్రమున వీటి భేదములను నిరూపించినాడు. ఉచ్ఛూనకమును వాత్స్యాయనుడు లోపలి పెదవిపై ప్రయోగింపనగు నని చెప్పగా అనంగరంగకర్త ఎడమ బుగ్గను దానిస్థానముగ చెప్పినాడు. ప్రవాళమణి రదనక్షతమును కామసూత్రములు అనేక మారులుగ ప్రయోగించి చూపమును పొందవలెనని చెప్పగా అనంగరంగ కర్త కల్యాణమల్లుడు పొరపాటు పడి కఠినముగ కొఱికి ఒక మారే యొనర్పవలెననినాడు. కల్యాణమల్లుడనినట్లు ప్రవాళమణి స్థానము పైపెదవి కాదు. దక్షిణ చుబుకము నందును ప్రయోగింపవచ్చును. మహర్షి అట్టొనర్చిన దానిని మండల రదనచ్ఛదముగ పరిగణించినాడు. "తదుభ మపిచ చండ వేగయోః" (2. 5. 18) అను సూత్రము ననుసరించి స్త్రీ పురుషులిరువురును వీనిని ప్రయోగింపవలయునని శాస్త్రకారుల మతమైనను విశేషముగ నివి పురుష ప్రవర్తకములుగ ప్రాచ్య దేశములందు కనిపించుచున్నవని పాశ్చాత్య జాతిశాస్త్ర వేత్తల అభిప్రాయము.[52]

రాగోద్దీపక క్రియలలో కచాకర్ష మొకటి. (Hair-Caressing) ఈ కేశగ్రహణము నేటి వరకును పాశ్చాత్యలోకము లెరుగవట! కామసూత్ర రతిరహస్యములందు కచాకర్షణ విధానములు కనిపింపవు. పంచసాయకములోని ఒకానొక ప్రతిలో ఒక విధానమున్నది. మరియొక విధానము నాగరసర్వస్వము నందున్నది.[53] అనంగరంగమునకు ప్రతిరూపమైన కామప్రబోధమున వీని స్వరూప స్వభావాదులు విశదముగ కనుపించు చున్నవి. ఇట్టి ఉద్దీపన క్రియలలో చేర్చదగిన మరికొన్ని మర్దనములు (Squeezes), గ్రహణములు (Grasps) కనుపించుచున్నవి. ఇవియును పూర్వ గ్రంథములందు లేవు. ఇవి బాహ్యరతులు. కరతాడన విధానముల పురుషులొనర్పదగిన వానిని నాల్గింటిని, స్త్రీ లొనర్పదగిన వానిని నాల్గింటిని అనంగరంగ కర్త పేర్కొనినాడు. పద్మశ్రీ కొన్ని మర్దనములను, గ్రహణములను చెప్పినాడు. ఆది పితకము (Enkindling) స్పృష్టకము (Touching) కంపితకము (Throbbing) సమిక్రమము (Attacking all about) ఇవి మర్దనరీతులు – బద్ధముఖి (Close Grasp) – వేష్టితకము (Twinning) కృతగ్రంథికము (Knotted tightly) సమకృష్టి (Pinching) గ్రహణములు ఔపరిష్టక సీత్కృతములును బాహ్యరతిలోనివే. వీనిని మహర్షి వేరు అధ్యాయముల విశదీకరించెను.

సంవేశన చిత్రరతాధ్యాయము (Modus sexualis) నకు ముందు మహర్షి దేశసాత్మ్యము ననుసరించిన ఆయా దేశీయములగు ప్రవర్తనములను విశదపరచినాడు.[54] 'ప్రకృత్యా మృద్వ్యో రతిప్రియా అశుచి రుచయో నిరాచారాశ్చాంధ్ర్యః' (2.5.28) అని ఆంధ్ర స్త్రీ లక్షణమును చెప్పినాడు. దేశ సాత్మ్యముల వివరించు సందర్భముల కొక్కోకుడు వాత్స్యాయను ననుసరించినాడు. పద్మశ్రీ నూతన మార్గమును త్రొక్కినాడు. మాళ్వ దేశ సాత్మ్యమును గూర్చి వాత్స్యాయనుడు 'పరిష్వంగ చుంబన నఖదంత చూషణ ప్రధానాః క్షత వర్జితాః ప్రహనం సాధ్యాః అభీర్యశ్చ' (2.5.24) అని వాత్స్యాయనుడు, కొక్కోకుడు, చూషణమును వదలినారు. అనంగరంగకర్త వారికి కరతాడనాదికములన్న ఇష్టమనినాడు. ఆంధ్ర స్త్రీలను వాడవకము (The art of holding the Linga by SPINCTER CUNNI Muscles) అని అందరు నంగీకరించినారు. (రతిరహస్యము - V-14) కర్ణాటక స్త్రీల సాత్మ్యమును గూర్చి నాగరసర్వస్వమును పూర్వగ్రంథములు ప్రసంగింపలేదు. కోసల స్త్రీలకు యోనికండూతి విశేషమనియును, కామతంత్రము నెరిగినవారని అనంగ రంగము, వీరు చండవేగలని అపద్రవ్య ప్రధానలు (Artificial Phallus) అని వాత్స్యాయనుడు (2.5.27). పాటలీపుత్ర స్త్రీలను గురించి కామసూత్రములందు ఎట్టి ప్రసంగమును లేదు. అనంగరంగకర్త నాగరీలక్షణములనే పాటలీపుత్ర స్త్రీల సాత్మ్యముగ చెప్పి ఉన్నాడు. వంగదేశమునకు పశ్చిమమున నున్నది స్త్రీ రాజ్యమని వ్యాఖ్యాత అభిప్రాయము. వారు ఖరవేగలు అపద్రవ్య ప్రియలు అని వాత్స్యాయనుని అభిప్రాయము. 'సకల చతుష్షష్టి ప్రయోగ రాగిణ్యో అశ్లీల పరుష వాక్యప్రియాః శయనే చ సరభసోపక్రమా మహారాష్ట్రన్' (2.5.28) అని మహారాష్ట్ర స్త్రీ లక్షణమును వాత్స్యాయనుడు వచించినాడు. దానినే కొక్కోకుడు గ్రహించినాడు. వీరికి గాఢరమేచ్ఛ కలదనియును, ఆలింగన చుంబనాదికము లందు ఆసక్తికలవారనియును, సంభోగమునకు ముందు కరికరక్రీడ (Titilation) ను[55] వాంఛింతురనియును పలికినాడు. వంగగౌడ లౌహిత్య కామరూప స్త్రీలకు నాగరసర్వస్వ కర్త అధరామృతపానశక్తి విశేషమని వాత్స్యాయనుని కంటె నధికముగ చెప్పి ఉన్నాడు. ఉత్కళులను గూర్చి వాత్స్యాయనుడు గాని, పద్మశ్రీ గాని పలుకలేదు. ఉత్కళదేశ స్త్రీలకు ఔపరిష్టక రతి (Fellatio and cunninglingus) యందాసక్తి విస్తారమని రతిరహస్యకర్త అభిప్రాయము. కామరూప స్త్రీలను గూర్చి విశేషాంశములను వాత్స్యాయనుడు పలుకలేదు. కొక్కోకుడు వారికిని, నేపాళ చీనాదేశము వారికిని, శృంగారిక దృష్టి వైశిత్యము విశేషమని పలికినాడు. వనవాసస్త్రీలు మృదుల హృదయలనియును, అసభ్య వైవాహిక ధర్మమును పరిత్యజింతురని పలికినాడు.

లాటదేశ స్త్రీల పోలినవారే అపరాంతవాసులని వాత్స్యాయనుని అభిప్రాయము. వారికి బాహ్యరతి, సంప్రయోగముల వెంటను ప్రీతి కలదని కొక్కోకుడనినాడు. సింధు స్త్రీలు ఔపరిష్టక ప్రియలనినాడు. వారికి ఔపరిష్ట కాద్యము కాని రతమున తృప్తి లేదనినాడు. జలంధర దేశ స్త్రీలకు ప్రయోగవిధాన వైచిత్ర్యములన్న (Sexual Movements) (కామసూత్రములు, ద్వితీయాధికరణము, అష్టమాధ్యాయమున వర్ణితములు) ఆసక్తి అధికమని పద్మశ్రీ అభిప్రాయము. ద్రావిడ స్త్రీలకు శుక్రక్షరణము రతారంభమునుండి కలుగుననియును అందువలన ప్రథమ రతముననే తృప్తలగుదురని వాత్స్యాయన కొక్కోకుల మతము. పద్మశ్రీ వీరికి కరతాడన, మర్దన, ఔపరిష్టకాది ప్రీతి కలదని చెప్పుచున్నాడు. కాశ్మీరస్త్రీ గంధప్రియ అని పద్మశ్రీ. ఇతర గ్రంథముల కానరాని అనేక దేశస్త్రీల సాత్మ్యములను నాగరసర్వస్వకర్త నిరూపించినాడు.[56] ఈ అధ్యాయాంతరమున సూత్రకర్త దేశ సాత్మ్య ప్రకృతి సాత్మ్యముల ప్రయోగ విధానమును గుర్తించి 'దేశసాత్మ్యాత్ప్రకృతి సాత్మ్యం బలీయ ఇతి సువర్ణ నాభో నతత్ర దేశ్యా ఉపచారాః' (2.5.34) అని నిశ్చయించినాడు. తుది సూత్రముగ చెప్పిన 'పరస్పరాను కూల్యేన తదేవం లజ్జమానయోః సంవత్సర శతేనాపి ప్రీతిర్నపరిహీయతే' అను వాక్యమెంతయో సమంజసమైనది. వీనిని గుర్తింపక పోవుట వలననే భారతదేశమున ప్రీతిరహిత వివాహ ధర్మములును, పాశ్చాత్య లోకములందు వివాహ విచ్ఛేదనములును జరుగుటయును, కలుగుటయును.

సంవేశన చిత్రరతములు (MODUS SEXUALIS) : దేశప్రకృతి సాత్మ్యా పేక్షయా ఆలింగనా ద్యుపచారముల మూలమున పరస్పరము అనురాగము కల్గిన నాయికానాయకులు సంవేశమునకు అర్హులయ్యెదరని పూర్వాధ్యాయమున స్థాపించిన తదనంతరము మహర్షి వాత్స్యాయనుడు సంవేశన ప్రకారమును, తదంతర్గతములైన చిత్రరతములను నిరూపించినాడు.

ప్రాచీన అర్వాచీన ప్రపంచములో రతిబంధ విభేదములు విశేషముగ కనుపించుచున్నవి. ఇవి కొన్ని స్వతః సిద్ధములు. కొన్ని నూతనత్వాపేక్షకులైన దంపతులు కనుగొనినవి.[57] అనేక కారణముల మూలమున సమస్త కాలములలోను సమస్త దేశ ప్రజలును వీనిని ఆదరించినారు. క్రీస్తునకు నెంతో పూర్వముననే ఔద్దాలక, శ్వేత కాదులు, భారతావనిలో రతిబంధ విభేదములను గుర్తించి శాస్త్రనిబద్ధములుగ నొనర్చిరి. వాత్స్యాయనుని నాటికి అవి క్రమక్రమముగ నలువది ఎనిమిదిగ సంగ్రహితములైనవి. ప్రాచీన భారతము నాటికి సంబంధించిన విజ్ఞానము విశేషముగ నుండుట వలన నివి సాహిత్యశాస్త్ర గ్రంథముల కెక్కినవి.[58]

రతిబంధ విభేద నిరూపణమున ప్రాచీనా చార్యులను మించినవారు నేటికిని జన్మింపలేదు. అరబ్బుదేశ కామశాస్త్రవేత్త నఫజోయిషేకు వాత్స్యాయనాది గ్రంథములనుండి అనేక విభేదములను స్వీకరించినాడు. రిచ్చర్డు బర్టన్ మహాశయుడు తన అనంగరంగ అనువాద పీఠికలో పాశ్చాత్యుల కూహింపనైన నలవిగాని రతిబంధ విభేదములను భారతీయులు స్వీకరించుటకు వారి అవయవ వల్గన స్వభావము ముఖ్యకారణము కావచ్చు ననినాడు.[59] వైవాహిక సౌఖ్యము (Happy Marriage) అను గ్రంథమున డాక్టరు హైమ్సు అను వైద్య శాస్త్రజ్ఞుడు భారతీయ రతిబంధ విశేషములను గమనించి విస్తుపోయి, "If some of these ideas are some what shocking because they have not been encountered before, it would be well for the married couples to try them gradually before condemning them" అని అభిప్రాయమిచ్చి ఉన్నాడు.[60]

ఇట భారతేతర దేశములందరి రతిబంధ వైవిధ్యమును కొంతగ గమనింపవలసి ఉన్నది. క్రీ.పూ. 1300 సంవత్సరముల నాటి ఈజిప్టు పాపిరసు చిత్రలిపిలో పదునాలుగు రతిబంధ విభేదములున్నవి. ఎలిఫాంటిస్ అను గ్రీసుదేశ కవయిత్రి ఒక గ్రంథమున నవవిధ రతిభేదములను (SUNT ILLIS VENERIS NOVEM) మాత్రమే పేర్కొనినది. క్రీ.శ. 14, 15 శతాబ్దములలో రోము, ఫ్రాంసు మొదలగు దేశములందు భోగతత్పరత విశేషముగ పొడకట్టినది. అనేక కామకళా గ్రంథములు బయల్వెడలినవి. వానిలో సుప్రసిద్ధ ఇటలీ రచయిత ఆర్టినో (క్రీ.శ. 1497-1557) గ్రంథము ప్రధానమైనది. రోమక చక్రవర్తి నీరో భోగమందిరమున కొన్ని రతిబంధ చిత్రములను గీయించినాడు. రాఫెల్ శిష్యుడు రొమానో వాటినుండి పండ్రెంటిని మాత్రము గ్రహించి, నూతనముగ నాల్గింటిని చేర్చి చిత్రణ మొనర్చినాడు. తదుపరి మర్కాంటో నియో రైమాండి అను చిత్రకారుడు ఈ పదునారు భేదములను మొదట చిత్రించి పండిత ప్రతిగా ముద్రించినాడు. ఈ ప్రతికి ఆల్టెనో వ్రాసిన అసభ్య శృంగారములైన సానెట్లను పదునారింటిని కూర్చి De Omnibus Veneris Schemafitus అను నామముతో మరియొక పండితప్రతి వచ్చినది. చక్రవర్తి అతనిని మరణదండనకు పాత్రుని చేయ ప్రయత్నించినాడు. కాని ప్రభువర్గమున నతనికి విశేషమైన పలుకుబడి ఉండుటవలన, ఆగ్రహము నుండి బయట పడిన తరువాత మరికొన్ని సానెట్లను పెంచి ముప్పది ఆరు చిత్రములతో ప్రచురించినాడు. నేడు దీనికి "ఆర్టినో చిత్రము"లని ప్రసిద్ధ నామము. రోమక సామ్రాజ్యము అత్యుత్తమ స్థితిలో నున్న కాలమున పుట్టిన 'ఆర్స్ ఆమోరిస్' గ్రంథకర్తయే ద్వాదశ రతి బంధములమించి గ్రహింపకపోవుట వలన,

నివి ఆ జాతి కనుభవైక వేద్యములైనవి కావని పండితుల అభిప్రాయము. రోమక సామ్రాజ్య వైభవమునాడు పశ్చిమ భారతమునుండి కొందరు సామాన్య వేశ్యలు వెళ్ళినారుగాని వారి వెంట నీ భారత రతిబంధ భేదములు అచటికి వెళ్ళినట్లు కనుపింపవు.[61] అరబ్బు దేశ కామశాస్త్ర వేత్తలు ముప్పది రెంటిని మించి సంవేశన విధానము లెరిగినట్లు లేదు. ఫోర్బెర్గ్ అను ఒకానొక ఆధునిక సాంఘిక శాస్త్రవేత్త (Sociologist) ప్రపంచములోని అనేక కామకళా గ్రంథము లను అవలోకన మొనర్చి తొంబది రతిబంధ భేదములను గుర్తించినట్లు తెలియుచున్నది. పారిస్ నగరమున ముద్రితములైన కొన్ని అశాస్త్రీయ గ్రంథములలో 101 రతివిభేదములున్నవట! శారీరకముగ సమమైనవియును, దంపతుల అన్యోన్యానురాగమును చూరగొన నవకాశము కల్పించునవియును అయిన సంవేశన విధానములు 12కు మించిలేవని పాశ్చాత్య శాస్త్రజ్ఞుల అభిప్రాయము. 'మేహన ధర్మములు' (Genital Laws) గ్రంథకర్త 10ని మాత్రమంగీకరించినాడు. ఆదర్శ వివాహ గ్రంథకర్తయును బంధదశకమును స్వీకరించినాడు. దంపతులు వైవిధ్యానుభూతికి, వ్యక్తిగతలోపపూరణములకును నివిచాలునని ఆయన అభిప్రాయము. మిగిలిన వానిని కామకళలోని మల్లబంధ విశేషములని త్రోసిపారవేసినాడు. సుప్రసిద్ధ స్త్రీ పురుష మానసిక శాస్త్రవేత్త (Sex - Psychologist) ఎల్లిస్ 48 బంధవిభేదముల నంగీకరించినాడు.

వాత్స్యాయనుడు నిరూపించిన నలుబది ఆరు రతిబంధ భేదములలో తరువాతి శాస్త్రజ్ఞులు కొన్నిటిని మాత్రమే స్వీకరించిరి. అనంగరంగకర్త 35 గ్రహించెను. కొన్ని సందర్భములందు నామ వ్యత్యయములు, లక్షణ వ్యత్యయములు కనుపించుచున్నవి. భారతదేశ మున జన్మించిన కామశాస్త్ర వేత్తలలో మహర్షిని అనుసరించినవారు కొందరు; పూర్వాచార్యుడైన గోణికాపుత్రుననుసరించినవారు కొందరు. మొత్తము మీద సంవేశనములు 48గ పరిగణితములగుచున్నవి. అందువలన వీనికి 'చౌశీతి' అను నామము రూఢమైనది.

బంధభేద స్వరూపములను నెల్లూరు శివ రామకవి కామకళానిధిలో నిట్లు ఎరిగించినాడు. "ఆ బంధములకు ఉత్తాన కరణములు (SUPINE ATTITUDES), తిర్యక్కరణంబులు (Lateral), స్థితీకరణంబులు, నుత్థిత కరణంబులు, వ్యాపకరణంబులు నన నైదు విధంబులు. నారీరత్నంబు పల్యంకి కాంకతలమున పన్నుండినపుడు తత్పాదంబులు, కరంబులు పట్టి పట్టెడి బంధంబు లుత్తాన కరణంబులు, పువుబోడి ప్రక్కవాటుగ నైన ప్రక్కగ నైన కుడిప్రక్కగనైన పవ్వళించియుండ

పురుషుం డభిముఖంబుగ పవ్వళించి పట్టునవి తిర్యక్కరణంబులు. అంగనామణి కూర్చున్నప్పుడు పురుషుండు పైకొనిపట్టు కరణంబులు స్థితకరణంబులు. మగువ నిలుచున్నప్పుడు, స్తంభకుడ్యాదులానిగా నుంచి పురుషుడు పట్టుబంధంబు లుత్థిత కరణంబులు. కోమలాంగి కరంబులు పాదంబులు పాన్పుననాని తిర్యగ్జంతువుల రీతి వ్రాలిన పురుషుండు వెనుకగ నిలచి పట్టు బంధంబులు వ్యాపకరణంబులు. ఇవి ఐదును పురుష కృత్యములు. ఇక పురుషుడు రతిశ్రాంతుడై పవళింప తనివినొందక పురుషుని పైకొని లతాంగి పట్టునవి విపరీత కరణంబులు నన జను" అని.[62]

కల్యాణమల్లుడు కూర్మ, పరివర్తిత, ఉపపాద, పద్మాసన, కర్కాటక, ఫణిపాశ, సంయమన బంధములను స్థితకరణములలోను (Sedentary attitudes), వీణక బంధకమును తిర్యక్కరణములోను (Lateral Group) చెప్పి ఉన్నాడు. ఇది వాత్స్యాయనాది ప్రాచీనాచార్యుల మార్గమునకు భిన్నమైనది.

'ఉత్ఫుల్లకం విజృంభితకం ఇంద్రాణికం చేతి త్రితయం మృగ్యాః ప్రాయేణ' (2. 6. 7) 'ఏకోన నీచతర రతేః సంపుటకం పీడితకం వేష్టితకం బాడబక మితి హస్తిన్యాః (2. 6. 14) అని మృగీ, హస్తినుల బంధవిభేదములను మహర్షి నిరూపించినాడు. ఉత్తాన కరణములలోని సమపాదము స్మరదీపిక, రతిమంజరీ, ప్రభృతి గ్రంథములలో కాకపాద, కామప్రద, నాగపాద, కామమర్దన ఇత్యాది నామవిభేదములతో పొడకట్టుచున్నది. వాత్స్యాయనుని జృంభితకమును రతిరహస్య కర్త స్వీకరించినాడు. పంచసాయకాదులు కల్యాణమల్లుని సమపాదమును గ్రహించినవి. స్మరదీపికలోని సమపాదమునకును, అనంగరంగములోని సమపాదమునకును కొంత విభేదము కనిపించుచున్నది. 'తరుణి తన పాదయుగళము, హరియూరువు లందు నిల్పియట బవళింపన్, యురమురము జేర్చి పైకొన, పరువడి సమపాద నామబంధం బయ్యెన్' అని నందికేశ్వర మతానుసారముగ శివరామకవి సమపాదమును చెప్పినాడు. నాయిక పాదము నొకదానిని పాన్పుపై జాపిన ఈ బంధమే సరితమగునని కొక్కోకుని మతము. గ్రామ్యబంధమే సౌమ్య బంధము. శివరామకవి దీనిని గుర్తించినట్లు లేదు. కామసూత్ర కారుని శూలచితమునే నాగర సర్వస్వము ఆయత మనినది. 'ఏకశ్శిరసి ఉపరిగచ్ఛే ద్వితీయః ప్రసారిత ఇతి శూలచిత' అని మహర్షి శూలచితమును చెప్పినాడు (2. 6. 26). రతిరత్న ప్రదీపిక కర్త వ్యాఖ్యాత ననుసరించి దీనిని శూలాంకమని నాడు. రతిరహస్య వ్యాఖ్యాత మల్లినాథుడును, కొక్కోకుడును దీనిని త్రివిక్రమమనినారు. వాత్స్యాయన, కొక్కోకు లిరువురును వ్యోమపాదమును పేర్కొనలేదు. ఇది పంచసాయక కామ

## ఉత్తాన కరణములు (Supine Attitudes)[63]

| సంఖ్య | GROUP | రతిరహస్యము | నాగర సర్వస్వము | అనంగరంగము | కామసూత్రము | ఉచ్చనీచలు |
|---|---|---|---|---|---|---|
| 1. | Normal | గ్రామ్య | గ్రామ్య | సౌమ్య | – | సమరతి |
| 2. | ,, | నాగరక | నాగరక | నాగర | – | సమరతి |
| 3. | Extended | సంపుట | – | – | సంపుట | నీచ |
| 4. | ,, | పీడిత | మర్కటక | – | పీడిత | నీచ |
| 5. | ,, | వేష్టిత | – | వేష్టిత | వేష్టితక | అతినీచ |
| 6. | ,, | వాడవక | – | – | వాడవక | అతినీచ |
| 7. | ,, | కౌర్మ | కౌర్మ | కౌర్మ | – | సామాన్య |
| 8. | ,, | పరివర్తిత | – | పరివర్తిత | – | సామాన్య |
| 9. | S.Extended | ఉత్ఫుల్లక | – | – | ఉత్ఫుల్లక | ఉచ్చ |
| 10. | ,, | సరిత | – | – | – | సమ |
| 11. | ,, | వేణువిదారిత | వేణువిదారిత | వేణువిదారిత | వేణువిదారిత | సమ |
| 12. | ,, | అర్ధాంగనిపీడిత | అర్ధపిండిత | వీణక | అర్ధపీడితలక | సామాన్య |
| 13. | ,, | శూలచిత | అయత | త్రైవిక్రమ | శూలచిత | సామాన్య |
| 14. | ,, | అర్ధపద్మాసన | అర్ధపద్మాసన | ఉపపాద | – | సామాన్య |
| 15. | Flexed | పద్మాసన | పద్మాసన | పద్మాసన | పద్మాసన | సామాన్య |
| 16. | ,, | ప్రేంఖ | ప్రేంఖణ | అవిదారిత | – | సామాన్య |
| 17. | ,, | భుగ్న | ఉద్భుగ్నక | ఉద్భుగ్నక | భుగ్నక | నీచ |
| 18. | ,, | జృంభక | జృంభిత | సమపాద | జృంభితక | సామాన్య |
| 19. | ,, | కార్కటకము | కార్కటకము | కార్కాటక | కార్కటకము | సామాన్య |
| 20. | ,, | పీడితకము | స్వస్తికము | – | పీడితకము | సామాన్య |
| 21. | ,, | ఉరఃస్ఫుటనము | పిండితము | స్ఫుటనము | ఉత్పీడితకము | సామాన్య |
| 22. | S. Flexed | – | –వ్యోమపాదము | | | ఉచ్చ |
| 23. | ,, | – | –స్మరచక్రము | | | ఉచ్చ |
| 24. | ,, | ఫణిపాశము | నాగపాశము | ఫణిపాశము | – | ఉచ్చ |
| 25. | ,, | సంయమనము | | –సంయమనము | – | ఉచ్చ |
| 26. | ,, | హనుపాదము | – | – | – | ఉచ్చ |
| 27. | ESFlexed | జృంభితకము | జృంభితము | జృంభితము | విజృంభితము | ఉచ్చ |
| 28. | ,, | ఇంద్రాణికము | ఇంద్రాణికము | – | ఇంద్రాణికము | అత్యుచ్చము |

ప్రబోధము లందున్నది. రతిమంజరిలోని రతిసుందర బంధమునకును దీనికిని సన్నిహిత సంబంధమున్నది. అందు నాయకుడు నాయిక పాదములను పట్టుట ఒక్కటియే విభేదము. స్మరచక్ర బంధమును పేర్కొనిన గ్రంథములు అనంగరంగ కామప్రబోధములు మాత్రమే. స్మరదీపికలో నొక స్మరచిత్రబంధము కనిపించుచున్నది. కాని దానికిని కామప్రబోధాది గ్రంథములలోని స్మరచక్రమునకును విభేదమెయున్నది. ఆ స్మరచక్రము వాత్స్యాయనుడు పేర్కొనిన శూలచితమునకు సన్నిహితముగ నున్నది. 'ఏ చాన చుంబన మాచరింపుచును చక్రాకృతి భ్రమియించు నదియ చక్ర బంధమని' ఎఱ్ఱన కొక్కోకుని చక్రబంధమును చెప్పినాడు గాని ఇది విపరీత కరణము. ఉపరతికి సంబంధించినది. అవిదారిత బంధము అనంగరంగ, కామప్రబోధ, పంచసాయకము లందు మాత్రమే కనుపించుచున్నది. ఇది నాగర సర్వస్వ, రతిరహస్యములలోని ప్రేంఖణము వంటిది. వేణువిదారితము పంచసాయకమునందు తప్ప తక్కిన శాస్త్ర గ్రంథములన్నిటను కానవచ్చును. వాత్స్యాయనాదులు దీనికి రెండు రూపములు చెప్పిరి. ఒక పరి కుడికాలు భుజముపై నుంచుట ఎడమకాలు చాచుట, రెండవమారు ఎడమకాలు భుజముపై నుంచి కుడికాలు చాచుట దీని విభేదములు. అనంగరంగమున నిట్టి విభేదము కానరాదు. అందువలన కల్యాణమల్లుడు చెప్పిన వేణువిదారితము రతిరహస్య సరితము. వాత్స్యాయనుని జృంభకమునే నాగర సర్వస్వకర్త భుగ్నకమనినాడు. దానిని అనంగరంగ కర్త ఉద్భుగ్నక మనినాడు. ఇది నీచరతము. యోనికంటె లింగము సూక్ష్మమైన దైనప్పుడు ఇది యోగ్యమైన బంధము. ఇది హరిణీ శశజాతులకైనది. (2.6.14) కామసూత్రములలోని ఉత్పీడితకము, రతిరహస్యములోని ఉరఃస్ఫుటనము, నాగరసర్వస్వములోని పిండితకమును ఒకే బంధ విశేషమును తెలియజేయుచున్నవి. దీనికిని అవిదారితమునకును విశేష భేదము లేదు. ఇందు అవిదారితము నందువలెగాక మోకాళ్ళను కలిపి పట్టవలయును. ఒక పాదమును పాన్పుపై చాచినచో నది అర్ధపీడితకము అని వ్యవహరించినారు. మహర్షి నిరూపించిన ఉత్తాన కరణములలో ఉత్ఫుల్లక, ఇంద్రాణికములను ప్రధానబంధ ద్వితయమును అనంగరంగ కర్త త్యజించినాడు. సువర్ణనాభుని పీడితకమును గూడ త్యజించినాడు. ఉత్ఫుల్లకమునకు పంచసాయకకర్త చాటుక ఫ్లేలుకమను నామమును వాడినాడు. ఇది బాహ్య యోని (Mons Veneris) వికసించినట్లు చేయుటవలన నుత్ఫుల్లకము (Blooming posture) అయినది. దీనిని ఎఱ్ఱన ఆంధ్ర కొక్కోకమున "కామిని కించి దున్నతముగా జఘనం బెగనెత్తి తత్కటీ సీమల క్రింద పాదములు సేరిచి కృష్ణ కటిద్వయంబులన్ ప్రేమను చేతులందు నిడ ప్రీతి విభుండు కుచంబులాని

యుద్దామగతిన్ రమింప నది ధాత్రిని ఫుల్లక నామబంధమౌ" అని నిరూపించినాడు. కౌర్మక బంధమును అనంగరంగకర్త అనాలోచితముగ స్థితకరణముల (Sedentary Postures) నుంచినాడు. అతడు దీనిలో పిరుదులు ఉన్నతములుగ నొనర్చిన కలుగు పరివర్తిత బంధమును ఉత్తాన కరణమేయనెను. రతిరహస్యము దీనిని వేరుగ చెప్పుచున్నది. నాయిక పాన్పుపై వెలికిల పరుండి చేతులను కాళ్ళను వివరమొనర్చినపుడు నాయకుడు ముఖమున ముఖమును, చేతుల చేతులును చేర్పగా నాయిక తొడల నెత్తిన నది పరివర్తితమట. అయిన నిది ఒక నూతన బంధవిభేదముగ కనుపించుటలేదు. దీనాలాపనిక శుకసప్తతిలో ఘనకూర్మమను మరియొక ఉత్తాన కరణము కనిపించుచున్నది. నాయిక వెనుకగ పరుండినపుడు నాయకుడు ఆమె పాదములను మోచేతులలోనికి తీసుకొని తన పాదములను ఆమె వక్షఃస్థలమున నుంచి రెండు చేతులతో నామె చేతులను పట్టుకొని రమించిన నది ఘనకూర్మమట. నెల్లూరు శివరామకవి ముప్పదిఆరు ఉత్తానకరణ విభేదములను పలికినాడు.

ఇందు యుగ్మపాదము నాగరసర్వస్వమతమున తిర్యక్కరణము, రతిరహస్య, అనంగ కర్తల మతమున నది స్థితకరణము. అర్ధపీడిత కార్కటక, పరావృత్తకములు కామసూత్ర రతిరహస్యాది గ్రంథముల ననుసరించి స్థితకరణములు.

కామసూత్రములలోని పార్శ్వ సంపుటకమునే అనంగరంగకర్త సంపుటక మనినాడు. 'ఋజు ప్రసారితా వప్పుభయో శ్చరణావితి సంపుటః స ద్వివిధః పార్శ్వ

### తిర్యక్కరణములు (Lateral Attitudes)[64]

| సంఖ్య | | కామసూత్రములు | రతిరహస్యము | నాగరసర్వస్వము | అనంగరంగము |
|---|---|---|---|---|---|
| 1 | Anterior | పార్శ్వసంపుటము | పార్శ్వసంపుటము | సంపుటము | -- |
| 2. | ,, | పీడితకము | పీడితకము | పీడితకము | -- |
| 3. | ,, | వాడవకము | వాడవకము | వాడవకము | -- |
| 4. | ,, | -- | సముద్గము | ముదగ్గకము | -- |
| 5. | ,, | -- | పరివర్తము | -- | -- |
| 6. | ,, | -- | యుగ్మపాదము | యుగ్మపాదము | యుగ్మపాదము |
| 7. | ,, | అర్ధపీడితకము | అర్ధాంగపీడితము | అర్ధపిండితము | వైణకము |
| 8. | ,, | కర్కాటకము | కార్కటము | కార్కటకము | కార్కటకము |
| 9. | Posterior | పరివృత్తము | -- | పరావృత్తకము | -- |

సంపుట ఉత్తాన సంపుటశ్చ తథా కర్మయోగాత్' (2.6.15.16) సూత్రములలో వాత్స్యాయనుడు సంపుటక భేదద్వయమును చెప్పినాడు. కొక్కోకుడు దీనిని ప్రత్యేకము ప్రస్తావింపక ఉత్తాన సంపుటమును చెప్పునపుడు ప్రస్తావించినాడు. దీనిని నేటి పాశ్చాత్యులు Anterior Lateral Extended Attitude గ పరిగణించిరి. వీటిలో నాయిక పిండిత, వేష్టిత, బాడబకముల మూలమున రతితృప్తి నొందును. 'సంపుటక ప్రయుక్త యంత్రైవ దృఢమూరు పీడయే దితి పీడితకమ్; ఊరూ వ్యత్యస్యేదితి వేష్టితకమ్; బడబేవ నిష్ఠుర మవ గృహ్ణీయా దితి బాడబక వరాభ్యాసికమ్' అనునవి వాత్స్యాయనుని వాక్కులు (2,6.17-19). కార్కటకమును కామసూత్ర, రతిరహస్య, నాగరసర్వస్వాది గ్రంథములు ఉత్తానకరణములుగ భావించినవి. పంచసాయకమున నీ బంధవిభేదము కనుపింపదు. కామప్రబోధము దీనిని కుక్కుట బంధమనినది. నాయిక నాభీస్థానమున నిజపాదముల నుంచి నాయకుని డోలిక వలె నూపిన నది ప్రేంఖణమని కల్యాణమల్లు డనినాడు. దీనిని తిర్యక్కరణముగ భావించుటలో పొరబడినాడు. నాయకానాయికలు శయన తలమున పార్శ్వవర్తనము కలిగి పరుండినపుడు ఇట్టి బంధవిభేదమున

**స్థితకరణములు (Sedentary Attitudes)[65]**

| సంఖ్య | | రతిరహస్యము | నాగరసర్వస్వము | అనంగరంగము |
|---|---|---|---|---|
| 1 | Anterior | యుగ్మపాదము | యుగ్మపాదము | యుగ్మపాదము |
| 2. | ,, | విమర్ధితము | -- | విమర్ధితము |
| 3. | ,, | మర్కటకము | -- | మర్కటకము |
| 4. | ,, | పద్మాసనము | పద్మాసనము | పద్మాసనము |
| 5. | ,, | అర్ధపద్మాసనము | అర్ధపద్మాసనము | ఉపవాదము |
| 6. | ,, | -- | -- | బంధురితము |
| 7. | ,, | ఫణిపాశము | నాగపాశము | ఫణిపాశము |
| 8. | ,, | సంయమనము | -- | సంయమనము |
| 9. | | కౌర్మము | కౌర్మము | కౌర్మము |
| 10. | | పరివర్తితము | -- | పరివర్తితము |
| 11. | | -- | ఆశినము | -- |
| 12. | | -- | లలితము | -- |
| 13. | Posterior | -- | ఆశినము | -- |

కవకాశము లేదు. సముద్గక ముద్గ కాది తిర్యక్కరణము లందు నాయకుని ఒక తొడ నాయిక ఊరువుల మధ్యనుండును. పరివర్తనక బంధమున నాయకుడు నాయికను వెనుక నుంచి పట్టుకొని రమించును. రతిరహస్య పరివర్తనకమునకును దీనికిని భేదమున్నది. అందు నాయికానాయకులిరువురుమ మేహన సంయోగమైన వెనుక సముద్గక విధానము నొంది విడివడక రమించిననది పరివర్తకము.

కొక్కోకుడు మర్కటకమును స్థితకరణముగ చెప్పినాడు. లలితము పంచసాయక రతిమంజరులందు పద్మాసనముగ నున్నది. యుగ్మపాదము అనంగరంగ రతిరహస్యములలో స్థితకరణముగాని నాగరసర్వస్వము నది తిర్యక్కరణము. రతిరహస్య కామసూత్రములను అనువదించి జూచినచో అర్ధపీడితకము, కార్కటకములు రెండును ఉత్తానకరణములు. 'చరణా వూర్ధ్వం నాయకో స్యాధారయే దితి జృంభితకమ్; తత్కుంచితా ఉత్పీడితకమ్; తదేక స్మిన్ ప్రసారితేర్ధ పీడితకమ్ (2.6.23–25) సంకుచితే స్వబస్తిదేశే విదధ్యాదితి కార్కటకమ్; (2.6.28) ఇవి ఈ బంధ ద్వితీయమునకును వాత్స్యాయన లక్షణములు – అనంగరంగ కర్తకు పూర్వముందున్న రచయిత లందరును పద్మాసనమును, ఉపపాదమును ఉత్తానకరణములుగ నిరూపింప నతడు వీనిని స్థితకరణములుగ పరిగణించినాడు. స్థిత కరణముగ పద్మాసన బంధ మొనర్చుట యతి కష్టసాధ్యము. కామప్రబోధములోని పద్మాసమును నాగరసర్వస్వములోని లలితమును నొకటియని కామశాస్త్ర గ్రంథ పఠనము మూలమున తెలియుచున్నది. అర్ధపాదమును అర్ధోపపాద మనుట యసమంజసము. ఇది పొరబాటు.[66] బంధురితము అనంగరంగముననను కామప్రబోధమునందును తప్ప తదితర గ్రంథములందు కనిపించుట లేదు. రతిరహస్యమున ఫణిపాశబంధమును వర్ణించు సందర్భమున ఉన్న శ్లోకములోని 'గట్టిగ బిగించు' అను నర్థముగల బంధురిత శబ్ద ప్రయోగమును చూచి కల్యాణమల్లుడు ఈ బంధవిభేదమును సృజించినట్లున్నాడని ఒకానొక నేటి కామకళావేత్త అభిప్రాయము.[67] బంధురితము కామప్రబోధము, అనంగరంగములందు తప్ప ఇతర గ్రంథములందు కనుపించుట లేదు. ఫణిపాశము కామప్రబోధమున కనుపింపదు. దీనికి శక్తిమంతము, దీర్ఘమునైన సాధకము (లింగము) కావలయును. నాగరసర్వస్వ రతిరహస్యములు దీనిని ఉత్తానకరణము క్రింద లెక్కకట్టినవి. ఇందు నాయిక మోకాలి సందులనుండి చేతులపోనిచ్చి నాయకుని కంఠాలింగన మొనర్చిన నది నాగరపాశమగునని నిర్ణయించినవి. స్మరదీపికలో దీని నిరూపణము మరియొక రీతిగ నున్నది. భర్త హస్తములను మోకాలిసందుల యందుంచి రమించు విధానమే ఫణిపాశమని అందున్నది. కామప్రబోధకర్త సంయమన బంధమును కౌర్మమని పేర్కొని

అనంగరంగ కర్తవలె స్థితకరణముగ పరిగణించినాడు. నాగరసర్వస్వకర్త ఉత్తానకరణ విభాగమగు నొకదానిని కార్ముకాకృతిని పోలిన దానిని 'హనుపాద' మని నామకరణ మొనర్చినాడు. అనంగరంగపు పరివర్తితమును పూర్వశాస్త్రజ్ఞులు ఉత్తానకరణముగ పరిగణించినారు. ఇది ప్రత్యేక బంధము కాదని విజ్ఞుల అభిప్రాయము. యుగ్మ పాదబంధమును అనేకులు అనేక రీతులుగ నిరూపించిరి. పద్మశ్రీ దీనిని తిర్యక్కరణ మనినాడు. అట్టయినచో 'ప్రక్కకు తిరిగి పరుండిన నాయిక పాదములు ఎదురుగ కూర్చుండిన నాయకుని క్రోడము వద్ద నుంచును'. రతిరహస్యమును బట్టి దీని స్వరూపమును గ్రహించుట కష్టము. కొక్కోక గ్రంథానువాదకు డొకడు యుగ్మపాదమున నాయికానాయకులిరువురును ఒకరి కొక రెదురుగ ఒక మోకాలిని ముడిచి రెండవ పాదమును ముడిచినవారి పాదమున కెదురుగ నిల్చి రమించుట అని పలికినాడు. రతిరత్న ప్రదీపికలో నాయిక కాళ్ళను ప్రక్కలకు ముడిచి రెండు పాదముల నొక చోటికి చేర్చును. నాయకుడు నట్లే ఆమెకు క్రిందుగ నొనర్చును. కామప్రబోధమున నాయకుడు కూర్చొని కాళ్ళు ముడుచుననియును, నాయికయు నట్లే యొనర్చుననియును నున్నది. విమర్దిత మర్కటక బంధములకు గలభేద మత్యల్పము. ఇందు మొదటి దానియందు భర్త పిరుదులనే వర్తులముగ నాడించును. రెండవ దానియందు పైకి క్రిందికి నాడించును. కొక్కోకకారుడు విమర్దితమున నాయిక నాయకుని కెదురుగ కూర్చుండు ననియును, మర్కటమున తొడపై కూర్చుండి అటే చూచుననియును చెప్పినాడు. ఇది వెనుక మళ్ళ అయిన స్థితకరణము. నాగర సర్వస్వమున ఒక మర్కటబంధమున్నది. కాని దానికిని అనంగరంగములోని మర్కటబంధమునకు పోలిక లేదు. నాగరసర్వస్వమున స్థితకరణములుగ నున్న అశిన, లలితములు – రెండును విపరీత బంధముగ పొడకట్టుచున్నవి.

**ఉత్థిత కరణములు** (Standing Attitudes):[68] మహర్షి వాత్స్యాయనుడు ఉత్థిత వ్యాన కరణముల రెంటిని చిత్రరతములనినాడు. సువర్ణనాభుడు స్థితకరణములను గురించి చెప్పలేదు. కాని నీటియందు పరుండి కూర్చొని, నిలచి భూమియందు కంటె సుగమముగ సంభోగించవచ్చునని అతని అభిప్రాయమైనట్లు మహర్షి వాత్స్యాయనుడు "జలే చ సంవిష్టోప విష్టస్థితాత్మకాం శ్చిత్రా న్యోగా నుపలక్షయేత్తథా సుకరత్వా దితి సువర్ణ నాభః" (2.6.32) అని చెప్పి తదుపరి వానిని శిష్టులంగీకరింపనట్లు 'వార్తంతు తచ్ఛిష్టే రపస్మృతత్వాదితి వాత్స్యాయనః' (2.6.33) అని తన మతమును నిరూపించినాడు.

ఉత్థిత కరణములలో నొకటైన జానుకర్పరము (Knee - Elbow Pose) నందు నాయిక ఒక ఉన్నతమైన వేదికమీద కూర్చొని ఉండగా నాయకుడు ఆమె పాదములను మోచేతులమీద నిల్పిన తరువాత ఆమె మెడను గాని, దేహమునుగాని ఆలింగన మొనర్చుకొని నిలచి రమించును. భర్త చేతులతో నాయికను కౌగిలింపవచ్చునని నాగరసర్వస్వము. ఉత్థితలింగము పైకినిలిచి రమించుట. జానుకర్పరమని కొక్కోకుడు. అట్టి సందర్భమున నాయిక భర్త శరీరమును మోకాళ్ళతో బంధింపవచ్చునని రతిరత్న ప్రదీపిక చెప్పుచున్నది. హరివిక్రమబంధము (Rampant Lion Pose) కేవలము యౌవనవంతులకు మంచిదని అనంగరంగకర్త చెప్పుచున్నాడు. ఈ బంధమున నాయకుడు పైకెత్తి నాయిక పాదమును చేతులలో పట్టుకొనగా నామె కొంచెము వెనుకకు వ్రాలినట్లుండు ననినాడు. ఈ బంధమునే పంచసాయకము త్రిపాద మనినది. "భార్య మోకాలును భర్త హస్తమున నిల్పి రెండవ పాదము భూమిపైనుండి అతనిని బంధింపగా నతడు ఆమె నాలింగన మొనర్చి రమించుటయే త్రిపాదమట. కామసూత్ర వ్యాఖ్యాత దీనికే వ్యాయితమను నామాంతరమున్నట్లు ఒక శ్లోకమును ఉటంకించినాడు. పద్మశ్రీ వ్యాపారమను నీ బంధ విభేదము నొకదానిని పేర్కొనినాడు. అందు నాయిక ఎత్తిన పాదమును భర్త భుజము మీద ఉంచవలెనట. 'కీర్తి' (Favouring Pose) అని లోకమున ప్రఖ్యాతి పొందిన బంధమునే కామసూత్రకర్త రతిరహస్యకర్తలు అవలంబిత మనినారు. నాగరసర్వస్వము విలంబిత మనినది. పంచసాయకము వ్యతికరమనినది. ఇందు భర్త ఒక కుడ్యమును ఆధారముగా గొని నిలచును. రెండు ముంజేతులను చేర్చి భార్య కూర్చొండుటకు అనువుగా నొక ఆసనమును నిర్మింప దానిపై నామె కూర్చుండి భర్తను పెనవేసుకొని కాళ్ళతో కుడ్యమును ఆధారము చేసుకొని పిరుదుల యులవలె నూపును. ఇట్టి సందర్భముల భార్య విశేషముగా నలసిపోయి సీత్కారమొనర్చుననియు, అధికముగా ఊపిరి విడచుననియును, ఇందుకు పురుషుడు అతిబలశాలి, యువకుడుగా నుండవలయుననియు కొక్కోకుని అభిప్రాయము. దీనినే అరబ్బులు డోక్ – ఎల్ – ఊటేడ్ (Driving the Nail Home) అందురు.

మరికొన్ని కామకళా గ్రంథములందు ప్రముఖ గ్రంథములలో కనుపింపని ఉత్థిత కరణములు కొన్ని కానవచ్చు చున్నవి. అవి (1) ద్వితాళము. భర్త నిలచి భార్యను హస్తముతో నామె పాదముల క్రింద నిలిపి పట్టును. ఆమె భర్తను కంఠాలింగన మొనర్చుకొనును. దీనికి భర్త అతిశక్తిమంతుడు కావలసి ఉన్నది. దీనినే నాగరసర్వస్వము అర్పిత మనినది. 2. డోలాబంధము: నాయిక ఎత్తయిన వేదిక మీద కూర్చొని పాదములను ఎదురుగా నిలచిన భర్త రొమ్ములపై నుంచును.

కంఠాలింగన మొనర్చును. కాని దీనికిని స్మరదీపికయందు కనుపించు డోలా (డోలాయిత) బంధమునకును భేదమున్నది. ఇందు నాయకుడు ఉన్నతమైన వేదికమీద కూర్చొని భార్య మోకాళ్ళ వద్ద చేతులుంపగా నామె అతనిని కంఠాలింగన మొనర్చుకొని పిఱుదుల పైకి క్రిందికి డోలవలె నాడించును. ఇది విపరీత బంధములలో (Reverse Attitudes) చేర్పదగినదని విజ్ఞుల అభిప్రాయము. 3. వేష్టితకము : భార్య వేదిక మీద కూర్చొని ఒక పాదమును నిలచిన భర్త రొమ్ముపై నుంచి రెండవ పాదముతో నతని చుట్టి కంఠాలింగన మొనర్చుకొనుటయే ఈ బంధ లక్షణము.

**వ్యానకరణములు** (Prone Attitudes):[69] వ్యానకరణములలోని ధేనుకాబంధము (Bovin Posture) ను నాగరసర్వస్వము, స్మరదీపికలు, పశుబంధ మనిన నేటి పాశ్చాత్య విద్వాంసులు దీనినే Standing Arched Position అనినారు. అరబ్బులు దీనికి 'ఏల్ హౌరీ' అని నామకరణ మొనర్చిరి. వ్యానకరణములలో ఐభ (Elephant mode) ఒకటి. ఐన (Deer) సూకర (Boar) గార్దభ (Ass) బంధములు వ్యానకరణములై యున్నవి. కాని ఇవి లోకమున కష్టకారణముగనో, లేక సౌఖ్యవ్యతిక్రమములగుట వలననో ఉ పయోగమున లేవు. వాఘ్రావస్కంధమను (Attack of the Tiger) మరియొక వ్యానకరణమున్నది. దీనిని నేటి పాశ్చాత్య విద్వాంసులు 'Wheel Barrow' అనినారు. నియతమనునది ఇదియు నొకటేయనియును నాగరసర్వస్వ వ్యాఖ్యాత త్రిపాఠీ మహాశయుడు వ్రాసియున్నాడు. కానీ అనంగరంగ సంపాదకుడు త్రిదివనాథరే ఈ అభిప్రాయముతో నేకీభవించుటలేదు. (అనంగరంగము పేజి 224). ఈ విధానమున నాయిక పర్యంకమున బోరగిల పరుండి పాదముల పైకెత్తగా ఆమె నడుమ బాణమువలె వంగి కామావయవసీమ కొంత ముందునకు తీసుకొని వచ్చిన భర్త ఆమె తొడలను మరింత పైకెత్తి వాటి కాధారముగా నతని మోకాళ్ళు నిలపి రమించుట ఈ బంధ లక్షణము. అందువలన త్రిదివనాథరే అభిప్రాయపడినట్లు ఇది భారతీయుల వ్యానకరణమును వాఘ్రావస్కంధమును (Attack of the tiger) పోలుటకు అవకాశము లేదు. ఇది Posterior extended attitudes కు ఉదాహరణము. అనగా ఇది ఉత్ఫుల్లక బంధమునకు Posterior Form అని చెప్పవచ్చును.[70]

'ఏతేనైవ యోగేన శాన మైనేయం ఛాగలం గార్దభాక్రాంతం మార్జాల లలితకం వ్యాఘ్రావస్కంధనం గజోపమర్దితం వరాహ దృష్టకం తురగారూఢాదిక మితి యత్ర యత్ర విశేష యోగో అపూర్వస్తత్త దుపలక్షయేత్ (2.6.39) అను సూత్రమును బట్టి వ్యానకరణముల నెన్నిటినైన నూహించి పొందవచ్చునని వాత్స్యాయనుని అభిమతమైనట్లు తెలియుచున్నది.

ఇట మహర్షి చిత్రరతములలో కొన్ని బృందసంప్రయోగ విధానములను (Group Congress) చెప్పినాడు. పురుషుడు అనేక నాయికలతో కలసి రమించుట వారి క్రీడితకము, ఐణేయము, ఛాగలము, మొదలగు భేదములతో నొప్పుననియును 'గ్రామనారీవిషయే స్త్రీ రాజ్యే చ బాహ్లికే బహవో యువానో అంతఃపురస ధర్మాణః ఏకైకస్యాః పూరిగ్రహభూతాః తేషా మేకైకో, యుగపచ్చ యథాసాత్మ్యం యథా ప్రయోగం చ రంజయే యః' (2. 3. 43) అను సూత్రమున అనేక యువకులు యుగపదముగ ఒక్కొక్కరు గాని, ఒక్కొక్క మాటుగాని, ఒకేమాటుగ వేర్వేరు ప్రదేశములని గాని సంప్రయోగము నెరపుటకు చెప్పినాడు. ఇట్లు చెప్పుట వలన నిది గోష్ఠీ పరిగ్రహయగు వేశ్యకు రాజపరిగ్రహకు సంబంధించినది. చిత్ర రతాంతమున మహర్షి 'తత్సా త్మ్యాద్దేశ సాత్మ్యాచ్చ తై సైఔర్భాతైః ప్రయోజితైః స్త్రీణాం రాగశ్చ స్నేహశ్చ బహుమానశ్చ జాయతే' (2. 6. 49) అని స్త్రీ స్నేహరాగ గౌరవములను పొందుటకు చిత్రరతముల చెప్పినట్లు సూచించినాడు.[71] అటుపిమ్మటవచ్చు సీత్కృతాద్యధ్యాయమున మహర్షి పలికిన 'కలహరూపం సురత మాచక్షతే వివాదాత్మకత్వా ద్వామ శీలత్వాశ్చ కామస్య' వివాదాత్మకము వామశీలము కలది అగుట వలన కామము కలహము వంటిదని ఆయన అభిప్రాయము. పాశ్చాత్యులును దీనిని కలహరీతిగనె (Love duel) పరిగణించినారు. కలహమగుట వలననే గ్రహణము కలిగినది. దానివలన సీత్కృతము పుట్టినది. ఇట్టి ప్రహరణములందు క్రౌర్యము లేదా అను ప్రశ్నకు మానవ జాత్యస్వభావము నెరిగిన పాశ్చాత్య విజ్ఞాని ఎల్లిస్ మహాశయుడు ఇట్లు పలికినాడు.

"When the normal man inflicts or feels to inflict, some degree of physical pain on the woman he loves, he can scarcely be said to be moved by cruelty. He feels, more or less obscurely, that the pain he inflicts, or desire to inflict, is really a part of his love, and that, more over, is not really resented by the women on whom it is exercised."[72]

'తస్మా త్ప్రహరణ స్థాన మంగం స్కంధౌ శిరస్తనాంతరం పృష్ఠం జఘనం పార్శ్వ ఇతిస్థానాని తచ్చతుర్విధం అపహస్తకం, ప్రసృతిక ముష్టిః సమతలకమితి' (2. 7. 2) అను సూత్రమున ప్రహరణ స్థానములను, తద్విభేదములను నిరూపించినాడు. సీత్కృతమున ధ్వని రూపమున నున్నవి హింకారము, స్తనితము, కూజితము, రుదితము, సూత్కృతము, సీత్కృతము, ధూత్కృతము, ఫూత్కృతము అని ఎనిమిది విధములు. సంబాధక మోక్షణార్థ అలమర్థక పీడా బోధకములును అర్థసంబంధము వలన సీత్కృతము లేనట. ఇందు విరుతములు (Inarticulte Erotic Movement)

విననగు చుంబనములని పద్మశ్రీ అభిప్రాయపడి చుంబనములుగ పరిగణించినాడు. ప్రధానపాత్ర మొనర్చు చుంబన నఖక్షత దంతక్షతా తాడనాదికముల వలన కలుగుటచే నీ ధ్వనులను చుంబనముల క్రింద పరిగణించుట పొసగదు. ప్రహరణములలోని కర్తరీకీలములు గమనింపదగినవి. ప్రహరణవిధులలో లెక్కగాని శాస్త్రముగాని లేదని వాత్స్యాయనుడు పలికినాడు.

తదుపరి అధ్యాయము పురుషోప సృప్తాద్యధ్యాయము. ఇందు పురుషోప సృప్తకములు దశవిధములని చెప్పి మహర్షి "ఉపసృప్తకం మంథనం హులోవ మర్దనం పీడితకం నిర్ఘాతో వృషాఘాత శ్చటకవిలసితం సంపుట ఇతి పురుషోపసృప్తాని" (2. 5. 33) ఇట్లు సూత్రనిబద్ధమొనర్చినాడు. ఈ యంత్రయోజన విధానమును (Penile Intromissions and Movements) కల్యాణమల్ల కొక్కోకులు వారి గ్రంథములందు పేర్కొనలేదు. ఇవి నిరుపయోగములని కొక్కోకుడు చెప్పలేదు. ఒకానొక తమిళ కొక్కోక గ్రంథ వ్యాఖ్యాత వీనిని కూడ చేర్చినాడు. ఇవి అధికమైన ఉపయోగమును గూర్పగలవనుట నిస్సందేహము.[73] చటక విలసితమునకు కొన్ని గ్రంథముల 'చాతకవిలసితము' (The Sport of the Sparrow) అను నామమున్నది. ఈ యంత్ర యోజనములన్నియును ఉత్తానకరణముల పురుషకృత్యములు, విపరీత బంధముల (పురుషాయితమున) స్త్రీవిగ పైన చెప్పిన వాని కంటె నధికముగ సందంశ (Pincers), భ్రమరక, ప్రేంఖోలితములు మూడున్నవని చెప్పినారు. (2, 8, 23) ఇందలి సందంశమును వాత్స్యాయనుడు 'బాడబేన లింగ మవగృహ్యా నిష్కర్షం త్యాం పీడయంత్యాం వాచిరాన స్థానం సందంశః' అని నిరూపించినాడు[74] రతిలయమును (Speed of the Sex Union) గురించి వాత్స్యాయనుడు ప్రసంగింపలేదు. కొక్కోకుడు అందు ద్రుత, మధ్య, వజ్రములని త్రివిధ విభాగము లున్నట్లు పలికినాడు.[75]

ఈ అధికరణమున తదుపరి వచ్చునది ఔపరిష్ట (Fellatio and Cunnilinctus) అధ్యాయము. ఇందు మొదట తృతీయాప్రకృతి (Hermophrodite) సంబంధమైన అనురాగము అభిమానికముగా దానిని గూర్చి చెప్పి తదుపరి నిమిత, పార్శ్వతోదష్ట, బహిస్సందంశ, చుంబితక, ప్రమృష్టక, ఆమ్ర చూతములను ఔపరిష్ట (Fellatio) విభేదములను తత్స్వరూపములు పలికినాడు. (2. 9. 1. 20) ఇందును స్తన ప్రేరణముల ప్రయోగముండ వలయునని చెప్పి ఇట్టి ఔపరిష్టకములను కేవలము కులటలు, స్వైరిణులు, సంవాహికలు ప్రయోగించుకొందురని చెప్పినాడు. మరునాడు అచ్చోట చుంబనార్థము వదన సంపర్కమొనర్చుట వలన బాధ కలుగుటచే ఇది పనికిరాదని

ఆచార్యులు నిషేధించిరి. ఔపరిష్టకము నే స్త్రీ కొనర్తురో దానితో కొన్ని దేశములవారు సంగమింపరని చెప్పినాడు. ఇందలి పురుషకృత్యమును (Cunnilinctus) గూర్చి కొలదిగనే ప్రసంగించినాడు. (1.6.31.33) పురుషులలో విస్తారరూపమున నీ ముఖచుంబనము (Buccal Congress) కనుపించిన దానిని గూడ పైరీతి నిమిత పార్శ్వ దష్టాదులవలె గ్రహింపవలెనని ఆయన అభిప్రాయము. ఇట్టివాని జోలికి విద్వాంసులు ఉత్తములు పోరాదని వైద్యశాస్త్రములోని రస వీర్య విపాకాది భక్షణ సామ్యమున నొక శాస్త్రార్థ మొనర్చినాడు. 'అర్థ స్వాస్య రహస్యత్వా చల త్వాన్మన సస్తథా. కః కదా కిం కుతః కుర్యాదితి కో జ్ఞాతు మర్హతి' అని దీని అనిశ్చయ స్వరూపమును వెల్లడించినాడు. (2.9.41)[76]

అటుపిమ్మట వచ్చిన రతారంభావసానికాదధ్యాయమున సురతారంభ సురతావసానముల నొనర్పవలసిన కృత్యములను చెప్పినాడు. నృత్తవాదిత్రాది గోష్ఠులు, ఆపాదకములు, ఖాద్యములు, మొదలగునవి భావ వృద్ధకములు ప్రవృత్తములైనవి. ఇట రతి విభేదముల గూర్చి 'రాగవ దాహార్యరాగం కృత్రిమరాగం వ్యవహితరాగం పోటూరతం ఖలరత మయంత్రిత మితి రతివిశేషాః' అని మహర్షి సూత్రీకరించినాడు. గోత్రస్ఖలనమును గూర్చి జాగరూకత వలసినది హెచ్చరించి ప్రణయ కలహ విధానముల జెప్పి చతుష్షష్టి మిగిలిన వాని కంటె శ్రేష్ఠము "విద్వద్భిః పూజితాం మేతాం ఖలైరపి సుపూజితాం, పూజితాం గణికా సంఘై ర్నందినీం కోనపూజయేత్" (2.9.51) అను శ్లోకమొనర్చి సాంప్రయోగికమును ముగించినాడు.

కన్యా సంప్రయుక్తకము తరువాత వచ్చు నధికరణము, చతుష్షష్టి కళావిచక్షణుడు, భావతః సంవక్ష్యమాణుడు అయిన నాయకునికి సమాగమోపాయమును అవాపము కావలయును. అందు కన్యక ముఖ్యురాలు గనుక నీ యధికరణమున ప్రథమాధ్యాయము వరణ విధానము. ఇందలి "సువర్ణాయాం అనన్యపూర్వాయాం, శాస్త్రాధిగతాయాం, ధర్మార్థక పుత్రాః, సంబంధః పక్షవృద్ధిః అనుపసత్కృతారతిశ్చ" అను సూత్రము ముఖ్యముగ గమనింపదగినది. సవర్ణయు, అనన్య పూర్వయు, అయిన నాయిక వలన ధర్మము, అర్థము, పుత్రులు, సంబంధము, పక్షవృద్ధి, అకృత్రిమ రతి లభించునని ఆయన అభిప్రాయము. (3.1.1) ఈ భావము నేటి పాశ్చాత్యుల వివాహవిజయమునకు సంబంధించిన అభిప్రాయముతో కొంత వ్యతిరేకించు చున్నది.[77]

భారతదేశమున వివాహము కాని వారు ఎవరును ఉండకూడదని ఋషుల అనుశాసనము. రూపాజీవయైన పణ్యస్త్రీయును కుమార్తె నెవరికైన నిచ్చి వివాహమొనర్చి

తీరవలసినదే. అటుల యోగ్యుడైన వరుడు లభించని పక్షమున నామె శాస్త్రోక్తముగ నొక వృక్షమునకు గాని, ప్రతిమకుగాని, కౌక్షేయకమునకు గాని వివాహ మొనర్పవలెను.[78] వివాహము కాని మధ్యవయస్కుడైన బ్రహ్మచారితో సహపంక్తి భోజనము పనికిరాదని స్మృతి వాక్యమున్నది.[79] వారి వివాహమునకు ప్రథమ కారణము 'కుమారుని మూలమున పితృతర్పణము'[80] ప్రాచ్యఖండములు వివాహము, మృత్యువు రెండును దైవకార్యములని భావింతురు. వీటన్నిటిని బట్టియును ప్రాచ్య దృక్పథమును బట్టియు హిందూవివాహము కేవలము న్యాయసమ్మత (Legal) పరస్పర ప్రేమానురాగ బంధముల (Mutual Sexual unions) కంటె విశేషమైనదని అర్థము కాగలదు. అందువలన ప్రాచ్యఖండములలోని వైద్యశాస్త్రజ్ఞులు, ధర్మశాస్త్రకర్తలు, సాంఘిక శాస్త్రవేత్తలును కన్యావరణమునకు ఎన్నో నియమముల నేర్పరచినారు. ప్రాచ్యదేశ ములందును కేవలము సహకారులుగ నుండుటకు మాత్రమే ఇట్టి నియమములు కొన్ని వారి పూర్వులు పలికినారు. అందలి అనేక నియమములు ప్రాచ్యదేశ వరణనియమములును ప్రధానముగ భారతీయ వరణవిధులతో సరిపోవుచున్నవి.[81]

భారతీయ వివాహ లక్షణవేత్తలు రూపమునకు విశేష ప్రాధాన్య మిచ్చినట్లు కనుపింపదు. ఆ రూపమును వ్యక్తిగత, దేశగత, జాతిగతము.[82] జాతులను సంరక్షించుకొనుటకు ఆవశ్యకములైన శరీర ధర్మమును (Biological means of race preservation) వారు విశేషముగ కోరినారు. నేటి మానసిక శాస్త్రవేత్తలును మరియొక రీతి స్త్రీ భాతృపితృ సమానులను, పురుషుడు మాతాభగినీ సమానలను వరించుట సహజముగ గోచరించునని చెప్పినారు [83] అందుమూలమున ఒకానొక వేత్తయన్న క్రింది వాక్యము లెంతయో సమంజములైనవి

''The Hindu Theologians have all along believed that marital partners are pre - ordained by God; where as the Freudian science admits that they are unconsciously pre - ordained by the children themselves, who alone can make a marraigae happy or unhappy.''

ఒకటి సత్యము. భారతీయ వివాహము న్యాయానురాగ బంధములకంటె నధికమైన దగుటచే విచ్ఛేదవిరహితము.[84]

కన్యయందు కోరదగిన లక్షణముల కొన్నిటిని మహర్షి వాత్స్యాయనుడు నిరూపించినాడు. వాటిని కల్యాణమల్ల కొక్కోకులు వారి కాలమునకు అనుగుణములుగ, నాటి అభిమానములతో పెంపొందించినారు.

వరణ యోగ్యయగు కన్యక లక్షణములను చెప్పు సందర్భమున నున్న వాత్స్యాయనుని సూత్రమున (3.1.2) 'త్రివర్షాత్ప్రభృతి న్యూనవయసం' అను దానిని గమనింపవలసి ఉన్నది.[85] మిగిలిన లక్షణములన్నియు నన్నిజాతులవారు నంగీకరించునవియే. ఇట పౌరుష దైవములను వరణద్వితయమును వాత్స్యాయనుడు పలికినాడు. 'తస్యాః వరణే మాతా పితరౌ సంబంధినశ్చ ప్రయతేర న్మిత్రాణిచ గృహీత వాక్యాని ఉభయ సంబద్ధాని' (3.1.4) అను సూత్రమును బట్టి వరించునది నాయకుడొక్కడే కాదని తెలియుచున్నది.[86] 'నక్షత్రాఖ్యాం నదీనామ్నీం, వృక్ష నామ్నీం చ గర్హితాం, లకార రేఫోపేతాం చ వరణే పరివర్జయేత్' అను సూత్రమున అశ్వని, రోహిణి ఇత్యాది నక్షత్రనామములను, గంగా యమునా కావేరి మొదలైన నదీ నామములు, మాలతీ కదంబ పారిజాత ప్రభృతి వృక్షలతా నామములు గల కన్యకలను వరింపరాదని వాత్స్యాయన మతము. దీనికిని మానసిక వృత్తికిని కొంత సంబంధముండి యుండవలయును. తదుపరి ఆయా దేశ లక్షణముల ననుసరించి వివాహము చేయవలసినదని 'దేశ ప్రవృత్తి సాత్మ్యా ద్వా బ్రాహ్మ ప్రాజాపత్యార్ష దైవానామన్యత మేన వివాహేన శాస్త్రతః పరిణయే దితివరణవిధానమ్' (2.1.21) అని సూత్రీకరించి ఈ అధ్యాయము ముగించినాడు.[87]

కన్యా విస్రంభణమున ఉపాయ పూర్వకముగ నాయికను విశ్వసింప జేయుట నిరూపితమైనది. వివాహపూర్వ ప్రణయము భారతదేశమున లేకపోవుటవలన నీ విస్రంభణము కామశాస్త్రమున చెప్పవలసి వచ్చినది.[88] కన్యావిస్రంభణ మెరుగని వారివలన జాతులు రోగగ్రస్తములగుచున్నవి.[89] తదుపరి వచ్చు బాల్యోపక్రమ ఏకపురుషాభి యోగాద్యధ్యాయముల కన్యక బాహ్య ఆంతర రతిసుఖమునకు ఎట్టివానిని స్వీకరింపవలయునో మహర్షి నిరూపించినాడు. తదుపరి వచ్చు వివాహాధ్యాయమున నష్టవిధ వివాహ స్వరూపమును తెల్పి అంతమున 'సుఖత్వాదబహు క్లేశాదపిచా వరణా దిహ అనురాగా దాత్మ కత్వాచ్చ గాంధర్వ ప్రవరో మతః' (3.5.80) అను గాంధర్వ వివాహా (Romantic Marriage) ధిక్యమును నిరూపించినాడు.

భార్యాధికరణము ఒక రీతిగ కన్యాసంప్రయుక్తమునకు పరిశిష్టము. 'భర్తాతు దేవతా స్త్రీణాం' అను న్యాయమున భార్య మెలగవలసిన రీతిని గృహకర్తవ్యములను నిరూపించి "జ్ఞాతి కులస్యా నభిగమన మన్యత్ర వ్యసనోత్సవాభ్యాం' (4.1.44) మొదలైన నీతులనెన్నిటినో వాత్స్యాయను డుపదేశించినాడు. ఈ ప్రకరణమున నాటి సాంఘిక స్థితియందు గృహిణి ఎట్టి ఉన్నతస్థితి ననుభవించునో తెలియగలదు. మనువు భార్యను

గురించి చెప్పిన వాక్యములన్నియును సత్యములని వాత్స్యాయనుడు భంగ్యంతరముగ నిరూపించినట్లు వ్యక్తమగును.[90] ఇందలి జ్యేష్ఠావృత్త ప్రకరణమున "జాడ్య దౌఃశీల్య దౌర్భాగ్యే భ్యః ప్రజానుత్పత్తే రాభీక్ష్ణ్యేన దారికోత్పత్తే నాయక చాపలాద్వా సపత్న్యధిక వేదనమ్' (4.2.1) అను సూత్రమున బహుభార్యాత్వ కారణముల జెప్పినాడు.[91] సపత్నిక భార్యాలక్షణముల చెప్పిన తరువాత పునర్భువును పేర్కొని ఆమెకు ప్రథమ గౌరవము లేదనియును, అందలి అక్షతయోని (అగర్భాదాన) క్షతయోని (గర్భాధాన) అనుభేదములున్నవనియును చెప్పినాడు. ఇటు పునర్భూ నిర్వచనమున గోనర్దీయ, బాభ్రవ్య మతభేదములు నిరూపితములైనవి. బాభ్రవ్యుని పునర్భువు పునర్భువు కాదని కామసూత్ర వ్యాఖ్యాత 'యాతు పునః పున్నిష్కా మత్సవేశ్యా విశేషే అంతర్భూతా' అని కొట్టివేసి వేశ్యావిశేషముగ పరిగణించినాడు. పునర్భూప్రకరణమున కొన్ని సూత్రములలో (996-1002) ఆమెకు వేశ్యకంటె ఉన్నత స్థానము నిచ్చినను ఉపపత్ని (Secondary Wife) గ మహర్షి పరిగణించినాడు. దుర్భగా ప్రకరణమున సపత్నీ బాధనొందు స్త్రీ తప్పించుకొని నాయకానురాగమును పొందురీతిని ఆతడు విశదీకరించినాడు. అంతఃపురికా ప్రకరణమున అంతఃపుర స్త్రీల విషయమున రాజును, జానపదులను భార్య లే రీతి వశమొనర్చుకొన వలయునో చెప్పినాడు. భార్యాధికరణ ఫలశ్రుతిగ మహర్షి పలిత "యువతిశ్చ జితక్రోధా యథా శాస్త్ర ప్రవర్తినీ హోతి వశ్యం భర్తారం సపత్నీ శ్చాధితిష్ఠతి' అనుమాట సత్యముగ విజ్ఞానప్రదముగ నీ యధికరణమును ఆయన చేకూర్చినాడు.

వేశ్యవల్ల కేవలము కామము మాత్రమే లభించి పరదారల వలన అర్థకామములు లభించుటచే వైశికము కంటె పారదారికాధికరణమును తదుపరి మున్ముందుగ మహర్షి పలికినాడు. అందును ముందు స్త్రీ పురుష శీలావస్థాపన మొనర్చి భారతీయుల పావిత్ర్యలక్షణములను ద్యోతకమొనర్చినాడు.[92] పరదారల పొందవలసిన నాయకునకును, నాయకుని పొందగోరు పరదారకును పరస్పరము స్త్రీ పురుష శీలావస్థాపన శక్తులత్యవసర మగుటయే ఈ అధ్యాయమును చెప్పుటకు మూల కారణము. ఇందు మదనావస్థ ఉత్పత్తి మొదలు ప్రాణాంతము వరకు పదిదశలని ప్రాచీనమతమును పేర్కొనినాడు. (5.1.5)[93] స్త్రీలు సర్వసాధారణముగ వ్యావర్తనమును పొందుటకు గల కారణములను చెప్పి (5.1.17.42) స్థాలీపులాక న్యాయమున చెప్పినానుగాని ఇంకను నిట్టి వనేకములున్న వనినాడు.[94] పరదారలయెడ సంసిద్ధతగల పురుషుల నెన్ని, తదుపరి కామసూత్ర కర్త అభియోగ విధానములను, పరిచయ కారణములను, బాహాభ్యంతర పరిచయ లక్షణములను చెప్పినాడు. భావపరీక్షా

ధ్యాయమున దూతీకర్మమూలమున అభియోగము నెరపుట నిరూపితమైనది. దూతీకర్మాధ్యాయమున దూతీలక్షణమున్నది. వాత్స్యాయనుడు 'దర్శితేంగి తాకారాంతు ప్రవిరళ దర్శనా మపూర్వాం చ దూత్యోప స్పర్శయేత్' (5.5.1) అను వాక్యమున దూతి ఉపయోగమును జెప్పి 1. నిసృష్టార్థ 2. పరిమితార్థ 3. పత్రహారి[95] అనుదూతికల విభేదమును పలికినాడు. భార్యాదూతీత్వ మిందు గమనింపదగినది. ఈమె ఎందు నిమిత్తము దూత్యమొనర్చుచున్నదో ఎరుగని ముగ్ధరాలు, మూఢదూతిక.

తదుపరి అధ్యాయము ఈశ్వర కామితము. ఇందు ప్రభువుల పరదారాభిగమనము నిరూపితము. 'నత్వేవం పరభవన మీశ్వర ప్రవిశేత్' (5.5.29) అని వాత్స్యాయ నాభిమతమును నిర్దేశించినాడు. తదుపరివచ్చు అంతఃపురికాప్రకరణమున నీ సూత్రమును సమన్వయ మొనర్చి వీరికిని పరభవన ప్రవేశము పనికిరాదనినాడు. ఇందలి రెండవ మూడవ సూత్రమున అంతః పురికలు అపద్రవ్యముల మూలమునగాని అవ్యక్త లింగముల మూలమున గాని, లేక పురుష ప్రతిమల మూలమున గాని అభిలాషము తీర్చుకొన వలెనని చెప్పినాడు. (9,9.2-4)[96] ఈ ప్రకరణమున చెప్పిన 'స్వైరేవ పుత్రై రంతః పురాణి కామచారై ర్జననీవర్జ ముపయుజ్యంతే వైదర్భి కాణాం' (5.6.36) అనుసూత్రము వలన నాత్మబంధు ప్రణయము (INCEST)[97] అంతఃపుర స్త్రీల కున్నట్లు తెలియుచున్నది. ఇట స్త్రీవినాశ కారణములను 'అతిగోష్ఠీ నిరంకుశతా భర్తు స్వైరతా పురుషైస్సహా నియంత్రణతా ప్రవాసేవస్థానం విదేశే నివాసః స్వవృత్త్యుప ఘాతః స్వైరిణీ సంసర్గః పత్యుతీర్ష్యాళతా చేతి స్త్రీణాం వినాశ కారణాని' (5.6.49) అను సూత్రమును పలికినాడు.[98]

అతి ప్రాచీన కాలముననే భారతదేశమున నన్యదేశములందువలె పణ్యవృత్తి (వేశ్యావృత్తి) ఏర్పడినది. ఇందు ఉత్తమలు గణికలు. అత్యుత్తమ నాగరికత వ్యాపించిన ఆ కాలముల నాగరకులు భార్యలలో లుప్తమగు భోగమును భోగస్త్రీలయందు (Femmes De joie) పొందెడివారు. అందువలన సాంఘిక వ్యవస్థలో వారికున్నత స్థానము ప్రాపించినది. అందువలననే గణికకళా ప్రావీణ్య లక్షణమును విద్యాసముద్దే శాధ్యాయమున వాత్స్యాయనుడు నిరూపించినాడు. వీరికి సంబంధించిన కామమును ఆయన వైశికమున నిరూపించినాడు. కొందరు, మహర్షి భార్యాధికరణమును వదలి కేవలము పారదారికమునకు విశేష ప్రాధాన్య మిచ్చినారు. కల్యాణమల్లుడు వేశ్యా ప్రకరణమును వదలినాడు. కొందరు శాస్త్రకారులు కేవలము వేశ్యయే నాయిక యైనట్లు గ్రంథరచన మొనర్చినారు.

ఇందు వేశ్యకు గమ్యులు కేవలార్థులు ప్రీతి యశోర్థులని ద్వివిధములుగ రూపించి వాని అంతర్విభేదములను నిరూపించి, సహాయుల చెప్పి, ఆమె కగమ్యులను వివరించి, గోష్ఠీ ఉపావర్తనాదిక్రియా స్వరూపమును వెల్లడించినాడు. వారికి కాంతానువృత్త విధానమును, కాంతాను వృత్తమున, ప్రియాస్వీకరణము, అర్థాగమోపాయాద్య ధ్యాయమున అర్థస్వీకరణ విధానమును చెప్పినాడు. తదుపరి విశీర్ణ ప్రతిసంధానాధ్యాయమున విశీర్ణ నాయకుని పొందు విధానమును చెప్పినాడు. లాభవిశేషాద్యధ్యాయమున గణిక, రూపాజీవ, కుంభదాసీలు వారి లాభములనెట్లు ఉపయోగింప వలయునో శాసించినాడు. తదుపరి అర్థానర్థానుబంధ సంశయ విచారా ధ్యాయము వైశికము చివరి అధ్యాయము. ఇందు విటులనేకులు విశ్వాసము గలిగి గోష్ఠీ పరిగ్రహముగ పొందిన వేశ్య ద్రవ్యార్జన మొనర్పవలసిన రీతిని నిరూపించినాడు. అంతమున 'కుంభదాసీ, పరిచారికా, కులటా, స్వైరిణీ, నటీ, శిల్పకారికా, ప్రకాశ వినష్టా, రూపాజీవా గణికా చేతి వేశ్యా విశేషాః' (7.6.57) అని అందలి విభేదములను నిరూపించి వేశ్యలు అర్థ ప్రయోజనలుగాని, రతి ప్రయోజనలు గారనీ నిశ్చయించినారు.[99] పణ్యజీవనము ఒకనాడు వచ్చినది కాదు. వివాహవిచ్ఛేదకమును కాదు. దీనిని గూర్చి ఎల్లిస్ మహాశయుడు ''The History of the rise and development of prostitution enables us to see that prostitution is not an accident of our Marriage system, but an essential constituent which appears with its other concurrently essential constituents'' అని చెప్పి ఉన్నాడు. ఇట్టి దృష్టి వాత్స్యాయనాది ప్రాచీన కామశాస్త్రవేత్తల కున్నట్లు గోచరింపదు. కాంతాను వృత్తాద్యధ్యాయమున పణ్యస్త్రీల కామలక్షణములను గూర్చి ప్రశ్నించుకొని మహర్షి 'సూక్ష్మత్వా దతి లోభాశ్చ ప్రకృత్యా జ్ఞానత స్తథా, కామలక్ష్మతు దుర్జ్ఞానం స్త్రీణాం తద్భావితై రపి' ఇత్యాదిగ పలికినాడు. కాని నేటి జాతిశాస్త్రవేత్తలు (Sexologists), మానసిక శాస్త్రవేత్తలు పణ్యస్త్రీ కామమును గూర్చి 'It is not from any innate wish of their own, but from necessity that most women enter this profession, indeed, psychological investigation has shown that, far from being over sexed, the majority of prostitutes are under-sexed. Many of them are even homosexual, with no feeling whatever for men'[100] అని చెప్పుచున్నారు.

ఔపనిషదికము తరువాత అధికరణము. స్త్రీ పురుష సుఖానుభూతి కేవల మానసికమే కాదు; శారీరకమును. ఇందు తన్మూలమున శారీరక లోపముల తీర్చుటకై వశీకరణ, వశ్యయోగ, వాజీకరణ[101] వర్ధనాది యోగముల చెప్పినాడు. 'పురుషునికి

విస్పృష్టి త్వరితముగ కలుగకుండుటకు వాత్స్యాయన కొక్కోకులు[102] బుద్ధిని బహుధా ప్రసరింపజేయుట అవసరమనినారు. ఇందలి సుభగంకరణాద్యధ్యాయమున వేశ్యావివాహ స్వరూపమును విశదీకరించినాడు. (7.1.13-23) రంగోప జీవులైనవారు నృత్యగీతాదులందు తోడ్పడువారికే కన్యక నీయవలయునని నియమించి ప్రాచీన భారత కళాకర్మ రక్షణకు మహర్షి శాస్త్రయైనాడు. ఇందలి నష్టరాగ ప్రత్యానయినాద్యధ్యాయమున లింగవేదన గూర్చిన సూత్రము గమనింపదగినది. (7.1.15) బహుపాదపాది మూలములను నూరి పిల్లనగ్రోవికి పట్టించిన తరువాత వాయించినచో నా ధ్వనికి స్త్రీలు వశ్యులగుదురనుట నమ్మతగినదేనా? ఇతర శాస్త్ర గ్రంథములందున్న వశీకరణాదిక మంత్రములు వాత్స్యాయనమునలేవు.

మహర్షి వాత్స్యాయనుడు కేవలము నాయికా నాయక కామమును వర్ణించినాడు గాని పాశ్చాత్య లోకముల విరివిగను, ప్రాచ్యలోకముల కొలదిగను పొడకట్టు కామోన్మాదములైన అసహజ ప్రణయములను (Abnormalities) స్పృశింపలేదు. కొన్నితావుల స్వీయజాతి ప్రణయము Uni sexual love నుద్ఘాటించినను విశేషముగ నందు పుంభావరూపత ఆనుగుణ్యమున్నది.[103] ఇందలి Tribadism, Gyandry (పోటారతము) మొదలగు గుణములచ్చుటచ్చుట పొడకట్టక పోలేదు. పశుపక్షిప్రణయము (Zoo Philia or Beastiality) మందునకైన లేదు. కాని ప్రాచీన దేవాలయ శిల్పముల వీనివిభేదములు క్వచిత్తుగ కాననగును. (Podophilia) బాల ప్రణయము మచ్చునకైనలేదు. (Sodomy) కనుపింపదు. అష్టవిధ వివాహములలోగాని అన్యత్రగాని దూషణము (Rape) కొన్ని జాతులవలె నెట్టిహీనులకైన వివాహవిధానముగ నా మహానుభావుడు పరిగణింపలేదు. వీనినిబట్టి మహర్షి దృక్పథము కామతంత్రమును జాత్యభ్యుదయమున కనుగుణముగ నిబద్ధించుటగాని అన్యముకాదు. ఈ మహాశాస్త్ర గ్రంథరచనము మూలమున మహర్షి భారతదేశమునకు నాటిసాంఘిక వ్యవస్థను గ్రహించుట కత్యుత్తమాధార గ్రంథమును సృజించి మహోపకార మొనర్చినాడు. ఈ శాస్త్ర గ్రంథము వలన నా నాటి సాంఘిక నాగరికత, జీవన విధానము, వర్ణ వ్యవస్థ, విద్యావైదు ష్యములు, క్రీడాదికములు, దేశసౌభాగ్య సంపదలు విస్పష్టముగ వెల్లడియగుచున్నవి.

ఒకానొక ఆధునిక జాతిశాస్త్రజ్ఞుడు గ్రంథాంతరమున ఫలశ్రుతిగ "The Question of sex - with the racial questions that rest on it - stands before the coming generations as the chief problem for solution. Sex lies at the root of life, and we can never learn to reverence life until we know how to understand

sex'' అని పలికినాడు. మహర్షి వాత్స్యాయనుడు బాభ్రవ్యాది మతములను గురువులవద్ద పఠించి తెలిసికొని, స్వబుద్ధిని తరచిచూచి యథావిధిగా ఈ కామసూత్రముల రచించి శాస్త్ర ప్రయోజనమును పైజాతి శాస్త్రజ్ఞుని కంటె నత్యున్నతస్థాయి నందుకొని ఇట్లు పలికినాడు.

"తదేత ద్బ్రహ్మ చర్యేణ పరేణ చ సమాధినా
విహితం లోక యాత్రార్థం నరాగోర్థోస్య సంవిధి ।
రక్ష న్ధర్మార్థ కామానాం స్థితా స్వాలోకవర్తనీం
అన్య శాస్త్రస్య తత్త్వజ్ఞో భవత్యేవ జితేంద్రియః ॥"

**అనుబంధము**


1. B.Z. Goldberg, ''THE SACRED FIRE'' Scientific curiosities of Love life and Marriage - Dr. Rustum J. Mehta (D.B. Tarapore-vala-Bombay) page 35
2. వాత్స్యాయన కామసూత్రములు : 1.1.5-19
3. Page 3 Introduction, Kalyana Malla's Ananga Ranga by Tridibnath Ray Medical Book Company, Calcutta)
4. Chandogyopanishat ch. v. ii, ch. vi. i,
5. Brihadaranyakopanishat ch. vi-Br 2.
6. మహాభారతము ఆదిపర్వము ch. 122 v 9-21
7. చతుర్భాణి - ధూర్తవిట సంవాదము - 24
8. Ibid - పాదతాడితకము P. 28
9. Majjhima Nikaya II Majjhima Pannassam 89, Robert Chamer's Edition P. 118
10. అర్థశాస్త్రము - 95 అధ్యాయము.
11. Elliots History of India - Vol IV.
12. Page 15 - Introduction, The art of love in the orient - N.K. Basu (Medical Book Company)
13. వాత్స్యాయన కామసూత్రములు - పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి - విజ్ఞప్తి iii (ప్రథమ ముద్రణము)
14. Journal of the Mythic Soceity vii - 291
15. వాత్స్యాయన కామసూత్రములు - ప్రథమ ముద్రణము - విజ్ఞప్తి ii

16. J.R.A.S. October 1930 pp - 930 -932

17. చతుష్షష్టి కళలు కామసూత్రములకు అంగవిద్యలని వానిని మహర్షి వాత్స్యాయనుడు సంగ్రహించినాడు. ఇవి ఇతర శాస్త్రములందును చెప్పబడి ఉన్నవి. కల్పసూత్రములలో కళలు డెబ్బదిరెండుగ నున్నవి. జైన గ్రంథము లందును నట్లే యున్నవి. కామసూత్ర వ్యాఖ్యాత ఈ అరువది నాలుగు మూలకళలయందే గర్భితములైయున్న అంతరకళలను మరికొన్నిటిని చేర్చి కళలు పంచశతములని చెప్పినాడు. వానిని కర్మాశ్రయములు (24), ద్యూతాశ్రయములు (20), శయనోపచారకములు (16), ఉత్తర కళలు (4) అని విభజించి వాని స్వరూపము రూపించినాడు. వాత్స్యాయనుని చతుష్షష్టి మరియొకటి ఉన్నది. మహర్షి, వ్యాఖ్యాత లిరువురు ఆ పాంచాలికా చతుఃషష్టిని గూడ కామశాస్త్రమున కంగవిద్యలుగా పరిగణించినారు. భోజుని చతుష్షష్టి మరొక విధముగ నున్నది. ప్రాచీన గ్రంథములను బట్టి కళలన్నియును తెలియకున్నను సుందరమైన ప్రతికర్మను మనవారు కళగా లెక్కించిరని చెప్పవచ్చును.

18. కామసూత్రములు - (1.4.42) ఇందలి యక్షరాత్రి, కౌముదీ జాగరము, సువసంతకము, యవన చతుర్థి, అలోల చతుర్థి, మదనోత్సవములు, కేవలము పురాతన గ్రీకుల కోర్డాక్సు నృత్యము, హేస్టీయా దేవపూజల వంటివి కావు. బొనాడియా, డైయినీషియస్, మొదలైన రోమక దేవతాపూజలలోని బుకనేలియా ఉత్సవముల వంటివి కావు. ఇందలి హోలాకా, అశోకొత్తంశికా, ఇక్షుభంజికాది క్రీడలు గ్రీకు రోముక దేశముల కామోన్మత్త వృత్తములతో పోల్చదగినవి కావు. ఉదకక్ష్వేడిక అను శృంగాటకము గిబ్బను మహాశయుడు విపులముగ వర్ణించిన ప్రజాస్నానద్రోణ జలక్రీడల పోలవు. (History of tho Decline and Fall of the Roman Empire Vol. V)

19. 'ఏకచారిణశ్చ విభవ సామర్థ్యా ద్గణికాయాం నాయికాయాశ్చ సఖౌభి ర్నాగర కైశ్చ సహచరిత మేతేన వ్యాఖ్యాతమ్' (1.4.43) అనుటను బట్టి ఏకచారులగు వారును విభవసామర్థ్యములను బట్టి సమస్త క్రీడలను ప్రవర్తించెడివారని తెలియుచున్నది.

20. పునర్భువును 'పునర్భూరియం అన్య పూర్వక రుద్దా నాత్ర శంకాస్తి' అని నిరూపించి పూర్వము క్షతయోనియై మరల వివాహమాడుటవలన నట్టి స్త్రీ నధిగమించుట వలన ధర్మపీడగాని, తదాశంక గాని లేదు (1.5.7) అని చెప్పుటవలన పునర్వివాహ విషయమున వాత్స్యాయనుని అభిప్రాయమేమో వ్యక్తమగుచున్నది. ఆమెకు ధర్మపత్నీత్వమును అతడంగీకరించినట్లు తోచదు. పునర్భూ సమాగమమునకు తరచుగ కలుగు కారణములను ఈ అధ్యాయమున 6-20 గల సూత్రముల విశేష బుద్ధికుశలతను ప్రకటించి మహర్షి విశదీకరించినాడు.

21. దీనిని గురించి ప్రత్యేకాధికరణము కామశాస్త్రమునందున్నది.

22. కామసూత్రములు : (1.5.- 4,5)

23. Ibid. (1.5.32)

24. Dr. N.K. Basu - Art of love in the Orient page 121.

25. Robinson - Sexual impotence pp. 304-305

26. Wright - 'The Sexual factor in Divorce' - Sex in Civilization – అమెరికా దేశమున విడాకుల చట్టము, వివాహములపై కెరోల్ మహాశయుడు తయారొనర్చిన ప్రణాళికలో, విడాకులు కోరువారు చూపిన కారణములలో దుర్గంధత్వము ప్రధాన కారణముగ విశేషముగ గోచరించుచున్నదని తెలియుచున్నది. (Report on Marriage and Divorce in United States by Carroil, D. WRIGHT.)

27. "There are various dispositions in the fair; treat these in thousand different ways. There are characters in these various dispositions as these are forms in this world; the man that is wise will adopt himself to the innumerable characters" Ars Amatoria - Bk. 1-RILEYS translation.

28. Understanding Human Nature ALFRED ADLER (Garden City Publication New York) pp 180-181

29,30. Sex Hostility in Marriages (W. Heinnemann Medical Book Ltd) pp 201-232 మీడియర్ స్త్రీ విషయమున చేసిన విభాగమునకు ప్రతిగా గయిల్ అను శాస్త్రజ్ఞుడు పురుషులను 1. ARCHITC TYPE 2. PHALLIC TYPE అని విభజించి "These architic Type is fond of family life... and often displays intelligeace thus the uterine type of women and has little artistic abilities and is generally conservative. The Phallic Type of Man has the qualitites and defects of the clitiroid type of women, who loves a man for his own sake and knows no satisfaction greater than sexual engagement" అని వాని గుణాగుణములను విశదమొనర్చినాడు.

31. Sex and a Changing Civilisation - KENNETH WALKER M.A; 3c.

32. Page 65 Modern Marriage - Edward. F. Griffith M.R. cs, L.R.C.P. (Methuen & Co Ltd. London)

32ఎ ఇట గుణపతాకుని మతానుసారమున నాయికా విభేదములను గమనింపవలసి యున్నది. ఈ ఆచార్యుని మతమున స్త్రీలు శ్లథలు, ఘన, మధ్యలు. శ్లథ : 5 – దీర్ఘ, కృష్ణ, కృశతను, చిరవిరహిణి, నిమ్న కక్ష. ఘన : 5 – స్థూలాంగి,

గౌరవర్ణ వామన, శశప్రియ, ఉన్నత కర్షభాక్కు – అవి కొన్ని ఇవి కొన్ని ఉన్నవారు సంకీర్ణలు మధ్యమలు. వీరికి అవస్థా పంచకములున్నవని ఇతరులు పేర్కొనినారు. అవి కన్యావస్థ, రోహిణ్యావస్థ, గౌర్యవస్థ, బాలావస్థ, తరుణ్యావస్థ, వృద్ధావస్థ. నాయికా నాయకులు సమానావస్థలు గల వారుగ నుండవలెనని కామజ్ఞుల మతము. సత్వభేదముల ననుసరించి స్త్రీలు (1) దేవసత్త్వ (2) నరసత్త్వ (3) నాగసత్త్వ (4) యక్షసత్త్వ (5) గంధర్వ సత్త్వ (6) పైశాచసత్త్వ (7) కాకసత్త్వ (8) కపిసత్త్వ (9) రక్షసత్త్వ (10) దానవసత్త్వ (11) గజసత్త్వ అని విభేదములున్నవి. అభిసారిక, ఖండిత, విరహోత్కంఠిత, వాసవసజ్జికాది శృంగార నాయికా విభేదములు అలంకార శాస్త్రము లందు గోచరించుచున్నవి. చరక శుశ్రుతాదుల వైద్య గ్రంథ విజ్ఞానముతో కొందరు శాస్త్రకారులు స్త్రీలను ప్రకృతి ననుసరించి వాత పిత్త కఫ ప్రకృతులని విభజించినారు. (శుశ్రుతము III. IV. – 62 – 63; ఈ సందర్భమున (శుశ్రుతము iii 72–76 63–71 చూడదగినవి), ఈ విభాగము పాశ్చాత్య వైద్యపిత యని చెప్పదగిన హిప్పోక్రేటిస్ విభజన వంటిది. బాల తరుణీ ప్రౌఢ వృద్ధాది విభాగమునకు ముఖ్యులు పంచసాయకకర్త జ్యోతీశ్వరాచార్యులు, స్మరదీపికకర్త ముఖ్యులు. బాల 16 వత్సరముల వరకు. 12వ వత్సరమున పుష్పవతి అయినను నాలుగు వత్సరముల తరువాత గాని గర్భాధానము జరుగరాదని కామశాస్త్రజ్ఞుల అభిప్రాయము. తరుణి 16–30. (20–30 అని జ్యోతీశ్వరాచార్యుడు) ప్రౌఢ వయస్సు స్మరదీపిక మతమున 19–50. వృద్ధ కొందరి మతమున 50 తరువాత, మరికొందరి మతమున 55 తరువాత. (నాగరసర్వస్వాదులు) గ్రీష్మ వసంతముల బాలతోను, హేమంత శిశిరముల తరుణితోను, వర్షమునను తదుపరి ప్రౌఢతోను ఆనందము నిచ్చునని పద్మశ్రీ పలికినాడు. రతిరత్న ప్రదీపికయందును, రతిరహస్యమునందును గల ఘనులే అనంగరంగ కర్త చెప్పిన దృఢలు. గుణపతాకుని విభాగము శాస్త్రీయముగ లేదు. నీలవర్ణలయిన సంతాల్ పర్గణాలలోని స్త్రీలు (దక్షిణ భారతము) ఘనులుగాని వారియందు శ్లథత (Flaccid Nature) ఉన్నది. మొరటువారు, ఉన్నత కర్షభాక్త్వము వారిలో లేదు. శుశ్రుతాచార్యులవారు సత్త్వము ననుసరించి పురుషులను (1) సాత్త్వక (2) రాజసిక (3) తామసికు లని చెప్పినారు. వారిలో సాత్త్వికులు (6) మహేంద్రకాయ, వరుణకాయ, యమకాయ, కుబేరకాయ, గంధర్వకాయ, ఋషికాయలు. దేవ, గంధర్వ, యక్ష, మనుష్య, సత్త్వస్త్రీలు సాత్త్వికలు. రాజసికులు: అసురసత్త్వ, సర్పసత్త్వ, శకునసత్త్వ, రాక్షస, పిశాచ, ప్రేతసత్త్వులు. పిశాచ నాగ, కాక సత్త్వస్త్రీలు రాజసికలు. తామసికులు : నాయిక (3) స్వీయ, పరకీయ, సామాన్య. స్వీయ (3) ముగ్ధ, మధ్య, ప్రగల్భ ముగ్ధ (2) అజ్ఞాతయౌవన, జ్ఞాతయౌవన – నవోఢ, విస్రబ్ధనవోఢ, అతివిస్రబ్ధనవోఢ. మధ్య

: ధీర, అధీర, ధీరాధీర. ప్రతి జాతియందును జ్యేష్ఠా కనిష్ఠలు విభేదములు. పరకీయ : గుప్త, విదగ్ధ, లక్షిత, కులట, అనుశయన, ముదిత, కన్యక. గుప్త: 12) వస్తు సురత గోపన వర్తీయమాణ సురతగోపన (వర్తమాన సురతగోపన). వాగ్విదగ్ధ క్రియా విదగ్ధ అని విదగ్ధ ద్వివిధము. సామాన్య : అన్య సంభోగ దుఃఖిత, వక్రోక్తి గర్విత ప్రేమ గర్విత, (సౌందర్య గర్విత), మానవతి (పరస్త్రీ, దర్శనాధి జన్మ, గోత్ర స్కలనాధి జన్మ, అపరాంగనాసంగాధి జన్మ) ఇది కామశాస్త్రముల నాయికా స్థూలస్వరూపము.

33. భారతీయ శాస్త్రవేత్తలు స్యందనము (Antorgastic Secretion) నకు విసృష్టి (Orgastic emission) కి విభేదమును చూపినారు. ఇది పూర్వాచార్యులు ఒనర్చిన విధానము. తదుపరి కొక్కోక కల్యాణమల్ల మల్లులు ఇట్టి విభేదము పాటింపక కామసలిల శబ్దమును రెంటికిని సమముగ వాడినారు. భావ శబ్దమునకు రస, రతి, ప్రీతి, రాగ, వేగ, సమాప్తి మొదలగు పర్యాయపదములు కామసూత్రముల (11.1.65) కనుపించుచున్నవి. కామసమయముననున్న గ్రంథమును గూర్చి ప్రాచీనులొనర్చిన ప్రశంసతో నేటి విజ్ఞానులంగీకరింపరు. Encyclopaedia of Sex Practice pp. 244-45 కొందరు కామసలిలామోదమునే దైహికామోదమని భావించినారు. స్మరదీపిక, రతిమంజరులు ఈ కోటిలోనివి. ఈ సందర్భమున స్త్రీ, పురుష జాతి దైహిక గంధ తత్త్వమును గూర్చి విపుల విజ్ఞానమునకు టాలమీ 'ప్రణయము' అను గ్రంథము చూడనగును. (Love Talmey - p. 98.)

34. Encyclopaedia of Sex Practice p. 231. Love 81, Ananga Ranga Tridibnath Ray pp 27-31. పాశ్చాత్యులందున స్త్రీ పురుష విసృష్టి విషయమున జీద్భాలకే, బాభ్రవ్య వాత్స్యాయనాదుల పోలిన మతభేదము లున్నవి.

34. Modern Marraige - Griffith. page 91

36. Studies in the Psychology of Sex - Havalock Ellis Vol. IV - p. 550

37. Clifford white - p. 156

38. Art of Love in the Orient - N.K. Basu pp. 202-204

39. Ananga Ranga - T. Ray page 30 Art of Love in the orient pp. 202-205 Physiology of Sex KENNETH WALKER - page 55.

40. Talmey - LOVE (Eugenics Publication Inc. New Yark - page 90.)

41. ఇట్టి ప్రేమకు పాశ్చాత్య కామతత్త్వవేత్తలు FELLATIO అని పేరు పెట్టినారు. 'దీనికి మనవారు ఔపరిష్టక రతి యనినారు. అంతఃపురికా ప్రకరణమున దీనిని గూర్చి విపులముగ చర్చయున్నది. స్త్రీల ఔపరిష్టకాది రతులను గూర్చి ఎల్లిస్

మహాశయుడు విపులముగ వ్రాసియున్నాడు. (Studies, vol. VI - page 557) ఇట్టి విధానము ఏ నాడును విపులముగనున్నట్లు భారతదేశమున పొడకట్టదు కాని శ్రుతులందును ఇట్టి కామ వైపరీత్యము (Sexual Abnormality) గోచరించుచున్నది. దీనికి ప్రతిగా పురుషులందు కాననగు ఆభిమానిక ప్రీతిలో నొక భాగమును పాశ్చాత్యులు Cunnilictus అనినారు. ప్రాచీన భారతీయ కామశాస్త్ర గ్రంథములో నీ మోహన చుంబనాదికమున్నను విశేష వ్యాప్తియులేదు. పాశ్చాత్య దేశములందు విరివిగ నున్నట్లు రచనలవలన తెలియుచున్నది. ''The Superior Berlin Prostitutes testify that about a quarter of their clientee desire to exercise the practice of CUNNILINCTUS to the utter disregard of the coitus proper. In France and Italy the proportion is known to be higher. The Number of European Women who find this aggreeable is undoubtedly greater in the household and without than we generally believe'' FLEXNER - History of Prostituttion in Europe.

42. వాత్స్యాయన కామసూత్రములు - (2.2.4.) ఈ చతుష్షష్టి యనుమాట సాంప్రయోగికమునందుగాని, శాస్త్రైకదేశమునందుగాని వర్తించునట! ఋక్కులలో దశత్రయీ ఋక్కులని కొన్ని యున్నవట. వీటికి చతుష్షష్టి సంజ్ఞ యున్నది. సంప్రయోగాంగమునందును దశావయవ మండలార్థ సంబంధ ముండుటవలన దీనికిని చతుష్షష్టి యని చెల్లునట! ఆ దశాంగము లెవ్వి? "ఆలింగనం చుంబన దంత కర్మ నఖక్షతం సీత్కృత పాణిఘాతం సంవేశనం చోపసృతౌపరిష్టం నరాయితం చేతి దశాంగ మాహుః" అనునది ప్రమాణము.

43. Strange customs of courtship and Marriage - W.J. FIELDING, Blakiston Company, Philadelphia pages 53-66

44. ''Three senses are blended in the kiss, touch, taste and smell; the sense of smell is important'' Ideal Marriage - VAN DE VELDE page 153. 'The prelude to sexual act begins with the kiss i.e. the erotic kiss. This is rich in its variation, from the lightest, gainest, form, it may run the gamut of intimacy and intensity to the pitch of Mariachinage in which the couple sometimes for hours mutually explore and caress the inside of the mouth of each other with their tongues as profuouesly as possible" IBID -

45. ఆదర్శ వివాహ గ్రంథకర్త వాన్ డి వెల్డి నూతన వధువుకు భయమును పారద్రోలుటకు నేటి దంపతులు ఇరువురును పరస్పరము మోహనచుంబన మొనర్చుకొనుట యుక్తమనినాడు. పే. 170.

46. “This Type of kissing has been endeared MARIACHINAGE in French, derived form the Mariaichins of the inhabitants of the district of Pays De Most in Britany. Here this form of Love Play is extremely popular among married as well as unmarried people. It is here that the lovers sometimes remain locked in embrace indulging in tongue-titling kiss for hours at times” - Ideal Marriage - p. 153.

47. అరబ్బులు, పర్షియనులు చుంబన ప్రాధాన్యమును గుర్తించినట్లు కనుపింపరు. బాహ్యరతి “పైనవారికి ప్రణయమున్నట్లు గోచరింపరు.” (Art of Love in the Orient - N.K.BASU - page 167-169)

48. “The more a couple kiss and make love, the more they will want to kiss and make love, untill they work themselves up into such a state of tension that they are unable to exercise proper control.

49. IBID pages 156- GRIFFITH - MOdern Marriage.

50. Van de Velde ‘Ideal Marraige’ page 156.

51. FRITZ WITTELS - Critique of Love pp 49, 79 అందలి అభిప్రాయమును మరియొక వేత్త ఇట్లు సంగ్రహించినాడు. “A certain amount of Sadistic impulse in man and mosachistic impulse in Women is normal and even necessary. There is nothing abnormal if these two instincts in a sane proposition are found mixed up and to appear successively in one and the same person.”

52. ఈ అభిప్రాయమునకు భిన్నముగ “ఆదర్శ వివాహ గ్రంథకర్త రదనచ్ఛదములను విశేషముగ స్త్రీలు ప్రయోగింతు”రని చెప్పినాడు. (Ideal Marriage p. 151). ఇది పాశ్చాత్య దేశ స్త్రీల విషయమున సత్యము కావచ్చును. కాని దచ్చి స్త్రీల కిట్టి గుణము లేదని అన్య ఆధారము వలన తెలియుచున్నది.

53. నాగర సర్వస్వము. 34, 35 అధ్యాయములు

54. కామసూత్రములు - (2.5.20 - 35) ఈ సాత్మ్య వివరణననుసరించి ప్రాచీన భారతదేశ విభాగ స్వరూపము కొంతగ గోచరించుచున్నది. ఇందు వాత్స్యాయనుడు పేర్కొనిన మధ్యదేశము మన్వాది సంహితలును పురాణములు పేర్కొనిన మధ్యదేశము హిమాలయ - వింధ్య మధ్యదేశము. తూర్పు హద్దు వినాశనము (సరస్వతి అంతర్వాహినియైన ప్రదేశము), పడమర ప్రయాగ, వరాహమిహిరుడు బృహత్సంహితలో (XIV, 2-4) ఈ ప్రదేశమునే మధ్యదేశమనినాడు. బౌద్ధుల మహావగ్గమున (V. 13.2) తూర్పు : కజంగల దక్షిణము : సతకన్నిక, పశ్చిమము : ధున, ఉత్తరము: ఉశిరధజలని యున్నది.

వాశిష్ఠ, బౌద్ధాయనులు దీని విస్తీర్ణము కొంత తగ్గించి చూపినారు. (Studies in Vatsyayana's Kama Sutras) వాత్స్యాయనుని మాళవకము నేటి తూర్పు మాళవము, దాని ముఖ్యపట్టణము విదిశ (Bhilsa). ఆభీర దేశ విషయమున కామసూత్ర వ్యాఖ్యాత 'అభీర దేశః శ్రీకంఠ కురుక్షేత్రాది భూమిః' (2.5.24) సూత్ర వ్యాఖ్యానము) అని దేశ నిరూపణమున పొరబడినాడు. ఆయన చెప్పినట్లు ఆభీరము కురుక్షేత్ర శ్రీకంఠములతో సంబంధము కలది కాదు. బృహత్సంహిత ఈ దేశమును కొంకణ, ఆకర, అవంతి, వనవాసి మొదలగు దేశములతో కలిపి పలికినది. అందువలన ఆభీరము పశ్చిమ భారతము లోనిది కావలయును. అది నాసిక ప్రాంతము. వాత్స్యాయనుని లాటము తూర్పు గుజరాతు బరోడాలగు సౌరాష్ట్ర అవంతులకు మధ్యదేశము. నేటి ఉత్తర కథియవాడ్ దేశము. కోసలము ఔంధ్ రాష్ట్రము. పాటలీపుత్రము మగధదేశ రాజధానీ ప్రాంతము. మహారాష్ట్ర దేశమును కామసూత్ర వ్యాఖ్యాత 'నర్మదా కర్ణాట విషయోర్మధ్యే మహారాష్ట్ర విషయః' (2.5.28) అని నిర్దేశించినాడు. వంగము దక్షిణ బంగాళదేశము. గౌడము ఉత్తర బంగాళము. స్త్రీ రాజ్యమును కోసలతో కలిపి పేర్కొనినాడు. ఈ రాజ్యమును కొందరు బాల్ఖో ప్రాంత దేశమనినారు. కొందరి మతమున నిది భూటాను, ఇతరులు ఈ రాష్ట్రమును తిబ్బత్తు దేశమనినారు. కాని ఇది పశ్చిమ తిబ్బత్తు రాజ్యము. ఇందు నేటికిని బహుభర్తృత్వము (Polyandry) వివాహధర్మముగ నున్నది. 'వంగ రక్త దేశాత్ పశ్చిమేన స్త్రీ రాజ్యం' అని వ్యాఖ్యాత (2.5.27). ఉత్కళము నేటి ఒరిస్సా రాష్ట్రము. బ్రహ్మపుత్రకు తూర్పుననున్న దేశము కామరూపము (Assam). కొంకణ రాష్ట్రమునకు తూర్పునను మహారాష్ట్రమునకు దక్షిణమున నున్నదియును వనవాసము. దీని ముఖ్యపట్టణము వనవాసి, 'Vanavasa the South Eastern portion of the Bombay Presidency, North - Western Portion of the Madras Presidency and South Western portion of Hyderabad' 'కర్ణాటక విషయా ద్దక్షిణేవ ద్రవిడ విషయ' వాత్స్యాయనుని తదనంతరము జనించిన గ్రంథములందు మరికొన్ని దేశనామము లున్నవి. అందు తిరుభుక్తి విదేహము. నేటి తిరుహట్. అది తూర్పున కౌశికీనదీ పరివేష్టితము దక్షిణమున గంగ. పశ్చిమమున సదానీక Gandak అని Muir; Rapti - Pargitar; Little Gandak Fleet - J.R.A.S. 1907. p. 644) ఉత్తరమున హిమాలయములు. పాట్నాకు ప్రాచీన నామములు పుష్పపురము, పాటలీపుత్రమే పుష్పపురమందమన్న వీలులేదు. కావున అనంగరంగ కర్త పేర్కొనిన పుష్పపురము పశ్చిమ బీహారు కావచ్చునని కొందరి అభిప్రాయము. అంగము తూర్పు బీహారము – భాగల్పూర్, రాజ్మహల్, పూర్నియా జిల్లాలు మద్రదేశము శల్యుని దేశము (Sialkot). సౌవరము దక్షిణ పశ్చిమ రాజపుత్రస్థానము, మలయదేశము

తిరువాన్కూరు, మధుర, తిన్నవెళ్ళి ప్రాంతము. కాంభోజము దక్షిణ – పశ్చిమ కాశ్మీరములోని రాజూయార్ ప్రాంతము. పౌం్డ్రులు ఉద్ర, ఉత్కళ, మేఖల, కళింగులను వరుసగ జెప్పుటకు ఈ గ్రంథములందున్నది. బంగాళమునుండి పశ్చిమమునకు నటుపిమ్మట దక్షిణ పశ్చిమ క్రమమునకు నడచి చెప్పినట్లున్నది. గాధి రాజ్యము కన్యాకుబ్జము. (Kanauj)

55. ఈ రాగవృద్ధి కరణమును గూర్చి వాత్స్యాయనుడు ప్రశంస తెచ్చినాడు గాని కొక్కోక పద్మశ్రీలవలె వికల్ప స్వరూపమును నిరూపించలేదు. ఈ కరికరక్రీడ రతిరహస్య కర్త మతమున 5 విధములు, (VI– 241–246) పద్మశ్రీ ఇందు షడ్విధ విభేదములను పలికినాడు.

56. ఆంధ్ర కామశాస్త్ర వ్యాఖ్యాత కావ్యస్మృతి తీర్థ శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రులవారు వాత్స్యాయన మహర్షి పేర్కొనని అనేక దేశస్త్రీల సాత్మ్యములను జ్యోతీశ్వరాచార్యుని పంచసాయకాది గ్రంథములనుండి గ్రహించి విపులముగ సంకలనమొనర్చినారు. (ఆంధ్ర కామసూత్రములు – ప్రథమ ముద్రణము పే. 370–371)

57. BASU - Love in the Orient - Chapter X & XI

58. సాహిత్య దర్పణ కారుడు సమస్త రత కోవిదయైన ప్రౌఢ నాయికను "క్వచిత్తాంబూలక్తః క్వచిదగరు పంకాంక మలినః, క్వచిచ్చూర్ణో ద్గారీ, క్వచి దపిచ సాలక్త పదః, వలీభంగా భోగై రలక పతితైః శీర్ణ కుసుమైః స్త్రియా సర్వావస్థాం కథయతి రతం ప్రచ్ఛదపటః" అని వర్ణించినపట్ల మార్జార, ధేనుబంధ, సమపద, ఉత్తానాది సురత విశేషములను పురుషాయితమును గర్భితముగ పలికిన వాక్యములు ఇందుకొక ఉదాహరణము.

59. "The reader will bear in mind that the exceeding pliablity of the Hindu's limbs enables him to assume attitudes absolutely impossible to the Europeans, and his chief object in Congress is to avoid tension of the muscles, which would otherwise shorten of the period of enjoyment Dr. Norman Himes vol VI p. 557

60. IBID 298

61. PAUL LECROIX, History of Prostitution - vol I p. 242 (Putnams Translation)

62. నెల్లూరు శివరామకవి – కామకళానిధి (శృంగార గ్రంథమండలి – సంపాదకులు, పురాణం సూర్యనారాయణ శాస్త్రులవారు)

63. ఉత్తానకరణములు అతిప్రాచీనములు. ఇవి మిగిలినవారికంటె ప్రశస్తములైనవని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. ఇందు యోనిమార్గము ఉన్నిద్ర లింగమున కనుగుణమై యుండుటయే ప్రశస్తిగల కారణము. వీటియందు స్త్రీ పురుషులన్యోన్యము అవయవ నిరూపణమును, భావవ్యక్తీకరణము నొనర్చుటకు వీలగుచున్నది. ఇందు (సంపుటక (Enclosing) పీడితక (Oppressive) వేష్టితక (Clasping) వేణువిదారిత (Split Bamboo) బంధములు (Poses or Attitudes) కుబ్జలింగత్వ మననే (Phallic insufticienge) ఉపకరించును. ప్రపంచములోని సమస్త జాతులలోను ఈ కరణములే ప్రాముఖ్యము వహించినవి. ఈజిప్టు దేశ పురాతన గోరీలందును, పెరూలోని ఇంకా జాతులవారి చంద్రదేవాలయము లందును ఉత్తానకరణ శిల్పములు కనుపించుచున్నవి. ఆఫ్రికా అనాగరక జాతులలోను, అమెరికా జాతులలోను ఈ కరణములనే విరివిగ వాడుదురు. దీనికి విపరీత కరణమే పురుషాయితము. సర్వకాలములందును రోమక జాతులవారిలోను నిట్టి ఆచారమున్నట్లు ఆర్స్ – అమటోరియా వలన తెలియుచున్నది. పురుషుని అధఃస్థితికి మహమ్మదీయ జాతులంగీకరింపవు. "పురుషుని భూమిని – స్త్రీని ఆకాశమున జేయువానికి నరకము కల్గుగాక" అని వారికొక సామెత యున్నదట! సాహోలీ జాతిలో పురుషాయిత బంధ ప్రియత్వము విశేషము. అందు నాయికలు Digtisha అనునొక మంథన క్రియ యొనర్తురట. దానిని వృద్ధ స్త్రీలు యువతులకు ఒక మండల దినములు నేర్పుదురట. అది ఎరుగని స్త్రీకి ఆయా జాతులలో గౌరవ ప్రతిపత్తులు తక్కువ. కమటా షోడిల్సు అనువారు ఈ బంధమును పాపకృత్యముగ తలచి వారి ముఖ్యాహారమగు చేపలవలె తిర్యక్కరణమున సంప్రయోగమొనర్తురట!

64. తిర్యక్కరణముల వలన కొంత శారీరకోపయోగము స్త్రీ పురుషుల కిరువురకున్నది. స్త్రీ పురుషభారము వహింప వలసిన అగత్యముండదు. పురుషునకు విస్పృష్టి అతివేగముగ జరుగదు. ఇరువురుగాని లేక ఒకరు గాని కుండబొజ్జగల వారైన, లేదా గర్భధారణసమయమున నైనను నీ తిర్యక్కరణములు (Lateral attitudes) ఉపకరించు చున్నవి. వీనిని గూర్చి ఒక విజ్ఞుడు వ్రాసిన వాక్యము లెంతయు సమంజసములైనవి: ''The Lateral attitude becomes distinctly disadvantageous unless and until the woman draws up her leg on which she is lying. In other words, this attitude virtually become half-super posed.'' ఈ తిర్యక్కరణమును ఓవిడ్ మహాశయుడు ఆర్స్ – అమటోరియాలో నిట్లు పొగడి ఉన్నాడు. ''Of loves thousand ways a simple way and with the least labour this is, to lie on the RIGHT SIDE, and half-supine withal.'' కాని ఈ తిర్యక్కరణమున భారతీయులు నాయికకు

కుడిదిక్కున నుండరు. కామకళాతంత్ర మెరిగిన ఒక శాస్త్రవేత్త ఇందలి లోపములను గురించి "But it has its draw backs also - Viz superfect penetration and localised pressure on the woman's leg; this of course, can only be avoided by approaching the normal Horizontal attitude or through the Extreme flexation and lifting of the captive limb" అని వ్రాసి ఉన్నాడు. ఎడ్విన్ హిర్ఛ్ అను వైద్యశిఖామణి ఈ తిర్యక్కరణము, నూతన వధూవరులకు సౌఖ్యదాయకమని అభిప్రాయపడినాడు. Power to Love అను గ్రంథమున నీగ్రో జాతులలో లొాయిలగోలు, నామొల్లోలు, మరికొందరు నీ తిర్యక్కరణముల యెడ విశేషాసక్తి నిరూపింతురట. ఇందుకు వారి దీర్ఘలింగము మూలకారణమని పెద్దల అభిప్రాయము.

65. స్థితకరణమును షేకు 'డొక్ – ఎల్ – అజార్' అని పిలచినాడు. అతని గ్రంథమున దీని ప్రశస్తిని గురించి ఇట్లు చెప్పినాడు. "Try different manners, for every woman prefers a distinct method to all the others for her intimate pleasure. The Majority of them have however, a prediliction for the DOK - EL - AZAR, as in the application of the same belley is pressed to belley, mouth can easily be gloved to mouth and the action of the womb with the vaginal wall is rarely absent" ఇందు నాయిక ప్రధాన పాత్రను, నాయకుడు ద్వితీయ పాత్రను (Secondary role) వహించును (Art of love in the orient - p. 249)

66. Anangarangam - T. Ray Page 214

67. Ibid - 216

68. ఉత్థిత బంధములకు అరబ్బు దేశస్థులు ఎల్ కూర్చి అని నామకరణ మొనర్చినారు. స్థిరతమునకు సంబంధించిన ఈ కరణములను ప్రాచ్యపాశ్చాత్య ఖండములు రెండును దోషయుక్తములని నిందించినవి. ఇందు మూటిని హిందువులును, రెంటిని అరబ్బులును పేర్కొనినారు (page 257 HAMMOND - Sexual Impotence; HIMES - Happy Marriage p. 295) స్థితవ్యానకరణముల రెంటిని వాత్స్యాయనుడు చిత్రరతములు (Fantastic Poses) గ పరిగణించినాడు.

69. అతి ప్రాచీన కాలమున వ్యానకరణములే (Prone or Ventral Attituder) సంప్రయోగమున విశేషస్థితి వహించినవనుటకు అనేక ప్రబల నిదర్శనములు కనిపించుచున్నవి. క్రైస్తవ దేశములందు మండలము మొదలు త్రిరాత్రముల వరకు నిట్టి మానవాసహజకరణప్రీతిని తొలగింపుమని భగవంతుని ప్రార్థించినట్లు నిదర్శనములున్నవి. వాన్డివెల్డి మహాశయుడు ఇందున్న అనేక దోషములు కారణముగ వీనిని త్రోసిపుచ్చినాడు. ఉత్థానకరణములలోవలె నిందు యోని

మార్గమునకును, లింగమునకును సంయోగము కుదరదు. ఇందు స్త్రీకి విసృష్టి సుఖముండదు. కామాపత్రసీమకు (Clitoridal Region) ఇందు సంబంధముండక పోవుట గొప్పలోపము అని ఆయన అభిప్రాయము. (Marriage - Vendevelde 117-119) కాని ఇతని అభిప్రాయములకు భిన్నముగ క్లోట్జ్ అను శర్మణ్య మానవజాత్య శాస్త్రజ్ఞుడు (Sexual Anthropology) వ్యానకరణములత్యున్నతము లైనవనియును ప్రతివ్యక్తియును వానిని స్వీకరింప వలయుననియును అభిప్రాయమిచ్చినాడు. (Der Mensch Ein Vier Fussler - Berlin 1908) క్రీ.శ. 2వ శతాబ్ది నాటి రోమక శిల్పమున నీ వ్యానకరణములే విశేషముగ శిల్పితములైనవి. ఇందలి ధేనుకావ్యానత బంధమున (Bovine Posture) నితర బంధములన్నిటి కంటె యోనికుల్య (Vaginal Canal) విశేషముగ ప్రవించునని పిళ్లె మహాశయుని అభిప్రాయము. (The Art of Love and Sane Sex living - A.P. Pillai. pp. 878-9) అందుమూలమున దీర్ఘలింగమునకును, గర్భోత్పత్తికిని నీ కరణములు ఆత్యుత్తములని చెప్పవచ్చును.

70. వాత్స్యాయన కామసూత్రములు (2.6.42)

71. చిత్రరతముల గూర్చియు, సామాన్య రతి విధానముల గూర్చియు వాత్స్యాయన మహర్షి అభిప్రాయములనే భంగ్యంతరమున ఎల్లిస్, హేర్ష్‌వెల్డె (Sex in Human Relationship), ఇవాన్సు (Men and Women in Marriage), రైట్ (Sex feels in Marriage) మొదలగు పాశ్చాత్య విద్వాంసులు వెల్లడి చేసి ఉన్నారు. వాత్స్యాయనుడు పలికినట్లు సాంప్రయోగిక విధానవైవిధ్యము మూలమున బహు శృంగార లక్షణుడగు (Poly-Erotic) పురుషునకు అసౌఖ్యము ఏకపత్నీత్వమున లభించుచున్నదని అంగీకరించు చున్నారు. విసుగును పోద్రోలుట, ఒకరికి గాని, ఇరువురకు గాని రతి సౌఖ్యమును వృద్ధి యొనర్చుట, ఆరోగ్య విషయకములును, స్థూలాది శరీర దోషము వలన కలిగిన అశక్తతను తొలగించుట, గర్భోత్పత్తి, గర్భనిరోధము – ఇట్టి రతివిభేద వైవిధ్యమునకు మూల కారణములు. సమస్త వ్యక్తులకు నొక విధానము యుక్తమని నిర్ణయించుటకు వీలులేదు. యాడ్లర్ మహాశయుడు చెప్పినట్లు కొందరు స్త్రీలకు విసృష్టి కలుగవలెనన్న తిర్యక్కరణము గాని (Laleral) పురుషాయితము (Posteriori) గాని కావలసి వచ్చును. (ADLER-Die Mangehafte) 'అమెరికాదేశ స్త్రీలలో నెవ్వరికిని వైవాహిక జీవితమున విసృష్టి సుఖము లేకపోవుటకు ఇదియే ప్రధాన కారణ'మని విజ్ఞుల అభిప్రాయము. ఇందువలననే ఆ దేశములోని విడాకుల వైపరీత్యమును. కేవల ముత్తానకణములను ప్రేమించు పునీత ఒక్కొక్కమారు సద్భర్తను పణ్యస్త్రీల పాలుచేయునన్న హెలీనా రైట్ (Birth Control)

మాటలోని సత్యము నిందు వలన కలిగినదే. కళాపిపాస వలనను, మానసిక లక్షణములవలనను సాంప్రయోగిక వైవిధ్య మవసరముగు చున్నది. డికిన్సన్ మహాశయుడు "మానవ జాత్య శారీరకము"న (Human Sex Anatomy) నీ చతుష్షష్టి (Coital Variations) వైద్యకర్మానుకూలతకు నుపయోగపడునని చెప్పినాడు. గర్భ విచ్ఛిత్తి నాపుటకును, గర్భధారణ విచ్ఛేదములకు నివి అనుకూలపడుచున్నవి. పురుషాయిత కేళిక్రియాదక్షతకు పుత్ర పుత్రీ దర్శనము దుర్లభమనుమాట నగ్న సత్యము.

72. Ellis - Love and Pain. page 83

73. Art of Love in the Orient page 271

74. This Princers action is effected by catching hold of the Phallus by SPINCTER CUNNI and other Muscles of the Vagina, the woman draws or presses it within and remains in this strate for a considerable time'

75. కొక్కోకము - శ్లో 297-298

76. ఈ ఔపరిష్టకములను గురించి రతిరత్నప్రదీపిక కారుడును (ch VI. 21-54) కొక్కోక కర్తయును (309-318 శ్లోకములు) ప్రసంగించినారు. సంప్రయోగ పూర్వరంగమున ఏతదవసరములను గూర్చి వ్రాయుచు శాస్త్రజ్ఞులు ఎల్లిస్, వాన్‌డివెల్డే లిరువురును ఔపరిష్టకములను (Fellatio and Cunnilinctus) గూర్చి ప్రసంగించి అవి నేటి అనాగర నాగరక జాతుల రెంటియందును విశేషముగ కనుపించుచున్నవని చెప్పి ఉన్నారు. ఔపరిష్టకములు భారతదేశమున విశేష ప్రచారములో ననాది కాలము నుండి యున్నవని ఎల్లిస్ అభిప్రాయము. (Studies, vol. VI p 557) ప్రమాదమూలకము. ఇది ఏ నాడును భారతదేశమున యూరప్ ఖండములో వలె ప్రాచుర్యము వహింపలేదు. ఇట్టి ఆధారమునకు మూలకారణమును ఒక విజ్ఞాని ఇట్లు నిరూపించినాడు.

''These Two methods, thought apparently reprehensible, may every where be found to spring up quite naturally among some lovers sometimes during the height of their erotic frenzy as coital preludes. Freud has pointed out in the second series of his BEITRAGE ZURNEUROSENLEHRE that the idea of practising fellatio as a part of sexual pleasure on the part of women has its origin in the almost inevitable factor of infantile fixation, because of the fact that the similarly, the desire for CUNNILINCTUS in men should cause us little alaram as the clitoris bears a natural analogy with the mothers treat the latter also being a prominent erogenous centre and the pleasure

derived in sucking by an infant being paid to be often erotically tinged.'' ఈ అభిప్రాయములే ఎల్లిస్ మహాశయుడు అతని (Sexual Selection In Man) అను గ్రంథమున (Sec. III) విశదీకరించినాడు. ఇట్టి మానసిక దౌర్భాగ్య కృత్యములు (Pathological cases) భారతదేశమున కనుపింపవు. కొందరు పడుపు వృత్తిలో జీవించువారు ఇట్టి కృత్యములగోరు విటునుండి అత్యధికధనమును పొంది విరక్తితో నొనరింతురని తెలియుచున్నది. యూరపు దేశములోని వ్యభిచార చరిత్రమును పరిశీలించినచో నిట్టి వృత్తి వారి యెడ విశేషమనియును, జర్మను కులస్త్రీలకే ఇట్టి భగచుంబనాసక్తి విస్తారమనియును, కేవల మద్దానితోనే సంప్రయోగరహితలుగ నుండగలరనియును తెలియుచున్నది. (FLEXNER'S - History of Prostitution in Europe) తృతీయా ప్రకృతి (Hermophroditism) ని గూర్చి విజ్ఞుల అభిప్రాయమిట్లున్నది. ''In every male lurks female, some times so arrogant as to mask the true personality, sometimes so shy as to be scarcely perceptible, not longer can we speak of the 'Male Type' and of the 'Female Type' but rather of a series of infinite gradations which extended from a flagrant Hermaprodistism to from so attenuated that they merge into normality itself'' (MARANON)

77. Art of Love - Chapters III & IV.

78. N.K. BASU - History of Prostitution in India vol. I-p. 199

79. అత్రిసంహిత 2/50 – వ్యాససంహిత 2/13

80. "దశపూర్వేషాం దశాపరేషాం మద్వంశానాం నరకాదుత్తీర్య శాశ్వత బ్రహ్మలోక నివాస సిద్ధ్యర్థం... స్త్రియ ముద్వహే' (వివాహ సంకల్పము) 'జాయా మానోవై బ్రాహ్మణః త్రిభిః ఋణవాన్ జాయతే బ్రహ్మచర్యేణ ఋషిభ్యో యజ్ఞేవ దేవేభ్యః ప్రజయా పితృభ్యః, ఏషవా అనృణో యః పుత్రీ యజ్వా బ్రహ్మచారీ" ఇత్యాదులు ప్రమాణములు.

81. Psychological Factors in Marital Happiness - LEWIS TERMAN - page 474; Predicating Success and Failure in Marriage - E.W. BURGESS nd COTTRELL - Page 47.

82. Physiology of Sex - WALKER - Page 53.

83. Happy Marriage - HIMES - page 77

84. అయినప్పటికిని విచ్ఛేదమును గూర్చి కొన్ని స్మృతులు పలికినవి. 'వివాదశీలీ, స్వయ మర్థ చోరిణీ, పరాభికూలాన్యవరాభి భాషిణి, అగ్రాశినీ చాన్య గృహప్రవేశినీ, భార్యాం త్యజేత్ పుత్ర దశ ప్రసూతికామ్' (పరాశర స్మృతి) 'చతుస్రస్తు పరిత్యాజ్యా

శిష్యగా గురుగాదయా పతిఘ్నీతు విశేషేణ గింజు లోపగతా చయా' (వాసిష్ఠస్మృతి). విధివత్ పరిగృహ్యాపి త్యజేత్కన్యాం విగర్హితామ్, వ్యాధితాం విప్రదుష్టావా ఛద్మనా చోపపాదితామ్ - భార్య భర్తను పరిత్యజించుటకు 'నష్టే మృత ప్రవ్రజితే క్లీబే చ తితౌ పతౌ పంచ స్వాపత్యు నారీణాం పతిరన్యో విధీయతే', (పరాశరము) భార్యను భర్త త్యజించినను విక్రయించినను భార్యాభర్తలసంబంధము ఉండనే ఉండునని మనుస్మృతి - "న నిష్క్రియ విసర్గాభ్యాం భర్త ర్భార్యా విముచ్యతే" (9-46) ఇట్టివే 2-31 3-24. పూర్వము ఒక స్త్రీని వివాహమాడినవాడు పరపూర్వాపతి, అన్య స్త్రీలోలుడై భార్యను త్యజించిన వాడు స్త్రీ జితుడును, పాపభాజనుడు - అతనికి యావజ్జీవమూ అశౌచ ముండునని భారతీయ ధర్మశాస్త్రము.

85. భార్యాభర్తల మధ్య ఉండే అంతరము మూలమున పూర్ణాయుర్దాయము నొందు సంతానము కలుగునని భారతీయుల నమ్మకము. శుశ్రుతాచార్యుని అనుసరించి స్త్రీ ఋతుధర్మం 12 ఏట ప్రారంభము. 15 మొదలు 45 వరకును స్త్రీలు సంతానవతులు కావచ్చును. అందువలన యువకుడు 30 ఏట స్త్రీ 12వ ఏట వివాహము చేసుకొనిన వైవాహిక జీవనము సంతృప్తికరముగను, సంతాన వంతముగను నొప్పునని భారతీయుల అభిప్రాయము. (అష్టాంగ హృదయము - శరీరస్థానము) ఆధునిక వివాహగ్రంథకర్త పాశ్చాత్యలోకముల ఆర్థిక సాంఘికాది పరిస్థితుల అనుసరించి కన్యకకు 25 ఏటను, యువకుని కంతకంటే కొలది సంవత్సరముల తరువాతను వివాహ యుక్తవయస్సు (Grififith - Modern Marriage p. 52) నేటి ఉత్తమ మధ్య తరగతి భారతీయులలో 16 మొదలు 24 సంవత్సరముల మధ్య వివాహములు జరుగుచున్నవి. భార్యాభర్తల అంతరము సామాన్యముగ 5 మొదలు 15 వరకు నున్నది. నేడు స్త్రీకి 18 సంవత్సరములు, 25 సంవత్సరములు పురుషునకు వివాహయోగ్య కాలముగ నిర్ణయింపవచ్చునని ఒక విజ్ఞుని అభిప్రాయము. అంతరమును గూర్చి ఆయన ఇట్లు వ్రాసినాడు. ''Ten Years of age may be put as the safe biologic ''Buffer'' between marital partners in view of the fact that senile changes take place earlier in women than in men and that feminine charms is always the outstanding asset in the balance sheet of Nuptials.''

86. History of Human Marriage. WESTERMARCK - 'Marriage Consent'

87. ప్రపంచమునందలి వివాహ వ్యవస్థ ఒకనాడు జన్మించినది కాదనియును క్రమపరిణామమున నేటి రూపము వహించినదనియును తెలియుచున్నది. (Marriage WESTERMARCK; Origin of Family - Angels.) ప్రాచీన భారతమున

నిట్టి సంప్రదాయము నుండి ఉండవలయును. వేద యుగమునుండి నేటివరకు నేర్పడిన వివాహ విధానములలో 8 విధములు : ఆర్ష (Higher form of Purchase) బ్రాహ్మ్య (Religious) ప్రాజాపత్య (Sanctioned by Law and Religion) దైవ (daughter given to a ఋత్విక్ Potentate) గాంధర్వము (Mutual consent) పైశాచము, రాక్షసము, ఆసురము – ఇందు మొదటి నాలుగును ధార్మ్యములు; మిగిలినవి వ్యాధములు. వ్యాధములలో గాంధర్వము ప్రధానము (3.5.29) వీనికి స్వయంవర బహుభర్తృత్వములను చేర్పవచ్చును. మహా నిర్వాణ తంత్రము (IX-269) వలన సంఘ వివాహములను ఒకరీతి శైవవివాహములు పురాతన భారతమున నొప్పుచున్నట్లు తెలియుచున్నది.

88. కన్యాప్రణయము (Pre-Marital Courtship) అనాగరక జాతులలోను, కొన్ని నాగరక జాతులలోను విశేషము. (HANNA and Abrahm - Marriage Manual; IWAN BLOCH Sexual Life of our time, Physiology of Sex-Chapter IX 103-115 Night courtship ను గురించి City of the Saints, Burton - SPEARE - Dark Daughter - Rhys&Brynmore Jones- Welsh People pp 582 - 4 Burton Saints etc - అనాగరక జాతులలోని కన్యకా కామమునకు Ernest CRAWLEY -Mystic Rose 2 vols. నేటి అమెరికాలో వివాహమునకు పూర్వము 73% పురుషులు, 63% స్త్రీలు వివాహమునకు పూర్వమే కామవ్యాపారము కలిగినట్లు టెర్మన్ పలికినాడు. అతడు అమెరికాను గురించి "If this drop should continue at the average rate shown for those born since 1890, Virginity at Marriage will be close to the vanishing point for males born after 1930 and for females born after 1940" అని పలికినాడు. నేటికది సత్యము. కన్యాప్రణయమును గూర్చి ఎల్లిస్ మహాశయుడు ((Psychology of Sex vol III. pp-380-381 "In some countries it is said to be almost a universal practice for the women to have Sexual relationship before legal Marriage,: Some times she marries the first man whom she tries! Some times she tries several before finding the man who suits her" ఇట్టి హాస్యాస్పదమైన వివాహపూర్వ ప్రణయము భారతదేశమున నేనాడును లేదని చెప్పవచ్చును. Health Disease in Relation to Marriage KAMINER - vol. I 2. SENANCOUR - Dil Amour vol. III p. 57 3. W. STEKEL Frigidity in Women vol. I 4. KRAFT Ebbing - Psychopathia Sexualis; Sex Friendship & Marriage - BARNES cap. X (Alen UNWIN)

89. WALKER - Physiology of Sex - Chap - VIII-Strange Customs of courtship & Marriage. W.J. FIELDING chap XVII etc.

90. మనుస్మృతి XI - 26 - 29; III - 60

91. ప్రపంచ వివాహ చరిత్ర కారుడు వెస్టర్ మార్కు 1. జనసంఖ్య 2. స్త్రీ పురుష గృహజీవన విధానమున శారీరక (Physical) ఉద్వేగ (Emotional) వైజ్ఞానిక (Intellectual) ప్రతిపత్తులలో సామ్యత లేకపోవుట 3. స్త్రీ ఋతుధర్మము, గర్భధారణము, దీర్ఘవ్యాధి కారణముగ మానవునిలో (దక్షిణత్వము) బాహునాయికత్వాపేక్ష (Polygomons Nature) నవ్యతా ప్రియత్వము 4. సంతానము ఆస్తిపాస్తులు బహుభార్యాత్వమునకు కారణములని చెప్పినాడు. చూడు. ఆంధ్రవారపత్రిక - 'నా బహుభార్యాత్వము - బహుభర్తృత్వము' (27-4-48)

92. శీలమును గూర్చి ప్రపంచములోని అనేక దేశముల భిన్నభిన్నములైన అభిప్రాయములున్నవి. ఏతద్రక్షణార్థము వివిధ జాతులు వివిధ మార్గముల ననుసరించినారు – W. J. Fielding - Strange customs of courtship & Marriage pp. 134-155; MEHTA : Scientific Curiosities of Love, Life and Marriage pp. 263-256. The battle of venus - HAAG: అనాగరక జాతులలో కనుపించు కన్యాత్వమను దోషపరిహరణము (Defloration sceintific curiosities of Love Life and Marriage page141.142) నే యుగమున లేదని విస్పష్టము.

93. అలంకార శాస్త్రవేత్తలు దశావస్థలను చర్చించి 'మరణము' కాదు మరణయత్నము పదియవ అవస్థ అని చెప్పినారు. ప్రతాపరుద్రీయమున ప్రలాపము, సంజ్వరము అను మరి రెండు అవస్థలను అధికముగ చెప్పినాడు. భావప్రకాశమున శారదా తనయుడు ఈ దశావస్థలకు భిన్నముగ 'దశధా మన్మథావస్థా భవే ద్వాదశ ధాఽపివా, ఇచ్ఛోత్కంఠాభిలాషశ్చ చింతా స్మృతి గుణస్తుతీ, ఉద్వేగోధః ప్రలాపస్యా దున్మాదో వ్యాధిరేవ చ, జాడ్యం మరణ మిత్యాద్యేద్వేకై శ్చి ద్వర్ణ్యతేబుధైః' అని పలికినాడు. (కావ్యాలంకార సంగ్రహము. సంపాదకుడు: సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి పుట 369)

94. FAUSBOLL - Jatakas vol. V 448; Kuntala Jalaka p. 536

95. ప్రాచీన భారతీయుల ప్రణయలేఖలు చిత్రలిపిలోను, సంజ్ఞలలోను వ్రాసుకొనెడివారు పత్రపుష్పాదికములను అందుల కుపయోగించు కొనుట కావ్య నాటకాదులవలన తెలియుచున్నది. చక్షుర్గోచరము గాని రీతిగ గుమ్మపాలతో గాని, పటిక నీటితో గాని వ్రాయుట రోమనులవలె (Ars Amatoria B.III 625 - 29) భారతీయు లెరిగినట్లు లేదు.

96. కామసూత్రములను పరిశీలించినపుడు హస్తినీజాతి స్త్రీలు అపద్రవ్య ప్రియలని తెలియుచున్నది. నష్టరాగ ప్రత్యానయనాద్యధ్యాయమున అపద్రవ్యములను వృష్యయోగములుగ మహర్షి పలికి యున్నాడు. మంద ధ్వస్తములగు నష్టములను

నష్టరాగలకు సంబాధకము నుపమర్దన మొనర్చి 'అపద్రవ్యాణి యోజయేత్' (7.3.3) అని చెప్పినాడు. 'తాని సువర్ణరజత తామ్ర కాలాయస గజదంతగవల (కొమ్ము) ద్రవ్యమయాని' (7.2.5) అని, పలికి 'త్రాపుషాణి సైసకాని చ మృదూని శీత వీర్యాని వృష్యాని కర్మణి చ దృష్టాని భవంతీతి బాభ్రవీయాః యోగాః' (7.2.9) అని బాభ్రవీయుల సీసక త్రాపుసక అపద్రవ్యములను చెప్పి 'దారుమధాణి సామ్యతశ్చేతి వాత్స్యాయనః' అని దారుమయ అపద్రవ్యములను సామ్యమును బట్టి యోజన చేయదగుమ అని నిజాభిప్రాయమును వెల్లడించినాడు. ఇందలి కర్కశ పర్యంత, బహుళ, సంఘటి, చూడక, ఏకచూడక, కంచుక, జాలకాది భేదములను చెప్పినాడు. వాటి ప్రయోగ విధానమును నిరూపించినాడు. (7.2.14) అనేక అనాగరక జాతులలో నష్టరాగలయిన వృద్ధస్త్రీలలో రాగస్థాపనార్థము అపద్రవ్యముల నుపయోగించుట నేటికిని అలవాటు. ఇట్టివానిలో పురుష మోహనమును పోలిన కృత్రిమ లింగము (Artificial Phallus - Dildo) ఒకటి. ఇది స్వజాతి ప్రణయలగు (Tribades) స్త్రీలు పాశ్చాత్యదేశములందు విరివిగ నుపయోగింతురు. వారు దీనికి Consola Leur, Bijou Indiscret, Gaude Mihi, Penis Succdea Neus ఇత్యాది నామములతో వ్యవహరింతురు. ఈ అపద్రవ్యములు అన్ని దేశములందును అతిప్రాచీన కాలమునందుండి ఉన్నవి. యూరప్ దేశమున ఇవి మధ్యకాలములోనే విశేష ప్రాచుర్యము వహించినట్లు బ్రాంటోమ్ మహాశయుని 'Lives of Fair and Gallent Women' అను గ్రంథమువలన తెలియుచున్నది. ప్రాచీన గ్రీసు దేశమున వీని యుపయోగమున్నట్లు ఎరిస్టొఫానిస్ 'Lysistrata' వలన తెలియవచ్చు చున్నది. బాబిలోనియా శిల్పములందు స్త్రీలు ఇట్టివానిని హస్తమునం దుంచుకొన్నట్లు ప్రతిమలు బహుళముగ కనిపించును. వీనికి ప్రాచీన గ్రీకులు Olibos అని నామకరణ మొనర్చిరి. స్త్రీల జాత్యాజీవితము (Sexual Life of Women) అను గ్రంథమున కిష్చ్ మహాశయుడు ఇట్టివానిలో అతిదీర్ఘములైన వానిని (వాత్స్యాయన మహర్షి సంఘాటీ వంటిది) వాన్ మస్చకా చూచినట్లు చెప్పుచున్నాడు. ఇట్టి కృత్రిమలింగములలో కపి పాలుపోసి యోని రంధ్రముద్వారా లోపలికంపి శుక్రస్యందనము కలుగునట్లొనర్తురని అతని అభిప్రాయము. ఇట్టిదే 'కృత్రిమయోనిని' (Mannikin) ని పురుషు లుపయోగింతురు.

ఈ సూత్రముల ననుసరించి స్వీయలింగ ప్రణయము, (Autoeroticism) అపద్రవ్య (Olibos) ప్రణయము ప్రాచీన భారతీయులు ఎరిగినట్లు తెలియుచున్నది. ఇది అభావమున స్వజాతి ప్రణయము గాని పాశ్చాత్యలోకములోని స్వతఃసిద్ధ స్వజాతి ప్రణయము (Homo-Sexuality) కాదు.

97. Chapter VII - INCEST; Physical Love in the Family R.J. Mehta - Scientific Curiosities of Sex Life pp. 60 - 67. కాని ఇది పురాతన ఇరాను ఈజిప్టు రాజవంశములలోని వైవాహిక సంబంధమైన స్వీయబంధుప్రణయము వంటిది కాదు. ఇది వ్యావర్తనకము. 'తథా ప్రవేశిభి రేవజ్ఞాతి సంబంధేభి ర్నాన్యై రుపయుజ్యం తేస్త్రైరాజ కానాం' స్త్రీ రాజ్యమున నిట్టి స్వబంధు ప్రణయము జ్ఞాతుల మూలమున జరుగునని మహర్షి పలికినాడు. ఈ ప్రకరణమును దారరక్షితమను ఒకే ప్రయోజనము కలిగినది.

98. ఆధునిక వ్యభిచారమునకు కారణములకు : ((Encyclopaedia Brittanica vol. XXII (seventh Edn.) page 464.

99. వాత్స్యాయనుడు వర్ణించిన గణికలు పురాతన గ్రీసు దేశములోని Heterai వంటివారు. ఈ మహానుభావుని మతమున వేశ్య కేవలము అర్థప్రయోజన, కృత్రిమ ప్రణయ. పాశ్చాత్య దేశమునందలి పురాతన దేవాలయము దాసీత్వము పణ్యవృత్తిలో నొకజాతిది. ''Their prostitue fulfils a social mission; She is the guardian of virginal Modesty, the channel to carry of adulterous desire, the protector of matrons who few late maternity; It is her part to act as the o shield to the female'' అన్న ఒక సాంఘిక శాస్త్రవేత్తను బట్టి, ఈ స్త్రీ నిజవృత్తి మూలమున భంగ్యంతరముగా నెట్టి మహోన్నతసేవ స్వజాతి కొనర్చినదో గమనింపదగినది. అందుమూలమున పణ్యవృత్తి ఉండతగినదనిగాని, వలెనని గాని కాదు.

100. Physiology of Sex - WALKER -page 144

101. మహర్షి వాత్స్యాయనుడు ఈ అధ్యాయమున 'దాక్షిణాత్యానాం లింగస్య కర్ణయోరిన వ్యథనం బాలస్య' (7.2.19) అను సూత్రమున లింగవేధను గూర్చి చెప్పి ఉన్నాడు. ఇట్టి కథ నేటికిని కొన్ని అనాగరక జాతులందు కనిపించుచున్నది. లింగవేధ జరిగిన తరువాత అందు లోహ, వాంశిక, కాష్ఠ, అస్థి మొదలైనవానితో నొనర్చిన పుడకల నుంతురు. డైక్ జాతివారును, మరికొందరును ఉపయోగించు నిట్టి వేధ సంబంధమైన అపద్రవ్యములను గురించి రైలీ స్కాట్టు ఇట్లు వ్రాసినాడు. ''Analagous methods are in use among other native race, such as metal rings in which feathers are inserted collars made of bistles for fastering round the conna glands etc. In some tribes small sharp stones or bits of metal are inserted under the skin of the glouds'' అని. ఇండోనీషియనులలోను, ఉత్తర సెలబీ జాతులలోను నేటికి ఇట్టి ఆచారమున్నదట! చైనాజాతివారు అపద్రవ్యముగ ఈకలను చుట్టి వెండిపూత పోసిన గొట్టము నుపయోగింతురుట. నేటి ఐరోపా, దక్షిణ అమెరికా, తూర్పు ఇండియా దీవులందు వేశ్యవాటికలలో ఉపయోగార్థము

అపద్రవ్యములను బహిరంగముగా నమ్ముదురని తెలియుచున్నది. అవి రబ్బరుతో తయారైనవి. చైనా జపాను దేశములందు భోగస్త్రీలు రిన్నోటమా అను రెండు బంతులను గుహ్యస్థాన ముందుంచుకొని వీని కదలిక మూలమున రాగాధిక్యమును పొందుదురట. బాకమాంట్ వ్రాత ననుసరించి క్రీ.శ. 10 శతాబ్దము నాటి ఫ్రెంచి స్త్రీలు ఇట్టి కందుకములు రాగవర్ధకములుగ నుపయోగించినట్లు తెలియుచున్నది. వీనికి వారిడిన నామము POMMES D'AMOUR. అపద్రవ్యములలో శృంగార కింకిణుల (Bells of eroticism) నిట చెప్పవలసి ఉన్నది. మానవజాత్య సంబంధము (The sexuall relations of mankind) అను గ్రంథమున మాంటిగజ్జ వీనిని గురించి ఇట్లు వ్రాసి ఉన్నాడు. 'I was amazed to find a custom in this country which is both lascivious and ridiculous... The women holds great store with them for when they are swen into the skin of the man's member they causes a swelling of tremulous length of the entire genital parts. Hence they claim their males have greater endurance and give them far greater pleasure. The men decorated in this fashion are held in high esteem by the women, and, when they walk through the streets believe it to be a mark of honour if the tinkling of the bells is heard' పురాతన భారతీయ స్త్రీల కింకిణీ ధారణ మెందులకుద్దేశితమైనదో దీనినిబట్టి కొంతగ మనకర్థము కాగలదు. శృంగార కలస్వనములకు గల సన్నిహిత సంబంధమే అందుకు ముఖ్య కారణము.

102. రతిరహస్యము V 3-4 అనంగరంగకర్త వాజీకరణ వశీకరణాదులనేగాక యోని ప్రసాధన (Uterus Toilet)ను గురించియు విపులముగ వ్రాసినాడు.

103. MEHATA - Scientific curiosities - Chapter VI; page 86.

# వివాహము - స్త్రీ పురుషులు

న్యాయతః వివాహం లేకుండానే స్త్రీ పురుషులిద్దరూ అన్యోన్యం ప్రేమించుకుంటూ కాపురం చెయ్యవచ్చును. సంఘానికి గానీ ప్రభుత్వానికి గానీ వారి జీవన విధానంతో ఎటువంటి జోక్యమూ అవసరం లేదు.

ఆ స్త్రీ పురుషులిద్దరూ ఒక సంఘంలో నివసిస్తున్నారు, కాబట్టిన్నీ, ఒక ప్రభుత్వానికి లొంగి ఉన్నారు కాబట్టిన్నీ, సంఘానికీ వారికీ ప్రభుత్వానికీ కొంత సంబంధం ఉన్నది. అందువల్ల ప్రణయ విధానాల్లో స్త్రీ, పురుషులిద్దరూ వ్యక్తిగతమైన వారి స్వేచ్ఛను కొంతగా అరికట్టటము అవసరం వచ్చింది. ఈ సంఘ నియమాలు వైవాహిక విధానంలోనూ ప్రణయ విధానంలోనూ నాగరిక అనాగరక సంఘాలు రెండూ అవలంబిస్తున్నవి.

నియమాలంటూ లేని దేశంగాని, జాతిగాని లేదు. అన్నివేళలా అడవి జంతువులను వేటాడి పొట్ట బోసుకునే ఆటవికుల్లోనూ ఈ నియమాలున్నవి. పశుపాలనం వృత్తిగా పెట్టుకొని దేశ దిమ్మరులుగా జీవించే జాతుల్లో కూడ ఈ నియమాలున్నవి. పట్టణాలలో నిరంతరము యంత్ర కర్మాగారాల్లో నివసించే పారిశ్రామిక జీవులకు గూడా ఈ నియమాలున్నవి. మానవుడు ఎటువంటి అనాగరిక స్థితిలోనూ నియమరహితమైన ప్రవృత్తి (Sexual Promiscuity) తో జీవించాడని చెప్పటానికి అవకాశం లేదు. అట్లాకాకుండా ఏ కాలంలోనూ, ఏ జాతిలోనూ కామక్షుత్తు (Sexual appetite) ఇష్టం వచ్చినట్లు తీర్చుకునే అవకాశము ఏ నాడూ మానవుడు అవలంబించలేదని నిర్ధారణ చేసి చెప్పవచ్చును.

కామతృప్తి కోసం ప్రతిజాతీ ఏర్పరుచుకున్న మూలాధార మేమిటి? సంసారమనేది, సంఘానికి పునాది. అందువల్ల ఈ నియమాలు సంసారాన్ని ఆధారం చేసుకుని, ఏతద్రక్షణార్థంగా నానా విధానాలైన మార్పులను పొందుతూ ఉన్నవని చెప్పటంలో అసంబద్ధత అణుమాత్రంగా ఉండటానికి అవకాశం లేదు.

కామానికి గానీ, కామశాస్త్రానికి (Sexual Science) గానీ సంబంధించిన నియమాలు అన్నిజాతుల్లో ఒకరీతిగా ఉండవని చెప్పడానికి అవకాశం లేదు. కానీ – ప్రతి జాతి ఒక విషయాన్ని అంగీకరిస్తుంది. ఏ జాతిలోనూ స్వబంధు ప్రణయము

(Incest) కనుపించదు. తండ్రికీ కుమార్తెలకూ, తల్లికీ కుమాళ్ళకూ, ఏకగర్భజనితులైన అన్నచెల్లెళ్ళకూ, అక్క తమ్ములకు కామ సంబంధం ఏ జాతీ అంగీకరించదు. ప్రాచీన కాలంలో ఈజిప్టు, పెరూ దేశాల రాజవంశాలలో ఇటువంటి ఆత్మబంధు సంబంధమున్నట్లు చరిత్రవల్ల గోచరిస్తున్నది. దేవాంశ సంభూతులు కావటం చేత సామాన్య ప్రజలకు వారితో వైవాహిక సంబంధం, ముఖ్యంగా కామసంబంధం ఉండటానికి అంగీకరించకపోవటం వల్ల ఇది ఏర్పడినది. అయితే ఆ దేశాలలోనూ ఆ ప్రాంతాలలో సామాన్య ప్రజలలో ఇటువంటి సంబంధం కనిపించదు.

ఆత్మబంధు ప్రణయ రహితత – అనేది ఒక నియమము (వైవాహిక నియమము) అని తెలుస్తున్నది. దీనికి కారణమేమిటి? జాతికే ఆధారభూతమైన ఈ సంసారం (Family) విచ్ఛిత్తి కాకుండా ఉండటమేనని మనము ఊహించ వచ్చును.

స్వీయబంధు ప్రణయం మూలంగా సంసారాలు నానారకాలైన మానసిక ఆవేదనలు కలిగి కుటుంబానికి ప్రమాదం తీసుకువచ్చే స్థితి ఏర్పడడం జరుగుతుంది. అందువల్ల కుటుంబేతరమైన వివాహవ్యవస్థ అమలులోకి వచ్చి ఉంటుందని శాస్త్రకారులు ఊహిస్తూ ఉన్నారు.

జంతువుకు సంతానం కలిగితే వాటిని పోషించే భారం విశేషంగా తల్లిదండ్రుల మీద ఉండదు. గుంపులో చేరి వాటి ఆహారాన్ని అవే తెచ్చుకుంటూ ఉంటవి. సంతాన విషయంలో మానవజాతి అలా బాధ్యతారహితంగా ఉండే అవకాశం లేదు. మానవ సంతానానికి స్వతంత్ర జీవనం చేసే శక్తి వచ్చి సాంఘికంగా స్వతంత్రతను పొందే స్థితి ఏర్పడటానికి ఎంతోకాలం పడుతుంది. అటువంటి స్థితి రావటానికి తల్లి దండ్రులు ఎంతో శ్రమించవలసి ఉంటుంది. వైవాహిక బంధం (Social Contract) అందువల్లనే వారిరువురికీ అత్యవసరమైంది. 'సంతాన రక్షణమే' ఈ వైవాహిక బంధానికి ప్రధాన కారణమంటే తప్పులేదు.

ఈ వైవాహికబంధం కేవలము కామోద్వేగము (Sexual Passion) మీద ఏర్పడ్డ వారియెడకంటే 'సంతాన ప్రాప్తి– రక్షణ'ల మీద ఆసక్తి ఉన్నవారియెడ ఏర్పడేది సుస్థిరంగా ఉంటుందని శాస్త్రజ్ఞులు అభిప్రాయ పడుతూ ఉన్నారు. అందుమూలంగానే సంతానం కోసమని ఏర్పరుచుకున్న వైవాహిక స్త్రీ పురుష సంబంధాన్ని సంఘమూ, మతమూ ఆమోదించటమూ జరుగుతున్నది. అందువల్ల 'వివాహం' అనే విధానము స్త్రీ పురుషుల కామతృప్తి కోసం ఏర్పడ్డ సంస్థ కాదు; సత్సంతానప్రాప్తి, పోషణ, రక్షణాదుల కేర్పడ్డ సంస్థ' అనటం సమంజసం.

కానీ – కాలం మారిపోయింది. వివాహం కేవలము సంతానం కోసమని అంగీకరిస్తే నేటి ప్రపంచ రాజకీయ పరిణామ స్థితిలో వివాహమే అనవసర మనిపిస్తుంది. స్వేచ్ఛా ప్రణయాన్ని అనుసరించి కలిగిన సంతానాన్ని ప్రభుత్వానికి (State) ఒప్పచెప్పితే సరిపోదా అనే ప్రశ్న ఉదయిస్తుంది.

ఈ సిద్ధాంతాన్ని గురించి సమర్థించినవారు కూడా లేకపోలేదు. ప్రభుత్వం ఆధునిక కాలంలో, అనాదికాలంలో తండ్రి వహించిన అనేక బాధ్యతలను వహిస్తూ ఉన్నది. అదే రీతిగా తల్లి భారాన్ని కూడా నేటి ప్రభుత్వం వహించవలసి ఉంటుందని వీరి అభిప్రాయము. అంటే సంతానరక్షణ విషయం వ్యక్తిపరము కాకుండా ప్రభుత్వపరము కావలెనని వీరి భావము.

ఈ విధంగా వాదించే వారు ఒక ప్రధాన విషయాన్ని మరచిపోయారని అనవలసి వస్తుంది. తల్లిదండ్రులు బిడ్డలకు ఆహారమూ, కట్టుగుడ్డ, వుండటానికి మంచి ఇల్లూ ఉండటంతో తృప్తి పడలేరు. ఇవన్నీ ఇవ్వకలిగినవాళ్ళుంటారు. లేనివాళ్ళూ ఉంటారు. కానీ అనురాగంతో చూచుకోని తల్లిదండ్రులు అరుదు. ప్రభుత్వం కంటే ఒకొక్కప్పుడు విద్యావిహీనులైన తల్లిదండ్రులుండ వచ్చును. అటువంటి సందర్భంలో సంతానాన్ని ప్రభుత్వపరం చెయ్యవలసిందని వారిని శాసనమూలంగా బలాత్కరించటము ఎంత ఘోరంగా ఉంటుందో, వారికి అటువంటి ప్రభుత్వ విధానం మానసికంగా ఎంత బాధ కలిగిస్తుందో ఆలోచించవలసి ఉంటుంది.

'వివాహ సంస్థ' అనాది కాలం నుంచీ లేదని గానీ, నాగరికత అభివృద్ధి పొందుతూ ఉన్న కొద్దీ మానవుడు కృత్రిమ రూపంతో దీన్ని కల్పించుకున్నాడని గానీ భావించటానికి అవకాశం లేదు. అంటే ఏ నాడో మానవసంఘం ఏర్పాటు చేసుకున్న వివాహ సంస్థకు మార్పు రాదని అనుకోటానికీ వీలులేదు.

ఏ ధర్మంగానీ, ఏ సంస్థగానీ నిలువవలెనంటే కాలంతో పాటు మార్పు పొంది తీరవలసిందే. మానవుడు వివాహం కోసం పుట్టలేదు. వివాహమే మానవుడి కోసం పుట్టింది – అన్న విషయం కూడా మరచిపోకూడదు.

వెనుకటి జీవన విధానం మారిపోతున్నది. అన్ని దేశాలూ క్రమక్రమంగా పారిశ్రామిక దేశాలుగా మార్పు పొందుతున్నవి. అందుమూలంగా జీవనము భారమైపోతున్నది. యువతులూ, యువకులూ ఈ వివాహ భారాన్ని నెత్తిమీద కెత్తుకోవటానికి జంకుతూ ఉన్నారు. యుక్త వయస్కులై స్వశక్తి మీద సంసారం చేయగలిగిన శక్తి కలిగేటంత వరకూ వారు వివాహం మాట తలపెట్టటం లేదు.

నేటి ప్రపంచ సభ్యతా సంస్కృతులను గమనిస్తే ముందు వివాహ సంస్థ నిలవటానికి అవకాశం లేదని అవగతమౌతున్నది. వెనుకటి స్వామిత్వం నశిస్తున్నది. సామ్యత్వం వస్తున్నది. సంసార మన్న తరువాత స్వామిత్వం కష్టసాధ్యము. వివాహ సంస్థను రక్షించదలచుకుంటే ఈ నాడు మన సంస్కృతిలో ప్రవేశిస్తున్న మార్పులను గమనించి తదనుగుణంగా వివాహ ధర్మాన్ని మార్చుకోవలసి వస్తుంది. అలా చేయకపోయినా, చేయలేకపోయినా సంఘంలో స్తిమితత ఉండదు. సంఘం పతనోన్ముఖమై క్రమక్రమంగా బ్రద్దలైపోతుంది.

కేవలం ఆర్థిక సమస్య ఒక్కటే కాకుండా మరికొన్ని క్లిష్ట సమస్యలు కూడా వివాహ సంస్థను నేడు ఎదుర్కొంటూ ఉన్నవి. పాశ్చాత్య దేశాలలో ముప్పది ఏండ్లలోపల ఎవరూ వివాహాన్ని చేసుకునే స్థితిలో లేరు. దీనికి ముఖ్యమైన కారణాలలో సంతాన నిరోధక ద్రవ్యాలను విరివిగా ఉపయోగించటం ప్రథమమని చెప్పవచ్చును. ప్రపంచానికి ఈ నిరోధక (Contraceptives) ద్రవ్యాలు క్రొత్తవి కావు. అనాదినుంచీ ఉంటూ ఉన్నవి. కానీ అవి ఈ నాడు ఉపయోగంలో ఉన్నట్లు పూర్వకాలంలో లేవు. జనసామాన్యానికి ఆ నాడు అందుబాటులో కూడా లేవు.

వివాహమంటే సంతాన రక్షణ కోసమూ శ్రేయస్సుకోసమూ భార్యభర్తలిద్దరూ ఏర్పరుచుకునే బంధమని వెనుక చెప్పి ఉన్నాము.

అటువంటి సందర్భంలో పిల్లలు లేనప్పుడూ అనవసరమైనప్పుడూ వివాహంతో సంబంధం లేదు కదా?– అనే ప్రశ్న ఉదయిస్తుంది; దానిని అనుసరించి ఆ స్థితిలో వివాహంతో పనిలేదు. దానిని పాటింపనవసరంలేదు; మానవులకు కామము శారీరకనైజగుణము (Biological Necessity) అని వాదించవచ్చును. ఈ వాదం స్థూలదృష్టికి సమంజమైనది అని కూడా అనిపించవచ్చును. తర్కశాస్త్రానుసారంగా పరిశీలిస్తే ఇంతకంటే నీచాతినీచమైన వాదం మరొకటుండదని వ్యక్తమౌతుంది.

వివాహ ధర్మానికి వ్యతిరిక్తమైన స్త్రీ పురుష సంబంధాన్ని అంగీకరించిన కొద్దీ వివాహ సంస్థకు దెబ్బ తగులుతుంది. తన్మూలంగా సంఘ శక్తి, స్తిమితత, పవిత్రత రూపు మాసిపోతవి. వైవాహిక నీతినియమాలు ఎటువంటివైనా వాటికి భిన్నంగా కనిపించే కామోపభోగాన్ని ప్రతిజాతీ, ప్రతిసంఘమూ ఆ నాటికాలంనుంచీ నిరసిస్తూ వస్తున్నది.

నేటి నాగరికత సభ్యతలో స్త్రీ పురుష సంబంధాన్ని మరింత క్లిష్టం చేస్తూ ఉన్నది స్త్రీల సమాన ప్రతిపత్తి, వారి సంపూర్ణ స్వేచ్ఛ. వెనుకటి కాలంలో స్త్రీ వివాహం

చేసుకుంటే గాని జీవనోపాధి దొరికేది కాదు. ఈ రోజుల్లో పురుషుడితోబాటు సమాన ప్రతిపత్తి చేకూరుతున్నది. చేకూరుతుంది. పురుషులవలె స్త్రీలు కూడా స్వతంత్ర జీవనం చెయ్యగలరు. స్వతంత్ర గృహనిర్మాణం చేసుకొనగలరు. భోగభాగ్యాలను అనుభవించగలరు. జీవితానికి ఆనందానుభవాన్ని కలిగించేది బిడ్డలు ఒక్కరే కాదు. విశాల విశ్వంలో పురుషుడికి ఎన్ని ఉన్నవో స్త్రీకీ అన్ని మార్గాలున్నవి.

నిత్యమూ ప్రపంచంలో ఏదో మూలనుంచి కామతంత్రాన్ని మూసి పెట్టకూడదు. స్త్రీ పురుషులు యావన్మందీ ప్రత్యేక శాస్త్రంగా దీన్ని పఠించి తీరాలి; ఇందులో సారస్యాలను గ్రహించి అనుభవించాలి అనే వివాదాలు వినిపిస్తూ ఉన్నవి. అంతేకాకుండా పురాతన కాలంలో వలె ఎబ్బెట్టులేకుండా అసభ్యతగా పరిగణించ కుండానే స్త్రీ పురుషులు ఒకచోట చేరి కామశాస్త్రరహస్యాలను బహిరంగంగా చర్చించుకుంటున్నారు. పాశ్చాత్య దేశాల్లో చలనచిత్రాల మూలంగా జాతిశాస్త్ర (Sexual Science) విజ్ఞానం వెదజల్లటం జరుగుతున్నది. ముమ్మందు ప్రాచ్యదేశాలు కూడా దృశ్య విద్య (Visual Education) మూలంగా ఈ విధానాన్ని అనుసరిస్తవి. అందులో అణు మాత్రము సందేహము అనవసరము.

కొంతకాలం బ్రహ్మచర్యాన్ని గడిపినా కామము విషయము ఏమి చెపుతావని ప్రశ్నించేది నేడు యువకుడొక్కడే కాదు, యువతి కూడాను. ఏవో నిష్ప్రయోజకాలైన వైరాగ్యోపన్యాసాలిచ్చి ఆమె మనస్సును త్రిప్పటానికి ప్రయత్నించడం వల్ల విశేషమైన ప్రయోజనం ఉండబోదు, ఉండదు. ఇటువంటి సమస్యను సహజమైన ఆర్ద్రదృష్టితో ఎదుర్కోటం వ్యక్తిపరంగానూ, సాంఘికంగానూ శ్రేయస్కరము.

సమాజం నుంచి మరికొందరు మరొక ప్రశ్న వేస్తున్నారు. తల్లికి పిల్లవాడిని పెంచుకునే ఆర్థికశక్తి స్వతంత్రంగా ఏర్పడ్డప్పుడు పొందే హక్కు న్యాయశాస్త్ర మూలంగా ఎందుకు ఉండకూడదు అని. అప్పుడు వారికి వివాహబంధం ఎందుకు? అది కేవలమూ స్త్రీని పురుషునికి బానిసగా జేయటంతప్ప అన్యమౌతుందా? ప్రభుత్వంగానీ, సంఘంగానీ భర్తను కోరే యువతికి భర్తను చూపలేకపోవటం వల్ల శక్తిమంతమైన మాతృత్వం ఉన్న స్త్రీ వ్యభిచరించటం దోషమా? – అయితే ఈ తప్పు సంఘానిదా? ప్రభుత్వానిదా? వ్యక్తిదా?

పురుషులకంటే స్త్రీలు విశేషంగా ఉన్న దేశంలోగానీ, జాతిలోగానీ, సంఘంలో గానీ, స్త్రీలందరికీ భర్తలు దొరకటం చాలా కష్టం. వివాహ విషయంలో ఆధునిక స్త్రీ మానసికస్థితి లోతెరిగిన ఒక వేత్త కొన్ని అభిప్రాయాలిచ్చాడు. "వంధ్యాత్వం

చట్టసమ్మతము చేయవచ్చును. స్త్రీలోనూ మానసికాభివృద్ధికి మాతృత్వాన్ని కావాలని కొందరు కోరుకుంటారు. కొందరు భర్త అంటే మనస్సు అంగీకరించకపోయినా పిల్లలమీద అపేక్షవల్ల వివాహం చేసుకుంటారు. పిల్లలు కావాలని ప్రతి స్త్రీ కోరుతుంది. కానీ అందుకోసం పురుషుడికి దాస్యం చేయటానికి అంగీకరించదు" అని.

అయితే పిల్లలు ఎలా వస్తారు? పెంచుకోవచ్చును, లేదా మరో స్త్రీ పిల్లలను దొంగిలించవచ్చును. ఇతరుల పిల్లలను పెంచుకున్నా, దొంగిలించినా తృప్తి కలుగకపోవటము మానవ లోకానికి సహజగుణం. ఇందులో రక్తసంబంధం కనిపించదు. ప్రసవ వేదన లేదు. ఆత్మీయత లేదు. ఏమి సంతృప్తి? ఎక్కడి సంతృప్తి?

లోకంలో కొందరికి సహజంగా కామోద్రేకం ఎక్కువ. కొందరికి తక్కువ. కొందరిలో కామం మధ్యేమార్గాన్ని అనుసరిస్తుంది. ఎవరిలో కామం తక్కువగా ఉంటుందో వారిని జాతి శాస్త్రజ్ఞులు ఊనకాములు (Infra-sex) అని వ్యవహరిస్తారు. ఇటువంటివారికి కామోద్రేకం విశేషంగా ఉన్నవాళ్ళను చూస్తే ఈర్ష్య కలుగుతుంటుంది. అందువల్ల దాన్ని తగ్గించటానికి ఎంతో తంటాలు పడతారు. లోకంలో స్త్రీ పురుష సంబంధంలో వచ్చే నిబంధనలూ, తప్పులూ, పుక్కిటి పురాణాలూ అన్నీ ఈ ఊనకాముల మూలంగా కలిగేవేనని ఒక మతం వారి అభిప్రాయం. అంటే కామానికి సంబంధించిన విధినిషేధాలు పనికిరావని అభిప్రాయం కాదు. ఊనకాముల అశక్తత వల్లకూడా లోకానికి కొంత మేలు కలిగింది.

పూర్వకాలం మతప్రవక్తలు గుర్తించినట్లు కామశక్తిని గమనించిన వాళ్ళు అరుదు. విచ్ఛేదన (Divorce) మాట ఎత్తకుండానే ఎన్నో ఆటంకాలు కల్పించారు. జీవన విధానంలో అనేక నిష్ఠానియమాలను ఏర్పరచి నేడు విచ్చలవిడిగా తాండవించే కామానికి కళ్ళాలు బిగించినారు. కామశక్తిని సమస్తమూ భగవంతుని మీద కేంద్రీకరించే ఆధ్యాత్మిక ప్రపంచాన్ని సృజించారు.

క్రైస్తవ మతం పావిత్ర్యాన్ని ప్రథమంలో అంగీకరించిన కేవల నీతివాదులు ఏమంటున్నారో గమనిద్దాము. వివాహ విధానాన్ని సంపూర్ణంగా మార్పు చేయటం కంటే ఏ కొద్దిమంది వ్యక్తులో మిగిలిన సంఘం కోసం బలి కావడం మంచిదని వారు అభిప్రాయ పడుతున్నారు. సంఘానికి శ్రేయస్సు అందువల్ల లభించేటట్లయితే కొందరిని త్యాగం చెయ్యమని కోరటంలో తప్పుండదు.

అయితే అప్పుడు మరో ప్రశ్న బయలుదేరుతుంది. జీవిత పర్యంతమూ బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తే మానసికంగా కానీ శారీరకంగా కానీ ఏమన్నా ప్రమాదం

సంభవిస్తుందా? అని. ఇటువంటి ప్రశ్న ఒక శతాబ్దానికి పూర్వం కలిగినట్లయితే దానికి 'ఏ ప్రమాదమూ లే'దని వెంటనే సమాధానం వచ్చి ఉండేది.

ఇది కేవలమూ శాస్త్రీయ యుగము. ప్రాచీన యుగంలో మతవక్తలు సంఘంలో ఉచ్చస్థితిని పొంది ఉన్నారన్న సంగతి లోక ప్రసిద్ధము. నేడు ఆ స్థితిని – ప్రజాయుగంలో – వైద్యులు పొందినారు. యథాతథంగా బ్రహ్మచర్యం వల్ల ఎటువంటి ప్రమాదమూ లేదు. కానీ కొందరికి ఉపకరిస్తుంది. కొందరికి ఉపకరించదు. – అని వైద్య శాస్త్రజ్ఞులు చెపుతున్నారు. కామశక్తి విశేషంగా లేనివాళ్ళు బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తే ప్రమాదం లేదు కాని, వ్యతిరేకులు స్త్రీ సంభోగాన్ని అరికట్టితే కామోన్మాదులు (Sexual Neurotics) అయినా అవుతారు లేదా ముష్టిమైథునానికి అలవాటు పడతారు ఇది వైద్యుల అభిప్రాయము. అందుకే బ్రహ్మచర్యం అందరికీ మంచిదని గానీ, చెడ్డదని గానీ నిర్ణయించడానికి అవకాశం లేదన్నమాట.

అంతేకాకుండా, స్త్రీ సంబంధం లేనంత మాత్రాన ఒక వ్యక్తి కామ రహితుడు కాదని బ్రహ్మచారి అనిగానీ అనటానికి వీలు లేదని జాతి శాస్త్రజ్ఞులంటున్నారు. ప్రాచ్య గ్రంథాలు కూడా అదేవిధంగా పలుకుతున్నాయి. బ్రహ్మచర్యావలంబకులకు కామసంబంధమైన భావనలూ, కాముక స్వప్నాలూ రాకూడదు. నిజమైన బ్రహ్మచర్యము కేవలము శారీరక భోగంతో ఆగిపోదు. అంటే బ్రహ్మచారి మనస్సులో ఏ విధమైన కామమూ ఉండకూడదు.

హేవ్‌లక్ ఎల్లిస్ మహాశయుడు బ్రహ్మచర్యాన్ని గురించి వ్రాస్తూ ఇలా అన్నాడు. "సామాన్యంగా 'చేస్టిటీ' (బ్రహ్మచర్యం) అనే శబ్దం శారీరక సంభోగాన్ని గురించి మాత్రమే లోకంలో వాడుకలో ఉన్నది. కానీ ఆ శబ్దం అంతమాత్రంతో ఆగిపోదు. అంతకంటే ఆనంతమైన అర్థాన్ని ప్రతిపాదిస్తుంది" అని. అందువల్ల మత, ధర్మ, వైజ్ఞానిక వివక్ష లేకుండా బ్రహ్మచర్యం ఒక గుణంగానే పరిగణిత మౌతూ ఉన్నది. పూర్వకాలపు మతధర్మాల మీద విప్లవం జరిపి స్వేచ్ఛను పొందినానని భ్రమపడే నేటి సభ్యప్రపంచం బ్రహ్మచర్యం మీద దాడి చేస్తూ ఉన్నది. అందుచేత ఒక వంక నుంచీ బ్రహ్మచర్య మేమిటి? మానవులకు కామేచ్ఛ సహజం, దాన్ని తీర్చుకోవలసిందే ననీ, వివాహాది నియమాలను త్రోసిరాజనవలసిందేననీ వినిపిస్తున్నది. ఏ దేశంనుంచైతే ఈ నినాదాలు వినిపిస్తున్నవో పూర్వం ఆ దేశంలోనే కామోపభోగానికి కొన్ని నియమాలున్నట్లు తెలుస్తున్నది. అయితే – కామేచ్ఛను తీర్చుకునే ఇతర అవకాశాలూ కనిపిస్తున్నవి.

కానీ విప్లవం చేసి సాంఘిక ఆర్థిక రాజకీయ స్థితుల్లో మార్పునూ, స్వేచ్ఛనూ పొందిన ఆ దేశం నేడు కామస్వేచ్ఛ (Sex-licence) కోరుతున్నది.

సామాన్య స్త్రీ పురుషులలో మిగిలిన అన్నిటితో పాటే కామమూ సామాన్యంగా ఉంటుంది. దానివల్ల ఎటువంటి ప్రమాదమూ లేదు. వైజ్ఞానిక, మానసిక వికాసాల విషయంలో కలిగే తృష్ణ వలెనే అదీ పనిచేస్తుంది. అత్యద్భుతాన్ని తెలుసుకోవలెననే ఆసక్తి ఎటువంటిదో కామమూ అటువంటిదే.

నీతిశాస్త్రజ్ఞుడు సంఘం అంగీకరించిన మార్గాలలోనే కామతృప్తిని పొందటమే స్త్రీకి గానీ, పురుషునికి గానీ శ్రేయస్కరమని అభిప్రాయమిస్తాడు. అటువంటి మార్గాన్ని అనుసరించలేని వ్యక్తి దానిని చంపుకోవటం గానీ, లొంగదీసుకోవటం గానీ మంచిదంటాడు. అయితే అటువంటి విధానాన్ని అనుసరించటము ఎంత వరకు సాధ్యము? అనేది ప్రశ్న.

మనస్సును మార్చుకున్నా - లేక స్నాయువులకు నిస్సత్తువ కల్పించుకున్నా కామము నశించదు. కామాన్ని చంపుకునేందుకు కొందరు కొన్ని క్రీడలు కనిపెట్టారు. దానివల్ల కూడా విశేష ప్రయోజనం కనిపించలేదు. పరిపూర్ణమైన అలసట (Exhaustion) కలిగేదాకా క్షుద్బాధగాని, కామక్షుత్తుగానీ నిర్మూలితం కాదు. మత విషయకమైన మనస్తత్త్వం కొంతగా ఉపకరించవచ్చునేమో గాని, అది లేనివాళ్ళకు కామాన్ని లొంగదీసుకోవటమనేదే లేదు. అటువంటివారు, సంఘం వారి ఆనందానుభవాన్ని అరికట్టితే, స్వీయ - కాములు (auto-erotic) గా పరిణమిస్తారు. దానివల్ల లోకానికీ, సంఘానికీ మరింత తీరని ప్రమాదం సంభవిస్తుంది.

ఉదాత్తమైన ఒక ఆదర్శం ఉంటే కామం లొంగక పోదు. ఆదర్శవిహీనంగా కామాన్ని లొంగదీసుకోటానికి యత్నిస్తే అందువల్ల ప్రయోజనం కంటే ప్రమాదమే విశేషము.

*(ఆంధ్రపత్రిక-28-1-48, వారపత్రిక)*

# హిందూ వివాహము - సంతానము

జాతీయ సభ్యత దేశంలో అభివృద్ధి కావటానికి రాజకీయవేత్తలూ, మతప్రవక్తలూ, సంఘ సంస్కర్తలూ, తదితరులూ తలా ఒక పథకాన్ని అమలు చేస్తుంటారు. ప్రతివారికీ వారి పథకాన్ని అమలు పరిస్తే అభ్యుదయం చేకూరుతుందనే నమ్మకం గాఢతరంగా ఉంటుంది.

దేశీయాభ్యుదయ మంటే - ఆ దేశంలో నివసించే స్త్రీ పురుషుల మానసిక, నైతిక, శారీరకాభ్యుదయం అని అంగీకరించవలసి ఉంటుంది. సంతాన శాస్త్రము దీనిమీదనే ఆధారపడ్డది. సంతాన శాస్త్రమంటూ పుట్టి ఇంకా పాతిక సంవత్సరాలు పైబడలేదు. కానీ అది నేటి సభ్యప్రపంచంమీద ఎంతో భావవ్యాపనం చేసింది. అత్యుత్తమ శ్రేణికి చెందిన మానవ నిర్మాణానికీ, తన్మూలంగా మానవ సంఘనిర్మాణానికీ ఈ శాస్త్రం ఎంతగానో ఉపకరించింది. ఉత్తమ సంతానాన్ని పొందే విధానాన్ని నిరూపించేది సంతానశాస్త్రమని దానిని కొందరు నిర్వచించారు. అది అత్యంత ప్రాధాన్యం కలది కాదు.

ఈ శాస్త్రం, జంతుపాలకుడు వాటిని అభివృద్ధి పొందించటానికి ఏ దృక్పథంతో వర్తిస్తాడో అదేరీతి, మానవాభివృద్ధిని కోరేవాడు మానవజాతిని దర్శించవలసినదని కోరుతుంది. వివాహమన్నా, సంతానమన్నా లోకంలో పాదుకోబడి ఉన్న కొన్ని అభిప్రాయాలను దూరంగా ఉంచమని కోరుతుంది.

ఉదాత్తులుగానో, నీచులుగానో, బలవంతులుగానో, బలహీనులుగానో ఆరోగ్యవంతులుగానో, అనారోగ్యవంతులుగానో వ్యక్తులను తీర్చిదిద్దేది ఏది? - అనే ప్రశ్న మానవుడికి సహజంగా కలుగుతున్నది. ఈ ప్రశ్నకు సక్రమమూ సమగ్రమూ అయిన సమాధానం కేవలం సంతానశాస్త్రం తప్ప మరొకటి ఇవ్వలేదు.

జన్మించి జీవించే ప్రతిప్రాణికీ ఏర్పడుతూ ఉన్న ప్రతి లక్షణానికీ, ప్రతిగుణానికీ ఈ శాస్త్రం రెండు కారణాలను చెపుతుంది. దీనిలో మొదటిది ప్రకృతి (Nature) రెండవది పెంపకము (Nurture). జననకాలంలో ప్రాణికోటికి అబ్బే సమస్తమూ ప్రకృతి తరువాత పోషణ విధానంలో కలిగే వాతావరణమూ, శారీరక సాంఘిక

విజ్ఞానాదికాలు అన్నీ పెంపకానికి సంబంధించినవి. తల్లిదండ్రుల శుక్లశోణితాల సంయోగం వల్ల మాతృగర్భంలో ఒక చిన్న అండం ఏర్పడుతుంది. మనస్సు ఊహించలేనన్ని శక్తులు దానికి అప్పుడే సంక్రమించి ఉంటవనీ, ఆ సమయంలో ప్రకృతి భవిష్యత్తులో ఆ అండం వల్ల జన్మించబోయే బిడ్డ భవితవ్యాన్ని సమస్తమూ నిరూపించే సంతానశాస్త్రం పలుకుతూ ఉన్నది. అందువల్ల వంశపారంపర్యంగా వచ్చే ప్రకృతి శక్తికి ప్రాథమిక ప్రాధాన్యత ఉన్నదని మనకు అవగతమౌతున్నది. శుక్ల శోణిత సంయోగం ఏర్పడే అండానికి ప్రకృతితః కలిగే గుణాల ననుసరించే బిడ్డ పాలు తాగటమూ పెరిగి పెద్దది కావటమూ జరుగుతుంది. అది కారణంగా కొందరు శాస్త్రవేత్తలు పుట్టుకను గర్భధారణకు ముందే పరిగణిస్తారు.

వ్యక్తులకు వైజ్ఞానికంగానూ, మానసికంగానూ, శారీరకంగానూ పుష్టిని కలిగించడంలో వంశపారంపర్యమైన ముఖ్యమైన ప్రకృతిశక్తి గొప్పదా, లేక వాతావరణ శక్తి గొప్పదా, అనే అనుమానం అప్పుడప్పుడూ అందరికీ కలుగుతుంది. అటువంటి ప్రశ్న కలగటం, సమంజసం కూడాను. అయితే దానికి తగిన సమాధానం ఇంతవరకూ రాలేదు. లోకంలో ఏ సాంఘిక చట్టము వచ్చినా వాతావరణానికే విశేష ప్రాధాన్యం ఉన్నదనే నమ్మకంతో వస్తున్నది. రాజకీయవేత్తలూ సంఘసంస్కర్తలూ దానికే విశేష ప్రాముఖ్యం ఉన్నట్లు పరిగణిస్తున్నారు.

"ప్రకృతి పోషణలో ఒకదానిని మించాలని ఒకటి ప్రయత్నిస్తే – రెంటికీ సమాన బలం ఉన్నప్పుడు కూడా ప్రకృతి జయించి తీరుతుంది. పోషణ ఓడిపోతుంది. అయితే ఏ ఒక్కటీ యథాతథంగా మానవజాతినిగానీ తదితర ప్రాణికోటిని గానీ అభ్యుదయ పథంలో నడిపించటానికి తమంతట తాము స్వయంశక్తాలైనవి కావు. ప్రకృతి శక్తి చాలా గొప్పదైనా క్రమమైన వాతావరణం లేకపోవడం వల్ల అది లోపించవచ్చును. అంతేకాదు. ప్రకృతి, సహజంగా ఉన్న పాశవృత్తినీ, శారీరకమైన అర్భకత్వాన్నీ బలహీనమైన మానసిక వృత్తినీ, వాతావరణం పోషణతో ఎంత ప్రయత్నించినా పూర్ణంగా మార్చలేవు'' అనిఒక శాస్త్రవేత్త అభిప్రాయ మిచ్చినాడు. ప్రకృతి శక్తి (వంశ పారంపర్యశక్తి) పోషణశక్తి కంటే అయిదు మొదలు పదిరెట్ల వరకూ శక్తిమంతమైనదని సంతాన శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

'లోకంలో శక్తిమంతమైనది మాత్రమే నిలుస్తుంది; అదే నిలవవలె' నని డార్విన్ మహాశయుడు ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అంటే ఆ సిద్ధాంతం లోకంలో జరిగే సమస్త హింసాకాండనూ ప్రతిఘటించకుండా చూస్తూ ఊరుకోమని కోరుతుంది.

ఆ సిద్ధాంతాన్ని అనుసరించే జీవ శాస్త్రజ్ఞులు (Biologists) కొందరు బయలుదేరినారు. అశక్తత వల్ల మరణించబోయే పసిపిల్లలకు పోషణ అనవసరము; వారు చనిపోవుటయే లోకానికి శ్రేయస్సు అని వారి అభిప్రాయం. కానీ లోకములో ప్రాణికోటి ముఖ్యంగా – మానవుడు, అనంతమైన మానసిక పరిణామాన్ని పొందినాడు. ఇటువంటి ఘాతుక కృత్యాలకు అతను పూనుకోలేడు ఆ అనాగరక స్థితిలో అతడు నిలువలేడు. కేవలం ప్రకృతి చేసే హింసావిధానాన్ని విప్లవ తత్త్వంతో ఎదుర్కొని అరికట్టకుండా దాసోహం చెయ్యలేడు.

ప్రకృతి సహజమైన ఎన్నిక చేయగలిగేమాట వాస్తవము. కాని క్రొత్తవాటిని సృజించే శక్తి దానికి లేదు. వాతావరణానికే ఈ శక్తి వున్నది. ప్రకృతి త్రోసి పారవేసిన వాటికి ప్రాణం పోసే శక్తి దానికున్నది. మెండల్ మహాశయుడు ఉద్భవించి పై జాతికి చెందిన జీవశాస్త్రజ్ఞుల దృక్పథాన్ని మార్చినాడు. వాతావరణానికి కూడా అనంతమైన శక్తి ఉన్నదనీ, దానిమూలంగా ప్రాణులు నూతన గుణాలను కొన్నింటిని సంపాదించుకుంటున్నవనీ నిరూపించి శాస్త్రజ్ఞలోకానికి చూపించినాడు.

ప్రాణిలోకంలో గుణాలు సుస్థిరంగా ఉండవనీ, మార్పును పొందుతూ ఉంటవనీ శాస్త్రజ్ఞులు అభిప్రాయము నిచ్చినారు. కొన్ని గుణాలు కొన్ని కాలాలలోనే వుండి తదుపరి మార్పు పొందుతవని వారి ఉద్దేశ్యము. వీటిని శాస్త్రవేత్తలు 'మ్యుటేషనులు' అన్నారు.

అది కారణంగా వృక్షజాతుల ఋతు కాలములో ప్రాణాండాలు (Germ - Cell) ఏకమైనప్పుడు మొదటి జాతికంటే భిన్నమైన జాతి లక్షణాలేర్పడవచ్చునని మెండల్ మహాశయుడు పరిశోధనల మూలంగా నిరూపించినాడు. అంటే వాతావవరణం వల్ల ప్రాణికోటిలో దాగి ఉన్న కొన్ని శక్తులు బహిర్గత మౌతవని తాత్పర్యార్థము.

అది సాంఘికం కావచ్చును. లేదా రాజకీయం కావచ్చును. వైజ్ఞానికమూ కావచ్చును. ఏ పథకానికైనా ఒకటే ఆదర్శం. ఉదాత్తమూ, ఉత్తమమూ అయిన మానవ సమాజాన్ని సృజించుకుంటూ పోషించుకోవటము దాని ధర్మమై ఉంటుంది. ఈ దృష్టితోనే ఏ జాతి పుక్కిటి పురాణాలైనా, అర్థం బద్ధం కనుపించని ఏ దేశంలోని ఆచార వ్యవహారాలనైనా శీలసంపత్తులనైనా విమర్శించవలసి వుంటుంది. ఏ జాతి ఐనా ఎంతమంది ఉత్తమ మానవులను సృజించింది. వారి గుణగణాలేమిటి? ప్రపంచాభ్యుదయానికి ఆ జాతి చేసిన దోహద సేవ ఏమిటి? అనే ప్రశ్నలు.

హిందూజాతి, సంతానాన్ని – దాని లక్షణాన్నీ, బాగా అవగతం చేసుకున్నది. అధునాతన కాలంలో పుట్టిన సంతాన శాస్త్రంలోని ధర్మసూక్ష్మాలన్నీ హిందూజాతి

వివాహ విధానంలో గోచరిస్తున్నవి. హిందువుల గృహ్య సూత్రాలూ, స్మృతులూ ఇందుకు ప్రబల సాక్ష్యాలు. హిందువుల ధర్మంలో సాంఘిక జీవితం సమ్మేళనాన్ని పొందింది. ధర్మాన్నీ, స్మృత్యాదులనూ పాటింపకుండా చరించినవారికి శిక్ష 'పాపకూపం' అనే బెదిరింపు, లేదా సంఘ బహిష్కృతి. ఇందులో మొదటిది ప్రాచీన కాలంలో బాగా పనిచేసింది. నేటి ప్రజాపరిషత్తులో జరిగే చట్టాలమీదకంటే వాటిమీదనే లోకానికి భయం విశేషంగా ఉన్నట్లు అవగతమౌతున్నది. నాలుగు వేల సంవత్సరాల నుంచీ నానావిధాలైన రాజకీయాలకూ, దండయాత్రలకూ, సాంఘిక జీవన విధానంలో పరప్రభావాలకూ గురియౌతూ వచ్చినా విశేషమైన మార్పులు హిందూ జాతి ధర్మాలలో కలగకపోవటం విశేషమైన ఆశ్చర్యం కలిగిస్తున్నది. అంతేకాకుండా హిందూజాతి స్మృతి, గృహ్యసూత్రాదుల ఆధిక్యమును వేనోళ్ళ చాటుతూ ఉన్నది.

ఈ గృహ్య సూత్రాలు గానీ, స్మృతులు గానీ మొదట కొద్దిపాటి సమాజాన్ని ఉద్దేశించి పుట్టినవి. తరువాత అనేక కారణాలమూలంగా అనేక జాతులు వచ్చి హిందూజాతిగా ఏర్పడ్డవి. ఆర్యావర్తపు టెల్లలు హిమాలయాలు మొదలు కన్యాకుమారి వరకూ క్రమక్రమంగా పెరుగుతూ వచ్చినవి. అయినా సాంఘిక స్థితిలో – లోపాలు లేవని కాదు – విశేషమైన మార్పులు కలగకపోవటానికి స్మృతికర్తల మేధావిశేషమే కారణమని ఒప్పుకొని తీరాలి.

యజుర్వేదంలో "పశ్యతి పుత్రం, పశ్యతి పౌత్రం, ప్రప్రజయా పశుభిః మిథునైర్జాయతే యస్యైవం విదుషాగ్ని హోత్రం జుహ్వతి" అని పరాయిత బ్రాహ్మణం పలుకుతున్నది. వివాహం ఎందుకోసం? సత్సంతానం కోసం. అందుకనే మహాకవి కాళిదాసు రఘువంశాన్ని వర్ణిస్తూ 'ప్రజాయై గృహమేధినాం' అని అన్నాడు.

'అపుత్రస్య గతిర్నాస్తి' అనే ఆర్యోక్తి లోక ప్రసిద్ధమైనదే. అంటే భారతీయ వివాహం పాశవ ప్రేమకోసం కాదు, ఉత్తమ గతికోసం. అభ్యుదయం కోసం. సంతాన శాస్త్రం కూడా వివాహం అత్యవసరంగా చేసుకొని తీరవలెనని చెపుతున్నది. ఆర్యధర్మము కూడా భంగ్యంతరంగా వివాహం చేసుకోవలసినదేనని విధిస్తూ ఉన్నది. స్త్రీ పురుష సంయోగానికి ఫలితాంశం సంతానం. సంతానంలేని దాంపత్యం పరిహాస పాత్రమౌతూ ఉండటమూ, బేలతనాన్ని వహించటమూ ఇందుమూలాననే.

కుమారుడు కలగటమంటే ఆర్యులకు ప్రజాపతిత్వం వహించటమన్నమాట! ప్రజాపతి కరుణాప్రసాదాన్ని పొందటమన్నమాట!! అందువల్ల నిత్యబ్రహ్మచర్యాన్ని వారు గర్హించారు. నాడు 'ఘోటక బ్రహ్మచారి' అనే పలుకుబడిలో న్యూనత గోచరిస్తుంది.

నిత్యబ్రహ్మచర్యమంటే కేవలం ఆత్మ స్వరూపాన్ని చంపుకోవటమనీ, అది అవమానకర కృత్యమనీ ఆర్యుల తలపోత. అది కేవలమూ మాతాపితృత్వాన్ని (Parenthood) వహించటానికి జంకటం తప్ప అన్యం కాదని వారి అభిప్రాయం.

ఆర్యధర్మ శాస్త్రవేత్తలు పితృదేవతలను తృప్తి పొందించటానికి సూనుడు (పుత్రుడు) అవసరమన్నారు. వారి నిత్యనైమిత్తిక తర్పణాలకు సూనుడు అత్యవసరము. 'సూను' శబ్దానికి మొగ్గ అని అర్థం. ప్రాణాంశాల సంయోగం వల్ల ఈ మొగ్గ కలుగుతుంది. తండ్రే మాతృగర్భాన్ని చేరి కుమారుడుగా పుట్టి ప్రజాతంతువును పొడిగిస్తూ, జీవ ప్రవాహానికి దోహద సేవ చేస్తాడని వారి నమ్మకం. పితృదేవతలు ఈ ప్రాణసూత్రం తెగిపోకుండా చూచుకోటానికి సృష్ట్యాది నుంచే వస్తూ ఉన్న వ్యక్తులు. దీనినే ఆధునిక పరిభాషలో చెప్పితే 'వైమనిజమ్' అనవచ్చును.

'జీవం ఒక ప్రాణాండం నుంచి మరొక ప్రాణాండానికి ప్రవహించే నది వంటిది' అని బెర్గసన్ అనే శాస్త్రవేత్త నిర్వచించాడు. అయితే ఆయన ఆర్యులు చెప్పినట్లు దానిని అడ్డుకోటం పాపం అని అనలేదు. శరీరము భగవత్ప్రసాదం, సృష్టికర్తృత్వాన్ని ప్రసాదించే శక్తిని ఉపయోగించుకోకపోవటము తెలివి తక్కువ. పూర్వులు లేకుండా తానింతవాడు కాగలడా? పితృభక్తి ఉన్నవాడు ఆర్యధర్మాన్ని అనుసరించి వివాహం చేసుకోవలసినదే; పితృఋణం సంతానముఖాన తీర్చుకోవలసినదే.

సాంఘికవ్యవస్థ ననుసరించి పరిగణించినా పుత్రుడు కలగటం కేవలము విజయంగా కనిపిస్తుంది. ఆ పుత్రుడు తనంతటి వ్యక్తి అయి లోకంలో తన్ను మరపింపజేస్తూ ఉంటే ఆనందించని పితృహృదయం, ఏ దేశంలో వుంటుంది? కుమారుడు లేని స్త్రీ భర్త మరణానంతరం ఒక అబీజ. 'పుత్ర' శబ్దంలో మరింత విశేషార్థం గోచరిస్తూ ఉన్నది. వ్యక్తి తన జీవిత కాలంలో తీర్చుకోలేని కోరికల నన్నిటినీ తీర్చేవాడు పుత్రుడు. అతడు ఏ పాపాలు చేసినా తిరిగీ కుమారుడి కడుపున పుట్టి పాపాన్ని పాపుకుంటాడు. కుమారుని కనటం భారతీయునికి కేవలం పితృదేవతల కోసం కాదు; తనకోసం కూడాను. 'ఆత్మజ' శబ్దంలో నా వల్లనే పుట్టినవాడు; అన్యుడు కాడు అనే అర్థం అవగతమౌతున్నది. పితృదేవతాపూజనం అంటే ఏమీ వింత విశేషం గాదు. లోకంలో అంతర్వాహినిగా అనంతకాలం నుంచీ వస్తూ ఉన్న జీవనదిని దర్శించి ధ్యానించడం.

ఆర్యసంఘానికి అనార్య సంపర్కమూ కలిగింది. అందుమూలంగా అనేక విలోమ జాతులు ఏర్పడ్డవి. ఒకానొక కాలంలో వర్ణాంతర వివాహాలున్న ఆర్యజాతి లక్షణాలను మార్చుకొని ఏ వర్ణంవారు ఆ వర్ణంలో వివాహం చేసుకోవాలి అని నియమించుకున్నది.

అయితే ఏ వర్ణం వారైనా వారి వారి గోత్రంలో నుంచి కన్యకలను వివాహం చేసుకోకూడదనే నిర్ణయించినారు. అంటే ఆర్యవివాహంలో ఒక విధమైన కూటాంతరత (Exogamy), కూటబాహ్యత (Endogamy) రెండూ ఉన్నవన్నమాట!

ఉత్తమ జాతులు (వర్ణాలు) అనిపించుకున్నవారు అనులోమ వివాహపద్ధతి మూలంగా తక్కువ వర్ణాలవారిని వివాహం చేసుకోవచ్చుననే నియమం ఆచారంలోకి వచ్చినది. ఎక్కువ జాతికి చెందిన తండ్రికి కలిగిన కుమాళ్ళు ప్రాచీనకాలంలో ఎక్కువ జాతివారై తదనుగుణమైన జననాదికసంస్కారాలను పొందేవారు. కానీ తక్కువజాతి తండ్రికి పుట్టినవాడు మాత్రము తల్లిజాతికి రావటానికి వీలులేదు. దీనిని ఆధారం చేసుకునే మనుధర్మశాస్త్రంలో అనులోమ విలోమ జాతి నిర్ణయం జరిగింది. వర్ణధర్మానికి మూలసూత్రం కులక్రమాగతశక్తి (Heredity). దానిని నిలపటానికే హిందూ ధర్మశాస్త్రజ్ఞులు ప్రయత్నించారు.

అయితే – భార్య ఎప్పుడూ తండ్రివైపు ఏడు తరాలలోనూ, తల్లివైపు 5 తరాల లోనూ ఉండకూడదు. ఈ నియమమూ కాలాన్ని బట్టి, స్థలాన్ని బట్టి, సందర్భాలను బట్టీ మార్పు పొందినట్లు కూడా నిదర్శనాలు లేకపోలేదు. తండ్రివంశములో నుంచి వివాహం చేసుకోవటమనే ఆచారం క్రమక్రమంగా నశించి నిర్మూలితమై ఉంటుంది.

హిందూ సంఘానికి చతుర్వర్ణాలు ప్రథమ విభాగం. అందులో ప్రతివర్ణములోను కొన్ని అవాంతర భేదాలు. ప్రతి అవాంతర జాతిలోనూ గోత్రవిభాగం ఏర్పడ్డది. ఇందులో కొన్ని వర్ణాల వారికి మొదట గోత్రాలు లేకపోయినా – లేకపోవటానికి కారణం అనాదినుంచీ ఆర్యులు కాకపోవటమేమో – తరువాత పురోహిత గోత్రాలను స్వీకరించి నారు. అందువల్ల అలా ఏర్పడ్డ వంశాలలోనూ పూర్వం ఒకవేళ అవకాశం ఉన్నా తరువాతి కాలంలో పితృపక్షంనుంచి భార్యను స్వీకరించే అవకాశం తప్పిపోయింది.

వెనుకటి కాలాన్ని గానీ, సాంఘిక స్థితిగతులను గానీ నేటి దృక్పథంతో విచారించడము శాస్త్ర సమ్మతము కాదు. ఆర్యజాతిలో విశిష్ట మేధాసంపన్నులు జన్మించి, జాతి విశిష్ట ధర్మాలకు దెబ్బ తగలని రీతిగా కొన్ని కట్టుబాట్లు ఆలోచించి, స్మృతులమూలంగా నిబద్ధం చేశారు. మొదట్లో వర్ణాంతర వివాహాలు కొన్ని విరివిగా జరిగి ఉండి ఉంటవి. వర్ణాంతర వివాహమంటే సంతనా శాస్త్ర రీత్యా పలికితే కృతక – సంతాన ప్రాప్తి (Inter - Breeding) అని చెప్పవచ్చును. లేదా, మిశ్రమ – సంతాన ప్రాప్తి వల్ల ఆర్యులకు కొన్ని దోషాలు పొడకట్టినట్లు అవగతమౌతూ ఉన్నది. ఆయా వర్ణాలలోనూ, వంశాలలోనూ కనుపట్టవలసిన పావిత్ర్యము మాట అటు ఉంచినా,

కొన్ని శారీరక విపత్తులు గూడా ఏర్పడి ఉంటవి. ఆ పద్ధతిని మరింతకాలం అమలులో ఉంచితే వర్ణాలలో విశేషంగా వంధ్యాత్వము (Sterility) ప్రబలిపోతుంది. అలా జరిగితే సంతాన రహితత కలుగుతుందనే అభిప్రాయాన్ని నేటి సంతాన శాస్త్రజ్ఞులు అంగీకరిస్తూ ఉన్నారు.

ఈ సందర్భంలో ఒక శాస్త్రవేత్త ఏమంటున్నాడో గమనించండి. 'యూరప్ దేశంలో కూడాను ఉత్తమ శ్రేణికి చెందిన వారిలో కంటే తక్కువవారిలోనే సంతానాభివృద్ధి ఎక్కువ. అందువల్ల లోకంలో ఎప్పుడు పుట్టినా మొత్తం మీద చూస్తే యోగ్యమైన సంతానం కంటే అయోగ్యమైన సంతానమే విశేషంగా కలుగుతూంది' అన్నాడు ఆయన. ప్రాచీన హైందవ సామాజిక స్థితి వర్ణభేదం మీద ఆధారపడిన మాట వాస్తవము. దాని కారణం నేటి సంతాన శాస్త్రజ్ఞులు పలుకుతూ ఉన్న అభిప్రాయాలకు మూలమైన విజ్ఞానమే. మిశ్రమ సంతానం వల్ల ప్రయోజనం లేదని వారు గ్రహించారు. అందువలన ప్రత్యేక వైవాహిక నియమాలను అనుశాసించారు. మెండల్ మహాశయుడు 'లోకం చెప్పుకునే వర్ణాంతర వివాహాలకూ, జాత్యంతర వివాహాలకూ తగిన ప్రకృతి మూలం లే'దని అభిప్రాయ పడుతున్నాడు.,

అయితే కులతత్త్వం విపరీత మార్గాలను పట్టి, చాలా సంకుచిత దృష్టి కాలక్రమేణా వహించిన దన్నమాట అందరూ అంగీకరించి తీరవలసినదే. అందుమూలంగా కూడా వివాహానికి ప్రధానాశయమైన 'సత్సంతానానికి' ఎంతో దెబ్బ తగిలిన మాటా వాస్తవము.

హిందూ వైవాహిక ధర్మంలో యోగ్యమైన కన్యకను మాత్రమే వివాహం చేసుకోమనేది మంచి నియమం. ఈ విషయాన్ని ప్రతి జాతీ పాటిస్తుంది.

వేదయుగం అంటూ ఒకటి చారిత్రక సత్యమైనట్లయితే ఆ కాలంలో వివాహం బాగా యుక్తవయస్సులోనే జరిగినట్లు నిదర్శనాలున్నవి. వారి వారి మానసిక వికాసాలను అనుసరించి ఒకరినొకరు అన్యోన్యం ప్రేమించుకొని వివాహం చేసుకున్నారు. కాని తరువాతి కాలంలో మార్పు వచ్చింది. భర్తకంటే భార్య మూడు వత్సరాలకంటే చిన్నదై ఉండరాదని వాత్స్యాయనాదులు చెప్పినారు.

సంతాన శాస్త్రజ్ఞులూ (Eugenists), మానసిక తత్త్వవేత్తలూ (Psychologists) ఇద్దరు కామోద్రేకులూ (Sexual Neurotics), అసామాన్య కామమార్గావలంబులూ (Abnormal Sexes) అయినవారి మధ్య జరిగే వివాహాలలో సంతానం చాలా దెబ్బతింటుందని అభిప్రాయమిస్తున్నారు. అందుమూలంగానే అనాదికాలంలో

అందరియెడా సర్వసామాన్యంగా ఉన్న గాంధర్వ వివాహ పద్ధతి కేవలమూ క్షత్రియుల విషయంలోనే ఆచారమై నిలచింది. మిగిలిన జాతులన్నిటికీ ప్రాజాపత్యమే ధర్మబద్ధమైన వివాహమైనది. ప్రస్తుతపు హిందూ వివాహ ధర్మం అది ఒక్కటే.

కన్యావివాహాలు కేవలం బ్రాహ్మణజాతికి మాత్రమే సంబంధించిన వేమో ననిపిస్తుంది. ఇందులో కన్యకకంటే వరుని వయస్సు మూడు రెట్లు అధికంగా వుండాలనే నియమం ఉన్నది. ఇది వారి విద్యావిధానం మీదా ఇతర కారణాల మీదా ఆధారపడి ఉంటుంది.

భార్యాభర్తల మధ్య అంతరాన్ని గురించి హిందూ వైద్యశాస్త్రజ్ఞులు ఏం పలుకుతున్నారో ఈ సందర్భంలో గమనించవలసి ఉంటుంది. సుశ్రుతుడు ఇరువది ఐదేండ్ల పురుషుడు పన్నెండేళ్ళ కన్యకను వివాహం చేసుకోవాలన్నాడు. వాగ్భటుడు పురుషుని వివాహ వయస్సును ఇరువది ఒక్క సంవత్సరానికి తగ్గించినాడు. అంతేకాకుండా పదునైదు, పదహారు సంవత్సరాలకు పూర్వమే స్త్రీకి గర్భధారణం జరిగితే పిల్లలు అతిబలహీనంగా ఉండటమో, మరణించటమో జరుగుతుందని సుశ్రుతుని అభిప్రాయము. అంతేకాకుండా వెనుకటి హిందూజాతి కన్యకలు పుష్పవతులయ్యే వయస్సు ఈ నాటికంటే మించి ఉండి ఉంటుందని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడినారు. ఆ నాడు కన్యావివాహాలని చెప్పినవన్నీ గృహస్థ ధర్మాన్ని నెరపే వివాహాలు కాకపోవచ్చును. కావు కూడాను.

యువకుల వివాహ వయస్సును ప్రాచీన హిందువులు ఎందుకు పెంచవలసి వచ్చింది? భార్యాభర్తల మధ్య ఉండే అంతరం మూలంగా బలకరమై పూర్ణాయుర్దాయాన్ని పొందే సంతానం కలుగుతుందనే నమ్మకం మీదనా? లేక, స్త్రీ కంటే పురుషునిలో ఏదో ఆధిక్యము ఉన్నదనే నమ్మకం మీదనా?

సుశ్రుతాచార్యుని అనుసరించి స్త్రీలలో ఋతుధర్మం పన్నెండవ ఏట ప్రారంభించి ఏబదియవ సంవత్సరం వరకూ ఉంటుంది. పదునైదవ సంవత్సరము మొదలు వారు దరిదాపు నలువది ఐదు సంవత్సరాలవరకూ సంతానాన్ని పొందటానికి శక్తిగలవారుగా ఉంటారు. అందువల్ల యువకుడు ముప్పదియవ ఏటా, స్త్రీ పన్నెండవ ఏటా వివాహం చేసుకుటే ఇరువురికీ క్రమమైన సత్సంతానం కలుగుతుందని ప్రాచీన హైందవులు నమ్మి ఉంటారు. అంతవరకూ సంతానానికి మూలకారణుడైన పురుషుడు అంతర్ముఖమైన సృజనాశక్తితో బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తాడు.

మరియొకరు ఈ వివాహ వయస్సు కేవలము ప్రాచీనార్య విద్యావిధానం మీద ఆధారపడి ఉంటుందనీ, ఆ నాటి యువకుని విద్యాపరిపూర్తికి ఇరువది నాలుగు, ముప్పది రెండు సంవత్సరాలు పట్టేదనీ అభిప్రాయపడినారు. మానవ జీవిత ప్రమాణమని చెప్పుకుంటూ ఉన్న నూరు వత్సరాలనూ మూడుభాగాలుగా విభజించి, మానవుడు ఒక్కొక్క విభాగాన్ని త్రివర్గాలకూ క్రమంగా ఉపయోగించవలసి ఉంటుందని వాత్స్యాయన ఋషి పలికినాడు. మనువు నాలుగు భాగాలుగా విభజించి ఒక్కొక్క పాదమునకు పాతిక వత్సరాలని నియమించాడు.

రాముని వివాహ సమయానికి అతని వయస్సు 16 సంవత్సరాలు, సీతకు 6 సంవత్సరాలు. (బాలకాండ 17 అరణ్యకాండ. 47) చాణక్యుడు ప్రతిక్షత్రియ కన్యకనూ 16వ ఏట వివాహం జరిగి తీరాలని నీతిశాస్త్రంలో నియమించాడు. కన్యక వయస్సును గురించి లక్షణాలు నానారకాలుగా కనిపిస్తున్నవి.

కన్యకను వివాహం చేసుకోటంలో ఓ అంతరార్థమున్నది. అందు మూలంగా ఆమె భర్తృ గృహవాతావరణాన్ని పొంది గృహస్థ ధర్మాన్ని నెరపే సమయానికి స్వేచ్ఛగా ప్రవర్తించే వీలు కలుగుతుంది.

హిందూ వివాహంలో యువతీయువకుల ప్రమేయం తక్కువ. యువకుల ఉద్రేకోత్సాహాలను అరికట్టే ప్రయత్నము ఇందులో కనిపిస్తుంది. కాని హిందూజాతి వివాహంలో జాత్యభ్యుదయమే ప్రధాన ధర్మమైనట్లు సుస్పష్టంగా గోచరిస్తుంది. వధూవరుల కన్యోన్యమూ అనురాగం లేని వివాహం నిష్ప్రయోజనమైనదనే మాట నిజమే. కాని కాలక్రమేణా కలిగే మానసికమైన అసంతృప్తీ శారీరకమైన అసంతృప్తీ అంతకంటే గొప్పవి.

వరణమంటూ హిందూ వివాహంలో ఒక తంతు ఈ నాడు కనిపిస్తుంది. పూర్వము ఆచారంగా కూడా ఉండి ఉంటుంది. అయితే ఇది అన్యదేశాలలో వలె లింగ సంబంధమైనది (Sexual) మాత్రము కాదు. సంతాన శాస్త్రజ్ఞులు పాశ్చాత్య దేశాలలో జాత్యభ్యుదయాన్ని మనస్సులో పెట్టుకొని రక్షకభటవర్గం చేత బలవంతంగా యువతీయువకులను భార్యాభర్తలు కాదగ్గవారిని ప్రభుత్వమే ఎన్ని వివాహం చేయటము మంచిదని అభిప్రాయపడ్డారు. జంతుకోటిలో ఈ రీతిగ బలవంతంగా ఎద అయ్యేటట్లు చేయించటం వల్ల మంచిజాతి జంతువులు పుడుతున్నవి. హిందువులు సంతాన శాస్త్ర సూక్ష్మాలను ఏ నాడో గ్రహించిన వారు కావటం చేత యువతీయువకుల తాత్కాలిక ఉద్రేకోత్సాహాలకు వివాహ సంస్థను ఒదిలిపెట్టి భగ్నం చేయలేదు.

వివాహ విషయంలో ఆర్యుల గృహ్య సూత్రాలు ఏమని చెప్తుతున్నవో ఈ సందర్భంలో పరిశీలించటం సమంజసము. వివాహం చేసుకునే వారు తల్లివైపూ, తండ్రివైపూ వంశ చరిత్ర జాగ్రత్తగా పరిశీలించటం అవసరమంటున్నారు. కన్యకను తల్లిదండ్రులు, యువకుడూ, మేధాసంపన్నుడూ అయినవాడికి ఇచ్చి వివాహం చెయ్యటము ధర్మమనీ, యువకుడు శుభలక్షణాంగిని సద్వంశజను, నచ్చిన కన్యకను, ఆరోగ్యవంతురాలిని వివాహంచేసుకోవలసి ఉంటుందనీ ఆశ్వలాయనగృహ్య సూత్రాలు చెపుతున్నవి. ఈ అభిప్రాయాలనే ఆపస్తంబాది ఇతర సూత్రకారులూ, పురాణ కర్తలూ బలపరుస్తున్నారు.

వరాహ పురాణంలో కన్యా లక్షణాన్ని గురించి ప్రత్యేకంగా ఒక అధ్యాయమే ఉన్నది. అందులో కన్యక రూపమూ, అవయవ లక్షణాలూ విపులంగా చర్చితాలైనవి. ఇవన్నీ సంతాన శాస్త్రజ్ఞులు అంగీకరించే విషయాలు. వాత్స్యాయనుడు కన్యావరణాధ్యాయంలో ఈ విషయాన్ని కామశాస్త్రానుగుణంగా పరిశీలించాడు.

మానవ, గంధర్వ, యక్ష, దేవ, సత్త్వాదుల క్రింద స్త్రీ పురుష జాతులను రెంటినీ విభజించి, ఆయా జాతివారికి వివాహం జరిగించటం యుక్తమని మన శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఆ కాలంలో ఘటికులనే పేరుతో వంశ సంబంధాలూ, బంధుత్వాదికాలూ, సత్త్వాదికాలూ గ్రహింపగలిగిన వారు వివాహ బంధాలను కుదురుస్తూ ఉండేవారు. అంతేకాకుండా జ్యోతిష శాస్త్రాన్ని వారు ఆధారంగా స్వీకరించేవారు.

మనువు ఒకచోట "ఒక యువకుడు, గుణసంపన్నుడూ, సుశరీరుడూ, రూపసీ దొరికితే పుష్పవతికాని కన్యకనైనా యిచ్చి వివాహం చెయ్యవచ్చు" నని అభిప్రాయ మిచ్చినాడు. కొన్ని కొన్ని కుటుంబాలలో వివాహాలు పనికిరావనీ, ధన ధాన్యాది సంపత్తిని జూచి మోసపోవద్దనీ, సద్గుణ సంపత్తి లోపించిన వారితో వివాహ బంధం పనికిరాదనీ ఆయన అభిప్రాయపడినాడు. బొల్లి, నంజు, కుష్ఠు, మొదలయిన వ్యాధులు వంశంలో ఉంటే వారికి పిల్ల నివ్వకూడదన్నాడు. జుట్టు విశేషంగా ఉన్నవారితో సంబంధం పనికిరాదన్నాడు. మనుధర్మశాస్త్ర వ్యాఖ్యాత అయిన కుల్లికుడు ఆ జబ్బులు సంతానానికి కూడా కలుగవచ్చునని అభిప్రాయమును వ్యక్త పరిచాడు. అయితే ఒకొక్కప్పుడు ఆ పారంపర్య దోషం సంతానానికి కలుగకపోవచ్చును. కాని మనువు ప్రధానోద్దేశం సత్సంతానము. అందువల్లనే వివాహం మంచి కుటుంబాల మధ్యనే జరగవలెనని అభిప్రాయం.

కానీ – మనువు చెప్పిన సూత్రాలనన్నిటినీ తూచా తప్పకుండా అనుసరిస్తే లోకంలో వివాహం కాని వాళ్ళు అనేకమంది మిగిలిపోతారు. చాలామంది బ్రహ్మచారులూ, సన్యాసులూ, జోగులూ – ఉభయ జాతుల్లోనూ ఉంటారు.

ప్రపంచంలో ఉత్తమ కోటికి చెందిన మహా మేధావులును అనేకులను సృజించినది హిందూజాతి. ఏ వ్యక్తి ఐనా స్వయంవ్యక్తిగా నిలవటానికి కారణాలు అతను కొన్ని గుణాలతో పుట్టటమే. అవి వాతావరణం వల్ల అభివృద్ధి పొందుతవని భారతీయ విశ్వాసము. మానవుడు పురుషోత్తమత్వస్థితిని పొందటానికి మూలాలు రెండు.

1. దైవ సంపద, 2. పురుష కారము అని పెద్దలంటారు. ఇందులో మొదటిది అతని పుట్టుకనూ, గుణగణాలనూ, జీవిత ప్రమాణాన్నీ తదితరాలనూ నిర్ణయిస్తుంది. పురుష కారము కేవలమూ వాతావరణానికి సంబంధించినది. ఈ రెండూ మానవాభివృద్ధికీ, సత్సంతాన ప్రాప్తికీ ఆవశ్యకాలని హిందూతత్వ వేత్తల అభిప్రాయము.

బీజ క్షేత్రాలలో బీజమే విశేషశక్తి కలిగినది అని మనువు. లోకంలో ఏ ప్రాణిలోనూ బీజానికి భిన్నమైన ప్రాణి జనించదు. మానవులలోనూ అంతే పురుషుడు బీజము. స్త్రీ క్షేత్రము. స్త్రీలో ఉండే ప్రాణాండము బీజమును వహిస్తుందనీ ఆయన అభిప్రాయము. అందువల్లనే ఆయన ఏకవర్ణ వివాహాలు (Intra - O caste Marriages) అంగీకరించి, వర్ణాంతర వివాహాలు (Iner-O caste marriages) తిరస్కరించినాడు. ఏకవర్ణ వివాహాలు శారీకంగానూ, మానసికంగానూ, దైనందిక వ్యవహారోచితంగానూ 'సరిసాటి' మీద ఆధారపడినవి. మనువును అనుసరించి సరిసాటి వారికి సంపర్కం ఉండకూడదు. ఆయనే ఒకచోట ఏ విధంగానైనా ఏడు తరాల వరకూ ఉత్తమ సంపర్కం కలిగితే, అధమవర్గానికి కూడా కలిగే సంతానం ఉత్తమస్థితికి చేరుకుంటుందని అన్నాడు. ఇందులో గర్భితమైన ముఖ్యసూత్రాన్ని సంతాన శాస్త్రజ్ఞులు అంగీకరించారు.

కన్యావివాహాన్ని గురించి మరోమాట. హిందువులకు స్త్రీ సంతానం కంటే పురుష సంతానం మీద విశేషాసక్తి. వారు ఉత్తమ లోకాలకూ పనికి వస్తారని వారి నమ్మకం. స్త్రీ సంతానం కేవలమూ పరలోకానికే పనికివస్తారు. అందువల్లనే హిందువులు కన్యను, దానయోగ్యమైనను ప్రధాన వస్తువుగా భావించి ఈ దానం మూలంగా ప్రజాపతి చేయబూనిన సంతాన సృష్టికి తాము తోడ్పడుతున్నామని భావిస్తారు. అటువంటి సందర్భంలో దానం కళంకరహిత మైనదై ఉండాలి. లేకపోతే పాపం చుట్టుకుంటుంది. అందువలన ఆమెను కన్యకగా ఉన్నప్పుడే కాళ్ళు కడిగి దానం చేస్తారు.

అసత్సంతానం (అధర్మ సంతానం) కలిగితే అందరూ అసహ్యించు కుంటారు, ప్రపంచంలో వారి వారి వివాహ నియమాలు ఎంత నీరసాలైనా సరే. అందుకనే ఏ లోపమూ లేని కన్యకను దానం చెయ్యడం. ఇటువంటి హిందువులు ఒకానొక కాలంలో 'దేవర న్యాయాన్ని' అంగీకరించారంటే గమనింపదగ్గ విషయం. ఇది కేవలమూ వంశరక్షణ సూత్రం మీద ఆధారపడి ఉంటుందని గమనించాలి. ఒక మగవాడు నష్టపడితే వంశానికీ, దేశానికీ, జాతికీ భంగపాటుగా వారు భావించి ఉంటారు. ఒకానొక కాలంలో పాశ్చాత్య దేశాలలో వచ్చిన చట్టం (Leverite Law) ఇటువంటిదే. ఈ చట్టము ఆ సంతానాన్ని అంగీకరించదు గానీ మఠాధిపతి అనుజ్ఞతో అన్యుని వల్ల సత్సంతానాన్ని పొందటానికి అంగీకరిస్తుంది. ఇది కేవలమూ సంతాన ధర్మాలను మనస్సులో ఉంచుకుని చేసినదని వేరే చెప్పవలసిన పనిలేదు.

హిందూ వివాహం కామతృప్తి కోసం కాక సత్సంతానాని కోసం అది శారీరకావసరమని (Biological Necessity) శాస్త్రజ్ఞులు గుర్తించకపోలేదు. మనువు దీనిని బట్టే ప్రమాణంలో వ్యభిచారాన్ని ఖండించాడు. ఏ విధంగా జింక మొదట కొట్టినవాడిదే ఔతుందో అదేవిధంగా సంతానం భర్తది అన్నాడు. సుశ్రుతాచార్యులు తరువాత కలగబోయే సంతానానికి కావలసిన సమస్తమూ శుక్లంతో ఉన్నదని నాల్గవ అధ్యాయంలో వాక్రుచ్చాడు. అది లింగ శరీర రూపంతో ఉంటుందని అన్నాడు. అయితే వైయక్తిక భేదాల మాటేమిటని చరకాచార్యుడు ప్రశ్నించుకొని, మూడవ అధ్యాయంలో అంధత్వము వికలత్వము మొదలైనవి బీజానికున్నా, గర్భాదాన ఉల్బణకర్మ కలిగేటంతవరకూ ఆ గుణా లంటవని సమాధానం చెప్పినారు. అది కేవలము శరీరమొక్కటే కాదు. ఆత్మ మరొకటున్నదని వారి అభిప్రాయం.

సారాంశము. హిందూ వివాహానికే సత్సంతానము లక్ష్యము. దానికి యువతీ యువకులు తమ బ్రహ్మచర్యాన్ని కొంత కాలం అవలంబించవలసి ఉంటుంది. బ్రహ్మచర్యంలోనే గార్హస్థ్య స్థితికి అత్యావశ్యకాలైన లక్షణాలన్నీ ఉన్మీలితాలై ఉన్నవని హిందూవేత్తల అభిప్రాయం.

*(ఆంధ్రపత్రిక -1948 మార్చి, 24వ తేది)*

# బహు భర్తృత్వం - బహు భార్యాత్వం

అనాది కాలంలో వివాహమనే వ్యవస్థ ఏ విధమైన శాస్త్రాన్నీ అనుసరించి ఏర్పడ్డది కాదు. స్త్రీ పురుష జాతులు రెంటికీ మధ్య ఏర్పడ్డ శారీరక సంబంధం దీనికి మూలమైన ఆధారం. అది క్రమక్రమంగా పరిణామ రూపాన్ని పొందుతూ నేటి వైవాహికసంస్థగా పరిణమించింది. ఆదిలో అది కేవలము శారీరక సంబంధము మాత్రమే. ఈ సంబంధం వల్ల స్త్రీ పురుషులు ఇరువురకూ సంతానం కలగటమూ, కుటుంబాలు ఏర్పడటమూ జరిగింది. అదే తరువాత సభ్య ప్రపంచంలో అనేక నిబంధనలతో ఆచారంగా పరిణమించింది.

అందువల్ల ఎలెన్‌కీ మహాశయురాలు అన్నట్లు 'వివాహము చరిత్రాత్మకమైన సత్యము. ఏ నాడది చరిత్రాత్మక సత్యముగా నిలిచిందో ఆ నాడు ఆ వివాహ వ్యవస్థ శాస్త్రీయ మనిపించుకున్నది. సంఘం నిలవటానికి, వివాహ నియమాన్ని అత్యవసరంగా పరిగణించ వలసి వచ్చినది. మతము దానికి ప్రోత్సాహమిచ్చి సుస్థిరం చేసింది."

ప్రపంచంలో ఉన్న వివాహ విధానాలను గమనిస్తే ఈ అంశాలు వ్యక్తమౌతవి. ఒకానొక కాలంలో వివక్షారహితమైన కామోపభోగం (Promiscuity) లోకంలో ఉండి ఉండవచ్చునని శాస్త్రజ్ఞులు అభిప్రాయమిస్తున్నారు. అటువంటిస్థితిలోనుంచి మానవజాతి బృందవివాహము (Group-Marriage) అమలులోకి తెచ్చుకున్నది. దాని పరిణామ రూపంగా దాంపత్య వివాహము (Pairing Marriage) ఏర్పడ్డది. నిలకడ లేని ఈ దాంపత్యంలోనుంచీ అంతకంటే సుస్థిరమైన ఏకగామిత్వ (Monogamy) వివాహవిధానం ఆధునిక ప్రపంచంలో సర్వజనాంగీకృత వివాహ విధానంగా నిలచి ఉన్నది. ప్రణయ వివాహము (Love Marriage) ఇంతకంటే అత్యుత్తమమైనదని నేటి సభ్య ప్రపంచంలో విశేష ప్రచారం జరుగుతూ ఉన్నది. దాని మంచిచెడ్డలూ ఇంకా పరీక్షితాలు కావలసి ఉన్నది.

లోకంలో అనేక దేశాల్లోనూ అనేక జాతుల్లోనూ బహు భర్తృత్వమూ (Polyandry), బహు భార్యాత్వమూ (Polygamy) సకృత్తుగా కనిపిస్తున్నవి. ఈ వివాహ విధానములు మానవజాతిలో దాంపత్య వివాహం, బృంద వివాహమూ, అమలులో వున్న సంధికాలంలోనే ఏర్పడి ఉంటాయని కొందరు శాస్త్రజ్ఞులు చెపుతున్నారు.

అయితే ఈ రెండు వివాహవిధానాలూ జాతులకు సర్వసామాన్యమైన వివాహ విధానాలు మాత్రం కావు. ఇవి బానిస విధానానికి జాతులలో చిహ్నాలుగా నిలచిన రూపాలని చెప్పవచ్చును. ప్రజాసామాన్యంలో ఏకపతి పత్నీత్వము (Monogamy) మాత్రమే వివాహ విధానంగా కనిపిస్తుంటే, కొందరిలో మాత్రం ఇవి ఆచారాలుగా ఉండటమే వీటి బానిస విధాన లక్షణాన్ని నిరూపిస్తున్నవి.

బహుభార్యాత్వం ముఖ్యంగా బానిస విధానం వల్ల ఏర్పడినదేనని చెప్పవచ్చును. కానీ ఇది కొన్ని కొన్ని ఉద్యోగాలు చేసేవారి విషయంలో మాత్రమే అంగీకారాన్ని పొందింది. పితృస్వామికవిధానం (Partriarchical family System) అమలులో ఉన్న జాతుల్లో కులంపెద్ద, అతని పెద్దకుమాళ్ళు ఒకరిద్దరు తప్ప ఇతరులు అనేకమంది భార్యలను వివాహమాడటం కనిపించదు. జనసామాన్యము ఏకగామిత్వాన్నే అనుసరిస్తుంది. అంటే సామాన్య ప్రజ ఏకపత్నీత్వాన్నే వివాహ ధర్మంగా అంగీకరించి ఆచరిస్తుందన్నమాట! ధనాఢ్యు లైనవారూ, ఉత్తమ కులాల్లో జన్మించామనుకునేవారు బహు భార్యాత్వాన్ని ఆదరిస్తారు. అందులో వారికి భార్యలయ్యే స్త్రీలు బానిసలుగా విక్రీతలైన వారై ఉంటారు. ఒక్కొక్కప్పుడు కొందరు తల్లిదండ్రులు కులగౌరవాన్ని ఆశించో, లేకపోతే తమ మనమళ్ళకు రాజ్యాధికారం రావాలని కోరుకొనో, ఇతఃపూర్వము అనేకమంది భార్యలున్న వానికే కుమార్తెలను ఇచ్చి వివాహం చేస్తుంటారు.

బహు పత్నీత్వ విధానాన్ని పోలినదే బహు భర్తృత్వం (Polyandry) కూడాను. దీని పుట్టుక కూడా బృందవివాహం (Group Marriage) నుంచే వచ్చి ఉంటుందని శాస్త్రజ్ఞులు ఊహ చేస్తున్నారు. 'ఏంజల్సు' మహాశయుడు ఈ విధానాన్ని గురించి ఇలా అన్నాడు :

"ఈ విధానాన్ని గురించి ఊహిస్తే చాలా భయంకరంగా కనిపించవచ్చును. కాని ఇది కొన్ని కొన్ని దేశాలలో – ముఖ్యంగా ముసల్మాను రాజ్యాలలో, కనుపించే జనానా జీవితాలకంటే భయంకరంగా ఉండదు" అని.

బహుభర్తృత్వం అనేది ప్రపంచంలో చాలా అరుదుగా కనిపిస్తూ ఉన్నది. ఈ వివాహ విధానంలో ఒక స్త్రీ అనేకమంది భర్తలతో కాపురం చేస్తుందని వెనుక తెలుసుకున్నాము. ఈ బహుభర్తృత్వానికీ, బృంద వివాహానికీ విశేషమైన తారతమ్యం ఉన్నది. బృందవివాహంలో ఒక జాతిలోని స్త్రీలందరూ ఆ జాతిలోని పురుషులకు, వివాహమాడినా ఆడకపోయినా భార్యలు. ఇందులో మరీ కొన్ని అనాగరక జాతుల్లో అమ్మ, అక్క, చెల్లెలూ – తండ్రి, అన్న, తమ్ముడూ అనే వివక్ష కూడా ఉన్నట్లు కనపడదు.

ఈ వివాహ విధానం దక్షిణ అమెరికా ఇండియన్లలోనూ, అలాస్కా జాతుల్లోనూ, కొన్ని ఆఫ్రికా జాతుల్లోనూ నేటికీ కనిపిస్తున్నది. తిబ్బెత్తు దేశంలోనూ, కాశ్మీరములోనూ, హిమవన్నగప్రాంతాలోని కొన్ని కొండజాతుల్లోనూ, తోడాలలోనూ, కూర్గులలోనూ, నాయర్లలోనూ ఇటువంటి వైవాహిక సంబంధం ఉన్నట్లు సాంఘిక శాస్త్రజ్ఞులు గమనించినారు.

అమెరికా ఇండియన్ జాతుల్లో క్రీ.శ. 1402 ప్రాంతంలో ప్రతి స్త్రీకి తప్పకుండా ముగ్గురు భర్తలుండేవారట! ఆమె నెలల వారీగా ఒక్కొక్క భర్త యింటికి వచ్చి కాపురం చేస్తుండేదట!

మెడగాస్కరు, మలై ఆర్చిపెలగోలలో ఈ ఆచారం నేటికీ సకృత్తుగా కనిపిస్తున్నది. మార్షలు ద్వీపాలలో ఈ ఆచారము విపరీతంగా గోచరిస్తుంది. ఇక్కడ జాతుల వైవాహికాచారాన్ని అనుసరించి భర్తలు రెండు రకాలు. ఒకడు ప్రధాన భర్త. ఇతరులు అప్రధాన భర్తలు. అంటే ఉపపతులన్నమాట! శాస్త్రోక్తంగా వివాహమాడిన భర్త సోదరులు ద్వితీయ శ్రేణికి చెందిన భర్తలు. అంతేకాకుండా ఆమె చెల్లెళ్ళందరూ భర్తకు ద్వితీయ శ్రేణికి చెందిన భార్యలు. వాళ్ళకు పెళ్ళిళ్ళు కాకపోతే ఇతరులను చేసుకోవచ్చును. అప్పుడు వారు వివాహమాడే వ్యక్తులు ప్రధాన భర్త లౌతారు. దీనిని బట్టి ఒక స్త్రీ భర్తలందరూ తప్పకుండా ఏకోదరులు కావలెననిగానీ, ఒక పురుషుని భార్యలందరూ ఏక గర్భజనితలు కావలెననిగానీ నియమం లేదు.

కాశ్మీర సంస్థానంలో ఉన్న 'లౌడకల్' అనే జాతిలో ఈ వివాహ విధానం ఇంకా చిత్రంగా కనిపిస్తుంది. ఒక కుటుంబానికి చెందిన పెద్దకొడుకు ఒక స్త్రీని వివాహం చేసుకుంటాడు. అతని భార్యద్వారా యావదాస్తీ వస్తుంది. అతడే మిగిలిన కుమారుల నందరినీ పోషించవలసి ఉంటుంది. కేవలం పోషణతో నిలువదు. ఆమె అన్నదమ్ములందరికీ సమాన ప్రతిపత్తి గల వ్యక్తి; భార్య, అంతేకాకుండా ఆమె కోరుకుంటే మరికొంతమంది ఇతరులను కూడా వివాహం చేసుకోవచ్చును. అయితే వారికి ఆమె ఆస్తి పాస్తులలో హక్కు కలగదు. ఆ వివాహం కేవలమూ శారీరకభోగం కోసమే.

హవాయి ద్వీపంలో స్త్రీకి తప్పకుండా ఇద్దరైనా భర్తలుండాలి. లేకపోతే సంఘంలో ఆమెకు గౌరవం లేదు. ఆమె భర్తలందరితో ఏకకుటుంబంగా జీవిస్తుంది. ఆమె అందరికీ సమానమైన భార్య. వీరి ఆచార వ్యవహారంలో ఒక స్త్రీ భర్తలందరూ తప్పకుండా ఏకోదరులు కావలెననే నియమం ఉన్నది.

తూర్పు హిమాలయ ప్రాంతంలో 'తెప్చాలన్' అనే జాతివారున్నారు. వారిది ఆటవిక జీవనం. వారిలో బహుభర్తృత్వ మున్నదని ప్రతీతి. కాని ఒక భార్యతో ఇద్దరన్నదమ్ములూ ఏకకాలంలో కాపురం చెయ్యరు. ఒకరు ఊళ్ళో లేనప్పుడు మరొకడు ఆమెకు సాంసారిక సౌఖ్యాన్ని కలిగిస్తుంటాడు. ఈ జాతిలో భార్య ముఖ్యంగా మొదటివాడినే పెళ్ళాడుతుంది. దీనిని బట్టి ఈ విధానం బహుసోదరభర్తృత్వం (Adelphic Polyandry) అని చెప్పవచ్చును. ఈ జాతిలో స్త్రీ ఒక వ్యక్తిని వివాహం చేసుకున్నా అతని తమ్ములందరితోనూ కామ సంబంధం కలిగి ఉంటుంది. అంతేకాకుండా ప్రతి మగవాడూ అన్న భార్యతోనూ, ఆమె చెల్లెళ్ళతోనూ మిథునక్రీడ సలుపుతూ ఉండే స్వేచ్ఛ కలిగి ఉంటాడు. వారికి పెళ్ళి అయినా సరే, కాకపోయినా సరే.

కానీ మరొక చిత్రం గమనించవలసి ఉన్నది. ఒక కులంలో పెద్దవాడు తమ్ముళ్ళ భార్యలతో శారీరక సంబంధం కలిగి ఉండటం ఆత్మబంధు ప్రణయము (Incest) గా భావిస్తారు. తమ వంశంలోగానీ, కుటుంబంలో గానీ పుట్టిన స్త్రీతో సంభోగ సంబంధం కలిగి ఉంటే ఎంతో తప్పిదంగా భావించి, కులంలోనుంచి బహిష్కరిస్తారు.

టర్కీ దేశంలో ఒకానొక కాలంలో బహు భర్తృత్వం తప్ప మరో వైవాహిక విధానం లేదని మెసగటీ అనే చరిత్రకారుని వ్రాతలవల్ల తెలుస్తూ ఉన్నది. అయితే భార్యకు ఎవరివల్ల సంతానం కలిగినా, ఆ సంతానం మీద హక్కు మాత్రం పెద్ద అన్నది. పిల్లలందరికీ తండ్రి అతడు మాత్రమే. మిగిలిన వారు పినతండ్రులు. పిల్లలు అతనిని ఒక్కడినే 'నాన్నా!' అని పిలుస్తారు. భార్య గర్భిణిగా ఉంటే ప్రసవించేటంతవరకూ ప్రథముని దగ్గిరనే ఉంటుంది.

దక్షిణ భారతదేశంలో నాయర్ జాతిలో ముగ్గురు నలుగురు పురుషులు సమష్టిగా ఒక స్త్రీని వివాహమాడుతారు. వారిలో ప్రతి ఒక్కరూ మరి ముగ్గురితోనో, నలుగురితోనో కలిసి మరొక భార్యను వివాహం చేసుకుంటారు. అదేరీతిగా మూడవభార్యనూ, నాల్గవ భార్యనూ, ఐదవ భార్యనూ – ఎంతమందినైనా వివాహం చేసుకోవచ్చును. ప్రతి స్త్రీకి మొదట్లో ఒక పురోహితుడు మంచి ముహూర్తాన తాళికట్టి మొదట తాను వివాహం చేసుకున్న తరువాత ఈ విధంగా జరుగుతుంది.

మెక్లినన్ అనే శాస్త్రకారుడు ఈ వివాహం బహుభర్తృత్వ విధానం క్రింద చేరదని అభిప్రాయపడినాడు. 'గిరాడ్–ట్యూలన్' అనే శాస్త్రజ్ఞుడు చెప్పినట్లు ఇది ఒక విధమైన

సమితి వివాహము (Club - marriage) అని అనవచ్చును. ఇది గుంపు పెళ్ళిలోనే ఒకవిధమైనదని అతని అభిప్రాయము.

బహుభర్తృత్వవిధానంలో పురుషులందరూ బహుభార్యాత్వాన్ని – అంటే బహు గామిత్వాన్ని (Polygamy) పొందుతారు. స్త్రీలు బహుభర్తృత్వాన్ని – అంటే బహుగామిత్వాన్ని (Polyandry) వహిస్తారు. బహుభర్తృత్వవిధానం ముఖ్యంగా మాతృస్వామిక (Matriarchical Family System) సంఘ నిబంధనల వల్ల కలిగి ఉంటుందని ఊహించటంలో విప్రతిపత్తి అణుమాత్రమూ లేదు.

ప్రపంచ వివాహ చరిత్రకారుడు వెస్టర్ మార్కు మహాశయుడు ఈ వైవాహిక విధానాన్ని గురించి ఇలా వ్రాసినాడు :

'బహుభర్తృత్వ బహుభార్యాత్వాలనే రెండు తెగలకు చెందిన వైవాహిక విధానాలనూ రూపుమాపవలెనంటే, బహుభర్తృత్వాన్ని కోరే స్త్రీల దగ్గిర భర్తలను తీసుకోవచ్చి బహుభార్యాత్వం కోరే పురుషుల దగ్గిర ఉన్న స్త్రీలకు వివాహం చేస్తే సరిపోతుందేమో కానీ అది అసంభవము. ఆయా జాతుల స్త్రీ పురుషుల సంఘాలపై ఆధారపడి ఉంటుంది. ఒక జాతిలో స్త్రీలు తక్కువగా ఉండి, పురుషులు ఎక్కువ ఉండటం వల్ల ఈ వివాహం అమలులోకి వచ్చి అటువంటి పరిస్థితులలో ఇటువంటి వ్యవస్థను సంఘం అంగీకరింపలేకపోయింది.'

ఈ వివాహ విధానానికి ఆర్థికావసరాలు కూడా మరో కారణం. దేశంలో ఆస్తిపాస్తులు స్త్రీల పరమైనప్పుడు ఏ స్త్రీ దగ్గర ఆస్తి ఎక్కువగా ఉంటుందో ఆమెను, ఆమె ధనాన్ని అనుభవించ వచ్చుననే కారణంతో ఎక్కువమంది పురుషులు ఏకకాలంలో వివాహమాడటం మూలంగా కూడా, ఇటువంటి విధానం ఆచరణలోకి వచ్చి ఉండవచ్చును.

బహుభర్తృత్వం ఒక విధమైన సంతాన నిరోధక మార్గము. ఒక స్త్రీకి అనేకమంది భర్తలున్నప్పుడు ఒక భర్త వల్లనే విశేష సంతానం కలుగదు. ఇందు మూలంగా ఆస్తిపాస్తుల విభజన కూడా 'సాముదాయిక జీవనం' చేయడానికి అవకాశమున్నది.

కొన్ని కొన్ని జాతుల్లో భార్యకు చెల్లించటానికి కావలసిన కన్యాశుల్కం (Bride Price) సంపాదించుకునే అవకాశం లేకపోవటం వల్లనూ బహుభర్తృత్వం అవలంబించి ఉండే అవకాశమున్నదని వెస్టర్ అభిప్రాయము.

అయితే – మనం బహుభర్తృత్వం ఉన్న జాతుల్లో పురుషులు ఎక్కువగా ఉంటారనీ స్త్రీలు తక్కువని గానీ నిశ్చయించడానికి వీలుండదు. ఈ వివాహ విధానం స్త్రీ, పురుషుల ఆర్థిక ప్రతిపత్తిని బట్టీ, సాంసారిక విధానాన్ని బట్టీ ఏర్పడినది. తరువాత సంఘ ఆచారంగా పరిణమించినది.

కేవలం ఆర్థిక ప్రతిపత్తి మూలంగా ఈ బహుభర్తృత్వ విధానం ఏర్పడుతుందని చెప్పటానికీ వీలు లేదు. ఈ విషయం బహుభార్యాత్వ విధానాన్ని పరిశీలిస్తే వ్యక్తమౌతుంది.

ఆస్ట్రేలియా అనాగరిక జాతుల్లోని 'బుష్‌మన్'లలో ఎంతటి పేదవారికైనా నలుగురైదుగురు భార్యలుంటారు. ఆ జాతిలో కొద్దిపాటి సామంతుడికి పదిమందికి తక్కువ కాకుండా భార్యలుంటారు. 'చెనిక్' జాతి రాజుకు భార్యలని చెప్పుకున్నవారు ఎందరుండేవారో చెప్పలేకున్నారట! కొందరు ఆరువందలన్నారు, మరికొందరు వేయిమంది అనీ, కొందరు వీరిని అయిదువేల వరకూ పెంచినారు. ధర్మశాస్త్రం రాజయినవాడు 8888 మంది కంటె ఎక్కువ భార్యలను వివాహమాడకూడదని ఉన్నదట. ఉగాండా రాజుకు, ఆయన పేరు మొటిస్సా – ఏడు వేలమంది భార్యలుండేవారట! పదహారువేలమంది గోపికలూ చరిత్రాత్మక వ్యక్తులైనట్లయితే మన కృష్ణభగవానుని మించినవాడు ఎవరూ ఇతః పూర్వం పుట్టినట్లు కనిపించటం లేదు. ఇకముందు పుట్టే అవకాశం కూడా లేదనవచ్చును.

ఈ రాజులు ఇంతమంది భార్యలనూ వివాహమాడినారా? అనే ప్రశ్న కలగక మానదు. అయితే వీరిలో ఎక్కువభాగం ఉంపుడుకత్తెలై ఉంటారు. వారికి కూడా భార్య అనే పేరు ఉండేది. ఒక చారిత్రికుని లెక్క ప్రకారము శ్రీకృష్ణరాయలకు నాలుగువేల నూట ఒక్కమంది భార్యలున్నట్లు తెలుస్తున్నది. కానీ ఆయన చిన్నమదేవీ జీవిత నాయకుడు; తిరుమలదేవీ, వరదాంబికలను అగ్నిసాక్షిగా ఆయన వివాహమాడినాడు. మిగిలిన వారి కందరికీ ఆ నాడైనా సంఘంలో విశేష గౌరవం ఉండేది కాదు. భర్త అని చెప్పుకోదగ్గ వ్యక్తిమీద శారీరకమైన హక్కు కూడా ఉండేది కాదు.

పూర్వం చైనాలో రాజు న్యాయసమ్మతంగా ఒక భార్యకంటే ఎక్కువమందిని వివాహం చేసుకోవటానికి వీలు వుండేది కాదు. ఉపపత్నిని మరొకదానిని స్వీకరించటానికి ధర్మశాస్త్రమే అంగీకరించేది. ప్రథమ భార్యకు ఉంపుడుకత్తెమీద విశేషమైన అధికారం ఉండేది.

ఈజిప్టు దేశంలో బహుపత్నీత్వాన్ని ధర్మశాస్త్రం అంగీకరించింది. కానీ ఆచారంలో ఆ వైవాహిక విధానం కనిపించదు. అయినా అది రాజవంశాలలో తప్ప సామాన్యజాతి వివాహ లక్షణంగా ఉండేది కాదు.

బాబిలోనియా దేశంలో హమ్మరీబాయి ధర్మశాస్త్రాన్ని అనుసరించి ఏకపత్నీ వివాహమే – అంగీకృత వివాహము. కానీ భార్యకు రుగ్మత ఏర్పడినప్పుడు మరొక భార్యను వివాహం చేసుకోవచ్చును. లేదా ఉపపత్నిని స్వీకరించవచ్చును.

హిబ్రూ జాతిలో రెండవభార్య పనికిరాదు. అయితే ధర్మశాస్త్రంలో భార్యల మధ్య భర్త ఎటువంటి విభేదాన్నీ పాటింపరాదని కనిపిస్తున్నది. అందువల్ల ఈ భార్యలెవరు అనే శంక కలుగుతుంది. ఆ దేశంలో పురుషుడు సంతానం లేని అన్న భార్యను గానీ, తమ్ముని భార్యను గానీ విధిగా వివాహమాడక తప్పదు. ఇతఃపూర్వము ఆ వ్యక్తికి పెళ్ళి కావచ్చును లేదా కాకపోవచ్చును.

ఇస్రలైటు జాతిలో ఇంతమంది భార్యలు మాత్రమే ఉండవలెననే నియమం లేదు. సోలమన్ రాజుకు ఏడువేలమంది భార్యలట! కానీ టాల్మడ్ అనే వారి గ్రంథం నలుగురికంటే ఎక్కువమందిని వివాహమాడరాదని అనుశాసిస్తున్నది.

అరేబియా దేశంలో మహమ్మదు నలుగురు భార్యలకంటే ఎక్కువమందిని వివాహం చేసుకోరాదని ఆజ్ఞాపించాడు. కానీ ఆయన అమీరులు ఎంతమందినైనా ఉపపత్నులను ఉంచుకొని అనుభవించవచ్చునని అనుజ్ఞ ఇచ్చినాడు. వారికి తోడు ఎంతమంది బానిస స్త్రీలనైనా అనుభవించవచ్చు నన్నాడు. ప్రవక్త ఎంతమందినైనా వివాహం చేసుకోవచ్చునట! ఈ కారణంవల్లనే మధ్యయుగంలోనే జ్యూజాతిలో అంతరించిన బహుపత్నీత్వ విధానము, మహ్మదీయ దేశాలలో ఉన్న జ్యూజాతులో నేడు కూడా కనిపిస్తున్నది.

భారతదేశంలో మహమ్మదీయ రాజులు పరిపాలించిన కాలంలో అమీరులు నలుగురు భార్యలను తప్పకుండా వివాహం చేసుకునేవారట! దానికి బైరంఖాన్ చేసిన క్రింది అనుశాసనం గమనించదగ్గది.

'ఫర్మాయే కర్తే థే కి అమీర్ కేలియే చార్ బీబియాఁ చాహియే. ముసీబత్ ఔర్ బాతోం చీతోం కేలియే ఇరానీ, ఖానా సమాడే కేలియే ఖేర్ సానీ, సేజ్ కేలియే హిందుస్థానీ, చయే తుర్కిణీ, ఉషైహార్ వక్త్ మార్తే దాంతే రహైకి ఔర్ బీబియాఁ దరత్ రహే.'

ఈ నలుగురు భార్యలలో సౌందర్యోపాసనకూ, సంభాషణకూ ఇరానీ స్త్రీ, వంటకు ఖేర్‌సానీ, శయ్యకు హిందుస్థానీ, తుర్కీ భార్య ధర్మానికి, ఇంకా తన్ననూ కొట్టనూ తిట్టనూ అనేకమంది స్త్రీలను పొందవలసిందని బైరంఖాను అభిప్రాయము.

హిందూదేశపు క్షత్రియులలోనూ, మరి కొన్ని కొండ జాతుల్లోనూ బహుపత్నీత్వం పూర్వంనుంచీ వస్తూ వున్న ఆచారం. పూర్వపు గ్రీసుదేశంలో ఏకపత్నీత్వమే చట్టసమ్మతమైన వివాహ విధానం. కానీ 'ప్రియామన్' రాజుకు అనేకమంది భార్యలున్నట్లు చరిత్రలు చెపుతున్నవి. రోమక న్యాయ శాస్త్రం కూడా ఏక పత్నీత్వాన్నే అంగీకరించింది. రెండవ పెళ్ళి చట్టసమ్మతం కాలేదు. అంతేకాకుండా చట్ట సమ్మతమైన "ఎంపికను" (Lawful Concubinage) అంగీకరించింది.

క్రైస్తవ మతము ఏకపతిపత్నీత్వాన్నే ఆదర్శవివాహ విధానంగా అంగీకరించింది. కాని బహుపత్నీత్వాన్ని అంగీకరింపకపోలేదు. బిషప్పులు, డేకనులు బహుపత్నీత్వాన్ని వహింపకూడదని శాసించింది.

పదునారవ శతాబ్దం మధ్యభాగంలో ఐరిష్ రాజు 'డయార్మైట్‌కు' ఇద్దరు భార్యలూ, అనేకమంది ఉంపుడు కత్తెలతో పాటు ఉండేవాళ్ళు. లూథరన్ చర్చివారు ఇచ్చిన అధికారంతో చార్లమెన్ చక్రవర్తి ఇద్దరు భార్యలనూ అనేకమంది ఉంపుడు కత్తెలనూ స్వీకరించాడు.

అంతేకాదు, చక్రవర్తుల విషయంలోనే కాదు - కొందరు మతబోధకుల విషయంలో కూడా బహుభార్యాత్వం అమలులో ఉండినట్లు తెలుస్తున్నది. తరువాత కాలంలో హెస్సీ దేశానికి చెందిన ఫిలిప్పు, రష్యాదేశ చక్రవర్తి ఫ్రెడరిక్ విలియము లూథరన్ చర్చివారి అనుమతితో ఇద్దరు భార్యలను స్వీకరించారు. ప్రాత నిబంధన కొన్ని సందర్భాలలో బహుపత్నీత్వాన్ని అంగీకరించినట్లు తెలుస్తున్నది.

క్రీ.శ. 1680 ప్రాంతంలో అనేకమంది యుద్ధభూమిలో చనిపోయినారు. ఆ ముప్పది మూడు సంవత్సరాల యుద్ధానంతరము వెస్టఫేలియా సంధి జరిగింది. నూరెంబర్గు ఫ్రాంకిష్ ప్రతివ్యక్తీ ఇద్దరిని తప్పకుండా వివాహం చేసుకోవలెనని తీర్మానించుకున్నాడు. అప్పుడు కొన్ని క్రైస్తవ సంఘాలు బహుభార్యాత్వాన్ని ప్రచారం చేసినవి. క్రీ.శ. 1631 ప్రాంతంలో నిజమైన క్రైస్తవుడు కావాలంటే అతడు అనేకమంది భార్యలను వివాహం చేసుకోవలెననే ప్రబోధ నినాదాలు వినిపించినవి.

ఎనిమిదవ హెన్రీ ఒకరి తరువాత ఒకరిని క్రమంగా ఎనిమిది మందిని వివాహమాడటం చరిత్రాత్మకమైన విషయము. సోలమన్‌కు ఎంత మంది భార్యలున్నారో చెప్పటం చాలా కష్టమని స్మిత్‌మైనర్ అనే చరిత్రకారుడు చెపుతున్నాడు.

అలీబాబా అంతఃపురంలో మూడువందల అరవై అయిదుమంది భార్యలు కాపురం చేసేవాళ్ళట! మొరాకో పూర్వరాజు ముల్లా ఇస్మాయెల్‌కు 40 మంది భార్యలుండేవారట. అతడు చనిపోయేనాటికి 548 మంది కుమారులూ, 340 మంది కుమార్తెలూ ఉన్నట్లు వింతల చరిత్ర (History of odd things) వల్ల తెలుస్తున్నది.

ఈజిప్టు చక్రవర్తి రెండవ రామేసస్‌కు మరణ సమయానికి 111 మంది మగపిల్లలూ, 51 మంది ఆడపిల్లలూ 'తండ్రీ' అని పిలిచేవాళ్ళు ఉండేవారు. క్రీ.శ. 1910వ సంవత్సరములో చనిపోయిన సయామ్ రాజు చేలారాముకు 3000 మంది భార్యలు, సంతానం 370 మంది – 134 మగవాళ్ళూ, 236 మంది ఆడవాళ్ళూ.

రాజుల మాటెందుకు? సామాన్యుల విషయంలోనూ అంతే. 'రేయిజ్ పలి' అనే హంగేరీ దేశ వైణికునికి 48 మంది కుమారులు. 'టుటుచ్చి' బెల్జియమ్ బిషప్పుకు 61 మంది కుమాళ్ళు. రిరిలాల్ అనే రష్యాదేశ వర్తకునికి భార్యలు 72 మంది అని చరిత్ర వల్ల తెలుస్తున్నది.

బహుపత్నీత్వం అమలులోకి రావటానికి కారణము స్త్రీ పురుషుల జనసంఖ్య. యుద్ధాల కారణంగా అది తారుమారు పొందటం వల్ల ఈ వివాహ విధానం అమలులోకి వస్తూ ఉంటుంది. అంతే కాకుండా కొన్ని దేశాలలో స్త్రీ జనసంఖ్య విశేషంగా కూడా ఉంటుంది.

అందువల్ల మగవాళ్ళూ ఆడవాళ్ళూ జన సంఖ్యలో సరిసమానంగా ఉన్నంతమాత్రాన ఏకపత్నీత్వం అమలులో ఉంటుందని చెప్పలేము. జనసంఖ్య సరిసమానంగా ఉన్నంత మాత్రాన 'ఏకగామిత్వాన్ని' మాత్రమే చట్ట సమ్మతమైన వివాహ విధానంగా శాసించటానికీ అవకాశం ఉండదు. అనాగరకజాతుల్లో స్త్రీలు విశేషంగా ఉండటం వల్ల బహుపత్నీత్వం అమలులో ఉంటుందని శాస్త్రకర్తల అభిప్రాయం.

ప్రపంచ వివాహ చరిత్రకారుడు వెస్టర్ మార్కు మహాశయుడు బహు భార్యాత్వానికి ఈ క్రింది కారణములను చూపినాడు. 1. జన సంఖ్య – పురుషులకంటె ఒక జాతిలో గాని దేశములోగాని అధికముగా ఉండటము, 2. స్త్రీ పురుష గృహజీవన విధానంలో

శారీరక (Physical) ఉద్వేగ (Emotional)) వైజ్ఞానిక (Intellectual) ప్రతిపత్తులలో సామ్యం లేకపోవటము 3. స్త్రీలలో సహజలక్షణాలైన ఋతుధర్మము, గర్భధారణమూ కారణముగా పురుషుడు అనేకమందిని వివాహమాడటమూ. తన తృప్తికోసము అనేకమంది వ్యక్తులతో ఏకకాలంలోనే కాపురం చేయవలెననే కోరిక వల్ల పురుషునిలో కలిగే దక్షిణ నాయక లక్షణమూ, నవతాప్రియత్వమూ. 4. సంతానమూ, ఆస్తిపాస్తులు.

ప్రాచ్యదేశాలలో 'ఆస్తి' ముఖ్యంగా బహు భార్యాత్వానికి దారి తీస్తుంది. ఆత్మబీజ జనితునికే ఆస్తిని సంక్రమింపచేయవలెననే ఆకాంక్ష ప్రాచ్యజాతుల్లో విశేషము. జపాను దేశంలో ఉంపుడు కత్తెవల్లనైనా కులధర్మాన్ని నిలపటానికి సంతానాన్ని పొందవచ్చును. సంతానం కోసం ఎందరినైనా వివాహం చేసుకోవటం ప్రపంచంలో అనేక జాతుల్లో ఆచారంగా నేటికీ కనిపిస్తూ వున్నది.

బహుభార్యాత్వ వివాహానికి భౌతికమైన లాభం కూడా మరొక కారణం. అనేకమంది భార్యలను వివాహం చేసుకోవటం వల్ల పూర్వకాలంలో రాజుల ప్రాపకం అభివృద్ధి పొందింది. అంతేకాదు, ఒక గౌరవనీయమైన రాజవంశంలో జన్మించినవానికి తాను నాల్గవ భార్య ఐనా గౌరవ ప్రదంగానే భావించేది స్త్రీ. అతని ఆస్తిపాస్తులను అనుభవించటానికి అవకాశం కలుగుతుందనే దృష్టి కూడా ఇందులో ఇమిడి లేకపోలేదు.

లోకంలో ప్రకృతి సహజమైన వైవాహిక ధర్మము (Natural Instindct) బహుగామిత్వము (Polygamy). అనేకమంది భార్యలను వివాహం చేసుకోవటం వల్ల సగటున సంతానం పెరుగుతుందనీ, దానిమూలంగా భౌతిక లాభం చేకూరుతుందనీ అనుకోవటం కూడా పొరబాటు. బహుపత్నీత్వం విశేషంగా ఉన్నా, బహుభార్యాత్వము విశేషంగా ఉన్నా సంతానం అభివృద్ధి పొందదు.

పెద్ద పెద్ద సంసారాలుండటం గొప్పగా భావించే కొన్ని అనాగరక జాతుల్లో నేటికీ బహుపత్నీత్వం విరివిగా అమలులో కనిపిస్తుంది. వారి విషయంలో ఆర్థికమైన అభ్యంతరాలు లేవు. ఆర్థికంగా నిలవలేని స్థితిగల జూలూ దేశస్థుడయినా తప్పకుండా ముగ్గురినైనా వివాహ మాడతాడు. పూర్వ మధ్య ఆఫ్రికా జాతుల్లో మగవానిని భార్యలే కూర్చోబెట్టి పోషిస్తారు. అతనికి కూలీ ఖర్చు లేకుండా అన్ని పనులూ వాళ్ళే చేస్తారు.

పూర్వం రష్యా దేశంలో మరొక ఆచారం ఉండేదట. రష్యా దేశస్థుడు వ్యక్తుడుగాని కుమారుని కోసం ఒక కన్యకను తానే వివాహ మాడి అతడు పెద్దవాడైన తరువాత అతనికి ఒప్పచెప్పేవాడట. అంటే – ఆ రైతుకు ఆమె ఖర్చులేకుండా 'కూలి మనిషి' అన్నమాట. ఆమెవల్ల అతడు సంతానం కనవచ్చును. కుమారుడు పెద్దవాడయిన

తరువాత ఆ బిడ్డలను కుమారుని సంతానంగానే వ్యవహరిస్తారు. అతిథి పూజనము కోసం అనేకమంది భార్యలను చేసుకోవటము జాతిలో కనిపిస్తుంది.

అనాది మానవ సంఘంలో స్త్రీ పురుషులకు సమానత్వ ముండేది. కాని మానవ ఆటవిక జీవితంలో సంసారానికి తగినంత ప్రాధాన్యం లేకపోవటం వల్ల స్త్రీలకు స్వాతంత్ర్యం గానీ, స్వామిత్వం గానీ అబ్బలేదు.

కాలక్రమేణా కొన్ని జాతుల్లో సాంఘిక ప్రాధాన్యం సంక్రమించి నప్పుడు ఆర్థిక ప్రాభవం గల స్త్రీలను ఆర్థిక ప్రాపకం కోసమూ, సంఘ ప్రాధాన్యతం కోసమూ అనేకమంది పురుషులు వివాహమాడే ఆచారం వచ్చింది. దానినే శాస్త్రం బహు భర్తృత్వం (Polyandry) అన్నది. ఈ నాటికీ ప్రపంచంలో అక్కడక్కడ అనాదిగా కొన్ని అనాగరక జాతుల్లో బహుభర్తృత్వ వివాహ విధానము అమలులో ఉన్నది.

పురుషుడికి ప్రాధాన్యం లభించే స్వామిత్వం కాలక్రమేణా స్త్రీలందరూ అతని బానిసలు కావడం ఆరంభించారు. ఆర్థిక సంపదను చూచో, సంపన్నతను చూచో, సాంఘిక ఔన్నత్యాన్ని చూచో ఒక పురుషునికే అనేకమంది భార్యలుకావటము గౌరవ ప్రదమని భావించేవారు. దానిని ఒకానొక వివాహ సంస్థగా పరిణమించిన తర్వాత శాస్త్రకర్తలు దానినే బహుభార్యాత్వ వివాహమన్నారు.

ప్రపంచ తాత్త్విక భావసంఘంలోని మహారచయిత బెర్నార్డ్ షా ఈ వివాహ విధానాలను గురించి ఇలా అభిప్రాయపడ్డాడు

‘బహుపత్నీత్వం మీదగాని బహుభార్యాత్వం మీద గానీ అసహ్యం కలిగేలా లోకంలో ఏకగామిత్వము (Monogamy) ఆచరణలోకి వచ్చిందని అనుకోవటం జరిగింది. దీనికి ముఖ్యమైన కారణం – స్త్రీల సంఖ్య పురుషుల సంఖ్య దరిదాపు సరిసమానం కావటంతో, ఎక్కువమంది భర్తలున్న స్త్రీకంటే తక్కువమంది భర్తలున్న స్త్రీకే విశేష సంతానం కలుగుతుంది.

‘ప్రతి మగవాడూ ఇద్దరు భార్యల కంటే ఎక్కువ భార్యలుంటే కామశక్తిని గురించిన కొలమానాన్ని దూరంగా ఉంచినా, అతని రాబడి, మూడురెట్లు పెరగవలసి ఉంటుంది. ఆర్థికంగా ఆలోచిస్తే లోకంలో ప్రతి ముగ్గురికైనా ఇద్దరు భార్యలు ఉండే అవకాశం లేదు.

‘స్త్రీలు బహు భర్తృత్వాన్ని ఎందుకు వద్దనుకుంటారు, ఇందుకు కారణం? ప్రతి స్త్రీకీ భర్త దొరికే అవకాశం లేకుండా భర్తలుగా పురుషులనందరినీ కొందరు

స్త్రీలే ఉంచుకునే అవకాశం ఉండటం వల్ల. పురుషులు బహుభార్యాత్వాన్ని నిరసిస్తారు. ఇందుకు కారణం ప్రతి పురుషుడికీ భార్య లభించే అవకాశం లేకుండా ఉంటుంది కాబట్టి. అందువల్ల సర్వసామాన్యులైన స్త్రీ పురుషులిద్దరూ ఏకగామిత్వాన్నే (Monogamy) కోరుకుంటారు. అందువల్ల బహుభార్యాత్వాన్ని నెత్తికెత్తబోతే సామాన్యమైన పురుషులు వ్యతిరేకిస్తారు. అదేవిధంగా బహుభర్తృత్వాన్నీ సామాన్య స్త్రీలు వ్యతిరేకిస్తారు.

ఉత్తమ శ్రేణికి చెందిన స్త్రీలు గానీ పురుషులు గానీ లేకపోవటం వల్లనే బహుభార్యాత్వం, బహుభర్తృత్వమూ లోకంలో ఆచరణలో నిలవక తప్పటం లేదు. లోకంలో ఏ పురుషుడూ కూడా తన శక్తిని మించినంతమంది భార్యలను పోషించలేడు. కాబట్టి చట్టసమ్మతంగా బహు భార్యాత్వాన్ని రద్దు చేయవలసిన అవసరం అగత్యమైంది. ఆ విధానం కొలదిగా ఏ మూలనో ఉన్నా విశేష ప్రమాదం లేదు.

***(ఆంధ్రపత్రిక 1948, ఏప్రిల్ 28)***

# వివాహము - ఏకపత్నీత్వము

అనాది కాలంనుంచీ సంఘానికి మూలాధారాలైన స్త్రీ పురుషుల పరస్పర శారీరక సంబంధం అనేక కారణాల మూలంగా మార్పులు పొందుతూ నేటి వివాహ వ్యవస్థగా పరిణమించింది. స్త్రీ పురుషుల శారీరక సంబంధం వల్ల సంతానము కలగటమూ, తన్మూలంగా కుటుంబాలు ఏర్పడటమూ జరిగి ఉంటుంది. అదే క్రమక్రమంగా మానవ జాతుల్లో ఆచారంగా పరిణమించి ఆయా కాలాలల్లో చట్టసమ్మతమైన వివాహంగా అంగీకృత మౌతూ వచ్చింది.

వివాహ వ్యవస్థకు ఆదిమ రూపం స్త్రీ పురుషుల శారీరక సంబంధం. దాని స్వరూప స్వభావాదులను గురించి శాస్త్రజ్ఞులు భిన్నాభిప్రాయాలను వెల్లడించారు. కొందరు ఒక జాతిలోని స్త్రీ పురుషులు యావన్మందీ తల్లి, చెల్లెలు, అన్న, తమ్ముడు అనే వివక్ష లేకుండా కామోపభోగం నెరపుకున్నారని అభిప్రాయపడినారు. కొందరు అటువంటి వివక్షారహిత కామోపభోగం (Sexual Promiscuity) ఉన్నదని నిరూపించటానికి తగిన ఆధారాలు లేవనీ, అటువంటి స్థితి మానవునికి పూర్వరూపమైన వానర జాతిలోనే కనిపించదనీ పలుకుతున్నారు.

ఒక మాట మటుకు సత్యము. ఆదిమ మానవ జాతుల్లో నేటి సంఘంలో కనిపిస్తూ ఉన్న నీతినియమాలూ, విధినిషేధాలూ లేవు. ఒకానొక స్థితిలో మానవజాతిలో స్వీయ బంధు ప్రణయము (Incest) ఉన్నదని అంగీకరించటానికి తగిన ఆధారాలు కనిపిస్తున్నవి. ఈ పద్ధతి ననుసరించి అన్నాచెల్లెళ్ళూ, అక్కాతమ్ముళ్ళూ, తల్లీకుమాళ్ళూ భార్యాభర్తలు కావచ్చును.

అనాది మానవ కుటుంబాలు (Families) ఇటువంటి వివక్షారహితమైన కామోపభోగస్థితి నుంచే ఉద్భవించినవని మోర్గన్ పండితుని అభిప్రాయము. నేడు ఇటువంటి శారీరక సంబంధాన్ని గానీ, వైవాహిక ధర్మాన్ని గానీ నిరూపించే జాతి ప్రపంచంలో ఎక్కడా కనిపించటం లేదు.

తరువాతి కాలంలో వివాహ వ్యవస్థలో ఒక మార్పు వచ్చింది. ఏక గర్భ జనితులైన సంతానం వివాహమాడరాదనే నియమం ఏర్పడ్డది. తల్లీబిడ్డల మధ్య కామభోగం నిషిద్ధమైనది. ఇది వైవాహిక విధానంలో రెండో మెట్టు. అందుమూలంగా మానవ

జాతులు వెనుక గుంపులుగా జీవిస్తూ గుంపు పెళ్ళిళ్ళు (Group Marriages) చేసుకుంటూ ఉండేవారు. సహచరీ వివాహానికి (Punatiar Marriages) అలవాటు పడి, ప్రత్యేక కుటుంబాలుగా ఏర్పడవలసి వచ్చింది. ఈ వివాహ విధానంలో అనేక రకాలైన మార్పులతో వివాహం జరగటానికి అవకాశం ఉన్నది. అయితే – ప్రధానాంశం ఒకటే. ఒక కుటుంబంలోని పురుషులందరికీ సమష్టిగా ఆ కుటుంబంలోని స్త్రీలందరూ భార్యలై ఉంటారు – పుట్టుకతోనే. వారు మాత్రము తల్లీకుమాళ్ళూ, అన్నాచెల్లెలూ, అక్కా తమ్ముడూ కాకూడదు.

ఈ వివాహ విధాన పరిణామ రూపంగా దంపతీవివాహము (Pairing Marriage) ఏర్పడ్డది. ఒక పురుషుడు ఒక స్త్రీతో తాత్కాలికముగానో, లేక కొంతకాలమో వైవాహిక ధర్మాన్ని కలిగి ఉంటాడు. గుంపు పెళ్ళిలో వివాహము వ్యక్తిపరము కాదు. ఈ రెండు విధానాలలోనూ అది వ్యక్తిగతము.

గుంపు పెళ్ళిళ్ళు క్రమంగా ప్రపంచంలో అంతరించిపోయినవి. దాంపత్య వివాహాలు (Pairing Marriages) ఆచారాలైనవి. ఈ విధానంలో బహుపత్నీత్వము ఉండకపోదు. ప్రతి మగవాడికీ అనేకమంది భార్యలున్నా వారిలో ఒకతె మాత్రమే ప్రధాన భార్య అయి ఉంటుంది. బహుభర్తృత్వము ఉన్న జాతుల్లో అనేక మంది భర్తలున్నా ఆ స్త్రీకి ఒకడే ప్రధాన భర్తగా వ్యవహరిస్తాడు. ఇంతేకాదు – జాతుల్లోని స్త్రీ పురుషులు ఇద్దరూ అప్పుడప్పుడూ కామతృష్ణను తీర్చుకోవటానికి ఈ దాంపత్య వివాహబంధాన్ని అతిక్రమించి అన్య స్త్రీ గమనమూ, స్త్రీ పరపురుష గమనమూ చేయటానికి అవకాశముండేది. కాని, స్త్రీ విషయంలో ఈ హక్కు ఎంతోకాలం నిలువలేదు. స్త్రీ ఒక పురుషునితో సహచరించటం ప్రారంభించింది మొదలు, ఏ జాతీ ఆమెపట్ల పరపురుష గమనాన్ని అంగీకరించలేదు. దానికి వ్యతిక్రమం జరిగితే కఠిన శిక్షకు పూనుకున్నవి కూడాను.

మాతృస్వామికాలైన కుటుంబాలలో (Matriarchical Families) బహుభర్తృత్వమూ (Polyandry), పితృస్వామికాలైన కుటుంబాలలో (Patriarchical Families) బహు భార్యాత్వమూ అన్ని కాలాలలోనూ కనిపించినా, ఈ ద్వివిధ వివాహాలూ ఆర్థికంగా అనేకమైన అవస్థలను తెచ్చిపెట్టటం చేత, ఏ నాడూ ఇవి ప్రబలంగా జాతి కంతటికీ వైవాహిక విధానాలుగా ఉన్నవని చెప్పటానికి అవకాశం లేదు.

దాంపత్య వివాహ విధానంలో వివాహ విచ్ఛేదానికి ఏ నిమిషాన పట్టినా అవకాశం ఉన్నది. అందులో కష్టమేమీ లేదు. నిబంధనలు లేవు. పూర్వంనుంచి వలెనే పిల్లలు తల్లికి చెందుతారు.

రక్తసంబంధం ఉన్న బంధువులతో వివాహ బంధాలు దూరమవటం దాంపత్య వివాహంతో ప్రారంభం. అందుమూలంగా కన్యకకు సవ్యమైన వరుణ్ణీ, వరుడికి సవ్యమైన కన్యకనూ వెతకటం ఆచారమైంది. ఒక ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు "దాంపత్య వివాహం మూలంగా రక్త బంధువర్గంతో వివాహం జరగటానికి వీలులేకపోయింది. ఇతఃపూర్వం బంధుత్వం లేనివారితో వైవాహిక సంబంధాలు నెరపవలసిన అగత్యం కలగటం చేత, జాతుల్లోని వ్యక్తులు, మానసికంగానూ, శారీరకంగానూ, బలవంతులు కావటం ప్రారంభించారు. శారీరకంగానూ, మానసికంగానూ బలంగల రెండు జాతులుగాని, రెండు కుటుంబాలు గానీ వైవాహిక బంధంతో ఏకమై ఒక జాతిగా గాని, ఒక కుటుంబంగా గానీ పరిణామాన్ని పొందేటప్పుడు వారికి కలిగే సంతానంలో మేధ విస్తారమై, ఉంటుంది. రెండు జాతుల శక్తులూ, రెండు కుటుంబాల శక్తులూ ప్రత్యేకతలూ వారిలో ప్రతిఫలిస్తవి" అని అభిప్రాయమిచ్చినాడు.

అంటే – క్రమక్రమంగా రక్తసంబంధం కలవారిని అధికం చేసుకుంటూ, వారితో వైవాహిక బంధాలను నిషేధిస్తూ ఉండటం వల్ల దాంపత్య వైవాహిక విధానం అమలులోకి వచ్చింది. మొదట జాతిని స్త్రీ పురుషులనే రెండు జాతులుగా విభజించటమూ, తదుపరి ఆత్మబంధు ప్రణయాన్ని అరికట్టటమూ జరిగింది. దాంపత్య వివాహ ధర్మానికి పరిణామ రూపంగా ఏకపత్నీ వివాహము (Monogamy) వైవాహిక విధానంగా అవతరించింది.

దాంపత్య వివాహం అమలులో లేని కాలంలో పురుషులకు స్త్రీలు కోరుకున్నంత మంది దొరికేవారు. ఈ వివాహం వల్ల స్త్రీలు కొందరికి మాత్రమే భార్యలైనారు. పుట్టుకతోటే భార్య అనిపించుకునే స్త్రీ పురుషుడికి గుంపు పెళ్ళి విధానంలో ఉన్న రీతిగా ఉండే అవకాశం పోయింది. అందుమూలంగా దాంపత్య వివాహంతోపాటు రాక్షసవివాహమూ (Marriage by Capture), క్రయ వివాహమూ (Marriage by Purchase) వైవాహిక ధర్మాలుగా ఒకదానికొకటి తోడుగా ఉంటూ ఉండేవి. అయితే ఇవి భార్యలను పొందే మార్గాలలో భేదాలే గాని ప్రత్యేక వివాహ సంస్థలుగా పరిగణింపదగ్గవి కావు.

ఏక పత్నీత్వము (Monagamy) మిథున వివాహానికి (దాంపత్య వివాహానికీ) పరిణామ రూపము. ఇది అనాగరక జాతి ప్రాథమిక ద్వితీయావస్థలలో అవతరించింది. ఈ విధానం ప్రపంచంలో అమలులోకి రావటం మూలాన క్రమక్రమంగా నాగరికత అభివృద్ధి కావటం ప్రారంభించిందన్నమాట.

ఈ వివాహ విధానాన్ని గురించి వ్రాస్తూ ఎలెన్‌కీ మహాశయురాలు ఇలా అన్నది.

"ఏకపత్నీ విధానము అనేక కారణాలవల్ల విజయవంతమైనది. ఇందుమూలంగా ఇతః పూర్వము స్త్రీలకోసం పురుషులలో జరిగే అంతఃకలహాలు నశించినవి. పురుషులు వారి శక్తిని వైజ్ఞానిక ప్రపంచ పర్యవేక్షణ వైపునకు త్రిప్పటానికి అవకాశం లభించింది. స్త్రీ పురుషులదృష్టి సంతాన ప్రాప్తి వైపుకు మొగ్గించి, స్త్రీ పురుషుల కార్యక్రమ విభాగము (Division of work) ఏర్పడ్డది. నిలకడైన జీవితం ఏర్పడ్డది. సంతానం కారణంగా స్త్రీ వెనుకటివలె పురుషుని ఇష్టానిష్టాలకు లొంగిపోవలసిన అగత్యం తప్పిపోయింది. స్త్రీ పురుషుల సాంసారిక జీవనానికి ఒక ఉదాత్తత లభించింది. ఈ వివాహ విధానం మూలంగా స్త్రీ పురుషులలో సహకార భావం వృద్ధి పొందింది. వారి ఇరువురి మధ్యా అన్యోన్యానురాగాన్నీ, దయాదాక్షిణ్యాలనూ ఏర్పరిచింది. భర్తకు స్వామిత్వం లభించింది. దానితోబాటు పోషణ భారం పైన బడ్డది. స్త్రీ పురుషుని మీద జీవనభృతికి ఆధారపడవలసి వచ్చింది. నిజమే కాని "సత్సంతానవతి" ననే ఆనందాన్ని పొందే సదవకాశం లభించింది."

మొట్టమొదట చరిత్రలో 'ఏకపత్నీత్వ విధానము' స్త్రీ పురుషుల సమానత్వం కోసం ఉద్భవించలేదు. ఎన్ని మాటలు చెప్పినా అనాది సంఘంలో స్త్రీ కున్న గౌరవం ఏకపత్నీ వైవాహిక ధర్మమైన సంఘంలో ఆమెకు లేదు. ఆమె ఒక విధంగా పురుషునికి బానిస ఐపోయినది అని చెప్పవచ్చును. ఏకపత్నీ వివాహ కాలానికి పూర్వము స్త్రీ పురుష జాతులు రెంటికీ పరస్పరాధిక్యాలకోసం అంతర్యుద్ధాలు జరుగుతూ వచ్చినవి. వాటి ఫలితంగా స్త్రీ జాతి ఓడిపోయింది. పురుష జాతి జయించింది.

అయితే – ఈ వివాహ విధానాన్ని కావలెనని కోరుకున్న వారు స్త్రీలేనని జేచేఫన్ వంటి శాస్త్రజ్ఞుల అభిప్రాయము. అనాది మానవ జాతి ఆరణ్యక జీవనం నశించటం ప్రారంభించింది. వైవాహిక విధానాలు క్రమక్రమంగా మార్పు పొందినవి. ప్రాచీన కాలంలో ఉన్న సామ్యగృహ జీవన విధానం నిలవటానికి తగిన అవకాశాలు తక్కువైపోవటం ప్రారంభించినవి. వారికి ఒక నూతనమైన ఆర్థిక విధానం, జీవిత లక్షణ లక్ష్యాలూ ఏర్పడుతూ వచ్చినవి. ఈ నూతన విధానంలో స్త్రీలకు బాధ కలగటం ప్రారంభించింది. అది కారణంగా వారు తాత్కాలికంగా గానీ, మరికొంత కాలంపాటు గాని ఒక పురుషునితోటే వైవాహిక జీవితం గడప నిశ్చయించుకున్నారు. అందుకు స్త్రీ పావిత్ర్యాన్నీ పాతివ్రత్యాన్ని అభిలషింప ప్రారంభించింది. పురుషుడికి తనను పాలింపను పట్టాభిషేకం కట్టింది.

వైవాహిక విధానంలో ఏకపత్నీత్వమనే మార్పు పురుషజాతివల్ల కలగలేదని చెప్పటానికి శాస్త్రజ్ఞులు ఒక కారణం చూపిస్తున్నారు. అది స్వేచ్ఛా ప్రణయము. ఈ ప్రణయము అనాదికాలంలో స్త్రీ పురుషులకు సరిసమానంగా ఉంటూ వచ్చింది. ఈ నాడు స్త్రీలకు లేదు. దీనిని పురుషులు అనుభవిస్తున్నారు. అటువంటి పురుష స్వేచ్ఛా ప్రణయాన్ని ఏ దేశమూ ఏ జాతీ బహిష్కరించలేదు. చివరకు ఎబ్బెట్టుగానైనా చూడటం మానివేసింది. స్త్రీలు అనుభవించటానికి ప్రయత్నిస్తే సంఘం వారిని బహిష్కరిస్తున్నది.

కామం మాట అటుంచినా, ఏకపత్నీత్వ విధానం మూలంగా దాంపత్య వివాహ కాలంలో ఉన్న స్త్రీ జాతి సాంఘిక ప్రతిపత్తి (Social Status) కూడా నశించింది. దాంపత్య కాలంలో స్త్రీల ఆధిక్యాన్ని గురించి ఒక యాత్రికుడు తన యాత్రలలో తిరిగి పొందిన అనుభవాలను వ్రాస్తున్నాడు.

"స్త్రీలు ఇతర కులాల్లోని భర్తలను గురించి సామ్య జీవన విధానమున్న ఇళ్ళలో నివసిస్తారు. అందువల్ల ఆ ఇళ్ళకు వర్గ యద్విధమైన ప్రాధాన్యం లేదు. వాళ్ళకు సంబంధించిన ధాన్యరాశులు అన్నీ ఒకటే. వాటిలో నుంచే అందరూ పంచుకుంటుంటారు. అదృష్టం లేని భర్త ఎవరైనా కాపురం చేస్తుంటే, అతడు సంపాదించ లేకపోతే, అతణ్ణి గొంగళీతో సహా ఏ నాడు బయటికి పొమ్మంటే ఆ నాడు నడవవలసిందే. అటువంటి సందర్భంలో పిల్లలు గానీ, ఇంట్లో ఆస్తిపాస్తులు గానీ వెంటరావు. అతడు వట్టి చేతులతో తిరిగి తండాల్లోనికి వెళ్ళి పోవలసి వస్తుంది. ఈ జాతుల్లో ఆడవారు శక్తిసంపన్నులు, అవసరమైతే వాళ్ళు మగవారి నెత్తిమీద కొమ్ములూడగొట్టి కూర్చోబెట్టగలరు." ఇటువంటి ఆధిక్యం ఏకపత్నీత్వం ఆచరణలో వచ్చిన తరువాత తారుమారవుతూ, పూర్వకాలంలో పురుషుల న్యూనభావపరంగా మారిపోయింది.

ఏకపత్నీత్వ వివాహ విధానం కుటుంబ సాంఘిక స్థితిలో అనంతమైన మార్పు కల్పించింది. ఇతః పూర్వమున్న వైవాహిక విధానంలో సంతానం తల్లిని తప్ప తండ్రిని గుర్తించలేదు. ఇప్పుడు వారిని పాలించి పోషించడానికి తండ్రికి సమాన ప్రతిపత్తి లభించింది. సామాజిక వివాహ విధానంలోని తండ్రుల కంటే ఈ తండ్రికి బిడ్డలమీద మమకారమూ, తహతహా అధికము కాదు. సంతానం పురుషుడిది. ఆస్తిపాస్తులన్నీ అతనివి. అతని ఆస్తికి ఉత్తరాధికారులు సంతానము. ఈ సంతానం కారణంగా పురుషుడు ఆస్తిపాస్తులను సంపాదించటమూ అభివృద్ధి పొందటమూ జరుగుతుంది.

వ్యక్తిగతమైన సంపత్తి (Private Property) కారణంగా లోకంలో పాలితులు, పాలకులుగా మానవజాతి విభజితమై పోయింది. మనిషిని దోచుకొని ఒక జాతి, ఒక వ్యక్తి బాగుపడటం నేటి ఆర్థిక విధానము. దీనికి మూలకారణము వ్యక్తిగత సంపత్తి; భంగ్యంతరముగా సంతానం. ఇవి రెండూ ఏకపత్నీ వివాహ విధానం వల్ల ఏర్పడ్డవి.

దాంపత్య వివాహ విధానంలో తండ్రి ఆహారాన్ని తెచ్చేవాడు. తల్లినీ పిల్లలనూ పోషించేవాడు. వారిరువురి మధ్యా కలహ కారణాలున్నప్పుడు తండ్రి వెళ్ళిపోతూ అతని సామగ్రి పుచ్చుకుని వెళ్ళేవాడు. తల్లి ఆమె సామగ్రి పెట్టుకొని ఇంట్లో ఉండి మరో తాత్కాలిక భర్తను చూచుకునేది. అంటే విచ్ఛేదం, ఇబ్బంది గానీ ఆంక్షగానీ లేదన్నమాట. ఏకపత్నీ వివాహంలో ఒక పక్షం అంగీకరించినా ఇరువురూ అంగీకరించినా సంతాన కారణంగా సంఘమూ, ప్రభుత్వమూ, మతమూ భార్యాభర్తల మధ్య వివాహ విచ్ఛేదము అంగీకృతం కాదు.

ఏకపత్నీత్వ విధానంలో ఆదర్శం ఒకదారి తీసింది. ఆచారం మరొక దారి తీసింది. ఏక పత్నీత్వం ఆచారంలో ఉన్న ఏ దేశంలోనూ మతగ్రంథాలనూ, పురాణాలనూ పరిశీలిస్తే స్త్రీకి విశేష గౌరవం కనిపిస్తుంది. కాని వ్యవహారంలో ఆ రీతిగా ఉండదు. స్త్రీని అతి ఉదాసీన భావంతో చూడటం సమస్త దేశాలలోనూ పొడకట్టుతున్నది. స్త్రీలనూ, సంతానాన్ని పని యంత్రాలుగా పరిగణించి వారిని శుల్కాల క్రింద మార్చుకోవటమూ, వాణిజ్య పదార్థాల క్రింద భావించి, వారి ఇష్టానిష్టాలతో ఈషత్తైనా ప్రమేయం లేకుండా అతిథి పరిచర్యలకూ, మిత్రకోటి ఆనందానుభవాలకూ ఉపయోగించారు. అన్యదేశాలను జయించి తెచ్చిన బానిసకన్యల కిచ్చిన గౌరవం కూడా ధర్మపత్నులకీయని రారాజులు చరిత్రలో లెక్కకు మిక్కిలిగా కనిపిస్తున్నారు. ఎప్పుడైనా పురుషులు భార్యను గౌరవించినట్లు కనిపిస్తే అతనికి వారసులైన పుత్రులను ఉత్పత్తి చేసే యంత్రమనే భావంతో తప్ప వ్యక్తిగత ప్రణయం మూలంగా గానీ, తన అర్ధాంగి అనిగానీ కాదు. ఆడ బానిసల మీద అధికారాన్ని ఆమెపరం చేసి భార్యను తృప్తి పరచినారు. అయితే ఆమె కంటి ముందే రాజవంశాలలోని పురుషులు వారిని ఉపపత్నులనుగా స్వీకరించి భోగిస్తుంటే ఆమెకు కిక్కురుమనే అధికారం లేదు. ప్రపంచంలో అన్ని జాతుల్లోనూ ఏకగామిత్వం (Monogamy) ఇదేరీతిగా నడిచింది.

అంటే ఏకగామిత్వ మనేది కేవలమూ స్త్రీ జాతి విషయంలోనే నన్నమాట. పురుషునికి ఈ వైవాహిక విధానంలో అనంతమైన కామ స్వేచ్ఛ ఉన్నదన్నమాట అందుకనే ఒక తాత్త్వికుడు దీనిని ఏకపత్నీత్వమనటం కంటే ఏక పతిత్వమనటం

యోగ్యమయినదన్నాడు. ఇది కారణంగా 'జనానా'లు బయలుదేరినవి. వాటితో పురుష సంబంధాన్ని అరికట్టారు. అందుమూలంగా ఆత్మలింగ ప్రణయము (Homo-sexual Love) అభివృద్ధి అయింది. ఎన్నివిధాల నిర్బంధాలు కల్పించినా స్త్రీలు భర్తలను మోసగించి కామేచ్ఛ తీర్చుకోవటమూ వ్యభిచరించటమూ జరుగుతూనే వస్తున్నది.

అందుమూలంగా ఏకపత్నీ వివాహానికి బానిసత్వము, వ్యభిచారమూ అనే రెండూ తప్పనిసరి ఐన ఉపాంగాలుగా ఉంటూ వచ్చినవి. ఈ విధానంలో సహజమైన అనురాగానికి స్థానము లేదు. ఆస్తిపాస్తుల మీద ఆధారపడి ఉన్నది. ఏకపత్నీ వివాహానికి మూలమైన అభిప్రాయములు – పురుషుని ఆధిక్యం, పురుష సంతానానికి వారసత్వపు హక్కు కలిగించటం దేశాన్నీ, దేవతలనూ, పితరులనూ తరింప జేయటమూ.

కార్మిక విధానాన ఆలోచిస్తే స్త్రీ పురుషుని సంతాన ఉత్పత్తి పోషణలనే మొదటి కర్మవిభాగాలు (Divisions of Labour) ఇవి ఏకపత్నీత్వ విధానం వల్ల ఏర్పడ్డవని అన్నాడు మార్కు మహాశయుడు. జాతి వ్యతిరేక భావాలు (Class opposition) మొదట ఏకపత్నీత్వ విధానంలో స్త్రీ పురుష జాతులకు రెంటికీ ఘర్షణ జరిగిందని అందులో స్త్రీజాతి ఓడిపోయి బానిస జాతిగా పరిణమించిందనీ ఏంజల్సు మహాశయుడన్నాడు.

ఏకపత్నీ వివాహ విధానం అమలులోకి వచ్చిన తరువాత సంఘంలో అంతకు పూర్వం కనుపించని మరి రెండు జాతులు బయలు దేరినవి. ఏకపత్నీ విధానాన్ని అనుసరించి ఆర్థిక సంపత్తిని చూచిగాని, లేక ఇతర కారణాల మూలానగాని వివాహమాడి, ఆ భర్తలతో సుఖాన్ని అనుభవించలేక నిరంతరమూ హృదయమిచ్చి మోహించిన ప్రియులు ఒక జాతి, నిష్ప్రయోజకులూ, నిరంకుశులూ, దద్దమ్మలూ అయిన భర్తలు (Cuckold Husbands) రెండవజాతివారు.

కన్యకాప్రణయము (Premartial Love), వ్యభిచారము (Prostitution) నాగరక జాతుల్లో తప్పని సరి ఐపోయాయి. దీనికి కారణము నేటి ఏకపత్నీ వివాహ విధానము. వ్యభిచారమును ఎంత అరికట్టటానికి ప్రయత్నించినా నిష్ప్రయోజన మైంది. అయితే ప్రభుత్వాలు ఒక విషయం మాత్రం చెప్పగలిగినవి. ఒక విషయము మాత్రమే. 'వైవాహిక బంధం వల్ల కలిగిన సంతానానికి (బిడ్డకు) తండ్రి అయినవాడు మాత్రమే 'భర్త' అని. మూడువేల సంవత్సరాలనుంచీ వస్తూ ఉన్న ఏకపత్నీ వివాహానికి తేలిన ఫలితాంశమిది.

***(ఆంధ్రపత్రిక – 1948 జులై 21)***

# వివాహము - కూటాంతరత

ప్రపంచంలోని నేటి నాగరకజాతులూ అనాగరకజాతులూ, వివాహ విషయంలో కొన్ని ప్రాథమిక నిబంధనలను ఏర్పరచుకున్నారు. జీవనయాత్రలో సహపథికను గానీ, పథికుణ్ణిగానీ ఎన్నుకోవటానికి వ్యక్తిప్రణయము (Individual Love) జీవనయాత్రలో మూలాధారం కాకపోవటమే కారణము. జాతిరక్షణ, దేవతాపితృ ఆరాధనా, సంతానమూ, ఈ నిబంధనలకు కారణాలు.

వైవాహిక విధానాలను స్థూలంగా 1. కూటాంతర వివాహములు (Endogamous Marriages) 2. కూటబాహ్య వివాహములు (Exogamous marriages) అని విభజించవచ్చు. ఈ రెంటిలో మొదటి పద్ధతి ననుసరించి వ్యక్తి వివాహము స్వకూటమిలో నుంచి జరుగుతుంది. అంటే అతను వివాహం చేసుకునే కన్య అతను ఏ కూటమికి చెంది ఉంటాడో అదే కూటమికి చెంది ఉండవలెనని నియమమున్నదన్న మాట. రెండవదానిలో వ్యక్తికి అతని కూటమిలో నుంచి వివాహము జరుగరాదు. అంటే అతను వివాహమాడే కన్య అతని కూటమిలో జన్మించి ఉండరాదన్నమాట.

ఈ రెండు రకాలైన పద్ధతులూ ఒకేకాలంలో ఒకే దేశంలో ఉండటానికి అవకాశం ఉన్నది. అంటే ఆ దేశంలోని కొన్ని జాతుల్లో కూటాంతరతను, కొన్ని జాతుల్లో కూట బాహ్యతను అనుసరించి వివాహాలు జరుపుకుంటారన్నమాట.

అందుకనే వైవాహిక విషయంలో అంతఃకూటమి (Inner-Circle), బహిః కూటమి (Outer-Cirle) ప్రతిదేశంలోనూ ఉండేదిగా కనిపిస్తున్నవని హెన్రీ మెయిన్ అనే ఒక సామాజిక శాస్త్రవేత్త అభిప్రాయమిచ్చాడు. లోకంలో అనేక జాతులవారు ఇతర జాతులవారితో వైవాహిక సంబంధంగానీ, కామ సంబంధం (Sexual Relation) గానీ ఉండడానికి వీలు లేకుండా అనేక నియమాలను ఏర్పరచుకున్నారు. ఇటువంటి జాతివైరాలు, ఉద్భవించటం కేవలం అనాగరక జాతుల్లోనే కాదు, నాగరకు లనిపించుకున్న వాటిలోనూ పొడకట్టినవి.

రోమనులు గొప్ప విజేతలు. వారు జయించిన దేశాలలోని జాతులనుంచీ వివాహయోగ్యదాయకమైన కన్యలను వారు వివాహం చేసుకోవటముగానీ వారి

కన్యకలను జయించినవారికి ఇవ్వటంగాని జరగలేదు. పైగా రోమను కన్యకలను ఇతరులకు ఇచ్చి వివాహం చేయటము చట్టసమ్మతము కాదని తీర్మానించినారు. వారి కన్యకలను బానిసలుగా స్వీకరించి వారితో కామోపభోగాన్ని అనుభవించటాన్ని వారి న్యాయస్థానం అంగీకరించింది.

ప్రతి జాతీ ఇతరజాతిని తనకంటే తక్కువదానిగా పరిగణించటం లోకంలో పరిపాటి. అందుమూలంగా ఇతర జాతులతో వైవాహిక సంబంధాలను అరికట్టటానికి యత్నిస్తుంది. జాతులు ఇతర జాతులతో వైవాహిక ప్రణయాన్ని అడ్డుకోవు. కానీ అటువంటి వివాహాన్ని న్యూనతాదృష్టితో చూడటము కద్దు. ఇది జాతుల సహజ లక్షణాలు.

అటువంటి పట్టింపులు కేవలం రక్త సంబంధికులతో తరతరాలనుంచీ సాంసారిక యాత్ర గడుపుతూ వస్తున్న తక్కువ జాతివారిలో విశేషంగా కనిపిస్తుంది. స్త్రీ పురుషులలో గమనిస్తే ఈ నిరసనభావం స్త్రీలలో విశేషంగా గోచరించింది.

సాధారణంగా లోకంలో జరిగిన జాత్యంతర వివాహాలనూ (Inter-National Marriages) వర్ణాంతర వివాహాలనూ (Inter-caste marraiges) పరిశీలిస్తే ముఖ్యంగా, ఎక్కువ సందర్భాలలో భర్త ఉన్నతమైన కుటుంబాలకు గానీ, వంశానికి గానీ చెంది ఉంటాడు. దీనికి మూలకారణం సామాజిక శాస్త్రవేత్తలు ఇలా చెపుతున్నారు:

"స్త్రీ తనను తక్కువచేసుకోటానికి నిరాకరిస్తుంది. పురుషుడికి అంతటి సునిశితత్వం గానీ, జాత్యభిమానము, వర్ణాభిమానముగానీ ఉండదు."

ఇందుకు నిదర్శనంగా అత్యుత్తమ ప్రజాస్వామిక దేశమని ప్రఖ్యాతిగన్న అమెరికాను తీసుకుందాము. ఆ దేశంలో నీగ్రో పురుషులను వివాహమాడిన శ్వేతజాతి స్త్రీలు అల్పసంఖ్యాకులు. దక్షిణ రాష్ట్రాలలో అటువంటి వివాహాలను ఆచారమూలంగా బహిష్కరించారు. అయితే అంతమాత్రాన శ్వేతజాతి స్త్రీలకు నీగ్రోజాతి పురుషులతో కామసంబంధం లేదని చెప్పటానికి వీలులేదు. మరికొన్ని రాష్ట్రాలలో ఆచారం మాట అటుంచినా న్యాయశాస్త్రం కూడా అంగీకరించదు.

ఈ కూటాంతరతకు (Endogamy) ముఖ్యంగా జాతిగర్వమూ, దేశౌన్నత్యగర్వమూ కారణాలు. జాతిగర్వము మూలంగా అన్యజాతులమీద అసహన భావం కలగటం సహజలక్షణం. అదేరీతిగా దేశౌన్నత్యగర్వం కారణంగా విదేశీయులంటే సౌహార్దము లేకపోవటమూ, వైముఖ్యమూ, వైమనస్యమూ కలిగి ఉండటమూ సమస్త దేశాలవారికీ

లక్షణము. అందులో ఆచార వ్యవహారంలోనూ, నాగరికత లోనూ, ఆధ్యాత్మిక, ఆధిభౌతిక జీవిత విధానాలలోనూ విశేషమైన అంతరం ఉన్న జాతుల మధ్యా దేశాలమధ్యా ఈ అసహనభావము, వైమనస్య వైముఖ్యాలూ విశేషంగా గోచరిస్తూ ఉంటవి.

జంతు జాతుల్లోనూ ఒక జాతికి చెందిన ఒక విలక్షణత ఉన్న ప్రత్యేక జంతుకోటికి (Distinct Species) మరొక విలక్షత కలిగిన ప్రత్యేక జంతుకోటితో కామసంబంధం కనిపించదు. అది ఆయా జాతులకు సహజావబోధము (Instinct). అదేరీతిగా రూపంలో స్వజాతికంటే భిన్నమైన జాతిలోని వ్యక్తులతో కామబంధాన్ని వైవాహిక సంబంధాన్ని గానీ, కలిగి ఉండటాన్ని జాతులు అసహ్యించుకుంటవి. స్త్రీ జాతిలో ఉండే కామసంబంధమైన సహజావబోధము పురుష జాతిలోని కామసంబంధమైన సహజావబోధంకంటే భిన్నమైనది. అందువల్ల స్త్రీలకు విదేశీయులతో రక్తసంబంధమంటే పట్టుదల విశేషము.

ఇందుమూలంగా మానవజాతిలోనే అనేకరకాలైన విలక్షణవర్గాలు (Species) ఉన్నవనికాదు. కొన్ని కొన్ని ఇళ్ళల్లో అలవాటు పడ్డ జంతువుల్లో కూడా పరస్పరమూ మిథున క్రీడకు అంగీకారము కనిపించదు.

అయితే ఈ సహజావబోధానికి కారణం ఏమిటి? శాస్త్రజ్ఞులు దీనికి 'సామ్యము' (Similarity) ముఖ్య కారణంగా పలుకుతున్నారు. కామ విషయంగానూ జాతులు గానీ, వ్యక్తులు గానీ ఒక విధమైన సామ్యమును ఆదరిస్తారని వారి అభిప్రాయము. సంతాన శాస్త్రజ్ఞులు ఇది ఒక విధమైన శారీరక న్యాయము (Physiological Law) అన్నారు. సంతానోత్పత్తికి ప్రతికృతి (Reproduction) ప్రాథమికాంగము. దీనికీ సామ్యము అత్యావశ్యక మని వారి అభిప్రాయము.

ఈ సామ్యము ప్రత్యేక జాతులమధ్యనే కాదు. ఒక విలక్షణత ఉన్న వర్గంలోనైనా అత్యవసరమని శాస్త్రజ్ఞులు పలుకుతున్నారు. పరస్పర సంయోగము (Inter-Crossing) చేయించదలచుకున్నా ఈ సామ్యమును ముఖ్యంగా గమనించ వలసి ఉంటుందని వారి ఊహ.

వృక్షజాతిలో గానీ, జంతు జాతిలోగానీ ఒక విలక్షణమైన వర్ణానికి (Species) మరొక విలక్షణమైన వర్ణంతో పరస్పర సంయోగం కలిగించవచ్చును. అటువంటి సందర్భాలలో సంతానం విశేషముగా కలుగుతుందని కానీ, ఎక్కువ సంఖ్యకు అవకాశం ఉంటుందని గానీ సిద్ధాంతీకరించటానికి వీలులేదనీ, దానికి భిన్నంగా జరగటం

కద్దనీ, అందుకు అనేక నిదర్శనాలు కనిపిస్తున్నవనీ ప్రపంచ వివాహ చరిత్రకారుడు వెస్టర్ మార్కు అభిప్రాయము.

సర్వ సామాన్యంగా ఆచారంలో అనేక జాతుల్లో వివాహము జాతికి బాహ్యంగా జరగటం లేదు. కొన్నిటిలో అంతర్వర్గాలను కూడా వ్యతిక్రమించి జరగటం లేదు. కొన్నిటిలో వాటి ఊళ్ళను మించి జరగవు. వంగ రాష్ట్రంలో బరయాన్ జాతివారు విదేశీయ స్త్రీని వివాహం చేసుకున్నవాడిని కులంలో నుంచి నేటికీ బహిష్కరిస్తారట. అతడు ఆ విదేశీయ భార్యను బహిష్కరిస్తేగాని తిరిగీ కులంలో చేర్చుకోటానికీ అంగీకరించరట. అంటే ఒక వ్యక్తి కులంలో నుంచి వెళ్ళిపోయినా అంగీకరిస్తారుగాని, విదేశీయ స్త్రీని తమ కులానికి కోడలిగా స్వీకరించరన్నమాట.

ఒకజాతిలో పుట్టిన ఆడపిల్లలు విదేశీయుణ్ణి వివాహమాడటమనే ఊహను కూడా అసహ్యించుకుంటారు. అస్సాములోని అభీరులు, పాడవొలు వారి జాతుల్లోని కన్యకలు విదేశీయుని వివాహ మాడటానికి ఉద్దేశిస్తే సూర్య చంద్రులు ఆకాశంలో ప్రకాశించరనీ, భూకంపాలు కలిగి లోకం తారుమారై పోతుందనీ నమ్ముతారు. ప్రమాదవశాత్తు అటువంటి దుఃస్థితి సంభవిస్తే దానికితగ్గ ప్రాయశ్చిత్తాలూ, శాంతులూ, ఉపశాంతులూ జరుపుతారు. లేకపోతే జాతికంతటికీ శాంతిగానీ, భద్రత గానీ లేదని వారి విశ్వాసము.

ఈ విధంగా జాత్యేతర, వర్ణేతర వర్గేతర వివాహాలను అరికట్టటమనే ఆచారం వ్యక్తిపరమైనది కాదు. జాతిపరము, వర్ణపరము, వర్గపరము అంటే ప్రతిజాతీ జాతిలోని స్త్రీలను బయటకు పోనీయటానికి ఇష్టపడలేదనటం.

పురాతన అరబ్బు జాతివారు వారిలో వారికి రక్తసంబంధం అభివృద్ధి కావటానికి గ్రామాన్ని దాటిన వివాహ బంధాన్ని సంఘం అంగీకరించలేదట! మొరాకోలో బర్బరులు తమ జాతితో అన్యులకు ప్రసక్తి కలగకుండా ఉండటానికి గ్రామంలో ఉన్న వాళ్ళతోనే వివాహ సంబంధం జరిగి తీరాలని నియమించుకున్నారట. ఇది ముఖ్యంగా తండ్రివైపునే జరుగుతుంది. గ్రామంలోనైనా తండ్రివైపు వారినే వివాహ మాడవలసి ఉంటుంది. అందువల్లనే జీలో పహద్ కుమార్తెలకు తన తండ్రి వంశంలోని వారికే వివాహం చేసుకోవలసిందని సలహా యిచ్చి, వారసత్వ విషయికమైన కష్టంనుంచి గట్టెక్కవలసి వచ్చింది. ఇటువంటి వివాహాలలో గ్రామాంతర, పిత్రీయాంతతత కనిపిస్తుంది. అందువల్ల శాస్త్రజ్ఞులు దీనిని పిత్రీయ స్థానీయాంతర వివాహాలు (Patri-Local marriages) అని నామకరణం చేసినారు.

జాతుల్లోని కూటాంతరతకు మతం కూడా ఒక ప్రబలకారణము. తండ్రి మతంలోనుంచి కుమారుడు బాహ్యుడౌతాడనే ఉద్దేశంతో కొన్ని జాతులు కూటాంతరతను అంగీకరించినవి. న్యాయశాస్త్ర కర్త మోజెస్, ఇజ్రాలైటులకు కాననైటులతో వివాహ సంబంధం పనికిరాదని శాసించాడు. దీనికి ముఖ్యకారణము ఇజ్రా తరువాతి కాలంలో అనేకమంది పాగనులు కాననైటులతో కలిసినారట.

పందొమ్మిదవ శతాబ్ది ప్రథమ భాగంలో కూడా యూరప్ దేశంలో ఇజ్రాలైటులకు క్రైస్తవులకు వివాహ బంధాలు ఉండేవి కావట. నెపోలియన్ చక్రవర్తి క్రీ.శ. 1807 సంవత్సరములో పండిత పరిషత్తులను ఏర్పాటు చేయించి వారి ఇరువురి మధ్యా జరిగే వివాహాలు చట్ట సమ్మతాలైతే చాలుననీ, మత సంఘ సమ్మతాలు కానవసరము లేదనీ తీర్మానం చేయించి శాసించినాడు.

క్రీ.శ. 1844లో రాబినికల్ సమ్మేళనం జరిగింది. తత్ఫలితంగా క్రైస్తవ, జ్యూజాతుల మధ్య జరిగే వివాహాలు అంగీకృతాలైనవి. ఏకేశ్వరోపాసకుల మధ్య జరిగే వివాహాలన్నీ చట్టసమ్మతాలని ఆ సభ అంగీకరించింది. కానీ తల్లిదండ్రులు సంతానాన్ని జ్యూ మతంలోకి తీసుకురావలసిన షరతు మాత్రము పెట్టుకున్నారు. సంఘ సంస్కర్తలు దీనికి వ్యతిరేకంగా వాదించారు. అంతటితో జ్యూలు తద్భిన్నులతో వివాహ సంబంధాలు చెయ్యరని తేలిపోయింది. అందు మూలంగా ఐరోపా ఖండంలో ఈ నాటికీ అనేక ప్రాంతాలలో ముఖ్యంగా రష్యాలో - జ్యూలకూ క్రైస్తవులకు వివాహ సంబంధాలు కనిపించవు, బహు సకృతు.

క్రైస్తవులు జ్యూలకూ క్రైస్తవులకూ వివాహ సంబంధాలు పనికిరావని తీర్మానించారు. దీనికి కారకులు కాన్స్టంటైన్ ప్రభృతులైన చక్రవర్తులు. మధ్య యుగసాహిత్యంలో జ్యూ జాతిమీద విశేష ప్రచారం సాగింది. సాహిత్యాన్ని పరిశీలిస్తే క్రైస్తవ కన్యకలు జ్యూ జాతిని ఎలా అసహ్యించుకున్నారో, ఎలా అసహ్యించుకోవాలో కూడా వ్యక్తమవుతుంది. క్రైస్తవులు పాగనులతోనైనా వివాహం చెయ్యవచ్చునని అంగీకరించారు గాని జ్యూలతో వివాహాలు పనికిరావని నిబంధించారు.

సెంటుపాల్ మహాశయుడు క్రైస్తవులకు హీదెనులతో వివాహము పనికిరాదని శాసించినాడు. అటువంటి వివాహము ప్రమాదవశాన జరిగితే దానిని 'అవివాహితతో నెరపిన కామసంబంధము' (Fornication) గా పరిగణించవలసి ఉంటుందన్నాడు. క్రైస్తవ మత వ్యాప్తిని ఉద్దేశించి అటువంటి వివాహాలు జరిగించటానికి కొంత ప్రోత్సాహ మిచ్చినాడు.

కాథలిక్కులు హెరిటిక్కుల మధ్య వివాహాలు పనికి వస్తాయని క్రైస్తవ సంఘం అంగీకరించింది. వారు క్రైస్తవ మతాన్ని అంగీకరించవలసి ఉంటుందన్నారు. కొన్ని క్రైస్తవ పరిషత్తులలో దీనికి వ్యతిరేకంగా తీర్మానించారు. ఇటువంటి వివాహాలకు మతప్రవక్తల అనుమతి అవసరమన్నారు. అటువంటి వివాహాలు మతవక్తల ముందు జరిగితే తప్ప అంగీకరణయోగ్యాలు కావని ట్రెంటులో జరిగిన పరిషత్తు తీర్మానించింది. కానీ కాలక్రమేణ 'పోపులు' ధర్మాంతర వివాహాలను (Mized Marraiges) అంగీకరించారు. పుట్టే సంతానము పొందే విద్యాదికాలను జూచి చర్చి అసహ్యించు కున్నది. ప్రొటెస్టెంట్లు మొదట ధర్మాంతర వివాహాలను వ్యతిరేకించారు గాని, క్రమక్రమంగా ఆమోదించారు. ఈ వివాహాలు ఈ నాడైనా రోమను కాథలిక్, ప్రొటెస్టెంటు దేశాలలో చట్టసమ్మతాలైన వివాహాలకు (Legal marriage) భిన్నంగా లేవు. గ్రీసు దేశానికి సంబంధించిన చర్చి వారిలో మతసంంధమైన నిబంధనలు ఈ నాటికీ కొంతవరకు కనిపిస్తూ ఉన్నవి.

అంతర్వివాహాన్ని ఇస్లాంమతం మొదటినుంచి ఈ నాటివరకూ అరికడుతూ వచ్చింది. 'ఇస్లాం మతధర్మాన్ని స్వీకరించని స్త్రీని వివాహమాడవద్దని' కొరాను పలుకుతున్నది. ఇస్లాం మత ధర్మాన్ని స్వీకరించినంత మాత్రంతో సరిపోదు. ఆ స్త్రీ ముసల్మాను ధర్మశాస్త్రాల మీద ఆస్థ కలిగి ఉండాలి; నమ్మకము కుదిరినదై ఉండాలి.

ఈ మూలసిద్ధాంతాలను ఆధారం చేసుకొని సున్నీ షియ్యా న్యాయ శాస్త్రవేత్తలు కొన్ని నిబంధనలు చేశారు. ఈ రెండు వర్గాలవారూ విగ్రహారాధనం చేసే జాతుల్లోని స్త్రీలను వివాహం చేసుకోకూడదని అనుశాసించారు. దీనిని బట్టి ఎటువంటి సందర్భంలోనూ మహమ్మదీయ స్త్రీగాని, పురుషుడు గానీ ధర్మాంతర వివాహాన్ని చేసుకోటానికి అవకాశం ఆ ధర్మ శాస్త్రజ్ఞులు కల్పించలేదని వ్యక్తమౌతున్నది.

హిందువులలో కూటబాహ్య వివాహము – స్థూలదృష్ట్యా స్వీకరించినప్పుడు – జరగటానికి వీలు లేదు. హిందూ జాతిలోని వర్ణ వ్యవస్థకు మూలాధారము అదే. హిందువులలో కూటాంతర వివాహమే ప్రధానధర్మము.

అయితే, అది కేవలము ఒక వర్ణముతోనే ఆగిపోలేదు. ప్రతి వర్ణములోనూ కొన్ని ఉపవర్ణములు (Sub - castes) ఏర్పడినవి. సర్వసాధారణముగా వివాహము ఉపవర్ణ, ఉపవర్గముల మధ్యనే నిలచిపోతుంది. ఎప్పుడైనా, వర్ణాంతర, వర్గాంతర వివాహాలు ఉపవర్గాలమధ్య జరగవచ్చునేమో కాని అనాదిలో ఏర్పడ్డ వర్ణ, వర్గాల

మధ్య అంతర్వివాహాలు పనికిరావు. ఉపవర్గాలలోనూ కొన్నిటినుంచి కన్యకను స్వీకరించవచ్చునుగాని కన్యకను ఆ ఉపవర్గంలోని వరునకు ఇచ్చే అవకాశం లేదు.

ఒక వర్ణము అనేక ఉపవర్గాలుగా విభజితమైన సందర్భాలలో 'అనులోమము' (Hyper-Gamy) కనిపిస్తుంది. అందువల్ల తల్లిదండ్రులు కన్యకలను వారికంటె అధికులని పేరుపడ్డవారికి ఇవ్వవలసి ఉంటుంది. లేకపోతే తక్కువ వానికిచ్చి సాంఘికంగా తమ వంశాన్ని అల్లుడైన వియ్యంకుని వంశస్థితికే తీసుకోపోవలసి ఉంటుంది. అందువల్ల పురుషులు తమ వంశంలోని పిల్లలనూ వివాహం చేసుకునే అవకాశం ఏర్పడి ఉండేదన్నమాట. ఇది ఉత్తర భారత జాతుల్లో కనిపిస్తుంది. దక్షణ భారతములోనూ, అస్సాములోనూ ఇటువంటి ఆచారమున్నట్లు గోచరించిందని వివాహ చరిత్రకారుని అభిప్రాయము.

మడగాస్కరు ద్వీపములో జాతులు మూడు విధాలు 1. ప్రభువులు 2. మధ్యస్థులు, 3. బానిసలు. బానిసలలో కూడ ఉపవర్గాలున్నవి. వీరిలో వర్గ బాహ్య వివాహాలుగాని, బానిసలమధ్య ఉపవర్గాంతర వివాహాలు గానీ లేవు. తూర్పు ఆఫ్రికా మాసై జాతుల్లో కమ్మరము, వడ్రంగము ఇత్యాది కర్మకార వృత్తిగలవారు అంతర్వివాహాలు చేసుకోటానికి వీలులేదు.

ఫోనీషియాలో ప్రభువర్గం వారు జనసామాన్యాన్ని మరొక జాతికి చెందిన వారినిగా చూస్తారు. అందువల్ల అన్యోన్య వివాహ బంధాలు లేవు. తహతీలో స్త్రీ తక్కువ జాతివాడిని వివాహం చేసుకుంటే కలిగే సంతానాన్ని చంపటానికి ముందు అంగీకరించవలసి ఉంటుంది.

క్రీ.పూ. 445 ప్రాంతాలలో గ్రీసుదేశం మహా వైభవాన్ని అనుభవించే దినాలలో ప్లీబనులూ, పెట్రీషియనులూ అని రెండు తెగలుగా ఉండేవారు. ఒకరితో ఒకరికి వివాహ సంబంధాలు ఉండేవి కావు. సిసిరోవంటి విజ్ఞాని క్రొత్తగా బానిసత్వం పోగొట్టుకున్నవారితో వివాహబంధాలు జాతీయులకు పనికిరావనినాడు. శాసనసభ్యత బానిసస్త్రీని వివాహమాడటం వల్ల పొయ్యేది. అదేరీతిగా బానిసత్వవిముక్తుని అతని పోషకురాలు వివాహం చేసుకునే అధికారం లేదు. వివాహము పనికిరాదనినారేగాని గ్రీసు రోమను శాస్త్రవేత్తలు స్వతంత్రులు, బానిసలు – అనే రెండు జాతుల మధ్య ఒక విధమైన కామ సంబంధము ఉండవచ్చునని (Contu Bernium) అంగీకరించినారు.

ప్రాచీన కాలంలో ట్యుటానిక్ జాతులవారు ఎవరైనా స్వతంత్రుడు బానిసతో వివాహ సంబంధం నెరపితే అతనిని బానిసనుగా చేసేవారు. అటువంటి పనికి స్త్రీ పూనుకున్నప్పుడు ఆమెను చంపివేసేవారు.

స్కాండినేవియన్ జాతుల్లో ఎక్కువ కాలం బానిసత్వం నిలవలేదు. జర్మనీలో అది 'సెర్ఫ్డం'గా మారింది. పుట్టుకతో సామ్యం (Equality of Birth) ఉంటేగాని వివాహానికి అవకాశం లేదు. జర్మనీ స్కాండినేవియాలలో క్రమక్రమంగా ప్రభుజాతి భిన్నమై పోయింది. ప్రభుజాతి వ్యక్తికీ, బానిసకూ ఏ కారణం చేతనైనా వివాహబంధం ఏర్పడితే దానిని దుష్టబాంధవ్యము (Mis-alliance) గా భావించేవారు. ప్రప్రథమంలో అటువంటి వివాహాలు చేసుకున్నవారు ఆర్థిక దుర్దశకు పాలైనారు. చాలాకాలంవరకు వారి సంతానానికి పౌరసత్వపు హక్కులు లభించలేదు.

చాలా సందర్భాలలో వర్గసంబంధమైన కూటాంతర వివాహ విధానానికి (Class Endogamy) జాతి వైషమ్యమూ, దేశ వైషమ్యమూ కారణాలు. అన్యదేశీయ దండయాత్రల ఫలితంగా సాంఘిక విభేదాలు ఏర్పడి ఉంటవి. జయించినవారు ప్రభువులూ, జితులు బానిసలూ ఔతుంటారు. వారి ఇరువురి మధ్యా వైవాహిక బాంధవ్యాలు ఉండేవి కావు.

సంస్కృత భాషలోని వర్ణశబ్దానికి 'రంగు' అని అర్థము. దీనినిబట్టి వర్ణభేదం ఎలా ఏర్పడి ఉంటుందో మనం ఊహించవచ్చును. ఉత్తమ వర్ణం గల ఆర్యులు అనార్యులను జయించి బానిసలనుగా పరిగణించి ఉంటారు. తరువాతి కాలంలో వర్ణశబ్దం కులవిభేదాలను తెలియజేస్తూ వచ్చింది.

ఆర్యజాతి ఏర్పడక పూర్వం భారతదేశంలో నీలవర్ణులైన జాతుల వారుండేవారు. వారే దస్యులు. కాలక్రమేణ వారు ఆర్యులకు బానిసలై పోయినారు. విజేతలైన ఆర్యులలో మొదట స్త్రీల సంఖ్య అతిస్వల్పంగా ఉండేది. ఆ కారణం చేత అనార్యజాతి కన్యకలనూ, స్త్రీలనూ వివాహం చేసుకున్నారు. తరువాత తరువాత అటువంటి అగత్యం లేకపోవటం వల్ల అంతర్వివాహ విధానాన్ని వారు అరికట్టినారు. అంటే కూట బాహ్యావివాహాన్ని అంగీకరించటం మానివేసినారన్నమాట.

నార్మనుల దండయాత్రకు పూర్వం ఆంగ్లదేశానికి శాక్సనులు ప్రభువులు. తరువాత నేటి జర్మనీ ప్రాంతీయులూ, గాలులూ అయిన నార్మనులు ఆ దేశాన్ని జయించినారు, ప్రభువులైనారు. రోమను జాతిలోని 'పెట్రీషియనులు' మొదట ప్రభువర్గంవారు కారు.

వారు రోము పట్టణాన్ని పట్టుకొని అక్కడ ఇతః పూర్వపాలకులైన శాబైనులను ఓడించి బానిసలుగా చేసుకున్నారు. వారు కాలక్రమేణ ప్లీబనులైనారు.

విజేతలు అన్ని దేశాలలోనూ వారి వారి పూర్వికుల సాంఘిక మత, రాజకీయ సంప్రదాయాలను అనుసరిస్తూ సామాన్య జనం దగ్గిరనుంచీ దూరంగా ఉంటూ వచ్చినారు. వారితో సహపంక్తి భోజనముగానీ, వివాహాలుగానీ జరిపేవారు కారు. అంటే ఆ విజేతలు ఎవరి మధ్య నివసిస్తున్నారో వారిని విజాతీయులుగానూ, అన్యదేశీయులుగానూ భావించే వారన్నమాట.

ప్రతిజాతికీ, ప్రతి వర్గానికీ, కొన్ని ప్రత్యేకాచారాలూ అభిమానాలూ లోకంలో గోచరిస్తున్నవి. వారి వారి జీవనవిధానాలు వేరు; వారి వారి ఉత్సాహోద్రేకాలు వేరు. వాటిని బట్టి ప్రతిజాతీ, ప్రతి వర్గమూ, తనను ఉత్తమ శ్రేణికి చెందిన దానినిగా భావించుకొని, ఇతర జాతులమీదా, వర్ణాలమీదా దాడిచేస్తూ ఉంటవి. ఆ జాతుల్లో పుట్టిన కవులూ, గాయకులూ ఆ మారణకృత్యాలను 'వీరగాథలు'గా భావించి కీర్తనం చేస్తుంటారు. ఈ ఉత్తమత్వాభిమానం మూలంగా జాతులమధ్య వివాహ బంధాలు ఉండవు.

ఈ విధంగా వివాహ బంధాలు లేకపోవటం వల్ల ఆయా జాతులు విశేషమైన నీతినియమాలు కలిగినవని భావించటానికి వీలులేదు. ఇందుకు ఉదాహరణముగా బెడాయిక్ జాతిని జూడవచ్చును. ఆ జాతి స్త్రీ కొద్దిమూల్యానికి టర్కీ దేశస్థునికి గాని, మరొక ఐరోపా దేశస్థునికి గానీ తన శరీరాన్ని అమ్ముకోవచ్చును. దానిని సంఘం అంగీకరిస్తుంది. కానీ ఆ విదేశీయుని వివాహం చేసుకుంటే తప్పిదము క్రింద పరిగణిస్తుంది. ఘోరశిక్ష విధిస్తుంది.

నేటి నాగరికత జాతులమధ్య, దేశాలమధ్య, మతాల మధ్య, సంఘాల మధ్య ఉన్న రాతిగోడలను బ్రద్దలు కొట్టే ప్రయత్నం చేస్తున్నది. ఇందుమూలంగా అన్ని దేశాలలో కాకపోయినా కొన్ని దేశాలల్లో నయినా – యుక్త వయస్సు గలిగిన స్త్రీ పురుషులు ఇరువురూ వారి వారి ఇష్టానుసారంగా మతసాంఘిక నిబంధనలకు తల ఒగ్గనవసరం లేకుండా వివాహం చేసుకొనే అవకాశం లభించింది. ఆ వివాహాలు చట్టసమ్మతాలైనవి. వెనుకవారు పడవలసిన ఆర్థిక నష్టాలవల్ల కలిగే భయం దూరమైపోయింది.

ఈ మార్పు అత్యంత ప్రధానమైనది. మానవ జీవిత చరిత్రలో ఈ వైవాహిక విధానంలోని పరిణామము మూలంగా నూతనాధ్యాయం ప్రారంభమైంది.

జాత్యహంకారమూ, కులగర్వమూ (Class Pride), ధర్మ, అసహనము (Religious, intolerance) స్త్రీ జాతి బానిసత్వమూ, అనులోమమూ (Hypergamy) కారణంగా ఏర్పడ్డ కూటస్థ వివాహ లక్షణం రూపుమాసిపోవటమంటే ఇక ప్రపంచంలోని ఏ జాతిలోనూ 'రాజుకూ రడ్డికీ' భేదముండదన్నమాట. ప్రభుజాతి, బానిస జాతి అనే విభేదం లేదన్నమాట. సాంఘిక జీవనంలో అత్యంతమైన మార్పు కలుగుతుంది. ప్రాచీన సాంఘిక దౌర్జన్యాలకూ, దురంతాలకూ ఇక తావుండదు. వ్యక్తిగత స్వాతంత్ర్యానికి ఏ లక్షణమూ వేరు పురుగుగా పరిణమించలేదు. మానవ జాతుల మధ్య వ్యక్తుల మధ్య సహనభావం విశేషంగా అభివృద్ధి పొంది, ప్రపంచంలోని మానవ జాతులన్నీ కలిసిపోయి ఏకైక కుటుంబంగా కాకపోయినా విశేష సహనభావంతో వర్తించటానికి అవకాశం కలుగుతుంది. అటువంటి పరిణామానికి వైవాహిక విధానంలోని కూట బాహ్యత (Exogamy) రాచబాట వేస్తుంది.

***(ఆంధ్రపత్రిక 1948 సెప్టెంబర్ 8)***

# బృంద వివాహము

శాస్త్రజ్ఞులు అనాది మానవజాతుల వైవాహిక విధానాన్ని గురించి ఎంతోవిచారణ చేశారు. ప్రాథమిక స్థితిలో అది కేవలమూ శారీరక సంబంధమని నిర్ణయించారు. అనాది మానవ సంఘంలోని స్త్రీ పురుషుల మధ్య ఉన్న ఈ శారీరక సంబంధంలో ఎటువంటి వివక్షా లేదని వారు అభిప్రాయపడినారు. దీనికే వివక్షారహిత కామము (Promiscuity) అని నామకరణం చేశారు. దీనిని బట్టి అతి ప్రాచీన కాలంలో ఎటువంటి వివక్షా లేకుండా స్త్రీ పురుషులు కామతృప్తి పొందేవారని నిశ్చయించవచ్చునన్న మాట.

అయితే ఈ వివక్షా రహితమైన కామోపభోగ స్వరూపం ఎటువంటిది? నేడు సంఘంలో ఉన్న నీతినియమాలూ, విధినిషేధాలూ ఆ నాడు లేవు. ఆ నాటి సంఘం కామసామ్యాన్ని (Sex Communism) పాటించేది. నేటి పరిభాషలో మాట్లాడితే అన్నకు చెల్లెలు, తండ్రికి కూతురూ భార్య లౌతారు; అక్కకు తమ్ముడూ, తల్లికి కుమారుడూ భర్త లౌతారు. బెహరింగు జలసంధి దగ్గర ఉన్న కలియక్కులలోనూ, అలాస్కాలోని కడ్డైయక్కులలోనూ, బ్రిటిష్ నార్త్ అమెరికాలోని టెన్నెహిజాతిలోనూ ఇటువంటి స్వీయబంధు ప్రణయము (Incest) నేటికీ కనిపిస్తున్నదని 'సంసారోత్పత్తి' (Origin of Family) అనే గ్రంథంలో ఏంజెల్సు మహాశయుడు వ్రాసి ఉన్నాడు. చిలీలోనూ, చిప్పల్ ఇండియను జాతివారిలోనూ ఇటువంటి ఆచారము నడుస్తూ ఉన్నట్టు కొందరు యాత్రికుల వ్రాతల వల్ల తెలుస్తున్నది.

పైన పేర్కొన్న అనాగరక జాతులకంటె నాగరకులనిపించుకున్న రోమనులు, పర్షియనులు, పార్థియనులు, హూణులు మొదలైన మరికొన్ని జాతులవారి చరిత్రలు చదువుతుంటే ఇటువంటి స్వీయబంధుప్రణయము నాగరక జాతుల్లోనూ చాలాకాలము వరకు గడచినట్లు కనిపిస్తుంది. కానీ తరువాతి కాలంలో ఈ ఆత్మ బంధు ప్రణయాన్ని కొన్ని జాతులు ఎబ్బెట్టుగా చూచారు. కొన్ని విధినిషేధాలు ఏర్పాటుచేసుకున్నారు.

మోర్గన్ మహాశయుని సిద్ధాంతాన్ని అనుసరించి ఇటువంటి వివక్షా రహితమైన కామోపభోగస్థితిలో నుంచే మొట్టమొదటి మానవ సంసారాలు (Human Families) ఏర్పడినవి. అంటే ఒక కుటుంబానికి సంబంధించిన తాతలనూ తాతమ్మలనూ

నియమించారు. తాతలకు సంబంధించిన వారందరూ భర్తృవంశం వారైనారు. ఆ విధంగా వివాహం చేసుకున్నవారివల్ల కలిగే సంతానాలమూలంగా భర్తృవంశాలవారూ, భార్యవంశాలవారూ ఏర్పడి ఉంటారు.

ఈ విధంగా ఏర్పడ్డ వివాహ సంస్థలో పూర్వికులకూ, వారిసంతానంతో వైవాహిక సంబంధము ఉండటానికి అవకాశం లేదు. ఆ నాటి వైవాహికమంటే కేవలమూ రతీత్యాదులు మాత్రమే – కేవలమూ కామోపభోగము. ఇటువంటి స్థితిలో అన్నకు చెల్లెలు భార్య కావచ్చును. అక్కకు తమ్ముడు భర్త కావచ్చును. ఈ విధమైన వైవాహిక పద్ధతిని నిరూపించే జాతి నేటి ప్రపంచంలో ఎక్కడా కనిపించటం లేదు. అయితే ఇటువంటి వివాహ క్రమము ఒకానొక కాలంలో తప్పకుండా ఉండి ఉంటుందని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడినారు. తరువాత కాలంలో అన్నదమ్ముల మధ్యా అక్కచెల్లెళ్ళ మధ్యా ఉండే ప్రణయాన్ని అరికట్టినారు. క్రమంగా పినతండ్రి పెత్తండ్రి బిడ్డల మధ్యా, పినతల్లీ పెత్తల్లి బిడ్డల మధ్యా ఉండే వైవాహిక సంబంధం కూడా తొలగిపోయింది. అందు మూలంగా అన్నదమ్ములు ఒక సంసారానికి సంబంధించినవాళ్ళూ, అక్కచెల్లెళ్లు ఒక సంసారానికి సంబంధించినవాళ్ళూ అయినారు. ఈ సంబంధం ఏకోదరుల విషయంలోనే కాదు – వేలు విడిచినవారైనా సరే – మరికొంత దూరమైనా సరే. ఈ విధంగా తరువాతి కాలంలో సంసారాలు ఏర్పడ్డవి. ఇటువంటి సంసారాలను శాస్త్రజ్ఞుడు మోర్గన్ 'పునలీయన్ సంసారా' లన్నాడు.

పునలీయన్ సంసారాలలో ఎన్ని మార్పులతోనైనా వివాహం జరగటానికి అవకాశమున్నది. కాని ప్రధానంగా ఒక కులంలోని స్త్రీలందరూ జన్మతః ఆ కులంలోని పురుషులందరికీ భార్యలై ఉంటారు. అయితే వారి సంబంధము సోదర సోదరీ సంబంధము కాకూడదు.

ఈ సంసారాలలోని వివాహ విధానాన్ని పరిశీలించి చూస్తే ఏర్పడే సంబంధ బాంధవ్యాలు ఈ క్రింది విధంగా ఉంటవి. రామన్న అమ్మ చెల్లెలి బిడ్డలందరూ రామన్న తల్లి బిడ్డలు. రామన్న తండ్రి తమ్ముని బిడ్డలందరూ రామన్న తండ్రి బిడ్డలు. రామన్న పినతల్లి భర్తలందరూ రామన్న తల్లికి భర్తలు. రామన్న తండ్రి తమ్ముని భార్యలందరూ రామన్న తండ్రికి భార్యలు.

అన్న తమ్ముళ్ళకూ, అక్కచెల్లెళ్ళకూ మధ్య వైవాహిక సంబంధం నిషేధితం కావటంతో, మానవజాతి వైవాహిక విధానంలో మరొక మార్పు వచ్చింది. ఈ మార్పు రెండు విధాలుగా రూపొందింది.

'పునలియన్' వివాహ విధానాన్ని అనుసరించి ఏర్పడ్డ కుటుంబాలు రెండు రకాలని వెనుక గుర్తించాము. వాటిలో ఏకగర్భాన పుట్టడం వలన పితృ సంబంధంగా సహోదరత్వమూ, మాతృసంబంధముగా సహోదరత్వమూ ఏర్పడ్డది. వారందరికీ ఒక తల్లి ఉంటుంది. ఆమె మూలముగా అక్కచెల్లెళ్ళు కాదగినవారు నియమితులౌతూ ఉంటారు. వీరికి భర్తలు ముఖ్యంగా 'అన్నదమ్ములు' కాదగినవారిలో ఉంటుంటారు. అందువలన మగవారు తల్లికి సంబంధించి ఉండటానికి వీలు లేదు. అందువల్ల వారు తల్లి కూటమికి సంబంధించరు. అదే రీతిగా కులంలోని స్త్రీ సంతానం తండ్రి కూటమికి సంబంధించి ఉండదు. ఈ విధంగా తల్లి జాతి తండ్రి జాతి వేరైనారు.

ఈ పునలీయన్ వివాహ విధానము క్రమక్రమంగా ఒక పురుషుడు ఒక స్త్రీతో తాత్కాలికంగానో, మరికొంత కాలంగానో వైవాహిక బంధం కలిగి ఉండే అవకాశానికి దారి తీసింది.

వివక్షారహిత కామోపభోగాన్ని అనుభవించే కాలంనుంచి పునలియన్ వివాహం అమలులోకి వచ్చే కాలంలో మానవజాతిలో గుంపు పెళ్ళిళ్ళు (Group Marriages) జరిగినవి. ఈ వివాహ విధానాన్ని అనుసరించి ఆ జాతులలోని స్త్రీ పురుషులు యావన్మందీ రెండు కూట బాహ్య కుటుంబాలుగా (Exogamous Families) విభజన పొంది ఉంటారు. ఒక కుటుంబంలోని వారు, స్త్రీలు యావన్మందీ, జన్మతః రెండవ కుటుంబంలోని పురుషులకు వివాహ సంబంధం వహించవలసిన వారై ఉంటారు. అదే రీతిగా అవతలి కుటుంబంలోని స్త్రీలందరూ ఇవతలి కుటుంబంలోని పురుషులు యావన్మందికీ పుట్టుకతోనే భార్యలై ఉంటారు. బృంద వివాహ విధానంలో ఇది ప్రాథమిక స్థితి. ఇటువంటి స్థితి ఆస్ట్రేలియాలో ఈ నాటికీ కనిపిస్తుంది.

దక్షిణ ఆస్ట్రేలియాకు సంబంధించిన మౌంట్ గాంబయర్ దగ్గిర నివసించే నీగ్రో జాతిలో ఈ ప్రాథమిక బృందవివాహం (Group Marriage) స్థితి కనిపిస్తున్నది. ఈ నీగ్రోజాతిలోని స్త్రీ పురుషులు యావన్మందీ క్రొక్కీ, కుమైట్ అనే రెండు కుటుంబాలుగా విభజన పొంది కనిపిస్తారు. క్రొక్కీలు క్రొక్కీలతో కామ సంబంధము, (వైవాహిక సంబంధము) కలిగి ఉండరాదు. కుమైట్లతో వారు వివాహం చేసుకోవచ్చును. అంటే కామ సంబంధము నెరపవచ్చునన్న మాట. అదే రీతిగా కుమైట్లు క్రొక్కీలతో వైవాహిక సంబంధము నెరపవచ్చును. వారిలో వారికి వైవాహిక వ్యాపారాలు పనికిరావు. అంతేకాదు, పుట్టుక చేతనే క్రొక్కీ జాతిలోని మగవానికి కుమైటు జాతి స్త్రీ భార్య;

కుమైట్ జాతి స్త్రీకి క్రొక్కీ జాతి పురుషుడు భర్త. అందరు క్రొక్కీలూ, అందరు కుమైట్లనూ అందరు కుమైట్లూ అందరు క్రొక్కీలనూ వివాహమాడతారు.

ఈ వివాహ విధానము మధ్య ఆస్ట్రేలియా అనాగరక జాతుల్లోనూ కనిపిస్తున్నది. ఈరీ సరస్సుప్రాంతంలోనూ, డార్జిలింగ్ నదీ ప్రాంతాలనూ అక్కడక్కడా ఇటువంటి వైవాహిక విధానంతో నివసించే జాతులు నివసిస్తున్నారు. న్యూ సౌత్ వేల్సుకు సంబంధించిన 'కుమిలాతాయ్' జాతివారు అనాది కాలంలో తల్లి కుటుంబము తండ్రి కుటుంబము అనే రెంటిని నాలుగు విభాగాలుగా చేసుకున్నారు. ఇందులో మొదటి రెండు విభాగాలవారు పుట్టుకతోనే భార్యాభర్తృ సంబంధం కలవాళ్ళు. తల్లి సంబంధాన్ని బట్టి వారి సంతానము 3వ విభాగానికీ 4వ విభాగానికీ చెందుతుంటారు. 3,4 విభాగాల సంతానం వారిలో వారు వివాహం చేసుకుంటారు. వివాహానంతరము 3, 4 విభాగాలకు సంబంధించిన వారు, వారి వారి తల్లి హక్కును అనుసరించి తల్లి వంశంలో చేరుతుంటారు. ఈ పద్ధతిని అనుసరించి ఒక తరానికి సంబంధించిన అక్క చెల్లెళ్ళ మధ్యనూ, అన్నదమ్ముల మధ్యనూ సంతానప్రాప్తి పనికిరాదు. అంటే వైవాహిక బంధము నిషేధిత మన్నమాట. వీటినుండి క్రమ క్రమంగా తల్లిని ఆధారం చేసుకొని కొందరు మూల స్త్రీలు (Women Ancestors) ఏర్పడినారు. వారి మూలంగా కొన్ని కుటుంబాలు ఏర్పడినవి.

కొన్ని మధ్య ఆస్ట్రేలియా జాతులలోని వివాహ విధానము పరిశీలిస్తే ఒకానొక కాలంలో ఆయా జాతుల్లో బృంద వివాహమున్నట్లు అర్థమౌతుంది. ఈరీ సరస్సు ప్రాంతంలోని జనంలో వివాహం రెండు విధాలుగా ఉంటుంది. 1. టిప్పు ముల్కు వివాహము 2. పిర్రారు వివాహం.

టిప్పు ముల్కు వివాహము వ్యక్తిగతము (Individual Marriage). ఈ వివాహ విధానాన్ని అనుసరించి ఒక వ్యక్తి ఒక భార్యతో కాపురం చేస్తాడు. 'పిర్రారు' వివాహ విధానంలో ఇద్దరు గాని, ముగ్గురు గాని అన్నదమ్ములు ఇద్దరిని గానీ, ముగ్గురిని గానీ అక్కచెల్లెళ్ళ వివక్ష లేకుండా వివాహం చేసుకుని అందరూ ఒక బృందంగా కాపురం చేస్తారు. ఇక్కడ అన్నలూ తమ్ముళ్ళూ ఏకగర్భజనితులు కానవసరం లేదు. ఒక భార్య భర్తను తనకు ఇటువంటివానిని పిర్రారుగా ఇవ్వమని అడగవచ్చును. ఒక స్త్రీకి పిర్రారు భర్తలు అనేకమంది ఉండవచ్చును. అదేవిధంగా ఒక పురుషుడికి పిర్రారు భార్యలు అనేకమంది ఉండవచ్చును. ఒక పురుషునికి ఒక స్త్రీగానీ, ఒక స్త్రీ ఒక పురుషునికి గానీ పిర్రారు కావటము సంఘంలో వారికున్న స్థానాన్ని బట్టి ఉండదు.

అది జన్మతః వచ్చే ఆచారము. ఒక తడవ పిర్రారు అయినవాడు గానీ అయినది గానీ నిరంతరమూ 'పిర్రారు' అయి ఉంటుంది.

టిప్పుముల్కు వివాహము వ్యక్తిపరము కావటం వల్ల స్త్రీ కావచ్చును,లేదా పురుషుడు కావచ్చును. టిప్పు ముల్కుకు గౌరవం విశేషము. 'టిప్పుముల్కు' భర్త భార్యను పిర్రారులకంటే అధిక గౌరవంతో చూస్తాడు. ఆమె సంతానాన్ని తన సంతానంగా భావిస్తాడు.. ఒక టిప్పుముల్కు భర్తను గానీ, భార్యను గానీ కాదని మరొక వ్యక్తికి ఏకకాలంలో టిప్పుముల్కు కావటానికి వీలు లేదు.

ఆస్ట్రేలియా జాతుల్లోని ఉరుబిన్నా వారి వివాహ విధానము ఒకానొక కాలంలో గుంపు పెళ్ళి ఉన్నట్లు నిరూపిస్తున్నది. ఆ జాతి భాషలో 'మియా' శబ్దానికీ తల్లి అనీ, జాతి తల్లి అనీ అర్థాలు. ఆ తరంలో వున్న స్త్రీలందరికీ ఈ పదాన్ని సమానంగా ఉపయోగిస్తారు. తల్లి జాతిలో వారందరూ ఒక వ్యక్తికి తల్లులు, వేరేజాతిలోని వారందరూ భార్యలు. కుర్నై జాతిలో మరదలు (భార్య చెల్లెలుగానీ) అక్కగాని న్యాయతః అతనికి భార్య అయినా అతని గుడిసెలో నిద్రపోరాదు. బ్రోగన్ జాతి వ్యక్తిని ఒక స్త్రీ భర్తని పిలిచినా భర్త, భార్య అని వ్యవహరించినా ఆమె ఇతర కులం ఇళ్ళలో తప్పకుండా నిద్ర చెయ్యాలి.

ఉరుబిన్నా జాతి ప్రతి మగవాడితోనూ ఒక 'నూప' ఉంటుంది. ఆమె భార్యకు అక్క చెల్లెళ్ళ వరుసలోనిది. ఆమె అతఃపూర్వం ఒకరిని వివాహం చేసుకొని ఉండవచ్చు. అయినా అంతమాత్రంతో ఆమె ఒక్కడినే వివాహం చేసుకున్నదనిగానీ, చేసుకోవలెనని గానీ చెప్పటానికి వీలు లేదు. మగవాళ్ళకు నూపలున్నట్లే ప్రతి స్త్రీ మరొక పురుషునికి భార్య పిరంగరు అయి వుంటుంది. 'పిరంగరు'గా ఆమె అనేకమందితో శరీర సంపర్కాన్ని పొందవచ్చు. దీనినిబట్టి తేలిన సారాంశమేమనగా ఉరుబిన్నా జాతిలో వ్యక్తిగత వివాహము ఆచారం మూలంగా గానీ, పేరుకు గాని లేదన్నమాట.

ఆస్ట్రేలియా అరుంటా జాతిలో వ్యక్తి వివాహమున్నా మగవాడు ఇతర జాతి స్త్రీతో – అది బహిష్కృత జాతి అయినా సరే – కాపురం కొన్ని సమయాలలో చేయవచ్చును.

ఆస్ట్రేలియాలోని అనాగరక జాతుల్లో కాకుండా కొన్ని నాగరక జాతుల్లోనూ ఇటువంటి వైవాహిక విధానం ఉన్నట్లు శాస్త్రజ్ఞులు పలుకుతున్నారు. సీజరు మహాశయుడు ఒక దేశాన్ని గురించి వ్రాసిన వ్రాతల్లో ఇలా అన్నాడు :

"వారి సాంఘిక జీవనవిధానం చిత్రమైనది. అన్నలూ తమ్ములూ, తండ్రులూ, కుమారులూ కలిసి పది పన్నెండు మంది భార్యా బృందంతో కాపురం చేస్తుంటారు.

మొదట ఆ స్త్రీని బృందంలోకి ఎవరు తీసుకొని వస్తారో అతనికి ఆమెవల్ల కలిగే సంతానం లభిస్తుంది. ఇదే రీతిగా ఒక తంతువు ననుసరించిగానీ, ఆచారాన్ని అనుసరించి గానీ ఒకరినొకరు వివాహం చేసుకోకుండానే అందరూ కలిసి ప్రణయ సామ్యాన్ని (Sex Communism) పొందుతుంటారు" అని.

టిబెట్టు, సిక్కిమ్, బూటానులలో ముగ్గురు నలుగురు అన్నదమ్ములు కలిసి సమాన స్వామ్యలలో ముగ్గురు నలుగురు అక్కచెల్లెళ్ళను వివాహం చేసుకునే ఆచారం అమలులో ఉండేది. పెద్ద భార్య సంతానము పెద్దవానికీ, రెండవ భార్య సంతానము రెండవ వానికీ, మూడవ భార్య సంతానము మూడవ వారికీ, ఈ రీతిగా చెందుతుంది. ఇందులో ఎవరికైనా సంతానం లేకపోతే వాళ్ళ వాళ్ళ అనుమతిమీద పంచుకుండేవారు.

తోడాజాతిలో కుటుంబంలో పెద్ద కుమారుడు పెళ్ళి చేసుకుంటాడు. అతనికి అయిదారుగురు తమ్ములుంటే ఆ భార్య అందరినీ భర్తలుగా స్వీకరిస్తుంది. వారికి ఆమెతో కామ వ్యాపారము చేయగల వయస్సు లేనప్పుడు కూడా వారామెకు భర్తలే. వారు పెద్దవారయిన తరువాత ఆమె వారితో సంభోగ సంబంధాన్ని నెరపుతుంది. ఆ భార్యకు చెల్లెళ్ళుంటే వారు అక్క భర్తలకు న్యాయతః భార్య లౌతుంటారు. కులంలో ఆడవాళ్ళు తక్కువైనప్పుడు కొన్ని సమయాలలో అయిదారుగురు అన్నదమ్ములకు ఒకటే భార్యగా కూడా ఉంటుంది. ఇద్దరన్నదమ్ములకు ఇద్దరు భార్యలు సమస్వామ్యంతో కూడా ఉండవచ్చును.

లంకలో క్రీ.శ. 1818లో ఒక చట్టం జరిగింది. దానిని అనుసరించి ఇద్దరు ముగ్గురు భార్యలు సమస్వామ్యంతో ఉండవచ్చునని తీర్మానమైంది.

సఖాలిన్ ద్వీపానికి సంబంధించిన గిల్సన్ జాతిలో కూడా ఒకానొక కాలంలో 'బృంద వివాహం' ఆచారంగా ఉన్నదని చెప్పటానికి తగిన ఆధారాలు కనిపిస్తున్నవి. 'ఈ నాటికీ వారిలో ఒక వ్యక్తికి అన్న భార్యలతోనూ, భార్య చెల్లెళ్ళతోనూ వైవాహిక సంబంధం కలిగి ఉండే స్థితి ఉన్నది. వారి జీవన విధానంలో సాంఘిక, ఆర్థిక, సామ్యం కనిపిస్తున్నది' అని ఏంజెల్సు మహాశయుడు అభిప్రాయమిచ్చి ఉన్నాడు.

వివక్షా రహితమైన కామోపభోగం ఉన్న కాలంలో ఏర్పడ్డ సంసారాల వల్ల బృంద వివాహ విధానము అమలులోకి వచ్చింది. అంతకంటె విశేష నాగరికతలను తెలియ పరిచే పునలియన్ వివాహ విధానానికి ఇది పూర్వ రూపము. అన్నదమ్ములు ఒక కుటుంబానికి, అక్కచెల్లెళ్లు ఒక కుటుంబానికి చెందటమనే లక్షణం ఏర్పడ్డ

తరువాత జన్మించినది ఈ పునలియన్ వివాహ విధానము. గుంపు వివాహానికి అటువంటి లోపం లేదు. ఒక కుటుంబంలోని స్త్రీలందరూ జన్మతః, మరొక కుటుంబంలోని పురుషులకు భార్యలు. అదేరీతిగా కుటుంబములోని పురుషులందరూ అవతలి కుటుంబములోని స్త్రీలకు భర్తలు.

బృంద వివాహ విధానాన్ని పరిశీలించి చూస్తే వివాహం గుంపుమీద జరుగు తున్నట్లు కనిపిస్తుంది. భార్యలు కాదగ్గ కులంలోని స్త్రీలు ఎంత దూర ప్రదేశంలోనైనా ఉండవచ్చును. అదేవిధంగా భర్తలు కాదగ్గ పురుషులు కూడా ఎంత దూర ప్రదేశాన్నైనా ఉండవచ్చును. ఒక పురుషుడు జన్మతః తనకు భార్య కాదగిన స్త్రీ దగ్గరికిపోయి నేను నీకు భర్తనని ఆమెతో భోగించవచ్చును. అదేరీతిగా ఒక స్త్రీ ఏ దేశంలో ఉన్నా జన్మతః భర్తృకుటుంబానికి చెందిన పురుషుని దగ్గిరకు పోయి నీవు నా భర్తవని చెప్పి కామోపభోగాన్ని పొందవచ్చును.

ఈ వైవాహిక విధానం నేటి నాగరకుని దృష్టికి కలుషపూరితంగా కనుపించ వచ్చును. కానీ దీనిని గురించి ఒకానొక శాస్త్రజ్ఞుడు ఏమంటున్నారో గమనించవలసి ఉన్నది :

“వ్యభిచార గృహాలకు భిన్నమైన మార్గాన్ని దర్శించలేని ఫిలిస్టయన్ జాతులలో ఉన్న వైవాహిక విధానం కంటే ఇది చెడ్డది కాదు. ఫిలిస్టయన్ జాతుల్లోని వ్యక్తి బహిరంగంగానూ, గూఢంగానూ అనుభవించే కామోద్రేక జీవిత విధానం బృంద వివాహవిధానాన్ని అనుసరించే వ్యక్తులలో కనుపించదు. నేడు బృంద వివాహ విధానం లేదు. లోకంలో దానికి సంబంధించిన కొన్ని లక్షణాలు మాత్రం ఆచారంగా వస్తున్నవి. వాటిని బట్టి చూస్తే అవి కేవలం దాంపత్య వివాహాల కంటెనూ, బహుపత్నీత్వ విధానం కంటెనూ, కొంచెం భిన్నంగా మాత్రమే కనిపిస్తవి. పూర్వం బృంద వివాహం ఉన్న జాతుల్లో కొన్ని సందర్భాలలో స్వేచ్ఛా సంభోగము మాత్రం కనిపిస్తుంది. ఈ హక్కు జన్మతః కలగటం చేత అది అనూచానంగా వస్తున్నది. ఈ ఆచారము క్రమక్రమంగా మాసిపోతున్నది. బృందవివాహ విధానము ఏ నాటికైనా నశించి తీరవలసినదే అయినా అది వివాహ పరిణామస్థితిని తెలియపరిచే ఒకానొక విధానము.”

పై శాస్త్ర కర్త అభిప్రాయపడినట్లే బృంద వివాహమును బహిరంగంగా చూసే వ్యక్తికి ఇది పట్టింపు విశేషంగా లేని దాంపత్య వివాహం గానో, లేక అనిబద్ధ ఏకపత్నీ వివాహము – ఇంత కంటే ఏకగామిత్వము అంటే బాగుంటుంది – (Monogamy)

గానో కనిపిస్తుంది. అక్కడక్కడా బహుపత్నీత్వము కూడా ఉన్నట్లు తోస్తుంది. కొన్ని సందర్భాలలో వైవాహిక ధర్మానికి మోసకారులు (Injidels) కనిపిస్తారు.

ఇటువంటి తికమక ఉండటము వల్లనే అనేక దేశాలలో బృందవివాహ లక్షణాలను చూచి శాస్త్రజ్ఞులు మోసపోయినారు. ఎర్నెస్టు క్రాలే మహాశయుడు ఆస్ట్రేలియా జాతుల్లోకి నూపా, పిర్రారు భార్యలను జూచి అది బహుభార్యాత్వ లక్షణముగాని, బృంద వివాహ లక్షణము కాదనినాడు. పిర్రంగులకు జరిగే బృంద వివాహాన్ని కొందరు కాముక స్వేచ్ఛ (Sexual licence) గా పరిగణించారు.

ఆస్ట్రేలియా జాతుల్లో కొన్ని పండుగలు వచ్చినప్పుడు యువతులను వివాహ యోగ్యలనుగా చేసే ఆచారం ఉన్నది. ఆ స్త్రీలలో వివక్ష లేకుండా కులంలోని పురుషులు అనుభవించటం వలన వారికి పరిణయ యోగ్యత కలుగుతుంది. ఈ ఆచారాన్ని చూచి శాస్త్రజ్ఞులు 'వివక్షారహిత కామము, (Promiscuity) బృందవివాహ లక్షణము అన్నారు. కానీ అది బృంద వివాహ లక్షణము గానీ, వివక్షా రహిత కామముగానీ కాదు. అది ఒక మతాచారము' అని క్రాలే అభిప్రాయపడినాడు. అంతేకాక ఆది అనే పాశ్చాత్య దేశాలలో మధ్యయుగం నాడు విశేష ప్రచారం ఉన్న ప్రభుహక్కుకు (Jusprimae noctis) ఆద్యంతమూ భిన్నమైనదని అభిప్రాయమిచ్చినాడు.

ఆస్ట్రేలియా డైరీ జాతిలో ఉన్న 'పిర్రంగు'ల విషయంలో ఒక నియమ మున్నది. ఆ నియమము అనేక జాతుల్లో కూడా ఉన్నది. భార్య అంటే, టిప్పుముల్కు, లేనప్పుడు మాత్రమే ఒక వ్యక్తి పిర్రంగుతో కాపురము చెయ్యవచ్చును. ఎటువంటి సందర్భములో నైనా ఆ వ్యక్తి పిర్రంగును భర్త దగ్గిరనుంచి బలాత్కరించి తీసుకోరావటానికి అవకాశం లేదు. ఈ 'పిర్రంగు' ఆచారము ఒకానొక ఉపస్థితి (Initiation) ని తెలియపరుస్తుంది. భర్త లేనప్పుడు పిర్రంగుతో మరొకడు కాపురము చెయ్యటము కూడా బృంద వివాహ లక్షణాన్ని వ్యక్తపరుపదు. ఇది ఒకానొక కాలంలో దక్షిణ ఐరోపాలో ఉన్న సిసియేట్ (Ciciseate) వంటిదని ఆయన అభిప్రాయము.

ఈ లక్షణాలన్నీ గుంపుపెళ్లి లక్షణాలనీ, శాస్త్రజ్ఞులు ఒకానొక కాలంలో గుంపు పెళ్ళిళ్ళు ఉన్నవని ఎందుకు అంగీకరించటము లేదో తనకు అర్థము కావటము లేదనీ, అందువల్ల నేటి సభ్యజాతికి ఎటువంటి అగౌరవమూ ప్రాప్తించదనీ 'సంసారోత్పత్తి' రచయిత ఏంజెల్సు మహాశయుడి అభిప్రాయము.

ఆస్ట్రేలియా జాతుల్లో యువకుడు చాలాకాలం అవివాహితుడిగా ఉండాలి. ఇది అతని బ్రహ్మచర్యం కోసం కాదు, ఆ జాతి స్త్రీల కామతృప్తి కోసం. అతను త్వరగా

వివాహం చేసుకుంటే వివాహ ధర్మాన్ని విచ్ఛిన్నం చేసి అతను స్త్రీలతో స్వేచ్ఛగా వ్యవహరించటానికి వీలు ఉండదు. ఈ సందర్భంలో మరొక చిత్రమైన ఆచారాన్ని కూడా గమనించవలసి ఉంది. కొన్ని ఆస్ట్రేలియా జాతుల్లో వివాహ వయస్సు రాని కుర్రవాళ్ళకు పెద్దవాళ్ళనిచ్చి వివాహం చేస్తారు. వారిని కులంలోని పెద్దవాళ్ళు అనుభవిస్తుంటారు. వివాహిత అయిన భార్య మరొకరిని వివాహం చేసుకొనే అధికారం ఉండదు. అందుమూలంగా కులంలోని వృద్ధులైన పురుషులకు యౌవన వతులను అనుభవించే అవకాశం లభిస్తుంది. ఇటువంటి ఆచారాలు కూడా ఒకానొక కాలంలోని వివక్షారహిత కామాన్నీ, బృంద వివాహ లక్షణాలనీ తెలియపరుస్తున్నవని కొందరి అభిప్రాయము.

గుంపు వివాహ పద్ధతిలో ఎప్పుడూ సంతానానికి తండ్రి ఎవరో కనుక్కోటము చాలా కష్టము. తల్లి ఎవరో చెప్పటము చులకన. అయితే ఆ తల్లి తన బిడ్డలనే కాకుండా ఆ వంశంలో ఉన్న పిల్లలనందరినీ తన బిడ్డలుగానే స్వీకరించి వ్యవహరిస్తుంది. తల్లివలెనే వాత్సల్యాదికాలను చూపిస్తుంది. అయినా ఆమె తన పిల్లలమీద ఇతరులమీద కంటే విశేషమైన మమకారం చూపిస్తుంది.

వంశక్రమము బృంద వివాహాన్ని బట్టి మాతృపర మౌతుంది. వంశాలు స్త్రీ నామం మీదనే చెల్లుబడి ఔతుంటవి. సామాన్యంగా అన్ని అనాగరక జాతుల్లోనూ పూర్వం ఇదేవిధానం ఆచరణలో ఉండేది. గౌరవార్హతలు తల్లులకు విశేషము. ఈ విశేషాన్ని ప్రప్రథమంలో గమనించిన శాస్త్రజ్ఞుడు జౌబ్ఫన్ మహాశయుడు. వంశక్రమాన్ని తల్లిమూలంగా గుర్తించడంలో ఆస్తిపాస్తులు తల్లిపరమై ఉంటవి గాని అవి సమష్టి కుటుంబానికి చెందినవి. అందువల్ల అవిభాజ్యాలు.

గుంపు పెళ్ళి ఆచరణలో ఉన్న కాలంలో కూడా ఒకవిధమైన రాక్షస వివాహము (Marraiges by Capture) ఉండవచ్చును. ఏ యువకుడైనా ఒక యువతిని బలాత్కరించి తెచ్చినా, చుట్టిముట్టి అనేకమంది మిత్రులతోనూ బంధువులతోనూ కలిసి ఎత్తుకోవచ్చినా, ఆమెను అపహరించటానికి సాయం చేసిన వారందరితో బాటు కొంతకాలం సమష్టిగా అనుభవించిన తరువాత ఆమె అతనికి ఆచార సమ్మతమైన భార్య ఔతుంది. అప్పుడు ఆమె భర్తల వంశంలోదిగా పరిగణిత ఔతుంది. వారిలో వారికి బాంధవ్యాలు ఏర్పడు తుంటవి. గుంపు పెళ్ళి విధానం అమలులో ఉన్నా వ్యక్తులు జంటలు జంజోయిగా తాత్కాలికంగానో, మరికొంత అధిక కాలమో భార్యాభర్తలుగా కలిసి జీవిస్తుంటారు. ఈ విధానంతో బాటు బహుభార్యాత్వమూ, బహు భర్తృత్వమూ కూడా బృంద వివాహం

ఉన్న జాతుల్లో ఉండవచ్చును. గుంపు పెళ్ళిలో ఉన్న రాక్షస వివాహము వల్లనూ, బహుభార్యాత్వమూ, బహుభర్తృత్వము మూలాన బృంద వివాహం వెనుకబడిపోయి ఉంటుంది.

గుంపు పెళ్ళి (బృందవివాహము) అత్యధమ జాతి వైవాహిక విధానాన్ని నిరూపిస్తున్నది. అంతకంటే ఉత్తమమైనది పునలీయన్ వివాహ విధానము. బృంద వివాహ విధానము ఆటవికులూ, దేశద్రిమ్మరులూ అయిన జాతి జీవిత విధానాన్ని వ్యక్తం చేస్తుంది. 'పునలీయన్' వివాహము కొన్ని కట్టుబాట్లు కలిగిన స్తిమిత జీవిత విధానాన్ని నిరూపిస్తుంది. మానవ జాతులలో ఆటవిక స్థితి పోవటంతో బృంద వివాహ విధానం నశించింది. కానీ ప్రపంచంలో ఇంకా కొన్ని కొన్ని అనాగరక జాతుల్లో దాని లక్షణాలు మాత్రం జీర్ణ స్థితిలోనూ, భ్రష్ట రూపంలోనూ పొడకట్టుతూ ఉన్నవి.

*(ఆంధ్రపత్రిక – 1948 సెప్టెంబరు 22)*

# వివాహము - జయాపజయాలు

మానవ వైవాహిక జీవన ప్రవాహము గంగానది వంటిది. ఇందు వైజ్ఞానిక (Intellectual) ఉద్వేగ (Emotional) ములను యమునా సరస్వతుల సంగమమున్నది. శారీరకమైన కామము (Physical passion) మూల ప్రవాహము. ఈ త్రివిధములైన నదులకూ ఒకవిధమైన లయ, కుదిరినప్పుడే భార్యాభర్తల వైవాహిక జీవన స్రవంతికి ఆనంద మహాసాగర సంయోగం కలుగుతుంది.

అంటే భార్యభర్తలకు శారీరకమైన పరస్పరాకర్షణమూ, అన్యోన్యమూ ఉండి, ఇరువురూ వైజ్ఞానికమైన ఏకస్థితిని పొంది, ఉద్వేగ విషయకమైన ఉన్నత బంధంతో సామ్యము కలిగియుండవలెనని అభిప్రాయము.

స్త్రీ పురుషులిద్దరిలో ఏ ఒకరో వైజ్ఞానిక, ఔద్వేగికాలైన మానసిక బాధలను అనుభవిస్తుంటే అది ఆ వ్యక్తి సహచర, సహచరీ వైవాహిక సౌఖ్యానికి భంగం కలిగిస్తుంది. వివాహ బంధము కేవలమూ అల్పమైన శారీరక శృంగార బంధము (Sexual Erotic Union) కాకపోవుటయే దీనికి కారణము. అందుకనే మానవజాతి శాస్త్రజ్ఞుడు ఎల్లిస్ మహాశయుడు 'ఉదాత్తమూ ఉత్తమమూ అయిన వివాహము కేవలం శారీరక భోగ తృష్ణను తీర్చుకోటంతో ఆగిపోదు. వాటికి భిన్నమైన అనేక బంధాలతో ఇది భార్యాభర్తలను అనువశులను చేస్తుంది. అందువల్ల ఇరువురికీ అభిరుచులూ, ఆదర్శాలూ ఏర్పడుతవి; సహజీవన మర్యాదలు ఏర్పడుతవి; మాతా పితృత్వబంధమూ ఆర్థిక బంధమూ ఏర్పడుతవి' అని అభిప్రాయ మిచ్చాడు. ప్రాచ్య కామ కళా విజ్ఞాని వాత్స్యాయన మహర్షి ఆదిలో శారీరక ప్రతిపత్తిని గురించి విశేషముగ పలికినాడు గాని, త్రివర్గములలో పరస్పరానుఘాతంగా కామాన్ని సేవించాలెనని నిర్దేశించాడు. ఈ రీతిగా ప్రాచ్య పాశ్చాత్య జాతి శాస్త్రజ్ఞులందరూ వైవాహిక జీవితంలో ఉన్న ఈ త్రివేణీ సంగమాన్ని గుర్తించారు.

యౌవనారంభ దశలో భార్యాభర్త లిరువురి మధ్యా శారీరక శృంగార భావం కొంత విశేషంగానే ఉంటుంది. అది కాలక్రమేణా నశించిపోయినా అనేకులలో వైవాహిక బంధం ప్రిదిలిపోవటం లేదు. దీనికి ముఖ్యకారణము పరస్పర ప్రీతిభావం

(Mutual Devotion) వైవాహిక విజయానికి ఇరువురు వ్యక్తులకూ పరస్పర గౌరవాదరణలు (Admiration of Personalities) ఉండి తీరాలి.

వైజ్ఞానిక, ఉద్వేగ, శారీరకములలో శారీరకానికి విశేష ప్రాధాన్యం లేకపోలేదు. వైవాహిక జీవనంలో శారీరకమైన అసంతృప్తి వధూవరులకు కలుగకుండా ఉండటానికే ప్రాచ్య పాశ్చాత్య లోకాలలో కామకళావేత్తలూ, వైద్యశాస్త్రజ్ఞులూ మానవ జాతి విభజన మొనర్చినారు, సాంప్రయోగిక వైవిధ్య (Modus Sexualis) మును నిరూపించినారు. భావరాగ లక్షణ నిరూపణ మొనర్చినారు. పూర్వరతి (Love-play) స్వరూపమును వెల్లడించినారు.

వైవాహిక జీవన విధానంలో స్త్రీలు విశేషంగా ఆశాభంగం ఎందుకు పొందుతారో చెప్పవచ్చును. వివాహబంధంలో స్త్రీ పురుషుని కంటే కొంత విశేషాన్ని ఆశిస్తుంది. ఆమె స్వప్నాదర్శాలకు ఏ మాత్రం విభిన్నత గోచరించినా ఆశాభంగం పొందుతుంది. పురుషుడు స్త్రీవలె గృహ విషయాన్ని విశేషంగా పట్టించుకోడు. అతని దృష్టి గృహేతరమైన బాహ్య ప్రపంచం మీద లగ్నమై ఉంటుంది. అందుమూలంగా వైవాహిక ఛిద్రాలకు స్త్రీవలె అతను నిస్పృహ వహించడు.

ఆధునిక స్త్రీ మానసిక స్థితీ, దృక్పథమూ, మార్పు పొందాయి. అందువల్లనే నేడు స్త్రీ విశేషమైన వైవాహికాశాభంగాన్ని పొందుతున్నది. ముమ్ముందు ఇది ఇంకా విపరీత స్థితిని పొందబోతున్నదని విజ్ఞుల అభిప్రాయము. ప్రాచీన కాలంలో భార్యాభర్తలిద్దరికీ వివాహం ఒక పవిత్ర కర్మ. అందువల్ల స్త్రీ పురుషులిరువురూ వివాహమంటే జంకేవారు కారు. ఏ కారణం చేతనైనా వైవాహికచ్ఛిద్రం ఏర్పడితే దానిని కేవలం విధివిలాసంగా భావించేవారు. ప్రాచీన మానవ సంఘాలు ఈ దృష్టితో వివాహాన్ని గుర్తించేవి. మతపీఠాలూ, పీఠాధిపతులూ ఈ నిశ్చయంతోనే నాటి వివాహాలను ఆమోదించేవారు.

ప్రాచీన వివాహం మీద మొదట పురుషుడు తిరుగుబాటు ప్రారంభించాడు. జీవత సహచరిని ఎన్నుకునే విషయంలో కొంత స్వేచ్ఛను ఆశించాడు. ధర్మశాస్త్రాను సారమైన వైవాహిక జీవనం వలన ఆత్మతృప్తి లేదనీ, వివాహ మూలముగా వైయక్తిక సౌఖ్యము (Personal Stisfaction) లభించవలెననీ, అదే ప్రాప్యమనీ వారు వాదించారు. పురుషులు ఇటువంటి విప్లవ మార్గాలను త్రొక్కటము ఏ నాడో ప్రారంభించినా, స్త్రీలు సాంఘికోన్నతి, ఉజ్జ్వల గృహమూ తప్ప తదితరాలను కోరకుండా వివాహాలు నేటివరకూ చేసుకుంటూ వచ్చారు. అంటే ప్రత్యేక స్త్రీ ప్రణయము కనిపించలేదన్నమాట!

'వేష ధారణలలో పురుషులతో సామ్యమును ఆశించలేదు. శాసనసభలలో సమాన హక్కు కోసం పోరాడి పొందలేదు' అన్నమాట.

కేవలం ఇటువంటి స్వేచ్ఛా సౌఖ్యాలను కోరటమే కాకుండా వివాహం వలన కామతృప్తి (Sexual Satisfaction) ని కూడా వాంఛిస్తున్నారు. పురుషునివలె శారీరకమైన వైవాహిక జీవనంలో వారూ కోరికలు పెంచుకున్నారు. అందువలన వారికి ఆశాభంగము అత్యధికంగా కలుగుతున్నది. వారిలో ఒకవిధమైన శృంగారిక కాఠిన్యము (Mosachistic Tendency) ఏర్పడినది. అందువలన వారు శుక్లస్యందనము విసృష్టి (Orgasm) సంబంధమైన సౌఖ్యాన్ని పొందలేకపోతున్నారు. నేటి స్త్రీకి ఆదర్శలగు అమెరికా యూరప్ దేశ స్త్రీలు (Euro - American women) నూటికి నలుబదిమందియైనా సాంప్రయోగిక సౌఖ్యాన్ని పొందలేకపోవటం జరుగుతున్నదని వాన్డినెల్డి, స్టెకెల్, మేరీ స్టోప్సు మొదలగు రచయితల వ్రాతలవల్ల తెలుస్తూ ఉన్నది. అంటే ఆధునిక స్త్రీ వైవాహిక జీవనంలో ఎంతటి ఆశాభంగాన్ని పొందుతున్నదో దీనివల్ల అర్థమౌతుందన్నమాట.

ఈ రీతిగా స్వేచ్ఛా సామ్యాలను సంపాదించుకొనిన ఆధునిక స్త్రీలలో గృహజీవనమును నెరపుటకు పురాతన మర్యాదల ననుసరించు భర్త పనికిరాడు. నూతనభర్త కావలసి వున్నాడు. పురుషుడు పూర్వం వలె ఒక చక్కని గృహాన్ని చూపించి సాధన సంపత్తి నిచ్చి ఇంతటితో తృప్తి చెందమని చెప్పే దినాలు పోయినవి. అతనికి ఏ విధమైన అంగవైకల్యం ప్రాప్తించినా అది నన్నేమి బాధపెడుతుందని ఇకముందు స్త్రీ తృప్తి వహించదు.

ఇంతకు పూర్వం స్త్రీ పురుష సంయోగం కేవలము ఏకపాత్రాభినయం (Solo). స్త్రీ ద్వితీయ పాత్ర వహించేది. ఈ నాడు అది వాకో వాక్యము (Duet). శృంగారిక రంగస్థలంమీద ఇద్దరూ సమానంగా పాత్ర నిర్వహణం చేస్తున్నారు. అందువల్ల కలిగే లాభనష్టాలకు ఇద్దరూ సమాన బాధ్యత వహిస్తున్నారన్నమాట!

నేటి వధూవరులలో కలుగుతున్న నూతన భావాలు ఒకరీతిగా విజయ వంతమైన వివాహ బంధాలు ఏర్పరుస్తున్న మాట వాస్తవము. కానీ అంతకంటె అధికంగా విజయరహిత వివాహాలను నిరూపిస్తూ ఉన్నవి. స్త్రీ పురుషుల మధ్య కామసంబంధమైన తౌర్యత్రికము (Harmony) కుదరకపోవటానికి ముఖ్యకారణము కామకళా విషయికమైన అజ్ఞానము. కేవలమూ అజ్ఞానము కంటే అపమార్గాన్ని అనుసరించే కించిద్ జ్ఞానము విశేషమైన అజ్ఞానము. ఇందువల్ల కూడా వివాహ బంధాలు విజయవంతాలు కాకపోవటం జరుగుతుంది.

లోకంలో అనేకమంది ప్రణయం సహజమైన అవబోధము (Instinct) అని భ్రమపడతారు. పరిశీలిస్తే మానవుడు తినటమూ, తాగటమూ, ఎలా నేర్చుకున్నాడో, అదేరీతిగా కామాన్ని కూడా నేర్చుకున్నాడు. ఇంకా విశేషంగా నేర్చుకోవలసి ఉంది. కేవలమూ ప్రకృతి ననుసరించటం వల్ల విశేషమైన ప్రయోజనం ఉండదు. దానికీ రసన (Taste) అవసరము. కామాన్ని పొందటంలో కళా మార్గాలను అనుసరించటము ఆరోగ్యానికి భంగమనీ, అది అసహజమైనదనీ కొందరు అమెరికా, ఇంగ్లండు దేశాలలోని భర్తలు భావిస్తున్నారట. ఇది పొరబాటు. ఏ రీతిగా మాతృత్వమునూ, భర్తృత్వ, భార్యాత్వములనూ కళలుగా భావిస్తున్నామో, అదేరీతిగా కామోపాసనమునూ ఒక కళగా భావించటము శ్రేయస్కరమని విజ్ఞుల అభిప్రాయం. అటువంటి అభిప్రాయంతో వైవాహిక జీవనం సాగినప్పుడు నేడు విశేషంగా 'విడాకుల' (Divorce) పాలౌతున్న అనేక సంసారాలలో విచ్ఛిత్తి ఉండదని ఎల్లిస్, యాడ్లర్, వాకర్ మొదలైన మానవజాత్యభిజ్ఞుల అభిప్రాయము.

శారీరకంగా వివాహము విజయవంతం కాకపోవటానికి విశేషంగా భర్తలు కారకులు. వారికి స్త్రీ పురుషులకు కలిగే విసృష్టి సుఖంలోని విభేదం తెలియుట అత్యవసరము. వారికి రతాంతరమున కలుగు శుక్ల క్షరణమున గాని సౌఖ్యం చేకూరదు. ఉపరతి (Tumscence) ఎరుగని భర్తకు రతమున (Da tumscence) భార్యను తృప్తను గావించే శక్తి ఉండదు. ఇతనికి కలిగే త్వరితస్ఖలనము శారీరకలోపము; వైద్యసహాయ మవసరము. స్త్రీలో కామం స్తబ్ధస్థితిని (Frigid State) పొందినప్పుడు ఆమె ఎటువంటి కామానుబంధాన్నీ (Sexual Intimacy) అంగీకరించదు. అది గమనింపని భర్త భార్యను ఉన్నిద్రను చేయటానికి యత్నించి విఫలు డౌతుంటాడు. పురుషుల్లో సంప్రయోగేచ్ఛ హఠాత్తుగా ఉత్పన్న మౌతుంటుంది. అది అతిశక్తిమంతము. స్త్రీలో నిద్రాణమై ఉంటుంది. దీనిని మేల్కొలపటానికే సమస్త దేశాలలోనూ ప్రాచీన కాలంలోనే కామతంత్రాలు బయలుదేరినవి. ఆధునిక భర్త అజ్ఞానం వల్లనూ, అపనమ్మకం వల్లనూ, దూరదృష్టి లేకపోవటం వల్లనూ వాటి పొంతపోక ప్రియాప్రసాధనం చేయలేకపోతున్నాడు. ఈ స్తబ్ధత కేవలమూ స్త్రీలలోనే కాదు; పురుషులలో కూడా ఉంటుంది. ఎల్లిస్ మహాశయుడు 'రెండు జాతులలోనూ నేటి దుష్టమైన విద్యావిధానం వల్లనూ, విశేషమైన వయస్సు వచ్చిన తరువాత వైవాహిక బంధనాలు ఏర్పడటము వల్లనూ, జాత్యజ్ఞానము (Sexual Ignorance) వల్లనూ స్తబ్ధత ఏర్పడుతుం'దని అభిప్రాయమిచ్చాడు.

ఈ స్తబ్ధతకు వ్యతిరిక్తమైన కామోద్వేగము (Hyper - aesthesia) కారణముగాను కొన్ని వివాహాలు విజయవంతాలు కాలేకపోతున్నవి. సహజమైన కామాన్ని బహిర్గతం చేయకుండా ప్రాచీనులు ఏర్పరచిన నిబంధనలు భంగ్యంతరంగా కామోద్వేగానికి కారణాలుగా పరిణమించినవి. ఈ ఉద్వేగము అధికమైనప్పుడు ఉన్మాదంగా పరిణమిస్తుంది (Sexual Neurosis). ఆవిష్కరణాది (Felishism) అసహజలక్షణాలు (Abnormalities) వల్ల ఏర్పడుతుంటవి. ఈ విధమైన ఉన్మాదం వల్ల వివాహ బంధానికి కొన్ని ఆటంకాలు కలుగుతున్నవి. ఇటువంటి స్థితి నాగరక జాతుల్లో కనుపించదు. నాగరికులలో కొంతకాలం ఏకపత్నీత్వమనో, పాతివ్రత్యమనో మనస్సులో దాగి ఉండి కాలక్రమేణ బయటపడతవి. వైవాహికమైన ఆనందాన్ని ఒక మనస్తత్త్వ శాస్త్రజ్ఞుడు పదునాలుగు శ్రేణులుగా విభజించాడు. అతడు పరిశీలించిన నూరు వివాహములలో ఏబది ఐదుమంది భార్యలు భర్తల వైవాహిక జీవితం సహజంగా ఉంటుందనీ, నలుబది ఒక్కమంది భర్తలు వారికి వైవాహికానంద మిచ్చే సుఖం సంపాదించుకోలేరనీ, అందులో ఇరువది ఒక్కమంది భర్తలు దుర్బలులనీ సమాధాన మిచ్చారట. 'వెయ్యి వివాహాలు' అనే గ్రంథంలో డికిన్సన్ తారాబీమ్ మహాశయులు ప్రతిముగ్గురు స్త్రీలలోనూ ఒకతెకు మాత్రమే శారీరకానందము కలుగుతున్నదని వ్రాశారు. టెర్మక్ అను శాస్త్రజ్ఞుడును ఇట్టి అభిప్రాయమును వెలిబుచ్చినాడు. వీటి ననుసరించి కెన్నెత్ వాకర్ తన 'నాగరికతా పరిణామము' (Changes in Civilization) అనే గ్రంథంలో, అసంతృప్తులైన స్త్రీలు వివాహ జీవనమంటే కాలక్రమాన అయిష్టత వహించి పరపురుషాభిలాష చేస్తారని చెప్పాడు.

వైవాహికమైన అపజయానికి నపుంసకత్వం ఒక కారణం. ఇది 90% మానసిక దౌర్బల్యము; మిగిలినది మాత్రమే శారీరకము. దీనికి పెంపకము కారణము. సంఘమూ, సంసారమూ కామాన్ని ఒక పెనుభూతంగా నిరూపించి చూపటమూ, అపవిత్రకర్మగా బోధించటమూ జరిగిన తరుణంలో వివాహం జరిగితే, వైవాహిక జీవనం చెయ్యటానికి తగిన శక్తి వ్యక్తులలో నిద్రితమౌతుంది. వారిని జాతిశాస్త్రజ్ఞులు ఊనకాములు అని అన్నారు. ఊనకామి వైవాహిక కామాన్నీ వ్యభిచారంగా భావించటం అనే అనుమానానికి తావిస్తుంది. అందువల్ల కామోద్వేగము కాని, నపుంసకత్వముగానీ కలుగవచ్చుననీ స్త్రీల జాతిస్వరూపానభిజ్ఞత, కామభీరుత్వము, కామేహ్యత (Disgust) కలుగవచ్చుననీ ఔస్పెన్స్కీ అనే ఒకానొక జాతి శాస్త్రజ్ఞుడు అభిప్రాయమిచ్చాడు. ఇటువంటి మానసికత్వాన్ని మానసిక వైద్యం మూలంగా నయం చేసుకొని వైవాహిక జీవనాన్ని సుఖప్రదం చేసుకోవచ్చునని విజ్ఞుల అభిప్రాయం.

విజయవంతంగా ఉన్నవనుకునే వివాహ బంధాలు కలిగిన భార్యాభర్తలను స్వేచ్ఛగా మాట్లాడే అవకాశాన్ని కల్పించినా, వారిలో ప్రతి ఒక్కరూ రెండవ వారిలో కామోద్వేగం తక్కువని చెపుతారని వాకర్ అనే మహాశయుడన్నాడు. ఇటువంటి సామ్యఆహిత్యాన్ని తీర్చి ఆ వివాహాలను పరిపూర్ణంగా విజయవంతం చేసేమార్గమే లేదు. అయితే మానసిక సామ్యంవల్ల ఈ కొద్ది లోపాలను దంపతులు లెక్కచేయరు. ఇటువంటి లోపాలు కూడా లేకుండా చేయటానికి కొందరు వివాహ పూర్వ ప్రణయ సంయోగము మంచిదని అభిప్రాయపడ్డారు. కానీ దానివల్ల అనేక లోపాలు కూడా సంభవిస్తాయని శాస్త్రజ్ఞులు నిర్ణయిస్తున్నారు.

వైవాహిక జీవనం కొంతకాలం సక్రమంగా సాగిన తరువాత స్త్రీ పురుషులలోని మాతృ పితృత్వ లక్షణాలు బహిర్గతమౌటం వల్ల కూడా తరువాత వివాహచ్ఛిద్రాలు బయలు దేరుతుంటవి. కేవలం సంయోగాసక్తి ఉన్న పురుషుడు (Phallic Type) పిల్లలమీద మమకారం ఉన్న స్త్రీని (Uterine Type) వివాహం చేసుకోవటంవల్ల ఆమెకు సంసారాసక్తి అతనికి కామేచ్ఛ అధికం కావటం జరుగుతుంది. అదేరీతిగా కామాసక్త (Clitoroid Type) కూ సంసారాసక్తునికీ (Orchitic Type) వివాహం జరిగినా కొంతకాలం తీరిన తరువాత అపజయాన్ని తప్పక పొందుతుంది. ఈ దంపతులలో స్త్రీ పురుషులు ఇద్దరూ కామాసక్తులైనప్పుడు పర పురుష దారాభిగమనాలు తప్పవు. అందువల్ల వైవాహిక జీవనంలో కామచిహ్నాలూ, మాతా పితృత్వ చిహ్నాలూ, దంపతులలో సరిసమానంగా ఉండటము అత్యవసరము. నేడు విశేషంగా అవతరిస్తున్న కృత్రిమ సాధనాలు (Contraceptives) మూలంగా స్త్రీ పురుషుని కోరికకు భిన్నంగా శారీరక సౌఖ్యాన్ని పొందటానికీ, భార్య అత్యధికంగా ప్రేమించే సంతానం కలుగకుండా పితృత్వం వహించదలచుకోకపోవటం వల్ల పురుషుడు కేవలం కామాన్ని తీర్చుకోటానికే అవకాశాలు ఏర్పడుతున్నవి. బిడ్డల పోషణను చేయదలచుకోక ఇద్దరూ ఏకగ్రీవంగా కృత్రిమ సాధనాలను ఉపయోగిస్తే తప్ప, లేకపోతే కొన్ని సందర్భాలలో ఈ సాధనాలే వైవాహిక జీవనాన్ని భగ్నం చేయగలవనటంలో సందేహం లేదు.

సంయోగ నాటకంలో కొన్ని తడవలు పొత్తు కలియక పోటానికి భార్య కూడా కారణమౌతుంటుంది. ఆమె తెలివిగలదైతే తనకేమి కావాలో భర్తకు చెప్పటమే కాకుండా, అతనిలో నిద్రిస్తూ ఉన్న శక్తిని ఉన్నిద్రం చేయగలిగలినదై ఉంటుంది. కానీ అటువంటి సందర్భాలలో ఆమె అతనికి గురుత్వము నెరపుతున్నట్లు తెలియకుండానే జరిగించాలి.

స్త్రీకి ఎటువంటి స్వేచ్ఛ లభించినా శారీరక సంయోగ విషయంలో పురుషుడే ప్రధాన భూమిక (Primary Part) వహించటం తప్పదు. అతడు గృహజీవనంలో ద్వితీయ స్థితిని పొందినప్పుడు ప్రణయ విషయంలోనూ ద్వితీయ స్థితిని పొందుతాడు. ఎంతగా తన ఆధిక్యాన్ని చలాయిద్దామనుకున్న భార్య ఐనా ఎక్కడో అన్యమైన ప్రయోజనాలు తప్ప కారణంగా నపుంసకుడిని వివాహమాడదు. ఒక్కొకప్పుడు భార్య భర్తలోని కామశక్తిని సవ్యంగా వ్యాఖ్యానించు కొనలేక, వైవాహిక జీవనం కొంత గడచిన తరువాత అతనికి అనురాగం తప్పిపోయిందనో, లేక వ్యభిచరిస్తున్నాడనో పొరబాటు కూడా పడటం సంభవించి వైవాహిక జీవనానికి భంగం వాటిల్లే చేష్టలు చేయవచ్చును.

వివాహమైన మొదటి దినాల్లో ఇతఃపూర్వము చిదంబర రహస్యంగా ఉన్న దానిని ఆనందాన్ని – పొందవలెననే కుతూహలం వల్ల రమేచ్ఛ ఉద్ధృతంగా ఉండవచ్చును. అది కాలక్రమేణా క్షీణించటమూ సహజము. కృత్రిమమైన వాంఛ తగ్గి సహజస్థితిని వారిరువురూ చేరుకున్నప్పుడే మానసిక నైతిక విషయాలలో అన్యోన్యత కలిగి, వైవాహిక విజయ జైత్రయాత్ర ప్రారంభిస్తారు.

స్త్రీలు ఏకశృంగారలు (Mono - erotic) పురుషులు బహుశృంగారులు (Poly-erotic) అనుకోవటం పొరబాటు. 'శారీరకంగా స్త్రీ అనేకమందిని ఆకర్షించినా ఆమె బిడ్డలకు వేరు వేరు తండ్రులను పొందటముగానీ, అనేక సంసారాలను నిలపడముగానీ పొసగదు. అందువల్ల వారు ఏకగమ్యులే గాని మానసికంగా బహుశృంగారలు' అని ఎల్లిస్ మహాశయుని అభిప్రాయము. ఈ సూక్ష్మమును గ్రహించుట వైవాహిక విషయానికి కొంత తోడ్పడుతుంది. ఒక భార్యాభర్తలు అన్యులచేత ఆకర్షితులైనప్పుడు వారి జీవితము సౌఖ్యప్రదమౌతుందని గాఢమైన నమ్మకం కలిగితే, వివాహ విచ్ఛేదావశ్యకత ఏర్పడుతుంది.

స్త్రీ పురుషులిద్దరూ అన్యోన్యాభిమానంతో ఉంటేగాని వైవాహిక జీవనము జయప్రదం కాదు. కేవలము శారీరకతృప్తి ప్రాధాన్యం వహించిన వివాహాలలో విజయవంతము లైనవి అత్యల్పము. మాతాపితృత్వవాంఛలో వైవాహిక జీవనం నెరపేవారికి సంతానము నిరంతరమూ వైవాహిక విచ్ఛిత్తి కలుగకుండా కాపాడుతుంటుంది.

నేటి వివాహ విధానాలలో ఉద్వేగానికి విశేష ప్రాముఖ్యాన్ని లోకం చూపటం లేదు. కేవలమూ శారీరక సౌభాగ్యానికి లొంగిపోయి కానీ, ఆర్థికాది సంపత్తికి తల ఒగ్గి కానీ వివాహ మాడేవారు, వైజ్ఞానికోద్వేగ సంబంధమైన సామ్యం దాని అంతట

అది ఉన్నప్పుడు సంతోషిస్తున్నారు. కానీ వైవాహిక జీవనంలో ఉద్వేగానికి విశేష ప్రాధాన్యం ఉన్నది. ఇరువురిలోనూ ఒకేవిధమైన ఉద్వేగమూ, ఆదరాభిమానాలూ ఉన్నా కొన్ని సందర్భాలలో వివాహం విజయవంతమైనది కావటం లేదు. కళాకారుల వివాహాలు సర్వసామాన్యంగా ఇటువంటివి. కళాజీవి సర్వసామాన్యంగా తాను కళకోసం జీవిస్తున్నాననుకుంటాడు. కళావేశం కలిగినప్పుడు ప్రియపత్నినైనా తోసి రాజంటాడు. ఇరువురూ కళాకారులై అన్యోన్యమైన భావోద్వేగాలను అవగతం చేసుకుంటే తప్ప, సర్వసామాన్యంగా వారి జీవితం వైవాహికంగా విజయవంతమైనదని చెప్పటానికి వీలుండదు. కేవలం తన మానసికోద్వేగాలను అనుసరించి ఆనందాన్ని పొందే వ్యక్తి సహచరికి వైవాహిక సౌఖ్యముండని మాట వాస్తవము. ఇటువంటి స్త్రీలును ఉండవచ్చును. బార్నిస్ 'జాతి, నేస్తము, వివాహము' అనే గ్రంథములో 'స్త్రీ జాతిలోని ఒకానొక అదుపాజ్ఞలు కలిగిన మానసికోద్వేగకు ఆ వైవాహిక విజయానందము శూన్య'మని ఈ విధంగా అభిప్రాయపడ్డాడు :

''The most dangerous type of female flirt is the beauty who uses every kind of art of attraction, accepting all the tributes that her admirers offer; leading men to believe that she is being ensnared but withdrawing safely and retaining her physical 'Purity' and inviolability each time. She is often for sale to the highest bidder, but she is sometimes only an abnormally cold and permanently immature person who cannot make a success of any kind of marriage'' అని అతని అభిప్రాయము.

స్త్రీ మానసికోద్వేగానికి నేటి వైవాహిక జీనవంలో కించిత్తయినా గౌరవం లేదు. సర్వసామాన్యంగా స్త్రీ మానసికోద్వేగం అతి అనాగరక స్థితిలో స్వామిత్వవాంఛ (Possessiveness), ఈర్ష్య ఇత్యాదులు అధికము. సృజనావిధానంలో ఆమె వీటిని మరిచిపోతుంటుంది. ఆమెకు తగిన సృజనోద్వేగవాంఛ తీరకపోవటంవల్ల కూడా వైవాహిక జీవనానికి ఆనందం ప్రాప్తించదని ఒక వేత్త అభిప్రాయము. మానసికోద్వేగము తీరని ఆధునిక స్త్రీలు కొందరు నవోఢలతో అధిక స్నేహము (Unisexual Love) చేస్తున్నట్లునూ, అందువల్ల విశేష ప్రమాదములు సంభవిస్తున్నట్టూ తెలుస్తున్నది. తమతో సమానమైన మానసికోద్వేగమూ, విజ్ఞానమూ కల పురుషుని కాని వరింపమని అన్వేషణ చేస్తున్న అనేకమంది ఆధునిక కన్యకలకు ఏదో విధమైన సృజనావృత్తు (Creative occupations) లతో సంబంధము కలిగి ఉండటము అవసరమనీ, అందువలన వారికి శారీరకమైన అవకాశాలేమిటో, వాటినుండి ఏ విధంగా బయటపడవలసి

ఉంటుందో తెలుస్తుందనీ లారా హట్టన్ 'ఏకాకిని' (Single Woman) అనే గ్రంథంలో వ్రాసింది.

వైజ్ఞానికంగా స్త్రీ పురుషు లిరువురూ నేడు సామ్యము కలిగి లేరు. కాని అట్టి స్థితికి సహచరినిగానీ, సహచరునిగానీ తీసుకొని వచ్చు ప్రయత్నమున్నప్పుడు వైవాహిక జీవనము విజయవంతమూ, ఆనంద ప్రదమూ ఔతుందనటములో ఆటంకము లేదు. అందువల్ల లోకంలో వైవాహిక జీవనము సౌఖ్యప్రదము కావటము కేవలము ఉ|ట ఉడియముగా కలుగదు. దానివల్ల కలిగే బాధలు విశేషంగా దంపతులలో ఏ ఒక్కరోగాని లేక ఇరువురు గానీ తాము ఎట్టి బాధ్యతా వహించకుండానే వివాహం వల్ల సమస్తమూ పొందవలెనని కోరుకోటం వల్లనే కలుగుతున్నవి. వివాహం విజయవంతమైనది కావటానికి కన్యావరణ; వధూవరణము మొదలు వైవాహిక జీవనము ఒక సమస్థితి వహించేవరకూ జరుగవలసిన సమస్తమైన కర్మలమీదనూ ఆధార పడవలసి ఉంటుందని చెప్పవచ్చును. ఇందులో ముఖ్యమైనది కన్యావరణమే. అందువల్లనే ఈ సమస్తమైన అభిప్రాయాలూ సూత్రప్రాయంగా మహర్షి వాత్స్యాయనుడు ఆయన కాలానికి తగిన భాషలో కన్యాసంప్రయుక్తములోని వరణాధ్యాయమున, కేవలమూ పురుష పరంగానే 'సవర్ణాయాం అనన్య పూర్వాయాం శాస్త్రతోఽ ధిగతాయాం, ధర్మోర్థః, పుత్రాః సంబంధః పక్షవృద్ధిః అనుపసత్కృతా రతిశ్చ' అని శాస్త్రబద్ధం చేశాడు.

***(ఆంధ్రపత్రిక 1948, నవంబరు 10)***

# వివాహము - వయస్సు

వైవాహిక సమస్యలలో వయోనిర్ణయం ఒకటి. అది ఏ ఒక ప్రత్యేక కారణంమీదా ఆధారపడి ఉండదు. ముఖ్యంగా దేశము, కాలము, వృత్తి, ఆర్థిక వ్యవస్థ, వ్యక్తుల గుణగణాలను బట్టి ఈ సమస్య నిర్ధారణ చేయవలసి ఉన్నది.

కొన్ని దేశాలలోనూ, జాతుల్లోనూ భార్యలు దొరకటం చాలా కష్టము. కొన్ని దేశాలు కేవలం 'కన్యావివాహాలు' పరమ పవిత్రాలుగా భావిస్తుంటవి. అటువంటి సందర్భాలలో వయస్సు ఈ లక్షణాలను అనుసరించి దేశకాలపాత్రలుగా నిరూపితమౌతుంది. బగండా జాతిలో బహుపత్నీత్వవిధానం అమలులో ఉంది. స్త్రీపురుష జన సంఖ్య 31/2 :1X ఉన్నా యువకులకు భార్యలు దొరకటం కష్టమట. అందువల్ల ఆ జాతివారు కన్యకను చౌకగా కొనవచ్చుననే ఉద్దేశంతో కన్యా వివాహాలు చేస్తారు. అందువల్ల కన్యాత్వం దూషితము కాకపోవటము వధూవరులు ఉభయవంశాల పరస్పర మైత్రి అభివృద్ధి అకృత్రిమంగా పెంపొందించుకోటానికి అవకాశం ఉంటుంది. కొన్ని సెమిటిక్ జాతుల్లో 18 ఏళ్లు దాటిన పురుషుణ్ణి భార్యను చూచుకోమని - న్యాయస్థానం ఒత్తిడి చేస్తుందట. అటువంటి నిర్ణయము స్త్రీ విషయంలో 13వ సంవత్సరానికే ప్రారంభిస్తుంది.

కన్యావివాహాలు పనికిరావనే వారు వారికి ప్రథమంలో వివేచనజ్ఞానం ఉండని కాలంలో వివాహం జరిగి, తరువాత రజస్వలలై భర్తగృహంలో నూతన గృహస్థితులతో విసుగు చెందుతుంటారు. అది భవిష్యద్వైవాహిక జీవనానికి భంగం కలిగిస్తుందని - అభిప్రాయపడ్డారు. యౌవనారంభంలో వివాహం జరిగితే ఆ వయస్సులో స్త్రీ పురుషుల మనస్సులు కొంత పరిపక్వతను పొంది ఉండడం ఒకరినొకరు అవగతం చేసుకొనగలుగుతారు; అందువల్ల వైవాహిక జీవితంలో అన్యోన్యత ఉంటుందని వారంటారు. యౌవనారంభంలో జరిగే వివాహాలలో కేవలం జాత్యాకర్షణ (Sexual attraction)కు మాత్రమే ప్రధాన స్థితి లభిస్తుందనీ, పరిపూర్ణమైన మానసిక ఉద్వేగాదికాలను గురించి ఉద్యద్యౌవనంలో ఉన్నవారు ఆలోచించరనీ వీరిని కొందరు ఖండించకపోనూ లేదు.

వివాహ వయస్సుకు నిర్ణయం ప్రధాన సూత్రాలలో సంతానం ఒకటి, వయస్సు మీరిన కొద్దీ సంతానాన్ని పొందటం కష్టం. వయస్సు మించిన కొద్దీ స్త్రీలలో ముఖ్యంగా, కొంత స్తబ్ధత (Frigidity) ఏర్పడుతుంది. అందువల్ల ముప్పది ఏండ్లు దాటిన స్త్రీ సంతానాన్ని పొందటానికి ఎంతో బాధపడవలసి ఉంటుంది. యౌవనారంభంలో ఉన్న వ్యక్తికి శరీరాపాయం లేకుండా సంతానం కలుగుతుందని శాస్త్రజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. యౌవనారంభం అయిన తరువాత వయస్సు ఎంతగా పెరగకపోతే సంతానాన్ని అంతే సుకరంగా పొందవచ్చునన్నమాట.

పేటక్, మాక్సు క్రిస్టియన్ వంటి సంతాన శాస్త్రజ్ఞులు పురుషుడు 25వ ఏట, అంతకంటె కొంత వయస్సు తక్కువలో స్త్రీ వివాహం చేసుకోవటం యుక్తమన్నారు. అనేక కారణాల చేత కొద్ది వయస్సులలో వివాహం చేయటం పనికిరాదని పాశ్చాత్య లోకాలలో శాస్త్రజ్ఞులు పలుకుతున్నారు. వారు చెప్పే ముఖ్య కారణాలను పరిశీలించవలసి ఉంటుంది. ఆధునిక స్త్రీ పురుషునితో సమాన స్వేచ్ఛనూ, ప్రాతినిధ్యాన్నీ వహిస్తున్నది. అందువల్ల ఆమెకూ ప్రత్యేక వ్యక్తిత్వమున్నది. ఆ కారణం మూలంగా వెనకటి వలె వివాహ నిర్ణయ విషయంలో పురుషునికి వలె ఆమెకూ ప్రధాన స్థితి ఉన్నది. ఆమెకు వయస్సు అభివృద్ధి అవుతున్న కొద్దీ అనేకులతో పరిచయం కలిగించుకునే అవకాశం లభిస్తుంది. ఆ పరిచయస్థులలో ఎవరితో ఆమె వైవాహిక జీవనము సంతృప్తికరంగా ఉంటుందో నిర్ణయించుకునే అవకాశం ఆమెకు లభింపజేయటం అత్యవసరం కనుక, కన్యకగా ఉన్నప్పుడే ఇక వివాహం పొసగదని వీరి అభిప్రాయం.

రెండవ కారణం విద్యాసంబంధమైనది. భవిష్యద్గృహకృత్యాలను సమర్థతతో సరిదిద్దుకోదగిన విద్య, కాలానుగుణమైన విజ్ఞానం పొందటానికి యుక్తమైన వయస్సు ప్రాచీనకాలం కంటే విశేషంగా కావలసి ఉంది. అందువల్ల కూడా వైవాహిక వయస్సు తప్పకుండా అభివృద్ధి పొందవలసిన అగత్యం కనిపిస్తున్నదని వారి నిశ్చయము. ఇందుమూలంగా పురుషుని వైవాహిక వయస్సు కూడా పెరిగి కావలసిన ధనాదికాన్ని సంపాదించి వైవాహిక జీవనాన్ని సుఖప్రదం చేసుకునే అవకాశాన్ని అతడూ పొందగలుగుతాడు. ఇటువంటి అవకాశాలు లేకపోతే జీవిత సహపథికులుగా ఉండి పవిత్ర జీవయాత్ర సాగిద్దామనుకుంటే భార్యాభర్తలిద్దరూ నిరాశను పొందుతుంటారు. సంసార బాధ్యతలతో భర్త ఆర్థిక ప్రతిపత్తికోసం పాకులాడుతుంటే, భార్య ఏకాంత జీవనం గడుపుతూనో, లేక ఆమె కూడా ఆర్జనకు పూనుకోవలసి ఉండటం వల్లనో వైవాహిక జీవనం అసంతృప్తికర మౌతుందని వారి అభిప్రాయము.

కానీ అటువంటి వ్యక్తులు కూడా వైవాహికానందాన్ని పొందటానికి వీలులేకపోలేదట. అది సంతాననిరోధము. వారు కొలది రాబడిలోనే జీవితాన్ని ఇముడ్చుకుంటూ సంతాన నిరోధక సామగ్రి (Contraceptives) సహాయంతో సంసారం పెరగకుండా చూచుకుంటూ, కొంతకాలం ధనం ఆర్జించిన తరువాత సంతానాన్ని పొందవచ్చుననే పాశ్చాత్య సంతాన శాస్త్రవేత్తలు కొందరున్నారు. బహుకాలము విశేషంగా సంతాన నిరోధక సామగ్రిని ఉపయోగించిన వధూవరులకు సంతానం కలగటం అసంభవ మనేవారు కొందరూ, కలిగే సంతానం కేవల తామసిక, రాజసిక ప్రవృత్తులతో ఉంటుందనేవారు కొందరూ లేకపోలేదు. నేటి ఆర్థిక స్థితిని అనుసరించి పాశ్చాత్య దేశాలల్లో వైవాహిక వయస్సు 20, 25 సంవత్సరాలు స్త్రీకినీ, పురుషుడికి 30 సంవత్సరాలు అనీ వివాహ గ్రంథకర్తలు నిశ్చయించారు.

వివాహానికీ, కన్యకలు రజస్వలలు కావటానికి కొంత సన్నిహిత సంబంధము కనిపిస్తున్నది. పుష్పవతులు కానివాళ్ళకు వ్యక్తిత్వముండదని – ఐననూ కొందరికి లేకపోవచ్చును – సామాన్యాభి ప్రాయము. మగపిల్లలకు కూడా వ్యక్తిత్వానికి కొంత వయస్సు అంటూ ఉన్నది. మానసిక శాస్త్రవేత్తలు మానవ జీవితాన్ని 1. నగ్నత్వము (Infancy), 2. బాల్యము (Childhoold), 3. యౌవనము 4. ప్రౌఢత్వము (Adult life), వృద్ధాప్యము (Old age) అని విభజించారు. నగ్నత్వము ఏడు సంవత్సరముల వరకు, ఏడు మొదలు పదునాలుగు వరకు బాల్యము. అది మొదలు యౌవనము ఇరువది ఒక్క సంవత్సరమునకు. ప్రౌఢజీవనము 50 సంవత్సరముతో అంతమౌతుంది. తరువాత వృద్ధాప్యము. రోమక ధర్మ శాస్త్రములో స్త్రీ పురుష వ్యక్తిత్వ వయోనిర్ణయం కనిపిస్తుంది. అందు స్త్రీకి 12వ ఏటా, పురుషునికి 14వ ఏటా వ్యక్తిత్వం (Puberty) కలుగుతుందని నిర్ణయం జరిగింది. దీనిని బట్టి సర్వసామాన్యంగా పదనాలుగు సంవత్సరాల ప్రాంతములో వ్యక్తిత్వం స్త్రీ పురుషులిరువురికీ కలగటం ప్రారంభిస్తుందని మూకుమ్మడిగా చెప్పవచ్చును. కానీ ఈ వ్యక్తిత్వం కలగటం కూడా ఆ దేశాల శీతోష్ణస్థితులమీదా విశేషంగా ఆధారపడి ఉంటుంది. ఉష్ణ ప్రదేశాలలో కొంత వేగంగానూ, శీతల ప్రదేశాలలో కొంత ఆలస్యంగానూ బాలబాలికలకు వ్యక్తిత్వం కలగటము సహజమని అభిజ్ఞులు పలుకుతున్నారు. కొన్ని సమయాలలోనూ, సంఘాలలోనూ వారి వారి కామకళా జీవనం కూడా బాలబాలికలకు త్వరగా గానీ, ఆలస్యంగా గానీ వ్యక్తిత్వం కలగటానికి తోడ్పడుతుంటవి. ప్రపంచములోని కొన్ని దేశాలలో వ్యక్తిత్వాన్ని (Majority) అంగీకరించటానికి కేవలం రజస్వలాధర్మారంభాన్ని గానీ, ఉద్యద్యౌవనాన్నిగానీ పరిగణించక, యౌవన ప్రారంభానంతరము కొన్ని

సంవత్సరాలు గడవనిచ్చారు. ఇటలీలోనూ, హాలండు, గ్రీసు, ఇంగ్లండు, ఫ్రాన్సు దేశాలలో 21వ వత్సరంగా, స్త్రీ పురుష విభేదం లేకుండా వ్యక్తిత్వ వయో నిర్ణయం (Determing the age of Majority) జర్మనీలో 20 గానూ, స్పెయిను 23, ఆస్ట్రియా 24 గానూ పరగణిస్తున్నవి. కానీ ఈ వయో నిర్ణయము న్యాయశాస్త్రానికి మాత్రమే వర్తిస్తుంది. సామాన్య వ్యక్తిత్వము (Puberty) స్త్రీలకే ముందు ప్రారంభమయ్యేటట్లు అందరూ అంగీకరిస్తారు. ప్రపంచంలోని వివిధ దేశాలలోనూ ఈ శతాబ్దారంభదశలో ఈ కిందివిధంగా వైవాహిక వయో నిర్ణయం జరిగినట్లు తెలుస్తున్నది

| **దేశము** | **పురుషుడు** | **స్త్రీ** |
|---|---|---|
| ఫ్రాన్సు | 18 | 15 |
| జర్మనీ | 20 | 16 |
| ఆస్ట్రియా | 25 | 24 |
| స్పెయిన్ | 18 | 16 |
| గ్రీసు | 16 | 14 |
| హాలండు | 18 | 16 |
| ఇటలీ | 18 | 15 |
| డెన్మార్కు | 20 | 16 |

అయితే తల్లిదండ్రుల (ఉభయ పక్షాలలోనూ) అంగీకారముంటే బాలబాలికలు 14వ సంవత్సరంలో వివాహం చేసుకోవచ్చునని ఆస్ట్రియా దేశంలో అభిప్రాయంగా ఉండేది.

భారతదేశంలో వైవాహిక వయో నిర్ణయం చిత్రాతిచిత్రమైన మార్గాలను అనుసరించుచున్నట్లు కనిపిస్తుంది. మొదట రజస్వలానంతర వివాహాలు ఉన్నట్లే కనుపించినా తరువాత తరువాత కన్యా వివాహాలు ప్రబలినవని చెప్పవలసి వస్తున్నది. అవి వర్ణవ్యవస్థ ననుసరించి అంతర్విభేదాలతో కూడా ఉన్నట్లు అర్థమౌతుంది. 'దేశప్రవృత్తి సాత్మ్యాద్వా బ్రహ్మ ప్రాజాప త్యార్ష దైవానా మన్యతమేన వివాహేన శాస్త్రతః పరిణయే దితి వరణవిధానమ్' (2-1-21) అన్న వాత్స్యాయన మహర్షి సూత్రాన్నిబట్టి చూస్తే, భారతదేశంలో క్రీ.శ. 4వ శతాబ్ది మధ్యభాగం నాటికే, అంతకు పూర్వం కొంతకాలం నుంచి కూడా అష్టవిధ వివాహాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. కొందరు కన్యనూ, కొందరు గాంధర్వ విధానాన యువతినీ వివాహ మాడినట్లు విస్పష్టము. కామతంత్రానికి ఏకైక శాస్త్రకారుడు వాత్స్యాయనుడు కన్యా సంప్రయుక్తంలో

గాంధర్వము ఉత్తమోత్తమ వివాహమన్నాడు ఒకచోట. అందువల్ల రజస్వలానంతర వివాహాలు కన్యావివాహాలుగానే పూర్వం పరిగణితాలైనవని అనవచ్చును. కన్యా వయో నిర్ణయం కూడా అవ్యవస్థంగా మారుతూ వచ్చినట్లు కనిపిస్తున్నది. దానిని కొంతగా ఇక్కడ సంగ్రహించటం అవసరం.

భారతీయ గృహ్య సూత్రాలలో కొన్ని పిల్ల పుష్పవతి కానప్పుడు వివాహం చెయ్యమని, కొన్ని నగ్నికగా ఉన్నప్పుడే జెయ్యమని (హిరణ్యకేశి గృహ్యసూత్రము - 1-19-2) చెప్పినవి. నగ్నిక అంటే ఆసన్నార్తవ. మానవ గృహ్యసూత్రము పుష్పవతి కాని కన్యకను వివాహం చేసుకోమని చెప్తున్నది. (1-7-4) పారాశరగృహ్య సూత్రంలో నూతన వధూవరులు క్షారం తినకూడదనీ, మూడు రాత్రులు అధశ్శయనం చెయ్యమనీ మిథునకర్మ జరుపరాదనీ చెపుతున్నది (2-1-4) ఆశ్వలాయన (1-8-10), ఆపస్తంబ (3-8-89) సాంఖ్యాయన (1-17) మానవ (1-14-14) కాథక (30-1) ఖాదిర (1-4-9) గోభిలీయ (2-3) గృహ్యసూత్రాలలోనూ ఇటువంటి నిబంధనలు కనిపిస్తున్నవి. ఆశ్వలాయన గృహ్యసూత్ర వ్యాఖ్యాత కాలంలో - క్రీ.శ. 1200 ప్రాంతంలో వివాహం కాగానే గర్భాధానం జరుగుతున్నట్లు ఆయన గ్రంథంవల్ల వ్యక్తమౌతున్నది. అందువల్ల హరదత్తుని కాలం నాటి వైవాహిక వయస్సు కన్యకకు 14 సంవత్సరాలుగా నిర్ణయం చెయ్యవచ్చును. యాజ్ఞవల్క్య (1-2) సూత్రగ్రంథాలలో గర్భాధారణ వంటి చతుర్థికర్మ ఒకటి కనిపిస్తున్నది. ఈ కర్మ వివాహమైన తరువాత, అంటే పాణిగ్రహణానంతరం నాల్గవనాడు జరుగుతుంది. మూడు దినాలు గడిచిన తరువాత ప్రథమ సంగమం జరుగవచ్చునని కొందరు ఆచార్యుల మతం. ప్రథమ సంయోగము ప్రథమరజస్సు ఆగిపోయిన తరువాత జరుగవలెనని సాంఖ్యాయన (1-17-19) పరాశర (1-11) ఆపస్తంబ (3-8-10) హిరణ్య కేశి (1-23) గృహ్యసూత్రాలు చెబుతున్నవి. కొన్ని గృహ్యసూత్రాలలో వివాహం జరుగుతుండగా ప్రథమరజోదర్శనమైతే వాటి ప్రాయశ్చిత్తం కనిపిస్తున్నది. బోధాయన (4-1-10) కౌశిక - (79-16) స్మార్తసూత్రాలు (6-13) మనుస్మృతి పుష్పవతి అయిన తరువాత మూడు సంవత్సరాలు గడిచిన తరువాత కన్యకకు తల్లిదండ్రులు వివాహం చెయ్యకపోతే, ఆమె స్వయంగా భర్తను వెతుక్కోవచ్చు అనే అనుశాసనం కనిపిస్తున్నది. మనువు ముమ్మారు పుష్పవతి అయిన తరువాత స్వయముగా పురుషుని వరించి సంయోగాన్ని పొందవలెననీ, నగ్నికగా ఉన్నప్పుడే వివాహం కావలెననీ కొందరన్నమాట తప్పనీ త్రోసివేసినాడు. వీటన్నింటిని బట్టి పరిశీలించినప్పుడు

రజస్వలానంతర వయసే వివాహ వయస్సు. బోధాయన సూత్రం కూడా (4-1-12-15) ఈ విషయాన్ని అంగీకరించింది.

మనువు (9-89-90) సద్వంశజుడు సద్యోన్యుడూ అయిన వరుడు లభించకపోతే కన్యక మృతివరకూ తండ్రి ఇంట్లోనే ఉండిపోవచ్చు అన్నాడు. ఇది ఒకవిధంగా నేటి పాశ్చాత్య విద్వాంసురాలు ఎలెన్‌కీ కోరిన మాతృత్వ రహితతావజ్ఞ (Exemption from Motherhood) అని చెప్పవచ్చును. ఈ పై అభిప్రాయాన్నే మహాభారతంలో వేదవ్యాసుడు అంగీకరించినాడు. (44-16)

మనువు తరువాత కాలక్రమాన కన్యక వివాహ వయస్సు తగ్గించడం జరిగింది. లౌషాక్షి గృహ్య సూత్రము ఆడపిల్లల బ్రహ్మచర్యము 10-12 సంవత్సరాలతో అంతమొందుతుంది అని చెప్పినది (19-2). వైఖానసస్మృతి బ్రాహ్మణుడిని నగ్నికను గానీ, గౌరిని గానీ వివాహమాడవలసిందని చెప్పి నగ్నిక వయస్సు 8 సంవత్సరాలనీ, గౌరి పుష్పవతికాని 10, 12 సంవత్సరముల కన్యక అని పలికింది. ఒక సూత్రంలో మృతి పర్యంతమూ వివాహమాడకుండా ఉండటానికి పైన చెప్పినట్లు మనువు అంగీకరించినా, మరొకచోట (9-94) 'ముప్పది సంవత్సరాలున్న యువకుడు అందమైన 12 సంవత్సరాల కన్యకను వివాహమాడవలసిం' దని శాసించాడు. ఆ సూత్రంలోనే పరంపరాగతాలైన వృత్తులూ, ధర్మాలూ నశించిపోతాయని తోచినప్పుడు, 24 సంవత్సరాల వయస్సున్న యువకుడు 8 సంవత్సరాల కన్యకను వివాహమాడ వచ్చునన్నాడు. పరాశర స్మృతిలో (ప్రకరణము 8) 8 ఏండ్ల కన్యక గౌరి అనీ, 9 ఏండ్ల కన్య రోహిణి అనీ, 10 ఏండ్ల కన్య రజస్వల అనీ చెప్పి ఉంది. 12 ఏండ్లు వచ్చిన తరువాత కన్యాదానం చెయ్యకపోతే ఆమె రజస్సును పితృదేవతలు పానం చేస్తారట, ఆమె తల్లిదండ్రులూ, జ్యేష్ఠభ్రాతలూ నరకాన్ని పొందుతారట. యమపరాశరాది గ్రంథాలు రజస్వలానంతర వివాహాన్ని పాపకృత్యంగా పరిగణించినవి. క్రమక్రమంగా 'అష్టవర్షా ద్భవేత్ కన్యా' అనే ఆర్యోక్తి ఏర్పడ్డది. బాల్యవివాహాలు ప్రబలినవి.

రామాయణంలో (అరణ్య కాండ 47-10-11) వివాహ సమయానికి సీతారాములకు వయస్సు 6, 16 సంవత్సరాలు, కానీ కౌటిల్యుని అర్థ శాస్త్రంలో క్షత్రియకన్యకు16వ ఏట వివాహం చెయ్యటం యుక్తమని కనిపిస్తున్నది.

వైద్యశాస్త్రజ్ఞుడు సుశ్రుతాచార్యులు 25 సంవత్సరాలు వచ్చిన తర్వాత యువకుడికీ, 12 ఏండ్లు వచ్చిన తరువాత బాలికకూ వివాహం చేయమన్నాడు. వాగ్భటుడు యువకుని

వయస్సు 21 సంవత్సరాలకు తగ్గించి, బాలికలకు 15,16 సంవత్సరాలకు పూర్వం సంతానం కలగటం ప్రారంభిస్తే, తల్లికి బిడ్డలకీ ప్రమాదమన్నాడు.

సుశ్రుతాచార్యుల మతాన్ని అనుసరించి స్త్రీజాతి ఋతుధర్మం 12వ ఏట ప్రారంభించి 50 సంవత్సరాలవరకూ ఉంటుంది. 15 మొదలు 45 ఏళ్ళవరకూ సామాన్యంగా సంతానాన్ని పొందవచ్చును. ఆ నాటి భారతీయుని విద్యాభ్యాసానికి 25 సంవత్సరాలు పట్టి ఉండటం వల్ల పురుషుని వైవాహిక వయస్సు 25 అని ఆయన చెప్పి ఉంటాడు. పూర్ణ పురుషాయుష జీవితాన్ని మూడు విభాగాలు చేస్తే 32 సంవత్సరాలు వస్తుంది. సన్యాసాశ్రమము లేకపోతే బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థాలు ఒక్కొక్కదానికి 32 సంవత్సరాలనీ, నాలుగు ఆశ్రమాలు ఉన్నప్పుడు ఒక్కొక్కదానికి వయస్సు 25 సంవత్సరాలనీ సుశ్రుతాచార్యులు భావించి ఉండవచ్చునని ఒక ఆధునిక వైద్య శాస్త్రజ్ఞుని అభిప్రాయం.

స్త్రీ పురుషుల మధ్య వైవాహిక వయస్సులో అంతరం ఎంత ఉండవలెననేది మరొక సమస్య. వీరి ఇరువురి మధ్య ఉండే అంతరాన్ని బట్టి కూడా కలిగే సంతానము, సౌఖ్యకరమైన జీవనమూ ఆధారపడి ఉంటాయి. ప్రపంచంలో సర్వసామాన్యంగా అనేక జాతుల్లో పురుషుని కంటె వధువు వయస్సు తక్కువగా ఉంటుంది. ఎక్కడైనా వరునికంటే వధువు వయస్సు అధికంగా ఉంటే దానికి ప్రత్యేకమైన కారణాలు ఉండవచ్చును. అన్న చనిపోయినప్పుడు అన్నభార్యను విధిగా వివాహమాడవలసిన సందర్భాలలో తప్పకుండా వధువు వయస్సులో వరుని మించి ఉంటుంది. ఆధునిక యుగంలోని ప్రణయ వివాహాలల్లో కొన్ని సందర్భాలలో కూడా వరుని కంటే వధువు వయస్సు పెద్దదిగా ఉండవచ్చును. సర్వసామాన్యంగా అటువంటి సందర్భాలలో కూడా విజ్ఞులు దానికి ఏదో మానసిక దౌర్బల్య సంబంధమైన మూలకారణాన్ని చెప్తూతున్నారు. ఏ దేశంలోనైనా వరుడు తప్పకుండా తనకంటే వయస్సున కొంత తక్కువగా ఉన్న దానినే వివాహం చేసుకోటం ఆచారంగా ఉంటుంది. సుశ్రుతాచార్యుల మతాన్ని అనుసరించి స్త్రీలలో ఋతుధర్మం 15 సంవత్సరము మొదలు 45 వరకూ ఉంటుంది. కాబట్టి వారి ఇరువురి మధ్యా సౌఖ్యకరమైన జీవనమూ, సంతానమూ కలుగవలెనంటే 15 సంవత్సరాల అంతరం ఉండితీరవలెనని అవగతమౌతున్నది. మనువు కూడా ముప్పదిసంవత్సరాల యువకుడు పన్నెండు సంవత్సరాల కన్యకను వివాహమాడ వలసిందని అన్నాడు. (9–24) అంటే ఆయన మతాన కూడా 18 సంవత్సరాల అంతరం ఉన్నదన్నమట. నేడు భారతదేశంలో జరుగుతున్న వివాహాల్లో వధూవరుల

అంతరం 5 మొదలు 15 సంవత్సరాలుంటూ ఉన్నది. మహర్షి వాత్స్యాయనుడు ఆయన సూత్రాలలో (3-1-2) 'త్రిర్వాత్ప్రభృతి న్యూనవయసం' అని చెప్పినాడు. అంటే వధూవరుల మధ్య అంతరం తప్పకుండా మూడు సంవత్సరాలైనా ఉండి తీరాలన్నమాట. దీనిని బట్టి 3 మొదలు 15 సంవత్సరాల వరకూ అంతరం ఉండవచ్చును. 'ఆర్ట్ ఆఫ్ లవ్ ఇన్ ది ఓరియంట్' అనే గ్రంథంలో యన్.కె. బాసు మహాశయుడు భార్యాభర్తల అంతరాన్ని గురించి 'Ten years of age may be put as the safe biologic 'buffer' between marital partners in view of the fact that the senile changes take place earlier in Women than in Men and that feminine charm is always the outstanding asset in the balance sheet of Nuptials' అని వ్రాసి ఉన్నాడు. అంటే మొత్తముమీద ఏ మతాన్ని అనుసరించి చూచినా, మూడు సంవత్సరాలకన్నా తక్కువ గాని అంతరం వధూవరుల మధ్య తప్పకుండా ఉండితీరాలని అర్థమౌతున్నది.

*(ఆంధ్రపత్రిక **1948**, నవంబర్ **17**)*

# రాక్షస వివాహము

"అంకిలి సెప్పలేదు చతురంగబలంబుతోడ నెల్లి ఓ పంకజనాభ. నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా వంకకు వచ్చి రాక్షస వివాహమునకు భవదీయశౌర్యమే యుంకువసేసి, కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్" అని శ్రీకృష్ణుని ప్రేరేపించి రుక్మిణీదేవి కృష్ణుని ధర్మపత్ని అయినది. పురుషోత్తముడు ఆమెను ప్రియపత్నిగా చేసుకొన్నాడు. రాక్షస వివాహాలకు కన్యను బలాత్కరించి ఎత్తుకోపోవటం ప్రధాన లక్షణం. దీనికి ఆమె అంగీకారం ఉండి ఉండవచ్చును. లేదా ఉండకపోనూ వచ్చును. పురాతన కాలంలో అన్ని దేశాలలోనూ అన్ని జాతుల్లోనూ, నేడు అనేక అనాగరక జాతుల్లోనూ ఈ రాక్షస వివాహ విధానం ఆచరణలో ఉన్నట్లు తెలుస్తున్నది. అష్టవిధ వివాహాలో రాక్షస వివాహం ఒకటిగా ధర్మశాస్త్రకర్తలు అంగీకరించారు. అష్టవిధ వివాహాలలో మొదటి నాలుగూ ధర్మ్యాలనీ, తదుపరి నాలుగూ వ్యాధాలనీ చెప్పి "పూర్వః పూర్వః ప్రధానం స్యా ద్వివాహో ధర్మసంస్థితేః, పూర్వాభావే తతః కార్య యోయ ఉత్తర ఉత్తర, వ్యాధానాంహి వివాహానా మనురాగః ఫల యతః, మధ్యమోపిహి సద్యోగో గాంధర్వస్తేన పూజితః" (వాత్స్యాయన సూత్రములు వివాహ యోగాధ్యాయము. (3.) (5.28,29) మన పూర్వులు వాటిలో మంచి చెడ్డలను నిరూపించారు. ఎనిమిది వివాహాలలోనూ తొల్లిటి తొల్లిటివి ప్రధానమైనవనీ, అటువంటి బ్రాహ్మ్యాదులైన పూర్వ వివాహాలు లభించనప్పుడు ఉత్తరోత్తరాదులైన గాంధర్వాదులు యోగ్యాచరణాలనీ అభిప్రాయమిచ్చారు. ఈ విధంగా రాక్షస వివాహాన్ని ద్వితీయ పక్షాలైన వ్యాధా వివాహాలలోనూ అధమమైనదానినిగానే మన పూర్వులు పరిగణించారు.

ప్రపంచ వివాహ చరిత్రను పరిశీలిస్తే అన్ని జాతులకూ ఇది ఒకానొక సమయంలో ఒక వివాహ విధానంగా ఉన్నట్లు తెలుస్తున్నది. మెక్లినస్ అనే శాస్త్రజ్ఞుడు "నాగరకజాతుల్లో భార్యను పొందటానికి ఇది ఒక్కటే క్రమమైన విధానం' అని చెపుతున్నాడు. ఇతని అభిప్రాయంతో సాంఘిక శాస్త్రవేత్తలు ఏకీభవించారు.

'కుటుంబోత్పత్తి పరిణామము' అనే గ్రంథంలో ఏంజెల్సు మహాశయుడు రాక్షస వివాహాన్ని గురించి 'మానవజాతి ఏక గామిత్వం (Monogany) వరకు పరిణమిస్తున్న

స్థితిలో రాక్షస వివాహము ఒకానొక అవస్థాభేదాన్ని నిరూపిస్తున్నది. ఈ వివాహ విధానంలో ఒక జాతికి చెందిన యువకుడు మిత్రబృందంతో పర జాతి కన్యకను బలాత్కరించి ఎత్తుకుపోతుంటాడు. కొంతకాలం వారి మిత్రులందరూ ఆ కన్యకను వంతుల ప్రకారం అనుభవిస్తారు. చిట్టచివరకు ఆమె మొదట ప్రేరేపించినవానికి భార్య ఔతుంది. కన్యక అతణ్ణి అంగీకరించక ఆ స్నేహితులబృందంలో మరి ఒకరిని భర్తగా కోరుకొని అతని వెంట పారిపోతే, అతని భార్య ఔతుంది. మొట్టమొదటివాడికి ఎత్తుకోరావటం వల్ల కలిగే హక్కులన్నీ పోతవి. గుంపుపెళ్ళి (Group-Marriage) సర్వసామాన్య లక్షణంగా మానవజాతి వైవాహిక విధానం నడుస్తూ ఉన్న దినాలలో ఈ విధానం అమలులోకి వచ్చి ఉంటుంది. బలాత్కారంగా యుద్ధసమయాలలో జితులైనవారి భార్యలనూ, కుమార్తెలనూ ఎత్తుకొని వచ్చి భార్యలుగా స్వీకరించటం గానీ, ఉంపుడుకత్తెలుగా నిలుపుకోవటం గానీ ఈ వివాహ విధానానికి లక్షణము అని నిరూపించాడు.

ఇటువంటి వివాహాలు ఇంగ్లండు దేశంలో ఏడవ హెన్రీ రాజ్యకాలంవరకూ పరిపాటిగా వస్తూనే ఉండేవట. అతడు రాజ్యంచేస్తూ ఉన్నప్పుడు రాజ్యార్హత కలిగిన రాజకుమార్తెను ఒక వ్యక్తి రాక్షస వివాహం చేసుకున్నాడు. అప్పుడు ఇది తప్పిదంగానూ, న్యాయవిరుద్ధ వివాహంగానూ ఏర్పాటైంది. ఐర్లాండు దేశంలో పూర్వపిక్టులకూ గాలులుకూ జరిగిన యుద్ధాలు రాక్షస వివాహ మూలాలే. ఇటలీలో ఈ ఆచారం మధ్యయుగంలో కూడా ఉండేది. అందుకోసమని ధనిక కుటుంబికులు వారి కన్యకలను రక్షించుకోటానికని కొంతమంది వీరులను (Knights) నియమించేవాళ్ళు. మరొక వీరుడు ఆ ధనిక కుమార్తె రూపరేఖావిలాసాలకు ముగ్ధుడై బలాత్కరించి రాక్షస వివాహం చేసుకోదలచుకుంటే, ఆమెకు రక్షకుడుగా ఉంటూ ఉన్న వీరుడితో యుద్ధం చేసి జయించవలసి ఉంటుంది. యుద్ధంలో కన్యక వీరుడు ఓడిపోతే ఆమె ప్రతివీరుడికి భార్యగా పరిణమించక తప్పదు. పురాతన గ్రీసులోనూ ఇంతే.

దక్షిణాస్లావ్ జాతుల్లో ఈ ఆచారం 18 శతాబ్దం వరకూ ఆచారంగానే ఉంది. ఆల్బేనియా పర్వతప్రాంత జాతుల్లో నేడూ ఇదే ఆచారం. వీరు కొండజాతులు, మైదానంలో నివసించి జాతుల ఊర్లమీద పడి వివాహితలనూ, అవివాహితలనూ ఎత్తుకొనిపోయి దూషణానంతరం (Rape) వివాహం చేసుకోవటం వారి ఆచారం.

యహగన్లూ, ఓనస్ జాతివారూ పరాయి పిల్లలకోసం వారితో యుద్ధాలు చేసి శక్తిని ప్రకటించి ఎత్తుకోపోతారట. ఇటువంటి పని శాంతి సమయాలలో

వారిజాతుల్లోనైనా జరుగుతుంటుంది. బ్రెజిలు మొదలైన దక్షిణ అమెరికా దేశాలలో వివాహం కోసం యుద్ధాలు జరుగుతవని ప్రపంచ చరిత్రకారుడు నెస్టర్ మార్కు అభిప్రాయము. ఇవి కేవలమూ కన్యకల కోసమే కాదు, వరులకోసం కూడా జరుగుతూ ఉంటవి. కొన్ని జాతుల్లో స్త్రీ జనసంఖ్య అధికంగా ఉంటుంది. అప్పుడు వారు ఇతర జాతులమీద పడి పురుషులను ఎత్తుకోపోయి వివాహమాడుతుంటారు. కాలిఫోర్నియా, లూషియానాలలో ఇండియను జాతులు పెళ్ళికుమార్తె యింటిమీద దండెత్తుతవి. ఈశాన్య ఆసియాలో చుకిచీ జాతి యువకుడు పిల్ల కాళ్ళు చేతులు కట్టివేసి బంధించి తెచ్చి వివాహం చేసుకుంటాడు. తల్లిదండ్రులు వచ్చి వారికి రావలసిన శుల్కం పుచ్చుకోవటం తప్ప చేయగలిగింది ఏమీ లేదు.

రష్యాలోని సాహోయన్, జిటాయల్, ఒష్టాయల్ జాతుల్లో వరులు వధువును బలాత్కరించి తెచ్చుకుంటారు. ఆమె అంగీకరింపక పోయినా, ఆమె తల్లిదండ్రులు అంగీకరింపకపోయినా ప్రయోజనం లేదు. కన్య ఒకదినం అతని పర్ణకుటిలో పవ్వళిస్తే చాలు, అతని భార్య ఐపోతుంది. ఇతరులు వివాహం చేసుకోటానికి అంగీకరించరు కూడాను. మలై అర్చిపెలగోలోనూ, మలనీషియాలోనూ, ఆస్ట్రేలియాలోనూ రాక్షస వివాహమే నేటికీ చాలాచోట్ల ఆచారము. మహమ్మదు పుట్టుకకు పూర్వం అరబ్బు సైనికులు రాక్షస వివాహం ఆడవచ్చునని వారి ధర్మశాస్త్రం అంగీకరించిందట. స్కాండినేవియా జాతుల్లో భార్యలకోసం నిరంతరమూ యుద్ధాలేనట. కొసక్, యుక్రీనియన్ జాతుల్లో కన్య దూషణ చేసిన వానిదే.

టుటానిక్ జాతుల ధర్మశాస్త్రం 'రాక్షస వివాహం' అధర్మమైనది; న్యాయసమ్మతము కాదని చెప్పింది. అటువంటి వారిని శిక్షిస్తుంది; కానీ ఒకానొక వైవాహికవిధానంగా దానిని అంగీకరించింది. తూర్పు ఆఫ్రికాలో యువకుడు కన్యక ఇంటిమీదికి కత్తికటారులతో వెళ్ళి అడ్డగించిన ఆమె అన్నదమ్ములతో పోట్లాడి, ఆమెను తెచ్చుకొని బలాత్కారంగా వివాహమాడుతాడు. మంగోలు జాతుల్లోనూ, మొరాకోలోనూ ఇదే ఆచారం. బర్మా జాతుల్లోనూ ఇటువంటి వివాహాలు ఒకానొక కాలంలో వున్నట్లు నేటి వైవాహికాచారాలలో కనిపించే ఉట్టుట్టి పోరాటాలవల్ల వ్యక్తమవుతున్నదని సాంఘిక శాస్త్రవేత్తలంటున్నారు.

నేటి రోమను కన్యక తల్లి ఒడిలోకి పారిపోతుంది. పెళ్ళికుమార్తెను చేసిన తరువాత వివాహ మాడనని చర్చికి పారిపోతుంటే పెళ్ళికుమారుడు స్నేహితులతోనూ, బంధువులతోనూ మళ్ళీ బలాత్కరించి తీసుకోవస్తాడు. జర్మనీదేశంలో పెళ్ళికుమార్తెను

బలాత్కరించి తెచ్చుకోటం క్షేమకరమైనదని నేటికీ ఒక నమ్మకం. 'నవ్వే పెళ్ళికూతురు ఏడ్చే భార్య ఔతుందనీ, ఏడ్చే పెళ్ళికూతురు నవ్వే భార్య ఔతుందనీ' వారి సామెత. సైబీరియాలో కులంపెద్దలే వివాహాన్ని నిర్ణయించినా వరుడు వధువును బలాత్కరించి లాక్కో రావటం వైవాహికాచారం.

స్పెన్సర్ అనే రచయిత మొట్టమొదట 'కన్యకను ఇలా బలాత్కరించి తీసుకురావటానికి ఆమె అంగీకరించకపోవటం కారణమై ఉంటుంది' అన్నాడు. కొన్ని జాతుల్లో వివాహం కాని స్త్రీ పురుష జాతులకు రెంటికీ వైవాహిక సంబంధమైన యుద్ధాలు జరుగుతుంటవి. వాటిలో స్త్రీ జాతి బహుతీవ్రంగా ప్రతిఘటిస్తుంటారు. దీనికి మానసిక శాస్త్రవేత్తలూ, సాంఘిక శాస్త్రవేత్తలూ నిత్యవైరము (Sex - antagonism) మూలకారణమన్నారు. నేడు కూడా అనేక అనాగరక జాతుల వివాహ సందర్భాలలో ఇటువంటి యుద్ధాలకు ప్రత్యామ్నాయంగా జరిగే ఉట్టుట్టి పోరాటాలు కనిపిస్తున్నవి. అరబ్బు జాతుల్లో పెళ్ళికొడుకు పక్షంలోని ఆడవాళ్ళు పెళ్ళికుమార్తె ఇంటిమీదికి దోపిడికి వెళ్ళి వాళ్ళ పురుషులతో పోరాడతారట!

భారతదేశంలో రాక్షసవివాహాన్ని మనువు ఒకానొక వైవాహికవిధానంగా అంగీకరించాడు. ఇది కేవలం క్షత్రియజాతికి మాత్రమే చెల్లుతుంది. ఒరిస్సాలోని భుయలాజాతిలో యువకుడు ఒక కన్యకను ప్రేమించినప్పుడు, ఆమె అంగీకరించకపోయినా, ఆమె తల్లిదండ్రులు అంగీకరించకపోయినా, ఏకాంతంగా కనిపించినప్పుడు ఎత్తుకోవచ్చుకుంటాడు. చిట్టగాంగ్ కొండ జాతుల్లోనూ ఆడపిల్లలు తక్కువ. వారు కూడా పరదేశం మీద పడి కన్యకలను తెచ్చుకుంటారు. వంగదేశంలో క్లాహౌ జాతి యువకుడు సంతోషంతో నృత్యం చేసే కన్యకను ఒంటరిగా చూచి తెచ్చుకొని భార్యనుగా చేసుకుంటాడు.

రాక్షస వివాహానికి దూషణము ప్రధాన లక్షణంగా అనేక జాతుల్లో కనిపిస్తున్నది. దూషణ మూలంగా భార్యలను సంపాదించుకోవటం పూర్వ రోమనుల లక్షణం. దీనికి సంబంధించిన అనేక కథలు బైబిలులో (Judges XX-XXI, Numbers XXXI, 7-8, Dueteronomy XXI) కనిపిస్తున్నవి. ఆస్ట్రేలియా జాతుల్లో భార్యను పొందే విషయంలో బలాత్కారమూ, దూషణమూ విశేషంగా ద్యోతకమౌతున్నది. ఇతర జాతిలోని స్త్రీని పొందదలచుకున్నప్పుడు వారి గుంపుమీద కాపలా వేసి, ఒంటరిగా కనిపించిన స్త్రీని ఆయుధంతో ఒక దెబ్బకొట్టి, చెట్టుపొదల మాటుకు తీసుకోవెళ్ళి, స్మృతి వచ్చిన తరువాత వారి గురువు దగ్గిరకు తీసుకోవెళ్ళి బహిరంగంగా నేను ఈమెను వివాహం

చేసుకుంటున్నాను అని నిరూపించటానికి, కులంవారి ఎదుట వరుడు దూషణచేస్తాడు. ఈ జాతిలో రాక్షస వివాహ విధానమూ, దానికి అంగముగా, ఉన్న దూషణమూ చిత్రాతిచిత్రంగా కనిపిస్తున్నది. పరకులాల మీద ఇద్దరు ముగ్గురు మిత్రులు కలిసి దూషణయాత్రకు (Rape - raid) బయలుదేరటం సర్వసామాన్యం. నిశ్శబ్దంగా వారి గుడిసెల్లో ప్రవేశించి ముళ్ళపొదను పోలిన బల్లెపు కొనకు స్త్రీల జుట్టును ఒకడు పెనవేస్తాడు. రెండవ వాడు బల్లెపు కొన వక్షఃప్రదేశానికి ఎదురుగా నిల్చి భయపెట్టి నిలుస్తాడు. నిద్ర మేల్కొన్న తరువాత ఆ స్త్రీ కిక్కురు మిక్కురు మనకుండా వారు చెప్పిన చోటికి నడిచి వెళ్ళుతుంది. ఆమెను ఒక చెట్టుకి కట్టివేసి 'నీవు నా బానిస' వని ఆమెకూ, 'ఈమె మా బానిస' అని ఇతర కులానికీ తెలియజెప్పి, తరువాత వారిలో ఒకరు వివాహ మాడతారు. సర్వసామాన్యంగా ఆ జాతుల్లో ఉన్న వైవాహిక విధానమే ఇది కనుక, బందీకృతలైన స్త్రీలు ప్రతిఘటించటానికి ప్రయత్నించరు. ఆ జాతుల్లో చిన్నతనం నుంచి పిల్లలు ఇటువంటి దూషణక్రియకు అలవాటు పడే ఆటలు ఆడుకోవటం ఆ జాతులవారు నేర్పుతారట!

ఆస్ట్రేలియా జాతుల్లో అందమైన ఆడపిల్ల జీవితం అతి గహనంగా ఉంటుంది. ఒక భర్తతో ఆమెకు సుస్థిరమైన కాపురమంటూ ఏర్పడబోయే లోపల, ఒకదాని వెంట ఒకటిగా అంటి వచ్చే ఎన్నో దూషణక్రియలకు ఆమె గురౌతూ ఉంటుంది. అందువల్ల ఆమె శరీరము చెడిపోటమూ, ఆమె చివరకు చేరే నూతన సంఘంలో చికిత్స దొరకకపోవటమూ నిశ్చయము. ఇటువంటి అవస్థలకు పాలైన స్త్రీ కులంవారు ఆమె పొందుతున్న కష్టాలకు ప్రతిక్రియగా మరికొన్ని యుద్ధాలు చేయటమూ, అందువల్ల మరికొంత మంది జనాన్ని కోల్పోవటమూ జరుగుతుంది. అందుమూలంగా కొన్ని జాతులవారు అందమైన ఆడబిడ్డలను పెరిగి పెద్దవాళ్ళు కాగానే దేవతలకు బలియిస్తుంటారు. ఒకవేళ అటువంటి యుద్ధాలలో వారు గెలిచినా దోషిని ఒప్పజెప్పిన తరువాత, పది బల్లాలు అతనికి తగిలీ తగలనట్లుగా విసిరి చివరకు సంధి చేసుకొని, విందు కుడుస్తారు. న్యూ గినీలలోని పాపను జాతిలోనూ, ఫిజీ ద్వీపవాసుల్లోనూ, ఇటువంటి ఆచారం నేటికీ కనిపిస్తున్నది. నిజమైన దూషణముగానీ, కల్పితమైన దూషణము (Stimulated Rape) గానీ, వీళ్ళల్లో సర్వసామాన్యము. దీనికి ఆ జాతులవారూ అధిదేవతనుగా ఒక శక్తిని కొలుస్తారు. దూషిత ఐన స్త్రీ అతని సెజ్జ చేరటముగానీ, మృతి పొందటము గానీ జరుగుతుంది. చివరకు ఉభయజాతుల వారూ చేరి విందు చేసుకుంటారు. బ్రతికి ఉంటే ఈ విందుతో వివాహం పూర్తి ఐనట్లు.

బలాత్కరించి తెచ్చి వివాహమాడిన స్త్రీ అతని పౌరుష పరాక్రమాలకు చిహ్నామనీ, అధిక గౌరవ వ్యాపకమైన పతాకమనీ అనాగరిక మానవుని భావన. రాక్షస వివాహం విశేష ప్రచారంలో ఉండే వైవాహిక విధానం కారణంగా, జాతిలోని కన్యకలను ఉత్తమ ప్రణయాదికాలవల్ల వివాహం చేసుకున్న వారికంటే, పరస్త్రీని బలాత్కరించి తెచ్చి దూషణానంతరం వివాహం చేసుకున్నవారు పరాక్రమోపేతులనే అభిప్రాయం ఆ జాతుల్లోని స్త్రీ పురుషుల్లో ప్రబలంగా ఉండటమూ, అందుమూలంగా అటువంటి వారికి విశేష గౌరవము సంఘంలో ప్రాప్తించటమూ జరుగుతూ వచ్చింది.

బేబరు ఆర్చి పెలగోలలో పక్కన ఉన్న గ్రామంలోని కన్యకను బలాత్కరించి పొందనివాడు స్త్రీతుల్యుడనే భావం నేటికీ కనిపిస్తున్నది. ఫిలిపైన్స్ ద్వీపాలలోని జాతుల్లో నేటివరకూ స్వజాతిలోని కన్యకలను వివాహ మాడటం తెలియదు. టిబెట్‌లోని పూరంగ్ జిల్లాలోనూ ఇదే నీతి. బలాత్కరించి కన్యకలను తీసుకోవచ్చి దూషణ క్రియ జరిపిన తరువాత ఆమెగానీ, ఆమె తల్లిదండ్రులుగానీ వివాహానికి అంగీకరింపకపోతే అతడు కులంపెద్దలను తీర్పు చెప్పవలసిందని విన్నవిస్తాడు. సర్వసామాన్యంగా వారు అవతలి జాతిమీద యుద్ధానికైనా సిద్ధపడి వివాహానికి సుముహూర్తం ఏర్పాటు చేస్తారు. ఈ కులంపెద్దల అంగీకారానంతరం విందులతోనూ, మదిరాపానంతోనూ వివాహం జరుగుతుంది. గోండు జాతిలోనూ ఇదే లక్షణం. న్యూ బ్రిటన్‌లోని చీజికీ జాతివారు కన్యను అపహరిస్తారు; వారు దొరకని సమయంలో పరుని భార్యనైనా అపహరించి దూషణానంతరం వివాహం చేసుకోటానికి వెనుదీయరు.

రాక్షస వివాహం నేడు ఆచారంగా లేని జాతుల్లోని వైవాహికపు తంతును పరీక్షిస్తే ఆ జాతుల్లో పురాతన కాలంలో ఉండే యుద్ధాలను జయించటానికి తగిన ఆధారాలు లభిస్తూన్నవి. బ్రిటిష్ న్యూ గయానాలోని రోరో తెగలో రాక్షస వివాహానికి ప్రత్యామ్నాయంగా ఒక తంతు కనిపిస్తున్నది. వధూవరుల ఉభయ బంధువర్గాలకూ కల్పితమైన ఒక చిన్న జగడం జరుగుతుంది. వధువు తల్లి ఒక కొయ్యతో కనబడ్డ ప్రతివస్తువు మీదా విరుచుకోపడి చివరకు రోదనం ప్రారంభిస్తుంది. దానితో ఊరిలో స్త్రీ వర్గం అంతా చేరుతారు. ఈ విధంగా మూడుదినాలు దుఃఖిస్తుంది. అనంతరం కూడా ఆమె పెళ్ళి కుమార్తెతో ఇంటికి వెళ్ళటానికి నిరాకరిస్తుంది. ఇది పెళ్ళికుమార్తెను బలాత్కరించి ఎత్తుకోపోయారని నిరూపించటానికి ఏర్పాటైన వింత ఆచారం. మంగోలు జాతిలో వరుని పక్షం వాళ్ళు పెళ్ళికుమార్తె యింటిముందుకు వెళ్ళి లోపలకి పోనియ్యమని అడుగుతారు. ఆమె అన్న 'మా ఇంటితో మీకేమి పని?' అని

ప్రశ్నిస్తాడు. 'మా గుడిసెలో నివసించటానికి యుద్ధం చేయవలసిందే' అని అంటాడు. యుద్ధం సాగగానే అతను లొంగిపోతాడు. వరుని పక్షంవారు ఇంట్లో ప్రవేశిస్తారు. ఆ జాతిలో వధువు పారిపోతే పట్టుకొని పోవడం కూడా ఇటువంటిదే.

ఆ నాడు ఆచారంగా ఉన్న ఈ వివాహాలు నేడు ఇటలీ దేశస్థుల వివాహంలోని ఒక తంతులో ఇమిడి, పోలండు దేశంలో ఇటువంటి ఆచారం ఉంది. ఐర్లండు వివాహంలోనూ ఇవే కల్పిత యుద్ధాలు (Mock - fight) కనిపిస్తాయి.

ఆర్కిటిక్ ప్రాంతాలను పర్యవేక్షణ చేసిన ఒక భూప్రదక్షకుడు, గ్రీన్‌లాండు ప్రాంతంలోని ఈ వివాహ విధానాన్ని గురించి విపులంగా వ్రాసాడు. ఆ దేశంలో అనాగరిక జాతుల్లో కన్యకను జుట్టుపట్టి లాక్కోరావటం తప్ప ఇతరమైన వైవాహికవిధానమే లేదట. ఈ వివాహాన్ని కన్యక తల్లిదండ్రులైనా చూస్తూ ఉండవలసిందేగానీ ప్రతిగా ఏమీ చేయటానికి వీలు లేదు. పైగా అది కేవలమూ వ్యక్తిగతమైనదిగా భావిస్తారుట. ఎస్కిమో జాతిలో ఈ విధంగా బలాత్కృతి ఔతున్న కన్యక పోరాడుతుందిట. ఇది కేవలమూ ఆమె పవిత్ర నీతి నియమాల్ని (Modesty) నిరూపించటానికి చేసే ప్రతిఘటన మాత్రమే. జీవనము ఆ బలాత్కరించే వ్యక్తితోనే ఉన్నదని ఆమెకు తెలుసును. ఇది పరంపరాగతంగా వస్తూ ఉన్న ఆచారం గనుక, ఆమె అనుసరిస్తున్నది. అంతే. వేరొక జాతిలో రాక్షస వివాహలక్షణం చిత్రమైన స్థితిలో కనిపిస్తున్నదని ఫీల్డింగ్ 'వైవాహిక విచిత్రాచారాలు' అనే వ్యాసంలో నిరూపించాడు. కన్యక తండ్రి ఆమెకు యుక్తవయస్సు రాగానే అతడు ఆమెను పెళ్ళాడదలచుకున్న యువకునితో 'నీవు నా కుమార్తెను బలాత్కరించవచ్చును' అని చెపుతాడు. అతనిని ప్రతిఘటించకుండా లొంగిపోవడం కేవలం స్త్రీ జాతికి అపకారం. 'నీ శక్తిని ఉపయోగించి పెనగులాడాలి సుమా!' అని తల్లి కుమార్తెకు నీతి గరపుతుంది. కన్యక ఒంటరిగా నిద్రిస్తూ ఉన్నప్పుడు ఎన్నడూ బలాత్కరించటానికి పూనుకోడు. అది అతని ఉజ్జీవనానికి శుభోదర్కమైన క్రియ గాదని అతని నమ్మకం. వరుడు బలాత్కరించటానికి తలపడి వస్తున్నాడని తెలుసుకొని, కన్యక వస్త్రాలంకరణంతో, ఇది ఒక విధమైన యుద్ధానికి ఆయత్తం చేసుకొని పారిపోతుంటుంది. వరుడు మిత్ర బృందంతో వెంటబడి ఆమెను అడ్డగిస్తాడు. కొంతకాలం వారి ఇద్దరిమధ్యా చిన్న యుద్ధం జరుగుతుంది. కొంతసేపు పోరాడి ఆమె ఓడిపోతుంది; వివాహానికి అంగీకరిస్తుంది. ఇది ఒక బహిః ప్రదేశంలో జరుగుతుంది. ఇద్దరూ వాహనంమీద గ్రామంలోకి తిరిగి వస్తారు. పెద్దలు వారికి వివాహం చేస్తారు.

పురాతన గ్రీసుదేశంలో – ప్రధానంగా స్పార్టాలో, ఈ రాక్షస వివాహ లక్షణం వారి వివాహపుతంతులో నిలచిపోయింది. ప్లూటార్కు మహాశయుడు 'లికుర్గన్ జీవితంలో' దీని స్వరూపాన్ని క్రింది విధంగా నిరూపించాడు.

''In their marriages the bride-groom carried off the bride by violence, and she was never chosen in a tender age, but when she arrived at full maturity. Then the woman that had the direction of the wedding cut the bride's hair close to the skin, dressed her in man's clothes laid her upon a mattress, and left her in the dark. The bridegroom went in privately, untied her girdle, and carried her to another bed....'' (Strange Customs of Courtship and Marriage - W. Fielding P. 251)

ఉత్తమ జాతులలోని వివాహాల్లోనూ ఈ లక్షణం అల్పమాత్రంగానైనా నేడు కనిపిస్తూ ఉన్నది. భారతదేశమూ, చైనా, జావా, ఈజిప్టు దేశాలలోనూ, యూరప్ దేశంలోనూ దీనికి సంబంధించిన ఒక తంతు కన్యక గిరి లేక కంచె తొక్కకుండా ఇంట్లో ప్రవేశించటము అనే ఆచారం కనిపిస్తున్నది.

ఈ రీతిగా నేటికీ నిజరూపాన్ని సంజ్ఞాత్మకంగానైనా నిలుపుకున్న రాక్షస వివాహం, వైవాహిక పరిణామంలో ఒకానొక దశను నిరూపిస్తూ ఉన్నది. దీనిని కొందరు 'మహద్దూషణము' (Glorified Rape) అన్నారు. మనలో అతి ప్రశాంతంగా నడిచిపోతూ ఉన్న వైవాహిక విధానాలను ఏ రీతిగా గమనిస్తున్నామో, ఈ వివాహ విధానం ఆచరణలో ఉన్న జాతులవారు దీనిని అదేరీతిగా చూస్తున్నారు. కూటాంతరము అంగీకరించని జాతులకు 'బాహ్యరక్తస్పర్శ' (Touch of Exogamous blood) దీనివల్ల కలుగుతున్నది. అందుమూలంగా జాతుల్లో నూతనరక్తం ప్రవేశిస్తున్నది. జాతి రక్తము గడ్డకట్టి పోవటమనే చెడు నేడు తప్పిపోతున్నది. ఈ దృష్టితో ఇటువంటి రాక్షస వివాహాలకు పూనుకున్న జాతివారు బలాత్కరించి తెచ్చిన స్త్రీలను వారి జాతి స్త్రీలకు పెంపుడు కుమార్తెలనుగా పరిశీలించి, యథావిధిగా వివాహం చేసినప్పుడు భార్యలుగా స్వీకరిస్తారు. ఈ పని ముఖ్యంగా మాతృస్వామిక కూటములో (Matriarchical Genus) జరుగుతుంది.

మెక్లినన్ అనే సాంఘిక శాస్త్రవేత్త సంజ్ఞాత్మకంగా నేటి వివాహాలలో రాక్షస వివాహ లక్షణం నిలబడి ఉండటము గొప్ప విశేషమనినాడు. ఉభయ పక్షాలలో వివాహానికి అంగీకారం ఉన్నప్పుడు వరుడు స్నేహిత బృందంతో కన్యను బలాత్కరించటం కేవలమూ పూర్వాచారము. కొన్ని జాతుల్లో పూర్వము అంగీకారం

లేకుండా జరుగుతున్నది. ఇది కేవలమూ దూషణము, బలాత్కారము, ఆచారము, కాదు. ఈ విభేదాన్ని గమనించవలసి ఉంది. ఈ రాక్షస వివాహ లక్షణం ఉన్నచోట పూర్వాచారమూ, సంజ్ఞాత్మకంగా బలాత్కారం జరిగినప్పుడు కన్యక చూపించే దుఃఖం విశేషంగా కృతకమూ, పరంపరాగతమూ, నీతి నిరూపణాత్మకమూ. కేవల దూషణ వివాహాల్లో దుఃఖము సత్యము. ఇటువంటి వివాహాలు విశేషంగా అనాగరక జాతుల్లో కనిపిస్తున్నా సర్వసామాన్యము కాదని గాడ్సీ అభిప్రాయం. అనాగరక జాతులు ప్రక్క జాతులతో వైరం పెట్టుకోటానికి ఇష్టపడకపోవటమే దీనికి ఆయన చూపించే ప్రబల కారణము. ఇది వారికి సర్వ సామాన్య ధర్మము కావటం వల్ల వారు ఈ విషయాన్ని గురించి సత్యమైన యుద్ధాలకు పూనుకోరనీ, వారి మైత్రి దీనివల్ల నశించదనీ ఇతరులు అతని అభిప్రాయాన్ని అంగీకరించారు.

*(ఆంధ్రపత్రిక, **1948** డిసెంబర్ 1)*

# ఆసుర వివాహము

కవిబ్రహ్మ తిక్కన సోమయాజి ఆనుశాసనిక పర్వంలో ధర్మరాజుకు గాంధర్వాది వివాహ విధానాలను చెప్పించే సందర్భంలో 'మున్ను మనంబున దనిసిన కన్నియ యెవ్వాని గోరు గాంధర్వం బా, యన్ను నతని కిచ్చుట, వెలవన్నుట యాసురము సూవే కౌరవముఖ్యా!' (ద్వి. ఆశ్వాసము. 233) అని ఆసుర వివాహ (marriage by purchase) లక్షణాన్ని వ్యక్తీకరించినాడు. కన్యకపోషకులు – తండ్రి కావచ్చును లేదా ఇతరులు కావచ్చును– ఆమెను ఒకానొక క్రయవస్తువుగా భావించి, వివాహార్థిగా వచ్చిన వరుని దగ్గిరనుంచి గానీ, లేదా వాని బంధువుల దగ్గిరనుంచి గానీ కొంత ప్రతిఫలాన్ని పొందటము ఆసుర వివాహానికి ముఖ్యగుణము. ఇది భారతదేశంలో అనాది కాలం నుంచీ ఒక వైవాహిక విధానంగా ఉంటూ ఉన్నట్లు మన్వాదిస్మృతులవల్ల వ్యక్తమౌతూ ఉన్నది.

అనాగరకజాతుల్లో నేటికీ ఈ వివాహ విధానమే విశేషంగా కనిపిస్తున్నది. ఇది కేవలం రాక్షస వివాహం వలె (Marraige by Capture) అధమము కాదు దైవప్రాజాపత్యాలవలె ఉత్తమమూ కాదు. నాగరికతా పరిణామంలో మధ్యమస్థితి వహించిన నాళ్ళలో ఈ వివాహ విధానమే విరివిగా కనిపిస్తున్నది.

కొన్ని అనాగరకజాతుల్లో వివాహానికి వధువు బంధువర్గం దగ్గిరనుంచీ అంగీకారం ఊరికే దొరకదు. కన్యక తండ్రికి గానీ, ఇతర ఆత్మ బంధువులకు గానీ కొంత 'శుల్కం' ఇవ్వవలసి ఉంటుంది. అది కేవలమూ ఆస్తిపాస్తుల వల్లనే కాకపోవచ్చును. కొన్ని జాతుల్లో వివాహ యోగ్య అయిన కన్యక దొరకవలెనంటే, వరుడు ఆమె బంధువర్గానికి కొంతకాలం సేవ చేయవలసి ఉంటుంది; కొన్ని జాతుల్లో కన్యకు ప్రతిగా మరి ఒక కన్యకను ఇవ్వవలసి ఉంటుంది.

ఈ విధంగా ప్రతిఫలాన్ని ద్రవ్యరూపాన గానీ, మనుష్య రూపాన గానీ, లేక సేవామూలంగా గాని పొందితేగానీ, కన్యకను వివాహ యోగ్యుడైన వరుడికి ఇవ్వకపోవటము చాలా నికృష్టమైన ఆచారం. దీనిని స్త్రీలైనా ఎదుర్కోవటానికి యత్నం చెయ్యలేదు. పైగా వారు ఇటువంటి 'పణ్యద్రవ్యం' పుచ్చుకోవటం వల్ల వివాహానికి

క్రమగౌరవం కలుగుతుందనీ, అది వారికి గౌరవ విషయమనీ భావిస్తున్నారు. కొన్ని జాతుల్లో ఆమెకోసం వ్యయమయ్యే ధనాధిక్యమును బట్టి భార్యకు గౌరవం లభిస్తున్నది.

'కన్యాశుల్కం' కోసం కొంతధనం వ్యయం చేయకుండా లభించిన భార్యను వెలివేసిన వ్యక్తివలె భావించటం యాకూట్ జాతి వారి అభిప్రాయం. యద్విధమైన శుల్కమును ఆ జాతి స్త్రీలు అగౌరవంగా చూస్తారట. క్రమమైన వెలయిచ్చి కొనుక్కోని భార్యను జారిణిగా పరిగణించటం పశ్చిమాఫ్రికా జాతుల ఆచారం. ప్రియుడు 'శుల్కం' చెల్లించలేని స్థితిలో, కొన్ని జాతుల్లో ప్రియ అతనితో కలిసి తండ్రి యింట్లోనుంచి పారిపోతుంది. అప్పుడు తప్ప ఆమె మనసారా ప్రేమించిన ప్రియుణ్ణి వివాహం చేసుకోటానికి అవకాశముండదన్న మాట. అందువల్ల కొన్ని జాతుల్లో ఈ శుల్కాన్ని తప్పించుకోటానికి యువతీయువకులు పారిపోవటం (Elopement) జరుగుతుంటుంది. అటువంటి వరుణ్ణి వధూజాతివారు దొంగసొత్తుతో ఉన్న వాడివలెనే చూస్తారు.

భార్యకు ప్రతిగా ఇచ్చే ఈ 'శుల్కం' జాతుల్నిబట్టి మారుతుంటుంది. మక్కాలో కన్యకలను భార్యలుగా ఉత్తమ తరగతులవారే అమ్ముతుంటారని ఫీల్డింగు అతని 'విచిత్రాచారాలు' అనే గ్రంథంలో వ్రాశాడు. చాలా దేశాలలో ఇది బహుమానంగా ఇవ్వటం జరుగుతుంది. దానికి ప్రతిగా వరుడు కొంత కట్నమూ పొందవచ్చు. ఆంధ్రదేశంలో పెట్టే సొమ్ముకూ అల్లుడికిచ్చే కట్నానికి అధిక సంబంధం నేటికీ కనిపిస్తూ ఉన్నది.

ఉత్తర అమెరికాలోని ఇండియను జాతుల్లో అందమైన వధువుకు 'శుల్కం' పన్నెండు పోనీ జంతువులు. అక్కడి కాలిఫోర్నియాలోని హూఫా జాతిలో వధువుకు ఇచ్చే శుల్కం వరుని తండ్రి తల్లిని వివాహమాడేటప్పుడు ఇచ్చిన 'పణ్యధనం' మీద ఆధారపడి ఉంటుంది. ఆఫ్రికా జాతుల్లో భార్యను కొనుగోలు చెయ్యటం విపరీతం. పణ్యధనం ఆహారవస్తువులు, గొంగళులు, కత్తులు మొదలైన వస్తు సామగ్రి ఏదైనా కావచ్చును. జాతి పెద్ద భార్యను కొనటానికి నూరు పశువుల నిస్తాడు. ఉగాండాజాతుల్లో ఉత్తమ తరగతివారు భార్యకోసం నూరు మేకలనూ, పదహారు ఆవులనూ క్రయధనంగా ఇవ్వవలసి ఉంటుంది. పేదవాడు మూడు నాలుగు ఎద్దులనూ అయిదు ఆరు సూదులు ఇస్తే భార్య దొరుకుతుంది. బంగలాజాతిలో నరధనం తప్ప పుచ్చుకోరు. ఆ జాతిలో భార్య కావలిస్తే ఇద్దరు ఆడబానిసలనూ, ఇద్దరు మగబానిసలనూ స్వతంత్రుడైనవాడు ఇవ్వలసి ఉంటుంది. ఆఫ్రికా జాతుల్లో సర్వసామాన్యంగా పశువులకూ కన్యకలకూ మారకం జరుగుతుంది. పది పన్నెండు పశువులను ఇస్తే కాఫిర్‌కు భార్య లభించటం

కద్దు. హైరిపోజాతిలో పేదవాడికైనా ధనికుడికైనా భార్య ఒకేరీతిగా, ఒకే మారకానికి దొరుకుతుంది. కన్యక తండ్రికి ఒక బలిసిన ఎద్దును గానీ, లేదా ఒక మేకపోతును గానీ పంపిస్తే చాలు. దానిని వివాహ సమయంలో చంపి తినేస్తారు. ఇది ఒక్కటే వారి వివాహం తంతు. ఒక బండెడు చొప్పకు గానీ, ఒక బండెడు కట్టెలకు గానీ పేదవాడికీ, మూడువేల రూబుల్స్ శుల్కమిస్తేగానీ ధనికుడికీ, రష్యాలోని బాస్కిర్ జాతివారిలో భార్య ఒకానొక కాలంలో లభించేది కాదని ఒక సాంఘిక శాస్త్రవేత్త వ్రాసి ఉన్నాడు.

సర్వసామాన్యంగా 'ఈ శుల్కం' అనేక విషయాలమీద ఆధారపడి ఉంటుంది. వధువు అందచందాలు, ఉభయుల ఆర్థికస్థితీ, వరుడి వయస్సు, స్త్రీ పురుష జనసంఖ్య, మరికొన్ని స్థానిక కారణాలూ దీన్ని నిర్ణయిస్తూ ఉంటవి. కొన్ని సందర్భాలలో ఈ సందర్భాలతో అవసరం లేకుండా భార్యను పొందటానికి ఇంత శుల్కమని నిశ్చితమై కూడా ఉంటుంది. సర్వసామాన్యంగా విడాకులు పొందిన స్త్రీని గానీ, విధవ అయిన స్త్రీని గానీ తక్కువ వెలకు పొందవచ్చు. పుష్పవతి కాని పిల్లగానీ, బహుకాలం వివాహం కాని స్త్రీగానీ తక్కువకే దొరకవచ్చు.

చైనాలో అత్యుత్తమ నాగరిక జాతుల్లో ఈ నాటికీ ఆసుర వివాహం కనిపిస్తున్నది. శుల్కం చేత పడ్డంతవరకూ పెళ్ళి జరిగినట్టే కాదు, తంతు జరిగినా సరే. మొట్టమొదట మహమ్మదీయ దేశాలలో తండ్రికి 'కన్యాశుల్కం' ఇవ్వడం జరిగేది. అది క్రమంగా భర్త చనిపోయిన తరువాతగానీ, విడాకులు పొందినప్పుడు గానీ ఉపకరించే స్త్రీ ధనంగా పరిణమించింది. కొన్ని సందర్భాలలో ఇది వధువుకు బహుమతి మూలంగా చెందే ఏర్పాటు జరిగింది.

ఆసుర వివాహం స్త్రీలకు నైచ్యస్థితి ఏర్పడడానికి కారణంగా పరిణమించింది. వ్యక్తిత్వము గానీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యముగానీ లేని పశువుగా ఆమె పరిగణిత కావటం పురాతన సంఘాలలో ఆమె మారకానికి ఉపకరించే వస్తువైంది.

గ్రీసుదేశం అత్యుత్తమ నాగరికతను అనుభవిస్తూ ఉన్న కాలంలో, ఈ ఆసుర వివాహానికి సంబంధించిన ఒక వైవాహికాచారం ప్రబలంగా ఉన్నట్లు వారి సాహిత్యం వల్ల వ్యక్తమౌతున్నది. ఆమె క్రొత్త యింటికి అమ్ముడు పోవటం వల్ల ఆమెకు స్వాతంత్ర్యం లేదు – అని నిరూపించటానికి ఆమె ఎక్కివచ్చిన బండిని వరుని ఇంటి ముందు పురాతన గ్రీకులు పరశురామ ప్రీతి చేసేవారట. 'ప్రధానపుటుంగరము' అనేక జాతుల్లో ఈ శుల్కాన్ని చెల్లించటానికి గుర్తుగా భావిస్తారు. టుటానిక్ ఇంగ్లీషు జాతుల్లోనూ ఇదే లక్షణము.

రష్యాలో వధువు వరుని పాదాలు ముద్దు పెట్టుకోవటమనే ఆచారం, ఆమె దాస్యభావాన్ని వ్యక్తం చేయటమే. అది ఫ్రాన్సు దేశంలో తరువాతి కాలాన భర్త కాళ్ళ దగ్గిర ఉంగరం పడేటట్లుగా చేసి దానిని వధువు వంగి తీసుకోవటమనే మార్పు పొందింది. రష్యాలో మహావిప్లవం వరకూ ఆసుర వివాహం బాహాటంగా సాగింది. వరుని తండ్రి వధువు తండ్రి దగ్గిరికి వెళ్ళి బేరమాడి కోడలిని కొనుక్కొచ్చేవాడు. గేదె, గుర్రం, ఆవును బేరమాడటానికి, వధువుని తెచ్చుకోటానికి ఏ విధమైన విభేదమూ లేదు. వారు వివాహ యోగ్య ఐన కన్యను 'కుంక' అంటారట. 'కున' అంటే మార్టిన్ అనే జంతువు. పూర్వం దాని ధర్మానికి మారకంగా వివాహ యోగ్య ఐన కన్యక లభించటం వల్ల, నేడు కూడా యుక్త వయస్క అయిన కన్యకు ఆ పేరే నిలిచింది.

ఐర్లండు జాతులవారు శుల్కానికి 'కాయోబాచీ' అంటారట. దానికి వస్తుసముదాయమని అర్థం. అందులో బంగారము, రాగి, ఇత్తడి, గుడ్డలు, పందులు, ఆవులు అన్నీ ఉండవచ్చును. భార్యాపణ్యద్రవ్యాన్ని ఒక్కమాటుగా ఇవ్వవలసిన అగత్యం అన్ని జాతుల్లోనూ లేదు. వివాహం జరిగిపోయిన తరువాత కొన్ని సంవత్సరాలవరకూ ఇస్తూ ఉండవచ్చును.

సైబీరియాలో కిర్గిజ్ అనే టర్కిష్ జాతిలోని తండ్రి, కుమారుడికి పది ఏళ్ళు రాగానే ఒక పిల్లను సిద్ధం చేసుకొని ఎనభై పశువుల వరకూ ఉండే శుల్క ద్రవ్యాన్ని జాగ్రత్త చేయటం ప్రారంభిస్తాడు. ఇది అనేక పర్యాయాలుగా చెల్లించవచ్చు. ఎక్కువమొత్తం రాగానే పెళ్ళి జరుగుతుంది. ఈ జాతిలో శుల్కం అధికం. అందువల్ల ఎవరూ తొందరపడి భార్యకు విడాకులివ్వరు. ఇస్లాం మతధర్మం పురుషుని ఆధిక్యాన్నే నిరూపిస్తున్నా, స్త్రీని భర్త ఆస్తిగా పరిగణించటాన్ని ఏర్పరచినా, కావలసినంత మంది దొరక్క పోవటం వల్ల (Economic law of supply and demand) ఇటువంటి పని జరగదు అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

ఆసుర వివాహ లక్షణమైన 'శుల్కం' పూర్తిగా చెల్లిస్తే గాని భార్య భర్త ఇంటికి రాక తల్లిదండ్రులతోనే ఉండటం అనేక జాతులలో ఉంది. పశ్చిమాఫ్రికాలో పూర్తిగా శుల్కం చెల్లించలేని భర్త మామగారింట్లోనే చెల్లించే వరకూ భార్యతో కాపురం చేస్తుంటాడు. అంతవరకూ కలిగే సంతానం మామగారి దౌతుంది. టెనింబరులో కన్యకకు శుల్క ద్రవ్యంగా ఏర్పరుచుకున్న దంతపు సామాను పిల్ల తండ్రికి చెందటానికి ఎంతోకాలం పడుతుంది. అంతవరకూ అతడు మామగారింట్లోనే ఉండిపోతాడు. ఆకికుయున్ జాతిలో ఇరవై గోవులకు భార్య లభిస్తుంది. అన్నీ ఒకమాటు చెల్లించక

వంతులమీద చెల్లించినపుడు అతనికి కలిగే సంతానానికి తొమ్మిది పది సంవత్సరాలు కూడా రావచ్చును. చిన్ కొండజాతుల్లో ఈ శుల్కాన్ని జీవితాంతం చెల్లిస్తూ ఉంటాడట. దీనినిబట్టి అనాగరక జాతులు కూడా అనేకమార్లుగా క్రయధనం పుచ్చుకోవటం వల్ల ఉండే నష్టాన్ని గ్రహించినట్లు అర్థమౌతున్నది. మొత్తం చెల్లింపలేని పక్షంలో పిల్లతండ్రికి కుటుంబము పెరగటమూ, కుమార్తె భర్తతో ఇంట్లోనే ఉండి అతని 'పనిపాటలు' చేసి పెట్టుతూ ఉండటం వల్ల, ఇటువంటి పద్ధతినే విశేషంగా కొన్ని జాతులు ఆదరించేవని ప్రపంచ వివాహ చరిత్ర కారులు వెస్టర్ మార్కు అభిప్రాయము.

రాక్షసంగా కన్యను ఎత్తుకోపోయి వివాహం చేసుకోవటం మొదటి మెట్టు. దానికి ప్రతిగా ఆసురము వచ్చింది. వెల ఇంత అని నిశ్చయం చేయటం కష్టమనిపించినప్పుడు ఆసుర వివాహంలోనే 'బదులుకు బదులు' (Marriage by Exchange) అనే పద్ధతి ఆచారంగా కొన్ని జాతుల్లో ఏర్పడ్డది. అంటే భార్య లభించవలెనంటే ఒక స్త్రీని బదులు ఇవ్వవలసి వచ్చిందన్న మాట. కుమార్తెలుంటే వధూవరుల తండ్రులు ఈ మారకం చేస్తారు; చెల్లెలుంటే అన్నదమ్ములు చేస్తారు; చెల్లెళ్లు లేనప్పుడు పినతండ్రి కూతుళ్ళనూ, పెత్తండ్రి కూతుళ్ళనూ మారకం చేయవచ్చు. మలనీషియాలోని సోలామన్ జాతిలో మొదటి స్నేహితాలు అభివృద్ధి చేసుకోవటానికి ఏర్పడ్డ స్త్రీల మారకం శుల్క వివాహంగా పరిణమించింది. దక్షిణ ఆస్ట్రేలియాలో వరిన్‌యేరీ జాతి స్త్రీ, తనకు బదులుగా తల్లిదండ్రులు మరి ఒక ఆడపిల్లను ఇవ్వని పురుషుణ్ణి వివాహం చేసుకోటం అగౌరవంగా భావిస్తుందట. ఇటువంటి ఆచారాలు న్యూ గినీ, న్యూ హెబ్రిడిన్, సొలోమన్, సుమత్రా ద్వీపాలలో ఉన్నవి. సుమత్రా ద్వీపవాసులు 'జూజు' (కన్యాశుల్కం) ఇవ్వటానికి బదులుగా స్త్రీనే ఇస్తారట. న్యూ సౌత్ వేల్సులో కుంబూ, మూరి జాతుల్లో శుల్కం బదులు వివాహం ఉంది.

కొన్ని జాతుల్లో ఈ శుల్కానికి తోడు ఆడపిల్లల కన్యాత్వాన్ని (Virginity) కాపాడినందుకు తల్లికి కొంత ధనమూ, అంగీకారం ఇచ్చినందుకు అక్కచెల్లెండ్రకూ, తండ్రికీ కొంత ధనమూ ఇవ్వవలసి ఉంటుంది. ఈ ధనమంతా తిరిగి అవసరమని తోచినప్పుడు ఇచ్చివేసి పిల్లను తెచ్చుకోవటం, ఆఫ్రికా జాతులు కొన్నిట్లో ఆచారంగా ఉందని వెస్టర్‌మార్క్ అభిప్రాయం. 'పశుధనానికి' అమ్ముడుబోయిన స్త్రీని కాఫిర్ జాతులు తక్కువగా చూస్తారు. కొన్ని జాతుల్లో ఈ ధనాన్ని వివాహానంతరం స్త్రీ ధనంగా మార్చి ఉంచుతారట. నేటి వైవాహిక విధానాలలో బహుమతులుగానూ కట్టళ్ళు, నడవళ్ళుగా మనం పిలిచినా సమస్త వ్యవహారాలూ ఒకనాటి ఆసుర వివాహ లక్షణాలే

అని నిశ్చయంగా చెప్పవచ్చును. ఇది ఆంధ్రదేశంలో నేటికీ విరివిగా కనిపిస్తున్నది. ఈ శుల్కం స్త్రీ ధనంగా మారటమూ, శుల్కాన్ని స్త్రీకే ఇవ్వటమూ ఆసుర వివాహ విధానంలో మరొక మెట్టు పైకెక్కినట్లు వ్యక్తం చేస్తున్నవి. కొన్ని మహమ్మదీయ జాతుల్లో క్రీ.పూ.100 సంవత్సరాలనాడే శుల్కంగా ఇవ్వటానికి కన్య అయితే ఒప్పుకున్న రెండువందల దీనారాలు గానీ, విధవ అయితే ఇవ్వవలసిన నూరు దీనారాలుగానీ, స్త్రీ ధనం కావటం ఏర్పాటైంది. దీనికోసం భర్త ఆస్తి తాకట్టైనా పెట్టవలసి వస్తుంది. వివాహం జరిగినట్లు నిశ్చితం కావలెనంటే, స్త్రీ ధనమైన 'సాదక్'ను తండ్రిపరం చేయవలెనని కొరాను పలికింది.

భారతదేశంలో 'స్త్రీధనం' మనువు నాటినుండి ఏర్పాటైంది. టుటానిక్ జాతుల్లో క్రీ.శ. 6వ శతాబ్దంలో కాని జరుగలేదు. పితృస్వామికాలైన కుటుంబాలలో ఈ స్త్రీధనం భర్త దగ్గరే ఉంటుంది. అతని మరణానంతరం ఆమెకు అతని రాబడిలో నుంచీ భృతికి ఏర్పాటు జరగడం వచ్చింది. మొన్నమొన్నటివరకూ యూరప్, జర్మనీ, స్విట్జర్లందు దేశాలలో వివాహ సమయంలో ఆచారంగా ఉన్న 'ఉదయప్రదానము' (Morgengabio) లేక 'మార్నింగ్ గిఫ్ట్' శుల్కానికీ, స్త్రీధనానికి సంబంధించింది. ఇటలీలోని 'కౌయిల్' ఇటువంటిదే.

ఆసుర వివాహంలో 'సేవాశుల్కం' అనే ఒకానొక విధానం అనేక జాతుల్లో కనిపిస్తుంది. తండ్రికి కొంతకాలం సేవ చేసి పిల్లను పొందటమే దీని లక్షణం. ధనం ఇచ్చే బదులు 'శరీర సేవ' చేస్తూ ఉండటం వల్ల దీనిని కూడా శాస్త్ర శుల్కవివాహం (Marriage by Purchase) గా భావించారు. కొన్ని జాతుల్లో శుల్కం చెల్లించినా కన్యక తండ్రికి వరుడు కొంతకాలం సేవ చేస్తేగాని భార్య దొరకదు. ఇటువంటి సందర్భాలలో జరిగే వివాహాన్ని ఆసుర వివాహము (Marriage by Purchase) అనటానికి వీలు లేదని ఫీల్డింగు అభిప్రాయము. ఇటువంటి వివాహానికి ఉదాహరణంగా బైబిలులో (Genisis - XXIX) జాకోబ్, రాఖిలోల – కథ కనిపిస్తూ ఉన్నది. మాతృస్వామికాలైన కుటుంబాలలో కన్యక కుటుంబానికి వరుడు కొంతకాలం సేవ చేస్తే గాని భార్య లభించదు; అతనికి ఆస్తి లేకపోతే ఎంతకాలమైనా ఆ కుటుంబానికి సేవకుడుగా ఉండవలసి వస్తుంది; అయితే పితృస్వామికాలలో (Patriarchal) సేవజేయవలసిన కాలానికి ఒక పరిమితి అంటూ ఉంటుంది. ఈక్విడార్‌లో కానిలాస్ ఇండియనులలోను, బ్రెజీలు ఇండియనులలోను యూకటులున లోను ఇదే ఆచారం. ఉత్తర ఆసియాలో నిగేరియా, కొరయక్, చుక్ చీ జాతి యువకుల్లో ఈ విధంగా భార్యకు సేవ

చేయవలసిందే. ఇండియా, ఇండో చైనా, చైనా, జపాన్ దేశాలలో ఇది అనేక జాతుల్లో ఆచారంగా ఉంది. ఇండియన్ ఆర్చి పెలగో, ఆఫ్రికా, దక్షిణ అమెరికాలల్లోను కొన్ని కుటుంబాలలో ఇదే పద్ధతి. ఎస్కిమో జాతిలోను, మకరంగాలలోనూ (ఆఫ్రికా) ఇదే ఆచారం. ఈ రీతిగా సేవ చేస్తూ ఉన్న భర్త మంచి గుణాలు లేనివాడనిపిస్తే, ఎప్పుడైనా అతణ్ణి కన్యక తండ్రి ఇంట్లోనుంచి వెళ్ళిపొమ్మనవచ్చును. అటువంటి సందర్భాలలో భార్యాభర్తలకు కలిగిన సంతానం కన్యక కుటుంబానికి చెందటమే కనిపిస్తున్నది.

ఈ సేవా వివాహానికి (Marriage by service) ముఖ్యోద్దేశం భర్తకంటే భార్య అవసరాలని నిరూపించడమే అయినట్లు అవగతమవుతున్నది. ఇటువంటి వివాహాలు జరిగినప్పుడు స్త్రీకి విశేష స్వాతంత్ర్యము ఉన్నది. ఆసుర వివాహంలో కేవలం శుల్కమిచ్చి విక్రయించుకున్న భార్యకు ఇటువంటి స్వేచ్ఛ ఉండడానికి అవకాశం ఏ మాత్రమూ లేదు. సర్వ సామాన్యంగా అనాగరక జాతుల్లో స్త్రీ పొందే నైచ్యాన్నీ, అగౌరవ భావాన్నీ తీసివేయడానికే ఇటువంటి సేవాలక్షణం. ఆసుర వివాహంలో ఒక భాగంగానూ, ప్రత్యేక వివాహ విధానంగానూ ఏర్పడి ఉంటుందని విజ్ఞుల అభిప్రాయం.

పురాతన గ్రీసు దేశంలోని స్పార్టాలో 2/5 వంతు దేశం స్త్రీకి కట్నంగా వచ్చినదేనని ఎరిస్టాటిల్ చెప్పినాడు. న్యాయ సమ్మతమైన భార్యకు 'డాన్' (స్త్రీ ధనం) ఇవ్వటము ఒకానొకనాడు రోమనులు విశేషంగా గౌరవించేవారు. భార్య దానిని నూత్న గృహ నిర్మాణం కోసం భర్తకిచ్చి తర్వాత పుచ్చుకుండేది. ఇటువంటి ఆస్తిని తాకట్టు పెట్టడానికి గాని, అమ్మడానికి గాని భర్తకు ఎటువంటి అధికారమూ రోమన్ ధర్మశాస్త్రం అంగీకరించలేదు. భర్త కట్నంగానూ భార్య శుల్కంగాని, లేక స్త్రీ ధనంతో గాని నూతన గృహాన్ని ఏర్పరచుకొని కొంతకాలం కాపురం చేసి, విభేదాలొచ్చి విడాకులు పుచ్చుకుంటే, ఆ ఆస్తిని ఇరువురూ సమానంగా పంచుకునేవారు.

క్రీ.పూ. 1955లో బాబిలోనియా రాజు హమ్మురబీ, భర్త భార్యను ఇంట్లోనుంచి వెళ్ళగొడితే, ఆమె స్త్రీ ధనాన్ని ఇచ్చివేయవలసిందే అని శాసించాడు. 'ఇటలీలోని స్త్రీలు' అనే గ్రంథంలో విలియం బౌల్డింగ్ మహాశయుడు స్త్రీ ధనాన్ని గురించి నానా విధాలైన నియమాలను, విచిత్రాలను వివరించాడు. ఇటువంటి లక్షణాలే ఇతర జాతుల్లోను, దేశాల్లోను ఉన్నవి. ఆసుర వివాహంగా ఉన్న సేవకుడు కేవలం సేవకుడు. భవిష్యత్తులో జామాత. ఇది అతనికి కేవలం పరీక్షాసమయం. విరివిగా కనిపించే బహూకృతులు, తదితరాలు ఉభయకులాల మధ్య సఖ్య బంధాన్ని అభివృద్ధి చేయడం కోసంగానే కనిపిస్తున్నవి. ఈ విషయమే జాఫెర్సన్ సైబీరియాలోని యూకాగిర్ జాతి

అభిప్రాయమే ఇటువంటిదైనట్లు రాసినాడు. ఫావిడా జాతిలోని పెళ్ళి కుమారుడి పక్షం ఏబది నాణాలు పంపితే వాటికి బదులుగా పెళ్లి కుమార్తె వారు ఐదు పందులను పంపుతారట! అప్పుడు పెళ్ళి కుమార్తె తండ్రి పెళ్ళి కుమారుడి తండ్రికి 'మీ నాణాలకు మీకు వచ్చేది ఈ ఐదు పందులు గాని అందమైన మా అమ్మాయి కాదు' అని చెప్పి పంపుతారట. ఇటువంటి సందర్భాలలో ఇవి లాంఛనాలు. పరస్పరమూ సఖ్య భావాన్ని పెంపొందించే క్రియలేగాని ఆసుర వివాహ లక్షణాలుగా ఆధునిక వివాహంలో నిలిచిన లక్షణాలు మాత్రం కావు.

***(ఆంధ్రపత్రిక 1948 డిసెంబర్ 15)***

# దేవీ నవరాత్రులు

“శివః శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
నచే దేవం దేవో నఖలు కుశలః స్పందితు మపి ।
అతస్త్వా మారాధ్యాం హరిహర విరించ్యాదిభి రపి
ప్రణంతుం స్తోతుం వా కథ మకృతపుణ్యః ప్రభవతి ॥”

(శివుడు శక్తితో కూడుకొన్నప్పుడే సృష్టించే శక్తి గలవాడౌతున్నాడు. ఆమె చేరనప్పుడు ఆ మహాదేవుడు కదలనైనా సమర్థుడు కాలేడు. అట్టి స్థితిలో ఏ పుణ్యం ఎరుగని నేను, బ్రహ్మవిష్ణు మహేశ్వరాదులైన దేవతల చేత సేవింపబడే నీకు ఎలా మ్రొక్కగలను? ఎలా నిన్ను స్తుతింపగలను?)

– శంకరాచార్య

## నవరాత్రులు – ప్రాముఖ్యము

పరజాతుల బుద్ధి సంస్కారాలతో అణుమాత్ర ప్రమేయమైనా లేకుండా, సర్వతోముఖమైన జాతీయ జీవన వికాసాన్ని ప్రతిబింబింపజేస్తూ, నానా విధాలయిన కార్యకలాపాల మూలంగా సమష్టి జీవితాన్ని కాపాడి వృద్ధి పొందిస్తూ, సమైక్యతను, సమగ్రతను సంపాదిస్తూ, భారతీయుల సాంఘిక వైజ్ఞానికాది దృక్పథాలను నిరంతరం తీర్చిదిద్దుతూ, అనాది కాలం నుండి అతిశయమయిన ప్రాముఖ్యాన్ని వహించిన కొద్ది పండుగలలో ‘దేవీ నవరాత్రులు’ ఒకటి. వీటిని కేవలం నవరాత్రులని వ్యవహరించడం కద్దు. చైత్రమాసారంభం నుంచీ ఒక నవరాత్రులు (వసంత నవరాత్రులు), భాద్రపదశుద్ధ ప్రథమ నుంచీ ఒక నవరాత్రులు (గణపతి నవరాత్రులు), ఆశ్వయుజంలో ఆదిని జరిగే ఒక నవరాత్రులు (శరన్నవరాత్రులు) ఉన్నా, “నవరాత్రులు” అన్న వ్యవహారం కేవలం ఈ దేవీ నవరాత్రులకే రూఢమైంది. అన్నివిధాలా ఈ ‘నవరాత్రాన్ని’ భారతీయులు మకర సంక్రాంతి తరువాత ప్రముఖమయిన పండుగగా భావిస్తున్నారు.

## నవరాత్రులు – వివిధ నామములు

ఆశ్వయుజ శుద్ధ ప్రథమ మొదలు దశమి వరకూ సర్వ వర్గాలకూ చెందిన భారతీయులందరూ భక్తిశ్రద్ధలతో, మహోల్లాస విలాసాలతో జరుపుకునే ఈ పండుగలకు

శరన్నవరాత్రులనీ, దేవీ నవరాత్రులనీ పేర్లున్నవి. సంవత్సరాత్మకమైన కాలచక్రములో ఆశ్వయుజ కార్తిక మాసాలలో ఏర్పడే శరదృతువుకు ప్రత్యేక ప్రాముఖ్యమున్నది. తమోగుణ ప్రధానమయిన వర్షఋతువు వెళ్ళిపోయి ఆకాశం మేఘరహితం కావడం వల్ల ఈ ఋతువులో చంద్రకాంతి మిక్కిలి తేజోవంతమయి విలసిల్లుతుంది. భూదేవికి (స్త్రీ) పురుషుడికీ పునస్సమాగమం చేకూరుతుంది. మహాలయ అమావాస్యతో అంతమయిన సంవర్తక క్రియ నుంచి బయటపడ్డ ప్రకృతి పునఃసృష్టికి పూనుకుంటుంది. పరమేశ్వరికి అంశావతారమయిన సరస్వతి నవమాసాలు మోసి నూతన సృష్టి అనే నవబాలను ప్రసవిస్తుంది. ఆ తల్లి నవ మాస గర్భధారణకు ప్రతీకలే ఈ నవరాత్రులు. జ్యోతిష శాస్త్ర దృష్ట్యా విశేష ప్రాముఖ్యమున్న శరత్తులో జరిగే పండుగలు కాబట్టి ఈ ఉత్సవాలకు 'శరన్నవరాత్రు'లన్న పేరు వచ్చింది.

సృష్టి, స్థితి, సంహారాలకు నియంతలైన మూలపురుషులు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. సరస్వతి, లక్ష్మి, దుర్గ (చండి, కాళి) ముప్పురూ వీరి శక్తులు. పరాశక్తి (ఆదిశక్తి, మహామాయ) అంశావతారాలైన వీరిని ప్రధానంగాను, కలాంశావ తారాలయిన బాల, లలిత, శ్యామలాదేవి దేవీ మూర్తులను సముచితంగానూ, ముగ్గురమ్మల మూలపుటమ్మ అయిన ఆదిశక్తిని పూజించటం ఈ నవరాత్రులలో జరగడం వల్ల ఈ పండుగలకు దేవీ నవరాత్రులన్న పేరు కలిగింది.

## దేవీ స్వరూప నిరూపణము

సృష్టి స్థితి లయాలను సంపాదించగలిగేది శక్తి. ఈ శక్తి, ఆదిశక్తి, పరాశక్తి, విష్ణుమాయ, యోగమాయ, పరమేశ్వరి, రాజరాజేశ్వరి, ప్రకృతి, మూలప్రకృతి, శ్రీ మున్నగు నామాలతో వ్యవహరించబడుతున్నది. ఈ ఆదిశక్తి స్ఫురణ వల్లనే బ్రహ్మాది త్రిమూర్తులు 'సృష్టి, స్థితి, సంహారా'లను చేయగలుగుతుంటారు. ఈ జగదంబ దేవతల్లోనూ, మానవాది భూతకోటిలోనూ నానావిధమైన అంశ విభేదాలతో, నానావిధ నామ రూపాలతో వర్తిస్తుంటుంది. జీవులు, మానవులు, దేవతలు ఈ శక్తి ప్రేరణ వల్లనే సుఖ దుఃఖానుభవాలను పొందుతుంటారు. అందువల్ల ఈ పరదేవిని దేవమానవాదులందరూ పూజించి, సేవించి శక్తి సంపన్నులౌతుంటారు. ఈ ఆదిశక్తి పురుష రూప అని కొందరు, స్త్రీ రూప అని కొందరు చెపుతుంటారు. కాని దేవీ భాగవతంలో ఈ పరాశక్తి తనను ధ్యానించి దర్శనాన్ని అర్థించిన బ్రహ్మకు సాక్షాత్కరించి 'పురుషుడను నేనే, స్త్రీని నేనే, ఇరువురిలో భేదము లేదని ఎవడు తెలుసుకుంటాడో అతడు ధీశాలి' అని పలుకుతుంది.

## మహాసరస్వతి – మహాలక్ష్మి – మహాకాళి

జగన్నియంతృత్వాన్ని లీలగా కలిగిన పరమాత్మ సృష్ట్యాది క్రియా కలాపాలను నిర్వర్తించడం కోసం ఆదిశక్తిని ఆధారంగా గ్రహించి, పురుష రూపంలో గాని, స్త్రీ రూపంలో గాని అవతరించడం కలుగుతుంది. పురుష రూపంలో అవతరించినప్పుడు బ్రహ్మ, విష్ణు, రుద్రరూపాలను, స్త్రీ రూపంలో అవతరించినపుడు మహా సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి రూపాలను ధరించడం జరుగుతుంది. త్రిమూర్తులలో బ్రహ్మ రజోగుణ ప్రధానుడు, విష్ణువు సత్త్వగుణ ప్రధానుడు, రుద్రుడు తమోగుణ ప్రధానుడు. త్రిశక్తులలో మహాసరస్వతి రజోగుణ ప్రధాన, బ్రహ్మీరూప, ఈమె ముఖ్యంగా జగదుత్పత్తి చేస్తుంది. జ్ఞాన సంచారాన్ని చేస్తుంది. విద్యాజ్ఞానాలకు అధిష్ఠానమైన ఈ తల్లి బుద్ధి, కవిత, మేధ, ప్రతిభ మొదలైన శక్తులను ప్రసాదిస్తుంది. వ్యాఖ్యా బోధల మూలంగా సమస్త సందేహాలను తీరుస్తుంది. ఈమె విచారణ కారిణి, గ్రంథకారిణి. మహాలక్ష్మి సత్త్వగుణ ప్రధాన.

## దేవీపూజ – దిన సంఖ్య

దేవీపూజ భారతదేశములోనే కాక కొన్ని ఇతర దేశాల్లో కూడా ఏదో రూపంలో కనిపిస్తున్నది. కానీ ఆ దేశాల వారు భారతీయుల వలె దేవిని సమగ్ర రూపంలో భావించి, ధ్యానించి, దర్శించి పూజిస్తున్నవారు కారు. వారి పూజా విధానంలో జ్ఞాన విజ్ఞానాలు, లౌకికత – ఆధ్యాత్మికతలు, కామ నిష్కామములు, పరిపూర్ణ రూపంలో ప్రస్ఫుటితాలు ఐనట్లు కనుపట్టవు.

ఆదిశక్తి లోకవిద్రోహాన్ని తలపెట్టి, సాధుజన సంతాపాన్ని కలిగిస్తున్న కొందరు రాక్షసులను సంహరించడానికి స్త్రీ రూపంతో అవతరించింది. ఈ శ్రీదేవి మధుకైటభులను సంహరించడం కోసం, మహాలక్ష్మిగా అవతరించింది. మహిషాసురుణ్ణి సంహరించడం కోసం, మహాకాళిగా అవతరించింది. శుంభనిశుంభులను సంహరించడం కోసం మహాసరస్వతిగా అవతరించింది. ఇవికాక మరి ఆరు అవతారాలెత్తినట్లు దేవీ మాహాత్మ్యం వల్ల తెలుస్తున్నది. అవి శ్రీకృష్ణభగవానుని జన్మ సమయంలో కంసవధాప్రయత్నం కోసం నందుని ఇంట పుట్టి, కంసుడు సంహరింపబోయినప్పుడు అదృశ్యురాలైన మహా మాయావతారం, మహాక్రూరుడైన ఒక రాక్షసుణ్ణి వధించటం కోసం ఉదయించి, వధవేళ దంతాలను రక్తవర్ణం చేసుకున్న రక్తదంతి అవతారం, నూరేళ్ళ క్షామ మేర్పడ్డప్పుడు ప్రజల బాధలను తీర్చటానికి శాక ఫలాదులను ప్రసాదించిన శాకంభరి అవతారం, దుర్గుణ్ణి సంహరించటానికి

ఎత్తిన దుర్గావతారం, మాతంగి అవతారం, అరుణుడనే రాక్షసుణ్ణి భ్రమరాల (తుమ్మెదల) సహాయంతో వధించిన భ్రామరీ అవతారం అన్నవి. దేవి మొత్తం తొమ్మిది అవతారాలు ఎత్తింది. ఈ నవావతారాలతో విలసిల్లిన తల్లిని నవాక్షరీ మహామంత్రంతో జపించాలి. ఈ నవావతారాలకు, నవాక్షర మహామంత్రానికి, శ్రీచక్రంలోని నవావరణలకూ, దేవిని నవరాత్రులు పూజించటానికి ఆధ్యాత్మికము, ఆంతరికమూ అయిన సంబంధం ఉంది.

తొమ్మిది దినాలు దేవీపూజ జరుపుకోలేని వాళ్ళు సప్తమి మొదలు మూడు రాత్రులు, పంచమి మొదలు ఐదు రాత్రులు, తదియ మొదలు ఏడు రాత్రులు. దుర్గాష్టమి మొదలు మహానవమిగా ఒక రాత్రి జరుపుకుంటారు.

## దేవీ నవరాత్రులు – పూజా కల్పవిభేదాలు

దేవీ నవరాత్రులను శరదారంభంలోనే కాకుండా వసంతారంభంలో చైత్రశుద్ధ ప్రథమ నుంచి కూడా జరుపుకోవచ్చని నిర్ణయ సింధువు అను ధర్మశాస్త్ర గ్రంథము వల్ల తెలుస్తున్నది. వసంత శరత్తులు రెండూ నానారీతి వ్యాధులకు నిలయాలు కనుక వీటికి యమదంష్ట్రికలని పేరు. అనగా యముని కోరలని యర్థము. ఈ కారణం వల్ల ఈ రెండు ఋతువులలోనూ దేవీనవ రాత్రులు జరుపుకోవాలని భాగవతం చెపుతున్నది. అయినా శరత్తులోని నవరాత్రులే దేవీనవరాత్రులుగా ప్రఖ్యాతి వహించాయి.

దేవీ పూజకు విధానాన్ని తెలియజేసే ప్రతిపదాది, నవమ్యాది, షష్ఠ్యాది, సప్తమ్యాది, అష్టమ్యాది, అష్టమీ, నవమీ కల్పాలనే ఏడు కల్పగ్రంథాలు ఉపాసకుల కోసం ఏర్పడ్డాయి. వీటిని అనుసరించి జరిగే దేవీ పూజ సాత్త్వికి, రాజసి, తామసి అనే ప్రధాన భేదాలతో ఉంటుంది. జపయజ్ఞాదులు, మాంసరహిత నైవేద్యాలతో కూడినది సాత్త్వికీ పూజ. జపయజ్ఞాలు లేక, బలులు, మాంస నైవేద్యములతో కూడింది రాజసిక పూజ. సురామాంసాది నైవేద్యాలతో చేసేది తామసిక పూజ. ఉపాసకుల గుణ, ప్రయోజనాలను బట్టి ఈ మూటిలో ఒక విధమైన పూజా విధానాన్ని అనుసరిస్తారు. సాత్త్వికతత్వం గల మహర్షులు మొదలైన వారు సాత్త్వికిని, రజఃప్రవృత్తి గల రాజులు, వీర పురుషులు రాజసిని, తమః ప్రవృత్తి గల రాక్షసులు, రాక్షసత్వం గలవారై తామసిని ఆదరిస్తుంటారు. ఎట్టి చిత్తవృత్తితో దేవిని పూజిస్తే అట్టి ఫలం కలుగుతుంది. కాని సత్యపదార్థ తత్త్వం గోచరించడానికి, దేవీ శ్రద్ధ కలగడానికి శుద్ధ సాత్త్విక స్థితి (సాత్త్విక సాత్త్వికం) అత్యవసరం. మోక్షాపేక్ష గలవారికి సాత్త్వికమే సంశయ రహితమయిన మార్గం.

దాక్షిణాత్యులు సాత్త్విక విధానాన్నే విశేషంగా ఆదరిస్తారు. ఉత్తర దేశంలో ముఖ్యంగా వంగదేశంలో దేవీపూజ అజమహిషాది బలులతో (మేకలు, దున్నపోతులు మున్నగునవి), సురాపానము, అశ్లీల సంభాషణము మొదలయిన కార్యకలాపాలతో ఉన్మత్తము, భీకరమై, రాజస తామస విధానాలను అనుసరించి జరుగుతుండేది.

## ప్రతిపదాది కల్పోక్త పూజాపద్ధతి

ప్రతిపదాది కల్పాన్ని అనుసరించి దేవీ పూజలు జరిపేవాళ్ళు, పాడ్యమి నాడు దీక్ష వహించి కలశస్థాపన చేసి దేవిని ఆవాహన చేస్తారు. వేదిక మీద దేవీ ప్రతిమలను నిలిపి కేశసంస్కారాది ద్రవ్యాలను సమకూరుస్తారు. విదియ నాడు కేశబంధన సేవ, తదియనాడు దర్పణ ప్రదానం, అలంకరణ ద్రవ్య సమర్పణం, చవితినాడు మధుపర్క సమర్పణం, పంచమినాడు షోడశోపచార పూజ చేస్తారు. షష్ఠినాడు సాయం సమయములో బిల్వతరుబోధన చేస్తారు. ఇది దక్షిణాయనం కనుక (దేవతలకు రాత్రి పూట కనుక) దేవతలు నిద్రావస్థలో ఉంటారు. రావణవధ సందర్భంలో దేవ విజయాన్ని కోరి బ్రహ్మ దేవీపూజ చేసినప్పుడు, పంచమినాడు కన్యకారూపంలో కనిపించి 'మర్నాడు బిల్వవృక్షం మీద నిద్రపోతున్న నన్ను మేల్కొల్పు'మని చెప్పింది. ఆ సంఘటనకు సూచకంగా బిల్వతరుబోధన నవరాత్రి పూజలో చేరింది. బిల్వతరువు వద్ద ఈ తంతు జరిగేటప్పుడు 'ఆ నాడు రావణవధార్థం, రామ విజయార్థం నిన్ను మేల్కొల్పాడు. అలాగే షష్ఠినాడు నిన్ను నేను అకాలంలో మేల్కొల్పుతున్నాను' అంటారు.

తరువాత సప్తమి నాడు స్వగృహంలో షోడశోపచార పూజ చేస్తారు. అష్టమినాడు ఉపవాసముండి, సప్తమాతృకా సహితయైన దేవిని (అష్టశక్తి) పూజిస్తారు. నవమినాడు ఉగ్రచండ్యాది పూజలు గాని, మహాలక్ష్మి పూజలు గాని జరుపుతారు. ఈ నాటి హోమాదులతో, విశేష పూజాదులతో నవరాత్రి పూజ పూర్తవుతుంది. దశమినాడు ఉదయం గాని, సాయంకాలం గాని, దేవిని మంగళ వాద్యాలతో ఊరేగిస్తూ వెళ్ళి నదీ జలాల్లో నిలిపివస్తారు. దీనినే దేవీ ప్రస్థానము, మహాపూజ, గౌరమ్మ నీళ్లాట అని అంటారు. మనవారు ఆదిశక్తిని కన్యకగా భావించటం వల్ల ఈ నవరాత్రులలో నిత్యం కన్యకలను పూజిస్తారు. కొందరు సుమంగళీ పూజలు కూడా చేస్తారు.

## మూడు రాత్రుల పూజ

దేవిని మూడు రాత్రులు మాత్రమే పూజించేవారు. మూలా నక్షత్రయుక్తమైన సప్తమినాడు కలశ స్థాపనాదులు చేస్తారు. ఆ నాడు సరస్వతీ పూజ జరిపిస్తారు. సరస్వతీ పూజను అష్టమినాడు, నవమినాడు చేయడం కూడా ఉన్నది.

అష్టమి దుర్గా పూజకు, నవమి లక్ష్మీపూజకు ప్రధానంగా ఉద్దేశింప బడతవి.

మహా నవమినాడు ధనధాన్యాది వస్తురూపంలోనూ, కంచరం, కమ్మరం, కుమ్మరం, వ్యవసాయం మొదలైన వృత్తుల సాధనాల రూపంలోను మహాలక్ష్మి పూజ ఎట్టి విభేదాలు లేకుండా చేస్తారు. ఆ నాడు నానాజనం శక్తి కొద్దీ జాతరలు చేసుకుంటారు. ఆ నాడు మొదలు ఈ నాటి వరకూ చక్రవర్తులు, రాజులు, జమీందారులు మహానవమి నాడు లోహాభిసారిక అనే తంతు నడిపించేవాళ్ళు. పూర్వం లోహుడనే రాక్షసుడు లోకభీకరుడై దేవతల మీదకి దండెత్తి వస్తే దేవి సహాయంతో వాణ్ణి ముక్కలు ముక్కలుగా త్రుంచి వేశారట. ఆ లోహపు ముక్కలే నేటికీ ఆయుధాలకు ఉపకరిస్తున్నాయి. శస్త్రోపజీవులైన క్షత్రియులు నవమి నాడు పై వృత్తాంతానికి స్మృతిగా లోహాభిస్మారమనే చిత్ర క్రియను చేసి ఛత్ర, చామర, సింహాసన, కనకదండాది రాజలాంఛనాలనూ, చాపఖడ్గాది ఆయుధాలను పూజిస్తారు. దీనికే 'ఆయుధ పూజ' అని నామాంతరము.

## నవరాత్రులు – లౌకిక ప్రాముఖ్యము

ప్రాచీన కాలంలో చక్రవర్తులు జరిపించే ముఖ్యనగరంలోని నవరాత్ర్యుత్సవాలకు దేశంలోని సామంతులు నలమూలల నుంచీ వస్తూ తమ ప్రాంతంలోని వేదశాస్త్ర విద్వాంసులను, సంగీత నాట్యాది కళావేత్తలను, మల్లురు మున్నగు బలవిద్యాప్రవీణులను ఇతర చిత్ర విద్యానిపుణులను వెంటబెట్టుకో వచ్చి సమ్రాట్టుకు సమర్పించేవారు. ఆయన నవరాత్రులలో ప్రతినిత్యం వారిని పరీక్షించి, సముచిత బహుమానాలిచ్చి సత్కరించేవాడు. వారి సంచారం విద్యాభివృద్ధికీ, కళాకౌశలాన్ని విస్తరింపజేయడానికి తోడ్పడుతుండేది. చక్రవర్తుల మార్గాన్నే సామంతులు, ధనికులు ప్రముఖోద్యోగులు అనుసరించేవాళ్ళు. ఇందువల్ల పాలకులైన వారికి వివిధ విద్యారంగాలను సమీక్షించి, దోహదమిచ్చి ప్రయోజనాత్మకంగా దేశశక్తులను ఏకోన్ముఖం చేయడానికి అవకాశం లభించేది. విద్వాంసులలో, ప్రజలలో అన్యోన్యమైత్రి, అవగాహన, పరస్పర సహన సహకారాలు, అభివృద్ధి పొంది, సమష్టి జీవనవిధానం వృద్ధి పొంది, ప్రగతిని సాధించడానికి వీలయ్యేది. ఇట్టి ప్రయోజనాలు నవరాత్రుల వల్ల ఆ నాడే కాక యీ నాడూ లభిస్తున్నవనటం నిస్సంశయం.

## నవరాత్రులు – స్త్రీలు – బొమ్మల కొలువులు

దేవీ నవరాత్రులలో స్త్రీలు విశేషంగా ప్రముఖ పాత్ర వహిస్తూ వస్తున్నారు. ఒక వంక వీరు భర్తలతో పాటు కల్పోక్త పూజలలో పాల్గొంటూ, మరొకవంక జ్ఞాన విజ్ఞాన

ప్రచారకమైన బొమ్మల కొలువును నిర్వహిస్తున్నారు. వీరి 'బొమ్మల కొలువు' బహుళార్థ సాధకమైన క్రియాకలాపం. ఇది ప్రధానంగా విజ్ఞానవంతులు గాని సామాన్య ప్రజలకూ, భావికాల సంస్కృతీపరిరక్షకులైన బాలలకు భారతీయుల సగుణ నిర్గుణ విభేదాలతో అనంతంగా విలసిల్లే దేవతా స్వరూపంతో ప్రథమ పరిచయం కలిగించడానికి ఉద్దేశింపబడింది. వేదాలకు పురాణాలు వాఖ్యానాలైనట్లు దేవతా స్వరూపానికి ఈ బొమ్మల కొలువులు వ్యాఖ్యలు. బ్రహ్మ శబ్దానికి వికృతి రూపమే బొమ్మ. ఈ బొమ్మల కొలువుల్లో విజ్ఞానవతులైన స్త్రీలు సృష్టి, స్థితి, లయకారకులైన త్రిమూర్తులను, వారి శక్తులను, వారి అంగదేవతలను నవ రసోచితంగానూ, స్థానోచితంగాను నిలుపుతారు. ప్రశ్నించినవారికి వయోవిజ్ఞాన విభేదాలను అనుసరించి వివరిస్తారు. ఈ కొలువులోను, వీటికి అనుబంధంగా సాగించే పేరంటాలలోనూ స్త్రీలు తొమ్మిదినాళ్ళూ సర్వస్వతంత్రలై శక్తి స్వరూపిణులుగా వ్యవహరిస్తూ తమ విద్యా సంస్కృతులను, సంగీత చిత్ర లేఖనాదులందలి కళాకౌశలాలను, అలంకరణలోని నర్మమర్మాలను, లోకజ్ఞతా క్రియాదక్షతలను ప్రదర్శిస్తుంటారు. ఇందుమూలంగా స్త్రీలలో పరస్పరానుబంధాలు, స్నేహ సౌహార్దాదులు వృద్ధి పొంది సంఘ పురోభివృద్ధికి దారి తీస్తవి.

**నవరాత్రులు – బాలలు**

శ్రీరామ విజయానికి చేదోడు వాదోడైన ఆంజనేయాది వానర వీరులకు ప్రతీకలైన కోతులను ఆడించుకుంటూ, విల్లంబులు చేపట్టి 'విజయీభవ దిగ్విజయీభవ' చెప్పుకుంటూ, 'అయ్యవారికి చాలు ఐదు వరహాలు, పిల్లవాండ్రకు చాలు పప్పుబెల్లాలు' మొదలైన దసరా పద్యాలు చదువుకుంటూ భారతీయ విద్యా సంస్కృతులను పరిరక్షించడానికి ఏర్పడ్డ మహాసైన్యంలోని బాలశాఖో అన్నట్లు ఈ నవరాత్రులలో బాలలు వీథివీథీ ఊరేగుతారు. తమ గురువులను సగౌరవంగా ఇండ్లకు తీసుకుపోయి ఏడాది పొడుగునా సాధించిన విద్యావిశేషాలను స్థూలారుంధతీ న్యాయాన తల్లిదండ్రుల ముందు ప్రదర్శించి, అయ్యవారికి వార్షికమైన కట్నాన్ని ఇప్పించి, చందన తాంబూల నూతన వస్త్రదానాది సత్కారాలు చేయించి సంతసిస్తారు. విజయదశమి నాటి సీమోల్లంఘనము, జమ్మికొట్టం మొదలైన కలాపాల్లో వీరి వర్తన చూస్తుంటే భారతజాతి సంస్కృతీ వీరతలు వీళ్ళ చేతుల్లో భద్రంగా ఉంటవనే విశ్వాసాన్ని పెద్దలకు కలిగిస్తూంటారు.

విద్వద్గోష్ఠులలోను, సంగీతాది సభలలోను పాల్గొంటూ విద్వాంసులు, కళాకారులు వార్షికాలను, పారితోషికాలను అందుకుంటూ సంచారం చేస్తుండడం

వల్ల నవరాత్రులలో దేశం కళకళ లాడుతుంటుంది. దేవాలయాల్లో నానావిధ చిత్రవర్ణాలతో, మృణ్మయాదులతో దేవీరూపాలను దినానికొకరీతిగా కల్పన చేస్తుండటం వల్లనూ, హరికథా శ్రవణాదుల వల్లనూ అవి విజ్ఞాన నిలయాల వలెనూ, ప్రయోజనాత్మకమైన విలాస రంగాల వలెనూ విలసిల్లుతుంటవి. సామాన్య జనులు కొందరు మహిషాసుర మర్దని మొదలైన దేవీ రూపాలను ఆ తల్లి వాహనాలైన సింహ శార్దూల రూపాలను, రాక్షసరూపాల, వేషాలు ధరించి పగటి వేళ ఊరేగింపులు చేసుకుంటూ దేవీ కథలను ప్రదర్శించి, సాధారణ జనుల విజ్ఞాన విలాసాలకు తోడ్పడుతుంటారు. తమిళ కన్నడ దేశాలలో దేవీ వేషాలను మధ్య నిలుపుకొని, తారు పూసుకున్న రాక్షస విచిత్ర వేషధారులు పగటివేళ వీథుల విజ్ఞాన విలాసాలకు తోడ్పడు తుంటారు. భారతదేశమంతటా విస్తరించి ఉన్న ప్రధాన శక్తి పీఠాలు గల నగరాల్లో ఈ నవరాత్ర్యుత్సవాలను ప్రజలు వైభవోపేతంగా జరుపుకుంటూండటం కనిపిస్తుంది.

## విజయదశమి - నామ హేతువులు

విజయదశమి దేవీ నవరాత్రులకు కిరీటం వంటిది. ఈ పండుగకీ పేరు రావటానికి పురాణాలు, వ్రత గ్రంథాలు, జనశ్రుతి (ట్రెడిషన్) అనేక కారణాలను చెపుతున్నవి. రావణ వధ నవమినాడు జరిగింది కనుక కృతజ్ఞతా ప్రకటన కోసం దేవతలు దేవీ విజయోత్సవాలు దశమి నాడు చేశారనీ, తత్సూచకంగా దేవీ నవరాత్రుల వెంటనే వచ్చే శ్రవణంతో కూడిన దశమి విజయదశమి అయిందని ఒక అభిప్రాయం. పాండవ యోధుడైన అర్జునుడు ఉత్తర గోగ్రహణ యుద్ధంలో భీష్మద్రోణాది వీరుల మీదికి వెళ్ళి ఈ దశమి నాడు విజయం పొందడం, విజయదశమి. దేవి మహిషాసురుణ్ణి వధించినపుడు ఈ దశమి నాడు దేవతలు విజయోత్సవం జరపటం వల్ల విజయదశమి అనీ, దశమినాడు జైత్రయాత్రకు బయలుదేరిన రాజులకు విజయం తథ్యం కనుక విజయదశమి. అశ్వయుజ శుద్ధ దశమి నాటి శ్రవణా నక్షత్రోదయ సమయానికీ 'విజయ' అన్న జ్యోతిషశాస్త్ర సాంకేతిక వ్యవహారం ఉండడం వల్ల అటువంటి 'విజయ'తో గూడిన దశమి విజయదశమి. నవమాస గర్భధారణకు సంకేతకంగా నవరాత్రులు చేసి దేవి నూతన సృష్టిని కల్పించడంలో దశమి నాడు విజయాన్ని పొందింది కనుక విజయదశమి. విశ్వజిద్యాగం చేసి మృణ్మయ పాత్రతో మిగిలిన రఘువు దగ్గరకు వరతంతు మహాముని శిష్యుడయిన కౌత్సుడు గురుదక్షిణ కోసం (పదునాలుగు కోట్ల బంగారు నాణెములు) యాచించటానికి వచ్చి, ఆ మహారాజు రిక్తహస్తుడని గుర్తించి వెళ్ళబోతున్నప్పుడు, ఆయన అతణ్ణి ఆపి స్వర్గం మీదికి యుద్ధయాత్రకు

బయలుదేరడానికి ఉద్దేశించాడు. మరుక్షణంలోనే కుబేరుడు రఘుమహారాజు కోశాగారంలో కనక వృష్టి కురిపిస్తే కౌత్సుడు అందులో తనకు కావలసినంత ద్రవ్యాన్ని తీసుకొని, మిగిలినది ఈ రఘుమహారాజ ధార్మిక విజయ విలాసంగా నవరాత్రులు గడిచిన మరునాడు ప్రజలకు పంచి యివ్వటం వల్ల, శ్రవణ నక్షత్రయుక్త దశమి విజయదశమి అయినదనీ అనేక రీతులుగా విజయదశమి నామానికి కారణాలను చెప్పుకోవటం జరుగుతున్నది. ఇలా అనేక మహత్తర విజయాలకు స్మృతి చిహ్నమైన విజయదశమి చేరటం వల్ల 'నవరాత్రము' దసరా (దశరా) అయినది.

## విజయదశమి – ఉత్సర్జనోత్సవము

నవమినాటి రావణవధానంతరం దేవిని మహోత్సవాలతో స్వర్గానికి పంపించారు కనుక నేడు కూడా నవరాత్రులలో పూజించిన దేవికి విజయ దశమినాడు వీడ్కోలివ్వటం (ఉత్సర్జనోత్సవం) జరుగుతున్నది. ఈ ఉత్సర్జనోత్సవాన్ని శాబరోత్సవంగా జరిపించాలని, అలా చేయటం దేవికి ఎక్కువ ప్రియమనీ కొన్ని ధర్మశాస్త్ర గ్రంథాలు చెబుతున్నవి. శబరుల వలె ఆకులలములు కట్టుకుని, భేరి పటహాది వాద్యాలను మ్రోగించుకుంటూ, శంఖాలు కొమ్ములు ఊదుతూ, ఆశ్లీలాలు పలుకుతూ, అసభ్య గానాలు చేస్తూ ఒకరి మీద ఒకరు బురద, బూడిదలు చల్లుకుంటూ దేవిని పంపించటం శాబరోత్సవానికి ముఖ్య లక్షణాలు. బురద చిమ్ముకోవటం, బూతులు మాట్లాడడం లేకపోతే దేవి తృప్తిపడదట. అణచిపెట్టిన క్షుద్ర లైంగికాభిలాషను (లోయర్ సెక్స్ డిజైర్స్) ఈ రూపంగా బయట పెట్టి, తృప్తిని పొంది, చేతనకు కలిగే నైజావరోధాలను తొలగించుకునేందుకు ఈ శాబరోత్సవమూలంగా మన పూర్వులు చక్కని అవకాశాన్ని కల్పించినట్లు కనిపిస్తుంది.

## విజయదశమి – ఆచారాలు

విజయదశమినాడు సీతారాములను పూజించాలి అని నారద పురాణం చెబుతున్నది. దేవి పూజలు లేని ఉత్తర దేశంలోని కొన్ని ప్రాంతాలలో దీనిననుసరించి 'రామలీల' వంటి ఉత్సవాలను జరిపించడం ఆచారమైనట్లు కనిపిస్తుంది. గొప్ప ఊరేగింపులో రావణ కుంభకర్ణుల పెద్ద బుట్టబొమ్మలను విశాలమైన మైదానానికి తీసుకువెళ్ళి తగులబెట్టి ధర్మ ద్రోహులను, సాధుజన శత్రువులను హతమార్చినట్లు ఆ ప్రాంత ప్రజలు ఆనందిస్తారు. ఊరేగింపులో ఏనుగుల మీద సీతారామ లక్ష్మణుల వేషాలు ముందు నడుస్తుంటవి. ఈ ఉత్సవం వీరగుణ సూచకం కనుక, రామలీలల్లో

కాళికా వేషధారులు చిత్రవిచిత్రంగా కత్తికటారులను త్రిప్పుతూ తమ శస్త్రవిద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించి పాలకుల వల్ల పారితోషికాన్ని పొందుతారు.

గ్రహానుకూల్యం ఉన్నా లేకపోయినా పరదేశాలకు వెళ్లదలచుకున్న వాళ్ళు బయలుదేరటం మరొక ఆచారం. రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో దేవీ నవరాత్రుల లోను విజయదశమి నాడు, దేవీ విగ్రహాన్ని కాకుండా ఖడ్గాన్ని పూజిస్తారు. తామసిక పూజ చేసేవాళ్ళు విపరీతంగా మద్యపానం, జంతుబలి చేస్తారు. వంగదేశంలో ఈ నాటి సంబరాలు అతిభీకర రూపంలో సాగేవి.

## విజయదశమి – బలనీరాజనోత్సవము

విజయదశమి ప్రధానంగా క్షత్రియుల పండుగ. అందువల్ల మహారాజులు, రారాజులు గజతురగ భటాది సైన్య బలాలన్నిటినీ ఈ విజయదశమి నాడు పర్యవేక్షించి, ప్రశంసించి, నీరాజన మిస్తారు. రావణ వధానంతరం దేవి ఈ దశమినాడే స్వర్గానికి వెళ్ళినప్పుడు ఇంద్రుడు దేవసేనకు నీరాజనమిచ్చాడట. అందువల్ల జైత్రయాత్రా సందర్భాల్లో బలనీరాజనోత్సవం చేయటం క్షత్రియులకు ఆచారమైంది. విజయదశమి నాడు జైత్రయాత్రా సూచకంగా సీమోల్లంఘనం చేయటం జరుగుతుంది. కనుక రాజులు ముందుగా బలనీరాజనోత్సవం జరిపించేవారు. కృష్ణ దేవరాయాది విజయనగర సార్వభౌములు ఈ ఉత్సవాన్ని ఘనవైభవంగా చేసినట్లు నిదర్శనాలు కనిపిస్తున్నవి. చక్రవర్తి మూలబలాన్ని ముఖ్యనగరంలో జరుగుతున్న నవరాత్ర్యుత్సవాలలో పాల్గొనటానికి వస్తూ సామంతులు వెంట తెచ్చిన సైన్యాలను బారులు తీర్చి మహానవమి వేదిక ముందు నిలిపితే ప్రతిశ్రేణి ప్రధాన గజాన్నీ, ప్రథనాశ్వాన్ని, ప్రధాన భటుని ఆ శ్రేణుల అధిపతులను చందనాదులతో అలంకరించి, మాలలు వేసి చక్రవర్తి స్వయంగా నీరాజన మిచ్చేవాడట. ఆ శ్రేణులలోని ఇతర గజాశ్వాదులను చక్రవర్తి సన్నిహిత బంధువులు, ముఖ్యోద్యోగులు ఇలాగే పూజించి నీరాజన మిచ్చేవాళ్ళు. ఈ నీరాజనోత్సవంలో దేశం నలుమూలల నుంచి రప్పించబడ్డ నాట్యకత్తెలు సైతం పాల్గొనేవారు. ఇట్టి విచిత్ర దృశ్యాలతో కూడిన విజయదశమి నాటి విజయనగరాన్ని విభ్రాంతితో తిలకించిన పియజ్ అనే విదేశీయాత్రికుడు 'ఇది స్వప్నమా! మిథ్యాకల్పనమా! మృణ్మయమైన భూమి మీద ఇటువంటి సౌందర్యం ఎక్కడ ఉంటుం!' దని మెచ్చుకున్నాడు. ఈ బలనీరాజనోత్సవం రాజభక్తిని, దేశభక్తిని, ధర్మ రక్షాసక్తిని సైన్యంలో పెంపొందించింది. దీన్ని కన్నుల పండువగా చూచిన ప్రజకు

సమీకృతమైన దేశభక్తి అర్థమైనది. వారికి మనం శక్తిమంతులము, అజేయులం అన్న భావాలు హత్తుకుని మనోధైర్యాన్ని, హృదయశాంతిని లభింపజేశాయి.

**విజయదశమి – అపరాజితా పూజనము**

విజయదశమి నాటి కర్తవ్యాలు అపరాజితాపూజనము, శమీ పూజ, సీమోల్లంఘనములు. అపరాజిత (పరాజయము లేనిది) ఋగ్వేదార్య దేవత. కౌటిల్యుడు ఈమెకు అప్రతిహత (అడ్డు లేనిది) జయంత (విజయశీలము గలది) వైజయంత (జయము నిచ్చునది) అనే ముప్పురు క్షాత్రదేవతలను తోడుచేసి, జైత్రయాత్ర సందర్భాల్లో వీరిని పూజించి తీరాలని నియమ మేర్పరిచాడు. బహుకాలం నుంచి రాజులు 'విజయ' నామంగల దశమి నాడే రుద్రప్రియ అయిన అపరాజితను పూజించటం ఆచారంగా వచ్చింది. పూజ ముగిసిన తరువాత పసుపుగుడ్డలో గరిక, ఆవాలు పెట్టి వలయంగా చేసి 'అపరాజితా! నీవు లతలలో ఉత్తమమయిన దానివి. సకలార్థ సిద్ధి కోసం నిన్ను ధరిస్తున్నా' నని చెప్పి దానిని కుడిచేతి దండకు కట్టుకోవడం ఆచారం. అపరాజిత కాళిదాసు కాలంలో ఒక మూలికగాను, తరువాతి కాలంలో విష్ణు క్రాంత, చంద్రక్రాంతగానూ మారి, చివరకు మరుగుపడింది. చివరికీ శబ్దం అగ్నిని పుట్టించే అరణికి మూలము అయిన శమీ వృక్షాన్ని వ్యక్తం చేయటం జరిగింది. అగ్ని వీరానికి, వైరానికి ప్రతీక. ఆ అగ్నిని గర్భ మందు ధరించుట వల్ల పూజార్హతను పొందిన శమీ వృక్షాన్ని పూజించే సమయంలోనే తరువాతి కాలంలో రాజులు శమీపూజ చేశారు.

**శమీపూజ – ఖంజరీటదర్శనము, సీమోల్లంఘనము**

ఈ శమీపూజా సందర్భంలో శివ ప్రీతికరమైన ఈశాన్య దిక్కుకు వెళ్ళి అక్కడ ఉండే జమ్మిచెట్టుకు గొప్పు త్రవ్వి, నీరు పోసి, క్రింద స్థలశుద్ధి చేసి, అష్టదళ పద్మాన్ని నిర్మించి, దానిమీదికి దుర్గాదేవి మూర్త్యంతరమైన అపరాజితను, ఆమెకు అంగదేవత లయిన జయ విజయలను ఆహ్వానించి, అపరాజితకు, శమీదేవికి భేదం లేనట్లు పూజిస్తారు. పూజ వేళ 'శ్రీరామ పూజితా! శమీ! నా జైత్రయాత్రను నిర్విఘ్నంగా కొనసాగించు' ఆమెను 'నీవు అర్జునుని బాణాలను ధరించిన దానవు; రామచంద్రునితో ప్రియమైన మాటలు పలికిన దానవు' అని స్తుతిస్తారు.

శత్రు విజయం కోసం, కార్యార్థ సిద్ధికోసం, దేశాంతర యాత్ర కోసం విజయదశమి నాడు సీమోల్లంఘనం చేయవలెనని శాస్త్రం చెప్పింది. సీమోల్లంఘనం శమీపూజకు పూర్వం గాని, తరువాత గాని ఎప్పుడైనా చేయవచ్చునని ఉన్నా తరువాత

చెయ్యటమే ఆచారమైనది. ఈ పొలిమేర దాటటానికి ముందు ఖంజరీట దర్శనం చేయాలి. ఈ కాటుక పిట్ట, వర్షర్తువు వెళ్ళిన తరువాత ఆకాశం మేఘ రహితమయితేనే కాని బయటికి రాదు. దీని రాక యాత్రానుకూల్యాన్ని సూచిస్తుంది. కనుకనే యాత్రకు ప్రతీక అయిన సీమోల్లంఘన సమయంలో ఖంజరీట దర్శనం చేయవలసి వచ్చింది. ప్రాచీన కాలవిజ్ఞానానికి సూచకమయిన ఈ చర్య ఇంకా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నది.

పూర్వ రాజన్యులు అశ్వారూఢులై పరివార సైన్య సమేతంగా పొలిమేర దాటి, ధనుష్టంకారం చేసి, అక్కడ ధర్మవిద్రోహులు, లోక కంటకులు అయిన శత్రువులకు ప్రతిగా నిల్పిన బొమ్మల మీద బాణ ప్రయోగం చేసి వధను అభినయించేవారు. వీరి జైత్రయాత్రకు పరద్రవ్యాపహరణాసక్తిగాని, రాజ్యవిస్తరణ కాంక్ష గాని కారణాలు కావు. తిరిగి వచ్చేటప్పుడు వీరు శమీ వృక్షం మీదుగా వచ్చి, చిన్న కొమ్మను త్రుంచి శిరసు మీద ధరించి తెస్తూ తరువాత నగర ప్రవేశం చేసేవాళ్ళు. ఆలయాల్లోని దేవతామూర్తులు సైతం ఈ విజయదశమి నాడు భూత ప్రేత పిశాచాదులను అదుపులో పెట్టడం కోసం చేసే జైత్రయాత్రకు సూచకంగా సపరివారంగా సర్వసన్నాహాలతో, సీమోల్లంఘనాదులు చేయడం ఆచారంగా వస్తున్నది. ధర్మ విజయాభిలాషతో, ధర్మ ప్రచార దృష్టితోను చేసే యాత్రకు సూచకంగా యీ నాడు పీఠాధిపతులైన యతీశ్వరులు, ఇతరులు సీమోల్లంఘనం చేస్తారు. నానావిధ విద్రోహులను వెంటపడి పట్టుకోవడానికి సూచకంగా 'పారువేట' జరిగేది. ఈ పారువేట తంతులో బాగా బలిసిన గొర్రెకు తోక కోసి, క్రొత్త సున్నం పెట్టి, కోలాహలం చేస్తూ తరిమితే అది చిక్కకుండా పారిపోతు న్నప్పుడు పిక్కబలం కలవాళ్ళు వెంట పరుగెత్తి దానిని గెలుచుకుని పురస్కారాలను, పారితోషికాలను పొందటమనే విశేషాన్ని జరిగిస్తారు. ఇవి సామాన్య జనవిలాసమై, శరీరపుష్టిని, ధావన కౌశలాన్ని పెంపొందిస్తవి.

సీమోల్లంఘనం సర్వసిద్ధి ప్రదం కాబట్టి శతవృద్ధులు తప్ప తక్కినవారు అందరూ ఈ విజయదశమీ కర్తవ్యాన్ని నిర్వహిస్తారు. వీరు కూడా సాంకేతికంగా పొలిమేర దాటిన చోట శత్రువిజయాన్ని అభినయిస్తారు. జయశీలంతో శమీ వృక్షం మీదుగా తిరిగి వస్తూ 'జమ్మికొట్టి' పత్రితో ఇంటికి వచ్చి, పెద్దల చేతిలో పెట్టి 'శమీ శమయతే పాపం శమీ శత్రువినాశినీ' ఇత్యాదిగా గల శ్లోకాన్ని పఠిస్తూ నమస్కారం చేసి, ఆశీర్వచనాలు పొందుతారు.

నవరాత్రి విజయదశమ్యుత్సవాలు ఈ విధంగా హిందూ జీవన విధాన నాగరికతా సంస్కృతులను ప్రదర్శించుకోటానికి, పరస్పరావగాహనలకు పట్టని అద్దాలై, శీల

శిక్షారక్షణలకు, ఉత్తరమాదర్శ సిద్ధులకు, ప్రవృత్తి నివృత్తుల సక్రమ సమ్మేళనం గల నిత్య ప్రగతి మార్గ సంచారాలకు నాటి నుండి నేటివరకూ నిరుపమమైన దోహదం చేస్తున్నవనటం నిస్సంశయం.

## మన కర్తవ్యము

ఈ ఉత్సవాలను లోచూపుతో ఇతోధికంగా అవగతం చేసుకొని పునరుజ్జీవనాన్ని పొంది, ఆర్జించిన జ్ఞాన విజ్ఞానాల కనుగుణంగా ఆదర్శ జీవితయాత్రను సాగిస్తూ, అతిశయ శ్రద్ధా భక్తులతో సేవించి మాతృదేవీ మూర్తుల అపారమైన అనుగ్రహ విశేషం వల్ల సంప్రాప్తించే సర్వశక్తులను సమీకరించుకొని, వైజ్ఞానికరంగంలో హిందూసంఘాన్ని ఇతోధికంగా ఏకోన్ముఖమూ, పటిష్ఠమూ చెయ్యడానికీ, సముజ్జ్వలంగా హిందూ సంపదను పెంపొందించడానికి, బలప్రదర్శనాదులతో హిందూత్వాన్ని పరిరక్షించుకుంటూ విశ్రుత విజయాన్ని సాధించుకోటానికీ మనం కడు జాగరూకతతో మెలగవలసి ఉంది. ఉత్తమ జీవిత దృక్పథం కోసం అంధంగా అన్వేషిస్తూ అలసి అలమటిస్తున్న దేశాలకు, నీచ జీవన పద్ధతులతో నిలువునా మునిగి బ్రతుకుతూ, అయినా అదే ఇతరులు అనుసరింపదగ్గ బ్రతుకనే భ్రాంతితో విర్రవీగుతున్న వెర్రి దేశాలకూ జ్ఞాన విజ్ఞాన ప్రబోధం చేసి విముక్తిని చేకూర్చటం కోసం, మనం వీరత్వ వివేక విశ్వాసాలతో మన సంస్కృతిచేత సీమోల్లంఘన చేయించి, విశ్వ హిందూత్వ విజయయాత్రకు బయలుదేరవలసిన సమయం వచ్చింది. కనుక మనం కటిబద్ధం కావలసి ఉంది. ఇంతటి మహత్తర కార్యభారాన్ని నిర్వహించవలసిన మనకు మహాసరస్వతి వివేకాన్ని, మహాలక్ష్మి సంపత్తిని, మహాదుర్గ శక్తిని, అపరాజితాదేవి విజయాన్ని ప్రసాదించుగాక!

## దేవీస్తుతి

యా దేవీ సర్వభూతేషు విష్ణుమాయేతి శబ్దితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥
యా దేవీ సర్వభూతేషు చేతనేత్యభిధీయతే । నమః*
యా దేవీ సర్వభూతేషు బుద్ధి రూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు నిద్రా రూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు క్షుధారూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు ఛాయారూపేణ సంస్థితా । నమః*

యా దేవీ సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు తృష్ణారూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు క్షాంతిరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు జాతిరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు లజ్జారూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు శాంతిరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు శ్రద్ధారూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు కాంతిరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు వృత్తిరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు స్మృతిరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు దయారూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు తుష్టిరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా । నమః*
యా దేవీ సర్వభూతేషు భ్రాంతిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥

* ఈ గుర్తుకు తరువాత వచ్చిన ప్రతిపాదము తరువాత 'నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః' పఠించవలె.

# భగవాన్ శ్రీకృష్ణ

## శ్రీకృష్ణాయ నమః

"యదా యదా హి ధర్మస్యగ్లాని ర్భవతి భారత! ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజా మ్యహం ॥"
"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥"

"ధర్మచ్యుతి కలిగి అధర్మము ప్రబలినపుడు నన్ను నేను సృజించుకొంటాను. దుష్ట సంహారం చేసి శిష్టులను రక్షించి ధర్మ సంస్థాపన చేయటం కోసం యుగయుగంలోను నేను అవతరిస్తుంటాను" అని గీతాచార్యుడైన శ్రీకృష్ణ భగవానుడు అభయమిచ్చాడు.

### కృష్ణావతారము : సంఖ్య

ఈ అభయ ప్రదానాన్ని చెల్లించటంకోసం పరమాత్మ అనంతకోటి అవతారాలు ఎత్తాడు. అయితే వాటిలో మనం పదింటినే ప్రధానంగా గ్రహించి "దశావతారా" లని వ్యవహరిస్తున్నాము.

"మత్స్య కూర్మ వరాహశ్చ, నారసింహశ్చ వామనః ।
రామో రామశ్చ రామశ్చ కృష్ణః కల్కిరేవ చ ॥"

అన్న శ్లోకం ఈ దశావతారాలను క్రమంగా పేర్కొంటున్నది. ఇందులో కృష్ణావతారం తొమ్మిదవది. అంకెలలో తొమ్మిది పూర్ణ సంఖ్య. అలాగే దశావతారాల్లో కృష్ణావతారం పూర్ణావతారం.

### కృష్ణశబ్ద నిర్వచనం

బ్రహ్మ వైవర్త పురాణంలో

"బ్రహ్మణో వాచకః కోయ మృకారోఽ నంతవాచకః
శివస్య వాచక ష్షశ్చణ కారో ధర్మవాచకః ।

అకారో విష్ణువచన శ్వేతదీపనివాసినః
నరనారాయణార్థస్య విసర్గో వాచక స్మృతః ॥”

క్+ఋ+ష్+ణ్+అః= కృష్ణః కకారము బ్రహ్మ వాచకము. ఋకారము అనంతవాచకము. ‘ష’కారము శివ వాచకము ణ కారము బ్రహ్మావాచకము. అ కారము విష్ణువాచకము. విసర్గ నరనారాయణులను తెలుపుతుంది. అంతేకాక కృష్ణః – నల్లనివాడు. సర్వం కరో తీతి కృష్ణః – సర్వమును చేయువాడు. కర్ష తీతి కృష్ణః – రాక్షసులను సంహరించువాడు అని కూడ కృష్ణశబ్ద వ్యుత్పత్తి విశేషాలు కన్పిస్తున్నవి.

## కృష్ణావతార ఆవశ్యకత – వైశిష్ట్యం

ప్రతిసృష్టిలోను జీవులు దేవాంశ, రాక్షసాంశలతో పూర్వ జన్మల్లో సంపాదించిన పాప పుణ్య కర్మల సంచితాల కనుగుణంగా సజ్జనత్వ, దుర్జనత్వాలతో జన్మిస్తారు. యుగాంత సమయాలల్లో దుష్టశక్తులు ప్రబలి విశృంఖల విహారం చేస్తూ ఆపదలు కల్గిస్తున్నప్పుడు భగవంతుడు అవతరిస్తాడు. దేవాంశలతో భీష్మ, ద్రోణ, ధర్మజాదులు జన్మించి, రాక్షసాంశ సంభూతులు, దుష్టులైన దుర్యోధనాదుల విజృంభణం వల్ల ధర్మజాదులు ఆపదలపాలై అధర్మానికి తాత్కాలిక విజయం చేకూరటం జరుగుతున్న సమయంలో, అధర్మాన్ని నిర్మూలించి ధర్మాన్ని స్థాపించటం కోసం కృష్ణపరమాత్మ అవతరించటం అవసరమయింది. ఆయన ద్వాపరయుగాంత సమయంలో ఒక శ్రావణ బహుళ అష్టమి (జన్మాష్టమి) నాడు చీకటి చిందులాడే చెరసాలలో దేవకీదేవి అష్టమగర్భాన లీలామానుషవిగ్రహుడై అవతరించాడు. వీర, శృంగారాది నవరసపరిపూర్ణుడై మహాయుద్ధవీరుడుగా, ఆదర్శ ప్రభువుగా, రాజనీతి ధురంధరుడుగా, అనుష్ఠిత సదాచార ప్రవర్తకుడుగా, ధర్మసంస్థాపనాచార్యుడుగా, సర్వోపదేష్టయైన జగదేక గురువుగా, భక్తలోకశరణ్యుడుగా వ్యవహరించి, తన కర్తవ్య నిర్వహణానంతరం నిర్యాణాన్ని పొందటమే శ్రీకృష్ణావతార వైశిష్ట్యం.

## పుట్టుక – బాల్య క్రీడలు

శ్రీకృష్ణుడు లీలామానుష విగ్రహుడు. కారాగారంలో బంధితులైన దేవకీ వసుదేవుల గర్భాన, తనకు పూర్వం అగ్రజులు ఏడుగురు క్రూరనిరంకుశుడైన మేనమామ కంసుని కఱకు కత్తికి బలియైనారని ఎఱిగి ఎఱిగి, ఎనిమిదవ వాడుగా భూమిపై పడటమే ఆయన తొలి లీల. మానవాకృతితో తరువాత ఆయన నిర్వహించిన సమస్తచర్యలూ ఆయన లీలావిశేషాలే.

దివ్యబాలుడుగా అవతరించి చిత్రహింసలకు గురి అవుతున్న తల్లిదండ్రుల హృదయాలలో ఆశాజ్యోతులను వెలిగించి, భావిజన నాయకుడుగ పరిణమించి, ప్రఖ్యాతి నార్జించటం కోసం తండ్రి వసుదేవునిచేత తనను గోకులంలోని నందగోపుని ఇంటికి చేర్పించుకున్నాడు. తనకు ప్రతిగ నిల్పిన మహామాయచేత తానవతరించి అతణ్ణి హతమార్చనున్నాడని హెచ్చరిక చేయించి, కంసుని హృదయంలో భయాగ్నిజ్వాలలను ప్రజ్వలింప జేశాడు.

నందుని ఇంట ముద్దుబిడ్డడై పెరుగుతూ అతిచిన్న వయస్సులోనే కామరూపిణియైన పూతనను సంహరించటం, అఘాసుర, శకటాసుర, ధేనుకాసుర, తృణావర్త, వృషభాసురాది దుష్టులను పరిమార్చి తన మాహాత్మ్యాన్ని, దివ్యత్వాన్ని ప్రదర్శించాడు. మృద్భక్షణం చేసి తల్లి యశోదకు తన దివ్యత్వాన్ని ప్రదర్శించి వాత్సల్య రసానుభవం కోసం మరుక్షణంలోనే మరిచిపోయేటట్లు చేశాడు. క్షీర, నవనీతాదులను దొంగిలించి ఒకవంక గోపాలకులకు కష్ట నష్టాలను కల్పించి కోపోద్రేకాలపాలు చేస్తున్నా, వారికి వీడరాని ప్రియ బాలుడైనాడు. ఆప్తమిత్రుడు, అగ్రగామి యై వారికి నాయకుడై యుగయుగాలుగా వస్తున్న ఇంద్రపూజకు స్వస్తి చెప్పించి గోవర్ధన పూజ నారంభించి, ప్రతీకారంగా ఇంద్రుడు కురిపించిన శిలా వర్షం నుంచి వారి కభయమిచ్చి కాపాడి, తాను సాధుజన రక్షకుడైన దేవదేవుడన్న విశ్వాసం కల్గించాడు.

శ్రీకృష్ణుడు గోకులాన్ని ఆవరించి ఉన్న కాళీయాది అసురశక్తుల నన్నింటినీ నిర్మూలించి వారి హృదయాలలో ధార్మికమైన సజ్జన భావనను కల్పించాడు. గోపాలకుల క్షీర, నవనీతాలను దొంగిలించటం మూలంగా వారిని ప్రేమించి సుజ్ఞానులను, విజ్ఞానులను చేశాడు. గోపీ కృష్ణ ప్రణయమార్గం ద్వారా గోపకులానికి జీవాత్మ పరమాత్మలకు గల సంబంధాన్ని వెల్లడి చేశాడు. రాధా ప్రణయలీలల మూలంగా భక్తి అవిచ్ఛిన్న తైలధార వంటిదని నిరూపించాడు. రాసక్రీడలవల్ల గోపకులానికి 'సోఽహం' మార్గాన్ని నిరూపించాడు. ఈ విధంగా గోకుల జీవితంలో శ్రీకృష్ణుడు అశక్తులు, నిస్సహాయులు, అజ్ఞానులు, అసంస్కృతులు అయిన సామాన్యజనానికి దైవమైన తానే వెనుక శక్తియై, సహాయకుడై, బోద్ధయై, సంస్కర్తయై వర్తిస్తానని ప్రకటించాడు.

## అవతార సహాయకులు

అథర్వ వేదాంతర్గతమైన 'కృష్ణోపనిషత్తు' శ్రీమహావిష్ణువు కృష్ణావతారాన్ని ఎత్తటానికి పూర్వమే రుద్రాది దేవతలు అవతార సహాయకులుగ అవతరించిన

విశేషాలను వివరించి చెపుతున్నది. శ్రీరామచంద్రుని పురుష సమ్మోహనమైన దివ్యమంగళ విగ్రహాన్ని చూచి వనవాసులైన మహర్షులు సంతుష్టులై "స్వామీ! నిన్ను ఆలింగనం చేసికోవలెనని కోరిక మాకుదయించింది. అంగీకరించ"మని ప్రార్థిస్తే శ్రీరామచంద్రుడు "నేను మరొక పర్యాయం కృష్ణరూపంలో అవతరించబోతున్నాను. అపుడు మీరంతా గోపికలై అవతరించగలరనీ, అపుడు నన్ను ఆలింగనం చేసికోవచ్చును" అనీ ఈ ఉపనిషత్పీఠిక వెల్లడిస్తున్నది.

రుద్రాదిప్రధాన దేవతలు "మేము నీ ఆజ్ఞానుసారం భూలోకంలో అవతార సహాయకులుగా అవతరిస్తాము. కాని మమ్మల్ని సర్వదా నీ దేహసంస్పర్శనం కలిగే అవతారాలనే మాకు ప్రసాదించ' మని వేడుకొంటే స్వామి అంగీకరించాడు. అందు మూలంగా నందాదుల జన్మలేర్పడ్డాయి.

బ్రహ్మానందమే నందుడు. ముక్తి కాంత యశోద. బ్రహ్మ విద్య దేవకి. వసుదేవుడు ఉప నిషత్సముదాయం. వేదార్థం శ్రీకృష్ణ భగవానుడు. గోపికలు, గోపాలురు వేదమంత్రములు. విహార సమయాల్లో కృష్ణభగవానుని చేతిలో ఉండే వేణుదండం బ్రహ్మ. రుద్రుడు మురళి. శృంగము ఇంద్రుడు. స్నేహితులు దేవతలు. గోకులం (బృందావనం) వైకుంఠం. గోకులవనంలోని వృక్షాలు మునీశ్వరులు. ఆదిశేషుడు బలరాముడు. కృష్ణుని అష్టభార్యలు, షోడషసహస్రాదిక స్త్రీలు ఉపనిషన్మంత్రములు. రుక్మిణీ దేవి దయ. సత్యభామ అహింస, సుదాముడు (కుచేలుడు) శమము, అక్రూరుడు సత్యము, ఉద్ధవుడు దమము.

తృణావర్త, ధేనుకాది దైత్యులు లోభక్రోధాదులు. చాణూరుడు ద్వేషము. ముష్టికుడు మత్సరము. కువలయాపీడము దర్పము. బకాసురుడు గర్వము. అఘాసురుడు మహావ్యాధి. కంసుడు కలి. (కలహము)

శ్రీకృష్ణ భగవానుని నందకమనే ఖడ్గము మహేశ్వరుడైన రుద్రుని రూపము. శ్రీరుద్రునకు ఘోరాతనువు, శివాతనువు అనే రెండు రూపాలున్నవి. అందులో శివాతనురూపమైన శాంతి రూపం, వంశీనాదం. ఘోరాతనురూపం ఖడ్గం. శ్రీకృష్ణుని కట్టి వేసిన రోలు శ్రీమహావిష్ణువు తండ్రి యైన కశ్యపుడు. తాడు దేవమాతయైన అదితి. కృష్ణుని గద (కౌమోదకి) కాళిక, ధనుస్సు (శార్ఙ్గము) వైష్ణవీమాయ. బాణము ప్రాణభక్షకమైన కాలం, వటవృక్షం గరుడుడు. వనమాల (తులసీమాల) భక్తి.

కృష్ణోపనిషత్తులోని పై వివరణ వల్ల, ఇతర విశేషాలవల్ల శ్రీమహావిష్ణువే కృష్ణభగవానుడుగా అవతరించటమే గాక, బృందావన రూపంతో సమస్త వైకుంఠాన్నీ

భూమి మీదికి తరలించి తాను క్రీడించాడని వ్యక్తమవుతున్నది. ఈ విశేషమంతా శ్రీకృష్ణావతారం పూర్ణావతార మనటానికి తగిన ఉపపత్తిని స్పష్టరూపంలో నిరూపిస్తున్నది.

## అవతరణ రహస్యాలు

వేదార్థవిదులైన పెద్దలు కృష్ణావతార సమయంలోని అవతార రహస్యాలను ఎన్నింటివో వివరించారు. అందులో కొన్ని :

కృష్ణభగవానుడు పరమాత్మ. ఆయన బ్రహ్మానందంలో గాని ఆవిర్భవించ లేడు గనుక బ్రహ్మానందమే నందుడుగా అవతరించినది. పరమానందం ముక్తిలోనే లీనమై ఉంటుంది గనుక ముక్తికాంత యశోదగా రూపొందినది. దేవతలచేత కొనియాడబడుతున్న బ్రహ్మ విద్యే దేవకి గనుక శ్రీకృష్ణరూప పరబ్రహ్మం ఆమెయందు ఆవిర్భవించాడు. వేదార్థం నారాయణ స్వరూపం. అట్టివేదార్థమే శ్రీకృష్ణరూపంతో భూమిమీద అవతరించినది. గోపికలు శ్రీమహావిష్ణు ప్రతిపాదకమైన వేదమంత్రాలు కావటం తగిఉంది. జగద్గృహంలో శ్రీమహావిష్ణువు బ్రహ్మ రూప దండ సహాయంతో సర్వకార్యాలనూ నిర్వర్తిస్తుంటాడు కనుక, బ్రహ్మదేవుడు శ్రీకృష్ణ రూపగోపాలకుని వేణుదండం కావటం విశేషం. భగవంతుడైన రుద్రుడు సకల కళా ప్రవీణుడు. ఆయన శ్రీకృష్ణుని పిల్లనగ్రోవిగా అవతరించటం యుక్తము. ఇక్కడ ఉపనిషత్తులు గోపనీయాలు (కాపాడదగినవి) అలాగే స్త్రీలు గోపనీయలు గనుకనే ఉపనిషన్మంత్రాలు షోడశ సహస్రాధిక స్త్రీలు కావటంలోని ఔచిత్యం. శ్రీకృష్ణుణ్ణి యశోద కట్టివైచిన ఉలూఖలం (రోలు) దామము త్రాడు. దేవతా పితరులైన కశ్యపుడు అదితి కాకపోతే బంధితుడుగాని శ్రీకృష్ణుని బంధించటం ఎలా వీలు పడుతుంది? శ్రీకృష్ణ భగవానుడు అదితీకశ్యపుల చేత బంధితుడు కావటానికి, శిక్షణీయులైన యమళార్జునాదులను దండించటమనే ధర్మమార్గాన్ని కాపాడడం కోసం చేసిన అభినయం (నటన) మాత్రమే. కువలయా పీడము పూర్వజన్మలో అరిష్టుడనే రాక్షసుడు. దుర్యోధనుడు కలియుగావతారం. వైజయన్తి అనే కృష్ణుని పూలమాల, దాని పరిమళం కేవలధర్మం. వైజయంతి అనే పేరు జయహేతువు. "యతో ధర్మ స్తతో జయః" అను ప్రమాణాన్ననుసరించి ధర్మం, సైతం జయహేతువే గదా! అక్షరాల శిరోభాగంలో అనుస్వారం వలె ఉండే వైష్ణవమైన ఛత్రం ఆకాశం. శ్రీకృష్ణుని నందకం (గద) చతుర్దశ విద్యలు.

శ్రీకృష్ణ నాయకత్వాన సాగిన భారతయుద్ధభూమిలో పాల్గొన్న ఉభయ పక్షవీరులు ఏయే దేవాంశ రాక్షసాంశలతో జన్మించారో మహాభారత సభాపర్వ ఆరంభంలో విశదంగా నిరూపితమైనది.

## కృష్ణుడు – విద్యాభ్యాసము

తాను సర్వజ్ఞుడైనా లోక శిక్షణకోసం "గురువులేని విద్య, కూసువిద్య" అన్న సామెతను నిరూపించేటట్లు, సుదామా(కుచేల) ది సతీర్థులతో మహర్షి సత్తముడైన సాందీపని దగ్గర అంతేవాసియై అష్టాదశ విద్యలను సకల కళాశాస్త్రాలను అనతికాలంలో అధ్యయనం చేశాడు. భావికాలంలో గీతోపదేశం చేయటానికి తగిన అర్హత నంతటినీ సమార్జించుకొని బ్రహ్మణ్యుడైనాడు. (తపస్సు, వేదము, సత్యము, జ్ఞానము, మొదలైన విద్యావివేకాల యెడ ప్రీతిగలవాడు 'బ్రహ్మణ్యుడు'). ఆయన బ్రహ్మణ్యుడని 'బ్రహ్మణ్యో దేవకీ పుత్ర' అని ఆత్మబోధోపనిషత్తు ప్రకటిస్తున్నది. తన శిష్యు డార్జించిన సామర్థ్యాన్ని పరీక్షించడం కోసం ప్రభాసతీర్థంలో మరణించిన తన పుత్రుని బ్రతికించమని సాందీపని కోరితే, శ్రీకృష్ణుడు యమలోకానికి వెళ్ళి మృతబాలుని బ్రతికించి తెచ్చి గురుదక్షిణగా సమర్పించి గురుఋణము తీర్చుకొన్నాడు. భార్య ప్రేరణంవల్ల దారిద్ర్య నివారణ కోసం సర్వసంపన్నుడైన తన కడకు వచ్చి చెప్పుకోలేక లజ్జాముద్రితుడైన సహపాఠి సుదాముణ్ణి, అతని మనోవృత్తి నెరిగి సర్వసంపన్నుని చేసి లోకాని కొక సత్పాఠాన్ని నేర్పాడు. తపః ప్రభావాన్ని నిరూపించటం కోసం తానే పుత్రార్థియై శివుని గురించి తపస్సు చేసి సిద్ధసంకల్పుడైనాడు. రాజసూయయాగ సందర్భంలో ధర్మజుడు వచ్చినవారిని పరామర్శిస్తుంటే శ్రీకృష్ణుడు ఆ యాగసందర్శనార్థం విచ్చేసిన మహర్షుల పాదప్రక్షాళం చేసి అర్చించి వినయ విధేయతా స్వరూపాన్ని లోకానికి ప్రదర్శించాడు.

## ఆదర్శప్రభువు – జాతినిర్మాత

గోకులం నుంచి తన లౌకిక జీవిత ప్రయోజనాలను సాధించటం కోసం మథురానగరికి వెళ్ళి నాందీప్రస్తావనలుగా కువలయాపీడ మర్దనం, చాణూర, ముష్టిక సంహారం చేసి క్రూరనిరంకుశుడు, మాతులుడు అయిన కంసుని వధించి మాతామహుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. అశక్తత వల్ల వృద్ధుడైన ఉగ్రసేనుడు మథుర సింహాసనాన్ని స్వీకరించి రాజ్యపాలన చేయమని కోరినపుడు –

"నహి రాజ్యే న మే కార్యం, నాప్యహం నృపకాంక్షితం! ।
న చాపి రాజ్యలుబ్ధేన మయా కంసో నిపాతితః ॥"

"నాకు రాజ్యకాంక్ష ఎన్నడూ లేదు. రాజ్యలోభం వల్ల నేను కంసుని చంపలేదు" అని సెలవిచ్చి, మాతామహుడికి ప్రతినిధిగా రాజ్యపాలనం చేస్తూ లోకానికి ఉత్తమ పాలక లక్షణాలను ఆచరణ మూలంగా వెల్లడించాడు. పరస్పర వైషమ్యాలతో భిన్న మార్గులై వర్తిస్తున్న వృష్ణి, సాత్వత్యాదులయిన యాదవ ప్రభువులను ఏకముఖం చేసి, ధర్మ సంస్థాపన మహాకార్యాలలో తన నాయకత్వము క్రింద అగ్రగాములై వర్తించేటట్లు వారిని తీర్చి దిద్దాడు.

## శ్రీకృష్ణుడు : మహావీరుడు

శ్రీకృష్ణుడు వరగర్వితులైన శిశుపాల, కాలయవన, హంస – డిభక, పౌండ్రకవాసుదేవ, వజ్రనాభ, నరకాసురాది రాక్షసులతోను, జాంబవంతాది మహావీరులతోను నానావిధ యుద్ధనైపుణ్యాన్ని ప్రదర్శించి కొందరిని సంహరించి, కొందరిని సంస్కరించి జగదేక వీరుడని కీర్తికెక్కాడు.

## రాజ, రాజరాజ నిర్మాత

దుష్టరాజన్యులను సంహరించినపుడెల్లా శ్రీకృష్ణుడు ఆ రాజ్యాలమీద గుణవంతులైన ధర్మప్రభువులను నిలిపి మహారాజనిర్మాత అనిపించుకొన్నాడు. ధర్మజునిచేత రాజసూయం చేయించి సమ్రాట్ నిర్మాత అయినాడు. ధర్మప్రియులైన పాండవుల పక్షాన్ని వహించి భారత మహాసమరంలో వారికి విజయాన్ని చేకూర్చి, ధర్మ ప్రతిష్ఠాపనం చేశాడు.

## శ్రీకృష్ణుడు : నిరుపమ రాజనీతి కోవిదుడు

కౌరవ, పాండవ రాజకీయ వ్యవహారాలతో సంజయ రాయబారం వరకు తనకేమీ పట్టనట్లు వర్తించిన శ్రీకృష్ణుడు, దుర్యోధన, ధృతరాష్ట్రుల దుష్టబుద్ధిని శంకించి స్వయంగా కౌరవ సభకు రాయబారిగా వెళ్ళే బాధ్యత తనమీద వేసికొని, సభలో బహుముఖీనమైన రాజనీతి నైపుణ్యాన్ని ప్రదర్శించి శత్రువుల బలాబలపరిజ్ఞానంతో తిరిగివచ్చి రాజనీతి కోవిదులలో అగ్రేసరుడనిపించు కొన్నాడు. రాజసూయవేళ తనను అర్చించడానికి అంగీకరించటంలోను, శశిరేఖా వివాహ సందర్భంలోను, కర్ణుడి

జన్మవృత్తాంతాన్ని తెలియజేయడంలోను, జీవితంలోని ఇతరమైన అనేక చర్యల్లోను శ్రీకృష్ణుని రాజనీతి ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

## శ్రీకృష్ణుడు : ఆపద్బాంధవుడు

కౌరవ సభలో ధర్మబద్ధులై భర్తలు తోడ్పడలేని నిస్సహాయ స్థితిలో ఉన్న సమయంలో, దుష్టదుశ్శాసనాదులు వివస్త్రను చేయటానికి పూనుకొన్నప్పుడు ద్రౌపది మొరపెట్టుకొంటే అక్షయ వస్త్ర ప్రదానం చేసి మానసంరక్షణం చేయటం, అరణ్యవాస సమయంలో పాండవులను శాపోపహతులను గావించటానికి దుర్యోధనుడు, శిష్యసహితుడైన దుర్వాసోమహర్షిని పంపించినపుడు ఆయనకు తగిన రీతిలో ఆతిథ్యమిచ్చి సత్కరించేటందుకు సూర్యుని చేత అక్షయపాత్ర ప్రదానం చేయించటం ఆయన ఆపద్బాంధవత్వానికి నిదర్శనాలు. అశ్వత్థామ క్రూరాస్త్ర ప్రయోగానికి గురియైన ఉత్తర గర్భాన్ని రక్షించి పరీక్షిత్ జన్మకు హేతుభూతుడై భరత వంశాన్ని నిలువబెట్టటం, ఆయన ఆర్తత్రాణ పరాయణత్వానికి ఉచితమైన ఉదాహరణ. ఆయన నిర్హేతుక జాయమాన కటాక్షానికి కుబ్జవృత్తాంతం చక్కని నిదర్శనం.

## శ్రీకృష్ణుడు : భక్త జనాధీనుడు

"అనన్యా శ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥"

ఇతర భావాలు లేనివారై ఎవరు నన్ను గురించి ఆలోచిస్తూ నిరంతరం ధ్యానిస్తుంటారో, వారి యోగక్షేమాలను నేను వహిస్తుంటాను అని తన భక్త పరాయణత్వాన్ని గురించి గీతలో భగవానుడు వెల్లడించాడు. రామావతారంలో మహర్షిసత్తములు "నీవు పరమాత్మ" వని ఎన్నిమార్లు చెప్పినా, నేను దశరథపుత్రుడను అని అన్నాడేగాని, తాను పరమాత్మనని అంగీకరింపలేదు. శ్రీకృష్ణుడు ఇందుకు భిన్నంగా తాను పరమాత్మనని మాహాత్మ్యాదులతో ప్రదర్శించుకొన్నాడు. ప్రత్యక్షంగా పలుమార్లు ప్రకటించుకొన్నాడు. యశోదకు నోటిలో బ్రహ్మాండాదులను చూపించటం, రాయబారవేళ తన్ను కట్టివేయదలచి నపుడు, మహాభారత యుద్ధారంభవేళ విశ్వరూప ప్రదర్శనం చేశాడు. తన యెడ భక్తితో వర్తించిన అక్రూర, ఉద్ధవ, విదుర, భీష్మ, కుంతి, ద్రౌపది రుక్మిణ్యాదుల యెడ భగవంతునివలె వర్తించాడు ఆయన.

'మద్భక్తా యత్ర గాయన్తి, తత్ర తిష్ఠామి నారద!' అన్న ప్రమాణ వాక్యానికనుగుణంగా భక్తాధీనుడైనాడు. తనకంటె తన భక్తులను అధికం చేసి దాస, దాసోఽహ సంప్రదాయానికి కారణ భూతుడైనాడు. శిశుపాలాది వైరభక్తులకు సైతం మోక్షప్రదానం చేసిన ప్రభువైనాడు.

"యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్ ।
మమ వర్త్మాను వర్తన్తే మనుష్యాః పార్థ! సర్వశః ॥"

ఎవరు ఏ మార్గంలో సేవించినా నన్ను చేరుతారని మహోదారదైవమై ప్రవచించాడు. ఆయన ప్రభుతా విశేషాలను, భక్త జనమార్గ వైవిధ్యాలను వెల్లడించే భక్తి శాస్త్రం భాగవతం.

'విద్యావతాం భాగవతే పరీక్షా' నేను విద్యావంతుడనన్న వాడిని భాగవతంలో పరీక్షించటం భారతదేశంలోని విద్వత్సంప్రదాయం. ఇంతటి మహోదాత్తత గల గ్రంథం కావటం వల్లనే, భక్తకవి సత్తముడైన మహాకవి పోతన భాగవతాన్ని ఇలా కీర్తించాడు.

మ. "లలిత స్కంధము కృష్ణమూలము శుకా లాపాభిరామంబు మం
జులతాశోభితమున్, సువర్ణసుమన స్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరువు ర్విన్ సద్విజ శ్రేయమై."

## శ్రీకృష్ణుడు : గీతాచార్యుడు

మహాభారత రణరంగంలో ఉభయపక్షాల మధ్య అష్టాదశ అక్షౌహిణీదళాలు మోహరించి నిలచినవేళ విభ్రాంతుడు, మహావేశ వివశుడు, కింకర్తవ్యతావి మూఢుడు, యుద్ధ యాగారంభ విముఖుడునై పార్థుడు అస్త్ర సన్యాసం చేసినప్పుడు, పార్థసారథి తన నారాయణత్వాన్ని ప్రకటిస్తూ అనుగ్రహ బుద్ధితో, అల్ప సమయంలో సదసద్వి జ్ఞాన రూపమైన ఉపనిషత్ సారాన్ని గీతారూపంలో ఉపదేశం చేసి, అతనిచేత కదనభూమిలో వీరవిహారం చేయించి విజయాన్ని చేకూర్చాడు. పిండీకృత విజ్ఞాన పుంజమైన గీతను ఉపదేశించిన మార్గాన్ని అనుసరించడం వల్ల కలిగే ప్రయోజనాలను సంజయుడు ధృతరాష్ట్రుడికి 'ఏకశ్లోకీ భగవద్గీతా' అన్న ఈ క్రింది శ్లోకంలో ఇలా ఉపదేశించాడు.

"యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతి ర్మతిర్మమ ॥"

ఎక్కడ యోగేశ్వరుడైన కృష్ణుడు,* ధనుర్ధారియైన అర్జునుడు ఉంటారో అక్కడ సంపద, విజయం, ఐశ్వర్యం, దృఢమైన నీతి ఉంటాయి. ఇంతటి మహత్తు కలిగిన గ్రంథం కావటం వల్లనే భారతీయ తత్త్వవేత్తలు వేదాంత శాస్త్రానికి ప్రమాణ గ్రంథాలైన "ప్రస్థానత్రయం"లో ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలతో బాటు ఈ గీతను కూడ చేర్చారు. భారతదేశంలో పుట్టి వేదప్రామాణ్యాన్ని అంగీకరించే సమస్తమతకర్తలు, అద్వైత విశిష్టాద్వైతాది సంప్రదాయ మతాచార్యులు, తమ తమ సిద్ధాంతాలకు అనుగుణంగా గీతకు వ్యాఖ్యానాలు వ్రాసి ప్రచారం చేశారు. ప్రాచ్య పాశ్చాత్యమైన ఆధునిక వైజ్ఞానిక ప్రపంచం చేత సర్వసంశయవిచ్ఛేదం చేయగలిగి సత్యార్థ ప్రకాశకమైన ఏకైక తత్త్వ గ్రంథంగా స్వీకరింపబడి గీత ఈ నాడు జేగీయమానమవుతున్నది.

ఈ సందర్భంలో గీతా మహాత్మ్యంలోని క్రింది రెండు శ్లోకాలను స్మరించడం సముచితం.

"సర్వోపనిషదో గావోదోగ్ధా గోపాలనందనః ।
పార్థో వత్సః సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥"

"సంసార సాగరం ఘోరం తర్తుమిచ్ఛతి యో నరః ।
గీతానావం సమాసాద్య పారంయాతి సుఖేన సః ॥"

ఉపనిషత్తులన్నీ గోవులు. శ్రీకృష్ణుడు పాలు పితుకువాడు. అర్జునుడు దూడ. మహత్తరమైన గీతామృతమే క్షీరము. బుద్ధి సంపన్నుడే ఆ పాలను త్రాగువాడు. ఘోరమైన సంసార సముద్రాన్ని దాటదల్చుకొన్న మానవుడు భగవద్గీత అనే నౌకను పొందగలిగితే సులభంగా ఆవలిఒడ్డుకు చేరగలడు.

శ్రీకృష్ణార్పణమస్తు

* శ్రీ కృష్ణ భగవానుడు యోగేశ్వరుడనీ అష్టభార్యలతోను, షోడశసహస్ర వనితాజనంతోను గోపికాంగనలతోను విలాసలీలల్లో మునిగి తేలినా అస్ఖలిత బ్రహ్మచారి అని, ఆయన జీవయాత్ర 'పద్మ పత్రమి వాంభసామ్' అన్న రీతిలో సాగిందని, మహాద్రష్టలైన మహర్షి సత్తములందరూ ఏకగ్రీవంగా అంగీకరించడం జరిగింది. ఈ విశేషాంశాన్ని అవగతం చేసికోటానికి సాంప్రదాయిక పరిజ్ఞాన సంపత్తితో కూడిన వివేచనసామర్థ్యం ఎంతైనా అవసరం. కేవల లౌకిక విజ్ఞానవేత్తలకు అర్థమయ్యేది కాదు.

## కృష్ణాష్టకమ్

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానన్దం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

అతసీపుష్ప సంకాశం హారనూపుర శోభితమ్ ।
రత్నకంకణ కేయూరం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

మందారగంధసంయుక్తం చారుహాసం చతుర్భుజమ్ ।
బర్హిపింఛావ చూడాంగం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

ఉత్ఫుల్లపద్మపత్రాక్షం నీలజీమూత సన్నిభమ్ ।
యాదవానాం శిరోరత్నం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

గోపికానాం కుచద్వంద్వం కుంకుమాంకిత వక్షసమ్ ।
శ్రీనికేతం మహేష్వాసం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

రుక్మిణీకేళి సంయుక్తం పీతాంబరసుశోభితమ్ ।
అవాప్త తులసీగంధం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

కుటిలాలక సంయుక్తం పూర్ణ చంద్రనిభాననమ్ ।
విలసత్కుండలధరం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

శ్రీవత్సాంకం మహోరస్కం వనమాలావిరాజితమ్ ।
శంఖచక్రధరం దేవం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

కృష్ణాష్టక మిదం పుణ్యం, ప్రాతరుత్థాయ యః పఠేత్ ।
కోటి జన్మకృతం పాపం, తక్షణేన వినశ్యతి ॥

శ్రీకృష్ణార్పణమస్తు

# శ్రీగణపతి

"గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనా ముపమశ్రవ స్తమమ్ ।
జ్యేష్ఠరాజమ్ బ్రహ్మణామ్ బ్రహ్మణస్పత
ఆనః శ్రుణ్వ న్నూతిభిః సీద సాదనమ్ ॥" ఋగ్వేదము 11-28-1

"ఈ సమస్తమైన దేవతాగణాలన్నిటికీ నీవే ప్రభువు, నాయకుడవు, బుద్ధిమంతులలో నీవే బుద్ధిమంతుడవు. ప్రఖ్యాత పురుషుల్లో అగ్రగణ్యుడవు. మా ప్రార్థనలూ, పూజలూ, యజ్ఞాలూ మొదలైన సమస్త కర్మలకూ నీవే రాజువు ఓ బ్రహ్మణస్పతీ! యజ్ఞస్థానాన్ని అధిష్ఠింపుము."

గణపతి విఘ్నకర్తగానూ, విఘ్నహర్తగానూ భక్తగణాల పూజ లందుకుంటున్న దేవతామూర్తి. అయితేనేం, విఘ్నేశ్వరుడి పెళ్ళికి వేయి విఘ్నాలన్న సామెత తెలుగుదేశంలో నిత్యమూ ప్రచలితమౌతున్నది. ఈ విఘ్నాలను హాస్యరస ప్రియుడైన ఆయన కల్పించుకున్నవేనా? సమస్తకార్యారంభాలలో విఘ్ననాథుణ్ణి కొలవవలసిన ఆచారం భారతీయులలో ఉంది. అది ఆయన జన్మించినప్పటినుంచీ వచ్చి ఉంటుందా? ఆయనకు తల్లిదండ్రులైన పార్వతీపరమేశ్వరుల వివాహానికి విఘ్నేశ్వరపూజ సప్తర్షులు జరిగించినట్లున్నది. ఇదేమిటి, ఇటువంటి వైరుధ్యాలే ఆయన రూప విషయంలోనూ ఎన్నో గోచరిస్తున్నవి. అంతటి మహామూర్తికి ఆ మూషకవాహనం ఎక్కడ చాలుతుంది? ఇదీ హాస్య ప్రియత్వమా? ఏకదంతం, శూర్పకర్ణద్వయం, గజాననం ఇత్యాది లక్షణాలను పేర్కొంటున్న ఆ అష్టోత్తర శతాలే ఆయన్ను నవమన్మథుడని స్తుతిస్తున్న వేమిటి? దేవగణాధిపత్యానికి, హాస్యరస ప్రియత్వానికి ఏ దిక్కు కే దిక్కు? అందుకనే భావుకులకు వినాయకుణ్ణి (విశేషమైన నాయకుడు, విశిష్టమైన నాయకుడు) వైరుధ్యాలకు ఒక సంజ్ఞామూర్తి (Symbol of Incongruieties) గా మన ప్రాచీనులు భావించి రూపకల్పన చేసి ఉంటారని తలపోయటానికి అవకాశం కలుగుతున్నది[1].

ఆయన బ్రహ్మచారిట! అయితేనేం సిద్ధి, బుద్ధి ఇద్దరూ ఆయన భార్యలు. ఇదీ ఈ హాస్య రసాధిదేవతకు ఉచితమైన చేష్టగానే కనిపిస్తున్నది. గృహస్థాశ్రమంలో ఉండి

బ్రహ్మచర్యం నడపవచ్చుగదా అనుకుంటే అటువంటివాడికి ఏ సిద్ధో, బుద్ధో చాలదా అని శంక కలుగుతుంది. అందువల్ల ఈ బహుపత్నీత్వ బ్రహ్మచర్యం హాస్యాభిమానాన్ని వెల్లడిస్తున్నది. సాహిత్య గ్రంథాలు పరికిస్తే ప్రత్యేకంగా ఈ రసాభిమానం ఆయనకు చిన్ననాడే అలవడ్డది. అప్పకవి చెప్పిన ఆయన చిన్ననాటి చేష్ట యిందుకో గొప్ప ఉదాహరణ – "తను గని యెత్తుననె దక్షజయుం, నిటలాక్షుడు, న్ముదంబున నిరు చెక్కులం గదిసి ముద్దు గొనంగ, నొకింత నెమ్ముగ బనువుగ వెన్కకుం దిగిచి, యత్నవిహీన పరస్పరాస్యచుంబనములు, తల్లిదండ్రులకు బన్నుగ గూర్చు, గజాస్యు గొల్చెదన్."

భారతదేశంలో వినాయకుణ్ణి హిందువులు, బౌద్ధులు, జైనులు – మూడు మతాలవారూ కొలుస్తున్నారు. ఈ దేవతామూర్తి కేవలం భారతదేశంలోనే కాదు, నేపాళము, చైనీయ తుర్కీ స్థానము తిబ్బత్తు, బర్మా, సయాం, ఇండోచైనా, జపానుదేశాల్లో భక్తవత్సలుడై పూజాదికాలను అందుకుంటున్నాడు. హీనయానబౌద్ధులు గణాధిపతిని ఎరుగరు. ఆయన మహాయాన వజ్రయాన బౌద్ధాలలో ప్రవేశించాడు. బుద్ధ భగవానుడు రాజగృహంలో, గణేశ శక్తిగా భావితమౌతూ వున్న గణేశ మహామంత్రాన్ని ప్రియశిష్యుడైన ఆనందునికి చెప్పినట్లు, మహాయానబౌద్ధులు పలుకుతున్నారు. వారి సంప్రదాయంలో ఈ మంత్రానికి గణేశ హృదయమని నామం[2]. నేపాళము, తిబ్బత్తులలో ఉన్న శిల్పంలో ఆయన విగ్రహాలు అనేక రీతులలో శిల్పితాలై ఉన్నవి. వాటిలో ఆయన కేవలం ఒక దేవతామూర్తి మాత్రమే కాదు, బౌద్ధ దేవతలందరితో పోరాడే రాక్షస శ్రేష్ఠుడు. చైనీయులు, జపానీయులు గణపతిని రూపద్వయ మూర్తినిగా దర్శించి శిల్పించుకున్నారు. ఆ రెండు రూపాలలో ఒక రూపం భారతదేశంలో సర్వసామాన్యంగా కనిపిస్తున్నది. రెండవ రూపానికి ఉదాహరణలు భారతదేశంలో లేవు. అది 'అర్ధనారీ – గణపతి' మూర్తి. భారతదేశంలో గణాధిపతి విద్యాధనదేవత, క్షేత్రపాలకుడు. గ్రామాలకు నలుమూలలా వుండి ఆయన రక్ష చేస్తుంటాడు. శాక్తేయం ప్రబలిన కాలంలో దాని ప్రభావం వల్ల తంత్ర గ్రంథజాలం అభివృద్ధి పొందింది. వాటి ప్రభావం బౌద్ధంలో ప్రవేశించిన కాలంలో ఇటువంటి 'అర్ధనారీ గణపతి' రూపాన్ని శిల్పి దర్శించి ఉంటాడని ప్రతిమా శాస్త్రజ్ఞులు (iconographists) అభిప్రాయ మిస్తున్నారు.

రుద్ర గణాలకు అధిపతి గణపతి. అథర్వశిరోపనిషత్తులో రుద్రుడే గణపతి అయినట్లు ఒక సూక్తం కనిపిస్తున్నది. మహాభారతం ఆనుశాసనిక పర్వంలో కొందరు గణేశ్వరులూ, వినాయకులు కొందరూ వున్నారు. శతరుద్రీయంలో గణపతి

అత్యుత్తమమైన దేవతామూర్తి అనీ, మానవకర్మలకు ఆయన సాక్షీ భూతుడనీ నిరూపితమైంది. మానవగృహ్యా సూత్రంలో నలుగురు గణపతులు కనిపిస్తున్నారు. వారు నలుగురూ విఘ్న నాయకులు. యాజ్ఞ్యవల్క్యస్మృతిలో బ్రహ్మ, రుద్రుడూ, ఇరువురూ కలిసి షణ్ణామధారి అయిన గణపతిని సృజించి, మానవలోకానికి కామ్యార్థసిద్ధ్యర్థం ప్రసాదించినట్లు చెప్పి ఉంది. గుప్తుల కాలంలో ఉన్న శిలా లేఖనాల్లో గణాధిపుని నామం కనిపించటం లేదు. కాని వారి కాలంలో నాటినది, ప్రసిద్ధి పొందిన పాలై దేవాలయ స్తంభ శిల్పాలల్లో, గణాధిపుని రూపం కనిపిస్తున్నది. ఎల్లోరాలోని రెండు గుహల్లో గణపతి శిల్పాలున్నవి. అందువల్ల గుప్తులకాలంలో అప్పుడప్పుడే ఆరంభమైన గణాధిపుని పూజ, క్రీ.శ. 3, 8 శతాబ్దాల మధ్యకాలంలో భారతదేశాన ప్రాచుర్యం వహించి ఉంటుందని చరిత్రజ్ఞులు పలుకుతున్నారు. క్రీ.శ 376 నాటి శిలాశాసనంలోని రచనవల్ల ఆ నాటికి వినాయకునికి గజానన మున్నట్లు లేదట! అది ఎలా వచ్చింది అర్థం కావటం లేదని 'మిశ్రబంధు' ఒకచోట వ్రాసినారు[3]. ఈ గజాననము భవభూతి గ్రంథజాలంలోనూ, ఎల్లోరా శిల్పాలలోనూ, పాలై శిల్పాలలోనూ కనిపిస్తున్నది. ఋగ్వేదంలో బ్రహ్మణస్పతి సూక్తాన బృహస్పతి, గణపతి ఇరువురూ గణపతి యయినట్లు వున్నది. ఆయన రూపం క్రమక్రమంగా నేటి మూర్తిని తాల్చి వుంటుంది. ఆయనకు త్రిమూర్తుల కంటే అధికమైన స్థానం వచ్చి వుంటుంది. క్రీ.శ. 10వ శతాబ్ది నాటికి, ఆయనకు ప్రత్యేక దేవాలయాలు వచ్చినవి. తిరుచ్చి గుహా దేవాలయాలలోని 'ఉచ్చిప్ప పిళ్ళయార్ కోయిల్' కేవలం గణపతి దేవాలయంగా ప్రసిద్ధమై ఒప్పుతున్నది.

వినాయక చతుర్థినాడు మనమందరమూ మృద్గణేశుణ్ణి పూజిస్తున్నాము. శివుడు గజాసుర సంహారానికి వెళ్ళిన సందర్భంలో పార్వతి అభ్యంగనస్నానం చేస్తూ నలుచుకున్న మట్టితో ఒక విగ్రహాన్ని చేసి ప్రాణం పోసి తండ్రిని లోపలికి రానీయకుండా వాకిట చౌకీదారుగా నియమించిందట. ఆయన వచ్చి లోపలికి ప్రవేశించబోతూ ఉండగా ఇతడు అడ్డుకున్నాడని, శిరస్సు ఖండించిన తరువాత పార్వతి వల్ల సమస్తమూ తెలుసుకుని గజాననము తెచ్చి అతికించిన పిమ్మట విఘ్న నాయకుడు గజాస్యుడైనాడని మార్కండేయ పురాణ కథ వల్ల వ్యక్తమౌతున్నది. ఈ కథ వంగదేశంలోనూ ప్రచారంలో ఉంది. ఈ విషయాన్ని దుర్గాషష్ఠిని పరిశీలించటం వల్ల నిర్ధారణ చేయవచ్చును. భారతదేశంలో అనేక ప్రాంతవాసులు దుర్గాపూజ జరిపే సందర్భంలో విఘ్నేశ్వరుణ్ని ఆచారాన్ని బట్టి అయిదు దినాలో, వారము దినాలో ఉంచి తల్లితో పాటు నదికి తీసుకుపోయి అందులో కలుపుతున్నారు. దాన్ని ఆధారంగా చేసుకొని శబ్ద శాస్త్రవేత్తలూ, మానవశాస్త్రజ్ఞులు (Ethnologists) గణేశుణ్ణి భాద్రపద

మాసంలో వచ్చే పంటదేవతగా (Harvest god) నిరూపించటానికి యత్నించారు. ఈ విషయాన్నీ గుప్తే మహాశయుడు ఆయన హిందువుల పండుగలు అనే గ్రంథంలో ఇలా వ్రాసినాడు.

"Philologists and Ethnographists have tried to trace the origin of Ganesh to the Harvest season, comparing Parvati to the earth, and the clay of which the figure was made, to the alluvial crust found on the banks of the rivers soon after the Bhadra pada crop. Some derive his origin from the letter 'Om' but a recent examination of the signs of the zodiac discloses the origin of the belly, from the big body of the crab, or Cancer (Karkataka) which stands in heaven just near SHIVA, who as the male part of the GEMINI (Mithuna) intervenes between the female part of that sign (Parvati) and the Zodaical sign of Cancer or the crab of big belly."[4]

గణాధిపతి ప్రధాన లక్షణాలను అనుసరించి పైరీతిగా ఆయనను భాద్రపదమాసంలోని పంటదేవతగా భావించటానికి అవకాశం ఉంది. పైరీతిగా భావించిన వారు ఆయన మూషకవాహన లక్షణాన్ని కూడా సమన్వయించారు. మూషకశబ్దం (ముష్) ధాతువువల్ల జనిస్తున్నది. పంటపొలంలో ఉండే దొంగ ఎలుకలను పట్టుకోడానికి పంటదేవత అయిన విఘ్నేశ్వరుడు మూషకవాహనుడు కావలసివచ్చిందని వారు భావించారు. ఆయన గజాననము బహుశః కర్షకుని రూపం నుంచి వచ్చి ఉండవచ్చునని వారి అభిప్రాయం. కర్షకుడు, తలమీద కోసిన ధాన్యాన్ని మోసుకొని వస్తుంటే వేలాడే చివరలను చూచినవానికి ప్రథమంలో గజాననుని రూపం గోచరించి ఉంటుందనీ , దానిని అందరూ అంగీకరించి ఉంటారని వారన్నారు. ఆధిక్యమును ఏనుగుతో పోల్చుటం కద్దు. అందువల్ల అధికమైన పంటను తెలియజేసే దేవతతో గజసంబంధాన్ని కల్పించి ఉంటారని కొందరు ఊహించారు. ఆయన లంబోదరత్వము పంటను దాచి ఉంచే గాదెలను సూచించవచ్చునని వారిలో మరికొందరు అభిప్రాయ పడ్డారు. కాళియదమనుడు విజయసూచకంగా ఫణి ఫణాగ్రాలమీద నృత్యం చేసినట్లు, తాను ఎలుకలబారినుండి రక్షించిన పంటను చూచి, మిమ్మల్ని నేను జయించాను చూచారా, అన్న విజయ భావాన్ని సూచించటానికే పూర్వులు ఈ పంట దేవతకు మూషక వాహనాన్ని కల్పించి ఉంటారని కొందరన్నారు[5].

గణేశుని ఏకదంత శూర్పకర్ణాలకు కూడా వారిలో కొందరు ఇటువంటి ఊహలు చేయకపోలేదు. ఆయన ఏకదంతము నాగలి, శూర్పములు నూతన ఫలసాయానికి

చిహ్నాలుగా నిశ్చయించి నాగలిమీద అటూ ఇటూ క్రొత్తచేటలు వేసుకొని వస్తూ వున్న రూపము గజముఖాన్ని జ్ఞప్తికి చేస్తుందనీ, అందువల్ల అనాది భావుకుడు విఘ్నేశ్వరుడిని గజాననుడిగా దర్శించి ఉంటాడనీ కొందరు ఊహించారు. ఆయన ఆహారం కూడా క్రొత్తపంటనే తెలియజేస్తూ ఆయన పంట దేవత అని అనటానికి అవకాశం కల్పిస్తున్నది వారి మతం. అన్నీ భాద్రపదమాసానికి సంబంధించినవి. పిండి మోదకాలు, ఇక్షురసం, నారికేళము ఇత్యాదులు. ఆయన లంబోదరం మీద నాగపాశాలు పొలంలో ఉండే ఎలుకలను భక్షించే పాములకు చిహ్నాలని కూడా పైవారు ఊహించారు.

ఈ రీతిగా మానవశాస్త్రజ్ఞులు (Ethnographists) గణేశుని మెక్సికో దేశంలోని ధాన్యదేవతతోనూ, టోంగాద్వీపాలలోని ఆలో – ఆలోతోను, గ్రీకుల డిమిటర్, రోమనుల సిరీస్‌తోనూ పోల్చుకుంటూ వచ్చి, ఆయన లక్షణాలను భాద్రపదమాసం నాటి కర్షక జీవితంలోని అంశాలతో సమన్వయించినారు. సంఘం అభివృద్ధి పొందిన తరువాత తాత్త్వికాభివృద్ధి వల్ల సమస్త సిద్ధి ప్రదాతయై విఘ్నహర్త అయి ఉంటాడని వారు నిశ్చయించినారు.

మనదేశంలో శ్రావణ గౌరిని సాగనంపడంలో గడచిన ఋతువు మృతిని వ్యక్తం చేస్తారు. ఆమెతో బాటు కొన్ని ప్రాంతాల్లో మృద్గణేశుని తిరిగి త్వరగా రమ్మని పంపుతారు. పశ్చిమ భారతదేశంలోని కొన్ని జాతులవారు గణపతిని 'బొప్పా, మోరియా?' అని వ్యవహరిస్తారు. మహారాష్ట్ర దేశంలో పిల్లలు దానికి 'పుధారియావర్షీ లౌ కారియా' అనే మాటలను కలిపి గణపతిని త్వరగా తిరిగి రమ్మని వేడుకుంటారు. ఇందులోని మోరియా శబ్దాన్ని సామాన్యకర్షకుడు మోహేరాయా (అందరికంటె త్వరగా రా) అని ఉచ్చరిస్తాడు. ఈ రూపాన్ని తరువాత కాలంలో విద్యాధికులు మరొక విధంగా అర్థం చేసుకొని ఉండటం వల్ల మహారాష్ట్ర దేశంలోనూ, పశ్చిమ భారతంలోని మరికొన్ని ప్రాంతాలలోనూ గణపతిని మయూరేశ్వరుడుగా భావించి, మహాగణపతిని మయూరవాహనుడిగా రూపిస్తూ ఉన్నారు.

గణపతికి సంబంధించిన అనేక కథలు పురాణాల్లో కనిపిస్తున్నవి. బ్రహ్మ వైవర్తపురాణంలో, శివపార్వతులు క్రీడాపరాయణులై ఉన్న సందర్భంలో దేవతలు వచ్చినట్లూ, ఆ సమయంలో శివవీర్యం నేలమీద పడటం వల్ల విఘ్నేశ్వరుడు ఉదయించినట్లూ, ఒకానొక కశ్యపశాపం వల్ల అలా ఉదయించిన పుత్రుణ్ణి శివుడు చూడగానే అతని శీర్షం బ్రద్దలు కాగా, దేవతలు పుష్పభద్రనదీ తీరంలో ఉన్న గజము శిరస్సు తీసుకోవచ్చి ఆ బాలునికి అతకటం వల్ల అతడు గజముఖుడైనట్లూ, ఒక కథ

ఉంది. వెనుక పేర్కొన్న కథ కాకుండా మార్కండేయ పురాణంలో విఘ్నేశ్వరుణ్ణి గురించి మరొక కథ కనిపిస్తున్నది. జలానికీ, భూమికీ, రూపం ఉంది కానీ ఆకాశానికి లేదు. ఒక సందర్భంలో శివుడు ఆకాశంవైపు తీక్ష్ణంగా చూచాడట! ఆ సమయంలో ఆకాశాన గజాస్యుడు సుందర రూపంతో జన్మించాడు. అతనిమీద పార్వతికే మోహం జనించింది. అతణ్ణి సంహరించటంకోసం శివుడు రుద్రగణాలను సృజించాడు. వారికి ఆయన చెమట బిందువులలో నుంచి జన్మించిన ప్రముఖుడు గజాననుడు అధిపతి అయినాడు. ఆ నాటినుంచీ గణపతి రుద్రగణాలకు అధిపతిగా అభిషిక్తుడైనాడట! శివ పురాణంలో విఘ్నేశ్వరుని బుద్ధి వైశద్యాన్ని తెలియజేసే ఒక కథ చెప్పి ఉంది.

కుమార విఘ్నేశ్వరుల నిద్దరినీ పిలిచి మీలో ముందుగా ఎవరు భూప్రదక్షిణం చేసి వస్తే వారికి వివాహం చేస్తామన్నారు. కుమారుడు మయూరవాహనాన్ని, విఘ్నేశ్వరుడు మూషకవాహనాన్ని అధిరోహించి భూప్రదక్షిణానికని బయలుదేరారు. బుద్ధిమంతుడైన విఘ్నేశ్వరుడు వెంటనే తిరిగివచ్చి తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణం చేసి నా భూప్రదక్షిణమైపోయింది, నాకు వివాహం చెయ్యమని కోరినాడట. అతని తెలివితేటలకు సంతోషించి పార్వతీపరమేశ్వరులు, సిద్ధి, బుద్ధి, నిచ్చి వివాహం చేశారు. ఆయనకు సిద్ధివల్ల క్షేముడు, బుద్ధివల్ల లాభుడు అనే ఇద్దరు పుత్రులు జన్మించారు.

గజాననుని ఏకదంతానికి సంబంధించిన క్రింది కథ బ్రహ్మాండపురాణం వల్ల తెలుస్తున్నది. కార్తవీర్యుని సంహరించి పరశురాముడు గురువర్యుడైన శివుని దర్శించటానికి వచ్చిన సందర్భంలో ఆయనకు విఘ్నేశ్వరునితో పోరాటం సంభవించింది. ఆయనను గణపతి తొండంతో పైకియెత్తి ఏడు లోకాలూ చూపించాడు. పరశురాముడు దిగ్భ్రమ చెంది పరశువుతో కొట్టినాడు. గజాస్యుని దంతం ఒకటి నేల మీద పడ్డది. అందువల్ల గణపతి ఏకదంతుడైనాడు.

ముద్గల పురాణంలో గణపతికి ముప్పదిరెండు మూర్తి భేదాలున్నట్లు చెప్పి ఉంది. వాటిలో సిద్ధి వినాయకుడు, సత్య వినాయకుడు, చోరగణేశుడు, మహా గణేశుడు, హేరంబగణేశుడు, హరిద్రగణేశుడు, ఉచ్ఛిష్ట గణపతి మొదలైనవారు ముఖ్యులు. సుదాముడు, మదనావతులకు సంబంధించిన బ్రహ్మాండ పురాణాంతర్గతమైన కథ సత్యవినాయకునికి సంబంధించినది.

జపం చేస్తూ ఉన్న సందర్భంలో జపమాలలోని అక్షాలను లెక్కపెట్టటంలో మోసం చేసినా, మరచిపోయినా లెక్క వేస్తూ పట్టుకొనేవాడు చోర గణపతి.

సిద్ధి వినాయకుణ్ణి గురించి మహాభారతంలో ధర్మరాజుకు కృష్ణభగవానుడు ఇలా చెప్పినట్లుంది. యుద్ధసన్నద్ధులై కురుక్షేత్రంలో కౌరవ పాండవులు నిలచినప్పుడు 'ఏ దేవత మనకు సిద్ధిని చేకూరుస్తాడు?' అని యుధిష్ఠిరుడు కృష్ణ భగవానున్ని ప్రశ్నిస్తే, ఆయన సిద్ధి గణేశుని నామాన్ని ఉచ్చరించి ఆయనను పూజింపవలసిన విధానాన్ని విపులంగా పేర్కొన్నాడు. ఆయనకు ఇరువది ఒక్క పత్రి, దూర్వాంకురాలూ ఇష్టమని చెప్పినాడు. బంగారు గణేశ విగ్రహాన్ని బ్రాహ్మణునికి దానం చెయ్యవలెననీ, సమస్త దేవతాపూజకు ముందూ సిద్ధివిఘ్నేశ్వర పూజ జరిగించాలనీ, గణేశపూజ వల్ల చండికామాతృశ్రీ సంతోషిస్తుందనీ, భాద్రపద శుద్ధ చతుర్థినాడు గణేశపూజ చేస్తే దానికి కైలాసంలో దేవతలందరూ సంతోషిస్తారనీ, పరాశర మహర్షి శాపకారణంగా ఆ పండుగనాడు చంద్రుని చూడగూడదనీ ఆ భారత భాగం వల్లనే కృష్ణ భగవానుడు ధర్మరాజు కుపదేశించినట్లు తెలుస్తున్నది. ఒకవేళ పొరబాటున ఆ నాడు ఎవరైనా చంద్రుణ్ణి చూడటం సంభవిస్తే "సింహప్రసేన మవధి త్సింహో జాంబవంత హంతః" అని అనవలెననీ, దానికి మూలకారణమైన శమంతకమణి కథనాన్ని సూతుడు శౌనకాది మహామునులకు చెప్పినట్లు స్కాందపురాణంలో ఉంది.

యాస్కాచార్యులవారు 'గణ' శబ్దాన్ని వాక్కుకు ముప్పదియెనిమిదవ నామంగా లెక్కపెట్టి నారు. ముప్పదియవ నామము ఘోషము. స్కంద స్వామి దానికి "ఉచ్యతే యితి వాక్. ఇంద్రియమ్, తత్కార్యః శబ్దోప్యుచ్యతే ఇతి వాక్ తదధిష్ఠాత్యపి దేవతా వా గణిష్యతే" అని వ్యాఖ్యానించినాడు. క్షీరస్వామి "గణః గణనాత్ సహి గణ్యతే – వసుసంయోగాత్ గుణశ్చ గుణాపి గణనాదేవ, అసావపిహి గణ్యత ఏవ – ద్విగుణః, త్రిగుణః" అనినాడు., అందువల్ల గణపతి అష్టోత్తర శతాలలో వాగధిష్ఠాన దైవతము, శబ్దగమ్యుడు అయినాడు.

గణపతి గణేశ మంత్రానికి ప్రధాన బీజాక్షరం 'గం' – దీని శక్తులు 1. తీవ్ర (ధా) తీవ్ వ్యాపించు, అనంతమైన, తీక్ష్ణమైన, 2. జ్వాలినీ – మండు : 3. నందా: సౌఖ్యము, సమృద్ధి 4. భోగదా : సౌఖ్యానుభవము, సంపద (ధా. ఘుజ్) 5. కామరూపిణీ 6. ఉగ్ర 'గణ'కు శక్తిగా ఉన్న ఉచ్ నుంచి వచ్చినది. 7. తేజవతీ 8. సత్య 9. విఘ్ననాశినీ గణేశమంత్ర ద్రష్టను తంత్రగ్రంథాలు 'గణకర్షి' (Calculator) అని పేర్కొన్నవి. అతడు కుంకుమ వంటివాడు. త్రినయనుడు. కుండబొజ్జవాడు. చేత ఒక దంతాన్ని ధరించి ఉంటాడు. ఒక అంకుశము ధరించి ఉంటాడు. ఈ వర్ణనంతా ఆ తంత్రాలలోనే కనిపిస్తున్నది. వక్రతుండుడు, ఏకదంతుడు, లంబోదరుడు, మహోదరుడు,

గజాననుడు, వికటుడు – అతని అనుచరులు. గణకర్ని రూపాన్ని అనుసరించి గణపతికి నేటి దేవతామూర్తి వచ్చి ఉంటుందని కొందరూహిస్తున్నారు.,

మహాగణేశ్వరుని మహామంత్రం 'ఓం, హ్రీం, శ్రీం, క్లీం, క్లైం, గ్లౌం, గం, గణపతయే వరవరదసర్వ జనం మే వశమానయ స్వాహా' – అని. ఇందులో ముఖ్యమైన అక్షరాలు ఇరువది ఒకటి మాత్రము, అందువల్ల గణపతికి ఇరువది యొకటి ముఖ్యమైన సంఖ్య. అన్ని పత్రులు, అన్ని కుడుములు పెట్టటము మనకు లక్షణము.

మహాగణేశుని రూపాన్ని గురించి వ్రాస్తూ ఒక అభిజ్ఞుడు ఇలా వ్రాసినాడు. 'Mahaganesa is a fanciful figure better imagined than modelled. A Sea of cane juice which naturally attracts bees and wasps; and the elephant headed God has to perpetually fan them with his broad flapping elephant ears, for he has the head of an elephant with three eyes. An elephant rutting and as such Mahaganesa has his spouse Paducakara seated on his left thigh and embracing an amorous bejewelled Ganesa : a Veritable NOU VEAUX riches.'[6]

కొన్ని గ్రంథాలు మహాగణేశుని హేరంబుని ఒకే దేవతామూర్తిగా భావించినవి. హేరంబశబ్దాన్ని 'హః : శంకరః హేతతే సమీపే రమతే తిష్యతా' అని సాధింపవచ్చును. హేరంబుడు బంగారువర్ణము కలవాడు. త్రినయనుడు. సింహవాహనుడు. ఆయన హస్తాలలో ఒకటి అభయహస్తము. ఒక కొమ్ము, గొడ్డలి, జపమాల, గద, అంకుశము, త్రిశూలము ఆయన ఆయుధాలు. విఘ్న, వినాయక, శూర, వీర, వరద, ఇభవక్త్ర, ఏకదంతులు ఇతని పరిచారకులు. ఇతనికి బీజాక్షరం 'గం.' ముద్గల పురాణంలో హేరంబుని గురించిన రూపవర్ణనాదులు విశదంగా కనిపిస్తున్నవి. ఆయన గజతుండము సూటిగా నుండి కుడికిగాని ఎడమకుగాని తిరిగి ఉండటం మరొక శిల్పశాస్త్ర లక్షణము. ఈయనను పంచముఖ వినాయకుడని కూడా శిల్పరత్నము, ముద్గల పురాణము వ్యవహరించినవి. మనదేశంలో తిరుముట్రియూరు దేవాలయంలో పంచముఖ వినాయకుని శిలావిగ్రహం ఒకటి అతి సుందరశిల్పం కనిపిస్తున్నది. ఆ విగ్రహానికి ఉన్న పంచ శీర్షాలమీదను కారండమకుటాలు ఉన్నవి. సర్వసామాన్యంగా ఉండవలసిన యజ్ఞోపవీతం కనుపించదు.

హరిద్రాగణపతికి బీజాక్షరం గ్లం. గాయత్రి ఛందము. చోరగణేశుడు మంత్రజప సందర్భాలలో తప్పిదం చేయకుండా ఉండటానికి ఏర్పడ్డ దేవత. 'గణేశవిమర్శిని' అనే గ్రంథంలో చోరగణేశ మంత్రం 'న జప్త్వా కర్మ మాత్రం న కుర్యాత్, యది కుర్యాత్ తదా దోష ఉక్తో వర్ణవిలాస తంత్ర్' అని ఉంది. ఇతని మంత్రం గ్లౌం.

బ్రహ్మ దానికి ద్రష్ట. ఉచ్ఛిష్ట గణపతి దేవతా ఉచ్ఛిష్టాన్ని స్వీకరిస్తాడు. హిందూ దేశంలో హస్తిపకులు ఉచ్ఛిష్టాన్ని భుజించటం కారణమై ఉంటుంది. ఢుంఠి విఘ్నేశుని రూపాన్ని మహాకవి శ్రీనాథుడు కాశీఖండంలో పేర్కొన్నాడు. చండీ గణేశరూపానికి ఇండోనీషియా, బృహద్భారతం (Greater India) లో అనేక శిలాప్రతిమలు ఉదాహరణాలుగా కనిపిస్తున్నవి.

సామాన్యంగా పుణ్యాహకర్మచేయిస్తూ పురోహితుడు 'యత్పుణ్యం నక్షత్రం, తద్వదకుర్వీతి లోపఘ్యుషమ్, యదావై సూర్య ఉదేతి, అథ నక్షత్రం నైతియావతి తత్ర సూర్యోగచ్ఛేత్, యత్ర జఘన్యం పశ్యేత్, తావత్కుర్వంతి యత్కారస్యాత్ పుణ్యాహ ఏవ కురుతే (తైత్తిరీయ బ్రాహ్మణము – 1,5,2,1) అనే మంత్రాన్ని వినిపిస్తాడు. సూర్యోదయ కాలానికి ముందు ఉషఃకాలంలో తూర్పున ఏ నక్షత్రం ఉదయిస్తుందో గమనించి, ఆ నక్షత్రాన్ని పూజించటం భారతీయులకు అనూచానంగా వస్తున్న ఆచారం. ఈ అభిప్రాయాన్నే నిరూపిస్తూ ఋగ్వేద మంత్రం ఒకటి 'ప్రాతర్యవాణా ప్రథమా యజధ్వమ్ నోరనసామయన్తి దేవాయా అజుష్టమ్' (ఋగ్వేదము V 77.1) ఈ రీతిగా ఉంది. సూర్యోదయానికి పూర్వం తూర్పున ఏ నక్షత్రం ఉదయిస్తే ఆ నాడు ఆ నక్షత్ర సంబంధమైన దేవతను ముందు మనం పూజించాలి. లేకపోతే సూర్యాస్తమయ సమయంలో ఉదయించే నక్షత్ర దేవతనైనా పూజించాలి. అని ఈ మంత్రానికి తాత్పర్యం. భాద్రపదచవితినాడు సూర్యోదయాత్పూర్వం మనకు విఘ్నేశ్వర నక్షత్రం కనిపిస్తుంది. అందువల్ల ఆ నాడు గణపతిని పూజిస్తున్నాము. మర్నాడు ఋషిపంచమి. ఆ కారణం చేత భాద్రపదమాసారంభం నుంచీ విఘ్నేశ్వర నక్షత్రం సప్తర్షుల ప్రక్కన ఉంటాడు. ఈ కారణాలవల్లనే విఘ్నేశ్వరుని జ్యోతిష రూపుడని అష్టోత్తర శతాలు పలకడం.

దేవతలే నక్షత్రాలు.[7] పాశ్చాత్యులు సప్తర్షి మండలం నాగలి ఆకారంలో ఉంటుందని అన్నారు. గ్రిమాల్డి అనే పాశ్చాత్య ఖగోళ శాస్త్రవేత్త చీనాదేశ నక్షత్రపట్టికలో మూషకరూపం ప్రక్కన సప్తర్షులు ఉన్నట్లు చూపినాడు. సింహం మీదుగా ఒక ఏనుగుతలతో ఉన్న మనుష్యరూపం ఉందిట వాటిలో. అందువల్ల గజముఖుడు, లంబోదరుడూ, మూషకవాహనుడూ అయిన విఘ్నేశ్వరుడు జ్యోతిష రూపుడు.

భాద్రపద శుద్ధచవితినాడు ఉదయానికి ముందు ఉదయించిన విఘ్నేశ్వరుడు, చైత్రశుద్ధ చవితినాడు సూర్యాస్తమయ సమయంలో తూర్పున కనిపిస్తాడు. అందువల్ల నేటికీ అస్సాం రాష్ట్రంలోదిగా పరిగణిత మౌతున్న కామరూపంలో, ఆ నాడు విఘ్నేశ్వర

పూజ చేస్తారు. ఈ విధంగా చవితినాడూ, చైత్రశుద్ధ చవితి నాడూ విఘ్నేశ్వర పూజ చేయటం పైన ఉదహరించిన ఋగ్వేద మంత్రాన్ని అనుసరించి వైదికాచారాలే. మన పంచాంగాల్లో మాఘశుద్ధ చవితి గణేశ పూజ అని వ్రాసి ఉంటుంది. చైత్రశుద్ధ చవితినాడు విఘ్నేశ నక్షత్రదర్శనం అయినా, ఆయన మాఘశుద్ధ చవితినాడే ఉదయించటం వల్లనే ఆ నాడు గణేశ పూజ అయింది. ఇందువల్లనే సుప్రసిద్ధ ఖగోళ శాస్త్రజ్ఞుడు స్వామికణ్ణు పిళ్లె గణేశ చతుర్థి మాఘశుద్ధ చవితి అని నిర్ణయించినారు.

విఘ్నేశ్వరునికి సంబంధించిన గజముఖ, శమంతకోపాఖ్యానాలను జ్యోతిష శాస్త్రజ్ఞులు ఖగోళ శాస్త్రరీత్యా సమన్వయం చేసినారు.

గజాసురుడు ఘోరమైన తపస్సు చేసి లోక కంటకుడైన సందర్భములో విష్ణువు మాయానర్తకుని వేషంలో వచ్చి బ్రహ్మ, నంది, నారదుల సహాయంతో నాట్యం చేసి అతణ్ణి ప్రాణమివ్వమని కోరినాడు. అతడు అంగీకరించి శివునికీ తనకూ నిత్యసాన్నిధ్యం కోరుకున్నాడు. ఆ కారణం చేత నంది వెళ్ళి గజసంహారం చేసి అతని శిరస్సును తెచ్చి పార్వతిచేసిన పిండిబొమ్మకు అతికించినాడు. గజాసురుడు కోరినట్లు అతని ముఖానికి ప్రథమపూజ ఆ నాటినుంచీ జరుగుతూ వున్నది. విఘ్నేశ్వరుడు గజముఖుడైనాడు. ఇది పురాణ కథనం. దీనిని ఖగోళ శాస్త్రజ్ఞులు ఈ క్రిందివిధంగా సమన్వయిస్తున్నారు.

'ఆర్ద్ర[8] రుద్రుడు. అశ్వని, భరణి కృత్తికా నక్షత్రాలు నాగవీథి; రోహిణి, మృగశిర, ఆర్ద్ర నక్షత్రములు కుజవీథి, ఈశ్వరుడు గజవీథిలో ఇరుకు కోవలసి వచ్చినది. వృషభరాశి నంది, వృషభము గజుని చంపినది, వృషభము ఆర్ద్రను మిథునముతో జేర్చుటకు తోడ్పడినది. ఇంతకుముందు గజుని మూలముగా వేరైనా పార్వతీ పరమేశ్వరులు మరల నొకటైనారు.

"మఖ, పుబ్బ, ఉత్తర 1/4, సింహరాశి, సప్తర్షి మండలం జ్యోతిష శాస్త్రంలో బృహదక్షమని పిలువబడుతున్నది. అందే జాంబవంతుడు, సప్తర్షులలోని వాడు పడమటి చుక్కలు రెండూ ఇట మఖ సింహమును, అట ధ్రువుని (URSA - MINOR – చిన్న ఎలుగుబంటు) జూపుచున్నవి.' దీని ననుసరించి ఏర్పడ్డదే శమంతకోపాఖ్యాన కథ.[9] విష్ణుపురాణంలో జాంబవంతుని కుమారుని దాది 'సింహః' ప్రసేన మవధీత్సింహో జాంబవతాహతః, సుకుమారక మారోదీస్తవ హ్యేష శ్యమంతకః" అని చెప్పింది.

విఘ్నేశ్వరుడు చవితినాడు హస్తానక్షత్రంలో కలిసి వుంటాడు. అందువల్ల హస్తి (గజము) హస్తకూ ఏమైనా సంబంధం ఉండి వుంటుందా అని శ్రీ గొబ్బూరి వెంకట

ఆనందరాఘవరావుగారు ఊహించినారు.[9] వేదములో 'హస్తానక్షత్రం సవితాదేవతా' అని ఉందట! సత్రాజిత్తు సూర్యుణ్ణి ఆరాధించి శమంతక మణిని సంపాదించినట్లు ఉన్న కథకూ, దీనికీ ఏమైనా సంబంధం ఉంటుందా?

ఆచార్య శంకరుల తరువాత సూర్య, శివ, శక్తి, సుబ్రహ్మణ్య, గణేశ, విష్ణు సంప్రదాయాలు వచ్చినవి. వీరిలో గాణాపత్యులు గణపతిని శివునికంటె అధికునిగా భావించి ఆయనకు పంచముఖాలు, త్రినయనాలూ కొన్ని సందర్భాల్లో కల్పించినారు. వినాయకుణ్ణి వారు శివుని ఆకాశ శక్తిగా భావించినారు. అనంతాకాశాన్ని వ్యక్తం చేయటానికి బహుళ గోళాలను మోదక రూపాలుగా భావించి ఆయన కడుపును అంత విశాలమైనదానినిగా ఊహించి ఉంటారా? అనంతానందగిరి, గాణాపత్యులలో ఆరు సంప్రదాయాలున్నట్లు పేర్కొన్నాడు. వారిలో ప్రథములు మహాగణపత్యుపాసకులు. ఈ సంప్రదాయానుయాయులు వామ మార్గాన్ని అనుసరించి అశ్లీలమైన గణపతిమూర్తిని ఆరాధిస్తారట. నవనీత, సంతాన, స్వర్ణ గణపతులను ఉపాసించేవారు శ్రౌతవిధులను అనుసరిస్తారట. గాణాపత్యుల మతంలో కార్యారంభాల్లో గణపతిని పూజిస్తే సమస్త దేవతలనూ పూజించినట్లు 'ఓం లం నమస్తే గణపతయే త్వ మేవ ప్రత్యక్షం, తత్త్వమసి, త్వమేవ కేవలం కర్తాసి, త్వమేవ కేవలం ధర్మాసి, త్వమేవ కేవలం హర్తాసి, త్వమేవ కేవలం ఖల్విదం బ్రహ్మాసి, త్వం సాక్షాదాత్మాసి నిత్యమ్" ఇత్యాది వాక్యాలవల్ల గాణాపత్యులు గణపతిని వసు, రుద్ర, ఆదిత్య రూపుడైన పరమాత్మనుగా భావించారనటం నిస్సందేహము. అందువల్ల ఆయన అవతారమూర్తులను కొన్నిటిని కల్పించి ఈ దేశంలో కొన్ని కథలు కూడా వ్యాప్తిలోకి వచ్చినవి. అటువంటి కథలు దక్షిణ దేశంలో చిన్న పిల్లలకోసం మురుగేశ మొదలియారు వ్రాసినాడు. ఈ కథలో ముఖ్యంగా గమనింపదగ్గ అంశం కంసునికీ కృష్ణునికీ ఉన్న సంబంధం వంటిది, గణేశుడికీ, సింధువనే రాక్షసుడికీ, ఉండటం, ఈ కథల్లో ప్రళయ కాలానంతరం పునఃసృష్టికి పూర్వం గణపతి వటపత్రశాయిగా ఉండటమూ గమనింపదగ్గది.[10]

"త్వం బ్రహ్మాత్వం విష్ణుస్త్వం
రుద్రస్త్వ మింద్రస్త్వ మగ్నిస్త్వం ।
వాయుస్త్వం సూర్యస్త్వం చంద్రమాస్త్వం
బ్రహ్మ భూర్భువరాప ఓమ్ ॥" – గణపత్యుపనిషత్తు

## అధోజ్ఞాపికలు

1. గత సంవత్సరం గుంటూరు హిందూకళాశాలలో శ్రీ వల్లభజోస్యుల సుబ్బారావుగారి అధ్యక్షతన జరిగిన గణపతి మహోత్సవాల్లో అధ్యక్షులు ఈ అభిప్రాయాన్ని సెలవిచ్చారు.
2. Hindu - Sunday - V.M. Narasimham, 14 Aug 1949
3. హిందీ మాధురి సం. 3 సం. 6 పుట 832
4. Hindu Holidays and Festival & GUPTE, p. 55
5. "The Idea therefore of a bumper crop overriding the pestilence of the rats might be well represented by a god with an elephant head, riding a rat or MUSHIKA (thief) and possessing in addition, a fair, round belly of the later evidently symbolical of the barn" (Gupte-P 58)
6. DEVATA : - Edited by B.D. Basu - P. 187
7. 'Deva means a shining or luminous star; luminosity; light itself subject to appearance like the moon on those days of full moon and new moon' - R. Shama Sastri, Vedic iconography.
8. భారతి - పార్థివ, భాద్రపదము పుట 229, 230 ఈ అంశాలను శ్రీ విస్సా అప్పారావు పంతులు గారు ఆంధ్రశిల్పిలో విపులంగా చర్చించినారు.
9. భారతి - పార్థివ భాద్రపదము పుట 230.
10. ఈ సందర్భంలో 'విఘ్నేశ్వరుడు కూడా ఒక దేవుడేనా?' అన్న శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారి వ్యాసాన్ని గమనించటం యుక్తము. (భారతి ఆగస్టు 1927)

***(భారతి - వికృతి, భాద్రపదము)***

# ఆంధ్రులు - సంగీత నాట్యాలు

'దేవానా మిద మామనంతి మునయః
కాన్తమ్ క్రతుమ్ చాక్షుషమ్' – మాళవికాగ్ని మిత్రము

'Music is a moral law; it gives a soul to the Universe, wings to the mind, flight to the imagination, a charm to sadness, gaiety and life to everything.

- Plato

భారతజాతివలెనే దాని సంగీత నాట్యకళలూ అతి ప్రాచీనాలు. వేదకాలం నాటికే మనకు సంగీత నాట్యాలతో నిరుపమానమైన పరిచయం ఉన్నట్లు స్పష్టమౌతున్నది. నేటి పురాతత్త్వవేత్త మొహంజోదారో, హరప్పాలలోని చరిత్రాత్మక పరిశోధనల మూలంగా ఈ రెండు కళలూ ప్రాగ్వైదికయుగంలోనే భారతదేశంలో విశేష వ్యాప్తి పొందినట్లు వ్యక్తమౌతున్నది. వేదవాఙ్మయంలోని యమయమీ ఊర్వశీపురూరవాది సంభాషణలు ప్రాచీన భారతీయ వాకోవాక్య సంపత్తికి (Dialogue) ప్రబల నిదర్శనాలు. శిక్షాస్మృతులలో కొందరు దేవతలను ఆరాధించేటప్పుడు గృహస్థు కులపురోహితుడితోనూ, భార్యతోనూ కలిసి కొన్ని గేయాలు పాడవలెననీ, కొన్ని నాట్యాలు చేయవలెననీ నియమాలు కనిపిస్తున్నవి. గృహస్థూ, పురోహితుడూ పాడుతుంటే యజమానురాలు వీణాతంత్రులు మేళవిస్తూ శ్రుతి కలపవలెనట! అటువంటి వీణను 'పిఛోళీ' అని వ్యవహరించేవారట. దీనికే 'ఔదుంబరవీణ' అనే నామం కూడా కనిపిస్తున్నది. ఇది జంత్రవాద్యాల ప్రాథమిక స్థితి అని చెప్పవచ్చును.

సామవేదంలోని 'కృష్ట'లలోనే సంగీత శాస్త్రంలోని స్వరాలను మనం గుర్తించవచ్చును. నేటి శాస్త్రాని కంతటికీ మూలరూపాలని అనిపించుకోతగిన శుద్ధ, భిన్న, గౌడ, వేసర, సాధారణాలు అనే అయిదు గీతాలూ సామవేదంలోని ప్రస్వర, ఉద్గీత, ప్రతీహార, ఉపద్రవ, నిధానాలలోనుంచి వచ్చినవేనని సంగీత శాస్త్ర పరిశోధకుల అభిప్రాయం. ప్రస్తారం చేసి చూస్తే తదుపరి వ్యాప్తిలో ఉన్న సమస్త రాగాలూ ఈ అయిదింటిలో దేనికో ఒకదానికి చెందుతవి. సామలను స్తోభలంటారు. వాటిని ఉదాత్త, అనుదాత్త, స్వరితాది విభేదాలతో గానం చెయ్యటం మనకందరికీ తెలిసిన విషయమే.

సంగీతంతోపాటే నాట్యం కూడాను. దేవతా ప్రీతికోసం సామగానం చేసేటప్పుడు నృత్య, గీత, వాద్యాలు మూడూ కలిసి ఏర్పడే తౌర్యత్రికము (Symphony - Union of Song, Dance, and Instrumental music) కలిగితే గాని రసనిష్పత్తి కలగదని ప్రాచీనుల అభిప్రాయము.

భరతశాస్త్రం మీద వ్యాఖ్యానం వ్రాసిన తిక్కాకర, అభినవగుప్తపాదులిద్దరూ భరతాచార్యుల వారికి పూర్వమే భరత శాస్త్రాన్ని గురించి కాశ్యప విశాఖాది ఆచార్యులు ప్రవచించినట్లు వ్రాసి ఉన్నారు. వారి గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోవటం కారణంగా భరతర్షి ఈ శాస్త్రాన్ని నిబంధించి క్రమమార్గంలో లోకంలో ప్రచారం చేయవలసి వచ్చింది.

భరతాచార్యులవారి నాటికే ఆంధ్రులు గాంధర్వ విద్యాప్రవీణులనీ, నాట్యశాస్త్రకోవిదులనీ తెలుస్తున్నది. ఈ ఆచార్య మహాశయుడు 13వ అధ్యాయంలో (1) అవంతీ (2) దాక్షిణాత్య (3) పాంచాలీ (4) మాగధీరీతులని నాట్యాన్ని విభజించి దక్షిణ దేశానికి ఎల్లలు చెపుతూ 'దక్షిణసముద్ర వింధ్యమధ్య దేశమ్' అన్నాడు. ఆయన మతంలో కోసలులు, కళింగులు, ద్రావిడులు, ఆంధ్రులు, మహారాష్ట్రులు, దాక్షిణాత్యులు. వీరు బహునృత్యగీతాభిమానులట! చతుర మధుర లలితాంగాభినయులట!

ఆంధ్రజాతి ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకు వచ్చి కళాప్రియంభావుకమైనది, ప్రప్రథమంలో శాతవాహన రాజుల కాలంలోనే. ఈ రాజవంశం కంటే ప్రాచీనము లనిపించుకున్న జగ్గయ్యపేట, భట్టిప్రోలు మొదలైన కొన్ని ప్రదేశాల్లోని శిల్ప ఖండాలను పరిశీలిస్తే, ఆ నాటికే ఆంధ్రులు సంగీత నాట్యశాస్త్రాలలో అందెవేసిన చేతులని అవగతమౌతుంది. శాతవాహన రాజులలో మూడవవాడు కృష్ణుడు. జగత్ప్రశస్తి గన్న సాంచీ స్తూప స్తంభంమీద ఇతని ప్రాకృత శాసనం ఒకటి కనిపిస్తున్నది. సాంచీ శిల్పాలలో కొన్ని ఆంధ్రులవి. వాటిలోని నాట్యభంగిమలూ, జంత్రవాద్య సమ్మేళన చిత్రములూ శాతవాహనులనాటి ప్రాథమిక స్థితిలోని ఆంధ్రుల సంగీత నాట్యవైభవాన్ని ఊహించటానికి చక్కని ఉదాహరణాలు. కొంత కాలానికి సాత వాహనరాజులు యావద్భారతాన్నీ కైవసం చేసుకొని మగధ రాజధానిగా రాజ్యపాలనం చేశారు. వారిలో ప్రసిద్ధుడు హాలమహారాజు గాథాసప్తశతీ సంగ్రథిత, 'బృహత్కథ' కర్త గుణాఢ్య పండితుడు, కామసూత్ర కర్త వాత్స్యాయన మహర్షి ఈ కాలంవారు. గాథాసప్తశతిలో అనేక గాథలు ఆ నాటి ఆంధ్రుల సంగీత, నాట్య, చిత్రలేఖనాది కళాప్రియత్వాన్ని వెల్లడి చేస్తున్నవి. మహర్షి వాత్స్యాయనుడు కామ సూత్రాలలో అనేక సందర్భాలలో

సంగీత నాట్యాలకు సంబంధించిన సూత్రాలు వ్రాసినాడు. ఆయన విద్యా సముద్దేశంలోని నాగరవృత్తంలో నాగరకులు యక్షరాత్రి, సువసంతక, మదనోత్సవాది గోష్ఠులు జరుపలెననినాడు. వీటిలోని సువసంతక, మదనోత్సవములు, కేవలము నృత్యగీతవాద్య ప్రాయాలైనవని కామసూత్ర వ్యాఖ్యాత జయమంగళుడు 'సువసంతో మదనోత్సవ, తత్ర నృత్తగీతివాద్య ప్రాయః' (1-4-42) అని వ్యాఖ్యానించినాడు. 'పక్షస్య మాపక్షస్యవా ప్రజ్ఞాతేఽహని సరస్వత్యా భవనే నియుక్తానాం నిత్యసమాజః, కుశీల వాశ్చాగంతుకాః ప్రేక్షణకమేషాం దద్యుః, ద్వితీయే-హని తేభ్యః పూజానియతం లభేరయన్, తతో యథాశ్రద్ధ మేషాం దర్శన ముత్సర్గోవా. ఆగంతుకానాం చ కృతిసమవాయానాం పూజన మభ్యుపపత్తి శ్చేతి గణధర్మః' (161-165) మొదలైన మూల సూత్రాలలో మహర్షి వాత్స్యాయనుడు 'ప్రఖ్యాతమైన పండుగదినాల్లో నగరానికి వచ్చే నటులూ, సంగీతజ్ఞులూ, మొదటిదినం సమస్త ప్రదర్శనాలో పాల్గొని, మూడవ దినం క్లిష్టదానం అవుతుంది. కనుక రెండవ దినమే వారి కోసం ఏర్పాటైన ప్రేక్షక మూల్యంలోనుంచి కొంత ధనాన్ని బహుమానంగా పుచ్చుకోలవసిందనీ, దానికి ఇష్టంలేని సందర్భంలో ప్రేమ పూర్వకంగా నాగరకులు ఇచ్చిన వస్త్రాభరణాలతో తృప్తిపొంది జరిగిన నాటక ప్రదర్శనాన్ని ప్రేక్షకులు తిరిగి కోరినట్లయితే ప్రదర్శించవలసిందనీ, నగరాలలో ఉండే కుశీలవులకూ, నాగరకులకూ, పరిషత్తులకూ ఆగంతుకులుగా వచ్చిన నటగాయకాది కళాభిజ్ఞులను గౌరవించడం ధర్మ' మనీ శాసించినాడు. దీనినిబట్టి క్రీస్తు పూర్వమే ఆంధ్రజాతి సంగీత నాట్యాది కళాభిజ్ఞత సంపాదించి కట్టుబాట్లతో వాటిని పోషించుకున్నదని వ్యక్తమౌతుంది. అంతకు ఎంతో పూర్వమే భారతదేశంలోని సమస్త ప్రాంతాలలోనూ స్త్రీ పురుష నాటక సంఘాలు ఉన్నట్లు వాల్మీకి మహర్షి రామాయణంలోని 'న రాజకే జనపదే ప్రభూత నటనర్తకాః, ఉత్సవాశ్చ సమాజాశ్చ వర్ధంతే రాష్ట్ర వర్ధనాః' ఇత్యాది అభిభాషణాలవల్ల తెలుస్తూనే ఉన్నది. మహర్షి శయనోపచారికాలలోనూ, చతుష్షష్టినిరూపణములోను వైశికమునను మరికొన్ని సూత్రాలు వ్రాసినాడు, ఆ నాడు ఉదక వాద్యములు భాండనృత్యములు నున్నట్లు తెలియుచున్నది. హాల మహారాజు నాటిదని చెప్పదగ్గ కౌముదీ మహోత్సవ నాటకంలో మరికొన్ని సంగీత నాట్య ప్రశంసలు కనిపిస్తున్నవి. హాల మహారాజు అనంతరం సాతవాహన రాజులలోగౌతమీ పుత్ర, వాసిష్ఠీ పుత్రులు ప్రసిద్ధి కెక్కిన రాజన్యులు. వీరు ధాన్యకటకము రాజధానిగా ఆంధ్రదేశాన్ని పాలించి అమరావతి, రామిరెడ్డిపల్లి, గుంటుపల్లి, గోలీ, బుద్ధాం, సమాధానపురం, మంచికల్లు మొదలైన అనేక ప్రదేశాలలో బౌద్ధక్షేత్ర నిర్మాణానికి కారణభూతులై అనేక యజ్ఞయాగాదిక్రతువు లొనర్చి పూర్వరాజన్యప్రశస్తి పొందినవారు. పైన చెప్పిన యజ్ఞ యాగాదిక్రతు

లక్షణాలను పరిశీలించినప్పుడు దేశంలో సంగీత నాట్యాలు అత్యుత్తమ స్థితిని పొందినవని చెప్పవలసి వస్తుంది. పూర్వోక్తాలైన బౌద్ధ క్షేత్రాలలోని శిల్పఖండాలను పరిశీలించినప్పుడు, ఈ అభిప్రాయం దృఢ మౌతుంది. ఆలీఢ ప్రత్యాలీఢాది పాదవిన్యాసాలూ, పతాకాది ముద్రలూ, కోమల కరణాంగహారాలూ వాటిలో శిల్పితాలైనవి. జంత్ర, చర్మ వాంశికాది వాద్యాలతో ఆ నాటి ఆంధ్రులకు పరిచయమున్నట్లు స్పష్టమౌతుంది. వేయితీగలు గల 'గెయిటర్'ను పోలిన ఒక వాద్యవిశేషశిల్పం ఒకటి అమరావతి స్తూప చిత్రాలలో కనిపిస్తున్నది. సాతవాహన రాజులనాటి సంగీత నాట్యాలనూ, శాస్త్ర విస్తృతిని స్మరించటానికి శిల్పఖండాలు తప్ప మరొక ఆధారం ఏమీ కనిపించటం లేదు.

సాతవాహన రాజుల తరువాత ఆంధ్రదేశాన్ని, ఇక్ష్వాకులు, పల్లవులు, శాలంకాయనులు మొదలైన ఆంధ్రభృత్యులు పరిపాలించారు. శాతవాహన రాజులు చేతికిచ్చిన కళాసంపత్తిని వ్యర్థం చేయకుండా వన్నెలు చిన్నెలు దిద్దుకుంటూ, పూర్వ ప్రభుమార్గాన్ని అనుసరించి పోషించారు, ఈ రాజవంశాలలో జన్మించిన ప్రభువులు. మాధ్యమిక బౌద్ధవాదానికి పట్టుగొమ్మ అయిన నాగార్జునాచార్యుడు ఇక్ష్వాకు వంశ మూలపురుషుడు – శాంతిమూలుని సమకాలికుడని చరిత్రజ్ఞుల అభిప్రాయము. ఇది సత్యమైనట్లైతే ఆ మహావిజ్ఞాని వ్రాసిన సంగీతశాస్త్రం ఏ టిబెత్తు భాషలో నుంచో బయట పడినప్పుడు ప్రాచీనాంధ్ర సంగీత విద్యావిశేషాలు మరికొన్ని బయటపడవచ్చును. నాగార్జున కొండ శిల్పాలలో కొన్ని ఖండాలను పరిశీలించినప్పుడు ఆ నాటి సంగీత నాట్యాలను గురించి కొంత ఊహాగానం చెయ్యటానికి అవకాశం ఉంటుంది.

సాతవాహన రాజ్యపతనానంతరం ఇక్ష్వాకులతో పల్లవులు కూడా ఆంధ్ర దేశంలో కొంత భాగాన్ని పాలించారు. వీరు పశ్చిమం నుంచి చాళుక్యరాజు రెండవ పులకేశి వచ్చి దక్షిణానికి తరిమివేసేటంతవరకూ దేశాన్ని పాలించి, సంగీత నాట్యాలకు దోహదమిచ్చారు. పల్లవ మహేంద్రవిక్రముడు దక్షిణానికి వెళ్ళిపోయేటప్పుడు అనేక కవిగాయక శిల్పి వర్గాలను ఆంధ్రదేశం నుంచి ఆయనవెంట తీసుకొని వెళ్ళినాడు. వారిలో సుప్రసిద్ధుడు మేధావి రుద్రుడనే నామాంతరమున్న రుద్రాచార్యులు. ఈ మహానుభావుడు తన కాలంలో ఉన్న తానాలను సరిదిద్ది నిబంధిస్తే, ప్రభువు మహేంద్రవర్మ 'కుడిమియ మలై' అనేచోట శాసనస్థం చేయించాడు – శిలాస్తంభాలమీద. ఇక్ష్వాకుల పతనానంతరం ఆంధ్రదేశం విష్ణుకుండినుల హస్తగతమైంది. ఉండవల్లిగుహలు వీరు తొలిపించినవేనని శ్రీ భావరాజు కృష్ణరావు

గారి అభిప్రాయము. అందులోని వీణాది వాద్యజంత్రాలనూ, నాట్య భంగిమలలో నున్న స్త్రీ వేషాలనూ పరికిస్తే, ఆ నాడు కూడా సంగీత నాట్యాలు రెండూ ఆంధ్రులకు ఆదరణపాత్రాలైన కళలుగా ఉన్నవని వ్యక్తమౌతుంది.

'అందీ అందని భావరేఖల ప్రసన్నాగారతన్ లేత పూతన్ తీపారగ తీర్చి దిద్దిన అజంతాగహ్వార శ్రేణులు', వాకాటకరాజుల నాటివి. కానీ శిల్పు లాంధ్రులు. ఎల్లోరా, కైలాసము, అజంతా శిల్పఖండాలనూ, భిత్తిచిత్రాలనూ పరిశీలిస్తే సంగీత నాట్యాలకు ఆ నాటి రాజన్యులెంత ప్రాధాన్యము నిచ్చారో వ్యక్తమౌతుంది. శివ తాండవాది దేవతా నాట్య భంగిమలను నిరూపణ చేసే సందర్భంలో శిల్పులు ఉపయోగించిన వీణలనూ, సంగీత వస్తువులనూ గమనిస్తే, అజంతా శిల్ప సమ్రాట్టులకు సంగీత నాట్య శాస్త్రాలలో ఉన్న పరిచయం ద్యోతిత మౌతుంది.

క్రీ.శ. 610లో రెండవ పులకేశి పూర్వ దిగ్విజయయాత్రకు బయలుదేరి ప్రాగాంధ్రాన్ని జయించి, తమ్ముడు కుబ్జవిష్ణువర్ధనుని నూతన రాజ్యాధిపతిని చేసి, తిరిగి వెళ్ళిపోయినాడు. అతని వంశస్థులు కొంతకాలం అంతఃకలహాలతో కాలం వెళ్ళబుచ్చి, తరువాత కళాపోషణకు పూనుకున్నారు. వీరితోబాటు పశ్చిమాన రాజ్యం చేస్తున్న బిల్హణమహాకవి శిష్యుడు సోమేశ్వరుడు నాట్యశాస్త్రాభిమాని. మహారాష్ట్రం నుంచి వచ్చిన ఒక గోండుకన్యకు స్వయంగా 'చరణాచారము' చెయ్యటానికి సింహాసనం దిగివచ్చేవాడు. ఆ మహారాజు నేర్పిన నాట్యభంగిమమే తరువాత కాలంలో 'గోండ్లి' అనే ప్రసిద్ధ నామాన్ని పొందింది. నృత్త రత్నావళిలో జాయపసేనాపతి ఈ విషయాన్నే –

"కల్యాణకటకే పూర్వం భూతమాతృమహోత్సవే
సోమేశః కౌతుకే కాంచిద్ భిల్లవేష ముపేయషీమ్
నృత్యంతీ మథ గాయంతీం స్వయం పౌష్యమనోహరమ్
ప్రీతో నిర్మితవాన్ చిత్రగౌండినీ మిత్యయమ్
స్వతో భిల్లీ మహారాష్ట్ర గౌండినీ త్యభిధీయతే ॥"

అని పలికినాడు.

పశ్చిమ చాళుక్యులలోని సోమేశ్వరాది కళారాధకులను చూచి, కీర్తి స్పర్ధతో కొందరు పూర్వ చాళుక్యులు నాట్య సంగీత శాస్త్రాలకు చేయూత నిచ్చి పోషించారు. అందు మొదటివాడు, మొదటి చాళుక్య భీముడు. అతని మనుమడు రెండవ అమ్మరాజు. చాళుక్య భీమునికి (క్రీ.శ. 890–917) 'గాంధర్వ విద్యాప్రవీణ' బిరుదమున్నది. ఇతడు

చెల్లవ అనే నట్టువరాలికి అత్తిలి విషయంలో రెండు ప్రదేశాలను దానం చేసినట్లు అత్తిలి శాసనం వల్ల (Attili C.P. grant 14 of MER 1917-18) తెలుస్తున్నది. అందులో చెల్లవ 'నట్టువరాంద్రనే కలువలకు సూర్యకాంతి' అని వర్ణిత ఐనది. రెండవ అమ్మరాజు (క్రీ.శ. 945-970) 'కవిగాయక కల్పతరు' బిరుదనాముడు. ఇతని కీర్తిని కవిచక్రవర్తి, పోతన భట్టు అనే ఇద్దరు కవులు గానం చేసినట్లు చరిత్రజ్ఞులు తెలుపుతున్నారు. ఇతడు పట్టవర్ధని కులసంజాతనూ, సంగీత నాట్యశాస్త్రాలలో నిష్ణాత అయిన చామెకాంబను పోషించినట్లు తెలుస్తున్నది. (Kaluchambarru grant in E. I. Vol. VII, PP, 117 - 192) క్రీ.శ. 11వ శతాబ్దాదిలోనే నన్నయ మహాకవి భారతకృత్యాదిన కవిగాయక సమితులకు నమస్కరించాడు. రాజరాజనరేంద్రుని కుమారుడు కులోత్తుంగ చోళదేవుడు మాతామహరాజ్యాన్ని పాలించటానికి పితృరాజ్యాన్ని వదలి దక్షిణానికి వెళ్ళిన తరువాత, నెల్లూరు చోళులు, నతవాడి ప్రభువులు, పొత్తపి చోళులు, కోటవంశీయులు, కాకతీయులు స్వతంత్రించి ఆంధ్రదేశాన్ని భిన్న భిన్న ప్రదేశాలలో ముఖ్యపట్టణాలు ఏర్పరుచుకొని పాలించటం ప్రారంభించారు. తరువాతి కాలంలో కాకతీయులు ప్రముఖులై మహాసామ్రాజ్యాన్ని స్థాపించారు.

కాకతీయులలో మొదటి ప్రతాపరుద్రుని కాలమునాటికి వీరశైవము ఆంధ్రదేశంలోని విశేష ప్రచారాన్ని పొందింది. వీరశైవభక్తులు పరమేశ్వర సన్నిధానాన్ని పొందటానికి సంగీతనాట్యాలను సహాయకారులుగా స్వీకరించారు. కాకతీయులనాటి సంగీత నాట్యాల స్థితిగతులను తెలుసుకోటానికి పండితారాధ్య చరిత్ర, క్రీడాభిరామము, పల్నాటివీరచరిత్ర ముఖ్యమైన సాహిత్యాధారాలు.

పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రములో ఒకచోట విపులమైన నాట్య ప్రసంగము చేసినాడు. అందులో మార్గ, దేశివిభాగాలను పేర్కొన్నాడు. లాగు, వంజళము, ఢాళము, వళి, తివురు, బాగు, వాహిణి, సాళి ఇత్యాది దేశి భేదములను చెప్పినాడు. గతులలో అడ్డము, తివుటము, సన్న నమిలి, భ్రమర జలచరము, కోతి, గజ, సింహ, భుజంగములనూ, బంధములలో బారణ, దొర్తు, ద్రుక్కరము, మలపము, జల్లణము, బొల్లావణి, జొనాళి మొదలైనవాటినెన్నో ఉటంకించినాడు. వీణోత్తమము, బ్రహ్మవీణ సారంగవీణ, రావణవీణ, గౌణవీణ, కాశ్యపవీణ, భుజంగవీణ, భోజవీణ, త్రిసరణవీణ, సరస్వతీ వీణ, రావణ హస్తవీణ మొదలైన మార్గవీణలనూ, దివిరి, సకిన వళి, విట, సాగరిక, విపంచక, సర, మల్లరి, గోలాష్ఠి, షోషావతి మొదలైన దేశివీణలనూ, జాతివాస, విజాతివాస, పక్షవాస, రుద్రవాస, నిధివాస, ఋషివాస,

కార్తికవాస, ఘోరవాస, త్రిపురవాసాది వాంశికాలనూ, ఆవజము, కాహళము, రుండము, తోలు తప్పటము, తారుమద్దెలలు మొదలైన వాద్యాలను పేర్కొనినాడు.

వీరశైవులు భక్తిరసోన్మాదావస్థకు సాధనంగా సంగీత నృత్యాదులను గ్రహించిన విధానం పురాణంలోని క్రింది పంక్తులవల్ల గోచరిస్తుంది :

"అక్క మహాదేవి! అల్లమద్దెలలు
జక్కొల్పి వేగంబ సంధించుకొనుడు;
సర్వమానమున బసవ ప్రమథవ్వ!
కర మర్థి పట్టుడు కాహళలోలి
సకలవ్వ! నీవును సంగళవ్వయును
నొకరీతి నిలువుడు సుకరమ్ము గాను,
బాలరుద్రమ! ఎత్తుపట్టగ వాళె
గ్రోలు వాయింపుము గుడ్డవ్వ! నీవు
సట్టన నృత్యంబు సరసం బెరింగి
సంగు దాసమ! మహేశ్వరి! వీరభద్ర
లింగవ్వ! మీరు కేళికలు సేయుండు;
రమణదుకూలాంబరమును గంచుకము
నమరించుకొని చల్లడము బిగియించి
ఏతెమ్ము! నీవు పురాతమ్మ! శీఘ్ర
మాతతమ్ముగ నృత్యమాడుదు గాని;
తాళముల్ వట్టుడు, తాళగింపుండు
నాళతి వేళకు నందరు ననుచు,
నవిరళంబుగ నంత నార్భటం బిచ్చి
జవనిక రప్పించి సరసమై నిలచి,
పొలపగు ముఖరసంబును సౌష్ఠవమ్ము,
లలియు, భావంబు, ధూకళియు, ఝుంకళియును
మరియు తేవయు, విభ్రమమును రేఖయును
నెరయంగ నీరీతి నృత్యంబు సలుప"

(బసవ పురా. పే. 62)

బసవపురాణంలో సకలేశ్వర మాదిరాజయ్య కథలోనూ, నాట్యనమిత్తిండి కథలోనూ ఇట్లే మరికొంత విపులముగా గాంధర్వప్రశంస కనిపిస్తున్నది. భక్తులు శ్రీశైల పర్వతారోహణం చేసేటప్పుడు, తుమ్మెద పదములు, ప్రభాత శంకరాదిపదములు పాడుకొంటూ, ఆరభటీవృత్తిలో అంగలు వేస్తూ వెళ్ళేవారని సోమన చెప్పినాడు. ఆ నాటికే యక్షగాన నాటకాలూ, తోలుబొమ్మలాటలూ తెలుగుదేశంలో ప్రసిద్ధంగా ఉన్నట్లు సోమన రచనలవల్ల తెలుస్తున్నది. 'శతకంబు, శివతత్త్వ సారంబు, దీపకళిక, మహానాటకము నుదాహరణములు, రుద్రమహిమయు, ముక్తకామములు, ప్రథమదేశ పురాతనపటుచరిత్రములు, క్రమమెుంద బహునాటకము లాడువారు, భారతాదికథల చీరమరుగుల నారంగబొమ్మల నాడించువారు' అన్నవి ఆయన మాటలు. మహాకవి శ్రీనాథుడు, కాకతీయ ప్రథమ ప్రతాపుని సమకాలికుడైన నలగామరాజు పలనాటిని పాలిస్తూ సింహాసనం ఎక్కేటప్పుడు, ఒకానొక నర్తకి వచ్చి నాట్యం చేసిన విధానాన్ని కంటికి కట్టేటట్టు –

"ఘనవైభవంబున కామవిభుడు
నవ్వుచు సెలవిచ్చె నాట్యంబు సేయ,
వరమృదంగము లెస్స వాయించు మేటి
కుడిభాగమందున గుదురుగా నిలచె,
దాళమానజ్ఞులు దాపటి దిశను
నిలచి యుత్సాహంబు నేరుపుమీర,
ముఖవీణ వాయించు ముఖ్యుడొక్కండు
రాగమాలాపించు రమణు లిద్దరును,
నిండు వేడుకతోడ నిలచిరి వెనుక
గంజలోచనయును ఘనమైన పాత్ర
మదనుపట్టపుదంతి మంజులవాణి
....నిలచి నాట్యమునకు నేర్పరియైన
వేత్రపాణికి తన వినయంబు సూపి,
అతడొసంగిన గజ్జె లతిభక్తితోడ
బాదములం గట్టి, పంచవర్ణముల
కాసె గట్టిగ గట్టి కడు జనం బదర
మద్దెల తాళాల మధ్య నిలుచుండి

యోరజూపున రాజు నొయ్యన జూచి
సమపాదయుతమైన స్థానికస్థితిని
దాత్పర్యమున దేవతలకును మ్రొక్కి
పుష్పాంజలి యొసంగి పూని నాట్యంబు
సమకట్టి నాదంబు సభయెల్ల గ్రమ్మ
గైకొలు విడుదలల్ ఘనకళాశైలి
కైముడి కట్నముల్ కనుపింప జేసి
వెలయంగ దొమ్మిది విధము లైనట్టి
భూచారి నాట్యంబు పొందుగా సల్పి
పదునారు విధములై పరిగిన యట్టి
యా కాశచారియు సమరంగనాడి,
గతచారి భేదముల్ కనుపడునట్టు
భ్రమణసంయుతదీప్తపటిమ మీరంగ
బాణి భేదములను బాటించి చూపి
స్థానక సంచయ సంయుక్త మమర
బ్రేరణి దేశిని ప్రేంఖణ శుద్ధ
దండికా కుండలి తగు బాహుచారి
సప్తతాండవములు సల్పె చిత్రముగ...”

అని వర్ణించినాడు. ఇంత విపులంగా నాట్యోపక్రమోపసంహారాలను విశదీకరించిన పట్టు ఆంధ్రసాహిత్యంలో మరొకటి కనిపించటం లేదు. కాకతీయుల కాలంలో ఏకవీరాదేవి జాతరలు జరిగేవి. అందులో జన సామాన్యానందానుభవం కోసం ద్విపద ప్రబంధాలను పాడేవారని వినుకొండ వల్లభామాత్యుడు క్రీడాభిరామంలో –

“ద్రుతతాళంబున వీరగుంఫితకథల్ దుంధుం కిటత్కార సం
గతి వాయింపుచు నాంతరాళికయతి గ్రామాభిరామంబుగా
యతిగూడన్ ద్విపదప్రబంధమున వీ రానీకముల్ బాడె నొ
క్కత ప్రత్యక్షరమున్ గుమారకులు ఫీ ట్కారంబునన్ దూలగన్.”

ఒక కోమలి వీరగాథలు పాడుతూంటే జనం పొంగి పరవశులై పోతూ ఉండేవారని వల్లభరాయుడు –

సీ. "గర్జించియరసి జంఘాకాండయుగళంబు
వీరసం బెట క్రోల వ్రేయు నొకడు,
యాలీఢపాదవిన్యాస మొప్పగ వ్రాలి
కుంతాభినయము గైకొను నొకండు
బిగువు కన్నుల నుబ్బు బెదరు చూపులతోడ
ఫీట్కార మొనరించు పెలుచ నొకడు,
పటుభుజావష్టంభపరిపాటి ఘటియిల్ల
ధరణి యాస్ఫోటించి దాటు నొకడు,

తే. యుద్ధి ప్రకటింప నొక్కరుం డోలనాడు
బయలు గుర్రంబు భంజళ్ళు పరుపు నొకడు
కొడుము దాటింపుచును పెద్ద కొలువులోన
బడఁతి పల్నాటివీరుల బాడునపుడు."

అన్నాడు. గుర్రపు భంజళ్ళు మహాకవి పింగళి సూరనార్యుని విశేషంగా ఆకర్షించినవి. అందువల్ల ఉదాత్తనాయకుడైన ప్రద్యుమ్నునిచేత ప్రభావతీ ప్రద్యుమ్నంలో ఆయన గుర్రపు భంజళ్ళు త్రొక్కించాడు. దేశీయ నాట్యమూ, సంగీతమూ విస్తారంగా ఆ దినాల్లో ప్రచారంలో ఉండటం చేతనే, కవి బ్రహ్మ తిక్కనామాత్యుని దృష్టి వాటిమీద నిలిచింది. ఆయన అర్జునుణ్ణి విరాటరాజు కొలువులో ప్రవేశపెట్టేటప్పుడు 'ఒందు పనులకు సెలవు లేకునికిజేసి యభ్యసించితి శైశవమాదిగాగ, దండలాసకవిధమును గుండలియును, బెక్కణంబు తెరంగును ప్రేరణంబు' అని ఆ వీరుడినోట పలికించాడు. ఈ కవిబ్రహ్మ తన నాటి తోలుబొమ్మలనుంచి ఎన్నో ఉపమానాలు గ్రహించాడు. 'కీలుకా డెడలింప గెడసిన బొమ్మల కైవడిఁ బటుతురంగ వ్రజంబు కూలఁ' (ద్రోణపర్వము – ఆ.3) 'చలమున దుస్ససేనుడును సౌబలుడున్ మిముబట్టి యార్ప బొమ్మలక్రియ నాడుచుండుదురు మానక నీవు సుయోధనుండు' (ఉద్యోగ పర్వము).

కాకతి గణపతిదేవ చక్రవర్తి బావమరది జాయపసేనాపతి నృత్తరత్నావళి కర్త. ఇతని నృత్తరత్నావళి మధ్యయుగంలో ఆంధ్రులు రచించిన నాట్య గ్రంథాలలో సుప్రసిద్ధమైనది. ఇది అముద్రితము. దీని ప్రతి ఒకటి తంజావూరు సరస్వతీ మహల్ తాళపత్ర గ్రంథాలయములో ఉన్నది. ఈ గ్రంథాన్ని బట్టి గణపతి దేవ చక్రవర్తి సంగీత నాట్య ప్రియుడనీ, కౌమారం నుంచీ ఆయన నాట్యశాస్త్రంలో విశేషకృషి

చేసినవాడనీ, అతని ప్రతిభను గమనించి ప్రభువు నృత్తరత్నావళీ రచన చేయలసినదని శాసించినట్లు అందులోని –

"ప్రేక్ష్య ప్రజ్ఞా మతిశయవతీం స్వామిభక్తిం చ, హర్షా
దాకౌమారా ద్గణపతినృపో జాయనం యం సమర్థమ్ ।
శుండామాత్యే సకలసుమన స్సేవ్యమానో జయంతం
వాచాంపత్యై హరిరివ కలా శ్లాఘనీయం వ్యనైషీత్ ॥

జిత్వా శౌర్యేణ పృథ్వీం జలనిధిరశనాం స్వస్థిరీకృత్య లోకం
సంగీత స్యోపభోగం సకుతుకమనసః స్వామినః శాసనేన ।
తస్యాభీష్టస్య భాస్వన్మణినికరనిభం నృత్తలీలాయితస్య
రాజ్ఞోఽ సౌ శాస్త్ర మేత ద్రచయతి చతురం నృత్తరత్నావళీతి ॥"

అన్న వాక్యాల వల్ల తెలుస్తున్నది.

కాకతీయుల కాలంలో వీరశైవంతో పాటు ఆంధ్రదేశంలోని కొన్ని ప్రాంతాలలో కాలాముఖ పాశుపత శైవాలు కూడా విజృంభించినవి. పాశుపత గోళకీ మఠానికి గణపతి దేవచక్రవర్తి కుమార్తె రుద్రాంబ గుంటూరు జిల్లా మల్కాపురంలో కొంత భూమిని దానం చేస్తే, మఠాధిపతి విశ్వేశ్వర శివదేశికాచార్యులవారు దేవాలయం కట్టించి దాని అంగరంగ భోగలక్షణాలుగా ఇద్దరు నర్తకులను, అయిదుగురు ఆవజ కాంద్రను, తగిన వాద్యసంపత్తిని ఏర్పరచినట్లు తెలుస్తున్నది (J.A.H.R.S.Vol. IV. Pts. 8 & 4) వీరికాలంలో దేవాలయాలకు సంబంధించిన గాంధర్వ విద్యాప్రవీణుల జీవితాలు నాటకాలుగా కట్టి ఆడతగినట్లుగా ఉండేవట. క్రీడాభిరామంలో ఒక వారాంగన ప్రశంస మాటలమధ్య వచ్చినప్పుడు, మంచన శర్మ టిట్టిభ సెట్టితో 'లెస్సగాక, కిరాట! ఈ లేమచరిత మాడుదురు నాటకంబుగ నవనిలోన' అని చెప్పేవాడు.

కాకతీయుల పతనానంతరం క్రీ.శ. 14వ శతాబ్ది మధ్య భాగంలో బృహదాంధ్రదేశం 1. కోరుకొండ, 2. రాచకొండ, 3. పిఠాపురము 4. కొండవీడు, 5. విజయనగరము అనే ఐదు రాజ్యాలుగా ఏర్పడిపోయింది. కళాపోషణ విషయంలో వీరందరూ కాకతీయుల అడుగుజాడలనే అనుసరించారు.

కొండవీటి రాజ్యస్థాపనాచార్యుడు ప్రోలయ వేమారెడ్డి; ఎఱ్ఱాప్రగడ రామాయణ హరివంశాలకు కృతిభర్త. ఎఱ్ఱాప్రగడ హరివంశంలో కృష్ణుని జలక్రీడలను వర్ణించే సందర్భంలో 'లలితగగనరంగంబున, నలయక క్రొమ్మెఱుఁగు గొండ్లియై యాడెడుచో

నలవడియె మొగిలు తెరలును, బొలుపగు వడగండ్లగములు పుష్పాంజలులున్’ అని నాట్యపూర్వరంగాన్ని ఉద్ఘాటించాడు. ప్రోలయ వేమారెడ్డి కుమారుడు అనవేమారెడ్డి కంచి, రన్ని, పొన్ని అనే ముగ్గురు నాట్యశాస్త్రాభిజ్ఞుల పోషించినట్లు తెలుస్తున్నది. కొండవీటి రెడ్డి రాజులలో ఒకడైన కుమారగిరిరెడ్డి వసంత రాజీయ మనే నాట్యశాస్త్రాన్ని ఒకదానిని వ్రాసి దానిని శిష్య అయిన లకుమాదేవి మూలాన ప్రచారం చేయించినట్లు –

> “జయతి మహిమా లోకాతీతః కుమారగిరి ప్రభో
> స్సృదసి లకుమాదేవీ యస్య ప్రియాసదృశీ ప్రియా ।
> నవ మభినయం నాట్యార్థానాం తనోతి సహస్రధా
> వితరతి బహూ నర్థా నర్థివ్రజాయ సహస్రశః ॥”

అన్న శ్లోకం వల్ల వ్యక్తమౌతున్నది. కుమారగిరి రెడ్డికి వసంతరాజు బిరుదనామము, అతని వసంతోత్సవ ప్రియత్వం వల్ల కలిగింది. ఇతని బావమరిది కాటయ వేమన శాకుంతల వ్యాఖ్యలో కుమారగిరి నాట్యశాస్త్రాన్ని గురించి ‘మునీనాం భరతాదీనాం చ భూభుజాం, శాస్త్రాణి సమ్య గాలోచ్య నాట్యవేదార్థవేదినాం, ప్రోక్తం వసంతరాజేన కుమారగిరి భూభుజాం, నామ్నా వసంతరాజీయం నాట్యశాస్త్రం యదుత్త మమ్’ అని వ్రాసి ఉన్నాడు. కుమారగిరి తరువాత కొండవీటిని పాలించిన పెదకోమటి దత్తిలమతాన్ని ఆధారం చేసికొని ఒక నాట్యశాస్త్రాన్ని వ్రాసినట్లు తెలుస్తున్నది. కొండవీటి రెడ్డిరాజ్యం అంతరించిన తరువాత శ్రీనాథ మహాకవి రాజమహేంద్రవరం రెడ్లను ఆశ్రయించాడు. ఈ మహాకవిగ్రంథాలలో అనేక సందర్భాలలో సంగీత నాట్య ప్రశంసలు కనిపిస్తున్నవి. ‘వల్లకి చక్కి కాహళము వంశము ఢక్క హుడక్క ఝర్ఝరుల్, ఝల్లరి యాదిగా గలుగు శబ్ద పరంపర తాళశబ్దమై, యుల్లసిలం బ్రబంధముల కొప్పుగ నాడుదు రగ్రవేదిపై, బల్లవపాణు లీశ్వరుని పంటమహీశులు పూజసేయగన్ హిందోళంబున బాడి రచ్చరలు భీమేశున్ త్రిలోకాధిపున్ – భీమఖండము పాడిరంగనల్ దేశ విధంబు మార్గమున తేటయు నొక్కట సాళగింపగన్ – నైషధము; బెండపూడి యన్నయామాత్యుండు కట్టించిన మొగసాలవాకిటి మహోత్సవ మంటపమునందు, పేరోలగంబుండి ‘...కుండలీ, దండలాసక, ప్రేరణ, సింధు, కందుక, ధమాళీ, చేలమతల్లికా, హల్లీసకాది నృత్యంబుల నవలోకింపుచు మేలంబు లాలకించుచు, జంపుచాటునాట కోదాహరణజయఘోషచక్రవాళ చతుర్భద్ర చతురాత్రి ప్రబంధంబు లాకర్ణించుచు’ మొదలైన సంగీత నాట్య సంబంధములైన రచనలు శ్రీనాథ మహాకవి గ్రంథాలలో విశేషంగా కనిపిస్తున్నవి.

కోరుకొండ రాజుల్లో ముమ్మడి నాయకుల తమ్ముడు సింగమనాయకుడు గొప్ప సంగీత కళాభిమానిగా కనిపిస్తున్నాడు. ఒకానొక శాసనంలో ఇతన్ని గురించి –

శా. 'వీణా వాదనకోవిదేన విలసల్లాస్య ప్రశస్యశ్రియో
సారస్యాస్పదగానమానవిధినా సౌజన్యమానాత్మనా ।
నిత్యైశ్వర్యవిలాసినా నిరుపమాకారేణ కాంతాజనే
నాయంకూనయభూమిసింగతిలకః క్రీడన్ సదామోదతే! ”

అని ఉన్నది.

కొండవీటి పెదకోమటి వేమారెడ్డితోనూ, విజయనగర రాజన్యుడు ప్రౌఢదేవరాయలతోనూ కీర్తిస్పర్ధ వహించి కవితాపోషణం చేసిన రాచకొండ రాజు సర్వజ్ఞ సింగభూపతి సంగీత నాట్యాలకు దోహమిచ్చినట్లు కనుపించదు. కానీ ఓరుగంటి నివాసి బమ్మెర పోతనామాత్యుడు భాగవతంలో 'వినుము దేహధారి స్వతంత్రుడు కాడు, జంత్రకాని చేతి జంత్రబొమ్మ కైవడి నీశ్వరతంత్రపరాధీనుండై దుఃఖంబులందు నర్తనంబు సలుపు' (దశమస్కంధము ఆ 2) అని బొమ్మలాట ప్రశంస చేసినాడు.

ఇక విజయనగర రాజన్యుల సంగీత నాట్యపోషణమును గురించి ఆలోచించవలసి ఉన్నది. హరిహర బుక్కరాయల మహామంత్రి విద్యారణ్యులవారు సంగీతసారమనే ఒక శాస్త్రగ్రంథాన్ని వ్రాసినారట. అందులో 267 రాగాలు ప్రత్యేకంగా వారు సూచించినట్లు ఇతర గ్రంథాలను బట్టి తెలుస్తున్నది. బుక్కరాయల వల్ల పెంచుకలదిన్నె గ్రామాన్ని అగ్రహారంగా స్వీకరించిన నాచన సోమనాథ కవి శేఖరుడు ఉత్తర హరివంశంలోనూ, వసంత విలాసంలోనూ కొన్ని సంగీత నాట్య ప్రశంసలు చేసినాడు. 'కమలముఖీకటాక్ష కటకాముఖపాణి నఖోపకారివిభ్రమమణి పుంఖరింఖ దభిరామరుచుల్' – ఉత్తరహరివంశము. ఆ 1. పద్యం 159; పేదలైన విన బ్రాహ్మణు వీట, జాణలు మెత్తురు జాజరపాట – ఉ. హరి. పీఠిక;

సీ. 'వడకు పన్నగరాజు పడగలమీద స
ర్వం సహాకాంత పేరణము సూప,
నుగ్రూతలూగెడు నుదయాస్తగిరులతో
నాకాశలక్ష్మి కోలాటమాడ,
తెరలెత్తి సప్తసాగరములు పొరలంగ
వరుణుండు గొండిలి పరిఢవింప,

మొగములచాయ వేరొక చందముగ నిల్పి
కమలసంభవుడు ప్రేంఖణ మొనర్ప

.............

తే. శౌరి పూరింప నప్పాంచజన్యరవము' – ఉత్తర హరి. ఆ. 4–215.

ఇందుకు కొన్ని ఉదాహరణాలు. వసంత విలాసంలో నాచన సోమనాథుడు పేర్కొన్న జాజర పాటను తరువాత ఎంతో కాలానికి దామర్ల వెంగళ భూపాలుడు బహుళాశ్వచరిత్రలో చెప్పినాడు.

శ్రీనాథ మహాకవిని 'దీనారటంకాల తీర్థమాడించిన' విజయనగర చక్రవర్తి ప్రౌఢదేవరాయలు సారంగదేవుని సంగీతరత్నాకరానికి వ్యాఖ్యవ్రాసిన కల్లినాథుణ్ణి పోషించాడు. (J.A.H. R.S. Pts. 2, 3, 4 page 204) సాళువ నరసరాయల కాలంలోనే మొట్టమొదటి యక్షగానం కనిపిస్తున్నది. అది ప్రస్తుతం ఉపలబ్ధం కాదు. కర్త చెన్న శౌరి. హరిభట్టు నారసింహ పురాణంలో 'సౌరభిచరితంబు జక్కులకథ చెప్పి లాలితనవరసాలంకృతముగ' అని తన పూర్వజుడు అన్న శౌరిని కీర్తించాడు. విజయనగర సామ్రాజ్యాన్ని కృష్ణరాయలు పాలిస్తూ దక్షిణాపథాన్నంతటినీ ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకు తెచ్చిన తరువాత, సమస్త కళాపోషణం విశేషంగా జరిగింది. సంగీత నాట్య సాహిత్య శిల్పాలు అన్యోన్యాశ్రయాలై ఇతని కాలంలో విలసిల్లినవి. చివరకు దుఃఖాన్ని కూడా సంగీతదృష్ట్యా కవులు, అవలోకించారు. శిల్పంలో 'సరిగమపధనిస స్వరవల్ల కీతుల్యరవ విఠోబాస్తంభ రాగఫణితి' గమనింపదగినది. ప్రబంధనాయిక లందరినీ 'వీణాప్రియ'లనుగా తీర్చిదిద్దిన కవులు కథానాయికల చేత ఏదో ఒక వీణను పట్టించారు. 'తరుణాంగుళిచ్ఛాయ దంతపు సరకట్ల నింగిలీకపు వింతరంగు లీన' అన్నచోట 'సర' అనే ఒకానొక వీణను వరుథిని చేత పట్టించాడు పెద్దనామాత్యుడు. 'కిన్నర' వీణ కూడా ఆ దినాలలో ప్రచారంలో ఉన్నట్లు కవితా స్వరూప నిరూపణ చేసే సందర్భంలో 'కిన్నర మెట్ల బంతి సంగాతపు సన్నతంతు' అన్నచోట ఆయన చెప్పినాడు. నయగారపు కన్నడి, గౌళపంతు ఇత్యాది రాగాలు ఆ నాడు ప్రసిద్ధి వహించినట్లు తెలుస్తున్నది. రాయలనాటి వీణమెట్లు ప్రస్తుత కాలంలో నిబద్ధాలై ఉన్నట్లు కనుపించదు. అవి వాతావరణాన్ని బట్టి, పాటకుని గొంతును బట్టి, రాగాన్ని అనుసరించి మార్చేవారు. మనుచరిత్రలో వరూథిని విరహావస్థలో ఉన్నప్పుడు చెలికత్తె పలికిన 'వాలారుం గొనగోళ్ళ నీ వలసతన్ వాయించుచో నాటకున్, మేళంబై, విపంచి నిన్న మొదలున్ నీవంటమింజేసి యా, యాలాపంబె యవేళ పల్కెడు

ప్రభాతాయాతవాతాహతిన్, లోలత్తంత్రుల మేళవింపగదవే లోలాక్షి దేశాక్షికిన్' అన్న వాక్యాలవల్ల తెలుస్తున్నది. ఆనాటి జనసామాన్యరసికలోకానికి ఈ రాగవిభేదాలు తప్పకుండా తెలిసి ఉంటవని మనం నిశ్చయించవచ్చును. రాధామాధవకవి ఈ విషయాన్నే 'కొలదిగ రాగ భేదములకున్ దగు సారెలు సారెకొత్తి తంత్రులు కొనగోళ్ళ మీటుచు జనుంగవ దండె యమర్చి కృష్ణ లీలలు ప్రకటించి పంచమకలశ్రుతి మాకు లిగుర్ప రాధకున్ వలపులు చిల్కగన్ మధురవాణి ప్రవీణత బాడె వీణతోన్' అని పలికినాడు. వీణా వాదనమూ, అభ్యసనమూ సర్వసామాన్యంగా ఆ నాడున్నట్లు గోచరిస్తుంది. లేకపోతే రాయలు ఆముక్తమాల్యదలో –

ఉ. “వేవిన మేడపై వలభి వేణిక జంట వహించి విప్పగా
బూవులు గోట మీటుతరి పోయెడు తేటుల మ్రోత లేమి శం
కావహమౌ గృతాభ్యసన లౌటను దంతపు మెట్లవెంబడిన్
జే వడి వీణ మీటుటలు చిక్కెడ లించుటలున్ సరింబడన్.” (ఆ1. ప. 62.)

అన్న పద్యంలోని భావాభినివేశానికి వీలుంటుందా? రాయల పాలనకాలంలో 'నాట్యకళ' అత్యుత్తమ స్థితి పొందినది చెప్పటానికి రామాలయ శిల్పాలు నిదర్శనాలు. మనుచరిత్రలో ఒకచోట పలికిన –

చ. 'చిలుకల కొల్కి కల్కి యొక చేడియ నాటకశాల మేడపై
నిలువున నాడుచుండి, ధరణీపతి చూడదలంచి యంచునన్
నిలచి రహిం గనుంగొనుచు నెయ్యమునన్ దనువల్లి యుబ్బి కం
చెల తెగబడ్డ కేతనము చీర చెరంగున మూసెఁ జన్నులన్.'

అన్న పద్యంవల్ల ప్రత్యేకంగా ఆ నాడు ఆంధ్రదేశంలో నర్తనశాల లున్నట్లు వ్యక్తమౌతున్నది. ఇక్కడ 'కంచెల' శబ్దానికి నాట్యం చేసేటప్పుడు బిగుతు కోసం తొడుగుకునే చనుకట్టు అని బ్రౌను అర్థము చెప్పినాడు. రాయలు ప్రజావినోదార్థము తోలుబొమ్మ లాటగాంద్రను రావించి, వారిమీద కాళన మంత్రిని అధికారిగా నియమించి గ్రామసీమల్లో వారిచేత ప్రదర్శనలు చేయించేవాడట. ఇతని కాలంలోనే మొట్టమొదటి 'కొరవంజి'కి ఆదరం లభించినట్లు అయ్యల రాజు రామభద్రుని 'జక్కిణీ, కొరవంజి వేషముల కేళి సల్పిరి, దేవతానటీమణులకు బొమ్మవెట్టు క్రియ' అనే ప్రయోగం వల్ల వ్యక్తమౌతున్నది. పదకవితాపితామహుడు, తాళ్ళపాక పెదతిరుమ లార్యుడు రాయలకు సమకాలికుడు. పదకవితకు ప్రాపకం లభించింది. కవితా

పితామహుడు పెద్దన్న 'మధురకిన్నరీ నిక్వాణంబుల రాణం ద్రాణచెరచు లక్ష్మీ నారాయణ కల్యాణంబు పాటలం దీటకొను తిన్నని రవంబు' అని వాటికి స్థానమిచ్చాడు.

రాయల ప్రాపకం క్రింద కొన్ని సంగీతలక్షణ గ్రంథాలు జన్మించినవి. వాటిలో లక్ష్మణభట్టు 'సంగీత సూర్యోదయము' ప్రసిద్ధమైనది. లక్ష్మణభట్టు కర్ణాటక సంగీతాన్ని జన్య జనకరాగవిభాగం చేసి నిరూపించటానికి ప్రారంభించినవారిలో మొదటివాడని చెప్పవచ్చును! 'కామ దేవవిలాస' మనే సంగీత నాట్య శాస్త్రగ్రంథ మొకటి ఈ కాలంలో జన్మించినదని తెలుస్తున్నది. అళియరామరాజు సంగీత కళాభిమాని. బియకారం రామయామాత్యుని 'స్వరమేళకళానిధి' ఆయన కాలంలో జన్మించిన అత్యుత్తమ సంగీత శాస్త్ర గ్రంథము.

తళ్ళికోట యుద్ధానంతరము విజయనగర సామ్రాజ్యలక్ష్మి పెనుగొండ, చంద్రగిరులకు చేరింది. కానీ ప్రభువుల కళాభిమానం వారిని పరిత్యజించ లేదు. పెనుగొండ రాజులలో తిరుమల రాయలు భట్టుమూర్తికి ఆశ్రయుడు. కృత్యాదిలో భట్టుమూర్తి 'సంగీతకళారహస్యనిధి' నని చెప్పుకున్నాడు. ఆయన 'లలనా జనాపాంగ' వంటి ఛందోబద్ధలయ ప్రధానాలయిన పద్యాలనే కాకుండా, వచనాలను కూడా శిష్టు కృష్ణమూర్తిశాస్త్రులవారి వంటి ప్రసిద్ధ విద్వాంసులు వీణమీద పలికించినట్లు వినికిడి. వసుచరిత్రలో ఒకచోట 'హారముల్ కుఱుచలు త్రొక్క' అనే ప్రయోగం కనిపిస్తున్నది. దీనికి శబ్ద రత్నాకరకారులు ఒక నాట్య విశేషమని వ్రాసి ఉన్నారు. ఈ ప్రాంతములో గోదావరీ పరిప్రాంత నివాసి సోమనాథ పండితుడు ఒక సంగీత శాస్త్రాన్ని రచించినట్లును, అది తరువాత ఖిలమై పోయినట్లును సంగీత సారామృతాదిశాస్త్ర గ్రంథాల వల్ల తెలుస్తున్నది. ఇతడు స్వరాలు 15 మేళ కర్తలుగ నిశ్చయించినాడట. తిరుమల రాయలు గీత గోవిందంమీద ఒక వ్యాఖ్యానాన్ని అంకితం పుచ్చుకున్నాడు.

విజయనగర పతనానంతరం ఆంధ్రకళాకోవిదులూ, శాస్త్రజ్ఞులూ దక్షిణదేశానికి వలసవెళ్ళినారు. అక్కడ తంజాపురము రఘునాథరాయలు విశేషంగా కళాపోషణం చేశాడు. ఆయన కవి, గాయకుడు, శాస్త్రజ్ఞుడు. ఇతడు సంగీత నాట్యాల రెంటియెడా సమానత్వం వహించి సంగీతసుధ, భరతసుధ అనే రెండు ఉత్తమశాస్త్ర గ్రంథాలను రచించినట్లు తెలుస్తున్నది. సంగీతసుధ మొదట రఘునాథరాయలు 7 అధ్యాయాల గ్రంథంగా వ్రాసినాడట. నేడు 4 అధ్యాయాలు మాత్రమే కనిపిస్తున్నవి. ఈ గ్రంథంలో రాయలు 50 రాగాలను 15 మేళకర్తలుగ విభజించినాడు. ప్రాచీన శాస్త్ర గ్రంథాలలో రాగాలకు అంస, న్యాస, గ్రహాలు మాత్రమే కనిపిస్తవి. ఇతడు శ్రుతి, స్వర అలప్తికలను

గూడా చేర్చినాడు. ఈ మహాగ్రంథానికి రఘునాథరాయల గురువు గోవిందదీక్షితుడు వ్యాఖ్యానం వ్రాసినాడు. రఘునాథ రాయలు వీణావాదనలో దిట్ట అని దీక్షితులు "జయంతసేనాదిమ రాగ రామానాందాది తాళాన్ రచయన్ నవీనాస్, సంగీత విద్వాంస ముపాదిశ స్త్వమ్ విపంచికావాద దక్షణానామ్' (J.O.R. Vol. III – 154) రీతిగా పలికినాడు. రాయలు వీణలలో నాలుగు రకాలను సూచించి వాటి అమరికను గురించి కొంత చర్చించినాడు. అతని పేరుమీద రఘునాథ మేళ నొకదానిని సృజించాడు. అతని ఆస్థానంలో సంగీత శాస్త్రనిధులు – స్త్రీ పురుషులు – అనేకులు ఉన్నట్లు 'వాగ్గేయ కారప్రముఖై రనేకై ర్విచిత్ర గీతాదికళా ప్రవీణైః, తథైవ వీణాదిమవాదవిద్యా విచరక్షణైః క్వాపినిషేవ్యమాణః' అనే ప్రమాణం వల్ల తెలుస్తున్నది. ఇతని కొలువులో ఉండే అనేక నాట్యగత్తెల విలాసవిభ్రమాలనే 'శృంగార సావిత్రి'లో అశ్వపతి తపోభంగం చేయటానికి వచ్చిన అప్సరసలకు చూపించినాడు. వెంకటమఖి, రఘునాథ రాయల ఆస్థాన సంగీత విద్వాంసులలో ప్రముఖుడు. 'తుర్దండి ప్రకాశిక' అనే సంగీత శాస్త్ర గ్రంథ నిర్మాత. వీణ, శ్రుతి, స్వరము, మేళము, రాగము, అలాపనము, ఠాయ, గీత ప్రబంధాలు అనే 10 అధ్యాయాల గ్రంథము. రఘునాథుని వీణమెట్ల పద్ధతిని అనుసరించక, సప్తస్వరాలకూ సర్వ కాలసర్వావస్థల్లో ఒదిగేటట్లు మెట్లను సరస్వతీ వీణకే ఏర్పాటు చేసి, 72 మేళకర్తలను నిరూపించిన మహానుభావుడు వెంకటమఖి. ఇతడు జయదేవుని గీత గోవిందమార్గాన్ని అనుసరించి త్యాగరాజస్వామిమీద 24 అష్టపదులు చెప్పినాడట (భారతీయ సంగీతము – వీణ సుబ్రహ్మణ్యశాస్త్రి పే. 6)

కృష్ణరాయుల కాలంలో అల్పప్రచారాన్ని పొందిన యక్షగానాలు రఘునాథరాయలు, అతని కుమారుడు విజయరాఘవరాయల కాలంలో విశేష వ్యాప్తిని పొందినవి. తంజావూరు కోటలో ప్రత్యేకంగా నాటకశాలలు కట్టించినట్లు ఆయన అంకితం పుచ్చుకున్న విజయవిలాసంలోని 'మాటల నేర్పులా సరసమార్గములా నాటకశాలలా... కీర్తిలోలుడు జుమీ రఘునాథ నృపాలుడిమ్మహిన్' అన్న పద్యం వల్ల వ్యక్తమౌతున్నది. రఘునాథరాజు స్వయంగా 'అచ్యుతేంద్రాభ్యుదయ' మనే యక్షగానం వ్రాయటమే కాకుండా, ఎలకూచి బాలసరస్వతి వంటి విద్వాంసుల దృష్టిని వాటిమీదికి ప్రసరింపచేశాడు. బాల సరస్వతి 'కల్యాణకౌముదీకందర్ప నాటకం' వ్రాసినాడు. రాయలకుమారుడు విజయరాఘవరాయలు కళాపోషణ కోసమే రాజ్యాన్ని పాలిస్తున్నట్లు శారదా ధ్వజాన్ని ప్రతిష్ఠించాడు. 50 యక్షగానాలు వ్రాసి ఆడించాడు. ఇతని కాలంలో తంజావూరు నాటకశాలల్లో నటించిన యక్షగానాలు 300కు పైగా ఉన్నవట. నాటకాలు ఆడేటప్పుడు రంగులు వేసుకొని పాత్రోచిత వేషధారణలతో ప్రజలను

రంజింపజేసేవారట. స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించినట్లు తెలుస్తున్నది. ప్రత్యేకమైన నాట్య ప్రదర్శనాలు కూడా విజయరాఘవుని కాలంలో కొలువులో జరిగేవి. అతడు అంకితం పొందిన రాజశేఖరవిలాసంలో చుండి కాళయ అతని సభలో ఖ్యాతి పొందిన నర్తకీమణుల ప్రత్యేకతలను గురించి –

సీ. "చౌపదంబులు సీత రూపవతీ కాంత
శబ్దచూడామణి చంపకాఖ్య,
చెలువగు జక్కిణి చెలువ మూర్తి వధూటి
కొదమ కోమలవల్లి గురునితంబ
నవపదంబులు లోకనాయికా లోలాక్షి
యలదేశి శశిరేఖికాబ్జనయన,
తురు పదంబులు రత్నగిరి నితంబినియును
పేరణివిధము భాగీరథియును

తే. మదన ప్రదద్యూత నవరత్నమాలికాది
బహువిధాలక్ష్య నాట్య ప్రపంచమెల్ల
ఘనత కెక్కిన తక్కిన కాంతలెల్ల
నభినయించిరి తమ నేర్పు లతిశయిల్ల."

అని వ్రాసి ఉన్నాడు. పదకవితా చక్రవర్తి క్షేత్రయ్య విజయరాఘవుని రాజ్యకాలంలోనే దక్షిణ యాత్ర జేసి 4000 పైగా (మేరునిఘంటువు లెక్క ప్రకారము) మధుర భక్తి ప్రపూరితాలైన పదాలను గానం చేశాడు. గేయకవితా ప్రపంచంలో పాత్రవైవిధ్యానికీ, పరిస్ఫుట రూప చిత్రణానికీ, భావవ్యక్తీకరణానికీ క్షేత్రయ్యకు సాటి నిలువగలవాడు లేడు. ఇతని పదాలలో మగబొమ్మలు సూటిగా మన కంటిముందు కనపడరు. వారి నాడించు సూత్రధారిణులు స్త్రీలు. స్త్రీ స్వభావము నందలి వైవిధ్యమును, అంద చందాలనూ, ఇంత సుకుమారంగా, గంభీరంగా త్రచ్చి చూచినవాడు లేడు. 'మగువ ఏకాంత మందిరము వెడలెన్' అన్న వనితాదివ్య సౌందర్య నిరూపణం మొదలు ఆహిరి చాపుతాళములో వ్రాసిన 'పచ్చి ఒడలిదానరా, పాపడు పదినెలలవాడు వచ్చి కూడుటకు వేళ గాదు' అన్నంత వరకూ ఆయన లేఖినికి విహారభూమి. మధుర చొక్కనాథుడూ, తొండైమాన్ రఘునాథరాజూ విజయ రాఘవునితో కీర్తిస్పర్ధ వహించి సంగీత నాట్యాలను పోషించారు. చొక్కనాథుని ఆస్థానకవి తిరుమలుడు 'చిత్ర కూటాచల మాహాత్మ్య' యక్షగానాన్నీ, మైసూరు సంస్థానాధిపతి చిక్క దేవరాయనిమీద ఒక కవి

'చిక్క దేవరాయ విలాస'మనే గేయ ప్రబంధాన్నీ వ్రాసినట్లు తెలుస్తున్నది. (తంజావూరు తాళపత్ర గ్రంథావళి నం. 520 Madras Oriental Manuscripts - Catalogue iii)

క్రీ.శ. 1676 తరువాత తంజావూరును పాలించిన మహారాష్ట్ర నాయకులు ఆంధ్రనాయకుల అడుగుజాడల్లో నడిచి యక్షగాన రచన చేశారు. కవితను పోషించారు. వారిలో 'షాజీ' ప్రముఖుడు. ఆస్థానకవులలో 'గిరి రాజకవి' ముఖ్యుడు. తంజావూరు మహారాష్ట్రులలో ప్రతాప సింహుని కాలంలో ముద్దు పళని సంగీత సాహిత్యనిధి తాతాచార్య శిష్య. ఆమె గోదాదేవి వ్రాసిన తిరుప్పావును 10 సప్తపదులుగా తెలుగులోకి పరివర్తన చేసింది. క్రీ.శ. 1793–1832లలో తంజావూరును పాలించిన శరభోజి కాలంలో త్యాగబ్రహ్మ జన్మించి 'నాదధేనువు'ను పిండి నవనీత మొలికించాడు. తెలుగుభాషను దాక్షిణాత్య సంగీత ప్రపంచానికి ఏకైక భాషగా తీర్చిదిద్దిన మహానుభావుడు త్యాగరాజస్వామి. కర్ణాటక సంగీత ప్రపంచంలో 'రసత్రయ'మని ప్రసిద్ధి వహించిన ముగ్గురిలో త్యాగయ్య. శ్యామశాస్త్రులిద్దరూ ఆంధ్రులే. శ్యామశాస్త్రి కుమారుడు సుబ్బరామదీక్షితులు, శిష్యులు పట్నం సుబ్రహ్మణ్యం, ముత్తు స్వామి దీక్షితులు, చిన్న స్వామి దీక్షితులు మొదలైన విద్వాంసులు మిలికినాటి ఆంధ్రులు. ఈ సందర్భంలో సావేరిరాగాన్ని 8 గంటలు ఆలాపన చేసిన పల్లవి శేషయ్యను పేర్కొనుట సమంజసము.

కృష్ణరాయల కాలంలో నామమాత్రంగా వినబడుతున్న కొరవంజికి విశేష గౌరవమిచ్చి మహారాష్ట్రులు ప్రచారం చేశారు. జనసామాన్యానికి ఆధ్యాత్మిక విద్య 'జీవనాటకము' వంటి యక్షగానాల ద్వారా నేర్పటానికి యత్నించినట్లు వ్యక్తమగుచున్నది. ఈ కాలంలో పుట్టిన 'త్యాగరాజవినోద చిత్ర ప్రబంధనాటకం' అతిచిత్రమైనది. పాత్రోచితమైన భాష విచిత్రంగా సంస్కృతము, అరవము, మహారాష్ట్రము, తెలుగు కన్నడములలో ఉండేదిట. స్వర సాహిత్యము, జతులు, కీర్తనలు, జావళులు, యక్షగానాలూ ఈ కాలంలో లెక్కకు మిక్కిలిగా పుట్టినవి'

విజయనగర పతనానంతరం – దక్షిణ దేశానికి వలసపోని కవులనూ, గాయకులనూ, నటకులనూ, వెంకటగిరి, విజయనగరము, పిఠాపురము మొదలైన సంస్థానాధిపతులు పోషించారు. కూచిపూడి వారు భరతశాస్త్రానికి పెట్టినది పేరై నేటివరకూ మధ్యాంధ్రంలో ఖ్యాతి గడించారు. వేములపల్లెవారు, ధర్మవరంవారు ఒక్కొక్క ప్రత్యేకతతో యక్షగానరచన చేశారు.

కంకంటి పాపరాజువంటి విద్వత్కవులు కాలానుభావాన్ని అనుసరించి ఉత్తర దేశంలో 'విష్ణుమాయావిలా'సాది యక్షగాన రచనకు పూనుకున్నారు. పాపరాజుకు నాట్యమంటే అభిలాష. ఉత్తర రామాయణంలో జక్కిణి, పేరిణి మొదలైన నాట్య విన్యాసాలను ఉటంకించాడు. ఇతర ప్రబంధాలలో సవరించిన హల్లీసకాన్ని –

సీ. "అన్యోన్యదండావృత్తు లెసగ నొం
డొరుల సాముఖ్యమ్ము నొందియొంది,
యీవలావల వచ్చి యితరేతరము దొల్త
నిలచిన వెలపుల నిల్చి నిల్చి,
కంకణమంజీర కాంచికల్ మ్రోయ స
వ్యాపసవ్యస్ఫూర్తి చూపి చూపి,
తాళవాద్యరవానుకూలంబుగా మంద 8
దృత మృదు గతులను తిరిగి తిరిగి,

తే.గీ. యనుపమ రసోదయంబున నభినవాతి
చిత్ర వర్తన భంగుల చెలగి చెలగి
విడివడిన మన్మథోన్మద ద్విరదములన
సఖులు హల్లీసకము సల్ప సంతసిల్లి."

అని వివరించాడు. తరువాత కాలంలో ఆంధ్రులలో గాంధర్వవిద్య క్రమక్రమంగా సన్నగిల్లిపోవటం ప్రారంభించింది. ఒకనాడు యావద్భారతంలో ఖ్యాతి వహించిన ఆంధ్రుల సంగీత నాట్య కళాభినివేశం మళ్ళా ప్రాచీనౌన్నత్యంతో నూతన తేజస్సు ఏ నాడు వహిస్తుందో!

*– భారతి, నవంబర్ – డిసెంబర్ 1948*

# దేవీ నవరాత్రాలు - ఆచార వ్యవహారాలు

భారతీయుల సాంఘిక జీవనంలో పండుగలు విశేషమైన ప్రాధాన్యము అనాదికాలం నుంచీ వహిస్తూ ఉన్నవి. ఆ పండుగల్లోని గోష్ఠుల మూలంగానూ, ఇతరములైన కార్యకలాపాల వల్లనూ సంఘంలోని వ్యక్తులలో సమష్టి జీవనం అభివృద్ధి పొందుతూ వచ్చింది. జాతీయ జీవనాన్ని పెంపొందిస్తూ ఒకనాడు అనంతవైశిష్ట్యాన్ని చేకూర్చుకున్నవి. అందువల్ల అవి జనసామాన్య ధర్మంలోనూ, మత విషయక జీవనంలోనూ భాగాలై నేటివరకూ నిలచి ఉన్నవి.

హిందువుల ధర్మాలూ, వైజ్ఞానిక ప్రవృత్తీ, నమ్మకాలూ, నిశ్చయాలూ వెల్లడి చేసే పండుగలు అనేకం ఉన్నవి. అట్టివాటిలో సంఘంలోని సమస్త వర్ణాలవారూ ప్రాచుర్యం వహించే పండుగలు కొన్ని మాత్రమే. నవరాత్రాలు అందులో ఒకటి. మకర సంక్రాంతి తరువాత దీనిని అత్యుత్తమమైన పండుగగా భారతీయ ప్రజలు భావిస్తూ ఉన్నారు.

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని దశమి వరకూ వచ్చునవే నవరాత్రాలు. నవరాత్రోత్సవాలు శరత్కాలంలో జరగటం వల్ల శరన్నవరాత్రాలనీ, లక్ష్మి, సరస్వతి, పార్వతి, రాజరాజేశ్వరి మొదలైన దేవీ రూపాలకు ఈ నవరాత్రాల్లో పూజ జరగటం వల్ల దేవీ నవరాత్రాలనీ వీటికి పేర్లున్నవి. సామాన్య ప్రజలు 'దశరా' అని వ్యవహరిస్తున్నారు.

రావణాసురుడు దేవీపూజ వసంతకాలంలో చేసేవాడట. శ్రీరామచంద్రుడు శరత్కాలంలో దేవీపూజ చేసి, రావణవధ చేసినట్లు మహర్షి వాల్మీకి పలికినాడు.

ఈ తొమ్మిది దినాల్లో ఆదిశక్తి మూర్త్యంతరంగా ఉన్న దుర్గాదేవీపూజ జరుగుతుంది. ఐశ్వర్యప్రద అయిన లక్ష్మిని, జ్ఞానప్రద అయిన సరస్వతిని విధియుతంగా ప్రజలు శక్తికొలదీ పూజాదికాలతో కొలుస్తారు. ఆశ్వయుజ శుద్ధ సప్తమినాడుగానీ, అష్టమి నాడు గానీ, లేదా దశమి నాడు గానీ సర్వసామాన్యంగా సరస్వతీపూజ జరుగుతుంది. వేదికమీద గ్రంథాదులను సేకరించి భారతీదేవిని, ఆహ్వానించి,

షోడశోపచారాలతో పూజించటం అనాదికాలంనుంచీ వస్తూ ఉన్న ఆచారం. నవమినాడు లక్ష్మిని ధన, ధాన్య, వస్త్ర, వృత్తి, వస్తురూపాలతో అర్చిస్తారు.

ప్రాచీన కాలంలో రారాజుల ఇళ్ళలో కల్పోక్త ప్రకారంగానే తొమ్మిది దినాలూ దేవీపూజ జరిగేది. అనుదినమూ ప్రభువులు, అమాత్య సామంతాదులతో కొలువు తీర్చి విద్వద్గోష్ఠులతోనూ, సంగీత నాట్యాదికాలతోనూ, కాలం గడుపుతూ విద్వద్వరేణ్యులనూ, శాస్త్రవేత్తలనూ, కళాకారులనూ శక్తిసామర్థ్యాలను అనుసరించి గౌరవించేవారు.

వ్యవసాయమూ, కంచరమూ, కమ్మరమూ మొదలైన వృత్తులు గల సామాన్య జనం, నవమి నాడు వారి వారి వృత్త్యుపకరణాలను లక్ష్మీ స్వరూపాలుగా భావించి, అలంకరించి, శక్తి కొలదీ జాతరలు చేసుకొనేవారు.

పదవ దినము విజయదశమి. ఈ దినాన రారాజులు సింహాసన ఛత్ర చామరాది రాజలాంఛనాలనూ, గజాశ్వాది సేనాంగాలనూ, భక్తియుతులై పూజించేవారు. క్షత్రియుల ఇళ్ళల్లో సర్వసామాన్యంగా ఈ తొమ్మిది దినాలకోసం పూజావేదికను ఒకదానిని నిర్మించేవారు. పూర్వం విశేష ప్రాచుర్యం వహించిన తండుల కుసుమ జలవికారాది కళాకుశలులు ఆ వేదికను అలంకరించేవారు. దానిమీదనే యుద్ధోపకరణాలను, ఛత్రచామరాదులను నిలిపేవారు. ఆ వేదిక మీద నిర్మించిన అగ్ని కుండంలో ఆర్ష ధర్మానుసారంగా సమస్త ఆయుధ దేవతలనూ ఆవాహన చేసి, సమంత్రకంగా వారి ప్రీతికోసం పాయసహోమం చేసేవారు.

పూర్వం రాజకుటుంబాలు విజయదశమినాడు చేసే కర్మలో లోహాభిస్మార మొక చిత్రమైన కర్మ. లోహుడనే రాక్షసుడు లోకభయంకరుడై దేవతలమీద దండెత్తగా, వారు అతన్ని ముక్కలు ముక్కలుగా త్రుంచి వేశారట. అవే నేటి ఆయుధాల కుపకరించే లోహపుముక్కలు. లోహరాక్షసుని అవశిష్ట భాగాలైన లోహపుముక్కలు ఈ అభిస్మార కర్మవల్ల మొక్కపోవని వారి నమ్మకము. ఆయుధ పూజ పరిపూర్తి అయిన తరువాత, ససైన్యంగా అశ్వాలను, గజాలను అధిరోహించి నగరానికి ఈశాన్య దిక్కుగా ఉన్న శమీ వృక్షం దగ్గరెకు వెళ్ళి శమీ పూజ చేస్తారు. వీటి అవశిష్ట రూపాలే నేడు మన పిల్లలు పట్టే విల్లంబులూ, కోతులూ – 'జమ్మికొట్టటము' శమీపూజకు మారురూపంగా నిలచిన ప్రక్రియ.

శమీవృక్షం దగ్గిర మొదట 'అపరాజిత' పూజ జరుగుతుంది. ఆమె దుర్గాదేవి మూర్తిభేదము. అష్టదళపద్మం మీద దక్షిణ వామ భాగాలలో జయవిజయలను

ఆవాహనచేసి పూజిస్తారు. దుర్గా రూపమునూ 'శమీ శమయతే పాపం శమీ శత్రువినాశనీ' అని ప్రతిష్ఠ వహించిన జమ్మి చెట్టు మొదట మన్ను త్రవ్వి నీరుపోసి, అక్షతలు గలిపి తిరిగి వచ్చేటప్పుడు శిరస్సుమీద ధరించి రావటము ఆచారము. పరసీమలో శత్రువుల బొమ్మలనుంచి ధనుష్టంకారం చేసి వాటి హృదయసీమల్లో అమ్ములు నాటి, జమ్మి దాకి నెత్తిమీద ఉంచుకొని తిరిగి వచ్చి విద్వద్గోష్ఠీలోలు రయ్యేవారు పూర్వపు రారాజులు. పాండవుల అజ్ఞాత వాసారంభదశలో ఆయుధాలను కట్టకట్టి మత్స్యపుర ప్రేతభూమిలో ఉన్న జమ్మిమీద ఉంచి వెళ్ళిపోయిన తరువాత, ఉత్తర గోగ్రహణ సందర్భంలో అర్జునుడు గాండీవాన్ని స్వీకరించి విజయాన్ని పొందాడు. (రుద్రుడికి శ్మశాన భూమి విహారస్థానము. ఆయన ఈశాన్యదిశ కధిపతి. అందువల్లనే శ్మశానాలు గ్రామాలకు ఈశాన్య దిశకు చేరువగా ఉంటవి) విజయదశమి నాడు అర్జునుడు శత్రువిజయం చేయటం వల్ల విజయదశమి మహోత్సవాన్ని క్షత్రియులు మహోల్లాసంతో జరిగించేవారు.

నవరాత్రి ఉత్సవాలు చిరకాలం నుంచీ జరుగుతున్నవి. ఒక్కొక్క దేశంలో ఒకవిధంగా నడుస్తున్నవి – అందులోని ఆచార వ్యవహారాలకూ, ఆర్షమైన సంప్రదాయానికీ అనంతవైవిధ్యం గోచరిస్తున్నది. దేవీ స్వరూపాలు భిన్నభిన్నాలైనట్లే పూజావిధానాలు కూడా భిన్నభిన్నంగా ఉన్నవి.

దేవీపూజకు సప్తవిధాలైన కల్పాలున్నవి : 1. నవ్యమాది కల్పము 2. ప్రతిపదాది కల్పము 3. షష్ఠ్యాది కల్పము 4. సప్తమ్యాది కల్పము 5. అష్టమ్యాది కల్పము 5. అష్టమీ కల్పము 7. నవమీ కల్పము. సామాన్యులైనవారు సప్తమ్యాది కల్పాన్నీ, సంపన్నులైనవారు ప్రతిపదాది కల్పాన్నీ అనుసరించి దేవీపూజ చేస్తారు.

ప్రతిపదాది కల్పాన్ని అనుసరించి ఆశ్వయుజ శుద్ధ ప్రతిపత్తునాడు ప్రతిమా కలశస్థాపనాదులు జరిగించి దేవికి కేశసంస్కారాది ద్రవ్యాలను చేకూర్చుతారు. విదియనాడు కేశబంధనం జరుగుతుంది. తదియనాడు దేవికి దర్పణాన్ని అర్పించటమూ, సిందూరము, లత్తుక మొదలైన అలంకరణ ద్రవ్యాలను సమర్పించటమూ జరుగుతాయి. చవితినాడు మధుపర్క సమర్పణమూ, నేత్రాలంకరణమూ చేయవలె. షష్ఠినాడు సాయంసమయంలో బిల్వతరు బోధనము జరుగుతుంది. దేవతలకు దక్షిణాయనం రాత్రి కనుక నిద్రించు దేవిని మేల్కొల్పటమే బోధనము. సప్తమినాడు స్వగృహంలో పూజ, క్రితం దినం షోడశోపచారపూజ జరుగుతుంది. కనుక షష్ఠిని ఉపవాసము, అష్టశక్తి పూజ, నవమినాడు ఉగ్రచండాది దేవీపూజ, బలిదానాదులూ, కుమారీ పూజ

చేయటం ఆచారము. దశమినాడు పూజ అయిపోయిన తరువాత మధ్యాహ్నం మంగళ వాద్యాలతో, ఉత్సవాదులతో దేవీ ప్రతిమను నదీజలంలో నిలిపివస్తారు. దీనినే మహాపూజ అంటారు. పూర్వాచార పరాయణులైన ముత్తయిదువలు 'గౌరమ్మ నీళ్లాట' అని అంటుంటారు.

ఈ కల్పాలను అనుసరించి చేసే పూజ సత్త్వ, రజః, తమోగుణాలను అనుసరించి సాత్త్వికి, రాజసి, తామసి అనే విభేదాలతో ఉంటుంది. సత్త్వరజస్తమోగుణాత్మకమైన ఈ పూజవల్ల, తత్తదర్హమైన శక్తి కలుగుతుంది. సత్త్వగుణ ప్రధానాలైన అవస్థలు మూడు. రజః ప్రధానాలు మూడు. తమఃప్రధానాలు మూడు. సాత్త్విక సాత్త్వికము, సాత్త్విక రాజసము, సాత్త్విక తామసములు సాత్త్వికావస్థలు. ఇదేరీతిగా రజస్తమస్సులలోనూ ఆయా సంబంధావస్థలు ఉన్నవి. వీటిలో శ్రేష్ఠమైన సాత్త్విక సాత్త్వికావస్థ ఉదయించి నప్పుడే వాస్తవమైన దేవీశ్రద్ధ ఉదయిస్తుందట! పూజావిధానాలలో సాత్త్వికము మునికోటికి, రజోయుతాలు రాజకోటికి, తామసములు నిశాచరులకు. దిగ్దేశకాలాదికాలను తెలుసుకొని మంత్రద్రవ్య విప్రసంయుతంగా చేసేది సాత్త్వికము. ఇది అత్యుత్తమము, శాంతి దాంతి స్వభావులకు మాత్రమే ఇట్టి పూజావిధానము లభ్యము. రాజసములలో ద్రవ్య బాహుళ్యముంటుంది. సురామాంసాదులతోనూ, జంతుబలులతోనూ కూడినది తామసి. రాజసిలోనూ ఆమిషముంటుంది. సాత్త్వికంలో నిరామిష నైవేద్య యజ్ఞ పారాయణాదులు ఉంటవి.

దేవీపూజ విషయమున ఉత్తర హిందూస్థానమునకూ, దక్షిణ హిందూస్థానమునకూ విశేషమైన అంతరమున్నది. వారిది సప్తమ్యాది కల్పము. దాక్షిణాత్యులది ప్రతిపదాది కల్పము. ఈ రెంటికీ విశేషమైన అంతరమున్నది. వారిది తామసపూజ; అందువల్ల వారికి తుది మూడుదినాలే ప్రధానము.

ఉత్తర హిందూ దేశంలో పురాణాదులలో వర్ణితమైనట్లు దుర్గారూపమును మృత్తికాదులతో నిర్మించి ప్రతిష్ఠించి పూజ చేస్తారు. ఈ విగ్రహానికి, కుడివైపు సరస్వతీ గణేశుల ప్రతిమలూ, ఎడమవైపు లక్ష్మీకార్తికేయ ప్రతిమలూ ఉంటవి. ఉత్తరదేశంలో మహాకాళీపూజ సప్తమ్యాది కల్పాన్ని అనుసరించి జరుగుతుంది. ఇందులో తామసీవిధానము కనిపిస్తుంది. పశుబలి, మద్యపానము, అశ్లీలభాషణము విశేషము. ఇది కల్ప మన్నను క్షుద్రశక్తుల జాతరల కంటె భీకరమూ, బీభత్సమూ అని తెలుస్తున్నది. దక్షిణ దేశంలో కలశాన్ని స్థాపించి దుర్గాదేవిని ఆవాహన చేసి తొమ్మిది దినాలూ సాత్త్విక విధానాన్ని అనుసరిస్తారు. సరస్వతీ, లక్ష్మీ పూజలు కూడా జరుపుతారు.

దక్షిణదేశంలో బొమ్మల కొలువు మహావైభవంతో జరుగుతుంది. మేల్కట్టులతో ప్రతిమామంటపాన్ని అలంకరించి వింత వింతగా బొమ్మల కొలువులు తీరుస్తారు. బాలికలూ, యువతులూ, అలంకరణం చేసుకొని వీథులు కళకళలాడేటట్లు పేరంటపు కొలువులతో ఈ దినాల్లో కాలం వెళ్ళబుచ్చుతారు.

యోగ్యమైన అధికారం కలిగి యజ్ఞశాలానిర్మాణం చేసి, విధులు తెలుసుకొని దేవీవ్రతం చేయవలసి ఉంటుందని శిల్పగ్రంథాలు పలుకుతున్నవి. హరిహరాదులైన లోక పాలకులందరూ దేవీపూజాతత్పరులేనట. ఈ నవరాత్రి విధానాలకు సంబంధించిన దేవీపూజావిశేషాలు సంప్రదాయ గమ్యాలు. ఒకరి సంప్రదాయాన్ని మరొకరు గ్రహించటం కూడా పాపహేతు వట!

ఇక్కడ దేవీస్వరూపాన్ని కొంతగా సంగ్రహించవలసి ఉన్నది. ప్రపంచము సమస్తమూ ప్రకృతిమయము. ప్రకృతి స్త్రీమూర్తి. ఆదిశక్తి. ఈమెవల్లనే ప్రపంచానికి సృష్టిస్థితి లయాలు ఏర్పడుతున్నవి. సృష్టి స్థితిలయాలకు కారణభూతులైన దేవతల్లో నానానామాలను ధరించి శక్తి ప్రకాశిస్తున్నది. బ్రాహ్మి, వైష్ణవి, గౌరి, వారాహి, నారసింహి ఇత్యాది నామాలతో భాసించే తల్లి పరాశక్తి. అందువల్లనే 'సర్వచైతన్య రూపాంతాం, ఆద్యాం విద్యాం చ ధీమహి, బుద్ధిం యానః ప్రచోదయాత్' అనే దేవీ గాయత్రి. ఈ అర్థాన్నే దేవీభాగవతము 'జగములు సృజింప రాజసీ శక్తియగుచు, జగములు భరింప సాత్త్వికీశక్తి యగుచు, జగము లణపంగ దామసీ శక్తియగుచు, నిన్ను నన్నును హరుని దానిల్పెనంబ' అని పల్కింది.

అంబిక, హైమవతి, కాత్యాయని, సతి, దుర్గ, భద్రకాళి, కాళరాత్రి, చండి మొదలైన నామాలలో ఉన్న రూపాలన్నీ ఆదిశక్తి స్వరూప భేదాలే. అంబికా నామము. శ్రుతులలోనూ, ఉమా, హైమవతీ, దుర్గాదులు ఉపనిషత్తులలోనూ కనిపిస్తున్నవి. ప్రకృతి స్త్రీరూపిణి కావటం వల్ల శాక్తేయులు పెక్కుశక్తులను పూజించే బదులు కేవలం స్త్రీని పూజిస్తారు.

బృహన్నందికేశ్వర పురాణంలోని దుర్గాపూజాపద్ధతిలో సర్వతోభద్రమున నవావరణాలలో 'గుండీ' ననుసరించి పూజాలంకరణం చేసి, విశిష్ట కేతనాలతో జల కలశాలు నిలిపి కోటియోగినీదేవతలను పూజించవలెనని ఉన్నది. కళాకర్మకు సంబంధించిన మయదీపికలో దేవీమూర్త్యంతరాల స్వరూప లక్షణాలు చిత్రితాలై ఉన్నవి. తంత్ర గ్రంథాలను బట్టి ఆదిశక్తి కోటియోగినీరూపాలలో ఇవి ప్రధానాలుగా కనిపిస్తున్నవి. ఇందు కొన్ని సౌమ్యమూర్తులు, కొన్ని అసౌమ్యమూర్తులు. వికృత,

విశ్వరూపిక, యమజిహ్వా, జయంతి, దుర్జయ, యమాంకిక, విరాళీ, ఖేతీ, విజయంతిక, దేవకి, యశోద, నంద, అంబ, సర్వమంగళ, కాళరాత్రి, లలిత, జ్యేష్ఠా, నీలజ్యేష్ఠా, భూతమాత, సురభి, యోగనిద్ర, శ్రీ, చాముండ, చండిక, నవదుర్గ, రౌద్ర, కాళీ, కలవికర్ణీ, బలప్రమథినీ, మనోన్మనీ, కృష్ణా, ఉమా, పార్వతీ, మహాకాళీ, శివరాత్రీ, వారుణీ, శివదూతీ, కాత్యాయనీ, కార్త్యాయనీ, అభయ, అంబిక, యోగేశ్వరీ, భైరవీ, రంభా, శివా, తుష్టీ, సిద్ధి, బుద్ధి, క్షమా, దీప్తి, రతి, శ్వేతా, వైష్ణవీ, ఐంద్రీ, యామ్యా, కౌమారీ, వారాహీ, బ్రాహ్మీ, సరస్వతీ, లక్ష్మీ, సావిత్రీ, సర్వగంధా, గంధేశ్వరి, శక్తి, ఆశా, బృహత్కుక్షీ, సర్వజ్ఞా, వామనీ, భయాతన, ఖగానన, తపనీ, క్రోధన, వమని, మహాక్రూర, లోలుప, హాహారవ, పిశితాశా, బడబాముఖీ, పిశాచి, హుంకార, పిచువక్త్ర, విశాలాక్షి, విమల, చంద్రావళి, లాలస, చంద్రహాసన, లంకేశ్వరి, వరద, లంకా, కాలకర్ణి, లోల, ప్రచండోగ్ర, లయ, మేఘనాద, లీలా, కరంగినీ, బాల, విష్ణుజిహ్వా, క్షయా, రక్తాక్షి, అక్షయ, తాలుజిహ్వక, పింగాక్షీ, సవరాక్షపణ, ససంగ్రహి, వృక్షకర్ణీ, హయాసన, తరళ, తార, అక్షోభ్య.

అంటే ప్రకృతిలోని ప్రతి శక్తినీ ఒక దేవతా రూపంలో ప్రాచీనులు నిరూపించారని ఈ అనంతకోటి దేవతా స్వభావాదులను బట్టి తెలుస్తున్నది. ఆసేతుశీతాచల పర్యంతం విశాలమైన భారతదేశంలో ఉన్న దేవాలయాలలో ఈ దేవతారూపాలు శిల్పాకృతి ధరించినవి. నేడు శిల్పాచార్యులమని చెప్పుకునే అనేకమంది విజ్ఞులకు కూడా అవగతం కానన్ని దేవతామూర్తులున్నవి. తంత్రగ్రంథాలను పరిశీలించి ఈ శిల్పమూర్తుల స్వరూపాదికాలను తెలుసుకోవలసిన విజ్ఞానం విశేషంగా కనిపిస్తున్నది.

ఈ దేవతామూర్తులలో విలక్షణ రూపాలు కలిగిన వాటిని గురించి కొలదిగా ప్రసంగించిన తరువాత, మహిషాసురమర్దని, దుర్గ, కాళీలకు రూపకల్పనావశ్యకతనూ, భావనా వైచిత్రినీ నిరూపించుట సమంజసము. వికృత ఉష్ట్ర వాహన భయకృత మస్తకము మీద శవశకలం ఉంటుంది. 'ముసలం ముద్గరం యావ్యే పరశుం బంధనం తథా, బిభ్రతి యమజిహ్వా స్యాత్ కరాళా మహిషాస్థి' అనేది యమజిహ్వా స్వరూపము. బిడాలీ దేవత రూపము చిత్రాతిచిత్రమైనది. 'శకటస్థాతి ఘోరాస్యా క్షీర వర్ణాయమాంతికా, మార్జారస్థ బిడాలీ చ విశాలాక్షీ భవేత్ సితా' అని ఆమె స్వరూప నిరూపణము. విజయాంతిక దుర్గాపూజలో ఉపవిగ్రహమైన విజయ. అంబను తైత్తిరీయ సంహిత 'ఏషతే రుద్రభాగః సహస్రాంబిక యాతం జుషస్య' అని రుద్రునికి భగినిగా చెప్పుచున్నది. సర్వమంగళ జగద్ధాత్రు లిరువులు నేకరూపలు. కాళరాత్రి స్వరూప ఐన మహామాయను

ధ్యానించినాడట. జ్యేష్ఠా, నీలజ్యేష్ఠ లిద్దరూ లక్ష్మి తోబుట్టువులు. 'తురంగనాసా చ లంబోష్ఠీ లంబమాన స్తనోదరీ, ఆలోహితా స్మృతా హ్యేషా జ్యేష్ఠాలక్ష్మీ రితిశ్రియే' – అని జ్యేష్ఠా లక్షణము. విమల వ్యాఘ్రయాన, చేతియందు కర్తరి కలది. త్రినేత్ర, హుతాశన అగ్నిలోని స్త్రీ శక్తి. విశాలాక్షీ సుందరి. హుంకార మీనవక్త్రమీనగ. బడబాముఖి బడబాగ్ని స్త్రీమూర్తి. 'తర్జన్యాభయ భృత్సౌమ్యే దండకపాలినీ, కృషా హాహారవా క్రూరా రాసభస్య ఖరస్థితా' ఇది హాహారవ రూపము. వంగదేశంలో దుర్గాదేవిని చండికగా భావిస్తారు. దుర్గాపూజ కేర్పరచిన స్థలాన్ని 'చండీతల' మంటారు. పూజను చండీ పూజ అంటారు. యోగేశ్వరిని వంగదేశములోని కొన్ని ప్రదేశాలలో మాత్రమే పూజిస్తారు. కరింగిని క్రోధసుత, ఇదేరీతిగా మిగిలిన దేవతా మూర్తులును కొన్ని సాత్త్వికములు, కొన్ని రాజసికములు, కొన్ని తామసికములు.

ఈ సమస్త దేవతాస్వరూపాలకు మూలము ఆదిశక్తి. ఆమె ప్రథమంలో మహిషాసురుణ్ణి సంహరించటానికి అవతరించింది. రాక్షసమాత దితి కుమారుల అపజయానికి చింతించి మహిషీ రూపంతో బ్రహ్మనుగూర్చి తపస్సు చేసి మాయావి, శూరుడైన మహిషాసురుని కన్నదట. నాడు దేవతలకు దుర్నిరీక్షుడై, బాధలు పెట్టు సమయంలో దేవతలందరూ విష్ణుదేవుని చేరుకుంటే, వారి ఆలోచనాసమయంలో వారి శరీరాలనుంచి తేజోరూపాన వారి అంశాలు బయలుదేరి, సుందరాకార, ఆభరణభూషిత, అత్యుజ్జ్వల అయిన మహాదేవి అవతరించింది. ఆమె అష్టాదశభుజ. బ్రహ్మాది దేవతలు వారి వారి ఆయుధాలను ఆమె కిచ్చారు. ఇంతలో మహిషాసురునికి రాత్రి కల ఒకటి వచ్చి అందులో దేవి తన్ను సంహరిస్తున్నట్లు తెలిసికొని, నిరంతరమూ 'నా శరీరము నీ పాదాలకు అంటి ఉండేటట్లు ప్రసాదింప మని కోరగా, అతణ్ణి మహాదేవి ఉగ్రచండ, మహాకాళి, దుర్గ – అనే మూడు మూర్తులతో రూపుమాపి మహిషాసురమర్దని ఐంది.

పూర్వం తపశ్శక్తితో ముల్లోకాలనూ జయించిన రురుని కుమారుడగు దుర్గుని శక్తికి తాళలేక, దేవతలు శివుని శరణుచొచ్చారట. శివుడు దుర్గుని సంహరించటానికి (శాంభవీశక్తిని) మహాదేవిని కోరగా ఆమె కాళరాత్రిని పంపించినది. కాళరాత్రి హుంకారాగ్ని మూలాన అతని సైన్యాన్ని నాశనం చేసింది. దుర్గుడు కాళరాత్రితో పోరాడుతూ వింధ్యాద్రివరకూ వచ్చి, దేవిని చూసి మోహించి భార్యగా కోరాడు. ఆమె క్రూరదృష్టితో అతని సేవకులను చెండాడిన తర్వాత, దుర్గుడు గజరూపాన్ని ధరించి పోరాడగా ఆ గజాన్ని ఖండించిన తరువాత, మహిషరూపాన్ని పొంది దుర్గుడు

పోరాడాడు. దేవి త్రిశూలంతో అతణ్ణి పొడిచి సహస్రబాహువులతో ప్రత్యక్షమైన అతణ్ణి చంపి 'దుర్గా' నామాన్ని వహించింది.

కాళీతంత్రంలో మహాకాళీరూపాన్ని ఇలా నిరూపించారు. 'అతిభయంకర. కరాళదంష్ట్ర, చతుర్భుజ, ఒక చేత కపాలము, ఒక చేత ఖడ్గము – ఒకటి, వరదహస్తము. ఒకటి అభయహస్తము. శివశక్తి, దిగంబర, కరాళ జిహ్వా. కాలాధిదేవత – మహాకాలునికి స్త్రీ మూర్తి. జగత్తు కాలంలో లయ మొందినప్పుడు సమస్తమూ శివము కాని శవము. జగన్నాశనము చేసిన ఏకైక వీరగా ఆమె భయంకర స్వరూపంతో నిలుస్తుంది. వికటాట్ట హాసము, విజయ ఘోరహాసము. నాలుగు హస్తాలు కాలంలో లయం పొందే నాలుగు దిశలు. ఖడ్గము వినాశసాధనము. తొలగిన తల విజయచిహ్నము. అమృతత్వంలో ఆనందమున్నది. వరదహస్తము కాలాధిదేవతయైన ఆమెకున్న దానయోగ్యతానిరూపణ లక్షణము. నగ్నత్వము సత్యము మాయావరణ రహితమైనదని నిరూపించు గుణము. చితి జగచ్చితి. కాలాధి దేవత ఐన ఆమె కాలకర్ణ, అంటే జగత్తులోని సమస్త రూపాలూ, వర్ణాలూ, లయ మొంది, కాలరాత్రి స్వరూపయైన ఆమెలో లయం పొందుతవని అభిప్రాయాన్ని మహాకాళీ రూపకల్పన నిరూపిస్తున్నది.

దుర్గాదేవి విగ్రహ రూపానికి కూడా ఇటువంటి అర్థాన్ని ప్రతిపాదించి పూర్వులు నిరూపించారు. దుర్గ పరబ్రహ్మము. త్రిశూలము జ్ఞానము, ఆమె వాహనమైన సింహము మహిషాసురాదులు కామక్రోధాదులు, త్రినేత్రాలు త్రికాలాలు, లక్ష్మీసరస్వతులూ, వినాయక కార్తికేయులూ చతుర్విధ పురుషార్థాలట. అందువల్ల దేవీపూజ వల్ల సాధకుడు పురుషార్థసాధన మూలాన జ్ఞానాన్ని సంపాదించుకొని, కామ క్రోధాదులను ధ్వంసం చేసి త్రిపురనాశకుడు, సర్వవ్యాపి అయిన పరమాత్మను తెలుసుకొంటాడు – అని దుర్గాపూజ అంతరార్థము.

(శరన్నవరాత్రి పూజావిధానాన్ని గురించీ, దేవీ స్వరూపాన్ని గురించీ విశేషంగా తెలుసుకోవటానికి భారతి – రక్తాక్షి ఆశ్వయుజమాసము సంచికలోని 'శరన్నవరాత్రాలూ' భారతి – ఆంగీరస అశ్వయుజమాస సంచికలోని 'నవరాత్రి పూజ', గృహలక్ష్మి – ఆంగీరస సంచికలోని 'దసరా ఉత్సవము'లను చూడ గోరుతాను, దేవీ కథాదికాలను గురించి శ్రీ మాధవరామశర్మ శ్రీదేవీకథలు ఆంధ్రభాషలో విశేష పరిచయం కలిగించగల పుస్తకాలు.)

***– ఆంధ్రపత్రిక – 1948 అక్టోబరు 6***

# దీపావళి

ఆశ్వయుజ మాసం శరన్నవరాత్రులతో ప్రారంభిస్తుంది. అంతటా దీపావళి మహోత్సవాలు జరుగుతవి. భారతదేశంలో సమస్తజనం సంతోషంతో పాల్గొనే పండుగల్లో దీపావళి ఒకటి. అతిముఖ్యమైనదని కూడా చెప్పవచ్చును. ఒక కవీంద్రు డన్నట్లు –

సీ. “ఒక దివ్వె వెలుగంగ నుజ్జ్వలంబయి భార
తీ దివ్యరేఖ దీప్తించెననగ,
ఒక సంచు మ్రోయగా నుత్తమ భారతి
జయభేరి మ్రోగిన సరణిదోప,
ఒక చిచ్చుబుడ్డి యాగక ముత్యముల్ చిమ్మ
భారత రత్నముల్ ప్రబలెననగ,
ఒక చువ్వ మింటికి సెక దీసికొని పోవ
భరతశోభలు మిన్ను ప్రాకెననగ,

తే.గీ. అన్ని యొకమారు తోపగానన్ని యొక్క
మారుతోచినయట్లయి మారుమ్రోగ
భరతవర్షంపు గీరితి పరిఢవిల్ల
వెలుగు దీపావళీ దివ్య విభవ మవని.”

భారతదేశ కీర్తివ్యాపకాలైన మహోత్సవాలలో దీపావళికి అగ్రస్థానం.

దీపావళి అతి ప్రాచీనమైన పండుగ. మధ్యయుగంలో వచ్చింది కాదు. ఈ పండుగకు సంబంధించి జనశ్రుతిలోనూ, భాగవతాది పురాణాలల్లోనూ కొన్ని కథలు కనిపిస్తున్నవి. ధర్మసంస్థాపనార్థం ఉజ్జయినీసంస్థాన సింహాసనాన్ని విక్రమాదిత్య గుప్తుడు ఆశ్వయుజ మాసంలో దీపావళినాడు అధిష్ఠించినాడని చరిత్రజ్ఞులంటున్నారు. ఆ నాటినుంచి విక్రమశకం ప్రారంభించింది. అందువల్ల ఆ నాటి విదేశీయ సంప్రదాయాలకూ, క్రూరయాతనలకూ, పరిపాలనకూ తల వొగ్గి బాధపడలేక బయటపడిన భారతీయ ప్రజ, ఆనందంతో ఎత్తిన దీపహారతులే నేటి దీపావళికి

మూలమని కొందరి అభిప్రాయం. ఆ రాజన్యుడు విక్రమాదిత్యుడూ, గుప్త వంశస్థుడూ, ముఖ్యపట్టణము ఉజ్జయినీ, నూతన శకారంభం – వీటినిబట్టి ఈ విధంగా ఊహించటానికి అవకాశం లేకపోలేదు.

దీపావళి శబ్దానికి దీపపు వరుస అని గానీ, సమూహము అని గానీ అర్థం చెప్పవచ్చును. ఈ పండుగ లక్ష్మీదేవి (ఐశ్వర్యాధిదేవత) లేదా భవానీ దేవి ఆధిక్యమును నిరూపించటానికి ఏర్పడ్డ పండుగగా కనిపిస్తుంది.

పూర్వం ప్రాగ్జ్యోతిషాధిపతి అయిన నరకుడు వరమాహాత్మ్యం వల్ల ఇంద్రపదవిని పొంది ముల్లోకాలనూ చీకాకు పరచినప్పుడు, శ్రీకృష్ణుడు ఇంద్రాది దేవతల మొరవిని అతనితో యుద్ధం చేసి, అతణ్ణి రూపుమాపి అతని చెరలో ఉన్న పదహారు వేలమంది గోపికలనూ విడిపించి వివాహమాడినట్లునూ, అతని విజయసూచకంగా దీపావళీ మహోత్సవాలు జరుగుతున్నట్లు పురాణాలవల్ల తెలుస్తున్నది.

వంగ దేశస్థులు ఈ పండగను దుర్గాపూజ, కాళీపూజ అని వ్యవహరిస్తారు. అర్ధరాత్రి వేళ ఆ దేశస్థులు గృహద్వారతోరణాలనూ, నదీతీరాలనూ, దీపావళులు వెలిగించి పూజ చేస్తారు. ఈ సందర్భంలో వారు పూజించే దేవత కాళరాత్రి – మహామాయ. మార్కండేయ పురాణంలోని దేవీమహాత్మ్యంలో ఈ శక్తిని గురించి 'కాళరాత్రి ర్మహారాత్రి శ్చ దారుణా' అని చెప్పి ఉంది. ఇతర పుస్తకాలలో 'దీపావళి తయా ప్రోక్తా కాళరాత్రిస్తు సా మతా' అని కనిపిస్తున్నది. దీపావళి నాటి రాత్రి మహారాత్రి కాళరాత్రి. ఆ నాటి పగలు కాలవేలము లేదా వారవేలము. వ్యాపారస్థులు కొత్త చిట్టాలు ప్రారంభిస్తూ, అతిశయమైన వైభవంతో పూజాపునస్కారాలూ, గృహాలంకరణలూ జరుపుతారు; వారిలో కొందరు కొద్ది రోజులల్లోనే 'దివాలా' తీస్తారు. అందువల్ల ఒక ఉర్దూకవి 'ఐసీ ఆయీ థీ దివాలీ కి దివాలా నికాలా' అని చమత్కరించాడు.

నరకాసుర వధ వంటి పౌరాణిక గాథలు కొన్ని కనిపిస్తున్నా దీపావళికి విశేషమైన మతసంబంధము గానీ, తాంత్రిక సంబంధము గానీ కనిపించటం లేదు. అందువల్ల దీనిని కొందరు అతి ఆధునికమైన పండుగగా భావిస్తున్నారు. దీపావళి ముఖ్యంగా సూర్యగమనంలో కలిగిన ఒక మార్పును సూచిస్తున్నది. ఈ నాడు ఆ గ్రహరాజు తులారాశి (Libra) లో ప్రవేశిస్తున్నాడు. బార్హస్పత్య మానాన్ని అనుసరించే ఔత్తరాహులకు కార్తిక ప్రతిపత్తునాటితో నూతన సంవత్సరం ఆరంభిస్తుంది.

తులారాశి చిత్రార్థము, స్వాతి, విశాఖ, 3/4లో ఉన్నది. అశ్వని మొదలుకొని విశాఖ ఉన్నవరకూ ఉన్న నక్షత్రాలు ఉత్తరార్ధ గోళంలో ఉన్నవి. అయితే క్రాంతి వృత్తంలోని నక్షత్రాలు విశాఖ మొదలుకొని దక్షిణార్ధంవైపు మరలుతూ ఉన్నవి. ఇక్కడ ఒకవిధమైన శాఖాంతరం ప్రారంభించటం వల్లనే ఈ చుక్కలకు విశాఖ అనే పేరు వచ్చినట్లు కనిపిస్తున్నది. తుల అంటే సరిగా తూచి పంచేది అని అర్థము. సూర్యుడు ఈ రాశిలో ప్రవేశించగానే శీతోష్ణాలు ఎక్కువ తక్కువ లేకుండా సరిసమానంగా ఉంటవి. అదేరీతిగా దివారాత్రాలు కూడాను. తుల మధ్యదేశాధిపతి శిబి అగ్ని పరీక్షకు ఆగిన మహాపవిత్రస్థానము. చాల్డియా, అసీరియా, అకేడియా దేశాల వారు కూడా ఈ రాశిని 'తుల్కు' అని అంటున్నారు; దానికి కూడా తుల అనే అర్థము.

విశాఖ నక్షత్రమే రాధ. విష్ణుస్వరూపుడైన శ్రీకృష్ణుని ప్రియ. అయన ఘోషుని భార్య. శరత్తులోనే కృష్ణభగవానుడు స్థావర జంగమాత్మికమైన చరాచర ప్రకృతి సమస్తమూ ముగ్ధ మయ్యేటట్లు మోహన వేణుగానం చేసింది. 'భూసతికిన్ దివంబునకు పొల్పెసగంగ శరత్సమాగమం బాసకల ప్రమోదకరమై ఒప్పుచున్న' దని మహాకవులు ఈ కాలాన్ని గురించే చెప్పినారు కూడాను.

ప్రాణికోటిని మొరవెట్టేటట్లు చేసిన 'నరకుని సంహరించి ఇంద్రునికి (మేఘాధిపతి) సంతోషం కలిగించి, పారిజాతము (సముద్రంలో పుట్టినది) ను తీసుకొని రావటమూ సమస్తమూ ఒక రీతిగా కాలములోని మార్పును సూచించే సంజ్ఞాత్మకమైన కథనం (Symbolic expression) గా కనిపిస్తున్నది.

దీపావళి జైనులకు కూడా గొప్ప పండుగ. అయితే వారికి 'నరకాసుర వధా'ది పౌరాణిక దృష్టిలేదు. వారి దృష్టిలో ఇది ఐశ్వర్య సంబంధి. జైన వ్యాపారస్థులు ఆనాడు ధనపూజ చేస్తారు. వారూ ప్రమిదలలో – దీప పంక్తులుగా ఏర్పరచి – హారతులు తీర్చి దిద్దుతారు. జిన దేవుని నిర్వాణానంతరం అతని శిష్యులు పదునెనిమిది మంది రాజులూ ఒక గొప్ప సభ చేసి, 'జ్ఞాన దీపం (జినదేవుడు) వెళ్ళిపోయినాడు. కనుక మనము భౌతికపదార్థ దర్శనార్థం దీపాలను పెట్టి వెలిగిద్దామని' నిశ్చయించారట. ఆ నాడు మొదలు నేటివరకూ దీపావళినాడు వారు దీపావళీ సముత్సాహంలో పాల్గొంటున్నారు. వారికి దీపావళి నాలుగు దినాల పండుగ. మూడవ దినాన్ని మహావీరుని (జినదేవుడు) నిర్వాణదినంగా భావిస్తారు. మొదటి దినము ఇంట ఉన్న లక్ష్మీతుల్యాలని భావించే విలువైన పదార్థాలనూ, ప్రతిమలకు 'పులికాపు' చేసి, రెండవ

దినము 'మిఠాయి' పంచిపెట్టి పేదసాదలకు సంతోషం కలిగించి, మూడవ దినం దస్తరాలను పూజిస్తారు. సాయంత్రం శారదాపూజ చేస్తారు. 'మిఠాయి' పంచి పెట్టటం వల్ల దుష్టశక్తులకు తృప్తి కలిగిస్తున్నామని వారు భావిస్తారు. శారదాపూజనాడు సర్వసామాన్యంగా జైనవర్తకులు పురోహితుణ్ణి పిలిపించి అతనిచేత పూజ చేయిస్తారు. అతడు దస్తరాల మీద 'శ్రీ' వ్రాస్తాడు. అది మేరుపర్వత రూపంలో ఉండవలెనని నియమం. అందువల్ల ముఖ్యంగా బేసి సంఖ్యగా ఉంటుంది. దస్తరం మీద ఒక పాత 'రౌప్యము' ఉంచి పూజిస్తారు. దాన్ని సంవత్సరాంతం వరకూ చలామణి అయ్యే ధనంలో కలపరు. అది అధికదనం తెచ్చి యిచ్చే వస్తువని వారి నమ్మకం. మరుసటి దినం బంధువులూ, స్నేహితులూ కలిసి క్రొత్త గుడ్డలు కట్టుకొని సద్గోష్ఠితో, సంగీత వ్యాపారాలతో కాలక్షేపం చేస్తారు.

హిందువులకు 'దీపావళి' దినం లోపరహితమైనది. మొదటిసారిగా అల్లుణ్ణి తీసుకోరావటానికిగానీ, చిన్నపిల్లలకు విద్యాభ్యాసం ప్రారంభించటానికీగానీ, వ్యాపారారంభానికి గానీ అంతకంటే మంచిదినం మరొకటుండదని వారి అభిప్రాయం. ఇటువంటి సందర్భాలలో జ్యోతిష్కుని పిలిపించి ప్రశ్నించ వలసిన అగత్యం లేదు.

దీపావళి వస్తుందనగానే ఇళ్ళకు వెల్ల వేయించి పసుపుకుంకుమలు పెట్టి రమ్యంగా అలంకరిస్తారు. ఆ నాడు భారతీయు లెరిగిన రేఖా శాస్త్రమంతా వ్యక్తమయ్యేటట్లు అంతర్గృహాలలోనూ, బాహ్య తోరణ ప్రదేశాలలోనూ చిత్రాతి చిత్రమైన రంగవల్లికలను తీర్చిదిద్దుతారు. ప్రాచీన కాలంలో ఈ నాడు గృహాలంకరణం కోసం తండుల కుసుమ బలివికారాదులైన కళలను స్త్రీలు ప్రత్యేకంగా అభ్యసించేవారని తెలుస్తున్నది. తోరణాలు కట్టటము ప్రాచీన భారతీయులు ఒక కళగా అభివృద్ధి పొందించారు. రాజనగరాలలో 'కలువడాలతో' స్తంభ వీథులను 'దీపావళి' పండుగనాడు అలంకరించేవారట. నరక చతుర్థినాడు తెల్లవారు జామున లేచి తలంటు స్నానం చేస్తారు. ఇది నరకాసురుడు చనిపోతూ కోరుకున్న కోరికట. అతని మృత్యు దినాన లోకంలో జనమందరూ అభ్యంగనం జేసి నూతన వస్త్రాలను ధరించేటట్లుగా వరమీయవలసిందని శ్రీకృష్ణుని కోరుకున్నాడట. పిండివంటలతో తృప్తికరమైన భోజనం చేసి, మర్నాడు కొత్త అల్లుళ్ళకి నూతన వస్త్రాలు కట్టబెట్టి ప్రొద్దు కుంగగానే మతాబులు, ఔట్లు, కాల్చుకుంటారు. 'భారతీ భాగ్య ప్రభావం' ఇటువంటిదని నిరూపించేటట్లుగా ఉంటుంది ఆ నాటి సౌభాగ్యము. అందువల్ల ఆ నాటి వెలుగును చూసి ఒక కవి –

సీ. “వెలిగించుచుందురు విమలార్యమానినీ
తిలకంబు లెల్లెడ దీపరాజి,
పట్టించుచుందురు ప్రమదామణుల్ నిజ
సుతులచే దివటీలు పతులు చూడ
ప్రేలించుచుందురు వివిధంబులౌ బాణ
సంచులు బాలురు సంబరమున,
కట్టించుచుందురు కమనీయ వస్త్రముల్
క్రొత్త యల్లుంద్రచే నత్తమామ

తే. లాత్రపడుచుందు రెల్ల రా రాత్రమందు
పరమ తేజోమయంబగు ప్రకృతి జూడ
భారతీ భాగ్యరేఖా ప్రభావ మిటులు
వెలుగు నన దోచు దీపాళి విధము గనగ.”

అని అన్నాడు.

ఔత్తరాహులు వెలిగించే దీపావళికి మరొక అభిప్రాయం ఆధారం. సుఖప్రసూతలు కాలేక మరణించినవాళ్ళూ, బలవన్మరణాన్ని పొందిన వాళ్ళూ భూతరూపాలతో తిరుగుతుంటారని వాళ్ళ నమ్మకం. వారిని పారద్రోలటానికని వారు దీప సమూహాన్ని వెలిగిస్తారట!

దీపావళి మహోత్సవాలలో మందు సామాన్లు కాల్చటం బాబరు చక్రవర్తితో ప్రారంభించింది. అందువల్ల ప్రమిదల్లో దీపాలు వెలిగించటమే ప్రధానంగా భావించే అలవాటు కనిపిస్తున్నది. కన్యకలు తాళపత్రాలతో గుమ్మటాలు చేసి దానిలో దీపం పెట్టి, గిరగిరా త్రిప్పుకుంటూ పాటలు పాడుతారు. గ్రామసీమలలో చొప్పకట్టలు కట్టి ఊరి బయట త్రిప్పి చివరకు అన్నిటినీ ఒకచోట చేర్చి నరకాసురుణ్ణి దగ్ధం చేసివచ్చినట్లుగా తిరిగి వస్తారు. దీపావళి పండుగ సయాం దేశంలో కూడా జరుగుతుంది. వారూ కార్తిక మాసంలో మనవలెనే ఆకాశదీపాలు ఉంచుతారు. బోర్నియోలో కూడా దీపావళి ఒకనాడు జరిగినట్లు పురాతత్త్వవేత్తలు చెబుతున్నారు. తూర్పు బోర్నియోలో కుటై నదీప్రాంతాన ‘మౌర కామన్’ అనే ప్రదేశంలో బయటపడ్డ క్రీ.శ.400 నాటి సంస్కృత శాసనం మూలంగా, ఆ దేశపురాజు ‘మూలవర్మ’ చరిత్ర బయట పడినది. అందులో అతని దానాలు పేర్కొన్నారు. దీపమాలికలతో తిలా పర్వత దానం చేసి ఆకాశదీపాలు ముఖ్యపట్నంలో – దీపావళి మహోత్సవానంతరం

– నిలిపినట్లు తెలుస్తున్నది. మనదేశంలో అక్బరు చక్రవర్తి దీపావళీ మహోత్సవాలలో పాల్గొన్నట్లు ఐనీ – అక్బరీ వల్ల వ్యక్తమౌతున్నది.

ఈ రీతిగా పరిశీలిస్తే దీపావళికి పౌరాణిక, ఖగోళ, చరిత్రాత్మక ప్రాధాన్యమున్నట్లు అవగత మౌతున్నది.

"భరతామప యద్రపో ద్యోః పృథివి క్షమా
రపో మో షు తే కిం చనామమత్" 59–10 ఋగ్వేదము

'భూమ్యాకాశాలు ఏకమై లజ్జాకరమైన అన్యాయవర్తనాలు తల ఎత్తకుండా మొదలంట నాశనం చేసి, పక్షపాతాలను నిర్మూలించి తుడిచివేయును గాక! ఏ పాపాలూ ఏ దుఃఖాలూ మిమ్మల్ని అంటకుండు గాక!'

*– ఆంధ్రపత్రిక – 1948 నవంబరు 3*

# సంక్రాంతి - సూర్యోపాసన

"బ్రహ్మస్వరూప ముదయే
మధ్యాహ్నేతు మహేశ్వరమ్ ।
సాయం ధ్యాయే త్సదా విష్ణుం
త్రిమూర్తిశ్చ దివాకరః ॥"

'వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి. వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి.' సంక్రాంతి మూడుదినాల పండుగ. ఆంధ్రులూ, తమిళులూ ఈ పండుగను మిగిలినవాటికంటే విశేషంగా గౌరవిస్తారు. దేశాచారాలు ఎన్ని విధాలుగా మారినా ప్రధానోద్దేశం మాత్రం సూర్యోపాసన. సంక్రాంతి పండుగ ముఖ్యంగా కాలంలోని మార్పును సూచిస్తుంది. సూర్యభగవానుడు సంక్రాంతి నాటికి ఉత్తర దిక్కుగా ప్రయాణం ప్రారంభించి (డిసెంబరు 21) రెండు వారాలు దాటి ఉంటుంది. కానీ ఉత్తరాపథానికి ఆది అయిన మకరంలో పుష్య శుద్ధ పూర్ణిమ (జనవరి 14) నాడు గాని ప్రవేశింపడు. అందువల్ల ప్రాచీన కాలంనుంచీ సూర్యుని ఉత్తరాయణమును సంక్రాంతినాటినుండే పరిగణించటం భారతీయ సంప్రదాయం.

ఆంధ్రదేశంలో 'కన్యకలు' ధనుర్మాసారంభం నుంచీ 'గొబ్బిళ్ళు' పెట్టుకుంటారు. ఇంటి ముందు రంగవల్లికలు తీర్చి, గోమయంతో అర్ధగోళాకృతులుగా 'గొబ్బిళ్ళు' చేసి పసుపు కుంకుమలతో అలంకరించి, పూల గొడుగులతో నిలుపుతారు. వీటిని చూస్తుంటే పురాతన బౌద్ధ స్తూపాలు జ్ఞప్తికి వస్తుంటవి. స్తూపానికి 'గొబ్బ' అనే పర్యాయపదం ఒకటి బౌద్ధ సాహిత్యంలో కనిపిస్తుంది. దానికి, 'గొబ్బి'కీ సన్నిహిత సంబంధం ఉన్నదని ఊహింపవచ్చును. అనాది కాలంలో బౌద్ధమత ప్రాబల్యం మూలంగా ఇది మన దేశంలో నిలిచి ఉంటుంది. కొందరు ప్రాతఃకాలంలో సగం ఉదయించిన సూర్యుణ్ణి చూచి స్థపతి (Architct)) స్తూపరూపాన్ని చిత్రించి నిర్మించాడని అభిప్రాయ మిచ్చారు. బౌద్ధుల కాలపు స్తూపారాధనము (సూర్యారాధనము) తరువాత హిందూ సంఘంలో గొబ్బి పూజగా ఏర్పడి ఉంటుందని నా అభిప్రాయము. ఇది ద్రావిడ సంప్రదాయమనీ, ఆంధ్రదేశంలోకి ప్రాకివచ్చిందనీ కొందరు సాంఘిక శాస్త్ర వేత్తల అభిప్రాయం ఒకటి ఉన్నది. (M.N. Srinivas's - Folk Songs, Journal of the

University of Bombay Vo. XVIII part I) వీటి పౌర్వాపర్యాలను గురించి చరిత్రకారులు చర్చింపవలసి ఉంది.

ఆంధ్రదేశంలో ఈ సంక్రాంతి పండుగ మూడు దినాలను భోగి, సంక్రాంతి, కనుమ పండుగ లంటారు. భోగినాడు తెల్లవారక ముందే 'భోగిమంటలు' వేసుకొని తలంటి పోసుకుంటారు. ఇవి బలిచక్రవర్తి ఏలుబడిలో ఉండే దినాలని ఒక నమ్మకం కూడా ఆంధ్రదేశంలో ఉంది. ఇది ఇంద్రసంబంధమైన పండుగనీ, వర్షాలూ, చలీ అంతం పొందించినందుకు అతనిని పూజించటమనీ కొందరి అభిప్రాయం. భోగినాటి సాయంత్రం బొమ్మలు పెట్టిస్తారు. ఇది బాలబాలికలకు పూర్వకాలంలో చిత్రకళ, శిల్పకళలతో పరిచయం కలిగించటమని భావించవచ్చును. ఆ నాడే 'గవిరమ్మ'లు పెట్టి ముత్తయిదువలు మూడునాళ్ళూ చందన తాంబూలాది సత్కారాలతోనూ, పూజా పునస్కారాలతో పూజించి కనుమనాడు సాయం కాలం నదులున్నచోట నదుల్లోనూ, లేకపోతే వాపీ కూపాదుల్లోనూ ఓలలాడిస్తారు. అంతకు ముందు మేళతాళాలతో ఊరేగింపు జరుగుతుంది.

'గవిరమ్మ పూజ' ఆశ్వయుజ మాసంలో జరగవలసిన పండుగ. గవిరమ్మ కృషికి అధిదేవత. ఆమెను పూజించటము భంగ్యంతరముగా చంద్రోపాసన. ఆయన కృపవల్ల పంటలు బాగా పండినందుకు కృతజ్ఞత చూపిస్తూ కార్తిక పౌర్ణమి నాడు ఉపవాసం ఉండి, 'చంద్రపూజ' చేయటము ఆర్య సంప్రదాయము. కర్షకులు 'గవిరమ్మ' పండుగను అతివైభవంగా జరుపుతారు. భోగినాడు రాత్రి ఒక రవికగుడ్డ, బియ్యం మోయిన, దక్షిణ తాంబూలంతో కమ్మరి ఇంటికి వెళ్ళి, అతడు అంతకుముందు నిర్మించి ఉంచిన సంక్రుమయ్య విగ్రహాలను మేళతాళాలతో తీసుకోవచ్చి, పండుగనాడు, కనుమనాడూ పూజించి గౌరమ్మతోపాటు ఓలలాడిస్తారు. భోగినాడు సాయంత్రం బిడ్డలకు పళ్ళు పోసి ముత్తయిదువలకు వాళ్ళచేత తాంబూలాలిప్పించి దీవెనలు పొందుతారు. కనుమ పండుగతో ప్రారంభించి నూతన వధువులు సావిత్రీ గౌరి నోములు ప్రారంభించి తొమ్మిది దినాలు తొమ్మిది నైవేద్యాలతో, అనేక నియమాలతో శ్రద్ధాభక్తులతో చేస్తారు. పుట్టింటి పాక శాస్త్ర విజ్ఞానాన్ని నేర్చుకోవటమా ఇది అనిపిస్తుంది – నేడు కొంచెం ఊహించేవాళ్ళకు ఈ సావిత్రీ గౌరీ నోములు. అకలంక పాతివ్రత్యము దీనికి ముఖ్యోద్దేశం. ఆ సందర్భంలో సావిత్రి ఆదర్శమూర్తి.

సంక్రాంతి పండుగను పితృదినంగా పెద్దలు భావిస్తారు. ఆ నాడు తర్పణాదికాలు వదిలి పెడతారు. శ్రద్ధాభక్తులతో 'సావిత్రి' జపిస్తారు. పూర్వరాజన్యులు హేమాద్రివ్రత ఖండంలోని దానాలు చేసేవాళ్ళు. ఆంధ్రదేశంలో రాజులు వేయించిన దానశాసనాలలో

విశేషభాగం సంక్రాంతి పుణ్యకాలంలో జరిగినవై ఉంటవి. ఎంతటి పేద ఐనా, వైదికుడైనా ఆ నాడు తిలతర్పణాలు విడిచి అధమం ఒక కూష్మాండాన్ని దానం చేసుకుంటాడు. ఇది విశ్వాండానికి ప్రత్యామ్నాయమైన దానం. జగత్సంజ్ఞ (Symbol). సంక్రాంతినాడు 'పొంగలి' చేసుకొని గౌరమ్మకు, సంక్రమయ్యకు, ఇతర దేవతలకు నైవేద్యం పెట్టటం కనిపిస్తున్నది. 'పొంగలి' ఒక భోజ్యవిశేషము.

అరవలు సంక్రాంతిని 'పొన్‌గల్' అంటారు. 'పొంగలి' పండుగకు మొదటి నామమై, తరువాత ఆ నాటి భోజ్యపదార్థానికి పేరై ఉంటుంది. 'పొన్' శబ్దానికి బంగారు అని అర్థము. 'సంక్రాంతి'ని 'బంగారు కాంతులు' అని వారు వ్యవహరిస్తారు. ఆ సూర్యుని 'హిరణ్మయునిగా' గణించటం వైదికము. వారు 'తైపొంగల్' అంటారు. తై (మాఘం) నెలలో సంక్రాంతి రావటం దీనికి కారణము.

తమిళ దేశంలో పూజాగృహాలలో చక్రాకృతిగా సూర్యుని సంజ్ఞను ఏర్పరచి ఆయన్ను నారాయణస్వరూపుణ్ణిగా పూజిస్తారట. కొత్త పంటలు రావటమూ, దానికి సూర్యుడు కారకుడని భావించటమూ దీని తాత్పర్యార్థంగా వారిలోనూ కనిపిస్తుంది. 'పొంగల్' పండుగ మర్నాటి దినాన్ని తమిళులు 'మాట్టు పొంగల్' అంటారు. అంటే పశువుల పండుగ. వారి పంటకు కారణం అయిన పశువులను వారు పూజిస్తారు. వాటికి స్నానం చేయించి పసుపుకుంకుమలతో అలంకరించి పూజ చేసి హారతులిచ్చి గోవుల పాటలు, నంది పాటలూ పాడుతారు. తెలుగు దేశంలోనూ నందిపాటలు 'వీథి వీథులంట విడువరమ్మ మా నందినీ శివనందినీ' ఇత్యాదులు – వినిపిస్తుంటవి. 'రాగల్లుదున్న' పాట ఇటువంటిదే. సంక్రాంతికి తమిళదేశంలో కృషీవలుడు 'కోడె పందాలు' వేస్తుంటాడు. బాగా మేపి పందాలు కట్టి తవెటు, డోళ్ళు, మద్దెలలతో ఉత్సాహాలు కల్పించి కోడెలను పోట్లాడిస్తారు. ఇవి చూచి తీరవలసినవి. 'మాట్టు పొంగల్' పండుగలో 'జల్లికట్టు' చాలా ప్రళయంగా ఉంటుంది. కొంత ధనం సంచిలో పోసి మదించిన కోడె కొమ్ముకు కట్టి దానిని వశపరచుకున్న వాళ్ళకు దానిని బహుమతిగా ఇస్తారు. ఇందుకోసం అనేకులు బలశాలురు వచ్చి గాయాలకూ, రక్తస్రావాలకు ఓర్చి, పశువులను లొంగదీసి బహుమతులు పుచ్చుకుంటారు. సంక్రాంతినాడు ఆంధ్ర గ్రామాల్లో కోడిపందాలు జరుపుకోవడం తెలిసిందే.

**'ఆంధ్ర'లో 'కోడిపందాలు'**

పొంగలి పండుగ మూడవనాడు తమిళ దేశంలో 'కన్నెల పాటలు' స్త్రీలు పాడుతారు. ఇందులో ముఖ్యంగా కన్యలు పాల్గొంటారు. మూడవదినం ఉదయమే

లేచి మామిడితోపులకు వెళ్లి అక్కడ ఉన్న ఏడుగురు కన్నెరాళ్ళ దగ్గిరకు వెళ్ళి, పూజ అయిన తరువాత చక్రాకృతిగా చేరి, చేతులతో తాళం వేస్తూ పాటలు పాడుతారు. వాటినే 'గుమ్మి తట్టర పాట్టు' అంటారు. వంగి (కన్నెలకు) చప్పట్లు చరుచు పాటలని వీటి అర్థము. ఈ కన్నెలు ఎవరనే విషయంలో అభిప్రాయభేదాలున్నవి. వీరు ఎందరు అనేవిషయంలోనూ అభిప్రాయ భేదం ఉంది. కొన్నిట్లో ఏడుగురు అని కనిపిస్తున్నది. కన్నెపాటల్లో 'ఇంద తెరువిలే ఆరుకన్ని, అంద తెరువిలే ఆరు కన్ని' అనే పాటలవల్ల పన్నెండు మందిగా వ్యక్తమౌతున్నది. కొందరు వీరు ప్రకృతి శక్తులన్నారు. జైగన్ బాల్ అనే శాస్త్రజ్ఞుడు 'శక్తినుంచి ఏర్పడ్డ నూతన శక్తులు' అన్నాడు. (Geneology of South Indian Gods, B. Ziegenbalg - Translated into English by G.J. Metzger, Madras - P P 36-7) కొందరు ఈ కన్నెలను బ్రహ్మ విష్ణు మహేశ్వరుల ప్రకృతి శక్తులన్నారు. కొందరు 1. మారెమ్మ, 2. ఎల్లమ్మ, 3. అంకాలమ్మ, 4. భద్రకాళి, 5. పిండారి, 6. చాముండ 7. దుర్గ, 8. పురన్నై 9. పుడికాళైలన్నారు. ఇందులో చివరి ఇద్దరూ అయనారు భార్యలట. తమిళ నిఘంటువు వీరు ఏడుగురు అక్క చెల్లెళ్ళనీ, వరుసగా పితామణి, నవయాని, మోక్షేశ్వరి, కౌమారి, వారాహి, రుద్రాణి అని చెపుతున్నది. వీరు సంస్కృత సాహిత్యంలోని సప్తమాతృకలు.

దక్షిణ భారతంలో కనుపించే ఆచార వ్యవహారాలలో కొన్ని ఆర్యసంప్రదాయాలూ, కొన్ని ద్రావిడ సంప్రదాయాలూ కనిపిస్తున్నవి. ద్రావిడ సంప్రదాయాలలో విశేషాలన్నీ అరవ దేశంలో కనిపిస్తవి. ఒక రచయిత ఉద్దేశాన్ననుసరించి 'ఉత్తర సర్కారుల వారు అరవదేశం నుంచి గొబ్బిపూజ, పొంగలి నైవేద్యము గ్రహించినారు. వారు 'మాట్టు పొంగల్' ను గ్రహించలేదు. కడప, చిత్తూరు జిల్లాలకు, తమిళ దేశానికి దగ్గర సంబంధం ఉండటం వల్ల అక్కడ పశువుల పండుగ కూడా కనిపిస్తున్నది. కన్నడులు 'పొంగలి'కి పశుపూజను గ్రహించారు. కాని ధనుర్మాసంలో 'గొబ్బిపూజ' ను, అక్కడి గొబ్బిపాటలను నృత్యాన్ని గ్రహించలేదు. కాని గొబ్బి, ఆంధ్రదేశం నుంచి తమిళ దేశానికి వెళ్ళినట్లు కనిపిస్తుంది. బౌద్ధం ఆంధ్రంలో వ్యాపించినట్లు తమిళ దేశములో లేదు. గొబ్బి పాటలు తెలుగుదేశంలో విశేషంగా కనిపిస్తున్నవి.

సంక్రాంతి పండుగను ఉత్తరాయణ పుణ్యకాలం అని ఆంధ్రులు వ్యవహరిస్తారు. 'అయన' శబ్దానికి మార్గమని అర్థము. 'రషాభ్యాం నో ణస్సమానపదే' అనే పాణినీయసూత్రం వల్ల 'అయణము' ఔతుంది. సూర్యుడు పన్నెండు రాశుల్లో ప్రయాణం చేయటానికీ పన్నెండు నెలల కాలం పడుతుంది. అయన కటకాది నుంచి మకరం వరకూ దక్షిణంగానూ, మకరం నుంచి కటకం వరకూ ఉత్తరంగానూ పయనిస్తాడు.

అందువల్ల జ్యోతిష శాస్త్రజ్ఞులు సూర్యదేవుని మార్గాన్ని ఉత్తరాయణమూ, దక్షిణాయనమూ అని రెండు విధాలుగా విభాగించారు. 'పంచపాదం పితరం ద్వాదశాకృతం దివ ఆహుః పరే అర్ధే పురీషిణమ్, అథేమే అన్య ఉపరే విచక్షణమ్ సప్తచక్రే షడర ఆహు రర్పితమితి' (ఋగ్వేదము 1-164-12). (కొందరు ఇతణ్ణి అయిదు పాదాలు పన్నెండు రూపాలు ద్వాదశమాసాలు కలిగిన పిత అనీ, ఏడు చక్రాలూ ఆరు ఆరాలు (షడృతువులు) కలవాడనీ, వర్ష ప్రదాత అనీ అంటారు) దీనిని బట్టి సూర్యుడు ప్రాణమనీ, కాలకర్త అనీ, విభక్త అనీ, జగత్పిత అనీ భారతీయులు ఋగ్వేదకాలంనుండే గ్రహించినట్లు అర్థమౌతున్నది. ఈ శ్రుతి ప్రమాణానికి అనుగుణంగా ప్రశ్నోపనిషత్తులోని 'సంవత్సరోవై ప్రజాపతిః, తస్యాయనే దక్షిణాం చోత్తరం చ తద్యేహవై తదిష్టాపూర్తే కృత మిత్యువాసరే, తే చంద్రమస వేన – లోకమభి జయంతే, తమేహ పునరావర్తతే, తస్మాదేతి ఋషయః ప్రజా కామా దక్షిణం ప్రతి ప్రతిపద్యంతే, ఏషహవై రయిర్యః పితృయాణః' (ప్రశ్నోపనిషత్తు ప్రథమ ప్రశ్న 9. సంవత్సరము ప్రజాపతి ఉత్తర దక్షిణాలు. అయన మార్గాలు. ఇష్టా పూర్తమొనర్చినాడు. చంద్రలోకాన్నీ చేరుతాడు. ఇది పితృయానము.) ఉత్తర ప్రయాణాన్ని దేవయానంగా చెప్పినారు. అందువల్లనే అది పుణ్యకాలం అయింది. 'శుభాన్ని' కలిగించేది కాబట్టి పుణ్యము. ఆదిత్యోహవై ప్రాణో; రైరేవ చంద్రమా (ఆదిత్యుడు ప్రాణము; పదార్థము చంద్రుడు) అని శ్రుతి ప్రమాణాలు కనిపించటం వల్ల, భీష్మాదులు ఉత్తరాయణ పుణ్యకాలంలో మృతి పొందటం వల్ల పునర్జన్మ కలగదనే భావంతో దానిని ఆశించి నిరీక్షించారు. సూర్యుడు ఉత్తరాయణం వేళ జ్యోతిస్సును లోకానికి ప్రసాదించటం వల్ల పుణ్యనదుల్లో స్నానమూ, కూష్మాండాది మహాదానాలూ అలాంటి వేళ చేయటం యుక్తమని ఆర్యులు భావించారు. ఇటువంటి విజ్ఞానంతో ఎవరైతే ఆయనను పూజిస్తారో, భావించి, దర్శిస్తారో వారికి పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందట. 'అథోత్తరేణ తపసా బ్రహ్మ చర్యేణ శ్రద్ధయా విద్యాత్మాన మన్విష్యాదిత్య మభిజయన్తే' అనేది దీనికి ప్రతి ప్రమాణము.

పతంజలి యోగశాస్త్రాన్ని లోకంలో ప్రవేశపెట్టిన తరువాత, ఈ ఉత్తర దక్షిణాయనాలు రెండూ సూర్య సంబంధమైన ఆదిత్యుని పరంగా అందులో ప్రవేశించినవి. కాశీ ఖండంలో మహాకవి శ్రీనాథుడు యోగశాస్త్ర విషయకమైన ఉత్తరాయణ దక్షిణాయన విభేదాన్ని క్రింది రీతిగా నిరూపించినాడు. 'ప్రాణంబ ఆదిత్యుండు ఆదిత్యుండ చంద్రుండు... ఇడా నాడియందు చంద్రుం డధివసించి యుండుం గావున నందు పవనం బుద్గమించు కాలంబు రాత్రి. ప్రవేశించు కాలంబు పగలు. పింగళానాడియందు సూర్యుం డధివసించుగావున మకరాయన సమయంబున

దక్షిణ దిగవస్థితుండగు సూర్యుండు కర్కటాయన పర్యంతంబు నుత్తరంబు నడుచుటం జేసి ఉత్తరాయణం బయ్యె. ఈ చందంబున నుత్తరంబు పింగళాస్థితుండగు పవనుండు యావత్కాలంబు నిడయందు సంక్రమించునంత కాలంబుత్తరాయణం బీ ప్రకారంబున దక్షిణాయనంబు నెఱుంగునది. ఇది స్కాందపురాణ రహస్యము. మానవుని ప్రాణ ముద్గమించునట్లు జగత్ర్పాణమైన సూర్యుడు నాక్షమునుండి బయలు దేరినాడు. తిరిగి నాక్షమును చేరినచో సూర్యగోళముండదు.'

సంక్రాంతిని ఉత్తరాయణ సంక్రాంతి అనటమే కాక సంక్రమణము అని అనటమూ కద్దు. 'సంక్రుమయ్య' సంక్రమణానికి ప్రతీక. ప్రతిమా రూపాన్ని పొందిన దేవత. సంక్రమణ శబ్దాన్ని యోగశాస్త్రపరంగా మహాకవి శ్రీనాథుడు కాశీఖండంలోనే 'మొదల సుషుమ్న జొచ్చు నిడబుట్టిన గాడుపు కొంతసేపునం బిదప సుషుమ్న బుట్టిన సమీపము జొచ్చునిడాఖ్య నాడికన్, మొదల పిమ్మటన్ బవనముల్ తిరుగంబడి చొచ్చు గాన, నయ్యదనులు సంక్రమంబులని యాడుదురాగమ తత్వకోవిదుల్' అని అన్నాడు. సూర్యుడు దక్షిణ మార్గాన నడుస్తున్నప్పుడు, ఆయన కిరణాలవల్ల పుట్టిన గాలులు ఉత్తరాపథాన నడవటం ప్రారంభించిన తరువాత పుట్టిన గాలులతో తిరగబడి పోరాటం వల్ల సంక్రమణం ఏర్పడుతుంది.

మకర సంక్రాంతిని భారతదేశంలోని కొన్ని ప్రాంతాలవారు అజసంక్రాంతి అని కూడా వ్యవహరిస్తారు. ఋగ్వేదంలో ఇంద్రుడు చేసిన అనేక ఘనకార్యాలలో ఒకటి, ఒక మేక చేత పులిని చంపించటం. అది 'అధ్రేణ చిత్తద్వేకం చకా సింహ్యం చిత్వేత్వే నాజఘూనం' (Viii–18–17) అన్న సూక్తం వల్ల తెలుస్తున్నది. ఇది ఒకానొక జ్యోతిషాంశానికి పూర్వ ఋగ్వేద కవులు కల్పించిన కవితాస్వరూపమని నేటి భారతీయ, జ్యోతిష శాస్త్రవేత్తల అభిప్రాయము. సింహరాశి అస్తమిస్తేగాని అజరాశి (మకరం) ఉదయించదు. పూషుని రథాన్ని అజము లాగినట్లు ఋగ్వేదంలో అనేక వర్ణనలు కనిపిస్తున్నవి. ఇది కేవలం అజము కాదు; కొంత మీనము; కొంత అజము. అందువల్ల మన్మథుడు (ధనుస్సు) మొదట మీనకేతనుడు; తదుపరి అజము – మకరంగా భావితం కావటం ప్రారంభం కాగానే మకరకేతను డైనాడు.

సంక్రాంతి సూర్యోపాసన, 'రావణునితో యుద్ధం చేస్తూ అలసిపోయిన రామచంద్రునికి అగస్త్యులవారు ఉపదేశించినట్లు, ఆదిత్య హృదయాన్ని, మహర్షి వాల్మీకి చెపుతూ ఆదిత్యుడు సమస్త' మని చెప్పినాడు.

'సర్వదేవాత్మ కోహ్యేషు తేజస్వీ రశ్మిభావనః ।
ఏష దేవాసుర గణాన్ లోకాన్ పాతి గభస్తిభిః ॥

ఏష బ్రహ్మే చ విష్ణుశ్చ శివస్కంధః ప్రజాపతిః ।
మహేంద్రో ధనదః కాలో యమస్సోమోహ్యాపాంపతిః ॥

పితరో పసవస్సాధ్యో హాశ్వినౌ మరుతో మనుః ।
వాయుర్వహ్ని ప్రజాప్రాణా ఋతుకర్తా ప్రభాకరః ॥'

అని పలికి 'సూర్య ఆత్మా జగతస్తస్థు ష శ్చ' అన్న శ్రుతి ప్రమాణాన్ని ప్రపంచీకరించాడు. ఆ అభిప్రాయాన్నే సంధ్యావందన మంత్రం 'హిరణ్య వర్ణాశ్శుచయః పావకా, యాసు జాతః కశ్యపోయా స్విన్ద్రః యా గర్భం దధిరే విరాపాస్థాన అపశర్మ్యధ్ స్యోనాభవంతు (బంగారు రంగులు కలవీ, పరిశుద్ధము లైనవీ, పావనం చేసేవీ, వేని యందు సూర్యుడు, ఇంద్రుడు పుట్టినారో, ఏ పరమాత్మ అగ్నిని గర్భాన ధరించినాడో, విశ్వరూపి ఐన ఆ పరమాత్మ మాకు శుభాలు ఇచ్చుగాక!' అంగీకరిస్తున్నది.

ఋగ్వేదంలో 'ఆదిత్యవర్గం' కనిపిస్తున్నది. అందులో సూర్యుడు తప్ప తక్కినవారు జ్యోతిర్గోళ స్వరూపాన్ని పొందినట్లున్నది. కొన్ని సందర్భాలలో వారు సూర్యునికి పర్యాయనామములుగా వర్ణితులైనారు. ఋగ్వేదం (మం. VII 36–2) సూర్యుడు, సావిత్రి ఉషానాథులనీ, (మం. VII ఋ75–5) సూర్యుడు అదితి పుత్రుడనీ ఉన్నది. సావిత్రీమైత్రేయులు అదితి పుత్రులట. (మం. VIII 18–3; 11–271). సూర్యుడు ఏడు గుర్రాల రథాన్ని ఎక్కి వస్తాడని (VII–60–3), సావిత్రి రెండు గుర్రాల రథము ఎక్కుతాడట (మం. 1–35–2). వీరు దుస్స్వప్న దోషాపహర్తలనీ, పిశాచాలను పారద్రోలగలవారనీ (X–37 (4) 1–3–6) ఉన్నది. ఈశోపనిషత్తులో వర్ణితుడైన పురుషుడు ఆదిత్యవర్గంలోని వాడే. తదుపరి ద్వాదశాదిత్యులైనారు. సూర్యుడు విష్ణ్వంశ సంభూతుడైనాడు. విష్ణు పురాణంలోని 'వైష్ణవోం శబరస్సూర్యః అంతర్జ్యోతి రసంపం అయాయాత మోంకారం తస్య తత్ప్రేరకం పరమ్' అన్న వాక్యాలవల్ల సూర్యుడు విష్ణ్వంశ సంభూతుడనీ, ఓంకారము అతనిని ప్రేరేపించగలదనీ తెలుస్తున్నది. క్రమంగా ఆయన సూర్యనారాయణుడైనాడు.

యాస్క సిద్ధాంతాన్ని బట్టి దేవతలు ముగ్గురే. 1. సూర్యుడు, 2. అగ్ని 3. వాయువు. భూలోకదేవత అగ్ని అంతరిక్ష దేవత వాయువు, ద్యులోక దేవత సూర్యుడు. మిగిలినవారు సూర్యునివల్ల ఉద్భవించినట్లు నిరుక్తం నిరూపిస్తున్నది. 'పత్య తేచాగ్ని దిత్య ఉదకం చందమాస్కృతః, శేషాణాం ప్రకృతిం సమ్యగ్వర్ణ్య మాణాం నిబోధత'

అన్న వాయుపురాణ వాక్యం వల్ల (53, 10) సూర్యునికి కారణం జ్యోతి అని అర్థమౌతున్నది. చాక్షుష మనువు కాలంలో అదితికి కాశ్యపునివల్ల విశాఖానక్షత్రాన సూర్యుడు పుట్టినాడనీ, (53,3) వర్షానికి అతడే కారకుడని (51, 21) విష్ణుపురాణ, వాయుపురాణాలవల్ల వ్యక్తమౌతున్నది. ఆదిత్య శబ్దాన్ని యాస్కాచార్యులు 'ఆదత్తే రసాన్ భాసాన్ జ్యోతిషి' అని నిర్వచించారు. పురాణాలవల్ల సూర్యుడికి సుషుమ్న, హరికేశ, విశ్వకర్మ, విశ్వశ్రవ, సంయద్వసు, అర్యవసు, స్వరలనే ఏడు కిరణాలు (సప్తాశ్వాలు) ఉన్నట్లు తెలుస్తున్నది. గురు శనులు సూర్యునిలోని మబ్బులట. బృహత్సంహితలో ఈ వైజ్ఞానిక విషయం నిరూపితమైంది. 'నక్షత్ర గ్రహతారాణా మధి పో విశ్వభావనః తేజస్వీ, ద్వాదశాత్మా నమోస్తుతే' అన్న విష్ణుపురాణ వాక్యం వల్ల (10-40) కాలాధినాథుడుగ సూర్యుడు ధ్యానితు డౌతున్నాడు.

సూర్యుణ్ణి గురించి అనేక ఇతిహాసాలు వేదాల్లోనూ, పురాణాలలోనూ కనిపిస్తున్నవి. ఋగ్వేదంలో (175-4) ఇంద్రుడు సూర్యుని రథ చక్రాలను గ్రహించినట్లు ఒక గాథ ఉంది. రాహు కేతువుల గ్రహణము రామాయణములో ఉన్నది. సూర్యునికి 'సూర్యా' అనే కుమార్తె ఉన్నట్లును, ఆమె అశ్వినీ దేవతలతో కలిసి వారి రథము మీద తిరిగినట్లు ఋగ్వేదమున అనేక స్థలములందున్నది. ఆమెకు పూషునితోనూ, చంద్రునితోనూ సంబంధమున్నట్లు (మం. VI ఋ 58-4) తెలియుచున్నది.

సూర్యుడు కవి ఐనట్లు ఋగ్వేద మంత్రము లున్నవి. యాజ్ఞవల్క్యునికి వేదార్థములను బోధించాడట. సూర్యుడు 'సంజ్ఞ'ను వివాహమాడగా నామె అతని ప్రతిభను సహింపలేక 'ఛాయ' యను పరిచారికను అతనికిచ్చి, అరణ్యములకు పోయి ఆడగుర్రపు రూపము పొంది ఉండగా సూర్యుడు మగ గుర్రమై ఆమెతో విహరింపగా అశ్వినీ దేవతలు జన్మించినట్లు ఒక ఇతిహాసమున్నది. సంజ్ఞాదేవి తండ్రి అల్లుని ప్రతిభను తగ్గించటానికి ఒక కొలత బద్ద నెక్కించి ఎనిమిదవ వంతు తెగగొట్టగా విరిగిన భాగం వల్ల విష్ణుచక్రము, శివుని త్రిశూలమూ, కార్తికేయుడి బరిసె కలిగినట్లు పురాణాల్లో కొన్ని ఇతిహాసాలు కనిపిస్తున్నవి.

భారత దేశంలో అనాది కాలం నుంచీ నానా రూపాల సూర్యోపాసన కనిపిస్తున్నది. ఛాందోగ్యాది ఉపనిషత్తులలోనూ, సౌరమంత్ర పాఠములలోనూ సూర్యకిరణారాధన మున్నది. సూర్యుడు భారతములో అష్టోత్తర నామాలతో కీర్తితుడైనాడు. స్కాందమున సూర్యుని అష్టోత్తరము, గాయత్రీ ప్రభావమూ కన్పించుచున్నవి. 'దైవమైన సావిత్రి

అప్రతిమానమహిమ నాకు ప్రాప్తించుగాక’ అన్నది గాయత్రికి అర్థము. బౌద్ధ జాతకాలాలో సూర్యోపాసన ఉన్నది. బౌద్ధుల స్తూపమే ఉదయసూర్యునికి సంజ్ఞ.

భారతదేశంలోని సూర్యోపాసన వల్ల మొదట కొందరు సౌరులు ఏర్పడ్డారు. వారు క్రమంగా నశించి వైష్ణవులైనారు. ఒరిస్సాలో బౌద్ధం వైష్ణవ ప్రభావం వల్ల మారి సూర్యోపాసనగా మారింది. కోణార్క దేవాలయం భారతదేశ సూర్యదేవాలయాలలో అత్యుత్తమమైంది. భువనేశ్వరంలోనూ, ముల్తానులోనూ మరి రెండు దేవాలయాలు కనిపిస్తున్నవి. ఎల్లోరాలో కేవలం శిల్పమే ఉన్నది.

ఒరిస్సా చరిత్ర వ్రాసిన హంటర్ మహాశయుడు 'Sun-worship in Orissa formed one of the religions into which Buddhism disintegrated, a religion of Vaishnavite type, identified with the Vishnavite dynasty. From the earliest times, Vaishnavaism and Sun worship stand together in close affinity, indeed, in the Vedas, Vishnu who developed into the second diety of the Hindu triad, appears only as a form of the Sun' (Hunter's Orissa pp. 228) ఈ అభిప్రాయాన్నే వెలిబుచ్చినాడు.

సూర్యదేవుని విగ్రహ నిర్మాణ విషయంలో శిల్పశాస్త్రాలు రెండు విధాలుగా ఉన్నవి. రథం మీద పద్మంలో కూర్చునిగాని, నిలుచొని గానీ సప్తాశ్వాలు లాగుతూ ఉన్నట్లు చిత్రితుడు కావలెనని నియమం ఉంది. ముందు అనూరుడు సారథిగా ఉంటాడు. కొన్ని సందర్భాలలో అతని భార్యలు ఇద్దరూ ఉంటుంటారు. ఉష కూడా ఉండవచ్చు, మూడవ భార్యగా. దండ, పింగళులు అతని ద్వారపాలకులు. పింగళుదు, కుంభోదరుడు. కత్తిగాని, మషీపాత్రను గానీ, పట్టుకొని ఉంటాడు. దండుడు చేతిలో కత్తి, దండము, శంఖములలో ఒకదానిని పట్టుకొని ఉంటాడు. మత్స్యపురాణంలోనూ, బృహత్సంహితలోనూ సూర్య విగ్రహాలు నిర్మించేటప్పుడు స్థపతి మోకాలి దగ్గిరనుంచి క్రింది భాగాన్ని చిత్రించకూడదని ఉన్నది. దానికి గొప్ప శాపం విధించారు. (Iconography of Buddhist and Brahminical Sculptures N.K. Bhattasati p. 157) అందువలన ఆ భాగం ఏ సూర్యవిగ్రహానికీ కనిపించదు. కొన్ని సందర్భాలలో నాగులు ఆయన రథాన్ని అడ్డుకుంటున్నట్లు చిత్రిస్తారు. దీనిని గురించి భోజరాజు ఆస్థానంలో ఒక వృద్ధ కవయిత్రి చెప్పిన చాటువులో ‘రథస్యైకం చక్రం భుజగనమితాః సప్తతురగాః, నిరాలంబోమార్గః, చరణవికల స్సారథి రపి, రవిర్యాత్యేవాంతం, ప్రతిదిన మపారస్య నభసః, క్రియాసిద్ధిస్సత్త్వే భవతి మహతాం నోపకరణే’ అని ‘భుజగ నమితా’

అన్న పదం వలన అర్థమౌతున్నది. ఈ నాగులు మందేహరాక్షసులనీ, బ్రాహ్మణుల మంత్రజలాలవల్ల వారు తొలగిపోతారని ప్రమాణాలు కనిపిస్తున్నవి.

సమస్త జగదాధారభూతుడైన ఆదిత్యుణ్ణి భారతీయులు 'జోక్య సూర్యం దృశే బుద్ధితో పశ్యేమ శరదశ్శతం, జీవేమ శరదశ్శతం నందామ శరదశ్శతం మోదామ శరదశ్శతం, భవామ శరదశ్శతం, శ్రుణువామ శరదశ్శతం ప్రబ్రవామ శరదశ్శతం మజీతాస్స్యామ శరదశ్శతం మణభావాలకు ప్రబ్రవామ శరదశ్శత మజీతాస్స్యామ శరదశ్శతం' అని అర్థిస్తుంటారు. ఆయన్నే పరమాత్మ స్వరూపుణ్ణిగా ధ్యానిస్తారు. 'ఉద్యన్త మస్తంయన్త మాదిత్య మభిధ్యాయన్ కుర్వ న్బ్రాహ్మణో విద్వాన్ సకలం భద్ర మశ్నుతే' (ఉదయాస్తమయాలు కలిగి స్వయం ప్రకాశం గల సూర్యుని ధ్యానం చేస్తూ, ప్రదక్షిణం చేస్తూ ఈ సూర్యుడే భగవంతునిగా ఎరిగిన జ్ఞాని సకల శుభాలనూ పొందుతాడు.) అన్న శ్రుతి ప్రమాణాన్ని శిరసా వహిస్తారు.

అడుగో – ఆదికవి; ద్రష్ట –

సీ. 'చిరుసాన బట్టించి చికిలి వేయించిన
గంద్రగొడ్డలి నిశాగహనలతకు,
గార్కొన్న నిబిడాంధకారధారాచ్ఛటా
సత్రవాటికి వీతిహోత్రజిహ్వ,
నక్షత్రకుముదకాననము గిల్లెడు బోటి
ప్రాచి నెత్తిన హస్తపల్లవాగ్ర,
మరసి మింటికి మంటికైక్య సందేహంబు
బరిహరింపంగ బాల్పడ్డ యవధి,

తే.గీ. సృష్టి కట్టట్టు తొలుసంజ చెలిమికాడు,
కుంటు వినతామహాదేవి కొడుకుగుట్టు,
సవితృసారథి కట్టెర్రచాయ దెలుప
నరుణుడుదయించె ప్రాగ్దిశాభ్యంతరమున.'

*– ఆంధ్రపత్రిక – 1949 జనవరి 12*

# శ్రీ వేదవ్యాస

"నమోస్తు తే వ్యాస విశాలబుద్ధే!
ఫుల్లారవిందాయతపత్త్రనేత్ర! ।
యేన త్వయా భారత తైలపూర్ణః
ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥"

వ్యాస భగవానుడు భారతీయ జ్ఞానజ్యోతి. అతడు సమస్త విద్యాసాగరాలను ఆపోశన పట్టిన అగస్త్యుడు. విశాల భారతాన్ని ప్రప్రథమంలో వీక్షించిన దార్శనికుడు. జాతి కంతటికీ ఏకైక సాంస్కృతిక శక్తిని ప్రసాదించిన గురుదేవుడు. వేదవిభాగం చేసి, అష్టాదశ పురాణములను నిర్మించి 'పంచమ వేదమై పరగిన' భారత సంహితను సృజించిన మహిమోపేతుడు వ్యాసుడు.

## వ్యాసుడు : బిరుదము

"విద్యాస వేదాన్ యస్మాత్, వివ్యాస ఏకం వేదం చతుర్ధా" అనే వ్యుత్పత్తులలో దేన్ని గ్రహించినా 'వ్యా' శబ్దం ఈ మహానుభావుడికి వేదవిభాగం (విస్తరణం) వల్ల కలిగిందని తెలుస్తుంది. వేదంలో యజ్ఞ యాగాది క్రతువులకు సంబంధించిన విధ్యర్థవాదక మంత్రాలను విస్తరించటం వల్ల ఆయనకు వ్యాసబిరుదం వచ్చిందని భారతీయ చారిత్రకు లందరూ అంగీకరిస్తున్నారు. యజ్ఞాన్ని నడిపించేవారు హోత, అధ్వర్యువు, ఉద్గాత, బ్రహ్మలు. వీరు యజ్ఞం చేయవలసిన సందర్భాలలోనూ, చేయించవలసిన సమయాలలోనూ చెప్ప వలసిన మంత్రాదులను ప్రత్యేకంగా అనేకమంది మహర్షులు 'వ్యాసునికి' పూర్వమే చేసినట్లు అర్థమౌతున్నది. అందువల్ల ప్రధాన వ్యాసుడైన కృష్ణద్వైపాయన వ్యాసుడికి పూర్వం ఇరువది ఆరుగురు వ్యాసులున్నట్లు వాయు పురాణంలోని 23వ అధ్యాయంం వల్ల తెలుస్తున్నది. బ్రహ్మాండ పురాణంలో నూ, మరి యితర పురాణాలలోనూ శక్తి పరాశరాదులు వ్యాసులని ఉంది. వాయుపురాణంలో ఒక వ్యాసుడు భరద్వాజుడు. ఇదేవిధంగా సామవేదాచార్యు డనిపించుకున్న ద్వైపాయనుడికి కొంతగా పూర్వులూ, పూర్వ వ్యాసులూ అయిన కుధుమి, హిరణ్యనాభ, కౌసల్య, లౌగాక్షులు పురాణాదులవల్ల వ్యక్తులౌతున్నారు.

## వ్యాసుడు : పాశ్చాత్య విమర్శ

పురాణాలలో కనిపించే ఇరువది ఆర్గురి లెక్కను జూచి, వ్యాసనామం మీద చెల్లుబడి ఔతున్న బహుళ గ్రంథజాలాన్ని జూచి ఇతమిత్థమని నిర్ణయించలేక, సంస్కృత వాఙ్మయ పరిశోధన చేసిన పాశ్చాత్య రచయితలు కొందరు వ్యాసుణ్ణి చరిత్రాత్మక వ్యక్తిగా పరిగణించలేదు. హాప్కిన్సు "ది గ్రేట్ ఎపిక్ ఆఫ్ ఇండియా" అనే గ్రంథంలో "In other words there was no one author of the Great Epic, though with not an uncommon confusion of the editor with the author, an author was recognised, called Vyasa. Modern authorship calls him the unknown, Vyasa for convenience, but this Vyasa is a very shadowy person. In fact his name probably covers a guild of revisers and retellers of the tale" అని వ్యాస భగవానుణ్ణి గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచినాడు. కీత్, మేగ్డొనెల్ వంటి పాశ్చాత్య పండితులు స్వల్ప భేదాలతో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు.

## ప్రాచ్యుల అభిప్రాయాలు

కాని చారిత్రక రంగంలో భారతీయులు ప్రవేశించిన తరువాత ఆ అభిప్రాయాలు పరాస్తాలైపోయినవి. భారతజాత్యుద్ధరణ కోసం, ధర్మసమైక్యత కోసం వ్యాస భగవానుడు భారత భూమిలో అవతరించి, శిష్యుల మూలంగా ధర్మస్థాపన చేసిన చారిత్రక వ్యక్తి అని వీరు నిరూపించారు.

మహాభారతములోని శకుంతలోపాఖ్యానంలో దుష్యంతుని కాలంలో కృష్ణద్వైపాయన వ్యాసుడు పదసంహితాసహితంగా అథర్వ వేదాన్ని అధ్యయనం చేసినట్లున్నది. ఆచార్య శంకరులు సూత్ర భాష్యంలో (3.3.32) "తథాహి – అపాంతరతమా నామ వేదాచార్యః పురాణర్షిః విష్ణు నియోగాత్ కలిద్వాపరయోః సంధౌ కృష్ణ ద్వైపాయనః సంబభూవ – ఇతిస్మరంతి" – అని ప్రవచించారు. అందువల్ల అపాంతరతముడనే వేదాచార్యుడూ, ప్రాచీన మహర్షి కలిద్వాపర సంధి సమయంలో కృష్ణద్వైపాయనుడుగా అవతరించాడని ఆచార్య శంకరుల అభిప్రాయము. ఈ అభిప్రాయాన్ని తరువాత కాలంలో పుట్టి అహిర్బుధ్న్య సంహిత (11) అంగీకరించి వాక్పుత్రుడైన వాక్పుత్రుడూ, వాచ్యాయనాపరనాముడూ అయిన అపాంతర తమ మహర్షి ఒకమారు వేదవిభాగం చేసి, విష్ణునియోగం వల్ల తిరిగి వేదవ్యాసుడుగా జన్మించి పునర్విభాగం చేసినాడని పలుకుతున్నది.

## కృష్ణద్వైపాయనుడు – వేదవ్యాసుడు

వైదిక సాహిత్యంలో ఎక్కడా వ్యాసశబ్దం కనిపించదు. తరువాతి కాలములోని తైత్తిరీయారణ్యకంలోనూ, సామవిధాన బ్రాహ్మణంలోని వంగవంశ క్రమంవల్లనూ (Vedic Index II P. 339) కేవల వ్యాసశబ్దమే కాని కృష్ణద్వైపాయన, పారాశర్య శబ్దాలు కనుపించవు. కృష్ణ ద్వైపాయనులు ప్రత్యేక వ్యక్తులని కూడా ఒక అభిప్రాయం చారిత్రకులలో ఉంది. కాని "ఆంధ్ర మహాభారత భగీరథుడు నన్నయ్య భట్టారకుడు కృష్ణ ద్వైపాయన మునివృషభాభిహిత మహాభారత బద్ధనిరూపితార్థ మేర్పడ" రాజరాజు తన్ను భారతాంధ్రీకరణము చేయమని కోరినట్లు వ్రాయటం వల్ల, కృష్ణద్వైపాయనుల నిద్దరినీ ఒక వ్యక్తిగానే స్వీకరించినట్లు కనిపిస్తున్నది. సాత్యవతేయుడే భారత రచయిత అయిన వ్యాసుణ్ణిగా తిక్కయజ్వ భావించి, "సాత్యవతేయ సంస్మృతి శ్రీవిభవాస్పదం బయిన చిత్తముతో" అన్న భారతావతారికతో పలికినాడు. కానీ సాత్యవతేయుడు కౌరవవంశకర్తగాని పంచమ వేదకర్తకాడు. పంచమ వేదకర్త పారాశర్యుడని పార్జిటరు మహాశయుడు అభిప్రాయమిచ్చినాడు. (A.I.H.T.-70) దేశీయ చరిత్రకారుడు భగదత్త వైదిక వాఙ్మయ చరిత్రలో వ్యాసవంశాన్ని సమన్వయం చేయటానికి యత్నించాడు. ఆయన అభిప్రాయాన్ని అనుసరించి "అనాది కాలంలో బ్రహ్మ అనే మహర్షి ఒకడుండేవాడు. ఆయన కుమారుడు వశిష్ఠుడు. వశిష్ఠుని పుత్రుడు శక్తి. శక్తి కుమారుడు పరాశరుడు. అతడు మత్స్యగంధి వల్ల ఒక కానీనుణ్ణి పొందినాడు. అతడే ద్వైపాయనుడు. తల్లి 'కృష్ణ' కాబట్టి అతడు కృష్ణద్వైపాయనుడైనాడు" (పే. 61) కానీ అంత స్వల్పంగా కృష్ణ ద్వైపాయన సాత్యవతేయులను సమన్వయం చేసి ఒకే వ్యక్తి అనటానికి అవకాశం లేదు. పారాశర్యులు నలుగురైదుగురు కనిపించటం వల్ల, వేదవిభాగం చేసిన పారాశర్యుడెవరో ఇంతవరకూ నిశ్చితం కాలేదు. ఇది భావి పరిశోధనలవల్ల నిరూపితమౌతోంది.

## వ్యాసుడు – మహాభారతము

కృష్ణ ద్వైపాయనుడు వేదవిభాగం చేసినట్లు సమస్త పురాణాలూ సాక్ష్యమిస్తున్నవి. ఆయన నాలుగు వేదాలనూ నలుగురు శిష్యులకు – సుమంతుడు, పైలుడు, వైశంపాయనుడు, జైమినులకు – ఒప్ప చెప్పినట్లు మహాభారతం వల్ల వ్యక్తమౌతున్నది. (I.6324; XII 342-13025) అతి ప్రాచీనకాలంనుంచీ భారతదేశంలో జనశ్రుతిలో (Tradition) ఉన్న ఉపాఖ్యానాలనూ, ఇతిహాసాలనూ, కథాగాథలను గ్రహించి అష్టాదశ

పురాణాలను వ్యాసభగవానుడు ప్రవచించాడు. అయినా సమస్త భారత విజ్ఞానాన్నీ ఒకచోట క్రోడీకరించవలసిన అగత్యం కనిపించినది. అప్పుడు 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని అధ్యాత్మ విదులు వేదాంత మనియు, కవివృషభులు మహాకావ్యమని..." ఈ రీతిగా భావనకు యోగ్యమైన భారతాన్ని పలికాడు. భారత రచన పురాణ రచనాంతర మైనట్లు 'అష్టాదశ పురాణాన్ని కృత్వా సత్యవతీ సుతః భారతాఖ్యాన మఖిలం చక్రే తదుపబృంహితమ్' అన్న మహాభారతంలోని (53-70) శ్లోకం వల్ల వ్యక్తమౌతున్నది. ఈ వ్యాసుడు సత్యవతీసుతుడని అంగీకరిస్తే, వ్యాసునకు 1000 సంవత్సరాల వయస్సు ఉంటుంది. కాబట్టి ఈ శ్లోకాన్ని ప్రక్షిప్తం క్రింద కొందరు వ్యాసకృతంగా అంగీకరించలేదు.

## వ్యాసుడు - గురువు

ద్వైపాయనుడు బాల్యంనుంచీ మహావిద్వాంసుడు. అనూచానంగా వస్తూ వున్న ఆచారం ప్రకారం వేదశాస్త్రాలను అధ్యయనం చేశాడు. వైదిక సాహిత్యంలో వ్యాసుడు విష్వక్సేనుని శిష్యుడని కనిపిస్తున్నది. పౌరాణిక వాఙ్మయంలో ఆయన జాతుకర్ణి శిష్యుడు. వాయుపురాణం ప్రథమాధ్యాయంలో

**బ్రహ్మ వాయు మహేంద్రేభ్యో నమస్కృత్య సమాహితః । ఋషీణాం చ వరిష్ఠాయ వశిష్ఠాయ మహాత్మనే ॥**

## వ్యాస శిష్యులు

వ్యాసాశ్రమంలో ఆయన శిష్యులు నలుగురు - సుమంతుడు, వైశంపాయనుడు, పైలుడు, జైమిని, వ్యాసుని పుత్రుడు శుకుడూ ఉండేవాళ్ళు. తండ్రి ఆజ్ఞానుసారంగా శుకుడు సాంఖ్యశాస్త్రం తెలుసుకోటానికి వెళ్ళిపోయినాడు. నలువురు శిష్యుల వేదాధ్యయనమూ పూర్తి అయిన తరువాత వ్యాసభగవానుడు అన్నాడు :

"భవంతో బహుళా సంతు వేదో విస్తార్యతామ్"

('మా శిష్యప్రశిష్యుల మూలంగా లోకంలో వేదం బహుముఖాల వ్యాప్తి పొందుగాక!') - శిష్యులు శైలకానన ద్వీపాలను లెక్కచేయకుండా వేదవ్యాప్తికి వెళ్ళిపోయినారు. నారదుడు వచ్చి "మీ ఆశ్రమంలో వేదాధ్యయనం వినిపించటం లేదు. మీరు ఏదో ఏకాంతంగా చింతాక్రాంతులైనట్లున్నా" రన్నాడు. ఆయన శిష్యవాత్సల్యం అపారం కావటం వల్ల అలా ఉన్నప్పుడు, మహర్షి నారదుడు శుకునితో

కలిసి వేదాధ్యయనం చెయ్యమని చెప్పి వెళ్ళిపోయినాడట! ఆయన ఒక్కొక్క విద్య ఒక శిష్యుని మూలంగా లోకంలో వ్యాప్తి పొందించిన గురుదేవుడు, పరమయోగి, త్రికాలవేదీ. ఈ సమస్తశక్తినీ తపస్సంపన్నతవల్లనే ఆ మహానుభావుడు పొందగలిగాడు. ముందెందరు వ్యాసులో జన్మించినా, వారందరూ చేయలేని పనిని కృష్ణద్వైపాయనుడు ఆ శక్తివల్ల చేయగలిగాడు. అందుకనే అశ్వఘోషుడు బుద్ధచరిత్రలో "వశిష్ఠుడూ, శక్తి ఏ పనైతే చేయలేదో ఆ వంశంలో జన్మించిన వ్యాసుడు దానిని చేశాడు; అతడు సారస్వత వ్యాసుడు" అన్నాడు (బుద్ధ చరిత్ర–48).

వైదిక సాహిత్యంలోనూ, పురాణాలలోనూ కనిపించే ఋషి వంశాల్లో వ్యాస వంశము దొడ్డది. వ్యాసుడు వశిష్ఠసంతతివాడు. ఆయన బ్రహ్మ సూత్ర రచన చేసిన బ్రహ్మజ్ఞాని. భారతీయ విజ్ఞాన గ్రంథకర్త కావటం వల్ల గ్రంథ పీఠం వ్యాస పీఠమైంది. వ్యాసమహర్షి భారత జాతిద్రష్ట, సారస్వతస్రష్ట, దేశంలో ధర్మం లుప్తమైనప్పుడల్లా 'జాగృతి' పొందటానికి దివ్య తేజస్సుతో జయగ్రంథసాగరంలో భాసించే మహోజ్జ్వల మణిదీపం. ఆది గురుదేవుడు.

## ఆయన పూజ గురుపూజ

తన్నప్త్రే చాతియశసే జాతూ కర్ణ్యాయ చర్షయే వశిష్ఠా యైన శుచయే కృష్ణద్వైపాయ నాయ చః

అని ఒకచోటా, మరొకచోట

"తస్మై భగవతే కృత్వా నమో వ్యాసాయ వేధసే! । పురుషాయ పురాణాయ భృగువాక్య ప్రవర్తినే ॥ మానుషశ్చ... విష్ణవే ప్రభవిష్ణవే జాత మాత్రం చయం వేద ఉపతస్థౌ ససంగ్రహః ॥ ధర్మమేవ పురస్కృత్య జాతూకర్ణ్యాదవాప తమ్ । మతి మంథాన మావిధ్య యేనాసౌ శ్రుతి సాగరాత్ ॥ ప్రకాశో జనితో లోకే మహాభారత చంద్రమాః । వేదద్రుమశ్చయం ప్రాప్య సశాఖః సమపద్యత ॥" అని కనిపిస్తున్నది.

## వ్యాసాశ్రమము

మహాభారతం శాంతిపర్వంలో 'గురో ర్మే జ్ఞాననిష్ఠస్య హిమవత్పాద ఆస్థితః' అన్న వాక్యం వల్ల, ఆయన ఆశ్రమం హిమవత్పాద ప్రదేశంలో ఉన్నట్లు తెలుస్తుంది. దీనికి "బదరిక" అనే నామం కూడా వ్యవహారంలో ఉంది. అది బాదరాయణుని వల్ల

కలిగింది. కావచ్చును. వ్యాసుడు కొంతకాలం శిష్యవర్గంతో వారణాసిలో ఉండటం వల్ల దానికి అంతటి ప్రశస్తి కలిగిందని కూర్మ పురాణం పలికింది.

## వ్యాసుడు : వాల్మీకి

వాల్మీకి సామవేద ప్రోక్త. ఆయన "నిషాద క్రౌంచపక్షి" వృత్తాంతాన్ని చూచి, 'వైదిక అనుష్టుప్' ఛందాన్ని కొంత మార్చి, రామాయణ మహాకావ్య నిర్మాణం చేశాడు. కాని ఇతిహాసము గేయరూపకంగా ఉండకూడదు. వైదిక కర్మోపయుక్తంగా వ్యాస భగవానుడు ఆయా కర్మలననుసరించిన అర్థవాదాలకు అనుగుణమైన ఇతిహాసాన్ని వ్రాసి అశ్వమేధ యాగానికి యుక్తంగా నడిపించినాడు. అందువల్ల మహాభారతము జయము. అందువల్ల ఆయన భారత ధర్మాచార్యుడైనాడు. వాల్మీకి రామాయణాన్ని కుశలవులచేత పాడించి యిహంలో వ్యాప్తి పొందించినట్లే, వ్యాస భగవానుడు వైశంపాయనాది శిష్యుల ముఖాన సమస్త రచనలనూ ప్రచారం చేయించారు.

*భారతి – వ్యయ, ఫాల్గునము పే. 107–211*

# సంవత్సరము, ఆది - ఆచారములు

"చతుర్వింశతి పర్వ త్వాం షణ్ణాభి ద్విదశీ ప్రధి ।
తత్త్రిషష్టి శతారం వై చక్రం పాతు సదాగతి ॥" – మహాభారతమ్

చ. "ఋతువున కొక్కరూపు సవరించి అహర్నిశలన్ తెరల్ యథో
చితముగ లేచి వ్రాలగ కుశీలవులై నటియింప ప్రాణి సం
హతి సుఖదుఃఖరంగముల నాదియు నంతములేక సాగు నీ
స్తుతిమదదృష్ట కాల నయచోదన కంజలినిత్తు నర్మిలిన్." – శ్రీ రాయప్రోలు

## 1

ఆంధ్రులకు చైత్రశుద్ధ పాడ్యమితో సంవత్సరాది. మన ప్రాచీనులైన ఆంధ్రులూ, భారతీయులూ అనంతమైన కాలాన్ని ఏ నాడో భావించారు; అది పరబ్రహ్మ స్వరూపమని సిద్ధాంతీకరించారు. సృష్టి స్థితిలయాలు కాలం వల్ల కలుగుతున్నవనీ బ్రహ్మ విష్ణు మహేశ్వరులూ, తదితర దేవతలైన ఇంద్రాదులు కాలనియంత చేత వారి వారి పదవులనుంచి చ్యుతులై పరమాత్మలో లీనమౌతున్నారని భారతీయుల భావన. కాలము, దేశము, వస్తువు – ఈ మూటి చేతా పరిచ్ఛిన్నమైనది ప్రకృతి. పరమాత్మ ఈ మూటిచేతా అపరిచ్ఛిన్నుడు. ఇది మన తత్త్వశాస్త్రజ్ఞుల నిర్ణయం.

జగత్కారణుడైన నారాయణమూర్తి హిరణ్మయ స్వరూపిగా సూర్యమండల మధ్యవర్తియై కాలచక్రాన్ని భ్రమింప జేస్తున్నాడని మన జ్యోతిస్సిద్ధాంతుల సిద్ధాంతం. మహత్తర మేధానిధులైన మహర్షులు బహుకాలం తపించి, చంద్ర సూర్య నక్షత్ర గ్రహ గమనాలను పరిశీలించి, ఇతర జ్యోతిర్గణాలను దివ్యనేత్రాలతో దర్శించి, అనంతమైన కాల స్వరూపాన్ని నిరూపించారు. కాలాన్ని పరిగణించటానికి మానాలను ఏర్పరిచారు. ఈ భారతీయుల కాల విజ్ఞానము నేటి శాస్త్రజ్ఞులను కూడా ముగ్ధులను జేసి జోహారులు అందుకుంటున్నది.

మన భారతీయ కాలమానానికి విస్పష్టమైన ఆద్యంతాలున్నవి. బ్రహ్మ సృష్టితో ప్రారంభము, ప్రళయంతో అంతము. ఈ సృష్టి ప్రళయాలను కలిపి మనం కల్పమని

వ్యవహరిస్తున్నాము. విష్ణు పురాణాదులు "రెండు పరార్థ కాల పరిమితి ఉన్న బ్రహ్మపతనము శ్రీమహావిష్ణువుకు ఒక దిన" మని పలుకుతున్నవి.[1] సచ్చిదానంద స్వరూపియైన పరమేశ్వరుని లీలావిలాసం చేత త్రిగుణాత్మకమైన సృష్టి కలుగుతున్నదనీ, పరమేశ్వరుడు అపరిచ్ఛిన్నుడు కనుక బ్రహ్మతో సృష్టి కాలం ఆరంభమౌతున్నదనీ గమనించిన మన ప్రాచీనులు కాలాన్ని కొలవటానికి నాలుగు మానాలు ఏర్పరిచారు. 1. మనుష్య మానము 2. పితృమానము 3. దేవమానము 4. బ్రహ్మమానము. మనం మానవ లోకంలో నివసిస్తున్నాము. మనకు మానవమానం ప్రమాణం. మనకు మన మానంలోనే చెపితే అర్థమౌతుంది. కనుక మనవారు మానవేతరమైన మానత్రయాన్ని మానవమానంలోనే లెక్కించి చూశారు.

## 2

వాడియైన సూదిమొనతో తామరసదళాన్ని గుచ్చటానికి పట్టే కాలం ఒక త్రుటి. నూరు త్రుటులు ఒక లవము. ముప్పది లవాలు ఒక నిమేషము. పదునెన్మిది నిమేషాలు ఒక కాష్ఠ. ముప్పది కాష్ఠలు ఒక కల – దీనికి ప్రాణము నామాంతరము. ఇది ఒక గుర్వక్షరోచ్చారణకు పట్టే కాలం. ముప్పది కలలు ఒక ఘటి. పది గుర్వక్షరోచ్చారణ కాలం ఒక ప్రాణం. ఆరు ప్రాణాలు ఒక వినాడి లేక విఘటిక. అరవై విఘటికలు ఒక అహోరాత్రము (దినము). పదిహేను దినాలొక పక్షం. రెండు పక్షాలు ఒక మాసం. రెండు మాసాలు ఒక ఋతువు. మూడు ఋతువులు ఒక అయనము. రెండు అయనాలు ఒక సంవత్సరము లేదా సౌరాబ్దము. ఇది మానవమానం!

మానవ మానంలో రెండు పక్షాలున్నవి. ఇందులో శుక్లపక్షం పితరులకు పగలు. కృష్ణపక్షం రాత్రి. అంటే మన మాసం పితరులకు ఒక అహోరాత్ర మన్నమాట. ఇది పితృమానం!!

మానవ మానాన్ని అనుసరించి ఆరుమాసాలు ఉత్తరాయణము. ఆరు మాసాలు దక్షిణాయనము. ఇందులో మొదటిది దేవతలకు పగలు, రెండవది రాత్రి. అంటే మానవుల ఒక సంవత్సరము దేవతలకు ఒక అహోరాత్రము. దీనిని బట్టి మూడు వందల అరువది మానవ వత్సరాలు దేవతలకు ఒక సంవత్సరము. పన్నెండువేల దేవ సంవత్సరాలు దేవతల కొక యుగం. ఇది మనుష్య మానంలో 4,32,000 సంవత్సరాలు. దీనికి మహాయుగమని నామం. ఈ దేవయుగంలో మన కలి 4,32,000, ద్వాపరం 8,64,000, త్రేత 12,96,000 కృతయుగం 17,28,000. వెరసి 43,20,000 సంవత్సరాలు ఇమిడి ఉన్నా యన్నమట. ఇది దేవమానం!!

ఇటువంటి చతుర్యుగాలు లేక దేవయుగం బ్రహ్మకు ఒక దినం (పగలు) రాత్రికూడా అంతే. ఈ కాలానికి 71 రెట్లు మన్వంతరము. అంటే మన డెబ్బది ఒక్క చతుర్యుగ కాలాలు మనువుకు కాలనియతి అన్నమాట. మానవ కాలపు ప్రమాణంలో ఇది 30,67,20,000 సంవత్సరాలు. పదునలుగురు మనువుల కాలం 4,29,40,80,000 మానవ సంవత్సరాలు. వీటన్నిటినీ బట్టి బ్రహ్మమానం క్రింది రీతిగా ఉంటుంది.

| **14 మన్వంతరాలు లేక 1000 మహాయుగాల కాలము** | **మానవాబ్దాలలో** |
|---|---|
| 14 మన్వంతరాలు లేక 1000 మహాయుగాల కాలము | 42,94,08,000 |
| 6 మహాయుగాల సంధికాలము | 2,39,20,000 |
| బ్రహ్మకు పగటికాలము సృష్టికల్పము | 4,32,00,00,000 |
| బ్రహ్మకు రాత్రి కాలము ప్రళయకల్పము | 4,32,00,00,000 |
| బ్రహ్మకు అహోరాత్రమైన దినము (బ్రహ్మకల్పము) | 8,64,00,00,000 |
| 30 కల్పముల బ్రహ్మ మాసానికి | 2,59,20,00,00,000 |
| 12 కల్పాల బ్రహ్మ సంవత్సరము | 31,10,40,00,00,000 |
| 100 సంవత్సరాలు బ్రహ్మ కాయుః ప్రమాణము | 31,10,40,00,00,00,000 |

ఇది బ్రహ్మ మానము. శత సంవత్సరాలున్న బ్రహ్మ పరమాయువుకు మన ప్రాచీనులు 'పర'మని సంజ్ఞ కల్పించారు. ఈ పరానికి రెండు అర్ధాలున్నవి. అర్ధానికి బ్రహ్మవత్సరాలు ఏబది.[2]

## 3

ఈ కాలమానంతో మన ప్రాచీన భారతీయులు బహుకాలం తమ నిత్య నైమిత్తిక కామ్యకర్మలను జరుపుకున్నారు. ఈ నాడు కూడా శుభాశుభకర్మల్లో మనం ఈ మానాన్ని అనుసరిస్తున్నాము. ఈ జయనామ సంవత్సరాదినాడు సదాచార సంపన్నులు ప్రాతః స్నాన సంకల్పం చెప్పేటప్పుడు "శ్రీమహావిష్ణో రాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య బ్రహ్మణః ద్వితీయ పరార్థే శ్వేతవరాహకల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే భరత వర్షే భారతఖండే మేరోః దక్షిణదిగ్భాగే శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే... అస్మిన్ వర్తమానేన జయనామ సంవత్సరే ఉత్తరాయణే వసంతే చైత్రమాసే శుక్లపక్షే

ప్రథమే భానువాసరే...' ఇత్యాదిగా చెప్పుకుంటారు. దీనినిబట్టి మనవారు మనకు ఎటువంటి కాల స్వరూపాన్ని ఏర్పరచిందీ, దాన్ని మనం ఎలా నిత్యజీవితంలో వినియోగించుకుంటున్నదీ వ్యక్తమవుతున్నది.

మనకు నేటి సంవత్సరాదితో ఆరంభమయ్యే జయనామ సంవత్సరం నాటికి చతుర్విధమానాలు ఈ రీతిగా గడిచాయి. సృష్ట్యాదిగా గడిచిన సంవత్సరాలు 1655885054. జయతో 1655885055 ప్రారంభమైంది. ఇప్పటి బ్రహ్మకు ద్వితీయ పరార్ధము. ఆయన 50 సంవత్సరాలు గడిచి ఏబది ఒకటో సంవత్సరం మొదటి దినం జరుగుతున్నది. ఈ దినానికే కల్పమని పేరు[3]. మొదటి దినం కనుక శ్వేత వరాహకల్పము. మొదటి దినంలో పగటివేళ ఘ 13 వి. ఘుడియలు గడిచినవి. స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, చాక్షుస, రైవత, వైవస్వత, సూర్యసావర్ణి, దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మసావర్ణి, రుద్రసావర్ణి, దేవసావర్ణి, ఇంద్రసావర్ణి – ఈ పదునాల్గురు మనువుల్లో ఆరుగురి మన్వంతరాలు గడిచిపోయినవి. ఏడవ దైన వైవస్వత మన్వంతరంలోని డెబ్బది మహాయుగాలలో ఇరువది ఏడు గడిచిపోగా, ప్రస్తుతము నడుస్తున్న 28వ మహాయుగంలోని చతుర్యుగాలలో కృత, త్రేత, ద్వాపరాలు అయిపోయినవి. నాల్గవ దైన కలియుగంలో ప్రథమ పాదం నడుస్తున్నది.[4]

కలియుగానికి 4,32,000 మానవాబ్దాలు. అందులోని ప్రథమ పాదంలో జయనామ సంవత్సరం నాటికి 5054 గడిచిపోయినవి. జయతో 5055 ప్రవేశించింది. ఇక కలిలో శేషాబ్దాలు 426945.

ప్రతి అరవై సంవత్సరాలకూ ప్రభవాది నామాలు చెల్లుతూ ఉండటం ఆంధ్రులందరికీ తెలిసిందే. ఈ అరవై సంవత్సరాల ప్రమాణం దేవతలకు ఒక ఋతువు. ఈ అరవై సంవత్సరాలల్లో జయ, ఇది చాంద్రమానాన్ని బట్టి.

సంవత్సరాల సంఖ్యను చెప్పుకోటానికి అన్ని దేశాలలోను, ఏదో ఒక అబ్దం ఆచారంలో ఉంది. మన దేశంలో ఇటువంటివి షట్శకాలున్నట్లు తెలుస్తున్నది. అవి 1. యుధిష్ఠిర శకము. 2. విక్రమార్క శకము 3. శాలివాహన శకము 4. విజయాభి నందన శకము 5. నాగార్జున శకము 6. కల్కి శకము. యుధిష్ఠిర విక్రమార్కశకాల మధ్యకాలంలో భారతదేశంలో ఏదో ఒక ప్రాంతంలోనైనా సప్తర్షియుగము, మహేశ్వరాబ్దము వాడుకలో ఉన్నట్లు తెలుస్తున్నది.[5] ప్రాచీన భారతదేశంలో స్వర్ణయుగాన్ని కల్పించిన గుప్తుల పేర ఒక శకం కన్పిస్తున్నది.[6] పూర్వపు ఒరిస్సా

లోని కళింగ గాంగరాజులపేర ఒక శకం కొంతకాలముంది. ఈ శకాలలో నేడు ఉత్తర దేశంలో విక్రమార్క శకము, దక్షిణ దేశంలో శాలివాహన శకము వాడుకలో ఉంది. మహమ్మదీయ క్రైస్తవ ప్రభుత్వాల కారణంగా ఫసలీ, క్రీస్తుశకాలు వచ్చినవి.

ఈ జయనామ సంవత్సరము యుధిష్ఠిర శకాబ్దము 3059, శాలివాహన శకము 1876, ఫసలీ 1363–1364. క్రీ.శ. 1954–55 (ఎ.డి)[7] ఆంధ్రదేశంలో వేదార్థ నిర్ణయం చేసిన అద్వైత స్థాపనాచార్యులు శ్రీ శంకరభగవత్పాదులవారి జన్మ నుంచీ, విద్యారణ్య స్వామివారి జన్మనుంచి సంవత్సరాన్ని లెక్క పెట్టడం అనూచానంగా వస్తున్నది. జయ ఆచార్యుల జన్మ నుంచి 2457. విద్యారణ్యావతారాబ్దములో జయ 959.

## 4

ఆంధ్రదేశంలో సంవత్సరము లోక వ్యవహారానికి చాంద్ర సౌరమానాన్ని (Luni-Solar measure) అనుసరిస్తున్నది. సూర్యుడు అశ్వినిలో ప్రవేశించటంతో సౌర సంవత్సరము ప్రారంభిస్తుంది. నేటికి కూడా శేషాచల (తిరుపతి) దక్షిణ దేశంలో సూర్యుడు మేషంలో ప్రవేశించిన నాటినుంచే సంవత్సరాది. వింధ్యకు ఉత్తరాన ఉన్న దేశంలో బార్హస్పత్యమానం ఆచారంగా ఉంది. కార్తికమాసంలో ఈ అబ్దానికి ఆరంభం.[8] ఈ మాన ప్రకారము మన జయ వింధ్యోత్తరవాసులకు ప్లవంగ సంవత్సరము.

సంవత్సరాన్ని గురించి అరుణ కాఠకములలో (3–56) “పంచ పంచస్త త్రివర్త సంవత్సరః” అని మంత్రం కనిపిస్తున్నది. దీని అర్థం 5+50+300 = 355. పంచ పంచస్త పంచదశః : (50×50)+105 = 355. పంచ పంచస్త ఏక వింశః 5×(50+21) = 355 దీనిని బట్టి సంవత్సరానికి 355 దినాలున్నట్లు ఒక లెక్క ఉన్నదన్నమాట. చంద్రుడు భూమి చుట్టూ తిరిగి రావటానికి పట్టే కాలం ఒక నెల. సూర్యుని చుట్టూ ఒకసారి భూమి తిరిగి రావటానికి పట్టే కాలము (Sidereal year) సంవత్సరము.

పన్నెండు చాంద్రమాసాలు కలిపి 291/2×12=356. సౌరవత్సరానికి మూడు వందల అరవై ఐదు దినాల ఆరుగంటల తొమ్మిది నిమిషాల 9 సెకండ్లు. చాంద్ర సంవత్సరానికీ – అంటే 12 చాంద్రమాసాలు పట్టే కాలానికి – సౌర సంవత్సరానికీ ఉన్న తేడాలను దూరంగా ఉంచితే సగటున సంవత్సరానికి 360 దినాలు.

సంవత్సరానికి 360 దినాలైతే మాసానికి 30 దినాలుగల 12 చాంద్ర మాసాలకూ కలిపి కొన్నాళ్ళు తగ్గింది. సౌర వత్సరంలో కొన్ని దినాలు పెరిగినవి. రెంటికీ ఉన్న తేడాను మనవారు 10 ది. 21 గం. 20 ని. 30 సెకండ్లని నిర్ణయించారు.

మనవారు ఋతువులలో విస్పష్టంగా కనిపిస్తున్న సౌర సంవత్సరాన్ని వదులుకోలేక పోయినారు. మరొక వంక శుక్ల కృష్ణ పక్షాలతో చాంద్రమాసము (Lunar month) కనిపిస్తుంటే దాన్నీ వదులుకోలేక చాంద్ర – సౌరవత్సరాన్ని స్వీకరించారు.

## 5

యజ్ఞప్రియులైన ప్రాచీనార్యులకు తిథి, మాస, ఋతు, అయన పరిజ్ఞానము అత్యవసరమైంది. అందువల్లనే ఒక జిజ్ఞాసువు 'జ్యోతిష్య శాస్త్ర దృష్టి'తో చూస్తే యజ్ఞము కాలాన్ని కనుక్కోవటానికి ఏర్పడ్డ పరిశోధనాగారమని భావించారు. యజ్ఞం సంవత్సరం పొడుగునా జరుగుతూ ఉండటం వల్ల యజ్ఞం, సంవత్సరము అనే రెండు పదాలు ఏకార్థసూచకాలైనవి.[9] 'సవన'మనే శబ్దానికి సోమరస సంధానమని అర్థము. ఇది యజ్ఞము. దీనిని బట్టి సావన దినము, మాసము, సంవత్సరము అను వ్యవహారం కల్గింది. కాని 30 సావన దినాల మాసము చాంద్రమాసానికి ఎక్కువ. చాంద్ర మాసము ది. 29 1/4 తో అయిపోతుంది. దీనిని బట్టి పన్నెండు నెలలకు 6 దినాల తేడా వస్తుంది. చాంద్రమాసాలకు ఋతువులకు ఐక్యాన్ని సరిపెట్టటానికే మనవారు అధిక మాసాన్ని కల్పించారు. ఋతుభేదాన్ని పాటించకుండా చంద్రునితో సరిపెట్టుకుంటూ ముసల్మాన్ సోదరులలాగా పోతే, మన వ్యవసాయపు పనులల్లోనూ, దేవపూజ, నిత్య పూజాల్లోను చీకాకు కలుగుతుంది. 360 తిథులను సిద్ధాంతులు 354 దినాలలోకే సర్ది, అవసరాన్ని బట్టి అధిక మాసాలను చేరుస్తూ పంచాంగాలను సవరణ చేస్తూంటారు.

ఆంధ్రదేశంలో చాంద్ర – సౌర భేదాల చేత సంవత్సరం రెండు విధాలుగా ఉందని పైన గమనించాము. అమావాస్య నుంచి అమావాస్యకు ఉన్న కాలం చాంద్రమాసం. పన్నెండు చాంద్రమాసాలు ఒక చాంద్రవత్సరం. సూర్యుడు మేషాది రాశిచక్రాన్ని తిరిగి రావటానికే పట్టే కాలం సౌరసంవత్సరం. ఈ సౌరవత్సరం సాయన నిరయన భేదాలతో ద్వివిధంగా ఉంది. మేషాయనం (మార్చి 20) నుంచి మేషాయనం వరకు పట్టేకాలం సాయన సంవత్సరం. మేష సంక్రమణం (ఏప్రిల్ 13) నుంచి మేష సంక్రమణం వరకు అయ్యేకాలం నిరయన సంవత్సరము. ఆంధ్రుల సంవత్సరం చాంద్రమాసాలవల్ల కలగటం చేత ఆంధ్రుల సంవత్సరం నేడు నిరయన సంవత్సరము.

పూర్వకాలములో ఆంధ్రదేశంలో సాయన నిరయన వత్సరాలు రెండూ వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తున్నది. కాని సాయన వ్యవహారం మధ్యలో లోపించింది. నేడు నిరయనం వాడుకలో ఉండడం వల్ల మేషారంభమైన అశ్వన్యాది మనకు సంవత్సరాదిగా ఉన్నది. కాని యజ్ఞయాగాది క్రతువులకు సాయనవత్సరమే అవసరము. అందువల్లనే బాలగంగాధర తిలక్ మహాశయుడు ఇలా అభిప్రాయమిచ్చినాడు.

''At the present day we on the southern side of Narmada begin the year at the vernal equinox for all civil purposes, but still all the Religious ceremonies prescribed to be performed in the Uttarayana, are performed in Uttarayana beginning with the winter solstice.''[10] అయన చలనాలవల్ల ఇలా రెండు సంవత్సరారంభాలు ఏర్పడి రెండూ రెండు విధాలైన ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నవన్న మాట!

## 6

"సంవత్సరోవత్సరోఽబ్దో హాయనో స్త్రీ శరత్సమాః" సంవత్సరాదిని సూచించే శబ్దాలను అమరుడు ఈ విధంగా పేర్కొన్నాడు.[11] "సమ్యక్ వసంతి ఋతవోఽస్మిన్నితి సంవత్సరః ఽవత్సరశ్చ. ఋతువులు ఇందు బాగా నివసించటం చేత సంవత్సరము వత్సరమనీ, ఆపః దదా తీతివా అబ్దః – జలము నిచ్చునది కనుక అబ్దమనీ, లేదా అన్యతే అధిక మాసేన అబ్దః – అధిక మాసాల చేత విస్తరించేది కనుక అబ్దమనీ, జహాతి ఋతూన్ క్రమేణ వరుసగా ఋతువులను విడిచేది గనుక హాయనమనీ, శీర్యతే జగదనయేతి శరత్ – జగత్తు దీని చేత దుఃఖపెట్టబడుతుంది కనుక శరత్తనీ, సహమాంతి వర్తంతే ఋతవోఽత్రసమాః, సమయంతి జనానితి – సమాః – ఋతువులు దీనియందు కూడి ఉంటవి కనుకనూ, జనులను విహ్వలత్వము పొందిస్తుంది కనుకనూ సమ అనీ సంవత్సరానికి నామాలు కలిగినట్లు విజ్ఞులు వ్యాఖ్యా నించారు. సంవత్సరానికి వర్షమని కూడా మరొక సంజ్ఞ ఉంది.

వీటిని గమనిస్తే, అందులో ముఖ్యంగా అబ్ద, వర్ష, శరత్ శబ్దాలను గమనిస్తే ఒకానొక కాలంలో వర్షంతోనూ, మరొక కాలంలో శరత్తుతోనూ వర్షం ఆరంభించిందా అనిపిస్తుంది.

భారతదేశంలోని ఆర్యుల సంవత్సరారంభ విషయంలో తిలక్ మహాశయుడు సంగ్రహంగా ఇలా పలికాడు.

"The ancient aryans originally commenced their year, which was Luni - Solar, and sidereal, with the Vernal Exquinox, and that when the beginning was changed to the winter solstice both the reckonings were kept up, the one for the sacrificial and the other for civil purposes."[12]

తిలక్ మహాశయుడు భావించినరీతిగా ఆర్యులు చాంద్రసౌర సంవత్సరాన్ని గ్రహించి వసంత చైత్రశుద్ధ ప్రథమతోనో కృష్ణ ప్రథమతోనో సంవత్సరాన్ని ఆరంభించటానికే ముందు మరొక విషయాన్ని విద్వాంసు లూహించారు.[13] వీరి యభిప్రాయంలో కొన్ని వేలవేల యేండ్లకు పూర్వం నాక్షత్రమైన సౌరసంవత్సరం ఒకటి ఉండి ఉండాలి. సూర్యుడు ఒక నక్షత్రంలో బయలుదేరి తిరిగి ఆ నక్షత్రానికి రావటానికి పట్టేకాలము నాక్షత్ర సంవత్సరము. ఈ సౌరవత్సరానికి ఆరంభం ఎప్పుడో చెప్పలేము.

తరువాతి కాలంలో మహా విషువంనాడు సంవత్సరం ఆరంభించి ఉంటుంది. ఈ విషువము ఏటేటా 50 వికలలు వెనుకకు జరుగుతుంటుంది. 950 సంవత్సరాలకు సుమారు ఒక వెనక ఔతుంది. విషువంతో సంవత్సరం ఆరంభించినప్పుడు ఆ నాడే ఉత్తరాయణానికి, ఋతువుకు, మాసానికి, యజ్ఞానికి ఆరంభము.

భారతీయ సాహిత్యంలో కొంతకాలనుంచీ కలుగుతూ వస్తున్న మార్పులను సూచించడానికి తగ్గ నిదర్శనాలు కనిపిస్తున్నవి. పునర్వసుకు నక్షత్ర దేవత అదితి. ఆమెకు అన్ని యజ్ఞాలూ ఆమెతో ప్రారంభించి అంత మొందేటట్లు వరమున్నది.[14] సంవత్సరారంభంతో యజ్ఞాలు ఆరంభించటం ఆచారం కనుక ఇది ఒక సంవత్సరారంభాన్ని సూచిస్తున్నదనీ, అదితి ఆదిత్యులకు తల్లి అనీ, ఆమె దేవయాన పితృయానాలను ఏర్పరిచి ప్రథమ నక్షత్రంగా ఉన్నదనీ తెలియజేసే మంత్రాలు కనిపిస్తూ ఉండటం ఈ అంశాన్ని బలపరుస్తున్నదని తిలక్ మహాశయుని అభిప్రాయం. ఈ కాలానికి 'అదితి కాలము' (క్రీ.పూ. 6000 - 4000) అని నామకరణం చేసి, అప్పుడు సంవత్సరము వాసంత విషువము దగ్గిర పునర్వసుతో గాని, దాని దగ్గర గాని ఆరంభించి ఉంటుందని ఆయన నిర్ణయించాడు.

తరువాత కాలము మృగశిర కాలము (క్రీ.పూ. 4000 - 2500) ఈ కాలంలో విషువము ఆర్ద్రలో ఉండేది. మృగశిరకు ఆగ్రహాయనమనే నామం ఉండటం వల్ల సంవత్సరారంభం ఆ నక్షత్రంతో అయి ఉంటుందని తిలక్ మహాశయుని నిర్ణయము. మూడవకాలము కృత్తికాకాలము (క్రీ.పూ. 2500-1400). ఇది తైత్తిరీయ సంహితా

బ్రాహ్మణాల కాలము. ఋగ్వేదంలో ఎక్కడా కృత్తికలు నక్షత్రముఖంగా చెప్పలేదు. సంహితాకాలంలో వాసంత విషువము సంవత్సరము కృత్తికతో ఆరంభించింది. క్రీ.శ. 1377లో ప్రాంతంలో విషువము ధనిష్ఠలో ఉంది. ఇది వేదాంగ జ్యోతిష కాలము. తరువాత ఐతిహాసిక కాలంలో విషువము శ్రవణంలో ఉండేది. మహాభారతములోని విశ్వామిత్ర సృష్టి ఇందుకు నిదర్శనం.[15] "అహః పూర్వం తతో రాత్రి ర్మాసాః శుక్లాదయః స్మృతాః, శ్రవణాదీని నక్షత్రాణి, ఋతవః శిశిరాదయః" దీనిని బట్టి మహాభారతము శ్రవణం నక్షత్ర ముఖంగా ఉన్న కాలంలో పుట్టి ఉంటుంది. అంటే క్రీ.శ. 4వ శతాబ్ద ప్రాంతంలో శ్రావణ శుద్ధ ప్రథమ సంవత్సరాది అన్నమాట. కానీ ఈ పరిగణనను అందరూ అంగీకరించి వ్యాప్తికి తెచ్చినట్లు తోచటం లేదు. క్రీ.శ. 18 వ శతాబ్ది వరకూ ఇలాగే ఉంది. తరువాత అశ్విని నక్షత్రాది అయింది. మేషంతో రాశి చక్ర మారంభించింది. చైత్ర శుద్ధ ప్రథమ సంవత్సరాది – అయినది.[16]

## 7

మన సంవత్సరానికి రెండు అయనాలు. ఉత్తరాయణము, దక్షిణాయనము (Equinactical Points). వేదాంగ జ్యోతిష కాలంలో (క్రీ.శ. 1377 ప్రాంతము) సూర్యుడు ధనిష్ఠ ప్రథమ పాదంలో ప్రవేశించగానే ఉత్తరాయణము. ఆశ్లేషార్ధగతుడు కాగానే శ్రావణ మాసంలో దక్షిణాయమని తెలుస్తున్నది.[17] వరాహ మిహిరాచార్యుడు 'సాంప్రత' మయనం సవితుః కర్కటకాద్యం మృగాడిత శ్చాన్యత్' అని చెప్పినాడు. పునర్వసు చతుర్థ పాదంలో దక్షిణాయనమని, ఉత్తరాషాఢ ద్వితీయ పాదంలో ఉత్తరాయణమనీ దీని భావము. ఈ నాడు సూర్యుడు కర్కటకరాశి ప్రవేశించగానే దక్షిణాయనము; మకరరాశిలో ప్రవేశింపగానే ఉత్తరాయణము.

## 8

మన సంవత్సరంలో షడృతువులన్నవి – అని వరుసగా వసంతము, గ్రీష్మము, వర్షము, శరత్తు, హేమంతము, శిశిరము. దీనిని బట్టి ఋత్వాది వసంతమని మనకు అర్థమౌతున్నది. 'నూరు సంవత్సరాలు నన్ను బ్రతకనీ' అనటానికి 'నూరు హేమంతాల ఆయువీయి' అన్న అర్థాన్నిచ్చే మంత్రాలు కనిపిస్తున్నవి. అంటే ఒకానొక కాలంలో హేమంతము మొదటి ఋతువన్న మాట! వైదిక వాఙ్మయంలో ఋతువులకు సూర్యుడు కారకుడనీ, అవి మూడు, అయిదు, ఆరు, ఏడు, అనీ నిదర్శనాలు కనిపిస్తున్నవి.[18] శతపథ బ్రాహ్మణాన్ని బట్టి ఋతువు లారని తెలుస్తున్నది. వసంత ఋతువున

మధుమాధవ మాసములు, గ్రీష్మంలో శుక్ర శుచి మాసాలు. వర్షర్తువులో నభోనభస్య మాసాలు, శరత్తులో ఇషోర్జములు, హేమంతంలో సహస్సహస్య మాసాలు, శిశిరంలో తపస్తపస్య మాసాలు ఉన్నవి. ఈ ఋతుమాసాలు వ్యవహారంలోకి రాక పూర్వం ద్వాదశాదిత్యుల పేర్లు పుట్టి ఉంటవి. దీనికి కారణం ఆయన గతి తిన్నగా తెలియక పోవటమే. ద్వాదశాదిత్యులు వసంతంలో ధాత – అర్యములు. గ్రీష్మంలో మిత్రావరుణులు, వర్ష ఋతువులో ఇంద్ర వివస్వతులు, వర్షర్తువున పర్జన్య – పూషులు. హేమంతంలో అంశు – భగులు, శిశిరంలో త్వష్టృ – విషులు[19]. వసంత గ్రీష్మ వర్షాలు మూడు దేవ ఋతువులనీ, శరద్ధేమంత శిశిరాలు మూడు పితృఋతువులనీ శతపథ బ్రాహ్మణము.

'సంవత్సరము ఒక పిట్ట. వసంతం దాని తల. గ్రీష్మం కుడి రెక్క. శరత్తు ఎడమ రెక్క. వర్షము తోక' అని ఒక బ్రాహ్మణంలో ఋతువు స్వరూపం నిరూపించి ఉంది. దీన్నిబట్టి ఒకానొక కాలంలో వసంతం ఋత్వాదిగా ఉన్నట్లు కనిపిస్తూ ఉంది. వాసంత విషువము (Vernal Equinox – షుమారు మార్చి 21) మొదలు ఆరు నెలలు ఉత్తరాయణము. శారద విషువము షుమారు సెప్టెంబరు 21 మొదలు ఆరునెలలు దక్షిణాయనము. తరువాత కాలక్రమాన ఇది మారి ఉత్తరాయణము దక్షణాయనాంత దినము (Winter Solstice డిసెంబరు 21) నుండి ప్రారంభించింది. మరి కొంత కాలానికి తిరిగి వాసంత విషువద్దినం నుంచి సంవత్సరము ఆరంభమైంది. మహాకవి కాళిదాసునాడు చాంద్ర ఆషాఢ శుక్ల ప్రతిపత్తునాడు దక్షిణాయనారంభము. సౌర మాఘంలో ఉత్తరాయణము. పురాణాలలో, సాహిత్య గ్రంథాలలో చైత్ర వైశాఖాలు వసంత ఋతువని కనిపిస్తున్నది. తరువాత వచ్చిన జ్యోతిష సిద్ధాంతులు ఫాల్గున చైత్రాలు వసంత ఋతువని నిర్ణయించారు. ఇప్పటికీ ఉత్తర దేశంలో 'ఫాల్గున చైత్రాలే వసంతము. తైత్తిరీయ సంహితాకాలంలో వసంతము ఋతుముఖము. అప్పుడు సంవత్సరాది ఫాల్గున పూర్ణిమ. శిశిరము ఋతుముఖంగా కొంతకాలం ఉంది. వరాహ మిహిరుడు ఫాల్గునంలో సంవత్సరారంభం చేశాడు. భాస్కరుడు (క్రీ.శ. 1150) మరల వసంతము ఋతుముఖంగా పేర్కొన్నాడు.

## 9

మన సంవత్సరానికి పన్నెండు మాసాలు. 'మస్యతే పరిమియతే నేతి మాసః – మసీ – పరిమాణే' దీనిచేత కాల పరిమాణం చేయబడుతున్నది కనుక ఇది మాసమైంది.[20] పున్నమినాడు చంద్రుడు ఏ నక్షత్రంతో కూడి ఉంటాడో దాన్ని బట్టి

చైత్రాదిమాస నామాలు కలిగినవి. చైత్రమాసంలో పూర్ణిమనాడు 'చిత్ర'లో ఉంటాడు. ఇలాగే వైశాఖంలో విశాఖలో.

రాశిచక్రంలో చంద్రగమనాన్ని బట్టి చైత్రాది మాసాలు ఏర్పడుతున్నవి. చంద్రుని గమనం వల్లనే భారతీయులకు నక్షత్రాలు తోచినవి. నక్షత్రాలను ఆధారం చేసుకొని మొదట చంద్రగమనాన్ని, తరువాత సూర్యగ్రహ గమనాలనూ నిర్ణయించారు. నక్షత్రాలు ఆకాశంలో ప్రయాణం చేసే దేవయాత్రికులకు మైలురాళ్ళ వంటివని భారతీయులే నాడో గుర్తించారు. సూర్యుని గమనం గాని, ఇతర గ్రహాల గమనం గాని చంద్రుని గమనానికి భిన్నం కాకపోవటం వల్ల 27 నక్షత్రాలను 12 రాసుల క్రింద విభజించారు.[21] నక్షత్రం ఒకటి నాలుగు పాదాల చొప్పున 27 × 4 = 108 పాదాలను పన్నెండు రాసుల క్రింద సర్ది, సూర్యుడు నెలకు 9 పాదాలు గమిస్తాడని మనవారు నిర్ణయించారు. చైత్రాది మాస నామాలు పుట్టక పూర్వం, మధు మాధవాది మాస నామాలు సూర్యునిబట్టే వ్యవహారంలో ఉండేవి. రాశిచక్రంలో సూర్యగమనాన్ని బట్టి మేష, వృషభాది మాసాలు వచ్చినవి. ఇవి చైత్ర వైశాఖాది మాసాలకు తరువాత పర్యాయపదాలైనవి. కవితా స్వభావం గల భారతీయ దైవజ్ఞులు వీటిని (సౌర మాసాలను) చంద్రుని సంతానమని వ్యవహరించారు.[22]

## 10

భారతీయుల రాశి చక్రంలో 27 నక్షత్రాలున్నవి. ప్రతి నక్షత్రంలో ఒకటి, రెండు, మూడు లేక అంతకంటే మించి చుక్కల గుంపులు ఉంటవి. ప్రతి నక్షత్రంలోనూ కాంతిమంతమైన చుక్క ఒక్కటి ఉంటుంది. దాన్ని మనవారు 'యోగతార' అని వ్యవహరించారు. ఇవి క్రాంతి వృత్తానికి మధ్యమార్గంలో ఉండటం వల్ల చంద్రునితో కూడడానికి, గ్రహాలతో యోగం పొందడానికి వీలవుతుంది.

వైదిక సాహిత్య కాలంనాడే ఆర్యులకు 27 నక్షత్రాలు తెలుసు. మొదట చంద్రుడు దినానికి ఒక నక్షత్రంతో ఉన్నట్లు భావించి, చాంద్రమాసానికి 28 దినాలు మించి ఉండడం వల్ల 28వ నక్షత్రం కూడా కల్పన చేశారు. దీని పేరు అభిజిత్తు (Vega Alfra Lyra) దీనిని తైత్తిరీయ బ్రాహ్మణకాలంలోనే గుర్తించారు. మహాభారత వనపర్వంలో (23) రోహిణిమీద అభిజిత్తుకు ఈర్ష్య కలిగి సహించలేక తపోవనాలకు వెళ్లిపోయినట్లున్న కథ దీనికి సంబంధించిందే. ఈ అభిజిత్తు ఉత్తరాషాఢ శ్రవణాలకు మధ్య ఉండేది. అభిజిత్తు తపోవనానికి వెళ్ళిన తరువాత ఇంద్రుడు కాలాన్ని గుర్తించలేకపోతే, బ్రహ్మ స్కందుడు దాన్ని ధనిష్ఠ నుంచి గుర్తించారట.[23] తరువాత

కృత్తిక నక్షత్రాదిగ ఉంది. యజుర్వేదంలో వేదాంగ జ్యోతిషంలో నక్షత్రపు పట్టిక కృత్తికతో ఆరంభిస్తుంది. ఈ పట్టిక క్రీ.శ. 1వ శతాబ్ది వరకూ ఇలానే ఉంది. తరువాతి నక్షత్రాలు అశ్వనితో ప్రారంభించినవి.

ఉత్తర దిక్కున ఉన్న ధ్రువుని క్రీ.పూ. 2780లోనే భారతీయులు ఎరుగుదురని జాకోబీ. అటువంటి భారతీయులు రాశి చక్రాన్ని గ్రీకుల దగ్గిరనుంచీ గ్రహించారనటం అసమంజసము. సర్ విలియం జోన్సు వేదకాలంనాడే భారతీయులకు రాసులు తెలుసునని చెబుతున్నాడు. ప్రాచీన పంచాంగాలనూ, రాసులను పరిశోధించిన ప్లంకెట్ ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాడు.[24]

## 11

మన మాసానికి రెండు పక్షాలున్నవి. ఒకటి శుక్ల పక్షము; రెండు కృష్ణ పక్షము. మాసానికి 15 దినాలు. కృష్ణ పక్షము అమావాస్యతో అంతం పొందుతుంది. 'అమా సహతిష్ఠతః రవి చంద్రావస్యా మిత్యమావాస్య' అమా = కూడ, వాస్యా = వసించుట – సూర్యచంద్రులు కూడి ఉండేది కనుక, అమావాస్యనాడు సూర్యచంద్రుల మధ్య అంతరం శూన్యం. ఆ నాటినుంచీ సూర్యచంద్రులిద్దరూ ఎవరి దారిన వారు వెళ్ళుతుంటారు. వారికి పన్నెండు డిగ్రీల ఎడము ఉన్నపుడు పాడ్యమి పూర్తి ఔతుంది. విదియకు 240 డిగ్రీల ఎడము. పున్నమినాటికి 1600 ఎడము. 3600 డిగ్రీల ఎడముంటే అమావాస్య.

పూర్వ పక్షాలు కృష్ణపక్షంతో కొంతకాలం మొదలు పెట్టినట్లు నిదర్శనాలు కనిపిస్తున్నవి. మహాభారతము వన పర్వంలో (161 అధ్యాయము) కుబేర యుధిష్ఠిర సంవాదంలో "మొదటిదైన కృష్ణపక్షంలో నీవు భయదుఃఖరహితంగా ఉండు" అన్న వాక్యం కనిపిస్తున్నది. 'పూర్ణమాసి' శబ్దం వల్ల ఒకానొక కాలంలో శుక్లపక్షం నుంచి మాసారంభం కనిపిస్తున్నది. దీనినిబట్టి ఒక కాలంలో శుక్ల పక్షం నుంచి మాసారంభం అయ్యేదనీ, ఋతువులలో ఆయన చలనాల వల్ల కలిగిన మార్పులు కారణంగా అమావాస్య నుంచీ మాసం ఆరంభించిందనీ, తిరిగీ శుక్లపక్షమే పక్షద్వయారంభ మైందనీ మనం నిర్ణయించవచ్చు. ఈ విషయాన్ని గురించి సి.వి. వైద్య ఇలా అన్నారు.

''The fact is clear that at the begining of the Epic Period the practice of counting the month from the dark fortnight has prevailed as in other Aryan countries. But towards the end of the Epic period the country practice was

certainly in Vogue. The other practice again came into use after this, perhaps being copied from the Greeks, to suit the shifting back in seasons as measured by the old months which had happened by the time, a reform perhaps introduced by King Vikramaditya like similar reforms in calenders introduced by many Kings in the West.''

(Ep. India P. 317)

సిద్ధాంత గ్రంథాలు శుక్లపక్షాన్నే ప్రథమ పక్షంగా చెబుతున్నప్పటికీ, ఉత్తర భారతంలో ఈ నాడు కూడా మాసం కృష్ణ పక్షంతో ఆరంభిస్తున్నది.

## 12

సూర్య చంద్రుల మధ్య ఎడమున్న పన్నెండు అమావాస్యలు కల పన్నెండు చాంద్రమాసాలు ఒక చాంద్ర సంవత్సరము. దీనికి దినాలు 354 మాత్రము. తిథులు 360. రవిచంద్రుల గమనం వేసవిలో వడిగా ఉంటుంది. శీతకాలంలో మెల్లగా ఉంటుంది. దీర్ఘాహము ఘ 65-16; హ్రస్వాహము 53-56. ఇందువల్ల 360 తిథులను సరిపెట్టుకోవలసి వచ్చింది.[25] చాంద్రమాసాదులలో 7 వృద్ధితిథులు, 13 క్షీణ తిథులు వస్తున్నవి.

చాంద్ర సౌరమాసాలను సరిపెట్టటానికి అధికమాసాన్ని చేర్చటం ఋగ్వేద కాలంనుంచీ కనిపిస్తున్నది. అప్పుడు ఎలా సరిపెట్టేవారో చెప్పలేము. రెంటికీ మధ్య ఉన్న తేడా సవరించడానికి మనవారు మూడు సంవత్సరాల్లో ఒక అధికమాసం గాని, లేదా అయిదు సంవత్సరాల్లో ఒక అధికమాసం గాని చేరుస్తారు. పందొమ్మిది సంవత్సరాలలో ఏడు అధికమాసాలు వస్తవి. దిద్దుబాట్లు విశేషంగా వచ్చినప్పుడు ఒక మాసాన్ని తగ్గించవలసి వస్తుంది. క్రీ.శ. 1826లో ఇలా తగ్గించిన ఒక లుప్తమాసం వచ్చింది. క్రీ.శ. 1963, 1964 లోగా మరొక లుప్తమాసం వస్తుంది.

## 13

నేడు ఆంధ్రదేశంలో ఆదిత్య సోమాది వారాలు వ్యవహారంలో ఉన్నవి. ఇవి నేటి రూపంలో ఇతిహాసకాలంలో లేవని ఒక అభిప్రాయం ఉంది.[26] ఇవి అవైజ్ఞానికాలనీ, వీనివల్ల జ్యోతిష్య శాస్త్రంలో తప్ప ప్రయోజనం లేదనీ, మరిచిపోతే వీటిని ఉద్ధరించటానికి మార్గం లేదనీ మరొక అభిప్రాయం.[27] వారంలోని దినాలకు 'శక' మనీ, తత్సంబంధమైన జ్ఞానాన్ని మనవారు శకజ్ఞాన మన్నారనీ, ఋగ్వేదంలోని

మం 1 అను 22 సూక్తం 80, మంత్రం 48 వారాన్ని గురించి చెబుతున్నదనీ, దీనిని భారతీయులు గ్రీకుల దగ్గరనుంచి గ్రహించలేదనీ మరొకమతం.[28] తైత్తిరీయారణ్యకంలోని ప్రశ్న 1 అనువాకం 3. పంచతి 1 ఏడుదినాలు గల వారాన్ని సూచిస్తున్నదని రెండవ మతం. ఋగ్వేద సంహితలోనూ, తైత్తిరీయారణ్యకంలోనూ పేర్కొనబడ్డ వారాలనే తరువాతి కాలంలో సిద్ధాంతులు విపులీకరించి ఉంటారు. వారం ఇంచుమించు పక్షములో సగభాగము. సూర్యుడు ఉదయం ఏ గ్రహపరిధిలో ఉదయిస్తాడో ఆ దినానికి ఆ గ్రహనామాన్ని బట్టి పేరు వచ్చింది. సోమవారం నాడు సూర్యుడు చంద్రుని పరిధిలో ఉదయిస్తానదన్న మాట. ఇదే రీతిగా మంగళవారం నాడు కుజపరిధిలో. కౌటిల్యుని అర్థశాస్త్రంలో సప్తవార విభాగం లేదు, పంచవార విభాగం ఉంది. అమర సింహుడు వారనామాలను పేర్కొనలేదు. సప్త సంఖ్యతో మాసం గాని, సంవత్సరం గాని సమానంగా విభజితం కావడం లేదు. అయితే పంచాంగాలలో వారం ఒకటి నిత్యోపయోగంలో ఉంది.

## 14

నెలకు ముప్పది దినాలని మనం వ్యవహరిస్తున్నాము. అనేక విధాలైన దినాలు నేడు కనిపిస్తున్నవి. ఒక నక్షత్రం ధ్రువం చుట్టూ ఒకసారి తిరగటానికి పట్టే కాలము 23 గంటల 56 ని. 40.9 సెకండ్లు. దీనికి నక్షత్ర దినమని పేరు. ప్రాచీనులు నక్షత్ర దినానికి అరవై నాడులున్నవన్నారు. ప్రతి నాడికి అరవై వినాడులు. ప్రతి వినాడికీ ఆరు ప్రాణాలు. ప్రతి ప్రాణికీ పది గుర్వక్షరాలు. గుర్వక్షరం ప్రతిదానికీ నాలుగక్షరాలు. ఈ దిన విభాగం అతి ప్రాచీనమైంది. "గౌరీ మిమాయ సలిలాని తక్షత్యేక పదీ ద్విపదీ సాచతుష్పదీ అష్టాపదీ నవపదీ బభూవుషి. సహస్రాక్షరా పరమేవ్యోమమ్."[29] ఈ మంత్రంలో పైన పేర్కొన్న దిన ప్రయాణం నిబద్ధమై ఉందట. $1 \times 2 \times 4 \times 8 \times 9 \times 1000 = 864000$ అక్షరాలు. మన పూర్వులు దిన ప్రమాణాన్ని కొలవటానికి అక్షరాన్ని (శబ్దాన్ని) ఆధారం చేసుకున్నారు. ఋగ్వేదంలో ఉన్న మొత్తం అక్షరాలు ఒక సౌర సంవత్సరానికి ఎన్ని అక్షరాలు ఉన్నవో అన్నేనట. అంటే 864000. ఈ విషయాన్ని గురించి ఒక అభిజ్ఞుడు 'ఆరు – గడియారము' వలె మన పూర్వులు ఋగ్వేదాన్ని ఉపయోగించారు. పై గడియారము ఒక సెకండు కాలాన్ని, అంటే సౌరదినంలోని 864000 భాగాన్ని మాత్రం కొలవగలుగుతుంది. దీనిని బట్టి ప్రాచీనులకు నిష్కర్షగల ఒక కాలమాపక మున్నదని అర్థమౌతుంది' అని వ్రాసినాడు.[30]

## 15

భాస్కరాచార్యులు (క్రీ.శ. 1150) దినాన్ని త్రుటుల లెక్కలో చెప్పి, దినానికి 2,91,60,00,000 త్రుటులున్నవన్నాడు. అంటే 27×25×43,20,000 చతుర్యుగాలను సంవత్సరాలుగా మారిస్తే ఎన్ని భాగాలు వస్తవో, దినాన్ని భాగాలుగా మారిస్తే అన్ని త్రుటులు వస్తవన్నమాట.

ఒక మధ్యాహ్నం నుంచి మరొక మధ్యాహ్నానికి సూర్యుడు రావటానికి పట్టే కాలాన్ని సౌరదినమని వ్యవహరిస్తున్నాము. ఈ సౌరదిన పరిమాణం ఋతువులతో బాటు మారుతూ ఉంటుంది. దీర్ఘమైన ప్రొద్దున్న దినానికీ, పొట్టి ప్రొద్దు ఉన్న దినానికీ మధ్య తేడా 51 సెకండ్లు. దినానికి ఆరంభం లంకిలో ఉయమని ఆర్యభటుడు, వరాహ మిహిరుడు అర్ధరాత్రం నుంచి అర్ధరాత్రానికి దినమని చెప్పాడు. 'ఉదయా దుదయం వారః' అన్న ప్రమాణాన్ని అనుసరించి మనం నిత్య వ్యవహారంలో ఉదయంతోనే దినం ఆరంభించినట్లు లెక్కిస్తున్నాము.

దినంలో (పగటిలో) ప్రాహ్ణము, మధ్యాహ్నము, అపరాహ్ణము, సాయాహ్ణము' అని నాలుగు రీతుల ఒకచోట, ఉష, మధ్యాహ్నము, అపరాహ్ణము, సాయాహ్ణము, సంగవము (పాలు పితుకు కాలము) అని ఒకచోట అయిదు రీతుల కన్పిస్తున్నది. బౌద్ధుల పద్ధతిని బట్టి రాత్రి త్రియామ, యామానికి నాలుగు గంటలు. బౌద్ధేతరులు రాత్రిని, పగలును కూడా నాల్గు యామాల క్రింద విభజించి వ్యవహరించినట్లు యువాన్ చ్వాంగ్ చెప్పినాడు (యువాన్ చ్వాంగ్ పుట 143)

## 16

ప్రాచీన కాలంలో దినప్రమాణాన్ని, సహగమన విశేషాలనూ క్రమంగా నిరూపించుకొని వ్యవహరించుకోటానికి కొన్ని యంత్రా లుపయోగించారు. ఋగ్వేదంలో తురీయమనే యంత్రం కనిపిస్తున్నది.

దీనిని భాస్కరాచార్యులవారు 'దళీకృతం చక్రముశంత చాపం కోదండ ఖండం ఖలు తుర్యగోళం' (సిద్ధాంత శిరోమణి -10-15) అని వర్ణించారు. ఒక గ్రహాన్ని గాని, నక్షత్రాన్ని గాని, సూర్య చంద్ర బింబాన్ని గాని మనం చూస్తున్నప్పుడు అది దిక్చక్రం మీద ఎన్నో భాగ (డిగ్రీ) ఎత్తున ఉన్నదీ దాని సహాయంతో మనవారు చూచేవారు.[31] వృత్తాంత పరిమాణాన్ని, కాల పరిమాణాన్నీ కనుక్కోవటానికి పూర్వులు రెండు యంత్రాలను ఉపయోగించారు. శంకువు పగటివేళ పనిచేస్తుంది. రాత్రికి కపాల యంత్రాన్ని కనిపెట్టారు. రాశిచక్రం వచ్చిన తరువాత సూర్య ఘటికాయంత్రం

వచ్చింది. దీనికి 12 ముళ్ళు ఉంటవి. పగటిని తెలియజేస్తుంది. తరువాతి కాలంలో జలఘటికాయంత్రాలు వచ్చినవి.

పూర్వం మఠాలలో, సంఘారామాలలో ఇవి ఉండేవి. మోఖరీ మైత్రికుల కాలంతో క్రీ.శ. 5వ శతాబ్ది మొదలు ఏడవ శతాబ్దం వరకూ ఉత్తరదేశంలోనూ, తరువాత బహుకాలం వరకూ దక్షిణాదేశంలోనూ ఇవి ఉన్నవి.[32] వీటిని సంఘారామాలలో కుర్రవాళ్ళ చేత పట్టించి వాళ్ళు వచ్చి కాలాన్ని చెప్పుతుంటే ఘటికాస్థానంలో గంటలు కొట్టేవారు. మన పిల్లలమర్రి పినవీరన పీఠికలలో "చిడిముడి జాహ్నవీతటిని శీకరపోతముజూచి యెవ్వరీ కొడిమలుగట్టి పెండ్లికొడుకున్ గడియారము మోవజేసి రంచడుగ"లో సూచించింది ఈ విషయమే.[33] మధ్యాహ్నాన్ని, కుతపకాలాన్నీ తెలుసుకోటానికి షష్ఠి యంత్రాన్ని ఉపయోగించేవారు. పెద్దన్నగారు ప్రవరాఖ్యుని ఇంటికి యోగిని కుతప కాలంలో తీసుకొని వచ్చారు. బహుశః రాయల కాలంలో (క్రీ.శ. 15 శతాబ్ది పూర్వభాగం) ఆంధ్రదేశంలో ఇవి ఉపయోగంలో ఉండి ఉండాలి. గణిత శాస్త్రసహాయంతోనూ, యంత్రసహాయంతోనూ మన పూర్వులు పరిపూర్ణ కాలవిజ్ఞానం కలిగి వ్యవహరించారనటం నిస్సంశయము. వారి అనంత కాలవిజ్ఞానం వేదకాలం నుంచీ అవ్యవచ్ఛిన్నంగా వస్తున్నది. ఇటువంటి వారు ఇతరుల దగ్గర నుంచి జ్యోతిష విజ్ఞానాన్ని గ్రహించారని పాశ్చాత్యులు కొందరు వ్రాస్తే వ్రాసి ఉండవచ్చు గాని, దానిని మనవారు కూడా కొందఱు నమ్మటం శోచనీయం. పాశ్చాత్యులలో బుద్ధిమంతులు కొందరు సత్యప్రియులై, 'ఈ నాడు నూతనంగా కనిపెట్టబడ్డవని' చెప్పుకునే యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలు కూడా మన భారతీయులకు తెలుసునని అంగీకరిస్తున్నారు.[34]

## 17

ప్రాచీన శాసనాలను చూస్తే క్రింది విశేషాంశాలు సంవత్సరానికి సంబంధించి కన్పిస్తున్నవి. ఒక కుషాణ రాజు తక్షశిల శాసనంలో (క్రీ.శ. 79) 'ఆషాఢస్య మాసస్య దివసే పంచదశే' అని మాస నామం కనిపిస్తున్నది. (Ep. hd. XIV. P125) 'మహారాజస్య కనిష్కస్య రాజ్యతృతీయే హేమంతమాసే తృతీయే పూర్ణిమాంతమాఘే' (37-39 Selective Inscriptions - D.C. Circar) శాతవాహన రాజుల కాలంలో గాని, ఇక్ష్వాకు రాజుల కాలంలో గాని శాసనాలలో మాసనామం కన్పించడం లేదు. కృష్ణ పక్షంతో నాలుగు మాసాలు గల మూడు ఋతువులు ఆరంభిస్తున్నట్లు నిదర్శనాలున్నవి. వాశిష్ఠీ పుత్ర పులోమావి కార్లే శాసనాలలో 'గ్రీష్మ పక్షే పంచమే దివసే ప్రథమే' : జ్యేష్ఠ కృష్ణ ప్రథమ (క్రీ.శ. 137) అనీ,[35] 'హేమంత పక్షే తృతీయే దివసే ద్వితీయే : పుష్య

బహుళ ద్వితీయ (క్రీ.శ. 154) అనీ,[36] వీరపురుషదత్తుని (ఇక్ష్వాకువంశపు రాజు) నాగార్జునకొండ శాసనంలో 'హేమంతః పక్షః షష్టః దివసః త్రయోదశః : మాఘ శుద్ధ త్రయోదశి' అనీ[37] కనిపిస్తున్నది. పల్లవులలో తరువాతి రాజుల కాలంలో మాస నామాలు కన్పిస్తున్నవి. శకవర్ష ప్రశంస కన్పిస్తున్నది. కుమారవిష్ణు చందలూరు, ఉరవవల్లి శాసనాలు ఇందుకు నిదర్శనము.[38,39] రాజరాజ నరేంద్రుని వంశస్థుల శాసనాలలో సింహమాసము,[40] తులామాసము[41] అనే వ్యవహారం ఉంది. ఇలాగే ఉత్తర దక్షిణ భారతదేశంలోని శాసనాలను పరిశీలిస్తే సంవత్సరానికి సంబంధించి విశేషాలెన్నో బయల్పడతవి.[42]

## 18

"అబ్దాదౌ బంధుసంయుక్తో మంగళ స్నాన మాచరేత్
వస్త్రైరాభరణై దేహ మలంకృత్య తత శ్శుచిః ।
విఘ్నేశం భారతీం ఖేటాన్ దైవజ్ఞ మభిపూజ్యచ,
సంవత్సర ఫలం సమ్యక్ఛృత్వా విప్రాన్ సమర్చయేత్. ॥"

అనాదినుంచి సంవత్సరాది ఒకే నియతమైన ఋతువులో గాని, మాసంలోగాని, పక్షంలోగాని రావటం జరగలేదు. అనేకరీతుల మారుతూ వచ్చిందని మనం గమనించాము. అందువల్ల పూర్వకాలంలో సంవత్సరాది ఆచారాలు విస్పష్టంగా ఇలా ఉన్నవని చెప్పటం కష్టం. అయితే మొట్టమొదటి సంవత్సరాది నాడే యజ్ఞం ప్రారంభమయ్యేది. సంవత్సర కాలం అది జరుగుతూ ఉండేది. నేడు మనం ఉత్తరాయణ, దక్షిణాయన పుణ్యకాలాలలోనూ, నక్షత్ర దర్శన సమయాలలోనూ చేసే కార్యకలాపాలన్నీ ఆయా కాలాలతో సంవత్సరం ఆరంభించినప్పుడు సంవత్సరాది కృత్యాలుగా ఉన్నవని ఊహించవచ్చు.

నేడు సంవత్సరాది చైత్రశుద్ధ ప్రథమ. ఇప్పుడు నింబకుసుమ భక్షణం, పంచాంగ శ్రవణం తప్ప విశేషంగా పాటిస్తున్న ఆచారాలు ఆంధ్రదేశంలో ఏమీ లేవు. సంవత్సరాది నాడు సదాచార సంపన్నుడు అంగుళీస్ఫోటంలో నిద్రలేచి శ్రీమచ్ఛంకర భగవత్పాదులవారు చెప్పిన

"ప్రాతఃస్మరామి హృది సంస్ఫురదాత్మతత్త్వం
సచ్చిత్సుఖం పరమహంస గతిం తురీయమ్ ।
యస్తు ప్రజాగరసుషుప్త మక్షైతి నిత్యం
తద్బ్రహ్మ నిష్కలమహం న చ భూత సంఘః ॥

ప్రాతర్భజామి మనసా వచసా మగమ్యమ్
వాచో విభాంతి నిఖిలా యదనుగ్రహేణ ।
యన్నేతి నేతి వచనైర్నిగమా అవోచమ్
తం దేవ దేవ మజ మచ్యుత మాహురగ్ర్యమ్ ॥

ప్రాతర్న మామి తమసః పరమార్క వర్ణం
పూర్ణం సనాతన పదం పురుషోత్తమాఖ్యమ్ ।
యస్మిన్నిదం జగదశేష మశేషమూర్తౌ
రజ్వాం భుజంగ ఇవ ప్రతిభాసితం వై ॥"

అన్న ప్రాతఃస్మరణ శ్లోకాలను పఠిస్తాడు. పైన చెప్పిన శ్లోకాలలోని అర్థాన్నీ

'కాలః కలయతే లోకం
కాలః కలయతే జగత్ ।
కాలః కలయతే విశ్వం
తేవ కాలోభిషీయతే ॥

కాలస్య వశిగా స్సర్వే
దేవర్షి సిద్ధ కిన్నరాః ।
కాలోహి భగవాన్ దేవ
స్స సాక్షాత్పరమేశ్వరః ॥'

అన్న కాలస్వరూపాన్ని నిరూపించి కాలం పరమాత్మ అనీ, సర్వం కాలాధీనమని ఊహించి మననం చేసుకుంటాడు. కాల్యకృత్యాలను తీర్చుకొన్న తరువాత మంగళస్నానం చేసినా, సంకల్పపూర్వకమైన కూపోదక స్నానాన్ని గానీ, నదీ జలోదక స్నానం గానీ చేసి సంధ్యావందనం పితృతర్పణాదులు పూర్తి చేసి, దేవతలకు పులికాపు చేసి ఆసాదించి శర్క రామ్ల ఘృతాదులతో కూడిన నింబ కుసుమ ప్రసాదాన్ని నివేదన చేసి, సకుటుంబంగా తానూ స్వీకరిస్తాడు. మృష్టాన్న భోజనం చేస్తాడు. సాయంత్రం పంచాంగ శ్రవణం చేస్తాడు.

ధనికులు కొందరు దైవజ్ఞులను, పండితులను, గురువులనూ ఆహ్వానించి వాళ్ళ ఇళ్ళల్లోనే సాయంత్రం పంచాంగ శ్రవణం చేస్తారు. వీరికీ, గ్రామ వాసులకూ ఉదయమే ఇంటి పురోహితులూ, గ్రామ పురోహితులూ వచ్చి నింబకుసుమ ప్రసాదాన్ని ఇచ్చి వెళ్ళుతారు.

ధనికులు నూతన వస్త్రాభరణాలంకరణం చేసుకొని పంచాగ శ్రవణ సమయంలో రాబొయ్యేది వేసవి గనుక, పాత్రులకు ఛత్రము, తాళవృంతము, పాదుకలు, వస్త్రాభరణాదులు దానం చేస్తారు. కొందరు సరస్వతీపూజాసమయంలోనూ, మంటపారాధన సమయంలోనూ 'పంచాంగాలు' పంచి పెట్టుతారు; పేద విద్యార్థులకు ఇతర పుస్తక దానం కూడా చేయటం కద్దు.

గ్రామాల్లో జనం ఉదయం మంగళస్నానాలు చేసి, ఆమ్రతోరణాలతో గృహద్వారాలను అలంకరించి, నూతన వస్త్రాభరణాలతో అలంకరించుకుంటారు. పురోహితుడు వచ్చి యింటింటికి తిరిగి ప్రసాదమిచ్చి వాయనాలు పుచ్చుకొని వెళు తాడు. సామాన్య ప్రజలు 'సంకులమ్మ' మొదలైన గ్రామ దేవతల దగ్గరకు 'చిందు నృత్యం' చేసుకుంటూ మంగళవాద్యాలతో వెళ్ళి వచ్చి, తృప్తిగా భోజనం చేసి సాయంకాలం దేవాలయంలోని మండపం దగ్గరికి పంచాంగ శ్రవణం కోసం చేరుతారు.

మంటపం దగ్గిర సభ ఉత్తర ముఖంగా గాని, తూర్పు ముఖంగా గానీ ఏర్పాటై ఉంటుంది. పంచాంగ శ్రవణం గణపతి పూజతో ఆరంభిస్తుంది. "గణానాం త్వాం గణపతిగ్ం హవామ హే, కవిం కవీనాముప మశ్రవస్తమం, జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణ స్పత, అనఃశృణ్వ న్నూతిభిః సీదసాదనమ్" (ఋగ్వే 11.28) అన్న ఋగ్వేద మంత్రంతో గణపతి పూజ ప్రారంభించినప్పుడు వేదార్థం తెలిసినవారు ఈ మంత్రంలోని 'ఈ సమస్త దేవతాంగాలకూ, అధిపతివి నీవు, నాయకుడవు, బుద్ధిమంతులలో బుద్ధిమంతుడవు, ప్రఖ్యాతులో అగ్రగణ్యుడవు, ప్రార్థనలు పూజలు యజ్ఞాలు మొదలైన సమస్త కర్మలకు నీవే రాజువు ఓ బ్రాహ్మణస్పతీ! యజ్ఞస్థానాన్ని అలంకరించు' అన్న అర్థాన్ని మననం చేసుకొని గణపతిని పరబ్రహ్మగా భావిస్తారు. తరువాత సరస్వతీ పూజ. సరస్వతి వాగధిదేవత. సృష్టికి ఆదిశబ్దం. కాలానికి సంబంధించిన సంవత్సరాదినాడు సరస్వతీపూజ ఎంతో సముచితమైంది. ఈ సరస్వతీపూజకు ముందే మంటపారాధన జరుగుతుంది. 'మంటపము' కేవలం ఖగోళము. వివిధ నక్షత్రాలనూ, గ్రహాలను, ఇంద్రాది లోకపాలకులనూ, తదితర దేవతలనూ ఇందులో ఆహ్వానించి పూజించటం ఉంటుంది. ఈ పూజాసందర్భాలలో కాలాన్ని కనుక్కోవటానికి మన పూర్వులు ఉపయోగించిన తురీయ, కపాల, షష్ఠి, జలఘటికాది యంత్రాలను కూడా పూజించేవారు.

పైన చెప్పిన మంటపారాధాన, సరస్వతీ పూజలు అయిపోయిన తరువాత పురోహితుడు తప్పుకుంటాడు. దైవజ్ఞుడు గ్రామ పెద్ద ఆహ్వానాన్ని అందుకొని వేదికను అలంకరిస్తాడు. ఆయనకు చందన చర్చ, వస్త్రాలంకరణం ఇత్యాదులు జరుగుతవి.

ఇతడు ద్వేషరహితుడు, నిత్యసంతోషి, గణిత శాస్త్రవేత్త, ముహూర్తగుణ దోషజ్ఞుడు, వాగ్మి, సూక్ష్మబుద్ధి, నిత్యకర్మలలో ఆసక్తి కలవాడు, అయి ఉండాలెనని శాస్త్రం చెప్తుతున్నది. దైవజ్ఞుడు పూజలు పొందిన తరువాత ఇష్టదేవతా గురు ప్రార్థనలతో 'పంచాంగ శ్రవణం' ప్రారంభిస్తాడు.

తిథి, వార, నక్షత్ర, యోగ కరణాలతో కూడింది పంచాంగము. సంవత్సరాదిని పంచాంగం విన్న వాళ్ళకు 'క్రతుఫలం' చెప్పి ఉంది. నిత్య నైమిత్తిక కామ్య కర్మల్లో వేటికైనా భారతీయులకు కాలజ్ఞానం అవసరం. అంతేకాక వర్షాలు, కార్తెలు, ధనధాన్య సమృద్ధి మొదలైన వాటిలో జ్యోతిష్కులు చెప్పినట్లే జరుగుతూ ఉండటంవల్ల ప్రజలు అత్యాదరంతో ఈ పంచాంగ శ్రవణం చేస్తారు.

దైవజ్ఞుడు పంచాగ శ్రవణానికి (వినిపించటానికి) ముందు అనంతమైన కాల స్వరూపాన్ని విశదం చేస్తాడు. ఇది పంచాంగాలకు పీఠికాభాగంలో ఉంటుంది. సంవత్సరాధిపతులను గురించీ, వారిచ్చే ఫలితాలను గురించీ చెప్పి, తరువాత ఆదాయకందాయాలనూ, రాజపూజావమానాదులను నిరూపిస్తాడు. పుష్కరాలు గాని, అర్ధోదయ మహోదయాలు గాని ఉంటే వాటి విశేషాలను నిరూపిస్తాడు. గ్రహణ విశేషాలను పేర్కొంటాడు. పండితులు వేసే ప్రశ్నలకు సమాధానాలిచ్చిన తర్వాత దైవజ్ఞుడు తన ప్రసంగాన్ని క్రింది పంచాంగ శ్రవణఫలశ్రుతితో పూజ చేస్తాడు. ప్రజలు వడపప్పు, పానకాలు పుచ్చుకొని సంవత్సరం విశేషాలను గురించి ముచ్చటించుకుంటూ ఇళ్ళకు చేరుకుంటారు.

"శ్రీ కల్యాణ గుణావహం రిపుహరం దుస్స్వప్న దోషావహం
గంగాస్నాన విశేష పుణ్యఫలదం గోదాన తుల్యత వృణామ్ ।
ఆయుర్వృద్ధి ముత్తమం శుభకరం సంతాన సంపత్ప్రదం
నానా కర్మసుసాధనం సముచితం పంచాంగ మాకర్ణితామ్ ॥"

**అథఃసూచీపట్టిక**

1. "ద్విపరార్ధాత్మకః కాలః కథితో యో మయా తవ
తదహస్తస్య మైత్రేయ విష్ణో రీశస్య కథ్యతే"
విష్ణు పురాణము 6. అ.గ. 4 అధ్యా. శ్లో. 41

2. "శతం హితస్య వర్షాణాం పరమిత్యభిధీయతే
పంచాశద్భి స్తథా వర్షైః పరార్ధమితి కీర్త్యతే"
మార్కండేయ పురాణము 46 అధ్యాయ. శ్లో 42

సంవత్సర ఫలాన్ని వినేటప్పుడు బ్రహ్మజన్మతః వినమని శాస్త్రాలు చెబుతున్నవి. దైవజ్ఞులు ఆ క్రమాన్నే అనుసరించి పంచాంగ శ్రవణము చేస్తున్నారు. ఈ కల్పకల్పనము వేదాలలో లేదు గాని, దాన్ని ప్రపంచించటానికి అవసరమైన బీజాలు కనిపిస్తున్నవి. 1. కల్పము : 14 మన్వంతరములు + 1 కృతయుగము = 14 (71 మహాయుగములు 1 కృతయుగము) +1 కృతయుగము 1 మహాయుగము 10+ 4,32,000 ఏండ్లు; కృతము × 4 × 4,32,000 సంవత్సరాలు, ఒక మన్వంతరము 810 × 4,32,000 + 4 × 4,32,000 ఏండ్లు కాబట్టి ఒక కల్పము = (14 × 714 + 4) × 4,32,000= 4,32,00,00,000 ఏండ్లు. 'ఇందులో 714ను గుణకంగా గ్రహించటం వల్ల ఇది కేవల జల్పనం కాదనీ అయనాంశ పరిమాణాన్ని భావగర్భితంగా వ్యాఖ్యానించటమనీ, బ్రేసేండ్ మొదలైన పాశ్చాత్య విద్వాంసులు కూడా అంగీకరించారు'

(భారతి – సర్వధారి, కార్తికము పుట 476)

3. బ్రహ్మ మాసానికి 30 తిథులు (దినాలు) శ్వేతవరాహము, నీలలోహితము, వామదేవము, రథంతరము, రౌరవ, దేవ, బృహత్, కందర్ప, సత్య, ఈశాన, తమః, సారస్వత, ఉదాన, గారుడ, కౌర్మ, నారసింహ, సమాన, ఆగ్నేయ, సోమమానవ, తత్పురుష, వైకుంఠ, లక్ష్మి, సావిత్రీ, ఘోర, వరాహ, వైరాజ, గౌరీ మహేశ్వర పితృకల్పములు.

4. కలియుగం క్రీ.పూ. 3102 ఫిబ్రవరి 20 తేదీన గం.2 ని. 17 సెకండు 30న ఆరంభమైందని మనవారు సిద్ధాంతీకరించారు. వైవస్వత మన్వంతరానికి ఇంద్రుడు పురందరుడు, ఆదిత్యుడు, మరుత్తులు, అశ్విని, వసువు, రుద్రుడు ఇత్యాదులు దేవతలు. కశ్యప, అత్రి, భరద్వాజ, విశ్వామిత్ర, గౌతమ, వశిష్ఠ, జమదగ్నులు సప్తర్షులు. సప్తర్షులు మన్వంతరాన్ని బట్టి మారుతుంటారు. సప్తర్షులను గురించి చూ. భారతి ఈశ్వర చైత్రము; భారతి ఈశ్వర మాఘము; వీరిలో కొందరు ప్రజాపతుల్లో ఉన్నారు. ప్రజాపతులు రవిసోమాది గ్రహాలనటానికి చూ. Planets, Prajapatis and plexuses - C. J. Ghatak Astro, Maga... No. 1 pp 70-73

5. ప్రాచీన ఖగోళము శ్రీ వేలూరి శివరామశాస్త్రి, భారతి – సర్వధారి. పు. 604

6. గుప్తశకం. క్రీ.శ. 320లో ప్రారంభమైనదని డాక్టరు ఫ్లీట్ (1. A.Val X VIII)

7. క్రీస్తుశకాన్ని క్రీ.శ. 533లో డయోనిసియస్ ఎక్సిగ్ నస్ అనేవాడు ఏసు కాల్పనిక జన్మతిథినుంచి ఒక అబ్దారంభం చేయాలని నిర్దేశించాడు. క్రీ.శ. 6వ శతాబ్దిలో ఐరోపాలో అన్ని దేశాలవారూ ఈ అబ్దాన్ని అవలంబించారు.

8. కృత్తికలో విషువం ఉన్నప్పుడు ఆశ్లేషతో ఉత్తరగతి ధనిష్ఠతో దక్షిణగతి చెల్లేది. ఈ మానము వేదాంగ జ్యోతిష రచనాకాలము క్రీ.శ. 1337 ప్రాంతాన ఆరంభించి ఉంటుందని అభిజ్ఞుల నిర్ణయము. విషువమంటే రాత్రి, పగలు సమానంగా ఉండే కాలము.

9. 'సంవత్సరః ప్రజాపతిః, ప్రజాపతిర్యజ్ఞః' ఐతరేయ బ్రాహ్మణము 11. 17. 'The main idea of Yearly sacrifice appears to be a very old one. The Etymology of Ritvij, (Ritu + Yag) is season - Sacrificer. Note the correspondence between the sacrifice and seasons. In 'Samvatstara' 'Vas' is to dwell. It is a cycle of Lewis seasons. The priests were not only sacrificers but time keepers' Lewis. Historical Survey of the Astronamy of the Ancients - 9.19

10. B.G.Tilak - Orion - P. 31

11. 'ఏడాది' దేశిపదం. ఏఱు + ఆది : ఏఱు + ఆది – ఏడు + ఆదిగా మారి ఉంటుంది. ఇది వర్షాలు కురిసి ఏఱులు బాగా వచ్చిననాటి వర్షారంభాన్ని సూచిస్తున్నట్లున్నది.

12. ORION P. 32

13. ప్రాచీన ఖగోళము – కాలము భారతి, సర్వధారి కార్తికము పుట 469

14. ఐతిరేయ బ్రాహ్మణము 1.7 తైత్తిరీయ సంహిత 1.5.1

15. ORION - P. 205 మహాభారతము ఆదిపర్వము – 61

16. C.V. Vidya - Epic India P. 311 'ద్వౌ క్వా మాఘాదిమాసౌ ఋతురిత్యుతే' అని అమరుడన్నాడు.

17. "ప్రపద్యేతే శ్రవిష్ఠాదౌ సూర్యా చంద్రమాసా వుదక్ ।
సార్పార్ధే దక్షిణార్కస్తు మాఘ శ్రావణ యోస్సదా ॥"

18. ప్రాచీన ఖగోళము – భారతి సర్వధారి కార్తికము పుట 471

19. 'వసంతో గ్రీహ్మో వర్షాతే దేవా ఋతవః శరద్ధేమంత శిశిరస్తే పితరో' శత. బ్రాహ్మ 11.1.3,1–3

20. ఆంగ్లభాషలోని మాస్ మంత్ శబ్దాలు కూడా పరిమాణార్థంలోనే వచ్చాయి. Epic India - C.V. Vidya P. 317 'చంద్రమస్' శబ్దంలోంచి 'మాస' శబ్దం విడివడ్డది. కొన్ని ఋగ్వేద మంత్రాలలో 'సూర్యమాసా' అన్నచోట 'మాస' శబ్దానికి చంద్రుడనే అర్థం.

21. రాశుల స్వరూప విశేషాలకు – శ్రీ గొబ్బుటూరి వేంకటానంద రాఘవరావు 'రాసుల ప్రశంస' భారతి పార్థివ మాఘము, పుటలు 149–160

22. తైత్తిరీయ సంహిత మాఘ పూర్ణిమనుంచి సంవత్సరాదిని చెప్పింది.
23. మహాభారతము అనుశాసనిక పర్వం అధ్యా. 64
24. రాసుల విషయంలో భారతీయులు గ్రీకులకు ఋణపడి లేరనటానికి చూడుడు – కవితా సమితివారి వైశాఖి సంచికలో శ్రీ గొబ్బూరి వారి 'నక్షత్రాలు' అనే వ్యాసం Astrological Magazine Vol. 38 - No.1. భారతి పార్థివ – మాఘము
25. Lokmanya B.G. Tilak. Orion p. 15
26. Epic India P. 117
27. ప్రాచీన ఖగోళము – భారతి సర్వధారి కార్తికము పు. 475
28. Astrological Magazine 1949 (Vol. 68. No. 2) Indian Year
29. ఋగ్వేదము 1. 164. 41; తైత్తి. అర. 1.9.4
30. "The Rig - Veda repetion served the purpose of a stop watch" - Astrological Magazine Vol. 38 N. 1-P. 79
31. తురీయాన్ని గురించిన వివరాలకు – వేద ఋషుల గణిత యంత్రము భారతి – వ్యయ ఫాల్గునము పుటలు 283–285
32. Life in the Gupta Age - R. Salatore P.P. 106-107
33. దీన్ని ఉపయోగించే విధానానికి Itsing P 144-145
34. 'Uranus and Neptune have only been rediscovered. They have been moving through the heavens and were known to Hindu astrologers ages - Alan Leo - Astrology Explained
35. Ep. Ind. Vol. VII
36. Ep. Ind. Vol. VIII
37. Ep. Ind. Vol. XX
38. Hultzch E-1-1 PP
39. 1. A Vol. VIII
40. విమలాదిత్యుని రణస్థపూడి శాసనము. Ep. Ind. Vol VI 397-398
41. శక్తివర్మ సాహిత్య పరిషత్తు శాసనము (A.S.P.P.)
42. శాతవాహన రాజుల కాలంలో మూడే ఋతువులు, పూర్ణిమతో మాసారంభము, గ్రీష్మము : చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢాలు, వర్షము శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తికాలు హేమంతము : మార్గశిర, పుష్య, మాఘ, ఫాల్గునాలు

***– ఆంధ్రపత్రిక, జయ ఉగాది సంచిక, 1954***

# పర్వదినాలు - సంస్కృతి

ఒక జాతి సంస్కృతిని ప్రతిబింబింపజేసే అంశాలలో పర్వదినాలు పరమ ప్రాధాన్యాన్ని వహిస్తున్నవనటంలో ఎట్టి అతిశయోక్తీ లేదు. భారతీయుల పర్వదినాలు వారి అత్యంత పౌరాతన్యమూ, అతి విశిష్టమూ అయిన సంస్కృతిని సర్వతోముఖం గానూ, సమగ్రంగానూ ప్రదర్శిస్తున్నవి. మన ప్రాచీన మహర్షులు, భారతదేశీయమైన భౌగోళికైక్యతను దర్శించిననాడే భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి, భారతీయులను అందరినీ ఏకజాతిగా తీర్చటంలో ఈ పర్వదినాలను ఒక ప్రముఖ సాధనంగా చేసుకున్నారు. భారతీయుల పర్వదినాలలో ప్రతి ఒక్కటీ వారి సంస్కృతిని ప్రతిబింబించే ఒక ఘన దర్పణం. "పర్వదినాలకు సంబంధించిన విజ్ఞానమంటే అది సర్వ సంస్కృతి విజ్ఞానం" అని అనటంలో ఎట్టి అనుపపత్తీ ఉండదు.

పరదేవతారాధానమే పరమ లక్ష్యంగా పెట్టుకున్న వారై, అన్నిటినీ దానితో అనుబంధించుకున్న భారతీయులకు చెందిన సంవత్సరంలో, పర్వదినం ఒక్కటైనా లేని మాసమంటూ లేదు. చైత్రంలో ఉగాది, వసంత నవరాత్రాలూ, కామోత్సవాలు, శ్రీరామ నవమి - వైశాఖంలో పరశురామజయంతి, శంకర జయంతి, విద్యారణ్య జయంతి, నృసింహ జయంతి, జ్యేష్ఠంలో గంగావతరణాలు - ఆషాఢంలో కర్కాటక సంక్రమణం, వ్యాసపూర్ణిమ (గురుపూజ) - శ్రావణంలో ఉపాకర్మ, శుక్రవార వ్రతాదులు - భాద్రపదంలో గణపతి నవరాత్రులు, (ఇంద్రద్వాదశి: భాద్రపదశుద్ధంలో) మహాలయామావాస్య - ఆశ్వయుజంలో శరన్నవరాత్రులు, నరక చతుర్దశి, దీపావళి - కార్తికంలో నక్తవ్రతాలు, నాగచతుర్థి - మార్గశీర్షంలో లక్ష్మీవారాలు, సుబ్రహ్మణ్య షష్ఠి, దత్తజయంతి - పుష్యంలో మకర సంక్రాంతి, ఉత్తరాయణ పుణ్యకాలం - మాఘంలో రథ సప్తమి, శివరాత్రి - ఫాల్గునంలో కామదహనాదులు, ఇత్యాదులయిన పర్వదినాలతో భారతీయుల సంవత్సరం చక్రీభూతంగా వివరించుకొని ఉంది.

ఈ పర్వదినాల్లో భారతీయ చారిత్రక దినాల్లో ఏర్పడ్డ శంకరాచార్య జయంతి, విద్యారణ్య భారతీ జయంతి వంటివి కొన్ని తప్ప ఇతరాలైనవన్నీ ఎంతో పురాతనమైనవి. కేరళ దేశంలో మాత్రమే కనుపించే "ఓణం" వంటి కొద్ది పర్వదినాలు తప్ప మిగిలినవన్నీ ఆసేతుశీతాచలం ఒకేరీతిగా ఆచరించే పర్వదినాలే. కనుక ఇవి అన్నీ భారతదేశీయాలే.

వీటిలో గణేశ చతుర్థి, నాగచతుర్థి వంటి పర్వదినాలు వేదోక్త దేవతాకాలు. కర్కాటక సంక్రాంతి, మకర సంక్రాంతి, శ్రావణ పూర్ణిమల వంటివి స్మార్తపర్వదినాలు. శరన్నవరాత్రులవంటివి తాంత్రిక పర్వదినాలు. నరక చతుర్దశి, భీష్మ ఏకాదశి వంటివి పౌరాణిక పర్వదినాలు. అందువల్ల ఆయా పర్వదినాలలో ఆయా కాలాలకు చెందిన భారతీయ సంస్కృతి ద్యోతక మౌతుంటుంది. భారతీయ పర్వదినాల్లో సామాన్య ప్రజల నృత్యగీత కేళీ విలాసాదులకే విశేష ప్రాధాన్యం కనిపించే జాతరలు మొదలుకొని, అతి నిగూఢమైన సృష్టి రహస్య విజ్ఞానంతో గూడిన శరన్నవరాత్రుల వంటి తాంత్రికోపాసన వరకూ ఉన్నవి. పర్వదినాల్లో కొన్ని జాతి నిర్మాణాన్నీ, రక్షణనూ, సంక్షేమాన్నీ చేకూర్చిన మహాపురుషుల జన్మస్మృతికి సంబంధించినవి. కొన్ని జ్ఞాన విజ్ఞాన ప్రదాతలైన గురువర్యుల యెడ కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ అభినందించేవి. కొన్ని శ్రావణ మంగళవార, శ్రావణ శుక్రవార, మార్గశీర్షంలోని లక్షీవారాల వంటివి సాంఘికోత్సాహ మూలకాలై క్రమశిక్షణాదులను నేర్పి యువకలోకాన్ని భావిజీవితానికి అనుగుణమైన ప్రవర్తనను పొందేవాటిగా పరిణమింపజేసేవి. తొలుత ఏ ఉద్దేశంతో ఏర్పడ్డప్పటికీ నానారీతులైన ఇవి, అంటే ఒక రీతి పర్వదినాలు మరొక పర్వదినాలుగా రెండవ రీతి పర్వదినాల మీద తమ ప్రభావాన్ని నడుపుకుంటూ వచ్చి, అధిక సంఖ్యాకంగా సంఘంలోని సర్వశ్రేణులకూ చెందిన జనసముదాయాన్ని ఆకర్షించేటట్లు రూపొందాయి.

ఖగ చక్ర పరిభ్రమణం వల్ల ప్రకృతిలో కలిగే ఉల్లాసకరాలూ, శుభప్రదాలు అయిన వసంత సౌభాగ్యం, గ్రహోద్ధతి మొదలైన ప్రకృతి శక్తులను ఊహించడంతో భారతీయుల దేవతారాధన ప్రారంభమై ఉంటుంది. అయితే అతి పురాతనమైన అనాదికాలంలోనే, తాత్త్వికులుగానూ, ఆధ్యాత్మిక యోచనాతత్పరులుగానూ పరిణమించిన భారతీయులు చరాచర ప్రకృతి సమస్తం శివశక్త్యాత్మకమైన పరబ్రహ్మ స్వరూపమనీ, సృష్టి స్థితి లయాలనే పరిణామ విపరిణామాలను పొందుతుందనీ, ఆత్మజ్ఞానార్జన చేసి ఆ పరబ్రహ్మమందు లీనం కావటం లేదా ఆ పరబ్రహ్మను అందుకోవటం పరమానందమనీ, మోక్షమనీ, అదే జీవికి చరమలక్ష్యమనీ నిర్దేశించుకొన్నారు. సత్, చిత్, ఆనందస్వరూపమైన యీ పరబ్రహ్మాన్ని ఖగోళ విజ్ఞానం మూలంగా బహురూపాల్లోనూ, ఇష్టదేవతామూర్తులుగాను వీక్షించి ఉపాసించటం (అర్చించటం, పూజించటం) కోసమే పర్వదినాలను నిర్దేశించి నిబద్ధం చేసుకొన్నారు.

ఇందుకు అనుగుణంగా చతుర్విధ పురుషార్థ వివేకం, చతురాశ్రమాదుల పరిచయం, యోగాది విద్యాపరిజ్ఞానం, శిల్ప నాట్య సంగీతాది కళానైపుణ్య సంపాదన

ఇత్యాదులతో గూడిన ఉత్తమ సంస్కారోపేత సాంఘిక వ్యవస్థ రూపొందింది. భారతీయుల సర్వ పర్వదినాలలోనూ తాత్త్వికమూ లేదా ఆధ్యాత్మికమూ అయిన, సాంస్కృతిక దృష్టి అభివ్యక్తమౌతుంటుంది. భారతీయుల పరదైవతం, ఉపాసించే వారి ప్రయోజనాలకు బ్రహ్మ విష్ణు మహేశ్వరాది ముక్కోటి దేవతామూర్తులను ధరిస్తుంటాడు. అనంత వైవిధ్యంతో గోచరించే ఈ మూర్తులకు రూపకల్పన చేసి, అర్చావిధానాన్ని అవగతం గావించేటందుకు అనేకమైన ఆగమ, తంత్ర గ్రంథాలు, గృహ్య శ్రౌత సూత్రాలు, ధర్మ, జ్యోతిష, జన్మాది శాస్త్ర గ్రంథాలు – అనంతమైన దైవ విజ్ఞాన గ్రంథజాలం అవతరించింది. పర్వదినాలలో విశేష ప్రాచుర్యం వహించే దీనిని పరిశీలిస్తే విశ్వ సృష్ట్యాదులను గూర్చిన భారతీయుల భావనావైశద్యం, శిక్షాఛందాదులందు వారు సాధించిన విజ్ఞానం, నృత్య సంగీత శిల్పాదులందు వారార్జించిన నైపుణ్యం, శౌచ సత్యదాన దయాధర్మాదులందలి వారి దృక్పథం మొదలైన వాటిలో వారు ఎంతటి బాహ్యాభ్యంతర సంస్కృతిని సంపాదించారో వ్యక్తమౌతుంది. వసంత నవరాత్రుల్లో కామదేవుడిని, కృష్ణాష్టమినాడు యోగమాయను, వినాయక చతుర్థినాడు గణపతిని, శరన్నవరాత్రులలో ప్రధానంగా సరస్వతీ, లక్ష్మీ, దుర్గలను, ధనుర్మాస దినాల్లో మహావిష్ణువును, శివరాత్రినాడు మహాదేవుణ్ణీ, స్కందషష్ఠినాడు కుమారస్వామిని, రథసప్తమినాడు సూర్యదేవుని – ఈ రీతిగా ఆయా పర్వదినాల్లో ఏయే దైవతాన్ని ఆరాధించినా, ఆయా దేవతలను అందరినీ పరబ్రహ్మమనే భావంతోనే భారతీయులు ఆరాధిస్తారు. షణ్మతాలవారూ వల్లభ చైతన్యప్రభు అనుయాయులయిన వారు పంచాయతన దేవతార్చనగావించే, అద్వైతులు చేసే అర్చనారీతులు ఆయా శాఖ వారి విశ్వాసాలకు చెందిన మానసిక సంస్కృతీవిభేదాలను అభివ్యక్తం చేస్తుంటవి. దత్తాత్రేయ సంప్రదాయులవారు మార్గశీర్షంలో వచ్చే దత్త జయంతి నాడు త్రిమూర్త్యాత్మక రూపుడైన దత్తాత్రేయుని కొలవటం ఈ విధానాన్ని నిరూపించటానికి ఒక చిన్న నిదర్శనం.

రథసప్తమినాడు అర్చింపబడేది సూర్యుడే కాక కార్తికేయ, గణేశాది దేవతలు, ఎందరో జ్యోతిర్గణాలు, నక్షత్రగణాలు. ఆకాశంలో గంగావతరణానికీ, కొన్ని సమయాల్లో విశేషంగా గోచరించే "గంధర్వ నగరాలకూ", ఇత్యాదులకూ తమ జీవితాలకూ సంబంధం ఉన్నదని ఏ నాడో గుర్తించిన భారతీయులు, అందుకు హేతువులైన నక్షత్ర గణాలనూ, జ్యోతిర్గణాలను వాటి ఉదయాస్తమయాలలో అర్చించటం వారి సాంస్కృతికోన్నతిని వెల్లడి చేస్తున్నది. ఆ నక్షత్ర లక్షణాలకూ, జ్యోతుల గుణ విశేషాలకూ, వానివల్ల రూపొందిన దేవతలకూ ఉన్న సంబంధాన్ని అవగతం చేసుకొని

మనం మన ప్రాచీనతాదృష్ట్యా ఆవిర్భవించిన అంటే మన పూర్వ మహర్షులు దర్శించిన, విశ్వ విజ్ఞానాన్ని ఆర్జించటం ఎంతైనా అవసరం. జ్యోతిర్గణిత శాస్త్రరీత్యా కల్పాదితో స్పష్టంగా సంబంధం ఉన్నట్లు గోచరిస్తున్న ఉగాదినాడు, సంవత్సర పురుషుడికి పర్వదినం చేసి భారతీయులలో ఒక శాఖవారు సాంవత్సరిక కర్మారంభం గావించటం పర్వదిన దృష్టితోనే. భాద్రపద కృష్ణ పక్షంలోని మహాలయ అమావాస్య అయిన తరువాత వచ్చే శరన్నవరాత్రుల్లో ప్రధానంగా సృష్టి, స్థితి లయ శక్తి దేవతలైన సరస్వతీ, లక్ష్మీ, దుర్గలను పూజించి పొందిన యోగసిద్ధి దినాన్ని, వారు బహువిధరూపాల విజయదశమిగా భావిస్తారు. ఒక శాఖవారి దృష్ట్యా ఆదిదేవుడైన మహాదేవుడు లింగోద్భవ మూర్తిగా ఉద్భవించిన అంశాన్ని నిరూపించటానికి ఉద్దేశితమైన శివరాత్రి సర్వ సృష్టీ తమస్సుతో నాగతేజోద్భూత మౌతుందన్న విజ్ఞాన రహస్యాన్ని వ్యక్తీకరిస్తుంది. భారతీయ దేవతల చిత్రవిచిత్ర రూపాలకూ, వారిని అర్చించే దినాల నాటి నక్షత్రాల లక్షణ విశేషాలకూ ఉన్న సంబంధాన్ని జ్యోతిశ్శాస్త్ర విజ్ఞానం ద్వారా తెలుసుకొనటం సామాన్య శాస్త్రజ్ఞులకు సైతం ఎంతైనా అత్యవసరం.

దుష్ట శక్తులవల్ల భారతీయ ధర్మానికి ఉపప్లవం సంభవించినప్పుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణలకోసం పరమాత్మ మత్స్య, కూర్మాది దశావతారాలను ధరించటం జరిగింది; జరుగుతుంది. అట్టి అవతరణ సమయాలను స్మరించటం ఆస్తికత్వ విషయాలు – గాఢ విశ్వాసాన్ని నెలకొల్పటం మొదలైన విశ్వాసాలలో వామన జయంతి, నారసింహ జయంతి, పరశురామ జయంతి, శ్రీరామనవమి, కృష్ణాష్టమి (జన్మాష్టమి), నరకచతుర్దశి మొదలైన పర్వదినాలు ఏర్పడ్డవి. ఈ అవతారాలు అర్చనాది విధానాలవల్ల భారతీయులకు బహుముఖీనాలైన లౌకిక, దైవిక విజ్ఞానాలు సంప్రాప్తిస్తవి.

భారతీయుల ధర్మశాస్త్రం వారికి దేవ, గురు, పితృ ఋణాలనే ఋణత్రయం ఉన్నట్లు నిర్దేశించింది. వ్యాసభగవానుడు మానవులకు “మనుజ ఋణం” అనే నాల్గవ ఋణం కూడా ఉన్నట్లు భారతం – ఆశ్రమవాస పర్వంలో ఒక సందర్భాన ఆదేశించాడు. భారతీయులు వివిధ పర్వదినాల్లో తమ జన్మాదులకు మూలకారణాలైన దేవతల స్వరూపాది విశేషాలను తెలుసుకొని అర్చిస్తూ, వారి దైవ ఋణాలను తీర్చుకుంటారు. ఉపనయనాది సంస్కారాలను ప్రదానం చేసి, లౌకిక దైవిక విజ్ఞానాన్ని ప్రసాదించి వారి జీవితాన్ని తీర్చిదిద్ది నడిపించిన గురువర్యులను పూజించి, వారి గురుఋణాన్ని తీర్చుటకోసం ఏర్పడ్డవే గురుపూర్ణిమ (వ్యాసపూర్ణిమ), శంకర, రామానుజ, మధ్వాచార్యాదుల పుణ్య దినాలు. భారతీయుల దృష్టితో గురువులు బ్రహ్మ

విష్ణు మహేశ్వర స్వరూపులు. ఇట్టి గురువుల్లో భారతీయులకు అగ్రగణ్యుడు వ్యాస భగవానుడు. ఈయనను అర్చించటం ఆర్జించటం కోసం అగ్రహారాది మహాదానాలను గావించేది, విశేషంగా యీ మకర సంక్రాంతి పుణ్యకాలంలోనే.

భారతీయులు ఈ విధంగా పర్వదినాలలో దేవ, గురుదేవ, పితృదేవతలను అర్చించి, వారి యెడ ఋణాలను తీర్చుకోవటం మూలంగా ఆది భౌతిక ఆధాన చిత్త సంస్కృతిని పొంది, శిష్యశిక్షణకోసం దాన్ని ప్రదర్శిస్తుంటారు. పర్వదినాల్లో త్రివిధ దేవతలను ఆహ్వానించి షోడశోపచారాలను సమర్పించి, తిరిగి నూతన సంవత్సరం వచ్చి ఉద్వాసన చెప్పేటంత వరకూ నడిచే తంతు, భారతీయుల సంస్కృతీ, వైవిధ్యాన్ని బహుళ కోణాలలో ప్రదర్శిస్తుంది. పర్వదినాలో ఈ త్రివిధ దేవతార్చన సమయాల్లో భారతీయులు పాటించ వలసిన సామాన్య లక్షణాలుగా స్మృతి గ్రంథాలు నిర్దేశించిన ఇంద్రియ నిగ్రహం, సహనం, శుచిత్వం, సత్యప్రియత్వం, అతిథి పూజాపరత్వం, యజనయాజన యాజమాన్యాచరణం, పరద్రవ్యాపహరణవైముఖ్యం, ఉపవాస, జాగరణాదులు వారు సాధించిన సంస్కృతీవిశేషానికి కొన్ని సూచికలు మాత్రమే. సస్యం సమర్పించగా సంప్రాప్త మౌతున్న సంక్రాంతి వంటి పర్వదినాల్లో సర్వజనులూ పట్టణ నగర గ్రామీణ బాహ్యాలంకార గృహాలంకరణ గావించుకొని, అభ్యంగన స్నాన, నూతన వస్త్రాలంకరణలు చేసుకొని, ఏకాంత (వ్యక్తి) సమష్టి సంగీత నాట్య విలసనలతోటీ, స్త్రీ పురుషులు వివిధ రంగాలలో ఆర్జించిన విద్యావిశేషాలతోటీ ప్రేక్షకులను సంతోషపరచటం అనే ఆలోచనతో పరికిస్తే, భారతీయుల పర్వదిన విజ్ఞాన వైయాత్యం ఎంత బహుముఖీనమూ, ఘనతరమూ అయినదో అభివ్యక్త మౌతుంది.

***23-6-న విజయవాడ ఆకాశవాణిలో చేసిన ప్రసంగం***

# శరీరాలు - వాసనలు (సంస్కారాలు)

సర్వపాపాలకూ స్థూలమూ, సూక్ష్మమూ, కారణమూ అనే మూడు రకాలైన శరీరాలున్నవి. చేతనుడైన జీవుడు ఈ శరీరాలలో ఉంటాడు. స్థూలశరీరం మరణాదుల్లో పతనాన్ని పొందినప్పటికీ, సూక్ష్మశరీరం నిలిచే ఉంటుంది. ఇది గోచరం గానిది. దీనితోనే జీవుడు లోకాంతరాల్లో సుఖదుఃఖాలను తన కర్మానుసారం అనుభవిస్తూ ఉంటుంటాడు. మనుజుడు దుస్తులను ధరించి విడుస్తున్నట్లు ఈ సూక్ష్మశరీరంతో గూడిన జీవుడు (జీవచైతన్యం) తన పుణ్యపాపాలవల్ల వచ్చే ఆయా రూపాలయిన స్థూలశరీరాలను జన్మసమయాన ధరిస్తూ మరణసమయాన విడుస్తుంటాడు. శరీరాలు మారినా వాటిలోని సూక్ష్మ శరీరం ఒక్కటే అవటం చేత, ఆయా పూర్వజన్మల్లో తనకు గలిగిన వాసనలను (సంస్కారాలను) మాత్రం తాను పొందే ఉంటాడు. కనుక పూర్వజన్మ సంస్కారాలు తరువాతి జన్మల్లో అజ్ఞాతంగా పనిచేస్తూ ఉంటాయని వేదమత సిద్ధాంతము. అలాగే పూర్వజన్మకృతాలైన పుణ్యపాపాల కర్మలకు చెందిన ఫలాలైన సుఖదుఃఖాలనే జీవుడు అనుభవిస్తూ ఉంటాడనీ, చేసిన పుణ్యపాప కర్మలు అనుభవించనిదే క్షీణింపవనీ, "నా భుక్తం క్షీయతే కర్మ" అనీ ఈ వేద సిద్ధాంతము. పాప కర్మాలను కొంతగా క్షీణింపజేసుకొనటానికి ప్రాయశ్చిత్తాలు సైతం ఉపయోగపడతాయని ధర్మశాస్త్రం చెపుతున్నది. ప్రాణులు ఎట్టి పాపకార్యాలు ఆచరిస్తారో వాటిని అనుసరించే పరమేశ్వరుడు వారికి ఆయా సుఖదుఃఖాలు కలుగజేస్తాడు గాని, ఆయన కేవలం తన బుద్ధ్యనుసారంగా మాత్రం ప్రాణులకు సుఖదుఃఖాలను కలుగజేయడు. కర్మలను నిమిత్తంగా చేసుకొని ప్రాణులకు ఫలాలను ఇచ్చేవాడు ఈశ్వరుడే అవటం వల్ల, మనుష్యులకు ఈశ్వరానుగ్రహం సైతం ఆవశ్యకమౌతున్నది. ఇలా ఒక బీజం అంకుర భావాన్ని పొందటానికి ఆ బీజానికి ఉన్న బీజశక్తీ, జలశక్తీ రెండూ ఎలా ఆవశ్యకాలో అలాగే జీవుడు తాను ఆచరించిన కర్మఫలానికి స్వప్రయత్న రూపమైన కర్మశక్తీ, పరమేశ్వరానుగ్రహరూపశక్తీ అంటే ఉభయశక్తులూ అవసరాలే. ఈ విషయాన్ని బాదరాయణ మహర్షి బ్రహ్మ సూత్రాల్లోని "కృత ప్రయత్నాపేక్షస్తు" (2-3-42) అన్న సూత్రంలో వివరించి ఉన్నారు. అందువల్లనే ఒకానొక కార్యం కేవలం పురుష శక్తిపై గానీ, లేదా కేవల పరమేశ్వరానుగ్రహంపై గానీ ఆధారపడదని ఆర్ష సిద్ధాంతము.

ఇట్టి దైవానుగ్రహ సంపాదనకు పరమేశ్వరారాధనం ప్రధానం. సర్వవ్యాపకమైన విద్యుచ్ఛక్తిని కొన్ని సాధనాలతో పరిమితం చేసి, ప్రత్యక్షం గావించుకొని తత్ఫలాలను మనం అనుభవిస్తున్నట్లు సర్వ వ్యాపకుడు, సర్వశక్తిసంపన్నుడు అయిన పరమేశ్వరుడు ఒకే పరిమిత భావాన్ని సహజంగా పొంది ఉండకపోయినప్పటికీ, మంత్ర తంత్రాది శాస్త్రవిధానం చేత పరిమితాలైన మూర్తులందూ (విగ్రహాలు, సాల గ్రామాలు మొదలైన వానియందూ) ధ్వనిరూపాలైన మంత్రాలందు, పరిమితం గావించుకొని తదనుగ్రహాన్ని పొంది, మనం తత్ఫలితాలను పొందవచ్చునని శాస్త్రాలు చెప్పుతున్నవి.

ఒక వ్యక్తి పుత్ర, మిత్ర, కళత్ర, శత్రు, రూప, గ్రహీతృభేదం చేత నానా విధానాలను పొంది, ఆయా ఫలాలను వారి వారికి అందించనట్లు ఈ పరమేశ్వరుడు సైతం ఈ ఉపాసకుని అంతరంగభేదం చేత భిన్నభిన్నంగా స్వీకరింపబడుతుంటాడు. అంతేగాక ఒకే పరమేశ్వరుని స్త్రీ రూపంగానైనా, పుం రూపంగానైనా లేక కళారహిత రూపంగానైనా భావన చేస్తూ (ధ్యానిస్తూ) మనం తత్ఫలాన్ని పొందగలమని "స్త్రీ రూపం చింతయే ద్దేవం పుంరూపం వా విచింతయేత్ అథవా నిష్కలం ధ్యాయేత్ సచ్చిదానంద విగ్రహమ్" ఈ విధంగా శాస్త్రం పేర్కొంటున్నది. దీనిని బట్టి దేవతా రూపాలు అనేకవిధాలుగా ఉన్నప్పటికీ, వాస్తవం చేత అవి అన్నీ ఒకే దేవతకు చెందిన విభిన్న రూపాలనీ, ఆయా భక్తులందరూ తమచేత పూజింపబడే దేవతారూపాలను కేవలం పరమేశ్వర రూపంతోనే ధ్యానిస్తారనీ తెలిసికోవలసివుంది.

పైన తెలిపిన పద్ధతిలో ఉత్తమ భక్తుడై పరమేశ్వరాధనను తన వర్ణాశ్రమాలకు విధింపబడ్డ కర్మానుసారం ఆచరిస్తూ అంత్యాన శరీరత్యాగం చేసినవాడు, ఆయా పుణ్యానికి అనుకూలమైన లోకాన్ని పొంది, అందులో తన పుణ్య పరిమితికి తగినంత కాలం ఆ పుణ్య ఫలమైన సౌఖ్యాలను అనుభవించి, కొంచెం పుణ్యం మిగిలి ఉండగానే ఆ శేషపుణ్యకర్మతో మళ్ళీ భూలోకాన ఆ పుణ్యకర్మకు అనుకూలమైన జన్మను పొందటం జరుగుతుంది. ఇదే గీతలో

"తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి"

అని చెప్పబడింది. ఇదే విధంగానే పాపఫలాన్ని ఆయా నరకస్థానాలలో అనుభవించి, ఆ పాపం క్షీణింపగా మిగిలిన కించిత్పాపంతో దాని కనుకూలమైన భూప్రదేశాన సూకరాది జన్మలను పొందటం జరుగుతుంది. దీనిలో ఒక విశేషముంది. మృతులైన జీవులు ఎలా పుణ్యలోకాలకు వెళ్ళుతున్నారో, అట్లాగే అక్కడ పుణ్యానుభవం ముగిసిన

తదుపరి మళ్లీ భూమిమీదికి ఎలా అవతరిస్తున్నారో ఆ ఆరోహణ – అవరోహణ క్రమాన్ని ఉపనిషత్తులు మనోహరంగా వర్ణించి వున్నాయి. అందు పుణ్యాత్ములు పుణ్యభేదాన్ని బట్టి ద్వివిధాలైన గతులను పొంది వుంటారు. అందు ఉత్తమ పుణ్యులగతి అర్చిరాది మార్గము. సామాన్యపుణ్యుల మార్గము ధూమ్రాది మార్గము. అర్చిరాది మార్గగతులు పునర్జన్మ నొందక శాశ్వత బ్రహ్మలోకాన్ని చేరుకొంటారు; ధూమ్రాది మార్గగతులు స్వర్గ ఫలాన్ని అనుభవించి తిరిగి భూమిమీదికి వస్తారు. అలా రావటంలో మొదట వారు తమ పుణ్యలోకాల నుంచి వెనుకకు మళ్ళీ ఆకాశాన్నీ, అక్కడినుంచి వాయురూపాన్నీ, దానినుంచి ధూమభావాన్నీ దానినుంచి మేఘభావాన్నీ పొంది వర్షరూపంతో వీహ్రియవాది ఓషధులై, వాటిని భుజించిన స్త్రీ పురుషుల శోణిత శుక్లరూపాన్ని పొంది మాతృగర్భం నుంచి అవతరిస్తున్నారని ఛాందోగ్యోపనిషత్తు ఇలా వ్యక్తం చేసింది.

> "తస్మిన్ యావత్ సంపాతముషిత్వా అథైతమే వాధ్వానం పున
> ర్నివర్తన్తే యథేత మాకాశా ద్వాయుః, వాయు ర్భూత్వా
> ధూమో భవతి ధూమోర్భూత్వా అభ్రం భవతి" ఛాం. (5–10–5, 6)

పైన వర్ణింపబడ్డ రీతిగా పుణ్యఫలంగా గానీ, పాపఫలంగా గానీ జననమరణాలను పొందటం అంతా దుఃఖరూపమే అనీ, ఇది అంతా సంసారమే అనీ, ఇట్టి సంసారం నుంచీ విముక్తిని పొందటము అంటే జననమరణాలు ఎన్నటికీ కలుగుకుండా ఉండటమే ఉత్తమస్థితి అనీ, దానినందువాడే ఉత్తముడనీ శాస్త్రాలు చెప్పుతున్నవి.

ఇట్టి జనన మరణ రూపమైన సంసారం నుంచి కలిగిన విముక్తినే "మోక్షము" అని ఉపనిషత్తులు పేర్కొంటున్నవి. మోక్షము అంటే విడుచుట, విడివడుట అని అర్థం. ఇట్టి మోక్షస్థితి తాను ఎవరో తన స్వరూపాన్ని అనుభవపూర్వకంగా గుర్తెరిగినట్లయితే కలుగుతుంది. అని "జ్ఞానా దేవతు కైవల్యం" అన్న శ్రుతుల చేత తెలుస్తున్నది. అంటే లోకంలో దుస్తులను ధరించిన ఒక సామాన్యవ్యక్తి దుస్తులతో గూడిన తననే ఫలాని వ్యక్తిగా భావిస్తూ, దుస్తులు తనకంటే భిన్నమైనవని ఎలా భావింపజాలడో, అలాగే మానవుడు చైతన్య రూపమైన తన స్వస్వరూపం కంటె అంగీలవంటి స్థూల సూక్ష్మాది శరీరాలు వేఱయినవని తలపలేక, ఆ శరీరాలే తన రూపమని భావిస్తున్నాడు. అందుచేత నతనికంటె భిన్నమైన శరీరాదులకు కలిగిన బాధలను తనకు గలిగిన బాధలుగా భావిసూ్త అనేకమైన యాతనలను అనుభవిస్తున్నాడు.

ఏ నాడు సద్గురు శాస్త్రాలు "నీవు కేవల చైతన్య స్వరూపుడవే కనుక ఈ దేహాదులు నీ రూపాలు కావు. ఈ దేహాదులు చొక్కాల వంటివి. అందువల్ల ఈ దేహాదులకు కలిగే బాధలు నీకు ఎంత మాత్రం అంటవు. దేహాదులు ఎప్పుడు జీవరూపాలు కావో – అంటే వానికంటే చేతన రూపుడయిన జీవుడు వేఱయిననాడో – అప్పుడు సర్వజీవుల్లో కనుపించే చైతన్య మొక్కటే అనీ, ఒకే సూర్యుడు నానాతరంగాలలోనూ ప్రతిబింబిస్తూ అనేకాలుగా కనబడినట్లు, ఈ ఒకే ఒక చైతన్యం నానావిధ శరీరాలనే ఉపాధుల భేదం చేత భిన్న భిన్నములుగా కనబడుతున్నదనీ, వాస్తవం చేత ఈ చైతన్య మొక్కటే అనీ, ఈ చైతన్యమే జగత్కారణమైన బ్రహ్మమనీ, అందువల్ల నీవు జగత్కారణమైన బ్రహ్మమువే (తత్త్వం అసి) అనీ చేసే ఉపదేశాలను అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడో అప్పుడు ఆ సాధకుడు "అహం బ్రహ్మాఽస్మి" అనే జ్ఞానాన్ని అందుకొని అఖండ విజ్ఞానానంద రూపమైన స్వస్వరూపమందే లీనమౌతుంటాడు. ఈ అర్థాన్నే "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అన్న శ్రుతి చెపుతున్నది. అట్టి ముక్తుడు తన రూపాన్ని సర్వ ప్రాణులలోనూ, సర్వ ప్రాణులనూ తనలోను చూస్తుంటాడు." ("తనయందు సకల భూతములందు నొక భంగి" అని భాగవతము) అనీ వేదాలు చెపుతున్నవి. "జగత్కారణమూ, స్వస్వరూపమూ అయిన బ్రహ్మము సత్ – చిత్ – ఆనంద – స్వరూపుడే గాని కరచరణాద్యవయవ విశిష్టుడెంత మాత్రం కాజాలడు అట్టి రూపాలు వాస్తవరూపాలు ఎంతమాత్రం కావు" అని శాస్త్ర హృదయము. పరమేశ్వరుడు ప్రపంచాన్ని సృష్టించి, తానే జీవరూపంతో అందులో ప్రవేశించాడు గనుక, జీవుడు పరమేశ్వర రూపుడే అన్న విషయం "తత్ సృష్ట్వా త దేవాను ప్రావిశత్, అనేన జీవే నాత్మనా ప్రవిశామి" మొదలైన శ్రుతుల చేత చెప్పబడింది.

పూర్వం తెలిసిన సకలకర్మలకు గానీ, సకల ఉపాసనాదులకు గానీ ఇట్టి మోక్షస్థితి యందే పరమతాత్పర్యం అని వైదిక సిద్ధాంతం.

# గడియారము

భారతీయుల సంవత్సరము ప్రధానంగా సౌరమానాన్ని అనుసరించి పరిగణితమౌతున్నది. భారతీయుల సిద్ధాంతాన్ని అనుసరించి సూర్యుడు క్రాంతి వృత్తము (Ecliptic) నిర్ణీతమైన వర్తులముపై గమిస్తాడు. ఈ క్రాంతి వృత్తము 27 భాగాలుగా విభాజితమై ఉంది. ఒక్కొక్క భాగానికి ఒక నక్షత్రమని నామము.

సూర్యుడు అశ్వినిలో ప్రవేశించటంతో భారతీయుల సంవత్సరం ఆరంభిస్తుంది; రేవతితో అంతం పొందుతుంది. వైదికకాలంలో కూడా సంవత్సరపరిగణనం ఇదేవిధంగా ఉండేది. ఋగ్వేద సంహితలలోనూ, యజుర్వేద సంహితలలోనూ ఈ విషయాన్ని నిరూపిస్తూ అనేక మంత్రాలు కనిపిస్తున్నవి. ఉదా :

అభోద్యగ్నిర్జ్మ ఉదేతి సూర్యో వ్యుషరశ్చంద్రా మహ్యామో అర్చిషా ।
ఆయుక్షతా మశ్వినీ యాతవే రథం ప్రాసావి ర్దేవః సవితా జగత్పృథ ॥
(ఋగ్వే. 1.154.1)

పాసాత్యౌ చిత్రౌ జగతే నిధానౌ
ద్యావా భూమీ చరథః సం సఖాయౌ ।
తా వాశ్వినీ రాసభస్వా హవం మే
శుభస్పృతీ ఆగతం సూర్యయా సః ॥ (తైత్తిరీ యారణ్యకము (1.10.2)

వీటిని బట్టి వైదికకాలంలోని సంవత్సరము సూర్యుడు అశ్వినిలో ప్రవేశించినప్పుడే ప్రారంభ మైనదని మనకు అర్థమౌతున్నది. అంటే వేదకాలారంభం నుంచీ నేటివరకూ సంవత్సరం ఒకేరకంగా ఆరంభమై, అంతం పొందుతున్నదన్నమాట.

**సంవత్సరము రెండు భాగాలు:** దేవ అహస్సు, దేవరాత్రి. దేవ అహస్సులో సూర్యుడు అశ్విని నుంచి పునర్వసు మీదిగా చిత్ర చేరుకుంటాడు, దేవరాత్రిలో చిత్రనుంచి ఉత్తరాషాఢ మీదుగా మరల అశ్విని చేరుకుంటాడు.

సంవత్సరానికి – వసంతము, గ్రీష్మము, వర్ష, శరత్తు, హేమంతము, శిశిరము – ఆరు ఋతువులు. వసంతము సౌర సంవత్సరంతోనే ఆరంభ మౌతుంది. సంవత్సరము వసంతంతో ఆరంభిస్తుంది.

"సౌరాగవస్తై ర్జరరక్షః వసంతో వసుభిస్సహ
సంవత్సరస్య సవితోః ప్రైషకుత్ప్రథమః స్మృతః "

అన్న తైత్తిరీయ వాక్యాన్ని బట్టి (1.3.2) వైదిక కాలంలో కూడా ఇలాగే వసంతారంభాన్ని గురించి, వత్సరారంభాన్ని గురించి భావించారని వ్యక్త మౌతున్నది.

"ద్వాదశారం నహి తజ్జరాయ వర్వర్తి చక్రం పరిద్యామృతస్య
ఆపుత్రా అగ్నే మిధానాసో అత్ర సప్త సతాని వింశతిశ్చ తస్యుః"
(ఋగ్వేదమ్ – 1.23.11)

సుబ్రహ్మణ్యోం సుబ్రహ్మణ్యోం సుబ్రహ్మణ్యామ్ ఇంద్రాగచ్ఛ హరివ
ఆగచ్ఛ మేధాతేథౌః మేషవృషణ శ్వస్య మేనౌ

భారతీయుల "సౌర – చాంద్ర వత్సరానికి" (Luni - Solar year) మాసాలు పన్నెండు. అశ్విని మొదలు రేవతి వరకూ ఉన్న ఈ సంవత్సరానికి మూడు వందల అరవై (360) నక్షత్ర దినాలుగా విభజించారు. ఈ విభజన సూర్యుడు కాంతి వృత్తంమీద ఒక డిగ్రీనుంచి మరొక డిగ్రీ వద్దకు నడిచే కాలాన్ని మాత్రమే తెలియజేస్తవి. ఈ మూడు వందల అరవై నక్షత్ర దినాలు కూడా ఋగ్వేద సంహితా కాలంనాటివే.

ద్వాదశ ప్రథమ శ్చక్రమేకం త్రీణి నఖ్యాని క ఉతశ్చి కేత
తస్మిన్యాకం త్రిశతాన శంకమోర్పితా షష్ఠి ర్నిచలాచలాసః

ఈ 'నక్షత్రదినము', 'స్థల–కాలము' (Space-Time) గ విభజితమైంది.

"క్షౌద మభ్రం నివేశిత్ క్వాయమ్ సంవత్సరాం మిధః
క్వాహక్వేయం దేవరాత్రీ, క్వమాసా ఋతవః శ్రితాః
అర్ధమాసా ముహుర్తాః నిమేషా స్త్రురిభి స్సహ"

అని తైత్తిరీయారణ్యకంలో ఉంది.

వారంలోని దినాలకు 'శక'మనీ తత్సంబంధమైన జ్ఞానానికి 'శకం జ్ఞాన' మనీ అన్నారు. ఋగ్వేద సంహితలో (మాండలము 1, అనువాకము 22 సూక్తము 6 సూత్రము 48.) సంవత్సరానికి పన్నెండు నెలలయ్యే 360 శకాలున్నట్లు ఉన్నది. తైత్తిరీయారణ్యకంలో వారాల వరుసను గురించి ఇలా ఉన్నది (ప్రశ్న – అనువాకము 3. పంచతి 1)

"అస్య వాడస్య పరితస్య మొతుస్తస్య భ్రాతా మధ్యమో అస్త్యశ్నః
తృతీయో భ్రాతా ఘృత పృష్టో అస్యా త్రాతస్యం విశపతిం సప్త పుత్ర"

ఋగ్వేద సంహితమూ, తైత్తిరీయారణ్యములనూ, వారముల క్రమాన్ని గురించి విపులంగా చెప్పి ఉంది; మిగిలిన సిద్ధాంత గ్రంథాలు వీటిని విశదీకరించినవి. దీనిని బట్టి వారాలను భారతీయులు గ్రీకుల వద్దనుంచి గ్రహించారని భావించటం పొరబాటు. వత్సర ప్రమాణాన్ని గురించి పోపు గ్రెగరీ (1582) కాలంవరకూ పాశ్చాత్యులు ఎరుగరు. గ్రీకుల ఆ కాలమే వత్సర ప్రమాణాన్ని క్రీ.శ. 1752 వరకూ ఇంగ్లండు అంగీకరించలేదు కూడాను.

*(అసంపూర్ణం)*

# శబ్దమూ - శబ్ద సంపదా

"దైవీం వాచ మసృజంత దేవాః, తాం విశ్వరూపాః పశవో వదంతి"

నేను మాట్లాడుతున్నాను నాకీ 'మాట్లాడటం' ఎలా వచ్చింది? ఈ జిజ్ఞాస ప్రారంభిస్తే తేలే సారాంశము : చిన్నతనంలో మా అమ్మా, నాన్నా నాకు కొన్ని శబ్దాలు నేర్పారు; తరువాత మా గురువు కొన్ని నేర్పారు; గ్రంథజాలం వల్ల నేను కొన్ని నేర్చుకున్నాను; ఈ శబ్దసంపదంతా నేను ఒకనాడుగా సేకరించుకున్నది కాదు అని తేలుతుంది. భాషాశాస్త్ర పరిభాషలో చెప్పవలెనంటే నాకు భాష సంఘమూలకంగా వచ్చిందనవలసి వస్తున్నది.

అయితే, నా కాలంవారికి శబ్దజాలం ఎలా వచ్చింది? పూర్వులనుంచి అని సమాధానం. వారి పూర్వులకో వారి పూర్వులనుంచి. ఇలా పోగా పోగా అనాది మానవ సంఘం దగ్గిరకూ, అనాది మానవుడి దగ్గిరకూ చేరుకుంటాము.

అప్పుడు అనాది మానవుడికీ శబ్దజాలం ఎలా వచ్చింది అనే జిజ్ఞాస కలుగుతుంది. అతడు పరిసరాలలో ఉన్న ఆయా వస్తువులను ఆయా శబ్దాలతో పిలుద్దామని ఏర్పాటు చేసుకొని ఉంటాడేమో అని అనిపించవచ్చును. లేదా జంతులోకం మధ్య తానూ ఒక జంతువుగా వ్యవహరిస్తూ, సుఖదుఃఖాలను వెల్లడి చేసుకుంటాడని జంతుజాలం చేసే శబ్దాలను అనుకరించటము నేర్చుకొని ఉంటాడు అని తోచవచ్చును. లేకపోతే అనాది మానవుడు సుఖదుఃఖాది ద్వంద్వాలమధ్య చేసే అవ్యక్త ధ్వనులవల్ల భాషలో శబ్దజాలం ఏర్పడి ఉండవచ్చును - అని ఆలోచన నడవవచ్చును.

భారతీయ విజ్ఞానము శబ్దము నిత్యమనీ, సృష్టితోనే ప్రారంభమైనదనీ, సృష్టికి అదే మూలమనీ పలుకుతున్నది. 'వాగేవ విశ్వా భువనాని జజ్ఞే', 'వాక్ తంత్రిః నామాని దామాని తస్యేదం వాచా తంత్ర్యాః నామభిః దామభిః సర్వం సితం' (సర్వమూ వాక్కువల్లనే పుట్టింది, దండలో దారం వలె అది సమస్తములోనూ అనుస్యూతంగా ఉన్నది) అనే శ్రుతి వచనాలు ఇందుకు ప్రమాణం. 'నామరూపే వ్యాకరోత్' అనే దానివల్ల ఉపనిషత్తు సృష్టికర్తే శబ్దాన్ని సృజించాడని ప్రవచిస్తున్నది.

పరమ శివుని స్వరూపమైన శబ్దంలోనుంచీ ఆకాశమూ, ఆకాశావచ్ఛిన్ను డైన ఈశానునివల్లా తచ్ఛక్తి ఐన పరాశక్తివల్లా శబ్దస్పర్శాత్మకమైన వాయువూ జనించింది. వాయుతత్త్వావచ్ఛిన్నుడైన తత్పురుషునివల్లా, తచ్ఛక్తి ఐన ఆదిశక్తివల్లా శబ్దస్పర్శ రూపాత్మకమైన వహ్ని స్పష్టమైంది. ఆ వహ్నికి అవచ్ఛిన్నుడైన అఘోరుడి వల్లా, తచ్ఛక్తి ఐన ఇచ్ఛాశక్తివల్లా శబ్దస్పర్శరూప రసాత్మకమైన జలం ఉద్భవించింది. తజ్జలా వచ్ఛిన్నుడైన వామదేవుడివల్లా, తచ్ఛక్తి అయిన జ్ఞానశక్తివల్లా శబ్దస్పర్శరూపరస గంధాత్మకమైన పృథివి ఆవిర్భూతమైనది.

ఇది మహాదేవమననంలోని పంచభూతోత్పత్తి కథనం. పాంచభౌతిక మైనది శరీరం. పంచ భూతాలకూ ప్రథమం ఆకాశం. ఆకాశం శబ్దగుణకము. శరీరము శబ్దం.

శబ్దము పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ – అనే నాలుగు అవస్థాభేదాలతో ఉన్నది. 'తురీయం వాచో మనుష్యా వదంతి' – మానవుడు వైఖరీ వాక్కులతోనే వ్యవహారం నడుపుకుంటున్నాడు. 'గుహా త్రీణి నిహితా నేంగయంతి' – గుహాశయమై లోపల శబ్దము పరా పశ్యంతీ మధ్యమ లనే మూడు అవస్థలూ పొందుతున్నది. దాన్ని యోగసాధన లేని సామాన్య మానవుడు తెలుసుకోలేడు. 'తాని విదు ర్బ్రాహ్మణా యే మనీషిణః' – మత్సరరహితులు, అలోపులూ, దర్పదంభ క్రోధ వర్జితులూ, బ్రహ్మవిద్యావేత్తలూ అయిన శిష్టులకు ఒక్కరికే శబ్దతత్త్వం సంపూర్ణంగా గోచరిస్తుంది. సామాన్య మానవులు కొంత కొంతగా వ్యాకరణ శాస్త్ర మూలంగా దానిని గ్రహించ వచ్చును. అందుకనే భగవత్పతంజలి 'మరణ ధర్మాణువులయిన మానవులను శబ్దతత్త్వాత్మకుడైన మహాదేవుడు ఆవేశించాడు; ఆ మహాదేవ పదవిని పొందాలంటే వ్యాకరణ శాస్త్రం చదివి తీరాలి' అన్నాడు. 'సక్తు మివ తిత ఉనా పునంతః యత్ర ధీరా మనసా వాచ మక్రత, అత్ర సుఖాయః సఖ్యాని జానతే, భద్రైషాం లక్ష్మీ ర్నిహితాధివాచి' – పేలాలను జల్లెడలో పట్టుకొని శోధించినట్లు శబ్దాలను శోధించి ప్రయోగిస్తే, వారు సత్పురుషులై సాయుజ్యాన్ని పొందుతారు; వారి వాక్కులో లక్ష్మి ఉంటుంది అని వేదము. 'ఏకః శబ్దః సమ్యక్ జ్ఞాతః సుష్ఠు ప్రయుక్తః స్వర్గేలోకే కామధుగ్ భవతి' అని అనటం వలన, శబ్దాన్ని తెలుసుకొని ప్రయోగిస్తే స్వర్గం మన పాలిటి కామధేనువు అవుతుందట!

***

'సర్వే వేదా యత్పద మామనంతి, తపాంసి సర్వాణి చ యద్ వదంతి, యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి, తత్ తే పదం సంగ్రహేణ, బ్రవీ మ్యో మిత్యే తత్'

– సమస్త వేదాలూ దేనినైతే మననం చేస్తున్నవో, సమస్త తపస్సులూ దేనిని వదిస్తున్నవో, దేనిని ఇచ్ఛించి బ్రహ్మచర్యము నడుపుతున్నారో – నేను దానిని గురించి సంగ్రహంగా చెపుతాను; అది 'ఓమ్' అని, ప్రణవాన్ని కఠోపనిషత్తులో యముడు నచికేతుడికి చెప్పాడు. ప్రణవము పరబ్రహ్మ, హిరణ్య గర్భ స్వరూపము. త్రిమాత్రాకమైన ఓంకారాన్ని దర్శించినవాడే పరమ యోగి. 'అనాహత మతిక్రమ్య విశుద్ధే ప్రాణా న్నిరోధ్యాజ్ఞామను యాయన్ బ్రహ్మరంధ్రం ధ్యాయన్ త్రిమాత్రో హమిత్యేవం సర్వథా ధ్యాయన్ పశ్య త్యనాకారాశ్చభవతి' అని హంసోపనిషత్తు. అంటే అనాహత చక్రాన్ని అతిక్రమించి విశుద్ధ చక్రంలో ప్రాణాన్ని నిరోధించి ఆజ్ఞాచక్రంద్వారా బ్రహ్మరంధ్రాన్ని చేర్చి జ్ఞానపరుడై 'ఓం' కారాన్ని నేనని ధ్యానించే పురుషుడు, పరాన్ని వీక్షించి అనాకారుడౌతాడని అభిప్రాయము.

ఓంకారాన్ని ఆధారంగా చేసుకొని పరమ పురుషుణ్ణి ధ్యానిస్తే కర్మవిముక్తి కలుగుతుందనీ, సాధకుడు సూర్యసంపన్నుడై భాసిస్తాడనీ వేదంలో మరికొన్నిచోట్ల కనిపిస్తుంది. ఓంకారము వ్యక్తబ్రహ్మమట! అది అర్ధమాత్రాకము; అవ్యక్తము; కళాతీతము. ఏకైకశః దాన్ని ఉచ్చరిస్తే అందలి అ, ఉ, మ కారాలు మృత్యుతుల్యాలై బాధ పెట్టుతవనీ, ద్విమాత్రాకంగా ఉచ్చరిస్తే కొంతకాలం వ్యక్తి మనస్సులో లీనమై చంద్రలోకంలో వసించి తిరిగి జన్మిస్తాడనీ బృహదారణ్యకోపనిషద్వాక్యాల వల్ల వ్యక్తమౌతున్నది ముండకోపనిషత్తులో –

"ప్రణవో ధనుః, శరో హ్యాత్మా,
బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం
శరవత్ తన్మయో భవేత్"

అని ఉన్నది. ఓంకారము బాణము, ఆత్మ, ధనుస్సు, బ్రహ్మము లక్ష్యము. అప్రమత్తతతో ఓంకార శబ్దాన్ని లక్షిస్తే ఆత్మ బ్రహ్మంలో లీనమౌతుందని అభిప్రాయము. బ్రహ్మానికే సంకేతము ఓంకారము. సమస్తమూ బ్రహ్మము. సమస్తమూ శబ్దము. 'ఓ మిత్యేతదక్షర మిదగ్ం సర్వం, తస్యోపవ్యాఖ్యానం భూతం భవద్భవిష్య దితి సర్వ మోంకార ఏవ' అని ప్రమాణము.

***

'ఓమ్ ఇత్యేకాక్షరం బ్రహ్మ' అన్నారు. మంత్రద్రష్టలైన మహర్షులు. ఆ బ్రహ్మను పురుష సూక్తం 'అంతశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు, త్వం యజ్ఞ స్త్వం

వషట్కార స్త్వ మింద్ర స్త్వగ్ం రుద్ర స్త్వం విష్ణు స్త్వం బ్రహ్మోత్వం ప్రజాపతిః' అని రూపిస్తున్నది. బ్రహ్మమే శబ్దము అయినప్పుడు ఉపాసకుల కార్యార్థము బ్రహ్మము రూపకల్పన పొందటము వల్ల కలిగిన దేవత లందరూ శబ్ద స్వరూపులు. మన వర్ణ సమామ్నాయము 'అ' కారముతో ప్రారంభించి 'హ' కారంతో అంతమొందుతుంది. అందువల్ల 'అహమ్' అనే శబ్దము సమస్త ప్రపంచాన్నీ నిరూపించటానికి యోగ్యమైనది. 'అ' కారము శివస్వరూపము; నిర్గుణము. 'హ' కారము శక్తి స్వరూపము; సగుణము. శివశక్తి స్వరూపమైన అహంకారము కామకళాస్వరూపంతో జగద్రూపాన పరిణమించింది. అక్షర సమామ్నాయము బ్రహ్మరాశి, పుష్పించి పుష్పించి అది చంద్రతారకంగా విరాజిల్లుతున్నది అన్నాడు పతంజలి మహర్షి. అందువల్ల శబ్దమే దేవత. మంత్రము దేవత. యాజ్ఞవల్క్యమహర్షి ఆహ్నిక సూత్రాలలో ఇలా అన్నాడు

> 'యస్య యస్య చ మంత్రస్య ప్రోద్దిషాయాచ దేవతా
> తదాకారం భవేత్ తస్య దైవతం దేవతోచ్యతే'

మంత్రరూపమే దేవతారూపము; మంత్రమే దేవత అని తాత్పర్యార్థము. ఈ సూక్ష్మాన్ని అనుసరించే మాతృకాన్యాస తంత్రం బయలుదేరింది.

దేవతలు కేవలం శబ్ద స్వరూపులే కాదు; శబ్ద గమ్యులు కూడాను. ప్రతి దేవతను గురించీ అష్టోత్తరశతాలలో 'శబ్దగమ్యాయ' అని కనుపిస్తుంది. ఆచార్య శంకరపాదులు 'సౌందర్యలహరి'లో 'ముఖం బిందుం కృత్వా కుచయుగ మధస్తస్య తదధో, హరార్ధం ధ్యాయే ద్యోహరమహిషితే మన్మథ కలామ్, న సద్య స్సంక్షోభం న యతి వనితా ఇత్యతిలఘు, త్రిలోకీ మప్యాశు భ్రమయతి రవీందు స్తనయుగామ్' అని వర్ణించాడు దేవిని. 'హరార్ధం' అనటంలో 'శివార్ధం' – అర్ధనారీశ్వర రూపము వ్యక్తమౌతున్నది.

> 'శివః శక్తిః కామః క్షితి రథ రవి శ్శీతకిరణః
> స్మరోహంసః శక్రః తదనుచ పరా మార హరయః
> అమీ హృల్లేఖాభి స్తిసృభి రవసానేషు ఘటితా
> భజంతేవర్ణా స్తే తవ జనని నామావయవతామ్'

శివ (క), శక్తి (ఏ), కామ (ఈ), క్షితి (ల), రవి (హ), శీతకిరణ (స), స్మర (క), హంస (హ), శక్ర (ల) – వర్ణాలతో హ్రీం కారాలను మూడుచివరలా కూరిస్తే తల్లీ, నీ నామధేయానికి అంగ మౌతుందని సౌందర్యలహరిలోనే భగవత్పాదులు అన్నారు. క, ఏ, ఈ, ల, హ్రీం, హసకహల హ్రీం, సకలహ్రీం – ఇదే దేవనామాత్మకమైన నూతన

తంత్రము. ఇది లోపాముద్రవిద్యను సూచిస్తున్నదని కొందరు వ్యాఖ్యాతలు వ్రాసినారు. ఇది గురుముఖతః గ్రహించవలసిన శబ్ద స్వరూపము.

సంగీత శాస్త్రమూ శబ్దాన్ని బ్రహ్మంగా పరిగణిస్తున్నది. పరమభక్తాగ్రేసరుడూ, వాగ్గేయకార ప్రముఖుడూ, ఋషితుల్యుడూ అయిన త్యాగరాజ స్వామి 'నాదతనుం అనిశం శంకరం' అని ధ్యానించాడు బ్రహ్మ స్వరూపాన్ని. కేవలం నాదోపాసనవల్లనే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు జన్మించారని ఆయన 'నాదోపాసన చేసి శంకర నారాయణు లన వెలసిరి ఓ మనసా' అని పాడుకొన్నాడు.

'నకారం ప్రాణనామానం దకార మనలం విదుః, జాతః ప్రాణాగ్ని సంయోగా త్తేన నాదోఖి ధీయతే' అని శబ్దాన్ని సంగీతదర్పణం నిర్వచిస్తూ ఉన్నది. ప్రాణానల సంయోగం వల్ల నాద మేర్పడుతున్నదని భావము.

ఈ నాదము (శబ్దము) వర్ణాత్మకమూ, ధ్వన్యాత్మకమూ అని ద్వివిధము. 'అ ఇ ఉణ్, ఋ, క్' ఇత్యాది మాహేశ్వర సూత్రాలవల్ల అజ్ఝల్విభాగాన్ని పొంది వేద వేదాంగాలకూ, సమస్త వాఙ్మయ సాహిత్య ప్రపంచాలకూ మూలంగా పరిణమించింది. వర్ణాత్మక నాదం, అధిదేవత, జాతి, మిత్రత్వమూ, శత్రుత్వమూ, లింగమూ, కాంతి, విష, అమృతేత్యాది గుణరూపాలు వర్ణాత్మక శబ్దానికి లక్షణాలు. ఇందలి ఆయా వర్ణాలకు మాతృకాన్యాసంలో అంగన్యాస కరన్యాసాలు నిరూపితాలై ఉన్నవి.

ధ్వన్యాత్మకమైన శబ్దం ఆహతమూ, అనాహతమూ అని రెండు విధాలు. ఈ రెంటిలో అనాహతము రేచకపూరకాదుల వల్ల మూలాధార స్వాధిష్ఠాన మణిపూరాది చక్రాలకు నాదాన్ని రేపి, కేవలం మహాయోగులకు మోక్ష సాధకమవుతున్నది.

రెండవది ఆహతము. నాదతరంగాలను శ్రుతి పుటాలో ప్రవేశపెట్టి 'ఆనందో బ్రహ్మ' సూత్ర సమన్వయం చేయగల శక్తిమంతమైన సంగీతానికి మూలము. ఇదే సామానికి మూలం. సారూప్య మోక్ష సాధనము. 'మోక్షము గలదా భువిలో జీవన్ముక్తులు గాని వారలకు సాక్షాత్కార నీ సద్భక్తి సంగీత జ్ఞాన విహీనులకు' అని త్యాగయ్యచే అనిపించుకున్న సంగీతానికి ఆధారము.

నాదమనే పేరుతో వ్యవహారంలో ఉన్న శబ్దము సప్తస్వరాలతో లోకపూజ్యమై ఉన్నది. ఈ ఆహతనాదశక్తి అత్యద్భుతమైనది. 'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః' అన్న వచనం లోక ప్రసిద్ధమైనది. అంతేకాదు, దేవతలకు కూడా ఆహత శబ్దం మీదనే అత్యంతాభిమానమట!

యజ్ఞ సమయాలలో అధ్వర్యుడు, హోత, ఉద్గాత ముగ్గురూ ప్రధానులు. ఏదో దేవతను - ఉదాహరణానికి ఇంద్రుడనుకుందాము - మొదట అధ్వర్యుడు 'ఏహి ఇంద్రా' అని పిలుస్తాడు. ఇంద్రుడు రాడు. హోత మంత్రపూతంగా అస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అప్పటికీ రాడు. ఉద్గాత సామగానంతో ఇంద్రుడు సంతోషించి కామప్రదుడు కావటానికి బయలుదేరుతాడని పెద్దలు చెపుతారు.

ఒక్కొక్క స్వరానికి ఒక వర్ణమూ, ఒక రూపమూ ఉన్నవని శాస్త్రము చెపుతూ ఉన్నది. 'అందువల్లనే రాగ, రాగిణుల కల్పన జరిగింది. పాశ్చాత్యదేశాలల్లో ఆహతశబ్దశక్తిని గురించి అనేక పరిశోధనలు జరిగినవి. శబ్దానికి వర్ణాలున్నవనీ, అనేక రూపాలను సృజించే శక్తి ఆహత శబ్దానికున్నదనీ ఆ పరిశోధనలవల్ల నిరూపితమైనది. శబ్దము శ్రవణేంద్రియ మూలంగా శరీరంలో ప్రవేశించి విద్యుచ్ఛక్తి వలె పనిచేస్తుంది. శబ్దానికి ఓషధీగుణ మున్నదని నేటి ప్రకృతి శాస్త్రజ్ఞులు నిరూపిస్తున్నారు. దీపకము, వసంతము, మేఘాంబరి ఇత్యాది రాగాలవల్ల ఆహత శబ్దశక్తిని తాన్‌సేన్, గోపాలనాయకాది భారతీయ సంగీత శాస్త్రవేత్తలు నిరూపించారు. మహాధానుష్కుల మంత్రపూతమైన అస్త్ర ప్రయోగోప సంహారాలల్లో అసంబద్ధత ఉండనవసరం లేదు.

***

'శం సుఖం దదాతీతి వా శబ్దః' - సుఖాన్ని ప్రసాదించేది కనుకనే శబ్దము. అందువల్లనే శబ్దాధిదేవత ఐన సరస్వతిని 'యా కుందేందుతుషార హారధవళా... నిశ్శేష జాడ్యాపహా' అని స్తుతిస్తున్నాము. శబ్దాన్ని 'శప్యతే అనేనేతి శబ్దః' - దీనిచేత ఆక్రోశింపబడుతుంది కాబట్టి శబ్దము అనీ నిర్వచనం చెయ్యవచ్చును. లోకంలో సుఖానికీ, దుఃఖానికీ శబ్దమే కారణమౌతుంది. అందుకనే ఒకానొక తత్త్వవేత్త అన్నాడు. 'మానవలోకంలో యుగయుగాలనుంచీ వస్తూ ఉన్న రాగద్వేషాలకూ, సుఖదుఃఖాలకూ శబ్దమే కారణము' అని.

మానవలోకంలో శబ్దం ఎంత పని చేయటానికి శక్తి కలిగినదో మనం ఊహించలేము. బైరను మహాకవి 'డాన్ జాన్'లో ఇలా అన్నాడు :

"But words are things and a small drop of Ink - Falling like due, upon a thought produces - That which makes thousands, perhaps millions think' అని.

ఒక క్రూరమైన మృగాన్ని మాలిమి చేసుకోవచ్చును. ఆలనా పాలనా లేకుండా అయోమయంగా పెరిగిపోయిన అడవిని అదుపులో పెట్టి అందమైన మార్గనిర్మాణం చెయ్యవచ్చును. కానీ అజాగ్రత్తతో ఉచ్చరించిన ఒక విషశబ్దం వల్ల కలిగే ప్రమాదాన్ని తప్పించుకోలేము. 'మాటలో ఏముంది మనసు లొకటైతే చాలు' ననుకోవటం మనకు పరిపాటి. అయితే మనస్సు ఒకటి కావటానికి మాటే ప్రధానమని మనం మరిచిపోకూడదు. నిశితమైన నిస్త్రింశిక కంటే హృదయ విదారణ శక్తి శబ్దానికే ఎక్కువ ఉంది. 'మాటలలో ప్రయోజనమేముంది, పని చూపాలి' అని కూడా లోకంలో వింటుంటాము. ఒకప్పుడు మాటే పనికంటే సహస్రాధికంగా పనిచేస్తుంది. అది వచ్చే సమయాన్ని బట్టీ, అందుకునే వ్యక్తినిబట్టీ, అనే వక్తను బట్టీ అర్థభేదాలు ఏర్పడుతూ, భావచ్ఛాయలు గోచరిస్తూ ప్రళయ ప్రణయాలు కలగటానికి శబ్దం తోడ్పడుతుంటుంది. అది ఒక జాతిని అభ్యుదయపథం పట్టించనూ గలదు; అధోగతికి చేర్చనూ గలదు.

శబ్దతత్త్వం తెలిసినవారికి శబ్దం పతివ్రత వంటిది. నిత్యమూ వారి భావాలను అనుసరిస్తూ ఉంటుంది. 'కార్యేషు దాసీ' మొదలు 'శయనేషు రంభా' వరకూ అనురక్తగా ఉంటుంది. శబ్దతత్త్వం తెలుసుకుని భ్రమ పడేవారికి జారిణిగా వ్యవహరించి, తళుకు బెళుకులతో, తరితీపి ధ్వనులతో ఆకర్షించి శుభ్రంగా 'సుబ్బిసెట్ల'ను చేసి కూర్చోబెడుతుంది. శబ్దం అతి చిత్రమైంది.

శబ్దం ధర్మార్థ కామాలను అభివ్యక్తం చేస్తుంది. గృహమర్యాదలూ, సంఘ మర్యాదలూ, సంబంధ బాంధవ్యాలూ, రాజ్యాలనూ, లోకాలనూ, విశ్వాలనూ, దేవతనూ, పరబ్రహ్మనూ తెలియపరుస్తుంది.

శబ్ద సంస్కారం లేకపోవడం వల్ల 'మోదకైః తాడయ మాం' కథవల్ల శాతవాహన మహారాజంతటి వాడు అవహేళన పొందినాడు. 'మాహిషం చ శరచ్చంద్ర చంద్రికా ధవళం దధి' అక్షరలక్ష లిప్పించింది.

***

శబ్దం అనేక అంచులు ఉన్న రత్నం. ఆ రత్నశిల్పి లోకంలో ఒక మానవుడి జీవితాన్ని వసంతం చేయకలదు; నిదాఘం చేసి నిర్మూలం చెయ్యనూ గలదు. మానవుని తత్త్వవివేచనశక్తీ, జిజ్ఞాసా శబ్ద జాలంమీద ఆధారపడి ఉంటాయి. అది అధికమైనప్పుడు అధికమూ, స్వల్పమైనప్పుడు అల్పమూను.

జాన్సన్ మహాశయుడు ఒకచోట 'Words are the daughters of the earth and deeds are the sons of heaven' అన్నాడు. ఆ శబ్దశక్తి అనంతమైనది;

అనిర్దిష్టమైనది లోకంలో. దాని రూపాన్ని ఇదమిత్థమని నిర్ణయించటానికి వీలు లేదు. ఆధునిక రచయితలలో ప్రసిద్ధురాలు 'వర్జీనియా వుల్ఫ్' శబ్దజాలాన్ని గురించి వ్రాస్తూ ఇలా అన్నది :

''The art of writing which is just another name for beauty is the art of having at one's beck and call every word in the language, of knowing their weights, colours, sounds, associations and thus making them suggest more than they can suggest....Now this power of suggestion is one of the mysterious properties of words. Words are the wildest the freest, and most irresponsible, most inteachable of all things. They do not live in the dictionaries; they live in the minds. That pause was made the well of darkness was dropped to tempt words to come together in one of those swift marriages which are perfect images of ever - lasting beauty'' శబ్దానికి శక్తీ, సాంద్రతా, వర్ణమూ, వ్యక్తిత్వమూ ఉన్నవన్నమాట.

శబ్దజాలంలోని అన్యోన్యమైత్రి మూలంగా కాంతి, ఓజస్సు, సమత – ఇత్యాదిగుణాలు కలుగుతవని సాహితీవేత్తలు చెపుతుంటారు. దానివల్లనే రచనల్లో శైలి ఏర్పడుతూ ఉంటుంది. దానిని మన ప్రాచీన సాహిత్య లాక్షణికులు 'యా పదానాం పరాన్యోన్య మైత్రీ శయ్యేతి కథ్యతే' అన్నారు. కూర్పులో క్రొత్తందనము కలుగుతుంది గాబట్టే కవుల సమ్మోహనశక్తి నిత్యనూతనంగా పరిణమిస్తూ ఉంటుంది. 'యానేవ శబ్దాన్ వయ మాలపామో, యానేవ చార్థాన్ వయ ముల్లిఖామ, తై రేవ విన్యాస విశేషభవ్యైః సమ్మోహయంతే కవయో జగంతి' – అవే శబ్దాలు, అవే అర్థాలు. కాని వాటి విన్యాసంతోనే కవులు లోకాన్ని సమ్మోహపరుస్తారు అని కీర్తి పొందారు కవులు. దీన్నే ఉక్తివిశేషం అనవచ్చును. రాజశేఖరకవి 'ఉక్తివిశేషో కబ్బో' – కావ్యము ఉక్తివిశేషము అన్నాడు. సాహితీ తాత్త్వికులు కొందరు కేవలము శబ్దమే కావ్యము అన్నవారున్నారు. శబ్దమన్నప్పుడు అర్థము దానిలోనే నిబద్ధమై ఉన్నదన్న మాట. 'రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యం' అన్న జగన్నాథ పండిత రాయల తాత్పర్యార్థము కూడా 'శబ్దము కావ్యము' అనే చెప్పవచ్చును. 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ' అన్న ఆచార్యదండి శబ్దశాస్త్ర రహస్యవేత్త. 'మాటలు మాటల వచ్చును, మాటలనే కలుగుచుండు మణిమంత్రంబుల్, మాటల పొందిక తెలిసిన మాటలనే ముక్తి కలుగు మహిలో వేమా!' అన్నాడు తాత్త్వికుడు వేమన.

***

'పూల కడుపులలో తేనె పోసె నెవడొ,
దాని తీయు నేర్పు తుమ్మెదకు లభించె;
భాషలోని మాధుర్య లావణ్యభావ
సాధుభోగము కవిముఖ్యసాధ్య మయ్యె'

అన్నాడు రాయప్రోలు. కవులు రసపిపాసువులు, రసలోలుపులు, శబ్దశక్తి వారెరిగినట్లు ఇతరు లెరుగరు. భావగోపనం చెయ్యటంలో వారు మాంత్రికులు. ఒకానొక సందర్భంలో వాల్టేరు మహాశయుడు 'One great use of words is to hide our thoughts' అన్నాడు.

పదజాలానికి మూలాలు ఏమిటని భాషాశాస్త్రవేత్తలు జిజ్ఞాస చేశారు. అర్థవత్తులైన సూక్ష్మతర రూపాలు శబ్దజాలానికి మూలకారణాలని తేలింది. వాటికే మనవారు ధాతువులని నామకరణం చేశారు. ఇవి కేవలం రసాయన శాస్త్రంలోని మూలవస్తువులకు (Elements) తుల్యమైనవి. వీటికి చాలా భాషల్లో స్వతంత్ర ప్రయోగముండదు. ఇవి అనాది మానవుడు ఉచ్చరించిన పరిపూర్ణ వాక్యాలకు పరిణామ రూపాలు. కాలక్రమేణా పరిణామాలను పొంది పొంది నిలిచిన అవశిష్టరూపాలు.

***

మహాకవి కాళిదాసు పార్వతీపరమేశ్వరులను 'వాగర్థ'ములతో పోల్చి ధ్యానించాడు. పార్వతి ఉంటే పరమేశ్వరుడున్నట్లే. పరమేశ్వరుడున్నా పార్వతి ఉన్నట్లే. శబ్దము ఉన్నదంటే అర్థము ఉన్నదన్నమాటే! అయితే ఈ శబ్దానికి ఈ అర్థము అని ఎలా రూఢికి వచ్చింది? గ్రీకు దేశంలో అరిస్టాటిల్ అనే భాషావేత్త శబ్దార్థ సంకేతాన్ని జిజ్ఞాస చేసి, అనాది మానవులకు శబ్దార్థ సంకేత విషయంలో ఒక ఒడంబడిక కుదిరి ఉంటుంది అన్నాడు. డార్విన్ మహాశయుని పరిణామ వాద సిద్ధాంతాన్ని అనుసరించి మనుష్యులకు భాష (శబ్దార్థాలు) వారి పూర్వరూపాలైన వానరుల కిచ కిచలనుంచి వచ్చిందని ఊహించవచ్చును.

'సంకేతస్తు పదపదార్థయో స్సంబంధః' అని మహర్షి పతంజలి స్ఫోటవాదం నిలబెట్టినాడు. నైయాయికులు 'శక్తం పదం' అన్నారు. పదానికి, పదార్థానికి ఉన్న సంబంధం ఈశ్వరేచ్ఛారూపకమని వారి అభిప్రాయం. అయితే వైయాకరణులు ఈశ్వరేచ్ఛను అంగీకరించలేదు. పదానికీ, పదార్థానికీ ఉన్న సంబంధం కేవలం వృత్తిరూపకమనీ, తాదాత్మ్యసంబంధమైనదనీ వారి అభిప్రాయం. ఈ సంబంధం వారి మతంలో నిత్యము. కంటికి చూడటమూ, చెవికి వినటమూ ఏ నాడు కలిగిందో ఎలా చెప్పలేమో, అదేరీతిగా శబ్దానికి అర్థం కూడాను అని వారంటారు. శబ్దార్థ సంబంధం అనాది అని వారి మతం.

వైయాకరణులూ, మీమాంసకులూ శబ్దము నిత్యమంటారు. నైయాయికులు అనిత్యమంటారు. 'అర్థ కృతేన నామశబ్దేన భవితవ్యమ్' – అంటే శబ్దం కేవలం శ్రుతికి తగిలి ఏదో అర్థసంప్రత్యయాన్ని కలుగజేసి కనబడకుండా పోతుంది. ముఖ్యమైనదని అర్థము అని వారి భావము. అంటే వాద్యంలో శబ్దం పూర్వము లేదనీ అది క్రొత్తగా వాయించడము వల్లనే పుట్టి వాయువు వల్ల అభివ్యక్తమై, అర్థసంప్రత్యయము కలిగిస్తున్నదని వారి అభిప్రాయము.

***

'కావ్యలక్ష్మి కి తనువగు శబ్దార్థంబులు' అని ఆలంకారిక నిర్వచనము. విద్యా సంబంధం వల్ల బ్రహ్మము ఏ విధంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరత్వాలను ధరించాడో అదేవిధముగా శబ్దము సత్త్వరజస్తమో గుణాలను బట్టి వాచక, లక్షక, వ్యంజకత్వాలను ధరిస్తూ ఉన్నది.

'వాచ్యార్థోఽభిధయా బోధ్యో
లక్ష్యో లక్షణయా యుతః,
వ్యంగ్యో వ్యంజనయా తాస్స్యు
స్తిస్రః శబ్దస్య శక్త మః'

అని సాహిత్య దర్పణకారుడు. అంటే అభిధాశక్తి వాచ్యార్థాన్నీ, లక్షణాశక్తి లక్ష్యార్థాన్నీ, వ్యంజనాశక్తి వ్యంగార్థాన్నీ నిరూపిస్తూ ఉంటవని అభిప్రాయము. శబ్దాలకు లోకంలో ఉండే ప్రయోగం గానీ, పరిణామం గానీ, విపరిణామం గానీ ఈ మూడు శక్తులలో ఒకదాన్ని అనుసరించి ఉంటుంది.

***

శబ్దాన్ని ఆధారం చేసుకొని సంస్కృత న్యాయాలు కొన్ని ఏర్పడ్డవి. ఒక్కొక్కప్పుడు స్వార్థాన్ని విడిచి అన్యార్థాన్ని బోధిస్తూ ఏదైనా న్యాయం ఉంటుంది. 'గంగాయాం ఘోషః' (గంగలో గొల్లపల్లె) అన్న చోట 'గంగ ఒడ్డున' అనే అర్థము. దీన్నే జహత్ స్వార్థావృత్తి న్యాయమంటారు.

మొదట శబ్దానికి ఒక అర్థాన్ని చెప్పి తరువాత దానికున్న సహజార్థముతో రెండూ ఒకటే అని చెప్పటము జహదజహత్ స్వార్థావృత్తిన్యాయము.

'యత్పరః శబ్దన్యాయం' మరొకటి. ముందు తేజస్సు పుట్టి తరువాత శబ్దం పుడుతుంది అని అనటం. అంటే అర్థవంతమైనదే శబ్దము అని అనటము. 'రథకార

న్యాయమూ’ శబ్ద సంబంధి. ‘రథం కరోతీతి రథకారః’ వ్యుత్పత్తి చేత రథకారశబ్దానికి ‘రథముచేసేవా’డనే అర్థము. కాని ఒకానొక సంకీర్ణజాతివాడనీ అర్థము కలుగుతుంది. ఇది గౌణార్థము. ‘అవయవసిద్ధేః సముదాయసిద్ధి ర్బలీయసీ’ – రూఢ్యర్థము బలవత్తరమైనది. అందువల్లనే పంకములో పుట్టిన ప్రతిప్రాణీ పంకజము కాదు. కేవలమూ పద్మము ఒక్కటే పంకజము.

శబ్దచ్ఛలానికి శబ్దమే ఆధారము. ఇది త్రివిధంగా ఉంటుంది. 1. వాక్ఛలము : రెండు అర్థాలున్నచోట వక్త అభిప్రాయానికి భిన్నార్థాన్ని ప్రతిపాదించి వాదించటము వాక్ఛలము. ‘పిల్లవాడు నవకంబళుడు’ అన్న చోట ప్రతిపక్షి ‘తొమ్మిది కంబళ్లు కలవాడు’ అని వాదించటము. 2. సామాన్య ఛలము : విశేష పదంగా సంభవించే అర్థాన్ని అతి సామాన్యపదంగా చెప్పి అసంభవార్థంగా మార్చటము. ‘ఈ బ్రాహ్మణుడు పండితుడు’ అని చెప్పినప్పుడు బ్రాహ్మణత్వా వచ్ఛేదకధర్మము పాండిత్యము అని చెప్పటాన్నే గ్రహించి, పండితులు కాని బ్రాహ్మణులు లేరా, అబ్రాహ్మణులు పండితులు లేరా అని వాదించడము. 3. ఉపచారచ్ఛలము : పదానికి శక్యార్థాన్ని గ్రహించకుండా లక్ష్యార్థము వివక్షితమైతే దాని వాచ్యార్థాన్ని గానీ, వాచ్యార్థం వివక్షితమైనప్పుడు లక్ష్యార్థాన్ని గానీ గ్రహించటము ఉపచారచ్ఛలము ‘మంచెలు అరచుచున్నవి. పాగాలు పోవుచున్నవి’ అన్నచోట ‘మంచెలే అరచుచున్నవి. పాగాలే పోవుచున్నవి’ అని వాదించటము. ఇందులో ఒకరు ముఖ్యార్థాన్నీ, మరొకరు గౌణార్థాన్నీ గ్రహించి వాదిస్తారు.

***

శబ్దార్థాన్ని లోకం స్వరమూ, ఊతల సహాయం వల్ల గ్రహిస్తూ ఉంటుంది. సందేహమూ, సంతాపమూ, ఆనందమూ ఆశ్చర్యమూ ఇత్యాది భావచ్ఛాయలు ఒక్కొక్కప్పుడు కేవలం అంగవిన్యాసాలతో కూడా చూపించవచ్చును. అందుకనే భగవత్పతంజలి ‘అంతరేణాఽపి శబ్ద ప్రయోగం బహవోర్థా గమ్యంతే అక్షనికోచైః, పాణి విహారైశ్చ’ అని ప్రవచించాడు. చేతులు త్రిప్పి, గ్రుడ్లు తిప్పి చాలవరకు అర్థసంప్రత్యయం కలుగజేయవచ్చును అని ఆయన అభిప్రాయము. ఉచ్చారణవిధానాన్ని బట్టి శబ్దంలోని భావచ్ఛాయలను శ్రోతలు గ్రహిస్తూ ఉంటారు; అవగతము చేసుకోగలుగుతుంటారు; శబ్దోచ్చారణలో ఉండే ఎగుడు దిగుడులే లేకపోతే భాష శ్రుతికటువుగా ఉంటుంది. ఇది గమనించే సంస్కృత వైయాకరణులు ఉదాత్త అనుదాత్త స్వరితాలతో కూడిన శిక్షాశాస్త్రాన్ని కల్పించారు. స్వరం తప్పినప్పుడు శబ్దం అపశబ్ద మైపోతుందన్నారు. ప్రమాదవశాన యజ్ఞకర్త ఒక శబ్దాన్ని దుష్టంగా పలికితే

దానికి ప్రాయశ్చిత్తంగా సారస్వతేష్టి చెయ్యవలసిందని 'ఆహితాగ్ని రపశబ్దం ప్రయుజ్య ప్రాయశ్చిత్తీయాం సారస్వతీం ఇష్టిం నిర్వపేత్' అని అనుశాసించారు. 'దుష్టః శబ్దః స్వరతో వర్ణతోవా మిథ్యా ప్రయుక్తో న తదర్థమాహ, స వాగ్వజ్రో యజమానం హినస్తి యథేంద్రశత్రుః స్వరతోపరాధాత్' – స్వరం చేతనూ, వర్ణం చేతనూ దుష్టమైన శబ్దము వృథాప్రయుక్తమూ, అనర్థకమూ అయిపోవటమే కాదు. యజ్ఞకర్తను వజ్రమై హింసిస్తుందిట. దీనికి 'ఇంద్రశత్రు' శబ్దమే నిదర్శనము అని అన్నారు. 'ఇంద్రుడనే శత్రువు నశించుగాక!' అనే ఉద్దేశంతో క్రతువు చేసే దధీచి 'ఇంద్రశత్రు' శబ్దాన్ని 'ఇంద్రుని శత్రువు నశించుగాక!' అనే అర్థం వచ్చేటట్లు ఉచ్చరించటం చేత అతడే నశించాడు. శబ్దాన్ని బాగా తెలుసుకొని ప్రయోగిస్తే స్వరక్రతుకర్తకు కామధేను వౌతుందిట!

సంస్కృత భాషలో ప్రాతిశాఖ్యలూ, పాణినీయ శిక్షలూ, వ్యాకరణ శాస్త్రమూ శబ్ద స్వరూపాన్ని నిలపటానికే పుట్టినవి. అసంస్కృత, అనాగరక భాషల్లో శబ్దానికి నిలకడ లేకపోవటం వల్ల అజ్లోపము, హల్లోపము, వర్ణప్లుతి, ద్విత్వవికల్పము, హలాగమము, సంప్రసారణము ఇత్యాదులను పొందుతూ, సహజ స్వరూపాన్ని పోగొట్టుకుంటూ ఉంటుంది. అయితే జీవద్భాషలో ఎన్ని కట్టుదిట్టాలున్నా శబ్దానికి కొంతగా 'వికృతి' ఏర్పడటం తప్పదు.

శ్లేషకల్పనలకూ, ఉక్తివైచిత్ర్యానికీ 'ఊత' ఎంతో ఉపకరిస్తుంది. ద్వ్యర్థి త్ర్యర్థి కావ్యజాలం ఉక్తి మీద ఆధారపడ్డది. అంటే ఊతమూలంగానే నడుస్తున్నదన్నమాట. శత్రురాజాస్థానంలో ప్రవేశించి ఆ రాజును పొగడినట్లు కనిపించి, నిజరాజాస్థానానికి తిరిగి వచ్చి శ్రీనాథమహాకవి ఊత సహాయం వల్లనే 'సర్వజ్ఞనామధేయము... రావుసింగజనపాలునకే 'యుర్వీం జెల్లును' అని విడగొట్టి ప్రభువు మెప్పు పొందాడు. 'అరచందమామ నేలిన దొరగా నెన్నుదురు నెన్నుదురు బిత్తకిన్, బరువంపు మొల్లమొగ్గల దొరగా బలుకుదురు పలుకుదురు జవ్వనికిన్' అన్న చేమకూరకవి ఉక్తి ఊతమీద ఆధారపడ్డదే!

ఏ భాషలోనైనా శబ్దజిజ్ఞాసకు పూనుకుంటే ఆశ్చర్యంతోపాటు విజ్ఞానమూ కలుగుతుంది; ప్రజ్ఞానమూ కలుగుతుంది. ప్రజ్ఞాన విషయం పూర్వము చర్చించు కున్నాము. ఇక విజ్ఞాన విషయము, శబ్దార్థాలను గమనిస్తే ఎంతో విజ్ఞానము కలుగుతుంది. ఉదాహరణానికి సంస్కృతభాషలోని ఓషధీవర్గ శబ్దాలను నాల్గింటిని పరిశీలిద్దాము. 'శిగ్రు' అనే శబ్దానికి 'మునగ' అర్థము. 'శినోతి శమయతి కఫాదీన్ శిగ్రుః' శ్లేష్మాదులను పోగొట్టుతుంది కాబట్టి దీన్ శిగ్రువైనది. కఫథోషాన్ని భక్షిస్తుంది

కాబట్టి జువ్వి ప్లక్షమైనది. 'బిలతి శుష్టాదీన్ బిల్వః' – కుష్ఠాదులను కొట్టివేస్తుంది కాబట్టి మారేడు బిల్వమైనది. ఆర్యభాష శబ్దజాలంలోనే విజ్ఞానాన్ని ఇముడ్చుకున్నది. ఈ రీతిగా శబ్దజాలాన్ని పరిశీలిస్తే అనంతవిజ్ఞానం కలగటానికి అవకాశమున్నది.

***

ఒక భాషలో పుట్టిన ఒక శబ్దం మరొక భాషలో ప్రవేశించి వేరు అర్థంలో ప్రయోగాన్ని పొందుతూ ఉంటుంది. మహారాష్ట్ర భాషలో పింగాణీ శబ్దానికి సీతాకోక చిలుక అని అర్థం. తెలుగు భాషలో ఇది 'పింగాణీ గిన్నె' అన్నటువంటి ప్రయోగంలో ఒక పదార్థానికి వాడుకలో ఉన్నది. దీనికి మొదట్లో చైనా, జపానుల నుంచి దిగుమతి అయ్యే పింగాణీ సామానుల మీద సీతాకోకచిలుక బొమ్మ ఉండటమూ, అవి బొంబాయి రేవులో దిగటమూ కారణము. సంస్కృత భాషలోని సంతాప శబ్దానికి మహారాష్ట్ర భాషలో కోపమని అర్థము. 'రాగ' శబ్దానికి వంగభాషలో కోపమని అర్థము.

ఆంధ్రభాషలో అనేక సంస్కృతశబ్దాలు తత్సమాలుగా ప్రవేశించి, అర్థ విపరిణామాన్ని పొందినవి. 'అనుమాన' మనే తార్కిక శబ్దానికి సంశయము, సంకోచము అని అర్థము వచ్చింది. 'ముష్టి' బిచ్చమైంది. 'దాహము' దప్పికగా మారిపోయింది. 'పూజ్యము' శూన్యార్థాన్ని సూచిస్తూ ఉన్నది. 'దేవానాంప్రియుడు' మూర్ఖుడైనాడు. 'పండితపుత్రుడు' శుంఠ. కైంకర్యం 'కాజేయుట' యైనది. 'దేవతార్చన' భోజనానికి పర్యాయపదమైనది. ఈ జాతిలోవే గీర్వాణము, తద్దినము, ఫలహారము, సంభావన, సంతర్పణ, స్వయం పాకము, స్వస్తి, కుశలము, అయోమయమూ ఇత్యాదులు.

కేవలం దేశీయ శబ్దాలు కూడా అర్థవిపరిణామాన్ని పొందక పోలేదు. 'కంపు' శబ్దము భారత రచనాకాలంలో సువాసనను సూచిస్తుంటే, నేడు దుర్గంధాన్ని పలుకుతున్నది. కన్నడ భాషలో నేటికీ 'కంపునూనె'కు గౌరవముంది. వాసన నూనెలకు వాడకం చేస్తున్నారు. నన్నయనాడు యౌవనవతిని తెలియజేసే 'అవ్వ' శబ్దం ఈ నాడు కాటికి కాళ్ళు చూచిన ముసలమ్మలను తెలియజేస్తుంది. యౌవనవతిని ఈ నాడు 'అవ్వ' అని సంబోధిస్తే జరగవలసిన మర్యాద జరిగి తీరుతుంది.

***

శబ్దాలు వలసపోతూ ఉంటవి. మృతి పొందుతవి. తిరిగీ పుడుతూ ఉంటవి. నూతనంగా సృజితమూ అవుతుంటవి. నేటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ వాతావరణంలో నిత్యమూ ధ్వనించే బూర్జువా శబ్దము మొదట పరిహాసాస్పదుడైన

వ్యక్తి నుద్దేశించి వ్యవహారంలో ఉండేది. కాలక్రమేణా దానికి జనసామాన్య వ్యతిరేక భావం కలిగింది.

దేశంలో రాజకీయాలు మారుతూ ఉంటే పూర్వ శబ్దాలను పదభ్రష్టాలను చేసి, వాటి స్థానాలను నూతన శబ్దాలు ఆక్రమిస్తూ ఉండటము నైజము. దండయాత్రల ఫలితంగా, దాస్యం కారణంగా భారతీయ భాషలన్నిటిలోనూ ఎన్నో అన్యదేశ శబ్దాలు వచ్చి చేరినవి. ముసల్మానులు మన దేశంలో ప్రభుత్వం చేసిన రోజుల్లో పన్ను పోయి తహశీలు, పాట పోయి ఇజారా, ఆరెకులు పోయి గస్తీలు, తప్పు బదులు జుల్మానా ఇత్యాదిగా ప్రవేశించినవి. తెలుగు రాజుల కాలంలో ఉన్న ఉద్యోగాలూ, ఉద్యోగస్థులూ మారిపోయినారు. వకీలు, సముద్దారు, సిరస్తాదారు, తహసిల్‌దార్, అమీనాలు రాజ్యపాలన చేయడం ప్రారంభించారు. ఇళ్ళలో వస్తువులు మారిపోయినవి. మేజా, మెల్లా, బావిడీ, కూజా, కుర్చీ, కిటికీలు వచ్చినవి. మిఠాయి, మసాలా, పూరీ, ఫేణీ, దూద్ పేడా, బర్ఫీ, హల్వా, జిలేబీ, పోణీ, కోవాలు తినడం నేర్చుకున్నాము.

ఫ్రెంచివారూ, బుడతకీచులూ మన దేశంతో వ్యాపారం చేసిన దినాలలో కొన్ని శబ్దాలు ప్రవేశించినవి. ఇంగ్లీషువారి నాగరికతా వ్యామోహంతో, రాజ్యపాలనతో మన భాషలో ఎన్నెన్ని శబ్దాలు ప్రవేశించి అప్రయత్నంగా ముసలమ్మకూ త్రోసిరాజనలేని పదాలుగా మారిపోయినవి!

'ముచ్చె తీసుకొని తంతాను', 'దమ్మిడీ ముండకు ఏగానీ క్షవరం' అనే ప్రయోగాలు పల్లీయుల వ్యవహారంలోనూ వినిపిస్తుంటవి. కాని, అవి ఎలా వచ్చినవో వారెరుగరు. 'ముచ్చె' పర్షియన్ పదము. 'దమ్మిడీ', గ్రీకు పదము. 'జముఖాణా' లేనిది బ్రాహ్మణ ముసలమ్మకు మంచంమీద నిద్రపట్టదు. అయితే ఆ వస్తువు మొదట లక్ష్ణిణీ దేశానిదనీ, ఆ పదము లక్ష్ణిణీ శబ్దమనీ ఆమెకు తెలియదు. తెలిస్తే తప్పకుండా తడిపి, కాసిని పంచితం నీళ్లు చల్లి పక్క వేసుకొనేది.

గ్లాసూ, కిరసనాయిలూ మనవి కావని తెలుసుకోబట్టే ఆమె ఈ నాటికీ గాజుసీసాలో నూనె పోయించుకోదు; మడితో కిరసనాయిలు లాంతరు ముట్టుకోదు. 'ఆసుపత్రి'కి వెళ్ళివస్తే, రైలులో ప్రయాణం చేస్తే ఇంటికి వచ్చి 'సచేలస్నానం' చేస్తుంది.

***

అన్య దేశాలతో సంబంధం లేకుండా నిత్య వ్యవహారం జరగదు. అప్పుడు ఇతర దేశశబ్దాలు భాషలో ప్రవేశించకుండా ఉండనూ ఉండవు. 'కోప్రా' శబ్దం వల్ల

పుట్టిన 'కొబ్బరినూనె' లేనిదే కోమలాంగులు – ఛాందస కుటుంబాలలో కూడా – కురులు ముడువరు. బత్తాయిపండును ప్రిస్క్రైబ్ చెయ్యని ఫిజిషయన్ కనుపించడు. సోడాబుడ్డీ లేకపోతే సుష్ఠయిన భోజనం ఈ దినాలలో శుద్ధశ్రోత్రియుడికి కూడా అరగటం లేదనటంలో అసంబద్ధత అణుమాత్రమూ లేదు. సాలామిస్రీ, సఫేద్‌మిస్రీ, ముస్తకీ, రూమ్, గావుజ్, బాల్, బాన్‌లు లేకపోతే మన అంటురోగాలు మొదలారి ఆరోగ్యం చేకూరటం లేదు. తుపాకులు, సనీలు, బజాయీలు, జిల్లీలు, తూటాలు, ఔట్లూ లేనిదే తెలుగుదేశంలోకి దీపావళిదేవత తిరిగి తిరిగి రావటం మానేస్తుంది. టెలిగ్రాఫ్, టెలిఫోనులతో పని పడకుండా ఉండటమూ లేదు. 'రేడియో న్యూస్' వింటేగాని నిద్రపట్టటమూ లేదు.

ప్రభుత్వాలతో పాటు దుస్తులూ మారుతూ వచ్చినవి. చనుకట్టు పోయి కంచెల వచ్చింది. అది కొంతకాలానికి కనపడకుండా పైఠిణీ రవికకు బరాబరు చేసింది. ఒకదానికి తరువాత ఒకటి జుబ్బా జాకెట్టు, జంపర్లు స్త్రీల ఊర్ధ్వ కాయాలమీద ఉజ్జ్వలంగా రాజ్యం చేస్తూ వచ్చినవి. మొదట్లో మగవాళ్ళూ, తరువాత జబ్బుగా ఉన్న ఆడవాళ్ళూ ఆంగ్ల దేశంలో ఉపయోగించిన జంపరు ఈ నాడు మన దేశంలో స్త్రీలకు నిచోళమైంది. 'పాంటలూన్' అనే ఒక జర్మనీదేశ తత్త్వవేత్త మొట్లో నేటి 'పంట్లం' వంటి దుస్తు కుట్టించుకున్నాడు. క్రమక్రమంగా అది యూరప్ దేశంలో 'ఫాష'నై మన దేశంలోకి దిగుమతైంది. 'నిక్కరు' మొదట్లో 'వాషింగ్‌టన్ ఇర్వింగ్' అనే ఒక రచయిత పెట్టుకున్న మారుపేరు. అతని దుస్తుకు నామమై నేడు క్రమంగా ప్రపంచమంతా ఏలుతూ ఉన్నది. 'బీరువా' ఎలా వచ్చిందో తెలియకుండానే గుడ్డలు పెట్టుకుంటున్నాము; నగలు దాచుకుంటున్నాము. ఫ్రెంచి భాషలో బీరువాకు 'ఒక బల్ల' అని అర్థం మొదట్లో. బీరువా అనే రంగుగుడ్డ వేయటం వల్ల బల్లకు ఆ అర్థం రూఢికెక్కింది. ఈ నాడు 'ఆఫీసు' మోటై 'బీరువా' అని పిలిపించుకుంటున్నది. పదాల చరిత్ర ఒక్కొక్కప్పుడు 'ఫార్సు'గా ఉంటుంది. 'ఫార్సు' ఫ్రెంచిమాట!

***

దుస్తులను గురించి చెప్పి అలంకరణాలలో మచ్చుకు ఒకటైనా చెప్పకపోవటం భావ్యం కాదు. 'అరవ చెవుల కేల అరిది వజ్రపు కమ్మ!' 'కమ్మ' శబ్దానికి లేత 'తాటిమొవ్వ' అని అర్థం. పూర్వం స్త్రీలు లేత తాటిమొవ్వను చుట్టచుట్టి కర్ణాలంకరణంగా ఉపయోగించేవారు. తరువాత ఆ 'కమ్మ' సంస్కృతీకరణంవలన 'తాటంక' మైనది. కర్ణాభరణ మనే సామాన్యార్థం వచ్చేసింది. ఎర్రరాళ్ళ కమ్మలూ,

వజ్రపు కమ్మలూ వచ్చినవి. 'దుద్దు' అంటే 'అకరువు.' బంగారం చైనా రాళ్ళు పొదిగినా దుద్దురూపం ఉన్నంతవరకూ అవి దుద్దులే – ఇలాగా, కవుల గండపెండేరాలకూ, సోమయాజులవారి సింహతలాటాలకూ, నర్తకుల లోలాకులకూ, బిబ్బీల జూకాలకూ, వనితల ఒడ్డాణాలకూ చరిత్ర ఉంది.

ఒక జాతిలోనే ఒక్కొక్క సంఘం ఒకవిధమైన సంకేతాలనూ, ఆకారాలనూ ఏర్పరుచుకుంటుంది. ఛాందసులు నెయ్యి అనటానికి 'తేజోవై' అంటారు. 'వాయవ్యం' అంటే వారి పరిభాషలో 'రూపాయి' 'యువాసు' అంటే బట్ట. బ్రహ్మచారిని 'అమాయంతు' అంటారు. విధవను 'ఇంద్రాణీ' అంటారు. నీటితుప్పర పడుతుంటే 'యా కుందేందు' అనే సరస్వతీ స్తోత్రం చదువుతారు. తరుణిని 'ఆక్రంద' అనీ, ముసలి మనిషిని 'ఏతావా ఇడా' అనీ వ్యవహరిస్తారు. ఎగతాళికి మనం వాడే 'ఎద్దేవా' వైదిక పరిభాషల్లోనిదే. తిట్లలో ద్రాపె, యం బ్రహ్మ ఇత్యాదులు మనకు వారు ప్రసాదించినవే.

***

తల్లిదండ్రులకు కొందరు బిడ్డల మీదనే మమకారమున్నట్లు కవులకూ, రచయితలకూ కొన్ని శబ్దాలమీదనే మమకారం విశేషంగా ఉంటుంది. అది సకారణమూ కావచ్చును. అకారణమూ కావచ్చును. వారు వ్యక్తంగానో, అవ్యక్తంగానో, వారి కావ్యాలలోనూ రచనల్లోనూ వాటిని విశేషంగా ప్రయోగిస్తుంటారు. శబ్దాలే చివరకు వారి బిరుదనామాలై జన్మ నామాలు నశించి పోతవి. భవభూతికి భవభూతి శబ్దంమీద విశేష మమకారమట! భారవి, రత్నఖేట శబ్దాలవల్లనే వారికి ఆ పేర్లు వచ్చినవి. 'జఘనచపల, వికటనితంబ'లకు ఆ పేర్లు శబ్దంమీద మమకారం వల్ల కలిగినవే కాని, వారి జఘనచాపల్యం వల్లనూ, నితంబవికటత్వం వల్లనూ కలిగినవి కావు.

శబ్ద చరిత్రే మానవజాతి చరిత్ర అని చెప్పవచ్చును. పదజాలానికి చరిత్ర అత్యవసరము. అది వచ్చిన నాడే జాతి చరిత్ర పరిపూర్ణమౌతుంది. ఆ జాతికీ భాషలోని శబ్దజాలాన్ని పరిశోధించుకోవడము అత్యవసరము. పరిశోధన వల్లనే ఆయా కాలాల్లో ఆయా సన్నివేశాలల్లో జాతి అజ్ఞానవిజ్ఞానాలూ, ఆకారప్రకారాలూ, అభ్యుదయా నభ్యుదయాలూ ప్రతిఫలిస్తవి. ఆంధ్రభాషకు ఈ మహాచరిత్ర రచన సంభవించే స్థితి ఏ నాటికో?

***– భారతి, జనవరి 1948***

# సూర్యుడు - సూర్యోపాసన

బాబరు ఆర్చిపెలగోలో సంతానాన్ని అర్థించే స్త్రీ, ఒక పెద్ద సంసారానికి తండ్రిని ఒకణ్ణి ఆహ్వానించి ఒక దినాన 'ఉపువెరో' అనే సూర్యుణ్ణి ప్రార్థించవలసిందని అతణ్ణి కోరుతుందట! (Fraser Sympathetic Magic - P 22) భర్తను యుద్ధభూమికి పంపించి తిరిగివచ్చిన 'కై' జాతిస్త్రీలు 'ఓ సూర్యచంద్రులారా! నూనె రాసిన వస్తువులమీద వాన చినుకులు జారిపోయి నట్లు మా భర్తలమీద శత్రువులు ప్రయోగించే ఆయుధాలు పడకుండా చేయండి' అని కోరుతారట! (IBID - P. 42) గ్రహణసమయంలో సూర్యుడు చల్లారిపోతున్నాడనే ఉద్దేశంతో జింబాబ్వే జాతివారు నిప్పుతో వెలిగించిన బాణాలను ఆకాశంలోకి విసురుతారు. అవి సూర్యుణ్ణి వెలిగిస్తాయని వారి నమ్మకం. పెరూలోని సెన్సిస్సులు గ్రహణ సమయంలో బాణాలను ప్రయోగించి సూర్యునితో పోరాడుతూ ఉన్న భూతాన్ని ఛేదించామని తృప్తి పడతారు. గ్రహణసమయంలో చిల్కోటిన్ ఇండియన్లు పైన పెద్ద బరువు ఉన్నట్లు నటిస్తూ ఒక చక్రాకారంలో నడుస్తారట. సూర్యుని ప్రతినిధులమని భావించుకునే పురాతన ఈజిప్టు దేశపు రాజులు గ్రహణ సమయంలో 'రా' (సూర్యుడు) దేవాలయాల చుట్టూ తిరిగి యథారీతిగా వెలుగును ప్రసాదించ వలసిందని ప్రార్థిస్తారు. వేసంగి కాలం రాగానే లోకయాత్రలో వృద్ధుడు అయిన సూర్యదేవుడికి ఒక ఊతకర్ర కావలెననే ఉద్దేశంతో, పురాతన ఈజిప్టు దేశస్థులు 'ఊతకర్ర పండుగ' (Nativity of the Sun's walking stick) చేసేవారు.

ప్రాచీన కాలపు మెక్సికనులు సమస్తశక్తీ సూర్యోద్భవమని భావించి, ఆయనకు 'ఇపల్‌నె మహౌని' అని నామకరణం చేశారు. దానికి 'ఎవరి వల్ల సమస్త ప్రాణులూ బ్రతుకుతున్నవో అతను' అని ఆ భాషలో వ్యుత్పత్త్యర్థము. సూర్యుడు తన సమస్తశక్తినీ లోకానికి ప్రసాదిస్తున్నాడట. అందువల్ల అతనికి శక్తి కలగటానికి మనం కొన్ని బలులు ఇవ్వవలెననే సిద్ధాంతాలతో, సూర్యుణ్ణి ఉద్దేశించి మెక్సికనులు నరబలులు కూడా ఇచ్చారు. సమస్త ప్రపంచాలలోనూ, నరబలుల విషయంలో ప్రాచీన మెక్సికనులంత ప్రసిద్ధులు లేరు.

సూర్యుడు ఆకాశపథాన రథం మీద ప్రయాణం చేస్తాడని పురాతన గ్రీకుల నమ్మకము. అందువల్ల వారూ, రోడీషియనులు సంవత్సరానికి ఒక రథాన్నీ, నాలుగు గుర్రాలను సూర్యోదయసమయాన సముద్రంలో ఒదిలి పెట్టేవారు.

పెరూవియన్ ఆండిస్ అనే లోయలో రెండు శిథిలరాజగృహాలున్నవి. వాటిమధ్య ఇనుపవంకీలకు ఒక వల వేసి ఉంటుంది. ఇది సూర్యుణ్ణి పట్టుకుని వేగం తగ్గించటానికి ఉద్దేశించినట్లు వారి జనశ్రుతి (Tradition). వారి పూర్వుల్లో అనేకులు సూర్యుణ్ణి ఆ విధంగా పట్టి బంధించినవారు ఉన్నారని వారి నమ్మకము. సూర్యుడు ఉత్తరం వైపు వెళ్ళేటప్పుడు పట్టుకొని నిలపటానికని 'వల ఆట', దక్షిణానికి వెళ్ళుతుంటే తిరిగి రావటానికి 'గిన్నె – బంతి' ఆట ఇగ్గులిక్కు లనే జాతివారిలో ఆడటము ఒక ఆచారము. ఆస్ట్రేలియాలోని అనాది జాతులవారు అడవుల్లో, పొలాల్లో పని చేసుకుంటూ సూర్యుణ్ణి త్వరగా అస్తమించకుండా చేయటానికి నల్లగుడ్డ ఒకటి సూర్యుడికి ఎదురుగా ఎత్తయిన చెట్టుమీద కడతారట! త్వరగా వస్తే తొందరగా ఇంటికి వెళ్ళవచ్చుననే సందర్భం కలిగినప్పుడు ఇసుక పైకి చల్లి నోటితో సూర్యుని వైపు ఊదుతారు. (IBID)

పెరూలోని 'ఇంకాలు' తాము సూర్యపుత్రులమని చెప్పుకుంటారు. వారిని ఇతరులు దేవతలుగా భావించి సమస్తవిధాలా గౌరవిస్తారు. ఇంకాలకు జబ్బు చేస్తే ఇతరులు భావించినట్లు భావించరు. అప్పుడు తమ తండ్రి అయిన సూర్యభగవానుడు శ్రమతీర్చు కోవటానికి పంపిన ఒక దూతగా భావిస్తారు. మృత్యువు ఆసన్న మౌతున్నప్పుడు దూరం చేసుకోవాలని ఎటువంటి క్రతువులూ చెయ్యరు, బలులు ఇవ్వరు. 'మా తండ్రి (సూర్యుడు) మమ్మల్ని వచ్చి తనతో కలుసుకోమని కోరుతుంటే అడ్డు పెట్టటమెందు'కని అంటారు.

ప్రాచీన కాలంలో పార్థియా రాజులు సూర్యుణ్ణి వారి భ్రాతగా భావించేవారు. ఈజిప్టు రాజులు దివ్యత్వాన్ని సమర్థించి జీవితకాలంలోనే విగ్రహాలు చేయించుకుని పూజాపునస్కారాలు పొందినారు. వారు సూర్యోద్భవులు, సమస్తజగత్తూ సూర్యోద్భవము. వారి బిరుదాలలో సూర్య నామం ఒకటి.

టిమ్రోషీ జాతివారు ఒక నల్లపందిని వర్షం కోసం భూదేవతకూ, ఎఱ్ఱని పందిని ఎండ కోసం సూర్యుడికీ బలి ఇస్తారట! (IBID P.18) ఆ సమయంలో ఆయన్ను 'ఓ సూర్యభగవానుడా! నీవు నిరంతరమూ ఎఱ్ఱగా మండుతూ ఉండు. ఆకాశంలో దట్టంగా క్రమ్ముకున్న నీలిమేఘాల నన్నిటినీ తినివెయ్యి' అని అడుగుతారట! చాల్డియాలు మూత రాయితో చక్రం చేసి ఒక కొరవిని ఆ రంధ్రాలలో ఉంచి, అనేక పర్యాయాలు త్రిప్పుతూ

మేఘాల నన్నిటినీ తిని భూమిని ఎండించి పంట పండించేటందుకు సూర్యుణ్ణి వెలిగిస్తున్నామని సంతోషిస్తారట! సూర్యుడి చేత ఎండ కాయించటమనే చిత్రమైన ఒక ప్రక్రియను 'వాట్‌లోవా' అనే పేరుతో బాంకు ద్వీపవాసులు జరిపిస్తారు. 'వాట్‌లోవా' ఒక రాతి ముక్క. దానిచుట్టూ ఎర్రని గుడ్డ కడతారు. ఇది సూర్యునికి ప్రతీక. కిరణాలను చాపటానికి దీని చుట్టూ గుడ్లగూబ ఈకలు నల్లగుడ్డతో కడతారు. పాటలు పాడి నృత్యం చేసి దీనిని చుట్టూ త్రిప్పుతారు.

## సప్తసప్తి

హిందూ సంప్రదాయాన్ని అనుసరించీ, ప్రపంచంలోని అనేక ఇతరజాతులను అనుసరించీ, సూర్యుడు తూర్పుదిక్కుకు అధిపతి. అమరసింహుడు అతనికి 32 నామాలు చెప్పినాడు. నామ లింగానుశాసనకర్త వాటికి వ్యుత్పత్త్యర్థాలను నిరూపించినాడు. అమరంలో కనుపించే నామాలు కాక మరికొందరు సూర్యుణ్ణి భగ, వృద్ధ, హరి, కాశ్యపేయాది శబ్దాలతో కూడా వ్యవహరించారు.

శతపథ బ్రాహ్మణము పన్నెండు మంది సూర్యులను పేర్కొన్నది. 'నానా లింగత్వాత్ ఋతూనాం నానా సూర్యత్వం' అనే ప్రమాణాల్ని అనుసరించి చూస్తే, ఈ ద్వాదశ సంఖ్య ద్వాదశ రూపాలను అనుసరించి పుట్టినట్లు కనిపిస్తుంది. ఋగ్వేదంలో ఒకచోట సూర్యులు ఆరుగురనీ (2-27), ఒకచోట ఏడుగురనీ (Tilak - Architic Home in the Vedas - Dawns) ఉన్నది. తైత్తిరీయ సంహిత సూర్యులు ఎనమండ్రురని ఒకచోటా, పన్నెండుమంది అని ఒకచోటా వ్రాసింది. ఉపనిషత్తులలోనూ, పురాణాలలోనూ సూర్యులు పన్నెండుగురు.

వేదకాలంలో హిందువులు ఆదిత్యుని మైత్రేయుడు, సావిత్రి, సూర్యుడు మొదలైన నామాలతో వ్యవహరించారు. ఋగ్వేదకాలంలో ఆదిత్యుని ఇతర మూర్తులకంటే సూర్యుని గురించి విశేషప్రస్తావన కనిపిస్తుంది. అతడు జ్యోతిర్మయుడు. సావిత్రికి కొంత క్లిష్టత కనిపిస్తున్నది. మైత్రేయుడు జ్యోతిర్దేవత. సూర్యునికీ మిగిలిన ఆదిత్య వర్గాలకీ ఉన్న సంబంధం ఎటువంటిదో ఆ వర్ణనలను పరికించి చెప్పటము కష్టము. అనేక సందర్భాలలో ఇతని స్వరూపస్వభావాదులు, ఇతర ఆదిత్యవర్గంలోని వారి స్వరూపస్వభావాదులతో సరిపోతున్నది. (ఋగ్వే. 36,75) సూర్యుడు, సావిత్రి ఇద్దరూ ఉషాధినాథులు. సూర్యుడు అదితి పుత్రుడు (1.191) సావిత్రి మైత్రేయులు ఆదిత్యులు (VII, 18; 11-22) సూర్యుడు సప్తాశ్వరథాన్ని ఎక్కి ఆకాశసంచారం చేస్తాడని వర్ణన

ఋగ్వేదంలో కనిపిస్తున్నది (VIII - 60). సావిత్రికి రెండు గుర్రాల రథ మున్నదట. (1–32) సూర్య సావిత్రులిద్దరూ దుఃస్వప్న దోషాలను పోగొట్టుతారని కొన్ని మంత్రాలు కనిపిస్తున్నవి. (5-32, I-35)

ఆదిత్య వర్గములో ఒకడు. తరువాతి కాలంలో పూష శబ్దం సూర్యునికి ఒక నామమైంది. ఈశావాస్యోపనిషత్తులోని 'హిరణ్మయేన, పాత్రేణ సత్యస్యాపి హితమ్ ముఖమ్...' ఇత్యాది వాక్యాలు ఇందుకు ప్రమాణము.

వేదకాలానంతరము విష్ణువు ఆదిత్యుల్లో ప్రథముడైనాడు. సూర్యుని త్రిమూర్త్యాత్మకత్వము ఆ నాడు విష్ణువుది. ఋగ్వేదంతో సంబంధం ఉన్న ఐతరేయ బ్రాహ్మణము ప్రారంభంలోనే అగ్నిర్వై దేవానా మవమో విష్ణుః పరమస్తదంతరేణ సర్వా – అన్యదేవతల వల్ల విష్ణుసూక్తాలకు తాత్పర్యం ఏమంటే (అతడు భువనరక్షకుడు) 'ఇనో విశ్వస్య భువనస్యగోపా' అన్న వాక్యం ఇందుకు ప్రమాణము. 'అఖిలామ్నాయైక వేద్యో హరిః' అన్న మధ్వాచార్యులవారి వాక్యానికి అనుగుణమైన విష్ణుప్రశంస అక్కడనే కనిపిస్తుంది. విష్ణువుకు సంవత్సరంలో నాల్గవ భాగంతో మాత్రమే సంబంధమున్నట్లు ఋగ్వేదంలో ఒక సూక్తం కనిపిస్తున్నది. విష్ణువును గురించి ఋగ్వేదంలో కనిపించే సూక్తాలను (1:22; 1–17) పరిశీలిస్తే అతడు దేవదేవుడని వ్యక్తమౌతుంది. అందువల్లనే ఆయన ఆదిత్యవర్గంలో తరువాతి కాలాన ప్రథమగణ్యుడై ఉంటాడు. విష్ణువులో ఆదిత్యాంశమేమీ లేదని ఓల్డెను బర్గు పండితుడు వ్రాసిన వ్రాతను (Vedic Mythology. P. 35) ప్రాచ్య పండితులు అంగీకరింపక 'వైష్ణవోం శబర స్సూర్యః అంతర్జ్యోతి రనంప్లవం, అభిమాయత మోంకారం తస్య తత్త్వేరమ్ పరమ్' అన్న విష్ణుపురాణవాక్యాన్ని (11. 8. 35) ప్రమాణంగా చూపించినారు.

సూర్యుణ్ణి గురించి 'క్షత్రియ కాశ్యపం రక్తం కాళింగం ద్వాదశాంగుళం, పద్మహస్తం పూర్వాననం, సప్తాశ్వ వాహనం, శివాఽ ధి దైవతం, ధ్యాయే ద్వహ్ని ప్రత్యధి దైవతమ్' అన్న వాక్యాన్ని అనుసరించి చూస్తే, సూర్యుడు క్షత్రియుడని తెలుస్తున్నది. కొన్ని చోట్ల 'అతడు బ్రాహ్మణు' డని ఉన్నది. అదితి – కశ్యప సంతానం కావటం వల్ల కాశ్యపుడైనాడనీ వ్యక్తమతున్నది. పద్మం సూర్యునితో వికసిస్తుంది గనుక అతను పద్మాననుడైనాడనీ, పూర్వ దిశన ఉదయించటం వల్ల పూర్వాననుడైనాడనీ కొందరు నిశ్చయించినారు. సప్తసంఖ్యకూ, సూర్యుడికీ విశేషమైన సంబంధం ఉన్నది. మాకరీ, సప్తమి సూర్యోపాసనకు ప్రత్యేకమైన దినంగా ఏర్పడ్డది. ఆ నాడు సూర్యుణ్ణి క్రింది మంత్రంతో అర్చించమని ఆదేశం.

శ్లో. 'జననీ సర్వభూతానాం సప్తమీ సప్త సప్తికే
సప్తవ్యాహృతికే దేవి నమస్తే రవిమండలే ।
సప్తసప్తి వహక్రీత సప్తలోక ప్రదీపన
సప్తమ్యాంహి నమస్తుభ్యం నమోంతాయ వేధసే ॥'

రవికి దేవత శివుడట. 'ఆదిత్య ప్రభవో విష్ణుః' అనే వాక్యం ఉన్నా సరే, తెల్లవారగానే అగ్ని సూర్యుడిలో ప్రవేశిస్తాడట! సూర్యుని కిరణాలు ఏడనీ, వేయి అనీ ఉంది. అతని వెలుగు తెలుపనీ, కారు నలుపనీ ఛాందోగ్యోపనిషత్తు తెలిపింది 1-6-5. కన్ను గ్రుచ్చి చూచేవారికి ఈ నలుపు కనిపిస్తుందని 'తర్ధ్యేనాంత సమాహిత దృష్టేర్ దృశ్యతే' అని ఆచార్య శంకరులు ఈ ప్రవచానికి భాష్యం వ్రాశారు. సూర్యదేవతలకు సర్వసామాన్యమైన వైదికమంత్రం అయిన 'రథౌ నాష్టేన రసజా వర్తమాన నివేశనన్నమృతం మర్త్యం చ హిరణ్మయేన సతా దేవో యాతి' అని ఉపనిషత్తులో అభివ్యక్తమౌతున్నది. వైజ్ఞానికులు ఈ విషయాన్ని అంగీకరించారు. ఛాందోగ్యంలో ఒకచోట సూర్యుడికి పింగళత్వమూ, పీతత్వమూ, శుక్లత్వమూ లోహితత్వమూ కనిపిస్తున్నవి (అసౌవా ఆదిత్యః పిఙ్గళ ఏష శుక్ల ఏష నీల ఏష పీత ఏష లోహితః 8-6-1) సూర్య గమనానికి సంబంధించిన కొన్ని సూక్తాలు ఋగ్వేదంలోనే కనిపిస్తున్నవి. రవి ముహూర్తానికి ఈ ముప్పది అంశలు నడుస్తాడని పురాణాలు చెపుతున్నవి.

పురాణాలు సూర్యుడు అగ్ని ప్రకృతి అనీ, (వాయు 53.30) సూర్య మండలము తేజోమయము అనీ, అది తెల్లనిదనీ (51.20) సూర్యుడే వాన కురిపిస్తాడనీ (51.21) గ్రహాలన్నింటిలో ఆద్యుడు ఆదిత్యుడనీ (53.111) నక్షత్రాలూ, చంద్రుడూ, గ్రహాలూ, సూర్య సంభవాలు (ఋక్ష చంద్రగ్రహా స్సర్వే విజ్ఞేయా స్సూర్య సంభవాః - వాయు 53.28) ఇంకా ఎన్నో విశేషాలు పురాణాల వల్ల తెలుస్తున్నవి. (ప్రాచీన ఖగోళము - వేలూరి శివరామశాస్త్రి. భారతి సర్వధారి, జ్యేష్ఠము పే. 51.53) సూర్యుని కిరణాలలో సుషుమ్న, హరికేశ, విశ్వకర్మ, విశ్వశ్రవ, సంయద్వసు, అర్వావసు, స్వరత్ అనే కిరణాల వల్ల క్రమంగా చంద్రుడూ, నక్షత్రాలుంటాయి. బుధుడూ, శుక్రుడు, కుజుడు, బృహస్పతి, శనీ పరిపోషణ పొందుతున్నారన్న వాక్యాలు (వాయు 53-44-50) విశేషంగా గమనింపతగ్గవి. సూర్య కిరణాలు అసంఖ్యాకాలు. వాటిలో నాలుగు వందలు వర్షదాలు, వాటి కాంతి శబలము, మూడు వందలు మంచు కురిసేవి. ఇవి పీతవర్ణాలు. మూడు వందల కిరణాలు వేడిని చిమ్మేవి. వీటి రంగు తెలుపు (53-19 మొదలు 27).

బృహత్సంహిత ఆదిత్య చారాధ్యాయంలో సూర్యబింబంలోని మచ్చలను (Sun-Spots) గురించి విశేషంగా ప్రసంగం కనిపిస్తున్నది. వీటిని తామస కీలకాలని జ్యోతిష శాస్త్రజ్ఞులు వ్యవహరిస్తారు. వీటివల్ల కలిగే అరిష్టాలను గురించి విశేషాంశాలు జ్యోతిశాస్త్ర గ్రంథాలలో కనిపిస్తున్నవి. వీటిలో సూర్యమండల విస్తృతి, గమన విశేషాలూ గుర్తింపదగినవి.

***

ప్రాచీన హిందువుల నిత్య నైమిత్తిక కర్మల్లో సూర్యభగవానుడు ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించాడు. ఋగ్వేదంలోని (III-62) గాయత్రీమంత్రం ఆదిత్యవర్గంలోని సావిత్రిని గురించి చెప్పినా, తరువాత సూర్యునికి ఉద్దేశితమైంది. రామాయణంలో రామరావణ యుద్ధం అంతం కాబొయ్యే సమయంలో అగస్త్యుడు శ్రీరామచంద్రుడికి ఆదిత్య హృదయాన్ని చెప్పినాడు. భారతములో (మూడవపర్వము) సూర్యదేవుని అష్టోత్తర నామావళి కనిపిస్తున్నది. ఇది బహుశః స్కాందములోని కాశీఖండాన్ని బట్టి చేరి ఉంటుంది. బహుకాలం వరకూ సూర్యుడు ప్రతిమారూపాన్ని పొందకుండా ప్రకృత రూపుడుగానే ధ్యానితుడౌతూ వచ్చాడు.

సూర్యుని ప్రతిమా స్వరూపము ఉత్తర పశ్చిమ భారతదేశంలో క్రీస్తు పుట్టుకకు తరువాత జరిగి ఉంటుందని చరిత్రకారుల అభిప్రాయము. ఈ ప్రాంతం బహుకాలం నుంచీ ఇరానియను దేశసంస్కృతితో పరిచయం కలిగినది. 'మిత్రసు' పర్షియను దేవత. ఇతడు మధ్యలోకంలోని ద్యుదేవత కాళరాత్రితో నిరంతరమూ పోరాడుతూ ఉన్న ఇరేనియనుల దేవాధిదేవుడు అఫెబార్ మజ్దాకు విశేష సహాయం చేసినట్లు వారి పురాణాలు పలుకుతున్నవి. వీరి ఉద్దేశాలతో సంబంధం కల సూర్య ప్రతిమలు, ఉత్తర పశ్చిమ భారతంలో దొరికిన నాణాల మీద కనిపిస్తున్నవి.

బౌద్ధ సాహిత్యంలో సూర్యునికి తుల్యమైన దేవతలుగా కనిపిస్తున్న మైత్రేయ, అమితాభులు పర్షియను ప్రభావమూలంగా కలిగినవారని అభిజ్ఞుల అభ్యూహ. భారతదేశంలో అనాది నాణెముల మీద కనిపించే చక్రాన్ని, ధర్మచక్రంగా కొందరు భావించారు. కానీ ఇది సూర్యదేవునికి ప్రతీక అని శ్రీ కె.ఎ. నీలకంఠ శాస్త్రి, ప్రభృతుల అభిప్రాయము. హేమాద్రి వ్రతఖండంలో సూర్యవ్రతాన్ని గురించి వ్రాస్తూ సూర్యుణ్ణి పన్నెండు దళాలు కలిగిన పద్మంగా నిరూపించవచ్చునన్నారు.

ప్రాచీన తక్షశిలలో ఒక మాజ్డియన్ దేవాలయం ఉన్నట్లూ క్రీ.శ. 50 ప్రాంతంలో టైనా రాజు అప్పయినియసు దానిని దర్శించి కానుక లర్పించినట్లూ పరిశోధనల వల్ల వెల్లడైంది. కనిష్కుని నాణెముల మీద కనిపించే ప్రతిమను కొందరు 'మాజియను రాజు' అని నిరూపించారు. కానీ అది ఎనైటిస్, ఆత్రో, మిత్రో మొదలైన నామాలను బట్టి చూస్తే సూర్యదేవుని ప్రతిమలనే అభిప్రాయం కలుగుతున్నది. అటు తరువాతి కాలంలో సూర్య ప్రతిమలు ప్రాంతీయాలైన ఆహార్యాలతో రూపొందినవి. రాజ తరంగిణి కర్త కల్హణుడు కాశ్మీర మిహిరేశ్వరాలయాన్ని కుషాను రాజు మిహిరకులుడు కట్టించినట్లు వ్రాసినాడు. అక్కడ అతను సోదరీమణులతోనూ, కోడంద్రతోనూ సంభోగాన్ని నెరపే బ్రాహ్మణులను అర్చకులుగా నిల్పినట్లు పై గ్రంథం పలుకుతున్నది. బహుశః వీరు మాంత్రికులు కావచ్చును.

సుప్రసిద్ధ భారతీయ జ్యోతిషశాస్త్రవేత్త వరాహమిహిరుడు. (క్రీ.శ. 587 ప్రాంతము) అతని తండ్రి ఆదిత్యదాసుడు. వీరి నామావళిలో సూర్యునికి ఉన్న సంబంధం గమనింపతగ్గది. వరాహమిహిరుడు అతని బృహజ్జాతకాన్ని సూర్యస్తుతితో ప్రారంభించినాడు. అతడు వర్ణించిన సూర్యరూపము కనిష్కుని నాణెముల మీద కనుపించే హీలియొస్‌ను జ్ఞప్తికి చేస్తున్నదని ప్రతిమాశాస్త్రాభిజ్ఞుల (Iconographists) అభిప్రాయము. అతని కిరీటము, కీర్తిముఖము, వివర్తోత్తరీయము మొదలైన లక్షణాలు తరువాతి కాలంలో పుట్టిన సూర్యప్రతిమల్లో కనిపించవు.

సూర్యదేవుని అనాది ప్రతిమారూపాలలో ఒకటి బుద్ధగయలోని ఒకానొక ఫలక శిల్పం మీద కనిపిస్తున్నది. అందులో సూర్యుడు ఉషస్సు, ప్రత్యుషస్సులతో రథం మీద పయనమౌతున్నట్లు చిత్రితుడైనాడు. కలకత్తా వస్తుప్రదర్శనాలయంలో ఒక ఉషోదేవతతో మాత్రమే రథము మీద కూర్చొన్న సూర్య శిల్పము ఒకటి ఉన్నది.

భవిష్యపురాణంలో కృష్ణుని కుమారుడు సాంబుడు చీనాబ్ నది ఒడ్డున ఉన్న మిత్రవనంలోని సూర్యుని దేవాలయం దగ్గిరకు యాత్రకు వెళ్ళి, అతని కుష్టు రోగాన్ని పోగొట్టుకున్నట్లు ఒక కథనం కనిపిస్తున్నది. అతడు ఆ ప్రాంతంలో మరొక సూర్యదేవాలయాన్ని నిర్మించినట్లూ దానికి అర్చకులు దొరకకపోతే, శిథియనుల దేశమైన శకద్వీపంనుంచి కొందరు మఘవంశాలవారిని పిలిపించినట్లూ ఆ గ్రంథం చెపుతున్నది. ఈ మఘులు బ్రాహ్మణులకు సూర్యునికీ, నిక్షుభకూ కుమారుడైన జరాశబ్దునికీ, మిహిర గోత్రుడైన ఒక బ్రాహ్మణుని కుమార్తె శైవహకూ జన్మించిన వంశంలో వారట! ఈ మఘ బ్రాహ్మణులకు చతుర్వేదాలున్నవి. అవి ఋగ్వేదాదులు కావు. అవి వాదము,

విశ్వవాదము, వైద్యుతము, ఆంగిరము. వార్షమము వారి సోమలత. అవ్యాంగము వారి యజ్ఞోపవీతము.

కృష్ణకుమారుడు సాంబుడు కట్టించిన సూర్యదేవాలయం మూల్తాను (మూలస్థానము) లోని ఆలయమని చరిత్రకారుల అభిప్రాయము. మూలస్థాన సూర్య దేవాలయాన్ని చైనా యాత్రికుడు హుయత్సాంగు, అరబ్బు పండితుడు ఆల్బెరూనీ ఎరుగుదురు. ఈ ఇరువురూ ఆ దేవాలయప్రతిష్ఠనూ, ప్రభావాన్నీ వారి చరిత్రల్లో ఉటంకించారు. మూల్తానును జయించిన మహమ్మదు బిన్ ఖాసిమ్ దానికి 'ఆల్మమురా' అనే నామం ఉంచినాడు. కడసారిగా సింధు రాష్ట్రంమీద దండెత్తిన ఔరంగజేబు, ఈ దేవాలయాన్ని నేలమట్టం చేశాడు. 'ఆల్-ఇద్రిష్' మూలస్థానంలో సూర్యవిగ్రహాన్ని, దేవాలయాన్నీ నేలమట్టం చేశాడు. హర్షవర్ధనుడూ, అతని వంశస్థులూ, సూర్యోపాసకులు. అతని తండ్రి ప్రభాకరవర్ధనుడు. ఇతడు నిత్యమూ ఆదిత్య హృదయాన్ని పారాయణం చేసేవాడట. మయూరుడు సూర్యశతకాన్ని చెప్పి కుష్ఠురోగాన్ని పోగొట్టుకున్నట్లు జనశ్రుతి. ఈ శతకంలోని ఆరు శ్లోకాలు కాంచీ పురంలోని ఒక శిలాఖండం మీద లిఖితమై ఉన్నవి.

భారతదేశంలో సూర్య దేవాలయాలు విశేషంగా లేవు. ఒరిస్సాలో కోణార్క సూర్యదేవాలయం ప్రసిద్ధమైంది. కాశ్మీరంలోని శ్రీనగరానికి వెళ్ళే త్రోవలో ఉన్న మార్తాండాలయము మరొకటి. ఒక రథంమీద పక్షి మొగంతో ఉన్న వ్యక్తి రథచోదకుడుగా ఉన్న మరొక సూర్యశిల్పం, కలకత్తాలో వారణాసి ఘోషు వీథిలో ఉంది. దక్షిణదేశంలో కేవలం సూర్యదేవునికి అంకితంగా కట్టిన దేవాలయం తంజావూరు మండలంలో 'సూర్యనార్ కోయిల్' అనే నామంతో కీర్తి కన్నది. దీనిని బహుశః కనూజ్ గుహద్వారాలతో ఉన్న పరిచయం కారణంగా కులోత్తుంగ చోళ దేవుడు (క్రీ.శ. 11వ శతాబ్దము) కట్టించి ఉంటాడని నీలకంఠ శాస్త్రిగారి 'చోళ చరిత్రలో' వ్రాసినారు. దాక్షిణాత్య దేవాలయాలన్నిటిలో ఉన్న నవగ్రహాలలో ఆదిత్య విగ్రహాలు కనిపిస్తున్నవి. ఉత్తరదేశంలోని ఆదిత్య విగ్రహాల చేతులో ఉన్న తామరలు పూర్ణంగా వికసించినవి. దక్షిణదేశంలో అవి మొగ్గలు. అదే ఉత్తర దక్షిణ దేశ సూర్యవిగ్రహాలలో కనిపించే ముఖ్య విభేదం సూర్యారాధనా విధానం, వాయు పురాణం 12వ అధ్యాయంలో విపులంగా కనిపిస్తున్నవి.

(సూర్య విగ్రహనిర్మాణాన్ని గురించీ, ఇతర విశేషాలను గురించీ సంక్రాంతి స్వరూప స్వభావాచారాలను గురించి ఆంధ్రపత్రిక, వారపత్రిక జనవరి 12-1-1949 'సంక్రాంతి - సూర్యోపాసన' అనే నా వ్యాసాన్ని చూడవలసిందని ప్రార్థన.)

# తంత్రాలలోని స్త్రీ జనాలేఖ్యం

పాశ్చాత్య స్త్రీలు ఈ శతాబ్దం ద్వితీయ దశకంలోనే అనుమోదన (సమ్మతి) పౌరసత్వాన్ని (వోటింగు హక్కును) ఆర్జించారు. ఈ సంపాదనం నిశ్చయంగా స్త్రీ జనోద్యమ ప్రగతిలో విశిష్ట పదచలనము.

నెదర్‌లాండ్సు 1917 సంగాలో వైశ్వాత్మక (అనుమోదన) పౌరసత్వ సిద్ధాంతాన్ని ప్రథమతః విస్తరింపజేసింది. తరువాత ఆస్ట్రియా, బ్రిటను, బాల్టిక్ దేశాలు, జకోస్లావియా, జర్మనీ, ఐర్లండు, లక్జెంబర్గు, స్కాండినేవియన్ దేశాలు అనుసరించటం జరిగింది. అమెరికా 1920లో స్త్రీ పౌరసత్వాన్ని ప్రకటించింది.

1970వ సంవత్సరాలలో 90 దేశాల్లో విస్తరించి ఉన్న ఆరు కోట్ల సభ్యులు గల ఆంగ్లికను చర్చికి చెందిన పాశ్చాత్యదేశాలలో పురుష పాలనవ్రవిచ్ఛేదం జరిగింది. 1971 నవంబరు 28న హాంగ్ కాంగ్‌లో ఆంగ్లికన్ చర్చివారు, ఇరువురు స్త్రీలు వారి పౌరోహిత్యానికి నియమితురాండ్రు గావింపబడటంతో, చరిత్రాత్మక పరివర్తనకు బంతిని ప్రయోగించటం ప్రారంభమైనది. 1976 నవంబరులో కెనడా దేశంలోని ఆరుగురు స్త్రీలు మంత్రివర్గంలోనికి ఆహ్వానితులయినారు. 1977లో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఎపిస్కోపల్ చర్చివారు ఆరుగురు స్త్రీలను పురోహితులనుగా నియమించారు.

ఇందుకు భిన్నంగా ఇంగ్లండు చర్చివారు 1975 జులై నెలలో స్త్రీలు పౌరోహిత్యంలోకి ప్రవేశించవచ్చు అన్న విషయాన్ని సిద్ధాంతరీత్యా అంగీకరించారు. ఈ విషయం 15 సంవత్సరాలుగా అన్యగర్భితమై ఉన్నది. ఇప్పుడు ఇంగ్లండులో ఇంకా స్త్రీలు పౌరోహిత్యానికి నియమితులు గావింపబడవలసి ఉన్నారు.

పౌరోహిత్యానికి స్త్రీలను నియమించటం విషయాన్ని రోమను కాథలిక్ మతపీఠంవారు సంపూర్ణంగా వ్యతిరేకిస్తూనే ఉన్నారు. 1977 జనవరి 27న పోప్ పాల్ VI "జీసస్ పురుషుడు. ఆయన ఆత్మ మాతృమూర్తి మీద పౌరోహిత్యాన్ని ప్రసాదించలేదు గనుక స్త్రీలు ఎన్నడూ తమను కాథలిక్ మత పురోహితులుగా గుణీభూతలను గావించుకొనలేరు" అని ప్రకటన గావించాడు.

ఇందుకు భిన్నంగా, భారతదేశంలో 15000 సంవత్సరాలకు పూర్వమే తంత్రగ్రంథాలు, వాటి ప్రకాశకులు స్త్రీల ఉద్యమాన్ని (సంచలనాన్ని) సాగించటం జరిగింది. పాశ్చాత్యదేశాలు ఇంకా అంధకార యుగాలలో నిద్రాముద్రితాలవుతున్న కాలంలో అవీ, వారు ఉభయ లింగకుల (స్త్రీ పురుష) సామ్యతకు చెందిన విప్లవాత్మకాలు అయిన భావాలను సర్వత్రా నిదర్శనాలు గావించటం జరిగింది. వీటికి ఉన్ముఖులు అజ్ఞాతులు, గౌరవాలను పొందనివారు, అకీర్తితులు అయిన పుంతాత్త్వికులు తప్ప ఇతరులెవ్వరూ కారు. వారు స్త్రీ విముక్తిని, ప్రశాంతంగాను, అగోచరంగాను, అనుగ్రహయుతంగానూ కొనివచ్చినారు. ఏమైనప్పటికీ ఈ విషయంలో తంత్రాలు నిర్వహించిన విశిష్ట పాత్ర ఇంతవరకు అంగీకరింపబడటం జరుగలేదు.

తంత్రాలు సతీ హస్తబంధాలనుంచి విముక్తురాంద్రను గావించి భారత స్త్రీలకు విముక్తి విమోచనను ప్రసాదించటానికి ఎంతగానో తోడ్పడ్డవి. సతీ తంతును (సహగమనాచారాన్ని) మత ప్రవచనాలకు, మానవత్వానికి సామాన్య మనోభావానికి వ్యతిరేకమైన ఆటవికాచారమని చిహ్నితం గావించి, తంత్రాలు దానిని సందిగ్ధరహితంగా నిందించినవి. ఈ విషయాన్ని మహానిర్వాణతంత్రం ఇలా ప్రకటించింది. "ఒక స్త్రీ తన అజ్ఞానాంధకారం వల్ల మృతినొందిన పతి చితి మీదికి అధిరోహించినట్లయితే ఆమె నరకానికి వెళ్ళి తీరుతుంది!"

పురాతన మాధ్యమిక కాలాలలోని అక్రమపరులైన న్యాయప్రదాతలు, సాహిత్యకులు, విద్వాంసులు అయినవారి వినాశకరమైన విజ్ఞాపనలు ఎలా ఉన్నప్పటికీ తంత్రగ్రంథాలు వశీకరణాంధకార ప్రదేశంలోనికి ఆదిత్యకాంతిని ఆభాసింపజేసినవి. తాంత్రిక సిద్ధాంతాలు సర్వలైంగికులకు, సర్వధర్మాలకు, సర్వ వర్గాలకు, సర్వ వర్ణాలకు ప్రసారితాలు. విషయానికి వస్తే తాంత్రిక ప్రచారకుల్లో పరమ ప్రముఖుల్లో కొంతమంది స్త్రీలే.

తాంత్రికత్వానికి మూలాధారం ఏమిటో అభివ్యక్తం కావటం లేదు. ఏమైనప్పటికీ కొంతమంది విద్వాంసులు సర్వభారతీయ ధర్మాలలో దానిని పరమ పురాతనమైనదిగా విశ్వసిస్తున్నారు. అంతేకాక వారు దానిని భారతదేశంలోని ఆర్యులకు (స్వీకృత మతాలలో) పూర్వులైన ప్రజల మతంగానూ, యోగ శాస్త్రానికీ, భారతీయ గూఢతకు, భారతీయ గుప్త విద్యకు (Indian Occufison) మూలాధారంగానూ, భావించారు. అది ఆఫ్ఘనిస్థానం మొదలు అస్సాం వరకు సరిహద్దు ప్రాంతాలల్లో ప్రగాఢంగా లగ్నమై ఉన్నది. సాంప్రదాయికశాఖల మీద వ్యతిరేకంగా విప్లవాత్మక చిత్తప్రవృత్తిని ప్రసరింపజేసింది.

(తాంత్రిక స్వీకృత మతశాఖలవారిలో శైవులలోని సౌరపాత్రులు అయిన కౌలము, కాపాలికము, నాథము, శాక్తము, శాఖలు వైష్ణవులలోని కుమితి సోమసిద్ధాంతులు, పాంచరాత్రులు, సహజయానులు, ప్రముఖులు.

వామాచార తాంత్రికశాఖలలో కౌలము ప్రధానమైనది. దీనిని అనుసరించేవారు కౌలికులని Tais Cult అందరూ వ్యక్తీకరింప బడతారు. దత్తరీయగోత్రులయిన కౌలులకు కాశ్మీరము దీని అతిప్రముఖ వపము. 'కౌలము' అనే పారిభాషిక పదానికి మూలం అనిశ్చితంగా గోచరిస్తున్నది. "కుండలిని"కి, దాని ఉత్థాపనకు సబంధించిన కౌలినీ దేవతతోను, దానిలో ప్రవీణులయిన వీరులుగా వ్యవహరింపబడే కాలి, కౌలీనులను తెలిపే కులంతోను, తంత్రంమీద మతశాఖకు చెందిన విశ్వాసా వేమన (సమ్మఏముల సారె) మీద వ్యవహరించే తంతువాయుని వ్యక్తం చేసే కౌలికతోను, అనేక కౌల సిద్ధాంతాల బీజాలను పొంది ఉన్న కౌలోపనిషత్తును అనుసరించేవారైన కౌలోపనిషదుల తోను ఉన్న కౌల సిద్ధాంతాలు కులార్ణవతంత్రంలో అధికంగా వివరింపబడ్డవి.

తాంత్రిక వేల (స్రోతస్సు) మహాశక్తిమంతమైనది. మహాయాన బౌద్ధం సైతం దీని ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయింది. తాంత్రిక ధర్మసంప్రదాయంలోని వామాచారపద్ధతికి కాలచక్రయానం, కామవజ్రయానం అన్న రెండు శాఖలున్నవి. యోగాచార విధానానికి క్రీ.శ. 4, 5 శతాబ్దాలలో పెషావరులో వర్ధిల్లిన అసంగ, వసుబంధులనే సోదరులు ఇద్దరూ ద్రష్టలు. వేలకొద్దీ ఆధార గ్రంథాలు Orthodox హిందువుల చేత, మహమ్మదీయుల చేత అగ్ని దగ్ధాలు గావింపబడ్డప్పటికీ, వామాచారం అత్యధిక సాహిత్యాన్ని వహించి ఉన్నది. ఏ కారణం చేత అయితేనేమి, దానిలో అధికభాగం ఇంకా అనువదితం కాలేదు. తాంత్రిక ధర్మానికి చెందిన ఆధారగ్రంథాలలో కొన్ని అత్యధిక గూడార్థోపేతాలు. కృతప్రవేశులకు (విద్యోపక్రములకు) పరమ గహనాలు. మూల ప్రవచనాలన్నిటినీ మౌఖికంగా బోధించటము, ప్రవచనాల్లో ఒక భాగం మాత్రం గుహ్యాభాషలో లిఖించటము, ఇందుకు ముఖ్యహేతువు. తంత్రగ్రంథాలన్నీ ఇతర గ్రంథ రచనలతో పోలిస్తే, ఆలస్యంగా లిఖింపబడ్డవి. అతిపురాతన తంత్రగ్రంథం క్రీ.శ. 5వ శతాబ్ది నాటిది.

అసంగుడివే అయిన గుహ్యా సమాజ తంత్రము, ఉత్తర తంత్రము రెండు ప్రాచీనాలైన గ్రంథాలకు మూలాధారగ్రంథము క్రీ.శ. 750 నాటి మంజుశ్రీ మూలకల్పము. పరమ ప్రమాణాలైన మూలాధారగ్రంథములు క్రీ.శ. 9 మొదలు.

క్రీ.శ. 12 శతాబ్దిలో లిఖితాలైనవి. కులార్ణవతంత్రము (సిర్కా 9 శతాబ్దము) రుద్ర – యమలము (సిర్కా 10వ శతాబ్దము) బ్రహ్మ యమలము (సిర్కా 1100) కౌలోపనిషత్తు ఇందులోనివి.

వామాచారతంత్రాలలో అధిక సంఖ్యాకాలు మూల సిద్ధాంతాలు వ్యక్తీకరింపబడ్డ శివశక్తుల సంభాషణల రూపంలో ఉన్నవి. తాంత్రిక విద్య ప్రధాన పీఠాలలో వంగదేశపాలకులైన 'పాల' వంశ రాజన్యులచేత సుస్థాపితాలైన రెండు విశ్వ విద్యాలయాలు ప్రసిద్ధాలు. ఇందులోని విక్రమశిల విద్యాలయం క్రీ.శ. 810లో మగధకు తూర్పున ధర్మపాల రాజన్యుడి చేత అల్పపర్వతం మీద, లేదా అల్పతరమైన గంగ మీద స్థాపితమైనది. రెండవది జగద్దల. ఇది క్రీ.శ. 1090లో ఉత్తర వంగదేశ ప్రాంతంలో, రామపాల రాజన్యుడి చేత స్థాపితమైనది. ఈ రెంటినీ కుతుబుద్దీన్ ఐబక్ సైన్యం క్రీ.శ. 1198 లోను, క్రీ.శ. 1207లోను ధ్వంసం చేసినవి.

భారతీయ యువ నారీజనాఖ్యాతాధిక్యములు మన జాతీయ వారసత్వంలో అభివ్యక్తులయ్యే అజ్ఞాతులు, అకీర్తితులు, అపూజ్యులు అయిన పురాశిల్పుల కృషిలో ప్రతిఫలిస్తున్నవి. వారి సద్గుణాలు, శక్తి వీరత్వాలు, అజంతా ఎల్లోరా గుహలలోను, ఇతర గుహల్లోను ద్యోతకమయ్యే "కుడ్యశిలా చిత్రాలలో, (Murals) ఖజురహో, కోణార్కము, రాజస్థానము, దక్షిణ భారతదేశంలోని దేవాలయాల్లో వినిర్మితమైన శిల్పాలలోను అగ్రతలానికి తీసుకురాబడ్డవి. సత్యానికి వస్తే ఈ గుహలు, దేవాలయాలు శిలానిర్మితాలైన మహాగీతికలు. ఇవి స్త్రీ జనుల వైశిష్ట్యాలను ప్రదర్శించేటందుకు శిలాశిల్పితాలైన విజయప్రశస్తులు. ఉత్కృష్టములు, చేతనోపేతకాలు అయిన ఇవి కళకు సంబంధించిన పరమాధునిక భావనాకేంద్రాలు. వీటిలో స్త్రీలు, వారి దోలాయతములు ప్రతి బింబీకృతములు, క్రీడాయుతములు, ప్రేమశలములు అయిన బాధలలో నిదర్శితలైనారు. శైలశిలాకుడ్యాలమీద అర్ధచంద్రద్వయాల మీద నాగదంతాల మీద లఘు స్తంభాలమీద, కుంచితాగ్రాల మీద ఛిద్రాలమీద నివేశాల మీద స్తంభాల మీద స్థాణువుల మీద వారు అంతటా ప్రతిస్థలంలోను ఉన్నారు.

ఈ నాడు స్మృతిలో లేని పురుషులు కొందరు స్త్రీలు ఐంద్రజాలిక స్పర్శ గలవాళ్ళయినట్లు విశ్వసించారు. వారిని అనుసరించి వృక్షాలు అందగత్తెలయిన ఆడువారి స్పర్శను ప్రగాఢంగా అభిలషిస్తాయి. అందువల్ల వకుళ వృక్షం, యువతి ముఖోద్గతమైన ద్రాక్షారసంచేత చిలుకరింపబడితే అది ప్రసవించేటట్లు, అశోకవృక్షం (Saraca Indica) ఒక కన్యకామణి పాదస్పర్శ వల్ల నారంగ లేదా శోణవర్ణ పుష్పాలను ప్రసాదించేటట్లు చెప్పబడినది.

వాత్స్యాయనుడు గావించిన స్త్రీ ప్రకృతి (స్త్రీ స్వభావ) వర్గీకరణ అతి విశిష్టంగా ఉన్నది. స్త్రీలను పూర్వ మహర్షులు వారి బహుముఖీన ప్రకృతిని అనుసరించి వర్గీకరించారు. స్త్రీ ప్రకృతి ఆమె మనోగుణాలమీద ఆధారపడి ఉంటుంది అని ఆయన తెలియజేశాడు.

చాపల్యం, లౌల్యం వాత్స్యాయనుడి స్త్రీలకు సంకేతములు. ఆయన దృష్టిలో వారు చతుష్షష్టి కళలను నేర్వవలె. ఎవరు చతుష్షష్టి కళలను అభ్యసిస్తారో ఆ స్త్రీలు వారి మాతాపితరులు, లేదా రక్షకులు లేదా భర్తలు లేనప్పుడు గృహకృత్యాలు, లలితకళలు, కర్మకౌశలాలు కలిసి ఉండటం వల్ల – కళలశ్రేణి అతి విస్తృతమైనది. కనుక, యిది యేమీ సుదూరానికి చేర్చే సిద్ధాంతం కాదు – వారి జీవనసాధనలను ఆర్జించుకొనగలరు అని ఆ మహర్షి తెలియజేశాడు.

భారతీయ స్త్రీలు కళలలోను, గణితం, వ్యవసాయంలోను, ఖగోళ శాస్త్ర, పాక శాస్త్రాలలోను రసాయనశాస్త్ర, వస్త్రధారణలలోను, కాంతిశోభావర్ధకాలలోను, ఆలేఖనము, నాట్యము, వినయరీతి (శిష్టాచార లేదా సదాచార రీతి) యంత్ర విద్య, యుద్ధ విద్య, భాషాశాస్త్రము, పాండిత్యము, ఇంద్రజాలము, లోహ శాస్త్రము, చిత్ర లేఖనము, కవిత్వము, ఛందో విజ్ఞానము, పఠనము, గానము, ప్లవనము, లేఖనములలో సంపూర్ణంగా శిక్షితలు గావింపబడవలె.

వాత్స్యాయనుడు స్త్రీలను నిస్సందేశార్థమూ, నిష్కాపట్యము (నిర్వ్యాజము) అయిన భాషలో వర్ణించాడు. వాత్స్యాయనుని కామసూత్రం స్త్రీలకు అగ్రశిఖరలేఖనాన్ని ప్రసాదిస్తున్నది, వారి యెడ ప్రశంసలను, విశేషాలను (ఉపాధులనూ) కురిపిస్తున్నది.

వాత్స్యాయన మహర్షి మహాగ్రంథపఠనం పాఠకుడిని అది ఒక తాంత్రిక మూలాధారగ్రంథమని విశ్వసింపజేస్తుంది. లైంగికగహనత, గూఢత – తాంత్రిక ప్రధానాంశాలలో మత సంప్రదాయంలోని అనుయాయి అయిన దాని పూర్ణోపపత్తిని, దాని పూర్ణవ్యక్తీకరణమును (పరిపూర్ణ స్పష్టీకరణమును), దాని పరమ విస్తృత తత్త్వాన్ని వీక్షిస్తారు గనుక ఒకటి అయి ఉన్నది.

A deep study of Vatsyayana compels one to believe the sage's magnum opus in a tantric text. Sexual mysticism was one of the main aspects of Tantrism, for it is in this cult that one finds it full rational, complete expression and most extended phylosophy.

**Times of India (3-5-87)**

# సాహిత్య విమర్శ

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | తంజావూరు మహారాష్ట్ర నాయకులు: ఆంధ్రవాఙ్మయము | 427 |
| 2. | నా ఎఱుక | 446 |
| 3. | గేయరచనలు : ప్రాచీనులు – ఆధునికులు | 470 |
| 4. | శివశంకర స్వామి (1892–1977) | 500 |
| 5. | వచన కావ్యాలు – రచనావిధానం | 520 |
| 6. | దీక్షిత దుహిత | 532 |
| 7. | నోరి ఖండ కావ్యాలు | 559 |
| 8. | చింతా దీక్షితులు (1891–1960) | 576 |
| 9. | భారతీయ సంస్కృతిలో ఇస్లాం ప్రభావము (1206–1526) | 600 |
| 10. | ఆంధ్రభారత రచనోద్దేశ్యము | 605 |
| 11. | శ్రీమదాంధ్ర మహాభారతము–శ్రీకృష్ణుని రాయబారము | 609 |
| 12. | మనుచరిత్రము – అల్లసాని పెద్దన | 624 |
| 13. | ప్రభావతీప్రద్యుమ్నము | 688 |
| 14. | ఎఱ్ఱన మహాకవి కృత ఘోషయాత్ర | 732 |
| 15. | శివరాత్రి మాహాత్మ్యము | 747 |
| 16. | గౌతమ వ్యాసములు | 758 |
| 17. | నిగమశర్మోపాఖ్యానము | 764 |
| 18. | వేమన | 795 |

# తంజావూరు మహారాష్ట్ర నాయకులు: ఆంధ్రవాఙ్మయము

విజయనగర సామ్రాజ్యాస్తమయమునకు వెనుక రెండు శతాబ్దుల కాలమాంధ్రవాఙ్మయ పోషకులుగా నుండిన దక్షిణదేశ నాయకరాజులు స్వతంత్రించిరి. వీరు మొదట విజయనగర సమ్రాట్టులచే బ్రతినిధులుగా నంపబడిన తెలుగు నాయకులు. వీరి పాలనకాలములో తమిళ దేశమునకు దెలుగు తెగ లనేకములు వలస పోయినటుల స్థానిక చరిత్రలవలన దెలియుచున్నది. ఈ తెలుగు నాయకులు ఆంధ్రవాఙ్మయ పక్షపాతులై వెలలేని సాయమొనర్చిరి. తిరుచునాపల్లి, పుదుక్కోటల రాజులగు తొండమాన్ వంశజులు తమిళులైనను తెలుగు కవితాకుమారికి వశులై, సారస్వతాంబుధి నోలలాడిరి. ఈ కాలమున తంజావూరు, మధుర, తిరుచునాపల్లి, పుదుక్కోట లాంధ్ర వాఙ్మయమునకు విద్యాస్థానములై విలసిల్లినవని చెప్పవలయును. విజయనగర రాజులతో బ్రబంధయుగ మంతరించినది. ఈ యుగమున నాటకములు, వచన కావ్యములు విరివిగా నభివృద్ధిలోనికి వచ్చినవి. కావున నీ యుగమును 'నాటక వచన కావ్యయుగ'మనిగాని, దక్షిణ దేశమున నీ కాలమునం దాంధ్రవాఙ్మయ మభివృద్ధి బొందుటవలన 'దక్షిణ దేశ ఆంధ్ర వాఙ్మయ' (1600–1800) మని గాని పిలవవచ్చును. ఇది ప్రబంధ అధునాతన యుగములకు సంధియుగము.

పైన పేర్కొనబడిన విద్యాస్థానములలో తంజావూరును క్రీ.శ. 1535 – 1675 వరకు నాంధ్ర నాయకులు పరిపాలించిరి. వీరి తరువాత తంజావూరునందు క్రీ.శ. 1800 వరకును మహారాష్ట్రులు తమ పరిపాలనమును నెలకొల్పి, యాంధ్రభాషను బోషించి మహాయశస్సును గడించిరి. అన్యదేశీయులైనను వీరు శిల్పమునకు నా దేశమున పారంపర్యముగా వచ్చు నాంధ్ర సారస్వతమునకు జేయూత నిచ్చిరి. దక్షిణ హిందూ దేశమున వీరి పరిపాలనకాలమున గట్టబడిన దేవాలయములు, ప్రాచీన హైందవ చిత్రకళానైపుణ్యమును, శిల్ప నైపుణ్యమును జాటుచున్నది. వీరాంధ్ర వాఙ్మయమును బోషించుటలో నాంధ్ర నాయకుల యడుగుజాడలనుబట్టి నడచిరి. ఆంధ్ర సారస్వతమును బోషించిన యన్య దేశీయులలో నగ్రస్థానము వీరికే జెందవలసి యున్నది. పాఠకుల సౌకర్యార్థమై నీ రాజన్యుల వంశవృక్షము పొందు పరుపబడుచున్నది.

ఈ వంశవృక్షము రాబర్టు సూయల్ 'List of Antiquities - Part, ii' ననుసరించి యీయబడినది. (పట్టిక కోసం తరువాతి పేజీని చూడండి)

'ఇది చోళసింహాసనాధ్యక్ష భోసల ప్రతాపసింహ రాజ పూర్వపుణ్య పరిపాకస్వరూప యామునాంబికా గర్భశుక్తి మౌక్తికాయమానామరసింహ మండలాధీశ్వర నామాంకితంబైన' యని యుండుటచే పై పట్టికయందు చూపబడినది తప్పుగా దోచుచున్నది.

## ఏకోజీ (క్రీ.శ. 1674-1684)

ఛత్రపతి శివాజీమహారాజు తమ్ముడగు నీతడు తంజావూరు ప్రథమ మహారాష్ట్ర పరిపాలకుడు. ఇతడు తంజావూరిని క్రీ.శ. 1674లో ముట్టడించెను. ఇతడు నాయక రాజ్య విచ్ఛేదమునకై బద్ధకంకణుడైన బీజాపుర సుల్తానుచే పంపబడిన సేనా నాయకుడైనట్లు శాసన ప్రమాణములు గలవని, కురుగంటి సీతారామయ్యగారి తంజావూరి యాంధ్రనాయకుల చరిత్రలవలన దెలియుచున్నది. కాని 'ఏకోజి' తంజావూరి ఆంధ్ర నాయకులలో కడపటి వాడగు విజయ రాఘవుని ప్రేరణమున తంజాపురమును ప్రవేశించి, అతని మరణానంతరము బలవంతుడై సింహాసన మధిష్ఠించెనని శ్రీయుత జయంతి రామయ్య పంతులవారు నుడువుచున్నారు.[1] తన రాజ్యకాలము నంతయు రాజ్యసుస్థాపనార్థమే వినియోగించిన యీ రాజన్యునకు సారస్వత సేవకు గాలము కరువయ్యెను. అందువలన నతని కాలమున సంస్కృత వాఙ్మయముగాని, తెలుగు వాఙ్మయముగాని, యే విధమగు పోషకత్వమును బడసినట్లు కన్పింపదు. శత్రు రాజులతో సమరములు సల్పి రాజ్యస్థాపన మొనర్చు మహారాజుల రాజ్యకాలములో వాఙ్మయ పోషణ మరుదు.

## శాహజీ (క్రీ.శ. 1684-1710)

ఏకోజీ మహారాజు పరిపాలనానంతరము అతని జ్యేష్ఠపుత్రుడగు శాహజీ సింహాసనమలంకరించెను. తండ్రి రాజ్యమును సుస్థిరమొనర్చి స్వర్లోక ప్రస్థాన మొనర్చుటచే నీ రాజన్యునకు సారస్వతసేవ యొనర్చుటకు తగినంత విశ్రాంతి దొరికినది. ఇతడు దేవభాష యాంధ్రముల రెంటను అసమాన పాండిత్యము గడించిన కవి రాజన్యుడు. ఇతని యాస్థానకవి యగు విచిత్ర రాయావతంస కవి యీతనిని 'సరససాహితీ లక్షణవిభు' డని పొగడియున్నాడు. తానే తన 'విష్ణు పల్లకి సేవా ప్రబంధ' మను నాటకమున తన్ను గూర్చి 'కవిత సంగీత తాన శ్రుతి స్వరసాధన

## తంజావూరు
## మహారాష్ట్ర నాయకుల వంశవృక్షము

శాహజీ భోన్స్లే (క్రీ.శ. 1594)

జిజిబాయి

తుక్కాబాయి

శంభాజీ

శివాజీ ఛత్రపతి

(మొదటి) ఏకోజీ (క్రీ.శ. 1674–1684)
(తంజావూరు మహారాష్ట్ర రాజ్యస్థాపకుడు)

(రెండవ) ఏకోజీ లేక బాబాజీ
(మైనరైనందున తల్లి జిజి
క్రీ.శ. 1737–1740 (?) వరకు
రాజ్యపాలన మొనర్చెను)

శాహజీ
(క్రీ.శ. 1740 నుండి 1746 వరకు
రాజ్యపాలన మొనర్చినపిదప నాతని
తమ్ముడు ప్రతాప సింహునిచే
రాజ్యభ్రష్టుడు గావింపబడెను)

శివాజీ

ప్రతాప సింహుడు*
(క్రీ.శ. 1746–1764)

(రెండవ) తుళజ (1765–1788)

అమరసింహుడు
(క్రీ.శ. 1788–1798)

శరభోజీ (క్రీ.శ. 1768–1833)

శివాజీ (క్రీ.శ. 1833–1855)

* ఆంధ్రవిశ్వవిద్యాలయము వారిచే ముద్రింపబడిన తంజావూరు శరభోజీ సరస్వతీ మహల్ నందలి యాంధ్రతాళ పత్ర గ్రంథముల పట్టికలో అమరసింహుడు ప్రతాప సింహునకు కుమారుని కుమారుడుగా జెప్పబడియున్నది. కాని అమరసింహుడు ప్రతాప సింహుని కుమారుడే యనుట సమంజసము. అమరసింహుని యాస్థానకవియగు మాతృభూతుడు తాను రచించిన పారిజాతాపహరణ నాటకమునందు (తంజావూరు సరస్వతీమహల్ గ్రంథాలయ తాళపత్ర గ్రంథముల పట్టిక, నం. 543.)

రాగాంగగాన క్రియాస్థాయి గనక ప్రబంధ ధాతు గాయనగణితానద్ధర్దాహకుండ' (?) నని చెప్పుకొని యున్నాడు. కాని యితనికి కవితాకళ, గానకళలందు పాండితి యపారమని తెలియుచున్నది. స్వయముగా తాను కవియగుటయే గాక తన యాస్థానమునందనేక కవులకు గాయకులకు పోషణము కల్పించెను. ఈతడనేక కృతులకు భర్తయు కర్తయు నగుటయే గాక కృతులలో నాయకుడు గూడనై యున్నాడు. ఇతడిట్టు భాష కపారసేవ యొనర్చి తన నామమునకు వాఙ్మయ చరిత్రయందు చిరస్థాయిత్వము కల్పించుకొని యున్నాడు. ఇతనికి గాన కళాభిరుచి మెండు.

త్యాగరాజ స్వామివారి వంశకర్తలలో నొకడగు వెంగనార్యుడను గాయకశిరోమణి యీతని యాస్థాన మలంకరించెను[2]. శాహజీ మహారాజు సంస్కృతమునం దసమాన ప్రతిభావంతుడై 'చంద్రశేఖర విలాస' మను రసవత్కావ్యమును రచించెను. శాహజీ యాస్థాన మలంకరించిన సంస్కృత కవులలో నీలకంఠ దీక్షితుని తమ్ముడగు అతిరాత్రయాజి యొకడు. ఇతడు కవితారచనలో నఖండుడు. సర్వస్వతంత్రుడు. ఇతడు మృదుమధుర పదభూయిష్ఠమగు 'కుముద్వతీపరిణయ' మను నైదంకముల రూపకమును రచించెను. సంస్కృత వాఙ్మయముగల చంపువులలో నగ్రస్థానము వహింపదగిన 'ధర్మవిజయ' మను గ్రంథము నల్లదీక్షితకవిచే శాహజీ మహారాజు కోరికపై రచింపబడెను. శాహజీ మహారాజు పరిపాలన కాలమున ఆతనినే కావ్యనాయకునిగా నొనర్చి రచించిన కావ్యపరంపర బహుళము. అట్టి వానిలో సంస్కృతమునందు చొక్కనాథ కవిచే రచింపబడిన 'కాంతిమతీపరిణయ' మను రూపక మొకటి. అయ్యవాలనబడు శ్రీధర వెంకటేశ్వర కవి పండితుని శాహరాజాష్టపదియు, గంగాధర పండితుని భోసల వంశావళియు, లక్షణకవి శాహరాజ సభాసరోవర్ణనియు పై రకమునకు జెందిన గ్రంథములు, తంజావూరి మహారాష్ట్ర నాయక చరిత్ర వ్రాయదలచుకున్న చరిత్రకారుల కిట్టి గ్రంథములు ముఖ్యాధారములు.

ఇతని కాలమున సంస్కృతము కన్న హెచ్చు తెలుగు వాఙ్మయ మభివృద్ధి జెందినట్లు కాన్పించును. ఇతడాంధ్ర వాఙ్మయమునందలి బహునాటకములకు కర్త. తంజావూరు విజయరాఘవుని కాలమునందువలెనే యీతని కాలమున హెచ్చు యక్షగానములు, నాటకములు, దండకములు, కొరవంజులు వ్రాయబడినట్లు కన్పించుచున్నది. ఆంధ్ర నాయకులగు రఘునాథ, విజయ రాఘవ నాయకుల కాలమునుండి వచ్చు నాటకములతో బాటు తాను కొన్ని నాటకముల రచించియు, నితర కవులను బ్రోత్సహించి వారిచే రచియింప జేసియు, రంగస్థలముపై వేషముల

వేయించి, నటియింపజేసియు ప్రజల నానందాబ్ధి నోలలాడించెను. ఇతని కాలమున రచింపబడిన పద్య కావ్యములు కన్పింపవు. ఇతని కాలమున తిమ్మయ్య ద్విపద మహాభారతము తిరుగ వ్రాయింపబడినట్టు దెలియుచున్నది[3]. ఈ గ్రంథమే గాక తనకు బూర్వము వ్రాయింపబడినవియు, క్రిమిదష్టమై శిథిలత్వ మనుభవించుచున్నవి యునగు గ్రంథ పరంపర నుద్ధరించెను[4].

శాహజీ మహారాజు 'శృంగారంబున పొంగారు' 'గంగాపార్వతీ సంవాద' మను నాటకమును రచించెను. ఇందలి కథావస్తువు, 'సర్వేశ్వరుడు గంగతో వనమున విహరించువేళ నారదుడు వచ్చి గంగను స్తుతించి పార్వతిని నిందించిన సమయమున పార్వతి సఖి దానిని విని దేవికి దెలియుజేయుట, ఆ సమయమున సవతుల పోరాటము ఈశ్వరుడు వారి కయ్యమును మాన్ప నొకతెను శరీరమున, మరియొకతెను శిరమున ధరించుట.' ఈతని నాటక రాజము లీతని పాండిత్యమును వెల్లడిజేయుచున్నవి. సహజవర్ణనలు, పాత్రోచితభాషలు, జాతీయములు – ముఖ్యముగా జీవద్భాషలీ నాటకములకు బెట్టని శృంగారములు. ఇతడు 'కిరాతవిలాస'మను మరియొక నాటకమును రచియించెను. ఇతడు వ్రాసిన నాటకములలో మేలు బంతియని పొగడదగినది 'త్యాగరాజవినోద చిత్రప్రబంధనాటకము'. ఈ నాటకమున మహారాజు అష్టాదశవర్ణనల నినుమడింపజేసి ప్రబంధత్వము కల్పించెను. తన పాండితీప్రకర్షను వెల్లడియొనర్చుటకై యీ నాటకమును సంస్కృతపద భూయిష్ఠముగా రచియించి, నాటకములన్న పండితుల కామోదమును రగుల్కొల్పెను. తన కవితాశక్తి కోర్చిన యీ నాటకమున కవి సంస్కృతము, మహారాష్ట్రము, తెలుగు భాషలకు సమ్మేళనము కల్పించెను. ఈ నాటకమునందలి పాత్రలు పై మూడు భాషలలోను ప్రసంగింతురు. ఈ నాటకమునకు ప్రేక్షకులు శిష్టులు గాని నిరక్షరులు కారు. పండిత పామర జనానందముగా నాటకముల రచియింపగల యీ కవిరాజన్యుడు, ద్రౌపదీ కల్యాణమును రచియించెను. నటరాజగు నీశ్వరుని యొద్ద చెంచు మొదలగు నాట్యకర్తలు తమ నటనాకౌశలమును జూపి బిరుదులను బడయుట కథావస్తువుగాగల 'పంచరత్న ప్రబంధ' మను నాటకమును శాహ మహారాజు కొలది కాలములో రచించితినని చెప్పుకొనెను. ఇతడు తన 'పార్వతీపరిణయ' మను నాటకమును 'వేష భాషాదియుతముగా' విస్తరింతునని చెప్పెను. కాబట్టి శాహమహారాజుకు నాటకమన్న నెట్టి యభిప్రాయము గలదో తేటతెల్లమగుచున్నది. నాటకమున పాత్రోచితభాష, వేషము లేకపోయినచో నది దృశ్యకావ్య మనిపించు కొనదుగదా! అనగా శాహావనీపతికి నాటకము లెట్లు వ్రాయవలయునో, యెట్లు వ్రాసిన ప్రజల హృదయము రంజిల్లునో దెలియునన్నమాట.

శాహమహారాజు రచియించిన నాటకములలో ఖిలమైపోయినవి పోగా తంజావూరు వాఙ్మయసర్వస్వ మనిపించుకొనిన సరస్వతీ మహల్ గ్రంథాలయమున వ్రాతప్రతులుగా మిగిలియున్న వానిలో రతీకల్యాణ నాటకము, రుక్మిణీ సత్యభామా సంవాదము, వల్లీకల్యాణము (కుమారస్వామి వల్లీదేవుల వివాహము), విఘ్నేశ్వర కల్యాణము, శంకరపల్లకి సేవాప్రబంధము, సతీదానసూరము, సతీపతి దాన విలాసము, సీతాకల్యాణము, రామపట్టాభిషేకము, జలక్రీడలు, కంసవధ, సరస్వతీ విలాసము, శచీపురందరము, శాంతాకల్యాణము, విష్ణుపల్లకి సేవాప్రబంధము లను నాటకములు కొన్ని. పై నాటకము లన్నిటిలో సరస్వతీ కల్యాణకర్తృత్వమును గూర్చి కొంచెముగా జెప్పవలసి యున్నది. గ్రంథమున శేషాచలపతి రచించె ననియు, గ్రంథాంతమున శాహమహారాజు రచియించె ననియు చెప్పబడి యున్నది. సరస్వతీ మహల్ గ్రంథాలయము కేటలాగు సంపాదకులు గ్రంథ మంతయు శేషాచలపతి వ్రాసినదేగాని కారణాంతరమువలన మహారాజు హెచ్చు భాగమును వ్రాయుట వలననో యేమో శాహ మహారాజు పేరనే చెల్లుబడియగుచున్నదని చెప్పబూనిరి. కాని యంతకన్న శేషాచలపతి గ్రంథమును కొంతవరకు రచియించి స్వర్లోకమున కేగిన వెనుక, కొరవడిన యధికభాగమును శాహ మహారాజు పూరించుటచే నా గ్రంథము అతని పేరుననే చెల్లుబడియగుచున్నదనుట సమంజసముగా దోచుచున్నది.

శాహమహారాజు తెనుగున రచించిన గ్రంథము లన్నియు నాటకములే. కొన్నిటికి నాటకములనియు, కొన్నిటికి ప్రబంధములనియు పేరుపెట్టి రెండవ రకము వానియందు సంస్కృత పదజాలము, సంగీత శాస్త్ర పాండితీ ప్రకర్ష చూపించెను. 'ప్రబంధం కల్పనా కథా' యను సూక్తి నాధారముగా గొని వర్ణనల కల్పించి, ప్రఖ్యాత ఇతివృత్తములనే నాటకములుగా నొనర్చి వాటికి ప్రబంధత్వ మారోపించి, నాటకములయెడ పండితులకు గల గౌరవమును పెంపొందించెను. ప్రబంధములకు మిగిలిన రెండవ తరగతి 'నాటకము'లు పామర జనవేద్యములు. సంస్కృత వాఙ్మయమునందు వలెనే తెలుగు వాఙ్మయము నందును శాహమహారాజును నాయకుని జేసి రచించిన గ్రంథము లనేకములు గలవు. ఇట్టి గ్రంథములన్నియు నాతని పరిపాలనకాలముననే రచింపబడిన వనుట యుక్తము. అట్టివానిలో శాహజీ సాహిత్యము, శాహజీయము, శాహజీ దండకములు ముఖ్యములు.

శాహమహారాజు నాస్థానము నలంకరించిన తెలుగు కవులలో ప్రథమమున పేర్కొన దగినవాడు గిరిరాజకవి. ఇతడు అనిర్వాచ్యమగు నోంకారమును

నాదబ్రహ్మోపాసకుడై గానామృతమును విశ్వముపై నొలికించి బ్రహ్మానందమును గలుగజేసిన త్యాగరాజస్వామికి తాతగారు. ఈతడు వాదవిజయము, సర్వాంగసుందర విలాసములను నాటకముల రచించి శాహమహారాజున కంకితమిచ్చెను. ఇతడు శాహేంద్రచరిత్రమును యక్షగానముగ రచియించెను. అందలి గద్యలో

'కందచక్కెరలీల కల్పించి రుచుల,
గండుమీరిన యక్షగానంబు మిగుల
గరిమను గిరిరాజకవి రచియించె'

అని చెప్పుకొని యున్నాడు. ఈతని కవిత సహజ మాధుర్యమును పొందియున్నది. ఇతని వర్ణనలు సహజములు. ఇతడు నాటకములందు హెచ్చుగా ప్రబంధపు పోకడల పోయెను. 'కొరవంజి'[5]ని వ్రాసిన తెలుగు కవులలో నీతడే ప్రథముడుగా కన్పించుచున్నాడు. గిరిరాజకవి 'రాజమోహన కొరవంజి' యను నొక గ్రంథమును రచించి శాహమహారాజున కంకిత మొనర్చెను. ఈ గిరిరాజకవి రాజకన్యా, పరిణయమను మరియొక కొరవంజిని రచియించి శాహమహారాజు మెప్పు వడసెను. శాహమహారాజు వాహ్యాళి వెడలుచుండగా జూచి రాజకన్యయొకతె ఆయనను ప్రేమించును. ఈ వృత్తాంతము నా రాజకుమారి తల్లిదండ్రులు తెలిసికొని, యామెను మహారాజున కిచ్చి వివాహము గావింతురు. ఇది యందలి ప్రధాన కథావస్తువు. గిరిరాజకవి బహు నాటకకర్త యని పేరుపొందినవాడు. కాని యితని నాటకములు మాత్రము నేడు మూడో నాలుగో కన్పించుచున్నవి. ఇతడు శాహజీ మరణానంతరము రాజ్యమునకు వచ్చిన యితని తమ్ముడగు శరభోజీ ప్రథమ రాజ్యవత్సరములలో జీవించియున్నట్లు తెలియుచున్నది.[6] ఇతడొకానొక చోట గద్యలో 'గిరిరాజనుతలీల శరభోజిభూపాల" యని చెప్పుకొనుటయే గాక శరభోజీ భూపాలుని పేర నంకితముగా 'లీలావతీకల్యాణ' మను నాటకమును రచించెను. ఇతని కవిత రసవత్తరమైన దగుటయే గాక సహజ వర్ణనల గూడ కలిగియున్నది.

శాహజీ మహారాజు సభ నలంకరించిన కవులలో గిరిరాజకవి వెనుక పేర్కొనదగినవాడు, విజయ రాయావతంసకవి. ఇతడు తన గద్యములందు 'సలోహితగోత్రాహోబళార్యపుత్రకులపావన గిరిరాజ కవిపరానుజ' యని చెప్పికొని యుండుట వలన, నీతడు గిరిరాజకవి తమ్ముడని తెలియుచున్నది. ఇతడు తెనుగున 'అభినయ దర్పణ' మను నాట్యశాస్త్రమును రచించి ఖండోజీయను మహారాష్ట్ర సేనాని కంకితమిచ్చెను. బాలకవి యను మరియొక కవివరేణ్యుడు తాను శాహమహారాజు

కోరికపై పంచకన్యా పరిణయమను నాటకమును రచించితినని చెప్పుకొనెను. మహారాజీ నాటకము నాంధ్రభాషలో వ్రాయవలసినదిగా కోరెనట. కాబట్టి యీతడు మరి యితర భాషలలో గూడ కవిత జెప్పగలిగినాడని యూహించుట కవకాశము కలుగుచున్నది. శాహ మహారాజ రాజ్యకాలముననే లీలావతీశాహరాజీయ మను నాటకమునకు కర్తయగు బాలకవి సుబ్బన్నయను నొక కవిపుంగవుడు కన్పించుచున్నాడు. పై బాలకవియు, నీ బాలకవి సుబ్బన్నయు నొకడేమోయని తలంచుట కవకాశము కలుగుచున్నది గాని, యొక్కరే యని చెప్పుటకు తగినంత యాధారము లేవియు లేవు. బాలకవి సుబ్బన్న 'లీలావతీశాహ రాజీయ' మను గ్రంథమున 'సరికవు లెన్నునట్లుగా వ్రాసినాడ' నని చెప్పుకొనెను. కాబట్టి బాలకవి సమకాలీనులలో పేరుగన్న వాడన్నమాట. 'శేషాచల పతి' యను మరి యొక కవి 'శాహ మహారాజ విలాస' మను నాటకమును రచించెను. ఇతడు తన నాటకమున 'అష్టభాషా కవిత్వంబులమరు' నని చెప్పియున్నాడు. ఇతని పాండితీ ప్రకర్ష నిరుపమానమని యీ నాటక రాజము చెప్పకయె చెప్పుచున్నది.

## శరభోజీ (క్రీ.శ. 1711-28)

శాహ మహారాజు మరణానంతరము అతని తమ్ముడగు శరభోజీ రాజయ్యెను. ఇతడు శాహ మహారాజువలె పండితుడు కవి కాకపోయినను కవులను పోషించెను. ఇతని కాలమున గిరిరాజకవి కొంతకాలము జీవించియున్నట్లు పైన పేర్కొని యున్నాను. ఈతని పరిపాలనకాలముననే త్యాగరాజస్వామి జీవించి, తన గానామృతమును వెదజల్లినది. త్యాగరాజు తాను జీవద్భాషలో వ్రాసిన దివ్యమైన కృతులు గాక 'నౌకా చరిత్రము', 'ప్రహ్లాద చరిత్రము' అను రెండు యక్షగానములు గూడ రచించెను. త్యాగ రాజాంధ్రుడు, బ్రాహ్మణుడు, ములికినాటి వంశజుడు. శాంతాదేవి – రామబ్రహ్మల గర్భశుక్తిముక్తాఫలము. చోళ దేశమునందలి పంచనద గ్రామనివాసి. తిరువది గ్రామనివాసి యని శ్రీయుత జయంతి రామయ్యపంతులవారు వ్రాసియున్నారు. త్యాగ రాజస్వామి తన నౌకాచరిత్రమున 'కాకర్లాంబుధి చంద్రుడు శ్రీకరుడగు త్యాగరాజ చిత్తనివేశా' యని పేర్కొనుటవలన త్యాగరాజు గృహనామము కాకర్లవారని తెలియుచున్నది.[7] త్యాగరాజ స్వామి నౌకాచరిత్రమున తన గురువర్యుడు రామకృష్ణానందమును

కం. 'మ్రొక్కెద దేశికవరునకు,
మ్రొక్కెద ధర్మార్థ కామ మోక్షదునకు (?),

ప్రొక్కెద పదముల ననిశము,
ప్రొక్కెద శ్రీ రామకృష్ణ మోదాఖ్యునకున్.'

అని ప్రార్థించి యున్నాడు. త్యాగరాజస్వామికి సంస్కృత ఆంధ్రవాఙ్మయముల యందు పరిపూర్ణ పాండిత్యము కలదు. తమిళ దేశమునందు నివసించుచున్నను శ్రీ స్వామివారికి తమిళం అంతగా రాదు. పండిత కవిగాయక వంశమున జన్మించిన త్యాగరాజస్వామి కవి, నాదబ్రహ్మోపాసకుడగుటలో నాశ్చర్యము లేదు. త్యాగరాజు తన కృతుల మాధుర్యయుతముగాను, సర్వజన ప్రియకరములుగాను జీవద్భాషలో రచియించెను. నేటివరకును అరవము, కన్నడము, మలయాళము, తుళు, తెలుగు మొదలగు ద్రావిడ భాషలందలి గానకళకు త్యాగరాజకీర్తనలే జీవనాధారములుగా నున్నవి. ఈ మహాత్మునికృప వలన నాంధ్రభాష దక్షిణదేశ సంగీత ప్రపంచమునకు సామాన్య భాష (Lingua Franca) గా నున్నది. తెలుగు భాషయందున్న త్యాగరాజు కృతులు ద్రావిడ కర్ణాటకుల సంగీత పాటకులుగా తీర్చి దిద్ది నిత్యారాధన మొందుచున్నవి. భక్తి, జ్ఞానము, వైరాగ్యము, నీతి, ధర్మము మొదలగు గూఢ విషయములను గురించి ఇతని కృతులు అసంఖ్యాకములుగా నున్నవి. ఇతని కృతులయందు కావ్యాత్మయగు జీవిత విమర్శ (Criticism of life) తొలుకాడుచుండును. ఇతడు తన జీవితాంతిమ కాలమున కావేరిగట్టున కేగి ధనమునంతయు బీదసాదలకు పంచిపెట్టి సర్వసంగపరిత్యాగ మొనర్చి భగవంతుని గూర్చి ప్రార్థింపసాగెను. దక్షిణ దేశమున నపర బ్రహ్మయు, నాంధ్రకవికుల సూర్యుడునగు త్యాగరాజకవి 1698 (?) (క్రీ.శ. 1806) పుష్యబహుళ పంచమినాడు తన పాంచభౌతిక శరీరమును వదిలెను.[8]

## తుళజ మహారాజు (క్రీ.శ. 1726-35)

ఇతడు సంస్కృత ఆంధ్రవాఙ్మయములు రెంటియందును పాండిత్యము కలవాడు, కవి, సంగీత శాస్త్రజ్ఞుడు. ఇతడు సంస్కృతమున 'సంగీత సారామృత'మను దాక్షిణాత్య సంగీత శాస్త్ర గ్రంథ మొకటి రచియించెను. ఇది కర్ణాటక జన్య రాగపద్ధతుల వివరించు గ్రంథము. ఇది సంగీత శాస్త్రజ్ఞులకు పాఠ్యమగు గ్రంథము. అతని గృహామాత్యుడు 'ఘనశ్యామ' పండితుడు భవభూతి యుత్తర రామచరిత్రమునకు 'ప్రజ్ఞాప్రతిష్ఠ' మను వ్యాఖ్యానమును రచించెను.[9] ఇతడు 'కుమారవిజయ' మను మరియొక సంస్కృత కావ్యమును గూడ రచియించెను. ఈ ఘనశ్యామ పండితుని వ్యాఖ్యానము, కుమార విజయకావ్యము సంస్కృతభాషాభిజ్ఞుల మెప్పువడసినవి. ఇతని యాస్థాన

మలంకరించిన వారిలో సుందరి, కమల యను కవయిత్రులు ముఖ్యులు[10]. వీరు సంస్కృతమున మంచి ప్రవేశమును సంపాదించి సంస్కృత వాఙ్మయము నందలి విద్ధసాలభంజిక యనునాటకమునకు వ్యాఖ్యానము రచించిరి.

తుళజ మహారాజు తెలుగున 'శివకామసుందరీ పరిణయ' మను నాటకమును రచించి ప్రదర్శింపించెను. ఈ నాటకము ఈ మహారాజు పాండితిని, గానకళాభిజ్ఞ తను వెల్లడి చేయుచున్నది.

## ఏకోజీ (క్రీ.శ. 1735-1741)

ఇతడు తెలుగున రామాయణము సుందరకాండమును ద్విపదగా రచియించెను. విఘ్నేశ్వర కల్యాణమును గూడ నాటకముగా రచియించెను. ఏకోజీ ఈ గ్రంథమును రాజ్యమునకు వచ్చినవెనుక రచియించెనో, లేక తండ్రి జీవిత కాలముననే రచియించెనో నిర్ణయింపవలసియున్నది. అనేక పాపపరిహారార్థముగా సుందరకాండ పారాయణమొనర్చు నాచారముగా నున్నది. సంస్కృత సుందర కాండమును పారాయణ మొనర్పలేనివారలకు ఈ మహారాజు గానయోగ్యమగు నీ ద్విపద సుందరకాండమును రచియించి యుండునని తలపవచ్చును. ఇతని జీవితకాలమున తల్లి రాజ్యమొనర్చు చున్నటుల తెలియుటచే, నీతడు రాజకుమారుడుగా నున్నట్లెంచవలయును.

## శాహ మహారాజు (క్రీ.శ. 1741-49)

ఏకోజీ తరువాత నీతని కుమారుడగు శాహ మహారాజు క్రీ.శ. 1741 నుండి 1749 వరకు రాజ్యపాలన మొనర్చినవెనుక, అతని పదభ్రష్టుని గావించి యాతని సవతి తమ్ముడగు ప్రతాపసింహుడు రాజ్యమునకు వచ్చెను. ఈ శాహమహారాజు కాలమునగల వాఙ్మయ వికాసమును దెలిసికొనుటకేమియూ నాధారములు లేవు.

## ప్రతాప సింహుడు (క్రీ.శ. 1749-64)

ఈ రాజన్యుడు విషయలోలుడై రాజ కార్యములందు మనస్సు పెట్టలేదు. కాని కవులను, ముఖ్యముగా కామకళ నెఱింగినవారలను పోషించినట్లు కన్పించును. ఇతని విషయలంపటతను సహింపజాలని 'వాంఛేశ్వరు' డను సంస్కృతకవి యన్యాపదేశముగ 'మహిష శతకము' ను రచించి ఈ రాజన్యుని బుద్ధి మార్చుటకు బ్రయత్నించెను. వాంఛేశ్వరుడు రాజుగారి గృహామాత్యుడు, విద్వత్కవి. తెలుగున రాధికాసాంత్వనము లేక ఇళాపరిణయమును రచించిన ముద్దుపళని ప్రతాపసింహుని యుంపుడుకత్తెయే.

ఈమె తండ్రి ముత్యాలు, తల్లి పోతి. ముద్దుపళని తన కావ్య గద్యమున "శృంగార రసప్రధాన సంగీత సాహిత్య భరత శాస్త్రాది విద్యాపారంగత తిరుమల తాతాచార్య పాదారవింద చోళ సింహాసనాధ్యక్ష ప్రతాపసింహ బహుకృతానేక చామీకరాంబరాభరణ" యని చెప్పుకొని యున్నది. సంగీత సాహిత్యములు, భరత శాస్త్రమున మంచి పాండిత్య ముండుటవలననే రాజు మనసును చూరగొనగలిగినది. చూరగొనినంతనే యూరకొనక శృంగార రసప్రధానునిగా నొనర్పగలిగినది. పళని గ్రంథమున సంస్కృతాంధ్ర సాహిత్య మున్నది. రాధికాసాంత్వనమును పళని రచియించెనా, లేక గురువగు వీర రాఘవ దేశికులు రచియించెనా యను సంశయము మొదట సి.పి. బ్రౌన్ దొరవారికి కలిగినది[11]. పళని మహారాష్ట్ర వనితగా కన్పించుట వలన నామె వ్రాసి యుండదని వారూహపడిరి. కాని పళని తల్లిదండ్రులను బట్టి చూచినచో నామె యాంధ్రదేశ స్త్రీగనే కన్పించుచున్నది. ఆంధ్రమున కొంత భాగమును, సంస్కృత పదభూయిష్ఠముగా కొంత భాగమును రచియించి యుండుటచే సంస్కృతమున్న భాగము వీర రాఘవాచార్యులు వ్రాసెననియు, తెలుగు భాగము పళని వ్రాసి యుండుననియు దొరవారను కొనుటలో తప్పున్నట్లు కన్పింపదు. అట్లు సమర్థించుటయే సమంజసమని నా యభిప్రాయము.

పళని రాధికాసాంత్వనము సంభోగ శృంగారరస ప్రధానము. ఇందు పళని స్త్రీజన స్వాభావికమగు సిగ్గును విడనాడి శృంగారమును పచ్చిపచ్చిగా వర్ణించినది. ప్రబంధకవులును సంభోగశృంగారమును విరివిగానే వర్ణించిరి గాని దానిని శైలీకాఠిన్యము వలననో, వ్యంగ్య ప్రాధాన్యమువలననో కప్పిపుచ్చుచువచ్చిరి. 'ఈ కావ్యము మృదు పదభూయిష్ఠమై సరసంపుపల్కుల కాకరమై యున్నను, (గ్రంథకర్త్రి) కథాంతమువరకును ఆలుమగలాటను వర్ణించుట, వివిధ గతుల విస్తరించుట మొదలగు శృంగార వర్ణనలయందే తన నెఱజాణ తనమును గనబఱచెను. ఆమె కావ్యలక్షణము లను లక్ష్యము జేయక కొంకు కొసరు లేక రసంపుబెంపును సొంపుగా గూర్పదలచి కృతిని బూతులబుంగను జేసె'నన్న సర్వసామాన్య విమర్శనమునకు గురియైనది. గాని ఈమె ఏ గౌరవ పాత్రమైన గ్రంథమును రచించెనన్న మన్నన వడసినది లేదు. కవనము రసవంతమైనది. సజాతీయము. స్త్రీ హస్తము మాత్రము కవనమున కన్పించును. శృంగార రసవర్ణనలందు తిమ్మన పెద్దనల శృంగారపు బోలికలు, పోకడలు కలవు. పళనికి సంగీత ప్రావీణ్యము కలదన్నమాట యొప్పుకొనక తప్పదు. పళని రాధికాసాంత్వనమను గ్రంథముగాక సప్తపదులు కొన్ని రచించినది. (?)[12] ఇవి యరవభాషయందు గోదాపరనామము ధరించిన చూడికొడుత్తనాచ్చియారు

రచించినట్లుగా వాడబడుచున్న తిరుప్పా వనుపాటకు తెలుగు సేత. ఇందు పదిపాటలు మాత్రము యున్నవి. కాని యరవమునందు (?) ఇరువదిపాటలు కన్పించుచున్నవి. ప్రతాపసింహుని కోరికపై నెల్లూరి శివరామకవి కామకళానిధియను రతిశాస్త్రమును రచించి మహారాజున కంకితమిచ్చెను.

కామకళకే ప్రాధాన్యమిచ్చిన యీ రాజన్యుని పరిపాలనమున కవులనేకులు రాజాదరణ లేకపోయినను గ్రంథములు రచించిరి. అట్టివారిలో పేర్కొనదగినవాడు రాఘవాచార్యులు. ఇతడు ముద్దుపళని గురువు. ఇతడు నలచరిత్ర, విష్ణుభక్త చరిత్ర అను రెండు ద్విపద గ్రంథములు రచించెను. ఇతడు వైష్ణవుడు. పండిత వంశజుడు. తండ్రితాతలు పండితులై సంగీతాది కళలయందనవద్యులై మెలగిరని చెప్పుకొనెను. ఇతని ఇంటిపేరు చక్రపురివారు. రాఘవాచార్యులు తన తాత 'చక్రపురి విహారుం' డని చెప్పియున్నాడు. ఈ చక్ర పురము ప్రస్తుతము చక్రపల్లియని పిలువబడుచున్నది. ఇది తంజావూరు జిల్లా పాపనాశనము తాలూకానందున్నది. ఈ గ్రామము నందు చక్రపల్లి వారనేకులున్నారు. వీరి కులగురువులుగా ప్రస్తుతమును కందాళవారే యున్నారు. ఇచ్చటి చక్రపురివారు రాఘవాచార్య దేశికకవి తమవంశము వాడనియు, తమ వంశము పండిత వంశమనియు సగర్వముగా చెప్పుకొనుచున్నారు. వావిళ్ల వారచ్చు వేయించిన రాఘవాచార్యుని 'నలచరిత్ర' మను గ్రంథమునకు కడప వాస్తవ్యులగు బ్రహ్మశ్రీ జనమంచి శేషాద్రిశర్మగా రుపోద్ఘాతమును రచించిరి. అందు బ్రహ్మశ్రీ శర్మగారు 'ఇతడు దత్తమండలమున ప్రచారమునందున్న మాటలను వాడుట వలనను, ఇతని ఇంటిపేరు గలవారును, ఇతని గురువంశజులును బెక్కు రుండుట చేతను నీ మహాకవి దత్తమండలవాసి యని యే బుధుండైనను దప్పక యొప్పుకొను' నని వ్రాసి యున్నారు. కాని ఇతని వంశజులు 'చక్రపురము' నందున్నారని రాఘవాచార్యులు పేర్కొనుట వలనను, ఇతని వంశజులు దత్త మండలమునకన్న తంజావూరు జిల్లా పాపనాశనము తాలూకాయందు హెచ్చుగ కన్పించుటవలనను, అదియునుగాక రాఘవాచార్యులు 'మా యూరివాడు', 'మా వంశములోని వా' దని సగర్వముగా చక్రపల్లిలోని చక్రపురివారు పేర్కొనుటవలనను' నే నీతని నివాస స్థానము తంజాపుర మండలముగాని, దత్త మండలము కాజాలదని తలచుచున్నాను. బ్రహ్మశ్రీ శర్మగారు చూపిన యాధారములలో చక్రపురి గురువులను గూర్చి ముచ్చటింప దగియున్నది. కాని కవి గురువంశమును బట్టి కవి దేశమును నిర్ణయింప జాలము. అదియును గాక కందాళ వారు రామేశ్వరము మొదలుకొని గోదావరి వరకు గల దేశములో ననేక వైష్ణవ కుటుంబములకు గురువులుగా కన్పించు చున్నారు. తాళ్ళపాక

వారును అట్టివారే. కాబట్టి కందాళ వారిని బట్టి రాఘవాచార్యుని నివాసస్థానమును మనము నిర్ణయింపజాలము. బ్రహ్మశ్రీ శర్మగారు రాఘవాచార్యులు నలచరిత్రమున దత్తమండలపు మాండలిక పదముల నుపయోగించి యున్నాడని వ్రాసిరి. కాని నలచరిత్రమునందు గాని, విష్ణు భక్త చరిత్రమునందుగాని దత్తమండలములోని ప్రత్యేక పదములున్నట్లు కనుపింపవు. అట్టి మాటలన్నియు పూర్వ కవులు ప్రయోగించినవే. అదియును గాక రాఘవాచార్యుడు తన నలచరిత్రమున కందాళ దొడ్డయాచార్యుని ప్రస్తుతించెను. ఈ దొడ్డయాచార్యుని ప్రస్తుతించిన కవులందఱును తమిళ దేశమునందలి యాంధ్రకవులే గాని, యాంధ్ర దేశమునందలి యాంధ్రకవులుగా కన్పింపరు. కాబట్టి రాఘవాచార్యుని నివాసస్థానము తంజావూరు పాపనాశనము తాలూకా యని తేట తెల్లమయినది. రాఘవాచార్యుడు బాల్యము నంతయు తన జన్మస్థానమగు చక్రపురమునందే గడపి తరువాతి కాలమున తంజాపూరమును ప్రవేశించి తన పాండితీప్రకర్ష వలనను, సంగీత శాస్త్రజ్ఞానము వలనను ముద్దుపళనిని శిష్యురాలిగా బడయగలిగెను. ముద్దుపళని రాధికాసాంత్వనము నందలి సంస్కృతపద బాహుళ్య మంతయు రాఘవాచార్యుని సహాయమూలకమే. ఇతనికి ద్విపద కవిత్వమన్న నల్లేరుపై బండి. తిరుపతి ప్రాంతమువాడగుటవలన తాళ్ళపాకవారి అష్టమహిషీ కల్యాణము నందలి పదములనేకము లీతని విష్ణుభక్త చరిత్రమున[13] గన్పట్టుచున్నవి. ఇతని కవిత్వము నిర్దుష్టము; అలంకార యుతము. కొద్దిపాటి దోషములున్నను త్రోసి వేయదగినవి. ఇతడు తన ద్విపద కావ్యములను కవిపామర జనవేద్యములుగా నొనర్చెను. పాల్కురికి సోమనాథ, రంగనాథాదు లెట్లు 'ద్విపద కావ్యంబు ముదికాంత దిడ్డికంత' యను నైచ్యభావమును బోగొట్టి కీర్తిపాత్రులైరో, యితడు నట్లే తన కావ్యమును నవరసభరితముగ, ప్రబంధ లక్షణములకు లోటు లేకుండ నన్ని వర్ణనల జక్కగ జేసి, మృదు మధురములగు పదములతో ద్రాక్షాపాకంబున రచించెను. ఇతడు తన నలచరిత్రమున పరదారాసక్తివలన గలుగు నష్టములు, వ్యసనాభిలాషవలన గలుగు కీడులు, బాతివ్రత్యము మొదలగు విషయములను జక్కగ పామరజన వేద్యములుగా రచియించెను.

## తుళజ మహారాజు (క్రీ.శ. 1765–87)

ఇతని రాజ్యకాలమున సంస్కృతమున 'రామచంద్రశేఖర కవి' యనునతడు 'కళావతీనందక' మను కావ్యమును రచించెను. తుళజ మహారాజు సాహిత్యవేత్తగా కన్పించుచున్నాడు. ఆంధ్ర వాఙ్మయమునందీతని కాలమున ముఖ్యముగా పేర్కొనదగిన

కవులిరువురే కన్పట్టుచున్నారు. అందు 'ఆంధ్ర కాళిదాసు', 'అభినవ కాళిదాసు' అను బిరుదులు పొందిన ఆలూరి కుప్పన కవి యొకడు. ఇతడు తన కాంధ్ర కాళిదాస బిరుదమును తుళజ మహారాజిచ్చినట్లుగా చెప్పుకొని యున్నాడు.[14] ఇతడు బహుకావ్యకర్త. కాని యితని ఆచార్య విజయ, పార్థసారథి విజయములు[15] తప్ప మిగిలిన కావ్యములను జూచు భాగ్య వఋాంధ్ర సారస్వతవేత్తలకు లభింపలేదు. ఇత డాచార్య విజయమున తాను రచించిన యితర గ్రంథములను గూర్చి క్రిందివిధముగా చెప్పుకొనియున్నాడు :

సీ. లీల పంచనదస్థలీపురాణము తెని
 గించితి నారూఢి కవిత మెరయఁ
బరగు రామాయణ భాగవతంబులు,
 యక్షగానము జేసి తద్భుతముగ
గరమొప్ప పరమభాగవత చరిత్రయు
 కృతియొనర్చితిని యున్నతిదలిర్పఁ
దెలివొందు నిందుమతీ పరిణయనామ
 కృతి విరచించితి నతులగరిమ

గీ. (?) గురుతరోజ్జ్వలసరణి హరి క,
థాసుధాభిధకావ్య ముదారఫణితి
గా రచించితి నెనలేని గద్యపద్య
తతులు, లెక్కింప దఱమె తత్కృతులు జగతి.

ఈతని కావ్యములవలెనే యీ నాయకుల పరిపాలనమున రచియింపబడిన గ్రంథములు అనేకము లింతవరకును దృష్టిపథగోచరము కాకున్నవి. ఆలూరి కుప్పన కర్తృత్వమున 'పార్థసారథి విజయ'మను నొక తాళపత్రగ్రంథము మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందున్నది. కుప్పనకవి యాచార్యవిజయమున 'అనంతానందగిరి గురురచనా విశదంబు చేయంబూని' యని చెప్పియున్నాడు. ఇందు పేర్కొనబడిన అనంతగిరి సంస్కృత శంకరవిజయ కర్త కావలయును. ఈ సంస్కృత శంకరవిజయము కొలది కాలము క్రిందట ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారిచే సంపాదింపబడినట్లు దెలియుచున్నది.[16] ఈ శంకరాచార్య విజయమును కవి చెన్నపురి ప్రజల కోరికపై రచియింతినని చెప్పుకొని యున్నాడు. ఇతని కవనము ప్రబంధ కవుల కవితాధోరణి గల్గి రసవంతమై యున్నది.

ఇక రెండవ కవివర్యుడు 'కస్తూరి రంగకవి' ఆలూరి కుప్పనకవి తన గద్యమున 'కస్తూరి రంగ సద్గురు పాదారవింద భజనానందిత హృద్విలాస' యని చెప్పుకొనుటచే నితడతని శిష్యుడని వెల్లడియగుచున్నది. ఇతడు గొప్ప లక్షణ కవి. సర్వస్వతంత్రుడు. కుప్పనకవి రంగకవిని ప్రస్తుతించుచు,

సీ. భారతి కేవిప్రవర్యునిజిహ్వా ని
  త్యముగ వసించు నాస్థానవాటి
 వాణీవధూటి కెవ్వాని నున్బలుకులు
  ధరియించునట్టి ముత్యములచాలు
 శారద కేసుధీస్వామిచేతోవీథి
  యమరిన రత్న సింహాసనంబు
 పలుకుల వెలది కేభావజ్ఞుని గృహంబు
  నెట్టుగా వసియించు పుట్టినిల్లు

గీ. నలువ చెలువకు నెవ్వ డెన్న దగు పుత్రు
 డట్టి కస్తూరి రంగార్యు నచలధైర్యు
 నార్యమతచర్యు మద్గురువర్యు నెంచి
 ప్రణుతిగావింతు పలుమారు ప్రస్తుతింతు.

అని చెప్పియున్నాడు. రంగకవి గొప్ప లక్షణవేత్త. రంగకవి తన యానంద రంగరాట్ఛందము పీఠికలో 'జతుర్విధాంధ్ర కవితాసల్లక్షణ గ్రంథశోధన ధీసంయుతుడ'నియు, 'భావగర్భ పదపద్యాళి ప్రబంధానుబంధుడ' ననియు చెప్పుకొని యున్నాడు. ఇతడు లక్షణ చూడామణియను నామాంతరముగల 'ఆనందరంగరాట్ఛందమును, 'కృష్ణార్జునసంవాద' మను నైదాశ్వాసముల రసవత్కావ్యమును రచించెను. ఆ కాలమున పాండిత్యమున కస్తూరి రంగకవిని మించినవాడు లేడు. రంగకవి ఆనంద రంగరాట్ఛందమును ఫ్రెంచి గవర్నరగు డూప్లేకు ద్విభాషి (Translator) గా నుండి పుదుచ్చేరియందు నివాస మేర్పరచు కొనిన యానందరంగపిళ్లె కంకితమిచ్చెను.[17] ఇతడు తన ఛందోగ్రంథము నందనేక కవులను, వారి ప్రయోగములను బేర్కొని యున్నాడు. ఇతడు సాంబనిఘంటువని పేరు వడసిన శబ్దకోశము నొకదానిని రచించెను. ఇది తాళ్లపాక వారి వేంకటేశ్వరాంధ్రము ననుకరించినట్లు కన్పించును. ఆయా పదముల కా నిఘంటువునందుగల పర్యాయ పదములనట్లె దీనియందు నుంచెను. కాని వేంకటేశ్వరాంధ్రము కన్న రంగకవి సాంబనిఘంటువు కొంత

విపులముగాను, మరికొంత ప్రౌఢముగాను, మిగులు సలక్షణముగాను చూపట్టుచున్నది. ఇందు ప్రయోగసిద్ధములు గాక వ్యవహారైక శరణ్యములగు పెక్కు శబ్దములు కన్పించుచున్నవి. కస్తూరి రంగ కవితా 'సుమామహేశ్వర కరుణాకటాక్షలబ్ధ సాహితీవిభవుడ' నని చెప్పుకొని యున్నాడు. ఇతడు వెంకట కృష్ణార్యుని పుత్రుడు శ్రీ వత్సగోత్రుడు ఆర్వేల కమ్మని యోగి.

## అమరసింహుడు (క్రీ.శ. 1788-98)

ఇతని కాలమున మాతృభూతుడను తెలుగు కవి పారిజాతాపహరణమను నాటకమును రచించెను. ఇతడు శాండిల్య గోత్రజుడు. ఈ నాటకమున కవి తన్ను గూర్చి 'మాతృభూత స్వామి మహిత కటాక్ష చాతుర్య పరిలబ్ధ సరస సాహిత్య, సంగీత మధుర వాగ్ఝరి గల్గువాడ, శృంగారరసము తెలిసిన మేలువాడ' నని వ్రాసి కొని యున్నాడు. గద్యయందు 'సుధాసార సంజనిత చతుర్విధ కవితానిర్వాహకుడ' నని చెప్పుకొనినాడు. ఇతడు తన నాటకమును ప్రబంధ ధోరణిని గానయోగ్యముగా నొనర్చెను. మాతృభూతకవి తండ్రి పేరు రంగకవి. ఇతడే గ్రంథములు వ్రాసెనో యెఱుక పడకున్నది. ఇతడు కస్తూరి రంగకవి మాత్రము కాడు. వారి గోత్రమును, వీరి గోత్రమును భేదించినవి.

## శరభోజీ (క్రీ.శ. 1798-1832)

ఇతని కాలమున కవుల పోషణ మెట్లుండెనో తెలియరాదు. కాని తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయమును చక్కబరచి తాళపత్ర గ్రంథములకు ననేక ప్రతుల వ్రాయించి భద్రపరపించెను. ఇతడు తాళపత్ర గ్రంథములను తిరుగ వ్రాయించి భద్రపరపించుటకు గాను వరాహప్పయ్య దీక్షితులను ఫౌజుదారును నియమించెను.[18] ఇతడు వేగినాటి బ్రాహ్మణుడు. అందువలననే శరభోజీ పేరుననే తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయము పేర్కొనబడుచున్నది.

## శివాజీ (క్రీ.శ. 1833-35)

ఈ రాజన్యుడు తెలుగున 'అన్న పూర్ణాపరిణయ' మను నాటకమును రచించెను. దానిని 'సకల విద్యాప్రవీణులైన సభ్యులు గల నాటకశాలలందు నటియింప జేయదలపెట్టితి'నని గ్రంథావతారికలో జెప్పుకొని యున్నాడు. ఇందు తంజా పురమునందలి కొంకణేశ్వర అన్నపూర్ణల వివాహోదంతము సొగసుగా వర్ణింపబడినది. ఇతని యాస్థానకవి వెంకట కృష్ణయ్య. ఇతడు శివపారిజాతమను నాటకము నొకదానిని

రచించెను. అందలి గద్యలో 'శ్రీ శివాజీ మహీపాలుని తెలుఁగుకవి వెంకట కృష్ణాజెట్టి' యని వ్రాసుకొని యుండుటవలన, శివాజీ కొంతమంది సంస్కృత కవులను గూడ పోషించినట్లు ద్యోతకమగుచున్నది.

ఈ మహారాష్ట్ర నాయకుల పరిపాలనకాలమున సేనాపతులనేకులు వాఙ్మయాభిలాషులై వర్తించిరి. అట్టివారిలో ఖండోజీ యొకడు. ఇతడే మహారాష్ట్ర నాయకుని సేనాపతియో ప్రత్యేకముగా తెలియదు. ఇతడు కలిగిరి యను కవిని పోషించి రుక్మాంగద చరిత్రమను నేకాదశీ మాహాత్మ్యమును తెనుగున ద్విపదకావ్యముగ రచియింపజేసెను. ఈ కలిగిరి వెనుక శాహజీ కాలమున చెప్పబడిన శ్రీగిరికవి వంశజుడు.

మహారాష్ట్ర నాయకుల కాలమున వెలసిన ఆంధ్రవాఙ్మయమును సింహావలోకన మొనర్చినచో, వీరి కాలమున 'నాటక వాఙ్మయము' హెచ్చుగా నభివృద్ధి జెందినటుల కన్పించును. ఈ నాటకములు సంస్కృత వాఙ్మయము నందలి నాటకములతో నెట్టి సంబంధమును లేక సర్వస్వతంత్రములైనవి. 'ప్రతిభ' శిశిరసంచికలో శ్రీయుత చింతా దీక్షితులుగారు యక్షగానము లను శీర్షిక క్రింద ఆంధ్రనాటకముల యభివృద్ధిని గూర్చి విపులముగా చర్చించి యున్నారు. ఆంగ్ల నాటకములు గ్రీకు నాటక సంపర్కము లేకుండా సర్వస్వతంత్రముగా ఒపేరాల (Operas) నుండి పుట్టినట్లుగా నాంధ్ర నాటకములు తోలుబొమ్మలాట నుండి పుట్టినవి.

మహారాష్ట్రు లన్యదేశీయులైనను ఆంధ్రభాషను గౌరవించి పోషించిరన్నచో తెలుగుభాష తేనెతెరలవంటి దగుటయే గాక, దానికి గల శ్రవణపేయమగు శబ్దమాధుర్యము (Euphony) ఏ యితర దాక్షిణాత్య భాషలకు లేకపోవుటయే ముఖ్యకారణము. కావుననే కర్ణాటాధిపతియగు కృష్ణరాయలు 'దేశ భాషలందు తెలుగు లెస్స' యని పొగడియున్నాడు.

చ. జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునన్
ఘనలలితార్థ గౌరవిభాసి తెనుం గభిరమ్యమంతకున్
గనుగొనఁ జాతబీజమున కంటెను గోమలపత్త్రపుష్ప శో
భనమృదుపల్లవాభినవ బాలరసాలము సొంపు నింపదే !

*(శ్రీ పర్వత పురాణకర్త)*

*– ఆంధ్రపత్రిక బహుధాన్య సంవత్సరాది సంచిక*

## అధస్సూచికలు

1. J.A.H.R.S,Vol. ii, page. 173
2. మార్తాండకుల శాహమహీపాలుసభను కీర్తికెక్కినవాడు గిరిరాజుసుకవి సంగీతకళా రహస్యము గన్నవాడు వెంగనార్యుండు వివేకధనుండు
   (Saraswati Mahal Telugu Manuscripts catalogue : Page, no. 124)
3. అనఘసన్నుతికి శాహావనీపతికి నింబాజి వ్రాయించె నిఖిలార్థవితతి కంభోధియగు చుండు నట్టి భారతము నిటలాక్షపదపద్మ నిహిత ప్రసన్న పటుచిత్తుడైన కుప్పయమంత్రిచేత.
4. తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయ పట్టికయందు లేని గ్రంథములకు మాత్రమే యిచట నాధారములు చూపబడును. మిగిలిన గ్రంథము లా పట్టికలోనివే.
5. కొరవంజి శబ్దము దేశ్యము – ఎఱుక వాడు, ఎఱుకది, సోదియని యర్థము. ఈ కవితావిభాగము (Poetic form) నకు ముఖ్య లక్షణము నాయికావిరహము, ఎఱుకది సోది జెప్పుట, తరువాత నాయికానాయకుల వివాహము. ఇందు కవి ప్రాచీనాంగ్ల నాటకములందలి ప్రస్తావన (Prologue) వలె కథావస్తువును దిఙ్మాత్రముగా మొదట సూచించును. ఉదా : శ్రీ సుతతుల్యుడై చెలువొందునట్టి భోసల కుల శాహభూపాలు మీద చెన్నుగా మోహితచిత్తయై రాజకన్నెకామణి సరికాంతలు గొలువ గరిమతోడుత ముసు కదలి వచ్చుటయు నెఱుకత వచ్చి తా నెఱుక జెప్పుటయు గురుతుగా శాహేంద్రుగూడి యుండుటయు అనియెడి రాజమోహన కొరవంజి
6. J.A.H.R.S., Vol, ii, 173.
7. 'నౌకా చరిత్రము' – వేంకటేశ్వర ప్రెస్ మద్రాసు (1907)
8. Andhra Patrika, 22nd May 1937
9. See the famous introduction of Kane to Uttararamacharitra.
10. Quarterly Journal of the Mythic Society, July - October, 1935
11. "An amatory poem written by Palani ........ It does not seem probable that the lady herself composed the whole poem, parts of which display much learning. Her name and the other names she introduces as her relations appear to be Maharatta, utterly different from Telugu appellations. Her tutor Vira Raghavachari probably assisted her, but the composition in other

parts evinces a female hand and it may be observed that she uses only the changing meteres, those being the easiest and loosest rhymes such as, అఖండయతి and వబయోర భేదయతి" etc.

C.P.Brown's Note on Radhika Santwana. - (Madras Oriental Mansucripts Library Catalogue, Vol II, part II, page 933

12. Madras Oriental Manuscrtipts Library Catalogue, Part II, pg 933 Part. III, No 221 (c)

13. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, సం. 4, పుట. 30 చెన్నపురి ప్రాచ్య పుస్తక భాండాగారము, నం ॥

14. ఘనుఁడగు తుళజేంద్రుఁడు దయతనరగ నీ కాంధ్రకాళిదాసాభిధ మన్ననగా నొసంగెనట నీ యనుపమసాహిత్యమున కహో యెన గలదే?

    – (ఆంధ్రకవుల చరిత్ర, మూడవ భాగము. పేజి, 121)

15. Madras Oriental Library Catalogue, Vol. II, pt. ii. Page, 684.

16. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, Vol. III, P, 20

17. చూడుడు : ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, సం, VIII "ఆనందరంగపిళ్లై"

18. J.A.H.R.S, Vol. II, pts, 3 & 4, p. 173.

# నా ఎఱుక

## పీఠిక

## 1

"నా యెఱుక" సర్వతోముఖ ప్రతిభా విజ్ఞాన ప్రపూర్ణులు, సంగీత సాహిత్య రత్నాకరులు, "హరికథాకర్తృ కాలక్షేప పితామహ" బిరుదాంకితులు, ప్రసాదిత హరిదాసజన జీవనులు, ప్రముఖాంధ్ర మహాపురుషులు, కారణజన్ములు, చిరస్మరణీయులు అయిన శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారి స్వీయచరిత్ర.

ఆధునికాంధ్రసాహిత్య యుగకర్తలుగా పేరెన్నికగన్న శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు, సి.వై. చింతామణి ప్రభృతులైన మిత్రప్రముఖుల ప్రోత్సాహముతో ఆత్మకథారచనమునకు పూనుకొంటిననియు, 'తెలుగు భాషలో స్వీయచరిత్ర రచనకిది ప్రథమ ప్రయత్న' మనియు తమ గ్రంథావతారికలో చెప్పియున్నారు. దీనినిబట్టి స్వీయచరిత్ర రచనాభగీరథులు కందుకూరి వారనిపించును.

"తెలుగులో స్వీయచరిత్రలు లేవనియు, అట్టివానిని తాము వ్రాయవలయుననియు దాసుగారికి తోచెను. అంతట తన చరిత్రము ముప్పది యేండ్లవరకు దాసుగారు వ్రాసిరి. ఇంతలో వీరేశలింగం పంతులుగారి స్వీయచరిత్ర ప్రథమభాగము బయల్వెడలెను. దాసుగారు తాము వ్రాయుచుండిన స్వీయచరిత్రము నాపివేసిరి" – అని శ్రీ నారాయణదాసు జీవితచరిత్రకారులు (పే. 237) తెలిపినారు. శ్రీ వీరేశలింగంగారి స్వీయచరిత్ర ప్రథమభాగము 1903లో చింతామణీ ముద్రణాలయమున ముద్రణనొంది ప్రకటితమైనది. దీనినిబట్టి ప్రకటన దృష్ట్యా శ్రీ కందుకూరి వారి స్వీయచరిత్రకు ప్రాథమ్యమున్నను, రచనదృష్ట్యా శ్రీ ఆదిభట్లవారి ''ఆత్మపరిచయమే'' ('నా యెఱుక') తెలుగున పుట్టిన తొలి స్వీయచరిత్ర అనవలసియున్నది. ఆదిభట్లవారే ఆత్మకథాభగీరథులు వారి 'నా యెఱుక'యే ప్రథమాంధ్ర స్వీయచరిత్ర రచన.

శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారు పార్వతీపురమున కెనిమిది మైళ్ళ దూరముననున్న సువర్ణముఖీనదీతీరమందలిఅజ్జాడ గ్రామములో రక్తాక్షి శ్రావణ శుద్ధ

చతుర్దశి బుధవారము నాడు (31-8-1864) అవతరించిరి. కారణజన్ములైన వీరు బాల్యమాదిగ శక్రధనువువలె శబలిత కాంతులతో శోభిల్లిన సహస్రమాస జీవితమును గడిపి, సర్వప్రయోజనములను సాధించి 2-1-1945లో నిర్యాణమొందిరి. పూర్ణపురుషాయుష జీవులైన ఈ మహనీయుల తొలి ముప్పది సంవత్సరముల జీవిత చరిత్ర (1864-1897) 'నా యెఱుక' అను స్వీయచరిత్రకు కథావస్తువు.

1903లో శ్రీ వీరేశలింగం పంతులు స్వీయచరిత్ర ప్రకటితమగుటకును, శ్రీ దాసుగారు తమ స్వీయచరిత్రను ఆపివేయుటకును గల సంబంధము అతర్కితోపనతము; కేవలము కాకతాళీయము. తెనుగున స్వీయచరిత్రలు లేని లోపమును తీర్చుటకై 'నా యెఱుక' ను రచింపనుద్యమించిన శ్రీ దాసుగారు, శ్రీ వీరేశలింగం పంతులుగారి ఆత్మకథాప్రకటనతో ఆ లోపము తీరినది గదాయని భావించి, తమ స్వీయచరిత్రను ఆపివేసిరనుట అంగీకరింపదగినది కాదు. శ్రీ కందుకూరివారి స్వీయచరిత్ర రచనారామణీయకమున గాని, సత్యార్థ ప్రకటనా వైశిష్ట్యమున గాని తమరచన కంటె మిన్నగ సాగినదనుటచే వెఱచి ఆపివేసి రనుట అపచారము.

శ్రీ దాసుగారు మొదటినుండియు 'నా యెఱుక' లో తమ ముప్పది సంవత్సరముల జీవితమునే నిక్షేపించ నుద్దేశించినారు. తొలుత ప్రకటితమైన శ్రీ కందుకూరి వారి స్వీయచరిత్ర శ్రీ దాసుగారిని పునరాలోచనకు పురికొల్పి, తమ మొదటి ఉద్దేశమును దృఢతర మొనర్చుటకు తోడ్పడియుండును. "ముప్పదియేండ్ల జీవితకథతోనే తమ స్వీయచరిత్ర నేల ఆపివేసి?" రని ప్రశ్నించినపుడు, శ్రీ నారాయణదాసుగారు ఇట్లు చమత్కారముగ సమాధాన మిచ్చిరట!

"ఎవ్వని చరిత్రమైనను ముప్పదియేండ్ల వఱకే లోకమెఱుగవలయును. ఆ పైని అనవసరము. ముప్పది యేండ్ల వరకే సుగుణముండును. ఆ పైన పేరాసయు, అసంతుష్టియు పెచ్చు రేగిపోవును. దైవత్వము నశించును. దేవతల నందుకే త్రిదశు లన్నారు. ముప్పదియేండ్లు దాటిన మీదట నందరు రాక్షసులే!"

ఇందు శ్రీ దాసుగారు వెల్లడించిన అభిప్రాయములలోని సత్యాసత్యము లెట్లున్నను, స్వీయచరిత్రకు వారు మొదటినుండియు ఉద్దేశించిన వస్తువు తమ ముప్పదియేండ్లు జీవితకథ మాత్రమే అని ప్రస్ఫుటమగు చున్నది. 'ముప్పదియేండ్లు దాటిన మీదట అందఱు రాక్షసులే' అన్న శ్రీ దాసుగారి భావము ప్రముఖాంగ్ల సాహితీవేత్తలలో నొకడును, విశిష్టభావుకుడు, చమత్కారచతురుడైన జార్జి బెర్నార్డు

షా వెలిబుచ్చిన "Every gentleman over forty is a scoundrel" అన్న ఛలోక్తిని స్మృతికి తెచ్చుచున్నది.

'నా ఎఱుక'ను శ్రీ దాసుగారు తమ ముప్పదియేండ్ల జీవితకథతోనే ముగించుట యందలి సామంజస్యమును మరొకరీతిగ భావింపవచ్చును. గురుముఖతః విద్యలార్జించువారు, ఆ గురువర్యులిచ్చు ప్రోత్సాహదోహదములతో విజృంభించి ఇంట గెలిచిన పిమ్మట రచ్చ గెలుచుచు జీవిత విజయపరంపరలను చేకూర్చుకొందురు. 'స్వశక్తితో విద్యలార్జించువారు, పరంపరాగతములైన ప్రోత్సాహదోహదములు సహజముగ సంప్రాప్తింపనందున వ్యతిక్రమమార్గమున స్వైరవీరవిహారము లొనర్చి తొలుత రచ్చగెలిచి తదుపరి ఇంట గెలిచి విజయపరంపరలను చేకొందురు. శ్రీ దాసుగారు రెండవకోవకు చెందిన ప్రతిభావంతులు. విద్వాంసులందలి స్పర్ధాసంశయములు హేతువులుగా స్వస్థానమునందేర్పడిన వ్యతిరేకతలవలన వీరికి ఆరంభదశలోనే ఆత్మప్రభువులైన ఆనందగజపతుల ఆదరగౌరవములు లభించలేదు. అందుచే వీరు ప్రథమమున మైసూరు పర్యంతము పరస్థానములందు విద్యాజైత్ర యాత్రలొనర్చి, దిగ్విజయ గౌరవధన్యులై కీర్తిప్రతిష్ఠలతో తిరిగివచ్చి, విజయనగర ప్రభువుల ఆహ్వానసత్కారములందుకొనిరి. ఇట్లు "సర్వత్ర పూజ్యత" "స్వస్థల విజయ పరితృప్తి" లభించిన దశ శ్రీ దాసుగారి ముప్పదియేండ్ల వయసుతో ముగిసినది. శిష్యశిక్షార్థము ప్రదర్శింపవలసిన సమస్త ముఖ్యలక్షణములుగల వారి ప్రౌఢవ్యక్తిత్వము ఈ వయసునకు పూర్ణముగ రూపొందినది. లోకమునకు మార్గదర్శకములుగ వెల్లడింపదగిన జీవితానుభవములన్నియు వారి కీ కాలమునకే చేకూరినవి. ఈ సమస్త విశేషమును 'నా యెఱుక' రచనకు పూనుకొనుటకు ముందే సింహావలోకనమొనర్చి యుండుటవలననే, శ్రీ దాసుగారు తమ స్వీయచరిత్రకు ముప్పది సంవత్సరముల జీవితకథనే వస్తువుగా పరిమితమొనర్చి స్వీకరించియుందురు. శ్రీ దాసుగారి ముప్పదియేండ్ల జీవిత చరిత్రను వెల్లడించుటకు అనేకహేతువుల దృష్ట్యా వారే యోగ్యులు. అది స్వీయచరిత్ర రూపమున ప్రదర్శితమగుటయే సముచితము, పరమ ప్రయోజనకరము. శ్రీ దాసుగారు తరువాత గడిపిన ఏబది సంవత్సరముల జీవితము ఎంతగ రసవంతము, పండిత పామరజన సమ్మోహకరము, లోకజ్ఞతాప్రదర్శకము నైనదైనను, క్షుణ్ణమార్గమున మందాకినీమహనీయతతో కొనసాగినది. కావున దానిని వారే చెప్పపని లేదు. భావికాల జీవితచరిత్రకారునకు, లోకమునకు విడిచిపెట్టవచ్చును. ఉచితజ్ఞులైన దాసుగారట్లే యొనర్చిరి. శిష్యులెన్నడైన ఆ ఏబది సంవత్సరముల జీవిత విశేషములనుగూర్చి ప్రశ్నించినపుడు, వారు "అందుకు లోకమే ప్రమాణమని దాని

రచన లోకమునకే విడిచిపుచ్చితిని" – అని సమాధానమిచ్చినట్లును వినికిడి. "స్వయముగ చెప్పవలసిన అగత్యమున్నంతటి తన జీవిత కథను మాత్రమే స్వీయ చరిత్రకారుడు వస్తువుగా స్వీకరింపవలయును. అన్యమైన జీవితకథను ప్రదర్శించుపని జీవిత చరిత్రకారునిది" – ఇది అనుభవజ్ఞులైన శ్రీ దాసుగారు సాహిత్యోపాసకుల కిచ్చిన అమలిన సందేశము. జీవిత చరిత్రను ప్రదర్శించు విషయమున ఇట్టి పరిణత దృష్టి గల శ్రీ దాసుగారి స్వీయచరిత్ర 'నా యెఱుక.'

## 2

'నా యెఱుక' స్వీయచరిత్ర అను సాహిత్య ప్రక్రియకు చెందిన కృతివిశేషము. వైషయికముగ స్వీయచరిత్ర, జీవితచరిత్ర ఒకేజాతిలోనివి. ఇవి ఆత్మకర్తృకమును, అన్యకర్తృకములై యుండుటయే ముఖ్యవిభేదము. శిల్ప విషయమున రెంటియందును వైధర్మ్యములకంటె సాధర్మ్యములే విశేషము. రెంటికిని మహాపురుష జీవితముపై నుదయించు ప్రణయగౌరవములే ప్రధానోద్బోధకములు. స్థూలదృష్టికి రెండును జీవిత చరిత్రలు. ఈ ఇరుతెగల కృతులు చెప్పినవారును జీవితచరిత్రకారులు.

"ఉదాత్త జీవనుల జన్మమువలె ఉత్తమజీవిత చరిత్రకారుల జన్మమును అరుదు" "జాన్సను లెందఱో ఉండవచ్చును; బాస్వెలు లెన్నడో గాని ఉదయింపరు" – ఆంగ్ల భాషలోని ఈ జిజ్ఞాసాత్మక వాక్యము జీవిత చరిత్రకు అర్హులైన వ్యక్తుల ఆధిక్యమును, ఉత్తమ జీవిత చరిత్రకారుల అతిశయమును, వేనోళ్ళ చాటుచున్నది.

జీవిత చరిత్రకారునకు మహాపురుష జీవితమునకు సంబంధించిన సత్యాంశకథనము ముఖ్యలక్ష్యము. కావ్య నాటకాది ప్రక్రియలను చేపట్టిన వారివలె నితఁడు విషయకల్పనలకు ఆసక్తి వహింపరాదు. సత్యప్రియులైన పాఠకలోకమును తృప్తిపరచి గౌరవానురాగములను చూరగొనుటకై ఇతడు గుణదోషములను రెంటిని యథాతథముగా ప్రదర్శింపవలయును. సౌందర్యోపేతముగ సత్యాంశకథన మొనర్చిన గాని ఇతని కృతి సాహిత్యసృష్టి కాఁజాలదు. సత్యసౌందర్యముల రెంటిని సమన్వయించుకొన్న జీవిత చరిత్రల విషయముననే "Biography is a literary work of art rivalling sculpture itself" అన్న విమర్శక వాక్యార్థము చెల్లదగియున్నది. ఇట్టి సత్య సౌందర్య సమన్వయమును సంపాదింపని యెడ జీవిత చరిత్ర కేవల చరిత్ర రచన అనియో, కేవల సౌందర్య సృష్టి అనియో అనిపించుకొనును. ఉత్తమ జీవిత చరిత్రకారుడు మహాపురుష జీవితమునకు సంబంధించిన సత్యాంశములతో

వినిర్మితమైన పంజరాకృతి నాధారముగ గ్రహించి, కళాకుశలుడై, నిత్యసౌందర్య పరిశోభితమైన జీవితప్రతిమను గండరింపవలయు నన్నమాట! జీవిత చరిత్ర ఇంతటి బృహద్భారనిర్వహణముతో గూడినదియు, క్లేశకరము, శ్రమసాధ్యమునైన దగుటవల్లనే అసిధారానృత్యమగుచున్నది. జీవిత చరిత్రలను గూర్చి యొనర్చిన ఈ జిజ్ఞాస స్వీయచరిత్రలకును అన్వయించుట సత్యము.

అత్యంత ప్రాచీన కాలముననే పాశ్చాత్య దేశములకు ప్రాచీన గ్రీకు రోమను జీవిత చరిత్రల నిబద్ధమొనర్చి యిచ్చిన గ్రీకు జీవితచరిత్ర కారుడగు ప్లూటార్క్ మహాశయుడు (క్రీ.శ. 64-120) జీవిత చరిత్రకారులు పాటింపవలసిన ప్రధాన సూత్రములనెల్ల నిర్దేశించి యిచ్చినాడు. కాని అవి అతనితోనే విస్మృతములైనవి. జీవిత చరిత్ర రచన మరల మధ్యయుగమునందు పుణ్యపురుష జీవిత ప్రశస్తులతో (Panegyrics of Saints) పునః ప్రారంభమైనది.

అయినను 19వ శతాబ్దిలోని మహారచయితలైన జాన్సన్, బాస్వెల్, సథీ, కార్లయిల్, ఫ్రౌధే, మెకాలే, ఆబట్‌ల తీవ్రకృషి వలన గాని జీవిత చరిత్రకు ఒక సాహిత్యశాఖగా నెలవుకొను అవకాశము లభింపలేదు. ఈ రచయితలు తమ పాత్రల గుణములను మాత్రమే స్వీకరించి రచన సాగించుటవలన వీరు వ్రాసిన జీవిత చరిత్రలు వీర పూజను ప్రోత్సహించునవైనవి. ఈ జాతి జీవిత చరిత్రలకు కార్లయిల్ మహాశయుని "హీరో అండ్ హీరో వర్షిప్" చక్కని ఉదాహరణము. వీరి పాత్రలు భయగౌరవములను పొందగలిగిన దేవతాప్రతిమలైనవేగాని, సమకాలీన సహజీవనులైన ప్రజల అభిమానానురాగములను పొందలేకపోయినవి.

ఇట్టి స్థితినుండి 20 వ శతాబ్దమున పాశ్చాత్య జీవిత చరిత్రను సముద్ధరించి, పునరుజ్జీవమును కల్పించి, బహుముఖీన వైభవవికాసములను ప్రసాదించిన ఉత్తమ రచయితలు ఎ.జి. గార్డ్‌నర్, లిట్టన్ స్ట్రాచీ, ఎమిల్ లుడ్విగ్, ఆండ్రూమారా ప్రభృతులు. జీవిత చరిత్రల మూలమున విషయబోధన మొనర్చుటకంటే, చిత్తాహ్లాదమును చేకూర్చుటయే (delight than teach) ముఖ్యాశయముగా 'ప్రాఫెట్స్, ప్రీస్ట్స్ అండ్ కింగ్స్' (1908), 'పిల్లర్స్ ఆఫ్ సొసైటీ' వంటి ఉత్తమ జీవిత చరిత్రలను రచించి ఎ.జి. గార్డ్‌నర్ ఆంగ్ల దేశమున నూతన శకారంభ మొనర్చినాడు. లాయడ్ జార్జి మొదలు చార్లీ చాప్లిన్ వఱకుగల అపూర్వ వ్యక్తులను ఇతడు భయసంకోచములు లేక యథార్థరూపములలో దర్శించి, ఆయా పాత్రలను మానవాతీతులనుగా కాక సమకాలీన సామాజికులనుగా ప్రదర్శించినాడు.

లిట్టన్ స్ట్రాచీ 1918లో "ఎమినెంట్ విక్టోరియన్స్" రచనతో ఆధునిక జీవిత చరిత్రకు స్వయం సంపూర్ణత నొసగి సకల ప్రపంచసాహిత్యకుల దృష్టి నాకర్షించినాడు. ఇతడు పూర్వులవలె పాండిత్య ప్రదర్శనకై అసంఖ్యాకముగ పాత్రల జీవితాంశములను సేకరించి వెల్లడించుటయెడ మిక్కిలి మక్కువను ప్రదర్శింపలేదు. పాత్రల ఆంతరిక వ్యక్తిత్వమును తేజోవంతముగ బహిర్గత మొనర్పగల అల్పాంశములతోనే ఇతడు వ్యక్తిత్వోన్మీలన మొనర్చినాడు. సమకాలీన ప్రజలచే మానవాతీతులుగ పరిగణితులు, పూజితులునైన విక్టోరియా నాటి స్త్రీ పురుషశ్రేష్ఠులం దీతడు, సామాన్యులలో కన్పట్టు దోషములను సహితము దర్శించి వెల్లడించుటకు వెనుదీయలేదు. ఖారటూంవీరుని మద్యపానవ్యసనిగను, కార్డినల్ మానింగును సదా భావవైక్లబ్యునిగను రూపొందించుట ఇందుకు నిదర్శనము. ఇతడు చిత్రించిన ఫ్లారెన్స్ నైటింగేల్ ప్రజానీకము ఊహాతూలికలలో మనోభిత్తికలపై తీర్చిదిద్దుకొన్న అశ్వినీదేవతలను బోలిన అమరకాంత కాదు; ధైర్యసాహసములతో ప్రబల ప్రభుత్వమును ప్రతిఘటించి, "సైనిక వైద్యసేవ" (Army Medical Service) యందున్న దోషములను తొలగించుటకై పోరాడి విజయమును చేకొన్న వీరనారి. స్ట్రాచీ పాత్ర లెల్లరు బలదౌర్బల్య గుణదోషయుతులైన మానవులే కాని అందీయందని ఛాయామూర్తులు గాని, దిగ్భ్రమగొల్పు తేజోమూర్తులు గాని కారు. స్వీయచరిత్ర రచనయందు నూతనశకారంభ మొనర్చిన ఈతని తరువాతి కృతియైన "క్వీన్ విక్టోరియా" యందును ఇతడు విక్టోరియా రాజ్ఞిని, ఆమె భర్తను, మెల్బోర్న్ ప్రభువు వంటి అగ్రవర్గముల వారినైనను ప్రదర్శించుటకు పూనుకొనలేదు. ఇతడు స్త్రీజననైజ దోషములైన ఆత్మప్రామాణ్యము, ప్రగల్భత, కార్కశ్యములతో విక్టోరియా రాణిని, అట్లే ఇతరదోషములతో ఆమె భర్తను, మెల్బోర్న్ ప్రభువును ప్రదర్శించినను ఈ పాత్రలు గాని, లోపయుతములుగ ప్రదర్శితములైన ఇతని ఇతర పాత్రలు గాని శోభారహితములని భావింపరాదు. ఇతని పాత్రలన్నియు పటిష్ఠములై పాఠకుల దృష్టి నాశ్చర్యకరముగ నాకర్షింప జాలియున్నవి. విచిత్రమైన ఒక విడంబన ధోరణి లేదా అవక్షేపధోరణి (Mocking strain) లిట్టన్ స్ట్రాచీ రచనారీతికి జీవాతువు. ఇతనినుండి ఉద్బోధమునొందిన ఆధునిక జీవిత చరిత్రకారులలో మఱొక "క్వీన్ విక్టోరియా" చెప్పిన ఎడిత్ సిట్వెల్, శ్లాఘనీయముగ "అక్బరు"ను రచించి యిచ్చిన లారెన్స్ బినియన్, "పామెర్‌స్టన్" కృతితో ఘనవిజయమును గైకొన్న ఫిలిప్ గొయొడెల్లా ప్రముఖులు.

ఎమిల్ లుడ్విగ్ అను జర్మను జీవిత చరిత్రకారుడు, మహాపురుష వ్యక్తిత్వమును అసాధారణ భావనాశక్తితో ఒడుచుకొని, కవితోద్వేగము, అతీంద్రియతలను ఊతగా

జీవితచరిత్ర రచన యొనర్చినాడు. పాత్రలను గూర్చిన ఊహాచిత్రములతో బయలుదేరి, పురావస్తుశాలలందు అనుగుణమైన సాధన సామగ్రి నెన్నుకొని లుడ్విగ్ బిస్మార్క్, గెథీ, ది సన్ ఆఫ్ మాన్, త్రి టిటన్స్, క్లియోపాత్రా మొదలైన జీవిత చరిత్రలను చెప్పి పిదప "విలియం II" "నెపోలియన్" లను రచించినాడు. జీవితాంశముల బాహుళ్యమువలనను, సర్వాంశములకు నెత్తిచూపిన అసంఖ్యాక నిరూపణములవలనను మొదటి రచనలందు పాత్రోన్మీలనమును కొంతగ మరుగుపరచినట్లు కన్పించినను, ఇతడు "విలియం II" 'నెపోలియన్'లలో విషయ విస్తృతిని, ప్రామాణ్య ప్రదర్శనములపై ప్రీతిని విసర్జించి సముజ్జ్వలముగ పాత్రలను చిత్రించుటలో సిద్ధహస్తతను సంపాదించినాడు. విశ్వవిఖ్యాతి నార్జించి యిచ్చిన "నెపోలియన్" (1925) ఎమిల్ లుడ్విగ్ జీవిత చరిత్ర రచనయందు ప్రత్యేకముగ సాధించిన చిత్త చిహ్నాత్మకము, ఆలేఖ్య ప్రాయమునగు కథాకథన స్వభావము (Impressionistic and Pictorial Nature of Narration), సముజ్జ్వలముగ ద్యోతకమగు చున్నది. ఆబట్ రచించిన 'నెపోలియన్' కంటే నితని 'నెపోలియన్' జీవిత చరిత్ర వేయిమడుగుల విశిష్టరచనగా కీర్తికెక్కినది. బైరన్, షెల్లీ మహాకవుల జీవిత చరిత్రలు కథావస్తువులుగా "బోరన్", 'ఏరియల్' అన్న అనితర సాధ్యకృతులను జెప్పి, ఆధునిక జీవిత చరిత్రకు అత్యధిక ప్రజానురాగమును చేకూర్చిన ఫ్రెంచి రచయిత ఆంద్రూ మారా. పాత్రను గూర్చిన నిశితదర్శనము గలవాడగుటవలన నితడు 'బోరన్'లో బైరను చిత్రమును సత్యసమ్మతముగను, చిత్తాకర్షకముగను ప్రదర్శించినాడు. షెల్లీ మహాకవి జీవిత చరిత్రను చెప్పునపుడు 'ఏరియల్' లో ఆంద్రూ మారా పూర్వరచనారీతిని పరిహరించి, సముజ్జ్వలమైన నూతన రచనాశిల్పము ననుసరించినాడు. ఇందు ఈతడు నిరూపించిన మార్గమును విమర్శకలోకము 'ఆఖ్యాయికాప్రాయ జీవిత చరిత్ర' (Fictional Biography) అని వ్యవహరించినారు.

'నా యెఱుక' శ్రీ నారాయణదాసుగారు స్వయముగ చెప్పుకొనిన జీవిత చరిత్ర. ఉత్తమ కథకులై అశేష జనానీకము నానందాబ్ధిలో నోలలాడించిన శ్రీ ఆదిభట్ల వారి జీవిత చరిత్రలో ఉత్తమ జీవిత చరిత్రలందు కన్పట్టు సమస్త లక్షణములును సమన్వయము నొందినవి. 'నా యెఱుక' సత్యసౌందర్యముల సమ్మేళనమని సర్వత్ర నిరూపించుకొనినది. 1903కు పూర్వమే పుట్టినను 'నా యెఱుక'లో శ్రీ నారాయణ దాసుగారు రూపొందించుకొన్న వారి వ్యక్తిత్వము ఆధునిక జీవిత చరిత్రకారులు ప్రీతి పడినదియును, జనానురాగ గౌరవములను చూరగొన జాలినదియునైన గుణదోష మిశ్రమగు మానవమూర్తియే కాని, పూర్ణ సద్గుణ పుంజమై వీరపూజను ప్రోత్సహించు

దేవతామూర్తి కాదు. ఆధునిక జీవిత చరిత్రకారులకు అన్ని విషయములందును అగ్రగామియు, మార్గదర్శకుండునైన లిట్టన్ స్ట్రాచీ రచనామర్మములన్నియు, నాతనికి రెండు దశాబ్దులకు పూర్వమే తమ జీవిత చరిత్రను చెప్పుకొనిన శ్రీ దాసుగారి 'నా యెఱుక'లో కన్పట్టుట వారి ప్రజ్ఞాపాటవమునకు, సహజ సాహితీశిల్పనైపుణికి ప్రబల సాక్ష్యములు. తుదకు స్ట్రాచీ అనుసరించిన విడంబన ధోరణి (Mocking strain) సహితము 'నా యెఱుక' యందు తావు చేసికొనినది. శ్రీ దాసుగారు అక్కడక్కడ తమ్ముగూర్చి చెప్పుకొనువరకే ఈ అవక్షేపధోరణిని పరిమిత మొనర్చుకొనుటలో ఔచిత్యమును పాటించిరనుట సత్యము. పాత్రోన్మీలన వేళలందు కొన్నియెడల లుడ్విగ్ విధానము 'నా యెఱుక' లో కన్పట్టుట ఆశ్చర్యకరమైన అంశము. జీవిత కథనమునందు 'నా యెఱుక' అనేక రసవద్ఘట్టములలో ఆఖ్యాయికాప్రాయముగ సాగి, ఆంద్రూ మారా రచనలను తలపింపజేయుచు, ఇట్టి రచనాసౌందర్య విశేషమును 20వ శతాబ్ది ప్రారంభమునకు పూర్వమే దర్శించి ప్రదర్శించిన శ్రీ నారాయణదాసుగారికి కైమోడ్పు లర్పింప జేయుచున్నది. పరికించినకొలది శ్రీ నారాయణదాసుగారి 'నా యెఱుక' యందు జీవితచరిత్ర రచనకు సంబంధించిన సర్వశిల్ప విశేషములును ఏదో ఒక తావున దర్శనమిచ్చి తీరుననుట అతిశయోక్తి కాజాలదు.

## 3

మహాపురుషుల సారవజ్జీవిత వైవిధ్యము, సాధించిన ఘనకార్యవైశిష్ట్యము, ఆదర్శప్రబోధములు, రసబాహుళ్య, రామణీయకతాది గుణవిశేషములు గౌరవానురాగములను కల్పించి జీవిత చరిత్ర రచనకు ప్రోత్సాహకము లగుచున్నవి. వివిధ జీవితరంగములలో పొందిన విశిష్ట విజయములను, స్వీయ గుణవర్తనలను, సాక్షీభూతులై భావించినపుడు ఉదార చరితులకు గలిగెడు స్వాభిమానము, స్వీయాదర్శాభివృద్ధి నాసించి ఒనర్పదలచిన శిష్యశిక్షణాసక్తి, పరులు అపార్థమొనర్చుకొని జీవిత చరిత్రలందెట తమ్ము సత్యేతర స్వరూపముతో ప్రదర్శించి ప్రయోజనావాప్తికి భంగపాటు కల్పింతురో అను భయసంశయాదులు స్వీయ కథారచనోద్బోధకములు, ఆత్మకథాజనన హేతువులు నగుచున్నవి.

ఆత్మపరిచయ మొనర్చుటయం దాస్థ వహింపకుండుట భారతీయులకును, వారిలో అంతర్భాగమైన ఆంధ్రులకును నైజగుణము. "తన్ను గూర్చి వ్రాసికొనునపుడు ఈశ్వరముఖమును జూచి సత్యమునే చెప్పబూనినను, సమకాలమువారు ఆత్మస్తుతిగనో, పరనిందగనో చేకొని భావింపవచ్చు" నని స్వీయకథారచనమునకు మొన్న

మొన్నటివరకు మనవారు చిత్తప్రవేశమును కల్పింపలేదు. అందుచే "పూర్వుల కంతగా రుచింపని" ఈ సాహిత్య ప్రక్రియాసృష్టికి భారతీయులకెట్లో ఆంధ్రులకు నట్లే పాశ్చాత్యులు మార్గదర్శకులు కావలసి వచ్చినది.

పాత్ర సంశయములు కారణములుగా పాశ్చాత్యులందును సాహసికులైన ఏ స్వల్ప సంఖ్యాకులో తప్ప ఆత్మకథారచన నితరులాదరింపలేదు. అందువలన వారి దేశములోను జీవిత చరిత్రలవలె స్వీయచరిత్రలు పృథు సంఖ్యలో పుట్టలేదు. "I feel greatmen should tell the story of their lives., therefore I am telling mine" అన్నాడు మధ్యకాలమునాటి ఇటాలియను మహాశిల్పి సెలినీ. ఈ అభిప్రాయము స్థూలదృష్టికి అహంభావపూరితముగ తోచినను, ఒక చిరతరసత్యమును వెల్లడించుచున్నది. లోకోపకారబుద్ధితో చెప్పుకొన్న ఇతని స్వీయకథ శిల్పసాధకులకే కాక, సకల కళాజీవులకును దుర్గమ దేశములందు వెలుగుబాటలను జూపుచున్నది. తుదకు శృంగారశూరుడైన 'కాసనోవా' ఆత్మకథయును (Adventures of Casanova) మానవ మనస్తత్త్వమునకు మనోజ్ఞముకురమై చిత్తాహ్లాదనమును, జ్ఞానబోధనము నొనర్చుచున్నది. పాత్రలు స్వయముగ చెప్పికొనునవగుటచే ఇట్టి స్వీయ చరిత్రలు ఎట్టి శంకలకు తావీయక గాఢముగ విశ్వసింపబడుచు నధిక ప్రయోజనమును చేకూర్చుచున్నవి.

'నా యెఱుక' అనుపమములైన ఆత్మవిశ్వాస ప్రత్యయములు గల సర్వతోముఖ ప్రజ్ఞాశాలియగు శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారి ఆత్మ కథ. "లోకులచే నేనెఱింగినదియు, నాకు స్వయముగా తెలిసినదియు మదీయానుభూతి దెలుపగోరి యిద్దాని వివరించెద. బాల్యయౌవనదశలను గల యనుభవము నన్ను గూర్చియు, లోకము గూర్చియు నే దెలిసిన మట్టుకు వ్రాసెద" అని వారు స్వీయ చరిత్రను ఆరంభించినారు. ఈ వాక్యములను బట్టి వారు ఏ దృష్టితో స్వీయచరిత్ర రచనకు పూనుకొనునదియును, అందుకు వేనిని ప్రమాణములుగా గ్రహించినదియును తెలియుచున్నది. శ్రీ దాసుగారి అనుభూతిలో కొంత లోకులచే నెఱిగినదున్నది. ఇందధికభాగము బాల్యమునకు జెందినదై యుండును. వారు తమకు మూడేండ్ల వయసునుండియు కలిగిన జాగ్రత్స్వప్నానుభూతులలో మూడువంతులు జ్ఞప్తియందున్న వారు. స్వానుభూతి విజ్ఞానమును పరులనుండి విన్నదానితో సమన్వయ మొనర్చుకొని శ్రీ దాసుగారు ఆత్మ పరిచయ రచనమొనర్చిరన్నమాట!

సంగీత సాహిత్య నాట్యావతారులైన శ్రీ నారాయణదాసుగారు ఆంధ్ర సరస్వతికి సమర్పించిన నవరత్నోపహారమిది. ఇది శ్రీ దాసుగారి అసాధారణ వ్యక్తిత్వ నికేతనమున

కెత్తిన రజతపతాక. నిత్యార్జిత కళాజీవనులైన వారు శిష్యకోటి యెడగల అనన్య వాత్సల్యాభిమానములతో అనుగ్రహించి యిచ్చిన జీవిత మార్గదర్శిక, వర్ధమాన కళాకారులకు సంశయభీరుతను (Decido Phobia) పోద్రోలి, భూరితరోపదేశము నీజాలిన గీతామహోపనిషత్తు, చిత్రవిచిత్రాను భవములకు శేవధి. లోకానుభవ విజ్ఞతలకు మణిమంజూష, రసవద్భావ భాషాసౌరభ్యములతో రసిక లోకమును రంజింపజేయు ప్రసవసముద్గతము.

## 4

ఆంధ్ర సాహిత్యమునందు తొలి స్వీయచరిత్రగా ఉదయించినను "నా యెఱుక" స్వీయ కథాశిల్ప నైపుణ్యములనెల్ల పుణికిపుచ్చుకొనినది. ఇట్టి శిల్పశక్తి బహుభాషా కోవిదులైన శ్రీ దాసుగారికి పరభాషలలోని ఆత్మకథాగ్రంథములను పఠించుటవలన చేకూరిన శక్తి కాదు. స్వోపజ్ఞము. సరససాహిత్యకులు, శ్రోతల హృదయతంత్రులను మీటి ఉఱ్ఱూతలూగింపగల ఉత్తమ కథకులునైన శ్రీ దాసుగారికి స్వీయచరిత్ర ప్రక్రియను ప్రత్యేకముగా నేర్వవలసిన పని యేమున్నది?

"ఉద్రేక పూరితమైన మనస్సునందు ఉత్సాహవశమున దోచు వింత యూహలకు యథోచితమగు నక్షరసందర్భములను గూర్చుట రచన" అని శ్రీ దాసుగారు నిర్వచించినారు. "నా యెఱుక" ఈ నిర్వచనమునకు తగిన లక్ష్యమై సర్వరచనా రామణీయకములను సంతరించుకొని చక్కని ఆత్మకథగా అవతరించినది.

"నా యెఱుక" యందు శ్రీ ఆదిభట్లవారు తమ జీవితమందలి సత్యకథాంశములను సౌందర్యపరిప్లుతములు గావించి ప్రదర్శించినారు. శ్రీ నారాయణదాసుగారిని స్వీయకథారచన కున్ముఖులను గావించిన ప్రబల హేతువులలో జనరంజకమైన వారి జీవితమునందలి రసరామణీయకత నంతర్ముఖులై గమనించుట యొకటి. స్వీయచరిత్రకు పూనుకొనిన పిమ్మట నీ సౌందర్యసంపాదనకై తమ జీవితమందలి ఏ ఘట్టముల నే దృష్టితో ప్రదర్శింపవలయునో శ్రీ దాసుగారు చక్కని సింహావలోకన మొనర్చి వాని నెన్నుకొన్నట్లు 'నా యెఱుక' సర్వత్ర సాక్ష్యమిచ్చుచున్నది. 'నా యెఱుక' యందు శ్రీ ఆదిభట్ల వారు ప్రస్తరించిన ఆత్మజీవిత సన్నివేశములన్నియు సౌందర్య సమున్మిషితములు.

ఆత్మకథారచయిత తన జీవిత సన్నివేశములను చిత్రించునపుడు, దేనికదియే విలక్షణము, సుందరమునై యుండియు, పూర్ణకథలో నొదిగిపోవుచు దాని వైలక్షణ్య,

రామణీయకములను పోషించునట్లు జాగరూకత వహింపవలయును. శ్రీ అజ్జాడవారు తమ జీవిత ఘట్టములను కథించునపుడు వానిని వ్యష్టిగను, సమష్టిగను పోషించి, 'నా యెఱుక' యందు అంగాంగీభావ సంయోగమును సంపాదించి, సముచితమైన నిర్మాణ సౌందర్యమును (Structural Beauty) ప్రదర్శించినారు. కామేశముపంతులు ఔదార్యరసజ్ఞతలు, రామయ్య వీడ్కోలు, భీముడుగారి వేశ్యాశోధన, నరసన్న పేట వింత వేశ్య, బందరు అవధాన విశేషములు, గంగాధర రామారాయణింగారు చేసిన సన్మానము, మైసూరు జైత్రయాత్ర మొదలైన సన్నివేశములన్నియు నిందుకు సాక్ష్యములుగ నొప్పియున్న వనుట ఛిన్న సంశయము.

ఎట్టి కథకైనను రామణీయకమును కల్పించు నంశములలో ప్రధానమైనది అందలి పాత్ర చిత్రణము. పాత్రలు సందర్భోచిత వేషభాషాచేష్టలతో సజీవమూర్తులై పాఠకుల మనోముకురములందు సుందరముగ ప్రతిబింబితములై రూఢికెక్క వలయును. శ్రీ నారాయణదాసుగారి 'నా యెఱుక' లోని పాత్రలు సిద్ధహస్తుడైన కవి గండరించిన, అమృతపాత్రలవలె సహజోక్త సుందరములై నిజరూపములతో నిత్యత్వము నార్జించుకున్నవి. ఇందలి ప్రధానమైన పాత్రయైన శ్రీ దాసుగారు, సహగాయకుడు పేరన్న, జయంతి కామేశము, భీముడుగారివంటి మిత్రులు, మహీశూర మహారాజు, పిఠాపురము మహారాజు గంగాధర రామారాయణింగారు, విజయనగర ప్రభువు ఆనందగజపతి వంటి వదాన్య శేఖరులు, రసజ్ఞశేఖరులే కాక మాటతప్పిన వేశ్య, భీముడుగారి వేశ్య, నరసన్నపేట వేశ్య మొదలైన వారును, ప్రాసంగికముగ కథలో ప్రవేశించిన వైష్ణవ సంగీత సాహిత్య విద్వాంసులు విచిత్ర వివాహకర్త, మదరాసు ఆంధ్రభాషోపన్యాసకుడు, డిప్యూటీ కలెక్టరు, శ్రీ దాసుగారి లయజ్ఞానమును తప్పుబట్టిన వైణికుడు మొదలైన వాతెందరో "నా యెఱుక" లోని మరపునకు రాని పాత్రలు.

'నా యెఱుక'కు వింత సౌందర్యమును చేకూర్చిన విశేషములలో హృదయావర్జన మొనర్చుకొనగల వర్ణనసామర్థ్యమొకటి. "వర్ణనా నిపుణఃకవిః" అని గదా! శ్రీ దాసుగారు సన్నివేశ చిత్రణమునందెంతటి సమర్థులో వర్ణనలందును నంతటి ప్రతిభావంతులు. శ్రీ దాసుగారి సన్నివేశములవలెనే, వర్ణనలును బహువిధ వైవిధ్యముతో నొప్పి వారి మేధానైశిత్యమును, విజ్ఞాన వివేకవిస్తృతులను, రసజ్ఞతారామణీయకతలను సర్వత్ర బహిర్గతము లొనర్చినవి. 'నా యెఱుక' లోని ప్రతి సన్నివేశమునందును నారాయణదాసుగారి వ్యక్తిత్వము కారణముగా నంతయో ఇంతయో వైచిత్రి ప్రవేశించినది. చిన్ననాడు రాజదుర్గయ్య పంతులు గారింట సాహసించి భర్తకై

వ్యంజనములు వడ్డించి ఉంచిన విస్తరిలో అన్నము పెట్టుకొని తిని, వారము సంపాదించుట, నిద్రపట్టక వేశ్య ఇంటికేగి "ఒంటరిగా పండుకొననిచ్చిన రెండు రూపాయలిత్తు" నని ఆమెను మోహపెట్టి పణ్యరహితముగ ననుభవించుట, భీముడుగారి వేశ్యాశోధన, విచిత్ర శివయోగిని వృత్తాంతము, వైష్ణవమిత్రునియింట పెద్ద గురుసేవ, హోటల్ కీపరుతో జట్టీ తెచ్చుకొనుట మొదలైనవి శ్రీ దాసుగారి స్వీయకథలోని విచిత్ర సన్నివేశములు ఎంతయు రమణీయములు. ఋతుపరిజ్ఞానము, బాల్యదశ, బరంపురము కోర్టు, పరీక్షలు, పడవ ప్రయాణము, వేశ్యల పరిచర్య, రాజమండ్రి టౌను హాలు, మదరాసు నేటివ్ క్లబ్, లాల్ బాగ్ పుష్పప్రదర్శనము, కార్తిక వనసమారాధనము మొదలైన మనోహర వర్ణనలు శ్రీ దాసుగారిని మహాకవికోటిలో చేర్పజాలినవై, ''Style is the man'' అను న్యూమన్ సిద్ధాంతమునకు చక్కని సాక్ష్యములై యొప్పుచున్నవి. వీరి వర్ణనలు సౌందర్యపరిజ్ఞానపుంజములై నిరంతరమును ''The poet's eye in a fine frenzy rolling...'' అన్న షేక్స్‌పియర్ కవిచంద్రుని సుప్రసిద్ధ వాక్యమును జ్ఞప్తి యొనర్చుచున్నవి. ఏ దృక్కోణమునుండి పరికించినను 'నా యెఱుక' సౌందర్య సముపేతము.

## 5

శ్రీ దాసుగారు దృఢసత్త్వులు, సత్యనిరతులు, అతిపవిత్రులు, అనూచానులు జనించిన అమలిన వంశమున అవతరించిన ఆముష్యాయణులు. సహజశేముషీ పాండిత్య ధురంధరులు. రూపతేజో బలసంపన్నులై 'సింహసంహననమూర్తి' తో విరాజిల్లిన విశిష్టవ్యక్తులు, విద్యకుదగ్గ రూపవిభవముగల అదృష్టవంతులనియు, భక్తిని ప్రేరేపించు నవ్యక్తశక్తి యుక్తులనియు జనప్రశస్తి నందుకొన్న మహనీయులు.

పూవు పుట్టగనే పరిమళించు నన్నట్లు శ్రీ దాసుగారిని విశిష్టవ్యక్తులుగ రూపొందించిన గుణవిశేషములన్నియును వారియందు చిన్ననాడే కుదురుకొన్నవి. స్వశక్తిపై గాఢవిశ్వాసము, స్వయంకృషి, సాహసము, సత్యప్రియత్వము, స్వేచ్ఛా జీవనాసక్తి, యథాలాభ సంతుష్టి, కలహప్రకృతి, జయేచ్ఛ, అకారణ మిత్రత్వ శత్రుత్వములు, నిశిత పరిశీలనదృష్టి మొదలైనవి శ్రీ దాసుగారికి నైజగుణములు. వీరు బాల్యముననే ఆకలిని గూడ మరచి ఆత్మారాములై విహరించుచు మానవులందు తప్ప మిగిలిన చరాచర ప్రాణి విశేషములందన్నిటను దేవతామహిమను దర్శించిరి; మానవుల నెంతటి వారినైన నిర్లక్ష్యముగ జూచుట వీరి కా తొలిదశయందే అలవడినది. కవియై, జిజ్ఞాసువై, విచిత్ర సంకల్పమూర్తియై, తల్లిదండ్రులపై నైనను మమత్వమును

వీడి, జీవన్ముక్తుని వలె మధురోహలతో వీరు బాల్యమున ఊహాలోక విహరణమొనర్చిరి. ఏదియో గొప్పపని చేయవలయునను సంకల్పము, చేయగలనను విశ్వాసము శ్రీ దాసుగారికి చిన్ననాడే అబ్బినవి.

సహవాసదోషమువలన యౌవనారంభవేళనుండి శ్రీ దాసుగారికి స్త్రీ, 'గురు' సేవన వ్యసనము లలవడినవి. అపురూపరూపము, శృంగార పురుష వేషము, బహిరంగ కామవ్యాపారము లిందుకు తోడైనవి. దేవదత్తములైన ప్రజ్ఞాపాండిత్య బలములతో గౌరవమునకు భంగమురాని రీతిగ వారెంత ప్రవర్తించినను, నడవడి విమర్శకు లోనగుచు వచ్చినది. అసమాన పాండిత్యము గురుజనరాహిత్యము, బ్రాహ్మణకర్మపై నాస్థ, యజ్ఞకలాప వైముఖ్యము, హరికథాప్రవిష్ణత – విలాసవేషము, రాజాదరణవలననే గాని ఘనముగ రాణింపని విద్యలు – స్వచ్ఛంద ప్రియత్వము – లోకాధారజీవనము – వెలుపులేని బహిరంగ వ్యక్తి విమర్శ, సహజ సౌజన్యము – నైజకలహశీలము – ఇట్టి అసంబద్ధతలు (incongruities) కొట్టవచ్చినట్లు కన్పట్టుటవలననే, శ్రీ దాసుగారికి వీడ్కోలిచ్చువేళ కంటతడివెట్టు కామేశము పంతులు కారణమడుగగా "సూరన్నా! లోకమెట నిన్నపార్థ మొనర్చుకొని అగౌరవించునోయని చింతించుచున్నా' ననవలసి వచ్చినది.

యౌవనదశలో కొంతకాలము తఱుచుగ గురుసేవలో నుండుటచే నొదవిన అలక్ష్యబుద్ధితో, కథలొనర్చువేళ పిన్న పెద్దలనక అభిప్రాయములు చెప్పి తట్టాబాజీలు తెచ్చుకొనుట, యథేష్ట వేషభాషలతో అహంకరించి తిరుగుట శ్రీ దాసుగారికి లక్షణములైనవి. ఈ సందర్భములందు వీరు తమపని చెడుటనైన గమనింపరు. వీరు ఆత్మదోషములను సైతమట్లే ప్రకటించి విమర్శించుకొనిన వారు. ఉత్తమ మిత్రులైన వీరు హృదయమిచ్చి పుచ్చుకొన నేర్చినవారు. మిత్రవియోగము బాధపెట్టినపుడు నైజముగ నిశ్చింతగలవారగుటచే హాయిగ నుండగలవారు. తమ్ము ఘనముగ నాదరించిన కామేశముపంతులు, భీముడుగారి వంటి గాఢమిత్రులకే కాక కృతజ్ఞతాబుద్ధితో శ్రీ దాసుగారు విద్యార్థిదశయందలి మిత్రులకును, చంద్రశేఖరశాస్త్రి వంటి గురువులకును స్వీయచరిత్రయందు స్థానమును కల్పించి, చిరంజీవత్వమును ప్రసాదించుట శ్రీ దాసుగారి ఔదార్యమునకు దొడ్డ నిదర్శనము. జీవితము దోషావిష్టము గావున పదునారేండ్ల వయసునకు మించిన, పూర్వపరిచితులవి తప్ప, మిగిలినవారి పేర్లను చెప్పనని నియమేర్పరచుకొని, పాటించుట శ్రీ దాసుగారి ఔచిత్యపాలనమునకు తార్కాణము.

ఇట్లే శ్రీ దాసుగారికి తమ మనసు కెక్కిన విద్వాంసులను, రసజ్ఞులను, ఉదారవదాన్యులను సముచితరీతి ప్రశంసించు టాచారము. ఉపమోత్ప్రేక్షాదులతో నొప్పు వీరి పొగడ్తలు ఎంతటి ఘనులకోకాని దక్కెడివి కావు. మహమ్మదీయగాయకుని గంధర్వులను మెప్పింపజాలిన మేటి గాయకుడని మెచ్చుకొనుటయు, పదిసవరుల బంగారు కంకణములను చేతనుంచి ప్రార్థించి పల్లవిపాట విన్న వైశ్యోత్తముని రసిక శేఖరుడనియు ప్రశంసించుటయు వీరి గుణగ్రహణ పారీణత కులమత విచక్షణల కతీతమైనదని అభివ్యక్త మొనర్చుచున్నది. ఆడంబరత్వ, దౌష్ట్యములను శ్రీ దాసుగారు సహింపలేరనుటకు బిల్వేశ్వరీయకర్తను 'అమృతప్రవాహముగ నుపన్యసింప జాలినవా'డని పొగడిన వీరు విచిత్ర వివాహకర్తను తెగడుటయు, వీరి రచనలను స్వీయ రచనలుగా రాజుగారి యెదుట ప్రకటించుకొన్న డిప్యూటీ కలెక్టరును 'నేను ద్రావిడుడను. నీ దౌష్ట్యమును అడిగినవారికి అడగనివారికి తప్ప నింకెవ్వరికిని చెప్ప' నని ఛలోక్తి సహితముగ ధైర్యముతో బెదరించుటలు నిందుకు తార్కాణములు.

బహిరంగముగ ప్రకటించుకొనుట లోక మంగీకరింపని స్త్రీ లౌల్య 'గురు' సేవన వ్యసనములను సభలలో వెల్లడించుటయే కాక, కలకాలము నిలిచిపోవునట్లు తమ స్వీయచరిత్ర కెక్కించుట శ్రీ దాసుగారి సత్య ప్రియత్వమునకు నిస్తుల నిదర్శనము. లోభరహితులైన వీరికి యాచ్ఞాదైన్యము లేదు. ఆత్మాభిమాన, దైవపరత్వములు గల శ్రీ దాసుగారిని తెలియక ఎంతటి వదాన్యులైన 'ఏమి కావలయునో కోరుకొ' మ్మనినపుడు వారికి 'పరమేశ్వర కటాక్షముకంటె కోరదగిన దేదియును లేదు' అని రేవారాణి పొందిన సమాధానమే వచ్చితీరును, విద్యాపరీక్షణ మొనర్చి, పిదప చిన్నచూపు చూచి, అల్పమిచ్చినచో యథాలాభసంతుష్టి జీవలక్షణముగా గలవారైనను శ్రీ దాసుగారు మోమోటపడక 'ఏదైన ఖర్చునకు వచ్చును మీరే ఉంచుకొను' డని తిరస్కరించుటకు వెనుదీసెడువారు కారు.

శ్రీ దాసుగారికి స్వతంత్ర జీవనాసక్తి చిన్ననాడే జితించినది. శ్వవృత్తి సమస్త శక్తుల నాహరించి దైవదూరులను, స్వలాభపరులను గావించునను విశ్వాసము కాలము గడచిన కొలదీ శ్రీ దాసుగారికి ప్రగాఢమైనది. విద్యాపరీక్షణమొనర్చి పరమానందము నొందిన పిమ్మట మైసూరు మహారాజావారు "సర్వీసు చేసెదవా?" అని ప్రశ్నించినపుడు శ్రీ దాసుగారు, క్షణమైన యోజింపక, ''నేను మర్త్యులను గొల్వను'' అని సమాధానమిచ్చి, వారిని కోపఘూర్ణితనేత్రులను గావించుట వారికే తగియున్నది. తుదకు తమ హరికథలలో నొక్కదానినైనను నరాంకితము గావింపలేదని శ్రీ దాసుగారు

సగర్వముగ జెప్పికొనినారు. శ్వవృత్తి గైకొన్నవారు ఎంతటి విద్యావంతులైనను స్వార్థపరులై తమ ప్రభువైన ఆనందగజపతిని అపమార్గములనుండి తప్పించి, దేశశ్రేయస్కరములైన సత్కార్యములకు ప్రోత్సహింపరని వీరు ఆక్రోశించినారు.

'భోగరాయుడ' నని పలుమారు ప్రకటించుకొన్న శ్రీ దాసుగారు శృంగార శేఖరులు. భోగలాలసులైనను వీరు పరస్త్రీని మాతృవతుగా దర్శించినవారు. నైజధర్మాభిరతిగల వీరిదృష్టిలో మిత్రుల ఉంపుడు కత్తెలును వీరికి ఆశింపదగనివారు. ఆప్తమిత్రులైన భీముడుగారిని ద్వితీయ వివాహమునకు ఉద్బోధించువేళ, వారికి పరమ పతివ్రతయని తమ వేశ్యపై గల భ్రాంతిని తొలగించుటకై, వారి అభ్యర్థనను గైకొనిగాని శోధించుటకు బూనుకొనకపోవుట ఇందుకు తార్కాణము. భోగినీజన చిత్తవృత్తిని గూర్చి శ్రీ దాసుగారికి గల పరిజ్ఞాన మపారము. వారకాంతలవలన నెంతటి సౌఖ్య మనుభవించినను వీరు తార్తీయపురుషార్థమును సర్వోత్తమముగా భావింపలేదు. ఇరువది యొకటవ సంవత్సరముతో స్త్రీ వ్యసనమును, ఇరువది యేడవ యేటితో గురుసేవా వ్యసనమును విసర్జించి వీరు నిర్మలులైనారు. వీరు స్త్రీ వ్యసనమునకు దమ్మిడీయైన వ్యయమొనర్పకపోవుట విశేషము.

శ్రీ దాసుగారి సద్యఃస్ఫూర్తికి, సంభాషణచతురతకు 'నా యెఱుక' యందు నిదర్శనములు సర్వత్ర గోచరించుచున్నవి. తమ సమ్మోహనరూపమును కాదని శివయోగినివలె నటించిన నరసన్నపేట వేశ్య నాకర్షించుటకు జావళిని విసరి లొంగదీయుట వీరి సద్యఃస్ఫూర్తి చేష్టలకొక నిదర్శనము. భీముడుగారి వేశ్యాశోధనవేళ నామె హృదయ రహస్యమును వెల్వరించుటకు "నా కడ విద్యనార్జించు శిష్యురాండ్రను కన్నబిడ్డలుగా చూచెదను" అని పల్కి, ఆమెచేత "నేను మీ శిష్యురాలను కాలేను సుండీ" అనిపించుట, గంగాధర రామా రాయణింగారు పారితోషికమిచ్చుచు 'సంతుష్టియేనా? అసంతుష్ట ద్విజోనష్టః' అన్నపుడు "సంతుష్ట ఇవ పార్థివః" అని గిలిగింతలు పెట్టించునట్లు, ఇతరులకంటె పైన అనుటయను తమ నైజగుణమును వెల్లడించునట్లు పలికి, అధిక గౌరవమును పొందుట మొదలైనవి సంభాషణ నైపుణ్యమునకు చిన్ని సాక్ష్యములు. "ఏమి హరికథలు వెధవ హరికథ" లని ఒకరన్నప్పుడు "పంతులుగారికి సహవాసబలము కాబోలు నెల్లపుడు విధవాస్మరణ చేయుచుందు" రనుట వంటి ఛలోక్తులు, శ్రీ దాసుగారి ప్రతిపక్ష ముఖపిధాన సమయస్ఫూర్తికి ఒక నిదర్శనము. "నయగారములు, నక్కటక్కులు, పలుపిచ్చువిద్యలు వెన్నతో బెట్టినరీతి నేర్చిన జాణలగు వేశ్యలను" కొలను విడిచి కొండను దిగివచ్చిన

కలహంసది తప్పుగాని కాకిది తప్పా!" అను రీతి మందహాస సుందరముగ పలికి లోగొని, దాసురాంద్ర గావించుకొను నేర్పునందు దాసుగారు కడుదక్షులు. వీరి సంభాషణయందలి పరిహాసచాతుర్యమునకు "శారద చంద్రికా!" యందు తప్పు పట్టిన శ్రేష్ఠిగారితో నొనర్చిన సంభాషణము నిదర్శనము. ఇట్టి సమయస్ఫూర్తి, సంభాషణ రాసిక్యములు శ్రీ దాసుగారికి విద్యాజైత్రయాత్రలందు ప్రముఖ సాధనములైనవి.

శ్రీ దాసుగారికి అపూర్వ వ్యక్తిత్వమును ఆర్జించియిచ్చిన విశేషములలో ప్రథమగణ్యములైనవి విజ్ఞాన పాండిత్యములు. 'నా యెఱుక' యందు "అంబాశబ్దమే నిశ్చయముగ "ఓమ్' అని పరిణమించెను. అంబా శబ్ద వివర్తరూపమే సర్వజగత్ప్రకృతి" ఇత్యాదిగా ప్రదర్శించిన యోజన వారి విజ్ఞానగంభీరత కొక చిన్న తార్కాణము. వారి సంగీత సాహిత్య వైదుష్యములు సహజసిద్ధములు. సచేతనములు. సృజనాత్మకములు, బహుముఖీనములు, నవనవోన్మేషములు. బహువిధమైన అంతస్తులతో గూడిన జన జీవితములతో పరిచయము గల శ్రీ దాసుగారి లోకజ్ఞత అతివిపులము నిశితము, గభీరము, ఇట్టి ప్రతిభావ్యుత్పన్నతలతో వారు, లోకమే విశాల కళాశాలగా, తామొక విశిష్ట సంచార విశ్వవిద్యాలయమై విద్యాప్రదాన ప్రబోధము లొనర్చి ధన్యులైనారు. శ్రీ దాసుగారు ద్రష్టలు, స్రష్టలు, ఉపదేష్టలు.

సంస్కృతాంధ్రాంగ్ల ఉర్దూ పార్శీ అరబ్బీ భాషాకోవిదులైన శ్రీ దాసుగారు, ఇంగ్లీషు తప్ప మిగిలిన భాషలనెల్ల స్వయంకృషితో నార్జించిరి. సంగీతము నందును వీరు గురుశుశ్రూష వలన సంపాదించిన దల్పము. కావుననే వారు "నా సంగీత సాహిత్యములు సహజసిద్ధము"లని నిస్సంకోచముగ ప్రకటించినారు. కుశాగ్రబుద్ధులైన శ్రీ దాసుగారికి పండిత పామర జనరంజనమునందు ఏకసంథాగ్రాహిత్వము ఎన్నియో రీతుల తోడ్పడినది. బాటసారి, ఉమర్ ఖయ్యాము వంటి కావ్యరచనలతోను, అనన్యసాధ్యమైన హరికథారచనలతోను అపూర్వ సాహిత్యస్రష్టలనిపించుకొనిన శ్రీ దాసుగారు, హరికథాకాలక్షేప వేళల ప్రహ్లాద నారద పరాశరాది మహాభక్త కోటిలోని వారన్న ప్రఖ్యాతిగడించినారు. ఔత్తరాహ, దాక్షిణాత్య సంగీత విద్వాంసులలో నెంతటివారినైన మెచ్చని శ్రీ దాసుగారు, పరమేశ్వరదత్తములైన శ్రుతిలయ త్రిస్థాయి గౌళగాత్రముతోను, అన్య్య లంచులనైన అందుకొనజాలని లయజ్ఞానముతోను సంగీత సభలలో అనన్వయా లంకారమునకు ప్రథమలక్ష్యముగ విలసిల్లినారు. సంగీత సాహిత్యములకు సమప్రాధాన్య మిచ్చుచు వీరు కావించిన నానావిధములగు అష్టావధానములు అన్యులకు దుర్ఘటములు. 1. రెండు పాదముల రెండు తాళములు, రెండు చేతుల రెండు తాళములు వేసి పల్లవి పాడుచు కోరిన జాగాకు కోరిన ముక్తాయిలు

వేయుట 2. ప్రాబ్లము మెంటల్‌గా సాల్వు చేయుట 3. నల్వురకు తెలుగున, నల్వురకు సంస్కృతమున కవిత్వము చెప్పుట. 4. వ్యస్తాక్షరి 5. న్యస్తాక్షరి 6. ఇంగ్లీషున కోరిన విషయముపై నుపన్యాసము 7. పూలు, గంటలు లెక్కించుట 8. ఛంద స్సంభాషణములతో గూడిన బందరు అష్టావధానము వంటి వానియందు శ్రీ దాసుగారు ప్రదర్శించిన ప్రజ్ఞకదియే సాటి. ఇవి అసాధ్యాష్టావధానములు. ఇట్టి విద్యా ప్రదర్శనములను తిలకించి పండిత ప్రకాండులు "ప్రపేదిరే ప్రాక్తన జన్మవిద్యా" అని ప్రశంసించుటలో ఆశ్చర్యమేమున్నది? శ్రీ నారాయణదాసుగారి స్వీయచరిత్రయైన "నా యెఱుక" వారి వ్యక్తిత్వమును సమగ్ర రూపమున ప్రదర్శించి, వారి జీవన్మూర్తిని పాఠకుల కనులకు కన్పట్టు నట్లొనర్చుటలో కడుశక్తిమంతమైనది.

## 6

"నా యెఱుక" యందు శ్రీ నారాయణదాసుగారు సందర్భోచితముగ 19వ శతాబ్ది చివరిపాదమందలి ఆంధ్రదేశస్థితిగతులను, ప్రజాజీవితమును ప్రదర్శించిరి. నాటి ప్రభువుల విద్యాపరీక్షణ కీర్తిప్రియత్వములను, ప్రజల అన్నదాన విద్యాదాన పోషణాదులను శ్రీ దాసుగారు వెల్లడించిరి. వైదిక విద్యార్థుల జీవితమును రుచి చూపించిరి. నాటి యజ్ఞ ప్రియులైన బ్రాహ్మణులు ఇష్టులు జరుపుకొనుచుండెడి వారు. నీటికరువు వచ్చినపుడు వారుణ జపములు చేయుట, గంగాష్టకము పఠించుచు బావులు త్రవ్వించుట, నృసింహజయంతి, ఏకాదశి మొదలైన పుణ్యదినములందు అభీష్ట దేవతామంత్రజపములు చేయుట వారి కాచారము. గుడుగుడు కుంచము. గుజ్జనగూళ్లవంటి ఆటలేకాక, కోతిపిట్ట, గోనెబిళ్ల, కిఱ్ఱు గానుగ వంటివి బాలుర క్రీడలు. ఆ నాడు నాచురంగు (వేశ్యల నాట్యప్రదర్శన) లను ప్రభువులు, ప్రజలు ఆదరించిరి. వేశ్యలు సంఘమునందు అంతర్భాగమై యున్నట్లును, విద్వాంసులకు అందు ముఖ్యముగ సంగీత విద్వాంసులకు, వారితో గాఢమైత్రి యున్నట్లు తెలియుచున్నది. విద్వాంసులు "గురుసేవ" (మద్యపదార్థ వినియోగము) యొనర్చెడి వారు. ఆంగ్లవిద్య క్రమక్రమముగా దేశమున పాదుకొనిపోవుచున్నది. శ్రీ నారాయణదాసుగారు మహీశూర రాష్ట్రమున స్త్రీలు పురుషులతో సమానస్వత్వములను వహించి విద్యాభ్యాస మొనర్చుటయును, స్వైరవిహారము లొనర్చుటయును గుర్తించిరి.

సంఘ గౌరవము ప్రభుత్వోద్యోగములను బట్టి కల్గుచుండెడిది. పంక్తి భోజనవేళల యందును గౌరవనిశ్రేణిక యీ క్రమముననే జమీందారీ ప్రాంతములందు

సాగుచుండెడిది. శ్రీ దాసుగారు "నా యెఱుక" యందు దాని నిట్లు తమ నైజమగు పరిహాసచతురతతో వెల్లడించినారు : "గవర్నమెంటు నౌకరు మొదట గౌరవనీయుడు. అందు క్రిమినల్ అధికారి శ్రేష్ఠుడు. సివిలు రెండవ రకము. మా వైపు భోజనము చేయువేళ షష్టుక్లాసు పంక్తిలో మొదటి విస్తరి డిప్యూటీ కలెక్టరుగారు తరువాత సిరస్తాదారుగారు తరువాత సబ్ మేజిస్ట్రేటుగారు తరువాత మునసబుగారు తరువాత ఇనస్పెక్టరుగారు తరువాత హెడ్ గుమాస్తాగారు తరువాత నాజరుగారు తరువాత ప్లీడరు తరువాత చిల్లర గుమాస్తాలు. రెండవ క్లాసు పంక్తిలో జీతమునుబట్టి తరగతిగా జమీందారీ యుద్యోగులు. మూడవక్లాసు పంక్తిలో స్కూలు మాష్టర్లు, పిదప దిక్కుమాలిన పంక్తిలో పండితులు, వైదికులు. కొట్టకొసకు గాయకులు, భిక్షుకులును."

శ్రీ దాసుగారు నాటిదేశీయ ప్రభువులు మొగదాళ్ళు త్రిప్పుట వంటి వ్యాయామ విశేషములు, బ్రాహ్మణుల భోజనపరాక్రమము, వేశ్యల కపట నటనాకౌశలములు మొదలగు విశేషములను, ఉచితభాషలో సందర్భానుసారముగ తమ ఆత్మకథ యందు నిబద్ధమొనర్చినారు.

శ్రీ నారాయణదాసుగారు ఐహిక ఆముష్మికములైన భారతీయ సాహిత్య గ్రంథములతోను, ఆధునిక సంస్కృతితోను గాఢపరిచయ మబ్బుటవలన నెలకొనిన ఉత్తమము, విపులమునైన దృక్పథము గలవారు. జీవహింస, అనృతములను పాపములంటనివారు. విహంగమన్యాయమున జీవింప నిశ్చయించుకొని కేవలము ఆత్మానందమునకై విద్యార్జన మొనర్చినవారు. తాత్కాలికదృష్టితో కాక నిత్య సౌఖ్యావహమైన నిర్మల చిత్తవృత్తితో తమ పరిసరములందలి సంఘమును గాఢముగ పరిశీలన యొనర్చినవారు. తాము దర్శించిన గుణదోషములను వెఱపెఱుగక వెల్లడించినవారు. శ్రీ దాసుగారు అతివిస్తృతమైన తమ యనుభవమును పురస్కరించుకొని బాల్యయౌవనములు, స్త్రీ పురుష విభేదములు, మిత్ర శత్రుత్వములు, సజ్జనత్వ దుర్జనత్వములు మొదలగు వానిని గూర్చిన పరిశీలనల నెన్నింటినో 'నా యెఱుక' యందు వెల్లడించినారు. శ్రీ దాసుగారు వెల్వరించిన భావములతో ఆధునికులు కొన్నిటితో నేకీభవింతురు. వర్ణవ్యవస్థ, స్త్రీ స్వాతంత్ర్యము, స్త్రీ పునర్వివాహము మొదలగు కొన్ని సందర్భములయందు ఆధునికులు వారిని ఛాందసులుగా పరిగణించెదరు.

"పురోడాశమును రుచిమరిగియే కాబోలు పున్నమల కమావాస్యలకు ఇష్టి జరుపుచుందురు. క్రిష్టియానిటీకి అన్యమతస్థులయెడ దయ లేదు. బ్రహ్మసమాజము

క్రిష్టియానిటీకి పెద్దప్ప; మహమ్మదానిజమునకు మేనత్త; లోకములో యోగులు, యోగినులు, హరిదాసులు, వేదాంతులు తఱచు సమయము తటస్థించువరకే ధూర్త బకములవలె ధ్యానమొనర్చెదరు. పిల్లి చాంద్రాయణమువలె కలికాలపు వైరాగ్యము నమ్మవాటము కాదు. త్రాగుబోతులందు మెట్టవేదాంతము క్షుద్రజనులలో దేవతావేశము తఱచుగ గోచరించును" – మొదలైనవి శ్రీ దాసుగారు మతములనుగూర్చి యొనర్చిన పరిశీలనలకు నిదర్శనములు. "తండ్రి వంక వారికంటె తల్లివంక వారెక్కువ ప్రేమింతురు. వెలబోటుల విశ్వాసము గగనారవిందము, పుణ్యాత్ములకు లాతివారి దోషములు కనిపింపవు. జూదము జరుగుతావున, తీర్థములందు, రైల్వే ప్లాటుఫారముల చెంత, వెలయాలియింటిలోను, మదిరాగృహములందు జనులకు త్యాగము మెండు. వ్యసనులు దయగల వారగుదురు. వ్యసనరహితు లెక్కడనో తప్ప గొడ్డువారివలె గార్హస్థ్యదూరులవలె కఠినాత్మ లయ్యెదరు" – మానవ స్వభావాదులను గూర్చి శ్రీ దాసుగారొనర్చిన పరిశీలనలలో ఇవి కొన్ని.

"తీయని పాట యమకింకరులను గూడ కరిగించు" నని సంగీతశక్తిని ప్రశంసించుచు పరిశీలన మొనర్చినను, శ్రీ దాసుగారు సంగీతమునకు గల దుష్టశక్తిని గూర్చి "సంగీతము మరగినవారు నిషాబాజులవలె మరెందుకు పనికిరారు. తలను మణిగల ఫణికి విషాభివృద్ధి సహజమగునట్లు సంగీత విద్యగలవారికి దుష్టవర్తనము స్వభావ సిద్ధము. సంగీతము వచ్చినవారిలో నిర్మలవర్తను లరుదగుటచేతనే గదా గాయకులపాత్రులని స్మృతులు తెల్పుచున్నవి. కులస్త్రీలకు సంగీతవిద్య మప్పరాదు" అని నిస్సంశయముగ భావించిరి. "విశాఖపట్టణములో పురుషులకు నీరసము, స్త్రీలకు పుష్టి నైజము. అరవలకు ధనలోభము, మర్కట చేష్టలు, కాపట్యము, మురికితనము, మోటరికము సహజములు" – ఇట్లు శ్రీ దాసుగారు తాము వసించిన నగరములను గూర్చియు, పరిచయము కలిగిన ప్రజలను గూర్చియు అభిమానింపక, జంకక, 'నా యెఱుక' యందు కొన్ని పరిశీలన లొనర్చిరి.

"అనాదిగా నున్న వర్ణభేదమును తొలగించుట, స్త్రీ పునర్వివాహప్రేరణము చింత్యము" లని శ్రీ దాసుగారి పరిశీలన. స్త్రీలు "ఉస్కోయన" ఉస్కోయనునట్లు పురుషునితో సమానముగ వర్తింపరాదనియు వారు యథాపూర్వకముగ నుండుటయే మేలనియు, స్త్రీ గృహలక్ష్మి రూపమున భర్త యోగక్షేమముల నరయుటయే ఎల్లలోకముల నుద్ధరించుట యనియు, తాత్పర్యమున 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' యనియు శ్రీ దాసుగారి పరిశీలనము. పురుషుడు మగయాడువాడు, స్త్రీ ఆడు మగది – అని నేటి

లైంగిక మనస్తత్త్వవేత్తలు (Sex-Psychologists) దర్శించి 'యూనిసెక్సు' అని వ్యవహరించుచున్న జీవ రహస్యమును, ప్రాణికోటియందలి 'యక్సు, వై' క్రోమోజోముల సంయోగ స్వరూపములు దర్శించిన ఆధునిక జీవ శాస్త్రజ్ఞుల (Biologists) పరిశీలనమును శ్రీ దాసుగారు ఎన్నడో గ్రహించుట ఆశ్చర్యకరమైన విశేషము!. "పరమపురుషుడు తప్ప పురుషుడు లేడు. చెరిసగము స్త్రీ పుంస్త్వములున్నవి. కనుకనే సంయోగాపేక్ష, నిండు మగవాడు శివునివలె కామశత్రువు" – ఇట్టి గభీరసత్యములను 'నా యెఱుక' యందు శ్రీ దాసుగారెన్నింటినో వెల్లడించినారు.

శ్రీ దాసుగారికి దేశమన్నను దేశీయ ప్రభువులన్నను, దేశీయ స్వాతంత్ర్య మన్నను అమిత గౌరవాభిమానము లున్నవి. 'గంధర్వమానవుడ' నని చెప్పుకొనుచు సంగీత సాహిత్యసభలతో కాలముగడుపుచున్నను, శ్రీ దాసుగారు దేశాభివృద్ధిని గూర్చి యోజనయొనర్పకపోలేదు. ఉద్యోగులైనవారు దేశీయ ప్రభువులును ప్రజాసంక్షేమ కరములైన కార్యకలాపము లొనర్చుటకు ప్రోత్సహించుటలేదని వారు ఆక్రోశించినారు. దేశీయులు వ్యవసాయము, వర్తకము అభివృద్ధి చేసికొనవలెగాని సాంఘిక సంస్కరణలపై దృష్టిని నిలిపి, కాలమును వ్యర్థపుచ్చరాదని వారి భావము. అందువలననే "శిరస్సు లేని మొండెమున కభ్యంగన మొనర్చినట్లు స్వాతంత్ర్యము లేని దేశమునకు సోషల్ కాన్ఫరెన్సు ఏలా? డాబులు చేయుటకు టప్పాలు కొట్టుకొనుటకు" అని శ్రీ దాసుగారు "నా యెఱుక" యందు అభిప్రాయపడిరి.

## 8

"నా యెఱుక" యందు శ్రీ దాసుగారి విషయకథనము, సన్నివేశ చిత్రణము, సంభాషణవిరచనము, వర్ణనాదులందు రసానుగుణము, ఔచిత్యశోభితమునైన సారవద్భాషను ప్రయోగించినారు. వీరి భాష ప్రసన్నమధురము చమత్కార విస్ఫురితము సూక్తి సుధావిలసితము. శ్రీ దాసుగారి శిష్టభాష ఎడనెడ వ్యంగమర్యాదలతో, ఆలంకారిక వైభవముతో విలసిల్లుచు "నా యెఱుక" కు కావ్యత్వమును సిద్ధింపజేయుటకు అధికముగ తోడ్పడినది. శ్రీ దాసుగారు అచ్చ తెనుగుపై ఇంచుక విశేషానురాగము కలవారైనను ఉచితజ్ఞులై, "నా యెఱుక" స్వీయచరిత్ర రచనమునందు తత్సమ ఆచ్ఛిక పద సంకలితమైన "ఆంధ్రభాష"పై మక్కువ వహించుట మెచ్చదగియున్నది. 'నా యెఱుక' యందలి భాష నుడికారపు సొంపులతో, జాతీయపుటింపులతో జీవవంతమై సాహిత్యలోకమునకు ఆదర్శముగ నొప్పియున్నది. శ్రీ దాసుగారి జీవితమువలెనే వారి శబ్దకోశము అతి విస్తృతము; సర్వతోముఖము; శక్తిమంతము; సంస్కృతీప్రదర్శకము.

వాక్య యోజనయందు వారు పోయిన పోకడలు అనంతములు.

సామాన్యుల రచననుండి కవిశేఖరుల రచనలను శృంగగ్రాహికగా పట్టిచూపునది వారి ఆలంకారిక భాష. కవివర్యులు విశేషముగ రూపకభాషపై (Metophorical language) మక్కువ చూపుచుందురు. శ్రీ దాసుగారు ఇట్టి భాషను నైజలక్షణముగ ప్రయోగించిరనుటకు "దొరగారు సంగీతకుఠారము; పెద్దయుజ్జీ నోడించుట సైంధవవధ; అక్కన్న మాదన్నగారలు వచ్చారండీ; నిమ్మకొయ్యజాతి గనక చొరవ మెండు; దాసుగారి పాట దేవదుందుభులు మ్రోగెను; నీవు గుడాకేశుడవయ్యా!; పేరన్న కత్తి; నేపల్ల" (చుఱుకైనవాడు, బరువు మోయువాడు) వంటి రూపకభాషా ప్రయోగములు నిదర్శనములు.

"ఏ యెండ కా గొడుగు పట్టనివాడు కష్టముల పాలగును గదా! పుణ్యాత్ములకు లాతి వారి దోషములు గన్పింపవు గదా! కొలను నుండి కొండకేగిన కలహంసది తప్పుగాని కాకిది తప్పా?" వంటి అర్థాంతరన్యాస నిదర్శనాలంకార శోభితమైన భాష శ్రీ దాసుగారి రచనకు కావ్యత్వమును కొంతగ కల్పించినది. ఇందలి తుదివాక్యము వ్యంగ్యోక్తికిని, చమత్కారమునకును నిదర్శన మగుచున్నది. "ఆకసమున తామరలు మొలుచునా?" వంటి నిదర్శనాలంకారములును వీరి రచనకు శోభ నిచ్చినవి.

"నా కండవాతజాడ్యము ననుగ్రహించిన వెలయాలు, గొట్టాలమ్మ (కలరా) వేంచేయు, ఏ పుణ్యాత్ముడో నా గావంచా కాజేసెను; విజయనగరమున హుక్కాసువాసన తప్ప మిగిలిన దెల్ల దుర్వాసన. అతడు నేర్పిన విద్య యెట్లున్నను మప్పిన చుట్ట శాశ్వతమాయెను. ఏకాక్షి త్రితయ (సబ్ మేజిస్ట్రేటు, అతని భార్య, అతని కుక్క) మొక్కచో ప్రోగయ్యెను" – మొదలైన ప్రయోగములు వ్యంగ్యచమత్కారయుతములై దాసుగారి పరిహాసచతురతకు సాక్ష్యములుగ నొప్పినవి. వారు క్లబ్బులో ప్రవేశించునపుడు "Love fifty" అను కేకలు వినిపించె ననుటయు, భీముడుగారి వేశ్యాశోధనము ముగిసిన పిమ్మట "నీతో పొందు చింత కాయ" అనియు, వైష్ణవమిత్రుల యింట పెద్దగురుసేవ చేయునపుడు "ముండదేవుడు కుదిర్చెను కదరా ముగ్గుర నొకమారు" అను పాటను కల్పించి పాడుటయు నిట్టి చమత్కార విశేషములే.

శ్రీ నారాయణదాసుగారి భాషయందలి వైశిష్ట్యము విశేషముగ వారి ఉపమాప్రయోగమునందు కన్పట్టుచున్నది. వారి ఉపమలలో నూటికి తొంబది పాళ్లు స్వోపజ్ఞములు. ఇవి బాహ్యాంతరికములైన విశాల ప్రపంచములను తమయం దిముడ్చుకొని శ్రీ దాసుగారి నిశిత భావనాశక్తిని, సంస్కృతీవిలసనను వెల్లడించుచు

“ఉపమా కాళిదాసస్య” అన్నట్లు “ఉపమా ఆదిభట్టస్య” అన నొప్పుచు రసజ్ఞ లోకమును గిలిగింతలు పెట్టజాలియున్నవి. “చదువు కోటాకు వేసిన గురుజుపిట్టలా తిరుగుట; దైవమువలె కూర్చున్న బ్రహ్మ (యజ్ఞమును చేయించువారిలో ముఖ్యుడు); పుణ్యపుంజము వలె భర్త చెంగట నున్న సోమిదేవి; ధవళమేఘములవలె ప్రేలు ప్రత్తిచేలు; వేదహిత ధర్మముల మాడ్కి నొడ్డు చేర్చు నోడలు; వంగ మూడికవలె పిలక ఝాడించు; కామేశము పంతులు సవారిడేగ వలె వచ్చెను; (భార్య మరణానంతరము పునర్వివాహమాడుట) రాత్రిపడ్డ గోతిలో మరల పడినట్లు; డబ్బిచ్చి తద్దినము గొనినట్లు; వదలిన పీడను తిరిగి తెచ్చుకొన్నట్లు; పెండ్లిపిల్లలు బొడ్డు కోకతో నెండురొయ్యవలె గన్పట్టిరి; నీరు మింటివఱ కుప్పొంగుటచే పండుగుల ముందు వెనుకల నున్న మనస్సువలె పడవ లాకున నున్నతమై పిదప మామూలు స్థితి వహించెను; పరపతి పోగొట్టు దబ్బరపల్కుల రీతి గాలిం గూడనీని తెఱచాపల ఛిద్రములు కేసు గెల్చుటకు వాదించు ప్లీడర్లవలె భోగేచ్ఛం బోరాడు వృషభంబులమాడ్కి నొండొరుల మీరి రాగ తానపల్లవుల బాడుచుంటిమి; సొరంగము నుండి రైలు బయటపడినపుడు కష్టముగడచినట్లు నిద్రమేల్కొన్నరీతి, రహస్యము నెఱిగినట్లు ననుభూతి నొందితిమి (భీముడు గారు తిరిగి మమ్మాదరించుటచే) క్రొత్త కుండలో జోరీగ చొచ్చినట్లైనది మా పని; వారింట భుజించి చెట్టువిడిచిన భూతమువలె తిరిగితిమి” – ఇట్టివి వారి సహజసిద్ధములైన ఉపమలకు అల్పనిదర్శనములు. శ్రీ దాసుగారి బాల్యదశ బరంపుర మద్రాసుపయాణాది వర్ణనలకు చిత్రవిచిత్రములు, బహుసంఖ్యాకములు నైన ఉపమలు ప్రాణపదములు. శ్రీ దాసుగారు “రూపాజీవలు శ్మశానకుసుమముల వలె వర్జనీయలు, పూలతావి మోసికొని వచ్చుటచేత సంతర్పణము తిన్న బ్రాహ్మణునివలె గాలులు మెల్లగ వీచుచున్నవి” – వంటి ఉపమలను పూర్వకవి గౌరవము వలనను, దేశాచారాభిమానము వలనను ఆదరింపకపోలేదు. పరిశీలింపగా ఔపమ్య, తర్క, న్యాయమూలాదులైన సర్వాలంకారములకు దాసుగారి ‘‘నా యెఱుక’’ యందు ఉదాహరణములు కన్పట్టకపోవు.

శ్రీ దాసుగారు ఆంధ్రజాతి సంస్కృతికి సుస్థిరసాక్ష్యములై యున్న సామెతల నెన్నింటినో ‘‘నా యెఱుక’’ యందు ప్రయోగించి, తమ రచనకు స్ఫూర్తిని చేకూర్చుకొనిరి. “నానాటికి తీసికట్లు నాగంభట్లు; జ్వరము తగిలి సందెకు దించినట్లు; దొంగిలింపబోయిన మంగలము దొరికినట్లు; దూదేకువారికి దుంపతెగులు; గ్రుద్దులాడుకొన్నగాని కులము బయటపడదు; చేయునవి మాఘస్నానములు దూరునవి దొమ్మరి గుడిసెలు; వినాయకుని చేయబోయిన; క్రోతియగు” – వంటి ప్రసిద్ధములైన

పెక్కు సామెతలను సందర్భోచితముగ, కులవర్గ పక్షపాతరహిత దృష్టితో శ్రీ దాసుగారు ఆదరించి ప్రయోగించినారు.

శ్రీ దాసుగారు బహుభాషా కోవిదులు. నేర్చిన భాషలన్నింటను వాని యందలి జాతీయ ప్రయోగ నైపుణ్యమును పుణికి పుచ్చుకొన్నవారు. చిన్ననాడే ''All his love - in him'' ను తరగతియందలి విద్యార్థులందరును పూరింపజాలనపుడు, ''Centred'' అని చెప్పి ''that is very learned'' అని ఆచార్యుని మెప్పుగొన్నవారు. అట్టి దాసుగారు "నా యెఱుక" యందు దేశీయములను, జాతీయములను కోకొల్లలుగ ప్రయోగించి, తమ రచనకు నిత్య తారుణ్యమును సంపాదించినారు. ఇందుకు "భరద్వాజవిందు, శృంగభంగము, కాష్ఠవాదము, కంకోష్ఠ పద్యము, శశవిషాణము, గగన కుసుమము, తిక్క శంకరయ్య, దాపుమూపు లెఱుగకపోవు, లెంపకాయ ఖర్చునకిచ్చు, వేలంవెఱ్ఱి గవ్వగ ఖర్చుపెట్టు, తొమ్మిదవ అర్థము పారాయణము చేయు, గురుడు పన్నెండింట నుండు, ఏకు మేకగు, బ్రహ్మానందమొందు" వంటి ప్రయోగములు కొన్ని నిదర్శనములు.

"నా యెఱుక" యందు శ్రీ దాసుగారు సహజత్వమును సంపాదించుటకై మాండలిక శబ్దములను బహుభాషలనుండి స్వీకరించిన శబ్ద జాలమును ప్రయోగించినారు. ఆంగ్ల భాషలనుండి వీరు ''College, Magistrate, Scoundrel, thanks వంటి ప్రత్యేక పదములనే గాక ''Vice-versa, Love fifty'' వంటి పదబంధములను, ''It lulled me to sleep'' వంటి వాక్యములను సైతము గ్రహించి ప్రయోగించినారు. ఆంగ్లభాషాశబ్దములతో "కంట్రీగురుడు" వంటి సమాసపదములను కల్పించుటకును వీరు వెనుదీయలేదు. వీరి రచనయందు "సీదా, రస్తా, జరూరు, కరారు, కైజారు, ఉమ్మేజువారి, నిషాబాజు, కావేషీ, నిసీబు, తైనాతు, నాజూకు, సాహెబు, ఫర్మాయించు" మొదలైన ఉర్దూ, పర్షియన్, అరబిక్ పదములు "నా యెఱుక" యందు అనంతముగ ప్రయుక్తములైనవి.

శ్రీ దాసుగారు "తుంబ, తరవాణి, వంతర, వాణము (బండి), మొత్తములు, పల్ల, (చేతి) రువ్వ, మదిని (వదినె), పెయ్యమ్మ (పెత్తల్లి), తోచ్చి (పినతల్లి), ఆచ (అన్న), చిట్టి (పినతండ్రి), గోర్జెలు, లంకె, మప్పు, చీరె (వస్త్రము)" వంటి మాండలిక పదములను "బ్రహ్మ, పురోడాశము, ఇష్టి" వంటి వృత్తి మాండలిక పదములను; బాణమిచ్చు (ఐదు రూపాయలు సంభావన యిచ్చు) గురుడు (నల్లమందు, గంజాయి, బ్రాందీవంటి మద్యపదార్థము), గోవిందుడు (సారాయి సీసా), వంటి సాంకేతిక

పదములను ఝుడితిస్ఫూర్తి నాసించి ప్రయోగించినారు. "దిబ్బ భడవ, గుంటడు, స్కౌంద్రలు, శుంఠలు (రసహీనులు)" వంటి తిట్లు సముచితముగ ప్రయోజితములైనవి. "నీ అమ్మకనులు మండ, గుంటడు" వంటి తిట్లు ప్రేమార్ద్రతను వెల్లడించుట యందును ఆంధ్రదేశాచారము ననుసరించి 'నా యెఱుక' లో ప్రయుక్తములయినవి.

శ్రీ దాసుగారు నైజముగ లక్షణవిరుద్ధమైన భాష నాదరింపని వారు, శిష్ట భాషాప్రియులు. సామాన్య, సంశ్లిష్ట, సంయోగవాక్యములను ఆవశ్యకత లెరిగి ప్రయోగింప నేర్చినవారు. చర్చకు వచ్చినపుడు క్త్వార్థకము భిన్నకర్తృకమై యుండుటకు నన్నయ పెద్దనలనుండి ప్రయోగములు చూపనేర్చిన వ్యాకరణ పాండిత్యము కలవారు. ఐనను వీరు లోకభాష నాదరించుటచే "శివకోవెల, భరద్వాజ విందు, సర్పుజెముడు, యుద్ధపుంజు" వంటి వైరి సమాసములు, "ముక్కోపి" – వంటి గ్రామ్య బహువ్రీహి. "పాటకుడు" (గాయకుడను నర్థములో దేశిశబ్దముపై సంస్కృత ప్రత్యయమును చేర్చుట), "అభినయకత్తె" (సంస్కృత శబ్దముపై తెలుగు ప్రత్యయమును చేర్చుట) "సభికులు" (జూదరులు సభ్యులను నర్థమున ప్రయోగించుట) – వంటి వ్యాకరణవిరుద్ధ పదప్రయోగములు "నా యెఱుక" యందు ఎడనెడ కన్పట్టుచున్నవి. ఇట్టివానిని వారాదరించుటకు వారి అనభిజ్ఞత హేతువనుకొనుట విజ్ఞత కానేరదు.

"నా యెఱుక" సర్వతోముఖముగ ప్రశంసింపదగిన ప్రథమాంధ్ర స్వీయచరిత్ర. అపూర్వాంధ్రమహాపురుషులై అనేక రంగములందు అనుపమ స్థానమును ఆర్జించుకొన్న శ్రీ ఆదిభట్లవారి ఆత్మకథయగు నిది, అనతికాలములో ముద్రితమై ఆంధ్రుల గౌరవానురాగములను చూరగొనుచు, అనేక ప్రయోజనములను ప్రసాదించుగాక!

*శ్రీ ఆదిభట్ల నారాయణదాసు గారి స్వీయ చరిత్ర*

*'నా యెఱుక' యొక్క పీఠిక – **1976** ముద్రితము*

# గేయరచనలు : ప్రాచీనులు - ఆధునికులు

నారాయణ భగవంతమ్
శివ
నారాయణ భగవంతమ్
గోసాయిల మాట
గొడ్డటి దెబ్బ
సాదుల మాట
సర్పము కాటు
నారాయణ భగవంతమ్
శివ
నారాయణ భగవంతమ్

భిక్షుక గీతం ఏది విన్నా, నాలుగేళ్ళనాడు నాగవరంలో నిద్ర లేచేటప్పటికి తన చేతులలో ఉన్న తాంబూరా మీటుతూ ధ్రువాగీతిలో బావాజీ పాడిన ఈ పాట మనస్సులో ప్రత్యక్షమవటం పరిపాటి ఐపోయింది. అంతకుముందు పాటలు, పదాలు విన్నాను. కానీ, నాకు ఆనాటినుంచే గేయసారస్వతం మీద గౌరవం, ఆదరాభిమానాలు, కృషిచేతామన్న అభిలాష పొడచూపినవి.

ఏ సాహిత్యంలోనైనా శ్రోతను గాని, పఠితనుగాని రస ప్రపంచయాత్ర చేయగలిగించేవి గేయరచనలే. రసికులను రంజింపజేయటానికి రమ్యమైన పదరచన ఉపయోగించినట్లు రసవంతమైనా పద్యం ఉపకరించదు. అవి లయతాళబద్ధాలుగా ఉండి గానకళతో సన్నిహిత సంబంధం కలిగి ఉండటమే దీనికి ప్రబల కారణము. ఒక దేశంలోని మత విపరిణామాలను, మనస్తత్త్వాలను, ఆచార వ్యవహారాలను, అన్యోన్య అనురాగాలను, సౌందర్య సౌభాగ్యాలను ప్రతిబింబిస్తూ దేశ జాతీయ దర్పణాలుగా ప్రవర్తిల్లడమే వీటిలో ఉన్న ఉత్కృష్టత. పరదేశీయ సాహిత్య ప్రభావం వల్ల, పాండితీ ప్రకర్షాభిలాష వల్ల, ప్రౌఢోక్తులవల్ల, పద్యసారస్వతము దేశీయతను, జాతీయతను విరివిగా వెల్లడించలేదు. ఆంధ్రభాషలో ఏదైనా వ్యక్తిత్వము, జాతీయత

కలిగిన రసవంతమైన కవిత ఉన్నదా అంటే అది పద వాఙ్మయములోనే ఉన్నదని నా అభిప్రాయము.

శ్రీనాథునికి అంటగట్టబడ్డ అపవాదాన్ని ఆధారం చేసుకొని ప్రతివ్యక్తీ పదకర్తలను, కృతులను నిందించటానికి సాహసిస్తారు. విదేశీయ సాహితిలో అభివృద్ధి నొందినట్లు పదవాఙ్మయం అందువల్లనే మన సాహిత్యంలో ప్రవర్ధమానం కాలేదు. ఉన్నదాని మీద ఆదరము శూన్యముగా ఉన్నది. సంస్కృత భాషలో కృష్ణకర్ణామృతము, భజగోవిందశ్లోకాలు, అష్టపదులు అనుభవించే ఆదర్శపూజ్యత ఆంధ్రంలో ఒక గేయకృతికైనా లేదు. వంగభాషలో చండీదాసు, విద్యాపతి, రామమణి, గోవిందదాసు మొదలైన పదకర్తలను మహాకవులుగా పరిగణిస్తారు. హిందీ భాషలోని నూరు పదావళీ కబీరు కీర్తనలకు ఆదర్శపూజ్యత. తుకారాం, మీరాబాయి మొదలైన కృతికర్తల మహారాష్ట్ర అభంగాదులకు అత్యంత ప్రతిష్ఠ. ప్రపంచ విఖ్యాతిని చూరగొన్న రవీంద్రుని రచనలలో ముప్పాతికవంతు పదాలే.

సంతోషం కలిగినప్పుడు ప్రథమ మానవుడు చిందులు వేస్తూ కూనరాగా లాపనముతో సామాన్య పదకవిత్వము ప్రారంభిస్తాడు గాని, సంస్కృతపదభూయిష్ఠమైన పద్యకవిత్వం మొదలు పెట్టడు. అందువల్లనే సాహిత్యవేత్తలు పద్యంకన్నా పదమే మొదట ఏ సారస్వతంలోనైనా ఉద్భవిస్తుందనటంలో ఏకీభవించారు. అదే విధిగా మన భాషలోనూ ప్రథమంలో పదసాహిత్యము జన్మించి ఉంటుంది. ఆదిగ్రంథమైన భారతానికి పూర్వం పుట్టిన గేయకృతులన్నీ, పాండితీప్రభ సాగే రోజులో రూపుమాసి పోతూ జనసామాన్య గౌరవం పొందుతూ, భిక్షుక గీతాల్లోను, భక్తుల గేయాల్లోను, స్త్రీల సారస్వతములోను, సాములయ్యల గరిడీలలోను, తమ ప్రాణము నిలుపుకొంటూ వచ్చినవి. కాని పదఛందస్సులైన 'తరువోజ', 'మధ్యాక్కరలు' ప్రథమ కావ్యంతో పరిచయము కలిగించుకోగలిగినవి.

ఒక శతాబ్ద కాలము మళ్ళా పదవాఙ్మయ చరిత్ర అజ్ఞాతంగా ఉన్నది. ఇంతలో వీర శైవమత విజృంభణము దక్షిణాపథాన్నంతా కలవరపరచినది. దాక్షిణాత్య భాష లన్నిటిలోను ముఖ్యంగా కన్నడ, తెలుగు సారస్వతాలలో దేశీయ కవిత్వము మొదలు పెడుతుంది. మత ప్రాబల్యానికి సామాన్య భాషలో గ్రంథరచనము అవసరమని ఆ నాటి మత ప్రవక్తలు గుర్తించారు, ఈ మత ప్రాబల్య ఫలితాలే పాల్కురికి సోమనాథుని 'పండితారాధ్య చరిత్ర', 'బసవపురాణ' ద్విపదలు. ఈ శతాబ్దిలో పదవాఙ్మయము పండిత పామర జనానుమోదమైన పలుకుబడి సంపాదించుకున్నది. అందువల్లనే

ఈ కాలంలో పద్యకవిత్వము కనిపించటం లేదు. సోమనకు పూర్వమున్న గేయ కవితాస్వరూపము మనకు బసవపురాణములోని –

'కర మర్థి నూరూర సిరియాళ చరిత
పాటలుగా గట్టి పాడెడువారు
అటుగాక సాంగభాషాంగ క్రియాంగ
పటునాటకంబులు నటియించువారు'

అనీ, పండితారాధ్య చరిత్రలోని శ్రీశైల వర్ణన సందర్భములో –

'మది నుబ్బి సంసార మాయాస్తవంబు
పదములు, పర్వతపదము లానంద
పదములు, శంకర పదముల్ నివాళి
పదములు, వాలేశుపదములు, గొబ్బి
పదములు, వెన్నెల పదములు, సెజ్జ
వర్ణన మణిగణ వర్ణన పదము
లర్ణవ ఘోషణ ఘూర్ణిల్లుచుండ'

భక్తులు శ్రీశైల పర్వతారోహణ చేశారని చెప్పే రెండు ద్విపదలవల్లా తెలుస్తుంది. తెలుగులో దేశీయ నాటకములు కూడా ఈ రోజులలోనే సదస్సును సంతోషపరచి ఉంటవి.

పదకవితల ప్రభావము తరువాత కవులమీద చాలమట్టుకు కనిపిస్తుంది. మొదట సంప్రదాయాలు కాని ఛందస్సులను – రగడలు, షట్పదులు, చౌపదులు, ద్విపదలు, – పురాణ ప్రబంధ కవులు ఆమోదించి కృతియోగ్యాలుగా స్వీకరించారు. జాను తెనుగు ప్రభావ ప్రవాహానికి ఎదురీదటానికి నన్నెచోడ తిక్కనలు గూడా సాహసించలేదు.

వీరశైవ మత విజృంభణము నెమ్మదిగా వెనుకదారిపట్టి, హరిహరనాథాత్మకమైన అద్వైత సిద్ధాంతము మీదికి దేశంలో అభిమానం ప్రబలింది కొంతకాలానికి. అప్పుడు నాచన సోముడు ఉత్తర హరివంశమే కాకుండా, 'వసంత విలాస'మనే గోష్ఠీ విషయక ఏకాశ్వాస ప్రబంధము రచన చేశాడు. తెలుగు తోటలో ఉపలబ్ధ మౌతూ ఉన్న ప్రథమ గేయసుమము మనకు ఆ కావ్యంలో కనిపిస్తుంది. అది –

'వీణాగానం వెన్నెలతేట
రాణమీరగా రమణుల పాట
పేరుచెప్పిన పినబ్రాహ్మణు వీట
జాణలు మెత్తురు జాజరపాట'

అనేది. జాజర అనేది ఏదైనా వాద్యవిశేషమా? లేక పదభేదమా?

కవిసార్వభౌముడు శ్రీనాథుని జీవితకాలానికి పదఛందస్సులను కావ్యార్హత ప్రస్ఫుటమైనది. ద్విపదలో సోమన రచనలు అంతకుపూర్వమే ఉన్నా, అవి మతవిషయిక పురాణాలు కాని రసవత్కావ్యాలు కావు. ఈ యుగంలోనే శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర, గౌరన హరిశ్చంద్రోపాఖ్యానము, నవనాథ చరిత్ర ద్విపదలు.

శ్రీనాథుడు పదకవిత్వాన్ని
'ముదివిటులు వెధవలంజలు
పదకవితలు (?) మాఱుబాపన వార
ల్చదువని పండితవర్యులు
కదనాస్థిర వీరవరులు కడిదిపురమునన్"

అనే పద్యంలో పలుచగా చూచాడని అంటారు. హాస్యరస ప్రధానమైన మోటు చమత్కారాలు. మొరటుతిట్లు నెత్తిన వేయించుకోవటానికి తెలుగు సారస్వతంలో తెనాలి రామలింగడు, శ్రీనాథుడు, ఏ అన్నెం పున్నెం ఎరక్కపోయినా, అసభ్య రసిక లోకానికి చిక్కుతారు.అతడు గేయరచనలు నిజంగా నిరసించినట్లైతే ఆ దేశీయ ఛందస్సులో పల్నాటి వీరచరిత్రను ఎందుకు వ్రాస్తాడు? శ్రీనాథునికి పదకవితలంటే ఎంతో ఇష్టం అనటానికి ప్రబలప్రమాణాలు ఇంకా ఉన్నాయి. భీమఖండంలో దక్షారామాన్ని వర్ణిస్తూ

'కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి'

అని జనసామాన్య గేయ ప్రబంధాకృతిని ఉల్లేఖిస్తాడు. ఇతని పోషకులైన రెడ్డి రాజన్యులకు మహేశ్వరునికి వసంతాభిషేకము చేయటము అలవాటు. ఆ సమయంలో స్త్రీలు వల్లకి, చక్కి, కాహళము, వంశము, డక్క, హుడుక్కు, ఝల్లరి మొదలైన వాద్యవిశేషాలతో పదాలు పాడుతూ నర్తనం చేసేవారని భీమఖండంలోనే –

'వల్లకి చక్కి కాహళము
వంశము డక్క హుడుక్కు ఝుర్ఝురుల్
ఝల్లరి యాదిగా గలుగు
శబ్దపరంపర తాళశబ్దమై
యుల్లసిలం బ్రబంధముల
నొప్పుగ నాడుదు రుగ్రవేదిపైఁ
బల్లవపాణు లీశ్వరుని
పంటమహీశులు పూజసేయగన్'

అని వర్ణిస్తాడు. అటువంటి శ్రీనాథుడేమిటి, పదసారస్వతాన్ని పరిహసించటము ఏమిటి?

దిగ్విజయార్థము బయలు దేరుదామనుకున్న కృష్ణరాయలకు అపరిమితోత్తేజము కలిగించిన ఆ నాటి జానపదుని –

కొండవీడు మనదేరా!
కొండపల్లి మనదేరా!
కాదను వాడుంటే
కటకం దాకా మనదేరా!

అనే గేయం ఆంధ్రలోకానికి అపరిచితం కాదు. ప్రబంధ యుగంలో ప్రత్యేక గేయరచనలు వెనుకపడ్డా, పుష్పాపచయాలలో పద ఛందస్సులు కనిపిస్తున్నాయి. ప్రబంధ నాయికలకు పదసారస్వత మంటే పరమానందము కూడాను.

నాయకరాజుల పరిపాలనకాలంలో మళ్ళా పదకర్తలు తల ఎత్తారు. పద్య కవులతో సమానగౌరవం లభించింది. ఎన్నో యక్షగానాలు ఉద్భవించినవి. రంగాజీ, రామభద్రాంబ, కృష్ణాజీ మొదలైన కవయిత్రులు పదరచనల్లో పాల్గొన్నారు. విజయరాఘవ నాయకుడు క్షేత్రయ్య, తదితర వాగ్గేయకారాగ్రగణ్యులను పోషించటమే కాకుండా, ఎన్నో చౌపదులు, ద్విపదలు, యక్షగానములు రచించాడు. ఈతని కాలినడకలనే అనుసరించి మహారాష్ట్ర నాయకులలో ప్రముఖులైన శాహజీ ప్రభృతులు పదసారస్వతసేవ చేశారు.

ప్రబంధయుగంలో పదరచనలు చేయటానికి దడిచినట్లు పండితకవులు పోయిన రెండు శతాబ్దులలో వెనుదీయలేదు. ఎలకూచి బాలసరస్వతి, కంకంటి పాపరాజు,

కందుకూరి రుద్రయ్య, గోగులపాటి కూర్మనాథకవి, ఆలూరి కుప్పన మొదలైన పండిత కవులు, జంకు లేకుండా ప్రజాసాహిత్యాభివృద్ధికి ప్రౌఢయక్షగాన కృతులు రచించి పేరుతెచ్చుకున్నారు.

ఇరవయ్యో శతాబ్ది ప్రథమదశలో గేయరచనలకు గౌరవం తగ్గింది. ఇప్పుడిప్పుడే ఆధునికుల అపార శ్రమ, అప్రతిమాన ప్రతిభ వల్ల ప్రతిష్ఠ సుస్థిరమైనది.

మన ప్రాచీన గేయవాఙ్మయాన్నంతా కొన్ని ముఖ్యశాఖలుగా విభజనలు చేయవచ్చు.

అవి జానపదుల పదకవిత, మతవేదాంత భక్తి రచనలు, జావళీలు, స్త్రీల సారస్వతము.

**జానపదుల పదకవిత :** కర్షక గీతాలు, దంపుళ్ళ పాటలు, బండిపాటలు, పడవపదాలు, పల్లీజన ప్రేమగీతాలు, జంగం పాటలు, ఏలపదములు, చందమామ పదములు, నూరుపుళ్ళ పాటలు, మొదలైనవన్నీ జానపద వాఙ్మయం క్రిందికే వస్తవి. స్వచ్ఛందభావము, నిరలంకారత, సమాజకవితాపటిమ, జాతీయత, రసపుష్టి వీటిలో ఉన్నంతగా నాగరిక కవితలో కనుపించదు.

ఏరుమీద ఆధారపడే కర్షకులకు ఏరువాక ఒక వరవడిదినం ఆబాలగోపాలము ఆనందంలో పొంగిపోతారు. నూతన పరికరాలను సేకరించుకొని ఏరు ఎప్పుడు వస్తుందా ఎదవేద్దామని కాచుకొని, స్వాతివానకు ముత్యపుచిప్పలలాగా నోరు తెరచుకొని కూర్చున్న రైతులకు, ఏరు రాగానే హృదయం పొంగి సహజకవిత ఉద్భవిస్తుంది.

ఏమని

'ఏరు వాకొచ్చింది ఏరు వాకమ్మ
ఏళ్ళు నదులూ పొంగి వెంబడే వచ్చాయి
నల్లమేఘాలలో నాట్యమాడింది
కొండ గుట్టలమీద కులుకులాడింది
ఇసుక నదిలో దూరి బుసలు కొట్టింది
పాడుతూ కోయిలా పరువులెత్తింది
ఆడుతూ నెమిలి అలసిపోయింది
నవ్వుతూ మా అయ్య బువ్వతిన్నాడు' అని.

జానపదులకు కవిత కష్టాలకూ వస్తుంది, సుఖాలకు వస్తుంది. ప్రవాస దుఃఖము అనుభవిస్తూ ఉన్న పల్లెపడుచు ఏరురావాలనీ, వస్తే బావ వచ్చి లాలిస్తాడని తొలకరినుంచే వెర్రితలపులు తలచుకుంటూ పాట పాడుకుంటుంది.

'తొలకరి ఒక మబ్బు తొంగి చూచింది
మబ్బులో ఒక మెరుపు మెరసిపోయింది
పెరటిలో ఒక జల్లు కురిసి వెలిసింది
జల్లులో నా మనసు జారిపోయింది
ఏ కొమ్మ మీదనో ఎండ తాకిన పిట్ట
ఏటి త్రోవలు పట్టి ఎగిరిపోయింది
ఏరువాక నాటి కేడాది దాటింది
ఎదురు చూచి గుండె చెదిరిపోయింది
పిట్ట పిట్టా ముద్దు పెట్టుకున్నాయి
గోవులన్నీ ఇల్లు చేరుకున్నాయి
ఏటిగాలికి చిలుక లెగిరిపోయాయి
ఎందుకో నా ఆశ లెగిరిపోయాయి
ఏటి ఒడ్డున నేను పాట పాడేవేళ
నవ్వుతూ మా బావ పువ్వులేరేవేళ
కొంటె కోయిలపైన కూతకూసేవేళ
లేతమనసులు విచ్చి పూత పూసేవేళ
బావొచ్చి నాతోటి బాసలాడాలి
ముద్దొచ్చి నాతోటి మురిసిపోవాలి
ఏరువాకమ్మ మా కెదురు రావాలి
తలవంచి మము చూచి దీవించి పోవాలి'

ఎంత ప్రకృతి సిద్ధ భావౌన్నత్యము! సౌకుమార్యం! ఇటువంటి పల్లీజన ప్రేమ "వెంకయ్య – చంద్రమ్మ" పాటలో ప్రదర్శితమౌతుంది.

'తెలిచందమామలో తియ్యపానకముంది
తెచ్చి పెడుదువు గాని రారో రెంకయ్య!'

అన్నప్పుడు చంద్రమ్మ అమాయకత్వమూ,

'రావి చెట్టెక్కేవు రాగాలు తీసేవు
రాలి పోతవు గండుకొడుకో రెంకయ్య'

అన్నప్పుడు ఆమె హృదయారాటము బహిర్గత మౌతున్నవి. ప్రియునితో సరస సల్లాపాలకు ఏకాంత ప్రదేశం అభిలషిస్తూ ఒక పల్లెపడుచు,

"సముద్రాలు దాటి పోతే
సక్కనైనా తోపులుండై
సల్లగా ఆ చెట్టు నీడల
సరస మాడుదమా! మామా
తాలి పోవుదమా?"

అని అంటుంది. ప్రబంధ నాయికానాయకులకు వంద పద్యాల వర్ణన పట్టే వనం ఉంటేగాని సల్లాపాలు సాగవు. 'చల్ మోహనరంగా' పాట గూడా నవరసోపేతమైన ప్రణయగాథ. పదవాఙ్మయములో ఆ పాట విని ఏ రసజ్ఞుడు ముగ్ధుఁడై పోడు?

కరుణప్రధానాలైన కమ్మని పదాలు భిక్షుకుల నోట్లో తాండవిస్తూ ఉన్నాయి. ముష్టిమనిషి చంకన జోలెలో పసిపిల్లను వేసుకొని ఇంటింటిదగ్గిరా –

"జోడుకొండల నడుమ నినుగంటి తండ్రి
ఏడువకు ఏడువకు వెర్రి అబ్బాయి
ఏడిస్తె నిన్నెవరు ఎత్తుకుంటారు?
చెట్లె చుట్టాలు మరి రాళ్లె దేవుళ్ళు"

అని పాడుకుంటూ తన జీవనాధారం చూసుకుంటుంది. అది పాడేటంత సేపూ మనకు వనాంతరాల్లో వనితామణి సీత పసిపిల్లవాణ్ణి సముదాయించలేక పడే పాట్లు జ్ఞప్తికి వస్తాయి.

ఏదో ఒక పదం పాడుతూ పనిచేసుకోవటము పల్లెవాసులకు పరమానందం. దంపుతూ ఉంటే చూచాను.

"సువ్వని నేనొక్క పోటేసితేను
చుక్కల్లు పిక్కటిలు సూరన్న కదలు

అన్నని నేనొక్క పోటేసితేను
ఆకసము తల్లడిల్లు ఆరాము గదలు"

అని పాడుతూ ఉంటారు.

పాములవాడు కాటుకు మందు వేయబోతూ –

'దిగు దిగు నాగన్న, దివ్యసుందరనాగ!
నిండుపున్నమనాడు పండు వెన్నెల గాచు
స్వల్ప గ్రహణం నాడు చందమామను మ్రింగు
దిగు దిగునాగన్న దివ్యసుందర నాగ!
దిగకున్న మంత్రాన దింపించుతానురా
నాగ దిగురా నాగన్న దిగరా నాగా దిగర'

అని పదంపాడి ఏదో మూలిక వేసి సర్పదష్టుడైన సామాన్యజీవికి ప్రాణం పోసి పంపిచేస్తాడు. ఇటువంటి జానపదసారస్వతాన్నంతటనీ సేకరించి గ్రంథస్థం చేయటము ఆంధ్రుల కర్తవ్యము.

మతవేదాంత భక్తి రచనలు లెక్కకు మీరి మన భాషలో ఉన్నవి. మన దేశపు మత విపరిణామ చరిత్రకు పట్టుకొమ్మలు అవే. వీరశైవమత విజృంభణ కాలంలో

"శివ శివ యన మేలు తుమ్మెదా – శివ
యంటేను వినమేలు తుమ్మెదా
శరణన్న మేలె ఓ తుమ్మెదా
శ్రీకంఠుడును పువ్వు తుమ్మెదా
మూడులోకము లాయెనే తుమ్మెదా –
పరమైకాంతమును జూడు తుమ్మెదా"

అనే పదం పాడేవారు భక్తులు. ఈ తుమ్మెదపదంలో అన్యాపదేశము, వ్యంగ్యత మూర్తీభవించాయి. సాధారణంగా వేదాంతపదకర్తల రచనాధోరణి ఇదేవిధంగా ఉంటుంది.

ఆంధ్రజ్ఞానులలో ప్రత్యేక వ్యక్తిత్వం కలవాడు వేమన. తత్త్వోపదేశం జాను తెనుగులో నూరిపోసి మధుర కవులలో తన పేరుకు చిరస్థాయిత్వం కల్పించుకున్నాడు. ఆ నాటి మతాచారాలతోను, వేదాంత మార్గంతోను విసుగు జెంది,

"జాతర జాతర జాతర సుమ్మీ
జాతరతీతుడు వేమన సుమ్మీ
వేదాతీతుడు వేమన సుమ్మీ
వేమన చెప్పిన వేదము సుమ్మీ
వేదశాస్త్రములు వాదులు సుమ్మీ
వాదుల నోళ్ళకు బూదిడు సుమ్మీ
కన్నవారు మరి చెప్పరు సుమ్మీ
చెప్పిన నెవ్వరు చేయరు సుమ్మీ
చేసినవారే సిద్ధులు సుమ్మీ
సిద్ధులమాట ప్రసిద్ధము సుమ్మీ"

అనే గేయంలో ఉద్ఘోషించాడు. బాపనయ్య, నందమయ్య, వీరబ్రహ్మ యోగి మొదలైన జనసామాన్య వేదాంతుల రచనలన్నీ ఎంతో తీపిగా ఉంటాయి. ఇంత వరకూ ఈ గీతాలకు బైరాగుల నోళ్ళలోనే నివాసం.

'పంచదశి' సారాన్ని అంత చిన్న ఉయ్యాలపదంలో పెట్టిన బాపనయ్య –

'ఓం నమశ్శివాయ ఆరక్షరముల తొట్టి
ఆరంభమాయెనే ఉయ్యాలా ॥
రక్షకుడు చిన్మయా తొట్టిలోపల తాను
ఊగుతూ ఉన్నాడు ఉయ్యాలా ॥'

అనే ఉయ్యేలపదం పూర్వసువాసినులు పాడుతూ ఉంటే, ఎందుకో మన ఒళ్ళు పులకరిస్తుంది. ఇటువంటిదే –

తొలుత బ్రహ్మాండంబు
తొట్టి గావించీ
నాలుగూ వేదములు
గొలుసు లమరించీ ॥ ॥జో అచ్యుతా॥

అనే వేదాంత ప్రతిపాదక పదము.

ఈ శ్రేణికి చేరిన తోట నరసింహదాసు – వేదాంతి రామదాసు శతకములో ఛందస్సులో క్రొత్తకల్పన చేశాడు చూడండి.

'మాయచీకటి కోనలో
కొన్నాళ్ళు
మార్గంబు గానరాక
యే యుపాయంబు గానక
జన్మముల
నెత్తితిని రామరామ!'

ఆంధ్రభక్తులలో త్యాగయ్యది అగ్రతాంబూలం. వాగ్గేయకారాగ్రణి, వ్రాసిన ఛందస్సులో వ్రాయకుండా రెండువేల కృతులకు పైగా రచన చేశాడు. భక్తిరస ప్రధానమైన ఈతని కృతులకు సారస్వతగౌరవం లేకపోవుట శోచనీయము. అసలు కవిగా కూడా లెక్కలోకి రాడంటారు మనవాళ్ళు. త్యాగయ్య కవి ఐనదీ, కానిదీ ఈ క్రింది భాషాంతరీకరణాలు పరిశీలిస్తే తెలుస్తుంది

"O the breath of my life!
The fruit of my choice!
Though king of kings!
O, the light of my vision!
My rose's perfume!
The flowers of my worship!
I bow to thee.
Tell me, lord, this secret
Does the babe go to the mother.
or the mother fondly runs to the crying babe?
Does the cow follow licking her tender calf?
Does the crop follow the cloud
Or the cloud descends to tend the crop?
Does the sweet heart follow the lover
Or the lover follows closely in her foot-steps?
Tell me the secret, Lord,
And show me thy face."

భాషాంతరీకరణము చదివిన ఇతర సాహిత్యవేత్తలు, త్యాగయ్యను మనము కవిగా పరిగణింపకపోతే రమ్యావలోకన చేయలేమని నిరసిస్తారన్నమాట మన వాళ్ళింకా గ్రహించలేదు. ఇతనిని అరవవారికి అరణమిచ్చామే, ఎల్లా తీసుకుందామా అని సంశయిస్తున్నారా?

జావళీలన్నీ శృంగార రసప్రధానమైన పదసారస్వతం క్రిందికి వస్తాయి.

'రేపు వత్తువుగాని తూరుపు తెల్లవారెపోరా ఈ వేళకు' అనే జావళి

'చెరగుమాసె ఏమి సేతురా,
దరిజేరగనైన వీలుకాదురా'

అనే జావళీ సంభోగ శృంగారాన్ని సూచిస్తున్నా వాటి కూర్పులో గొప్పదనం, భావనలో ఔచితీ కనిపిస్తవి.

పదసంయోజనంలోను, భావవైఖరిలోనూ, విన్యాసక్రమంలోనూ తనతో ఏ పదకర్తా పోలలేకుండా పదకృతులు చేసిన క్షేత్రయ్యలో, నవీనులు అందుకోలేని రమ్యత కనిపిస్తుంది. శృంగారనాయికలు ఎన్నెన్ని రకాలో అన్ని రకాల పదాలు మువ్వగోపాలుని మీద రచించాడు. ఏ పదము తీసినా ఆధునిక భావచైతన్యము స్ఫురిస్తుంది.

**ఉదాహృతి**

మగువ ఏకాంతమందిరము వెడలెన్
వగకాడ, మా కంచివరద! తెల్లవారె నను చు ॥ మగువ ॥

విడగారు గొజ్జంగి విరిదండ జడతోను
కడుచిక్కుబడి పెనగు కంఠసరితోను
నిడుదకన్నులదేరు నిడుదమబ్బులతోను
తొడరి పదయుగమున దడబడెడు నడతోను ॥ మగువ ॥

సొగసి సొలయని యలపు సొలపు జూపులతోను
వగవగల ఘనసారవాసనలతోను
జిగి మించు కెమ్మోవి చిగురు కెంపులతోను
సగము కుచముల విదియచందురులతోను ॥ మగువ ॥

తరితీపు సేయు సమసురతిబడలికతోను
జరతపాపడ చెరగు జార్చైటతోను
ఇరుగడల కైదండ లిచ్చు తరుణులతోను
పరమాత్మ, మువ్వగోపాల! తెల్లవారె ననుచు ॥ మగువ ॥

భావకవిత్వమేదో ఈతనితో పుట్టినట్లుందే? స్త్రీల సారస్వతములో ఇది ఉన్నది, ఇది లేదనటానికి వీలులేదు. సర్వశాస్త్రాలు, పురాణాలు, ఉపాఖ్యానాలు, ప్రాచీనులు ప్రత్యేకంగా స్త్రీలకోసం పదాలుగా రచన చేశారు. కుసలాయకము, కుచ్చెలకథలు, సీతసురటి, గంగాగౌరీ సంవాదము; లంకాయాగం, లక్ష్మణ దేవరనవ్వు – కోవెల రాయబారము, చిలుక రాయబారము – ఎన్నో పాటల పుస్తకాలు ముద్రితమై ఉన్నాయి. వీటిని గురించి వ్రాయడం ప్రత్యేకంగా పెట్టుకోవలసిన పని.

పదకర్తలకు ఉపకరించే ఛందస్సులు తరువోజ, రగడలు, ద్విపదలు, మంజరులు, ముత్యాల సరాలు, మధ్యాక్కరలు మొదలైన జాతీయఛందస్సులు. అంతమాత్రంతోటే కొన్ని కృతులు వృత్తాలుగా ఉండవనటానికి వీలు లేదు.

'చింతచెట్టు చిగురు చూడు
చిన్నదాని షోకు చూడు'

అనే పదాన్ని విభజిస్తే సుగంధివృత్తమౌతుంది. ఇవన్నీ ఇంచుమించు మాత్రాఛందస్సులు, గురజాడ అప్పారావుగారు చేపట్టిన నాటినుండీ వీటికి మళ్ళా ప్రాణప్రతిష్ఠ కలిగింది. ఆధునికులు నూతన ఛందస్సులను సృష్టి చేసి కావ్యరచన చేస్తున్నారనే అభిప్రాయం ప్రబలింది. కాని అది అపోహ. అన్నీ పూర్వకవి ప్రయుక్తాలే. ముత్యాల సరమనే పేరు క్రొత్తదైనా ఆ ఛందస్సు పూర్వ సాహిత్య ప్రసిద్ధమే. గోకులపాటి కూర్మనాథకవి మృత్యుంజయ యక్షగానంలో హిమవన్నగాన్ని వర్ణిస్తూ ఇదే ఛందస్సు ఉపయోగించాడు చూడండి.

'సాలతాల తమాలతిలక ర
సాలకురవక కుందవిచికిల
మాలతీసుమ ఫలము లందున
జాలగా నమరున్.

కమ్ము కస్తురి కల్కి తావుల
గ్రమ్ము జవ్వాజి యను తుహిన జ

లమ్ము కప్పురమందు నెప్పుడు
నిమ్ములను మీరున్."

కృతియోగ్యానుసారంగా నూతన ఛందస్సులను ఆధునికులు కల్పించుకుంటే మాత్రము ఏమి మునిగిపోతుంది?

పురాతన ఛందస్సంప్రదాయానుసారంగా గేయకృతులను రచించినా, ఈ నాటి పదకర్తల మీద, వారి రచనల మీద అకారణంగా నిరసన భావము చూపిస్తున్నారు. అటువంటి వారికి ప్రాకృతకవితపట్ల ఆ నాటి సాంస్కృతికుల మనుకొనేవారు అసహనము చూపించినప్పుడు, జయవల్లభుడు చెప్పిన సమాధానము ఒప్పుజెప్పడము సమంజసము.

ప్రాకృత కావ్యం పఠితుం గుంఫితుం
తథా చ కుటజ ప్రసూనం కుపితాం చ
ప్రసాదయితుం అద్యాపి బహవో న జానంతి

ప్రాకృతకావ్యం చదవటం గాని, వ్రాయటం గాని, కుటజ ప్రసూనమాలిక కూర్చడము, కుపితురాలైన ప్రియురాలిని ప్రసన్నను చేసుకోవటము మీకు తెలియవు.

**ఆధునికులు**

"The nightingale thought

I have sung songs but never a one so gay

For the sings of what the world be

When the year have died away"

నవ్యసాహిత్యం పుట్టీపుట్టకముందే అర్వాచీనుల దృష్టి గేయఛందస్సుల మీదికి ప్రసరించింది. సాహిత్య ప్రపంచంమీద విప్లవం చేసి నూతన కవితారీతులు ప్రవేశ పెట్టదలచుకున్న అన్ని దేశాలలోని కవులూ, తమతమ ప్రజాసారస్వతంలోని పదఛందస్సులలో కవిత్వం చెపుతారు. ఆంగ్ల సారస్వతంలో పోప్డ్రైడనుల కవితాపద్ధతుల మీద తిరుగుబాటు చేసి నూతన సంప్రదాయములను, కవితా వస్తువును కొనివచ్చిన రొమాంటిక్ కవుల విషయంలో అంతే జరిగింది. వారు మరుగు పడిపోయిన పూర్వపద ఛందస్సులను ఎన్నిటినో పునరుద్ధరించారు. మన వారు చేసిన పనీ అంతే. మరుగుపడి పోవడమంటే మహాకవులు వాటిని చేపట్టకపోవటమన్నమాట.

గేయకవితా ఛందస్సులను నవ్యకవిత్వం పుట్టకముందూ, పుట్టేరోజుల్లో యక్షగాన నాటకాల్లో విరివిగా వాడుకజేసేవారు. మిగిలిన అనేకంతో పాటు ఇవి కొంచెం ఎక్కువగా ఉండేవిగాని, వాటికి ప్రత్యేక స్థితి లేదు. ఆ యక్షగానాల పేరు గానాలైనా, వాటిలో అన్ని గేయఛందస్సు లుండవు. క్షేత్రయ్య, త్యాగయ్య మొదలైన వాగ్గేయకారుల కృతులలో అన్నీ గేయఛందస్సులే అయినప్పటికీ వాటిలో కవితాగుణము తక్కువే అని ఒప్పుకొని తీరాలి. యక్షగానాల విషయం గూడా ఇంతే! అవి కేవలమూ సంగీత దృష్టితో పల్లవి, అనుపల్లవులు కల్పించి వ్రాసిన "కృతులు".

ఆ కారణం చేతనే వాటిలో సంగీత సాహిత్యాల ఎక్కువతక్కువలు కనిపిస్తవి. ఈ గేయఛందస్సులకు సంగీత సాహిత్యాల సమరత్వము నవకవుల వల్ల ఏర్పడ్డదే. నేటి కవుల గేయం పాశ్చాత్యుల గేయ లక్షణానికి అనుగుణంగా ఉంటున్నది. "సంగీత సాహిత్యాల సంయోగం వల్ల ఏర్పడి, ఏకభావాశ్రయమై, ఆలాపన కనుయుక్తమైన లయతో కూడిన ఆత్మకావ్యము గేయమని వాని నిర్వచనము.'

''As a Union of Poetry and music, it (Song)
may be defined as a brief Lyrical poem...
...... to which is added a melody for the
purpose of singing it''

స్థూలంగా గేయాలను పాశ్చాత్యులు రెండు రకాల క్రింద విభజించారు. 1. కావ్యశిల్ప గీతాలు (Art Songs), 2. జానపదగీతాలు (Folk Songs). సుఖదుఃఖాది అనుభూతులు కలిగినప్పుడు సూటిగా పల్లీయజనుల హృదయకుహరాలను బ్రద్దలు చేసుకొని బయటపడేవి జానపదగీతాలు. సంస్కృతిరహితులైన జానపదులు వాటి కవులు. సహజమైన ఆవేశము కొన్ని కట్టుబాట్లకు లోనై కవి శిల్పి చేతిలో చిత్రణము పొందేవి రెండోరకము. ప్రజాసాహిత్యం మీది ఆకాంక్షవల్ల నేటి రచయితలు గేయఛందస్సులను విరివిగా ప్రయుక్తం చేసి రకరకాలుగా రచనలు సాగిస్తున్నారు. సింహావలోకనంచేస్తే చివరకు క్రిందివిధముగా విభజన చేయవచ్చు ననిపిస్తుంది. కథాగమన గీతికలు (Narrative Songs), గీతినాటికలు (Song - Dramas), గోగీతికలు (Pastoral Songs), జాతీయ గీతాలు (National Songs), జానపద గీతాలు (Folk Songs), సాంఘిక గేయాలు (Social Songs), ఆత్మ గీతాలు (Personal Songs), ప్రేమ గీతాలు (Love-Songs), ఆధ్యాత్మిక భక్తిగీతాలు (Philosophical and devotional

- Songs), బాలగేయాలు (Children's Songs), ప్రచార గీతాలు (Songs of propaganda), విప్లవ గీతాలు (Revolutionary Songs).

కథాగమన గీతాలు ఒకటో రెండో తప్ప లేవు. ఉన్న వాటిలో కూడా కథాకాలం నాటి సాంఘికాది పరిస్థితులకు స్థానం తక్కువ. చరిత్రాత్మకమైన పాత్రల పేర్లు వున్నంతమాత్రాన అది చరిత్రాత్మక కథాగమన గీతిక కాదు. గేయాలలో కూడా తక్కిన ఇతర కావ్యాలలో మాదిరిగానే దేశకాల పరిస్థితులు, ఆచార వ్యవహారాలు ప్రతిఫలించాలి. గీతినాటికారచనలకు ప్రయత్నించే కవులు మనలో అరుదు. దానికి ఎంతో వ్యుత్పత్తి కావాలి. "నాటకాంతం హి సాహిత్యమ్" అని ప్రాచీనులు నాటక విషయంలో అన్నారు. "న తత్ శ్రుతం న తత్ శిల్పం, న సా విద్యా న సా కళా, నాసౌ యోగో న తత్ కర్మయ న్నాట్యేఽ స్మిన్న దృశ్యతే" అని భరతుడు. కేవలం నాటక విషయమే ఈ విధంగా ఉంటే దానిని ఛందోబద్ధము చేయటానికి ఇంకా ఎంత ప్రజ్ఞ కావాలో ఆలోచించండి. కేవలం ఆత్మానుభూతులను వచ్చినది వచ్చినట్లుగా అభివర్ణించాలనే మతము పోయే అంతవరకూ ఈ కావ్యపద్ధతికి (Poetic form) ముక్తి రాదు.

గ్రీసుదేశంలో మొదట కవులు తమ కష్టసుఖాలకు తాము గోపాలకులై, అనుభూతి గోపాలక ప్రపంచానికి సంభవించినట్లుగా భావించి కావ్యరచనలు చేశారు. వాటినే గోగీతిక (Pastoral Songs) లనే వాళ్ళు. తరువాత తరువాత అవి అన్నిదేశాల సాహిత్యాలలోకీ ప్రాకిపోయినవి. మన ఆధునికులూ అటువంటి రచనలు కొన్ని చేశారు. కానీ వాటికింకా ఆంగ్ల సారస్వతంలో ఉన్న గోగీతికలకు కలిగినంత ప్రత్యేకత రాలేదు. జాతీయ గీతికలు ఆధునిక సాహిత్యంలో బహుముఖముగా వికసించినవి. కానీ వాటిలో ఎక్కువ భాగము పాడుకోవడానికి నిరుపయోగంగా కనిపిస్తున్నవి. విమలభావనతో, జాతీయ జీవనాన్ని ఒలక బోసుకుంటూ హృదయవీథులలో విహరించే శక్తి వేళ్ళమీద లెక్కపెట్టదగ్గ ఏ కొన్నిటికో మాత్రమే ఉన్నది. వీటిలో కొన్ని సంకుచిత జాతీయభావాన్ని ప్రదర్శిస్తున్నవి. భారతదేశమంతా నాదనుకున్న జాతీయగీతికాకర్తలు తక్కువ. ఆంధ్రాభిమానం ఉండటం తప్పు కాదు. కానీ అది భారతదేశాభిమానాన్ని ధిక్కరించేదిగా ఉండకూడదు. 'భారత (చీ) కాదు ఆంధ్ర మాతకు జై' అన్న "శ్రీ" గీతాన్ని చదివినప్పుడు విశాల జాతీయదృష్టి గల పఠితకు ఏయే భావాలుత్పన్న మౌతవో ఆలోచించండి.

ఆత్మగీతాలు తరువాతివి. నేటి రచయితలలో ఇవి బహుళము. కవుల కష్టసుఖాదులు వీటికి వస్తువు. స్వానుభవాలు కాబట్టి, ఆవేశ పూరితమైన హృదయము, అప్రయత్నత (Inevitability) వీనిలో పరాం కోటికి చేరాయి.

ఆధునికుల ప్రేమగీతాలు చాలా గొప్పవి. వారు స్త్రీని జగదంబ స్వరూపిణిగా దర్శించారు. ఆ కారణం చేత ఈ శ్రేణికి చెందిన గేయాల్లో అపవిత్రతగాని, అంగసౌష్ఠవ వర్ణనగాని కనిపించవు. ఒకవేళ వీరి దృష్టి అంగప్రత్యంగవర్ణన మీదికి పోయినా, అది శిల్పిదృష్టి. పరమేశ్వరిని చిత్రించే శిల్పి దేవి పీనవక్షోజాలను ఏ దివ్యదృక్కుతో, పవిత్రభావనతో వీక్షించి చిత్రిస్తాడో, వీరూ అదేరీతి.

ప్రకృతి పురుష స్వరూపులైన జగదేకమాత, లోకేశ్వరులిద్దరే ఆధునికుల భక్తికి అధిష్ఠానదేవతలు, నిర్గుణతత్త్వాన్ని నిరసించరుగాని సగుణమంటే సంతోషము అధికం, బహుమూర్తులను ఆరాధించినా బ్రహ్మపదార్థం ఒకటేనని వీరి విశ్వాసం. ముముక్షుమార్గానికి భక్తులు అవలంబించే పంచభావాలలో దాస్య, వాత్సల్య మధురాల మీద మక్కువ. వెతికితే శాంతం కూడా అక్కడక్కడ కనిపించకపోదు. ద్వైతాద్వైతాది జిజ్ఞాసలలోకి దిగరు. ఇది నేటి ఆధ్యాత్మిక భక్తిగీతాలలోని విషయము. రచనా నాస్తికమత ప్రబోధం చేసే గేయాలు కూడా ఒకటి రెండు వచ్చాయి. వాటికి సమాధానాలు కూడా గేయరూపాలే ధరించాయి.

చిన్నపిల్లల విజ్ఞానానందాల కోసం ప్రస్తుతము అన్ని దేశాలలో కవులు గేయాలు చెపుతున్నారు. నిజంగా కవిని పట్టిచూస్తే రచనలు బాలబాలికల అనుభవాలలోను, చేష్టలలోను, ముఖ్యంగా వాళ్ళ భాషలోను కవి సుపరిచితుడు కావాలి. వాళ్ళ చిలిపి చేష్టలను చూచి కవి తాను గూడా పిల్లవాడై ఆనందించి అప్రయత్నంగా వాళ్ళ నోటివెంట వచ్చే భావాలకు ఉప్పొంగి, వాళ్ళ ఆటపాటలు పరిశీలించి, వాళ్ళ మానసిక తత్త్వ నిరూపణ చేసికొని గాని అతడు వాళ్ళకోసం పాటలు వ్రాయగూడదు. ఆ శక్తి లేనివాళ్ళు వ్రాస్తే రసికలోకానికి రక్తి కడితే కట్టవచ్చుగాని, పిల్లలకు నిరుపయోగం. కవి పోయి చెప్పకుండానే వాళ్ళు తెలుసుకొని ఆనందించే టంత అందుబాటులో ఉండాలి. మనలో ఆ ప్రయత్నం చేసే కవులు ఇద్దరో ముగ్గురో తప్ప లేరు. వ్రాయటము మట్టుకు చాలామంది వ్రాస్తున్నారు. ఈ రచనలు చాలా భాగం గంభీర భావాలతోను, అల్లిక జిగిబిగువులతోను, ఛందోరహితంగాను ఉన్నవి. వస్తువును బాలబాలికల దృష్టితో వీక్షించక పోవడము వల్ల ఏర్పడే లోపం వీటిలో ఎక్కువ. బాలగేయాలకు ప్రత్యేకంగా లయ అత్యవసరము. నడక సాధ్యమైనంతవరకు సాఫీగా ఉండటము మంచిది. లేకపోతే పిల్లలు తికమక పడతారు. ఇటువంటివి పారంపర్యంగా వచ్చే పాటలు ఆంధ్రదేశంలో అన్ని మూలలా దొరుకుతవి. వాటిలో మట్లు ఆదర్శపాత్రమైనవి. అనుకరణ యోగ్యాలు. కొత్త మట్లు కనిపెట్టవద్దని కాదు. అప్పుడు కూడా పాతమట్లను దృక్పథంలో

పెట్టుకోవటము మంచిది. పిల్లలకు వ్రాసే గేయాల్లో అందుకోరాని సౌందర్యోపాసన, నాస్తికత ఇత్యాది శూన్య సిద్ధాంతాల కన్నా అహింస, ధార్మికత, ప్రేమ, సత్యము, నిరాడంబరత్వము, భక్తి మొదలైన విశ్వశ్రేయ విషయాలు వస్తువులుగా తీసుకొని, కొద్దిపాటి వ్యంగ్యంతో చిత్రించి చూపడము మంచిది. ప్రకృతిలోని విచిత్రాలను చూపిస్తూ వాటితో పిల్లలకు విజ్ఞానాభివృద్ధి కలిగేటట్లు చేయటము ఈ శ్రేణికవులకు ఆశయమైతే బాగుంటుంది. వయసుమీరిన బాలబాలికలకే ఈ గేయరచనాపద్ధతులు నేర్పి వారిచేతనే ఈ రచనలను పెంపొందజేయటము సమంజసమే.

సాంఘిక గేయరచయితలు కొద్దిమంది ఛందోబంధాలను త్రెంచి వేయకుండా, దేశీయమైన సంఘ దురాచారాలను ఎత్తిచూపుతూ మానవ హృదయంలో కరుణకు స్థానం కల్పిస్తున్నారు. ఈ గీతాలు విరివిగా రావలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. ప్రస్తుత ప్రచారక గేయాల్లో కవితావస్తువు బొత్తుగా లేనే లేదు. దీనికి మూలకారణము వ్రాసినవాళ్లు కవులు కాకపోవటమే. ఛందో విషయంలో అనవధానత ఎక్కువ, ప్రచారకగేయాలు ఎంత ఛందోబద్ధంగా ఉంటే సంగీతోత్పత్తి అంతగా కలిగి, ప్రచారోద్దేశ్యము అంత గాఢంగా ప్రజాహృదయంలో నాటుకు పోవటానికి అవకాశం కలుగుతుంది. ఇటువంటి రచనలను కూడా కవులు చేపట్టి రసవంతంగా చేస్తారని నమ్ముతున్నాను.

ఆధునిక విప్లవగీతాలు శైలి వస్తువులు రెంటిలోనూ అన్యసారస్వత వాసన పరిమళిస్తున్నది. వీటిలో కొన్నిటికి అనుకరణలమీద అనుకరణలు బయలుదేరాయి. “అన్నమయ కోశాన్ని” అంటిపెట్టుకొన్న ఈ శ్రేణికవులకు భావి, ప్రస్తుత ప్రపంచ పరిస్థితులమీద దృష్టి తక్కువేమో. కేవలం ఆదర్శాలే గాని, నిశ్చితాభిప్రాయాలు ఉన్నట్లు కనపడవు. సర్వమానవ సౌభ్రాతృత్వము, విశ్వ శ్రేయస్సు కోరే ఈ కవుల రచనలు చాలాభాగం అందరికీ అందుబాటులో ఉండవలసినది పోగా, సాహితీవిమర్శకులకు కూడ కొన్నిచోట్ల అవగతం కాకుండా ఉంటున్నవి. ఈ రచయితలలోని ఉత్సాహము, ఉద్రేకము, విప్లవతత్త్వము మెచ్చుకోదగ్గవి. వారి రచనలను గ్రహించడానికి ఇంకా కాలం పడుతుందని కొందరి సమాధానము. అలా అయితే వారు తేదలచుకున్న విప్లవం గూడా దానితోపాటు వెనక్కు పోతుందనే విషయం గూడా గ్రహించాల్సి ఉంటుంది.

వ్యక్తిగతంగా కాకుండా నేటి గేయసాహిత్యాన్ని పరిశీలిస్తే మంచిచెడ్డలు రెండూ గోచరిస్తవి. ఆధునికుల అపార శ్రమవల్ల ఈ రచనలకు మిగిలిన కవితావిభాగాలతో

పాటు సమాన గౌరవము, ఆదరాభిమానాలు సిద్ధించినవి. సంఖ్యలో అతిశయించినవి. ఆత్మానుభూతులను హృదయానికి నాటేటట్లు చెప్పటంలో పరాకాష్ఠనందుకున్నవి. ఆవేశ ప్రాధాన్యములో అందెవేసినవి. దేశానికి ఎంతో మేలు కలిగింది. సిద్ధహస్తుల విషయంలో అప్రయత్న, ఆవేశము, కవితాదీక్ష, విమల భావన, జీవిత విమర్శ, పరిశీలన, సుస్పష్ట రూపకల్పన, హృదయాకర్షణశక్తి. రసోజ్జృంభణము, ఉన్నతాశయములు, స్వచ్ఛమైన సంప్రదాయ సిద్ధి కలిగాయి. వీరు కవితాకైలాస శిఖరాలను చూపించి భావి కవులకు మార్గదర్శకులైనారు.

గేయరచనల్లో ఏర్పడ్డ లోపాలు చాలామట్టుకు దేశంలో ప్రబలిపోయిన కొన్ని నూతన సిద్ధాంతాల వల్ల కలిగినవి. కొందరి మతంలో గేయానికి ఒక విధమైన ఊపు వస్తే చాలునని. ఊపే ప్రధానంగా పెట్టుకొని రచన చేస్తే ఊపుతో చదవటానికి వీలుంటుందేమోకాని, పాడుకోటానికి వీలులేదు. గేయానికి కావలసిన ముఖ్యలక్షణాలలో ఒకటైన సంగీతానికి స్థానం తక్కువన్నమాట. వీటిని లక్షణ యుక్తమైన గేయాలనడం కన్నా, ప్రత్యేకమైన మరి ఒక ఊపు గేయ పద్ధతనటం చాలా బాగుంటుంది. మరికొందరు రచయితలు కేవలము మాత్రలు సరిపోయినవా, లేదా అనే చూస్తున్నారుగాని, లయమీద దృష్టి నిలపటం లేదు. ఇది ఒక నవ్యత అని వారి సిద్ధాంతము, మాత్రలు సరిపోయినా కొన్నిచోట్ల గేయం నడవదు.

శ్రుతిమించిన భావన చేసి దానిని స్ఫురింపచేసే సంప్రదాయసిద్ధమైన పరిభాష ఉపయోగింపక, పఠితను అయోమయంలో పడవేసే గేయరచనలు అపరిమితంగా వస్తున్నవి. భావించిన రూపకల్పన సంప్రదాయానికి కట్టుబడక పోయినా, సహృదయులైన రసికుల తార్కిక దృష్టికైనా పొడకట్టాలి. అలా జరగనప్పుడు వారి భావన ఒక విధమైన ఉన్మత్తత క్రిందికి వస్తుందని క్రోషి మతము.

"All imagination beyond reason is a bit of insanity."

భావన ఎంత విచిత్రంగానైనా చేసి అనుభవించవచ్చు. "హృదయంతో అనుభవించగలిగినది అంతా మాటలతో వెల్లడి కాదు. దాని ఛాయను వెల్లడించే శక్తి కూడా మాటలకు ఉన్నదో లేదో – అందుచేత కవి తన అనుభవాన్ని స్ఫురింపజేసే పరిభాషను ఉపయోగిస్తాడు. ఆ పరిభాష సంప్రదాయసిద్ధంగా ఉంటేనే కాని, పద బంధము మాటున ఉన్న భావ ప్రపంచములోకి వెళ్ళలేము. కవి ఆ విషయములో ఎంత శ్రద్ధాళువై ఉంటే కావ్యానికి అంత శోభ వస్తుంది" (వేదుల కల్యాణకింకిణి పీఠిక). ఇది ముఖ్యముగా గమనించవలసిన లోపము.

ఆధునిక కవులు కొందరు వాస్తవిక ప్రపంచానికి దూరమైపోయినారు, కల్పిత లోకాల్లో దారి తెలియక తారుమారై పోతున్నారు. కేవల భావనాజగత్తులలో కవులు విహరించడం వల్ల లోకజ్ఞత, వాస్తవ జగత్తులోని జీవిత విమర్శ (Criticism of life) అడుగంటినవి. వస్తు వైవిధ్యము సన్నగిల్లిపోతున్నది. కవి వాస్తవ జగత్తులోని వస్తువును చేపట్టి అన్యానుభూతిని యథాతథంగా ప్రదర్శించక, స్వాయత్తం చేసికొని వస్తుతత్త్వం చెడకుండా కొన్ని నూతనాంశాలను భావించి చేర్చుకొని కావ్యరచన చేస్తాడు. వాస్తవ లోకాన్ని వదిలి కేవల భావనాప్రౌఢ వీథుల్లో విహారం చేసే కవి నేల విడిచి సాము చేసే వాడన్నమాట. వివిధరకాలైన గేయాలు విరివిగా రాకపోవటము, ఉన్నవాటిలో వైవిధ్యము లేకపోవటమూ చాలామటుకు పై కారణం వల్లనే.

నూతనత్వం మీద అత్యధికమైన ఆకాంక్ష పెట్టుకొని కొందరు గేయరచయితలు అర్థపుష్టి, అన్వయసౌలభ్యాలను నీట కలుపుతున్నారు. నూతనసృష్టి మీద దృష్టి ఉండవలసిందే. "కాని నూతనత్వ మనేది భాషానియమోల్లంఘనాల వల్ల సిద్ధించదు. కవి సమయాలు పాటిస్తే నూతనత్వానికి భంగం రాదు. అర్థపుష్టి, అన్వయ సౌలభ్యమూ మొదలైన గుణాలు లేకపోతే నూతనత్వానికి కాదుగదా, కవితకే భంగం కలుగుతుంది. భావాలు నూతనంగా ఉండవచ్చు. పద సంఘటనలు క్రొత్త తీరుగా కూర్చవచ్చు. నూతనత్వం కోసం అర్థము పాడయ్యేటట్లు కూర్చటంలో నూతనత్వం లేదు."

సంప్రదాయానికి ఇమడని అన్యసారస్వతాలలోని మెలకువలను అనుక రించటంవల్ల, కొన్ని కొన్ని గేయాలు విచిత్ర రూపాన్ని ధరించాయి. ఆ విచిత్ర రూపం కూడా ఒక సౌందర్యమనే కొందరి సమర్థన.

ఆధునిక గేయ రచయితలలో ప్రత్యేకత కలిగి ప్రసిద్ధి పొందిన కొందరి రచనా పద్ధతులు, కవితావస్తువులు, ప్రత్యేకతలు చూపించవలసిన బాధ్యత కొంత ఉన్నది. గురజాడ అప్పారాయకవి నేటి గేయకవితాపితామహుడు, నీతి, దేశభక్తి, అస్పృశ్యత, పాశ్చాత్య వ్యామోహాది సంఘసంస్కరణము వీరి వస్తువు. వీరి దేశభక్తి యావద్భారతాన్నీ అనుసరించింది గాని, కేవలమూ ఆంధ్రదేశాన్ని మాత్రమే అంటిపెట్టుకొని కూర్చున్నది కాదు. కొద్ది మాటలలో పెద్ద భావాన్ని ఇమడ్చడము, రచన రససిద్ధిని పొందిగాని చేయకపోవటమూ వీరి ప్రత్యేకశక్తులు. ప్రజాదరణ పొందిన ముత్యాల సరాన్ని "పార్శీగజల్ వరుస" లో మొదట యీ కవి ప్రవేశపెట్టాడు. ఎంతో కాలము పరిశ్రమ చేస్తేనేగాని వీరు గేయాలలో వాడిన కండగల జాతీయ జీవద్భాష చేత చిక్కదు. అటువంటి భాష ఉపయోగించడము వల్లనే ఆయన భావాలు సూటిగా వచ్చి

హృదయానికి తాకుతవి. చిన్న పిల్లలకోసం వ్రాసిన "పూర్ణమ్మ పాట" మొదలైన గేయాలలో చిక్కనైన తేటతెనుగు తొణికిస లాడుతుంది. వీరి ఎత్తుబడులు ఎంతో మనోహరంగా ఉంటవి. దేశభక్తి అంటే,

"దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయి
గట్టిమేల్ తలపెట్టవోయ్"

స్వంతలాభం కొంత మానుకు
పొరుగువారికి తోడు పడవోయ్
దేశ మంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్!"

అని ఆంధ్రదేశంలో ప్రథమ శంఖధ్వానం చేసిన కవితాత్త్వికుడు (Poet - Thinker) నాటకరచయిత, ప్రథమ కథకుడు, విమర్శకుడు, నవ్య సాహిత్యానికి మూల పీఠము. ఒకవిధంగా రచనలు ఎక్కువభాగం వాచ్యంగా ఉండడం వల్ల కవితాశిల్పము కొంతవరకు లోపించిందేమో అని అనిపిస్తుంది. భాషావిషయంలో గురజాడ కవిని అనుకరించటానికి బసవరాజు ప్రయత్నించాడు. కానీ వారిని వీరందలేదని ఒక మతము. ఇది విచారణీయాంశము.

బసవరాజు నిరంతరమూ గానం చేసిన కవికోకిల. పాట కోసమే తన జీవితము మీదు కట్టాడు. ఆయన జీవితాశయమే అది. కవి –

"పాట పాడుతుండగ నా
ప్రాణి దాటి ఏగేనా
ప్రాణి దాటి ఏగుతుండ
పాట నోట మోగేనా" – అనే గేయంలో

ఆ విషయాన్నే సూచించాడు. "కావ్యమె జీవంగా గడపిన కవి." "కావ్యపానం చేసి క్రైపెక్కి" తన ఆత్మశక్తిని గుర్తించాడు.

"గుండు తా తా మంచు
కొట్టినట్టుగ నేటి

పండితులు తారెత్తి
పరుగుచ్చుకోవాలి”

అని పాండితీబంధనాలకు స్వస్తి చెప్పే సాహసము, ఆత్మశక్తిని గుర్తించిన స్వాభిమానమూ ఈ కవికి మొదటినుంచీ పట్టుబడ్డవి. ఆత్మానుభవాలను కొద్దిపాటి కల్పనతో పాటలుగా కూర్చి పఠితలను పరవశులను చేశాడు. రసమయమైన అనేక జీవిత ఘట్టాలే ముఖ్యమైన వస్తువు. వైవిధ్యము, దానికి తోడు దివ్యమైన కవితావేశము, సహజమైన పవిత్రభావన, ఉన్నతాశయాలు, స్వచ్ఛసంప్రదాయము, నగ్న సౌందర్యము, నిరాడంబర కవితాశిల్పము, వీరి గేయకవితా సుందరికి పెట్టని అలంకారాలు. ఆమె “చిన్నతనం నుంచీ రాగిణి. భావనోద్దీపిత, గానలోల.” శ్రోతలను ఒకచోట నవ్విస్తుంది. ఒకచోట నాట్యం చేయిస్తుంది. ఒకచోట కన్నీరు కార్చేటట్లు చేస్తుంది. ఒకచోట భయపెడుతుంది. చివరకు అభయమిస్తుంది. మనోహరమైన మహోన్నతభావాలను జీవద్భాషలో పెట్టి చేతికందించే శక్తి ఈ ఒక్కడి సొమ్మే. తికమకలు తక్కువ. పఠితలను పట్టిచూడటం కాదు ఆయన పద్ధతి; హృదయానికి నాటేటట్లు చెప్పడం. “వాగీశుడే వచ్చి దాసోహమని పాట వ్రాసి వల్లించాలి” అని ఆయన చెప్పిన ముక్కలో ఉన్న సత్యం ఈ కారణం వల్ల కలిగిందే!

గీతికా రచనకు తత్త్వ, ఓఘ, ఘనాలతో పరిచితి అత్యవసరము. నృత్య వాద్యాలతో కలిపి పాడినప్పుడు తౌర్యత్రికసిద్ధి కలిగి ఆయన పాటల్లో పట్టు తెలుస్తుంది. బసవరాజు సతతసౌందర్యోపాసి, పిపాసి, చిన్న చిన్న వస్తువులలో చిన్మయమూర్తిని చూచి చూపించే శక్తి కలవాడు. ఆశాభంగాలు కలగటం వల్ల అంతరంగవేదనాక్షుభితమై పాటగా అప్పుడప్పుడూ మోగినా, దాన్నే అంటిపెట్టుకొని కూర్చోడు. కష్టసుఖాలను రెంటినీ సమదృష్టితో చూడమనే అద్వైతి. ‘బ్రతుకే చేదని అంటావే బ్రతికెదరేలా దేవతలూ?’ అని ఆయన ప్రశ్న. దుఃఖమయ ప్రపంచాన్ని సంతోష సాగరంగా మార్చుకోటానికీ వీలున్నదనే భావుకుడు.

భక్తి, ప్రేమ, దానికి ఆయన సూచించిన సాధనాలు. ఆస్తికుడై ఈ కవి మిథ్యావాదులను భక్తిమార్గంలో పడిపోయి జీవితంలోని అశాశ్వతత్వాన్ని పోగొట్టుకొండని దారి చూపి ప్రబోధించాడు. జిజ్ఞాసాపూర్వముగాని జనసామాన్య మత మీయనది. ఈ కవి ప్రేమతత్త్వము ధనప్రాణాదులను, స్వార్థాన్ని మించి పోయింది. ప్రేమ మృదులతను కూరుస్తుందని, కలుషాలు కడిగి వేస్తుందని, అహంకారాన్ని అణగద్రొక్కుతుందని ఆయన నమ్మకము.

"ఎద మెత్తనౌటకై
సొద గుందరా అంత
మందిలో అహమ్మెల్ల
వదలి పోవునురా!"

అని ఆయన ప్రవచనము.

"ప్రేమించు ప్రేమకై
ప్రేమించు ముక్తికై
ప్రేమించు ప్రేమకై"

అన్న మాటలలోని మొదటి స్వార్థపరత్వమూ, చివరకు తద్రాహిత్యము కవిప్రేమ సిద్ధాంత పరిణామాన్ని సూచిస్తున్నది.

ఆయన వ్రాసిన కొన్ని జాతీయగీతాలు, దేశీయ గీతాలు కూడా ఉన్నవి. ఆయన దేశభక్తి గురజాడ కవివలే యావద్భారతానికీ సంబంధించింది. రాజకీయంలో కాంగ్రెసు వాది, విశ్వశ్రేయస్సు ఆకాంక్షించి, విమల భావాలు దేశానికి నూరిపోసి ప్రజాదరాన్ని పొందుతూ ఉన్న ఈ కవి కలకాలం నిలిచేవాడు.

జానపద భాషను, వాతావరణాన్ని అవలంబంగా పెట్టుకొని ఆత్మానుభవాలను జానపద గీతాలుగా కృషి చేసిన అమరకవి నండూరి. జానపదాల వ్యవహారంలో ఉన్న కొంచెం భాషతోనే కమనీయ కావ్యమే కాదు కదా, శాస్త్రార్థాలు గూడా అందుకోలేని అతిలోక విషయాలను రూపించాడీ కవి. ఇదే ఆయన ఉపజ్ఞ. కవులము కావాలని ఉబలాటపడేవారికి మొదట వీరి మార్గం కొంత సులభంగా కనిపించినా, అనుభవంలో పునీతమైన సంస్కారం వినా దుస్సాధ్యంగా తేలిపోయింది. వీరి యెంకిపాటలలో కమ్మని సంగీతము, సహజమైన పవిత్ర భావనలు, ఉక్తి సౌలభ్యము ముఖ్యంగా హృదయా కర్షణశక్తి కనిపిస్తవి. ఈ పద్ధతికి వీరే మార్గదర్శకులు. ఎంతమంది ఆ విధంగా వ్రాయటానికి ప్రయత్నాలు చేసినా ఏదో లోపం కలుగుతునే ఉన్నది.

గేయ కవితాలోకంలో పాత్రసృష్టి చేసిన కవులు బహుకొద్దిమంది. నండూరి యెంకి కవికీ, తనకూ విశిష్టత గడించింది. "పూలమొక్కల నీటిజాలు గని నిలుసుండి పూలన్నీ నీపాటే ఆలించె" అనే సునిశిత భావనాబలము, "అందాలు చూచుకోటానికి అద్దాలెందుకు? కనుపాపలు లేవా" అనే సహజరసికత, 'యెనక జల్మంలోన ఎవరమో?' అని నాయుడు బావ అన్నప్పటికీ ముగ్ధత్వమూ, "ముందు మనకేజల్మ ముందోలె"

అన్నప్పటి అమాయకత్వము. "ఎన్నాళ్ళో మనకోలె ఈ సుకము" అన్నప్పటి బేలతనము., కడుపులో చెయ్యేసి కలచే ఆమె చేష్టలు, మాటలూ రసికలోకం ఎలా మరచిపోవటం! ఆలోచించినకొద్దీ యెంకిలో ఎన్నో అందాలు బయటపడతవి. ఆ పాత్ర తరిగిపోని అమృతకలశము. ఎన్ని 'గాలిదుమారాలు' రేగినా, ఏ కోశానా చెక్కు చెదరలేదు, చెదరదు, చెదరబోదు.!

కావ్య శిల్ప గీతికలను, జానపద గీతాలను రెంటినీ కవితాదృష్టితో వీక్షించి, సమాన గౌరవం చూపి గేయరచన చేసిన కవి అడివి బాపిరాజు. నండూరి అభినయించిన జానపదజీవితంతో సారూప్యాన్ని పొంది పదకవితలు పలికాడు. గ్రామీణుల వివిధ జీవిత సంఘట్టనలను, వారి పదఫణితిలో పాడుకున్నాడు. నాయుడు బావ, ఎంకి, కవిలోని భావపారిశుద్ధ్యరసావేశాలలో ప్రభవించారు. బాపిరాజు స్వయంగా జానపదుడై సూటిగా బోళాతనంతో పఠితను తన వశం చేసుకుంటాడు. ఇక్కడ బుద్ధిని రంజింపజేసే తళుకుబెళుకులకు, నగిషీలకూ స్థానం లేదు. పుష్కలమైన జీవిత సుఖదుఃఖాలలో నుంచీ పొంగి పొరలే హృదయావేశం ఒక్కటే స్ఫురిస్తుంది.

ఈయన పల్లెపట్టు దాటి కావ్యాల్లోనికి అధిగమించి ఒక స్వాప్నికత్వాన్ని మనగేయ సారస్వతంలోకి పట్టుకొచ్చాడు. ఆమెను "శశికళ"గా రూపించి మన ఎదుట ప్రదర్శిస్తున్నాడు – శశికళ సౌందర్య బాలిక. ఆమెను గురించి కవే అన్నమాటలివి. "శశికళ" నాకు సత్త్వం, ఆమె నా ప్రేమ విధానము. నా గొంతుకలో బయలుదేరిన సన్నని రాగం గానీ, నా కళ్ళలో ప్రతిఫలించిన రంగుల చిత్రం గానీ ఆమె విలాసాలే. ఆమె నాకు తోచని క్షణాలు భయంకర ప్రదర్శనమే. కాలగర్భంలో నుంచి బయలుదేరిన మరుక్షణం నుండీ నా చేయి ఆమె, ఆమె చేయి నేనూ పట్టుకొని నడుస్తున్నాము. ఈ యాత్ర కాలాన్ని దాటిన ఆనందం వరకూ, ఆనందమే మాకు దారి. ఆనందమే గమ్యము." వస్తుతః దివ్యశిల్పి కావటం చేత ఆయన శశికళ పాటలలో రేఖాకార చిత్రలేఖనపు నగిషీలు కనబడతవి. "ప్రతి వాక్యమూ చిన్న బొమ్మలా నయనాలయందు నర్తిస్తుంది." ఇది ఆయన ప్రత్యేకత. దివ్యపథాలలో ఈ కవితో యాత్రలు సలిపే పవిత్ర నవ్య సాహితీ మూర్తులు, Dante, Rosette మొదలైన పాశ్చాత్య రచయితలు కవికి ఈ సౌందర్య బాలికాసాహచర్యంలో తోడు.

సంగీతానికి మొదట సుశరీరం, సుశబ్దం కావాలి. "కవిత్వమునకు కావలసినది భావనాస్ఫోరకత్వము (Suggestiveness), హృదయాకర్షణము, రసోజ్జృంభణము ఛందోబద్ధమగు మనోహర శబ్దసముదాయము" (కృష్ణశాస్త్రి – ఏకాంతసేవ పీఠిక)

చక్కని పదములు, కూర్పు అంటే కృష్ణశాస్త్రికి అపరిమితానందము. అది ఆయనలోని ఉపజ్ఞ. ఏ గేయమైనా తీర్చి దిద్దిన శిల్పఖండంలా, చెక్కుచెదరని దివ్యవనితలా మోహపెడుతుంది. కవితాశిల్ప ప్రధానమైన గేయాలకు ఈయనను చెప్పి చెప్పాలి. శబ్ద ప్రయోగము పట్టు ననుసరించి ఉంటుంది. కూర్పులో ఒక తడవ "పైదలి కుత్తుకలోని పల్లటీకూతలు'', ఇంకోమారు ''ప్రళయకాల మహోగ్ర భయదజీమూతోరుగళ ఘోరగంభీర ఫెళ ఫెళార్భటులు" వినిపిస్తవి. "కవి తన హృదయావేశాలకు బద్ధసభ్యుడు కావాలే గాని ప్రజాభికాంక్షకు పట్టుపడ కూడ"దనే రవీంద్రుని మతంలో వాడుగా కనిపిస్తాడీ కవి.

''Poets have to be true to their best moments and not to the people's requirements.''

ఈ విషయమే కృష్ణశాస్త్రి 'స్వేచ్ఛ' అనే గేయంలో –

"నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు ?
నా ఇచ్ఛయే గాక నాకేటి వెరపు?"

అని వాడుకున్నాడు.

ప్రేయసివైపు హృదయం ప్రవహిస్తే ప్రేమగీతాలు, పరమేశ్వరుని పాదసాన్నిధ్యంలో భక్తిగీతాలు, భారతజనయిత్రి సుందర ప్రశాంతరూపం కళ్ళకు కట్టినప్పుడు జాతీయగీతాలు, 'ఆకలి' వేసినప్పుడు ఆకలి పాటలు అల్లుకున్నాడు, పాడాడు, కురిశాడు, అందించాడు, ఉన్నట్లుండి ఉబుసు పోనప్పుడు ఊహాగీతికలు (Fancy Songs) వ్రాశాడు. ఆయనలో కలిగిన అన్ని సంస్కారాలనూ అన్ని రకాల గీతాలలో పెట్టాడు.

ప్రేమ గీతాలలో ఎక్కువగా ఉన్మాదావస్థ కనిపిస్తుంది. "అతడు నా వలెనే ఉన్మత్త భావశాలి" అనే వాక్యంలో ఈ విషయం ఆయననే చెప్పుకున్నాడు. పిచ్చివాడు, ప్రియుడు, కవిభావనాసౌధం మీద ఒకే అంతస్తులో ఉంటారు.

''The lunatic, the lover and the poet and all in imagination compact'' అనే సిద్ధాంతానికి కృష్ణిశాస్త్రి ప్రియుడుగాను, కవిగాను, స్వచ్ఛమైన తార్కాణము.

ఏకేశ్వరోపాసకుడైన ఈ కవి భగవంతుని పాదసన్నిధికి ప్రేయసిగాను, ప్రియపుత్రుడుగాను, ప్రియసేవకుడుగానూ చేరుకుంటాడు. మధుర, వాత్సల్య, దాస్యభావాలు స్థూలదృష్టికి భక్తిగేయాలలో కనిపిస్తవి. అహం గ్రహసంబంధమైన

ఉపాసన (ఆత్మచింతనకు సంబంధించినది) ఆయన భక్తి గీతాలలో బలవత్తరము. తన్మూలంగా కవి దీనతాభావాన్ని పొంది, దీనుడనని, పాపినని ప్రభువుముందు విలపిస్తాడు. బ్రహ్మ సమాజమత ప్రభావము దీనికి మూలకారణము కావచ్చు.

జాతీయ గీతాలు కమ్మని సంగీతంతో కళకళ లాడుతుంటవి. ఆకలిపాటల అంతరార్థమేమిటో ఇంకా ఆలోచించవలసిన విషయము. ఇవి విప్లవగీతాలు కావేమో! 'ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభ గరీయసి.' కాని వ్యుత్పత్తి ఎంత ఎక్కువగా ఉంటే ప్రతిభ అంత రాణిస్తుంది. ప్రతిభకు అండ ఆకాశము. వ్యుత్పత్తి వల్ల భావనకు బలం కలుగుతుంది. అది లేని కవిలో వస్తువైవిధ్యము తక్కువ. ఈ రెంటిని ఏకముఖం జేసుకొని గేయరచనలు చేసిన కవి విశ్వనాథ. పాడాలనే ప్రకామ్యస్థితి (Power of irresistable will) పొందినవారు ఈశత్వము (Power of Commanding), వశిత్వము (Power of subjugating) ఆయన కే నాడో హస్తగతమైనవి. వీరి కల్పనాశిల్పము, భావనాబలము, రససిద్ధి ఏ పట్టులో చూచినా గోచరిస్తాయి. 'శృంగారవీథి'లోని 'స్నానసుందరి'లో ఆయన చెప్పుకున్న 'ఊరక రసాత్మతనే ప్రవియించిపోదు' అన్న మాటలలో అతిశయోక్తి లేదు. రసానికి ఆయన ప్రాణము. ఆయన జీవితమే ఒక రసమయమైన కావ్యము. అది 'వేయి పడగల'లో వెల్లివిరిసినది.

జాతీయతలోని జిగి మెరపులు చూస్తే వీరిలోనే చూడాలి. నవ్యత్వానికి ఎంత నవసిపోతాడో, సంప్రదాయానికి అంత చక్కగా లోబడతాడు.

ఒక సామాన్య భావాన్ని చిత్రించడానికి ఈ కవి దృగ్గోచర రూపం గల ఒక సంజ్ఞ (Symbol) ను మొదట్లో ఏరుకుంటాడు. ఇది ప్రతికవికీ సహజమే. ఈయన ప్రత్యేకత అక్కడ బయలుదేరుతుంది. ఆ సంజ్ఞ ఎప్పుడైతే చేత చిక్కుతుందో అప్పుడా సామాన్యభావాన్ని మఱచిపోయి ఆ రూపాన్ని మనస్సులో ధారణ చేసి దాని సౌందర్యాన్ని మనస్సులో సూక్ష్మపరిశీలన (Minute Analysis) చేసి వేయివిధాలుగా నగిషీలు దిద్ది సర్వాంగ సుందరమైన చిత్రాన్ని బయట పెడతాడు. సామాన్యుల చేతిలో సాఫీగా ఒక గేయం కింద మారే కిన్నెర ఆయనలోని ఈ ఆత్మాంశ (Personality) వల్ల పుట్టి, నడకలు నడిచి, నాట్యం చేసి, సముద్రుడంత వాణ్ణి తనకోసం నవసిపోయేటట్లు చేసి, గోదావరి తల్లి గర్భంలో తలదాచుకుంటుంది. కోకిలమ్మ విషయమూ ఇంతే. పటుత్వం గల పెంపకంలో ఈయన ప్రజ్ఞ కిన్నెరసాని రూపచిత్రణము రససౌందర్యాల రమణీయతను పొంది కవి సృష్టి శిల్పానికి విశిష్టత చేకూర్చింది. కిన్నెర 'ఉద్విగ్న హృదయ' పతివ్రత, అత్తపోరు పడలేక అడవులపాలై కరిగి నీరై, వాగై ప్రవహిస్తుంది. ఆవేశహృదయంతో ఆమె చేసిన తప్పిదానికి పశ్చాత్తాప పడుతుంది. ఇంట్లోనుంచి ఏ

కారణం చేత యువతులు లేచి వచ్చినా వాళ్ళ విషయం మన్ననకోసం ఇతరుల చెవిలో వేస్తుంటారు కొంతమంది. వాళ్ళే గాలిపిల్లలు, మబ్బుకన్నెలు. పతివ్రతలని కూడా భావించకుండా, గొడ్డు ఈనిందంటే గాట కట్టేయమనే రకం వాళ్ళు. వాళ్ళను పొందాలనే వాంఛతో ప్రయత్నాలను చేసే ప్రజలున్నారు. లోకంలో అటువంటివాడే సముద్రుడు. ఇంట్లోనుంచి ఈ కారణం వల్ల లేచి వచ్చిన వాళ్ళను పొగిడేవాళ్ళూ లోకంలో ఉన్నారు. వారే భూదేవత, పికిలిపిట్ట, కోకిల ప్రభృతులు. వారిని ఆదరించే గోదావరీ తల్లి లాంటి పుణ్యవనితలు కూడా ఉన్నారు. ప్రపంచంలో ఇదంతా విశ్వనాథ కిన్నెరసాని పాటలో చూపించిన మనస్తత్త్వము (Psychology). అన్య సంపర్కాలను ఆహ్వానించి, జాతిధర్మాన్ని నాశనం చేసేవారిని దేశం ఎంతోకాలం ఆదరించదనే "కోకిలమ్మ పెండ్లి" లోని సామాన్య సిద్ధాంతమైనట్లు స్ఫురిస్తుంది.

వీరి భాష రసస్ఫూర్తిని బట్టి రకరకాలుగా పర్వెత్తుతుంది. గేయరచనలలో వీరు అనేక కొత్త నడకలు చూపించారు. అక్కడక్కడా శ్రుతికటువైన శబ్ద ప్రయోగం కనిపిస్తుంది. దానికి ప్రత్యేకమైన కారణాలేమన్నా ఉన్నవేమో!

ఈ యుగంలో యెంకిపాటలు వంటి పాటలు వస్తే రావచ్చు కాని కిన్నెరసాని వంటి పాటలు మాత్రం ఆ కవి నోట తప్ప, రావని నా మూఢవిశ్వాసం. నిరీక్షిద్దాము.

"సాహిత్య ప్రపంచంలో కొత్తరీతులకు దోవ చూపించింది, కొత్త రుచులు ఎరిగించింది, కవితాకన్యను మనోహరంగా, చూడ ముచ్చటగా అలంకరించింది. ఆమెకు క్రొత్త పోకడలు నేర్పింది నవకవులందరిలోకీ తొలుదొల్త శ్రీ శివశంకర శాస్త్రిగారే. ఆయన చూపని సులభోపాయం లేదు. కావ్యరచనావిధానానికి, అవుననక పోయినా అనుకరించని ఆధునికులూ లేరు" (రామకృష్ణ శాస్త్రి – కృష్ణాపత్రిక) శివ శంకర శాస్త్రి సంప్రదాయం చెడకుండా గేయకవితాకన్యకు ఎన్నో నూతనాలంకారాలు చేశాడు. అంతకుముందు తెలుగుకవికి తెలియని గీతికాస్వగతాలు, గీతినాట్యాలు, గీతికాసంవాదాలు, గేయ నాటికలు తెనుగులోకి తెచ్చాడు. ఈ రచనావిధానమే ఆయన విశిష్టత. నడకల్లో నానారూపాలు చూపించి ప్రసన్నతాగుణానికి తిరిగీ ప్రాణం పోసి గేయరచనలు చేస్తాడీ కవి.

ప్రణయ చిహ్నంగా ప్రేయసీదత్తమై వాడిపోయిన వకుళమాలిక ముఖతః ప్రేయసీ హృదయాంతరాళాలను విప్పి చెప్పి, ఆత్మ పరిశీలన చేసుకొని చూపించాడు. అద్భుత సంఘటనలు, అమరగానము అన్ని మూలలా కావ్యంలో కళ్ళకు కనిపిస్తవి. చెవికి వినబడుతుంది. భావనాప్రపంచం నిజమని నమ్మించే శక్తి ఈయనలో పరసీమ

నందుకున్నది. ప్రణయతత్త్వము ఈ కవి గేయనాటికల్లో గంభీరమైన దివ్యలోకాలవైపు దృష్టిని త్రిప్పుతుంది. ప్రేమ నగరానికి దారి కష్టమైనదని, అది సాధన వల్లగాని సుగమము కాదని ఆయన సూచించే భావము.

"ప్రేమ నగర కే రాహ కఠిన హై
ప్రేయసి కయి నే నేయది యైనన్
సంతోషముతో సలుపగ నేర్తున్"

అని పాడుకున్నాడు. అంత పండితుడైనా అనవసరంగా శబ్దకాఠిన్యానికి లొంగడు. ఈ గుణము పండిత కవులైన వాళ్ళల్లో ఉండటం అరుదు. శ్రుతి పుటాలకు చిన్నెలు దిద్దే గేయానికి రంగస్థలం మీదికి పరిపూర్ణ స్వరూపం రప్పించటానికి ప్రయత్నం చేసిన ప్రథమకవి శివశంకర శాస్త్రి.

చిన్న పిల్లలకు చక్కని పాటలు వ్రాయడంతో దీక్షితులదే ఉపజ్ఞ. చక్కని జాతీయ భాష. శైలీ సౌలభ్యము, చక్కని మెట్లు, గానయోగ్యత, నాతిగంభీరభావనలు, పరిశీలన, వాతావరణము వీరి పిల్లల పాటలలో ప్రస్ఫుట మౌతవి. ఉత్తమ శ్రేణికి చెందే కావ్యశిల్ప గేయరచనలు కూడా కొద్దిగా చేశారు. మనస్సు సంతోషంతో గిలిగింతలు పెట్టించే వింత వింత భావాలమీదికి వెళుతుంది ఈ 'కథక చక్రవర్తి' మనస్సు.

నవ్య గేయరచనలలో రెండు పద్ధతులు ఏర్పడ్డవి. ఒకటి భావకవుల రచనాపద్ధతి. రెండు క్రాంతిగీత రచనాపద్ధతి. ఇందులో మొదటి పద్ధతిని అందరికీ అందుబాటులో ఉండకుండా సుదూరం పొడిగించిన కవి మల్లవరపు. కమ్మని పదముల కూర్పంటే ఈ కవికి చాలా ఇష్టం. కొన్నిచోట్ల అర్థపుష్టి ఎంతవరకున్నదనే విషయం ఆలోచనీయాంశము. సంప్రదాయానికి ఇమడని అన్యసాహిత్య రచనాపద్ధతులేవో ప్రవేశపెట్టటానికి ప్రయత్నం చేయటం వల్ల, కొన్నిచోట్ల అన్వయ కాఠిన్యము గోచరిస్తుంది. మాత్రలు, యతులు పాటించి, లయను పాటించక పోవటము వల్ల ఏర్పడే కుంటుతనమున్నది కొన్నిచోట్ల.

మల్లవరపు నిజంగా కవితాహృదయం గల 'ఒక మహాగర్వి కవికుమారుడు' మధుకీల. కల్యాణకింకిణి వీరికావ్యాలు. సంగీతానికి స్థానమిచ్చి వ్రాసిన ప్రేమ గీతాలు రెంటిలోనూ కనిపిస్తవి. ప్రేమోజ్జ్వలత, ఉన్మత్తత, 'ఉద్రేక తాండవము' గోచరిస్తుంటవి. మొదటి రచనలో కృష్ణశాస్త్రి, నాయని, బసవరాజుల ప్రోద్బలము "చాల ఉత్సాహం, చాల అపరిపక్వత, చాలా కావ్యదోషాలు ఉన్నవి. వాటిలోనే అంతర్లీనమై ఆశలు

గొల్పుతూ ఒక కవితాకాంతి గూడా మెరుస్తూ ఉన్నది." రెండవ రచనలో ఈ లోపాలు కొన్ని లోపించి "స్వకీయమూ, పరిపూర్ణమూ అయిన వ్యక్తిత్వం" ప్రదర్శించాడు. ఆ నాటినుండీ వీరికి దేశంలో అనుయాయులేర్పడినారు. వీరి రచనలో కొన్ని అత్యుత్తమ శ్రేణికి చెందినవని ఒప్పుకొని తీరాలి.

నూతన గేయరచనోద్యమాన్ని బయలుదేరదీసి దానికి నాయకుడైనవాడు శ్రీ.శ్రీ. 'అల్లకల్లోలమైన సుడిగుండంలా' ఈ కవి 'ఒక్కడే అనేకమంది యువకులను తనలోకి లాక్కుంటున్నాడు.' 'ఈ సుడిగుండంలో పడి' వ్యక్తిత్వం గల యువక హృదయాలు 'ఉక్కిరిబిక్కిరై' పోతున్నవి.

కాని ఉద్యమనాయకుడెప్పుడూ ఋజుమార్గంలోనే ఉంటాడు. తన పూర్వులకు శైలీసౌలభ్యంలో సన్నిహితుడుగా ఉంటాడు. వారి ననుసరించే వారు చిత్రచిత్రాలు చేసి చివరకు ఒకప్పుడు అయోమయంలో పడిపోవటానికి అవకాశం కలుగుతుంది.

విశ్వ శ్రేయస్సు కోరి, పరిస్థితులు మారటానికి విప్లవము సాధనగా నమ్మి, దేశాన్ని ప్రబోధిస్తూ ప్రపంచంలో ఘోరహత్యలు జరిగినవీ, జరుగుతున్నవీ, కళ్ళకు కట్టేటట్లు ఆవేశపూరిత హృదయంతో కవిత్వం చెప్పాడు శ్రీ.శ్రీ.

'అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
జగమంతా బలివితర్ది'

నరజాతికి పరివర్తన – అనేది ఆయన నిశ్చయ లక్ష్యం ఇంత ఘాటైన కవితావేశం గల కవి తెలుగు నేలమీద ఎన్నడూ పుట్టలేదనే చెప్పాలి.

'ఉండాలోయ్ కవితావేశం
కావాలోయ్ రసనిర్దేశం
దొరకదటోయ్ శోభావేశం
కళ్ళుంటే చూసే
వాక్కుంటే వ్రాసే
ప్రపంచ మొక పద్మవ్యూహం
కవిత్వ మొక తీరనిదాహం –'

అని అంటాడీ కవి.

నూతన కవితావస్తువు, రచనాపద్ధతి కవితావేశం ప్రవేశపెట్టుటకు వీరి ప్రత్యేకత వీరి రచనామార్గాన్ని అనుసరించే వారిలో వీరి సౌలభ్యము, తత్త్వనిర్దేశము కేవల సంజ్ఞాపరిపోషక దృష్టిలోనూ, అతిశయ వ్యంగ్యసిద్ధిలోను, అతివేలమైన ఆవేశంలోనూ మాటుమణిగి పోతున్నవి.

ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, రాయప్రోలు సుబ్బారావు, తురగా వెంకట్రామయ్య, వేదుల సత్యనారాయణశాస్త్రి, బొడ్డు బాపిరాజు, దువ్వూరి రామిరెడ్డి, రామచంద్ర అప్పారావు, కొడాలి సుబ్బారావు, కొడాలి ఆంజనేయులు, శివరామం, అత్తిలి సూర్యనారాయణమూర్తి, ఉమామహేశ్, కుందుర్తి నరసింహారావు, కృత్తివాసతీర్థులు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, పిలకా గణపతిశాస్త్రి, పురిపండా అప్పలస్వామి, శ్రీరంగం నారాయణబాబు, రుక్మిణీనాథ శాస్త్రి, జనమంచి కామేశ్వరరావు, టేకుమళ్ళ కామేశ్వరరావు, కందుకూరు రామభద్రరావు, రజనీకాంతరావు, దేశిరాజు కృష్ణశర్మ, చిరంజీవి ప్రభృతులు వివిధ రకాలుగా గేయాలు వ్రాసి పేరు పొందారు, పొందుతున్నారు, పొందుతారు.

ఆధునికులు గేయరచనలమీద అభిమానోత్సాహాలు ఇనుమడించి రసవంతమైన రచనలు చేస్తారని నమ్ముతూ, చెప్పవలసినది క్లుప్తంగా ప్రతిపాదించాననే తృప్తితో విరమిస్తున్నాను.

***ప్రతిభ, జూలై 1940, అక్టోబరు 1941***

# శివశంకర స్వామి

## (1892-1977)

"కలనిస్వన కవికోకిల
కులకూజిత మధుర మధుర గుంజిత నవ మం
జుల సాహిత్యవనీ మధు
కులపతి, సురభిప్రభావ, గురుదేవ, శివా!" (నాయకురాలు)

మా గురువర్యులైన శివశంకరస్వామి మహాకవివర్యులు. మహనీయ వ్యక్తులు; మరపురాని మనీషులు. సముజ్జ్వల మహాసంస్థలు; సర్వతోముఖ సాహిత్య సేవకులు. నవ్యసాహిత్యాన్ని నానా రమణీయరూపాలతో అలంకరించి అభినందింప జేయటానికి అవతరించిన కారణజన్ములు. నవ్యసాహిత్యయుగ నిర్మాతలలో ప్రముఖులుగా పరిగణనీయులు. ప్రతిభావ్యుత్పత్తుల్లో సమానసామర్థ్యం గల సాహిత్య శక్తిసంపన్నులు. సాహితీతపస్సే నిత్యవృత్తిగా, ఆంధ్రజాతికి పరమ ప్రయోజనకరంగా గడిపి, వందనీయమైన సహస్రమాస జీవితానంతరం సిద్ధి పొందిన అమృతజీవులు; చిరస్మరణీయులు.

శివశంకరస్వామి బహుభాషాకోవిదులు. "వివిధ శాస్త్ర పారావారాలను చుళుకించిన విద్వద్వతంసుడు''. సౌందర్య ద్రష్టలు. సరసహృదయులు. సంభాషణచతురులు; గోష్ఠీ ప్రియులు; మహావక్తలు. సాహిత్య కులగురువులు. నవ్యులకు ప్రాచీనులు; ప్రాచీనులకు నవ్యులు. సాహిత్య సంచార ప్రచారకులు, జంగమ విజ్ఞాన సర్వస్వ స్వరూపులు. మార్దవ సంయమనాలు ముఖ్యగుణాలుగా గల సాహిత్య మహావిమర్శకులు, అజాతశత్రువులు అయిన వీరి ప్రోత్సాహాన్ని పొందని నవ్య సాహిత్యకుడు లేడనటంలో అతిశయోక్తి అణుమాత్రం లేదు.

స్వామి శివశంకరులు ప్రధానంగా నవ్యసాహిత్యసృష్టికి మూలకందమైన సాహితీ సమితికి సభాపతులు; వ్యాప్తికి హేతుభూతమైన మహాసంస్థ అయిన నవ్యసాహిత్య పరిషత్తుకు సర్వతోముఖ సంరక్షకులు.

శివశంకరస్వామి తెలుగుదేశంలోని మంగళగిరి పుణ్యక్షేత్రానికి సమీపాన ఉన్న కాజ అనే గ్రామంలో 12-9-1892న షడ్దర్శనపారగులు. తపస్సంపన్నులు, తరతరాలుగా తురీయాశ్రమాన్ని స్వీకరించి బ్రహ్మీభూతులయిన తల్లావజ్ఝల వారి వంశంలో సుకృతి విశేషం వల్ల ఉద్భవించారు. మహా భక్తవరేణ్యులు, శ్రీకృష్ణ లీలాతరంగిణి కావ్యకర్తలు అయిన శివనారాయణ తీర్థులవారు వీరి తల్లావజ్ఝల వంశానికి మూలపురుషులు. శివశంకరస్వామివారి వంశంలో శ్రీకృష్ణ లీలాతరంగిణిని పాడటం స్త్రీలు కూడా అభ్యసించవలెనట. శక్తి లేనివారు మూడుతరంగాలైనా చెప్పుకోకపోతే నారాయణ తీర్థులవారి శాపం తగిలేదట; శివశంకరస్వామికి బాల్యంలో ప్రథమతః కర్ణగోచరమైనవి శివనారాయణ తీర్థులవారి శ్రీకృష్ణ లీలాతరంగిణి శ్లోకాలే, వ్యుత్పన్నులు, సంపన్నులు అయిన తమ తండ్రిగారు శ్రీ కృష్ణశాస్త్రిగారు, అమృత వాక్కుతో శ్రీకృష్ణ లీలాతరంగిణిలోని శ్లోకాలను అంటూ, తమచేత నిత్యం చిన్నతనంలో నటన చేయించినట్లు, అందువల్ల "శైవా వయం న ఖలు తత్ర విచారణీయం పంచాక్షరీ జపపరా నితరాం తథాపి చేతో మదీయ మతసీకుసుమావభాసం స్మేరాననం స్మరతి గోపవధూకిశోరమ్" అన్న వసంతతిలక శ్లోకతాత్పర్యం తమ అంతరంగంలో అంతర్నిహితమైనట్లు, తమ వంశంలో అనుదినం పురాణశ్రవణమయ్యే ఆంధ్రభాగవతాన్ని అనవరతం పఠించటం వల్ల భగవద్భక్తి లగ్నమైనట్లు స్వామి శివశంకరులు చెప్పుకున్నారు. మహా విద్వాంసులు, సంగీతశాస్త్ర పారంగతులు, పెత్తండ్రులు అయిన నరసింహ శాస్త్రిగారు 1908లో వీరికి, శ్రీకృష్ణ లీలాతరంగిణి పాఠం చేయిస్తూ, వారికి అభిమాన కావ్యమయిన గీత గోవిందాన్ని గురించి చెప్పటం వల్ల, వీరికి గేయ రచనావిధానం మీద ఆసక్తి కలిగినట్లు, తదనంతరం అనతికాలంలోనే "కవిత్వం గేయ ప్రాయ" మన్న భావం స్ఫురించి, సుస్థిరం కావటం మొదలు పెట్టినట్లు కూడా వీరు వెల్లడించారు.

కుటుంబ ప్రభావం వల్ల స్వామి శివశంకరులకు మొదట సంస్కృత భాషాభిమానం కలిగి అది పట్టుబడ్డది. తరువాత వీరు యౌవనారంభంలోనే తెలుగు సాహిత్యం మీద విశేషకృషి చేశారు. భావంమీదనే కాక వీరికి భాష మీద కూడా విశేష ప్రీతి లభించటం, ఉపనిషత్తులవల్ల కొంత ఉద్దీప్తిని పొందటం, సహజంగా అలంకారప్రియత్వం ఉండటం మొదలయిన లక్షణాలతో సమ్మిళితమై, సరళమైన హృదయం గల వీరు సహజ కవులు కావటం, అప్రయత్నంగా వీరి నోట మొదట ఆటవెలది అవతరించటం జరిగాయి. పిమ్మట స్వామి శివశంకరుల పన్నెండో ఏట, మాలతీమాధవ నాటకంలో మాలతీ ప్రియుడైన మాధవుడు అఘోరకంఠుడనే

కాపాలికుణ్ణి ఖండఖండాలు చేసి ప్రియురాలిని రక్షించుకునే ఘట్టంలో నోట తేట గీతి పద్యం వచ్చింది. అంతట రెండు సంవత్సరాలకు, అంటే 1904న వీరు బంధువులు, విద్వద్వరేణ్యులు అయిన శ్రీ నోరి హనుమచ్ఛాస్త్రులవారి చరణసాన్నిధ్యంలో ఛందస్సు నేర్చుకోవటం వల్ల పద్యరచన, నాటకరచన సాగాయి. అప్పుడు వీరు 'మోహిని' మొదలయిన నాటకాలు, 'ఖుష్ రోజ్' మొదలయిన కావ్యాలు చెప్పటం, తండ్రిగారు వీరు సాహిత్య రచనలవల్ల జీవిస్తారని ఆనందించటం జరిగాయి. "అనవరత పంచాక్షరీ జపం చేత పవిత్రమైన అమృతవాక్కుతో ఆశీర్వదించి, 'పార్థివపూజ' చేత పరిపూతమైన పాణితో అభయమిచ్చిన అస్మత్తాత పాదులు శ్రీకృష్ణశాస్త్రులవారి తపోబలం చేతనే" తమ కవితాశక్తి విజృంభించిందని శివశంకరస్వామి విశ్వసించారు.

సింహలగ్న జాతకులైన శివశంకరస్వామి, చిన్నతనం నుంచి శరీర వ్యాయామం మీద కొంత కుతూహలం వహించారు. ఈతలో, గుఱ్ఱపు సవారీలో శక్తి సంపాదించారు. క్రికెట్, టెన్నిస్, బేస్ బాల్, అన్న ఆటలమీద ప్రీతి వహించి అధికప్రజ్ఞలను ఆర్జించారు. వ్యవసాయం మీద, ఉద్యానకళమీద ఆసక్తి వహించి శ్రమచేసి, తాము నిర్మించుకొన్న ఆశ్రమాలలో వాటిలో సంపాదించిన రమణీయ పరిశ్రమను, ప్రజ్ఞను ప్రదర్శించారు.

ఆధునిక సాహిత్యానికి ఆచార్యపీఠం వహించవలసి ఉన్న శివశంకర స్వామి, 1908లో తండ్రిగారైన శ్రీ కృష్ణశాస్త్రిగారు మరణించడం వల్ల, మెట్రిక్ లేషన్ పరీక్ష మొదటి రోజుననే ఆంగ్ల విద్యాభ్యాసానికి సంబంధించిన పాఠశాల చదువును పరిత్యజించారు. తరువాత 1909లో శ్రీ కంభంపాటి సీతారామశాస్త్రిగారి దగ్గర సంస్కృత కావ్యపఠనం, 1910లో వేదాంతం శ్రీరామశాస్త్రి గారి దగ్గర సాహిత్య కృషి, 1911లో మహానుభావులైన దెందుకూరి నరసింహశాస్త్రుల్లవారి దగ్గర న్యాయశాస్త్ర పఠనం ప్రారంభించటం. 1913లో వేదాంతం లక్ష్మీపతిశాస్త్రిగారి దగ్గర వ్యాకరణ శాస్త్ర పఠనం, దెందుకూరి పానకాల శాస్త్రి గారి దగ్గర న్యాయశాస్త్ర పఠనం చేశారు. బహుభాషా ప్రియత్వం వల్ల వీరు 1911-12లలో బెంగాలీ, హిందీ భాషలు, 1913లో ఉరుదూ, పారశీక భాషలు అభ్యసించారు.

అన్యభాషలలో నుంచి నవలాసాహిత్యం అనువాదాన్ని పొంది విశేషంగా వస్తూ ఉండటం వల్ల, స్వామి శివశంకరులు నవలాసాహిత్య రచనాభిలాషతో 1912లో వంగభాషనుంచి 'నీరద' అనే నవలను, 1914లో 'అఖ్యాయికాపరంపర' అనే గ్రంథమాలను స్థాపించి, 'రఘునాథజీ' అనే నామాంతరం గల మహారాష్ట్ర భాషలోని "జీవన ప్రభాతం" అనే నవలను, వంగభాషనుంచి అనువదించి ప్రకటించారు.

ఈ 1914లోనే ఉర్దూ, పారశీక భాషలను అభ్యసిస్తూ "రసపుత్ర జీవనసంధ్య" అనే హిందీ నవలను అనువదించి ప్రకటించారు. 1915లో అభిమానంతో జర్మనీ భాష శ్రమపడి నేర్చుకొన్నారు. ఈ సంవత్సరంలోనే వీరు "మురారి కథలు" అనే శీర్షిక క్రింద "గాదె" మొదలైన మౌలిక కథలను రచించి, అనతికాలంలో కథాసాహిత్య మాసపత్రికను ప్రకటించటానికి ప్రయత్నించారు.

స్వామి శివశంకరులు 1916లో బొంబాయి మహానగరంలోని "జే జే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్"లో కొంతకాలం శిల్పాన్ని అభ్యసించారు. ప్రారంభదశలో చక్కని సౌందర్య దృష్టిగల వీరు చిత్రాలు గీయటం, అజంతా చిత్రాలకు నకళ్లు చేయటం చేస్తుండగా ఆశ్చర్యపడి, మహారాష్ట్రుడైన శిల్పకళాగురువు "మీ రెవ" రని ప్రశ్నిస్తే "ఆంధ్రులము మహారాష్ట్రుల పూర్వికుల" మని ఆంగ్లభాషలో సగర్వంగా సమాధానము చెప్పటం వల్ల, ఆయనకు కోపం కల్గటం, వెంటనే వీరు శిల్పవిద్య మానటం జరిగాయి. కాని ఈ స్వల్ప విద్యాభ్యాసం వల్లనే శివశంకరస్వామికి ఎంతో ప్రయోజనం కలిగింది. నోబెల్ బహూకృతిని పొందిన హెమింగ్ వే అన్న నవలా రచయిత "One can learn much about the structure of prose from studying the structure of Paintings" అని అన్నాడు. శివశంకరస్వామి వచన నిర్మాణమేకాక పద్య గేయనిర్మాణాన్ని కూడా నేర్వవచ్చునని గమనించారు; అనుభవించారు.

శివశంకరస్వామి 1918లో మరాఠీభాషను, 1919-20లో వైదిక సంస్కృత, ప్రాకృత, పాళీ భాషలు నేర్చుకున్నారు. అధ్యాపకదృష్టిమీద బుద్ధి ప్రసరించటం వల్ల, వీరు ఈ మూడు సంవత్సరాలు గుంటూరు క్రైస్తవ కళాశాలలో పండితులుగా పనిచేసి, ఉత్తమ విద్యాబోధకులని విఖ్యాతిగన్నారు.

శివశంకరస్వామి 1917లో కొడవటిగంటి, కొమాండూరి, వేదుల, నోరి మొదలైన కవులను, చింతా దీక్షితులు, మునిమాణిక్యం నరసింహారావు మొదలైన కథకులను సమావేశపరచి, 'సాహితీ సమితి' అనే నవ్యసాహిత్య ప్రియుల సాహిత్య సంఘాన్ని స్థాపించారు. సర్వతోముఖ సాహిత్య ప్రజ్ఞాన్వితులు కావటం వల్ల ఈ సమితికి సభ్యులు శివశంకరస్వామిని సభాపతిగా ఎన్నుకొన్నారు. తరవాత అనతికాలంలో ప్రఖ్యాతులైన కృష్ణశాస్త్రి, నండూరి, కొడాలి ఆంజనేయులు, విశ్వనాథ, మొక్కపాటి మొదలైనవారెందరో సాహితీ సమితి సభ్యులు కావటం జరిగింది. 1920లో ప్రారంభింపబడ్డ "సాహితి" అనే మాసపత్రికను సభాపతి శివశంకరస్వామి శక్తిమంతంగా నాలుగు సంవత్సరాలు నడపటం, తద్వారాను, ఇతర విధాల సాహితీ

సమితివారు ప్రాచీనపంథాను విడిచి, సాహిత్యరంగంలో నవ్యవీథులు నిర్మించి యువత హృదయాలల్లో నూతనసృష్టి కోసం తపన కల్పించటం జరిగాయి. అనతికాలంలో సాహితీ సమితి సభ్యులు తమ రచనల మూలంగా జనాదరణ పాత్రులైనారు. "ప్రాచీన సాహిత్యానికి సాహితీ సమితి స్థాపనము ఒక సీమావధి. అది అంతకు ప్రాచీన యుగానికి ఆశ్వాసాంతము. నవీనయుగానికి నాందీ ప్రస్తావము. సాహితీ సమితి వారు చిరస్మరణీయులు" అని మహాచరిత్రకారులు శ్రీ మల్లంపల్లివారు సాహితీసమితిని, తన్మూలంగా సభాపతులైన శివశంకర స్వామిని అభినందించారు. శివశంకరస్వామి సాహితీ సమితిని నిర్వహించటంలో గాఢమైన క్రమశిక్షణను, మహాదక్షతను ప్రదర్శించటాన్ని సహించలేని కొందరు సభ్యులు, 1925లో విడివడటం జరిగింది. శివశంకరస్వామి స్వపక్షమువారైన సభ్యులను ఉల్లాసపరచి 1925లో "సఖి" అన్న సుందర త్రైమాసపత్రికను పెట్టించి దానిని కొంతకాలం శక్తిమంతంగా నడిపించారు. శివశంకరస్వామి సభాపతిత్వాన సాహితీసమితి, వారి అస్తమయం వరకు నవ్యసాహిత్య సేవ చేస్తూనే ఉన్నది.

"స్వామి శివశంకరశాస్త్రులు తమ గ్రంథాల వల్లనే కాక సాహితీ సమితి ద్వారా కూడా నవ్య కవిత్వానికి సాహిత్యానికి గొప్ప పటిమ ఇచ్చారు. వీరు మహావ్యక్తి; వీరే ఒక సంస్థ. ఎన్ని భాషలో వీరెరుగుదురు. ఎన్నో సాహిత్య హృదయాల లోతులలో తరచి చూచారు. కాని సంస్కృత వాఙ్మయమంటే మోజు ఎక్కువ. వీరి హృదయం ఎంత ఆర్ద్రమో అకలంకమో కాకపోతే, వీరి ప్రతిభ ఎంత గాఢము నిశితము కాకపోతే చిత్రచిత్ర ప్రకృతులు గల కవుల నందరిని ఒక కూటంలో అంతకాలం కూర్చి ఉంచగలరు!"... అని కృష్ణశాస్త్రి ఆ నాటి శివశంకరస్వామి మీద ఇచ్చిన హృదయ పూర్వకమైన అభిప్రాయం సమస్త సాహితీ సమితి సభ్యుల అభిప్రాయ మనటంలో అసత్యం లేదు.

శివశంకరస్వామి 1920లో "మాధవీకంకణము" అనే వంగ నవలను ఆంధ్రీకరించారు. వీరు 1922లో తెనాలి జాతీయ కళాశాలలో ఉద్యోగం నిర్వహిస్తూ, కురుగంటి శ్రీరామశాస్త్రులవారి వద్ద తర్కాన్ని, జగద్గురు కల్యాణానంద భారతీస్వామి వారివద్ద సూత్రభాష్యాలను, అద్వైత వేదాంత గ్రంథాలను పఠించారు.

వీరు 1921-22లలో తరువాత మహానటకులని విఖ్యాతి గన్న స్థానం నరసింహారావు, మాధవపెద్ది వెంకట్రామయ్య, కన్యాశుల్కంలోని గిరీశం పాత్రను ప్రదర్శించటంలో పరమ ప్రఖ్యాతి వహించిన గోవిందరాజుల సుబ్బారావు, పులిపాటి

వెంకటేశ్వరులు మొదలైనవారు సభ్యులుగా ఉంటున్న "రామవిలాససభ" అనే తెనాలి నాటక సంస్థకు గౌరవనీయ దర్శకులుగా వర్తించి, అనేక నూతన పరివర్తనలను, అభినయ విశేషాలను ప్రవేశపెట్టి క్రమశిక్షణతో నటనాకౌశలాన్ని పెంపొందించి దక్షతతో యావదాంధ్రదేశంలోను అత్యుత్తమంగా నాటక ప్రదర్శనలను నడిపించి కీర్తిగన్నారు.

1923-27లలో శివశంకరస్వామి రాజమహేంద్రవరంలోని అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడుగారి "సరస్వతీ గ్రంథమండలి"కి గౌరవ సంపాదకులై ఉద్యోగిస్తూ, ఎందరో నాటక కర్తలకు, నవలాకారులకు దోహదమిచ్చి ప్రోత్సహించారు. వీరు 1923లో కాంచనమాల, 1926లో కుంకుమభరిణె అన్న వంగభాషా నవలలను అనువదించి ప్రకటించారు. 1924లో మచిలీపట్నంలోని జాతీయ కళాశాలలో లోకవిఖ్యాతి గన్న చిత్ర కళాకారుడయిన ప్రమోదకుమార చటర్జీ దగ్గర చిత్రకళ అభ్యసించాలన్న కుతూహలంతో వీరు కొంతకాలం గడిపారు. 1925-30లలో పాశ్చాత్య భాషలకు మూలకందమైన లాటిన్ భాషను, ఫ్రెంచి భాషను కొంతవరకు అభ్యసించారు.

విపులమైన రాజకీయ విజ్ఞానాన్ని ఆర్జించిన శివశంకరస్వామి దృష్టి విశేషంగా 1928 నుంచి జాతీయోద్యమం మీద, సంఘసంస్కరణ, దేశసముద్ధరణలమీద ప్రసరించటం ప్రారంభించింది. ఆ సమయంలో వీరు ఆంధ్ర రాష్ట్రోద్యమాదుల వల్ల విశేష ఖ్యాతి నార్జించిన గుంటూరులోని "యంగ్‌మెన్స్ లిటరరీ ఎసోషియేషన్" లోని ప్రముఖ సభ్యులలో ఒకరైనారు. 1928-29లలో గుంటూరులోని "శ్రీకృష్ణాశ్రమం" అనే నిమ్నజాత్యుద్ధరణ సంఘ పాఠశాలకు ఉపాధ్యాయులుగాను, ఆ సంస్థలో నడపబడే జాతీయ పరిశ్రమలకు పర్యవేక్షకులుగాను వ్యవహరిస్తూ దేశసేవ చేశారు. సర్వతంత్రస్వతంత్రులు దేశస్వాతంత్ర్య ప్రియులు అయిన వీరు శ్రీ కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య, గొల్లపూడి సీతారామ శాస్త్రి, నడింపల్లి నరసింహారావు, అమంచర్ల శేషాచలపతి మొదలైన దేశభక్తి తత్పరులు, దేశస్వాతంత్ర్య ప్రియులు అయిన నాయకాగ్రణ్యుల స్నేహ ప్రభావ పరిచయ ప్రియాల మూలంగాను, గాంధీ మహాత్ముని శంఖారావం కర్ణగోచరం కావటం వల్లను సహాయ నిరాకరణోద్యమంలో ఈ సమయాన విశేష కృషి చేస్తుండేవారు. శివశంకరస్వామి 1930-32లలో ముమ్మారు కఠిన కారాగారశిక్షలు అనుభవించారు. ఆ సమయంలో వీరు గుంటూరు మండల కాంగ్రెస్ కార్యదర్శిగాను, అఖిలాంధ్ర కాంగ్రెస్ సభ్యులుగాను ఎన్నుకోబడి అధిక గౌరవాన్ని వహిస్తూ మహోద్యమాలను

నడిపించారు. ప్రభుత్వం కారాగారశిక్ష విధించి వీరిని తీసికొని వెళుతున్నప్పుడు అప్పటికే అధిక కీర్తిప్రతిష్ఠలు ఆర్జించుకొన్న విశ్వనాథ సత్యనారాయణ, కొడాలి సుబ్బారావు, కొడాలి ఆంజనేయులు మొదలైన కవి ప్రముఖులు సహితం గుంటూరు రైల్వే స్టేషన్ దాక వెంట నడచివెళ్లి చింతాక్రాంతులవుతూ వీడ్కోలు చెప్పటం, వీరి దేశభక్తిని విశిష్టంగా గౌరవిస్తూ ప్రచారం చేయటం సాహిత్యలోకాన్ని ఆకర్షించాయి. ఈ సందర్భంలో శివశంకర స్వామిని శ్రీ గిడుగు రామమూర్తి పంతులు 24-10-1930న పర్లాకిమిడి నుంచి కడలూరు కారాగారానికి వ్రాసిన లేఖలో ఇలా ప్రశంసించారు.

"మీ విషయమై ఆంధ్రపత్రికలో ప్రకటితమైన వార్తలు చూస్తూనే ఉన్నాము. మీ అవస్థ తలచుకొని దుఃఖిస్తూ ఉంటాను. కానీ మీరు ప్రకటించిన దేశాభిమానం స్థైర్యము ధైర్యము కొనియాడదగినవేను. మీది నిష్కలంకమైన ప్రవర్తన. మీవంటివారికి ఇట్టిపాట్లు కలగడం దురదదృష్టం. మీ పొటోగ్రాపు మా కంటి ఎదుటనే ఉంటున్నది. అది ఉండకపోయినా ప్రియమిత్రులైన మిమ్ము తలచుకోకుండా ఉండగలమా? బందిఖానాలో ఉన్నా మీరు క్రొత్త గీతాలు రచిస్తున్నారు. బందిఖానా మీ మనసునూ మీ ఉత్సాహాన్ని అరికట్టలేదు. మనకు ప్రాణ ప్రియమైన వాడుక భాషలో "మాలపల్లి" శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు రచించినట్లే మీరు కూడా ఏదైనా గొప్ప గ్రంథము రచిస్తారని అనుకుంటూ ఉంటిని. ఇప్పుడు కాకపోతే ఏమాయెను; విముక్తి అయినతరువాతే "స్థిత ప్రజ్ఞులు" మీ సంకల్పం వల్లను అట్టిది పుట్టవచ్చును. మీరు మీ ప్రతిజ్ఞను పరిపాలించుకోగలరని నేనెరుగుదును. అది చూడటానికి ఐనా బ్రతికి ఉండగలననే ఆశతో ఉన్నాను."

శివశంకరస్వామి ప్రఖ్యాతులైన దేశభక్తి తత్పరులు, జాతీయోద్యమ నాయకులు, సంఘ సంస్కార ప్రియులు కావటం వల్లనే, తెలుగు జాతికి మహా నాయకులైన ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రిత్వం వహిస్తున్నప్పుడు, 1946లో వ్రాసుకొన్న తమ "ఆత్మకథ" అన్న మహాగ్రంథానికి అభిలాషతో అర్థించి శివశంకర స్వామి చేత పీఠిక వ్రాయించుకోవటం జరిగింది.

కారాగారంనుంచి చివరిసారి తిరిగివచ్చిన తరువాత బహుపాశ్చాత్య భారతీయ భాషాభిజ్ఞులు, భారతీయ సంస్కార ప్రియులు, కవిశేఖరులు అని ప్రఖ్యాతిగన్న శివశంకరస్వామివారిని, శ్రీ బెజవాడ గోపాలరెడ్డి మహాశయులు 1933 జులైలో మహాకవి రవీంద్రనాథుని శాంతినికేతనంలో తెలుగు ప్రొఫెసర్‌గా నియోగింప జేయటానికి ప్రయత్నం చేశారు. కాని అనిర్వచనీయ కారణాలవల్ల వీరు అందుకు

అంగీకరింపలేకపోయారు. శ్రీ రాజా రంగయ్యప్పారావు అధ్యక్షతన 1930లో ప్రారంభమై సాగుతున్న ఆంధ్ర నాటకకళాపరిషత్తు, 1933లో యువనటులకు మంచి పాఠశాలను నడిపించదలచి శివశంకరస్వామిని గౌరవనీయులైన అధ్యాపకులుగా వర్తింపుడని ఆహ్వానిస్తే, పై కారణాలవల్లనే ఇందుకుకూడ అంగీకరింపలేకపోయినారు.

శివశంకరస్వామి జిల్లా కాంగ్రెసు కార్యదర్శిత్వం వల్ల, ఆంధ్రరాష్ట్ర సభ్యత్వం వల్ల, పొందిన కారాగారశిక్షలవల్ల 1930 నుంచి రెండుమూడు సంవత్సరముల కాలంలో తగిన కులగురు పర్యవేక్షణ లేకపోవడం వల్ల నవ్యాంధ్రసాహిత్యలోకానికి అభివృద్ధి నిరోధకాలు, అనేక కష్టపరంపరలు ఎదుర్కొంటూ ఉండడం చేత, దేశంలోని అనేకమంది సాహిత్యకులు, ముఖ్యంగా విప్లవతత్త్వం గల యువసాహిత్యకులు క్లేశపడ్డట్టు వ్యక్తమౌతున్నది. శివశంకరస్వామి తమ "నీలకంఠ కథ"అనే శృంగార కథల మూలంగా విశేష ప్రచార సహాయం చేస్తుంటే, అభ్యుదయ దృక్పథంతో "అహంభావ" సాహిత్యాన్ని సృష్టించే దృష్టితో జ్వాలాపత్రికను నడుపుతున్న ముద్దుకృష్ణ మహాశయుడు ఈ క్లిష్ట పరిస్థితుల వల్ల ఎంతో చింతపడ్డట్టు విశేషంగా వ్యక్తం చేశారు.

1933–34లలో శివశంకరస్వామి తన రాజకీయాది జీవితానికి కొంత స్వస్తి చెప్పారు. జన్మస్థానమైన కాజకు సమీపంలో ఉన్న కంతేరనే గ్రామానికి కొంతదూరంలో ప్రకృతి మనోజ్ఞమైన మహేశ్వరాశ్రమాన్ని నిర్మించుకొని ప్రశాంతంగా, ఏకాంతంగా, మునివృత్తితో జీవించారు. ఆ సమయంలో వీరు నూతనమైన రసవత్కావ్యసృష్టి చేయటం, సమీప ప్రదేశాలనుంచి తమను దర్శించటానికి వచ్చే జనసామాన్యానికి భక్తిని, రాజకీయ విజ్ఞానాన్ని ప్రసాదించటం, సాహితీ సమితి సభ్యులను ఉత్తమంగా ప్రోత్సహించి నూతన సాహిత్య సృష్టి చేయించటం సాగించారు. ఈ కాలానికి సాహితీసమితి ప్రాశస్త్యం అమెరికాకు, కొన్ని పాశ్చాత్య దేశాలకు వ్యాపించింది. ఒక అమెరికా విజ్ఞాన సర్వస్వం "శివశంకరుల ప్రభావం వల్ల 1917లో ఆయన సభాపతిత్వంతో, ఉత్తమ సాహిత్యక కవి మిత్రబృందం ఏర్పరుచుకొన్న 'సాహితీ సమితి' 'ప్రీ రాఫెలైట్ బ్రదర్ హుడ్' వలె నడచి నూతన సాహిత్యకృషి చేసి, ఈ నాడు మంచిపేరు తెచ్చుకుంటున్నది" అని వెల్లడి చేసింది. సాహితీ సమితి సభ్యులే కాని, ఇతర విద్వాంసులు, కవులు, కథకులు సైతం సాహితీసమితి కృషిని మెచ్చుకొనే సందర్భంలో శివశంకరస్వామిని, కీర్తించటం జరిగింది. ఇందుకు 'కవిమిత్రులు' అన్న కృష్ణాపత్రిక వ్యాసాలలో, మహాకథకులు విద్వద్వరేణ్యులు అయిన మల్లాది రామకృష్ణశాస్త్రి శివశంకరస్వామిని గురించి చేసిన ప్రశంస ఒక నిదర్శనం. ఇందులో శ్రీ రామకృష్ణశాస్త్రి "శాస్త్రిగారు కవి కళవళికలతో కనపడతారు; పలకరిస్తే పండితుడిలా మాట్లాడుతారు. ఆ మనోహర రూప భావ

సాదృశ్యాన్ని గమనించి ఎంతవారైనా ఎవరైనా ముగ్ధులైపోతారు. నవ్యసాహిత్య ప్రపంచంలో క్రొత్తరీతులకు త్రోవ చూపించింది, క్రొత్తరుచులు ఎరిగించింది, కవితాకన్యను మనోహరంగా, వింతగా చూడముచ్చటగా అలంకరించిందీ, ఆమెకు క్రొత్త పోకడలు నేర్పింది నవకవులందరిలోకి తొలుదొలుత శివశంకరశాస్త్రి గారే. నవ్యభావ విజ్ఞాన రచనావిధానోదయానికి ధ్రువతార శ్రీ శాస్త్రిగారు. ఇది అంతా ఆయన చలవ. ఆయన చూపని సులభోపాయం లేదు. కావ్య రచనావిధానానికి అవుననకపోయినా అనుకరించిన ఆధునికులు లేరు" ఇత్యాదిగా వ్రాశారు.

ఈ సమయంలోను, తరువాత అనతికాలంలోను శివశంకరస్వామి నవలా రచయితలకు కథారచయితలకు పత్రికాధిపతులకు తెలుగు భాషా (వ్యావహారిక భాషా) స్వరూపాన్ని నిరూపించి ప్రదర్శించటం జరిగింది. ఈ విషయాన్ని గురించి సుప్రసిద్ధ కథారచయితులైన శ్రీనివాస శిరోమణి "వినోదిని" అనే హాస్యరస మాసపత్రికకు సంపాదకులుగా ఉంటూ, 1935 ఆగస్టు నెలలో ఇలా వ్రాశారు.

"ఆఖ్యాయికా పరంపరంలో మునిగి తేలుతూ ఉన్నాడు... శ్రీ శివశంకరశాస్త్రి నోటి మాటలు కాకుండా – బహుభాషావేత్త. సాక్షాత్తు సదాశివస్వరూపుడు – తెలుగు వచనం ఇది అని నిర్ణయించుకొని వచనంలో వ్రాయడానికి పూనుకొన్నాడు... ఆయనది అప్పారావు పంతుల అతివాదము కాదు. రామమూర్తి పంతులవారి సుశిక్షిత మితవాదమున్ను కాదు – తెనుగు స్త్రీ శిశు వృద్ధులు ఇంపుగా మాట్లాడుకుంటూ – వ్రాసుకొని చదివి ఆనందించగల తెలుగు, ఆయన దృష్టిలో వ్యావహారికాంధ్రము – గ్రాంథికాంధ్రము అంటూ లేవు. తెలుగు, ఆంధ్రము అని రెండుగా విభజించుకున్నాడు. డబడబా మోత మ్రోగేది, పద్యాలు వ్రాసేది ఆంధ్రము – ఇంపుగా చదువుకొనడానికి వీలు అయ్యే వచనము తెలుగు, అని ఆయన అభిప్రాయము. అష్టగ్రహముల లాంటివాళ్ళను ఎనిమిది మందిని చేర్చాడు. తాను గ్రహరాట్టులాగా మధ్య కూర్చున్నాడు. కలములు తీసి వ్రాయమన్నాడు. తెనుగువాళ్ళంతా ఆ రచనలకు ముగ్ధులయిపోయినారు. అట్లా వ్రాయడము ఎట్లాగని అనుకున్నారు. ప్రతివాళ్ళు అట్లా వ్రాయడము ప్రయత్నములు చేసినారు. 12 సంవత్సరములు దేశాన్ని దండయాత్ర చేసి సాధించలేకపోయిన రామమూర్తి పంతులవారి వాదాన్ని సంవత్సరంన్నరలో శ్రీ శివశంకరశాస్త్రులవారు అవశ్య ఆచరణీయము చేశారు. అంతవరకు మడికట్టుకొని సముద్రపు ఒడ్డున కూర్చున్న రెండు తెలుగు పత్రికలున్ను (ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ) అల్లావచ్చినవి ఏమి చేస్తవి? చోటివ్వక తప్పినది కాదు."

ఈ 1935లోనే స్వామీ శివశంకరులు సహాయం మూలంగా సంతరించు కోగలిగిన ఆధునిక కవుల రచనాసంకలనమైన "వైతాళికుల" ను జ్వాలాపత్రిక సంపాదకులు శ్రీ ముద్దుకృష్ణ ప్రకటించటం జరిగింది.

నవ్యసాహిత్యాన్ని సర్వతోముఖంగా వికసింపజేయాలనే మహాశయంతో గురుభాగవతుల ధర్మారావు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి మొదలైన బరంపురంలోని రచయితలు 1933లో స్థాపించిన "అభినవాంధ్ర కవి పండిత సభ" అనంతపురంలో మూడవమారు 1935లో వార్షికోత్సవం జరుపుకుంటూ, శివశంకరస్వామిని అధ్యక్షులుగా వరించటం జరిగింది. ఆ సందర్భంలో ఏవో కొన్ని కారణాల వల్ల సాహితీ సమితిలో నుంచి కొందరు సభ్యులు విడిపోయిన తరువాత, సాహిత్యకులకు అందరికీ ఒకే సంస్థ లేక పోవటాన్ని గురించి చర్చలు సాగించి, శివశంకరస్వామి బరంపురం రచయితల మహాసంస్థగా రూపొందించారు. ఇలా నవ్యసాహిత్య పరిషత్తుకు మూలకారకులై, తరవాత వీరు 1946 వరకు ఆ సంస్థకు సర్వతోముఖ సంరక్షకులుగా వ్యవహరిస్తూ మహోన్నతంగా నడిపించారు.

నవ్య సాహిత్య పరిషత్తు 1939లో పత్రికాప్రచురణ చేయటానికి నిశ్చయించు కొన్నప్పుడు నామకరణ కళావేత్తలైన శివశంకరస్వామి ఆ పత్రికకు 'ప్రతిభ' అని నవ్య సాహిత్య పరిషత్తు లక్ష్యాన్ని, భావ ప్రాధాన్యమును వ్యక్తం చేస్తూ పేరు పెట్టారు. తరువాత ప్రతి సంవత్సరం జులై, అక్టోబరు, జనవరి, ఏప్రిల్ నెలల్లో వచ్చే ఈ ప్రతిభ అనే త్రైమాసపత్రిక ప్రథమసంచిక అయిన వసంత సంచికను విద్వత్కవులు, సాహితీ సమితి సభ్యులు అయిన శ్రీ కొమండూరి కృష్ణమాచార్యులవారిచేత ప్రారంభింపచేయిస్తూ అందులో వారిచేత –

"ధరణి వాణీవిలాస సౌధము లనంగ
గ్రాలు కవితల్లజుల మహాకావ్యములకు
కారణంబయి పూర్వసంస్కారగరిమ
నెగడు ప్రతిభకు బ్రహ్మయి వగును గాత!"

అని ప్రతిభ అతిశయాన్ని వెల్లడిచేయించారు. సంపాదకవర్గ సభ్యులుగాను, గ్రంథ నిర్ణాయకసభ్యులుగాను "చాలనీ"లో గ్రంథ విమర్శకులుగాను, ప్రముఖ రచనా సంపాదకులుగాను, రచనాప్రదాతలుగాను వ్యవహరించి, వీరు నవ్య సాహిత్య ప్రచారానికి, ప్రకటనలకు 'ప్రతిభ', 'భారతి' కంటే ఉత్తమ కేంద్రమై పోయేటట్లు కృషి చేశారు.

గిడుగువారి అధ్యక్షతన గుంటూరులో 1937న నవ్యసాహిత్య పరిషత్తు వార్షికోత్సవం జరిగినప్పుడు. బి.వి. నరసింహారావు మొదలైన ఉత్తమ నటశేఖరులు శ్రీ కృష్ణశాస్త్రి దర్శకత్వాన శ్రీ శివశంకరస్వామి రచించిన "పద్మావతీ చరణచారణ చక్రవర్తి" అనే పద్యనాటికను మనోహరంగా ప్రదర్శించారు. గీతికలకు "రసిక ప్రియ" అనే నామాంతరము గల గీత గోవిందాన్ని, లాస్య ప్రధానమైన 'పీయూషలహరి' అనే ఏకాంక గేయనాటికను రచించిన జయదేవమహాకవి మధురభక్తిరూపమైన ప్రణయజీవితాన్ని ప్రదర్శించిన శివశంకరస్వామి వారి ఈ రూపకాన్ని దర్శించిన సాహిత్య ప్రియులు. విద్వత్కవివర్యులు ఎంతగానో మెచ్చుకున్నారు. 1940లో నవ్యసాహిత్య పరిషత్తు వార్షికోత్సవం బెజవాడలో జరుగుతున్నప్పుడు శ్రీ శివశంకర స్వామి నవ్యాంధ్ర సాహిత్య నిర్మాతలలో ప్రథముడైన శ్రీ రాయప్రోలుకు అఖండ సన్మానం జరిగింది. ఆ సందర్భంలో ఉపన్యసిస్తూ 1913లో "రాయప్రోలు" రచించిన "తృణకంకణము" అనే కావ్యరచనతో నవ్యసాహిత్య యుగం ప్రారంభమైనదన్న విశిష్ట ప్రకటన చేశారు.

1938 ఫిబ్రవరిలో హైదరాబాదులోని శ్రీకృష్ణరాయ నిలయంలో అఖిలాంధ్ర కథకసమ్మేళన మహాసభలు మహోజ్జ్వలంగా రెణ్ణాళ్ళు జరిగినప్పుడే అధ్యక్షత వహించిన శివశంకరస్వామి తమపై అభిప్రాయాన్ని మొదలు వెల్లడించారు. కథక సమ్మేళనంలో శివశంకరస్వామి కథాసాహిత్యాన్ని గురించి సమగ్రమైన ప్రసంగం చేసి, ఆ నాటి నిజామ్ ఆంధ్రులకు ప్రోత్సాహాన్ని కలిగించటం వల్ల వారు హైదరాబాదులో నవ్యసాహిత్య పరిషత్తు శాఖను స్థాపించటానికి పూనుకొన్నాడు.

నవ్యసాహిత్య పరిషత్తుకు గుంటూరు ముఖ్య స్థానమైనప్పుడు నవ్య సాహిత్యానికి స్థాయిత్వము కలిగించటం కోసం శివశంకర స్వామి 1939-40 లలో గుంటూరు దివ్యజ్ఞానమందిరంలో ఏకాంతంగా ప్రశాంతంగా నివసిస్తూ, సాహిత్యకులను, యువవిద్యార్థి లోకాన్ని విశేషంగా ప్రోత్సహించారు. కవివర్యుల గ్రంథముద్రణ నవ్యసాహిత్య పరిషత్తునామంతో జరిగించటానికి విశేష కృషి చేశారు. ప్రతివారం దివ్యజ్ఞాన సమాజ మందిరంలో అనేక సాహిత్య ప్రక్రియల మీద, ప్రసిద్ధులైన ఆధునిక ఆంధ్ర రచయితల మీద, ప్రపంచంలోని ప్రముఖ సాహిత్యకుల మీద ఉపన్యాసాలు ఏర్పాటు చేసి నడిపించారు. ప్రతిభలో నవ్యత ప్రధానంగా రచనలు చేసిన వారి కృతులను ప్రత్యేకంగా ఆదరించి ప్రచురించారు. శిష్ట్లా ఉమామహేశ్వరరావు వంటి విప్లవ రచయిత రచన అయిన "విష్ణు ధనువు" వంటి ఆధునికకవి కృతులను తామే మార్దవ సంయమనాలు వహించి విమర్శించారు. తాము స్వయంగా కొన్ని పద్య

గేయ ఖండకావ్యాలను, కావ్యాలను, పద్యగేయ నాటికలను రచించారు. 1940–41లో వీరు కొంతకాలం మదరాసులో నివసించి సినిమారంగ రచయితగా వ్యవహరించారు. "ఆ సమయంలో వీరు విశ్వామిత్ర పాత్రను అభినయిస్తా"రని పత్రికల్లో ప్రకటన జరిగినపుడు సాహిత్యకులు ఎంతో సంతోషించారు. కానీ అది జరగలేదు.

ఉత్తమ వక్తలు, సంభాషణచతురులు, జంగమ విజ్ఞానసర్వస్వ స్వరూపులు అయిన శివశంకరులు సాహిత్యకళా సభలను నడిపించటంలో కడు సమర్థులు. కనుక యావదాంధ్రదేశంలో ఆ మహాసభలు జరిగించవలసి వచ్చినపుడు, ఆహ్వాన సంఘ సభ్యులు వీరిని అభ్యర్థించి పిలిపించుకోవటం సర్వసామాన్యమైపోయింది. స్వామి శివశంకరులు 1943లో రాజమహేంద్రవరాన శ్రీ శొంఠి రామమూర్తి పంతులుగారి అధ్యక్షతన జరిగిన వేంకట పార్వతీశ్వరకవుల షష్టిపూర్తి సన్మానసభలను మహాసామర్థ్యంతో రమ్యాతిరమ్యంగాను, మనోహరంగాను నడిపించారు. తరువాత ఈ 1943లోనే ఆంధ్రప్రచారిణీ గ్రంథమండలికి గౌరవ సంపాదకత్వం వహించి వీరు ఖండకావ్య, నాటికా, కథాసంపుటాలను, ప్రయోజనకరమైన తమ అమూల్య పీఠికలతో ప్రచురింపచేయించారు. ఈ సమయంలోనే శివశంకరస్వామి పాశ్చాత్య కథాసాహిత్యానికి మూలపురుషు డనదగ్గ బొకాషియో "డికామెరన్", "హెక్టామెరిన్"లలో అనుసరించటం కూడా జరిగిన సోమదేవసూరి కథాసరిత్సాగరమనే జగద్విఖ్యాత కథాకథన మహాగ్రంథాన్ని సామాన్య పాఠకలోకానికి సంతృప్తి కలిగేటట్లు ఆంధ్రీకరించి, ఆంధ్రప్రచారణీ గ్రంథమాలచేత ఆరు మహాసంపుటాలుగా ప్రచురింపజేయించి గొప్ప కథాసాహిత్యసేవ చేశారు.

శ్రీ శివశంకరులు 1948లో తెలుగు భాషా సమితి అధ్యక్షులైన శ్రీ బెజవాడ గోపాలరెడ్డి మహాశయులు, శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ సంపాదకత్వాన ప్రచురించిన విజ్ఞాన సర్వస్వం మూడవ సంపుటిలో వ్రాసిన కేతన పంచతంత్ర కవులు, కంకంటి పాపరాజు, పినవీరభద్రుడు, మారన, సూరనలవంటి వ్యాసాలు వారి ప్రాచీనాంధ్రకవుల మీది అభిమానవిధానానికి, వారికిగల విజ్ఞాన ప్రదర్శనకు దిఙ్మాత్రసూచనలు. 1925లో ఆత్మపరమైన కావ్యసంపుటి అయిన "హృదయేశ్వరీ" అన్న ప్రసిద్ధ మహాకావ్యాన్ని ప్రచురించిన తరువాత, బహుకాలం తమ కృతులను వేటినీ ప్రచురింపని శివశంకరస్వామి 1945లో "కావ్యావళి" అనే పద్యగేయ కావ్యాన్ని, 1946లో "రత్నాకరము" అనే గేయ కావ్యసంపుటిని "దీక్షిత దుహిత" అనే పద్యనాటికను ప్రచురించి, యువనవ్య సాహిత్యకులకు తమ కవిత్వవైశిష్ట్యాన్ని ప్రథమతః ప్రదర్శించారు.

నవ్యసాహిత్య పరిషత్తులో శ్రేయస్సును కాక కేవలం ప్రేయస్సును మాత్రమే అభ్యసించే సభ్యుల సంఖ్య, మార్క్స్ తత్త్వవేత్త ఆర్థిక దృక్పథమే ప్రధానమైన "ప్రగతి సాహిత్య" ప్రియులైన సభ్యుల సంఖ్య, మానసిక శాస్త్రవేత్తలైన ఫ్రాయిడ్, యాడ్లర్ యాంగ్ మొదలైన వారి సిద్ధాంతాలను అనుసరించి కామప్రధానంగా రచనలు చేసే సభ్యుల సంఖ్య విస్తరించి, యువకుల దృష్టి శాంతిప్రధానము, కళాత్మకము, నిత్యత్వతాగుణ విశిష్టము అయిన సాహిత్యాన్ని దర్శించే అవకాశం క్రమక్రమంగా సన్నగిల్లిపోతూ, 1945 నాటికి శక్తిహీనమైనది అవుతుండటం వల్ల శివశంకరులు నవ్యసాహిత్య పరిషత్తునుంచి తప్పుకొని, సాహితీసమితిని పటిష్ఠం చేసి తద్వారా ఉత్తమ కవిత్వసేవ చేయదల్చుకున్నారు. ఆ సమయంలో సాహిత్యానికి సంభవిస్తున్న ప్రమాదాన్ని సహించలేక, చివరకు ఆంధ్ర మహాసభవారిచేత 25-2-1946న, తెనాలిలో సాహితీ సమితి రజతోత్సవం జరిపించారు.

ఈ ఉత్సవ ప్రారంభంలో ఆధునిక సాహిత్య విధానాలను మథించిన సాహిత్యార్ణవ కర్ణధారివలె నూతన సభ్యులు, సభాధ్యక్షులు అయిన శ్రీ కురుగంటి సీతారామభట్టాచార్యులు "ప్రస్తుత వాతావరణాన్ని బట్టి దేశీయుల హృదయాలల్లో మార్పులు కలిగి తద్వారా సాహిత్య సిద్ధాంతంలో కూడా మార్పు కలిగినది. సాహిత్యము ప్రజకొరకే అని చెప్పవలసినా, కవిని అనుసరించి ప్రజలు, ప్రజలననుసరించి కవి ఉండటం అవసరమే అయినా, ఉత్తమ కవి మాత్రం ప్రజలనే ఆకర్షించి వారిని తన దగ్గరకు లాక్కుంటాడు... ఇప్పుడు సాహిత్య పరమావధి రసాస్వాదనమా, విషయ ప్రచారమా అన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నవి. సాహిత్యం ఆనందపర్యవసాయి. ఆనందానికి రసానుభూతి ప్రధానము. రససిద్ధాంతాన్ని అంగీకరిస్తేనే తప్ప సాహిత్యతత్త్వం సిద్ధించదు. సాహితీ సమితి సభ్యులు, తత్సంపర్కము కలవారు రససిద్ధాంతాన్ని పూర్తిగా ఆమోదించటమే కాక తమ రచనలతో దృష్టాంతరీకరిస్తున్నారు" అని వెల్లడించారు. సాహితీ సమితి సాహితిని గురించి మాట్లాడుతూ శ్రీ జమ్మలమడక "శివశ్రీ లోకాన్ని గుర్తిస్తూ లోకభావానుకీర్తనం చేస్తూ, సహృదయలోకానికి సాహిత్యారాధన సామర్థ్యాన్ని ఆస్వాదనశక్తిని సంపాదించాడు. స్త్రీశక్తిని స్త్రీశక్తిగా భావించి శివశ్రీ మధుర శృంగారానుభూతిని అభినవమంజులంగా అందించటం వల్ల లోకం ఆకృష్టమయినది. శృంగారమును మధుర భావదృష్టితో చూడటమును శివశ్రీ లోకానికి నేర్పినాడు... శివశక్తుల సామరస్యము సాహిత్యము. దీనికి సంబంధించిన కాంతామయమైన ఉపాసనను లోకానికి అందించిన శివశంకరశాస్త్రి విశిష్టమూర్తి" ఇత్యాదిగా ఉపన్యసించారు. సుప్రసిద్ధ సాహితీ సమితి సభ్యులయిన చింతా దీక్షితులు, ప్రభృతులు

సాహిత్యభావ భాషాపారిశుద్ధ్యాన్ని గురించీ, సాహిత్య ప్రయోజనాన్ని గురించీ, భవిష్యత్కార్య ప్రణాళికను గురించీ గంభీర వాగ్గుంభనతో వ్యక్తం చేశారు. ఈ సమయంలోనే వావిలాల సోమయాజులు గురుదేవులైన శివశంకరులకు తన "నాయకురాలు" నాటకాన్ని అంకితం చేయటం జరిగింది. 1935 తరువాత శ్రీ శివశంకరులు ప్రతిభాధురీణులు, ప్రజ్ఞావంతులు అయిన రచయితలను నూతన సభ్యులుగా చేర్చుకుంటూ, తమ అస్తమయం వరకు సాహితీసమితిని పటిష్ఠంగా నడుపుతూ వచ్చారు. వీరు తరువాత కొద్దికాలానికి డాక్టర్ మారేమండ రామారావు నడిపే ఆంధ్రేతిహాస పరిశోధన మండలికి "సాతవాహన సంచిక" అనే మహా గ్రంథాన్ని ప్రకటించటంలో ఎంతగానో తోడ్పడ్డారు. వీరి తోడ్పాటువల్లనే సాతవాహనుల కాలంనాటి సాహిత్యాది విషయాలమీద చక్కని వ్యాసాలు పై సంచికకు లభించటం జరిగింది.

శ్రీ శివశంకరులు అద్వైతసంప్రదాయులు, భక్తితత్పరులు కావటం వల్ల వీరికి రామానుజులవారి గద్య త్రయాది గ్రంథాలు ప్రాణతుల్యాలయినవి. వీరికి ఆర్యసమాజ, బ్రహ్మ సమాజ, దివ్యజ్ఞాన సమాజాలతోను, సి.వి.వి. సంప్రదాయంతోను కొంతకాలం ప్రబల పరిచయాలు కలిగాయి. 1947లో వీరికి పారమార్థిక దృష్టి విస్తరించటం వల్ల, వంశ మర్యాదను అనుసరించి యతీశ్వరులై కాషాయాంబరధారణ చేయటం జరిగింది. వీరు 1948లో వేటపాలెం చేరి తీర్థాశ్రమాన్ని స్థాపించుకొని సన్యస్త జీవితాన్ని గడపటం మొదలు పెట్టారు. కాని సాహిత్యలోకం వీరిని, వీరు దానిని విడిచిపెట్టటం కష్టం కావటం వల్ల, వీరు సాహిత్యలోకానికి దూరులు కావటం జరుగలేదు.

అనతి కాలానికే వీరి పుత్రులు, సాహిత్య రచయితలు అయిన శ్రీ కృత్తివాసతీర్థులు కళాశాలలో సంస్కృతోపన్యాసకులుగా ఉద్యోగిస్తున్న ఒంగోలు చేరటం, అక్కడ బహువిధ సాహిత్య వైజ్ఞానిక వ్యాప్తి కోసం 1951లో 'కవిత్రయ సమాజాన్ని', 1952లో అఖిలాంధ్ర పరిషత్తును స్థాపించటం జరిగాయి. 9-9-52న సహజంగా జరిగిపోయిన వీరి షష్టిపూర్తిని వేటపాలెంలో సాహిత్య మిత్రులు 1-4-53న మహోజ్జ్వలంగా జరిపించి, కృతజ్ఞతను వ్యక్తీకరించి మహానందాన్ని పొందారు. తరువాత అనతికాలంలో ఆనాటికి వచ్చిన శ్రీ శివశంకరుల కవిత్వకృతులన్నీ రెండు బృహత్సంపుటాలుగా ముద్రితాలయినవి.

1951-52లలో శివశంకర స్వామి బహుదేశ ప్రాచ్య పాశ్చాత్య కథా వాఙ్మయానికి ఆధారభూతములని వేత్తలు అంగీకరించిన పాళీభాషలోని 547 బుద్ధుని 'జాతక

కథలను’ ఆంధ్రీకరించి, కథాసాహిత్య లోకానికి అపూర్వసేవ చేశారు. ఈ జాతక కథలను అనువదించే సమయంలో వీరు అనేక భాషలలోని అనువాదాలను శ్రద్ధతో పరిశీలించి, అర్థస్ఫూర్తి కోసం అవసరమైన సమయాలలో బౌద్ధమతస్థుడైన కౌసల్యాయనుని అభిప్రాయాలను స్వీకరించటం ప్రత్యేకంగా గమనింపదగ్గ విషయము. వ్యాకరణశాస్త్రంలో విశిష్టపాండిత్యాన్ని ఆర్జించుకొన్న శ్రీ స్వామి, 1953-55 మధ్యకాలంలో “వ్యాకరణ దర్శనచరిత్ర” అనే రమారమి 1250 పుటల బృహద్గ్రంథాన్ని రచించారు.

1950 నుంచి నడుస్తున్న సాహిత్యలక్షణాలు ప్రత్యేకంగా శివశంకరులను క్లేశపెట్టటం వల్ల, సాహిత్య లోకాన్ని సక్రమమార్గంలోకి తీసుకువద్దామన్న సదుద్దేశంతో 1955లో అఖిలాంధ్ర సాహిత్య పరిషత్తును స్థాపించి, ఆంధ్రదేశంలోని అనేక ప్రాంతాలలో గంభీరోపన్యాసాలిస్తూ తీవ్ర కృషి చేశారు. ఆ సందర్భంలో వీరు తాత్త్విక విషయాలమీద, సాంస్కృతిక విషయాలమీద కూడా ఉపన్యసించారు. అనేక మహా సభలల్లో మహావక్తలై ఉపన్యాసాలు చేస్తున్నప్పుడు శ్రీ శివశంకరులు, 1935లో “సాహిత్యాచార్య”, 1938లో “కవీంద్ర”, 1943లో “సాహిత్య సమ్రాట్”, 1946లో “మహోపాధ్యాయ” 1959లో “కవిసార్వభౌమ”, 1962లో “విద్యావాచస్పతి” ఇత్యాది బిరుదాలను పొందటం వల్లను, ఆంధ్రలోకానికి అమూల్యరచనలను ప్రకటించి ప్రసాదించటం వల్లను, 1960కి పూర్వమే అఖిలభారత సాహిత్య అకాడమీ వారు ఆకర్షితులై సభ్యులుగా ఎన్నుకొని, సన్యాసరూపంతో దర్శన మిస్తుండటం వల్ల విలక్షణంగా గౌరవిస్తూ పనులు చేయించుకోవటం, అభిప్రాయాలకు అధిక శ్రద్ధనివ్వటం జరిగింది. అట్టి స్థితిలో శివశంకరస్వామి 1961లో అకాడమీ వారి కోరిక మీద రవీంద్రుని ‘గోరా’ను వంగభాష నుంచి యథామాతృకంగా యథార్థమైన వాడుక భాషను వాడుతూ, అవసరమైన చోట్ల సంభావ్యశ్రేణికి చెందిన పదజాలాన్ని ప్రయోగిస్తూ ఆంధ్రీకరించారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు 1968 ప్రారంభంలో శ్రీ శివశంకరులకు సభ్యత్వాన్ని, కార్యనిర్వాహక సభ్యత్వాన్ని, ఉపాధ్యక్ష పదవిని, 24-8-68న విశిష్ట సభ్యత్వాన్ని ఇచ్చి గౌరవించారు. మహాసంస్థ పక్షాన శివ శంకరస్వామి అనేక పదవులను నిర్వహిస్తూ ఆంధ్రశతకసంపుటాలకు సంపాదకత్వం వహించటం ‘‘శ్రీకృష్ణ లీలాతరంగిణి”ని ముద్రింపజేయటం మొదలైన ప్రయోజనాత్మకమైన పనులెన్నో చేశారు. ఈ కాలంలో ‘దేహళి’ అనే సాహిత్య మాసపత్రికను ప్రకటించటానికి యత్నించారు.

1970 తరువాత శివశంకరులు వెనుకటికంటే అధికంగా వేదాంత గ్రంథాలకు, భాష్యాలకు, భగవద్గీతకు, ఉపనిషత్తులకు, పురాణాలకు సంబంధించిన ఉపన్యాసాలు చేస్తుండేవారు. ఇట్టి స్థితిలో 1973న వీరి ద్వ్యశీతి జన్మవాసరదినాన 'రాజజామాత' అనే గేయనాటికను పిశుపాటి వెంకటరాయ శర్మకు అంకితమిచ్చి ప్రకటించటం జరిగింది. ఇది "A woman is incapable of jealousy - man only is capable" అన్న జర్మన్ తత్త్వవేత్త 'నీచే' అభిప్రాయాన్ని రూపిస్తున్నట్లు గోచరించే గేయనాటిక. వీరి అనేక నాటికలకు వలె దీనికి గూడ కల్హణుని 'రాజతరంగిణి'లోని కథాలేశం మూలము. ఈ కాలంలోనే శ్రీ శివశంకర స్వామి రాజతరంగిణిలోని మరొక కథావస్తువుతోనే "నోణకభార్య" అనే గేయనాటికను సైతం రచించారు. సంస్కృతంలో శ్రీ గిడుగు రామమూర్తి పంతులు అభిలషించిన "స్థితప్రజ్ఞులు" అనే నవల వంటి ఒక వచనగ్రంథాన్ని, ఒక పద్యకావ్యాన్ని, ఆంధ్రంలో ఒక మహాకావ్యాన్ని – జీవిత లక్ష్యాన్ని ప్రతిపాదించేదాన్ని వ్రాయాలన్న వీరి కోరికను నిర్వర్తించుకోవటానికి, 1973–74లలో యోచనలు చేస్తూ ఉండేవారు. 1975లో ప్రపంచ ప్రథమాంధ్ర మహాసభవారు వీరిని గౌరవించారు. ఆ సంవత్సరమే సర్వతోముఖ సాహిత్యప్రజ్ఞానిధులు, సక్రమమైన సంప్రదాయంలో నవీనదృష్టితో, నూతన కల్పనలతో సాహిత్యాన్ని పెంపొందించటమే లక్ష్యంగా జీవించినవారు అయిన వీరిని ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 'కళాప్రపూర్ణ, డాక్టరేటు" బిరుదమిచ్చి సన్మానించి తమ గౌరవాన్ని నిల్పుకొన్నారు.

వృద్ధాప్యంలోని తుది దినాలలో కూడా సాహిత్యలోక కుటుంబి అయిన శ్రీ శివశంకరులు దేశం నలుమూలలా పర్యటిస్తూ, సాహిత్యకుల సంక్షేమాన్ని, కృషిని పరిశీలించారు.

తే. "సహజ దరహాస మృదువచస్సరణి మీరు
అమల సౌహార్దమున సేమ మరయునపుడు
మత్తిలిన నా ఎడందలో మాటుమణుగు
శ్రవణసుఖదాయి యుష్మత్ప్రసంగసరణి."

అన్నది శ్రీ స్వామివారు వచ్చి ప్రథమతః ప్రసంగించినప్పుడు సాహిత్యకులు పొందే అనుభూతికి ఇది ఒక తార్కాణం. వీరు చిత్రాతిచిత్ర సంభాషణలతోనూ, చేష్టలతోనూ సాహిత్యకుల ఇళ్ళలోని స్త్రీ పురుషులను, బాలురను ఆకర్షించి, ఆప్తులై పరమానందాన్ని పంచి ఇస్తుండేవారు. సాహిత్యకుల బంధువులు మరణించిపుడు శవవాహక లోపము వల్ల వ్యథపడుతుంటే శివశంకరస్వామి తామే ఆ పనిని నిర్వహించి పూజనీయు

లైనందుకు కొన్ని నిదర్శనాలున్నాయి. అటువంటి సందర్భంలో ఒక యువసాహిత్యకుడు "మీరు జగద్గురువు"లని అంటే చమత్కారం కోసం 'జగద్గురువునే' అని అంగీకరించి, ఈ పదానికి "జగత్తునే గురువుగా కలవాడు అన్నది నా ప్రస్తుతార్థము" అని చెప్పి, పెద్దలు తమను అపార్థం చేసుకోవటానికి శ్రీ శివశంకరులు అవకాశమివ్వ లేదు. ఒకమారు ఒక సాహిత్యకుడు స్వామివారు వస్తే పండితులని పిల్చి గోష్ఠి చేయిస్తున్నప్పుడు, ఒక పండితుడు "ఆచార్య శంకరుల జయంతి ఇవాళే ఎందుకు? ఎప్పుడు చేస్తే ఏమి?" అని ప్రశ్నించాడు. శివ శంకరస్వామి "పెద్దలు ఏ నాడో 'కాదినవ పరిగణనతో' 512 = 215 = వైశాఖ శుద్ధ పంచమి అని తేల్చి ఈ నాడే ఆచార్య శంకరజయంతి చేయించటం వల్ల మనం భిన్నంగా వర్తించరా" దని ప్రామాణిక వచన మిచ్చి పాదాభివందనాన్ని పొందారు.

శివశంకరస్వామి ప్రకృతి సౌందర్యం కలవి, చారిత్రక, వైజ్ఞానిక, సాంస్కృతిక ప్రాధాన్యం కలవి అయిన ఉత్తర దక్షిణ భారత దేశాలలోని బహుప్రదేశాలను జిజ్ఞాసాత్మకంగా దర్శించి, ఆనందాన్ని, సాహిత్యరచనోపయోగాలను పొందారు. వీరికి నిత్యం ఏదో ఒక పుస్తకపఠనం చేస్తూండటం యౌవనారంభకాలంలోనే అలవాటయినది. తామభ్యసించిన వ్యాకరణాది శాస్త్రాలకు, అలంకార ధర్మశాస్త్రాదులకు, వేద విజ్ఞానానికి సంబంధించిన గ్రంథాలను పఠించటమే కాక, వీరు ప్రాచ్య పాశ్చాత్య భాషలలోని అనేక సాహిత్య ప్రక్రియలకు సంబంధించిన గ్రంథాలను, తత్త్వశాస్త్ర, మానసిక శాస్త్ర, లైంగిక శాస్త్ర గ్రంథాలను, ప్రముఖ ప్రాచ్య పాశ్చాత్య దేశ చరిత్రలను, ప్రపంచ శిల్ప చిత్రకళాచరిత్రలను, మహాపురుష జీవితచరిత్రలను, ఇంకా అనేక విషయాలకు సంబంధించిన గ్రంథాలను వృద్ధాప్యంలో తుదినాటివరకు పఠించారు. ఇందువల్ల సర్వతోముఖ జ్ఞానులైనారు. అపార గ్రంథపఠన అనేక విషయాలమీద మహోపన్యాసాలు ఇవ్వటానికే కాక, సాహిత్యసృష్టికి వీరికి ఎంతగానో ఉపకరించింది. ఇంతటి గ్రంథపఠన చేసినవారు కావటం వల్లనే శివశంకరుల లేఖలు, పీఠికలు, గ్రంథపరిచయాలు, విమర్శలు, ఇత్యాదులు మహాశక్తిమంతాలు, ప్రయోజనాత్మకాలుగా రూపొందాయి.

ప్రాచీన లక్షణాలు కలవి కావటం చేత 1916 వరకు తాము వ్రాసిన పద్య రచనలను, నాటకాలను పరిత్యజించి, శివశంకరస్వామి నవ్యత్వశోభితమై 1917 నుంచి 1977 వరకు సాగి షష్టిపూర్తి జరిపించుకొన్న నవ్య కవిత్వరచననే ప్రకటించి నిల్పుకొన్నారు. స్వానుభవం వల్ల అవతరించిన వీరి కవిత్వసాహిత్యం బహుముఖ

ప్రజ్ఞావిలసితము. మహాపండితులైనా వీరు కవితలో ఎక్కడా పాండిత్య ప్రకర్షను ప్రదర్శించలేదు. “శ్రీ శివశంకరశాస్త్రిగారు వాక్శుద్ధి గల కవివరేణ్యులు; వారి రచనలన్నీ భావోదాత్తములు. వారి పద్యమయ నాటికలు హృద్యరసనాటికలు. రచన ఎంత చిన్నదైతే ఏమి? దానిలో ప్రజ్ఞ మెరపుతీగలాగు మెరపడంలో ఉంది మహిమ. శ్రీ శివశంకర శాస్త్రిగారి ‘చిత్తకుబ్జ’ రచన (ఆవేదనలోని ముత్యాలసరం షట్పదీ ఛందం 9 పంక్తులు నడిచిన ఖండకావ్యము) చదివినప్పుడల్లా నాకు పారవశ్యం కల్గుతుం” దని స్వామివారి కవితను శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి మహాశయులు ప్రశంసించారు.

“వీరి ‘హృదయేశ్వరి’ ఆత్మపరమైన కావ్యాల సంపుటి, తీవ్రానుభవాలలో వేగిపోయే హృదయం వాటిలో వేడివేడిగా ఎంతైనా కనబడుతుంది. వీరి అనువాదాలు క్రొత్తవి కావ్యరూపాలు క్రొత్తవి. వీరు కల్పించే చిత్రాలూ, అలంకారాలూ, పాత సంప్రదాయానికి దగ్గరగా ఉన్నట్లనిపిస్తాయి; వీరి భాష మీద కూడా సంస్కృతప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది; వీరి పద్యం నిదానంగా, గంభీరంగా నడుస్తుంది – ఎక్కువ వేగమూ, ఆవేశమూ, ‘పెద్ద మనిషి తరహా’ కాదన్నట్లు. వీరి దివ్యలోచనములు వంటివి (‘కావ్యాళి’ లోని ఒక సంవాదాత్మక రచన) మహామంచి కావ్యాలు... వీరు పద్య రూపకాలు వ్రాయడంలో మార్గదర్శి” అని శ్రీ దేవులపల్లి కొన్ని శివశంకర కృతులను గురించి అభిప్రాయాన్ని వెల్లడించారు. శ్రీ శివశంకరులు ‘మేదూరి వారి కోడలు’ అనే కథాకావ్యాన్ని జూన్ 1933 భారతిలో ప్రకటించినప్పుడు శ్రీ కృష్ణశాస్త్రి “ఈ మధ్య భారతిని అసలు చూడటమే లేదు నేను. నిన్న చూచాను ఈ నెలది. ‘మేదూరివారి కోడలు’ ఒకటే చదివాను. ఈ వేళ మళ్ళీ చదివి ఈ ఉత్తరం వ్రాసిందాకా తోచక ఇపుడే వ్రాసి పోస్టు చేస్తున్నాను. మన తెలుగులో పద్యాలలో ఇంతకంటే బాగుగా రచింపబడ్డ చిన్న కథ మరొకటి లేదు. ‘ఉంది’ అనే అభాజనుణ్ణి ఏం చేస్తానో తెలియదు. దీని ముందర ‘టెనిజన్’ ‘డోరా’ గిర్రుమని తిరిగి చచ్చి ఊరకుంది. వెర్రిమొర్రి పొగడ్త కాదు.... దీనిలో ఒక మాటగానీ, ఒక పాదం గానీ తీసివేయలేను. గౌరవము పోకుండా Lucidity వచ్చింది. అవసరమైనచోట్ల Poetic Heights వచ్చాయి... మొదటి పద్యం హృదయం పట్టుకుంటుంది. అపుడే వల్లిస్తున్నాను” ఇత్యాదిగా హృదయపూర్వక లేఖ వ్రాసి విమర్శించారు.

శ్రీ శివశంకరశాస్త్రి రచనలలో పద్య, గేయ కావ్యాలు – పద్య, గేయ నాటికలు అన్న రెండు ప్రధాన విభేదాలు ఉన్నవి. ఆవేదన (1917–27), హృదయేశ్వరి (1924–26), వకుళమాలిక (1935), సాధకుడు (1936), రత్నాకరము (1938–39),

వ్రతభంగము (1942), కావ్యావళి (1924–50). వీరి పద్య, గేయ కావ్యాలు, పద్మావతీ చరణ చారణ చక్రవర్తీ, వరపరీక్ష, యక్షరాత్రి, సహజయాన పంథీ, దీక్షిత దుహిత, కవిప్రియ, పదాంకము, సద్వాక్యము, రాజజామాత, నోణకభార్య వీరి పద్య, గేయనాటికలు. 1934 నుంచి వీరు దృష్టిని విశేషంగా గేయకవిత్వ ధోరణికి మరలించారు. పద్య గేయ సంవాదాత్మక రచనలలోనూ, పద్య, గేయ నాటికలలో కథావస్తు రూపక నిర్వహణ (Plot construction) ల్లోనూ, పాత్రచిత్రణలోనూ, భావ వ్యక్తీకరణలోనూ అనంత వైవిధ్యాన్ని ప్రకటించిన వీరు అద్వితీయులు. ప్రేమ, భక్తి, మధురభక్తి, ధర్మవీరము వీరి రచనలలోని ప్రధానరసాలు. వీరు సర్వత్ర స్త్రీకి విశేషోత్కర్ష ప్రకటించారు.

శ్రీ శివశంకరుల పద్య, గేయ రచనలలో కొన్ని ఆత్మ పరకావ్యాలు (Subjective Poems), కొన్ని అన్య పరకావ్యాలు (Objective Poems), కొన్ని కథాకావ్యాలు (Narrative Poems), కొన్ని వాకోవాక్యములు, కొన్ని నాటకీయ సంవాదాలు. కొన్ని నాటకీయ స్వగతాలు (Dramatic Monologues), ఇతర రచనలు : పద్య నాటికలు, పద్యగేయ నాటికలు, గేయ నాటికలు.

శ్రీ శివశంకరులు కొన్ని కథాకావ్య వస్తువులు, ఇతర కావ్య వస్తువులు భారతదేశంలోని బహుప్రదేశాలకు సంబంధించినవి కావటం వల్ల, బహు గ్రంథ పరిచయం వల్ల, పరిశోధనలవల్ల, సంపాదించారు. వీరు తమ ఉభయవిధ రచనలలో లోపాముద్ర, రేణుక, రుచి అన్న పౌరాణిక స్త్రీ పాత్రలను; జమదగ్ని, దేవశర్మ, ధనుర్దాసు, కక్కయ్య అనే పౌరాణిక పురుష పాత్రలను; చామెకాంబ, భామతి, మీరాబాయి, ప్రతాపకుమారి, అలకాదేవి, నింబవతి, రామమణి, యామినీదేవి, నీలలోచన, మొదలైన చారిత్రక స్త్రీ పాత్రలను; వాచస్పతి, రూపగోస్వామి, రామనాథ భట్టాచార్యుడు, జయదేవుడు, జ్యోతిస్సింగు, నేమి, చండీదాసు, అప్పయ్య దీక్షితులు, బిల్హణభట్టు, లలితాదిత్యుడు మొదలయిన చారిత్రక పురుష పాత్రలను అపూర్వశక్తితో సృష్టించి ప్రదర్శించారు. వీరి సజీవ పాత్రల మూలంగా వీరు ప్రణయ, భక్తి, ధర్మాది విషయాలలో మానవమనఃప్రవృత్తి ఎంత వైవిధ్యంతో వర్తిస్తుందో మనోహరంగా వాస్తవికతా (Realism) రీతిలో వెల్లడిచేశారు.

శ్రీ శివశంకరుల పద్యగేయరచనలలోని కావ్యాలన్నిట్లో, ప్రధానంగా కావ్యావళిలోని కృతులు ఎన్నో హృదయాకర్షకాలు. హృదయేశ్వరీ వకుళ మాలికలు సాహిత్యలోకంలో ప్రత్యేక విఖ్యాతి గన్న రచనలు. పద్యనాటిక అయిన పద్మావతీ

చరణ చారణచక్రవర్తి నాటకరంగంలో ప్రయోగాన్ని పొంది పేరుగన్నది. దీక్షిత దుహిత మహోదాత్త పద్యనాటిక అని ప్రఖ్యాతంగా అంగీకరింపబడ్డది. వరపరీక్ష, కవిప్రియ ఇత్యాదులైన గేయనాటికలు గానీ, యక్షరాత్రి అనే గేయసల్లాపము కానీ తమలో ఏ ఒక్క రూపలక్షణాలను పోలని ప్రత్యేక లక్షణాలతో రమ్యంగానూ, రసవంతంగానూ రూపొందిన మహానాటికలు. రూపకళావిజ్ఞానశేఖరులైన శ్రీ శివశంకరస్వామి నాటికలను, నాటక సంస్థలు, టి.వి. రసజ్ఞులు, ప్రదర్శించి ఆంధ్రజాతికి ఘనతర రసానందాన్ని ప్రసాదింపవలసిన అవసరము ఎంతైనా ఉన్నది.

బహువిధ నవ్యసాహిత్య సృష్టికీ, వ్యాప్తికీ – కారణజన్ములుగా అవతరించి తమ మహాపాత్రను శేముషీమహత్త్వంతోనూ, మనోజ్ఞతతోనూ, నిర్వర్తించి, కార్యనిర్వహణా నంతరం శ్రీ శివశంకరులు 1-4-1977న సిద్ధిపొంది, బ్రహ్మీభూతులైనారు.

***– తెలుగు వైతాళికులు, సంపుటం 4***

# వచన కావ్యాలు - రచనావిధానం

జనసామాన్యానికి, అంటే మన భాషాచరిత్రతోనూ, సాహిత్యచరిత్రతోనూ పరిచయం లేనివాళ్ళకు మన భాషలో వచనరచన చిన్నయసూరితోనూ, తరువాత ఆంగ్ల వాఙ్మయ ప్రోద్బలం వల్లనూ ఉద్భవించి దినదిన ప్రవర్ధమానం అయిందని మాత్రమే తెలుసు. నిజానికి బహుకాలంనాడే పుట్టి అప్పటినుంచీ అభివృద్ధి పొందుతూ వచ్చింది. ఆంధ్రభాషకు నన్నయే ఆదికవి అనీ, అంతకు పూర్వం అజ్ఞాతయుగమనీ వ్యవహరిస్తున్నారు. కాని, ఆయనకు పూర్వమే ప్రాచీన లక్షణ గ్రంథాలు వున్నాయట. నన్నయకు ప్రాచీనుడు దక్షిణ దేశంలోని ఒక ఛందోవేత్త 'యాప్పిరంగళ్' అనే ఛందో గ్రంథాన్ని రచిస్తూ "నేను వాంచియార్ (బహుశః వంచయ్య) అనే తెలుగుకవి లక్షణగ్రంథాన్ని అనుకరించా" నని చెప్పుకుంటాడు. లక్షణ గ్రంథాలు ఒక దేశానికి మార్గదర్శకమైనవి, బయలుదేరిన ఆ యుగంలో కావ్యాల పేర్లయినా తెలియక కాలగర్భంలో కలిసిపోవడం వింతగా వుంది.

కావ్యావళి కరువైపోవటం వల్ల ఆ అజ్ఞాతయుగం నాటి వచన సంప్రదాయాన్ని తెలుసుకోవాలంటే మనకు శాసనాలే ముఖ్యాధారం. అవైనా క్రీ.శ. ఏడవ శతాబ్దికి పూర్వంవి ఇంకా దృష్టిగోచరం కాలేదు. ఇప్పటికి లభ్యమైనవాటిలో ప్రాచీన మైనది తూర్పు చాళుక్యవల్లభుడైన జయసింహునిది. ఇది క్రీ.శ. 633 నాటిది. ఆ శతాబ్దిలోదే మంగిదొగరాజు లక్ష్మీపుర శాసనం (క్రీ.శ. 675) పశ్చిమ చాళుక్య విక్రమాదిత్యుని (క్రీ.శ. 655–680) ధర్మవరం శాసనం కూడా ఒకటి వుంది. ఇక ఎనిమిదవ శతాబ్దికి వస్తే అహదనకరశాసనం కనిపిస్తుంది. తొమ్మిదవ శతాబ్దిలో గుణగ విజయాదిత్యుని (క్రీ.శ. 854–897) ధర్మవరము శాసనము, అద్దంకి శాసనము కనిపిస్తాయి. పదో శతాబ్దిలో వచనంలో వున్న ప్రత్యేక శాసనాలు కనుపించలేదు. గ్రామచిహ్నాలను సూచించటానికి వచనం వాడేవారు, శాసనమంతా సంస్కృతంలో వుంటే.

అజ్ఞాతయుగంలో వచనరచనా విధానాన్ని తెలుసుకోవటానికి దిఙ్మాత్రోదాహరణాలు. "...సకలలోకాశ్రయ జయసింఘవల్లభ మహారాజులాకున్ ప్రవర్ధమాన విజయ రాజ్య సంవత్సరంబుల్ ఎఌంబొది అన్నేణ్టి అమ్మన్పూణ్ణమ

నాణ్డుం మ్లావిండిరాజుల ముట్లు (రాజోద్యోగి) కలివిముడి రాజుల్ మ్లావిండి సముద్రర్కై (సముద్ధరణకై) నాకు బణిసేసిన...”

**జయసింహవల్లభుని శాసనము**

“....మగిదొరజుల ముడ్లు విట్రజుల పత్రమ రాజ్యంబున కదువం(డ్లు)ల ఇచ్చిన రెన్డువటి మిరియమ్బు బోళజకు తెంగరి పెడశిన రెణ్డువట్టి పదేన్డుంబు అడ్లుపట్టు ద్రుగ్గాదేవి నేలయు ఉఋవుటురి బోళరెన్డుట్టి అచువరుకళరేని బారణాసి వేగవిళాలు వేడ్లుము.”

**లక్ష్మీపుర శాసనము**

“..... పరమేశ్వర భటారకున్ విజయరాజ్య సంవత్సరంబుళ్ ఇరుభదిఎణ్డు అగునేటి కజుళు కోఁణివ్... ఇచ్చిరి దేని అచ్చువాన్టు”

**విక్రమాదిత్యుని శాసనము**

ఎనిమిదవ శతాబ్ది శాసనభాగం కొంత “స్వస్తిశ్రీ బణ్డయారు దెన్నిల్పిరి ఇపలుఅసి రాజగొణిన ఇన్డు ఋనకమ్బునకు”

**అహదనకర శాసనంలో నుంచీ కొంత వచన భాగం**

“ప్రిధివి వల్లవ పట్టనబున ఊరివారు కరిగళ్ళ వడవరికి ఊరిస్వాముళ్ ఇచ్చిన స్తితి రెణ్డువాడల పట్టనావురకు... సవ్వన్ బాదపరియారువు ఊరు దాయసెసి (పంచి) ఇచ్చి దినికి వక్రంబు ఌదు”

**తొమ్మిదో శతాబ్దికి వస్తే ఈ విధంగా వ్రాసేవారు**

“పాణ్డురంగు పరమ మాహేశ్వరుణ్డు ఆదిత్య భటారనికి ఇచ్చిన ఎనుబది వుట్ల అడ్లు పట్టునేల దమ్మపురంబున దమ్మువులు (విని) రక్షిఇ్చన వారికి అశ్వమెదంబున పలంబు అగు” (అద్దంకి శాసనము)

**ధర్మవరపు శాసనము**

“ఈస్వరున (కుం) గాత్తిౕ కేయుండుంబోలె చౌషష్టికల విసారదు (ణ్డ) య్ను అయ్య పయ్యము సకల శాస్త్రాత్థ పాగులయ్ను పెద పణ్డరంగులు అయ్లము పగ్గెన్డలుంగర (వ) మ్మున పణ్డరంగును ఈ ధమ్మౕ (నివ్వౕహ) నోద్యోగమ్మునకు”

పదో శతాబ్దానికి వస్తే తెలుగువచనం కేలం గ్రామ చిహ్నాలు తెలియ జేయటానికి విరివిగా ఉపయోగించారు. కేవలం వచనంలో వున్న శాసనాలు ధర్మవర శాసనంలోని వచనాన్నే అనుసరించి వుంటవి.

ఈ అజ్ఞాత యుగంలో వున్న ప్రత్యేకత ఉచ్చారణానుసరణంగా వ్రాయటం ముఖ్యమైంది. 'పృథివి' శబ్దము 'ప్రిథివి' అని వుచ్చరించేవాళ్లు కాబట్టి ఆ విధంగానే వ్రాశారు. ప్రథమావిభక్తి ప్రత్యయాలు హలంతాలు గానే వున్నాయి. ధర్మ, పూర్ణిమ, దుర్గ పదములు దమ్మ, పేణ్ణ, దుగ్గ, అని వికృతులుగా వ్రాయబడ్డాయి. ణ, న, స, శ, ష; ల, ళ లకు అభేదం కనిపిస్తుంది. విసంధిగా వ్రాయటము ప్రథమ తరువాత గ, స, డ, ద వా దేశ నిత్యత, కనిపిస్తవి.

అహదనకర శాసనంలోని ''ఊరుదాయ సేసియిచ్చి'' అనే వాక్యంలో అసమాపకక్రియ సమాపకక్రియగానే ఉపయోగించారు. ఈ ఆచారం మలయాళ భాషలో ఇంకావుంది. ప్రథమావిభక్తి ప్రత్యయాల్లో 'లు' కు బదులు 'ళ్' (సంవత్సరంబుళ్, ఊరిస్వాముళ్, భటారళ్, కొన్రుడుకళ్ మొదలైన పదాలలో) కారము 'ము' వర్ణానికి బదులుగా పూర్ణానుస్వారం లేకుండా వున్న 'బు' (పట్టనబు, దశపరాధబు) కనిపిస్తవి. ఆ యుగంలోని వచనంలో ప్రస్తుతం మనము అర్ధానుస్వారము పూర్ణానుస్వారము ఉపయోగించే చోట అనునాసికాక్షరం ప్రయోగించటం కనిపిస్తుంది. సాక్షులు అని వ్రాయటానికి 'సాక్షిమంతు' లని, కాశ్యప గోత్రుడైన రేవణశర్మ అని చెప్పటానికి రేవణశర్మ కాశ్యప గోత్రజుడనీ వ్రాయటం కనిపిస్తుంది, అన్నేంటి (అను+ఏడు+న్టి) మొదలైన విశిష్ట ప్రయోగాలు కనిపిస్తాయి. 'పొలము' అనే పదానికి 'పులొంబు' అనేది ప్రాచీన రూపంగా కనిపిస్తుంది. అంటే ఆ పదం తరువాత వర్ణవ్యత్యయాన్ని (Metathesis) పొందుతుందన్నమాట. ఈ యుగంలో వచనరచనలోనూ, పద్యరచనలోనూ ఒక వింత అక్షరం కనిపిస్తుంది. అది (ఱ లేక ), చోఱ, మాఱ, ఱు మినకంపునకు, అచ్చువాన్టు మొదలైన శబ్దాలలో ఈ అక్షరం కనిపిస్తుంది. ఇది తరువాత 'ళ' కారంగాను, 'డ' కారంగాను మారుతుంది. దీని ఉచ్చారణము ఫ్రెంచి భాషలోని 'J' వర్ణోచ్చారణాన్ని అనుసరించి వుంటుంది. గుణగ విజయాదిత్యుని ధర్మవరం శాసనంలోని భాష, వచన సంప్రదాయము నన్నయనాటికి కొద్దిమార్పు పొందినవి.

మన దేశంలో అనాది కాలంనుంచీ శాసనాలు గద్యపద్యాత్మకంగా వ్రాయటం అలవాటు. అంతేకాకుండా సంస్కృతంలో త్రివిక్రమభట్టు ఎనిమిదో శతాబ్దిలోనే దమయంతీ కథను చంపువుగా వ్రాశాడు. ఈ చంపూమార్గాన్ని అనుసరించే నన్నయభట్టు

మహాభారతం రచించాడు. అతని వచనం పద్యాల మాదిరిగానే ఎంతో హుందాతో నడుస్తుంది. నన్నయ వచనంలో సంస్కృతంపాలు ఎక్కువ. వచనంలో కూడా ఆయన రసోచితంగా ఆరోహణావరోహణలు చూపిస్తాడు. నన్నయ వచన సంప్రదాయానికి ఒక ఉదాహరణం :

"శకుంతల కెంతయు సంతోషంబుగా దానికి కోరినవరం బిచ్చి గాంధర్వ వివాహంబున నభిమతసుఖంబు లనుభవించి యక్కోమలి వీడ్కొని నిన్నుఁ దోడ్కొని రానస్మత్ప్రధానవర్గంబుఁ గణ్వమహాముని పాలికిం బుత్తెంచెద" ఈ వచనంలో శబ్దాలు కటువుగా కాకుండా సున్నితంగా అంగలమీద గుర్రం నడుస్తుంటే వుండే హాయి చూపిస్తూ రచించాడు.

నన్నయ తరువాత కొద్దికాలానికే ప్రత్యేక గద్యకృతులు పుట్టినట్లు కనిపిస్తుంది. 12వ శతాబ్ది మధ్యభాగంలోని పాల్కుర్కి సోమనాథుడు తన కాలానికి గద్య ప్రబంధాలు విరివియై, సంస్కృత పదబాహుళ్యం వల్ల జనసామాన్యానికి రుచింపక పోయాయని పండితారాధ్యచరిత్రలో –

"ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వ సామాన్యంబు గామి
జాను తెనుంగు విశేషము ప్రసన్నతకు"

అనీ, బసవపురాణంలో –

"ఉరుతర గద్యపద్యోక్తుల కంటె
సరసమై పరగిన జాను తెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట"

అనీ చెప్పినాడు. కాబట్టి 12వ శతాబ్దికే గద్యకృతులు అనేకం రచించినారనీ, అవి కృతకశైలిలో ఉండటం వల్ల ప్రజాదరణం కోల్పోయాయనీ తెలుస్తూ వుంది. పన్నెండో శతాబ్దిలో శైవకవులు కన్నడంలో మణిప్రవాళ శైలి వదిలి వేసి సులభశైలిలో అనేక వచన కావ్యాలు రచించారు. మన తెలుగు దేశంలో ఆ నాటి శైవకవులు వచన గ్రంథాలు వ్రాసేవుంటారు. మన భాషలో, అవి జాను తెనుగులోనే వుండి వుంటాయి. ఆ కారణం వల్లనే తిక్కన శైలి జానుతెనుగు కావలసి వచ్చింది. తిక్కన వచనంలో జాతీయత బాగా కనుపించటానికి కారణం కూడా అదే.

తిక్కన వచనం దేశీయ పదాలతో కొద్ది సంస్కృతం మేళవించి వ్రాశాడు. ఉదాహరణం.

"ఏము కలహం బొల్లక పొందుగోరుట తనకు మేలు. తన మనంబున దరికొను తృష్ణానలం బార్ప నొరు లడ్డంబు సొరమింజేసి యేన బుద్ధి సెప్పవలసి వచ్చె. తన యొద్దం గల యోధవరు లెయ్యెడల లేమిం దెల్లంబయినను మాకుఁ జేదోడు ధర్మంబుగల దదియునుంగాక యఖిలలోక సేవితుండైన శ్రీకృష్ణుండు పెనుబ్రాపుగావున మమ్ము..." నన్నయ కొద్దిగా వెనుక పుట్టినా ప్రత్యేక వచన కావ్యాలు రెండు శతాబ్దులవి దొరకడం లేదు. ఇందుకు పద్య కావ్యాలమీద వున్న ప్రేమ గద్య కావ్యాలమీద మొదటి కవులకు లేకపోవటమూ, వీరశైవులు మొదలుపెట్టిన, వచనరచన మతవైషమ్యాల వల్ల రూపుమాసేటట్లు కూడా చేసి వుండడం బహుశః కారణాలు అయి వుంటాయి. ప్రస్తుతము దొరికే ప్రాచీన ప్రత్యేక వచనరచనలో మొదటిది ప్రతాపరుద్ర చరిత్ర. కృతికర్త ఏకామ్రనాథుడు. ఈ కవి కాకతీయ ప్రతాపుని ఆస్థానకవి అని స్థానిక చరిత్రలను బట్టి తెలుస్తూ వుంది. ఈ వచన గ్రంథంలో చంపూ కావ్యాలలోని వచనానికి మాదిరిగానే కావ్యావసానం ఉండదు. వ్యావహారిక భాషాప్రయోగాలూ, వ్యాకరణవిరుద్ధభాష వాడుతాడు. ఉదాహరణం : "ఇక్కడ ఏకశిలానగరంబునున్న పారశి రాజు మృతిబొందిన అతని తమ్ముడు జవానుములుకు ఫకీరు వేషంబున ఏకశిలానగరం బునజొచ్చి పురంబు అంత తన సాధ్యంబుగాకుండ జేసి తన అన్న సతీ సుతులకున్నూ తాను యెరుక సేసి వారిని ఫకీరు వేషంబున పురంబు వెడలదీసుకొని తన రాజ్యంబునకు వచ్చి వాండ్లనునిచి" ఈ వచన భాగంలో వ్యావహారిక ప్రయోగాలు విరివిగానే వున్నాయి. గ్రంథం అంతా వ్యావహారిక భాషలోనే వ్రాస్తే కారణాంతరాలవల్ల కృతకభాషగా మారిపోయినట్లు కూడా కనిపిస్తుంది. తరువాత శ్రీనాథకవి సమకాలికుడు, తాళ్ళపాక అన్నమాచార్యులు, సంకీర్తనలక్షణం వచనంగా వ్రాస్తే దానిని అతని మనమడు ద్విపదగా చేశాడట. రాయవాచకంలో వీర నృసింహరాయల దినచర్యను గురించి వ్రాస్తూ స్థానాపతి, "విద్యానగరమందు వీరనృసింహరాయల వారు బ్రాహ్మీముహూర్తాన లేచి ఆరాధ్యులు నామావళులున్నూ, ఆధ్యాత్మసంకీర్తనములున్నూ, పాండవగీతలు, భ్రమరగీతలు, గజేంద్ర మోక్షము, భారతసావిత్రి, దధివామనస్తోత్రము... ఇవిన్నీ, మొదలైన నీతివైరాగ్య శతకం పురాణ శ్రవణమున్నూ" ఈ విధంగా వ్రాశాడు. ఇందులో భారతసావిత్రి తెలుగు వచన కావ్యం. ఈ కావ్యాన్ని ఎల్లకర నృసింహకవి తాను వ్రాశానని మార్కండేయ పురాణంలోని "ప్రచురవాక్యములచే రచించితివి కవిరాజు లౌననంగ" అనే పాదంలో చెప్పుకున్నాడు. ఆ వీర నృసింహరాయలు చెన్నశౌరి అనే

కవిని పోషించాడు. నృసింహ పురాణంలో ఈ చెన్నశౌరి ఆంధ్రభాషలో వచనకావ్యంగా బాలభారతం రచించాడని "బాలభారత మంధ్రభాషను రచించె కవీశ్వరులు మెచ్చ" అనే పాదం వల్ల తెలుస్తూ వున్నది. ప్రబంధయుగానికి పూర్వమే ఎన్నో కావ్యాలు ఆంధ్రభాషలో రచితమై నశించాయి అన్నమాట. కృష్ణరాయలు రాజ్యానికి వచ్చాడు. కవుల దృష్టి మళ్లా పద్య కావ్య రచనమీదికి పోయింది. కొంతకాలం క్రీ.శ. 1559లో విశ్వనాథ నాయకుడు మధురలో స్వతంత్ర పరిపాలనం సాగించినాడు. అతని సేనాపతి 'రాయవాచకం' వచనంగా రచించినాడు. ఈ వచన గ్రంథమే కుమార ధూర్జటి కృష్ణరాయ విజయానికి మాతృక అంటారు. ఇందులో వచనం వ్యావహారిక భాషలోనే వుంటుంది. చూడండి ."పట్టణములో గల అష్టాదశ వర్ణాలవారును అత్యంత సంతోష పరులై అతి వైభవములతోడట్లు నిత్యకల్యాణములున్ను పచ్చతోరణములున్నూ కలిగి యున్నారని విన్నపం శాయంగా దళ నాయకులు విని రాయలవారికి విన్నపం చేశారు. ఆ పిమ్మట విఠ్ఠల విరూపాక్షస్వామి ధ్వజారోహణమై వున్నది. రథోత్సవమునకు విజయం శాయవలెను; అని విన్నపం శాయంగ దగ్గిర వున్న దళనాయకులు ఆ తీరున్నే రాయలవారు విచ్చేసివున్నారు" ఈ విధంగా వాక్యావసానం లేకుండా ఉంటుంది. పదిహేడు పద్దెనిమిది శతాబ్దులలో దక్షిణ దేశంలో వచనరచన విరివిగా జరిగింది. ఈ రెండు శతాబ్దుల కాలంలోనూ వచనరచన అంతా వ్యావహారిక భాషలోనే నడిచింది. వచన సాహిత్యాన్ని పోషించిన వాళ్ళలో ముఖ్యులు మధుర నాయకులు. మధుర చొక్క నాథుడు (క్రీ.శ. 1660-1682) తిరుకామకవిని పోషించాడు. అతను శృంగార సత్యభామా సాంత్వనము, రుక్మిణీ పరిణయము, అనే పద్య కావ్యాలు రచించాడు. ఆ కవే ధేనుకామాహాత్మ్యమనే వచన కావ్యాన్ని తేటమాటల్లో రచించాడు. మధుర నాయక రాజ్యాన్ని పరిపాలించిన విజయరంగ చొక్కనాథుడు (క్రీ.శ. 1704-31) మాఘమాహాత్మ్యమూ, శ్రీరంగ మాహాత్మ్యమూ అనే రెండు వచన కావ్యాలు కూర్చాడు. ఇతని సేనానాయకుడే సముఖము వేంకట కృష్ణప్ప నాయకుడు. ఇతడు 1710 ప్రాంతంలో జైమిని భారతము, సారంగధర చరిత్రము అనే రెండు వచన కావ్యాలు రచించాడు. విజయరంగని ఆస్థానంలో వెలగపూడి కృష్ణయ్య కవి వుండేవాడు. అతడు తన భానుమద్విజయ కావ్యంలో "సన్నుత వేదాంత సార సంగ్రహ శాస్త్ర మమరంగ వచన కావ్యంబొనర్చి" అనే పాదంలో వేదాంత సంగ్రహము వచనంలో రచించినట్లు చెప్పినాడు. ఈ రాజన్యుని కాలంలోనే శ్యామారాయకవి యథావాల్మీకి రామాయణము వచనంగా కృతి చేశాడు. ఇతడు విద్వత్కవి. సంస్కృతాంధ్ర భాషా కవితా నిర్వాహకుడు. ఈ వచన రామాయణాన్ని నవరసాలంకారంగా తెనిగించాడు. ఈ కవి మిత్రుడు

వెంకటసుబ్బయ్య కవికూడా రామాయణ వచన కావ్యం రచించాడు. పులిపాక రామన్న వచన రామాయణం, శ్రీరంగమాహాత్మ్యమూ, ఇంత కంటే చాలా పూర్వంవి. ఈ కాలంలోనే శ్రీపతి రామభద్రకవి తెలుగు వచనకావ్యంగా స్కాంద పురాణాంతర్గత హాలాస్యమాహాత్మ్యాన్ని కూర్చాడు. చొక్కనాథుని దళవాయి, తుపాకుల అనంత భూపాలుడు తెలుగువచనంగా రామాయణాన్ని, భారతాన్ని, భాగవతాన్ని, విష్ణుపురాణాన్ని కృతులుగా చేశాడు. పుష్పగిరి తిమ్మన వచనభాగవతం తెలుగు వచన కావ్యంగా కూర్చింది ఈ కాలంలోనే. తంజావూరు మహారాష్ట్ర నాయకుల కాలంలో పేరుపొందిన 'అభినవ కాళిదాసు' ఆలూరి కుప్పన వచన రచనలు చాలా చేశానన్నాడు. మైసూరు చిక్క దేవరాయలు (క్రీ.శ. 1672-1704) దళవాయి కళువె వీరరాజు, అతని కుమారుడు నంజరాజు తెలుగులో వచన నిర్మాతలు. వీరరాజు క్రీ.శ. 1680లో తన భారతాన్ని పూర్తి చేసినాడు. నంజరాజు వచనంగా కూర్చిన విష్ణుభక్తవిలాసము, కాశీ మహిమదర్పణము, గరళ పురీమాహాత్మ్యము, పేరు పొందినవే. వెంకటగిరి ప్రభువు వెలుగోటి యాచమ నాయకుడు వేదాంతగ్రంథాలు అనేకం వ్యావహారికభాషలో రచించాడు. గోపీనాథకవి ఓఢ్రభాషలో నుంచి రామాయణాన్ని తెలుగులో వచనంగా వ్రాసినాడు. 17, 18 శతాబ్దులలోని భాషకు ఉదాహరణంగా కొన్ని వచన భాగములు:

"తదనంతరంబ్బు వషిష్ట మహామునీంద్రుండ్డు దిలీప మహారాజునుంజూచి, మృగశృంగమహామునీంద్రుండ్డు సలక్షణంబుగా అఖిల వేదంబులం జ్జదివించ్చి బృంమ్హచర్యవ్రతంబ్బు నెరవేర్చి"

## విజయరంగని మాఘమాహాత్మ్యము

''చతుర్ముఖుండు ఆ దేవదేవునుద్దేశించి స్వామీ నీవు నాయందద్ద ప్రసన్నుండవగుట నిక్కంబేని నీ నిజరూపంబు నేటివరలో ఒక్క నాడేనియు దివ్యకల్యాణ విగ్రహంబు గొనశాయవైతివి"

## శ్రీరంగ మాహాత్మ్యము

ఈ రెండు శతాబ్దులలోని వచన రచనావిధానం వింతగానే వుంటుంది. ద్రుత ప్రకృతిక సంధి, కావలసిన చోట చేసేవారు; లేనిచోట లేదు. విసంధిగా వ్రాసేవారు. యడాగమము గిట్టదు. ప్రథమా విభక్తి ప్రత్యయాలను తపంబ్బు, మనస్సు, కొండ్డెంబ్బులలో మాదిరిగా ద్విత్వమొనర్చడం ఉంది. ఉత్తుకు అచ్చుపరమైతే సంధి చేస్తే చేసేవాళ్ళు; లేకపోతే వ్యవహారం దొర్లినట్లుగా వ్రాసేవారు. పదాలమీద ఊత

(accent) కనిపిస్తుంది, విన్నపం చేశారు; శాయంగల మొదలైన పదాలలో, ప్రథమ మీద గ, స, డ, ద వాదేశం విరివిగా కనిపిస్తుంది. దీర్ఘాల మీద నిండుసున్న ప్రయోగించేవాళ్ళే – వాండు, మూంకుడు, పేండ, శబ్దాలలో. ఆ శబ్దాలు వ్రాసేటప్పుడు తరువాతి హల్లు మూకుండ్డు, పేండ్డ, వాండ్డు, మాదిరిగా ద్విత్వంచేసేవాళ్ళు. 'ఉ'కార 'ఒ'కారాలకు 'వ'కారం విరివిగా వాడేవాళ్ళు. చేస్తే, వస్తే మొదలైన ప్రయోగాలు విరివిగా వున్నాయి. స, శలకు, 'రు' 'ఋ'లకు భేదం లేదు. ఉచ్చారణానుసారంగా వ్రాసేవారు. బ్రహ్మపదాన్ని 'బ్రంహ్మ' అని ప్రయోగించేవాళ్ళు.

ఈ 17, 18 శతాబ్దులలో యక్షగాన నాటకవాఙ్మయం ఎంతో అభివృద్ధి పొందింది. ఆ నాటకాలలో వచనం ప్రయోగించేవాళ్ళు. ఆ వచనం కూడా వ్యావహారిక భాషలోనే వుంటుంది. చూడండి రెండుదాహరణాలు :

"అయ్యా! యీ సభలో యుండు రాజాధిరాజులారా! ఈ శకుని పురుష వేశ్యలవలె మంత్ర తంత్ర ఇంద్రజాలముచేసే తంటవరుని కండలు తుండెలు తుండెలుగా కోసి కాకులకు గెద్దెలకు వెయ్యకపోతే నేను సహదేవుడనుగాను"

**మహాభారత విలాస నాటకము**

"రాజ రాజనరేంద్రుని సుతుండైన సారంగధరు డెటువంటివాడో చూడవలెనని నిండా ఆపేక్ష గలిగి వుంటివి గనక నేటిదినం చెలికాండ్లతో కూడా రాజవీధిని ఆటలాడుతూ వున్నాడు చూతువు మేడమీదికి రావమ్మా చిత్రాంగిదేవి... కానరాని మేడిపుష్పము లయినా వెదికి కానవచ్చును. తెల్లటి కాకినైనా వెదికి కానవచ్చును. నీళ్ళలో వుండే చాపల అడుగులనైనా వెదకి కానవచ్చును. స్త్రీల హృదయం కనగూడ దనునీతి కలదు. కాన నీవు రాజులేని సమయమున మీ పినతల్లియైన చిత్రాంగి నగరికి పోకూడదోయి సారంగధరా"

**సిద్ధకవి సారంగధర నాటకము**

19వ శతాబ్ది ప్రథమ భాగంలో వచనరచన అంతా వ్యావహారిక భాషలోనే జరిగింది. కథావాఙ్మయమూ, శాస్త్రగ్రంథాలు, టీకా గ్రంథాలు కూడా ఈ భాషలోనే ఉన్నవి. సాంద్రీసు దొర ఈ శతాబ్ద ప్రథమ భాగంలో పైడిపాటి పాపయ్య కవికి ప్రోత్సాహం ఇచ్చి ద్విపద రామాయణాన్ని వచనకావ్యంగా వ్రాయించినాడు. ఈ కవి రచనావిధానానికి ఒక ఉదాహృతి :

"అంతటట రుష్యమూక పర్వతాంన్ని కనుగొని వోయీ జనకజా! యీ రుష్యమూక పర్వతమంద్దు సుగ్రీవునికి నాంకున్నూ సఖ్యమైనది నింన్ను రావణుడు లంకకు యెత్తుక పొయ్యేటప్పుడు నీవంట్టి సొమ్ములన్నియు తీసి యీ రుష్యమూక పర్వతమంద్దు పడవేశిపోగా యీ సుగ్రీవుడు నీ యొక్క సొమ్ములంన్నియు పదిలం చేసి వుంచి నా చేతికి తీసుకవచ్చి యిచ్చినచోటు. కనుగొంట్టివా చూస్తివా యీ యొక్క సరోవరం. వో సుదతీ నల్లకలువల చాతనున్నూ మంచి నిర్మలోదకం చాతను వొప్పుచున్నది. తుంమ్మెదలు ఝుంకారంలు చేస్తుంన్ను తామరకమలమంద్దు వ్రాలి మధుపానం చేస్తున్ను రెక్కలు విసురుతూ యెగుస్తూవున్నవి"

బ్రౌన్ దొర వ్యావహారిక భాషలో అనేక వచనాలు వ్రాయటమే కాకుండా, రావిపాటి గురుమూర్తి శాస్త్రికి, జూలూరి అప్పయ్యపంతులకు ప్రోత్సాహం ఇస్తే వ్యావహారిక భాషలోనే టీకాలు, ఉదాహరణ గ్రంథాలు, కొన్ని శాస్త్రగ్రంథాలు రచించారు. గురుమూర్తి శాస్త్రి వ్యావహారిక భాషలో బాలుర ఉపయోగార్థం వ్యాకరణం రచించాడు. చిన్నయసూరి బాలవ్యాకరణానికి పూర్వం బడుల్లో అదే వుండేది. ఈ శతాబ్దిలో యాదవాచార్యుడు, గజేంద్రుడు మొదలైన కవులు వచనరచన చేశారు. యాదవాచార్యుడు ప్రహ్లాదయక్షగానం కూడా చేశాడు. ఈ శతాబ్దిలోనే వచనంలో కథావాఙ్మయం పుట్టింది. ద్వాత్రింశత్సాల భంజికల కథలు, విక్రమార్కుని కథలు, రామలింగని కథలు, శుకసప్తతి కథలు, పంచ తంత్ర కథలు, మర్యాద రామన్న కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, బాల నాగమ్మ కథ, కాంభోజ రాజు కథ ఇటువంటివి ఇంకా యెన్నో వాడుక భాషలో వ్రాశారు. ఈ కథాసారస్వతంలో భాష జీవద్భాష. ఉదాహరణంగా కాంభోజరాజు కథలోనుంచి కొంతభాగం చూడండి:

"ఎందునిమిత్తము పాపాత్ముడైనాడంటే యేడుగురు భార్యలను వివాహం చేసుకున్నాడు. ఏడో భార్య మాణిక్యాల దేవిని పుణ్యపాపముల విచారణ చేయకుండా ఘోరమైన అరణ్యంలో... ప్రాణాలు తీసినాడు గనుక ఆ స్త్రీ హత్యగొట్టి రాజుగారికి ఘోరమైన వ్రణము లేచియున్నది. ఆ వ్రణము మాన్పేటటువంటివారు లేరురా తండ్రి. ఒక పాపాత్ముడగు వైద్యుడు వచ్చి ఆ వ్రణమునకు ఏమి ఔషధము చెప్పినాడనగా..." ఈ కథావాఙ్మయంలో భాష ముఖ్యంగా కొన్ని కథల్లోది ఎంతో అందంగా వుంటుంది. ఈ కథలలో మధ్యమధ్యా పదవాఙ్మయం కూడా వుంటుంది. ఉదాహరణంగా గాంధారి కథలో కొంతభాగం చూపిస్తాను.

“కాకరచెట్టులో బూచి వున్నదని సోయింత రాజుతో గాంధారి చెపుతూ వున్నది. వాడు కొట్టుతానని కత్తి తీసుకొని చక్కా వస్తాడు. అవతలా ఇవతలా చూస్తాడు. ఎక్కడ చూచినా ఏమీ లేకపోతుంది. ఆ కోపం చేత బాకు బండకు వేసి పొడుస్తాడు. ఫెళ్ళున విరిగిపోతుంది. అది విరిగిపోంగానే అట్టే గోతిలో నుంచి దిగ్గున లేచి పోయి సోయింత రాజును పట్టుకొని ఆ గోతిలో పడవేసి పైన యీ బండవేసి అట్టే అణగద్రొక్కి పోదామని ఉపాయం చేసుకున్నాడు సుందరగిరిరాజు. గాంధారి చూచి పాడుతుంది ఎటువలెను – పదం :

అధినాధుడా రావె తుమ్మెదా
అల్లతడు వూరికిపోయె తుమ్మెదా
నావద్ద యెవరూ లేరు తుమ్మెదా
వచ్చి వాలాలాడిపో తుమ్మెదా
చెట్టువేసీ పాయె తుమ్మెదా
వో కావిలెవ్వరు లేరు తుమ్మెదా
రాతికిందా వున్న తుమ్మెదా
నీనెత్తి బర్వుదింపె తుమ్మెదా
బాసలిచ్చినాను తుమ్మెదా
బలిపీఠగొట్యాను తుమ్మెదా”

అని పాడుతుంది. ఎంతో అందంగా వచనంలో వున్న ఆ నాటి కథావాఙ్మయం అంతా ఎంతో ఉత్సాహవంతంగా వుంటుంది. ఇటువంటి వాఙ్మయం నిరాదరణం వల్ల చాలా నశించింది. క్రీ.శ. 1800 మొదలు 1850 లోపుగా జరిగిన శాస్త్రరచన నాట్య శాస్త్రము, వైద్యము, కామకళ అన్నీ కూడా వ్యావహారిక భాషలోనే రచించారు. అల్లూరి పురుషోత్తమ కవి రచించిన కామశాస్త్రంలోనుంచీ ఆ నాటి శాస్త్రరచనావైఖరికి ఉదాహరణం చూపిస్తాను: “పద్మిని కుందనపు బంగారువలె గాని నల్లకలువల వలెగాని కాంతి కలిగి తామరపద్మములవంటి సువాసన గల శరీరము నెమిలి పింఛము వంటి నల్లనిజుత్తూ చంద్రునివంటి ముఖము కలవలవంటి కళ్ళూ సంపెంగ రేకులవంటి ముక్కూ మదపుటేనుగవంటి నడకయున్నూ”

ఈ కవికన్నా ఇతర శాస్త్రకవుల జ్యోతిషం ముఖ్యంగా జీవద్భాషలో వుంటుంది. ఈ కాలములోనే వచనం ఏ విధంగా వ్రాయాలనే సందిగ్ధతవచ్చి, మాట్లాడే భాషలో వ్రాయటం మంచిదని వాళ్ళు అనుకున్నట్లున్నారు. అసలు పూర్వంనుంచీ వ్యవహార

భాషలో వుంటే అటువంటి సందేహం ఎందుకు పుట్టిందనుకోవచ్చు. కొంతమంది కావ్యాలలో వచనాన్నీ వచన కావ్యాలలోని వచనాన్నీ మిళావు చేసి కృతక భాష తయారు చెయ్యటం వల్ల వచ్చింది. ఆ సమస్య వచ్చినప్పుడు వాళ్లు చేసుకున్న నియమం ఏ విధంగా కనిపిస్తుందంటే ఎవరైనా ఛాందస బ్రాహ్మణుడుంటే ఆయన కూడా తాను మాట్లాడేటట్లే వ్రాయాలని అనుకున్నట్లుగా తోస్తుంది. ఉదాహరణం చూపిస్తాను. మృగయాత్రను వివరిస్తూ ఒక ఛాందసుడు :

"ఆ మృగయాత్ర లక్షణం యెషువంట్టిదంటేను విళ్ళుధరించ్చిన వాల్లూ కొందరున్నూ కత్తులను ధరించ్చినవాల్లూ కొందరుంన్నూ యుద్ధముఖ్యులైన వీరభటులు కొందరున్నూ యీ ప్రకారమైనషువంటి మహాపరిజనం కలవాడౌ కుంచున్నూ మరింన్ని గీతావాద్యములతో కూడుకుంన్నవాడౌకుంచున్నూ మరింన్ని విల్లు బాణచక్ర అసిగదాకుంత్త యివి మొదలుగా గలషువంట్టి ఆయుధాల చాతనున్నూ" అని యీ విధంగా వర్ణించాడు.

క్రీ.శ. 1850 తరవాత బాగా ఆంగ్లవాఙ్మయ ప్రోద్బలం మన భాషమీదికి వచ్చింది. క్రీ.శ. 1852లో చిన్నయసూరి నీతిచంద్రిక వచన కావ్యంగా రచించాడు. క్రీ.శ. 1853లో మొదటి కూర్పు సూరి జీవించి వుండగానే ముద్రితం అయింది. ఆ గ్రంథానికీ మనకు ప్రస్తుతం ఉపలబ్ధమయ్యే గ్రంథానికీ చాలా వ్యత్యాసం వుంది.

కృత్రిమ భాషాప్రాభవం మిగతా పండితులందరికీ అబ్బింది.

ఆ మార్గానుసారులే ముద్రణయంత్రాలయాలలో పరిష్కర్తలుగా ఉండడం వల్ల టీకా గ్రంథాలూ, కావ్యాలలో వున్న వాడుక భాషలోని ప్రయోగాలు మార్చి గ్రంథ ముద్రణం చేశారు. చిన్నయసూరి ఏర్పరచిన కృత్రిమ సంప్రదాయమే కొంత కాలం వచనరచనకు మార్గమయింది. వీరేశలింగం పంతులు అక్కడక్కడ విసంధి గాను కొద్ది వ్యావహారిక భాషాప్రయోగాలతోను సంధి విగ్రహాలు వ్రాసినాడు. ఈ పందొమ్మిదో శతాబ్ది చివర భాగంలో పత్రికానిర్వహణం వాఙ్మయానికి గొప్ప దోహదం ఇచ్చింది. కల్పలత పత్రికకు పూర్వమే శ్రీయక్షిణి, తత్త్వ బోధిని, వర్తమానతరంగిణి, సుజనరంజని, గోదావరి, విద్యాప్రబోధిని, ఆంధ్రభాషా సంజీవిని, పురుషార్థ ప్రదాయిని, దినవర్తమాని, వ్యవహార తరంగిణి, హితవాది, సుధీరంజని, స్వధర్మ ప్రకాశిక, సకల విద్యాప్రబోధిని, బ్రహ్మాండరంజని, లోకరంజని, వివేకవర్ధని, జనవినోదిని, స్వదేశిని, మందారమంజరి, ప్రబంధ కల్పవల్లి, ఆంధ్రప్రకాశిక, రాజయోగి, కళానిధి, హాస్యవర్ధని, సత్యసంవర్ధని, చింతామణి, ధీరంజని మొదలైన పత్రికలన్నీ వచనరచనకు తోడ్పడ్డాయి. ఈ

పత్రికలవల్ల వ్యాసం అనే నూతనకావ్య భాగం తెలుగువచనంలో వచ్చి చేరింది. క్రీ.శ. 1872 నాటినుంచీ నాటక వాఙ్మయం బయలుదేరి వచన రచనాభివృద్ధికి పనిచేసింది. వీరేశలింగంపంతులు వచనంలో ప్రత్యేకత వున్న నవలాసాహిత్యాన్ని మనదేశంలోకి తెచ్చినాడు.

లోకరంజని పత్రికలో వుండే విషయాలను గురించి వ్రాస్తూ సంపాదకులు, "ఈ పత్రికలో నవరసములైన కథలు కూడా వుంటా" యని వ్రాశారు. కథావాఙ్మయం అందులో ప్రత్యేకంగా కథానికాసారస్వతం (చిన్నకథ) సాటిలేకుండా అభివృద్ధి పొందుతుంది. ఈ శతాబ్దిలో జీవిత చరిత్రలు, ఆత్మ కథలు కూడా వచనరచనలో ప్రత్యేకతను సంపాదిస్తూ ఆ వైఖరిని తెలుగులోకి తెచ్చినవాళ్ళను జీవన్మృతులను చేస్తూ వున్నాయి.

చిన్నయసూరి తెచ్చిన కృత్రిమ భాషారచన చాలాకాలం వచనరచనకు ఒరవడిగా ఉంటూ వచ్చింది. పూర్వం నుంచీ వస్తూ ఉన్న మార్గాన్ని వదలివేసిన వచన రచనా పద్ధతి మంచిది కాదని, ఆ అపమార్గాన్ని తప్పించి జీవద్భాషలో వచనరచన జరగాలని శ్రీ గిడుగువారు చేసిన కృషి మూలంగా ఆ కృత్రిమభాష పోతూ వుంది. చాలావరకు, సక్రమమైన మార్గంలో రచన జరిగితే మన వచనం సజీవంగా ఉండి, ఇంకా కొన్ని భాషలకు మేలు బంతి కూడా ఔతుందేమో!

*– ప్రతిభ Vol IV 2, 3*

# దీక్షిత దుహిత[1]

## 1

పాండితీ ప్రతిభలకు చుక్కెదురు. ఒకటి ఉన్నచోట ఇంకొకటి ఉండదు. కానీ అరుదుగా అవి రెండూ కలిసిన కవులున్నారు.

అధునాతన ఆంధ్రసాహితీ ప్రపంచంలో వ్యుత్పన్నత, ఉపజ్ఞ – రెంటినీ పొడిగించుకున్న కవులు కడుంగడు దుర్లభులు. నూతన రచనాసంప్రదాయాలకు మార్గదర్శకులై 'నవ్యసాహిత్యాచార్య' పదవిని అధిష్ఠించిన శ్రీ శివశంకరశాస్త్రిగారు వీరిలో ఒకరు. పట్టినదెల్లా బంగారం చేసి శిల్ప ప్రపంచంలో సిద్ధహస్తులనిపించు కున్నారు. వీరిలేఖిని లీలావిహారం చెయ్యని కావ్య విభాగం (Poetic form) కనపడదు. రచనలన్నిటిలో రూపక విధానానికి (Dramatic Instinct) ప్రాపు అధికము. ఖండ కావ్యాలలో గానీ, ఉపకావ్యాలలో గానీ, ఇతర గీతాలలో గానీ, నటనోచిత రూపము. నవనవోన్మేషతతో నాట్యం చేస్తుంది. దృశ్యశ్రవ్యానుయోగ్య పద్య, గీతి నాటికారచనము వీరిలో ఉన్న విశిష్టత – ఉపజ్ఞ. ఇది వీరికొక ప్రధానోత్సాహము.

## 2

చాలాకాలం వరకూ సంస్కృత నాటకప్రీతి తరువాత పాశ్చాత్య నాటకాలంటే అత్యంత ఆదరము వీరికి అవతరించింది. ప్రపంచ పద్య, గీతినాటికా కర్తల్లో ప్రముఖులు Goethe, Browning, Wagner, Keats, Tagore ఇత్యాదుల గ్రంథపరంపర సాంగంగా చదవటం వల్ల, ఆంధ్రభాషలో అంతకు పూర్వం లేని అపూర్వ పద్యనాటికారచనం మీద అభిమానం అంకురించింది.

ఆంగ్ల సారస్వతంలో క్రీశ. 1915 నుంచీ పదేండ్లపాటు పద్యనాటిక వెనుకంజ వేసింది. Bax, Bessier, Bottomley, Phillips Eliot, Auden, Spender ప్రభృతులు ఈ సాహిత్యశాఖకు నూతన జీవము ప్రసాదించారు. వీరి, రచనలవల్ల శ్రీ శాస్త్రిగారికి పద్యనాటికారచనకు ఉత్సాహం కలిగింది. కానీ, పై రచయితల ప్రోద్బలము కావ్యాలమీద కనిపించదు – లేదు.

‘దివ్య లోచనములు’, ‘క్రుద్ధముని’, ‘శిష్యురాలు’ తదితర సంపాద ఖండికలు కూడా పద్యనాటక వాకోవాక్య దృక్పథంలో జన్మించినవే.

నవ్యసాహిత్యం బాగా పేరు ప్రతిష్ఠలు సంపాదించిన ఈ రోజుల్లో నైనా మన భాషలో గీతి నాటికలు, పద్యనాటికలు విశేషంగా లేవు.

శ్రీ శాస్త్రిగారి నాటికలను అవతల పెడితే ఉన్న పద్యగీతి నాటికలు – క్రీ.శ. 1927 ప్రాంతంలో శ్రీ కోటమర్తి చిన రఘుపతిరావుగారి ‘సుయోధనవిజయము’ లో అన్నీ సీసపద్యాలు. పఠనయోగ్యత ఉన్నంత, ప్రదర్శన యోగ్యత కనపడదు. తరువాత, శ్రీ నోరి నరసింహ శాస్త్రిగారి ‘భాగవతావతరణము’, ‘షణ్ణవతి’, ఇతరులవేవో కొద్దిగా ఉన్నవి.

## 3

శ్రీ శివశంకర శాస్త్రిగారి పద్య గీతి నాటికలు పదికి మించాయి. సంస్కృత నాటికాలక్షణం వీటికి పట్టదు. ఆ దృష్టితో వ్రాసినవి కూడా కావు. ‘నాటిక’, ‘రూపిక’ పదాల్లో ‘క’ ప్రత్యయము కేవలం అల్పార్థానికే.

వీరి కృతులలోని ఆనందం అనుభవించాలంటే పఠితకు, శ్రోతకు, ప్రేక్షకుడికి ఎంతో రసికత – అంతకన్నా విశేషజ్ఞత ఉండాలి. నాటికలన్నీ జీవిత లక్ష్యాలుగా ఉండి నానాప్రపంచాలలో నడిపిస్తవి.

కావ్యవస్తు గ్రహణంలో ఈ కవికి విశిష్టత ఉంది. ఇతివృత్తం ఏదైనా ఉత్పాద్యమే అనిపిస్తుంది. ప్రతి నాటికలోను ప్రథమాశయంలో మార్పు. బహురస సమ్మేళనము, పాత్రవైవిధ్యము, అందువల్లనే ద్యోతకమౌతవి. పవిత్రత, ప్రేమ, ఉత్కంఠ, చిత్తక్షోభ, అనుతాపము, సౌశీల్యము, శాంతమధురిమ, తొణికిసలాడుతాయి. ప్రతినాటికా బాహ్యాంతర ప్రపంచాలకు ప్రతిబింబము.

## 4

పద్యరచన ప్రారంభించిన ప్రథమ దశలోనే (క్రీ.శ. 1908 ప్రాంతము) పెద్దలు చెప్పుకోవటం వల్లనో, తరువాత తండ్రిగారి వల్ల స్వయంగా వినటం చేతనో ‘దీక్షిత దుహిత’ కావ్యరచన చేతామన్న అభిలాష కలిగిందట. ఆ రోజుల్లో వ్రాస్తే ఏ ఖండకావ్యమో అయ్యేదిగాని, సర్వాంగ సుందరమైన ఈ నాటికగా పరిణమించేది కాదు.

'దీక్షిత దుహిత'కు అనుశ్రుతంగా వచ్చే ఐతిహ్యమే ఆధారం. ఈ నాటికీ విద్వాంసులు ఈ కథాకణిక చెపుతుంటారు. దీనికి పౌనభేదం ఉంది.

ఇంటిదగ్గిర అప్పయ్య దీక్షితులు బాల వైధవ్యబాధ అనుభవించే కుమార్తెకు పునర్వివాహం తలపెట్టి పర్యాలోచనలో మానివేయటం ప్రథమ ప్రతీతి. పునర్వివాహ విషయంలో కాశీ పండితులతో సమాలోచన చెయ్యటానికి పోయి, గంగాస్నానం చేసి సికతాతలం మీద సంధ్య వార్చుకుంటూ కూర్చుంటే, అప్రయత్నంగా అప్పయదీక్షితుల ధోతీ గోచికొంగు ఊడిందట. అపరశివావతారమని ఆయనను భావించే బ్రాహ్మణులు (అక్కడ జపం చేసేవారు) అదే శాస్త్రవిధిగా భావించి అనుకరించారు. కళ్లు తెరచి చూచిన దీక్షితులకు అది ఆశ్చర్యం కొలిపింది. సంధ్య వార్చేటప్పుడు కౌపీనం తొలగకూడదు. జంకి తానే పునర్వివాహం చేస్తే ధర్మ విప్లవము జరుగుతుందని తిరిగీ వచ్చాడనేది రెండోది.

కవి వీటిలో ఏదీ గ్రహించలేదు. పునర్వివాహం చేతామా అని సంశయించటమే ప్రధానాంశంగా పరిగ్రహించాడు. వస్తు పరివర్తనలుగ, ఇతివృత్త కల్పనలో మిగిలిన అందచందాలు అన్నీ కల్పితాలే.

నాటికా నామకరణంలో కృత్యాద్యవస్థ కలిగింది. మొదట 'విధిరేవ బలీయాన్' అనీ – తరువాత ఎప్పుడో భవభూతి చదువుతుంటే "సర్వంకషా భగవతీ భవితవ్యతైనా" అనీ అనుకున్నారట. 'పద్మావతీ చరణ చారణ[2] చక్రవర్తి' – అంత పొడుగుపాటి పేరు పెట్టిన కవికి ఇవ్వొక్క లెక్కా? దీర్ఘమని సంశయించలేదు గానీ శ్రవణ సౌఖ్యం లేదని మానివేశారు. 'నామకరణాచార్యులకు నాటికకు పేరు దొరక్క పోతుందా? 'దీక్షిత దుహిత' అని చివరకు తీర్చి దిద్దారు.

పాత్రల నామ పరిగ్రహణానికి కూడా కొంత చరిత్ర ఉంది. ఐతిహ్యంలో అప్పయ్య దీక్షితుల పేరు తప్ప తక్కినవేమీ లేవు. ఆమె మరదలు 'సరసవాణి' అని ఎప్పుడో విన్నారట శ్రీ శాస్త్రిగారు. సంస్కృతి సంపాదించినదనీ, చమత్కారంగా చర్చ చెయ్యగలిగేదనీ విద్వజ్జనులు చెప్పుకుంటారు. సరసవాణి కావటం వల్లనే 'సరసవాణి' అనే అభిధానంతో ఆమెను స్వీకరించారు. ఆమె విగత భర్తృక అని వినికిడి. మంగళాంబ విధవ. విశ్వస్తలను విరివిగా రంగంమీదికి రప్పించడం ఇష్టంలేక ఆమెకు కవి పసుపు కుంకుమ పంచి పెట్టాడు. ఎవరో దాక్షిణాత్య పండితుడు సంస్కృతంలో 'అప్పయ దీక్షితేంద్ర విజయం' రచించాడు. ఆ గ్రంథాధారాలతో భారతిలో ప్రకటితమైన ఒక వ్యాసంవల్ల దీక్షితులకు ఉమా మహేశ్వరుడు, నీలకంఠుడు, చంద్రావతంసుడు అనే

ముగ్గురు కుమార్తెళ్ళూ, మరకతవల్లి, మంగళాంబ అనే ఇద్దరు కూతుళ్లూ ఉన్నారని తెలిసింది. అవే కవి గ్రహించాడు. ఆ వ్యాసాన్ని చూడకపూర్వం మంగళాంబకు సర్వమంగళ, అనే పేరు పెడదామనుకున్నారట! ఆశ్చర్యము! ఆమె అసలు పేరుకూ కవిభావిత నామధేయానికి ఎంత సామీప్యము! దీక్షితుల భార్య పేరు కూడా మంగళాంబే. తికమక తొలగించడానికి అప్రధానమనీ ఆమెను ప్రవేశ పెట్టలేదు. కాల నియమాన్ని అనుసరించి ఉమామహేశ్వర, నీలకంఠ, చంద్రావతంసులు రంగం మీదకి రావటానికి వీలులేక పోయింది. పద్య నాటికలో పాత్రల సంఖ్య పరిమితంగా ఉంటే పసందు. కథానాయకాభిధానము కల్పితము. శైవ సంప్రదాయయోగ్యంగా ఉండటానికి 'చంద్రమౌళి' అనిపించుకున్నాడు.

## 5

ఆరామంలో సాయంకాలము వేదిక మీద కూర్చొని పసుపుపచ్చని తాళపత్రం మీద ఘంటంతో చంద్రమౌళి వ్రాస్తుంటాడు. ఇంతలో మంగళాంబ మంద గమనంతో వచ్చి కొంచెం సేపు వెనక నిలుచొని వ్రాసేదేమిటని ప్రశ్నిస్తుంది. శివార్కమణి దీపికా ప్రతి చూడటానికి వీలు లేదంటాడు. ముద్దుగా మొండికి వేసి హావభావాలు చూపి తాళ పత్రం తీసుకొని అందులో ప్రణయగీతాలు, చదువుతుంది. తరువాత తనమీదనే అని తెలుసుకోవటంతోటే ఆమెలో అదివరకే నాటుకొన్న ప్రణయ భావాంకురం మొలకెత్తుతుంది. అతన్ని క్రీగంటితో చూచి అవనతవదన ఔతుంది. చంద్రమౌళి చేయి పట్టుకొని తన హృదయాన్ని విప్పి చెపుతాడు. అన్యోన్య అనురాగం వ్యక్తం చేసుకుంటారు. వివాహం చేసుకుందామనుకుంటారు, ఆమెను సందిట చేర్చుకొని అతడు శిరస్సు మూర్కొనే సమయంలో లతాగుల్మాలు కదులుతవి. చంద్రమౌళి లేచిపోతాడు. అక్కడికి వచ్చి తెలుసుకోవటం వల్ల సరసవాణికి సర్వం తెలిసిపోతుంది. మంగళాంబ వివాహానికి మరకతవల్లీ, సరసవాణీ తోడ్పడతామన్నారు. ఇది ప్రథమరంగం.

వెన్నెల రాత్రి వితర్దిక మీద కూర్చొని మరదలు సరసవాణి తమలపాకులకు సున్నము రాసి ఇస్తుంటే దీక్షితులు తాంబూలం వేసుకుంటుంటాడు. సంభాషణ కొంత దూరం సాగిన తర్వాత లోపల నుంచి మంగళాంబ పాట వినిపిస్తుంది. దీక్షితులు ఆమె కంఠం ఒదుగైనదనీ, చదువు చెప్పిస్తే సంగీతము అబ్బేదనీ అన్నాడు. సరసవాణి ఆమె వైధవ్యానికి చింతించి, పునర్వివాహము శాస్త్ర సమ్మతమేనా అని ప్రశ్నించింది. ఆయన ఔనన్నాడు. అయితే మంగళకు ఎందుకు చేయకూడదన్నది. పెళ్ళి ఒకవేళ

చేతామన్నా వరుడు దొరకడన్నాడు అప్పయ దీక్షితుడు. చంద్రమౌళికి మంగళమీది ప్రేమ సరసవాణి చెప్పివేసింది. కొడుకులు, అల్లుడు ఏమంటారో అని ఆయన సంశయిస్తే అంతా మీ మాట వినేవాళ్ళేనని ఆమె అన్నది. బ్రాహ్మణ్యం ఏమంటుందో చూచికాని చెప్పలేనన్నాడు దీక్షితులు. ఇది ద్వితీయ రంగం.

మర్నాటి పగలల్లా బ్రాహ్మణ బృందం ఏమనుకున్నారో విన్నాడు. రాత్రి విశాలమైన గదిలో నటరాజ స్వామి విగ్రహం ముందు చింతామగ్నుడై కూర్చున్నాడు. వృద్ధ బ్రాహ్మణులన్న మాటలు నచ్చినవి. చివరకు పెళ్ళి చేయటానికి సాహసం లేదన్నాడు. చంద్రమౌళికి అంతరంగశుద్ధికోసం సేతుస్నానం విధించాడు.

చంద్రమౌళి సేతుస్నానానికి పోబొయ్యే ముందు మంగళాంబను కలుస్తాడు. తిరిగీ ఎప్పుడు వస్తారని ఆమె ప్రశ్న. ఎన్ని సంవత్సరాలకైనా వస్తానో రానో అని సమాధానము. అతని మెడలో రుద్రాక్షమాలికను జూపించి 'ఆమరణము ఆర్యాపదార్థమగుగాక!" అని మంగళ అన్నది. అతను ఇవ్వబోయి మళ్లీ ఏదో ఆలోచించి 'శంకరుడొక్కడే అర్చనీయు' డని అన్నాడు. అంతటితో ఆమె మనస్సు క్రుంగిపోతుంది. అతన్ని కనబడేవరకు చూచి పొంగి వచ్చే దుఃఖంతో నటరాజస్వామికి మోకరిల్లి, చేతులు జోడించి డగ్గుత్తికతో ప్రార్థిస్తుంది. అంతటితో నాటిక పరిసమాప్తమౌతుంది.

## 6

"అప్పదీక్షితార్యు లఖిల విద్యాగురుల్
అపరశివులు వారి అంతికమున
అభ్యసింప విద్య లాయువు చాలునే
ఎన్ని జన్మలైన నెత్తవలయు"

అనే చంద్రమౌళి మాటల్లో ద్యోతకమయ్యే పాండితీప్రతిభలు సంపాదించాలన్నా, ఆ నాడు ప్రఖ్యాతివహించిన "పదవాక్య ప్రమాణపారీణ" బిరుదం సంపాదించుకున్న గోవింద దీక్షితులవారితో వేదాంత తత్త్వవిచారణ జరపాలన్నా, నరసింహయతి తదితర యతీంద్రులకు కూడా నుతిపాత్రుడు కావాలన్నా, దీక్షితులు వయోవృద్ధయి ఉండాలి.

"అప్పయ దీక్షితేంద్ర విజయా" న్ని అనుసరించి క్రీ.శ. 1550 ప్రాంతంలో ఆయన జన్మించి ఉంటారని ఊహించి షష్టి పూర్తి చేసి, కథాకాలం క్రీ.శ. 1610 ప్రాంతంగా మొదట్లో భావించారు. తదుపరి శ్రీ కురుగంటి సీతారామయ్యతో సంభాషించినపుడు దీక్షితులు క్రీ.శ. 1582లో కాలకంఠేశ్వరాలయం కట్టించినట్లుగా

శాసన ప్రమాణమున్నదని తెలిసింది. అందువల్ల పూర్వాభిప్రాయాన్ని మార్చుకొని జన్మకాలం క్రీ.శ. 1520 ప్రాంతంగా భావించి దానికి అరవై ఏండ్లూ కలిపి కథాకాలం క్రీ.శ. 1580 ప్రాంతంగా మార్చారు.

కానీ, అప్పయ దీక్షితుల జాతక చక్రం ఒకటి అనుస్యూతంగా వస్తున్నది. తన్మూలంగా ఆయన జన్మకాలం శ.క. 1475 ప్రమాదీచ సంవత్సర కన్యామాస కృష్ణ ప్రథమ వాసరము (18 Sep 1553 A.D.) ఉత్తరఫల్గునీ నక్షత్రం. ఈ పరిగణన ప్రకారం కథాకాలము క్రీ.శ. 1610 ప్రాంతమనటమే సమంజసము. కూతురికి పునర్వివాహం చేతామన్న కల్మషాభిప్రాయం కలిగినందుకు కాలకంఠేశ్వరాలయం కట్టించాలెనని అప్పయ్య దీక్షితులు అనుకొన్నట్లు కల్పించటం ఈ పరిగణన ప్రకారం పొసగదు. దీనిలో కవిప్రమాదమేమీ లేదు. ఆయన పూర్వమతాన్ని అనుసరించి ఉంటారు.

## 7

గంభీరమైన కథావస్తువు. పవిత్రప్రేమకు ప్రబల వృద్ధాచారము అడ్డుకట్ట. శాశ్వతవియోగము, ఆచారము చేతుల్లో శాస్త్రము అణగిపోయింది. దానికి దయాదాక్షిణ్యాలు లేవు. విగతభర్తృక ఐతే చాలు. ముక్కుపచ్చలారని బిడ్డని ముద్దన్నా లేదు దానికి. మళ్ళీ పెళ్ళి చేసుకొని మహాపతివ్రత అనిపించుకోవలసిన మంగళ 'ఊర్మిళ విధాన నిద్రలో ఉండ' వలసి వచ్చింది. ఊర్మిళకు నిద్ర నిత్యమూ లేదు. మంగళపని మహా అన్యాయం ఐపోయింది! ఆచారాన్ని అమర్యాద చేసి కవి మంగళకు మాంగళ్యం కట్టించేవారే. కానీ ఐతిహ్యం ఒప్పుకోలేదు.

కథానిర్వహణంలో కవి ముక్కాకలు తీరినవాడు. స్వానుభవలేశాలతో కథను సర్వాంగసుందరంగా చేసి గద్దెక్కించాడు. నాయికానాయకుల విప్రయోగం తప్పించలేక తలనొప్పితో కొన్నాళ్ళు బాధపడటము నాకు ప్రత్యక్షానుభవము. ఎప్పుడైనా హృదయం గల శ్రోతకు గానీ, పఠితకు గానీ కంటికి కన్నీరు కారకుండా ఊరుకోదు. అంతట ఆగితే ఆనందమే.

రంగస్థల ప్రసాధన రసికుడైన కవికే తెలుసు.

ప్రథమ రంగస్థలం ఆరామంలో సాయంకాలము. కవితాప్రసరణకూ, కామినీ గోష్ఠికీ కావలసింది అంతకంటే ఏముంది? మధువనంలో మంజరులను చూడగానే చంద్రమౌళికి మంజరీఛందస్సు మనస్సుకు తట్టింది. చెంగల్వలను చూచేటప్పటికి

చెలియ పాదాలు జ్ఞప్తికి వచ్చినవి. కుసుమ శబలిత కాంతులతో ఉన్న ఆరామ మార్గము రత్న కంబళాన్ని జ్ఞప్తికి తెచ్చింది. ఆ నవవీథిలో అప్పుడప్పుడూ తిరిగి పండబారి పగిలిన దానిమ్మగింజలు చూడటం వల్ల అటువంటి అక్షరాలే వ్రాయటానికి అలవాటు పడ్డాడు. మందమారుతము, మనోనాయిక మనోహర భావాలకు మద్దత్తు ఇచ్చినవి. అప్పుడు

"చెంగల్వలంబోలు చిన్నిపాదాల
ననుగు నెచ్చెలి మెట్టునట్టి మార్గంబు
పులకితం బయి వన్నె పూవులు పూయ
రత్న కంబళమట్లు రంజిల్లు మిగుల"

అని వరస పెట్టి ముచ్చటగా మూడు పద్యాలు వ్రాసేటప్పటికి

'అంచనడకల నరుదెంచె నతనిసఖియ'

వితర్దికమీద విశ్రాంతిగా కూర్చోవటము. వెన్నెల రాత్రి. తాంబూల చర్వణము. రెండో రంగం ప్రారంభిస్తుంది. మరదలి మధురవాక్కులు, మంగళాంబపాట అప్పయదీక్షితులను నిష్ఠాలోకంలోనుంచి ఒక్కమారుగా నిజలోకంలో పడవేసి, పుత్రీ పునర్వివాహానికి బుద్ధి కలిగిస్తవి.

శివాజ్ఞ లేనిదే ఆయన చిన్న మెత్తుపని చెయ్యడు. మర్నాటి పగలల్లా బ్రాహ్మణ బృందము ఏమనుకుంటున్నారో తెలుసుకొని వివాహము చెయ్యటమా చెయ్యకపోవటమా అనే తుల్యబల విరోధాలలో తొక్కిసలాడుతూ, చింతాసాగరనిమగ్నుడై శివాజ్ఞ కోసం మర్నాటి రాత్రి విశాలమైన గదిలో – దీపము వెలుగుతుంటుంది – పార్శ్వపీఠం మీద నటరాజ విగ్రహానికి ఎదురుగా కూర్చొని ఉంటాడు.

మూడోరంగం ప్రారంభంలో, ఇక్కడ ప్రతి విషయం గమనించవలసిందే. విశాలమైనగది విమల భావనాప్రపంచంలోకి తీసుకోపొయ్యే రాచబాట. కృష్ణాజినం గృహ పారిశుద్ధ్యతకు ప్రబలసాక్ష్యం. ఇలువేలుపు నటరాజస్వామి విగ్రహానికి ఎదురుగా కూర్చోటం ఫాలాక్షుని పల్కుకోసం. శివాజ్ఞ కాలేదు. చిన్నతల్లి పెళ్ళి చెయ్యలేదు.

కథానుగుణమైన కమనీయవాతావరణం కల్పించకపోతే, కవి కళాభిజ్ఞుడు కాడన్నమాట. కవులు పాత్రల నామకరణం దగ్గిరనుంచీ పాటుపడి నానారకాలుగా ఈ వాతావరణాన్ని సృష్టిస్తారు.

కంచి వరదరాజనుతి, కృష్ణ ధ్యానపద్ధతి వ్రాసి మొదట్లో వైష్ణవుడనిపించుకున్నాడు; తరువాత అద్వైతిగా మారిపోయినాడు అప్పయదీక్షితులు. అందులో శివప్రీతి క్రమేపీ ఎక్కువైపోయింది.

"మహేశ్వరే నా జగతా మధీశ్వరే
జనార్దనే వా జగదంతరాత్మని ।
అభేదబుద్ధి ప్రతిపత్తి రస్తిమే
తథా పి భక్తి స్తరుణేందు శేఖరే ॥"

అన్నాడు. శంకరుని అపరావతారాలని అనిపించుకున్న వాళ్ళకు శివపక్షపాతం పరిపాటే. ఆచార్య శంకరుడూ అంతే.

"సహస్రం వర్తంతే జగత విబుధాః క్షుద్రఫలదాన మన్యే స్వప్నే వా తదనుసరణం త్వత్కృతఫలమ్, హరి బ్రహ్మాదీనా మపి నికట భాజా, మసులభం చిరం యాచే శంభో! శివ, తవ పదాంభోజభజనమ్" అని అన్నాడు. శివపక్షపాతం మూలాన జన్మించిందే అప్పయదీక్షితుల "శివార్క మణిదీపిక." ఈ గ్రంథరచనతో అద్వైతానికి అండపోయింది. నర్మదా తీరంనుంచి నరసింహయతి వచ్చి ప్రార్థిస్తే, దీక్షితులు బ్రహ్మసూత్రాలకు 'పరిమళ' వ్యాఖ్య వ్రాసి అద్వైతానికి అండగా నిలవబడ్డాడు. ఆయన శివపక్షపాతం ఎంత వరకు పోయిందంటే, ఆంధ్రులలో శిష్టులు ఆడవాళ్ళను వశి! వశి! అని అనేక తడవలు పిలవటం వల్ల శివ! శివ! శబ్దోత్పత్తి కలుగుతుంది; అందువల్ల ఆంధ్రభాష అందమైనదని ఛలోక్తిగా అనేవరకూ.

ఇలాంటిదే కవి విషయంలో కూడా జరిగింది. ఆయనకూ అర్ధనారీశ్వరుని మీద అభిమానం ఎక్కువ. కంతేరులో మహేశ్వరాశ్రమం స్థాపించినప్పుడు అర్ధనారీశ్వరాలయం కట్టించాలనుకున్నారు అంతరాయాలవల్ల ఆగిపోయింది. ఎక్కడో విందుకుపోతే భోజనాంతంలో సాంబారువంతు వచ్చింది. మొదట వద్దని తరవాత కావాలన్నారు. మిత్రులు కారణం అడిగితే "అరవ వాళ్ళదైనా సాంబారులో పవిత్ర సాంబ శబ్దం ఉంది. ఎలా ఒద్దనటం?" అని అన్నారట.

శైవవాతావరణాన్ని చిత్రించటానికి శ్రీ శాస్త్రిగారు అన్నివిధానాలూ అవలంబించారు. నామకరణం అందులో ఒకటి. 'చంద్రమౌళి' శైవగ్రంథాలు సంభాషణానుగుణంగా ఉట్టంకించటం ఇందొకటి. శివార్క మణిదీపిక, శిఖరిణీమాల, స్వరమేళలలో శివసహస్రనామంలో వలె శివపర్యాయపదాలు పదేపదే పలికించటం

శైవ వాతావరణానికి ఎంతో పట్టిచ్చింది. నటరాజవిగ్రహం నాల్గోది. నేపథ్యంలో మంగళాంబ

"యస్యాహు రాగమనిదః పరిపూర్ణ శక్తే
రంశే కియత్యపి నివిష్ట మముం ప్రపంచమ్ ।
తస్మై తమాలరుచి భాసుర కన్ధరాయ
నారాయణప్రియసఖాయ నమశ్శివాయ ॥"

అని శివస్తోత్రము చేయటము ఇంకో శోభ తెచ్చింది.

"జీయా త్కృతానఙ్గ పతఙ్గదాహః –
ఖట్వాంగినో నేత్రశిఖిప్రదీపః
యస్యాన్తికే శుభ్ర దశా నివేశ
శ్రియం కిరీటేన్దుకరాశ్రయంతే! ॥" (మంఖుని శ్రీకంఠ చరితము)

"చూడోత్తం సితచారుచంద్రకలికా చంచచ్ఛిఖాభాస్వరో
లీలాదగ్ధవిలోలకామ శలభ శ్రేయో దశాగ్రే స్ఫురన్ ।
అంతః స్ఫూర్జ దపార మోహతిమిర ప్రాగ్భార ముచ్చాటయన్
చేతస్సద్మని యోగినాం విజయతే జ్ఞానప్రదీపో హరః"

(భర్తృహరి – వైరాగ్యశతకము)

"మనస్తే పాదాబ్జే నివసతు వచః స్తోత్రఫణితౌ
కరశ్చాభ్యర్చాయాం శ్రుతిరపి కథాకర్ణనవిధౌ ।
తవధ్యానే బుద్ధి ర్నయనయుగళం మూర్తివిభవే!"

(ఆచార్య శంకరుడు – శివానందలహరి)

అనే మహా మాహేశ్వర కవుల వాక్యాలు పాత్రలచే పలికించటం వల్ల, అంతా శివమయ మైపోయింది.

భావోద్రేకం కలిగినప్పుడూ, ప్రార్థనాసమయంలోనూ, తెలుగు భాష తేలిపోతుంది.

అందుకు అమరవాణి అత్యంతోపయుక్తమని మహాకవుల శ్లోకాలు కవి ఉదాహరించాడు. నిజం కూడా అంతే.

సంస్కృతి కలవాళ్ళు సహజంగా భావోద్రేకాన్ని భరించలేని సమయంలో మహాకవుల మహనీయవాక్యాలు పఠించటం కద్దు. ఆ విధంగా చూస్తే నాటి కాలంలో సంస్కృత శ్లోకపఠనమే సమంజసమనిపిస్తుంది.

## 8

పద్యనాటికల్లో కవిని పట్టి చూపేది ఛందస్సు. పాత్రలన్నీ ఒకటే ఛందస్సులో మాట్లాడితే వెగటు పుడుతుంది.

ఛందోదేవి శ్రీ శాస్త్రిగారు చెప్పినట్లు వింటుంది. ఆయన దేశీయచ్ఛందో బహుళతను గ్రహించి, వాటితో అనేక నడకలు నడిపించవచ్చునని తెలుసుకొని అప్పయ్య దీక్షితులనోట ఆ మాట

"అతిమనోహరమైనదే ఆంధ్రభాష
అన్నిరీతుల పద్యంబు లల్ల వచ్చు"

అని అనిపించాడు.

రసస్ఫూర్తినిబట్టి రకరకాల ఛందస్సు ప్రయోగించడం శాస్త్రిగారికి అలవాటు. పద్యం, గేయ నాటికలలో వారు వాడేవన్నీ జాతీయ ఛందస్సులే. ఆటవెలది, తేటగీతి, మంజరి, రగడలు, షట్పదులు, ముత్యాల సరాలు. జాతీయఛందస్సుల కున్నంత గానయోగ్యత (Musical Element) లేకపోవటం వల్ల వృత్తాల జోలికి పోరు. ఉత్పలమాలాదివృత్తాలు దీర్ఘమై సంభాషణకు ఇమడవుకూడాను. లేకపోతే సకృతుగా కృతులపద్ధతి అవలంబిస్తారు. కృతుల పోకడ పోతే పల్లవి, అనుపల్లవులతో కథాగమనం మందగిస్తుంది. మాత్రాఛందస్సులు ప్రయుక్తమైతే కావ్యం మజాగా నడుస్తుంది. కానీ తాళ లయజ్ఞానం తప్పకుండా ఉండాలి.

దీక్షితులు దేశీయఛందస్సులలో హుందా ఉన్న ఆటవెలది, తేటగీతులలో మాట్లాడతాడు. కానీ, సరసవాణి మధురమంజరీ ధోరణిలో పడిపోయి, పునర్వివాహాభిప్రాయం కలిగినప్పుడు సామాన్యమానవుల మాదిరిగా మనస్సంక్షోభం చెంది సరసవాణితో స్వాభిప్రాయం కల్పటానికి మంజరీఛందస్సులో మనోభావాలను వెలిబుచ్చాడు. సంక్షోభం మందగించిన తరువాత మళ్ళా శ్రోత్రియత్వము, గాంభీర్యము, సంస్కృతి ఆయనను ఆవరించాయి. మాత్రాఛందస్సులను, తత్తుల్యమైన మంజరులను వదిలివేసి ఆటవెలది, తేటగీతులలో అభిభాషణం చేశాడు.

నాయకుడూ అంతే. మంగళాంబతో మనసు కలిపిన తరువాత ఆమె మంజరితో మాట్లాడితే మంజరిలోను, ముత్యాల సరాలలో మాట్లాడితే ముత్యాల సరాలలోనూ మాట్లాడాడు. నాయికా నాయకుల అంతరంగం ఒకటైనప్పుడు ఛందస్సు మాత్రం ఒకటి కావద్దూ?

ప్రకరణానుగుణంగా ఛందస్సులో పరిపరివిధాల నడక నాటికారచనలో గొప్ప నగిషీ పని.

సహపాఠ్యంగా చదవదగిన స్వరమేళలు మధురగతి రగడ నడకలతో మధురంగా నడిచాయి. స్వరమేళలలో ఆ వేగం ఉండటం చేత అష్టమాత్రాపరిమితమైన పాదాలు వాడటంతో శ్రవణసౌఖ్యం ఏర్పడ్డది.

"దీక్షిత దుహిత" ప్రధానంగా పద్యనాటికైనా పద్య ప్రాయాలైన గీతికలు రసాతిరేకం కలిగిన ఘట్టాలలో కవిప్రయుక్తాలైనవి.

దేశీయ ఛందస్సులు ఎంత విరివిగా వాడతారో శ్రీ శాస్త్రిగారిలో జాతీయ పదప్రయోగం అంత తక్కువ. సంస్కృత ప్రీతి అధికము. భాష సంస్కృత భూయిష్ఠమైనా కొన్ని సందర్భాలలో అప్రయత్నంగా తెలుగు పదాలు, జాతీయాలు పడతవి.

చెన్ను, పాలుమాలిక, పెడచెవిబెట్టు – ఇత్యాదులు పదాలు.

"ఈ అరుంతుదజీవన మెట్లు గడచు
**ముక్కుపచ్చలె ఆరని ముద్దుబిడ్డ**
కక్కటక్కట ఏల బాల్యమ్మునందె
చేసినారో వివాహమ్ము శీఘ్రపడుచు
చూచు చుండగ సంసార సుఖములందు
మునిగితేలెడి పెద్దల, ముద్దుబిడ్డ
**ఊర్మిళవిధాన నిద్రలో నుండవలెనే;**
దైవతాంశాభవము కదె దయ మహాత్మ!
జరిపి చెల్లి వివాహమ్ము సత్వరముగ
దాని క్రమ్మర నొక **ఇంటిదాని జేసి**
సంతసింపగవలసిన సమయమందు
కలుగ నేటికి ఇంతటి కలత మీకు

మన యనుంగు తల్లి మంగళజన్మంబు
**బండరాయివోలె** నుండవలెనె!”

ఇత్యాదులు తెలుగు జాతీయాలు.

“శాస్త్రేషు వ్యసనితా” అనే సంస్కృత సూక్తి, ‘ఆర్షేయ పౌరుషేయాలు’ ‘ద్రావిడ బుద్ధి’ – తదితరసంస్కృత జాతీయాలు కూడా నాటికలో అక్కడక్కడా కనిపిస్తవి.

సంస్కృతం మీద ఎంత ప్రీతి ఉన్నా సమాసము సామాన్యంగా మూడు మాటలకు మించి ఉండదు. అథవా ఎక్కడైనా కనిపిస్తే దానికి ప్రత్యేక రసప్రతీతి కారణం ఏదో ప్రకరణాన్ని బట్టి ఉన్నదన్నమాట!

కావ్యంలో త్రివిధధ్వని – వస్తుధ్వని, భావధ్వని, రసధ్వని – కళ్ళకు కడుతుంది.

తే. “నాకలోకాంగనావీటికాకరండ
మండితోన్నత నవసుధాఖండమట్లు
విరియుచున్నాడు శశి ఉడు వీథియందు
కళలు త్రిజగదుద్దీపన కారణుండు.”

వస్తువు ననుసరించీ, ప్రకరణాన్ననుసరించి సరణి మారటం సహజం. భావోద్రేకము, మనోవేదన అధికంగా ఉన్నప్పుడు పాత్రలు పకడ్బందీగా మాట్లాడవు. నాటికలోని వివిధ ప్రకరణాలలో వివిధ రీతులుగా సంభాషణతో పాటు రీతి మారిపోతుంది. కవిలో అందువల్ల రకరకాల రసవైచిత్ర్యము. కవులు సాధారణంగా తమ అనుభూతి అభిమతాన్ని కావ్యాల్లో చొప్పించటం కద్దు. బాధలో గాని పద్యం బయలుదేరదని శ్రీ శాస్త్రి గారు చెపుతుంటారు. ఆ విషయమే మంగళాంబ చేత –

“సాగు నందురు రచన విశ్రాంతిలోన
బాధలో నీకు కవన మేపగిది కుదిరె?”

అని ప్రశ్న వేయించి, చంద్రమౌళి చేత –

“నీకు విదితంబు కాదె వాల్మీకి శోక
మొక్కయుదయాన శ్లోకత్వ మొందియుంట!”

(కావ్యస్యాత్మా స ఏవార్థస్తథా చాదికవేః పురా క్రౌంచద్వంద్వ వియోగోత్థః శోకః శ్లోకత్వ మాగతః – అని ఆనందవర్ధనాచార్యుని అభిమతము)

అని జవాబుగా చెప్పించారు.

మొదటి సూక్తులు తదుపరి లోకోక్తులుగా మారుతవి. శ్రీ శాస్త్రిగారి సూక్తులు కొన్ని ఇదివరకే లోకోక్తులైనవి. 'దీక్షిత దుహిత' లోని మరికొన్ని లోకోక్తులు.

"కుసుమకోమల మైన మానసము వేరు
స్థైర్యవిరహిత మైన చిత్తమ్ము వేరు"

తే. "లోక సంగ్రహబుద్ధి వివేకులైన
ధర్మవేత్తలు చూపిన దారివెంట
చనెడివారల కొక్కింత శ్రమమె యైన
తుదకు నిశ్శ్రేయసప్రాప్తి ధ్రువము సుమ్ము"

తే. "ధర్మమార్గమునందు పాదములు సుఖము
పొందు నభిలాష కెట్టి పుప్పొడులు లేవు,
కానబడును వికీర్ణమై కంటకములు
గాటముగ నొప్పులెత్తించు కరకురాలు"

సందర్భానుగుణమైన చమత్కారము, చతురోక్తులు ఈ నాటికకు అలంకారాలు.

తే. "ముగ్ధహరిణాక్షి నే చతుర్ముఖుడగాను
సిద్ధుడను గాను దృష్టి విశేషమునకు"

శ్రోత్రియ వాతావరణంలో పెరిగిన పిల్లలకు చమత్కారం ఉండదంటారా?

"ఆహవముఖమునం దర్జుననట్లు
నిజకుమారి వివాహ నిర్ణయమందు
వెనుకంజవేసిన విప్రవీరునకు
గీతోపదేశ మే కృష్ణుండు చేయు!"

"మాటి మాటికి మీరు మారినరీతి
మరల నీవారము మారిపోరాదె!"

'దీపకళిక', 'అమృతవాక్కు', 'సుప్రభాతము', 'చల్లని వేళ', 'పుణ్యవేళ', ప్రశాంతవేళ, దివ్య, భవ్య, నవ్య, నవీన, నూతన, అభినవ – తదితర శబ్దాలమీద శాస్త్రిగారికి అనుకోని అభిమానమున్నట్లు ద్యోతక మౌతుంది.

ఉత్సాహం నిర్వేలమైనప్పుడు శాస్త్రిగారు ముక్తపదగ్రస్తం చేస్తారు. ఉదాహృతి – మంగళ పరిణయానికి అవకాశ మున్నదని దీక్షితులు నిర్ణయించినప్పుడు సరసవాణి సంతోషంతో ప్రవేశించి –

“మెచ్చుకోతగినది
మీ నిర్ణయమ్ము!
మీ నిర్ణయమ్మున
మిగుల హర్షమ్ము!
మీ నిర్ణయమ్మున
మిగిలినవారు
మిగుల హర్షము గాంత్రు
మేదినీస్థలిని”

అని అంటుంది. నిర్ణయశబ్దం ముమ్మాటు ఉద్దీప్తి కోసం పునరుక్తమైంది. మీ, మె, మేలు విరివిగా వాడటంలో సంగీత సంప్రదాయం ఉంది. కావ్యంలో Musical Element కల్పించటానికి కవులు వాడే పద్ధతులలో ఇది ఒకటి. ఇటువంటివి స్వరమేళలలో ఎన్నో కనిపిస్తవి.

పాదపూరణకోసం సంబోధన పారవేయటము కవులకు పరిపాటి. కవి రసావేశము ఉంటేనే గాని ప్రయోగించడు.

## 9

‘స్వరమేళ’ శబ్దాన్ని (Chorus) అర్థప్రతిపాదకంగా కవి ప్రయోగించాడు. అంటే అనేక కంఠాలు కలిసి పాడటమన్నమాట. వేదాధ్యయనంలో ‘సహ పాఠ్య’మనేది ఒక పద్ధతి. చతుష్షష్టి కళలలో కూడా ఒకటి.[3] మంత్రం కానీ, యజుస్సు కానీ ఒకరు చదవటం ప్రారంభిస్తే తక్కినవారు కలిసి చదవటం ‘సహపాఠ్యం.’ శ్రీ శాస్త్రిగారి ‘స్వరమేళ’ శబ్దానికి ‘సహపాఠ్య’ శబ్దం పర్యాయపదంగా వాడవచ్చు.

‘అజాతశిశు స్వరమేళ’తో కూడా నాలుగు సహపాఠ్యాలు పెడదా మనుకున్నారట. కానీ కారణాంతరాలవల్ల దీనిని మానివేశారు. ప్రస్తుతము మూడే – వృద్ధ బ్రాహ్మణ స్వరమేళ – యువబ్రాహ్మణ స్వరమేళ – వితంతు స్వరమేళ. గ్రీకు Chorus కూ,

దీనికీ చాల భేదమున్నది. విశాలమైన గదిలో కూర్చుని భావవిహారం చేసే దీక్షితుల దగ్గరికి వృద్ధ బ్రాహ్మణులు, యువబ్రాహ్మణులు, వితంతువులు రావటానికి వీలులేదని భ్రమపడవచ్చు. వీరు నిజమైన వ్యక్తులు కారు. అప్పయ దీక్షితుల అంతరంగ కల్లోలం, గ్రామంలో జనశ్రుతి కలిసి కథావ్యక్తులుగా పరిణమించినవి. అందుకనే రంగంమీద కనపడకుండా తెరవెనకాల అదృశ్యంగా ఉండవలసి వచ్చింది. ఇందువల్ల పాత్ర బాహుళ్యం లేకుండా పని జరిగిపోయింది. అప్పయ దీక్షితుల మానసికమథనంలోని వివిధ దశలకు ఈ స్వరమేళలు దర్పణాలు. వీటివల్ల కవి కల్పనాచాతురీ, మానసిక తత్త్వ పరిజ్ఞానమూ (Study of Psychology) ప్రస్ఫుటమౌతవి.

తే. “అర్భకునిభంగి లేదు నా అంతరంగ
మోలలాడగ నానంద డోలలోన
తుంగభంగాలపై నూగు దోనెవోలె
నున్నదని పల్కినను విశేషోక్తి కాదు.”

అంత మనోవేదనతో అప్పయదీక్షితులు మంగళ వివాహ విషయం ఇదమిత్థమని తేల్చలేక నటరాజ విగ్రహానికి చేతులు జోడించి –

“శాస్త్రమటు పల్కు, మరి వృద్ధ సంప్రదాయ
మిట్లు కాదను నటరాజ, ఏమి చేతు?”

అని కళ్లు మూసుకొని ధ్యానముద్రలో ఉంటాడు. వృద్ధ బ్రాహ్మణ సర్వమేళ అప్పుడు ప్రారంభమౌతుంది.

***

శంభో శంకర
శాంతం పాపమ్
విప్ర వితంతూ
వివాహ కార్యమె

***

శాస్త్రం బేటికి
సదాచారమే

వృద్ధాచారము!
వృద్ధాచారము!

***

ఇంకేమున్నది
ఇంకేమున్నది
ప్రళయము, ప్రళయము
బ్రాహ్మణకులమున!

***

సామాన్యునివలె
సంభ్రమ మెందుకు
అఖిలలోక నుత
అప్పయదీక్షిత!

ప్రామాణికుడు, సదాచార సంపన్నుడు, ఎంత దయాళువైనా వృద్ధాచారమే మొదట్లో ఆయన మనస్సును బాధపెట్టింది; మొగ్గించింది. తనకు అపరబుద్ధి పుట్టిందనుకున్నాడు. బ్రాహ్మణ కులానికి ప్రళయ మాపాదిస్తున్నట్లు తోచింది. సామాన్య మానవుని సహపంక్తికి రావటానికి సంకోచించాడు. ఇది ప్రథమ దశ.

మానసిక స్థితిలో మళ్లీ మార్పు యువ బ్రాహ్మణ స్వరమేళ.

***

శాస్త్రవదాంవర
సజ్జనకోటికి
సర్వకాలముల
శాస్త్రమె లక్ష్యము

***

మే మెల్లరమును
మీ బంటులమే

అగ్నిని దుముకుదు
మానతి యగుచో

***

ఆ సమయంలో ఆచారం మీది దృష్టి శాస్త్రం మీదికి తిరిగింది. యువకులు తన కండగా ఉన్నారనే ఉత్సాహం కలిగింది. వీళ్ళకు పెళ్ళి చేదామనే భావాంకురం పడటానికి అవకాశం కలిగింది. కానీ ఇంకా ద్వైవిధ్యము ఆయనను బాధిస్తూనే ఉంది. అప్పుడు వితంతువుల స్వరమేళ.

***

అబ్దసహస్రము
లరిగిన మీదట
అరుగుదెంచు నీ
అమరనిమేషము!

***

మీ కారుణ్యా
మృతసేకమ్మున
పుట్టుదురుత్తమ
పురుషులు స్త్రీలును

***

చిన్ని యనదలకు
జీవన్మరణము
తొలగింపుదు
మీదుహితృప్రేరణ

***

వితంతు స్వరమేళ విన్న తరువాత దీక్షితుల హృదయం దయాసాగర మైపోయింది. ఆయన అంతరంగంలోని అమృత కలశం ఉప్పొంగింది. ఇది రెండోదశ. సరసవాణితో వివాహం చేయటానికి అవకాశమున్నదని మరకతచేత చెప్పి పంపిస్తాడు. అంతలో

మళ్ళా వృద్ధ బ్రాహ్మణ స్వరమేళ. మొదట ఉన్న దౌర్జన్యం ఈ స్వరమేళలో లేదు. వాంఛాపూర్వకంగాను, పక్షద్వయ నిరూపణ పూర్వకంగాను కనిపిస్తుంది.

***

నీవే ఈ విధి
నిర్ణయించునెడ
పాతివ్రత్యము
భంగము కాదా!

***

భువనములో నీ
పుత్రి పునర్భువు[4]
అనెడి కళంకం
బంటకుండవలె!

***

ఆలోచింపుము
అప్పయదీక్షిత
ధర్మము ముఖ్యమొ
తనయయె ముఖ్యమొ

***

కాయిక సౌఖ్యము
ఘనమో, నిర్వృతి
కారణధర్మము
ఘనమో తలపుము!

***

దీనితో దీక్షితులు దయావీరాన్ని త్యజించి ధర్మవీరుడైపోయినాడు. 'ఆర్యధర్మవిదా' అని సంబోధించి వృద్ధ బ్రాహ్మణులు ఆయనను నాయకుణ్ణి చేసి భారం వేశారు. ధర్మరథ చోదకుడై –

“దయ, దయ, దయ యని
దౌర్బల్యంబున
ఆక్రోశించెద
రతి సామాన్యులు”

అనుకున్నాడు. కాయిక సౌఖ్యం కన్నా నిర్వృతి కారణధర్మము ఘనమని తోచింది. మనస్సు మారిపోయింది. పిల్లకు పెళ్ళి చేయటానికి సాహసము లేదని సరసవాణితో సాకు చెప్పాడు. వృద్ధాచారమే ఆయనను లొంగ దీసుకున్నది. మనదేశంలో ఇప్పటికి ఇంతే.

నాటికలో స్వరమేళలకు ప్రాముఖ్యం ఎక్కువ ఉన్నది అదీకాక ఇదే నూతనము కావటం వల్ల ఇంతగా చెప్పవలసి వచ్చింది.

## 10

విజయనగర సామ్రాజ్యం విచ్ఛిన్నమైపోయింది. స్వాతంత్ర్యం ప్రకటించి నాయకులు స్వతంత్ర రాజ్యాలు ఏర్పరుచుకున్నారు. దక్షిణదేశంలోని నాయక రాజ్యాలు ఆ విధంగా ఆవిర్భవించినవే. ఆంధ్రులు అవటం వల్ల ఈ నాయకులు తమ రాజ్యాలకు తెలుగుదేశం నుంచి పండితులను, కవులను, గాయకులను ఆహ్వానించారు.

ఆంధ్రదేశంనుంచి దక్షిణానికి వలస పోయిన వాళ్ళల్లో ఆచార్య అప్పయ దీక్షితుల పూర్వులు ఒకరు. ఒక వాడుక ప్రకారం వీరు వైష్ణవులు, స్మార్తులుగా మారిపోయినారట. కానీ, – వైష్ణవం వీరిని వదిలిపెట్టలేదు. అందుకనే కవి మంగళాంబ చేత –

“ఆంధ్రులము మేము, ద్రావిడులనుట తగదు
స్మార్తులమె యైన కొంత వైష్ణవము కలిసె
తొల్లి రంగరాజాచార్యదుహిత తోత
రాంబ ప్రపితామహుని భార్య అగుటవలన”

అని అనిపించాడు.

“తండ్రి మధ్వాచారి, తనయుడారాధ్యుండు, తల్లి రామానుజ మతస్థురాలు” అనే సంప్రదాయం ఉన్న రోజులు అవి. వేదాంతదేశికులు తరువాత దృఢనిబంధనలు చేశారు.

అప్పయ దీక్షితుల వంశవృక్షం చూస్తే వైదిక కర్మల ప్రత్యయము – దీక్షిత, అధ్వరి – ఇత్యాది, కనిపిస్తుంది. యజ్ఞకర్తలు, సదాచారసంపత్తి కలవారు.

అప్పయ దీక్షితుల పితామహుడు అచ్చాదీక్షితులు (అచ్చన్న దీక్షితులు – ఆచార్య దీక్షితులు) 'వక్షఃస్థల మవైక్షత' అనే పాదం గల శ్లోకరచనం వల్ల ఆయనకు 'వక్షఃస్థలదీక్షితు' లనే బిరుదనామం కూడా వచ్చింది. అప్పయదీక్షితులు వ్రాసిన

"ఆసేతు బంధతటమాచ తుషారశైలా
దాచార్య దీక్షిత ఇతి ప్రథితాభిధానమ్ ।
అద్వైతచిత్సుఖమహాంబుధిమగ్న భావ
మస్మ త్పితామహ మశేషగురుం ప్రపద్యే! ॥"

అన్న శ్లోకం ఆయనమీదిదే. అచ్చాదీక్షితులు కృష్ణరాయల ఆస్థానం[5] అలంకరించాడట. దీక్షితుల తండ్రి రంగరాజాధ్వరి. 'అద్వైత విద్యాచార్యుడు.' వివరణ దర్పణము, అద్వైత విద్యాముకురము ఆయన గ్రంథాలు.

"యం బ్రహ్మ నిశ్చితధియః ప్రవదన్తి సాక్షా
త్తద్దర్శనా దఖిల దర్శన పారభాజః ।
తం సర్వవేదసమశేష బుధాధిరాజం
శ్రీ రంగరాజమఖినం పితరం నతోఽస్మి! ॥"

అని తండ్రిని గురించి అప్పయ దీక్షితులు అన్నాడు. వారి గ్రామం అడయప్పళము. అంటే ఆదెప్పపాలెం. వైదిక సంప్రదాయం గల వంశంలో జన్మించి అప్పయ దీక్షితులు అఖిలాగమపారగుడై అధ్వరకర్త ఐనాడు.

జ్యోతిష శాస్త్ర పరిచయం కలవాళ్ళకు ఆయన జాతకచక్రం చూస్తే విద్యావిశేషము బయటపడుతుంది.

<table>
<tr><td>చ</td><td></td><td>శరా</td><td>కు</td></tr>
<tr><td></td><td colspan="2" rowspan="2">రాశి</td><td></td></tr>
<tr><td>గు</td><td></td></tr>
<tr><td></td><td>కే</td><td>శు</td><td>ల<br>ర బు</td></tr>
</table>

ఒకే గ్రహానికి ఉచ్చస్థితి పట్టి నీచస్థితి కూడా పట్టినట్లైతే, నీచగ్రహం పరిపూర్ణ శుభుడౌతాడు. అందువల్ల ఈ జాతక చక్రంలో గురుడు పరిపూర్ణశుభుడు.

ఆరూఢ పంచమంలో గురుడుంటే జాతకుడు సర్వజ్ఞుడు, గ్రాంథికుడు, వ్యాకరణం వేదాంతాది శాస్త్రవేత్త, వక్త ఔతాడని శాస్త్ర ప్రమాణము.[6]

దీక్షితుల జాతక చక్రంలో ఆ స్థితే ఉన్నది. అంతే కాకుండా ఆరూఢంలో రవి ఉండటం వల్ల వేదాన్త విద్యతో పాటు సంగీత శాస్త్రజ్ఞానము అబ్బుతుంది.[7] తత్ఫలితంగా 'శివార్కమణి దీపికా' రచనచేసి శివాద్వైత స్థాపనాచార్యుడైనాడు. చినబొమ్మరాజు కనకాభిషేకం చేశాడు. శివాద్వైత నిర్ణయము, రత్నత్రయపరీక్ష, అద్వైతదీపిక – ఆది శతాధిక గ్రంథాలు బయలుదేరాయి. కుజుడు ఆరూఢ పంచమాన్ని అష్టమ దృష్టితో చూడటం వల్ల, ఖండదేవుని వంటి మీమాంసకుడే ఆయనను 'మీమాంసక మూర్ధన్య' డన్నాడు. కావ్య నాటకాలంకార కారకుడు – శుక్రుడు ద్వితీయంలో – అంతేకాకుండా – స్వస్థానము, మూల త్రికోణము – ఉన్నాడు. దీక్షితులు దివ్యమైన కవి. పరశ్శత గ్రంథకర్త. కువలయానందము, ఆనందలహరి, అపీత కుచాంబాస్తవము తదితర కావ్యచయం అందువల్ల అవతరించింది. లగ్న, ఆరూఢలగ్నాల్లో బుధస్థితివల్ల జ్యోతిష శాస్త్ర విదుడవుతాడు.[8] ఆ సంగతి గమనించి శ్రీ శాస్త్రిగారు దీక్షితదుహితకు వివాహం కాకపోవటానికి కారణంగా ఆయన చేత –

"కూడియున్నవారు కుజ, శని, రాహువు
లష్టమమ్మునందు అందువలన
తప్పిపోవదాయె దానికి వైధవ్య
బాధ విధికృతాన బాల్యమందె"

అనిపించారు. ఇలా చెప్పించటం కావ్యానికెంతో కళ తెచ్చింది.

యజనకారకుడు గురుడు నీచలో పడటం వల్ల దీక్షితులు విపరీత సంప్రదాయజ్ఞకర్త ఐనాడు. యజ్ఞపశువును చంపి వపాహోమం చేయవలసి వుంటుంది. అలా చెయ్యకపోతే యజనం పరిసమాప్తి పొందినట్లు కాదు 'కరుణావార్నిధి' కావటం చేత అది జరగలేదు. అగ్ని ప్రత్యక్షమై వప స్వీకరించినట్లు జనశ్రుతి. ఆ ఆధారాన్ని అనుసరించే వితంతువుల స్వరమేళలోని –

"యజ్ఞ పశువునకు
ఆలంబనమును

తప్పించిన ఓ
దయాసాగరా! –"

అన్న వాక్యం కనిపిస్తుంది.

దశమాధిపతికి స్వక్షేత్రంలో ఉచ్చస్థితి కలిగితే జాతకుడు మహారాజసము డౌతాడని శాస్త్రం. అప్పయదీక్షితులమీద ఔత్తరాహకవి అన్న,

శా. "నానా దేశ నరేంద్రమండల మహా యత్నాతిదూరీభవ
త్కాదాచిత్క పదారవిందవినతే రప్పయ్యయజ్వప్రభోః।
శైవోత్కర్ష పరిష్కృతై రహరహ స్సూక్తైస్సుధాలాలితైః
ఫుల్లత్కర్ణపుటస్య బొమ్మనృపతేః పుణ్యాని గణ్యాని కిం ॥"

అనే శ్లోకాన్ని చూస్తే మహారాజసముడే కాదు "నానాదేశ రాజన్య మండలానికి అనేక ప్రయత్నాల వల్ల నమస్కరించటానికి తగిన పాదారవిందాలు కలవా" దని తెలుస్తుంది.

జాతకచక్ర ప్రభావంవల్ల జగన్మాన్యత గడించాడు. అందరాని పదం అధిష్ఠించి అపరశివావతారమైనాడు.

## 11

వంశంలోనూ, విద్యావైభవంలోనూ, అప్పయ దీక్షితులు అసామాన్యుడు. గాంభీర్యము, ఔదార్యము, అనుకంప ఆయనలో పుంజీభవించాయి. అఖిలాగమ పారగుడు అవటం చేత ఎదురాడటానికి ఎవరికీ సాహసం లేదు.

కవితాత్మకలవాడు కావటం వల్ల కవి ఆయన చేత –

తే. "నాకలోకాంగనా వీటి కాకరండ
మండితోన్నత నవసుధాఖండమట్లు
విరియుచున్నాడు శశి ఉడువీథియందు
కళలు, త్రిజగదుద్దీపన కారణుండు"

అనే ముక్తకము అల్లించాడు.

మంగళాంబ పాటలో ఉన్న మాధుర్యాన్ని గ్రహించిన సంగీతజ్ఞాని. ఆంధ్రభాషలోని అతిమనోహరత్వ మవగతం చేసుకున్నాడు. కర్మదీక్షితుడైనా కారుణికుడు.

తర్కశాస్త్ర వేత్త కావటం చేత తూచి మాట్లాడుతాడు. తొందరపడడు.

“మంచిదమ్మా పోయి
మంగళకు పరిణయము
చేయ నవకాశమ్ము
సిద్ధించు నని చెప్పు!”

అవకాశమని అన్నాడు కాని నిశ్చితాభిప్రాయంగా చెప్పలేదు. మరకతవల్లి మామూలు మనిషి కాబట్టి మంగళార్థం గ్రహించింది.

పునర్వివాహం చేతామన్న బుద్ధి పోయినంత మాత్రానికి కాలుష్యం ఆయనను క్రమ్మినట్లు తోచింది. కాలకంఠేశ్వరాలయం కట్టించి పరిపూతుడైనాడు. శిష్య వాత్సల్యం జీర్ణించుకున్న దీక్షితులు, చంద్రమౌళికి “పూర్వబంధములును పూర్వవాసనలను కోసి, కడిగి వేసికొనుట శుభము” అని అభిప్రాయమిచ్చాడు.

వ్యంగ్య సంభాషణ ఆయనలో వ్యక్తి తాల్చింది.

“సకలతాపహారి స్మరహరు కరుణచే
శర్మ మగుత నీకు చంద్రమౌళి!”

సకలతాపహారి, స్మరహరశబ్దాలవల్ల కామాన్ని తొలగించుకోమని సూచన.

ధర్మసూక్ష్మము, ధర్మనిర్ణాయకుల కారుణ్యము, వారి దృక్పథము గ్రహించి –

తే. “కాదు కాదు సుమా! మహాకారుణికులు
ధర్మనిర్ణాయకులు, వారితలపు వేరు
ఇహము కన్నను పరమునకే విశేష
ఫలము లోకహితమ్ముగా తలచినారు”

అన్నాడు. ఎంత మాత్సర్యవిరహిత సూక్ష్మబుద్ధి! ఆయనలో ఉన్న శాస్త్రాన్ని ఆచారము శాసించింది. చంద్రమౌళి సద్వంశసంజాతుడు. శాస్త్రవ్యసనము సంస్కృతి, పరిశుద్ధ వర్తనము, గురుభక్తి, పవిత్రప్రేమ అతనిలోని అమరగుణాలు.

మంగళాంబ మీద మనసు పోయినప్పటినుంచీ మరో కన్య మాటే లేదు. పెద్దలమాట పెడచెవి పెట్టే స్థితికి చేరుకుంటున్నాడు.

"నా ప్రేయసీ పదన్యాస సౌభాగ్య
మొందిన ఈ మందిరోపవనంబు
శ్రీ ప్రయాగమహత్త్వసిద్ధిచే సర్వ
దేవతలకు కూడ తీర్థరాజంబె"[9]

ఎంత పరిపూతభావము అతని మనస్సులో ప్రభవించింది! కవితాత్మ కలవాడనటానికి వేరే కారణాలు కావాలా?

"అనిమిష దుర్లభంబైన ఆదివ్య
మంగళ విగ్రహ మంజుహస్తంబు
గ్రహియించు భాగ్యమ్ము కలుగు టేలాగొ?
పెనగొను సంభ్రమ భీ విస్మయాలు!"

తన హృదయాన్ని దత్తం చేశాడు కాని, ఆమె హృదయం ఎటువంటిదో అవగతం కాలేదు. 'గురు పుత్రి అనే గూఢభయం వల్ల' సంభ్రమ భీతి విస్మయాలు పెనగొన్నవి.

ఆ రోజులలో ఇటువంటి ప్రణయగీతాలు వ్రాసే వారేనా అనే అనుమానం అంకురించవచ్చు. అప్పయ దీక్షితుల బంధువు, బహుశః నీలకంఠ దీక్షితులు ఒకనాడు స్త్రీ పరంగా –

"అకృశం కుచయోః కృశం వలగ్నే
విపులం చక్షుషి విస్తృతం నితంబే,
అధర్గేరుణ మావిరస్తు చిత్తే –

అని వర్ణిస్తుండగా ఇంతలో ఆయన చూచి ఏమిటంటే –

"కరుణాశాలి కపాలిభాగధేయం"

అని పూర్తిచేస్తే సంతోషించాడట!

పరస్పర హృదయదత్తానంతరం చంద్రమౌళి గురువుగారికి తెలిస్తే "మంగళమో మరణమో" అనే అంతరంగయుద్ధంలో ఆగిపోయినాడు.

"కుసుమకోమల"మైన మానసానికీ, "స్థైర్యవిరహిత" చిత్తానికీ ఉన్న సూక్ష్మాన్ని గ్రహించిన సునిశితబుద్ధి అతనిలో ఉంది.

"అమృలతుల్య మయ్యు, అదియేమొ జంకుచే
మాట నోటరాదు.... మంగళాంబ!"

'మంగళాంబ' శబ్దాన్ని సంబోధనగాను. ప్రియురాలి నామధేయంగాను శ్లేషించాడు. చిన్ననాటి కావ్యపరిజ్ఞానం అప్పుడు బాగా పనిచేసింది.

వివాహం విచ్ఛిత్తి జరిగిన తరువాత గుర్వాజ్ఞ ప్రకారం సేతుస్నానానికి పోబోతూ, మంగళకు చెప్పిన "అర్చనీయో హి శంకరః" అనే గంభీరవాక్కు ఆకల్పాంతం నిలిచిపోయేది.

చమత్కార వాక్యరచనలో అందెవేసిన చెయ్యి సరసవాణి. తన శాయశక్తులా బావగారి మనస్సులో ధార్మికయవనిక చాటున తారాడే దయారసకన్యను రంగం మీది కెక్కించింది. విఫలమైపోయింది. సమయాసమయ పరిచయము సరసవాణిలో సహజగుణం. అపర శివుడంతవాడిని –

"ఆహవముఖమునం దర్జునునట్లు
నిజకుమారివివాహ నిర్ణయమందు
వెనుకంజ వేసిన విప్రవీరునకు
గీతోపదేశమే కృష్ణుండు చేయు!"

అని సూటీపోటీగా మాట్లాడింది. ఆమె మాతృప్రేమే అందుకు కారణం.

విధివశాన చిన్ననాడే మంగళ విగతభర్తృక ఐపోయింది. చంద్రమౌళిలో సద్గుణాలు ఆమెను ఆకర్షించినవి. అతన్ని అవిదితంగా ప్రేమించింది. యౌవనానికి సహజమే! ముగ్ధ కావటం చేత ముందుగా తన హృదయం బయటపెట్టలేదు. అతని హృదయం గ్రహించి సందిటిలో అణిగిన తరువాత హృదయం గల యువతి కాబట్టి –

"అయ్యయ్యో నిష్కారణమ్ముగ
ఆధిపాలైనారు నాథా!
ఈ తపస్విని అంతరంగం
ఔరుక పడకుంటన్"

అని నొచ్చుకున్నది. ప్రథమరంగంలో ముద్దులు మూటగట్టే మాటలతో చంద్రమౌళిని మోహితుణ్ణిగా చేసింది. పెద్దలను త్రిప్పగలననే ధైర్యం ఆమెకు తోచింది.

రెండవ రంగంలో ఆమె లేనిలోటు సహజ కోమలకంఠంతో నేపథ్యాన పాడినపాట వల్ల ఉన్నానని తీర్చింది.

చంద్రమౌళి తిరిగి రావటానికి వీలుండదేమో అన్నప్పుడు రుద్ధకంఠంతో –

"ఇంక నా కేమున్నదీ లోకమందు
బ్రతికి యున్నను నేను ఫలమేమి కలదు
తొలగిపోవగ నాదు దుఃఖభారమ్ము
కాలకంఠా! ఇంక కబళింపు నన్ను"

అని దుఃఖించింది. నిరాశ, నిస్పృహ ఒక్క మాటుగా ఆవరించాయి. జీవితదీపం ఆరిపోయినట్లుగా తోచింది. రుద్రాక్షమాలిక కూడా లభించలేదు కొంత ప్రశాంతికోసం. చివరకు శివాజీవిగా మారిపోయింది.

## 12

నాటక కాలపరిమితి 30 గంటలు. ప్రదర్శనకు మూడు గంటలు పట్టవచ్చు. దేశభేదం లేకుండా రంగవిభాగం రమణీయంగా ఉంది. అన్నీ అప్పయదీక్షితుల గృహావరణంలోనే.

పద్యనాటికలో ప్రకృతివర్ణనకు ప్రత్యేకస్థానం లేదు. అందువల్లనే కనిపించదు. కానీ నేపథ్యరచనకు చాలా ఉపయోగపడ్డది.

నాటికలో సాధారణంగా ప్రాప్త్యాశ, నియతాప్తి రెండే సూచితమౌతవి. ఈ నాటికలో కూడా అంతే.

మనోహరభావాలు, మధురఛందస్సులు, మానసిక తత్త్వపరిజ్ఞానము, పాత్రపోషణ, గభీరత, క్వచిదలంకారాలు, నిశ్చితాభిప్రాయము, నియమితాశయము నాటికలోని నానాగుణాలు.

"దీక్షిత దుహిత" తెలుగు సాహిత్యాకాశంలో దివ్యతార. అందులోని అందాలను అవగతం చేసుకొని ఆనందించటము భావ్యము.

"అలౌకికోల్లేఖసమర్పణేన
విదగ్ధ చేతః కషపట్టికాసు ।
పరీక్షితం కావ్యసువర్ణమేత
ల్లోకస్య కంఠాభరణత్వమేతు! ॥"

హరత్వ మవగతం చేసుకున్నాడు. కర్మదీక్షితుడైనా కారుణికుడు.

తర్కశాస్త్రవేత్త కావటం చేత తూచి మాట్లాడుతాడు. తొందరపడడు.

*– భారతి – విక్రమ, ఆషాఢ మాసము*

## అథః సూచీ పట్టిక

1. మూడు రంగముల పద్యనాటిక : శ్రీ శివశంకరశాస్త్రి విరచితము : 'ప్రతిభ' (1938–39) లో ప్రకటితము.
2. పద్మావతీచరణచారణ చక్రవర్తి (ప్రత్యేకము). ప్రభువాక్యము (ప్రతిభ). వరపరీక్ష (ప్రతిభ). సాధకుడు (ఉదయిని – ఆంధ్రపత్రిక సంవత్సరాది), రత్నాకరము (వీణ), దీక్షిత దుహిత (ప్రతిభ), రాజ జామాత, నోనకభార్య, సహజయానపంథ, కవిప్రియ (అముద్రితములు). ఇంకా ఏవో రచన చేస్తున్నారు.
3. వాత్స్యాయన కామసూత్రములు. ప్రకాశకులు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, ప్రథమ ముద్రణము. పే. 106, 132
4. 'ప్రథమ మేకస్య జాయా భూత్వా పునః అన్యస్య జాయా భవతీతి పునర్భూః'
5. J.O.R. Madras vol, iii. p. 158. భారతి, అంగీరస – పుష్య మాసము
6. గురుణా తత్ర సంబంధే సర్వజ్ఞో గ్రాంథికోభవేత్,
   వైయాకరణ వేదాంతవేత్తా వాచాలకో భవేత్.
   గురుణా తత్ర సంబంధే సంప్రదాయేన వేదవిత్,
   శాస్త్రవిద్గ్రంథకర్తృత్వముఖ సద్గుణవాన్ భవేత్.
7. ఆరూఢతత్ప్రంచమయో న్సూర్యే వేదాంతవిద్భవేత్,
   గీతవిచ్చ భవేత్కేతుయోగే గణితశాస్త్రవిత్ (జాతక రాజము)
8. జాతకాలంకారము
9. తిహీ వ్రజకెలి నికుంజ. మగ్, పగ్ హోల్. ప్రయాగ్ – విహారీలాల్ (Hindi Script)

# నోరి ఖండ కావ్యాలు

"చిన్నతనంలో భారతము, భాగవతం, రామాయణమూ వ్రాసినవారు చాలా గొప్ప కవులనీ వారు వ్రాసినట్లుగానే చిరస్థాయిగా ఉండే కావ్యం (తాను) కూడా ఒకటి వ్రాయవలెననీ" నోరిలో ఒక అభిప్రాయం పడిపోయింది. అప్పటికా గ్రంథాలు చదవనుకూడా లేదు. ఆ చిన్ననాటి ఆశయాన్ని నెరవేర్చుకోటానికి, చిన్నతనం నుంచే పద్యరచన ప్రారంభించాడు. అందుకు వారి నాన్నగారు చాలా సహాయం చేశారు. కుమారుడికి వ్యాకరణం నూరిపొయ్యాలని ఆయన ప్రయత్నం. ఆయన బలవంతం వల్లనే నోరి సంస్కృతము అభ్యసించ ప్రారంభించాడు. ఆయన సంస్కృతాంధ్ర పండితులు, చిన్నతనములో పాదుకాంత దీక్ష పుచ్చుకున్నారట. పెద్దతనములో సంధ్యావందనము కూడా శ్రద్ధగా చేసేవారు కాదు. భోజనమునందు నోట్లో ఉదకము మాత్రము ప్రాశన చేసేవారు. మిషనరీలకు, డాక్టర్లకూ ట్యూషనులు చెప్పటం వల్ల సయన్సులమీద ప్రమాణబుద్ధి కలిగింది. అయినా పూర్వాచార పరాయణత ఉండకపోలేదు. పినతండ్రి గురులింగశాస్త్రిగారు గొప్ప విద్వాంసులు. సాహిత్యములో నిధి, జ్యోతిష శాస్త్రము, వేదాంతము, అవసాన దశలో వ్యాకరణమూ సంపూర్ణముగా అభ్యసించినవారు. బరూరి త్యాగరాయ శాస్త్రులు వారు ప్రచురించిన గ్రంథాలు సమస్తమూ వారు వ్రాసినవే అనవచ్చు. తండ్రి పినతండ్రులిద్దరూ లౌక్యులు. ఇద్దరికీ స్త్రీ వ్యసనము కూడా లేకపోలేదని ప్రతీతి" – ఇది పితృపక్షము.

మాతృపక్షానికి వస్తే 'మాతామహుడు క్రమాంత స్వాధ్యాయపరుడు. వారి సోదరులూ పెద్దలూ స్వాధ్యయనము చేసిన అవధానులు. ఆయన ఆధానము చేసిన దీక్షితులు. చదువు రాదన్న మాటేగాని తల్లిగారు వినికిడి వల్ల పురాణాలన్నిటి తాత్పర్యమూ గ్రహించేది. ఇంటిలో పనులన్నీ అయిన తర్వాత సత్కథాశ్రవణము, పఠనము, మననము – ఇత్యాది కాలక్షేపములతోనే పొద్దు పుచ్చేది. తెల్లవారుజామున పనిచేసుకుంటూ గజేంద్ర మోక్షము పాట – ఇత్యాదులు పాడుకుంటూ ఉండేది. రాత్రిళ్ళు పని అయిన తరువాత భజగోవిందము – ఇత్యాది స్తోత్రాలు చదువుకుంటూ నిద్రపోయేది. డాంబికము లేని శిష్టతా, పదిమందితో కలిసి భజనలు చేయని భక్తిశ్రద్ధలూ ఉండేవి.

పర్వదినాలలో ఉపవాసాదులూ దేవదర్శనమూ, కార్తిక మాసములో ఏకోత్తర వృద్ధిగా దీపారాధన, ఆకాశ దీపము ఇత్యాదులతో కాలం గడిపేది. శ్రావణ శుద్ధ ఏకాదశినాడు పరలోకగతురాలైనది. 'ఏకాదశి' అనే కావ్యం ఏతత్ఫలితం.

పితృపక్షం నుంచి కొన్ని గుణాలూ, మాతృపక్షం నుంచి కొన్ని గుణాలు నోరికబ్బాయి. ఆయన జీవితంలో కలిగిన సంఘర్షణంతా పితృపక్షలక్షణాలకూ, మాతృపక్ష లక్షణాలకూ సంబంధించింది. మాతృపక్షమే బలవత్తరమైనది. మొదట కొంతకాలము కవి హృదయంలో పితృపక్ష లక్షణాలు పనిచేసినా, వయస్సు వస్తున్న కొద్దీ మాతృపక్షలక్షణాలకు సంపూర్ణ విజయ ప్రాప్తి గలుగుతున్నది. కొద్దిరోజుల క్రింద జగద్గురువుల వద్ద స్వీకరించిన 'పూర్ణదీక్ష'తో ఈ విషయం రూఢైపోయింది. ఈ పక్షాల రెంటి లక్షణాలూ, వాటి సంయోగవియోగాలూ, నిమ్నోన్నతాలూ కవి రచనలలో ప్రతిఫలిస్తూనే వచ్చినవి.

పురాణ కవులనూ, వారి కవిత్వాన్నీ ఆదర్శంగా పెట్టుకొని కవిత్వము చెబుదామనుకున్న యువకవి దీక్షతో కలం చేబట్టాడు. కొన్ని ప్రబంధాలు చెప్పాడు. నవలలు, నవలా ప్రబంధ నాటకాలు, చిల్లర మొల్లరగా ఇంక నెన్నో కృతులల్లాడు.

శ్రీ శివశంకరశాస్త్రి నోరి అన్నగారికి తోడల్లుడు. పూర్వం నోరి స్వగ్రామం గుంటూరు. ఆ రోజుల్లో... శంకరశాస్త్రి గుంటూరు వచ్చినప్పుడు 'నీవు పద్యాలు వ్రాస్తావట, చూపించ' మంటే సిగ్గుతో చూపక తప్పుకున్నాడు నోరి. కానీ ఆయనమీద హృదయంలో ఏదో అభిమానం ఏర్పడ్డది. ఆ ప్రాంతములోనే ఒకటి రెండు రాత్రులు ఇష్టగోష్ఠిలో కావ్యప్రశంస వచ్చింది. దానితో నోరి హృదయాన్ని శ్రీ శివశంకర శాస్త్రి ఆకర్షించాడు. ప్రాచీన కవిత్వపు పోకడలకు స్వస్తి. నవ్య కవితాధోరణికి బీజాంకురము.

తరువాత కొన్నాళ్ళకు శ్రీ శాస్త్రితో పరిచయము కాకముందూ తరువాతనూ వ్రాసిన కావ్యాలలో కొన్ని మాత్రము అట్టేపెట్టి మిగిలినవన్నీ ఆయన నోరిచేత దహనం చేయించారు. నోరి కా పని అప్పుడిష్టము లేదు. కానీ ఆయన ప్రోద్బలం వల్ల చేశాడు. అందులో ఒక నవల పోయింది. కొన్ని ప్రబంధాలు పోయినవి. ఒక నవలాప్రబంధ నాటకము పోయింది. ఇక ఖండ కావ్యాలు లెక్క లేదు. అప్పుడే,

తే. 'రూపు మాత్రపుఁ బూలెన్నో రూపుమాసి
పోయిననె కాని పిందెపూల్ పుట్టబోవు

పిందెలెన్నియొ నాశంబు నొందిగాని
పూర్ణ ఫల మొండు నిలువగా బోదు లతను'

అని కొత్తగొంతుకతో పాడాడు.

ఆ రోజుల్లో ఉన్న కవిమిత్రులు నలుగురూ తరచుగా కలవటమూ, ఎవరన్నా కొత్త కావ్యం వ్రాస్తే అందరూ వినటమూ, తోచిన మార్పులు సూచించటమూ – అంతా ఎంతో కులాసాగా జరిగిపోయేది. శ్రీ శివశంకరశాస్త్రి సూచనలు పంక్తులు మార్చడముతోనూ, మాటలు తీసి మాటలు పెట్టడముతోనూ ఆగేది కాదు. కళావిషయంలో పొంకం (Artistic Unity) లేనిది నిర్దయతో తీసివేయమని ఆయన సలహా ఇచ్చేవాడట. దానితో వారి వారి కావ్యాలకు కూర్పులో ఒక బింకము (Finish) వచ్చేది. 'ఆయన సహాయం వల్ల స్వయంకృషి చేస్తే ఎన్నాళ్ళో తంటాలు పడితేనే గాని సాధ్యం కాకపోయే కళాభిరుచి అబ్బిం' దనీ, 'ఆయనతో పరిచయము కాక ముందుండే అతి ధోరణి (Exuberance) కొంత తగ్గిం'దనీ నోరి అంటుంటాడు. ఆయనతో పరిచయానికి పూర్వం నోరి దృష్టి ప్రహసననాలమీదికి విస్తారంగా ప్రసరించేది. ఆ స్వభావం క్రమేపీ కవిత్వంలో చచ్చిపోయి మాటలో మాత్రం మిగిలింది.

సాహిత్యంలో విప్లవం రావటానికి అప్పుడప్పుడే సూచనలు కనిపిస్తున్నాయి. రాయప్రోలు 'కావ్యావళి' ప్రచురించి –

ఉ. "కొమ్మలమీది కోయిలలు కుత్తుకలెత్తి స్వతంత్రభావ సూ
త్రమ్ముల కట్టసాగి మమతన్ ప్రణయాంబర చిత్రశాలలున్
కమ్మని జీవితానుభవ గాథలు స్వాదుకథాపదేశ మా
ర్గమ్ములు కర్ణరంజకముగా వికసించెడు నేడు భారతీ!"

అప్పటికే ఉచ్చకంఠంతో వినిపిస్తున్నాడు. అబ్బూరి, బసవరాజు నవ్య సాహిత్య క్షేత్రములో నూతనపంథాలను తొక్కిన కవితాకర్షకులు.

ఇంతలో 'సాహితీ సమితి' పుట్టింది. ప్రాచీన సాహిత్య మార్గంలో నడుస్తున్నామని చెప్పుకుంటూ, సాముగరిడీలు చేసే అవధాన కవులమీద, వారి కవితాపద్ధతులమీద తిరుగుబాటు చేసి, నూతన వ్యక్తిత్వాన్ని తెలుగు సాహిత్యానికి కట్టిపెట్టాలనే ఉత్సాహంతో ఉన్న కవిమిత్రులు సభ్యులుగా చేరారు. వీరందరిలో ఒక కట్టుబాటు ఉండేది.

**స్నేహభావంలోని ఆర్ద్రత సభ్యత్వానికి ప్రథమ లక్షణం.** కేవలమూ కవులకే కాకుండా చిత్రకారులకు, కథకులకు, విమర్శకులకూ సమితిలో స్థానం ఉండేది. వివిధ సాహిత్య భాండారాలను, నూతన రచనలతో పాటు – కొల్లగొట్టి తమవశం చేసుకోవాలని సభ్యులు ఆశయంగా పెట్టుకున్నారు. కొందరు కొందరు కలసి ఒక్కొక్క సాహిత్యాన్ని నేర్చుకున్నారు. సమితి ప్రథమ సభ్యుల్లో నోరి ఒకడు. సమితిలో ఉన్న ఇప్పటి వాళ్ళందరిలోకీ చిన్నవాడు.

కవి మిత్రుల స్నేహం వల్ల నోరిలో 'కవిత్వపు పిచ్చి' వృద్ధి కాజొచ్చింది. ఆయన కవితాజీవితంలో ఆ రోజులు ఒక Impressionable Age. ఏ విషయం కవిలో ఉద్రేకం కలిగిస్తే అదల్లా కావ్యమై కూర్చుండేది. నేటి ఆంధ్ర సాహితీలోకంలో సంస్కృతాంగ్లాంధ్ర సాహిత్యాలను విశేషంగా జీర్ణించుకున్న వాళ్ళలో నోరి ఒకడు. కన్నడంలో కూడా కొంత కృషి చేశాడు. **ఆయన కలం కేవలము పద్యాలు వ్రాయటంతోనే ఆగిపోకుండా వివిధ సాహిత్యశాఖలను అనుసంధించుకున్నది.**

తెలుగు సాహిత్యంలో చెప్పుకోతగ్గ కొన్ని కథలు వ్రాశాడు. ఆయన 'వీరుని కథ'లోని టెక్నిక్‌లో ప్రత్యేకత ఉన్నది. కథంతా స్వగతము (Dramatic Monologue) నడిచే పద్ధతిలో నడిచింది. వచన నాటికారచయితలలో తనకొక ఉన్నతస్థానాన్ని కల్పించుకున్నాడు. ఆయన పద్యకావ్యాల కన్నా వచననాటికలు – సోమనాథ విజయము – ఖేమాభిక్షుని – పతంగయానము పఠితల దృష్టిని ఎక్కువగా ఆకర్షించాయి. ఈ మధ్య 'భాగవతావతరణము', 'షణ్ణవతి' వంటి పద్యగీతి నాటికలు కూడా వ్రాయటము ప్రారంభించాడు. విమర్శనవిషయంలో ఆయన తీవ్రవాది. ఉపదేశార్హత లేనిదే కవిత్వం చెప్పకూడదని ఆయన మతము. అంతమాత్రముతో వచ్చే రచనలనన్నిటినీ త్రోసిరాజనడు. ఏ మాత్రము గుణమున్నా గ్రహించి మెచ్చుకొని, తీరుతాడు.

నోరి ఖండకావ్యాలు కొన్ని కలిపి 'గీతమాలిక' అనే పేరుతో సాహితీ సమితివారు 1921లో ప్రచురించారు. మొదట దీనికి 'రసాల' మని నామకరణము చేసి, తరువాత ఏ కారణమువల్లనో మార్చారు. అందువల్లనే గీతమాలికలోని 'శివశంకరునకు' అనే కావ్యంలో –

'నా వనమ్మున దోహదసేవ నీవు
సాదరమ్ముగ జూచు రసాల శాఖి"

అని కనబడుతున్నది. నవ్య సాహిత్యంలో ఆ నాటికి ప్రచురణ అయిన గ్రంథాలు : రాయప్రోలు కావ్యావళి 1913–14, అబ్బూరి మల్లికాంబ 1915, బసవరాజు సెలయేరు 1916, ఊహాగానము, పూర్వప్రేమ 1917, 19–20 సంవత్సరాలలో ఏమీ ప్రచురణ కాలేదు. నోరి – శారద, సఖి, భారతి, ప్రతిభ మొదలైన పత్రికలలో గీతమాలిక తరువాత వ్రాసిన మరి కొన్ని ఖండకావ్యాలు ప్రచురించాడు. గీతమాలికలోని కావ్యాలన్నీ కవికి పందొమ్మిదేండ్లు నిండక పూర్వం వ్రాసినవే.

నోరి ఖండకావ్యాలన్నీ ప్రకృతి, ప్రేమ, భక్తి, మైత్రి, జీవితాలకు సంబంధించినవి. కొన్ని చరిత్రాత్మకమైన కథలు.

ఖండకావ్యాలుగా చెప్పిన కథలకు మూలము బౌద్ధ, గ్రీకు చరిత్రలు. కవి అయిదో ఫారము చదువుతుండగా 'Children of the Dawn' అనే గ్రీకు పురాణ కథల మీద అపేక్ష విస్తారంగా కలిగిందట. అప్పటినుంచీ కనబడ్డ గ్రీకుకథల్లా చదివాడు. ట్రోజను యుద్ధకథలు కవి మనస్సులో బాగా నాటుకొన్నవి. తరువాత Derby హోమరు భాషాంతరీకరణము, Long వ్రాసిన గ్రీకు కథలు చదవటము సంభవించింది. Bury మహాశయుడు వ్రాసిన గ్రీకు దేశచరిత్ర చదివిన రోజులలో ఎన్నో కథలు ఆయన కవిత్వాన్ని ఆకర్షించాయి. రోమను చరిత్రకు గిబ్బను మహాశయుడు ఎటువంటివాడో, గ్రీకు దేశ చరిత్రకు బ్యూరీ అటువంటివాడు. ఆ రెండు దేశచరిత్రలూ సాహిత్య శ్రేణిలో పరిగణింపబడుతున్నవి. ఈ కృషికి ఫలితమే గ్రీకు చరిత్రలకు సంబంధించిన గీతమాలికలోని ఏయసు, ఈనను, జర్జీసు కావ్యములు. **ఆధునిక ఆంధ్రకవులలో గ్రీకు తత్త్వాన్ని అవగాహన చేసుకొని వారి వస్తువుతో కావ్యాలు చెప్పినది ఈయన ఒక్కడే. మహాకవి హోమరు రచనాపద్ధతిని తన కావ్యాలలోకి తీసుకు రావాలని ప్రయత్నము చేసి, చాలావరకు సఫలీకృతుడైనాడు.** నోరి మీద గ్రీకు వాఙ్మయ ప్రాబల్యం విషయాన్ని శ్రీ శివశంకర శాస్త్రి 'నాలో మార్పులో' గ్రీకువాఙ్మయం చదువుతున్న రోజుల్లో నోరి నరసింహశాస్త్రి అందులో కథావస్తువులు కొన్ని స్వీకరించి ఖండకావ్యాలు చేశాడు. .... నా కంటే అతను గ్రీకు (Spirit) బాగా గ్రహించాడేమో ననిపించింది' అని వ్రాశారు. నోరి గ్రీకు కథల్లో గ్రీకు పురాణకవిత్వానికి ముఖ్యగుణాలు – సౌలభ్యము, అవక్రత, వాస్తవికత (Realism) పట్టుకొని వచ్చాడు. బుద్ధదేవుని సర్వసంగపరిత్యాగానికి సంబంధించిన కథ 'వినిర్గమనము'. **గ్రీకు కథలలో కన్నా దీనిలో కవి కళాతత్పరత బాగా కనిపిస్తుంది.** ప్రకృతిని నేపథ్యరచనకు కవి రసోచితముగా వాడుకొన్నాడు, ఈ 'వినిర్గమనము'లో. ప్రకృతితో ఏదో ఒకవిధమైన సంబంధం లేని కవి అరుదు. కొందరు

ప్రకృతిని దర్శించి పసిపిల్లలు ఆనందించినట్లుగా ఆనందించి, ఉన్నది ఉన్నట్లుగా వర్ణిస్తారు. ప్రకృతిలోని పదార్థజాలాన్ని కొందరు కవులు ఇంద్రియ సంబంధమైన వ్యామోహాన్ని పొంది ఆమె బాహ్య సౌందర్యాన్ని అభినందిస్తారు. వస్తువు కనుగుణమైన ప్రకృతి స్థితిని తీసుకొని నేపథ్య చిత్రణము చేస్తారు కొంతమంది. ఉపమా రూపకాలంకారాలకు ఉపయోగించుకొని అంతతో ఆమెకు స్వస్తి చెబుతారు కొంతమంది. ప్రకృతిలోని అతీంద్రియమైన శక్తిని గ్రహించి జగదేకమాతగా పూజిస్తారు కొంతమంది. ఆమె చిత్రరూపాన్ని సర్వే సర్వత్రా దర్శిస్తారు. వాత్సల్యభావంతో ఆ మహాశక్తికి పాదాక్రాంతులై ఆమె అపాంగావలోకనాన్ని ఆకాంక్షిస్తారు.

నోరి మొదట ప్రకృతిని ఒక జవ్వనిగా దర్శిస్తాడు. 'పూర్ణచంద్రుడు ఆమె ముఖము, సాంద్రచంద్రిక హాసము. లసితజలధరులు చూర్ణకుంతలాలు, కాలగగనము సుందర కైశికము. దినమణి చారు విస్తారమైన ఆమె కేశపాశంలో సహస్ర కాంతులతో ప్రకాశించే దివ్యమణి. 'కృష్ణవేణి' – ప్రకృతి రమణీయ హరిత వస్త్రంబు గట్టి మంజు మంజీర మధుర నిస్వనముతోడ ప్రియుని దర్శించుమతి త్రపామంథరముగ, పోతూ ఉన్న ఒక ముగ్ధ మాదిరిగా కనపడ్డది.

ఇంకో తడవ –

'ప్రకృతి కాంత వసంతదర్శనము కలుగ
బ్రియుని సంప్రీతితో నాదరించుకొఱకు
చిగురుచీరె ధరించి విచ్చేసె నెదురు'

అని వాసకసజ్జిక మాదిరిగా కనపడ్డది. అంటే ఆ నాటికి కవి ప్రకృతిలోని కేవల బాహ్య సౌందర్యాన్ని మాత్రమే చూడగలిగాడన్న మాట. తరువాత 'మై మరపు' వ్రాసేనాటికి ఆమె తల్లిగా కనిపించింది. అప్పటికి కవి ప్రకృతిమాత ముందు తన శక్తి తానెరుంగని బాల్యావస్థలో ఉన్నట్లుగా కనబడుతాడు –

'ఇపుడు నేనున్న చోటి వస్తువుల నెల్ల
జిన్ని నీ యూర్మికరముల నెత్తిపట్టి
లీన మొనరించి నీలోన నీవు పోవు
చోటులను జూపి అందందు త్రిప్పుచుందు
అట్లు ననుగూడఁ ద్రిప్పి ముదంబు గూర్చు'

అని చిన్నపిల్లవాడు తల్లితో ఎక్కడికో తీసుకు పొమ్మని గునిసి, తీసుకుపోతానంటే పట్టరాని సంతోషంతో గంతువేసి కేక వేసేటట్లుగా కృష్ణానదీసైకతాలలో వెర్రిగా తిరిగాడు. ఈ స్థితిగతులు 'ఉద్బోధము' నాటికి మారిపోయినవి. అప్పుడు ఆయన ఒక కొత్త సత్యాన్ని కనుక్కున్నాడు –

"సంద్రమున సూర్యునిలో నాకసమున గాలి
జుక్కలను, చందమామలో జూడవచ్చి
పక్షి జీవంబులోన వెన్నెలలోన
ఊరి దంపతులలో కుటీరమందు
స్థిరపడిన గొప్ప ప్రకృతి చిత్రంపురూపు
కానగా వచ్చె – నాలోన కానవచ్చె
ప్రత్యణువునందు సైతము ప్రకృతి యెల్ల
నిమిడియుండుట ఇప్పుడే యెరిగినాడ
ఇంతవరకును పుట్టంధు వట్టులుంటి"

అని చెప్పాడు. ఈ పరిజ్ఞానము అందరికీ కలుగదని గీతలో పరమాత్మ 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అని చెప్పినట్లు –

'ప్రకృతి మహనీయ రూప మెల్లెడల కలదు
కనులు గలవారు మాత్రము కాంచగలరు'

అని విశదీకరించాడు. మహాకవి A.E. ప్రకృతి ఇట్టి వైచిత్ర్యాన్ని జూచినపుడు –

'One Thing in all things have I seen
One thought has haunted earth and air'

అని అన్నాడు. ఆంగ్ల సారస్వతంలో వర్డ్సు వర్తు కవికి ఈ అనుభూతి చిన్ననాడే కలిగింది. యౌవనంలో కవికి ప్రకృతి సంబంధం తగ్గిపోయింది. దానికి కారణము 'హర్షావహ నవ్యభవ్య వివిధాశయముల్ మధుర ప్రయత్నముల్'. కొంత కాలానికి చిత్తవృత్తిలో మార్పు కలిగి మళ్ళీ ప్రకృతిమాతను మోహాంధుడైన నీ కుమారుణ్ణి తిరిగి ఏలుకోవలసిందని ప్రాధేయపడతాడు. ప్రకృతికీ తన జీవితానికీ ఉన్న సంబంధాన్ని, ప్రకృతి కవిత్వాన్ని మానినందుకు బాధ పడుతూ చెప్పిన 'పునరావర్త'మనే ఖండకావ్యంలో ఉట్టంకించాడు. ఇది మహాకవి వర్డ్సువర్తు 'టిన్ టరన్ ఆబీ' మీద చెప్పిన కావ్యం వంటిది. అందులో –

ఉ. 'శైశవవేళ బాల్యమున శాంతవిశృంఖల సాధువృత్తి నీ
పేశల రమ్యగర్భ పద వీ స్థితి నెప్పుడు విశ్రమింతు క్షీ
రాశనుడైన యర్భకుడనారత మంబయురస్థలంబునన్
లేశము చింతలేక పవళించి సుఖించు మనోజ్ఞ వైఖరిన్.'

ఉ. 'పల్లవ పుష్పకోరకిత భాస్వరరూపము దాల్చి నీవు శో
భిల్లు వసంత దివ్యతరవేళ లతాగ్రము లెక్కి యోగి యు
త్ఫుల్ల మనంబుతో పికము ముద్దులపాటల నాలకింతు, నీ
వల్లన శ్రాంత వౌ శిశిర మందున నేనును విశ్రమించెదన్.'

ఉ. 'ఈ విధినెల్ల కాలము గతించిన మేలయి యుందుగాని యిం
కోవిధమయ్యె దైవగతి, యొయ్యన శైశవ బాల్యముల్ చనన్,
యౌవన మంకురించె, హృదయంబున వెంటనె మొల్కలెత్తె హ
ర్షావహ నవ్యభవ్య వివిధాశయముల్ మధురప్రయత్నముల్.'

ఉ. 'తల్లి, క్రమంబుగా స్మృతి పథంబున దూరము కాదొడంగె యు
ష్మల్లలితామలాకృతి, ప్రసన్నములై రుచిరంబులై సుధా
వేల్లితముల్ ప్రతిక్షణవివృద్ధములై సనసౌఖ్యరాజి భా
సిల్లె త్వదాఖ్యయే నిరవశేషము నామది విస్మృతింపగన్.'

ఉ. 'ఆ కలకంఠ కంఠ నిసృతార్ద్ర కుహూధ్వని నన్నినాళ్ళకున్
నీ కరుణాస్వరంబు విననేర్చితి, నావిధ మొన్నినాళ్ళుగా
నాకయి కంఠ మెత్తి కరుణంబున బిల్చితివో ఆమానమౌ
నీకృప నీమహత్త్వము గణింపదరంబె కృతజ్ఞబుద్ధికిన్.'

అని ప్రకృతికి విన్నవిస్తాడు. కవిలోని తాత్త్విక దృష్టి అభివృద్ధి అవుతున్న కొద్దీ ప్రకృతిలోని స్థిరత్వాన్ని, మానవ జీవితంలోని అస్థిరత్వాన్ని గ్రహించాడు. 'కృష్ణవేణి' కవిని చూచి 'ఏదీ నాతోపాటు కాస్త పొంగు' చూతామని అంటే –

శా. 'ఈ ఆషాఢ నవాంబుదార్భటులతోనేకశ్రుతిం గల్పి త
ల్లీ, ఈరీతిగ నిత్యయౌవనసుధాశ్రీరాగ మాలాపనల్
చేయంజాలితి వెన్నిమారు లిటులన్ జీర్ణించు నా బోంట్లకుల్
ప్రాయం బింత చిగుర్ప నేరితివె అంబా, కృష్ణవేణీనదీ!'

శా. ‘నిన్నా మొన్నటిదాక ఎండలను ఎంతే జాలిగా జాలుగా
నున్నా వోపిక లేక నాకువలెనే ఒక్కుమ్మడిన్ నేడు సం
పన్నాత్మీయమహాప్రవాహమున సివ్వాలాడుచున్నావు, నే
ని న్నీ నాడును పోలి పొంగగల నంటే తల్లి! కృష్ణాపగా!’

శా. ‘నీ కూలంకషవాః ప్రపూరమున నెన్నే బిందువుల్ గల్గనో
నీ కన్నేళ్ళ వయస్సు లేదటవె వీనిం జూడు షట్త్రింశకున్
వాకల్ కట్టుచు పొంగి పొంగి మరలన్ వర్షంబు వర్షంబునన్
నీ కౌమారము చాటెదే, ఇతడు క్షీణించెంగదే అప్పుడే.’

అని ఆమెను తనకు కౌమారాన్ని తిరిగీ ప్రసాదింప వలసిందని ప్రార్థించాడు.

పుష్పబాణ విలాసము, అమరుక శతకము, శృంగార శతకము, అలంకార గ్రంథాలలో నాయకులకు సంబంధించిన శ్లోకాలు చదవగా, అవి నోరి హృదయాన్ని ఆకర్షించాయి. వాటి అస్పష్టప్రభావం మనస్సులో ఉండిపోయి అంతస్సులో కలిగిన ప్రణయభావాలు నాయికాభావంలోకి మారి, ప్రథమరాగము, రాగభయము, జన్మసాఫల్యము, గర్వార్పణము, రాక్షసప్రేమ, నూతనక్రీడ, పరాజయము, అజ్ఞాత బంధము, విభ్రాంతి, ఘాతుకప్రియ సమాగమము – ఇత్యాది కావ్యాలుగా పరిణమించాయి.

‘ప్రథమరాగం’లో నాయిక అబల, సుకుమార. ఇతఃపూర్వము ప్రేమబాధ ఎరుగనిది. ఆమె హృదయంలో రాగచింత కలిగించాడు గాని, నాయకుడు తాపాన ఆమె మనస్సు కలవర పెట్టాడు. అప్పుడామె నాయకునితో –

తే. ‘రాజిత విచిత్రచిత్ర నిర్మాణకుశల
హిమసుధాస్వచ్ఛమగు నస్మదీయహృదయ
కైరవదళంబులం దీవు కరుణ మాలి
రాగరేఖల గాఢత వ్రాయుటేల?’

.............................

తే. భావి సుఖలబ్ధి కిట్టులు బాధపడుట
అబల సుకుమార నాకు సాధ్యంబె చెపుమ’

అని దీనాతిదీనంగా తన అవస్థను వెల్లడిస్తుంది.

మధురమైన లజ్జను త్యజించి నాయకునికి సంతుష్టి కూర్చటానికి ఎంత ప్రయత్నించినా నాయకుని మనస్సు ఆమె మీదికి ప్రసరించలేదు. అప్పుడు గర్వార్పణములో నాయిక –

తే.గీ. 'గాఢ చిరసంగతిని మమైక్యంబు గన్న
విపుల గర్వము కూడ నర్పింపవలెనె,
హృదయ వేదన కన్నీరు వదలవలెనె,
ప్రేమ కఠినాంతరంగ, నా హృదయనాథ!'

అని నాయకుని దూరుతుంది. కాని ఆమె హృదయంలోనుంచి అతనికి ఉద్వాసన చెప్పలేక 'నా హృదయనాథ' అని సంబోధించి చల్లబడిపోతుంది. 'రాగభయం'లో నాయిక చిత్రమైనది. నాయకుడు ఆమె యెదుట నిలువబడినంత మాత్రాన్నే ఆమె ఎద దడదడ మంటుంది. మనసు భయవిహ్వాలతతో మైకం క్రమ్మిపోతుంది. అతడు నాలుక కదిల్చితే ఆమె నాలుక తడియారి గొంతులోని స్వరము కుంచించుకొని పోతుంది. అతను కౌగిలిలో చేరిస్తే సివమెత్తి అరుస్తుంది. నాయకుని ఉన్నతికి తగిన దానిని కానేమోనని ఆమె భయము. నాయకుని సుఖానికే తన సర్వస్వాన్ని అర్పించి అతని ఆనందంలోనే తన జన్మకు సాఫల్య మున్నదని భావించుకుంటుంది. 'జన్మ సాఫల్య' నాయిక. 'రాక్షస ప్రేమలో' నాయిక ప్రమాదకరమైనది.

'నన్ను ప్రేమిస్తివా నా హృదయ మమృతమ్ము
కాదేని నాయెడద కఠినవజ్రమ్ము!
నన్ను మమతం గన్న నాయాత్మ నీదాసి
మీరుచో నీపాలి మృత్యు దేవతను.'

అని నాయకుని బెదరించి ఆత్మసుఖాన్ని చూచుకుంటుంది. 'నూతనక్రీడ' లోని నాయిక ప్రియుని అభిమతాన్ని అనుసరించేది. అందులో కలిగే తన బాధను కూడా లెక్కచెయ్యదు.

'పెదవి కదపక, నవ్వక ప్రీతి గదుర
అరయ కిటువైపు ఫుల్లనేత్రాంబుజముల
ఇపుడు నీవాడు లీల బాధించె నన్ను
ఇదియె ప్రియమైన నటులె కానిమ్ము నాథ!'

అని చెప్పుకుంటుంది. విరహతాపాన్ని బిగ్గబట్టి ఉన్న నాయికను నాయకుడు వచ్చి లాలిస్తాడు. 'కంఠ సంశ్లేషణము' శిథిలము కాగానే –

తే.గీ. 'అరయక భవన్ముఖాబ్జంబు శిరము వాల్చి
ఫాలభాగము నీభుజోపరి శయింప
అశ్రుధారల నీకు పూజార్పణమ్ము
చేయు నను గాంచుకొనుచును సిగ్గుపడితి.'

అని తన చేష్టకు తానే సిగ్గుపడుతుంది. 'విభ్రాంతిలో' నాయిక యౌవనంలో నాయకుని రూపరేఖావిలాసాలను చూచి మోసపోయి, తరువాత పూర్వస్థితి అంతా కలవరమని అనుకొంటుంది. 'ఘాతుక ప్రియ'లోని నాయిక నాయకుని దుష్టత్వాన్ని గ్రహించి –

తే.గీ. 'నీ చిఱుత నవ్వు భ్రాంతి సంధించి ఎదను
లేనిపోని యాశలు చిగురింపజేయు
మంచు తొలగును శశియుదయించి తోచు
అంతలో నీ ముఖంబు హిమాద్రి యగును.'

తే.గీ. 'తీవ్రతృష్ణాతురుని మృగతృష్ణ వోలె
చపలమత్స్యాంగనల నామిషంబురీతి
నీ సుషమపేశలాకృతి నీ మృదూక్తి
బలిమి కర్షించి నాదు దర్పము హరించు.'

తే.గీ. 'శాశ్వత విసర్జనేచ్ఛమై సాగునంత
అడుగు కదలక దారువై యట్టె నిలుచు
ప్రాణఘాతుక యను కొన్న ఫలితమేమి?
ప్రాణనాయిక యనినోట వాక్కు వెడలు.'

అతను వస్తే ఏమీ అనలేక తన హృదయాన్ని అతనికే అర్పించి ఊరుకుంటుంది.

'ఆత్మార్పణము' శ్రీ శివశంకర శాస్త్రి హృదయేశ్వరికి నాయికాపక్షంగా నోరి ఊహించిన జవాబు. కవికి సంయోగం కన్నా వియోగమంటే ఎక్కువ ఇష్టము.

'ఎడబాటు' అనే కావ్యంలో –

'ప్రేమ! నీతోడ నైక్యమ్మునొందుకంటె
నధికమధురిమ గల దెడబాటునందు'

అని పాడాడు. 'ప్రేమ గీతములు', 'ప్రియాతిశయోక్తి' ఈ శ్రేణికి చెందిన గీతాలు. ఇలా కవి నాయికలోని మానసిక వైవిధ్యాన్ని రకరకాలుగా ఊహించి చిత్రించాడు.

ఈ ప్రేమగీతాలన్నిటిలోనూ ఒక మూలసూత్రమున్నట్లు కనిపిస్తుంది. భక్తిరసములోని పంచభావాలలో మధుర భావము ఉత్తమోత్తమము. కవి హృదయంలో ఆ భక్తి రససంబంధమైన మధురభావన నిలచి, దాని సుస్పష్టరూపాన్ని ప్రతి గీతములోనూ ఒలకబోసుకుంటున్నది. మైత్రి విషయంలో కవి వ్యక్తిలోని ఉత్తమగుణాన్ని గ్రహిస్తాడు. లోకమేమనుకున్నా ఆయనకు లెక్కలేదు.

ఆ.వె. 'నీచ కఠిన క్రూర నింద్య కర్ముడవైన
ఇంక నేమియైన నేమి, నేడు?
ఒక్కవేళ నీదు నుత్తమోదాత్తాత్మ
నెరిగియున్న నేను మరువ దాని' –

అని నింద్యవర్తనుడైన మిత్రునితో గూడ స్నేహం చేస్తాడు. 'మిత్రుని స్ఫురణ' అనే కావ్యంలో –

'కాల మేఘచ్ఛన్న తమస క
రాలమైన యమాస నిశకున్
హ్రాదినీప్రభ బోలు దృష్టికి
నీదు దర్శనము' –

అని ఉప్పొంగి పోతాడు. స్నేహితుడు కోపగించి ఏమన్నాగాని సహించటానికి సంసిద్ధపడతాడు గాని వెనుతిరగడు. అతని ఆర్ద్రతకు అవతలివాళ్ళే కరిగిపోతారు. 'వీర పరిష్వంగం'లో –

తే.గీ. 'జలజలని మోదబాష్పముల్ జాలువార
నిశ్చలకరమ్ముతోడ ఈ నిశిత ఖడ్గ
మిచ్చుచున్నాడ నిదె వధియింపు నన్ను
నెచ్చెలీ! క్రోధమింక పోనేరదేని!'

అని ధీరుడై నిలిచినప్పుడు స్నేహితుడు లొంగిపోతే –

తే.గీ. 'పులకిత మదీయగాత్ర ముప్పొంగె, నకట,
భాసురాయుధ మటు పారవేసె దేల?
ఏల భరముగ నను కౌగిలించె దోయి!'

అని ఆదరిస్తాడు. 'ఆశాకిరణము, భిన్నమైత్రి, మిత్రప్రతిష్ఠ, మిత్రవియోగము' – మొదలైన కావ్యాలు మైత్రికి సంబంధించినవి, మైత్రి ఏర్పడే మొదటి రోజుల్లోనే మిత్రుని రూపాన్ని హృదయంలో సృష్టించుకొని, మిత్రుడు తప్పేదైనా చేసినా అతని నిజ స్వరూపాన్ని – హృదయంలో సృష్టించుకున్న దాన్ని – చూచి వెనక్కు తగ్గుతాడు, మిత్రునికి, తనకూ భేదభావం కలిగినప్పుడు 'సర్వజ్ఞ స్వామి'కి నివేదిస్తాడు.

బాల్యావస్థలో కవి ప్రతి వస్తువును కవితాచక్షువులతో చూచి ఆనందించేవాడు. ఆయనలో తాత్త్వికదృష్టి అభివృద్ధి అవుతున్నకొద్దీ ప్రతి విషయమూ ఏదో గొప్ప వ్యక్తిత్వంతో కనపడేది. చిన్నప్పుడు వ్రాసిన 'బూచి' అనే కావ్యం ఊహా ప్రధానమైనది. ఆరు వత్సరాల కుర్రవాడు,

తే.గీ. 'ఎండుటాకులు త్రొక్కుచు నెగిరి యెగిరి
చిన్నవాడందు తన చేతి చిన్ని వ్రేళ్ళ
జీటిమాటికి కురు లెగజిమ్ము కొనుచు
కుప్పలుగ గొన్ని వర్ణముల్ కూర్చుచుండె.'

తరువాత ఆ పసిపిల్లవాడు చిన్నపిట్ట యీకను చూచి దానిని నోటితో ఊది ఎగరవేసి, దాని వెంటనే కొంత దూరము పోయి అది విచ్చీవిచ్చని మొగ్గలో చిక్కుకుంటే రెంటినీ విడదీయలేక కలిపి గాలిలో వదిలిపెట్టాడు. ఇంతలో తీవ్రపవనుడు వచ్చి అతని కవి కనబడకుండా చేస్తాడు, పిల్లవాని మనస్సు ఇంతలో వేర్వేరు క్రీడలమీదికి పోతుంది. ఈ చిన్న కావ్యం మానవజీవితానికి సంబంధించిన ఒక సత్యాన్ని ప్రకటించే శక్తిని (Revealing effect) తనలో దాచుకున్నట్లు కనిపిస్తుంది. మహాకవి షేక్స్పియరు అన్న –

''Life is but a walking shadow; a poor player,
That struts and frets his hour upon the stage,
And then is heard no more; it is a tale,
Told by an idiot, full of sound and jury -
Signifying nothing''

అనే సత్యం ఈ కావ్యంలో గర్భీకృతమైనట్లు ప్రస్ఫుటమౌతుంది. 'నిర్యాణ'మనే కావ్యంలో జీవితములోని ఒక వైచిత్ర్యాన్ని కవి సూచించాడు. ఒక్కొక్కప్పుడు ప్రచండ శక్తిమంతుడైన మానవుడు ప్రకృతికి లొంగిపోవలసిందేనా? అనే భావపరంపరలో మునిగిపోయి అహంభావం రేకెత్తి –

"అలల వేగము తెడ్ల త్రోయుము
చండపవను వశీకరింపుము
పడవ నడపు తృణీకరించుచు
ప్రకృతి ఘనశక్తిన్"

"అబ్ధి యెంత గంభీరమైనను
అందు తేలగ తెప్పయున్నది
పడవ యొరగదు, పడవ మునగదు
పడవ పగులనిది!"

అని ప్రబోధించటము కూడా కద్దు. కానీ ఈ అహంభావము సర్వకాల సర్వావస్థలలో నిలిచేది కాదు. 'కాలధిక్కృతి'లో

శా. 'ఏమాత్రంబు భవత్ప్రతాపమహిమం బిచ్చాగతిం గాంచగా
లేమింగాదు మదీయజృంభణము; స్వల్పీయంబు నాశక్తియౌ
నామాటల్ శమియించుగాక నిల సంచారంబులో నింతలో
నేమాయెన్ హృదయంబు నిండిన పవిత్రేచ్ఛల్ సుహృద్ భావముల్?'

అని పావిత్ర్యము, సుహృద్భావాలతో నిండిన జీవితము ఏమైనా ప్రమాద రహితమైనదని అన్నాడు,

'జన్మముతోడనె జాతం బైనది
జనులకు మృత్యువు జగతిన్
..............
ఒక్క ముహూర్తం బెక్కువ బ్రతుకగ
బిక్కమొగం బిడనేలా?
ఒక్క ముహూర్తం బెక్కువ మనుటకు
టక్కరిమాట లవేలా?
..........
చిరకాలమ్మును జీవింపగ ధర
జీవసిద్ధులము కాము.
కీర్తి కాయముల క్రీడింతుము బహు
గ్రీష్మ కాలముల మేము'

అని చెబుతూ, చావు తప్పదని ఎరిగినప్పుడు ఉన్నంత వరకూ అనుభవిద్దామని ఉమర్ ఖయ్యాము మతాన్ని సూచించలేదు. జీవితానికి తరణోపాయాలు సత్యము, ధర్మము, పావిత్ర్యము నని ఆయన ప్రబోధము.

'జన్మంతా ఒక పవిత్ర యజ్ఞం
చావందులొ పూర్ణాహుతి'

అని ఆయన నిశ్చితము. పూర్ణాహుతికి ఫలితము తప్పక రాబొయ్యే జన్మలోనైనా వచ్చితీరుతుంది. అంటే మృత్యువు రాబొయ్యే జన్మసంస్కారానికి సహాయకారి అన్నమాట. బ్రౌనింగు మహాకవి కూడా 'మృత్యువు జ్ఞానకక్ష్యాంతరాలలో దీపికను చూపించే దాసి' (Death is a groom that brings taper into the outer world) అని చెప్పాడు. నోరి జీవితంలో నిరుత్సాహం ఎరుగనివాడు. ఎన్నటికినీ లేనివాడు, రానివాడు. ఇంకో కావ్యంలో –

"పసివేళటి పాలనునుపు
ఎలబ్రాయపు ఏటిపొంగు
ఇంకి పో లేదీ
ఎదలో సుస్థిరముగ
పదిలమైనా యోయ్!"

అని తన నిత్యనూతనత్వాన్ని గురించి వ్రాసుకున్నాడు. నోరి కర్మకాండతో పాటు భక్తి భావాన్ని కూడా తనలో పెంపొందించుకున్నాడు. 'జగదేకమాత, సర్వజ్ఞస్వామి' ఇద్దరే ఆయన కారాధ్యదేవతలు. వారి రూపాలనే వివిధదేవతలలో కవి చూస్తాడు. 'వేంకటేశార్పణము' అనే కావ్యంలో దీనంగా స్వామితో తన అజ్ఞానాన్ని, మోహాంధతను చెప్పుకొని, ఆయన వాత్సల్యము అపారమని, అజ్ఞేయము, అచింత్యము నని పొగడినాడు.

శా. 'నీ సేవార్థము నీ ప్రతిష్ఠ సలుపన్ నిర్మించుకొన్నావు నీ
ప్రాసాదంబుగ ఈ శరీరమని నే భావింపగా లేక పే
రాసన్నాదని యెంచి ఆత్మసుఖమే యాశించి యత్నించి ఆ
యాసం బందితి దాన దేహ మపవిత్రాత్మంబు గావించితిన్.'

అని తన తప్పిదాన్ని దాచిపెట్టకుండా భగవంతునితో వెళ్ళగక్కాడు. భగవత్సాన్నిధ్యములో ఒకప్పుడు సన్న్యస్తభావము కూడా ఆయనలో ప్రకోపించింది –

శా. 'నా యజ్ఞానము గర్వమున్ కలుషమున్ నానాటికిన్ వృద్ధియై
మాయన్ లేక మదిన్ శిరోగ్రమున నిమ్మాడ్కిన్ ప్రసాదించె నే
మా యన్పించెడి దీర్ఘ కేశముల నీకర్పించితిన్ భక్తితో
నా యాకారవికారచింతనము సన్న్యస్తంబుగా నాత్మలోన్.'

అని పూర్వోదంతాన్ని కావ్యం చేశాడు. 'పరమేశ్వరి', 'కామేశ్వరి' అని జగదేకమాతను సంబోధించి ఆయన ధ్యానిస్తాడు. కామరహితునిగా చేసి పరోపకారబుద్ధి ప్రసాదింపవలసిందని ఆమె ముందు ప్రాధేయపడతాడు.

తే.గీ. 'పగలు రేయును నపరాధబహుశతమ్ము
చేయు నను పుత్రబుద్ధి రక్షింపు మంచు
బాష్పగద్గదితాక్షర పంక్తితోడ
విశ్వజనని ప్రసన్న' – కావించుకొంటాడు.

ఈ లోకంలోకి ఒక యాత్రికుడుగా వచ్చిన తన్ను రేవు దాటేయవలసిందని, కష్టాలకు క్రాగిపొయ్యానని –

'ఓ నావ నడిపే పల్లెకారీ
రేవు దాటేయరా!' – అని కరుణంగా యాచిస్తాడు ఆ జగదేకపితను.

అనేకమంది కవులకు దోహదసేవ చేసినట్లే శ్రీ శివశంకరశాస్త్రి ఈయనకూ చిన్నతనంలో చేశాడు. కానీ కవితావిషయంలో ఆయన ప్రభావం నోరిమీద ఏ మాత్రమూ లేదు. కవితారచనవిషయంలో ఇద్దరూ రెండు ధ్రువాలు. ఆ విషయం నోరి, శ్రీ శివశంకర శాస్త్రికి వ్రాసిన ఒక ఉత్తరంలో ఇలా వ్యక్తీకరించాడు –

"స్త్రీ విరోధి" చదివాను. బాగున్నది. కానీ అది భూలోకం దాటిపోలేదు. అది లోపమని నా ఉద్దేశము కాదు. కాని నీ రచనలన్నింటిలో ఆ గుణమున్నట్లున్నది. దాన్ని ఏమనవలెనో తెలియదు. Realism అనవచ్చునేమో! అది ప్రధానముగా ఉంటుంది. నాకు మాత్రము రచనలు లోకాతీతముగా ఉండకపోతే తృప్తి ఉండదు. నాకా శక్తి లేకపోవచ్చును.

"నేను కొత్తగా వ్రాసిన నాటిక terminology లో ఆలోచిస్తే మన భేదము జటాయువు, సంపాతిది ఉన్నట్లుగా ఉంటుంది, సంపాతి పెద్దవాడు, ఎక్కువ సమర్థుడు. అయితే భూలోకము విడిచి పోవడానికి యత్నించాడు. జటాయువు చిన్నవాడు,

కొంచెము తక్కువ సమర్థుడు. కాని ఊహలు సూర్యమండలానికి పోతవి. జటాయువు బలవంతాన సంపాతి కూడా పతంగలోక యాత్రకు ఒప్పుకుంటాడు. జటాయువు కాలిపోబోతూ ఉంటే సంపాతి రక్షించి తన రెక్కలు కాల్చుకుంటాడు. పడిపోతూ ఇద్దరూ తన అపాయము సంగతి ఆలోచించుకోరు. మన ఇద్దరికీ స్వభావాలలో వారితో పోలిక ఉన్నది."

కొత్త వాక్యాలు చెప్పడంలోనూ, ఊహించడంలోనూ నోరికి ఉత్సాహం ఎక్కువ. 'పరకాయ ప్రవేశము', 'గాలివాన', 'మహిషాసుర మర్దనము', 'పంచబాణము' ఇత్యాది కవితావస్తువులు ఇదివరకే ఆలోచించి ఉంచినవి, ఇంకా రూపం తాల్చలేదు. వాటిని చదివే భాగ్యం త్వరలో లభిస్తుందని విశ్వసిస్తున్నాను.

*– ప్రతిభ సం.6 సంచిక 1*

# చింతా దీక్షితులు (1891-1960)

చింతా దీక్షితులు నవ్య సాహిత్య ప్రారంభ దశలో కవిగాను, గేయ రచయితగాను, ప్రజా సాహిత్య సంపాదక పరిశోధకుడుగాను, ప్రచారకుడుగాను, స్త్రీ సాహిత్య సంపాదక పర్యవేక్షణ ప్రబోధకుడుగాను, భాషా సాహిత్య నిర్మాతగాను, నాటికాకర్తగాను, ప్రధాన కథారచయితగాను ఆధునిక సాహిత్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం వహించిన సాహితీ సమితి ప్రారంభసభ్యుల్లో ఒక ప్రముఖవ్యక్తిగాను, నిష్ణాతుడైన వ్యావహారిక భాషాప్రచార బోధకుడుగాను ప్రఖ్యాతిగన్న సాహితీతత్పరుడు, బహుముఖీన సాహిత్య సంపన్నుడు.

తూర్పుగోదావరి జిల్లాలో కణ్వనదీ తీరాన ఉన్న దంగేరు, చింతా దీక్షితుల వారి స్వస్థలం. వీరు 1891లో అక్కడనే జన్మించారు. వీరి తండ్రిగారు, తాతగారు విఖ్యాతి గన్న వైదిక సంప్రదాయ నిష్ణాతులు, నిష్ఠాగరిష్ఠులు. వీరు చిన్నతనం నుంచి మంచి అభిలాషతో ఆంగ్లవిద్యను అభ్యసించటం జరిగింది. మంచి తెలివితేటలు గల వీరు, రాజకీయ, సాంఘిక, సారస్వత జిజ్ఞాసతో విద్యనభ్యసించి రాజమహేంద్రవరం కళాశాలలో 1913లో బి.ఏ. పట్టభద్రులైనారు. ఉపాధ్యాయ విద్యను అభిలషించి 1915లో సైదాపేటలో ఎల్.టి. అయినారు. విద్యారంగ సంస్కరణ దృష్టితో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి కొంతకాలం అనేక ప్రభుత్వోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడుగా పనిచేశారు. తరువాత బహుకాలం పాఠశాలల పర్యవేక్షకులుగా (Senior Dy Inspector of Schools) ఉద్యోగం చేశారు. 1946లో విరమించారు. ఉద్యోగ నిర్వహణ కారణంగా దీక్షితులు కనిగిరి, మార్కాపురం, కర్నూలు మొదలైన రాయలసీమ నగరాల్లో; నరసరావుపేట, గుంటూరు, రాజమండ్రి, జిల్లాలలో తిరగడం మూలాన, ఆ ప్రాంతాల ప్రజల జీవితాలను, ఆ ప్రాంతాలలోని గ్రామాదులను పరిశీలించటం వల్ల, వీరికి ఆంధ్రదేశంలోని అనేక ప్రాంతాలకు సంబంధించిన జనజీవితం తోటి, జానపద సాహిత్యచరిత్రల తోటి, ప్రకృతివిశేషాల తోటి అమూల్యపరిచయం, కలిగి పద్య రచనాదులకు ఎంతగానో ఉపకరించింది.

1917లో సాహితీసమితి ప్రారంభం కాక పూర్వమే వీరు 'ఆప్తబంధువులు' నవలారచయితలు. 1940లో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా విరమించిన చింతా

భీమశంకరంగారితో కలిసి 'చింతా శంకర దీక్షితులు' అన్న పేరుతో చిత్రరేఖ (1912), అలహాసింగరి అన్న అపరాధపరిశోధక నవలాదులనూ, కొన్ని కథలను ప్రచురించారు. 'శంకర దీక్షిత' నామంతోను కొంత పద్యకవిత్వరచన సాగించారు. 1913లో 'రాజగిరి రాజు' అన్న నవలను దీక్షితులు ప్రచురించారు.

మారుతి అన్న మారు పేరుతోను కొంత కథారచన చేశారు. ఆధ్యాత్మికచింతన స్థిరం కాకపూర్వం, డార్విన్ శాస్త్రజ్ఞుని ప్రకృతి పరిణామ సిద్ధాంతం యెడ ఆసక్తి కలిగింది. శాస్త్ర విజ్ఞానాన్ని ప్రచారం చేయటానికి, దేశభాషలో గ్రంథ రచన జరగాలన్న సిద్ధాంతం ప్రచార కృషి ప్రారంభం కావటానికి ఎంతో పూర్వమే, 1919లో పరిణామవాదము – తన్నిదర్శనాలు అన్న గ్రంథాన్ని లిఖించి ప్రచురించారు. 'ప్రపంచమీ స్థితి కెట్లు వచ్చినదో, మానవ జాతి ప్రస్తుతావస్థ కెట్లు పరిణమించినదో విపులముగా సిద్ధాంతము చేసిన ఈ పుస్తకాన్ని ఆ నాటి మోడరన్ రివ్యూ పత్రిక సమీక్ష చేస్తూ, ''We are glad to review this book. The author had very well succeded in producing a good book on the subject (evolution)'' అన్నది. ఈ పుస్తకం మదరాసు సర్వకళాశాల పారితోషికాన్ని, రామారాయనింగారి బహుమానాన్ని పొందటం జరిగింది.

అంతర్ముఖులై దేనికోసమో అన్వేషిస్తున్నట్లుండే ఆయనలో పూర్వమే ఆధ్యాత్మిక దృష్టి బయలుదేరింది. సన్యాసులుగాని, యోగులుగాని, కన్పిస్తే వారి వెంట పడేవాడు. ఒక యోగి రాళ్ళు రువ్వినా లక్ష్యపెట్టకుండా వెంటపడడం జరిగింది. కొంతకాలం సాగిన తరువాత ఈయనకు రమణమహర్షి దర్శనభాగ్యం లభించింది. అటు తరువాత క్రమక్రమంగా సారస్వతాన్ని స్మరించడం కూడా మానడం జరిగింది.

గురజాడవారి గేయ పద్య రచనామార్గాల యెడ సాహిత్యప్రియత్వం ఆరంభమయిన దినాలనుంచి చింతా దీక్షితులు ఆసక్తి వహిస్తూ, వారిని గొప్పగా గౌరవిస్తుండేవారు. ఆ దినాలనుంచే గిడుగువారి వ్యావహారిక భాషాసిద్ధాంతాన్ని అంగీకరించి పండితమ్మన్యుల ఈసడింపులు, అవహేళనలు లక్ష్యపెట్టక నిర్విరామంగా వ్యావహారిక భాషలో రచనావ్యాసంగం సాగిస్తూ, వారినే ఘనంగా గౌరవిస్తుండేవారు. వీరు సైతం ఆ ఉభయుల మార్గాలను అనుసరించి ఆయా విధానాలకు ఉప నాయకులయినారు. అందువల్లనే పై ఉభయుల మార్గాలను, విధానాలను అనుసరించే 'ఆధునిక సాహిత్యానికి వర్ధమాన ప్రముఖకేంద్రాలలో ఒకటయిన రాజమహేంద్ర వరంలో తమ అనుచరులు 28-10-1932లో జరిపిన గురజాడ వారి వర్ధంతి

మహాసభకు, శ్రీ రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షుడుగా రాజమహేంద్రవరంలో 1933 డిసెంబర్ నెలలో జరిగిన సభకు, 1935లో గిడుగు వారు తమ పర్లాకిమిడిని ప్రభుత్వం ఒరిస్సా రాష్ట్రంలో కలిపిందని బాధతో ఆ ప్రాంతాన్ని పరిత్యజించి రాజమహేంద్రవరం వచ్చినపుడు చేసిన సన్మాన మహాసభకు, చింతా దీక్షితులను అపూర్వమైన అభిమాన గౌరవాలతో అగ్రాసనాధిపతిగా ఎన్నుకోవటం, ఆయన ఆయా సభలను మహోదాత్తంగా నిర్వహించటం జరిగాయి. అభినవాంధ్ర కవిపండిత పరిషత్తు సభలో ఒక ప్రముఖుడుగా పాల్గొన్నారు.

ఉత్తమోపాధ్యాయుడుగాను, ఉన్నత విద్యాపర్యవేక్షకుడుగాను, గౌరవనీయ సాహిత్యకుడుగాను, గణనీయమైన ప్రసిద్ధిగన్న వీరికి 1946లో తెనాలి నగరంలో ఘన సన్మానం జరిగింది. సన్మాన సంఘాలవారు ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాలనుంచి వచ్చి ఆహ్లాదకరంగా వీరిని సన్మానించి 'బ్రహ్మరథం' పట్టారు. పూర్వమే భార్య స్వర్గస్థురాలు కావటం చేత, ఉద్యోగం విరమించిన కొంతకాలం తరువాత 1959 వరకు, పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురంలో సన్యాసివలె జీవించారు. అనారోగ్యం వల్ల బాధపడుతూ అప్పుడప్పుడూ ప్రజావాఙ్మయ సంపాదన ప్రకటనలు చేస్తూ, చివరకు అస్తమయం, ఏడాది ఉండగా కడలూరులో ఉంటున్న కుమారుడి ఇంటికి చేరి, 25–8–1960 నాడు పరమపదించారు.

ఆధ్యాత్మిక దృష్టి పెంపొందిన తరువాత చింతాదీక్షితులు మొదట హరనాథ బాబా (1865–1937) భక్తుడయినాడు. 1932లో ఆ హరనాథ బాబా మీద వచ్చిన ఆంగ్ల గ్రంథాన్ని 'ఉపదేశామృతం' (మొదటి భాగం) అను పేరుతో ఆంధ్రీకరించి ముద్రించారు. తరువాత అరుణాచలంలో పుణ్యజీవితాన్ని వహించి వ్యవహరిస్తూ రమణ మహర్షి పంథా యెడ చిత్తం లగ్నమై, చివరి వరకు నిలవటం జరిగింది. స్వచ్ఛ హృదయంతో, జిజ్ఞాసాత్మక చిత్తంతో, భక్తితత్పరతతో తన పరిచయాన్ని ఆకాంక్షించి ఆశ్రయించిన శ్రీ దీక్షితులమీద రమణ మహర్షికి అత్యంతమైన ఆత్మీయత ఏర్పడ్డది. శ్రీ దీక్షితులు మహర్షిని ఉద్దేశించి వ్రాసిన రచనలతో 'నివేదన' అన్న చిన్న పుస్తకాన్ని ప్రకటించారు. రమణ మహర్షి యెడ విశ్వాసం స్థిరమైన తర్వాత, శ్రీ దీక్షితులు ప్రియమిత్రుడు గుడిపాటి చలానికి వారి ఆశ్రయాన్ని కల్పించటం, ఆయన మహర్షి ఆశ్రమంలోనే ఉద్యోగానంతరజీవితం యొక్క చివరి సమయాన్ని గడపటం జరిగాయి. మహర్షి పరమ పదించినపుడు ఆయన అమూల్య వస్తువులన్నిటినీ క్రోడీకరించవలసిన బాధ్యత పడ్డ ఆశ్రమంలోని విఖ్యాత వ్యక్తి. వాటిలో మమకారాలు సర్వం పరిత్యజించిన రమణ మహర్షి స్వదస్తూరితో వ్రాసుకొని భద్రపరచుకొన్న చింతా దీక్షితుల ఈ 'నివేదన'

ఒకటిగా కనుపించడం విశేషం. ఆశ్రమ జీవితం; రమణ మహర్షి పరిచయం స్థిరమైన తర్వాత కొంత కాలానికి 1948 ప్రాంతంలో దీక్షితులు ప్రియమిత్రుడు గుడిపాటి వెంకట చలానికి ఆ మహావ్యక్తితో పరిచయం చేయటం, వారు రమణ భక్తులై 1959 వరకు తుది జీవితాన్ని రమణాశ్రమంలో గడపటం జరిగాయి. ఆశ్రమపాలన విషయంలో దీక్షితులకు కొంత అధికార ముంటుండేది. 14-4-1950లో రమణ మహర్షి నిర్యాణం చెందినపుడు, దీక్షితులు కొన్ని దినాలు అరుణాచలంలో ఉండటం కూడా జరిగింది.

1951 నుంచి ప్రారంభమైన వ్యాధితో అనారోగ్యం వల్ల బాధపడుతూ జీవించారు. దీక్షితులు సజ్జనుడు, సరసహృదయుడు, ధర్మాభిమాని, ఉత్తమ నీతివర్తనుడు, అవసర సమయాల్లో అతి సాహసికుడు, సుకుమార హాస్యప్రియుడు, మిత్రులకు అత్యంత ప్రియమిత్రుడు. చలం మిత్రుడు ఒకడు 1954లో "దీక్షితులుగారు చచ్చిపోయినారా?" అని చలంగారిని ప్రశ్నిస్తే ఆయన అరుణాచలం నుంచి ఉత్తరం వ్రాసి, దీక్షితుల క్షేమం తెలుసుకొని "మీరు చచ్చిపోయినారంటే ఆ రోజుల్లో మేమందరం తిండి సరిగా తినలేదు" అని "భగవాన్ అనుగ్రహం మీపై పూర్తిగా వుంది. మీరు నిరాశపడకండి. మీకు గొప్ప భవిష్యత్ ఉంది" అని ప్రేమలేఖ వ్రాయటం జరిగింది.

చింతా దీక్షితులు పొడగరి. ఎందరున్న గుంపులో అయినా ముందు ఆయన కనిపిస్తారు. వర్చస్వి, పచ్చనిఛాయ. కుదురుగా కోలగా చురుగ్గా ఉండే ముఖం. ఇతరులందరూ ఆయన భుజాల దగ్గరికి కూడా రాలేరు. ఆయనను పోల్చుకోవటంలో ఏ శ్రమా ఉండేది కాదు. తలపాగా, కోటు పంచెతో ఉద్యోగవేషంలో, ఉత్తమ సత్త్వగుణ స్వరూపప్రవర్తనుడుగా దేశంలో ఆయన ఎక్కువ పరిచితుడయినాడు. ఒంటిచేత్తో రాజమహేంద్రవరం గోదావరిని అవతలి ఒడ్డువరకు ఈదగలవాడు. భారతదేశ బానిసత్వం నశించాలన్న అభిలాష గల దేశభక్తిప్రపూరితుడు. జాతీయాభిమాని. ఆంధ్రరాష్ట్రాభ్యుదయాభిలాషి. తన పేరు దీక్షితులు అని ఉచ్చరించేవాడు కాదు. అప్పయ్య దీక్షితులవారిని "అప్పయ్యవారు" అనీ, శివశంకరస్వామి ఆయనకు అంకితమిచ్చిన "దీక్షిత దుహిత"ను బట్టి "దుహిత" అనీ అనటం నేను స్వయంగా విన్నాను.

సత్కారాలన్నా, సన్మానాలన్నా దీక్షితులు దూరదూరంగా తొలగిపోతుండేవారు. అందువల్ల ఘనంగా గౌరవించాలని అభిలషించిన తెనాలివారు, అతిరహస్యంగా ప్రయత్నాలు చేసి బలవంతం చేస్తేగాని ఈయన అంగీకరించలేదు. ఈయన బుద్ధి ఎన్నడూ తోడి సాహితీపరుల వ్యక్తిగతదోషాలమీద గాని, రచనాదోషాలమీద గాని మళ్ళేది గాదు.

ఆంధ్ర కథకుల్లో చింతా దీక్షితులు, గుడిపాటి వెంకటచలం ఇద్దరు ఉత్తములు. "అయితే జీవితంలో ఆదర్శాల విషయంలో కేవలం ఉత్తర దక్షిణ ధ్రువాలు. చలం గారొక పెద్ద జలపాతం వంటి వ్యక్తి. మరి దీక్షితులుగారో నిర్మల క్షీరసరోవరం. ఒకరొకరి రచనలయెడ గౌరవం వల్ల అయితేనేమి, నిశితమైన నిజాయితీ వల్ల అయితేనేమి వీరిద్దరికి చిక్కని చెలిమి ఏర్పడ్డది. ఇరువురు అన్యోన్య లేఖల్లో సారస్వతాల గురించి, సమస్యల గురించి చర్చలు సాగించారు. 1927 మొదలు 1954 వరకు చలంగారికి వ్రాసిన లేఖలను విజయవాడ దేశి కవితామండలివారు 1957లో ముద్రించారు. ఆ పుస్తకానికి పీఠికగా ఒక మాట వ్రాస్తూ అందులో దీక్షితులు ఇలా అన్నారు – "ఈ ఉత్తరాలు నేను దాచటానికి కారణం నాకు కీర్తి తెచ్చుకుందామని కాదు; వెంకట చలంగారికి కీర్తి తెద్దామని కాదు. నేను ప్రేమించిన స్నేహితులలో వెంకట చలంగారు ముఖ్యులు. నా ప్రేమకు బదులు ప్రేమ ఆయననుంచి నాకు కావలసినంత దొరికింది. ఆయన ఉత్తరాల్లో నిష్కాపట్యమూ, ప్రేమా, హాస్యమూ, హృదయవేదన నన్నాకర్షించాయి. పై కారణాలవల్లనే వారి ఉత్తరాలు దాచాను. అవి ఎప్పటికయినా ముద్రిస్తారని కూడా మేముభయలము అనుకోలేదు."

దీక్షితులు పరిశోధక నవలలు వ్రాసే రోజుల్లోనే మొదట ప్రౌఢ ప్రాబంధిక శైలిని త్యజించి, సామాన్యశైలిలో పాఠకసుబోధకంగా ప్రకృతివర్ణనాత్మకము, నీతి బోధకము అయిన ఆత్మాశ్రయ పద్యరచన చేశారు.

"మంజుల మధుర సంపద నంది యుండు
మతిని గులాబి వచించు నరవిందమనును
నిర్మల భావ మన్నిట జెందుమనుచు
కష్టాలనన్నిట గడుపుకొమ్మనుచు
చిక్కని చేమంతి చెప్పును గరిమ
ఉన్నంత ప్రజకిచ్చి ఊరుకొమ్మనుచు
దేవకాంచన ముపదేశ మొనరించు నెండ
వానల గణియింపకసంత
సము చెందుమని పల్కు స్వచ్ఛమౌ తుమ్మి"

– పుష్పోదేశము సాహితి 116 పుట 1926

నిష్కలంకమై పూజ్యమై నిరుపమాన
సౌఖ్యముల కాలవాలమై సంస్కృతిగల
కష్టములఁ దోపనీయక వ్రాలుచుండు
బాల్యమే జీవయాత్రకు పట్టుగొమ్మ. – సాహితి 253 పుట, 1922

"సొంపుగా దూర్పున సుముహూర్తమందుఁ
బుట్టుచుండెఁ బ్రభాత పూర్ణబింబాస్య!
స్వాగతమిడుచుండె సర్వలోకంబు
కనుఁడవె ప్రాగ్దిశఁ గనులపండువగ" ఇత్యాది...

– ఉదయలక్ష్మి సాహితి దుందుభి, ఆశ్వయుజం

ఇత్యాది సామాన్య శైలిలో దేశిఛందస్సులో నడిపిన కవిత వీరి పద్యరచనకు ఒక ఉదాహరణ. ఈ సమయంలోను, తరువాత వీరు గేయకవిత్వంలోకి దిగిపోయారు. తన గేయ కవిత్వం వీరు 'హరిణ దంపతులు' (శారద మే 1923), 'కవి – కన్య' (సఖి 1925) ఇత్యాది గేయాలలో సామాన్య కవితావస్తువును, యాదవప్రభువైన మహాదేవరాజు రుద్రమ మీదికి దాడికి వచ్చినపుడు, కాకతీయులను యుద్ధానికి పురికొల్పుతూ వ్రాసిన 'వీరగీతిక' (సాహితి సంపుటి 3, సంచిక 3) వంటి గేయాలలో ఆంధ్రచారిత్రక వస్తువును, 'బాజాలు రా నాన్న బాజాలు, బాజాలు వచ్చాయి బాజాలు, బాజాలతో వచ్చె పల్లకీ అదిగో, పల్లకీలో ఉంది పార్వతీదేవి, బాజాలు వింటుంది పార్వతీదేవి, పార్వతీ దేవికీ జేజేలు పెట్టు' ఇత్యాదిగా (1918–24 మధ్యలోనే) నడిపిన గేయాలు బాలసాహిత్య వస్తువును ఆదరించారు. సుగమము, సురుచిరము అయిన గేయసాహిత్యాన్ని సృష్టించారు.

***

జాతీయ దృక్పథంతో స్త్రీల అభ్యుదయానికి సంస్కృతిని అభిలషించిన చింతా దీక్షితులు, వారి సాహిత్యాన్ని సేకరించటానికి, దేశంలో ప్రచారం చేయటానికి ఎంతో కృషి చేశారు. జానపద సాహిత్య సంపాదనకీ, దాని కీర్తి వ్యాప్తికి గొప్ప కృషి చేసి విఖ్యాతి పొందిన నేదునూరి గంగాధరంగారికి వీరు ఎంతో సహాయమిచ్చారు. ఈ కృషిలో లభించిన సాహితీఖండికలను రచనలలో ఉపయోగించారు. స్త్రీల సారస్వతం మీద వీరి ఆసక్తి, జిజ్ఞాసాత్మక పరిశోధన, అభిప్రాయాలు ఎటువంటివో తెలుసుకోవటానికి గిడుగు రామమూర్తి పంతులు సంస్మరణ కోసం మిత్రులు, శిష్యులు,

సమర్పించిన వ్యాస సంగ్రహంలో (1937) వీరు ప్రచురించిన స్త్రీల సారస్వతము బృహద్వ్యాసం చక్కని నిదర్శనం. స్త్రీల సారస్వతాన్ని గురించి వారు అభిప్రాయాన్ని ఇలా వెల్లడించారు. "స్త్రీల సారస్వతములో ఒక విశేషము ఏమిటి అంటే చెప్పదలచుకున్న విషయము సూటిగా హృదయానికి తగిలేటట్లు చెప్పడమే. అందువల్లనే రసము చిప్పిల్లుతూ ఉంటవి. అఖండ కావ్యాలు చేద్దామని గాని, అర్థం చేసుకోలేని కావ్యాలు అల్లుదామనిగాని వారు తలపెట్టరు. అందుకనే ఆ కవులు అనవసరములగు విషయాలకి తావివ్వరు. ప్రబంధ లక్షణములను ఎదుటపెట్టికొని తానొక ఒరవడి దిద్దుకొనే ప్రబంధ కవుల కావ్యాలకంటె సహజమైన సెలయేళ్ళవలె ప్రవహించే ఈ (స్త్రీల) పాటల్లోనే గుణము అతిశయంగా ఉన్నది. పురుషుల సారస్వతముతో పోల్చి నిష్పక్షపాతముగా చూస్తే స్త్రీల సారస్వతమే గుణబాహుళ్యము కలదిగా కనబడుతుంది." (వ్యాస సంగ్రహము పుట 254)

దీక్షితులు జానపద సాహిత్య సంపాదన పరిశోధన చేసే సమయంలో ప్రజా వాఙ్మయం మీద ఎన్నో ప్రయోజనకర వ్యాసాలు వ్రాశారు. జంగం పాటలు మొదలైన వాటితోబాటు యక్షగానాలు సంపాదించటం గాక, వాటిమీద 1934లో పరిశోధన కృషి సాగించి, అవి ఎఱ్ఱాప్రగడ తర్వాత కాలం నుంచి తనవరకు అవిచ్ఛిన్నంగా వస్తున్నట్లు చరిత్రాత్మకంగా నిరూపించి, వాటి విలువలను వివరిస్తూ ఒక అమూల్యమైన బృహద్వ్యాసాన్ని ప్రతిభ 1937 ఫిబ్రవరి సంచికలో ప్రచురించారు.

చింతా దీక్షితులు ఈ నాడు విశేషప్రాముఖ్యం వహిస్తున్న బాలసాహిత్యానికి పితామహులు. ఈ విషయాన్ని బాలసాహిత్య రచయితలందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. వీరు దీనికొక గౌరవమున్నదని ఎవరూ గమనించని 1915 ప్రాంతంనుంచే కథా, గేయ రూప బాలసారస్వతాన్ని బహుళంగా సృష్టించి, తరువాతి రచయితలకు గురువులయినారు. తమ బాల సాహిత్యంలో "ఎన్నో చేస్తాను" – (1955 బాలానంద ప్రచురణ – విజయవాడ 2), 'సూరి – సీతి – వెంకీ' (1955 త్రివేణి పబ్లిషర్స్ మచిలీపట్నం) 'శంపాలత' (1955 కల్చరల్ బుక్స్ లిమిటెడ్ మద్రాసు 2) అన్న కథారూప పుస్తకాలుగా, 'లక్క పిడతలు' (1955 కల్చరల్ బుక్స్ లిమిటెడ్ మద్రాసు) అన్న గేయరూప పుస్తకంగాను, 'లీలాసుందరి' అన్న పేరుతో ప్రతిభలో ఒక పెద్ద కథగాను ప్రచురించారు. బాలలు హాయిగా పాడుకొనే బాల గేయాలకి సంబంధించిన వీరి లక్కపిడతలు గేయసంపుటికి తెలుగు భాషా సమితి బహుమానం, రాష్ట్రపతి బహుమతులు, భారతప్రభుత్వం బహమతి లభించాయి.

శ్రీ దీక్షితులు ఆలిండియా రేడియో రచయితలలో అత్యంత ప్రముఖులు. ఆలిండియా రేడియోవారు 1938లో వీరి నాటికలను, కావ్యాలను గౌరవంతో తెప్పించుకొని ప్రచారం చేశారు. ఆంధ్రప్రదేశ్ అకాడమీలు ఏర్పడక పూర్వమే ఆలిండియా సాహిత్య అకాడమీ తెలుగు శాఖవారు, ఆయా ప్రాంతీయ భాషల్లోకి అనువదింపతగ్గ కథలు పుస్తకంగా 'ఏకాదశి' అనే దీక్షితుల కథాసంపుటిని స్వీకరించి, పరప్రాంతీయ భాషల్లోకి అనువదింప చేయించారు.

శబరి అమాయక భక్తిప్రదర్శనమే ప్రధానలక్ష్యంగా ఉన్న చింతాదీక్షితులు 'శబరి' అనే ఆమూలాగ్ర వచననాటకాన్ని (భారతి–1931) రచించారు. శబరిలోని ఆటవికకన్య కల్లాకపటం లేని సహజసరళతకు ఒక సాంకేతిక రూపకల్పన గావించారు. నేటి ప్రదర్శన దృష్టితో దీన్ని పరిగణించరాదు. అప్పటి రసికులు శ్రవ్య నాటిక దృష్టితో పరిశీలించి, దీన్ని ఒక ఉత్తమ కళాపరిపూరిత గద్యకావ్యంగా గౌరవించారు.

దీక్షితులుగారు ఈ నాటకంలో సవర భాషలోని ఆటవికుల పాటలు కొన్ని చేర్చారు. 1930 ప్రాంతంలో శబరి నాటకరచనకు పూర్వమే దీక్షితులుగారిలో ఒక విధమైన ఆధ్యాత్మికదృష్టి బయలుదేరింది. (పిలకా గణపతిశాస్త్రి – పుట 83 భారతి అక్టోబరు1960)

శ్రీ దీక్షితులు కథల్లో వలె నాటికలు (రూపకాలలో) కూడా కళా శిల్ప సంబంధమైన నైశిత్యాన్ని, వైదగ్ధ్యాన్ని ప్రదర్శించారు. వీరు 1922లో సాహితిలో ప్రచురించిన 'తల్లి – కొడుకు' అన్న రూపకం మొదలుకొని, 1933లో భారతిలో ప్రచురించిన 'శ్రీకృష్ణుడు' అన్న రూపకం వరకు పన్నెండు నాటికలు సృష్టించారు. అవి: తల్లి – కొడుకు (సాహితి 1921), మానవుడు (శారద 1922), తెలుగు శాస్త్రులు (ప్రబుద్ధాంధ్ర 1924), చక్రవాక మిథున (జయంతి 1928), దసరా దిబ్బ (భారతి 1928), ధర్మిష్ఠ (భారతి – 1928), రేణుక (భారతి 1929), తిరుప్పాణాళ్వార్ (భారతి 1929), అహల్య (భారతి 1932), శ్రీకృష్ణుడు (భారతి 1933). తరువాత ఏకాంక రూప రచనావిస్తృతికి ఇవి ఎంతగానో దోహదం చేశాయి. "కళానైశిత్యంలోను, భావప్రదర్శనలోను ఎంతో విభేదం గల ఈ నాటికలు మూడు విభాగాలుగా గోచరిస్తున్నట్లు శ్రీ పిలకా గణపతి శాస్త్రి భావించి వివరించారు. (ఉదయిని – తొలిసంచిక) గరుత్మంతుడు మాతృదాస్య విమోచన కోసం అమృతాపహరణ ప్రయత్నం చేయటం వస్తువుగా నడిపిన 'తల్లి – కొడుకు', ప్రపంచాన్ని వశీకరించుకోవటం కోసం బ్రహ్మదగ్గర, వెల్లమానిసి వరాన్ని పొందటం ఆ సందర్భంలో సరస్వతీచతుర్ముఖుల

సంభాషణ వస్తువుగా నడిపిన 'మానవుడు', వెల్లమొక్కల విత్తనాలు చేసే నాశనం, వాటిని నివారించుకోటం కోసం చెట్టుతో కొందరు సంభాషించి – యత్నించటం వస్తువుగా నడిపిన 'కైలాస శిఖరం' అన్న మూడు రూపణ నాటికలు (Allegorical plays) సహాయ నిరాకరణతో దేశాన్ని ఉఱ్ఱూతలూగించే కాలానికి సంబంధించిన రాజకీయాభిప్రాయాలను ఆవిష్కరించాయి. గ్రాంథిక భాషావిషయం వస్తువుగా నడిపిన ప్రహసన నాటిక 'తెలుగు శాస్త్రులు.' ఈ నాలుగూ రూపకకర్త అపరిణతావస్థను కొంతగా ప్రకటించే మొదటి భాగానికి సంబంధించినవి.

మృదుమధుర వ్యవహారిక భాషావిన్యాసంలో సిద్ధహస్తులైన దీక్షితులు, ఆయన గ్రాంథిక భాషారచనా పాటవానికి, ప్రతీకలైన రచన వివిధ వర్ణాలతో నడచినట్లు నడిపిన వరూధిని. ప్రతిబింబితమైన ప్రాథమికావస్థ గాథ పరిణతావస్థతో ప్రతిధ్వనించినట్లు, ఒక ఉత్కృష్ట వచన ఖండకావ్యంగా నడిపిన 'చక్రవాక మిథునం'. 'నశించిన ప్రాచీన రాజ్య వైభవం' సామాన్య దృష్టులకీ అగోచరమైన స్థిరతను జ్ఞాని వలె తిలకిస్తూ రచయిత ఆనందిస్తున్నట్లు మేధాగాంభీర్యంతో నడిపించిన 'దసరా అబ్బి', జమదగ్ని మహర్షి ఒక మహావీరుడి జన్మకోసం రేణుకాదేవిలో ఉన్న అంతశ్శక్తులను రేకెత్తిస్తూ నడిపిన 'రేణుక', పూరువు వద్ద యౌవనాన్ని స్వీకరించి, శర్మిష్ఠతో యయాతి వయోభారాన్ని అనుభవించటాన్ని అభిలషించటం వస్తువుగాను, రూపకళ ఆత్మోన్నత్యాన్ని స్పృశించినట్లు నడిపిన 'శర్మిష్ఠ' అన్న ఐదు నాటికలు రెండవ భాగానికి సంబంధించినవి. దీక్షితుల రూపకాలలో ఇవి సర్వోత్కృష్టమైనవి.

ఆధ్యాత్మికదృష్టితో భక్తిభావమే కాక, అస్పృశ్యత కూడా ఓ సమస్యగా ధ్వనింపచేస్తూ నడిపిన 'తిరుప్పాణాళ్వార్', మనోహరాతి మనోహరమైన అహల్య శిలావర్ణనతో భక్తి భావనాతిశయంతో నడిపిన 'అహల్య', శ్రీకృష్ణుడిలో శిశు స్వభావ చిత్రణను, ఔన్నత్య శిఖరాన్ని స్పృశించేటట్లు, యశోదలో మాతృత్వాన్ని అంతకంటే అతి మనోహరంగా తాను పొందినట్లు నడిపిన 'శ్రీకృష్ణుడు' అన్న మూడు నాటికలు మూడవ భాగానికి సంబంధించినవి.

**బాలసాహిత్యం:** శ్రీ చింతా దీక్షితులుగారు ఒక్కరే జానపదగాథల విజ్ఞానశాస్త్ర విషయాలను సమన్వయదృష్టితో సంతరించి పాఠ్యపుస్తకాలను, వీటిలో తాము సంపాదించిన పద్య గేయ బాల వాఙ్మయాన్ని సముచితంగా సమీకరించారు.

**కథారచన :** "అచ్చమైన తెలుగు కథ శ్రీ దీక్షితులుగారి ఊహలో తొలిసారిగా జన్మించింది" అని కాలధర్మవార్త ప్రకటిస్తూ, భారతి అంగీకరించింది. (భారతి సెప్టెంబర్

1960) “రుచికి భేదాన్ని బట్టి కాలాన్ని అనుసరించి ఆధునికమనే పద్ధతిలో కథ ‘అయ్యంకి వెంకట రమణయ్య’ సంపాదకత్వాన 1912లో బందరు నుంచి బయలుదేరిన ఆంధ్రభారతి పత్రికలో మొదట వచ్చింది. ఆంధ్రపత్రిక బొంబాయి నుంచి మద్రాసు వచ్చి దినపత్రిక అయిన తదుపరి, అందులో సారస్వతానుబంధం ప్రారంభమైన తర్వాత కథాసాహిత్యానికి ఆకారం దొరికింది. 1915లో కథకు ఆకార ప్రకారాలు ఏర్పడ్డవి. ఆ నాటికే తరువాత ఉత్తమ కథకులుగా విఖ్యాతి పొందిన శ్రీ దీక్షితులు కథారచన ప్రారంభించారు. “కథకు సర్వవిధ సౌష్ఠవము సాహితీ సమితివారివల్లనే వచ్చిందని సహృదయ సాహిత్యకారుల సమ్మతి”. (స్వామి శివశంకర శాస్త్రి, ఆంధ్ర కథామంజూష పీఠిక పుట 5-6). 1917లో రూపొందిన సాహితీ సమితి ప్రారంభ సభ్యుల్లో ప్రముఖులుగా ఉన్న తొలి కాలానికి కొంత పూర్వం నుంచీ వీరు బహువిధ కథారచన చేస్తూ, కథకులంగీకరించిన మహా రచయితలై సాహితీ ప్రపంచంలో ‘కథక చక్రవర్తి’ అన్న అంగీకృత బిరుదు నామాన్ని పొందిన అనతికాలంలోనే వీరిని అత్యుత్తమ కవులని ఆంధ్ర దేశమంతా అంగీకరించింది.

సాహితీ సమితి 1920లో ప్రారంభించి నాలుగేళ్లు గడిపిన సాహితిలోను, భారతిలోను క్లబ్బుల్లో జాతీయ దృక్పథాన్ని పరిపూర్ణంగా పరిత్యజించి కృత్రిమ అంధానుకరణ నాగరికతను వ్యంగ్యగర్భంగా అవహేళన చేస్తూ వ్రాసిన వటీరావు కథలు ‘భారతి’లో, 1926లో తమ సాహితీ సమితి వారి ‘సఖి’లో వీరు తమ కథలను ప్రచురించారు. బాలానందం పేరుతో తాము సభ్యుడైన నవ సాహిత్య పరిషత్తు వారు నడిపిన ‘ప్రతిభ’లో ప్రకటించారు. అత్యుత్తమ కథకులన్న విఖ్యాతిని ఆర్జించిన వీరి కథలు ‘ఏకాదశి’, ‘ఎన్నో చేస్తాను’, ‘శంపాలత’, సూరి సీతి - వెంకి’, ‘దీక్షితుల కథలు’, ‘దాసరి పాట’, ‘వటీరావు కథలు’ మొదలైన పేర్లతో కథాసంపుటాలుగా ముద్రితాలయినవి.

దీక్షితులు గారి కథలు మన ఆలంకారికులు నిర్వచించిన కథ, కథానకము, ఆఖ్యానకము, ఆఖ్యాయిక అనే విభాగాలుగా ఇంగ్లీషులో స్టోరీ, టేల్ అనే విభాగాలకు సరిపోయేలాగున ఉంటవి. ధాత వసంత సమయంలో ఆరంభమైన వీరి కథలలో దేశీయ వాతావరణం కడు సహజంగా ప్రవర్తిల్లింది. పిల్లల కథలను 1931 నుంచి వీరు వ్రాస్తుంటే పాఠక లోకంలో కొందరు వ్యతిరేకించడం, అందువల్ల ఆధ్యాత్మిక దృక్పథం ప్రవృద్ధం కావటం వల్ల భయపెట్టినా వెనుకాడని వ్యక్తిత్వం గల వీరికి, కథా రచన మీద వ్యతిరేకభావం కలిగి దాన్ని విడిచిపెట్టడం జరిగాయి.

## కథలలోని ఇతివృత్తాలు – వైవిధ్యం

శ్యామల, ముద్దు, మా అబ్బాయి, వరూథిని, కవి రాయడు : మహారాజు, సాహితికి కథ, పాతము, ఎన్నో చేస్తాను, మన్మథ సందర్శనము, గాలిపాట, చెంచు దంపతులు అన్నవి పదకొండు కథలు. విద్యారణ్య స్వామివారు పదిహేను ప్రకరణాలు గల వేదాంత గ్రంథానికి ప్రకరణ సంఖ్యనుబట్టి 'పంచదశి' అని పేరు పెట్టినట్లు కథాసంఖ్యనుబట్టి 'ఏకాదశి' అని పేరుపెట్టి దీక్షితులుగారి కథాసంపుటిని ముద్రించారు.

'శ్యామల' అన్న కథకు జీవితంలోని ఒక అంశాన్ని మాత్రమే వ్రాసి స్వకీయచరిత్ర అని పేరు పెట్టిన శ్రీధరరావు రచనావిషయం ముఖ్య వస్తువు. శ్రీధరరావు చదువుకోసం చెన్నపట్నం వెళ్ళినపుడు శ్యామల అనే యువతితో పరిచయం కావటం, అతడు ఆమెను వివాహం చేసుకోవాలని అనుకోవటం, ఆమె కూడా అతడితో వివాహాన్ని అభిలషించి అనుగుణంగా వర్తిస్తూ ఉండటం, యోగ్యురాలైన ఆమెకు వివాహానికి పూర్వమే జబ్బు చేయటం, ఆసుపత్రిలోనే ప్రాణాలు విడవటం, శ్రీధరరావు ప్రాణాఘాతంలో పడ్డట్లు అనుభూతిని పొందటం, శ్యామల మహారాష్ట్ర యువతి కావటం వల్ల శ్రీధరుడామెను వివాహం చేసుకోటానికి సంఘం అడ్డు వస్తుందని ఆమె అసలు పేరు చెప్పకపోవటం కథావస్తువులోని ముఖ్యాంశాలు.

'ముద్దు' అన్న కథకు అడిగింది ఇచ్చేటట్లయితే కథ చెపుతానని భార్య చేత ఒప్పించి, ఒక వ్యక్తి ఏడుగురు రాణులతో ఉన్న రాజు కథ చెప్పి, భార్యను ముద్దు అడిగి పుచ్చుకొని ఆ ఆనందాన్ని అనుభవించటం కథావస్తువు. రాజుకు చిన్న భార్య అంటే మిక్కిలి ఇష్టం కావటం వల్ల మిగిలిన ఆరుగురు సఖ్యం చేసి, చిన్నరాణికి ఆపదలు కలిగించి కష్టపెట్టడం, చిన్నరాణినే నేను ఎక్కువ ప్రేమిస్తానని రాజు అనటం విని పెద్దరాణి, దాసి సాయంతో ఆ ప్రేమ భగ్నం చేయటానికి పూనుకోవటం ఈ కథా వస్తు ప్రధానాంశాలు.

'మా అబ్బాయి' కథకు తండ్రి నవల చదువుకుంటుంటే మూడేళ్ళ పిల్లవాడు వెఱ్ఱి చేష్టలతో మాటిమాటికీ అల్లరి పెడుతూ పుస్తకం లాగుతుండటం, తండ్రి వాడిని తల్లి దగ్గరికి పంపించటం, తల్లి వాణ్ణి తిట్టడం, వాణ్ణి గురించి తల్లిదండ్రులిద్దరూ పోట్లాడుకుంటుంటే, వాడు తల్లిదండ్రులిద్దరూ తగాదా పడవద్దని బతిమలాడి తల్లిదండ్రుల చేతులు కలపటం, ఆ సమయంలో తండ్రి ఉద్యోగయజమాని అయిన కొత్తగా వచ్చిన పోలీసు దొర ఒంటరిగా ఇంటికి రావటం, పిల్లవాడు సిరాబుడ్డి

మొదలైన వస్తువులన్నిటిని ఒంటినిండా చిమ్ముతూ పారేయటం, అది చూసి యజమాని ఏమనుకుంటాడో అని బాధపడుతుండటం, తరువాత తండ్రి దొరను కలుసుకున్నపుడు అతడు పిల్లవాడిని ఆటల్లో అడ్డుకోకుండా స్వేచ్ఛగా వ్యవహరించే అవకాశమిచ్చి పెంచుతున్నందుకు సంతోషించినట్లు అభినందించటం కథావస్తు విశేషాలు.

మార్కండేయ పురాణంలోనూ, మనుచరిత్ర ప్రబంధంలోను ప్రసిద్ధమైన వరూథిని అన్న పాత్రను రూఢిగా నడిపినా, వరూథినీప్రణయాతిశయం కథాప్రాధాన్యం వహించటం వల్ల శ్రీ దీక్షితులు 'వరూథిని' ని ఏకాదశి కథాసంపుటంలో చేర్చారు. కవిరాయడు తన గీతాది రచనలను మహారాజుకు వినిపించాలని, అంకితమివ్వాలని అభిలషించి యత్నించటం, అతడి ప్రయత్నాలను అంగీకరించక పోవటం వల్ల ప్రజలు మహారాజును కఠినహృదయుడని భావించటం, మహారాజుకు అనుగ్రహం కలగనందువల్ల కవిరాయడు మహారాజు పేరుతో ఒక మూర్తిని ప్రతిష్ఠింపచేసి, తన రచనలన్నీ వినిపించి అంకితమిచ్చి, మహారాజు నెడల తన విశ్వాసాన్ని వెల్లడించటం 'కవిరాయడు'. కథకు వస్తువు.

సాహితికి సాంఘిక కథలను వ్రాయాలని రచయిత ఆలోచనామగ్నుడవుతున్న సమయంలో, పిల్లవాడు వచ్చి కథారచనను భగ్నం చేసి అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పించుకోవడానికి రచయితను విసిగించడం, అందువల్ల జరిగిన ఆలస్యం మూలాన అనుకున్న సమయానికి కథ 'సాహితి'కి కథ రాయలేదని సంపాదకుడు కోపగించుకోవడం, తరువాత కథ వ్రాయడం, ఈ వరసను ఉన్నది అని ముగించటం 'సాహితికి కథ' కథావస్తువు. వస్తువులిస్తూ కొడుక్కు తీవ్రంగా విద్యాశిక్షణ ఆధునిక బోధనపద్ధతి ననుసరించి ఇస్తున్న ఉపాధ్యాయుడైన తండ్రి దగ్గరికి కాలహరణం చేస్తున్నాడన్న దృష్టితో వచ్చిన భార్య, "మీ అమ్మగారు భోజనానికి ఉండలేరు. మీకు ఉద్యోగవేళ అయింది. భోజనానికి కూర్చోడానికి స్నానం చేయ' మని త్వరపెట్టటం, ఆయన తల్లి కొడుకు కాలమంతా పిల్లవాడితో ఆడుకోవటంలో గడిపేస్తున్నాడు కాని చదువు చెప్పటం లేదని భావించి, "వాడికి రెండు ముక్కలు చెప్పకూడదా?" అని అనటం 'పాఠము' అన్న కథకు కథావస్తువు నాన్న చూడకుండా ఉంటే మేకపిల్లతో ఆడుకోవటం, పిల్లి, కుక్క మొదలైన వాటికి ఉత్తరాలు రాయటం, గావం కట్టుకుని కాలవకు వెళ్ళటం మొదలైనవి ఎన్నో చేస్తానని పిల్లవాడు తన ఊహలను వెల్లడించటం 'ఎన్నో చేస్తాను' అన్నదాని కథావస్తువు.

'మన్మథ సందర్శనం'లో మదరాసులో నివసించే రచయిత మన్మథుడు, రతీదేవి, వాయుదేవుల గురించి తెలియజేయటం, మన్మథప్రభావం ఎవరి మీద ఉండేది, ఉండేవాళ్ళ లక్షణాలు, ఉండని వాళ్ళ స్థితిగతులు వివరించటం మన్మథ సందర్శనము కథావస్తువు. తండ్రి మరణానంతరం కొంత కాలానికి యుక్తవయస్కుడైన నారాయణ అనే యువకుడు ఇంటి కాగితాలు తిరగవేస్తుంటే ఒక కాగితం మీద 'నిధికి దారి' అని కనిపించి తరువాతి భాష అర్థం కాకపోవటం, తెలుసుకోవటం కోసం ఆప్తమిత్రుడు విశ్వనాథుడి దగ్గరకి వెళ్ళటం, నారాయణ అంతకు పూర్వం రంగయ్య అనే అతని కుమార్తెను మరొకరు వివాహం చేసుకోవటాన్ని అడ్డుపడితే కష్టపడుతున్న రంగయ్యకు నిధికి దారి విషయం ముందే తెలుసునని, ఆయన కుమార్తెను పెళ్ళి చేసుకుంటే విషయమంతా తెలియచేయిస్తానని అబద్ధం చెప్పి మోసగించి, విశ్వనాథుడు రంగయ్య చేత నారాయణకు పిల్లనిప్పించి పెళ్ళి చేయించి మిత్రుణ్ణి బయట పడేయటం, 'గాలిపాటు' కథావస్తువు.

దంపతులైన ఈరమ్మ, అంగడు అనే అన్యోన్యప్రేమికులు, ఆటవికులు. తేనె తెట్లు కొట్టి తేనె త్రాగుతూ గడ్డలు, చిన్న జంతువులు తింటూ సుఖిస్తుండటం, ఒక సమయంలో, ఈరమ్మ భర్త అంగడు కొట్టలేని తేనె పట్టును మరొక కొట్టగలిగిన వాడితో వెళ్ళిపోయి, వాడు కొట్టిన పట్టులోని తేనె త్రాగి వాడితో సుఖంగా జీవిస్తూ ఉంటుంది. ఈరమ్మ అతన్ని ప్రేమిస్తూ పట్టు కొట్టే ప్రజ్ఞ నేర్చుకుంటుంది. భర్త అంగడు చూసి బాధపడి మరణించటం, ఈరమ్మ అంగడి మృతి చూసి సత్యాన్ని గమనించి తన దోషాన్ని అర్థం చేసుకొని, తాను కూడా మరణించి సహగమనం చేయటం 'చెంచు దంపతులు' కథావస్తువు.

గ్రామాలను దోచుకుంటూ క్రూరకర్మలతో భయపెట్టుతున్న బందిపోటు దొంగను రాజు ఎంత ప్రయత్నించినా లొంగదీయకపోవటం వల్ల, గ్రామాలలో పెద్దలు సభచేసి కష్టాలు తీర్చుకోవటం కోసం అతన్నే రాజువు కమ్మని రాయబారాలు నడిపి, అతడి అంగీకారం పొంది కోట కట్టడానికి నిర్ణయించుకొని, రాజ్యప్రారంభానికి నరబలి అవసరం కాబట్టి అర్థిస్తే ఒక సాహసిక ధర్మవీరుడు ప్రాణాలు అర్పించినందుకు, రాఘవరాజు అనే బందిపోటు ఆ వీరుడికి సత్కీర్తిని కల్పించటం కోసం శిలాప్రతిమను చేయించి ప్రతిష్ఠ చేయగానే సంతృప్తితో చూసి అతడి భార్య సహగమనం చేయటం – సాహిత్య అకాడమీ పక్షాన ముద్రితమైన ఆంధ్ర కథామంజూష అన్న కథాసంపుటిలోని శ్రీ దీక్షితుల 'శిలాప్రతిమ' కథావస్తువు.

శ్రీ దీక్షితులు 'ఎన్నో చేస్తాను, ఇతర కథలు' అన్న బాల కథాసంపుటిలోని (బాలానంద ప్రచురణ ప్రథమ ముద్రణ 1955 దేశీ ప్రెస్, విజయవాడ-2) ఆరు కథలలో 'సాహితికి, కథ, పాఠము, ఎన్నో చేస్తాను, మా అబ్బాయి' అన్న నాలుగు కథలు 'ఏకాదశి'లో ముద్రితాలయినాయి. నేను 'పెద్దవాడనైనాక' 'నీతి పాఠము' మిగిలిన రెండు కథలు.

"...అది ఎక్కి ఆకాశం దగ్గరదాకా వెళ్ళుతాను. వెళ్ళి ఆకాశాన్ని ముట్టుకొంటూ నిచ్చెన చివర నిలబడి నక్షత్రాలని కోస్తాను.కోసి జేబులో వేసుకొని ఆడుకుంటాను." ఇత్యాదిగా బాలుడి హృదయ భావాలను వెల్లడించటం 'నేను పెద్దవాడనైనాక' లో కథావస్తువు. పిల్లలకు గణితశాస్త్ర, ఖగోళశాస్త్ర, భూగోళశాస్త్రాదులు చెప్పటం కంటె నీతిని బోధించటం ప్రయోజనకారి అని తలపోసే తండ్రి మనోభావాలను వెల్లడిస్తుండగా వచ్చిన పిల్లవాడికి, దేవతాసంబంధమైన నీతిని మీరిద్దరూ పెద్ద దేవుళ్ళయితే నేను చిన్నదేవుడినే అని బాలుడు ఊహను పొంది, తన నీతిబోధకు ప్రయోజనం తీరుతుందని భావించే 'నీతి పాఠము' కథావస్తువు.

'సూరి - సీత - వెంకి' చింతా దీక్షితుల మరొక బాల కథాసంపుటి. (ప్రథమ ముద్రణ 1955, త్రివేణి పబ్లిషర్స్ మచిలీపట్టణం) పేరంటం, తీర్థం, పొడుపు కథలు, బొమ్మరిల్లు, భట్రాజు, సంకురాత్రి, జైలు ప్రవేశం, గుజ్జన గూడు, వెధవ ఉత్తరం, అమ్మ నన్నెందుకు కొట్టాలి? సూపర్నెంటు కూతురు, ఎవరు మంచివారు? అన్నవి ఇందులో కథలు. ఎనిమిదేళ్ళ సూరి, ఆరేళ్ళ సీత, మూడేళ్ళ వెంకి అక్కాచెల్లెళ్ళు. మరొక అమ్మాయి ఇంటికి పేరంటానికి వెళ్ళటం, సీత ఎక్కువగాను, మిగిలిన అక్కాచెల్లెళ్ళు తక్కువగాను ముద్దులమారి అల్లరి చేయటం, చివరకు సూరి తెచ్చుకున్న శనగలు వేయించి తెచ్చి అందరికీ పెట్టి సంతోష పెట్టటం, 'పేరంటం'లో కథావస్తువు. సాగరామావాస్యకు సూరి, సీత, వెంకి తల్లి, తండ్రి సోదరులతో తీర్థానికి వెళ్ళటం, అక్కడ సూరి, సీత, వెంకిలకు చుట్టమైన దొడ్డమ్మతో పరిచయం కలగటం, ఆమె తన ఇంటికి తీసుకొని పోవటం, తిరునాళ్ళలో బొమ్మలు కొనుక్కోటం, తండ్రితో స్నేహితుడు కనబడి ఇంటికి పిలిస్తే వీళ్ళకు ఒకచోటు చెప్పి ఉండమని, ఆయన వెళ్ళిన తర్వాత ఏడుస్తుంటే మరొకరు వీళ్ళను ప్రేమతో తమ ఇంటికి తీసుకొని పోవటం, అది తెల్సుకొని తండ్రి ఆ ఇంటికి వెళ్ళి సూరి, సీత, వెంకిని తెచ్చుకోవటం 'తీర్థం' కథావస్తువు. తీసిన కొద్దీ పెరిగేదేమిటి? - నుయ్యి, గొయ్యి. ఇట్లాంటి పొడుపు కథలతో సూరి, సీత, వెంకిల తెలివి బయటపెట్టడం 'పొడుపు కథలు' కథావస్తువు.

సూరి, సీత, వెంకి కొబ్బరాకు, పాతగుడ్డలు, పళ్ళు మొదలైన వాటితో బొమ్మలు చేసి బొమ్మరిల్లు నడిపి బొమ్మల పెళ్ళి చేయటం, 'బొమ్మరిల్లు' కథావస్తువు. భట్రాజు వచ్చి రకరకాల పద్యాలు పూసపాటి విజయ రామరాజుల మీద చాటువులు చెప్పి 'గువ్వల చెన్న' మొదలైన పద్యాలు చదవటం, చివరకు సూరి సీత వెంకి తమ మీద పద్యాలు చెప్పించుకొని సంతోషించటం. భట్రాజుకు బియ్యం పెట్టటం, 'భట్రాజు'లోని కథావస్తువు. ముగ్గులు, గొబ్బిళ్లు పెట్టటం హరికథకులు వచ్చి పాటలు పాడడం, సూరి, సీత, వెంకి నానారకాల పిండివంటలు చేయించుకోవడం, భోజనానంతరం సాయంత్రం కొత్త కొత్తగుడ్డలు కట్టుకొని సంతోషంతో పండుగ చేసుకోవటం 'సంకురాత్రి' కథావస్తువు.

విదేశీ వస్తు బహిష్కరణోద్యమం సాగుతున్నపుడు తల్లితో పాటు పాల్గొంటున్న పిల్లలు "గాంధీజీ కి జై!" అని కేకలు పెట్టినందుకు తల్లితోపాటు సూరి, సీత, వెంకిలను మాజిస్ట్రేటు జైలులో వేయటం, వాళ్ళ ప్రవర్తనను, శీలాన్ని, శ్రమాధిక్యాన్ని గమనించి మాజిస్ట్రేటు భార్య జైలులో వేసినందుకు భర్తతో పోట్లాడటం, 'జైలు ప్రవేశం' కథావిశేషాలు. కందిపప్పు, బెల్లం మొదలైనవి తెచ్చుకొని బొమ్మలు పెట్టుకొని ముద్దుగా మాట్లాడుకుంటూ పోట్లాడుకుంటూ సూరి సీత వెంకి గుజ్జన గూళ్ళు ఆడుకోవటం 'గుజ్జనగూళ్ళు' కథావస్తువు. వినాయక చవితినాడు పూజకోసం సమస్తయత్నాలు చేసుకొని ప్రారంభానికి సన్నద్ధులైన సమయంలో, తండ్రి తమ్ముడికి కొడుకు పుట్టాడన్న పురిటి వార్త వస్తే పిల్లలయిన సూరి సీత వెంకి వెధవ ఉత్తరం వచ్చిందని అనుకోటం 'వెధవ ఉత్తరం' కథావస్తువు.

పెద్ద పులివేషం వేయాలని తండ్రి పంచె ఒకటి తెచ్చి తడిపి బొగ్గులు, సుద్ద, పసుపు పూసి పాడు చేసినందుకు అమ్మ పిల్లలను కొట్టడం 'అమ్మ నన్నెందుకు కొట్టాలి?' కథావస్తువు. సూరి సీత వెంకి జైలులో ఆడుకుంటుంటే తండ్రితో వచ్చిన సూపర్నెంటు కుమార్తె వీళ్ళకు పరిచితురాలై స్నేహం ముదిరి ఇంటికి రానని తండ్రితో వ్యతిరేకించటం, తండ్రి బలవంతంగా తీసుకొని వెళితే పిల్ల ఏడుస్తుండటంతో సూపర్నెంటు భార్య సూరి సీత వెంకిలని తమ పిల్లలకోసం ఇంటికి తీసుకొని రమ్మని అడిగి తెప్పించటం, అంత చిన్న పిల్లలను జైలులో పెడుతున్న ప్రభుత్వం తెలివితేటల్ని జనసామాన్యం పరిహసించటం, సూపర్నెంటు భార్య భర్త చేత పైకి వ్రాయించి పిల్లలను వదలిపెట్టించమని కోరటం, సూరి సీత వెంకి జైలులో నుంచి బయటపడటం, 'సూపరెంటెండెంటు కూతురు' కథావస్తువు. వినాయక చవితినాడు పాలవెల్లి కడుతుండే దాన్ని క్రింద పడవేసినందుకు తండ్రి కోప్పడ్డాడని, తండ్రి కొట్టాడని అందుకు నాన్న

మంచివాడు కాదు అమ్మే మంచిదని చెప్పి, మరికొన్ని తండ్రి దోషాలు కూడా మొదటి సగంలో ఎన్నటం, రెండవ సగంలో అమ్మ మంచిది కాదు నాన్నే మంచివాడు అని పిల్లలు సంక్రాంతినాడు అమ్మ ముగ్గులన్నీ నన్ను పెట్టనివ్వదు, బొమ్మలన్నీ దాచి పెడుతుంది, ఈతపళ్ళు కొనుక్కోనివ్వదు, పొయ్యి దగ్గరికి రానివ్వదు, మొదలైన హేతువులు చెప్పటం 'ఎవరు మంచివారు?' కథావస్తువు. ఫెయిరీ టేల్స్ కథావస్తువుగా గల చింతా దీక్షితుల 'శంపాలత', 'లీలాసుందరి' అన్నవి రెండు నవలికలు అనదగ్గ అతి దీర్ఘబాల కథలు.

ఉద్యోగస్థుల భార్యలైన లేడీస్ క్లబ్ వార్షికోత్సవ సభల్లో ప్రతి సంవత్సరం వటీరావు ఎమ్.ఎ. (కళావతి) ప్రథమ బహుమానం పొందటానికి అనుసరించిన చిత్రాతిచిత్ర ప్రవర్తనలకు సంబంధించిన సన్నివేశకథలు శ్రీ దీక్షితుల 'వటీరావు కథలు' (నవ్య సాహిత్య పరిషత్తు హైదరాబాదు). 'మొదటి బహుమానం', 'మిసెస్ వి.కె. వటీరావు ఎమ్.ఎ.', 'నగ్నదిన మహోత్సవము', 'ఫ్యాన్సీ డ్రెస్ పారేడ్', 'మిస్సుల బహుమానం', 'సౌందర్య పోషణ' పద్ధతులు అన్న ఆరు ఈ సంపుటిని ఉన్న కథలు. బహుమానాన్ని పొందటానికి సభ్యురాళ్లు ప్రతి ఒక్కరూ భర్తలచేత చిత్రమైన పనులు చేయించాలని నిర్ణయించటం, దొరల దుస్తులు వేసుకొనే భర్త చేత పంచె కట్టించటం, తాను నవల చదువుకుంటూ సిగరెట్టు కాలుస్తూ భర్తచేత వంట ఇంటి పనులు చేయించటం, భర్తచేత చీర కట్టించి రవిక, గాజులు తొడిగి ఆడవేషం వేయించటం మొదలైన పనులను ఇతర సభ్యగణం చేస్తే, వటీరావు భర్తచేత శివుడి వేషం వేయించటం, జడ్జీలు వటీరావు భర్తచేత వేయించిన వేషానికి ప్రథమ శ్రేణికి చెందిందని నిర్ణయించి బహుమాన మిప్పించటం 'మొదటి బహుమానం' కథావస్తువు., భర్తలకు తీవ్రమైన అనుమానం కలిగేటట్లు సభ్యురాండ్రు పరపురుషులతో కలిసి నర్తించి తమ అభినయకౌశలాన్ని ప్రదర్శించి, బహుమానాలని పొందటం నిర్ణీతమైనపుడు ఇతర అభినయంతో సత్యాల కప్పి పుచ్చలేకపోతే వటీరావు భర్తకి అనుమానం కలిగేటట్టు భార్యతో వైరమేర్పడ్డ ఒక కొత్త యువ భర్తతో అతిసన్నిహితంగా నర్తించి బహుమానం పొందటం 'మిసెస్ వి.కె. వటీరావు' ఎమ్.ఏ కథావస్తువు.

సభ్యురాండ్రు ఒకచోట నగ్నదినోత్సవం చేసుకుంటామని, ఉల్లాసముంటే మీరు కూడా రావచ్చునని చెప్పటం, బీచి దగ్గరకు రమ్మని పిలిచి భర్తలు కనుక్కోలేకుండా దాసీలు ముసుగు వేషాల్లో రక్షించడం, పేరాపురంలో సభ్యురాండ్రు నిత్యం ఇళ్ళల్లో పనులు చేసుకొనే నగ్న రూపాలల్లోనే ఉత్సవాలను జరుపుకోవటం, ఉత్సవ ప్రదేశాన్ని కనుక్కోవటంలో భర్తలను వివేకహీనులను చేయటం, ఇందులో వటీరావు విచిత్ర

పాత్ర నిర్వర్తించటం 'నగ్నదిన మహోత్సవము' లోని కథావస్తువు. సభ్యురాండ్రు గుర్తించడానికి వీలు లేనంత గూఢమైన ఫాన్సీడ్రెస్ వేసుకుంటే వాళ్ల భర్తలు కనుక్కొని ముద్దుపెట్టుకోవటం, సభాకార్యక్రమం కావటము, అందులో ఒకరిద్దరు భర్తలు తమ భార్యలే అనుకొని పర స్త్రీ సభ్యురాండ్రను ముద్దు పెట్టుకోబోతే వాళ్ళు తప్పుకొని వెళ్ళటం, అనేకమంది భార్యలను గుర్తుపట్టి ముద్దు పెట్టుకోవటం, వటీరావు భర్త ఫ్యాషను దుస్తుల్లో ఉన్న ఆమెను తన భార్య కాదని నిర్ణయించి చెప్పటం, వటీరావు ప్రథమ బహుమానం, వింత నిర్ణయానికి ఆమె భర్త ఒక బహుమానం పొందట 'ఫ్యాన్సీ డ్రెస్ పెరేడ్' లోని కథా వస్తువు.

లేడీస్‌కే కాక తమకు కూడా బహుమానాలు వచ్చే కార్యక్రమాలు ఏర్పాటు చేయవలెనని పట్టుపట్టి, లేడీసుకు చెప్పకుండా మిస్సులు లేడీస్ భర్తలను ప్రేమించి తామట్లు అభినయించి వాళ్ళకు అనుమానం కలిగించటం కార్యక్రమంగా ఏర్పాటు చేయటం, వటీరావు భర్తకు మిస్సులు సైకిల్ యాక్సిడెంట్ కలిగినట్లుగా చేసి ఆయన్ను ఆసుపత్రికి చేర్చి, కట్టు కట్టి ఇంటికి పంపించడం, 'మళ్ళా కట్టు కట్టాలి ర' మ్మని, 'మేము నిన్ను ప్రేమిస్తున్నా'మని ఉత్తరం వ్రాస్తే వటీరావు భర్తచేత 'వస్తున్నాను పార్టీకి కూడా ఉంటాను' అని సమాధానం రాయించడం, భర్తను పంపించి రాత్రి రాకుండా ఉంచి, వటీరావు గాబరా పడుతూ క్లబ్బు కార్యదర్శికి ఉత్తరం రాసి తన్ను ప్రేమించే మిస్సులకు బహుమతి వచ్చేటట్లు చేయటం 'మిస్సుల బహుమానం' కథావస్తువు. ఆకాశవాణిలో సౌందర్యపోషణను గురించి ప్రసంగం రావటం, అది ఆధునికస్త్రీల దృష్టిని అనుసరించి నడవటం వల్ల వటీరావు భర్త విమర్శించటం, దానిమీద భార్యాభర్తలిద్దరూ పోట్లాడుకోవటం, ఇట్టి స్థితి ఇతర సభ్యురాండ్ర భర్తలకు కూడా కలగటం, వటీరావు దంపతులు వటీరావు భర్త వైరం మానేసేందుకు హోటళ్ళలో భోంచేద్దామని, క్యారియరు తెప్పించుకొని తిందామని భిన్నభావాలు వహించి ప్రణయ కలహంలో పడితే, ఇతర సభ్యులు వారి భార్యల ద్వారా రాయబారాలు నడుపుతూంటే, వటీరావు షరతులు వ్రాసివ్వడం 'సౌందర్య పోషణ' కథావస్తువు.

## కథా ఇతివృత్త వైవిధ్యం

చింతాదీక్షితులు ఔపనిషదిక విజ్ఞానవివరణ కృతులైన రామాయణ భారత భాగవతాది పురాణాలలోని కథలతోను, ఆంధ్రప్రదేశ చరిత్రతోను, ఆంధ్రప్రదేశ చారిత్రక కథలతోను, ప్రాచీనాంధ్ర జానపద జీవిత కథలతోను, పెరియ పురాణాది గ్రంథాలలోను లభ్యమయ్యే భక్తజన కథలతోను, స్వానుభవం వల్ల సంపాదించిన

సమకాలీన సాంఘిక జీవిత కథలతోను అత్యంత పరిచయం, ప్రీతి కలవారు. బహుముఖీన సాహిత్యసేవ చేసిన వీరు, ఈ కథలలో నచ్చినవాటిని గేయ, నాటికా బహువిధ కథాకథనాల్లో రూపొందించి తమ కథావస్తు వైవిధ్యాన్ని సాహిత్యప్రక్రియ భేదాల్లో పంచి ఇచ్చి, పాఠకులను ఆనందింపజేశారు. వీటిలో పేరుగాంచినవి రేణుక, తిరుప్పాణాళ్వార్ ఇత్యాదులు. కేవలం కథాకథన ప్రక్రియలోనే వీరి విశేష వైవిధ్యం ద్యోతకమవుతున్నది. అందువల్లనే 1925లో ప్రథమతః ముద్రించిన 'ఏకాదశి' కథాసంపుటికి వీరు ఉద్దేశించిన పాఠకలోకం బాల యౌవన వయోవృద్ధులు. వీరి ప్రక్రియలలో కథావృత్తాలు యువజన స్వేచ్ఛ, సఖ్యం, ప్రేమ పవిత్రత, మధుర దాంపత్యం, ఆదర్శప్రియత్వం, దేశభక్తి, జాతీయతా ప్రియత్వం, త్యాగం అవలంబించటం, నీతిబోధ, దేశీయాచార ప్రియత్వం, జాతీయ సంప్రదాయాలు వదులుకొని అన్యజాతి సంప్రదాయాన్ని అనాలోచితంగా పాటించటం హాస్యాస్పదమైనదని గమనింపచేసే యత్నం, "మగడు వేల్పన పాతమాటది, ప్రాణ మిత్రుడుగా నీకు" అన్న గురజాడ అభిప్రాయానికి సక్రమ నిరూపణ. బాలల మనో భావవర్తన శిక్షణాదికాలు, ప్రాచీన జానపద వీరత్యాగ స్వరూపాదులు. దూదేకుల పాట, హరిదాసు గంగిరెద్దుల రాకలు మొదలైన వాటితో కూడిన గ్రామసీమ సౌభాగ్యాదుల వంటి విశేషాలతో కథావృత్తాలు బహుళంగా నడిచి ఉండటంవల్ల, వైవిధ్యం విశేషంగా స్ఫురిస్తున్నది. కల్పనాసహజత్వం – బాలసాహిత్యంలో అంతర్భాగంగా ఫెయిరీ టేల్స్ వంటి పాశ్చాత్యులు సైతం ఆదరించి రచించిన శ్రీ దీక్షితులు ప్రారంభ దశలో పిల్లలకు వ్రాసిన 'శంపాలత', 'లీలాసుందరి' వంటివి అభూత కథా కల్పనలు. వీటిలో తప్ప వీరి ఇతరకథలన్నిటి కల్పనలో సహజత్వమే గోచరిస్తుంది. 'శ్యామల' కథలో ప్రేమించిన యువతి మరణించటం వల్ల ప్రియుడు జీవితాంతం బ్రహ్మచారిగా ఉండిపోవటం, వరూథిని కథలో మనస్సు మారి తనమీద ప్రేమ కలిగినపుడు తనదగ్గరకు వచ్చేటట్లు వరూథిని వరమిచ్చినా, వివాహితుడైన ప్రవరుడు, మనస్సు మారి మళ్ళీ వెళ్ళక, దాంపత్య ప్రణయపవిత్రతను నిలపుకొన్న ప్రవరుడి వంటివాళ్ళు ఉండటం అన్న విశేషాలకు లోకంలో ఎన్నో సహజ నిదర్శనాలు గోచరిస్తున్నవి. 'కవిరాయడు:' మహారాజు అన్న కథలో అనుగ్రహించని మహారాజు శిలామూర్తికి రచనలను వినిపించి అంకితమివ్వటం సహజమేనని అనటానికి ఎన్నో ఆధారాలు కనిపిస్తున్నవి. 'చెంచుదంపతులు' కథలో ఈరమ్మ తన లోపానికి పశ్చాత్తాపాన్ని పొంది, మరణించిన భర్త శవం పక్కనే సహగమనం చేయటం మూలంగా, చెంచువాళ్లు సైతం ప్రణయపవిత్రతను గొప్పగా పాటించేట్లు కల్పించటంలో అసహజత్వం అణుమాత్రం లేదు. 'శిలాప్రతిమ' కథలో బందిపోటు దొంగ రాజై

కోట కట్టుకొనేటపుడు వీర గ్రామీణుడు నరబలికి ప్రాణమర్పించటం, అతని శిలాప్రతిమను చూసి తృప్తితో భార్య సహగమనం చేయటం అన్నవి ఆధునికులలో కొందరు ఇలా జరుగుతాయా అని అనుమానించే అంశాలు. సత్యాలేనని ఎన్నో నిదర్శనాలు కనిపించటం, దేశంలో అట్లాంటి దంపతులిరువురి శిలాప్రతిమలు గోచరించటం సత్యాలు. బాల కథల్లో 'ఎన్నో చేస్తాను, నేను పెద్దవాడనైనాక' మొదలైన కథల్లోని బాలకుల భావాల్లోను, ప్రవర్తనలోను ఎక్కడా అతిశయోక్తి కనిపించదు. 'సూరి–సీతి–వెంకి' కథలలో ఆ బాలికల భావాలు చేష్టలు అతిసహజాలు. అసహాయోద్యమ కాలంలో విదేశీ వస్తు బహిష్కరణ చేస్తూ దేశభక్తి ప్రపూరితలైన తల్లులు మహాత్మాగాంధీ కీ జై అన్న కేకలతో ఉద్యమాలను నడుపుతున్నపుడు, ప్రభుత్వం ఆ తల్లులతో పాటు సూరి సీత వెంకి వంటి వయస్సు గల పిల్లలను సైతం జైలులో పెట్టటం, ప్రజల పరిహాసానికి లొంగి పిల్లల్ని విడిచిపెట్టటం, ఎంతో సహజంగా జరిగాయి. శ్రీ దీక్షితులు సూరి సీత వెంకిల జైలు శిక్షకు విముక్తిని కల్పించటంలో అసహజత అణుమాత్రం కనిపించదు. ఇలాగే 'వటీరావు కథల'లోని అంశాలు సైతం సహజ కల్పితాలైనాయని చెప్పటంలో వ్యతిరేకత అణుమాత్రం లేదు. వీరి కల్పనలో అంగవైకల్యం సైతం ఎక్కడా లేదు.

**శిల్పం భాషా విన్యాసం, కథన రీతులు:** బహువిధ ప్రయోజనాలను ఉద్దేశిస్తూ కథ, కథానకము, ఆఖ్యానము, ఆఖ్యాయిక అన్న భారతీయ కథావిధానాలకు ఇంగ్లీషులో స్టోరీ, టేల్, స్కెచ్ (షార్ట్ స్టోరీ) అనే కథావిభాగాలకు ఇంచుమించుగా సరిపోయేలాగున కథలు వ్రాసిన దీక్షితులు, ఆయా కథలకు యోగ్యమైన శిల్పాన్ని పాటించి విజయవంతమైన కథారచన చేశారు. కథాబీజాలను ప్రథమంలోనే నిపుణులతో నిర్ధారణ చేసుకొని, చింతా దీక్షితులు చిత్తాకర్షణ చేసే కథోదయాన్ని కల్పించి, అందులో కావ్యార్థ సూచనను గర్భీభూతం చేసి, తర్వాత కథాంతర్భాగ కల్పనావిన్యాసాలతో నడిపి జాగరూకతతో రసవంతంగా కథను గమ్యస్థానం చేర్చటం. పఠితకు భావోద్రేకాన్ని కలిగించే సందర్భ సహిత భావాన్ని చిన్న కథలలో సాధారణంగా ఒక్కటే ప్రధాన పాత్రని చేయడం, తక్కిన పాత్రలను వాటికి అణగి ఉండేటట్లు చేయటం, రసోచిత వేషభాషాచేష్టలతో పాత్రలను పోషించటం, మెరుపు వంటి చిన్న చిన్న కేంద్రాల్ని కల్పించుకోవటం దేన్ని ఎక్కువ స్ఫుటంగా చిత్రించాలో దాన్ని చిత్రించటం, గమిత వేగాన్ని కల్పించి కథనాన్ని నడపటం, మొదలైన కథాశిల్ప స్థూల స్వరూప చమత్కార లక్షణాలను వహించటం, ఇత్యాది నాటక శిల్పలక్షణాలన్నిటిలో దీక్షితులు సిద్ధహస్తులనే చెప్పవచ్చు.

శ్రీ దీక్షితులు మొదటినుంచీ కథారచనకు తేట తెనుగు వ్యావహారికభాషను వినియోగించారు. వీరి భాషలో ఆధునికులు కొందరు ఆంగ్లభాషా ప్రభావితమై వ్యవహరిస్తూ ప్రయోగించే వ్యావహారికభాష అణుమాత్రమైనా కనిపించదు. వీరి భాష వ్యావహారిక సలక్షణము, సంప్రదాయ సిద్ధము. ఇందులో జాతీయ జీవనం ప్రతిబింబించి కనిపిస్తుంది. కథలోని పాత్రల ఉనికికి అనుగుణంగా వాక్యరచన చేశారు. సముచితమైన తత్సమ దేశ్యాది అన్య దేశ్యపదజాలాన్ని స్వేచ్ఛగా భిన్న కథా కాలాన్ని బట్టి స్వీకరించారు. వీరు వ్యవహార నిర్వహణలో శిష్టులు కథా కాలాల్లో ఉపయోగించిన వ్యావహారికభాషను స్వేచ్ఛగా ఉపయోగించారు. ఉపాధ్యాయ వృత్తిరీత్యా ఆంధ్ర దేశంలోని అనేక ప్రాంతాలలో నివసించటం వల్ల వీరి కథారచనలో, ఆయా ప్రాంతాలలోని మాండలిక పదాలను ప్రీతితో స్వీకరించి ఉపయోగించారు. ఇటువంటి ఈ భాషావిన్యాసాల వల్ల వీరు ఎంతగానో ఔచిత్యశోభను సంపాదించారు. కేవలం ఆధునిక విషయాలే కథావస్తువుగా గల కథలకు వలె కాక, పురాతన, మధ్య కాల ఆధునిక పాత్రల వైవిధ్యం గల వీరు అవసరం కొద్దీ అధిక శబ్దజాలాన్ని స్వీకరించి రససౌష్ఠవోపేతంగా ప్రయోగించారు.

కథను చెప్పటంలో శ్రీ దీక్షితులు అవసరాన్ని బట్టి అనేక రీతులను అనుసరించారు. ఏ అంశమైనా కథావస్తువు కావచ్చునని సూచించడం అంశంగా 'సాహితికి కథ' అన్న కథను ప్రజ్ఞాప్రదర్శమైన విచిత్రరీతిలో వ్రాసారు. మాంటెస్సోరీ విద్యావిధానం మీద వ్యంగ్యంగా వ్యతిరేకతను వెల్లడిస్తూ 'పాఠం' అన్న కథను వ్రాసి, ప్రభుత్వం వల్ల ప్రమాదం కలుగుతుందేమో అనీ, వ్యంగ్యధోరణిలో మారుతి అన్న మారు పేరుతో చెప్పి ప్రకటించారు. తాము సేకరించిన కొన్ని జానపద సాహిత్య విశేషాలను, నీతి బోధకులైన వేమన, గువ్వల చెన్నడు మొదలైన కవివర్యుల పద్యాలను, ప్రసిద్ధ ప్రాచీనాంధ్రుల మీద చాటువులను మొదలైన వాటి ప్రయోజనాల్ని ఆశించి, కథా కథనంలో పాత్రల ముఖాన ప్రయోగించారు. కథకు మూలభావమైన అంశాన్ని గురించి విజ్ఞానాన్ని విశదీకరించ తలచి వ్యాఖ్యానించ తలచినపుడు, కొందరు కథకుల వలె తానే చెప్పక సందర్భోచితంగా అన్యపాత్రలను సన్నివేశాలను, ఉద్దేశాలను నిర్వహించు కొంటారు. ఈ పద్ధతికి దీక్షితులు వ్యతిరేకం. బాలలకు జాతీయము, దేశీయము అయిన ఉత్తమ నీతిని బోధించటం, యువకులకు సాంప్రదాయిక విజ్ఞానాన్ని, సమాచార మార్గాన్ని, దేశస్వాతంత్ర్య భక్త్యాదులను ఉత్తమ ధార్మికజీవితాతిశయాన్ని అధికంగా అత్యుత్తమ సఖ్య, ప్రణయ, దాంపత్యస్వరూపాన్ని, ఇత్యాదులను కథారీతుల మూలంగా వెల్లడించటం శ్రీ దీక్షితుల విశిష్టత.

పాశ్చాత్య సాహిత్య విమర్శకుడు Graham Balfour కథారీతులను గురించి There are so far as I know, three ways and three ways only of writing a story. You may take, a plot and bit characters to it, or you may take a character incidents and situations to develop it, you may take certain atmosphere and get actions and presons to readers. అని అన్నాడు.

శ్రీ దీక్షితులు ఈ మూడు రీతులలోనూ కథలు రచించారు. వీరి కథలు సాహిత్యంలో ఆదర్శప్రబోధితాలూ ప్రచారకాలూ చమత్కారిత్వ శోభితాలు. మృదుహాస్యరస స్ఫోరకాలుగా కొన్ని సందర్భాల్లో వ్యంగ్యగర్భితాలుగాను నడిచాయి. 'వీరు సాహిత్య కథ' వంటి కథలను కథావస్తు వైచిత్రిలోను, హాస్య కథలను ఉత్తమ భావబోధకాలైనా కేవల హాస్యరస ప్రధానంగానూ నడిపించారు. జాతీయ సంప్రదాయాన్ని పరిత్యజించి అన్యమార్గాల్లో అనుసరించే విషయాలను గురించి వ్రాసిన వీరి వటీరావు కథలను, ఇంటబుట్టిన ఆచారాలకు, దిగుమతి అయిన ఆచారాలకు సంఘర్షణ జరిగినపుడు రాలే విస్ఫులింగాల వల్లే ద్యోతకం చేశారు.

**పాత్రపోషణ**

అనేక కథలకు ఇతివృత్తాల వలె రాజకీయ, సాంఘిక, ఆర్థిక, లైంగిక, స్థితులకు చెందిన ఒక వర్గానికి సంబంధించిన ఇతివృత్తాల వంటివి బహుముఖీనాలు. అందువలన వీరి పాత్రలు సైతం అనేక కథకుల పాత్రలవలె ఒక వర్గానికి చెందినవి మాత్రమే కాక, ప్రాచీన చారిత్రక వర్తమాన కాల వయోగుణభావ వృత్తి జీవిత విశేష బహువిధ వైవిధ్యం కలవి. కవిరాయడు – మహారాజులోని పాత్రలు ప్రాచీనకాల పాత్రలకు, శిలా ప్రతిమలోని పాత్రలు చారిత్రక పాత్రలకు, వటీరావు కథలోని పాత్రలలో అత్యాధునిక సాంఘిక పాత్రలకు, 'దూదేకుల పాప' ఇత్యాదుల్లోని పాత్రలను, ఆధునిక గ్రామీణపాత్రలకు చెంచు దంపతులు, చెంచురాణి (సఖి 1927) లోని పాత్రలు ఆటవిక జీవితపాత్రలకు, 'శ్యామల' లోని పాత్ర సఖ్య ప్రేమాది భావవిషయిక పాత్రలకు, ఎన్నో చేస్తాను మొదలైన కథల్లోని పాత్రలు, సూరి సీత వెంకి కథల్లోని పాత్రల్లో బాల జీవిత పాత్రలకూ ఇత్యాదిగా వీరి పాత్రలు పాత్ర వైవిధ్యానికి నిదర్శనాలు. శ్రీ దీక్షితులు గారు కథోచితంగా ఇలాంటి వివిధ పాత్రలను సృష్టించుకొని, వాటికి అనుగుణమైన రూప వేష (అలంకరణ) భాషా (సంభాషణ) చేష్ట (ప్రవర్తన) లను ప్రసాదించి పోషించి, మనోరంజకంగా కథలు నడిపి పాఠకులకు ఆహ్లాదాన్ని కలిగించారు. పాఠకులకు పాత్రలను నిత్యపరిచితాలు చేశారు. చెంచు దంపతులలో ఈరమ్మ, కవిరాజు వటీరావు

వంటి కొన్ని పాత్రలు సాహిత్యలోకంలో సజీవాలయినాయి. పాత్రపోషణలో ప్రజ్ఞాన్వితులైన శ్రీ దీక్షితులు ప్రతిభావంతులు.

**ఇతర రచయితల సిద్ధాంతాల ప్రభావం**

చిన్నకథ 1915లో ప్రారంభమై, బహువిధ కథావస్తు గుణ భేదాలతో అవిచ్ఛిన్నంగా నేటివరకు వృద్ధి పొందుతూ, ప్రస్తుత సాహిత్యయుగంలో కథాయుగం అన్న కీర్తిని ఆర్జించి ఇచ్చింది. కథాప్రారంభకుల తొలినాటివారు భారత స్వాతంత్ర్య ప్రియులు, దేశభక్తితత్పరులు అయిన బంకించందు మొదలగు వంగభాషా రచయితల సిద్ధాంతాల ప్రభావాలు 1910లో ప్రారంభమై, ఉర్దూ కథా రచయితలగు ప్రేమ్‌చంద్ మానవత్వపు విలువలమీద కథా రచన చేశారు. వీరిలో కొందరు బాల్ జాక్, ఎమిలీజోలా, మొపాసాల వంటి రచయితలు తమ రచనలంతటా ప్రస్ఫుటీకరించిన కాముకత్వ సిద్ధాంతాల ప్రభావానికి వశమై కథారచన చేశారు. 1930 ప్రాంతంలో కొందరు కథకులు మార్క్స్ భౌతికవాద విజ్ఞానం వల్ల, మాక్సిమ్ గోర్కీ మొదలైన రష్యన్ కథకుల విప్లవ తత్త్వరచనల వల్ల, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికాభ్యుదయ కృషి, లైంగిక స్వేచ్ఛాదులతో కోరిన జీవిత ప్రియత్వాది సిద్ధాంతాల ప్రభావితులై, వస్తు విభేదాలను, కల్పించి కథారచన చేయటం ప్రారంభించారు. 1936లో భారత దేశంలోని అభ్యుదయ రచయితల సమావేశం ఉద్యమం జరిగింది మొదలు ఈ అతివాస్తవిక కథారచనల మీద, కథారచయితల మీద, రష్యన్ రచయితల ప్రభావం అధికంగా విస్తరించింది. తరువాత కొందరు రచయితలు మనస్తత్త్వశాస్త్రజ్ఞులైన ఫ్రాయిడ్ మొదలైన వారి సిద్ధాంతాల వల్ల ప్రభావితులై 'ఈడిపస్ కాంప్లెక్స్', 'నార్సిజమ్' మొదలైన వారి లైంగిక సిద్ధాంతాలను వెల్లడిచేస్తూ కథారచనలు నడిపించారు.

1915 నుంచి 45 వరకు కథారచన చేసిన శ్రీ దీక్షితులు ఈ ప్రభావాలలో దేనికీ లోనయినవాడు కాదు. ఈయన కథావస్తువులన్నీ స్వానుభవపూరిత సోపపన్నాలు. ఈయన ప్రదర్శించిన మానవత్వం, మహోన్నత గుణప్రియత్వం అనుభూతియుతాలు. ఆత్మ సంప్రదాయాను గుణాలు. శ్రీ దీక్షితులు రచనావిధానంలో కూడా పరభాషా రచయితల సిద్ధాంత ప్రభావానికి లోనయినవాడు కాదు. వీరి రచనలన్నీ స్వతంత్రాలు. వీరు పరప్రభావ రహితులు. దేశభక్తి, స్వాతంత్ర్య ప్రియత్వం, గ్రామీణ జీవిత ప్రియత్వం ఇత్యాది విశేషాలయినా దీక్షితులకు ఇతర రచయితల సిద్ధాంతాల ప్రభావం వల్ల పుట్టినవి కావు.

## మనోవిశ్లేషణ

ఆంధ్ర కథారచయితలలో కొందరు హేతువాద దృష్టితో సైకో ఎనలిస్టులు అనే మనస్తత్త్వ శాస్త్రజ్ఞులైన 19వ శతాబ్ది చివర భాగంలోని ఫ్రాయిడ్, యాడ్లర్ మొదలైనవారు మానవప్రవృత్తిని గురించి చేసిన సిద్ధాంతాల ప్రభావాలకు లోనై, వారి ఆలోచనలకు ఆకర్షింపబడి ఇరవయ్యవ శతాబ్దం మొదటి భాగంలో వాటిని అమలులోకి తేవటం కోసం రచన చేసిన ఇంగ్లండు, అమెరికా సాహిత్యకుల రచనాప్రక్రియకు లోనయినారు. ఇలా ఆంధ్ర రచయితలు ప్రభావితులు కావటం కొందరిలో 25 సంవత్సరాలకు పూర్వమే ప్రారంభమైనది. కొందరిలో 1944-50 ల కాలంలో విస్తృతంగా సాగింది. ఈ ఆంధ్ర కథకులు, మనస్తత్త్వశాస్త్రజ్ఞుల ఆత్మ, జ్ఞాతస్థితి, అజ్ఞాతస్థితి, మనోభావ వ్యక్తిత్వాలను ప్రేరేపించే శక్తి అయిన లిబిడో తల్లిదండ్రులకు, పిల్లలకు సంబంధించిన స్త్రీపురుష లైంగికప్రవృత్తికి సంబంధించినవయిన ఈడిపస్ కాంప్లెక్సు, ఎలెక్ట్రా కాంప్లెక్సు, నార్సిజమ్, ఆత్మన్యూనత్వం (Inferiority Complex) ఇత్యాది భావ సిద్ధాంతాలకు అనుగుణమైన మనోవిశ్లేషణను ప్రదర్శిస్తున్న అందరి రచనలలోని పాత్రలను పోషించి కథనశిల్ప ప్రత్యేకతను సంపాదించటం, కొందరు గాఢవిశ్వాసంతో పై మనస్తత్త్వ శాస్త్రం సిద్ధాంతాల లక్షణాలతో జీవితవర్తమానం సాగించటం జరిగించారు. ఈ మనస్తత్త్వ శాస్త్రవిజ్ఞానం మూలంగా, నిరూపితమయ్యే మనోవిశ్లేషణకు విశేష ప్రాముఖ్యాన్ని, ప్రచారాన్ని కల్పించే దృష్టితో నేడు సాహిత్య విమర్శనల్లో సైతం ప్రత్యేక స్థానాన్ని కల్పించటం జరుగుతున్నది. శ్రీ దీక్షితులకు ఈ రీతి మనోవిశ్లేషణతో పరిచయం ఉన్నది. కాని మానవజాతి పశుత్వ దుర్జనత్వాలను ఇవి విశేషంగా ప్రదర్శించి వెల్లడించినవి. దీనిలోని ముఖ్యాంశాల సత్యతను గురించి, సత్ప్రయోజనాన్ని గురించి వీరికి విశ్వాసం లేదు. వీరి విజ్ఞానం సంక్షేమకరము, ఉత్తమమానవత్వ, మానవ దివ్యత్వప్రదర్శనము ఆర్షజనానుభూతి నిరూపితము, సర్వతోముఖము అయిన భారతీయ విజ్ఞానము, ధార్మికమైనదీ. ప్రయోజనాలను నిత్యానుభూతితో అనుభవపూర్వకంగా పోషించటంలోను మనోవిశ్లేషణను ప్రదర్శించారు.

సమకాలిక రచయితలలో వీరికున్న విశిష్టత: చిన్న కథలు వ్రాసిన వారిలో శ్రేష్ఠులు శ్రీ చింతా దీక్షితులు. (క్రొవ్విడి లక్ష్మన్న - భారతి-మాఘ) చిన్న పిల్లలు అమాయక మనస్తత్త్వాన్ని, సౌకుమార్యాన్ని వీరు నివేదించినట్లుగా ఇంకెవ్వరూ నివేదించలేదనుటలో అతిశయోక్తి లేదు. శ్రీ దీక్షితులు సాహిత్యకంగ మాకు నచ్చాడు.

(శ్రీ కృష్ణ శాస్త్రి) 'ఆంధ్రదేశ రచయితలందరిలో ఉన్నత హృదయుడు'. (శ్రీ శివశంకరశాస్త్రి). ఇత్యాదిగా సమకాలికులలో సోదర రచయితల అనురాగాన్ని ఆర్జించాడు. 'మా సాహిత్య గురువు అని అనేకమంది సాహిత్య యువకుల గౌరవాన్ని ఆర్జించాడు. సఖిలో ప్రచురించిన వీరి కథలన్నిటికీ మిమ్ము అభినందిస్తున్నాను. కథ చాలా గొప్పగా ఉంది. మీ దోమల మహాబాధ చాలా బాగుంది. అట్లాటివి వ్రాయడంలో మీ సమానులు లేరు. ప్రతిభలో మీ కథ చాలా బాగుంది. చక్కగా సాధించారు ఇత్యాదిగా (చలం)

శ్రీ దీక్షితులు సారస్వతములో దివ్యజ్యోతి వెలిగించే బుద్ధితో రచన చేశారు. (శివశంకర స్వామికి శ్రీ చింతా దీక్షితుల ఉత్తరం 18-9-46) దేశ స్వాతంత్ర్య సంపాదక మహాత్మాగాంధీ ప్రభృతులైన మహానాయకులు, అరవింద ఘోష్ మొదలైన మహనీయులు ఆర్జించిన విజ్ఞానాత్మక, నైతిక, సాంఘిక జీవితాన్ని సాధించటం జాతీయ సంప్రదాయ వైరుధ్యాన్ని ఎదుర్కోవటం, ప్రాచీనాంధ్రత్వ వైభవాన్ని ఆటవిక గ్రామీణ జీవితాన్ని ప్రదర్శించటం మొదలైన కోరికలతో శిల్ప పరిపూరితమైన ప్రయోజనాత్మక సాహిత్య సృష్టి చేశారు. ఈ దృష్టితో బహుముఖీన ప్రయోజనాత్మక సాహిత్య సృష్టి చేసిన రచయిత ధార్మిక జీవితాన్ని గడుపుతూ వీరనుసరించిన దృష్టితో మరొకరు కనిపించరు. సమకాలిక రచయితలలో ఉత్తమ శక్తిమంతులైన ఉత్తమ కథకులలో అతి విశిష్టులు.

# భారతీయ సంస్కృతిలో ఇస్లాం ప్రభావము
## (1206-1526)

జన్మరాహిత్యం కలిగేటంతవరకూ మానవుడు 'పునరపి జననం పునరపి మరణం' సంసార యాత్ర సాగిస్తాడనీ, అనంతసాధన మూలంగా జన్మవిమోచనం పొందుతాడనీ భారతీయుల నమ్మకం. తరణోపాయాల్ని తెలుసుకోలేకుండా తబ్బిబ్బులు పడి మానవ లోకాన్ని ఉద్ధరించడానికిగాను, ధర్మసంస్థాపనార్థమూ, పురుషోత్తముడు అవతరిస్తూ ఉంటాడు. పూర్వజన్మంలో చేసిన దానికీ, ఈ జన్మలో చేస్తున్న దానికీ జీవుడు ప్రతిఫలాన్ని పొందవలసిందే. ఇటువంటివన్నీ మన భారతీయుల శాస్త్రవాదాలు, సామాన్యుల నమ్మకాలూ. మత విషయకమైన కర్మకాండలకు, ఆచార వ్యవహారాలకూ, సంస్కృతికీ, భాషావిషయిక విజ్ఞానానికీ భారతీయులది ఒక ప్రత్యేకమార్గము. సమస్త విషయాలకూ వారికి గర్వకారణమైన స్థితి ఉండనే ఉన్నది.

ఇస్లాం అరేబియా ఎడారుల్లో పుట్టింది. ఈజిప్టు, అబిసేనియా, మొరాకో, స్పెయిన్ ఫ్రాన్సుల్లో కొంత భాగమూ వ్యాపించింది. బైజయింటైను సామ్రాజ్యంలో తన ప్రభ వెలిగించుకున్నది. ఆసియా మైనరు టర్కీ, రష్యా, చైనాలలో నివాసం చేస్తూ ఉన్నది. పర్షియా, ఆఫ్ఘనిస్తాన్, హిందూస్థానాలను తన ప్రభావానికి లోను చేసుకున్నది. మతవిషయకంగా పరిశీలిస్తే ఇస్లాములో మార్పు లేదు. రాజకీయంగానూ, నైతికంగానూ చూస్తే మటుకు దానికి కొంత వృద్ధిక్షయాలు కనిపిస్తూనే ఉన్నవి.

ఇస్లాం ఏ దేశంలో ప్రవేశించినా ఆయా దేశాలు వాతావరణానికి అనుగుణంగా ఆచార వ్యవహారాల్లోనూ, అనుభవాలలోనూ మార్పును పొందింది.

భారతదేశాన్ని దండెత్తి జయించిన ఇస్లాం మతస్థులు టర్కులు, ఆఫ్ఘనులు. రెండు జాతులవారు ఇస్లాం మతాన్ని పుచ్చుకున్నవారు గాని అరబీయులు కారు. అరబ్బులు కూడా మన దేశాన్ని జయించను యత్నించారు. కాని వారి పాలన 40 సంవత్సరాలకు మించలేదు.

విభేదులైన ఈ టర్కులకూ, ఆఫ్ఘన్‌లూ విశేషమైన సంస్కృతిగాని, రూఢమైన మతాచార వ్యవహారాలు కలవారుగాని కారు. ఆఫ్ఘనిస్తాన్ వారి జన్మదేశం. మధ్యాసియాను వదిలి దండయాత్రలు చేస్తూ వారు ఆక్రమించుకున్న దేశాల్లో వారికి పూర్వంలో ఉన్న మతాలను స్వీకరించి, ఆ ఆచార వ్యవహారాలతో కాలం వెళ్ళబుచ్చు కుంటూ వచ్చారు. అందువల్లనే రష్యా, జార్జియాల మీద దండెత్తిన టర్కులు – కొందరు కొనక్కులు, కొందరు క్రైస్తవులుగా మారిపోయినారు. చైనాలో వారు బౌద్ధమతాన్ని స్వీకరించినారు. అరేబియాలో ముసల్మానులైనారు.

భారతదేశానికి రాకముందే ఈ ఆఫ్ఘన్ – టర్కులకు, ఇస్లాంతో సంబంధం కలిగింది. వారు ఇస్లామును స్వీకరించారు. అలా జరగకపోయి ఉంటే భారతదేశానికి వచ్చి నివాస మేర్పరచుకున్న శకులు, సిథియనులు, హూణులు, బాక్ట్రియా యవనులవలె హిందూమతాన్ని స్వీకరించి ఉండేవారు.

టర్కులు, ఆఫ్ఘన్‌లు మన దేశాన్ని జయించారన్న మాటేగాని వారికి సాంస్కృతికమైన విజయం కలగలేదు. వారి సంస్కారం కంటే ప్రశస్తమైన మరో సంస్కారము, అతి పురాతన కాలం నుంచీ భారతదేశంలో సజీవంగా ఉంటూ వస్తూ ఉన్నది. ఇస్లాం ప్రభావం వల్ల ప్రధానమైన మత సాంఘిక నైతిక విషయాల్లో ఎటువంటి మార్పులూ కలగలేదు.

సెమెటిక్ జాతికి చెందిన అరబ్బులుగానీ, ఆర్యజాతికి చెందిన పర్షియనులుగానీ భారతదేశాన్ని జయించి ఉన్నట్లయితే, భారతదేశంలోని ఇస్లాం చరిత్ర మరొక విధంగా ఉండేది.

టర్కులు, ఆఫ్ఘన్‌లు మధ్య ఆసియాలో బయలుదేరి జగద్విజయం చేసుకుంటూ వస్తున్నారు. ముందు వారికి ఇస్లాంతో సంపర్కం కలిగింది. వారు దాన్ని స్వీకరించారు. మహమ్మదీయుల మీద దండయాత్రలు చేయటానికి బయలుదేరారు. వారు చెప్పినవే మతసంప్రదాయాలని అంగీకరిస్తూ వచ్చారు. ఇస్లాం మతాన్ని నమ్మని వారిమీద యుద్ధం చేస్తూ, ఒక ముసల్మాను మృతి నొందితే అతన్ని 'షాహిద్' (దేహత్యాగి) అనేవారు. ఒక ముస్లిమేతరుణ్ణి చంపితే 'ఘాజీ' అవుతాడు. షాహిద్‌కైనా, ఘాజీకైనా స్వర్గం తప్పదు. పశుబలంతో మానవులను చెల్లాచెదరుచేస్తూ రక్తదాహం తీర్చుకుంటున్నా అతడు ఘాజీ షాహిద్ పదవిని పొందుతున్నాడు. ఏ విధంగా విజేతల మూలంగా క్రైస్తవ మత మూల ధర్మాలలో మార్పు కలిగిందో, అదేరీతిగా ఆఫ్ఘన్ టర్కుల మూలంగా ఇస్లాం మతంలో అనేకమైన మార్పులు సంభవించినవి. ఖ్యాతినార్జించటమూ, రణ కండూతి తీర్చుకోటమూ, దేశసంపాదనా – ఇవి మూడూ

వారి దండయాత్రకు మూల కారణాలు. ఎప్పుడైతే మత ప్రవక్తలు వీరు చేసే దండయాత్రలకు మతవిషయికంగా ముద్రవేసి మారణకర్మలను అంగీకరించటము మొదలుపెట్టారో, ఆ నాటినుంచీ ప్రతి దండయాత్రకూ ప్రతి మారణకర్మకూ టర్కులూ, ఆఫ్ఘనులూ 'జిహాద్' (మతయుద్ధం) అని పేరు పెట్టి ప్రారంభించారు. అన్ని జాతులూ అన్ని దేశాలలోనూ ఆక్రమించడం ఆరంభించారు. మహమ్మదు ఘనీ చరిత్రకారుడు, ఘజనీ గురించి చరిత్రలో ఇలా రాశాడు: అతడు విగ్రహాలను ఛిన్నాభిన్నం చేశాడు. దేవాలయాలను నేలమట్టం చేసి వాటిలో ఇస్లాం మతాన్ని స్థాపించాడు. ఇంటికి తిరిగి వచ్చి ఇస్లాం పేరిట తాను జరిపిన అఖండ విజయాలను లెక్కబెట్టాడు. హిందూదేశము మీద ఎల్లప్పుడూ ఇదేరీతిగా మతయుద్ధాలు సాగిస్తానని ప్రతిన పుచ్చుకున్నాడు.

అయితే హిందూ దేశ చరిత్ర చదివిన ప్రతివారికీ ఘజనీ మహమ్మదు దండయాత్రలు దేశాన్ని కొల్లగొట్టడానికి ఉద్దేశించబడ్డవి కాని ఇస్లాం మతవ్యాపకానికి కాదని తెల్లమౌతవి. మతోద్రేకంతో ఎటువంటి యుద్ధాలకైనా సైన్యాన్ని పురికొల్పవచ్చునని అతనికి బాగా తెలుసును. కొల్లగొట్టడానికి తోడు మతోద్రేకం సాయం చేసింది. ఫలితాలు అనంతంగా చేకూరినవి. తైమూరు వంటి దండయాత్రికుడు కూడా అటువంటి ఆశయముతోనే హిందూదేశం మీదికి వచ్చినట్లుగా స్వీయచరిత్రలో ఇలా వ్రాసుకున్నాడు.

"దేవాలయాలను నాశనం చేసి ఘాజీలమూ, ముజాహిద్దులము (మత సంస్కర్తలము) కావటానికి నేను హిందూ దేశ దండయాత్రలు తలపెట్టాను." అయితే జార్జియా తప్ప మిగిలిన అనేక ముసల్మాను రాజ్యాల మీద కూడా తైమూరు దండయాత్రలు చేశాడు. ముసల్మాను విజ్ఞానానికి అపకీర్తి తీసుకోవటానికో అన్నట్లు, 2000 మంది షేకులను సజీవంగా భూస్థాపితం చేసి వారిమీద సున్నపురాయితో కట్టడం కట్టించాడు. ఖలీఫాను తుత్తునియలు చేశాడు. బాగ్దాదునుంచి సమర్ఖండ్ దారుల్ ఖిలాఫత్‌ను మార్చాడు. బాహుబలంతో తాను 'ఖలీఫా'నని ప్రకటించాడు. అయినా తైమూరు ఇస్లాం మతస్థుడే. ఇదేవిధంగా ఆఫ్ఘన్‌లు, తుర్కులు కూడాను. మహమ్మదు ప్రవక్త అనుయాయులము అని వారు చెప్పుతున్నా, వారి చేష్టలకూ ప్రవక్త చేష్టలకూ హస్తిమశకాంతరము.

ప్రవక్త ఇస్లాం మతేతరులను ఉద్దేశించి "నీవు ప్రార్థించిన విధంగా నేను ప్రార్థించను. నేను పూజించినట్లు నీవు పూజించవు. నీ మతం నీది, నా మతం నాది" అన్నాడు. అంతేకాదు, "మత విషయకంగా ఎవరినీ పీడించవద్దు. లోకంలో పుట్టిన ప్రతివాళ్ళకూ ఏదో ఒక నమ్మకం ఉంటుంది" అన్నాడు.

ఖలీఫా సైనికులు జయించిన అబూ ఖుభార్, బోడోమను, క్రిస్టియన్, జూజాతులకు మతస్వాతంత్ర్యము ఉండనే ఉన్నది. కాని టర్కులు ఇటువంటి మార్గాన్ని అవలంబించలేదు. జయించిన దేశాల్లోని ప్రజలను బలవంతపెట్టి తమ మతం ఇచ్చారు. దానికి అంగీకరించని వారిని మృత్యువుకు బలి ఇచ్చారు.

భారతదేశంలో ఇస్లాం మతవ్యాప్తికి అనేకమంది ఫకీరులు పాటుపడ్డారు. సూఫీలు, ఫకీరులు మత ప్రబోధం చేసే మార్గంలో సర్వమత సామాన్య ధర్మాలు నిబద్ధమై ఉండటం చేత ఆ మతానికి ఏ హిందువులూ వ్యతిరేక ప్రచారం పాటించలేదు. దర్గాలలో ముసల్మానులూ, హిందువులూ కలిసి ఫకీరుల పలుకులు వింటూ వచ్చారు. క్రీ.శ. 750లో మలబారు దేశాన సంత్ మాలిక్ దివాన్ ఇటువంటి ప్రచారం ప్రారంభించాడు. ఇతరులు అనుసరించారు. అజ్మీర్, ఢిల్లీ, పాక్ పటాన్, పానిపట్, కచ్, గుల్బర్గా, షిలట్ మొదలైన ప్రదేశాల్లో ఇతని మార్గాన్ని అనుసరించి ప్రచారం సాగింది. షియోసన్ సంత్‌లు ఇస్లాం మతప్రచారానికి హిందూమత పారిభాషిక పదాలను ఉపయోగించారు. 'మైనుద్దీన్ చిష్టి' కాలం నాటికి ఇస్లాం ప్రచారం బహుళంగా ఉన్నది. అజ్మీర్ దగ్గిర ఉన్న పుష్కరంలో అతను ప్రచారార్థం నివాస మేర్పరుచుకున్నాడు. ఇతనికి హిందువులు అనుయాయులు. ఈ నాటికీ అజ్మీర్ దగ్గర కొందరు హుస్సైనీలు (బ్రాహ్మణులు) కనిపిస్తూ ఉంటారు. వారికి తాము అటువంటి వారని చెప్పుకోవడం చాలా గర్వకారణము. తాము ఆదర్శవాదులు అని వారు చెప్పుకుంటారు. రంజాను పండుగలో పాల్గొంటారు. మగవాళ్ళు ముసల్మాను దుస్తులు వేసుకుంటారు. స్త్రీలు ముఖాన కుంకుమ బొట్టు పెట్టుకుంటారు. చనిపోయినవారికి దహనసంస్కారం చేస్తారు. 'సుంతీ' ఆచారాన్ని ముసల్మాను మార్గాన్నే అవలంబిస్తారు. ఫకీరులు ఇస్లాం మతం ఇప్పించిన గుజరాత్‌లోని కాకాలు నేటికీ హిందువుల పేర్లే ఉంచుతున్నారు. షామీలు, ఇస్లామీలు భోజా సంఘానికి చెందిన హిందువులు. విగ్రహారాధనను అంగీకరించకుండా, గీతాపారాయణం చేసే షాహ్షుదీన్ టిబెర్‌జి తమ మూలపురుషుడని వారు చెప్పుకుంటారు. ఈ వంశస్థులు ఆగాఖాన్‌ను త్రిమూర్తుల అంశవల్ల జన్మించిన అవతారమూర్తి అని నమ్ముతారు.

పదిహేనవ శతాబ్దం నాటికి ముసల్మాన్ సంత్‌లు, ఫకీరులు తరువాతి కాలంలో హిందూ – ముస్లిమ్ మతసామరస్యానికి ప్రచారం చేసిన నింబార్క, నామదేవ్, రామానంద, కబీర్, నానక్, చైతన్య, కాశ్మీర దేశస్త్రీ ప్రవక్త లీలావ్యాకరణ వంటివారు జన్మించటానికి తగిన అవకాశాన్ని కల్పించి పరిస్థితులు సుగమం చేశారు. మత

సామరస్యాన్ని భారతదేశంలో ప్రచారం చేయ మొదలుపెట్టినవారు నామదేవ్. విగ్రహారాధన ఇతనికి గిట్టదు. కల్పసమస్తానికీ స్వస్తి చెప్పాడు. ఏకేశ్వరోపాసకుడు, రామానందుడు కులతత్త్వాలను రూపు మాపడానికి ప్రచారం సాగించాడు. కబీరు తరా, ఉపవా, మూలాతిలకాదులను తూర్పార బట్టాడు. తన కూతురు కమలిని ఒక బ్రాహ్మణుడికిచ్చి వివాహం చేశాడు. అతని శిష్యుడు రవిదాసు చమరుడు. మేవారు రాజకుమార్తె ఝూలీకి మతగురువైనాడు. గోరఖ్‌పురంలో అతని సమాధి వద్ద నేడు హిందువులు, ముసల్మానులు ఏకంగా ప్రార్థిస్తారు. హిందువులలో అనేకులు నేటికీ కబీర్ పంథీయులమని చెప్పుకుంటూ ఉన్నారు. సంత్ సయ్యద్ హసన్ వద్ద ఉపదేశాన్ని పొందిన తరువాత మక్కా వెళ్ళి తన భావాలు ప్రచారం చేశాడు. అతని బోధామృతము అరబ్బీ భాషలోకి పరివర్తితమైంది. నానక్ మహాశయుని దర్గాలో చాలా కాలం నివాసం చేశాడు. నానక్ మహాశయుడు సిద్ధి పొందినప్పుడు దేహాన్ని మాదని ముసల్మానులూ, మాదని హిందువులూ తగవులాడుకున్నారు. చైతన్యుడు ముసల్మానులను కూడా శిష్యపరంపరలో చేర్చుకున్నాడు. యవన హరిదాసు వారిలో ప్రముఖుడు. సనాతన రూప్ అనే అతని శిష్యుల మతసహనాన్ని జూచి సహించలేక, సనాతనులు వారిని పంక్తిబాహ్యులను చేసి వేశారు. అస్సాంలో కాయక్త శంకర దేవు 'మహా పురుషీయులు' అనే మరొక మతసంప్రదాయానికి మూల పురుషుడైనాడు. అతడు అనేకమంది ముసల్మాను శిష్యులనూ అంగీకరించాడు. బ్రాహ్మణగురువులు ఆయన్ని అంగీకరించలేదు. వంగ దేశంలోని సనాతన గోస్వామి దర్వేషీయులు అనే మరో సంప్రదాయానికి చెందినవాడు. అతని అనుయాయులు అల్ ఖల్లా అల్ అనే ముసల్మాను ఫకీరుల దుస్తులను ధరించేవారు. జపమాలను ఉపయోగించేవారు. హిందువులలోని సైనీయులు బహుచిత్రమైన వారు. గోమాంసాన్ని భక్షిస్తారు. మక్కానుంచి వచ్చే ఖాఖ్యఫార్ అనే జపమాలను ఉపయోగించేవారు. వాళ్ళ ప్రధాన సూత్రము 'పీర్ సత్ హై' (గురువు సత్యము) అనేది.

ఈ సంప్రదాయాలను ప్రవక్తలందరూ విశేషంగా బ్రాహ్మణేతరులు, ముసల్మానులు, ఇస్లాం మతప్రచారం ప్రారంభించిన తరువాత, హిందూమతం గురుపీఠం కేవలం బ్రాహ్మణకులాన్నే పట్టుకొని నిలిచిపోలేదు. యజ్ఞ యాగాది క్రతువులూ, తత్ఫలితాలు – సశరీర స్వర్గాలూ జనసామాన్యుల మనస్సును ఆకర్షించలేకపోయి ఉండవచ్చు. హిందూ వేదాంత, ఉపన్యాసాలు ప్రజాహృదయాలకి హత్తుకోవటం మానివేసినవి.

***(అముద్రితం)***

# ఆంధ్రభారత రచనోద్దేశ్యము

రాజరాజనరేంద్రునిచే భారతము మత ప్రచారార్థము పుట్టింపబడినదనియు, సారస్వత పోషణార్థము పుట్టింపబడినదనియు వాదించే ఇరువాగుల వారికిని భిన్నమగు, 'భారత రచనము వంశచరిత్ర రచన' ముగా నుద్దేశింపబడినదను నా యభిప్రాయము వెగటుగ తోపక మానదు. కాని నా వ్యాసోద్దేశమును చదువరులు సహృదయముతో గమనింతురుగాక యని ప్రార్థించుచున్నాను.

శ్రీయుత గొడవర్తి సూర్యనారాయణమూర్తిగారు 'వీణ' నవంబరు – డిశంబరు సంచికలలో భారత రచనము మతప్రచారార్థము జరిగినది కాదని నిరూపించి, వాఙ్మయ పోషణార్థ ముద్దేశింపబడినదని తేల్చియున్నారు. మతప్రచారార్థము కాదన్నమాట సత్యము. అందులకు వారా కాలమునాటి మతపరిస్థితుల విపులముగా చర్చించి, భారతరచనము వలన జరుగవలసిన మతప్రచారమేమియు లేదని చూపియున్నారు. భారతరచనము 'వాఙ్మయపోషణార్థమే' జరిగినదని వారు తీర్మానించిన వాదమును అంత సహేతుకముగ కన్పట్టదు.

రాజరాజు లోకమునం దాదికావ్యమగు రామాయణ మాంధ్రీకరింపజేయక, భారత మాంధ్రీకరింప జేయుటలో నీతని యుద్దేశ్యము సారస్వత పోషణము గాక అన్యమని స్పష్టమగుచున్నది. అదియే తన వంశచరిత్ర రచనోద్దేశ్యము. రాజరాజు విద్యావిలాస గోష్ఠిలో నుండి నన్నయ భట్టారకుని చూచి తాననేక కావ్యములను, ఈశ్వరాగమములను పరికించితిననియు, కాని 'అనవరతంబును శ్రీమహాభారతంబు విన నభిలాష పెద్దయైయుండు' ననియు చెప్పియున్నాడు. అట్టి అభిలాషకు కారణముగా భారతము తన వంశచరిత్రయని తలపోయుచు రాజరాజు :

చ. "హిమకరు దొట్టిపూరు భరతేశ కురుప్రభు పాండు భూపతుల్
క్రమమున వంశకర్తలనఁగా మహినొప్పిన యస్మదీయ వం
శమునఁ బ్రసిద్ధులై విమల సద్గుణ శోభితులైన పాండవో
త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్టమెంతయున్."

అని వచించియున్నాడు. తన వంశకర్తలలో నొకడుగ వ్యాసరచిత భారతామ్నాయమునే నన్నయభట్టారకు నాంధ్రీకరింప వలసిందిగా కోరియున్నాడు.

వ్యాసరచిత భారతము నాంధ్రీకరింపు మనుటలో రాజరాజు కన్నడ వాఙ్మయమునందలి పంప రన్నల భారతముల చూచినాడనవలయును. క్రీ.శ. 940 ప్రాంతమున పంపకవి తన ప్రభువగు 'అరికేసరి'ని అర్జునునితో పోల్చి, అర్జునునకు ప్రాధాన్యమిచ్చి, 'విక్రమార్జున విజయ'మను పేర భారత కథను క్రోడీకరించి వ్రాసియున్నాడు. క్రీ.శ. 11వ శతాబ్దిని రన్న కవి పశ్చిమచాళుక్య ప్రభువగు సత్యాశ్రయుని నాయకునిగా నుద్దేశించి భీమునకు ప్రాధాన్యమిచ్చి, 'సాహస భీమ విజయము' ను వ్రాసి యున్నాడు. కృతిభర్త కృతికర్తలు జైనులైనను, కథావస్తువు మాత్రము చాళుక్యవంశ చరిత్రయగు భారతమే. కన్నడ వాఙ్మయము నందలి భారతములలో 'ఆది వంశావతార సంభవము' విపులముగా నుండక పోవుట వలన వ్యాస భారతము నాంధ్రీకరింప వలసినదని రాజరాజు కోరియుండును.

రాజరాజునకు వంశచరిత్రయగు భారతశ్రవణాసక్తి హెచ్చు. 'అస్మదీయ వంశమని' సగర్వముగా చెప్పికొని యున్నాడు. బహుభాషల తన వంశచరిత్రను విని యున్నాడు. భారత శ్రవణము వలన 'సువర్ణ శృంగ ఖురమై కపిలంబగు గోశతంబు నుత్తములకు వేద విప్రులకు దానము చేసిన ఫలము, బహు యోగ ఫలము' గలుగునని చెప్పి యున్నాడు. తన పూర్వుల చరిత్రయగు భారతమును కృష్ణద్వైపాయన భారతము నందలి బద్ధ నిరూపితార్థ మేర్పడునట్లుగా తెనుగున రచింప వలయునని నన్నయ భట్టారకుని కోరియున్నాడు. నన్నయ భట్టారకుడు ఆరణ్యపర్వములో కొంత భాగము వరకు తెనిగించి పరలోక గతుడయ్యెను.

రాజరాజ నరేంద్రుడొక భారత మాంధ్రమున వ్రాసెనని, విజయాదిత్యుని శ్రీకూర్మక్షేత్ర శాసనమునందలి క్రింది శ్లోకము వలన తెలియుచున్నది.

'శ్రీ రాజరాజ నృపతి స్సువిశాల
కీర్తిః యస్యూరిభి స్సహఖిలస్మృ
తిజాలసార మంధ్రీచకార వర భా
రతవంశ వృత్తమ్' (Ep. Ind Vol V pp 32)

ఈతడు తన వంశచరిత్ర నాంధ్రీకరించి వంశగౌరవమును చాటుకొని యున్నాడు. ఈతని భారతము చోళచాళుక్య యుగముననో, వేంగి చాళుక్య రాజ్యపతన కాలముననో అంతరించి యుండును.

కాబట్టి రాజరాజునకు భారతమన్న తన వంశచరిత్రమన్న దృష్టియే గాని, మత వ్యాప్తికిని, సారస్వత పోషణమునకును తగిన యుపకరణమను దృష్టి లేదని తెలియుచున్నది. అట్టి రాజరాజు తన వంశచరిత్రకు వన్నెచిన్నెలు దిద్దగల మహాకవిని, అవిరళ జపహోమతత్పరుడును, సంహితాభ్యాసుడును, బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుడగు నన్నపార్యునియందు కన్గొనగల్గెను. నన్నయభట్టారకుడు భారత మాంధ్రీకరించుటకు రాజరాజే ముఖ్యకారణము గాని, యాతనికి భారతము తక్క మిగిలిన గ్రంథములు అర్జునునకు గాండీవము తక్క తదితరములగు విండ్లు నచ్చునట్లు నచ్చక పోవుట కాదు.

చంద్రవంశజులగు చాళుక్యులందరికిని తమ శాసనము లందైనను చంద్రుడు మొదలు పులకేశి వరకు తమ వంశచరిత్ర వ్రాయించుట అలవాటు. (Ref-Tel-Aca-Journal Vol 24 Pt 1 C.P. No. 8 of 1924-25) శాసనమునందు వచ్చు పూర్వుల చరిత్ర అంతయు పంప, రన్నల భారతములలో వలె గాక నన్నయభట్టారకుని భారతమున విరివిగా వర్ణింపబడియున్నది.

పశ్చిమ చాళుక్యులకును, పూర్వ చాళుక్యులకును తమ వంశచరిత్రమగు భారతమన్న గౌరవము మెండుగా నుండెడిది. పశ్చిమ చాళుక్యులు గ్రంథముల ద్వారా మతమును వ్యాప్తిలోనికి గొనిరాదలచినచో 'జైనతీర్థంకర' చరిత్రలను, పూర్వచాళుక్యులు మతమును వ్యాప్తిలోనికి గొనిరాదలచినచో 'శివపురాణము' లను, అంకితము గొని యుండెడివారు గాని, భారతము కన్నడమునకు నాంధ్రమునకు గొనివచ్చి యుండెడివారు కారు.

వంశచరిత్ర రచనమే పరమార్థముగా గలిగి సారస్వతమునకు చేయూతనిచ్చిన ఆ కాలపు కావ్యప్రవృత్తి నించుక తడువవలసి యున్నది. చాళుక్యులు తమ వంశ చరిత్రయగు భారతమును వ్రాయించియు, వ్రాసియు తమ వంశగౌరవమును చాటుకొనిరి. చాళుక్యుల అనంతర మాంధ్ర దేశమున సూర్యవంశజులగు కాకతీయులు సామ్రాజ్యాధిపత్యము వహించిరి. వీరి కాలమున సూర్యవంశ చరిత్రయగు రామాయణము వివిధముఖముల దాల్చినది. తిక్కన సోమయాజిచే సూర్యవంశజుడగు మనుమసిద్ధి నృపాలుడు నిర్వచనోత్తర రామాయణమును కృతిబొందెను. సూర్యవంశజులగు కాకతీయుల కాలమున రచింపబడిన సూర్యవంశ చరిత్రలగు రామాయణములు – భాస్కర రామాయణము, రంగనాథ రామాయణము, శాకవెల్లి మల్లికార్జున భట్టు రామాయణము, వాసిష్ఠ రామాయణము. ఇట్లీ కాలమున

చంద్రవంశజుల పరిపాలనమున చంద్రవంశ చరిత్రయగు భారతమును, సూర్యవంశజుల పాలనమున సూర్యవంశ చరిత్రయగు రామాయణమును ఆంధ్రీకరణములయ్యెను. ఇది ఆ కాలపు సారస్వత చిత్తప్రవృత్తి.

కావున ఆంధ్రసారస్వత ప్రథమావస్థలో రాజన్యుల వంశచరిత్ర రచనములే సాహిత్యలోకము నాకర్షించినవనవచ్చును. దానికి రాజన్యులే కారకులు. భారత రచనము వలన మతాభివృద్ధియు, భాషాపోషణమును, అవాంతరఫలములు. ముఖ్యోద్దేశ్యము వంశచరిత్ర రచనమే.

# శ్రీమదాంధ్ర మహాభారతము-శ్రీకృష్ణుని రాయబారము

**కవి కాలాదికము**

**సంస్కృత భారతము - వ్యాసమహర్షి**

వేదసాహిత్యము మహారణ్యమువలె వృద్ధినొందగా దానినంతటిని క్రమరీతిని విభజించి సత్యవతీపుత్రుఁడైన కృష్ణద్వైపాయనుఁడు వేదవ్యాసనామము వహించెను. అటుపిమ్మట నా మహర్షి అష్టాదశ పురాణములను జెప్పి యంతటితోఁ దృప్తినొందక చతుర్వేద సారమును, 'పంచమవేద'మని ఖ్యాతి వహించిన మహా గ్రంథమునునైన 'భారత సంహిత'ను రచించెను. ఈ భారతము ప్రాచీన భారతీయ విజ్ఞానము సంస్కృతుల (An encyclopedia of Indian wisdom & culture) కొక సర్వస్వమని చెప్పఁదగిన గ్రంథము.

ఇది పాండవుల సత్యశీలమును, ధార్తరాష్ట్రుల దుర్వృత్తిని, శ్రీకృష్ణమాహాత్మ్యమును వెల్లడించుచున్నది. ఇది పూర్వరాజన్యచరిత్రమును జెప్పుటచే నితిహాసము. 'బహుశా ప్రపంచమందలి తొలి చరిత్రకారుఁడు వ్యాస భగవానుడే' (శ్రీ కె.యమ్. మున్షీ).

వ్యాసమహర్షి ఈ యితిహాసమును కావ్యగౌరవమొప్పగా రచించినాఁడు. ప్రాచీనులే గాక యాధునికులును వ్యాస భారతమును మహా గౌరవముతో బఠించుచున్నారు.

వ్యాసమహాభారతమును గురించి యొక ప్రముఖ నాయకుఁడు, సాహితీవేత్త ఇట్లు చెప్పుచున్నాఁడు.

"Mahabharata is a noble poem possessing in a supreme degree the characteristics of a true epic, great and fateful movement, heroic characters and stately diction. (It) discloses a rich civilization and a highly evolved society, which, though of an older world, strangely resembles the India of our own time with the same values and ideas. The Mahabharata has moulded the character and civilization of one of the most numerous of the world's people."

- C. Rajagopalachari

శ్రీ రాజగోపాలాచారి చెప్పినట్లుగా నీ మహాభారతము నేటికిని భారతీయులపై విశేష ప్రభావము కల్గియున్నదనుట యెంతయు సత్యము.

## భారతము - నామము

భారతమునకు ఆ నామమెట్లు కలిగిందను విషయమున భిన్నాభిప్రాయము లున్నవి. శకుంతలాదుష్యంతుల పుత్రుఁడైన భరతుని వంశమందుఁ బుట్టిన రాజుల చరిత్రమును జెప్పునది కావున భారతమైనదని కొందరు, వేదశాస్త్రముల భారమును విస్తరింపజేయునది గావున భారతమైనదని కొందరు, వానికంటె నతిశయమైన మహత్త్వభారమును గల్గియున్నది గావున భారతమని కొందరు, భరతుఁడను నొక మహర్షి వలనఁ బ్రతిపాదితములైన ధర్మములను బోధించుచున్నది గావున భారతమైనదని కొందరు, ఇట్లే ఇంకను మఱికొందరు కొన్ని యూహలను చేసియున్నారు.

## పరిమితి - ప్రశస్తి

వ్యాసమహర్షి ప్రణీతమైన మహాభారతము నేఁడు లక్ష శ్లోకములు గల మహాగ్రంథమై యొప్పుచున్నది. వీనిలో తొలుత వ్యాసుఁడు ఇరువది నాలుగువేల శ్లోకములను మాత్రమే చెప్పినాఁడనియును, నది జయమను నామముతో నొప్పు గ్రంథమనియును, దానికి వైశంపాయనుఁడు, ఉగ్రశ్రవసుఁడను సూతుఁడు కాలక్రమమున ధర్మవివరణకై చేర్చిన శ్లోకములతో లక్ష శ్లోకముల గ్రంథజాలముగాఁ బరిణమించినదనియు నాధునిక విమర్శకుల యభిప్రాయము. ఇది కేవలము కురుపాండవ కథయే యైనచో లోకమున మహాభారతమున కంతటి కీర్తి లభించియుండెడిది కాదు. ఇది ధర్మశాస్త్ర, వేదాంతశాస్త్ర, నీతిశాస్త్రములతో నిండి వేదపఠనాధికారము లేనివారికి శ్రవణమునకు, పఠనమునకు ననుకూలమైన గ్రంథమై యుండుటవలననే దీనికింతటి ప్రశస్తి కలిగినది.

'భారతము వర్ణాశ్రమాచారములను ఉపదేశించుటలో పరమ గురువు. భారతమున లేనిది ఎచ్చటను లేదు. ఇది సకల ప్రపంచ మావరించినది' (శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రి). యుగయుగములనుండి ఈ యుద్ధగ్రంథము తనయందలి వీర పురుషవిఖ్యాత చరిత్రలతో భారతీయుల శీలసంస్కృతులను తీర్చిదిద్దుచు విశేష గౌరవమును బొందుచున్నది. మన పూర్వుల కీ వ్యాసభగవానుని భారతముపై నెట్టి గౌరవభావ మున్నదియును నన్నయభట్టారకుఁడు భారతావతారికయందుఁ జెప్పిన క్రింది పద్యమువలన వ్యక్తమగుచున్నది.

సీ. “ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని,
యధ్యాత్మ విదులు వేదాంతమనియు,
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవి వృషభులు మహాకావ్యమనియు,
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసకు లితిహాసమనియుఁ
బరమ పౌరాణికుల్ బహుపురాణసముచ్ఛ
యంబని మహిఁ గొనియాడుచుండ

ఆ. వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతంబు.”

ఆ మహాకవియే ‘భారత భారతీ సముద్రము దరియంగ నీదుటకు’ విధాతృనకైనను నేర్పు చాలదని చెప్పినాఁడు.

## భారతము – పురాణము, ఇతిహాసము, వేదము, జయము

కౌరవ పాండవ వంశచరిత్రనాధారముగా గ్రహించి వ్యాసమహర్షి యిందనేక రాజవంశముల చరిత్రలను సంగ్రహించుటవలన భారత మితిహాసము. పురాణ లక్షణములగు సృష్టి, ప్రతిసృష్టి, రాజవంశచరిత్ర, మనువుల కాలములలో జరిగిన విశేషములు, రాజవంశముల యవాంతర శాఖలను దెల్పుటయనెడి పంచలక్షణములతో నొప్పుచుండుటచే నీ భారతము పురాణము వేదార్థములను బోధించునది, వేదనామమును ధరించునది యగుటచే భారతము ‘సంహిత’. లోకాగమన్యాయైకాంత గృహమును నానా వేద వేదాంతయుక్తమును నగుటచే పంచమ వేదము. ధర్మార్థ కామ మోక్షము లనెడి చతుర్విధ పురుషార్థములను సాధించునది యగుటచే జయము.

## భాగములు: భాగనామములు

లక్ష శ్లోక పరిమితి గల యీ మహాగ్రంథరాజము ‘పర్వము’ లనెడి భాగనామములతో నొప్పుచున్నది. ఒక పర్వముకంటె నొక పర్వమున రసాధిక్యమగుటచే నీ భారతాంతర్గతములైన భాగములకు ‘పర్వములు’ (కణుపులు) అను నామము కలిగినది.

భారతము నందలి ప్రధాన పర్వములు 18. అవి : ఆది, సభా, ఆరణ్య, విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ, శాంతి, ఆనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థాన, స్వర్గారోహణములు. ఇందలి మొదటి యైదింటికిని 'నాది పంచక' మనియు, తఱువాతి ఐదింటికి 'యుద్ధ పంచక'మనియు, తఱువాతి మూడింటికి 'శాంతిత్రయ' మనియు, తుదినున్న యైదింటికి 'అంత్య పంచక' మనియు వ్యవహారనామములు.

## వస్తువు, నాయకుఁడు, రసము

కురుపాంచాల దేశములకు రాజకీయమైన సహజ వైరము అంతరంగములో నంకురించినది. అది ద్రుపదునిచే తిరస్కృతుఁడైన ద్రోణుఁడు ద్రుపదుని పట్టి కట్టి తెండని శిష్యులను బంపుటతో రేగినది. అది తఱువాత గౌరవ పాండవుల యంతఃకలహమునఁ బుట్టిన మహాసంగ్రామములో లీనమైనది. తుదకు ఇటు కౌరవులు నటు పాంచాలురు నశించిరి. పంచపాండవులు మిగిలిరి. పరీక్షిత్తుతో నర్జునవంశము భూమిపై నిల్చినది. ఇది మహాభారత కథాసారము. ఈ మహాభారత కథకు అంగిరసము (ప్రధాన రసము) శాంతము. నాయకుఁడు శ్రీకృష్ణ పరమాత్మ. నాయకుఁడైన లీలామానుష విగ్రహుఁడగు నీ కృష్ణభగవానుఁడు యుద్ధభూమియుందు అర్జునుని మానవునకు ప్రతీకనుగా (Symbol) గ్రహించి దివ్యజ్ఞానోపదేశ మొనర్చినాఁడు. ఇదియే లోకోత్తరమైన మహాగ్రంథముగా ప్రాచ్యపాశ్చాత్యులచే గొనియాడఁబడుచున్న భగవద్గీత.

## పాఠ సంప్రదాయములు

వ్యాసభగవానుని భారతము ప్రచారములోనికి వచ్చుటలో ననేకరీతులైన పరిణామములను బొందినది. అందుమూలముగా గ్రంథమునకు ఉత్తర దక్షిణదేశ సంప్రదాయములను రెండు విభేదములేర్పడినవి. శ్లోక సంఖ్య విషయమునను, నుపాఖ్యానముల విషయమునను నీ రెండు సంప్రదాయములకును మిక్కిలి విభేదమున్నది. మహాభారతము నాంధ్రీకరించిన కవిత్రయము వారు దక్షిణపాఠము ననుసరించిరి (శ్రీ కోరాడ రామకృష్ణయ్య).

## భారతాంధ్రీకరణము : కవిత్రయము

దక్షిణ భారతదేశమున తొలుత పశ్చిమ చాళుక్యరాజుల పరిపాలనకాలము నందు కన్నడభాషలో 'పంపఁడు' గదాయుద్ధమను పేర మహాభారత కథను జెప్పినాఁడు. అది శ్రీకృష్ణ నాయకమైన వ్యాసుని భారతకథ కాదు.

వ్యాసభారత మహత్త్వము దానియందుఁ గన్పట్టదు. కావున క్రీ.శ. 1022 మొదలు 1063 వఱకును వేఁగీమండలములోని రాజమహేంద్రవరము రాజధానిగా ప్రాగాంధ్రదేశమును బాలించిన తూర్పుచాళుక్య చక్రవర్తి రాజరాజనరేంద్రుని యభ్యర్థనమున అతనికి రాజపురోహితుఁడును, ఆస్థాన విద్వత్కవియును, మహాత్ముఁడునైన నన్నయభట్టు వ్యాస భారతాంధ్రీకరణమునకుఁ బూనుకొని పదునెనిమిది పర్వములలో ఆది సభాపర్వములఁ బూర్తిగను, ఆరణ్యపర్వములోఁ గొంతభాగమును ఆంధ్రీకరించి 'గాసట బీసటలు జదివి గాథలు త్రవ్వి' యానందించు నాంధ్రజాతికి సద్గ్రంథ రచనకు మార్గమును జూపినాఁడు.

ఈ నన్నయభట్టు ఆంధ్రభాషకు ప్రథమ ప్రవక్త. శబ్ద శాసన బిరుదాంకితుఁడు. అటుపిమ్మట నూటయేఁబది సంవత్సరములకు నెల్లూరి తెలుఁగు చోళరాజైన మనుమసిద్ధికి హితుఁడును, మంత్రియు, ఆస్థానకవీశ్వరుఁడును, 'ఉభయకవిమిత్ర', 'కవిబ్రహ్మ' బిరుదాంకితుఁడును, కావ్య కళాశిల్పమున నసమానుఁడునునైన తిక్కన సోమయాజి క్రీ.శ. 1260 ప్రాంతమున విరాటపర్వముతో నారంభించి స్వర్గారోహణము వఱకును గల పదునైదు పర్వములను ఆంధ్రీకరించినాఁడు. తఱువాతి కాలమునందలి ఆంధ్రసాహిత్యకు లీతని 'ఆంధ్రవాఙ్మయ స్థితికి మూలమై నిల్చినవానినిగా' భావించిరి. క్రీ.శ. 1300 మొదలు 1360 మధ్యకాలమున అద్దంకి రాజధానిగా ప్రాగాంధ్రదేశమునఁ గొంతభాగమును పాలించిన ప్రోలయ వేమారెడ్డి యాస్థాన కవియును 'శంభుదాస' 'ప్రబంధపరమేశ్వర' బిరుదాంకితుఁడునైన ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషమును నన్నయ రచనగాఁ బూరించినాఁడు.

ఈ రీతిగ వివిధ కాలములలో వ్యాసభారతము నాంధ్రీకరించి ఆంధ్రజాతికిఁ గానుకవెట్టిన నీ కవీశ్వరులు ముప్వురును ఆంధ్ర సారస్వత ప్రపంచమునకు త్రిమూర్తులు. కావున వీరికి కవిత్రయమను నామము సాహిత్యలోకమున రూఢమైనది. "సంస్కృత భారతమొక బంగారు ముద్ద. తెలుఁగు భారత మందులోనుండి కొంత బంగారమును తీసి మంచి పనివానితనముతోఁ దీర్చిన యొక యమూల్యాభరణము" – శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావు.

## భారత కవుల దృక్పథము

నన్నయభట్టు భారతమును వైదికదృష్టితోను, తిక్కన కావ్యకళాదృష్టితోను రచించినారని, శ్రీ కోరాడ రామకృష్ణయ్య వారి 'ఆంధ్రభారత కవితా విమర్శనము' అను గ్రంథమున నొక అభిప్రాయమును వెల్లడించి నిదర్శనములను గొన్నింటిని

జూపిరి. నన్నయ భారతముననున్న వైదిక దృష్టి మిగిలిన యిరువురకును గలదు గావున, వారు చూపిన నిదర్శనములవంటివానిని తిక్కన, ఎఱ్ఱనల కవిత్వభాగముల నుండియు చూపవచ్చును.

ఆంధ్ర శాతవాహన రాజుల కాలమునుండియు నాంధ్రదేశమున నెలకొనియున్న వైదిక మార్గసంపత్తిని సుస్థిరముగ నిల్పి ఇతర దక్షిణ దేశ ప్రాంతములలోవలె బౌద్ధ జైన వీరశైవ వీరవైష్ణవ మతోద్రేక ప్రవాహములలో నది కొట్టుకొనిపోవకుండుటకు కవిత్రయము వారు ముప్వురును వారి వారి కాలములలో శ్రమించి కృతకృత్యులైనారు. ముప్వురును వేదమూర్తులు. వైదికాచారసంపత్తి గలవారు. మీదుమిక్కిలి తిక్కన యజ్ఞకర్త. ఒకవేళ నన్నయ కొన్నిచోట్ల స్వతంత్రించి వైదిక కర్మలను వైదికాచారములను పొగడినను నంతమాత్రమున నన్నయకు కావ్యకళాదృష్టి లోపించినదని చెప్పుట కవకాశము లేదు.

"తన్నుఁగూర్చి నన్నపార్యుఁడే" లోకజ్ఞు నుభయ భాషాకావ్య రచనాభిశోభితు, సత్ప్రతిభాభియోగ్య... మత్యమరాధిపాచార్యు" ఇత్యాదిగాఁ జెప్పుకొనినాఁడు. కవిబ్రహ్మ (తిక్కన సోమయాజి) గూడ నన్నయను 'ఆంధ్రకవిత్వ విశారదుండు, విద్యాదయితుఁడు' అని పొగడినాఁడు. రాజసూయము, ద్రౌపదీవస్త్రాపహరణము, నలచరిత్రము, మున్నగు రమ్యతమ ఘట్టముల నన్నయకన్నఁ దిక్కనయేనియు రచించి యుండునా యని తోచుచున్నది. మొత్తము మీద కవిత్రయము వారి కవితామార్గము ఇంచుమించుగ నొకటియే. కావ్యకళాదృష్టి యందును నన్నయభట్టు తరువాతి యిరువురకును మార్గదర్శి" (శ్రీ గుఱ్ఱం వేంకట సుబ్బరామయ్య).

"సత్యమునకు కవిత్రయము వారు ముప్వురును వైదిక మార్గవర్తనులు, దైవభక్తులు, సదాచారులు, ఉత్తమ పండితులు. కవితాతపస్సు చేసి కాంక్షితార్థములను అంతర్వాణి యుద్బోధముతో నందుకొని కావ్య రచన గావించినారు" (శ్రీ వేటూరి). ముప్వురు పురాణధోరణిలోనే కావ్యశయ్యను మేళవించి తమ పవిత్రవాక్కులనెడి నిక్షేపములతో తరువాతి కవి కుటుంబములవారికి బంగారు పూలమచ్చుల నిచ్చినారు.

కవిత్రయమువారు చూపిన కవితామార్గమునకుఁగల ఔత్కృష్ట్యమును గూర్చి యొక యాధునిక విమర్శకుఁడిట్లు తెలిపినాడు "వారు (కవిత్రయము) ముగ్గురును త్రేతాగ్నుల వలె పవిత్రమూర్తులు. వారి వైదిక ధర్మతత్పరతయే మార్గదర్శకముగానుండి, ఆంధ్ర కవిత్వమునకు సంస్కృతగౌరవము నధికముగా చేకూర్చినది. ఆంధ్ర కవిత్వము అవతరించుటకు బూర్వమే అనేక కావ్యములు పుట్టిన కన్నడాది భాషలలోని ప్రసిద్ధ

మార్గములతోడను, ఉత్తమాంధ్ర కవుల మార్గములు పోల్చినచో విశేష భేదము గోచరించును. ఆంధ్ర కవిత్వమునకు ఋషిమూర్తులైన కవిత్రయము పెట్టిన ఒరవడి తప్పి ఎప్పటికప్పుడు కర్ణాట మహారాష్ట్ర ద్రావిడాది భాషల ననుసరించుచు, మఱల నాంధ్రకవి ఋషిమార్గమును జూచుకొని సరిదిద్దుకొనుటయే ఆంధ్ర కవిత్వ చరిత్రలో ప్రధాన సూత్రమని తద్‌జ్ఞులకు గోచరింపక మానదు" – శ్రీ నోరి నరసింహ శాస్త్రి – ఆంధ్రకవుల ఆదర్శములు. భారతి – సర్వజిత్తు, వైశాఖము.

## తిక్కన సోమయాజి

తిక్కన సోమయాజి గౌతమ గోత్రుడు. ఇమ్మహనీయుఁడు కొన్ని తరములుగా కవులును, మంత్రులును, దండనాథులునై ఆంధ్రజాతిని సేవించి ప్రతిష్ఠ గడించుకొన్న కొట్టరువు వంశమున జన్మించినాఁడు. తిక్కన తాత సారకవితాభిరాముఁడైన మంత్రిభాస్కరుఁడు. గుంటూరు విభుఁడు. తండ్రి సాంగవేదవేదియైన కొమ్మన. ఇతఁడు దండనాథుఁడు. ఇతని అన్న కుమారుఁడు ఖడ్గతిక్కన – కదనభీముఁడని విఖ్యాతిగన్న శూరాగ్రగణ్యుఁడు. తిక్కనయు మనుమసిద్ధి మహీపాలుని మంత్రియై యున్నాడన్నచో యుద్ధనిపుణుఁడు ననియు భావింపవలసియున్నది. మహారాజుచే 'మామా' అనిపించుకొన్న పరమాప్తుఁడు. వైదిక మార్గవర్తనమున యజ్ఞమొనర్చి సోమయాజియైన కర్మిష్ఠి. బ్రహ్మవిద్యావేత్త. తిక్కన మహోదార ప్రవృత్తిని రమణీయరూపమును నాతని శిష్యుఁడైన కేతన దశకుమారచరిత్రలోని అవతారికలో నొక శబ్దచిత్రణమొనర్చి చూపినాఁడు.

మనుమసిద్ధి క్రీ.శ. 1248లో రాజ్యమునకు వచ్చి క్రీ.శ. 1262 వఱకును నెల్లూరు చోళ రాజ్యమును పాలించిఁనాఁడు. అతఁడు సింహాసన మెక్కునాఁటికి తిక్కనకు నలుబది సంవత్సరముల ప్రాయముండుననియును, అయినచో తిక్కన క్రీ.శ. 1208 ప్రాంతమున జన్మించి యుండవచ్చుననియు చరిత్రజ్ఞుల యూహ. తిక్కన సహస్రమాసజీవి. కావున నతఁడు క్రీ.శ. 1288 ప్రాంతమున పరమపదించి యుండవచ్చును. ఈ రీతిగా తిక్కన జీవితము క్రీశ. 13వ శతాబ్ది ఆదినుండి అంతము వఱకును విస్తరించినట్లు కన్పట్టుచున్నది.

ధర్మార్థ కామమోక్షస్థితికి మూదల (కుదురు) ఐనదియును, బహువిధ కథామర్మములతోను, అనేక వైదిక విద్యారహస్యములతోను రాజ్యతంత్రములతోను నొప్పిన మహాభారతము నాంధ్రీకరించుటకు తిక్కన సోమయాజి సర్వవిధములైన

యోగ్యతలు గల మహనీయుడు. ఈ మహాపురుషుని గూర్చి ఆధునికులు చేసిన ప్రశంసలు పరికింపఁదగినవి. "తిక్కన ఆంధ్ర మహాపురుషుఁడు. కూలంకష ప్రజ్ఞాధురీణుఁడు. శ్రీమంతుఁడు. ఆముష్యాయణుఁడు. కావ్యకళాజనిభూమి. అన్వయోద్ధారుఁడు. నిరతిశయ వివేకోన్నిద్రుఁడు. బ్రహ్మవేత్త, కృతిభర్త, మంత్రి మాణిక్యము, దండాధీశుఁడు. సర్వాంధ్ర లోకపూజనీయుఁడు." (శ్రీ ఆంధ్ర శేషగిరిరావు). 'అద్వైతమత' బోధ మాంధ్రభాషలోఁ జేసిన ఆచార్యులలో సోమయాజి మొదటివాఁడు (శ్రీ గురజాడ రామమూర్తి). 'తిక్కనను ఆంధ్రవ్యాసుఁడనుట కాటంకమేమున్నది?' (కవిత్వవేది). 'తిక్కనకు ఆంతరంగిక శిష్యుఁడును, పరమ భక్తుఁడునునైన సూరన తిక్కనను నవీన పరాశరుఁడని యననే యనినాఁడు గదా!' 'తిక్కన విద్యారణ్యస్వామికిఁ బూర్వరంగ ప్రవర్తకుఁడు' (శ్రీ పింగళి). 'దక్షిణాపథము తురుష్కాక్రాంతము గాకుండ తరువాతి శతాబ్దిలో విద్యారణ్యస్వామి ఏ కృషిసల్పెనో ఆ ప్రయత్నమునే తత్పూర్వ శతాబ్దిలో భారతరచనలవలన తిక్కనమహాకవి యొనర్చెను.' – శ్రీ నండూరి రామకృష్ణమాచార్య.

**తిక్కన : యుగపురుషుఁడు**

తిక్కన కాలమునాటికి రాజకీయ మత సారస్వత రంగములలో విభిన్నత విశేషముగా నున్నది. ఆంధ్రదేశమున చిల్లర రాజ్యములు తమలోఁ దాము బోరాడుకొనుట వలన నొక మహాసామ్రాజ్య నిర్మాణము వంకకు రాజన్యుల దృష్టి ప్రసరించుట లేదు. ఒక వంక బ్రహ్మ నాయుఁడు ఆరంభించిన వీరవైష్ణవము, మఱియొక వంక అద్వైతమునకు ప్రతిస్పర్ధిగా విజృంభించిన వీరశైవము ప్రజలలో మతోద్రేకములు రేకెత్తించుచున్నవి. వారు వర్ణాశ్రమ ధర్మరాహిత్యమును, కర్మతిరస్కారమును, అన్యదేవతా దూషణమును ప్రబోధించుచు వచ్చిరి.

సాహిత్యరంగమున పాల్కురికి సోమనాది వీరశైవ కవులు 'జాను తెనుఁగు', 'దేశి కవిత' అను పేరులతో నొక నూతన కవితను గొనివచ్చి, శైవేతరులైన నన్నయాదుల మార్గకవితను ఖండింపనారంభించిరి. ఇట్టి అనైక్యము కారణముగా రాజకీయ మతసారస్వతరంగములలో విభిన్నత కలిగి దానివలన జాతి జీవశక్తి విచ్ఛిన్నమై నీరసింపదొడగెను. ఇట్టి స్థితిలో మహాపురుషుడైన తిక్కన సోమయాజి యవతరించి సర్వరంగములలో సమన్వయమార్గమును సూచించి ధర్మాద్వైతస్థితికి మూలస్తంభమై నిల్చి యుగపురుషుఁడైనాఁడు. రాజకీయ రంగమున మనుమసిద్ధిని కాకతీయ గణపతిదేవ చక్రవర్తికి సామంతునిగాఁ జేసి విశాలాంధ్ర సామ్రాజ్య స్థాపనకు

మార్గమును జూపినాఁడు. శైవవైష్ణవాభిమానములతో కల్లోలితమైన మతరంగమున హరిహరనాథ తత్త్వమును ప్రబోధించి సమన్వయ మార్గమును సూచించినాఁడు. సాహిత్య రంగమున 'శివకవి' 'భవి కవి' (శైవులు కాని కవులు) మార్గముల రెంటిలోని మంచిని గ్రహించి కవితావ్యవసాయమును సాగించు పద్ధతిని ప్రదర్శించినాఁడు. ఈ రీతిగ సర్వరంగములలోను సమన్వయమార్గమును బ్రదర్శించిన తిక్కన ఆ నాఁటి ఆంధ్రజాతికి గురుమూర్తి.

"తిక్కన యసాధారణ పురుషపుంగవుడని యాతని గుణములు స్థిరపరచుచున్నవి. అతని జీవితము నాఁటి సాంఘిక స్థితిలోని ఔన్నత్యమాతనికి సంక్రమించినది. అప్పటి శృంగారములోని పవిత్రత యాతనియందు ప్రతిఫలించినది. ప్రథమ ప్రతాపరుద్రుని శౌర్యము, గణపతిదేవుని రాజనీతి, విశ్వేశ్వర శివదేశికుని యాధ్యాత్మిక సంపద, తన వంశములోని ఖడ్గతిక్కన సాహసము, తన తాతలోని కవితారమణీయము కవి తిక్కనలోఁ గలసినవి. పూచినవి. భారతాంధ్రీకరణమున ఫలించినవి" (శ్రీ కవిత్వవేది)

"ఆంధ్ర భాషాసతిని స్వస్వరూపమున నిలిపి యుద్ధరించినవారిలో నీతఁ (తిక్కన) డగ్రగణ్యుఁడని చెప్పవలసి యున్నది. ఈతనిమూలమున నాంధ్రవాఙ్మయము, ఆంధ్రభాష, ఆంధ్ర దేశము, ఆంధ్రజాతి, వేయేల ఆంధ్రత్వమనునదే ధన్యత్వము నొందుచున్నది." (శ్రీ కోరాడ).

## తిక్కన కృతులు

తిక్కన తన కాలమునాఁడు సాహితీ గురుపీఠ మలంకరించి తన గృహమునే సాహితీ సంస్థగా నొనర్చి సమకాలిక కవులను బ్రబోధించుటయే గాక, తన ఆచార్యత్వమును స్థాపించు కొనుటకై కావ్యరచనకు గడంగినాఁడు. అప్పటికి రంగనాథ రామాయణ మారుకాండలేయైనది. ఏడవదియైన ఉత్తరకాండ రచింపఁబడకపోయినచో రామాయణ మసంపూర్ణముగ నుండిపోవును. కావున నిర్వచనోత్తర రామాయణమును రచించి యా యుద్గ్రంథమునకుఁ బరిపూర్తిని గల్పించినాఁడు. ఇంతకుఁబూర్వమే తన నవయౌవనమాధుర్యము ద్యోతకమగునట్టి విక్రమసేనమను ప్రౌఢశృంగార కావ్యమును జెప్పినాఁడు. నిర్వచనోత్తర రామాయణమునకు బూర్వమే చెప్పిన కవివాగ్బంధము లక్షణగ్రంథము కానోపును. తన నిర్వచనోత్తర రామాయణమును కృతిపతియైన మనుమసిద్ధి "ఏ నిన్ను మామ యనియెడు దానికిఁ, దగనిమ్ము భారతీకన్యక" యని అర్థించి యంకితముగొన్నట్లు కృత్యాదిని చెప్పుకొనినాఁడు.

ప్రౌఢమగు వయసునఁజెప్పిన యీ రామాయణమునందు తిక్కన రాజసము, అహంకారము, గోచరించును. “అమలోదాత్తమనీష నేనుభయ కావ్య ప్రౌఢిపాటించు శిల్పమునన్ పారగుఁడన్ కళావిదుఁడ'' నని చెప్పిన పద్య మిందుకుఁ జక్కనియుదాహరణము. ఈ కావ్యమును రచించిన కాలమునకును భారతమును జెప్పిన కాలమునకును మధ్యగల కాలములో తిక్కన మహాకవి మనసునందు విశేష పరిణామము కల్గినది. ఆయన పూర్వము మంత్రి. రాజుల యనురాగ వీక్షణము నర్థించువాఁడు. భారత రచనాకాలమున బుద్ధి పక్వమైనది. యజ్ఞ మొనర్చినాఁడు. నేడు తిక్కన యర్థించునది తన యిష్టదైవమైన హరిహరనాథుని అపాంగ వీక్షణము మాత్రమే. రామాయణము నాఁటి గర్వాహంకారములు తొలఁగినవి. భారత కృత్యాదిని వినయసంపద తోప “నా నేర్చిన భంగిఁ జెప్పి వరణీయుఁడనయ్యెద భక్త కోటికిన్” అని చెప్పుకొనినాఁడు. నిర్వచనోత్తర రామాయణము నందును కొంత తిక్కనార్యుని ప్రౌఢకవిత గోచరించును. అయినను 'నిర్వచనోత్తరరామాయణము తిక్కనకు విలువ రాయి కాదు' (కవిత్వవేది).

కవిత్రయములో నొకఁడైన ఎఱ్ఱన తిక్కన రచనను గూర్చి 'తన కావించిన సృష్టి తక్కొరుని చేతంగాదు నా నే ముఖంబునఁ దాఁబల్కిన పల్కులాగములై పొల్పొంద చెప్పినాఁ'డని స్తుతించినాఁడు. ఇట్టి స్తుతియంతయును తిక్కన మహాకవికి భారత రచన వలనఁ జేకూరినది. 'వినిన భారతమునే వినవలయును తినిన గారెలే తినవలయును' అని యొక సూక్తి. ఈ సూక్తి తెలుగు భారతమునకే వర్తించును. అదియును తిక్కన రచనవలననే భారతమునకుఁ జేకూరినది. ఇట్టి గౌరవము భారతమునకుఁ గలుగుటకు తిక్కనకు 'ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగా' రచన యొనర్పవలయునను మహోత్సాహము కల్గుటయే కారణము. ఆంధ్రభారత రచన మూలమున తిక్కన ఆంధ్రభాషకు, జాతికి మహోపకారమొనర్చి 'ప్రాతఃస్మరణీయుఁ' డైనాఁడు.

## విరాటోద్యోగ పర్వములు

తిక్కన భారతమున విరాటపర్వము మొదలు పదునైదు పర్వములు జనాభ్యర్చితమైన కవితలోఁ జెప్పినాఁడు. భారతరచన మొనర్చునపుడు తిక్కన తన చిత్తమును 'సాత్యవతేయ సంస్మృతి శ్రీవిభవాస్పదమును గావించుకొనినాఁడు.' నిత్యము నిష్టదైవమైన హరహరనాథుని ప్రత్యక్షీకరించుకొని యా దేవదేవుని హృదయమున కెక్కునట్లు జెప్పినాఁడు. 'భక్త కోటికి వరణీయుఁ' డైనాఁడు. హరిహరనాథునకుఁ

గృతినీయఁదలచినవాఁడు గావున నన్నయ విడిచిపుచ్చిన ఆరణ్యపర్వశేషము నెత్తుకొనక విరాటముతోఁ గథనారంభించినాఁడు. ప్రతి కథాఘట్టము నొక 'ప్రబంధమను' దృష్టితో తిలకించి రచించు తిక్కన "ఈ ప్రబంధమండలికి" తన హృదయాధినాథుఁడైన హరిహరనాథుని అధినాథుని గావించినాఁడు.

తిక్కన జెప్పిన పదునైదు పర్వములలో విరాటపర్వము మొదటిది. ఇది 'ఊర్జిత కథోపేతము. నానా రసాభ్యుదయోల్లాసి.' ఉద్యోగము తఱువాతిది. విరాటోద్యోగ పర్వములు రెండును ప్రావృట్కాలమున (వర్షాకాలమున) నుభయకూలముల (రెండు ఒండ్లను) దరిసి యుప్పొంగిపారు మహానదీప్రవాహములవలె నడచిన యద్వితీయ భాగములు.

తిక్కన కవితాప్రౌఢికి, ప్రతిభానిరూఢికిఁ దగినట్లు విరాటపర్వమునఁ గథావస్తువు పుష్టమై సమకూడినది. కేవలము శ్రవ్యకావ్యలక్షణములే కాక దృశ్య కావ్య లక్షణములను గూడ మేళవించి, అనుపమాన రసాస్పదముగ కవిబ్రహ్మ యిందు కవిత సాగించినాఁడు. 'విరాటపర్వము తిక్కశర్మ కవితాసౌష్ఠవమునకు నిలువుటద్దమువంటిది. భారతగ్రంథ హర్మ్యరాజమునం (పెద్ద మేడ) దెత్తిన మాణిక్యదీపము.' (శ్రీ రాజశేఖర శతావధాని).

## ఉద్యోగపర్వము – విశిష్టత

ఉద్యోగపర్వమునకు శ్రీకృష్ణరాయబారఘట్టము వజ్రకిరీటము. దీనిని తిక్కనార్యుఁడు అపూర్వమైన తన కవితాప్రతిభతో లోకోత్తరముగ నడిపినాఁడు. ఇందలి కథావస్తువునకును, విరాటపర్వమందలి కథావస్తువునకును సహజముగ విశేష విభేదమున్నది. విరాటమందలి కథ నానారీతులైన వస్తు సన్నివేశములు గలది. నానారసములతో నొప్పిన కథాఘట్టము లిందున్నవి. ఉద్యోగపర్వమున నట్టి రసవద్ఘట్టము గాని, కథారుచులుగాని లేవు. ఇందలి కథయంతయు రెండుమూఁడు ముక్కలలోఁ చెప్పదగినది. తిక్కన దీనిని తన పాత్రోచితసంభాషణ మూలమున నొక రసవత్ప్రబంధముగఁ తీర్చి దిద్దఁగలిగినాఁడు. ఈ విషయమును గమనించియే శ్రీ నండూరి బంగారయ్య 'ఉద్యోగమందున్న చమత్కృతియంతయును బ్రసంగా శ్రయమే' యని అభిప్రాయమిచ్చినారు. తిక్కన విరాటపర్వమున నొక విశాల ఫలకముపై వివిధ శిల్పకక్ష్యలు కన్పట్టునట్లు నానాకథాసందర్భములను బహువిధ రససూర్తులతో నొప్పునట్లు శిల్పించి, చూచువారికి రసపారణ మొనర్చు మహాశిల్పివలె గన్పట్టును. ఉద్యోగమున నట్లుగాక తిక్కన మన్మక్షితీశుని రాజ్యచక్రమును ద్రిప్పిన మంత్రి

శిఖామణివలె గోచరించును. మంత్రియై రాజ్యభారమును నిర్వహించిన యా కాలము నాఁటి తన యనుభవము నంతటినీ స్మృతికిఁ దెచ్చుకొని ఈ ఘట్టములందు ఒకదానిని పోలని రీతిగా మఱియొక దానిని జూపించుచు మూఁడు రాయబారములను – ద్రుపద పురోహిత, సంజయ, శ్రీకృష్ణుని రాయబారములను – రాజనీతి కోవిదుఁడై అనన్య సాధ్యములనునట్లు నడిపినాఁడు. ఉద్యోగ పర్వము నాంధ్రీకరించుటకు తిక్కనార్యునివలె యోగ్యత గల కవిశేఖరుఁడు ఆంధ్రభూమిని జన్మింపలేదని విమర్శకాభిప్రాయము. ఆంధ్రసాహిత్యమున జన్మించిన ఆయా కవుల జీవిత విశేషములను పరికించి చూచినచో నీ విషయమెంతయు సత్యమని నిరూపితమగును.

## ఉద్యోగపర్వ నామము

ద్రుపదపతి పురోహిత, సంజయ, శ్రీకృష్ణ రాయబారములతో గూడిన యీ కథావస్తువుతో నొప్పు భారత గ్రంథ భాగమునకు 'ఉద్యోగ పర్వ' మని పేరు. 'ఉద్యోగ' శబ్దమునకు 'ప్రయత్న' మని యర్థము. ఈ ప్రయత్నము దేని నిమిత్తము? సంధి నిమిత్తము. ఈ రాయబారము లారంభమగుటకుఁ బూర్వమే కౌరవ పాండవులు ఉభయులు యుద్ధయత్నము లొనర్చినారు. భారతదేశమందలి రాజులందరును నీ రెండు పక్షములలో నేదో యొక దానియందు జేరిపోయినారు. కౌరవులు పదునొకండక్షౌహిణుల సైన్యమును, పాండవులు ఏడక్షౌహిణుల సైన్యమును కూర్చుకొనినారు. కాని ఉభయపక్షముల వారును సంధియత్నము లొనర్చినారు. పాండవులు ద్రుపదపతి పురోహితుని కౌరవుల కడకంపి సంధియత్నమొనర్చినారు. ధృతరాష్ట్రుఁడు తనయాంతరంగికుఁడైన సంజయుని పాండవులున్న ఉపప్లావ్యమున కంపి సంధియత్న మొనర్చినాఁడు. సంజయుని రాయబారము వలనఁ నేమియును దేలక పోవుట వలన, శ్రీకృష్ణుఁడు పాండవపక్షమున హస్తిన కేగి కౌరవులతో సంధి యత్నమొనర్చినాఁడు. ఈ కారణములచే నిందలి 'ఉద్యోగము' (యత్నము) అంతయును సంధికొఱకేయైనట్లు కన్పట్టుచున్నది. కావున దీనికి కథావస్తువులోని సంధియత్నములనుబట్టియే ఉద్యోగపర్వమను పేరు వచ్చినదనవలయును.

అయిన మరి యుద్ధయత్నములు సంధికి సహాయకారులా? అన్న ప్రశ్న ముదయించుచున్నది. దానికి శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ ఇట్టి సరసమైన సమాధానమును జెప్పినారు. "లోకచరిత్రలో యుద్ధములు రాయబారములు జరిగినపుడెల్లను రెంటి నిమిత్తము ప్రయత్నములు ఏకకాలముననే జరుగుచుండును. రాయబారములు జరుపుచు యుద్ధయత్నములు చేయుట సంధి పొసఁగుటకు

ప్రతిబంధకము కాదా యని ప్రశ్నింపవచ్చును. యుద్ధయత్నములు సంధి పొసఁగుటకు ప్రతిబంధకము కావని నా సమాధానము. పైగా యుద్ధప్రయత్నములే సంధికిఁ దోడ్పడునని చెప్పవచ్చును. శత్రువు బలవంతుఁడుగ నున్నప్పుడు సంధి పొసఁగనిచో యుద్ధము సంభవించి అపజయము కలుగునేమోయని సందేహము కలిగి సంధి జరుగుట కెక్కువ యవకాశమిచ్చును'. దీనినిబట్టి ఉద్యోగమునకు సంధి ప్రయత్నమనియే యర్థము చెప్పవలయునన్నమాట!

కొంద రీ యభిప్రాయముతో నేకీభవింపక ఈ పర్వమందుఁ జరిగిన సర్వమును యుద్ధప్రయత్నముగానే సమన్వయించుచున్నారు. 'ఇందు జరిగిన సంధి ప్రయత్నము లందు నిజముగా విశ్వాసమున్నవారు అల్పసంఖ్యాకులు. ఒక్క ధర్మజుఁడు తప్ప నిజముగా సంధి జరుగునని విశ్వసించినవారు ఎవ్వరు నున్నట్లు కన్పట్టరు. అతనికైన నీ విశ్వాసము దృఢముగ నున్నదో లేదో చెప్పఁజాలము. అదియునుగాక యిందు జరిగిన సంధి యత్నము లన్నియును నుభయ పక్షములును తమపక్షమున లోపవేమియును లేదనియును, తప్పంతయు నెదుటి పక్షమువారిదేనని నిరూపించుటకు, దాని మూలమున జనాభిప్రాయమును జూరఁగొనుటకును జరిగించినవే. ఇట సంధి ప్రయత్నముల విస్తృతి యధికముగా నున్నను ప్రాధాన్యమంతయును సమర ప్రయత్నములయందే. సంధి ప్రయత్నములు గూడ సమర ప్రయత్నములకు బలము చేకూర్చుటకు జరిగినవేయగుటచే నీ పర్వమును సమరోద్యోగపర్వముగనే భావించుట యుక్తము.' (శ్రీ నండూరి బంగారయ్య). దీర్ఘముగ నాలోచించినచో నీ యర్థమే సమంజసముగఁ గన్పట్టుచున్నది.

**కథావస్తువు**

ఉద్యోగపర్వమున వస్తువిషయకముగ విశేష ప్రాముఖ్యము గలవి సంజయుని రాయబారము, శ్రీకృష్ణుని రాయబారము. ప్రథమాశ్వాసమున ప. 258 మొదలు ఆ ఆశ్వాసము తుదివఱకును; పిమ్మట ద్వితీయాశ్వాసమంతయును సంజయుని రాయబారము.

తదనంతర కథ తృతీయాశ్వాసము, చతుర్థాశ్వాసమున ప. 93 వఱకును కృష్ణుని రాయబారము నున్నవి. ఇవిగాక విరాటరాజు కొలువున జరిగిన సంప్రదింపులు, ద్రుపద పురోహితుని రాయబారము, చతుర్థాశ్వాసమందలి సేనానాయక నిర్ణయము, ఉభయపక్ష బలాబల నిరూపణములకు సంబంధించిన ప్రసంగములు ఈ ఉద్యోగపర్వమున ప్రధాన కథావస్తువునకు సంబంధించిన యంశములు.

ఇవిగాక యిందు ప్రథమాశ్వాసమున పురందర విజయోపాఖ్యానము, చతుర్థాశ్వాసమున అంబోపాఖ్యానము, మహాకవి అనునవి ప్రాసంగికేతి వృత్తములు. తిక్కన మహాకవి వీనిని, కేవలము నీతిబోధ తత్త్వ బోధలతోఁ గూడిన ప్రజాదరణవృత్తాంతమును సంగ్రహించినాఁడు. కావున నివి ప్రస్తుత కథ కుపకరించు నట్టివిగానే యున్నవిగాని కథాగమనము (Progress of the story) నడ్డునట్టివిగా లేవు.

వ్యాసభారతమున గుహ్యమైన యోగశాస్త్రము వస్తువుగాఁగల సనత్సుజాతీయ మున్నది. తిక్కన దీని నించుమించుగ ఉన్నదా యను సందేహము కలుగునంతగా సంగ్రహించినాఁడు. ఈ కారణమున కొందఱు తిక్కనను మహాపరాధిగా భావించుచున్నారు. తిక్కన దీనిని గుహ్యమైన (రహస్యమైన) విద్యయని విడిచి పెట్టియుండఁడు. ఇది శాస్త్ర గ్రంథమగుటచే కావ్య రసదృష్టితోఁ దిక్కన దీనిని అనువదించుట మానియుండును.

సనత్సుజాతీయము, భగవద్గీత, ఉత్తరగీత, ఇత్యాదులు ప్రత్యేకముగ ఉత్తమ గ్రంథములు. కాని తిక్కన కేవలము 'వేదభారవాహి' (వేదముల యొక్క భారమును మోయువాఁడు) కానందున వీనిలోని శాస్త్ర భాగములను జీర్ణించుకొని, తరువాతి శాంతి పర్వాదులందు భీష్మ ధర్మజాదుల సంభాషణ లందు వీనిలోని యంశములను క్రోడీకరించినాఁడు. ఈ యుద్యోగపర్వ ద్వితీయాశ్వాసమున నొక ప్రాతఃకాల వర్ణనమున్నది. ఇది మధ్యకాలీన సంస్కృతకవుల వర్ణనలను బోలియున్నది. ఒకవేళ నీ వర్ణనమును విడిచి పుచ్చినను, నీ కావ్య సౌందర్యమునకు లోపము కల్గియుండెడిది కాదని విమర్శకాభిప్రాయము.

ఉద్యోగపర్వమునందు 1. ద్రుపద పురోహితుని రాయబారము 2. సంజయుని రాయబారము 3. శ్రీకృష్ణుని రాయబారము – అను మూఁడు రాయబారములున్నవి. ఇందు ప్రధానములైనవి సంజయుని రాయబారము, శ్రీకృష్ణుని రాయబారములు. మహాభారత యుద్ధనాటకమునకు శ్రీకృష్ణుని రాయబారము నాంది. శ్రీకృష్ణుని రాయబారమునకు సంజయుని రాయబారము నాంది. సంజయుని రాయబారమునకు ద్రుపదపతి పురోహితుని రాయబారము నాంది. విప్రుని రాయబారమున పౌరుష్యము, సంజయుని రాయబారమున చాతుర్యము, శ్రీకృష్ణుని రాయబారమున ఔజ్జ్వల్యము ప్రధానలక్షణములై కన్పట్టుచున్నవి.

"ఈ ఉద్యోగపర్వమంతయును వ్యంగ్యచమత్కృతులతోను, వానికి మించిన సమాధానములతోను నిండియున్నది. 'ధ్వనిరాత్మా కావ్యస్య' (కావ్యమున కాత్మధ్వని) అనెడి పూర్వాచార్యుల మతమునకు అద్వితీయమైన నిరూపణ మీ పర్వమునందున్నది. కథకుఁగాని మరి యే యితర కావ్యగుణమునకుఁ గాని యిందు ప్రాధాన్యము లేదు. నదులన్నియును సముద్రమునఁ గలిసినట్లు ఇతర గుణములన్నియును ధ్వనిలో నిముడుచున్నవి. దీనిని బఠించుచుండగా నీ నాఁటి యుద్ధ సన్నాహములు, ఈ నాఁటి కపట ప్రచారములు, ఈ నాఁటి యుపన్యాసనైపుణ్యములు అన్నియు ప్రత్యక్షములగుచుండును. ఈ కారణముననే యీ పర్వము మన కామోదదాయకముగా నున్నది." ఈ రీతిగ కావ్యము లోకమునకుఁ బ్రతిబింబముగ (Mirror of life) నుండవలయుననిగదా పాశ్చాత్య దృష్టి!

"ఉద్యోగపర్వమునందలి వస్తునిర్వహణ కౌశలము అనన్యసాధ్యము. మొదటినుండియు తుదివఱకును, స్వల్పాంశములను అప్రధానవస్తువులను గూడ నెంతో హృద్యమొనర్చుచు నిర్వహించిన వస్తుచిత్రణ మిందలి కళావైభవమునకు సంజీవని. ఇంకను నిట్టి మహాగుణములు మూఁడు నాలుగైన నిందు బ్రత్యక్ష మగుచున్నవి. ముఖ్యముగఁ బేర్కొనఁదగినవి వ్యక్తిచిత్రణము, శైలియును. 'ఈ పర్వమునందలి అపురూప లావణ్యమును పూర్ణముగ విపులీకరించుకొని చూచినచో నిది ఆంధ్రవాఙ్మయమున కోటి కోహినూరుల కాంతితోఁ బ్రకాశించుచున్నట్లు స్పష్టమగుచున్నది. ఈ పర్వము నందలి శిల్పవైభవము నాధారముగాఁగొని విశ్వకళా ప్రపంచమున నాంధ్రుడు జైత్రయాత్రకు ప్రస్థాన (యుద్ధయాత్ర) భేరిని మాత్రమే గాక జయదుందుభిని గూడ మ్రోగింపవచ్చును." (శ్రీ నందూరి బంగారయ్య)

# మనుచరిత్రము - అల్లసాని పెద్దన

## కవి కాలాదికము

మనుచరిత్ర ఆంధ్ర పంచకావ్యములలో నొకటిగను, కొందఱిచే నగ్రగణ్యముగను బరిగణింపబడుచున్న మహాకావ్యము. ప్రబంధకవిత యనెడి నూతనకవితోద్యమమునకు మార్గదర్శకమైన కావ్యరాజము. 'నాఁటికిని నేఁటికిని ప్రబంధశైలికిని, వర్ణనౌచిత్యమునకును, కథాకథనమునకును ప్రథమోదాహరణమై తెలుఁగు ప్రబంధ శాఖలోనే గాక నాంధ్ర పంచ కావ్యములలో గూడ అగ్రస్థానము దక్కఁగొన్న, మహారచనయను విమర్శక ప్రశస్తిని సంపాదించిన కావ్యశ్రేష్ఠ మీ మనుచరిత్ర. ఈ మహాప్రబంధమునకుఁ గృతికర్త ఆంధ్రకవితాపితామహుడు అల్లసాని పెద్దనార్యుఁడు.

## అల్లసాని పెద్దన

'సాహితీ సమరాంగణ చక్రవర్తి' యని 'ఆంధ్రభోజుఁ'డని విఖ్యాతిఁగన్న విజయనగర సామ్రాజ్యాధీశ్వరుఁడైన శ్రీకృష్ణరాయ యాస్థాన కవీశ్వరులలో నెల్ల నగ్రగణ్యుఁడీ అల్లసాని పెద్దనార్యుఁడు. అశ్వలాయన సూత్రుఁడు. ఋక్‌శాఖాధ్యాయి, వసిష్ఠగోత్రుఁడు, నందవరీక బ్రాహ్మణుఁడు. చొక్కనామాత్యుని పుత్రుఁడు. బళ్ళారి ప్రాంతమందలి దోపాడు పరగణాలోని దోరాల యీతని నివాస స్థానము. ఇతఁడు తొలుత స్మార్తుడనియును, పిమ్మట వైష్ణవమును స్వీకరించి శఠకోపయతికి శిష్యుడైనాఁడనియును దెలియవచ్చుచున్నది.

ఇందుకుఁ గృష్ణ దేవరాయలకు వైష్ణవముపై నించుక విశేషాభిమానముండుటయు నొక కారణమైయుండి యుండవచ్చును.[1] వైష్ణవమును స్వీకరించినపిమ్మట నీ మహాకవి తన కవితాప్రావీణ్యమునకు మెచ్చి, రాయలు తనకిచ్చిన కోకటమను గ్రామమును వైష్ణవుల కగ్రహారముగా నిచ్చి, దానికి 'శఠకోపపుర' మను నామకరణమొనర్చెను.

కృష్ణరాయల యాస్థానమున 'కర్ణాటక కవి సార్వభౌమ', 'కుమార వ్యాస' బిరుదాంకితుఁడైన తిమ్మన వంటి కన్నడకవులు, ముక్కుతిమ్మనార్యాదులైన యాంధ్ర

కవులు, కొందఱు తమిళ సంస్కృతకవులు నుండిరి. రాయలును మహాకవి కోటిలో జేరినవాఁడు.

విద్వత్కవి ఐనను కృష్ణరాయలు పెద్దనార్యునిపైఁ బ్రదర్శించినంతటి భక్తి గౌరవము లితరు లెవ్వరియెడఁ బ్రదర్శించినట్లు కన్పట్టదు. 'కవి గండపెండేరము'ను స్వయముగ సభలో కాలికిఁ దొడుగుటయును, మనుచరిత్రము నందుకొనువేళ పురమేగునపుడు పల్లకిని కేల బట్టి యెత్తుటయు రాయలు పెద్దనార్యునకొనర్చిన యపూర్వ గౌరవములు. ఇట్టి విశిష్ట గౌరవములను ప్రభువుల వలన, నందును సాహిత్యచక్రవర్తుల వలన, గొన్న కవిచంద్రుఁడు పెద్దన దక్క యన్యుఁడొక్కఁడు ప్రపంచ సాహిత్య చరిత్రయందే కన్పట్టఁడు.

పెద్దనార్యుఁడు చతుర్విధ కవితానిర్వహణమునందేకాక రాజ్య వ్యవహారము లందును దక్షునివలెఁ గన్పట్టుచున్నాడు. ఇతఁడు రాయలవెంట యుద్ధభూముల కేఁగినట్లు కొన్ని చాటు పద్యములవలనఁ దెలియుచున్నది.

పెద్దనార్యుని రాజ్య వ్యవహారదక్షతను గమనించుట చేతనే రాయ లీతనిని దక్షిణ ఆర్కాటు జిల్లాలోని కఠివాచీసీమ నాయంకరమునకు అధిపతిని గావించినాఁడు.

## పెద్దనార్యుని కృతులు : ఆంధ్రకవితాపితామహ బిరుదము

లక్షణ గ్రంథములలోని ఉదాహరణములనుబట్టి పెద్దనార్యుఁడు 'హరికథాసార' మను మఱియొక ప్రబంధమును జెప్పినట్లు తెలియుచున్నది. ఇప్పుడది లభించుట లేదు. ఇందలి కొన్ని పద్యములు మాత్రమే నేఁడు మనకు లక్షణగ్రంథములలో దొఱకుచున్నవి. నేఁడు మనకు లభ్యమగుచున్న పెద్దన గ్రంథము 'స్వారోచిషమను సంభవ' (మనుచరిత్ర) యొక్కటియే. ఈ రెండు కావ్యములనే గాక పెద్దన మఱికొన్ని గ్రంథములను గూడ చెప్పియుండవలయును. మనుచరిత్రను రచింపుమని కోరునప్పుడే రాయలు పెద్దన్నతో

క. "హితుఁడవు చతురవచోనిధి
వతుల పురాణాగ మేతిహాస కథార్థ
స్మృతియుతుఁడ వాంధ్రకవితా
పితామహుఁడ వెవ్వరీఁడు పేర్కొన నీకున్?"

అని యనినాఁడు. మనుచరిత్ర రచనకుఁ బూర్వమే ఇట్టి 'ఆంధ్ర కవితా పితామహ' బిరుదము' లభింపవలయునన్న పెద్దనార్యుఁడు ఉత్తమ కావ్యములఁ గొన్నింటిని జెప్పి

యుండవలయును గదా! శిరీషకుసుమ పేశల సుధామయోక్తులతోఁ గూడిన అట్టి రచనలు ఆంధ్రుల దురదృష్టమున నశించినవని యూహించుటలోఁ దప్పు లేదు.

పెద్దనార్యుఁడు కృష్ణరాయలు తన 'భువనవిజయ' సభలో జరిపించెడి విద్వద్గోష్ఠుల కన్నింటికిని సభాపతియై వర్తించి యుండెడివాడని ఊహించుటలో నెట్టి విప్రతిపత్తియును లేదు. 'ఫణిన సూను కణాద బాదరాయణ సూత్రఫక్కి నుపన్యసింపఁగల విద్వాంసులు', కృష్ణరాయల సంగీత విద్యాగురువు పండిత బండారు లక్ష్మీనారాయణాది (సంగీత సూర్యోదయకర్త) కళావేత్తలు, వ్యాసరాయ, శఠగోప, తాతాచార్యాది మతపండితులు, అష్టదిగ్గజకవులు మొదలైన ప్రముఖ విద్వాంసులుండెడి సభకు సభాధిపత్యమన్న సామాన్య విషయము కాదు. ఇది పెద్దనార్యుని పాండిత్య విశేషమునకు, కవితాప్రావీణ్యమునకుఁ బ్రబలతర సాక్ష్యము.

పెద్దనార్యుఁడు చతుర్విధ కవితానిర్వాహకుఁడు. చిత్రకవిత, బంధకవిత, గర్భకవిత, ఆశుకవితలు చతుర్విధకవితలు. చమత్కార ప్రధానమైన యీ రచన పెద్దనార్యునకుఁ బూర్వమున నుండిన ఐదువందల సంవత్సరముల కాలమునందును సాహిత్యమున స్వల్ప స్వల్పముగఁ గనఁబడుచువచ్చినది. చమత్కార ప్రధానమగు నియ్యది రాజసముతో గూడిన రాజసభలయందలి కవితావిద్వద్గోష్ఠులకు ప్రాభవమబ్బిన రాయల కాలమున బాగుగా వేరూని తరువాతి కవులకు మార్గదర్శకమైనది. 'శిరీష పేశల సుధామయోక్తులతో, కథాకథన దక్షతతో, అనన్యమైన పాత్రపోషణ సామర్థ్యముతో రసవత్కవితఁ జెప్పఁగల పెద్దనార్యుఁడు సైతము కాలప్రభావమునకు లోనై నీ చతుర్విధ కవితలఁ జెప్పఁగల్గుట యొక ఘనతఁగ జెప్పుకొనుటఁ జూడ రాయల కాలమున నిట్టి కవితలకెంతటి గౌరవము లభించినదో తెలియుచున్నది.[2]

పెద్దన 'ఆంధ్ర కవితా పితామహ' బిరుదాకింతుడు. ఇట్టి బిరుదమీతని కున్నట్లు, 'ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి' ఇత్యాది చాటువునందలి 'ఆంధ్ర కవితా పితామహ అల్లసాని పెద్దన కవీంద్ర యని నన్నుఁ బిలుచునట్టి' అన్న ఎత్తుగీతిలోని భాగమువలనను, మనుచరిత్రలోని పీఠికయందలి 'హితుఁడవు, చతురవచోనిధి' ఇత్యాది పద్యమువలనను స్పష్టముగఁ దెలియుచున్నది. భారతమున పదునైదు పర్వముల నసామాన్య కవితాశిల్పమును ప్రదర్శించి మహాకవి తిక్కన 'కవిబ్రహ్మ' యన్న ప్రశస్తిని పూర్వమందుకొనియున్నాడు. అట్టి స్థితిలో పెద్దన్న కీ 'ఆంధ్ర కవితా పితామహ' యెట్లు కల్గినది? దీనికర్థమేమి? తిక్కన్నకుఁ దరువాతి కాలమునను 'కవిబ్రహ్మ' యను నర్థమునిచ్చునట్టి కవితాపితామహ బిరుదమును శివదేవయ్య (క్రీ.శ. 1260

ప్రాంతము), కొఱవి సత్తెనారన (క్రీ.శ. 1400 ప్రాంతము) అను నిరువురు కవులు వహించినట్లు తెలియుచున్నది.

[3]ఈ ఇరువురును ఆంధ్ర కవితా పితామహులైనట్లు వారి వంశీయులైన తుళ్ళూరి శరభరాజు, కొఱవి గోపరాజుల రచనల వలనఁ దెలియుచున్నది. వీరి రచనలు కన్పట్టకపోవుటచే నే కారణమున వీరి కా బిరుదము లభించినదో తెల్పుట కష్టము. వ్యాసరచిత మహాభారత ప్రపంచమును స్వకీయము గావించుకొని అపూర్వ శక్త్యుత్సాహములతో 'తన కావించిన సృష్టి తక్కొరుని చేతఁ గాదనునట్లు' రచించిన తిక్కనకు గవి బ్రహ్మ నామము లోక రూఢమైయుండఁగా, పెద్దనార్యునకు 'కవితాపితామహ బిరుదము వచ్చుటకుఁ గారణము 'ప్రబంధ సాహిత్య ప్రపంచమును' సృష్టించుటయే యైయుండునని చెప్పవలయును. ఈ బిరుదు అల్లసానివారికి మనుచరిత్ర రచనలవలనఁ కలిగినదని కొందఱు; ఈ బిరుదమును మనుచరిత్ర పీఠికాభాగముననే కన్పట్టుటచే నేతద్గ్రంథ రచనకు బూర్వమే కలిగినదని కొందఱు అభిప్రాయపడుచున్నారు. ఏమైనను నీ బిరుదము మనుచరిత్ర రచనాకాలమునకుఁ బూర్వమే కలదనుట సమంజసము. ఇది పెద్దన్న కోకట గ్రామ దాన శాసనముల రెండింటను (బహుధాన్య వైశాఖ శు. 30, 25-4-1518, బహుధాన్య కార్తిక బ. 12, 31-10-1518) కన్పట్టక ప్రమాది కార్తిక శు. 30, 6-11-1519 నాటి అన్నూరు శాసనమున 'ఆంధ్ర కవితా పితామహులైన పెద్దిరాజుగారు' అని కన్పట్టుటచే క్రీ.శ. 1518-19 సంవత్సరముల మధ్యకాలమున నేదోయొక కవితాగోష్ఠియందు లభించి యుండవచ్చును. అటుపిమ్మట స్వల్పకాలమునకే పెద్దన 'మనుచరిత్ర'ను రచించి రాయల కంకితమిచ్చియుండవచ్చు.

## పెద్దన జీవితకాలము

అల్లసాని పెద్దన తన మనుచరిత్ర మహా కావ్యమును క్రీ.శ. 1509 మొదలు 1530 వఱకును విజయనగర రత్న సింహాసనమెక్కి పాలించిన శ్రీకృష్ణరాయల కంకితమిచ్చినాఁడు. రాయలు అకాలమృత్యువు వాతఁబడి స్వర్గస్థుఁడు కాఁగా క్రింది సుప్రసిద్ధమైన చాటువును జెప్పినట్లు తెలియుచున్నది.

సీ. "ఎదురైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
 కేలూఁతయొసఁగి యెక్కించుకొనియె,
కోకట గ్రామాద్యనేకాగ్రహారంబు
 లడిగిన సీమలయందు నిచ్చె,

మనుచరిత్రంబందుకొను వేళఁ బుర మేఁగఁ
బల్లకిఁ దన కేలఁ బట్టియెత్తె
బిరుదైన కవిగండ పెండేరమున కీవె
తగుదని తాన పాదమునఁదొడిగె

తే. ఆంధ్రకవితా పితామహ అల్లసాని
పెద్దన కవీంద్రయని నన్నుఁ బిలచునట్టి
కృష్ణరాయలతో దివికేగలేక
బ్రదికియున్నాఁడ జీవచ్ఛవంబనగుచు.”

కావున పెద్దన కృష్ణరాయల నిర్యాణకాలమైన క్రీ.శ. 1530కి తరువాతఁ గొంతకాలము జీవించియుండవలెను. ఆ కాలమెంతో నిర్ణయించుట కష్టము. అది బహుశా ఐదు సంవత్సరములని యూహించినచో పెద్దన క్రీ.శ. 1535 ప్రాంతమున స్వర్గస్థుఁడు కావలయును. ఈ సందర్భములన్నింటిని లెక్కించి శ్రీ పింగళి, పెద్దనార్యుఁడు క్రీ.శ. 1470 ప్రాంతమున జన్మించి తన యేఁబదవ యేట మనుచరిత్రమును జెప్పి అరువది సంవత్సరాలకుఁ బైగా జీవించి, క్రీ.శ. 1535 ప్రాంతమున తరలిపోయి యుండునని యూహించినారు. (తెలుగు భాషాసమితి – విజ్ఞాన సర్వస్వము. పే. 927)

## మనుచరిత్ర : స్వారోచిషమనుసంభవము

‘మనుచరిత్రం బందుకొనువేళఁ బురమేఁగఁ బల్లకిఁ దనకేల బట్టి యెత్తె’ అను చాటువులో మను చరిత్రమనియును, ‘కోరిక నీ స్వారోచిషు చారిత్రము వినిన వ్రాయ’ (ఆ 6 ప 119) అనినచో స్వారోచిష చరిత్రయని, ‘నా యొనర్పంబూనిన స్వారోచిష మనుసంభవంబను మహా ప్రబంధంబునకు కథాక్రమం బెట్టిదనిన’ అనుచో స్వారోచిష మనుసంభవమని మూఁడు పేర్లను పెద్దనార్యుఁడే వాడియున్నాఁడు.

మనుచరిత్ర ఆఱాశ్వాసముల ప్రబంధము. ఇందయిదాశ్వాసములలోను, ఆఱవయాశ్వాసమున నధికాంశమునందును స్వారోచిషమనువు సంభవమునకుఁ గారణభూతమైన చరిత్రయే యున్నది గాని యతని చరిత్రము లేదు. అతని చరిత్రమంతయును నాఱవయాశ్వాసమందలి తుదినున్న యిరువది యొక్క పద్యములలో నున్నది. ఈ కారణముచే దీనిని మనుచరిత్రమనుట కన్న మనుసంభవకారణమైన చరిత్రయగుటచే స్వారోచిష మనుసంభవమనుటయే యుచితమని విమర్శకుల యభిప్రాయము. (తేవప్పెరుమాళ్ళయ్య). పెద్దనయును నీ నామమునే ఆశ్వాసాంత

గద్యములందు ఉపయోగించినాఁడు. కావున మనము స్వారోచిషమనుసంభవ మనునదియే దీని నామమనియును, మిగిలినవి వ్యవహారనామములుగా వచ్చినవనియును నూహింపవలసి యున్నది.

ఆంధ్రసాహిత్యమున క్రీ.శ. 1500 మొదలు 1600 వఱకును గల నూరు సంవత్సరముల కాలమొక ప్రత్యేక ఘట్టము. సాహిత్యచరిత్రకారులు దీనినొక ప్రత్యేక యుగముగ భావించి దీనికి 'కృష్ణరాయయుగ' మని నామకరణమొనర్చిరి. ఇంతకుఁ బూర్వయుగములందు కవులు విశేషముగా సంస్కృతమునుండి పురాణాది గ్రంథములనో, లేక గ్రంథభాగములనో స్వతంత్రించిగాని, మూలానుగుణముగాఁ గాని అనువదించినారే గాని స్వతంత్ర రచన లొనర్పలేదు. ఈ కృష్ణరాయయుగమున 'నూత్నతేజముతో వెలుగొందు సామ్రాజ్య వైభవముతో పాటు నవనవోన్మేషమైన స్వతంత్ర సారస్వత వైభవము' గూడ వెల్లివిరిసినది. అదియే మన ప్రథమ నవ్యకవిత్వోద్యమము.

ఆంధ్రులు తమ ప్రత్యేక సారస్వతసిద్ధిగాఁ గొనియాడుకొనఁదగిన ప్రబంధ ప్రక్రియ నూతనముగా నావిర్భవించుటయే ఆ యుద్యమమునకుఁ బ్రథమ లక్షణము. ఆంధ్ర సరస్వతీవిహారమున కనువైన సుందరోద్యానవనము ప్రబంధము. కృష్ణరాయల మనోరథానుసారముగ ఆ యుద్యాన నిర్మాణభారమును మొదట వహించిన మహాపురుషుఁడు అల్లసాని పెద్దన. ఆ యుద్యానమున తొలుతగా పుష్పించి ఫలించిన రసాలము (మామిడిచెట్టు) మనుచరిత్రము.

పెద్దనాదులైన మహాకవులు కడు శక్తిసంపన్నులు. అయినను పరిపూర్ణముగా స్వతంత్రించి క్రొత్త కథలను గల్పించుటకు వారు సాహసింపలేకపోయిరి. ఇందుకుఁ గాలప్రభావము (Time-spirit) ముఖ్య కారణము. వసుచరిత్రకారుడు కృతిపతి తన్నుఁగోరినట్లుగాఁ జెప్పిన –

ఉ. కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము లాద్యసత్కథల్
వావిరిబుట్టు రత్నము లవారిత సత్కవికల్పనావిశే
షావహపూర్వవృత్తములు సానలఁదీరిన జాతిరత్నముల్
గావున నిట్టి మిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్.

అన్న పద్యమువలన నా కాలపుఁ గవులకు మిశ్రమకథయం దభిమానము విశేషమగుట స్పష్టమగుచున్నది. పురాణయుగమునకుఁ బిమ్మట శ్రీనాథ మహాకవి సంస్కృత గ్రంథములను కావ్యమార్గమును ననువదించుటకు ద్రోవ చూపినాఁడు.

ఆ మార్గములనే యనుసరించి కొందఱు కవులు పురాణకథలను గైకొని స్వకపోకల కల్పనలఁగూర్చి అష్టాదశ వర్ణనలతో మిశ్రప్రబంధము లొనర్చినారు. అట్టివారిలో శ్రీనాథునకుఁ బిమ్మట ప్రసిద్ధుఁడు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు. 'ఉత్పాద్య'మైన కథావస్తువు (కల్పితమైన కథావస్తువు) నకు ఆ కాలమున నెట్టి గౌరవమును లేదనుట, యీతని శృంగార శాకుంతలములోని –

శా. ప్రఖ్యాతంబన మిశ్రబంధమన నుత్పాద్యం బనంగాఁ ద్రిధా
వ్యాఖ్యాతంబగు వస్తువందు మఱి యధ్యాహారముం జేయఁగాఁ
బ్రఖ్యాతం బితివృత్తమైనఁ గృతిసెప్పన్ వక్తకున్ శ్రోతకున్
విఖ్యాతిఁ గలిగించుఁ బుణ్యమహిమన్ విశ్వంభరామండలిన్.

అన్న పద్యమువలనను దెలియుచున్నది. మనుచరిత్రము ఈ పినవీరభద్రుని 'శృంగార శాకుంతలమునకుఁ బిమ్మట సర్వోత్కృష్టముగా వెల్వడిన మహా ప్రబంధము'. కాలప్రభావమును బట్టి పెద్దనార్యుఁడును ప్రఖ్యాతకథనే గ్రహించి తన ప్రతిభా విశేషముచే కొలది మార్పులను, నుచితవర్ణనలను జేర్చి మనుచరిత్రమును మిశ్ర కథ గావించినాఁడు.

తన యపూర్వకవితాశక్తిచే భారతభాగవతములకుఁ బిమ్మట నే గ్రంథమునకును లేని రసిక ప్రజాదరణమును మనుచరిత్రకుఁ గల్పించి, 'ఆంధ్రకవితాపితామహ' బిరుదము నర్థవంతము గావించుకొని, యశఃకాయుఁడైనాఁడు.

## మనుచరిత్ర కథ – మార్కండేయ పురాణాంతర్గతము

మనుచరిత్రలోని కథను పెద్దనార్యుఁడు మార్కండేయ పురాణమునుండి గ్రహించినాఁడు. ఈ మార్కండేయ పురాణమును తిక్కన మహాకవి శిష్యుఁడైన మారన క్రీ.శ. 1330 ప్రాంతమున నాంధ్రీకరించినాఁడు. మారన యే కథ ననువదించినాఁడో పెద్దనయు నా కథనే యనువదించినాఁడు.

## కథాసంగ్రహము

### ప్రవరునింటికి ఔషధసిద్ధుని రాక

వరుణానదీతీరమున అరుణాస్పదమను పురమున విద్యాపారంగతుఁడు, ధనికుఁడు, శమదమాది గుణసంపత్తి గలవాఁడును, మకరాంక శశాంక మనోజ్ఞమూర్తియునైన ప్రవరుఁడను బ్రాహ్మణవంశ ప్రదీపకుఁడు వసించుచుండెను.

తల్లిదండ్రులింటి పెత్తనమును దీర్చుచుండగా, నతఁడు శిష్యులకు విద్య నేర్పుచు స్వధర్మ నిరతుఁడై యొప్పుచుండు. నాతని కతిథిపూజనమన్న నమితానందము.

ఒకానాఁడొక యౌషధ సిద్ధుఁడు నగరమునకు వచ్చినాఁడని విని భక్తితో నేగిఁ యింటికిఁ గొనివచ్చి సపర్యలొనర్చి, దీనముగా నతనికి ప్రవరుఁడు తన తీర్థ సందర్శనాభిలాషను వెల్లడించెను. తన శీలముచే సిద్ధుని ప్రసన్నుని గావించుకొనఁగా, యోగ్యుఁడైన ప్రవరుని యభిలాషను దీర్చుటకై తన ప్రేంపసజ్జయందలి పసరు తీసి యిది యదియని చెప్పక, సిద్ధుఁడు, ప్రవరుని పాదములకుఁ బూసెను.

## ప్రవరుని హిమవన్నగయాత్ర

వెంటనే ప్రవరుఁడు హిమవంతమును జూడఁ గోరఁగా నుత్తర క్షణమునందే యతఁడు ఆ మంచుకొండపై నిలిచెను. హిమగిరిపై నాతఁడు కొన్ని రమ్య ప్రదేశములను, దివ్యస్థలములను జూచి వాని మాహాత్మ్యముల నెన్ని పగలు రెండు జాములు కాఁగా, తన కర్మకలాపమునకు వేళ దాటిపోవుచుండుటచే 'మరల రేపు వచ్చి చూచెద'నని తలచిఁ యెగురబోఁగా, పాదమునకుఁ బూయఁబడిన పూఁత కరిగిపోవుటచే నతఁడెగురఁ జాలకపోయెను.

అపుడు 'నిర్ఘండె' పడి కొంతసేపటికి ధైర్యము తెచ్చుకొని ముందుకుఁ బోవుచుండఁగా నట నొక మున్యాశ్రమమును బోలి యొక యాశ్రమము కన్పించినది. ఆశతో నేను రక్షితుఁడ నగుదునని తలపోయుచు మఱికొంత దూరము సాగిపోయిన ప్రవరునకు, మోడులు చివురించినట్లు వీణ వాయించుచున్న యొక గంధర్వ గాయనీమణి కాన్పించెను.

## ప్రవర వరూథినీ వృత్తాంతము

అంతట ప్రవరుఁడు అనుమానింపక నామెకడకేగి తన కులమును, నామమును జెప్పి త్రోవతప్పిన తనకు మార్గమును దెల్పుమని కోరినాఁడు. ఆమె యితని వలచియుండుటచే నతని యమాయకపు మాటలకు చిఱునవ్వు నవ్వి "చేరెడు కన్నులుగల నీవు తెరు వింకొకరి నడుగ నేల? వచ్చినత్రోవ తెలియదా? ఒంటిగనున్న జవరాండ్రను పల్కరించుట కీ పని సాకుగాఁ బెట్టుకొనినా' వని పల్కి తన పేరు వరూథిని యనియును, తిలోత్తమారంభాదులు తనకుఁ జెలికత్తెలని జెప్పి, తన ప్రేమభావమును గ్రమముగ వెల్లడించెను.

ప్రవరుఁడు వైదికుఁడు గావున అది యంతయు బ్రాహ్మణభక్తియని తొలుత తలపోసి క్రమముగఁ దెలిసికొని 'వ్రతినై కర్మకాండమున దినములు గడపు నన్నేల కామించితి?' వని పల్కి, తనయెదుట నట్టిమాట లాడవలదనినాఁడు.

వరూథిని తొలుత నాతని మాటలకు నిరాశ జెంది పిమ్మట ధైర్యము తెచ్చుకొని, 'మీ యజ్ఞముల కన్నింటికిని ఫలము మా కవుగిళ్ళలో సుఖించుటయే గదా! వ్రతములకై ప్రాకులాడెదవేల? – స్వర్గ ఫలమే నీ యెదుట సాక్షాత్కరించినది. కావున నన్నుఁగూడి సుఖింపు' మని కోరినది. 'ఆనందో బ్రహ్మ' యన్న ప్రాఁజదువు నూహింపుమని కోరినది.

కాని ప్రయోజనము లేకపోయినది. ప్రవరుఁడు "చెప్పకుమిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్" అని పలుకగా, నామె 'నన్నిఁక బాధపెట్ట వల' దని దీనయై మీఁదఁ వ్రాలి కౌగిలించి అధరము నాసింపఁగా నతఁడు ప్రయత్నమును సాగనీయలేదు. పొమ్మని త్రోసిపుచ్చినాఁడు. అపుడధిక దుఃఖముతో చుఱచుఱ జూచుచు దయారహితుఁడవని నిందించి కలస్వనముతో నేడ్చినది. ఇంకను నామె యేమేమో ప్రసంగించుచుండగాఁ ప్రవరుఁడు వినిపించుకొనక, ఆ కౌగిలించినపుడంటిన జవ్వాదిని కడిగికొని గార్హపత్యమనెడి యగ్నిని ప్రార్థించి యింటికిఁ జేరుకొనినాఁడు.

## వరూథినీమాయాప్రవర వృత్తాంతము

ప్రవరుని కాఠిన్యమునకు బాధపడుచున్న వరూథినిని ఆమె చెలికత్తెలు వచ్చి ఊరడింప యత్నించిరి. కాని ప్రయోజనము లేకపోయినది. అట్టి స్థితిలో వారామెను పూఁదోఁటకుఁ గొనిపోయిరి. వరూథినిని యంతకుఁ బూర్వమొక గంధర్వుఁడు ప్రేమించి తిరస్కృతుఁడైనాఁడు. అయినను నాశవిడువక 'జవరాండ్ర చిత్తములు చంచలములు గదా! నేఁడు తిరస్కరించిన యీ వనిత యోపిక పట్టినచో రేపు నన్ను చేపట్టదా?' యని భావించి యా ప్రాంతముననే యుండెను. అదృష్టవశమున ప్రవరుని జూచి వరూథిని మోహించుటయు, నతఁడు తిరస్కరించి వెడలిపోవుటయు నతని కంటఁబడినది. అతఁడు కామరూపి గావున తన యదృష్టము పండెనని తలపోసి ప్రవరుని వేషమును ధరించి, దేవతార్చనకై పూలను గోయుచున్నట్లు నటించుచుండెను. అట్టివానిని వరూథిని చూచి నిజమైన ప్రవరుఁడేయనుకొని యతనికడకేగి తన్నుఁ బరిగ్రహింపుమని దీనముగ వేడినది.

తుదకు మాయాప్రవరుఁడు జాలిని నటించి 'నీ వనుభవించుచున్న పరితాపమును జూడఁజాలకున్నాను. వ్రతముకంటె పరోపకారము ఘనమైనది గదా! సంభోగ

సమయమున స్త్రీ పురుషులొండొరులను జూచుకొనరాదు. కన్నులు మూసి కొనవలయును. మా దేశాచారమైన దీనికి విరుద్ధముగ నేను బ్రవర్తింపజాలను. ఇందులకు నీకిష్టమేని చెప్పు' మనినాఁడు. 'నీ కొఱకు నేను పదభ్రష్టుఁడనగుచున్నాను. నీతో చిరకాలము సుఖింపనైన సుఖింపవలయును. లేకున్న తపమైన నాచరింప వలయును. ఉభయ భ్రష్టుఁడను కాఁజాలను' గదా యనినాఁడు.

ఇట్టి యనుకూలప్రసంగమున కెంతో సంతోషించి వరూథిని నీ ఇష్టానుసారముగా ప్రవర్తింతునని చెప్పెను. అంతట నొక మణిగృహములోనికేగి వారు క్రీడించిరి.

## స్వరోచి పుట్టుక

మాయాప్రవరునివలన వరూథిని గర్భమును ధరించెను. అచ్చుట తానుండవలసిన పని తీరిపోయినదని తలపోసి, చెప్పక వెళ్ళినచో స్త్రీహత్యాపాతకము చుట్టుకొనునని తన గృహ పరిస్థితులు బాగుగా లేవని సిద్ధునివలన దెలిసికొన్నట్లు బలికి, సెలవు గొని వెళ్ళిపోయినాఁడు. అతఁడు సెలవు గైకొనునపుడు వరూథిని కన్నీరు గార్చఁగా నతండు 'దివ్యవనితవు. ధీరురాలవు. నీవిట్లు బేలవగుట తగ' దని యోదార్చి సమయోచితముగఁ బ్రసంగించి, తన దారిని పరమానందముతో వెళ్ళినాఁడు. నవమాసములు నిండిన పిమ్మట వరూథిని యొక శుభముహూర్తమున కుమారునిఁ గనెను. మహర్షు లా బాలుఁడు సూర్యచంద్రులవలె బ్రకాశించుటను గుర్తించి 'స్వరోచి' యని పేరిడిరి. యుక్తవయసు వచ్చిన పిమ్మట నా స్వరోచి మునులకడ సకల విద్యల నభ్యసించి మహావీరుఁడై, విశ్వకర్మ మందరగిరి మీఁద నిర్మించిన నగరము రాజధానిగా నాటవికులు గొల్వ రాజ్యపాలన మొనర్చుచుండెను.

## స్వరోచి వేట – మనోరమావృత్తాంతము

ఒకనాడు తన పరివారముతో స్వరోచి వేటకేఁగి తనివితీరగా దుష్టమృగ సంహారమొనర్చిన పిమ్మట, గొన్ని యపశకునములు తోఁచెను. అంతట స్వరోచి యశ్వము నధిరోహింపఁగా గొన్ని శుభశకునములు గన్పట్టెను. ఇంతలో 'ఆర్తను, అనాథను రక్షింపుఁ' డను కేక వినిపించినది. ఆ ధ్వని వచ్చిన వంకకుఁ బోవుటకు స్వరోచి యత్నించుచుండఁగా, నొక యౌవని యటకు వచ్చి 'మూఁడు దినములనుండి నన్నొక రాక్షసుఁడు వెంటబడి తరుముచున్నాఁడు. నేను ఇందీవరాక్షుఁడను గంధర్వరాజునకు మరుదశ్వుని కుమార్తెవలన గల్గినదానను. నా పేరు మనోరమ' అని చెప్పి, పూర్వము ఆమె తన చెలికత్తెలయిన కళావతి విభావసులతో నొక వృద్ధముని

యున్న యాశ్రమభూమికిఁబోయి విహరించుచు బాల్యచాపల్యమున నతని సమాధికి భంగము గావించుటయు, నతఁడు వృద్ధుఁడనైన నన్ను అవమానించితివి గావున నీవు రాక్షసుని వలన బాధ నొందెదవని శపించుటయును దెలియఁజెప్పెను.

ఆ సమయమున తన చెలికత్తెలు శాపమిచ్చినందులకు మహర్షిని నిందింపఁగా, నతఁడు కోపించి వారిని క్షయ రోగపీడితలగుదురని శపించుటయును మనోరమ స్వరోచికెఱిగించెను.

మనోరమ తనకడ నస్త్రహృదయమను విద్య యున్నదనియును, దాని నతని కొసఁగెదనని చెప్పి 'దాని సహాయమున నీవు రాక్షసుని సంహరింపు' మని స్వరోచిని కోరెను. అంతట స్వరోచి శుచియై మనోరమవలన అస్త్రహృదయమును ఉపదేశము పొంది, అప్పటికి తనపై వచ్చి పడిన రాక్షసునితోఁ బోరాడెను. అతఁ డెంతటికిని లొంగకపోవుటచే స్వరోచి ఆగ్నేయాస్త్రమును బ్రయోగింపగా నా రాక్షసుఁడు నేలగూలెను. అతని శరీరమునుండి యొక దివ్యతేజము గంధర్వరూపమున వచ్చి స్వరోచిని చేరెను. ఈ గంధర్వుడే మనోరమ తండ్రియైన ఇందీవరాక్షుఁడు. అతఁడు తాను పూర్వ మాయుర్వేదమును నేర్చుకొనఁ గోరి యొక మునికడకుఁబోగా నతఁడు తిరస్కరింపఁగా, ప్రచ్ఛన్నుఁడై యాతనికడనే విద్య నేర్చి, యా విషయము నాతని కెఱిగింపఁగా నతఁడు కోపము వహించి రాక్షసుఁడవు గమ్మని శపించుటయును, శరణుఁ జొరఁగా గొన్ని దినములకు నీవు రాక్షసరూపమున నీ కుమార్తెనే మ్రింగబోయి, యొక మహాత్ముని బాణములకు గుఱియై శాపాంతము నొందెదవని చెప్పుటయును స్వరోచికిఁ జెప్పెను.

తుదకు ఇందీరాక్షుడు తన కుమార్తెయైన మనోరమను ఆయుర్వేదవిద్యతోఁబాటు స్వరోచికి కాన్కగా నర్పింప, నతఁడు ఆమెను సంతోషముతో గ్రహించెను. తరువాత నిందీవరాక్షుఁడు స్వరోచిని తన నగరమునకుఁ గొనిపోయి వైభవముగ వివాహ మొనర్చినాఁడు. అనతికాలమున మనోరమ కోర్కెపై స్వరోచి ఆమె చెలికత్తెల కుష్ఠవ్యాధినిఁగూడ నయమొనర్చి వారికి బూర్వ సౌందర్యమును జేకూర్చినాఁడు. వారతని వివాహమాడఁ బ్రార్థింపగా, స్వరోచి మనోరమ యంగీకారముతో వారినిఁగూడ వివాహమాడినాఁడు.

### వనదేవతావృత్తాంతము

ముష్వురు భార్యలతో స్వరోచి బహుకాలము సుఖించిన పిమ్మట, నొకనాఁడు వేటకేగి యనేక జంతువుల సంహరించియు దృప్తినొందక యొక వరాహమును

జంపఁబోవు చుండఁగా, నొక లేడి వచ్చి 'రాజా! దానిని చంపవలదు, నన్ను జంపుము' అని యనెను.

స్వరోచి మనుష్య భాషణముల నా లేడి యట్లు పల్కుట కాశ్చర్యమొంది, 'నిన్నేల జంపుమందువు?' అని ప్రశ్నింప నా లేడి ఇతర స్త్రీలతోఁ గ్రీడించువానిని గోరుటకన్నఁ జచ్చుట మేలని పల్కినది. పిమ్మట నా లేడి 'నీ వెవనిని ప్రేమించితి' వని యడుగఁగా 'నిన్నే ప్రేమించితిని. నన్ను కౌఁగిలించుకొను' మని కోరినది. స్వరోచి యట్లొనర్చినంతనే యా లేడి యొక సుందర స్త్రీమూర్తియై యాతని కౌఁగిట నొదిగి, పిమ్మట తాను ఆ వనదేవతనని 'సమస్తదేవతలును నీ వలన మనువును పొందవలసినదని నన్ను గోరుటచే నిటు వచ్చితి' నని చెప్పి, తన్ను స్వీకరింపవేడినది. స్వరోచి యామెనుగూడ భార్యగా నంగీకరించెను.

### స్వారోచిష మనుసంభవము

అనతికాలమున నామె గర్భిణియై 'స్వారోచిషుఁ' డను బాలుని కనెను. అతఁడు యుక్తవేళ శ్రీహరిని గూర్చి తపమాచరించి విష్ణువు ప్రత్యక్షము కాఁగా 'దేవా! నేనీ ప్రపంచమున నుండఁజాలను. నన్ను నీలోఁ గలుపుకొను' మని ప్రార్థించెను. శ్రీహరి 'నీ కోర్కెను దీర్చెదను. కాని నీవు కొంతకాలము భూలోకముననుండి ధర్మరక్ష యొనర్పవలసియున్నది. నీవు, రెండవ మనువై భూమిని పాలింపు' మని పల్కి అదృశ్యుఁడయ్యెను. శ్రీహరి యాజ్ఞానుసారముగా స్వారోచిషుఁడు కొంతకాలము ప్రజాపాలనమొనర్చి పిమ్మట మహావిష్ణువులో నైక్యమొందెను.

### మూలానుసరణము

మారన మార్కండేయ పురాణానువాదమున పురాణమునందలి మూలకథ నెట్లనుసరించినాఁడో యదేరీతిగా పెద్దనార్యుఁడును ప్రధానముగా అనుసరించినాఁడు. మూలమందలి కథకును, ప్రబంధమందలి కథకును స్వల్ప భేదములు రెండు మూఁడు కన్పట్టుచున్నవి. అవియైనను విస్తారమైన వ్యత్యాసములు కావు. స్వల్పములైన ఈ వ్యత్యాసముల వలన 'మనుచరిత్ర'కు గుణాధిక్యము కల్గినదే గాని యెట్టి లోపమును గల్గలేదు.

మనుచరిత్రమునకు మూలమునకు భిన్నమైన ప్రధాన కల్పనము స్వరోచి మృగయావర్ణనము. ఈ వేట వర్ణనమును పెద్దనార్యుఁడు ఆ కథాసందర్భమున జరుగనున్న సన్నివేశములకు రంగముగాఁ జిత్రించినాఁడు. భయవిభ్రాంతయైన

మనోరమను రాక్షసుఁడు తరుముకొనుచు స్వరోచికడకుఁ దెప్పింపవలసియున్నది. కావున నట్టి సమాగమ సమావేశముల కనుకూలముగా నుండుటకై కావ్యతత్త్వజ్ఞుడైన పెద్దన భయానక బీభత్సములతో గూడిన వేట జరిగినట్టి యరణ్యప్రదేశమును రంగస్థలము గావించి దానిని వర్ణించినాఁడు. దీనినే వాతావరణసృష్టి (The creation of atmosphere) అని పాశ్చాత్య విమర్శకులందురు. 'ఇది మన శాస్త్రములలోని ఉద్దీపన విభావమున కించుమించు సరిపోవును' (శ్రీ పింగళి). మిగిలిన సందర్భములన్నింటను పెద్దన మూలమునే యనుసరించినాఁడు.

అయినను మార్కండేయ పురాణమునను పాఖ్యానముగా నున్న ఈ కథను చదువునప్పుడును, ప్రబంధమందలి యీ కథను జదువునప్పుడును కల్గు నానందములు వేరు. మనుచరిత్రయందు పురాణమందలి ఈ ఉపాఖ్యానమునఁ గన్పట్టని అపూర్వ శిల్పసృష్టి సర్వత్ర గోచరించును. ఇదియే పురాణము లందలి ఉపకథలకును, ప్రబంధములకును సహజముగా గన్పట్టు భేదము. ప్రబంధాత్మకమైన శిల్పవిన్యాసముల మూలముననే మారన మార్కండేయ పురాణమునందలి 150 పద్యముల కథ, మనుచరిత్రలో 800 పద్యములుగా బెరిగినది.

ఉత్పాద్యవస్తువునకు కాలప్రభావముచే (లక్షణము) గౌరవము లేనందున కథను పురాణమునుండి గ్రహించినప్పటికి, 'కథన చమత్కృతి, వర్ణననైపుణి, పాత్ర సృజనశక్తి, రసదీప్తి కలిగి సమగ్ర ప్రసాదిత (పూర్తిగా నలంకరింపబడినది) మైన రంగమునందు బ్రదర్శింపబడిన నాటకమువలె నీ కావ్యము సహృదయరంజకముగా నాల్గు వందల సంవత్సరములనుండి, ఆంధ్రప్రబంధలోకమున తన ప్రాభవము నకుంఠితముగా నిర్వహించుకొనుటకుఁ గారణభూతమైన సమస్తశక్తియును ఆంధ్రకవితా పితామహుఁడైన అల్లసానివానిదే. ఈ మనుచరిత్ర 'మల్లసానివారి అల్లిక జిగిబిగి' యను పలుకులు ప్రతిపదమును సార్థకపఱుచుచున్నవి.

పెద్దనార్యుఁ డీ ప్రబంధమును దీర్ఘకాలము పరిశ్రమ చేసి తన సర్వతోముఖ పాండిత్యమును జతుర్విధ కవితావిలాసమును వెలయించి, నిబ్బరమైన శైలి నాహా పుట్టించునట్లు పోహళించెను గాని యందదుకులుగా నెందును ముడిపెట్టలేదు.

ఈ గ్రంథమునందు గూర్చు నేర్పును, భావవైచిత్ర్యమును బిక్కటిల్లని పద్యముగాని, గద్యముగాని చూపట్టదు. ఎక్కడఁబట్టిన నక్కడఁ గవీశ్వరుని లోకజ్ఞానము, భాషావైదుష్యము (భాషాపాండిత్యము), కల్పనాచాతుర్యమును వెల్లివిరియుచున్నవి. (శ్రీ వేటూరి). (అనేక) గుణము లొక్కచో రాశీభూతమై యావిర్భవించిన మొదటి

ప్రబంధమగుట చేత[3], తరువాతి ప్రబంధ కర్త లెల్లరును దీనిని బుద్ధిపూర్వకముగానో, అప్రతర్కితముగానో (విచారింపఁ బడకనో) అనుకరించిరి. ప్రబంధకవులలో పెద్దనార్యుని యగ్రస్థానమునకు ఇది ప్రబల దృష్టాంతము.

## కవితావిశేషములు

## మనుచరిత్ర – గుణ దోషములు

ఆంధ్ర సాహిత్య ప్రపంచమునందలి అమూల్యాభరణములైన పంచ మహాకావ్యములలో నొకటిగఁ బరిగణింపఁబడుటయే గాక, రాయలయుగమందలి (లేదా ప్రబంధయుగమందలి) కావ్య జాలమంతటికిని మార్గదర్శకమై, ప్రబంధమనెడి నూతన ప్రక్రియావిభేదమునకు సంబంధించిన శిల్పవిన్యాసముల కెల్ల గనియై, కృతికర్తకు మహాకవికోటిలో స్థానమొసఁగిన ప్రబంధ రాజము మనుచరిత్ర. ఏతత్కృతికర్త ఆంధ్ర కవితాపితామహుఁడు అల్లసాని పెద్దనార్యుఁడు. చతుర్విధ కవితానిర్వాహకుఁడు. సాహితీసమరాంగణ చక్రవర్తియైన కృష్ణరాయల భువన విజయ విద్వద్గోష్ఠికి సభాపతి.

ఇట్టి అపూర్వ వ్యక్తిత్వము గల దక్షుఁడైన పెద్దనార్యుని మనుచరిత్రమున గుణవిశేషము లెన్నియో లెక్కలేనన్ని యుండకున్నచో దానికి గాని, తత్కర్తకుఁగాని అగ్రస్థానము ఎట్లు లభింపగలదు? బహువిధ గుణాధిక్యముచే నొప్పకున్నచో 'కవితాప్రావీణ్య ఫణీశుఁ' డని కీర్తిగన్న రాజాధిరాజైన రాయ లీ మహాకావ్యమును గృతినందుకొనువేళ పెద్దనార్యుఁడు పురమేగునపుఁడు పల్లకిని దనకేలఁబట్టి యెత్తుట యెట్లు?

## కథాకథన ప్రావీణ్యము

సామాన్యముగ నొక కావ్యమందలి గుణవిశేషములను బరిశీలించు సందర్భమున గమనింపవలసిన యంశములలో నీ కథాకథన ప్రావీణ్యమొకటి. ఆంధ్ర సాహిత్యమున కేవలము నూతనకథను కల్పించినవాఁడు పింగళి సూరనార్యుఁడొక్కడే. ఉత్పాద్య కథలకు (Original story) ఆ కాలమున గౌరవము లేదు. కావున పెద్దనాదులు ఘనమైన భావనాబలము కలవా రైనప్పటికిని నూతనకథలను సృష్టించుటకుఁ బూనుకొనలేదు. పురాణోక్తములైన ప్రఖ్యాతకథలనే వారు స్వీకరించుచు వచ్చిరి. కావున నీ యంశము విషయమున, నాయాకవులు పురాణమునుండి గ్రహించిన కథను తిరిగి

చెప్పుటలో నెట్టి నైపుణ్యమును ప్రదర్శించినా రనునదియే మనము గమనింపవలసిన యంశము.

మారన మార్కండేయ పురాణమున 150 పద్యములలో నున్న కథను 800 పద్యములుగ రసవత్తరముగఁ బెంచి చెప్పుటలో, పెద్దన మహాకవి కథాకథన వైశద్యము వ్యక్తమగుచున్నది. పెద్దనార్యుఁడు స్వారోచిషమనుసంభవ కథను ప్రవరుని చరిత్రతో నారంభించుటలోనే యొక వైశిష్ట్యము, కథాకథన పథకమందలి దూరదృష్టి కన్పట్టుచున్నవి.

స్వారోచిషుఁడు మనువు. 'మనువులు భువనరక్షాదక్షులు. తేజోనిధులైన ధర్మస్వరూపులు. మానవలోకవాసులయ్యును మానవాతీతులు. దేవాంశసంభూతులు. స్వారోచిషునకు మనుత్వము నొసగఁగలిగిన యట్టి అర్హతలు అతని జనకుఁడైన స్వరోచినుండి అతనికి సమగ్రముగా సంక్రమించుటకు తాత్త్వికముగా అవకాశము లేదు.

స్వరోచి వరూథిని వలె దేవతాంశసంభూతుఁడే; భువనరక్షాదక్షతగల శౌర్యవంతుడే. అయ్యు లోకమును ధర్మమార్గమును నయింపగల ధర్మస్వరూపుఁడు కాఁడు. అతఁడు కామస్వరూపుఁడైన వ్యసని. బాల్యముననే భక్తివైరాగ్యసంపన్నుఁడై చిరకాల తపశ్చర్యవలన శ్రీమహావిష్ణువును సాక్షాత్కరింపజేసుకొనిన స్వారోచిషుని ఆధ్యాత్మిక సంపద, ఆ తండ్రివలన సంక్రమింపనపుడు మరియెక్కడనుండి వచ్చియుండును? స్వారోచిషుని మనుపదమునకు అవసరమైన ధర్మనిష్ఠాగరిమ తల్లిదండ్రుల నుండి కాక, వారి తల్లిదండ్రులనుండి సంక్రమించినది. స్వరోచి జననీజనకులు వరూథినీ మాయాప్రవరులు గదా! ఈ జంటలో తల్లి యొక్క సౌందర్యము ప్రణయ స్వభావము స్వరోచిలో అచ్చుపడి, అతనిని తల్లిపోలిక కొడుకుగా బరిణతి నొందించెను. ఇక మాయాప్రవరుఁ డీతని పుట్టుకకు నిమిత్తమాత్రమే గాని తాత్త్వికమైన జనకత్వము అతనికి లేదు. అట్టి జనక స్థానమున నున్నవాఁడు ప్రవరుఁడు. అనన్య మనస్కురాలై – తదేక ధ్యానముతో ఆ బ్రాహ్మణ కుమారుని ఆరాధించిన వరూథిని గర్భధారణవేళ తాల్చిన తేజ మా బ్రాహ్మణునిది. అతని పవిత్రతయు, నతని యాధ్యాత్మికతయు స్వరోచికి సంక్రమింపవలసి యుండెను. ఆ గుణసంపద అతనిని త్రోసిపుచ్చి అతని కుమారుడైన స్వారోచిషునకు సంక్రమించెను. లోకములోఁ గొందరు తండ్రుల గుణములతోను, కొందరు తాతల గుణములతోను జనియించుట, స్వాభావికమే. ఈ రహస్యము జీవశాస్త్ర న్యాయమునను (Law of Biology) సమ్మతమే.

కావున మనుసంభవమునకుఁ బ్రభవ కారణమైన ప్రవరుని చరిత్రమే లేనిచో, ఈ కావ్యమునకు బీజమే ఉండదు. (శ్రీ పింగళి).

ఇంతటి దూరదృష్టితో ధార్మికాభిమాన ప్రవృత్తులతోను తన కావ్యమునకుఁ గథారంభ మొనర్చుట పెద్దనార్యుని కథాకథనప్రావీణ్యమున కొక తార్కాణము.[6]

పెద్దనార్యుని కథాకథన శిల్పప్రావీణ్యము పరాకాష్ఠనందిన ఘట్టము వరూథినీ వృత్తాంతము. ఇందు ప్రధానపాత్రలు వరూథినీప్రవరులు. భిన్నప్రకృతులు. పరస్పర విరుద్ధములైన శృంగార శాంతములకు గ్రమముగ ప్రతీకలు. ఆలంబన విభావములు.

భిన్న లోకములలో (దేవ మానవ లోకములు) జన్మించినవారు. వరూథినిది భోగభూమి – ప్రవరునిది కర్మభూమి. ధర్మవిషయమునను నిరువురకుఁ బరస్పర వైరుద్ధ్యమున్నది. అట్టి ప్రకృతులకు, నవస్థలకు లోనైన పాత్రలకు సంబంధించిన కథను, ఉత్తమకథకుఁడై యే వంకకును మొగ్గక, కడు సమర్థతతో పెద్దనార్యుఁడు మెప్పు పుట్టి రసికజను లాహా! ఏమి కథన శిల్ప నైపుణ్య మనునట్టు నడిపినాఁడు. వరూథినీమాయాప్రవర పాత్రలతోఁ గూడిన వరూథినీవృత్తాంత మందలి ఉత్తరార్ధమునను పెద్దనార్యుని కథాకథనదక్షత అవస్థానుగుణమై మహోదాత్తముగనే యొప్పుచున్నది. మాయాప్రవర వృత్తాంతమును పెద్దనార్యుని కథనశిల్పమున మనోజ్ఞముగఁ గోచరించుచున్నదనుటలో నెట్టి సంశయమును లేదు. మనుచరిత్రలోని ఉత్తరార్ధమందలి కథ రసవిషయికముగాఁగాని, కథాసన్నివేశాదులచే గాని, పాత్రల వైశిష్ట్యాదుల వలన గాని పూర్వార్ధమందలి కథతో నే విధముగను సరిపోలునట్టిది కాదు. అందు కథానిర్వహణ మాత్రమునకు అక్కరకు వచ్చు అలతి యలతి వృత్తాంతములు మాత్రమే కొన్ని కలవు. ఆ వృత్తాంతములు వరూథినీపుత్రుఁడైన స్వరోచి జీవితమునకు సంబంధించినవి.

పెద్దనవంటి కృతహస్తుఁడైన కవిగానిచో ఈ భాగమంతయును పేలవముగా తేలిపోయి యుండెడిది. ఈ కవీంద్రుఁ డీ యెడ 'కథావస్థానుసారముగ పద్యరచనా సౌందర్యమును, కథనచాతుర్యమును ప్రదర్శించి, గ్రంథమునకు నెట్టి వెలితి రాకుండఁ గాపాడినాఁడు.

## పాత్రసృష్టి

మహాకవుల శక్తిసామర్థ్యములను బ్రదర్శించు కవితాగుణవిశేషములలో నీ పాత్రసృష్టి లేదా పాత్రోన్మీలనాసామర్థ్యము ఒకటి. స్వీకరించినట్టి లేదా కల్పించినట్టి

కథలోని వివిధపాత్రలను భావనాబలవిశేషముచే ముందు తాను దర్శించి, తన శబ్దసంపత్తి సహాయముతో అవస్థానుగుణములైన యా పాత్రల రూపమును, చేష్టా సంభాషణాదికమును, మనోవృత్తులను కన్నులకుఁ గట్టునట్లు, శ్రవణేంద్రియమునకు సోకునట్లును శిల్పింపవలయును.

అట్లే శిల్పప్రావీణ్యము గల మహాకవులు చిత్రించిన పాత్రలు సర్వకాలముల నెక్కడనో సజీవులై యున్నట్లు భావుకలోకమునకు మనోనయనములముందు గోచరించుచుందురు. అట్టి నిత్యత్వముగల పాత్రలను సృష్టింపగలిగిన కవి కీర్తి కా పాత్రలు చిరస్థాయిత్వమును గల్పించుచుండును.

ఆంధ్ర సాహిత్య ప్రపంచమున మహాకవి తిక్కన సృజించిన భారతపాత్రలకుఁ బిమ్మట, పెద్దనార్యుఁడు సృష్టించిన ప్రవరవరూథినుల వలె ఆంధ్రజాతితో సాన్నిహిత్యమును బొందుచు నొప్పునట్టి పాత్రలు, భారత మనుచరిత్రలకు మధ్యకాలమున మఱల పుట్టలేదు. జన్మ, శీల, ధర్మాదులయందు పరస్పర వైరుధ్యము గల ప్రవరవరూథినుల సృష్టించుటలో పెద్దన మహాశిల్పి సామాన్యముగ శ్రవ్యకావ్యకర్తలలోఁ గన్పట్టక, పరిణతి పొందిన దృశ్య ప్రబంధ నిర్మాతలయందే కన్పట్టు నాటకీయ తాటస్థ్యమును (Dramatic Objectivity) ప్రదర్శించినాఁడు. ఈ పాత్ర సృష్టి పెద్దనార్యుని యపూర్వలోకజ్ఞతకు, భావనాబలమునకు నిదర్శనమై యొనర్పుచున్నది.

వరూథినీప్రవర పాత్రలే కాక మాయాప్రవర పాత్రను, అల్పకాలము మాత్రమే కథారంగమున నిల్చిన ఔషధసిద్ధుని పాత్రను సహితము పెద్దన తుల్యశిల్పముతోనే సృష్టించినాఁడు. స్వరోచి మనోరమాది పాత్రలును కథలో వానికిగల స్థానమును బట్టి ఉచితరీతిని ఉన్మీలన మొనర్పబడినవి. ఏమైన నిందలి పాత్రలలో వరూథినీప్రవర పాత్రలు అపూర్వములు. అనన్యసాధ్యములు. రెంటిని పెద్దన సమానాదరముతోఁ బోషించినాఁడు.

మనుచరిత్రను జదివిన రసికులెవ్వరును వేశ్యయని గాని, శ్రోత్రియునకు వ్రతభంగము చేయనెంచిన వలపుకత్తెయని గాని, వరూథినిని గర్హింపరు. మీదుమిక్కిలి ఆ యువతి యనురాగ మస్థానపతితమైనదని చింతిల్లు సహృదయులుందురు. ఆమెకు లోఁబడక ధీరుఁడై తప్పించుకొని ఇల్లు చేరిన ప్రవరుని తలచి, భక్తిపూర్వకముగా మరల వారే జోహారు లర్పింతురు.

మనుచరిత్ర పుట్టినది మొదలు హావభావాది విలాసములతో నెంతటి జితేంద్రియునైన జయింప సాహసించు 'శృంగార చణత'కు వరూథినిది, జితేంద్రియతకు శుకమహర్షిని మరపించు ప్రవరునిది ఆంధ్రలోకమున పెట్టిన పేరులైనవి. మార్కండేయ పురాణమం దే మూలనో యున్న ఈ పాత్రద్వయమును జూచి పునఃసృష్టించి రసికలోకమున కిచ్చిన అపూర్వశిల్పి పెద్దనార్యుఁడు తక్క నింకొకఁ డే భారతదేశ ప్రాంతీయ భాషయందును నున్నట్లు కన్పట్టదు.

సిద్ధుఁడన్న పేరు చెవిసోకినంతనే ఔషధ సిద్ధునిఁ బోలిన సిద్ధుఁడు యావదాంధ్ర సాహిత్యము నందును గోచరింపక పోవుటయును గమనింపవలసిన యంశము.

'ప్రవరసిద్ధ సంభాషణము' నందే పెద్దనార్యుఁడు ప్రవరుని పాత్ర కొక విస్పష్ట రూపచేష్టాభాషాదికము నిచ్చి యొక వ్యక్తిత్వమును (Individuality) జేకూర్చుటయును గమనింపవలసి యున్నది. ఉత్తరకథ లేకున్నను ప్రవరుఁడు మరపురాని పాత్రగా నిల్వగలఁడన్న యభిప్రాయ మీ ఘట్టమును జదివినంతనే పాఠకునకు గలిగితీరును.

**సంభాషణవిరచనము**

ఉత్తమ కథకున కావశ్యకములైన ప్రజ్ఞలలో సంభాషణ విరచన మొకటి. కథాకథన దక్షుఁడైన కవి ఎపుడు వర్ణింపవలయునో, ఎపుడు పాత్రల కథారంగమునకుఁ గొనివచ్చి వారిచే సంభాషణ చేయింపవలయునో బాగుగ నెఱుఁగును. పెద్దన ఉత్తమ కథకుఁడు. సంభాషణ విరచనాప్రావీణ్యము ఈ మహాకవి కనంతముగ నున్నది. రసావస్థల కనుగుణముగ నీతఁడు పాత్రలచే సంభాషణము చేయించినాఁడు.

ఇతఁడు సంభాషణలు సాగించుటలో వ్యంగ్య, గుణీభూతవ్యంగ్య, వాచ్య మర్యాదల నెల్ల నెఱిఁగి, పాత్రలచే వ్యంగ్య సంభాషణలచే చలింపఁ జేయఁజాలక వాచ్యముగ తన హృదయానురాగమును దెల్పి, 'దీనాలాపములతో వేడుకొనుటే గాక, తనబుద్ధిగరిమచే ప్రవరుని సదాచార సిద్ధాంతములను 'ఆనందో బ్రహ్మ'యటన్న ప్రాఁజదువు నంతర్బుద్ధి నూహింపుమా' యన్నంతవఱకును వెళ్ళి, పూర్వపక్షము చేయఁజూచిన వరూథినియుక్తులను, సహజ వైరాగ్యసంపత్తితో నొప్పు ధర్మబుద్ధితో ఆమె తలఁపును మందలింప యత్నించిన ప్రవరుని సమాధానమును గల సంఘర్షణముతో గూడిన సన్నివేశమున పెద్దనార్యుడు నడిపిన సంభాషణములు, ఆయన బుద్ధివ్యాపారవిన్యాసములతో గూడిన రమణీయసంభాషణ విరచనా చాతుర్యమునకు పరమావధిగ గన్పట్టుచున్నది.

ఈ కథాభాగమునందలి 'ఎన్ని భవంబులన్ గలుగు నిక్షుశరాసన సాయక వ్యథాఖిన్నత వాడి' ఇత్యాది సంభాషణములు ప్రతిపదరసోదయములై యొప్పుచున్నవనుట నిస్సంశయము. తలంచిన కొలదిని పెద్దనార్యుని సంభాషణలు తలపు లూరించుచుండుననుట సత్యము. సిద్ధ ప్రవర సంభాషణమునందు పరిణతమైన సంభాషణ విరచనాకౌశలము గన్పట్టుచున్నది. తన తీర్థయాత్రాకుతూహలమును వెల్లడించుట కారంభించినది మొదలుగ, 'నను మీ శిష్యుని తీర్థయాత్రవలనన్ ధన్యాత్ముగాఁ జేయరే' యని సిద్ధుని శరణు జొచ్చునంతవఱకును, ప్రవరునిచే పెద్దనార్యుఁడు అతని వినయసౌశీల్యాది గుణవిశేషములు, భక్తిభావము వెల్లడియగునట్లు వివిధాంతరములతో (నిఃశ్రేణులతో) సంభాషింపఁజేసినాఁడు.

అతని సంభాషణమునకు ముగ్ధుఁడై సిద్ధుడుఁ పరమంబైన రహస్యమగు పాదలేప వృత్తాంతమును దెల్పుటయే గాక, దానిని ప్రసాదించునంతవఱకును లొంగి పోయినాఁడా యన్నట్లు ప్రవరునిచేఁ బల్కించినాఁడు.

సిద్ధుఁడొనర్చిన సంభాషణమునందును ఆత్మశక్తి నెఱిఁగిన అహంకారము గాని ఆత్మవిశ్వాసము, విజ్ఞానాధిక్యము, శిష్యజనానురాగము, లోకానుభవము మొదలైన గుణవిశేషములను ప్రదర్శించినాఁడు. తన ఆశ్రమధర్మముపై నభిమానమున్నను గృహస్థాశ్రమాధిక్యమును గుర్తించి, 'కెలఁకులనున్న తంగెటి జున్ను గృహమేధి' ఇత్యాదిగాఁ బలుకుటయును పెద్దన ఔచితీపోషణతోను, ఆశ్రమస్థాన ధర్మవేతృత్వముతోను గూడిన సంభాషణ విరచనాప్రావీణ్యమును వెల్లడించుచున్నది. పెద్దనార్యుని సంభాషణలందు ఆ మహాకవి అపూర్వ విజ్ఞానలోకజ్ఞతలు వెల్లడి యగుచున్నవి.

పెద్దనార్యుని సంభాషణ విరచనమునందును నాటకీయ తాటస్థ్యము కన్పట్టుచున్నది. పాత్రలన్నిటి సంభాషణలు విశిష్టములు, సమయోచితములు, స్వభావోచితములు.

### వర్ణనవిశేషములు

మనుచరిత్ర మహాకావ్యమునకు సౌభాగ్యమును చేకూర్చిన గుణవిశేషములలో వివిధ వర్ణనకౌశల మొకటి. ప్రబంధము వర్ణన ప్రధానమను నంశమును బలవంతముగ మనమునఁ బెట్టుకొని వర్ణించుట యిందుఁగన్పట్టదు. ఈ వర్ణనలలో పెద్దనార్యుని మానవప్రకృతి – బాహ్యప్రకృతి, ఆంతరికప్రకృతికి సంబంధించిన పరిజ్ఞానము

విశేషముగాఁ గన్పట్టును. ప్రకృతి నతినిశితముగ పరిశీలించినవారిలో నీ బెద్దనార్యుఁ డొకఁడనిపించును.

ఇందలి కొన్ని వర్ణనలతో సరిపోల్పదగినవి ఆంధ్ర సాహిత్యమునందే కాక సంస్కృత సాహిత్యమునందును, లేదా ప్రపంచ సాహిత్యమునందును లేవని చెప్పుట యతిశయోక్తి కాదు. ఆయా కథాసన్నివేశములలో పాత్రల మనోవృత్తులను, అవస్థా విశేషములను, జేష్టాదికములను కడు కౌశలముతో బెద్దనార్యుఁడు చిత్రింపగలఁడు. ప్రవరునిచే దిరస్కృతయై పర్వతసానువుల వెంట దుఃఖనిర్మగ్నయై తిరుగుచు, దరి లేని దుఃఖసాగరము నీఁదుచున్న వరూథిని అవస్థను చిత్రించిన సందర్భమున, పెద్దనార్యుఁడు ప్రదర్శించిన విరహిణీ 'హృదయ వివృక్త పరిజ్ఞానము' మహాశ్చర్యకరము! దృశ్యవర్ణన సంపదయందు మనుచరిత్రము మేటి. ఇందలి పూర్వభాగములోని హిమవద్గిరిదరీఝరీ సానువర్ణనలు, సంధ్యాకాలవర్ణనలును, ఉత్తరభాగమందలి అటవీమృగయావర్ణనలు చిత్రలేఖనమునకు ఒరవడి కాదగిన దృశ్యములు. ఇవి కథాసందర్భమునకు ఉచితములును, కథాకార్యమునకు ఆవశ్యకములునైనవి. వీని మూలముగా 'కావ్యశ్రీ నాటకమునకు పెద్దనార్యుఁడు రంగస్థల వ్యాపారమును నిర్వహించినాఁడు.' ఆయా యెడలఁ బొడము రసభావములకు ఉద్దీపన విభావములుగా వెలుగొందజేసినాఁడు. కథ యందలి ప్రతి నాటకీయ సన్నివేశమునకును (Dramatic Situation) ముందు పెద్దన మనోహరవర్ణన మొనర్చి నేపథ్యచిత్రణము నొనర్చి గాని పాత్రలచే సంభాషణమును జేయింపఁడు.

ఇందు మూలమున పాత్ర లే పరిసరములలో నెట్టి యవస్థావిశేషములందు సంభాషించు చున్నారో పాఠకునకుఁ గన్నులముందు గోచరించుచుండును. మరియు వర్ణిత దృశ్యముల స్వభావమునుబట్టి పదగుంఫనము గూడ నొకయెడ సరళముగా, నొకయెడ నుదాత్తముగా, ఒకయెడ గంభీరముగా, ఒకయెడ సంశ్లిష్టముగా రూపొందుచుండును.

'శబ్దసరణి యెన్ని రూపాంతరములు పొందినను పెద్దన వాక్కునకు సహజమైన ప్రసన్నత, ముత్యములోని లావణ్యమువలె ప్రస్ఫుటమగుచునేయుండును. మఱియు వర్ణనానుగుణముగా నినదించునట్లు శబ్దమును గుంఫనము చేయుటలో ఈ కవి అద్వితీయుఁడు' (శ్రీ పింగళి).

'కావ్యములలో స్థిరపదార్థములను వర్ణించుటకంటె చరపదార్థములను వర్ణించుట కష్టతరము. అంతకంటెను దుష్కరము ప్రాణుల అంతర పరివర్తనములను వర్ణించుట.

పెద్దన ఈ త్రివిధ వర్ణనలు చేయుటయందును సమాననైపుణి గల మహాకవి. అందును చరద్రూపములను జిత్రించుటలోనే ఆయనకు గుతూహల మెక్కువ.' నలకూబరతుల్యుఁడైన ప్రవరుఁడు తొలుతగా గంటఁబడినపుడు చూచినది మొదలుగా రిచ్చపాటు పొందిన కన్నుదోయితో నాతని సౌందర్యామృతమును జూరగొనునప్పటి వరూథినీచలత్సౌందర్యము వర్ణన మిందుకుఁ జక్కని నిదర్శనము. కథతో నెట్టి సంబంధము లేకపోయినను ముక్తకములుగా నిలువగలిగిన గొప్ప వర్ణనలు గల పద్యములిందు ఎన్నియో కన్పట్టుచున్నవి. అట్టివానిలో నుత్తమములైనవి ప్రవరుఁడు వరూథినిని తొలుతగాఁ జూచినపుడు పెద్దన చెప్పిన 'తతనితంబా భోగ ధవళాంశు కములోని' ఇత్యాది వర్ణనము. ఈ దృశ్యవర్ణన మాధారముగాఁ గైకొని కృష్ణదాసను చిత్రకారులు రమణీయచిత్రమును గూడ చిత్రించినారు.

'చూచి ఝుళంఝుళత్కటక...' ఇత్యాది వర్ణన మాధారముగా గ్రహించి పోక నునుబోదియఁ జేరి విలోకన ప్రభావీచికలతో ప్రవరుఁడు వచ్చుచున్న పదవీకలశాంబుధిని వెల్లిగొల్పు వరూథినీ రమణీయభంగిమము శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తి చిత్రించినారు.

'ముడిచిన యొంటి కెంజెడ మూయు మువ్వన్నె మెకముతోలు కిరీటముగ ధరించి' ఇత్యాది సిద్ధుని వర్ణనము నీ జాతిలోనిది. 'చేర్చుక్కగా నిడ్డ చిన్ని జాబిల్లిచే' ఇత్యాది సరస్వతీవర్ణనమున స్థిరచరపదార్థ వర్ణనములు రెండును గన్పట్టుచున్నవి. 'వరణా తరంగిణీ' ఇత్యాది వర్ణనమున ప్రవరుని ఉదయవేళాజీవిత విశేషమంతయు నొక యల్ప చలనచిత్రరూపమున చిత్రితమైనది.

'కలశపాథోరాశి... రేవెలుఁగు' అన్న చంద్రవర్ణనమున మహాకవియైన పెద్దనార్యుని కవి–నేత్ర (Poet's eye) మెన్ని దృక్కోణములనుండి వర్ణ్యవస్తువును దర్శింపగలదో వ్యక్తమొనర్చు చున్నది. 'ఇందలి అనలాక్షు ఘనజటా వనవాటి కెవ్వాడు వన్నెవెట్టు నవార్తవంపు పువ్వు' ఇత్యాది వాక్యములు, తలచిన కొలది భావవిశేషముల గల్పింపగల సుకుమార భావనాబలమును బ్రదర్శించుచున్నవి. రాయల పరాక్రమ విశేషమును వర్ణించు సందర్భము నందలి 'క్రూరవనే భదంతి' ఇత్యాది వర్ణనము ప్రకృతిరహస్యపరిశీలనమును, 'ధర కెంధూళులు' ఇత్యాది మనోహర భావనా విశేషమును, 'మదకల కుంభి కుంభ వనమౌక్తికముల్' ఇత్యాది ఊహాబలమును (Power of Fancy) వ్యక్తమొనర్చుచున్నవి.

పెద్దనార్యుని వర్ణనల నెల్ల ప్రత్యేకముగఁ బరిశీలించినచో అనంత వైవిధ్యము గోచరించుటయే గాక, ఎన్నియో వర్ణన శిల్పకౌశల విశేషములును ద్యోతకములగును. ఇట్టి బహువిధ వర్ణనసామర్థ్యము గలవాఁడగుటవలననే పెద్దనార్యుఁడు ప్రబంధ కవిమండలి కంతటికిని అనుకరణయోగ్యుఁడు, మార్గదర్శకుఁడు నైనాఁడు. కాని తరువాతి ప్రబంధకవులలో నెవ్వరును పెద్దనార్యుఁడు ప్రదర్శించినంతటి వర్ణన వైవిధ్యమును బ్రదర్శించియుండలేదనుట సత్యము. పెద్దనార్యుని వర్ణనలలో రమణీయ భావములు విశేషము. కవికిఁగల సౌందర్య దిదృక్ష, శృంగార రసాభిమానము, ఐంద్రియ భోగలాలసతలు, అపూర్వభావవస్తుదర్శనాపేక్ష లీతని వర్ణనలలోఁ గన్పట్టును. సిద్ధుఁడు పశ్చిమాచలాదులఁ జూచిన విశేషములను దెల్పుచు చెప్పిన దీర్ఘవచనమున నిందుల కెన్నియైనను నుదాహరణములు కన్పట్టుచున్నవి.

**రసపోషణము**

పై గుణవిశేషము లన్నిటికంటెను కావ్యమున కాధిక్యమును గూర్చునట్టిది రసపోషణము. 'మనుచరిత్రమందలి వరూథినీప్రవరుల కథలో అంగిరసము శాంతము. అంగరసము శృంగారము. శమప్రధానుడైన ప్రవరుఁడు ఆలంబనముగా శాంతమునకు, ప్రణయప్రధానమైన వరూథిని ఆలంబనముగా శృంగారమునకు నిట సమ్మేళనము జరిగెను.' శాంతశృంగారములు రెండును విరుద్ధరసములు. ఈ రెంటికిని పెద్దన అన్యోన్య జిగీషతో నొప్పు పోరును గల్పించి మనోహరముగఁ బోషించినాఁడు. అంతమున ప్రవరుఁడు వరూథినీప్రణయమున ముంచివేయఁబడక ధీరుఁడై తన వైరాగ్యనిష్ఠను కాపాడుకొనుటే యాతనికిఁ గల్గిన జయము. అదియే శాంతరస సిద్ధి. పెద్దనార్యుఁడు మనుచరిత్ర కథను ప్రవరుని చరిత్రతో నుపక్రమించుటను, ఆతని సచ్ఛీలమును వర్ణించుటను, ఎట్టి యాటంకము గల్గినను దానిని అకుంఠితముగ గాపాడుటను గమనించితిమేని ఆయన శాంతమునే అంగిరసముగ నుద్దేశించినట్లు స్పష్టమగుచున్నది.[7]

కొందరు విమర్శకులు వరూథినీవృత్తాంతమును రసాభాసమందురు. రతి స్థాయికమైన వరూథినీచరిత్ర శృంగారరస పర్యవసాయి కాలేదని వారి అభిప్రాయము. అట్టి సంయోగమునకు కథలో నవకాశము లేదు. కథలోలేని సంయోగము నే కవియును సాధింపలేఁడు గదా! కథానుసారముగా రసపోషణమొనర్చి పెద్దనార్యుఁడు రససిద్ధినొందిన యుత్తమశిల్పి యన్న ప్రఖ్యాతి గడించినాఁడనుటలో నెట్టి విప్రతి పత్తియును లేదు.

వరూథినీవృత్తాంతములోని ఉత్తరార్ధమైన మాయాప్రవర గాథయందలి ఏకత్రానురాగము (ఏకపక్షానురాగము) ను సహితము పెద్దనార్యుఁడు కడు సమర్థతతోఁ బోషించినాఁడు. ఈ సన్నివేశమున రసాభాసము లేదని, ఉభయత్రానురాగమున్నదని వాదించువారి అభిప్రాయము లంగీకారయోగ్యములు కావు. కథయందు రసాభాసముండుట దోషము గాదు.

## శైలీ సౌభాగ్యము

మనుచరిత్రకుఁ 'బూజ్యస్థానమొసఁగిన గుణగణములలో మొదటిది యిందలి శైలీ సౌభాగ్య'మని శ్రీ పింగళివారు. 'శైలియందుఁ దీనిని మించిన ప్రబంధ మింతవఱకును బుట్టలేదు. ఆడంబరము లేని గాంభీర్యము, సౌమ్యమయిన ప్రాభవము, ఉద్వేగము లేని శీఘ్రగమనము, పేలవత్వము లేని స్వాభావికత, వెలితి లేక నిండారి మెఱుఁగులు తీరిన పదగుంఫనము ఈ కావ్యశైలికి ముఖ్యలక్షణ' మని అభిప్రాయపడుచున్నారు.

ప్రబంధ కవిత్వశైలికి ఒరవడి పెట్టినవాఁడు శ్రీనాథుఁడు. పెద్దన అతని అక్షరముల పొంకమును శతధా అనుకరించి కృతకృత్యుఁడైనాఁడు. పెద్దన సీసములు శ్రీనాథుని సీసములకు సాక్షాత్తు ప్రతిబింబములుగా నుండును. పెద్దన తరువాత ప్రబంధకవులెన్నో రీతుల శ్రీనాథుని సీసముల ననుకరించుటకు యత్నించిరి గాని, ఆ మహిమను పెద్దనవలెఁ గైవసము చేసుకొనలేకపోయినారు.

'మరికొందరు గురువుగారి పెద్ద శిష్యునియొద్ద పాఠముల నేర్చుకొను చిన్న శిష్యునివలె శ్రీనాథునిదెసకు చేతులు మోడ్చి పెద్దననే యనుకరించిరి.' ఆలంకారికమైన ప్రబంధశైలి మనుచరిత్రలో ఉన్నతస్థానము నందుకొనినది. పెద్దన తనకుఁ బూర్వము ప్రబంధపుఁబోకడలు పోయిన మారన, శ్రీనాథ, పినవీరభద్రుల కావ్యములను బహుపర్యాయములు తరిచి ప్రౌఢకవితాశైలిని చేపట్టినాఁడు.

మిన్నులు పడ్డచోటు, కులముసాములు, వెన్నతోఁ బెట్టినది, హుటాహుటి నడలు – ఇత్యాదులైన పలుకుఁబడులను వారినుండి – ముఖ్యముగా శ్రీనాథుని కడనుండి – గ్రహించినాఁడు. అందుచే శృంగార నైషధాది గ్రంథములలోని పద్యములకును, మనుచరిత్రలోని పద్యములకును గొన్ని సామ్యములు కన్పట్టును. ఇందుమూలముగా పెద్దన పూర్వులైన వారియెడ తనకుఁగల గౌరవమును దెల్పినాఁడేగాని, గ్రంథచౌర్య మొనర్చినాఁడనరాదు.

పెద్దనార్యుని శైలికి ముగ్ధులై మనుచరిత్రమునకుఁ బ్రతిబింబములనఁదగిన ప్రబంధములను తరువాతి కవులు కుప్పతెప్పలుగాఁ జెప్పిరి. వానియందు మనుచరిత్రలోని పద్యములతోఁ బోలికగల పద్యములు, కల్పనలు, భావానుకరణములు కొల్లలుగాఁ గన్పట్టుట మనుచరిత్రకుఁగల గుణాధిక్యమునే వెల్లడించును.

## మనుచరిత్ర – దోషములు

ప్రబంధములందు సర్వసామాన్యముగ కథ శృంగారప్రధానమై ఐక్యము కల్గియుండును. కథావిషయమున మిగిలిన ప్రబంధ సామాన్యములకును, మనుచరిత్రమునకును గొంత భేదమున్నది. ఇందలి కథ సామాన్యముగఁ బ్రబంధములలోఁ గన్పట్టు కథలకంటె విస్తారమై యున్నది. ఈ కారణముచే నిది ఏకనాయకము కాదనియును, కథైక్యము (Unity of Plot) లేదనియు, నిదియొక దోషమనియును కొందరు విమర్శకులు భావించుచున్నారు.

కాని మనుచరిత్ర కథయందు కథైక్యము లేదనుట అసత్యము. అంతకంటె నితివృత్తము (Plot) – కథావస్తువు – విస్తృతమైనదనుట కొంత సత్యము. ఇందు కథైక్యము లేదను దోషమునకు సమాధానముగా శ్రీ పింగళి ఇట్లు అభిప్రాయ పడుచున్నారు.

"ఇందు కథలో నైక్యము లేకపోవుట అసత్యము. అంతకంటె నితివృత్తము విస్తృతమైనదనుట కొంత నిజము. ఆ విస్తృతియైనను అనావశ్యకముగా జరిగినది కాదు. స్వారోచిషమనుసంభవ మనెడి నిర్వహణమునకు ఏయే కథాంశములు పూర్వ పూర్వ కారణకలాపములుగా ఆవశ్యకములో కవి వానినే సూత్రించెను గాని అనావశ్యకమైన ఏ సందర్భమును మార్చలేదు. ఏ ఘట్టమును పరిశీలించినను ఉపసంహార ప్రవణముగానే యుండును గాని తద్విరుద్ధముగా ఉండదు. అట్టి ఏకసూత్రతయే కథైక్యమును సాధించెను." ధర్మరక్షాప్రవణుఁడైన స్వారోచిషునికి మను పదమున కావశ్యకమైన ధర్మనిష్ఠాగరిమ సంక్రమించుటకు వరూథినీప్రవర మాయాప్రవర వృత్తాంతము లవసరమైనవి. ప్రవర వరూథినీవృత్తాంతమునకు కథను ప్రవర శీలవర్ణనముతో నారంభించుట యావశ్యకమైనదని దీని యభిప్రాయము. ఇందు ప్రథమాశ్వాసమందలి కథయు నత్యావశ్యకమని తెల్పుచు శ్రీ పింగళి 'మనుసంభవమునకుఁ బ్రథమ కారణమైన ప్రవరుని చరిత్రయే లేకున్నచో ఈ కావ్యమునకు బీజమే యుండదు' అని అభిప్రాయము నిచ్చినారు.

దీనిని బట్టి కథైక్యము లేదను విమర్శకవాక్య మసత్యమనియును, సామాన్య ప్రబంధములకంటె విస్తృతమైన కథయున్నదనుట యోగ్యమనియును తేలుచున్నది.

కొందరు విమర్శకులు మనుచరిత్రమున రసాభాసదోష మున్న దనుచున్నారు. ఏకపక్షాను రాగము రసాభాసము. మనుచరిత్రమందలి ప్రధానకథయైన వరూథినీ వృత్తాంతమునందలి పూర్వార్ధమున ననురాగము వరూథినియందు మాత్రమే యున్నది. మాయాప్రవర వృత్తాంతమునందు పరస్పరానురాగమున్నట్లు పాత్రలు పొడగట్టునుగాని, రసము సామాజిక నిష్ఠమైయుండుటచే నిటను రసాభాసమే కన్పట్టుచున్నది.

ఈ రసాభాసము పురాణములోని కథయందేయున్నది. కవి దానిని తప్పించుట యెట్లు? తప్పింప యత్నించినచో ప్రవరునకుఁ బతనము సంభవించును. కథయందు రసాభాసము వర్ణితము కారాదని నియమము లేదు. ప్రాచీనాలంకారికులును దీని నుపాధేయముగఁ జెప్పియున్నారు. కాని ప్రపంచ సాహిత్యమున ఏకపక్షానురాగము గల కథావస్తువులతో గూఁడిన కావ్యములెన్నియో అనన్య సామాన్యములైన మహాకావ్యములుగఁ బరిగణింపఁబడుచున్నవి.

పెద్దనార్యుఁడు శృంగారము నంగిరసముగా గ్రహించి వరూథినీవృత్తాంతము నందలి శృంగారమును ఎట్టి లోపము లేకుండ పోషించినాఁడు. రతిస్థాయికమైన వరూథిని చరిత్ర శృంగారపర్యవసాయి అగుటకు కథాధర్మమును బట్టి గాని యవకాశము లేదు. కావున 'రసాభాస' మును దోషముగ జెప్పి, దానిని పెద్దనార్యుని కావ్యమున నొక లోపముగా నెన్నుట రసజ్ఞత కాకపోవుటయే గాక, అనుచితమును, అసమంజసమును.

పాదలేప వృత్తాంతమునను, ప్రవరుని హిమవన్నగయాత్ర విషయమునను స్వల్పమైన కాలమునకు సంబంధించిన దోషమును కొందరు విమర్శకులు చూపుచున్నారు. కుతపకాలమున వచ్చిన యోగి భోజనాదికమును ముగించుకొన్న పిమ్మట ప్రవరునితో సంభాషించి తుదకు అతని పాదములకు పాదలేపమును పూసి వెళ్ళిపోయినాఁడు. ఆ సందర్భమున ప్రవరుఁడు హిమవన్నగమును జూడఁబోయినట్లున్నది. తఱువాత మధ్యాహ్న వర్ణనమున్నది. 'ఈ సందర్భమున ప్రవరుఁడు సాయంతనవేళ హిమవన్నగమున కేగినచో మఱల మధ్యాహ్న మగు టెట్లు? మఱుసటినాఁడుదయమున వెళ్ళినాఁడన్నచో పొసఁగునని కొందఱు సమాధానము జెప్పినారు. అవకాశము లభించిన తీర్థసందర్భనాభిలాషి

తెల్లవారువరకాగునా?' – ఇట్టివెన్నో ప్రశ్నలు కల్గుచున్నవి. దీనికేదో యొక సమర్థనమును జెప్పుకొనవచ్చును. ఒకవేళ నది కుదరకపోయిన దోషమైనను నది మనుచరిత్ర మహాకావ్యమునకు కళంక మాపాదింపఁగలిగినంతటి దోషము కాఁజాలదు. ఈ విషయమున శ్రీ వేటూరి ఇట్లు వ్రాసినారు. "అవ్వల హిమవంతమున కరిగి యందుఁ గొంత తడవైన విశేషములఁ బరికించి చూచిన పదఁపడి ప్రవరుఁడు నళినీ బాంధవ... మధ్యాహ్నమున్ దెల్పెడిన్" అనుట యసంగతము.

ఎంత లేదనినప్పటికి నపరాహ్ణము చాలవఱకును గడచియుండును. ఇచ్చోఁ బ్రవరుఁడు ఆ సిద్ధుఁడు చనుదెంచినాఁడు. హిమాలయముల కరుగక మఱుదినము ప్రొద్దుట నరిగెనని చెప్పి మరికొంద ఱా యనుపపత్తిని నివారించుచున్నారు. ఈ సమర్థనము మార్కండేయ పురాణానురోధియేగాని పెద్దన్న మాత్ర మట్టి వ్యవధి సూచించినాఁడు కాఁడు. గర్భితమనవలయును", 'ఫణినసూను', 'కొఱఁతంబడున్', 'కౌగిలిది' అనుచోట్ల వ్యాకరణ దోషములున్నవని సెప్పి విద్వాంసులు వానినిగూడ సమర్థించినారు.

ఒకవేళ దోషములున్నను, వీనిని దోషములన్నను నివి పెద్దనార్యుని రమ్యకవితా ప్రసారమున నలుసులు. సర్వ విధములైన యుత్తమకావ్యశిల్పములకు నిలయమైన కవితకు లక్ష్యభూతమైన మనుచరిత్రను జదివి మహానందము నొందినవాఁడగుట వలననే, ఎంతటి కవిని తన కొంటెతనముతో త్రోసిపుచ్చు స్వభావముగల కవిచౌడప్ప నేర్పుతో –

క. "పెద్దనవలెఁ గృతి సెప్పిన
బెద్దనవలె నల్పకవినిఁ బెద్దనవలెనా?
యెద్దనవలెఁ మొద్దనవలె
గ్రద్దనవలెఁ గుందవరపు కవిచౌడప్పా!"

అని జోహారులర్పించినాఁడు.

ఈ కవిచౌడప్ప యభిప్రాయముతో నేకీభవింపని రసికుఁడుండఁడు.

## మనుచరిత్ర – ప్రబంధము

ఆంధ్రసాహిత్యమున 'ప్రబంధ' మను ప్రక్రియావిభేదము పెద్దనార్యుని మనుచరిత్రముతో నారంభమైనదనియును, నాతఁడు జీవించియున్న రాయల

యుగమున నీ ప్రబంధములు విశేషముగా జన్మించినవనియును సాహిత్య చరిత్రకారులెల్లరు నంగీకరించిన యంశము. కావున పురాణ రచనమునకు నన్నయ ఎట్టివాఁడో ప్రబంధరచనకు పెద్దన యట్టివాఁడని చెప్పవచ్చును. ప్రబంధ ప్రక్రియకు నన్నయయైన పెద్దనయును తన మనుచరిత్రలోని ఆశ్వాసాంత గద్యములందు 'స్వారోచిషమను సంభవంబను మహాప్రబంధంబు నందు' అనియు 'అమ్మహాప్రబంధ నిబంధనంబునకుం బ్రారంభించితి' అనియును జెప్పిఁనాఁడు.

ఆంధ్రసాహిత్యమున నీ ప్రబంధశాఖ విశేష ప్రాముఖ్యము వహించినది. దీనికున్న ప్రాధాన్యము మఱియొక శాఖకు లేదు. పురాణ ప్రబంధమార్గములనెడి రెండు కవితా మార్గములు మన సాహిత్యమున నొకే కాలమునఁ బుట్టినవని స్థూలదృష్టిని చెప్పవచ్చును. పురాణయుగమందలి నన్నెచోడుడు ప్రబంధమార్గమును గొంతగాఁ జూపినాఁడు.

పురాణమున కథాకథనమునకే ప్రాధాన్యము. ప్రబంధమున కల్పనాచమత్కృతికి, వర్ణనాదికమునకు బ్రాధాన్యము. కొన్ని ప్రబంధ లక్షణములు కుమార సంభవమునఁ గన్పట్టినను నందు విశేషముగ పురాణశైలియే గోచరించును. ప్రబంధమను సాహిత్యశాఖ మన సాహిత్యమున పదునారవశతాబ్ది యారంభదశనుండి వచ్చినది. అయినను నది హఠాత్తుగఁ బుట్టినది కాదు. ఆంధ్రకవుల దృష్టి మొదటినుండియు ప్రబంధోచిత రచనయందే లగ్నమైనది.

భారతరచనారంభము మొదలు మనుచరిత్రావిర్భావము వఱకును గల ఐదువందల సంవత్సరముల కాలమున ప్రబంధవికాసమున కావశ్యకమైన దోహదము జరిగినది. తిక్కన భారతమున ప్రబంధఛాయలు గల ఘట్టములెన్నో యున్నవి. 'కీచకవధాఘట్టము' నిజమున కొక ప్రబంధము. కావుననే తిక్కన తన భారతరచనను ప్రబంధమండలి యనినాఁడు. ఎఱ్ఱన ప్రబంధరచనామార్గమును మఱికొంత పెంపొందించి 'ప్రబంధ పరమేశ్వరుఁ' డనిపించుకొనినాఁడు.

నాచన సోముఁడను కవీశ్వరుఁడు ప్రబంధకవులకు వక్రోక్తి చమత్కారములను భిక్ష పెట్టినాఁడు. తరువాతి కాలమున ప్రబంధ కవికులమున కాచార్యుఁడైన శ్రీనాథుఁడు తన శృంగార నైషధ రచనముచే తరువాతి ప్రబంధరచనకు 'మేలుబంతి' యైన ప్రబంధమును సృజించి, ప్రబంధ పూర్వయుగమున గర్తయైనాఁడు. ఈ యుగమందలి శృంగార శాకుంతలకర్త పినవీర భద్రుఁడు ప్రబంధ దోహదకారులలో నొకఁడైనాఁడు. పెద్దనాదులకుఁ బూర్వమెందరో కవులు ప్రబంధ రచనామార్గమును సూచించినను,

పెద్దనాదులనే ప్రబంధకర్తలనుటకుఁ గారణము మనుచరిత్రాదికావ్యములు స్వతంత్రములగుటయే.

'పురాణాంతర్గతమైన ఏ యుపాఖ్యానమునో ఇతివృత్తముగాఁగైకొని దానిని నానావిధ వర్ణనాలంకారములతో సింగారించి పాత్రచిత్రణమందు, రసపోషణయందు దృష్టి నిల్పి, ప్రౌఢమైన ఆలంకారిక శైలిలో రీతి ప్రధానముగా రచింపఁబడిన స్వతంత్ర కావ్యములు ప్రబంధము' లని ఆధునికులు ప్రబంధప్రకియకు లక్షణములను సమన్వయించి చెప్పుచున్నారు. ఈ సమన్వయము అలంకార గ్రంథములలోఁ జెప్పఁబడిన లక్షణములను, లక్ష్య గ్రంథములైన ప్రబంధములను బరిశీలించుటవలనను జేకూరినవి.

ప్రబంధ శబ్దమునకు సంస్కృత వాఙ్మయమున బహుకాలమునుండి విశేషవ్యాప్తి యున్నది. ఆ భాషయందలి కవులు, ఆలంకారికులు, వ్యాఖ్యాతలు నీ శబ్దమును కావ్యసామాన్యమును దెల్పు పదముగా నుపయోగించినారు. ఆలంకారికులలోని ప్రముఖులలో నొకఁడైన విశ్వనాథుఁడు (సాహిత్యదర్పణకర్త) భారత రామాయణములను, మాలతీమాధవాది నాటకములను ప్రబంధములని వ్యవహరించుటయే గాక, తన యలంకార గ్రంథమును సహితము ప్రబంధమనినాఁడు. కాళిదాస మహాకవి తనకుఁ బూర్వులైన భాస సౌమిల్లాదుల రచనలను ప్రబంధము లనినాఁడు. దీనిని బట్టి సాహిత్యరచన లన్నియును ప్రబంధములు కావు. ప్రబంధములు కాని ముక్తకములున్నవి.[9] ఇవి అనిబద్ధ కావ్యములు. ముక్తకములకు భిన్నములైన ప్రబంధములు నిబద్ధ కావ్యములు.

'కావ్యములోని పద్యములన్నింటికి ప్రకృష్టమైన బంధము కలది' అని తాత్పర్యము. అనఁగా కావ్యమందలి పద్యములనన్నింటినీ పరస్పరము సంబంధ మొనర్చునట్టి (పూసల నేకముగాఁ గూర్చునట్టి దారమువలె) ఇతివృత్తమొకటి (ఒక కథావస్తువు) ఉండవలెనని తేలుచున్నది. 'ఇతివృత్తమందలి పూర్వపూర్వ పద్యములు ఉత్తరోత్తర పద్యములకు దారితీయును. కార్యకారణ సంబంధముతో సన్నివేశనిబిడత్వమును, కథాకథన చమత్కృతిని గలిగి కార్యము మహోదారమైన సారస్వతమూర్తిగా గోచరింపవలయును.' కావ్యావయవములను చక్కగా బంధించి కూర్చెడి అంశములకే సంధిసామగ్రి యని పేరు. ఇట్టి సంధి సామగ్రి లేని స్వల్పరచనలు ఖండకావ్యములు.

ప్రబంధ శబ్దమును ప్రాచీనాంధ్ర మహాకవులు, సంస్కృతాలంకారికులు వాడిన యర్థములోనే వాడియున్నారు. కావుననే తిక్కన, ఎఱ్ఱన, సోమనాది కవులు తమ

రచనలను ప్రబంధములుగా భావించుట జరిగినది. కాని ఆంధ్ర లాక్షణికులు ప్రబంధములనొక ప్రత్యేక ప్రక్రియగా భావించి లక్షణ నిర్దేశమొనర్చినారు. వీరు సంస్కృతము నందు సర్గబంధమను మహాకావ్యమున కే లక్షణములను జెప్పినారో వానినే ప్రబంధ లక్షణములుగాఁ జెప్పినారు. వారి రచనలనుబట్టి ప్రబంధములన్నియు అష్టాదశ వర్ణనాత్మకములుగా నుండవలెనని, ఇతివృత్తము ప్రఖ్యాతము కావలెనని నియమముగాఁ జెప్పకున్నను అభిమానము చూపుటయును, ధీరోదాత్తాదులలో నొకఁడు నాయకుఁడుగా నుండవలయునని తెలుచున్నది.

ఈ లక్షణములనే గాక, ప్రబంధ నామముతో వచ్చిన గ్రంథజాలమును గూడ బరిశీలించి వాని సామాన్య ధర్మములనన్నింటిని క్రోడీకరించినచో, నివి ప్రబంధమునకు సాధారణ లక్షణముగా నేర్పడుచున్నవని శ్రీ పింగళి వారి నిర్దేశము. వీరి మతమున ప్రబంధమునకు 1. ఏకనాయకాశ్రయత్వము, వస్త్వైక్యము ప్రధానధర్మములు. 2. ప్రబంధములు అష్టాదశవర్ణనాత్మకములై యుండవలయును. 3. శృంగారము ప్రధానరసము; ఆవశ్యకతనుబట్టి తక్కిన రసములు గౌణములు (అముఖ్యము) కావచ్చును. 4. ఆలంకారికమైన శైలి ప్రబంధమునకు జీవము. 5. ప్రబంధము భాషాంతరీకరణము కారాదు. స్వతంత్రరచనయై యుండవలయును. ఈ లక్షణములు ఆంధ్ర సాహిత్య మందలి ప్రబంధముల కన్నింటికిని బట్టినవని యనుట కవకాశము లేదు. అయినను నివి స్వతంత్రరచనలగుట వలనను, ఆలంకారిక శైలీశోభిత మగుటచేతను ప్రబంధములుగానే పరిగణింపఁబడుచున్నవి.

ఇఁక మనుచరిత్రమున పైనఁజెప్పుకొన్న ప్రబంధ సామాన్యలక్షణము లెంతవఱకుఁ గలవో పరికింతము. మనుచరిత్రమందలి కథ మనుచరిత్రాది ప్రబంధములలో వలె ఏకనాయకాశ్రయత్వము కలది కాదు. ఇందలి పూర్వకథకు నాయకుఁడు ప్రవరుఁడు. తరువాతి కథకు నాయకుఁడు స్వరోచి. పిమ్మట కథకు నాయకుఁడు స్వారోచిషుఁడు. కావున నిందు ఏకనాయకాశ్రయత్వము లభింప లేదనవచ్చును.

ఇట్లు అనేక కథాఘట్టములతోఁ గూడిన విపులమైన కథలయందు వస్త్వైక్యము (Unity of Plot) ఉండఁజాలదు. పూర్వకథలు ఉత్తరోత్తర కథలకు కారణములగుటచే వస్త్వైక్యమున్నదని యొకరీతిగ[10] సమాధానముఁ జెప్పుకొనినను, భట్టుమూర్తి వసుచరిత్రలో వలె ఏకనాయకాశ్రయమైన కథైక్యము లేదనుట స్పష్టము.

ప్రబంధమునకు అష్టాదశవర్ణనము లుండుట మఱియొక లక్షణము. అప్పకవి పదునెనిమిది వర్ణనములకు మఱికొన్నిఁటిని జేర్చి, ప్రబంధమున కిరువదిరెండు వర్ణనము లుండవలెనని నియమ మేర్పరచినాఁడు. కథావస్తువున ఈ పదునెనిమిది వర్ణనము లవసరమైనను లేకున్నను వర్ణింపవలెననుటలో గల సామంజస్యమును పరిశీలింపవలసియున్నది. పెద్దనార్యుఁడు మనుచరిత్రలో నీ అష్టాదశ వర్ణనలలో నధిక సంఖ్యను చేసినాఁడు. అంతేకాక ఈ అష్టాదశ వర్ణనల విషయమున తరువాతి కవులకనేకులకు వర్ణనశయ్యా విషయమునను, ఉక్తివైచిత్ర్యమునందును, నితర గుణవిశేషములయెడను మార్గదర్శకుఁడు గూడ నైనాఁడు.[11]

శృంగారము ప్రధానరసమగుటయు, ఆవశ్యకతనుబట్టి తక్కిన రసములు గౌణము లగుటయు ప్రబంధములలోఁ గన్పట్టు మఱియొక సమానధర్మము. మనుచరిత్రములోని కథ ఏకనాయకము కాదు. ఆరంభయత్నాదు లిందు లేవు. కావున దృశ్య కావ్యములలో వలె నిది ప్రధానరసమని చెప్పుట కవకాశము లేదు. ఈ కావ్యమున పూర్వార్ధమందలి వరూథినీప్రవర వృత్తాంతమందును అంగిరసము శృంగారము కాదు. శాంతము అంగిరసము. శృంగారరసము అంగరసములలో ప్రముఖము. అదియైనను రసాభాసము. కావున నిందు వసుచరిత్రాదులలో వలె శృంగారమంగిరసమై, ఉద్దీపనాదులచే దానికి స్థాయియైన రతి రసస్థితి నొందలేదనియే చెప్పవలయును. మాయాప్రవర వృత్తాంతమునను రసము రసాభాసమే. కావున ప్రబంధములకు సామాన్య లక్షణముగఁ గన్పట్టు శృంగార మంగిరసమై యుండుట యను లక్షణము మనుచరిత్రకు బట్టలేదనుటయే సమంజసము.

ప్రబంధములలో 'ఆలంకారికశైలి' యొక లక్షణముగ నున్నట్లు గమనింపఁ బడినది. ఈ శైలియే ప్రబంధములను పురాణములనుండి వేఱొనర్చినది. ప్రబంధములు రీతి ప్రధానములు. పురాణములు రసప్రధానములు. ఆలంకారిక శైలి విషయమున మనుచరిత్ర ప్రథమతాంబూల మందుకొనఁదగిన ప్రబంధము. తరువాతి ప్రబంధకవు లందఱకును నిట్టి ప్రాబంధికశైలిని ఒరవడి పెట్టినదియే మనుచరిత్రము. మిగిలిన ప్రబంధములలో వలె వస్త్వైక్యము, శృంగారరస ప్రాధాన్యము లేకున్నను, మనుచరిత్రను ప్రబంధజాతిలో జేర్చుటకును, ప్రబంధములకు దానిని మాతృకగాఁ బరిగణించుటకును నీ ప్రబంధశైలియే (అలంకారశైలి) వర్ణనలతోఁ బాటుగ నొక ప్రముఖకారణమైనది. రాయవంశవర్ణనము నందలి 'చేర్చుక్కగా నిడ్డ', 'క్రూరవనే భదంత', 'మద కలకుంభి', 'బలమదమత్త', 'తొలుదొల్త నుదయాద్రి' ఇత్యాది పద్యములన్నియు చమత్కార

ప్రధానములైన ఆలంకారికశైలికి నిదర్శనములే. పెద్దనార్యుని మనుచరిత్రలో నుక్తివైచిత్ర్యము లేని పద్యములు మిక్కిలి తక్కువ. ఈ శైలియందు శబ్దార్థ వైచిత్రులను రెంటిని మనము గుర్తింపగలము.

ప్రబంధము స్వతంత్రరచనయై యుండుట మరియొక లక్షణము. ఆదినుండియు పెద్దన వఱకును మన సాహిత్యము ప్రధానముగా ననువాదసాహిత్యము. పెద్దన మనుచరిత్రముతోనే ప్రబంధమను స్వతంత్రకావ్య మవతరించినది. అయిన 'నీ కథయును మార్కండేయ పురాణాంతర్గతము గదా!' యన్న ప్రశ్న వచ్చును. ప్రఖ్యాత కథకు గల ప్రాచుర్యము ననుసరించి కథను పురాణమునుండి గ్రహించుటయే జరిగినది గాని మనుచరిత్రలో నొక్కపద్యము గాని, ఒక సంభాషణముగాని పురాణ మూల గ్రంథమున కనువాదము కాదు.

ఇందలి కథాగమనము, సంభాషణలు, వర్ణనలు పెద్దనార్యుని ప్రతిభాజన్యములే. కావున స్వతంత్ర గ్రంథమైయుండుటయను ప్రబంధ లక్షణము మనుచరిత్రకుఁ బూర్తిగాఁబట్టినది. మనుచరిత్ర పింగళి సూరన కళాపూర్ణోదయమువలె కేవల కల్పనాకథ కాకపోయినను స్వతంత్రము. ప్రబంధ లక్షణములను సర్వమును గల్గినప్పటికిని, నీ కారణముచేతనే శ్రీనాథ మహాకవి శృంగార నైషధము ప్రబంధములకు ఆద్య గ్రంథము కాలేకపోయినది. ఇట్టి మహా ప్రబంధ నిర్మాణముచే ఆంధ్రకవితను నూతన మార్గమును బట్టించి 'ఆంధ్ర కవితా పితామహుఁ' డని బిరుదునొంది, కొందఱమతమున ప్రబంధయుగకర్త యైన పెద్దనార్యుఁడు ధన్యుఁడు!

## కృష్ణరాయవంశ వర్ణనము

'భువన విజయ' సభాభవనమున విద్వద్గోష్ఠి సలుపుచు సాహిత్య సమరాంగణ చక్రవర్తియైన కృష్ణరాయలు తనకు హితుఁడును, చతురవచోనిధియును, పురాణాగమజ్ఞుఁడును, ఆంధ్ర కవితాపితామహుఁడునునైన పెద్దనార్యునితో, మార్కండేయ పురాణోక్తమైన స్వారోచిష మనుసంభవ కథను తన పేర నంకితముగఁ జెప్పుమని కర్పూరతాంబూలమును బెట్టి వేడఁగా నందుల కతఁడంగీకరించినాఁడు. ఆ మహాప్రబంధ నిబంధనకు బ్రారంభమొనర్చు సందర్భమున పెద్దన కవి రాయవంశము నిట్లు వర్ణించినాఁడు.

పాలసముద్రమునందలి మేటితరగ కడుపారఁ గన్నట్టివాఁడును, పరమేశ్వరుని జటాజూటమునకు వాడని పుష్పాలంకారమైనవాఁడును, తన కిరణములను దేవతల

కాహారముగా నిచ్చి పోషించువాఁడును, కటిక చీఁకట్లను దనకరములచేఁ గలువలను వికసింపఁజేయువాఁడును, లక్ష్మికిఁ దోడఁబుట్టువును, పదియాఱు కళలకును చోటయినవాఁడును, అశ్విని మొదలైన నక్షత్రములకు భర్తయైనవాఁడును, కాంతికి నిధియును, సూర్యునికి జతకాఁడును నైన చంద్రుఁడు లోకములఁ బొగడ్త నొందుచుండెను. అతనికి వేదవేదాంగాది విద్యల నెల్ల నేర్చిన బుధుఁడు కుమారుఁడై జన్మించెను. ఆ బుధునకు పురూరవుడు, నాతని కాయువును, ఆయువునకు యయాతి మహారాజును జన్మించిరి.

యయాతికి యదుతుర్వసులను నిరువురు శత్రుంజయులు, విద్యావేత్తలు నయిన పుత్రులు పుట్టిరి. వీరిలో తుర్వసుఁడు సద్గుణఖనియై ప్రఖ్యాతకీర్తి వహించినాఁడు. ఈ తుర్వసుని వంశమే 'తుళువ వంశ' మని పేరు పొందినది. అందు అసంఖ్యాకులైన రాజులు జనించి సాటిలేని కీర్తిచేఁ బ్రసిద్ధి నొందిరి. పిమ్మట నీ తుళువవంశమున తిమ్మరాజు జన్మించెను.

ఈ తిమ్మరాజు గొప్పవాఁడై ఆదికూర్మ, సప్తకులపర్వత, ఆదిశేష, వరాహములు మోయఁజాలని భూభారమును తన బాహుపీఠముపై నిల్పుకొని భరించుటచేత, వాని తగులపు బాదఱను మాన్పి కీర్తి లోకములెల్ల వ్యాపింపఁగా, శత్రురాజులు ప్రక్కలకొదిగి యణఁగి జీవింపఁగా నతిశయమైన పరాక్రమముతో నెగడెను.

దానమునకు గనియని పేరొందిన యా తిమ్మరాజునకును, నాతని దేవేరియైన దేవకీదేవికిని, రూపవంతుఁడు, సజ్జనరక్షకుఁడునైన ఈశ్వరరాజు జన్మించెను. దుష్టులైన త్రిపురులను రాక్షసుల సంహరించి ఆర్యను (పార్వతిని) పరిపాలించిన వెనుకటి ఈ ఈశ్వరుఁడే ఈశ్వరరాజై పుట్టి, దుష్టులైన శత్రురాజుల పట్టణములను ధ్వంసమొనర్చి ఆర్యులను బరిపాలించుచుండఁగా, నాలుబిడ్డలను విడిచి భయముతో కొండలను నరణ్యములను బట్టి తిరుగాడుచున్న శత్రురాజుల దేహములందు మన్మథవికారము లన్నియును నశించెను. ఈశ్వరరాజు సామంతరాజులచే నర్పింపఁబడిన కాన్కలచే సంపాదించిన సంపత్తితో నింద్రుని మించిన భాగ్యశాలి. తన భుజము నాశ్రయించిన భూమికి వజ్రకవచమైనవాఁడు. దుర్మార్గులనెడి కాలసర్పములకు పాములవాఁడు. స్త్రీలచిత్తము లనెడి సొమ్ములకు నందరు చూచుచుండఁగనే పగటివేళ దొంగిలింపఁగల గడిదొంగ. శత్రువులనెడి హంసల సమూహమునకు వర్షాకాలము. యాచక సమూహ మనెడి కోకిలలకు వసంత కాలపు దినమైనవాఁడు. గుణరత్నములకు రోహణపర్వతమైనవాఁడు. చుట్టముల సమూహమనెడి పద్మవనమునకు సూర్యుఁడు.

దయారసమునకు సముద్రుఁడు. ఇతఁడు ఈ రీతిగాఁ జెప్పఁబడుచు లోకములలో విఖ్యాతి నొందెను.

తిమ్మరాజపుత్రుఁడైన ఈశ్వరరాజునకు పుణ్యచిత్తయైన బుక్కాంబకును పరాక్రమమున సూర్యులును, బుద్ధిశాలురునైన నరసింహరాజు, తిమ్మరాజులను నిర్వురు పుత్రులు జనించిరి. వారిలో నరసరాజు శ్రీగంధముతోను, కల్పవృక్షముతోను, మల్లెలతోను, వెన్నెలతోను, సమానమైన తన స్థిరకీర్తిచే దిక్కులనన్నింటిని నింపినవాఁడై సమస్త పాపములను నశించునట్లుగా భూమిని పాలించెను. ఇతఁడు లక్ష్మీసంపన్నతచే విష్ణువును, ఐశ్వర్యముచే శివుని, బుద్ధిచే బ్రహ్మను, జయించు స్వభావముచే కుమారస్వామిని, రూపముచే మన్మథుని, శక్తిచే వీరభద్రుని, కాంతిచే చంద్రుని, ధైర్యమున మైనాకపర్వతమును, చేవచేత రాహువును, భోగములచే నింద్రుని బోలినవాఁడై యొప్పెను. వాడియైన తన కత్తిచే శత్రురాజుల శిరములను ఖండించి యా శిరములతో మాలికలు గ్రుచ్చి ఆ అలంకారములతో శివునర్చించు నీ నరసరాజు, సముద్రమునే కట్టు వస్త్రముగాఁగల భూమిని దన బాహుపురియందు మరకతముగా నొనర్చెను. ఎడతెగని దానధారావర్షమునకుఁ గవిసమూహములను చాతకపక్షుల గావించెను. దిక్కుల మధ్యనున్న సమస్త రాజసమూహమును తన కాలి గండపెండేరమున బొమ్మలను గావించెను. పూజార్హమైన తన స్వచ్ఛమగు కీర్తికి ఆకసమును రాజహంసగా నొనర్చెను.

ఆ నరసరాజుకు తిప్పాంబ, నాగాంబ అనునిర్వురు భార్యలు గలరు. వారివలన నీ నరసరాజు వీరనరసింహరాయఁడు, కృష్ణరాయఁడు నను నిర్వుర కుమారులను పొందెను. అందు కృష్ణరాయలు విష్ణ్వంశసంభవుఁడు. ఇందు వీరనరసింహుఁడు కరవాలముచే విరోధుల నందఱ ఖండించి ఏకచ్ఛత్రాధిపత్యముగ సమస్తభూమిని నిరాటంకముగఁ బాలించెను.

## శ్రీకృష్ణరాయ ప్రతాపాది వర్ణనము

వీరనరసింహరాయల యనంతరము కృష్ణరాయలు చిన్నాదేవియును, తిరుమలదేవియును తనకుఁ గూర్చునట్టి (ప్రియమగునట్టి) దేవేరులు కాఁగా భూభారమును వహించెను. ఈ కృష్ణరాయలు భూమండలమును బాలించుచుండఁగా ప్రజలందఱును సుఖించిరి. సకాలము నందు వర్షములు కుఱియుటచే భూమి సస్యసమృద్ధిచే రాణించెను. ప్రజాజీవితము సౌఖ్యవంతమయ్యెను. వేయేల, కృష్ణరాయల పాలనమున ప్రజలు రామరాజ్యమునందువలె సుఖించిరి. అంతవఱకును నెడతెగక

భరించుచున్న ఆదివరాహమూర్తి కోఱ, ఆదిశేషుని పడగలమీఁది మణులనెడి ఱాళ్ళు, కులపర్వత శిఖరములమీఁది శిలలు ఒరసికొనుటచే, శరీరమంతయును గంట్లేర్పడిన భూదేవి నా కృష్ణరాయలు తన భుజముననే ధరించుటచేత, దానియందుఁ బూయఁబడిన కస్తూరికాద్యలేపములు చిక్కగ నంటుకొనుటచే నా గంట్లు పూడి భూదేవి యథా రూపమును ధరించినది.

కృష్ణరాయల శత్రురాజుల పట్టణములు అతని దండయాత్రలచే పాడువడి కాఱడవులై పోయినవి. అందు వసించుచున్న యడవి యేనుఁగులు అచ్చట చెడియున్న మేడల గోడలను దంతములతోఁ బడఁగొట్టుచుండఁగా, వానినుండి వ్రాలిన వజ్రములను జూచి గిజిగాడులను బంగారు పిచ్చుకలు మిణుఁగురుబురుఁగులను భ్రాంతి వహించి కొనిపోయి రాత్రులందు వెలుతురుకై తమ గూండ్లలో నుంచెను.

ఎగరేగుటకై వెల్గింపఁబడిన తోకచిచ్చుననట్లుగా పిమ్మట నొప్పిన కృష్ణరాయల భుజపరాక్రమమనెడి ప్రజ్వలించు నగ్ని, తొలుత ఉదయగిరియనెడి చెకుముకిఱాతిని దగిలి వేడిఁగొన్న ఖడ్గమనెడి యుక్కువలన జన్మించినది. ఆ పిమ్మటఁ గొండవీడు నెక్కి యట నలియైన కసవాపాత్రుఁడను రాజునంటి రగుల్కొనెను. అటుపిమ్మట జమ్మిలోయ యను జమ్మును వేగముగా దహించెను. కోనయను మన్నెము నంటఁ గాల్చెను. కొట్టమను దేశమునంటుకొని కనకగిరి యనెడి దుర్గపుటతిశయమును గరఁగించెను. గోదావరిని క్రాఁగించెను. ఆ పిమ్మట పొట్టనూరను పట్టణమునందుఁ బ్రజ్వలించెను. మాడెములను బ్రేలఁజేసెను. ఒడ్డాదియను పట్టణమును బూడిద గావించెను. తుదకు గజరాజు (గజపతియను రాజు) భయపడి పారిపోవఁగా కటకమును మసియొనర్చెను.

కృష్ణరాయల భయమువలన నాతఁడు దండెత్తివచ్చుటకుఁ బూర్వమే స్వరాష్ట్రమును విడిచి వింధ్యపర్వతగుహలలో నివసించు వీరభద్ర గజపతియొక్క లోకమెఱుఁగని యంతఃపుర స్త్రీలు (శుద్ధాంత ముగ్ధాంగనలు), రాయల సేనలు దండు వెడలుటచే రేగిన యెఱ్ఱని ధూళి తాము నివసించుచున్న గుహలను దట్టముగాఁ జుట్టుకొనఁగా 'ఇది యేమో, యెఱ్ఱని వింతయైన చీఁకటి క్రమ్ముకొన్న' దని యొకరికొకరు చెప్పుకొనుచు చూచెదరు.

కృష్ణరాయలు తన విజయవార్తలను జెక్కించి తాళప్రమాణమైన జయధ్వజరూపమగు శాసనశిలను పొట్టునూరికడ ప్రీతితో నిల్పినాఁడు. సింహాచల నృసింహస్వామి యుత్సవములను జూచుటకై స్వర్గమునుండి వచ్చు దేవతలు,

మాటిమాటికి నా జయస్తంభమందలి లేఖనమును కళింగరాజైన వీరభద్రగజపతి యపకీర్తియనెడి కాటుకను బూసి చదువుచుందురు.

శ్రీకృష్ణరాయలకడ కాయారాజులు పంపిన రాయబారులు కానుకలుగాఁ గొనివచ్చిన భద్రగజములను, ఉన్నతాశ్వములతోడ నుంచుకొని శ్రీకృష్ణరాయల దర్శనము లభింపకపోవుటచే నగరివాకిట నిల్చి, ప్రొద్దుననుండి సాయంకాలము వఱకును ప్రతిదినము దర్శనమునకై సమయమును సంపాదింప వేచియుండెదరు.

యుద్ధములందు కృష్ణరాయలచే నఱుకఁబడిన యేనుగుల కుంభస్థలములనుండి వెల్వడెడి క్రొమ్ముత్తెము లాతని ఖడ్గధారయను ప్రవాహమున శత్రువుల పుట్టిమునుఁగగా నురువుపిండుతో వెడలు నీఁటి బుడగలవలెఁ గన్పట్టును.

కృష్ణరాయల ధాటి భయంకరమైనది. అతఁడు దాడి వెడలునప్పుడేన్గులు తుండములతోఁ జిమ్ము తుంపురులును, నవి చెవులు వీచుకొనుటచే రేఁగెడు దుమ్మును, గుఱ్ఱముల ముక్కులనుండి జాఱు మలమును, భటులు ప్రయోగించు నీటెల దెబ్బలను, నాతని శత్రురాజుల ప్రతాపాగ్ని జల్లారుటకై పైజల్లు నీరుగను, చేటలతోఁ గప్పుమన్నుగను, పైగప్పు బురదగను, అటుపిమ్మట ధరించునట్టి కఱ్ఱలదెబ్బలుగను నొప్పుచుండును.

రాయలశ్వవిద్యయందు మిక్కిలి కుశలుఁడు. దిగంతములవఱకును వ్యాప్తినొందించిన స్వచ్ఛమగు కీర్తి గలవాఁడు. ఎడతెగక గుంపులు గుంపులుగాఁ దోతెంచు గుఱ్ఱముల గిట్టల త్రొక్కుడుచే రేగిన ధూళియను చీఁకటిలో తబ్బిబ్బులుపడు శత్రురాజుల ప్రాణముల నాతని ఖడ్గ మనెడి సర్పమపహరించుచుండును. కృష్ణరాయఁడు ఆ కాలమున దాతృత్వమునకు కీర్తికెక్కిన కర్ణునితో తుల్యమైన దాతృత్వముగలవాఁడు. పండితజన విధేయుఁడు. కవితాస్త్రీలోలుడు. దిక్పాలురకును సహింపరాని పరాక్రమకాంతిచే మాటుపరచిన సూర్యుఁడు కలవాఁడు. అరనిమిష కాలమునఁ గళింగ రాజపుత్రుని బందీగాఁ బట్టుకొనినట్టివాఁడు. దయానిలయుఁడైన వేంకటేశ్వరుని పాదపద్మస్మరణము గలవాఁడు (వేంకటేశ్వర భక్తుఁడు. వేంకటేశ్వరు నిష్టదైవతముగాఁ గలవాఁడు).

## మనుచరిత్ర పీఠిక – చరిత్రాంశములు

ప్రాచీనాంధ్రసాహిత్యము విశేషముగా రాజాశ్రయమువలనఁ బెంపొందినది. మహాకవులైన నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథ, పెద్దనాదులు రాజాస్థానకవులై వర్ధిల్లి

కావ్యజాలమును జెప్పిరి. తమ పోషకులైన రాజన్యులకుఁ దమకావ్యముల నంకితమొనర్చిరి. అందుచే వారు కావ్యకృత్యాదియందు ఆయా రాజన్యుల వంశచరిత్రములను, వారొనర్చిన జైత్రయాత్రలను గుణవిశేషములను ప్రాస్తావికముగ వర్ణించుట పరిపాటియైనది. కావ్యములందలి ఈ పీఠికాభాగములలో అభిమానపూరితములైన అతిశయోక్తులెన్ని యున్నను వానినుండి చారిత్రక సత్యములను గనుఁగొనుట కష్టము కాదు. ఈ కారణముననే చరిత్ర రచనకు సమకాలిక సాహిత్యము (Contemporary Literature) నొక ప్రముఖాధారముగా (Important Source) చరిత్రకారులు గ్రహించుట సంభవించుచున్నది.

నన్నయ భారతమువలన తూర్పుచాళుక్య చక్రవర్తియైన రాజరాజనరేంద్రుని పరిపాలన కాలమునందలి విశేషములును, తిక్కన నిర్వచనోత్తర రామాయణము వలన నెల్లూరు తెలుఁగు చోళుల చరిత్రను, ఎఱ్ఱన హరివంశమువలన రెడ్డిరాజ్య స్థాపనాచార్యుఁడైన ప్రోలయ వేమారెడ్డి కాలమునాఁటి విశేషములను, శ్రీనాథుని రచనలవలన కొండవీటి, రాజమహేంద్రవర రెడ్డిరాజులనాఁటి పరిపాలన విశేషములను దెలిసికొనుట కవకాశము లభించుచున్నది. ఇట్లే క్రీ.శ. 1509 మొదలు 1530 మధ్యకాలమున విజయనగర సామ్రాజ్య వజ్రసింహాసన మధిష్ఠించి దక్షిణాపథము నెల్ల నేకచ్ఛత్రాధిపత్యముగఁ బాలించిన శ్రీకృష్ణరాయల కాలమునఁ బుట్టిన పారిజాతాపహరణ మనుచరిత్రాది మహాకావ్యములవలనను నా మహారాజ వంశమును గూర్చిన విశేషములును, నా రాజన్యుని గూర్చిన కొన్ని విశేషములును దెలియవచ్చుచున్నవి.

మనుచరిత్రయందు పెద్దన యొనర్చిన కృతిపతియైన కృష్ణరాయ వంశవర్ణనమువలన రాయలవంశమునకు సంబంధించిన విశేషములు, రాయల ప్రతాపాదివర్ణనము వలన నాతని జైత్రయాత్రలు కొన్నియుఁ దెలియుచున్నవి.

పెద్దనార్యుఁడు కృష్ణరాయలు చంద్రవంశమందలి తుర్వసుని కులమునఁ బుట్టినట్లు చెప్పియున్నాఁడు. 'వాని వంశంబు' (ప. 22) అనుదానియందు తుర్వసుని వంశమే తుళువాన్వయమైనట్లు చెప్పినాఁడు. తిమ్మన పారిజాతాపహరణమందును కృష్ణరాయలను చంద్రవంశ క్షత్రియునిగనే చెప్పినాఁడు. కాని కృష్ణరాయని వర్ణించుచు 'యాదవాన్వయము'నఁ బుట్టినట్లు వర్ణించినాఁడు. తుర్వసుని వంశస్థులు యాదవులగుట కవకాశము లేదు. అదియును గాక తుర్వసుని వంశజులు తౌర్వసులు కావలయును గాని తుళువలు కాఁజాలరు. కృష్ణరాయల కాలమునఁబుట్టిన 'నేర్లకెరె'

తామ్రశాసనము క్రీ.శ. 1511 నందును రాయలు చంద్రవంశార్గతమైన తుర్వసువంశమువాఁడని తెలియఁజేయుచున్నవి.

సాళువ నరసింహరాయుల కాలమున (క్రీ.శ. 1486-90) బుట్టిన వరాహపురాణమున తుళువవంశమునకు మూలపురుషుఁడు తిమ్మరాజని అతఁడు తుళు దేశస్థుఁడని మాత్రమే యున్నదిగాని, చంద్రునిప్రసక్తి గాని, తుర్వసులను ప్రసక్తిగాని లేఁదు. దీనినిబట్టి తుళువరాజులు క్షత్రియులుగారని తెలియుచున్నది. ఈ తుళువలలో సాళువ ఇమ్మడి నరసింహుని జంపించి (క్రీ.శ. 1506న) రాజ్యాభిషిక్తుఁడై మహారాయ బిరుదము నొందిన మొదటివాఁడు - కృష్ణదేవ రాయల సోదరుఁడైన వీర నరసింహరాయలు. ఇతని కాలముననే తుళువ వంశజులకు క్షత్రియత్వ మాపాదింపఁబడినదని చరిత్రజ్ఞుల యభ్యూహము.

ఒకవేళ తుళువలు క్షత్రియులని యంగీకరించినను, కృష్ణరాయల తల్లియైన నాగలాదేవి తండ్రియైన నరసనాయకునకు కులవధువుగాక, భోగకాంతయని బహుళముగాఁ బ్రచారమునున్న గాథనుబట్టి, రాయలు క్షత్రియుఁడని చెప్పుట కవకాశము లేదు. (కృష్ణరాయలు - శ్రీ నేలటూరి - భారతి సర్వధారి ఫాల్గునము పు. 159-160).

పెద్దనార్యుఁడు తిమ్మరాజు పుత్రుఁడైన ఈశ్వరరాజును ఘనముగఁ బొగడినాఁడు (ప. 25, 26). ఈ ఈశ్వరరాజు విజయనగరాధిపతియైన సాళువ నరసింహరాయల (క్రీ.శ. 1485-1490) సేనాపతి. కొండవీటి పైకెత్తి వచ్చుచున్న మహమ్మదు షా బహుమనీని ఓడించి తగిన ప్రతీకారమొనర్చుటకు రాయ లీతనిని నియమింపగా, నీతఁడు కందుకూరుకడ నాతని నోడించి ఖండించి, కంచినుండి యాతఁడు కొల్లగొట్టికొనివచ్చుచున్న ధనమును గ్రహించినాఁడు. (కళింగ జైత్రయాత్ర భారతి - వికృతి, చైత్రము పుట. 413)

పెద్దనార్యుఁడు ఘనముగ వర్ణించిన (ప 29,30) కృష్ణరాయల తండ్రియగు నరస ప్రభుఁడును గొప్పవాఁడే. ఇతఁడు సాళువ నరసింహుని సర్వసేనాధిపతి. ఇతఁడు సాళువ నరసింహుని పుత్రులగు తిమ్మరాజ, ఇమ్మడి నరసింహరాజుల కాలమున పేరుకుమాత్రము వారినే చక్రవర్తులనుగా నిల్పి, 'సంరక్షకుఁడై' క్రీ.శ. 1490-1506 మధ్యకాలమున విజయనగర రాజ్యమును నిరాటంకముగఁ బాలించినవాఁడు.

ఈ నరసరాయలు హోయిసల, చోళ, పాండ్యాది రాజులను, తురుష్కులను, గజపతులను యుద్ధముల నోడించిన పరాక్రమశాలి. ఇతనిచే నోడింపఁబడిన గజపతి పురుషోత్తమగజపతి పుత్రుఁడైన ప్రతాపరుద్రగజపతి. ఇతఁడు 1503లో మరణించెను. ఇమ్మడి నరసింహరాయలు చక్రవర్తిగా నున్నప్పుడే పదమూడు సంవత్సరములు గడచిన తరువాత నితఁడు వజ్రసింహాసన మెక్కి రాయబిరుదము నొందినాఁడు గాని, రాయలను పదభ్రష్టుని గావింపలేదు.

అల్లసాని పెద్దనార్యుఁడు (ప. 31) ఈ నరసరాయలు తిప్పాంబవలన వీరనృసింహ రాయలను, నాగాంబికవలన విష్ణ్వంశసంభూతుఁడైన కృష్ణరాయలను కుమారులనుగాఁ బడసినట్లు వర్ణించినాఁడు.

కృష్ణరాయల తండ్రియైన నరసరాయలకు 'ఓబాంబిక' యను మరియొక భార్యయున్నది. ఆమె వలన నతఁడు కృష్ణరాయలకుఁ బిమ్మట వజ్రసింహాసన మధిష్ఠించిన అచ్యుతరాయ, రంగరాయలను పుత్రులను బడసిఁనాఁడు. వీరి పేర్లు వీరనృసింహుని శాసనములలోగాని, లేదా రాయలనాఁటి కావ్యములందలి పీఠికాభాగములలోఁ గాని కన్పింపకపోవుట విశేషము.

కృష్ణరాయలతల్లి 'భోగ కాంత' యను జనశ్రుతి (tradition) కూడ నసత్యము. వీర నృసింహరాయల శాసనములందు 'తిప్పాంబ, నాగాంబికలు దశరథునికిఁ గౌసల్యాసుమిత్రల వంటి దేవేరు' లనియు, 'వారికిఁబుట్టిన కుమారులు రామలక్ష్మణులని' యును వర్ణనలు గన్పట్టుచున్నవి. కావున కృష్ణరాయలు కులవధూ పుత్రుఁడేగాని, తండ్రియైన నరసరాయలకు 'భోగిని' వలన జన్మించినవాఁడు కాఁజాలఁడు.

పెద్దన వర్ణించిన (ప. 31) వీరనృసింహరాయలు, సాళువవంశమువాఁడైన ఇమ్మడి నరసరాయలకు తండ్రి తరువాత సంరక్షకుఁడై యాతని జంపించి, వజ్రసింహాసనమధిష్ఠించి తుళువవంశమునకు విజయనగర సార్వభౌమత్వమును సంపాదించి, క్రీ.శ. 1506 మొదలు 1509 వఱకును పాలించినవాఁడు. ఇతఁడు సామంతుల తిరుగుబాటు నణచినాఁడు. కాని ఉమ్మత్తూరు రాజులతోఁ బోరాడుచు నోడి మనోవ్యథ వలన నకాలమరణము నొందెను.

వీరనృసింహునకుఁ బిమ్మట శ్రీకృష్ణరాయలు వజ్రసింహాసనమధిష్ఠించి క్రీ.శ. 1509 మొదలు 1530 వఱకును పాలించెను. పెద్దనార్యుఁడు తన కృతిపతియైన

ఈ కృష్ణరాయలను గూర్చి చేసిన వర్ణనలలో అతిశయోక్తు లెన్నియున్నను విషయములన్నియు చారిత్రక సత్యములు.

ఇతఁడు క్రీ.శ. 1509 ఫిబ్రవరి 4న పట్టాభిషిక్తుఁడై పరాక్రమాతిశయముననను, పరిపాలన దక్షతయందును దక్షిణాపథమును బాలించిన ప్రభువులలో నింతటివాఁడు లేఁడనిపించుకొనినాఁడు. పెద్దన 'నావాడపతి శకంధర' మొదలైన పద్యభాగముల నీతనికి మహమ్మదీయులతోనైన యుద్ధములను సూచించినాఁడు. ఈ యుద్ధములలోనే బిజాపుర మహమ్మదీయ పాలకులకు బందీయైన బహ్మనీపాలకుఁడైన మహమ్మదు శాహూను చెఱ విడిపించి, రాజ్యసింహాసనమున పునఃప్రతిష్ఠితుని చేసి 'యవనరాజ్య స్థాపనాచార్య' బిరుదు నొందినఁవాఁడు. పెద్దన్న ఈ విషయమును మనుచరిత్రలోని ఆశ్వాసాంత పద్యము (II-81, III-142) లలో తెలియఁజేసినాఁడు.

పెద్దన పిమ్మట కృష్ణరాయల పూర్వ దిగ్విజయయాత్ర (కళింగయాత్రను) 'తొలుదొల్త నుదయాద్రి' ఇత్యాదియందు వర్ణించినాఁడు. ఏ కారణమునో పెద్దన, ఉమ్మత్తూరు పాళెగాండ్రను జయించి కర్ణాట మలయాళదేశములను గైవస మొనర్చుకొనిన విషయముల నిందు ప్రశంసింపలేదు. పారిజాతాపహరణమున 'శ్రీరంగేశ్వర నాభిపంకజ రజఃశ్రీ కంటె' ఇత్యాదులందు ఈ విషయము నిరూపితమైనది. 'తొలుదొల్త నుదయాద్రి', 'ధరకెంధూళులు', 'అభిరతి కృష్ణరాయఁడు' ఇత్యాది పద్యములలో పెద్దన వర్ణించిన రాయల కళింగ దిగ్విజయయాత్ర క్రీ.శ. 1513లో నారంభమై, ఐదేండ్లు విజయవంతముగ సాగి, క్రీ.శ. 1518లో సమాప్తమైనది. ఆముక్తమాల్యదలో వరుసగ ఉదయగిరి, కొండవీఁడు, కొండపల్లి, పొట్నూరు, సింహాచలములపై గొన్న విజయములు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థాశ్వాసముల అంతమందు వర్ణితములు.

క్రీ.శ. 1513న ఆరంభమైన ఉదయగిరి ముట్టడి ఒకటిన్నర సంవత్సరము పట్టినది. ఆ దుర్గపాలకుఁడు ప్రతాప రుద్రగజపతి పినతండ్రి తిరుమల కాంత రాహుత్తుఁడు. కొండవీటి ముట్టడి (క్రీ.శ. 1515) లో గజపతి కుమారుఁడైన వీరభద్రుని 'జీవగ్రాహము'గా రాయలు పట్టుకొనినాఁడు. 'నలియైన యల కసవాపాత్రునంటి రాజె'ను ఆ పాదమున సూచితుఁడైనవాఁడు వీరభద్రునకు సహాయముగనున్న శ్రీనాథాదులలో నొకఁడైన గజపతి సామంతుఁడు. కొండవీటి విజయానంతరము రాయలు అమరావతిలోని అమరేశ్వర స్వామిని తన దేవేరులగు చిన్నాదేవి తిరుమల దేవులతో నేగి దర్శించి తులాపురుషమును తూగినాఁడు. ఈ విషయము అమరావతి

శాసనము (S.I.I.Vol Vl No. 248) లో నున్నది. 'గౌతమిని గ్రాచె' సింహాద్రిని చేరకముందే రాజమహేంద్ర వరమును జయించినట్లు సింహాచలశాసనము వలనఁ దెలియుచున్నది (S.I.I.Vol Vl No. 694). 'పొట్టు నూరికడ నిల్పిన కంబము' – కొండపల్లిని సాధించిన పిమ్మట తెలంగాణములోని దుర్గముల సాధించి రాయలు ఏకధాటిగా పొట్నూరుకుఁబోయి, యట గజపతిసైన్యముల నోడించి విజయ స్తంభమును నాటించినాఁడు. (తిరుపతి దేవస్థానశాసనములు సం. III నం 80).

మాడెములు ఒడ్డాది గజపతి ముఖ్యపట్టణమైన కటకమునకుఁ బోవు త్రోవలో నున్నవి. 'వీర రుద్రగజరాట్ శుద్ధాంత ముగ్ధాంగనల్' – ఇందలి గజపతి క్రీ.శ. 1497 మొదలు 1538 వఱకును కళింగమును బాలించిన ప్రతాపరుద్ర గజపతి.

క. 'ఆ విభు ననంతరంబ ధ
రావలయము బూని తీవు రహిమైఁ దిరుమ
ల్దేవియును నన్నపూర్ణా
దేవియుఁ గమలాబ్జముఖియు దేవేరులుగాన్.'

అని ఆముక్తమాల్యదలో రాయల దేవేరులనుగూర్చి యొక పద్యమున్నది, పెద్దన 'ఆ విభు ననంతరంబ ధరావలయముఁ దాల్చె' ఇత్యాదిలో (33) రాయలకు చిన్నాదేవి, తిరుమలదేవియను నిరువురు దేవేరులున్నట్లు వర్ణించినాఁడు. తిరుపతి దేవస్థానమున నున్న రాయవిగ్రహమునకు నొకవంక చిన్నాదేవి, ఒకవంక తిరుమలదేవి కన్పట్టుచున్నారు.

'చిన్నమదేవీ జీవితనాయక' అన్న పారిజాతాపహరణమందలి సంబోధనవలన రాయలకు చిన్నాదేవి ప్రియపత్ని యని వ్యక్తమగుచున్నది. ఈమె 'భోగ కాంత' యని, రాయలకు చిన్ననాఁటి నుండియు ప్రేయసి కావున నీమెను వివాహమాడి, దేవేరిని గావించుకొనినాఁడని చరిత్రకారుఁడైన న్యూనిజ్ వ్రాతవలన, జనశ్రుతివలనఁ దెలియుచున్నది.

ఈమె పేరు ఆముక్తమాల్యదయందుఁ గన్పట్టకపోవుటకుఁ గారణము, ఆ మహాకావ్యరచనా కాలమునకు ఆమె మరణించి యుండవచ్చునని చరిత్రకారు లూహించుచున్నారు. ఇందలి 'అన్నపూర్ణ' గజపతి కుమార్తె. ఈమెకు తుక్కాదేవి యని నామాంతరము. (చూ. కృష్ణరాయల దేవేరులు భారతి విరోధి – మార్గశీర్షము).

దండయాత్ర సందర్భమున రాయల సైన్యమును గూర్చి 'ధర కెంధూళులు', 'పుంఖాను పుంఖ' (1-43) లలో నెంతయో అతిశయోక్తియున్నట్లుగా పెద్దన వర్ణించినాఁడు. కాని చరిత్రల వలననే రాయరాణువలో 24 వేల గుఱ్ఱములు, 15 వేల ఏనుఁగులు, 2 లక్షల కాల్బలము నున్నట్లు చెప్పఁబడినది. కావున పెద్దన వర్ణించినంతటి ఘనమైన సైన్యముతోనే రాయలు దిగ్విజయములను సాగించినాఁడని భావింపవలసియున్నది.

లోకమున కృష్ణరాయలు కవితాప్రియుఁడే గాని స్వయముగ కవిగాఁడనియును, పెద్దనార్యుఁడే ఆముక్తమాల్యదను వ్రాసి రాయలపేర వెలయించినాఁడని యొక ప్రథయున్నది. అది యసత్యము. పెద్దనయే రాయలను గూర్చి 'కవితాస్త్రీ లోలుఁ' డనినాఁడు.

'భోజక్షమావిద్యాపరిపాక' అనుటయు, తిమ్మన 'కవితా ప్రావీణ్యఫణీశ' అనుటయు రాయలు భోజునివలె విద్వత్కవియనియే తెలియఁజెప్పుచున్నవి. కావున రాయలు కవీంద్రుఁడనుట చారిత్రక సత్యము. ఇట్టివానిని గాక పెద్దన 'ఒకరినొక పనికై నియోగించునపుడు కర్పూరతాంబూలమిడుట', మాన్యక్షేత్రములిడుట మొదలైన సాంఘికాచారములను, 'చేర్చుక్క', 'గండ పెండేరము' మొదలగు నా కాలమునాఁటి యాభరణాద్యలంకారములను, వేశ్యాదికముచే నా కాలమునాఁటి సాంఘిక వర్ణాశ్రమాచారాదికములను తన మనుచరిత్ర పీఠికయందును, నితర గ్రంథమునందును దెలియఁజేసినాఁడు.

## కృత్యాది విశేషములు

### (అవతారికాభాగ విశేషములు)

కృతులకు అవతారికలను జెప్పుట ఆంధ్రకావ్యములలో నొక విశేష లక్షణముగఁ గన్పట్టుచున్నది. సంస్కృత సాహిత్యమున నిట్టి సంప్రదాయము లేదు. వాల్మీకి రామాయణము వస్తునిర్దేశపూర్వకముగ నారంభమైనది. మహాకవి కాళిదాసు, కుమారసంభవ, మేఘ సందేశములను కావ్యములను వస్తునిర్దేశముతోనే యారంభించినాఁడు. రఘువంశమున మాత్రము పార్వతీపరమేశ్వరులకు "వాగర్థా వివసంపృక్తౌ'' ఇత్యాదియందు నమస్కరించి పిమ్మట తన వినయమును జెప్పుకొనినాఁడు. భారవి, మాఘుఁడు మొదలైన మహాకవులును వస్తు నిర్దేశముతోనే

గ్రంథారంభ మొనర్చినారు. గాని వారి కావ్యములందును మంగళాచరణాది అవతారికా విశేషములు గన్పట్టవు.

ఆంధ్రకవుల యవతారికాభాగమును శ్రీకారములతో నుపక్రమించుట, మంగళాచరణము, దేవతాస్తుతి, పూర్వకవి స్తుతి, కవితాలక్షణము, కుకవి నింద, సుకవి ప్రశంస, కృతిపతి ప్రశంస, కృతికర్త కృతిభర్తల యుభయవంశాభివర్ణనము, షష్ఠ్యంతములు అనునవి ముఖ్యముగ నుండఁదగిన యంశములైనవి. ఇందులో నే యొక్కటి తక్కువయైనను ప్రబంధము కాదేమోయన్న భయముతో, గవులెల్లరు నీ నియమములను బాటించినట్లు కన్పింతురు. ఈ కృత్యాదులలో, గొందఱకు స్వప్నములు వచ్చి ఫలాని గ్రంథమును ఇష్టదైవము తనకో లేక పేరుపెట్టి యొక రాజునకో యంకితమిమ్మని జెప్పిపోఁగా నంతట నా కవి శ్రీకారమునుజుట్టి గ్రంథరచన మారంభించినట్లుండును. లాక్షణికులును నీ కృత్యాదులకుఁ గొన్ని నియమముల నేర్పరచినారు.

ఈ అవతారికాభాగములు కాలక్రమమున పైలక్షణముల నెల్ల సంతరించుకొన్నట్లు పరిశీలనవలనఁ దెలియును. వీరివలన నాయాకవుల కవితా లక్షణోద్దేశాదులు, దేశకాల పరిస్థితులు, చారిత్రకాంశములు మొదలగు కొన్ని విశేషములు తెలియుచున్నవి.

మహాకవి పెద్దనార్యుని మనుచరిత్రమునందును దీర్ఘమైన యవతారికయున్నది. ఇందును స్వప్నము తప్ప మిగిలిన కృత్యాది లక్షణములన్నియుఁ గన్పట్టుచున్నవి. సకల శ్రేయస్సాధనమైన కావ్యమును జెప్పఁబూనినవాఁడై పెద్దనార్యుఁడు ఆశీర్వచనము, మంగళాచరణము, వస్తు నిర్దేశములలో నొకదానితోఁ గావ్యారంభ మొనర్పవలయుననెడి నియమము (ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశో వాఽపి తన్ముఖమ్) ననుసరించి పెద్దన, “శ్రీ వక్షోజకురంగనాభమెదపైఁ జెన్నొంద” ఇత్యాదియందు ఆశీర్వాదరూపమైన మంగళముతో కావ్యారంభ మొనర్చినాఁడు. లక్ష్మీస్తనకస్తూరిని జూచి భూదేవియని మునులు భ్రాంతినొందినట్లుగాఁ గల్పించి, గంధర్వుఁడు వరూథినికిఁ బ్రవరుఁడుగాఁ దోచుటకు సూచన గావించి కావ్యారంభశ్లోకమున ‘కావ్యార్థ సూచన మొనర్పవలయు’ నన్న నియమమునుగూడఁ బెద్దన పాటించినాఁడు.

కావ్యారంభమును శ్రీకారముతో నొనర్పవలయునని మఱియొక నియమము. ఈ విషయమును అప్పకవి తన లక్షణ గ్రంథమున “పదపడి శ్రీకారము కృతి మొదల నిలిచి దోషపుంజము నడంచి శుభం, బొదవించుఁ బరుసమినుమును, గదిసి

సువర్ణంబుసేయు కరణిన్ ధరణిన్" అని చెప్పినాఁడు. పెద్దన 'శ్రీ వక్షోజ' యని కృతి నారంభించుటచే కృత్యాదిని 'శ్రీ' కారముతో నొనర్చుటయును పాటించినట్లయినది. కావ్యాదిని 'మగణము' శుభదాయకమను శాస్త్ర వాక్యమును గూడ పాటించి, పెద్దన మగణముతో నారంభమగు శార్దూలవృత్తమును కావ్యారంభమొనర్చుటయును గమనింపఁదగియున్నది.

మంగళాచరణపద్యములలో 'శ్రీ వక్షోజకురంగనాభము', 'ఉల్లమునందు నక్కటిక మూనుట' 'నాలుగు మోములున్' అనువానియందు పెద్దన క్రమముగా హరి, హర, బ్రహ్మలను స్తుతించి నాఁడు. ఇందు 'బ్రహ్మ'ను గూడ స్తుతించుట విశేషము. బ్రహ్మ, త్రిమూర్తులలో నొకఁడైనను పంచాయతన దైవతములలోని (సూర్యుఁడు, శక్తి, విష్ణువు, శివుఁడు, గణనాథుఁడు – వీరివలన సౌరము, శాక్తము, వైష్ణవము, శైవము, గాణాపత్యములను మతము లుద్భవిల్లినవి – బ్రాహ్మమను మతము లేదు) వాఁడు కాఁడు. [12]కన్నడమున గదాయుద్ధమును జెప్పినారన్న కవిబ్రహ్మను, మన్మథుని గూడ స్తుతించినాఁడు. నన్నయభట్టు 'హరిహరగజాననార్కషడాస్యమాతృ సరస్వతీ గిరిసుతాదిక దేవతాతతికి నమస్కృతిసేసి' కావ్యారంభ మొనర్చినాఁడు.

నన్నెచోడుఁడు మన్మథుని గూడ స్తుతించినాఁడు. రాయలకాలముననున్న కన్నడ కవులు కన్నడ సంప్రదాయముననుసరించి బ్రహ్మను గూడ స్తుతించుటచే, పెద్దనయు పంచాయతన దైవతములలోని వాఁడు కాకున్నను బ్రహ్మను స్తుతించియుండవచ్చును.

ఇట్లు పెద్దన శివబ్రహ్మలను స్తుతించుటచే విష్ణు పారమ్యమునే పల్కు వైష్ణవుడు కాఁడేమోనన్న యనుమానమును గూడ గల్పింపఁగా, స్మార్తులతోఁ గొన్ని లౌకిక కారణములచే శ్రీవైష్ణవులవలెఁ బూర్తిగా భోజన ప్రతిభోజనాదులను వదలుకోచాలక యున్న ఇప్పటి గోల్కొండ వ్యాపారి వైష్ణవులవంటి వైష్ణవుఁడే మన పెద్దన్నగారు. స్మార్త సంఘమునందలి పామర సామాన్యాచారము ననుసరించి మనుచరిత్రమున నిష్టకామ్యార్థసిద్ధికై పెద్దనార్యుఁడు బ్రహ్మరుద్రాదులను స్తుతించెను. 'కేవల ముముక్షువులయందు దప్ప నిది దోషము కాదు' అని సమాధానము గూడఁ జెప్పఁబడినది. (ఆముక్తమాల్యద – వీర వైష్ణవము – శ్రీ. గో. రమాకాంతాచార్యులు భారతి వృష – ఆశ్వయుజము).

త్రిమూర్తుల స్తుతించిన పిమ్మట పెద్దనార్యుఁడు విద్యాబుద్ధులకధిదేవతయు, విఘ్నాధిపతియునైన గజాస్యుని గొల్చినాఁడు. గణాధిపస్తుతిపూర్వకమైన అర్ధనారీశ్వర వర్ణనమైన యీ పద్యము మిక్కిలి మనోజ్ఞమైనది. పిమ్మట పెద్దన సరస్వతిని

వర్ణించినాఁడు. దేవతాకాంతలను పాదములు మొదలు శిరము వఱకును వర్ణింపవలయునను ధార్మిక మర్యాదకు భిన్నముగ, శిరమాదిగ పాదముల వఱకును వర్ణించుట గమనింపఁదగియున్నది. ఇంతటితో దేవతాస్తుతిని ముగించి పెద్దన గురుస్తుతి యొనర్చినాఁడు. ఈ గురుస్తుతి వలన రాయల కాలమున శఠకోపయతి యను నొక వైష్ణవగురువరేణ్యు డున్నట్లు వ్యక్తమగుచున్నది.

ఈ యంశము కోకట గ్రామ దానశాసనముల వలన రూఢియగుచున్నది. ఇట్లు దేవగురు దేవతాస్తుతులొనర్చుట అవిఘ్న పరిసమాప్తికి. అది మానసికముగాఁగాక కృత్యాదిలోఁ బ్రవేశపెట్టుట యేల యనఁగా శిష్యులకు నేర్పుటకు ('శిష్య శిక్షాయై') అని సమాధానము.

గురుస్తుతికిఁ బిమ్మట పెద్దన అవతారికాది లక్షణములలో నొకటైన 'పూర్వ కవిస్తుతి' అను నియమమును బాటించి పూర్వకవులకుఁ బురస్కారమొనర్చినాఁడు. ఇందు తొలి దేవభాషా కవులైన వాల్మీక్యాదులను స్తుతించి పిమ్మట కవిత్రయస్తుతి యొనర్చినాఁడు.

తిక్కనను 'కృతక్రతు' అని పల్కి క్రతువులపై దనకుఁగల యభిమానమును బ్రకటించినాఁడు. ఈ కవిస్తుతులను బట్టి పెద్దన యిందు బేర్కొనిన కవీశ్వరుల గ్రంథజాలము నెల్ల సమగ్రముగఁ జూచినవాఁడని యూహింపవచ్చును. ఇందు తన కభిమానకవియును, కవిసార్వభౌముఁడు నైన శ్రీనాథుని గూర్చి చెప్పకపోవుట విశేషము. బహుశా పెద్దనార్యుని కాలమున కింకను శ్రీనాథుఁడు నవీనుఁడుగా భావింపఁబడుచుండెడివాఁడేమో!

పిమ్మట మనుచరిత్రలోని యవతారికాభాగమునఁ గన్పట్టు నంశము కుకవినింద. 'సుకవిస్తుతి యొనర్చినచో పరిశిష్టన్యాయమున కుకవినింద యొనర్చినట్లే, కాని రెండును కృత్యాదుల నుండవలె ననునది తెలుఁగు కావ్యావతారికలలో కాలక్రమమున నియమముగానైనది. నన్నయ సరసకవిసభలను వర్ణించి యూరకొనినాఁడు.

నన్నెచోడుఁడు కుకవినింద నారంభించినాఁడు. దేశికవితావిజృంభణము వలన సత్కవిత్వ మెద్దియో, కుకవిత్వమెద్దియో తెలిసికొనని కాలమగుటచే, 'కవిబ్రహ్మ' తిక్కన సోమయాజికిని కుకవి నింద యొనర్చుట యవసరమై, దానిని తన నిర్వచనోత్తర రామాయణమున "పలుకుల పొందులేక"... ఇత్యాది యందు రమణీయ మార్గమున కుకవినింద యొనర్చినాఁడు. ఇది తరువాత ప్రబంధములందు సంప్రదాయమైనది. పెద్దన కాలమున రాజసభలలో కవితకు విశేష గౌరవమును, దానివలనఁ

ప్రయోజనము విశేషముగా నుండుటచే గ్రంథచౌర్యము విశేషముగా జరుగుచుండెడిది కాఁబోలు. రాయల సాహిత్య సభాపతియైన పెద్దన దానినాపుటకై ఇట్టి కుకవినింద యొనర్చుటయవసరము గూడనైయుండి యుండవచ్చును.

కుకవినిందకుఁ బిమ్మట పెద్దన కృతిపతి ప్రశంస, సభావర్ణనములొనర్చినాఁడు. వీనివలన రాయల పరాక్రమాతిశయము, విద్యాభిమానములు వెల్లడియగుచున్నవి. రాయలు భువన విజయమను సభయందు విద్వద్గోష్ఠులు సాగించెడివాఁడను విషయమును దెలియుచున్నది. పెద్దన పిమ్మట కృతికి సప్తసంతానములలోఁగల స్థానమును గూర్చి తెలిపినాఁడు. సప్త సంతానముల ఘనతను గూర్చి అప్పకవి 'దుష్కృతములెన్ని చేసినను, సంతతులలోన నొకటి సలుపునతఁడు, కుతుకమునఁదన నూటొక్క కులమువారి, నరకములఁ బాపి ముక్తికి నడపు నిజము' అని చెప్పినాఁడు. అట్టివానిలో కృతిమహత్త్వము విశేషముగాఁ చెప్పఁబడినది.

కృతి ఖిలము గాకుండుటచే నందు జెప్పఁబడువారికి చిరస్థాయిత్వము గల్గుచున్నది. ఈ విషయము లన్నియును భంగ్యంతరముగ పెద్దన తెలియఁజేసినాఁడు. కవితను శిరీష కుసుమ పేశలముగఁ చెప్పవలెనని యిందుఁ దనకవిత్వాభిప్రాయమును వెల్లడించినాఁడు.

'హితుఁడవు, చతురవచోనిధి, వతులపురాణాగమేతిహాస కథార్థ స్మృతియుతుఁడవు, నాంధ్ర కవితా పితామహుఁడ'వన్న తన్నుగూర్చి కృతిపతి పల్కినట్లుగా జెప్పుకొనిన పద్యమున బెద్దన ఎన్నియో రహస్యముల వెల్లడించినాఁడు. 'హితుఁడవు' అను శబ్దముచే కృతికర్తకు హితుఁడైన కవి అభిమాన పూర్వకములైన వర్ణనలొనర్చి కృతిపతికిఁ గీర్తి స్థిరత్వమును గల్పించుననియు, హితుఁడు తన వర్ణనలచేఁ గృతిపతి రాజైనచో బ్రజాభిమానము జేకూర్చిపెట్టుననియు పెద్దన ఉద్దేశము. 'చతురవచోనిధివి' అనుటలో 'కావ్యము ఉక్తి విశేషము' గాన చతురోక్తులతో మెఱయని కావ్యము రసికజన చిత్తముల నాకర్షించి చిరంజీవత్వమును బొందఁజాలదని పెద్దన భావము. 'అతుల పురాణాగమేతిహాస కథార్థస్మృతియుతుఁడవు' అనుటలో కవికి కేవలము 'ప్రతిభ' చాలదు; వ్యుత్పన్నతయును గావలయును ధర్మతత్వ మెఱుఁగ వలయునని పెద్దన యభిప్రాయము.

'ఆంధ్ర కవితా పితామహుఁడ' వనుటలో నిత్య మాకర్షించు నవ్యతకలవాఁడవు. అట్టి నవ్యత (Novelty) కవితకవసరమని, కవిదృష్టి, కవిసృష్టి భిన్నమని పెద్దన సూచించినాఁడు.

'మనువులలో స్వారోచిషమనుసంభవము' అన్న పద్యమున 'రస సముంచిత కథలన్' అన్న దానివలన కవితాశిల్పమెంతయున్నను కవితకు ఆత్మరసమను నభిప్రాయము వ్యక్తమొనర్చి, సత్కవి రసవత్కావ్యవస్తువును స్వీకరింపవలెనని పెద్దన సూచించినాఁడు.

'కలి విధ్వంసక' శబ్దముచే కావ్యమునకు 'విశ్వ శ్రేయము' పరమ ప్రయోజనమన్న అభిప్రాయమును వ్యక్తమొనర్చినాఁడు. 'మార్కండేయ పురాణోక్త ప్రకారంబునం జెప్పుమనుట'తో ప్రఖ్యాతేతివృత్తమునకుఁ గల ప్రాముఖ్యమును దెల్పినాఁడు. ఈ రీతిగా పెద్దనార్యుఁడు చెప్పకయే కవితాలక్షణోద్దేశాదులను వెల్లడించినాఁడు.

పిమ్మట నొనర్చిన కృతిపతి వంశవర్ణనమున రాయల ప్రతాపాతిశయమును గూర్చియు నాతని కళింగ దిగ్విజయయాత్రను గూర్చియు నెన్నియో విశేషములను దెలిపినాఁడు.

షష్ఠ్యంతములను నన్నెచోడమహాకవి యారంభించినాఁడు. [13]తరువాతి కవులు అవతారికలలో నొక లక్షణముగఁ గ్రహించినారు. ఈ షష్ఠ్యంతరచనకు కవులందఱును కందమునే గ్రహించినారు. పెద్దనార్యుని షష్ఠ్యంతముల వలన రాయల సైన్యవిస్తృతి, విద్యావిశేషము, కవితాస్త్రీ లోలత, శ్రీవేంకటేశ్వరస్వామి పైఁగల భక్తి మొదలగు నంశములు వెల్లడియగుచున్నవి.

ఈ రీతిగా పెద్దనార్యుని మనుచరిత్రావతారికయందు అవతారికలకుఁగల ముఖ్య లక్షణములన్నియుఁ బుట్టినవి. వానివలన చారిత్రక, సాంఘికాది విశేషములెన్నియో వెల్లడియైనవి. 'పెద్దన మహాకవి' యనుటకు ఈ పీఠికా భాగమొక్కటియైనను జాలియున్నది.

## ప్రవరుఁడు

ప్రవరుని పాత్ర సకలాంధ్ర సాహిత్యమునందును నొక యపూర్వ సృష్టి. మనుచరిత్రకు విఖ్యాతిని గడించియిచ్చిన విశేషాంశములలో నొకటి. కవితా ప్రపంచమున పెద్దనను పెద్దన్నను గావించిన సృష్టి. నీవీబంధమోక్షమే (పోకముడిని విప్పుట) మోక్షమని వాదించు శృంగార రసవాదులైన కవులను సిగ్గిలఁజేయునట్టి ధర్మప్రతిపాదకమైన పాత్ర. పెద్దనను కావ్యసృష్టి మూలమున ధర్మప్రవర్తన మొనర్చినవారిలో నొక యగ్రేసరునిగ నిల్పిన పాత్ర.

'బలవా నింద్రియ గ్రామో విద్వాంస మపికర్షతి' – అన్న లోకోక్తిని తారుమారొనర్చిన ధర్మ ప్రవృత్తిగల సాటిలేని మేటి ఆదర్శపాత్ర! తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యములోని 'నిగమశర్మ'కు ప్రతియోగమైన పాత్ర. 'ప్రవర' అను అన్వర్థనామము గల పాత్ర.

మహాకవి పెద్దన ఈ ప్రవరుని పాత్రను సృష్టించుటలో తన యపూర్వ పాత్ర నిర్మాణ కౌశలము నెల్లఁ బ్రదర్శించినాఁడు. ఉత్తరకథయం దీ ప్రవరుఁడు దేవకాంతయైన వరూథినిని 'ప్రాంచద్భూషణ బాహుమూల రుచితోఁ బాలిండ్లు పొంగారఁ బైయంచుల్ మోవగఁ గౌఁగిలించి యధరం బాసింప, 'హా! శ్రీహరీ' యని ఓరమోమిడి యామె యంసద్వయమంటి పొ'మ్మని త్రోసిపుచ్చి, పిమ్మట నామె కలస్వనములతో వేదన నెపమిడి యేడ్చి ఎన్ని నర్మగర్భోక్తులు నక్కటక్కులు ప్రదర్శించినను లొంగక అస్ఖలితమానసుఁడై, 'కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్' అని నిగ్రహించి పలికి, ధర్మవిజయముతో నింటికి దిరిగివచ్చినాఁడు. ఇట్టి వానిని కథారంగమునఁ బ్రవేశ పెట్టునపుడే పెద్దన కడు శ్రద్ధ వహించి పిమ్మట నాతని ప్రవర్తనకుఁదగిన గుణబీజముల నెల్ల నాటినాఁడు.

ప్రవరుఁడు కులీనుఁడు, సుందరుఁడు, సంపన్నుఁడు, ఆచారవంతుఁడు, కర్మిష్ఠి, నిరంతరాధ్యయనాధ్యాపనతత్పరుడు, అధ్వరప్రియుఁడు, శమదమాదిగుణయుతుఁడు, నిరతాన్న ప్రదాత, ధార్మిక ప్రణయజీవి, శిష్యవత్సలుఁడు, తీర్థసందర్శనాభిలాషి, ఆతిథ్య తత్పరుఁడు, వృద్ధజన గౌరవము గలవాఁడు, అర్థార్జనతాపత్రయము లేనివాడు, జీవపితరుడు, సుఖి, సంభాషణచతురుడు, అరుణాస్పదపురాభరణము.

ప్రవరుఁడు కులీనుఁడు. కవి యాతని సిద్ధునిచే "ఓ చతురాస్య వంశకలశోదధి పూర్ణశశాంక" అని సంబోధింపజేసినాఁడు. తాను 'అంబురుహ గర్భకులాభరణ' మని పేర్కొనినాఁడు. బ్రాహ్మణ వంశజుఁడైన ఈ ప్రవరుఁడు పుట్టుకచే మాత్రమే బ్రాహ్మణుఁడు కాఁడు. సమస్త బ్రాహ్మణ ప్రవృత్తి కలవాఁడు. ఈతని అరుణాస్పదపుర మందలి బ్రాహ్మణులు ముదిమిచే మతితప్పిన బ్రహ్మను మెచ్చనివారు. అట్టి బ్రాహ్మణ కులమున కాభరణమైన ప్రవరుఁడు విద్యావంతుఁడని వేరుగాఁ జెప్ప పని లేదు. కవి యాతని 'భాషాపరశేషభోగి' (వాక్కులకు శేషుని వంటివాఁడు) అని వర్ణించుట ప్రవరుని భాషావైదుష్యమును వెల్లడించుచున్నది.

ప్రవరుఁడు సుందరుఁడు. ఇతనిని జూచుటతోడనే యాకర్షించున దీతని సౌందర్యము. అందుచే తొలుతగ నీతని కవి వర్ణించుచు 'మకరాంకశశాంక

మనోజ్ఞమూర్తి' (మన్మథ చంద్రులవలె రమణీయమైన రూపము గలవాఁడు) అనియు, అలేఖ్య తనూవిలాసుడనియు (చిత్రింపరాని రూపరేఖలు గలవాడు) జెప్పినాఁడు.

'సమ్మోహనకరమైన ఇట్టి రూపముగలవాఁడగుట వలననే' నితని నరుణాస్పద పురమందలి జారకామినులెందరో వలచుట సంభవించినది. ఇతని శరీర సౌందర్యము కేవలము మర్త్యభామినులనే కాక, వరూథిని వంటి దేవకాంతను సహితము మరులు కొల్పఁజాలినది.

ఈతని జూచిన మరుక్షణముననే ఆమె 'ఎక్కడివాఁడొ యక్షతనయేందు జయంత వసంత కంతులన్ జక్కదనంబునన్ గెలువఁజాలెడు వాఁడు మహీసురాన్వయం బెక్కడ? ఈ తనూవిభవ మెక్కడ?' అని యబ్బురపడినది. దేవలోక మందలి పురుష సౌందర్యమంతయు నీతని రూపసౌందర్యము ముందు దిగదుడుపే యని నిశ్చయించినది. ఈతని రూపమే వరూథినిని వలపించి చులకన చేసినది. కఠినవ్రత దీక్షల చేతను యజ్ఞయాగాది క్రియలుధర్మ నిర్వహణముల చేత నీ సౌందర్యము వాడిపోకుండుట విశేషము. ప్రవరుని యపురూపమైన సౌందర్యమంతయును నొకవేళ నామెకు దానిపై దృష్టియున్నను నది యీతని ధర్మపత్నియైన సోమిదేవికి తక్క నితర జారస్త్రీలకు భోగబాహ్యమైనది. ఇందు కీతని వైరాగ్యమే కారణము. ఈ యంశమునే పెద్దన మనోజ్ఞముగ –

ఆ.వె. 'వాని చక్కఁదనము వైరాగ్యమునఁ జేసి
కాంక్షచేయు జార కామినులకు
భోగ బాహ్యమయ్యె పూచిన సంపెంగ
పొలుపు మధుకరాంగనలకుఁబోలె.'

అని వర్ణించినాఁడు.

ప్రవరుఁడు ప్రణయతత్త్వము, భోగములను ఎఱుఁగనివాఁడు కాఁడు. ధర్మబద్ధుఁడు. ఇతఁడు తన తృతీయ పురుషార్థమునకు (కామమునకు) తన తల్లిదండ్రులు సంతోషముతోఁ గూకటులు కొలిచి చేసిన కూరిమి సోమిదమ్మ నొక్కతెనే సాధనముగ గ్రహించినాఁడు. అనఁగా నితని ప్రణయమేకపత్నీవ్రత పర్యవసిత మన్నమాట! ఆమె అనుకూలవతి. పతిదేవత. ఇతనిని సౌఖ్యావహయై భజించినది. ఇతని ఆతిథ్యతత్పరత్వము నెటిఁగి అర్ధరాత్రమున వేవురు వచ్చినను వండనలయక వారికిష్ట మృష్టాన్న భోజనముల నిడి సంతృప్తులను గావించి, భర్తకు

హృదయానందమును జేకూర్చెడిది. ప్రవరుని సదాచారములకు, క్రతుదీక్షా నిర్వహణములకు నిత్యోత్సాహమును ప్రదర్శించి యీ సోమిదమ్మ సర్వవిధ ధార్మిక దాంపత్య సౌఖ్యము లొడగూర్చునది. ఇట్టి యనుకూల దాంపత్యమునకు సంతాన సాఫల్యమేమైన కలిగినదో లేదో పెద్దన చెప్పినాఁడు కాఁడు. కథాకాలమునాఁటికి లేకపోవచ్చును. అయినను ప్రవరుఁడు ఇంకను జీవత్తాతపాదుఁడు (బ్రతికిన తండ్రి గలవాఁడు) యౌవనుఁడు గదా![14]

ప్రవరుఁడు ధనాఢ్యుఁడు. ఎట్టి కొఱఁతయును లేని గృహస్థు. ఆర్జనతాపత్రయము లేనివాఁడు. అతిశయమైన ఆతిథ్య తత్పరత్వమునకు, క్రతు నిర్వహణమునకు, నిరంతరాధ్యాపనమునకు విశేషధన మవసరము. అతని మాన్యక్షేత్రములు పెక్కు చందాల పండుచుండుటచే నతనికి వీని కన్నింటికవసరమైన ధనమునకు లోపము లేకపోయినది. ఈ కారణముననే అతని కార్జనతాపత్రయమును లేకపోయినది.

దాతలైన యెంతటి మహారాజు లీతని దానప్రతి గ్రహణయోగ్యతను గుర్తించి యీవచ్చిన నితఁడు సాలగ్రామము మున్నుగాఁ గొనకపోవుటయును సంభవించినది.

ప్రవరుని యదృష్టములన్నింటిలో గొప్పది 'జీవ పితరు'లను గల్గియుండుట. సుఖులై వారు 'దేవియున్ దేవరవోలె' నుండి యిలు దీర్చుట యంతకంటె నదృష్టము.

ప్రవరుఁడు సదాచారసంపన్నుఁడు. ఆచారసంపన్నతచే క్రమశిక్షణమును, శమదమాది సద్గుణముల నలవరచుకొన్నవాఁడు. ప్రత్యూష పవనాంకురములు పైకొనువేళ వామనస్తుతి పరత్వమున లేచి నదికేగి స్నానసంధ్యాద్యనుష్ఠానముల ముగించుకొని మడుగుదోతులు గొని సచ్ఛాత్రులు వెంటరాఁగా నింటికేతెంచుట యాతని కాచారము. అట్లు వచ్చుట ప్రజలు మెచ్చుకొనవలెనని గాదు. అన్యులకాదర్శమును జూపుటకు. ఇతరులు మెచ్చుకొనిరన్నచో నట్లొనర్చుట వారికి హృదయపూర్వకమైన మెప్పు కలుగుటవలననే.

నిత్య మధ్యాపనమున శిష్య హృదయముల నలరించుటచేత నాతనియెడ శిష్యసంతతికి భక్తిగౌరవము లతిశయములై యుండు నని యూహించుట యతిశయోక్తి గాదు. అతనికి శిష్యులపై వాత్సల్యమపారమై యుండవలయును.

కర్మిష్ఠి యైన పూర్వమీమాంసికుఁడైనను ప్రవరుఁడు భక్తి కొరవడినవాఁడు కాఁడు. భక్తిభావముతో నతిథులజేరి తీర్థమాహాత్మ్యముల నడుగుట, పోయి చూచిరావలయునని యువ్విళ్ళూరుటయు నిందులకు నిదర్శనములు.

ప్రవరుని తీర్థ సందర్శనాభిలాష ఉత్కటమైనది. సిద్ధుఁడు రాగా నాతనితో నితఁడొనర్చిన సంభాషణమున వినయమును, భక్తిని వెల్లడించినాఁడు. తన తీర్థయాత్రోత్సాహమును కరుణపుట్టునట్లు ప్రదర్శించుకొనినాఁడు. సిద్ధునివంటి ఇంద్రియ నిగ్రహముకలవానిని తన 'భాషాపరశేషభోగిత్వముచే' (మాటల నేర్పుచేత) కరిగించి రహస్యమును జెప్పించినాఁడు. తుదకు 'నను మీ శిష్యుని తీర్థయాత్రవలనన్ ధన్యాత్ముగాఁ జేయరే' అని శరణుఁజొచ్చి పాదలేపమును పొంది చిరకాలవాంఛను సాధించినాఁడు. తీర్థయాత్రకై బయల్వెడలి సూటిగ హిమవన్నగమున కేగినాఁడు. అట పాదలేపము కరిగిపోయినపుడు 'ఇమ్మంచు కొండకు రాఁజెల్లునె బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్!' అని తన్నుఁదా నిందించుకొనినాఁడు. కాని అటకేగనిచో తనూకాంతిచే మన్మథమన్మథుఁడైన యితనిని జూచి వరూథిని వలపు గొనుటెట్లు? వలపు విద్యనెల్ల నుగ్గుబాలతో నేర్చిన ఆమెకు లొంగక ధీరుఁడై "ఒడల్ తిరమే చెప్పకుమిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపై తేనియల్" అని పల్కి యుక్తులకన్నిటి కన్ని జెప్పి ధైర్య నిగ్రహముల త్రోసిపుచ్చి విజయముతో తిరిగివచ్చి, జితేంద్రియత్వమునకుఁ బెట్టినది పేరై ప్రశస్తిగనుటెట్లు?

ప్రవరుని తీర్థయాత్రాభిలాష తీరినదా? తీరకేమి? ఏది తరింపఁజేయునో యది తీర్థము. దానికేగుట యాత్ర. హిమవన్నగమున కేగి వరూథినీదర్శనమున ప్రవరుఁడు తరింపలేదా? తరించినాఁడు. అతని తీర్థయాత్రా కుతూహలము ఫలించినది. జితేంద్రియత్వ పరీక్షలో విజయము పొందుటయే యాతని తీర్థయాత్రవలని విచిత్ర ప్రయోజనము.[15]

పెద్దన ఉత్తరకథలో ప్రవరుఁడు ప్రదర్శించిన గుణవిశేషములకు బీజములన్నింటిని ప్రథమాశ్వాస కథయందే నిల్పి, పిదప వానినందంద వెలివిరియించుచు నా పాత్రను పూర్ణాకృతిని రచించి, తన కల్పనాశిల్పమహిమను మనోజ్ఞముగఁ బ్రదర్శించినాఁడు. ఆధునిక విమర్శకుఁడొకఁడు పెద్దనార్యుని ప్రవర పాత్రసృష్టికి ముగ్ధుఁడై ఇట్లు ప్రశంసించినాఁడు.

"జ్ఞాతాస్వాదో వివృత జఘనాం కో విహాతుం సమర్థః" శృంగారరసాస్వాదనము నెఱిఁగినవాఁడెవఁడు స్త్రీ వలచి వచ్చిన నిలువగలఁడు? – అని కాళిదాసుని సవాలు. దానికి సమాధానముగా 'శాణోపలనిఘృష్ట భర్మ శలాకనా' (ఒరపిడి రాయిచే బరీక్షింపబడిన బంగారు కడ్డీ) నొప్పు ప్రవరుని నిర్మించినాఁ డాంధ్రకవితాపితా మహుఁడు. "ఔరా పెద్దన్నా! నీవు పెద్దన్నవే. నీకును నీ ప్రవరునికిని జోహారులివే"

శ్రీ కుంటిమద్ది శేషశర్మ – ప్రవర నిగమశర్మలు – (భారతి – పార్థివ – కార్తికము). పెద్దన 'కవీనాం కవి' (The Poet's poet).

## సిద్ధప్రవర సంవాదము

ప్రబంధయుగ స్థాపనాచార్యుఁడును, ఆంధ్రకవితా పితామహుఁడునైన పెద్దనార్యుని మనుచరిత్రమున ప్రథమ రసవత్తర కథాసన్నివేశ మీ సిద్ధప్రవర సంవాదము. ఈ ఘట్టమును పెద్దనార్యుఁడు కడు సమర్థతతోను, శ్రద్ధతోను, రచించినాఁడనుటకు క్రింది విమర్శక వాక్యములు నిదర్శనములు. "ఈ సిద్ధప్రవర సంవాదమున భక్తి కరుణారసోల్లసితములగు రచన లతి ప్రౌఢములును, స్వభావోక్తి లలితములునగును. ప్రవరుని వినయౌచిత సంభాషణ వైదుష్యమును, కరుణారసోద్దీపక మగు సూక్తి నైపుణ్యము నగ్రగణ్యములు. ఇవియ వాని 'భాషా పరశేషభోగిత్వ' మును బట్టి యిచ్చుచున్నవి. సిద్ధుని గార్హస్థ్యవర్ణనమును హృదయంగమము" – శ్రీ తేవప్పెరుమాళ్ళయ్య.

తీర్థ సందర్శనాభిలాషియైన అరుణాస్పదపురవాసియగు ప్రవరుని ఇంటికొక సిద్ధుఁడు విచ్చేసి పాదలేపనమను దివ్యౌషధమును ప్రసాదింపఁగా, దాని దివ్యశక్తిచే ప్రవరుఁడు హిమవంతమునకుఁ బ్రయాణమగుట ప్రథమాశ్వాసమందలి కథ.

పెద్దన మహాకవి సిద్ధుఁడు ప్రవరుని ఇంటికి రావలయునన్నచో నాతని కతిథి సంతర్పణ గుణముగా నుండవలసివచ్చుటయు, అతిథి సంతర్పణము నిరంతరాయముగ సాగవలసి యుండుటచే ధనాఢ్యత, సదాచారసంపత్తి, వ్రతదీక్షాపరత్వము మొదలైన గుణ విశేషములు తన ప్రవరున కవసరములనియు గమనించుటచేత, తొలుతగా ప్రవరుని వర్ణించినాఁడు. అతని పాడిపంటలను వర్ణించినాఁడు. అతని ధర్మపత్నియైన సోమిదేవి అనుకూలవతి కాకున్న నా ప్రవరు నాధిపత్యప్రియత్వము కొనసాగదు గావున నన్నపూర్ణకు నుద్దియైన ఈమె యన్నదానగుణమును వర్ణించి సిద్ధుని రాకకు ఉపపత్తిని కల్పించినాఁడు.

ప్రవరునకు హిమాచలమునకుఁ బోవలయుననెడి కోర్కె చిరకాలమునాఁడే కల్గినది. ఆ కోర్కె చల్లారకుండుటకు ఉత్తేజములు, ఉద్బోధకములు అవసరముగదా! ఈ రహస్య మెఱిగి పెద్దన "తీర్థ సంవాసు లేతెంచినారని విన్న" అన్న పద్యమును, నీతఁడు తీర్థ సంవాసులు వచ్చినారని విన్ననెంతదూరమైన నేగి భక్తితో వారి నింటికిఁగొనివచ్చి ఆతిథ్యమిచ్చి, యిష్టాన్న సంతృప్తులను గావించిన పిమ్మట సకల

తీర్థమాహాత్మ్యముల నడుగుటను, 'పోవలయు చూడవలయు' నని యువ్విళ్ళూరుటయునుఁ గల్పించినాఁడు. ఈ సందర్భమున పెద్దన చెప్పిన 'తీర్థసంవాసు లేతెంచినారని విన్న' అన్న పద్యభావమంతయును మూలములో లేనిది. రసోద్వేల మైనది. అతి సహజమైనది. ప్రవరుని మనఃప్రవృత్తికిఁ బ్రతిబింబమువంటిది.

ఇట్లు అభ్యాగతసేవాపరతంత్ర సకలజీవనుఁడై ప్రవరుఁడు కాలము గడుపుచుండఁగా, ఔషధసిద్ధుఁడొకఁడు అరుణాస్పదపురమునకు వచ్చుచున్న వార్త ప్రవరుఁడు విని యెదురేగి, 'ముడిచిన యొంటి కెంజెడ మూయు మువ్వన్నె మెకముతోలు కిరీటముగ ధరించి' ఇత్యాది రూపములతో నపరశివావతారముగ వచ్చిన సిద్ధుని జూచినాఁడు.

పెద్దన 'మున్ముందు ప్రవరుఁడు తన తీర్థసందర్శనాభిలాషను తీర్చఁగల పరమయోగీంద్రుఁ డనుభావముతో శరణుజొచ్చి తరణోపాయమర్థింప' దగిన పరమయోగీంద్రునిగా, ప్రథమ దర్శనవేళనే భక్తి కుదురుకొనిన ప్రవరుని కన్నులతో మహానందమునఁ జూచినట్లుగా నాతని వర్ణించినాఁడు. పరమవైష్ణవ భక్తాగ్రేసరుఁడైన పెద్దనకు ప్రసన్నభావము నిత్య పరిచయమైనదిగదా! ఈ యోగీశ్వరవర్ణనము సమయోచితము, సహజము, మనోజ్ఞము.

ప్రవరుఁడు యోగీశ్వరున కాతిథ్యాదికమును నడిపి సదాచారమెఱిఁగిన విజ్ఞాని గావున చేరవచ్చి 'యన్మనీషి పదాంభోజ రజఃకణ పవిత్రతం తదేవ భవనం' – మహాత్ముల రాకచే గృహము పావనమగు' అన్న ఆర్యోక్తి నెఱిఁగియుండుటచే 'మీ రాకచే నా గృహము పావనమైనది. నేను పవిత్రుఁడనైనాను' అని సంభాషణ మారంభించినాఁడు. 'భాషాపరశేషభోగి' యైన యాతఁడు నేర్పుతో భక్తి యుట్టిపడ పొగడ్తగాని పొగడ్తగా యోగీంద్రుని మహిమలు జెప్పి స్తుతించి, తీర్థయాత్రాప్రశ్నమునకు అవతారికగా నిట్లు పలికినాఁడు.

తే. "మౌనినాథ! కుటుంబ జంబాలపటల
మగ్న మాదృశ గృహమేధిమండలంబు
నుద్ధరింపంగ నౌషధ మొండుగలదె
యుష్మదంఘ్రి రజోలేశ మొకటి దక్క?"

'ఇందలి వినయానుసంధానము, భక్త్యతిశయము, భాషాచమత్కృతి మిక్కిలి హృదయాకర్షకములు'. పిమ్మట సిద్ధుఁడు 'మావంటి తైర్థికావళి కెల్లన్ మీవంటి గృహస్థుల సుఖజీవనమున గాదె తీర్థసేవయు' నని పల్కి తీర్థసేవాప్రస్తావమునకు

దారి చూపుట గమనింపదగియున్నది. గృహస్థుల జీవనమును గూర్చి 'నికృష్ట'మను నభిప్రాయము ప్రవరుఁడు వెల్లడించినాఁడు గదా! దానికి ఎఱిఁగినవాఁడుగాన సమాధానము చెప్పకుండరాదు. చెప్పకుండు టెట్లు? సిద్ధుఁడు 'కెలఁకులనున్న తంగెటిజున్ను గృహమేధి యజమానుఁడంకస్థితార్థపేటి' ఇత్యాదిగా గార్హస్థ్యమును నిరతిశయమైనదని నానా నిరూపణ వైచిత్ర్యముతో రమణీయముగ వర్ణించినాఁడు.

ఇందు పెద్దన సిద్ధునిచే పండితులు సంభాషణములందు వాడుకొను 'తంగెటి జున్ను', 'అంకస్థితార్థపేటి', 'పండిన పెరటి కల్పకము' ఇత్యాదులను ప్రయోగింప జేయుట భాషయందును సహజత్వమును సంపాదించుటకేయని గ్రహింపవలయును.

దీనికి బిమ్మట ప్రవరుఁడు సిద్ధుఁడు ప్రయోగించిన 'తైర్థికావళి', 'తీర్థసేవ' అన్న పదములను ఊఁతగా గొని యతిసహజముగఁదోప 'పోయి సేవింపలేకున్న పుణ్యతీర్థమహిమ వినుటయు నఖిల కల్మషహరంబ' అని చాతుర్యమొప్ప పల్కి ప్రార్థింపఁగా, సిద్ధుఁడు తా నాయా దేశములందుఁ జూచిన యద్భుతముల నెల్లఁ జెప్పి వానిని దైవానుగ్రహము వలన నల్ప కాలములోఁ గనుఁగొనజాలితి నని తెలిపినాఁడు. అట్టి స్థితిలోఁ బ్రవరునకిది యంతయును కల్లగాఁ దోచుట సహజము. నవ్వు వచ్చినది. దానిని చెక్కిళ్ళతో కాచుకొనినాఁడు. అవిశ్వాసముతో నడుగుట దోషము. అతనికిఁ గల్గిన యాశ్చర్య మడుగుమనుచున్నది. అప్పుడు ప్రవరుఁడు తన అవిశ్వాసమను కటుత్వమునకు భక్తియను తీపిని చేర్చి 'రసవ్యంజకముగా' వెఱవక యని చెప్పి సంభాషణ మారంభించినాఁడు. ఈ సందర్భమున పెద్దన ప్రవరుని చేష్టాదికమును, మనోవృత్తిని అతిసహజముగ పాత్రోచితముగ నిరూపించినాఁడు.

ప్రవరుఁడు సిద్ధునితోఁ జేసిన "వెఱవక మీకొనర్తు నొకవిన్నప మిట్టివియెల్ల జూచిరా... ఏమి సెప్పుదున్" అన్న సంభాషణమున భక్తివలన భయము కల్గినది. అయినను వెఱువక యడుగుచున్నాననునది యాకూతము. ఇట యతఁడొనర్చినది అవిశ్వాసముచేఁ జేయు ప్రశ్నము కాదు. జిజ్ఞాసచేఁ జేయు విజ్ఞాపనము. ఈ విన్నపమును ప్రవరుఁడు గౌణముగాను భావగర్భముగాను 'ఇట్టివియెల్లఁ జూచిరా నెఱకలుగట్టుకొన్న మఱి యేండ్లును బూండ్లును బట్టు' ననియు, 'ప్రాయపుం జిఱుతతనంబు మీ మొగము చెప్పక చెప్పెడు' ననియు రెండు వాక్యములు పల్కి యా రెంటికిని నిగమనమును ఊహనీయముగాఁ దేల్చినాఁడు.

ఈ మాటలందును తన అవినయము వాసన కొట్టుచున్నదేమోయని యనుమానించి, దానిని పోగొట్టుటకై అట్లు యాత్రలొనర్చుటలెల్ల నాతని మహిమలుగాన

జెప్పినాఁడు. సిద్ధుఁడు ఈశ్వర సత్కృపవలనఁ దనకు గలిగిన పాదలేప మహిమ జెప్పినాఁడు. ప్రవరునకు నమ్మిక కల్గినది. అవిశ్వాసము నశించి భక్తి పెల్లుబుకగా శరణుజొచ్చి కరుణారసోద్దీపకముగా – "మీ దివ్య ప్రభావం బెఱుంగని నా ప్రల్లదముల్ సహించి మునిలోక గ్రామణీ సత్కృపన్ నను మీ శిష్యుని తీర్థయాత్రవలనన్ ధన్యాత్ముగాఁ జేయరే"

అని వేడుకొనినాఁడు. ఇక శిష్యవత్సలుఁడైన సిద్ధుని హృదయము కరుఁగకుండుటెట్లు? పాదలేపమును పూయఁగా ప్రవరుఁడు హిమాచలమునకు వెళ్ళినాఁడు. ఆ స్థితిలో అదియేమి మందని అడుగుటకు ప్రవరునకుగాని, దీని తత్త్వమిదియని తెల్పుటకు సిద్ధునకు గాని యవకాశము లేదు.

ఈ సందర్భమున పెద్దన మహాకవి ప్రవరుఁడు పాదలేపమును బూయించుకొని 'తుహిన భూధరతుంగ శ్యామలకోమల కానన హేమాఢ్యదరీ ఝరీ నిరీక్షాపేక్షన్' పోయినట్లు వర్ణించినాఁడు. ఈ దీర్ఘసమాసమున నా మహాకవి ఇంతవఱకును బిందువులు బిందువులుగా బడుచున్న యమృతము నొక్కుమ్మడిగా గ్రుమ్మరించినాఁడు. ఈ సమాసమున ప్రవరుని సంతోషాతిశయము నంతయును పెద్దన శబ్దతః నిరూపించినాఁడు. ఈ సమాసమున హుటాహుటి నడకలతో ప్రవరుఁడు హిమవంతమున కేగుటయును గన్పట్టుచున్నది.

ఈ రీతిగ మహాకవి పెద్దన పూర్వవాక్యములను పదములను ఉత్తరోత్తర సంభాషణలకు ఆధారములుగా గల్పించి, సూక్తి నైపుణ్యములతో సంభాషణలు సాగించి పాత్రోచిత ప్రవర్తనములు కన్పట్టునట్లుగా, భక్తి కరుణారసోల్లలితమైన ప్రౌఢరీతిని సిద్ధప్రవర సంవాదమును నడిపి, సిద్ధహస్తుఁడైన కథాకథనశిల్పి యనుభావమును పాఠక లోకమునకుఁ గల్పించినాఁడు.

తొలుత 'భాషాపర శేషభోగి' యని తా వర్ణించిన ప్రవరుని వచనరచనా నైపుణ్యమునంతటిని వెల్లివిరియించినాఁడు. ప్రవరుని ఈ శక్తిని మఱింత యధికముగా వరూథినీవృత్తాంతమందు చూపినాఁడు. ఈ ఘట్టమునందలి ఉత్తమ కథకున కావశ్యకములైన ముఖ్య లక్షణములన్నియు పెద్దనకడనున్నట్లు మనకు గోచరించును.

## అల్లసానివాని అల్లిక జిగిబిగి

నేటి పాశ్చాత్య సాహిత్య ప్రభావమువలనఁ బుట్టిన విమర్శవంటిది మనకుఁ బ్రాచీన కాలమున లేదు. కథానిర్మాణము, పాత్రపోషణము, మనస్తత్త్వ నిరూపణము,

ప్రకృతి పరిజ్ఞానము, సంభాషణ విరచనము మొదలైన వివిధాంశముల గ్రహించి విమర్శ యొనర్చుట ప్రధానముగా నిరువదియవ శతాబ్దియందే పుట్టినదని చెప్పునొప్పును. అంతమాత్రము చేత మన ప్రాచీనులకుఁ గావ్యవిమర్శ లేదనరాదు. కావ్యపరిశీలనమున వారి దృష్టి వేరు. విద్వద్గోష్ఠులలో వారు కావ్య విమర్శ యొనర్చెడి వారు. కవులు, పీఠికలందు వారి కవితాగుణములను గూర్చి చెప్పుకొనుటయు కలదు.

నన్నయ తన కవితలో 'నానా రుచిరార్థ సూక్తినిధిత్వము', 'అక్షర రమ్యత' లున్నవనుటయు, తిక్కన తాను "శిల్పమున పారగుఁడ" ననుటయు నిట్టివి. శ్రీనాథాది మహాకవులను "వచియింతు వేములవాడ భీమనభంగి నుద్దండలీల నొక్కొక్కమాటు" ఇత్యాదిగాఁ చాటువులందు జెప్పికొనినారు. రాయలనాటి కవుల విషయమునందును నిట్టి విమర్శక వాక్యములు కొన్ని పుట్టినవి. ప్రబంధయుగ కవితాపితామహుడైన అల్లసాని పెద్దనార్యుని గూర్చి మనుచరిత్ర కృత్యాదిని 'శిరీష కుసుమపేశల సుధామయోక్తులఁ గవితఁజెప్పు' మని రాయలు కోరినట్లుగాఁ గన్పట్టుట ఇట్టి జాతిలోని విమర్శ. పెద్దనార్యునికిఁ దరువాత దరిదాపుగ రెండు శతాబ్దములకుఁ బుట్టిన కవి చౌడప్ప పెద్దన కవితను గూర్చి చెప్పిన చాటువు "పెద్దనవలె గృతి చెప్పిన పెద్దనవలె, నల్పకవిని బెద్దనవలెనా? యెద్దనవలె మొద్దనవలె గ్రద్దనవలెఁ గుందవరపు కవి చౌడప్పా!" అనునదియు నిట్టిది.

పెద్దన కవితను గూర్చి ప్రాచీన కాలముననే పుట్టిన మరియొక విమర్శక వాక్యమున్నది. మూర్తికవి కవిత్వమును విమర్శించుచు తెనాలి రామకృష్ణుఁడో లేక మఱియొక కవియో చెప్పినట్లుగా వ్యాప్తిలోనున్న –

ఆ.వె. "అల్లసానివాని యల్లిక జిగి బిగి
ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు
పాండురంగవిభుని పదగుంఫనంబును
గాక మానురాయ నీకు తగుర!"

అన్న చాటువులోని 'అల్లసానివాని యల్లిక జిగిబిగి' యన్న వాక్యమిది. అల్లసాని పెద్దనార్యుని కవితలో 'నల్లిక జిగిబిగి' యున్నదని సమకాలిక కవులు గుర్తించినట్లు దీనివలనఁ దేటపడుచున్నది.

అల్లసాని పెద్దన మనుచరిత్రలోని కవిత్రయం 'దల్లిక జిగి బిగి' యున్నదనుట యంగీకరింతము. ఈ విమర్శక వాక్యము శబ్దప్రయోగ విషయమున పదముల

యన్యోన్య మైత్రిని గూర్చి పుట్టినదని "ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు, పాండురంగ విభుని పదగుంఫనంబును" అన్న ఇతరవాక్యముల వలన నూహింపవచ్చును.

ఈ వాక్యమునకు అల్లసాని పలుకుబడిలో 'అల్లికతనము,' అందు జిగి (కాంతి), బిగి (నిబిడత్వము – చిక్కదనము) నున్నవని భావార్థము. 'అల్లసానివాని అల్లిక జిగి బిగి' యన్న ఈ వాక్యము ఆ మహాకవి శైలికి సంబంధించినదని తేలుచున్నది.

కవి యెంతటి స్వతంత్రప్రవృత్తి గలవాఁడైనను గాలప్రభావమాతనిపై తన శక్తిని ప్రసరింపక మానదు. సామాన్యముగ దేశము సుసంపన్నమై, యొక సమ్రాట్టు పాలనకు లోనై ప్రశాంతజీవితమును బ్రతిబింబించు కాలమున, కళ శిల్పప్రధానముగ విజృంభించుటయు, నది నాగరకతాప్రవృత్తిని ప్రదర్శించుటయుఁ గన్పట్టును.

భోగపరాయణత్వమునకు, కృత్రిమత్వమునకు (Artificiality) సన్నిహిత సంబంధము. అట్టికాలమున బుట్టు కవితలో ఆవేశము ఉద్వేగముల (Emotions) కంటె ఉపజ్ఞాప్రధానమైనదియును, ఊహాజన్యమును, ఎఱిఁగియెఱిఁగి తీర్చిదిద్ది నదియును నైన రీతి (Style) కన్పట్టును.

రాయలనాఁటి కాలము ఇట్టి నాగరక ప్రవృత్తి కలది. ఈ కాలమునాఁటి శిల్పములు – హంపీ విఠలాలయ శిల్పములు, హజార రామాలయ శిల్పములు – నిట్టి లక్షణములనే వ్యక్త మొనర్చుచున్నవి. నాటి సంగీతము నిట్టి లక్షణములే గల్గియున్నదని యూహ సేయవచ్చును. రాయలనాఁటి సాహిత్య ప్రపంచమునకు, జీవితమునకు సర్వతోముఖ లక్షణములఁ బ్రదర్శించు ప్రతినిధియైన పెద్దన కవితలో నీ శిల్పరీతి సుస్పష్టముగ గోచరించును. పెద్దన కావ్య శిల్ప కళాధర్మ మర్మము లెఱిఁగిన, అపార కవితాసాధన మొనర్చిన స్వీయశక్తిజ్ఞానముగల శిల్పివర్యుఁడు (- A conscious artist)

ఈ మహాకవి ప్రధానముగ ఆలంకారిక శైలిలో కావ్య శిల్ప ఖండములను జిగిబిగులొప్పార శిల్పించి, ఆంధ్రజాతికిఁ గాన్కలు పెట్టినాఁడు.

జిగిబిగితో నొప్పు మనుచరిత్ర శైలికిని, పెద్దన స్వభావమునకు విశేష సంబంధమున్నది. పెద్దన ధర్మపథముపై నభిమానముగలవాఁడైనను లౌకిక భోగానుభవమును విడిచిపుచ్చిన కేవలకర్మిష్ఠి కాఁడు. ఒక సుఖస్థితియున్నపుడే జిగిబిగువులుగల కవితఁ జెప్పగలఁడు గాని యెల్లవేళల నీతఁడు పలుకలేఁడు, ఈ అభిప్రాయమునే పెద్దన –

చ. 'నిరుపహతిస్థలంబు రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పూర విడె మాత్మకింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పు త
ప్పరయు రసజ్ఞు లూహఁ దెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకినగాని యూరక కృతుల్ రచియింపు మనంగ శక్యమే?'

యన్న పద్యమున వెల్లడించినాఁడు. ఇందలి కోర్కెలను గోరువాఁడు కవితావేశముతోఁ గవిత జెప్పి రసికలోకమునుగాక సామాన్య లోకమును దృష్టినుంచుకొను స్వభావము గలవాఁడు కాఁడు. కవితను కళగా భావించి తగిన గుణగ్రాహులకు మాత్రమే కైత జెప్పునట్టివాఁడు. పెద్దన కవిత్వ విషయమున పోగరపనితనమును జూపించు నద్భుతశిల్పి.

కవితాతత్త్వమును గూర్చి పెద్దనార్యుఁడు రాయలగోష్ఠిలో జెప్పిన "పూఁత మెఱుంగులున్" ఇత్యాదియైన చాటువువలనను నితఁడు కవితయందు జిగి బిగువులు రెండును నుండ వలయునని కోరుచున్నట్లు తోచుచున్నది. ఈ చాటువునందలి –

"పూత మెఱుంగులున్, పసరు పూప బెడంగులు చూపునట్టివా
కైతలు జగ్గు, నిగ్గు నెనగావలె గమ్మనఁ గమ్మనన్వలెన్
రాతిరియున్, బవల్ మరపురాని హొయల్ చెలి యారజంపు ని
ద్దా తరితీపులో యనగ దారసిలన్వలె లోఁదలంచినన్
.............................................. జవరాలి సిబ్బెపు
న్మేతలి యబ్బురంపు జిగి నిబ్బరపుబ్బగు గబ్బి గుబ్బ పొం
బూతలనున్న కాయ సరిపోడిమి కిన్నర ....

ఇత్యాది వాక్యముల వలన కవితయందు 'జిగి' యుండవలెనని ఆ మహాకవి వెల్లడించినాఁడు. ఇందలి పద గుంఫనము వలననే కవితయందు పెద్దన 'బిగి' నెట్లు వాంఛించునో కూడ తెలియుచున్నది. ఈ చాటువుననే యున్న సంస్కృతంబు పచరించిన పట్టున భారతీ వధూటీ తపనీయ గర్భనికటీ ఇత్యాది రచన పెద్దన యెట్టి బిగినాశించునో తెల్పుచున్నది.

'అల్లసానివాని అల్లిక జిగి బిగి' అన్న ప్రాచీన విమర్శ వాక్యమును జెప్పినవాని యుద్దేశమున పెద్దనార్యుని కవితలో తేజము, శబ్దముల పోహళింపు నున్నదని స్పష్టముగ నూహింపవచ్చును. ప్రథమాశ్వాస పీఠికాభాగమునందలి "నిజభుజాశ్రిత ధారుణీ వజ్రకవచంబు, దుష్టభుజం గాహితుండికుండు'' (ప. 27) "అంభోధివసన

విశ్వంభరావలయంబు తన బాహుపురి మరకతముఁజేసె" (ప. 30) "ఆలపోత్రి ప్రభుదంష్ట్ర" ఇత్యాదులు జిగిబిగుల రెంటిని బ్రదర్శించుచున్నవి.

రత్నములు పొదిగిన రమణీయ కంఠాభరణమొనర్చు స్వర్ణకారునివలె శబ్దరత్నములను జిగిబిగి యొప్పఁగా బొదుగుట యిందు గన్పట్టును. కథాభాగమునందు జిగిబిగితో నొప్పు శైలికి నిదర్శనములైన పద్యములెన్నియో యున్నవి.

'ఆ పురిబాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి' అన్న పద్యమున జిగిబిగులొప్పు శైలితో పెద్దన ప్రవరుని ప్రవేశపెట్టినాఁడు. అతని రూప సౌందర్యమును తొలుత మకరాంక శశాంక మనోజ్ఞమూర్తియని చెప్పి, తుదకు మఱల 'అలేఖ్య తనూవిలాసుఁడై' అనుటచే జిగిగల రెండు రత్నముల నాద్యంతముల నిల్పి బిగువు మెఱయు నల్లిన యొంటి పేటహారము వలె పెద్దన పద్యమును లాగుట గమనింపవలసి యున్నది. జిగిని గూర్చుటలో పెద్దన భావమునకుఁ దగిన శబ్దజాలము నెన్నుకొనుటయు తగిన విడుపులతో, ఒంపుసొంపులతో వాక్యముల నడుపుటయుఁ జూపించును. ఇందుకు సిద్ధుఁడు పాదలేపమును కాలికి పూసిన పిమ్మట ప్రవరుఁడు హిమవంతమున కేగుటను వర్ణించునపుడు పెద్దన చెప్పిన :

క. "ఆ మందిడి యతఁడరిగిన
భూమీసురుఁడరిగె తుహిన భూధరశృంగ
శ్యామల కోమల కానన
హేమాఢ్యదరీ ఝరీ నిరీక్షాపేక్షన్."

అను పద్యము జిగిబిగులతో ప్రవరుఁడు హుటాహుటి నడకలనేగుటను గన్నులగట్టున ట్లొర్చుచున్నది. పద్యమందు మాత్రమే కాక, ఈ జిగిబిగులను గొనివచ్చుట పెద్దన వచనమునందును బ్రదర్శించినాఁడనుటకు సిద్ధుఁ డాయా దేశ విశేషములు దెల్పుచు చెప్పిన వచనమునందలి "లంబమాన రవి రథ తురంగ..., వికట కూట కోటి విటంక..., స్వప్న ప్రవర్ధిత వర్ధిష్ణు ధరణీరుహ..." ఇత్యాది వాక్యములు నిదర్శనములు.

పెద్దనార్యుఁడు ఐంద్రియతృప్తి యొనర్చు కవి (Poet of the senses) యగుటయు నీ జిగిబిగిని సంపాదించుటకుఁ దోడ్పడుచున్నది.

జిగిబిగులతో కూడిన అల్లసాని అల్లికలో వింత వైవిధ్యమున్నది. వాక్యనిర్మాణ విషయమున నీ యల్లికయందలి విభేదముల నెన్నింటినో పెద్దన ప్రదర్శించినాఁడు.

పెద్దన భావము లల్లుటయందును జిగిబిగులు గన్పట్టును. “వక్షోజ కురంగనాభములోని భావమునందలి” యల్లికలోని సొంపు ఊహించిన కొలదిని జిగిబిగులతో పఠితల కాశ్చర్యమును గల్గించును. ‘ధర కెంధూళులు కృష్ణరాయల చమూధాటీగతిన్’ ఇత్యాదిగ గల పద్యములోని యల్లికలో మార్దవముతో నొప్పారు జిగి బిగువులు, ‘ఘనుఁడై తిమ్మక్షితీశాగ్రణి శరకమఠగ్రావ’ ఇత్యాదియైన యల్లికయందును ‘ఆలపోత్రిప్రభుదంష్ట్ర భోగివర భోగాగ్రాళిఁబాలు’ ‘మదకలకుంభికుంభ నవమౌక్తికములు’ ఇత్యాదియైన యల్లికయందును ప్రౌఢతతో గూడిన యల్లిక కన్పట్టును. భావమునందే కాక మనుచరిత్ర కథయందును నల్లిక సొంపు కన్పట్టును. జిగిబిగితో గూడిన అల్లికసొంపుపై నభిలాష గలవాఁడగుటచేతనే పెద్దన తన చతుర రచన ‘కనుకూలమైన’ యీ కథావస్తువు నెన్నుకొనినాఁడు. పూర్వకవి చెప్పినట్లు కేవలము శైలియందే గాక, భావుకతాది వస్తువులందును, వర్ణనలందును నల్లికలోని జిగిబిగులు పెద్దనార్యుఁడు ప్రదర్శించినాఁడు.

పూర్వకవి ‘‘అల్లసాని వాని యల్లిక జిగిబిగి’ యన్న వాక్యమెంతయో సమంజమైనది. రాయలనాఁటి జీవితమే జిగిబిగులతోఁ గూడినది. పెద్దన మనుచరిత్ర యా నాఁటి కళాత్మక జీవితమునకు ప్రతిబింబము. పెద్దన నాఁటి శైలికి ప్రతినిధి.

**అధఃసూచిక**

1. కృష్ణరాయలు వేంకటగిరి వల్లభ భక్తుడగుటయు, శ్రీకాకుళాంధ్ర విష్ణువునకు నాముక్త మాల్యద నంకితమిచ్చుటయు, తాతాచార్యులవారి శిష్యుడగుటయు మొదలైన విందుకు ఆధారములు. రాయలు వైష్ణవుఁడైనను శైవులయెడగాని, స్మార్తులయెడగాని సహనము లేనివాఁడు మాత్రము కాఁడు. ఇతఁడు స్మార్తులు, శైవులునైన కవులనెందరినో యాదరించుటయు, స్మార్తుఁడైన తిమ్మరుసును మహామంత్రిగా గ్రహించుటయు, అమరావతి మొదలైన శైవక్షేత్రములకు దానములిచ్చుటయు నిందుకు నిదర్శనములు.
2. రాయలనాఁటి కాలలక్షణము సాహిత్య ప్రపంచమున నెట్టి మార్పును గొనివచ్చినదియును శ్రీ రాళ్లపల్లి రమణీయముగ నిట్లు నిరూపించినారు. “అది స్పర్ధలకాలము. స్పర్ధలో జయముగాంచి అభిమానపడు కాలము. కావున మా కగ్రతాంబూలము రావలయును. మేము కర్ణాటకులము, మేము తెలుఁగువారము. కావున సభలో మొదటి పీఠము మాది’’ ఇత్యాదిగా కేవల పశ్చాద్దృష్టితో జీవింపఁగోరు పేడిబదనికల (చెట్టుమీద మొలచునోషధి) కాలము గాదు. స్వశక్తి లేనివారి సడిచప్పుడు వినఁబడని కాలము. పురుష సింహుల కాలము.

ఈ కాలధర్మములు కవి కావ్యములందెట్లు ప్రతిఫలింపకుండగలవు? సామాన్యముగ రాజ్యము, మతము, శాస్త్రము, శిల్పము మొదలగునెల్ల విషయములందును మనుష్యశక్తియొక్క పరాకాష్ఠను జూపఁగోరు సమయమున, సన్నివేశమున కవులుమాత్రము ముద్దుగ, మృదువుగ, రసమయముగ, పూవులవలె నక్కరకు వచ్చినప్పుడు ముడిచినను, అక్కరమాలినపుడు త్రోసివేసినను సహించుకొని పేదులయి కేవలాధ్యాత్మిక తృప్తితో కాలము గడుపుట సాధ్యమా? కావున వారును పురుషసింహు లగుటకు యత్నించిరి. అంతకుఁ బూర్వ మైదునూర్ల సంవత్సరముల ఆంధ్ర సాహిత్యము యొక్క జీవనమున సంస్కృత సాహిత్యమహిమలో స్వల్ప స్వల్పముగ కనఁబడుచువచ్చిన చమత్కార ప్రధాన రచన రాయలకాలమున బాగుగా పెరిగి వేరూని తరువాతి కవులకు మార్గదర్శకమాయెను. చిత్రకవిత, బంధకవిత, గర్భకవిత, ఆశుకవిత యని నాల్గు రకములుగా పద్యరచన ప్రసిద్ధమాయెను. రాయలయాస్థానమున ప్రధాన కవియైన పెద్దన్న తన కీ 'చతుర్విధకవితామతల్లి' స్వాధీనమని చెప్పుకొనియున్నాడు. సంస్కృతాంధ్రములందు సమానముగ నాశుకవితఁ జెప్పగలిగినందుననే గండ పెండేరమును రాయలాయన కాలికిఁ దొడిగినాడట! రాయల కంకితము చేసిన మనుచరిత్రములో నిటువంటి కుస్తీ కవనపు ప్రసంగమే లేకపోయినను దాని నభ్యాసము చేసియుండనిచో కవిపండిత సమాజమున నాతనికి మర్యాద దొరకియుండదని ధారాళముగాఁ జెప్పవచ్చును. కఠిన సమస్యల నిచ్చుటయు ఆకస్మికముగ జూచిన వస్తు సన్నివేశములను గూర్చి కవనము జెప్పఁగోరుటయు, తృప్తికరముగ నట్లు చేసినవారికి బాగుగా సన్మానము చేయుటయు నప్పటి సామాన్య రాజసభాసంప్రదాయములుగ నుండెను. అందువలనఁ గత్తిబట్టిన శూరునకును, కలము బట్టిన ధీరునకును ఉత్సాహమున భేదముండలేదు. రసరంగములును, రణరంగములును నేకరీతిగ నుద్రేకదాయకములై యుండెను. అందుచే కవిశూరుల వీరాలాపములును సింహనాదములును ప్రాయశః ఆ కాలపు ప్రతి కావ్యము నందును వినరా నారంభించినవి... ఇటువంటి సమయమునఁ బుట్టిన కావ్యములు నిస్సారములుగ నీరసములుగ నుండ సాధ్యము కాదు. జీవనము నిండారి పొంగులు వారుచున్న సమయమున కేవల నిర్జీవ రచన ఎట్లు తలచూపును? – రాయలనాఁటి తెలుగు సాహిత్యము.

భారతి : ధాత : మాఘము.

3. శ్రీ నిడుదవోలు వేంకటరావు ప్రథమాంధ్ర కవితా పితామహుఁడు: శివదేవయ్య – భారతి పార్థివ, ఫాల్గునము.

4. పారిజాతాపహరణ పీఠికాభాగమున (కృత్యాదిని) నంది తిమ్మన శ్రీకృష్ణరాయల పూర్వదిగ్విజయయాత్రలో కొండవీటి విజయము వఱకే వర్ణించియుండుటచే నది క్రీ.శ. 1516న రచింపఁబడి యుండుననియును, మనుచరిత్రలో రాయల పూర్వదిగ్విజయయాత్ర సంపూర్ణముగా వర్ణింపఁబడుటచే నది క్రీ.శ. 1519 తరువాత నల్పకాలమున రచింపఁబడవలెనని శ్రీ కుందూరి ఈశ్వరదత్తు నిర్ణయము. ఈ మతమున నాంధ్ర పంచకావ్యములలోఁ పారిజాతాపహరణమే తొలి కావ్యమగుచున్నది. – ఆంధ్ర పత్రిక – సంవత్సరాది సంచిక – ప్రమోదూత పే. 101–104

5. 'ఆంధ్ర భాషయందుఁ బెక్కులు ప్రబంధము లుప్పతిల్లినను వానిలోఁ బ్రధానము లనియు నుత్తమోత్తమములనియుఁ బండితు లొకరీతిగాఁ బేర్కొనునవి మనుచరిత్రము, వసుచరిత్రము, ఆముక్తమాల్యద, పారిజాతాపహరణము, శృంగార నైషధము అను నీ యేను కావ్యములు. ఇవియే తెనుఁగున పంచ మహాకావ్యము లనఁబడును. కొందఱు శృంగార నైషధమునకు మాఱుగాఁ గాశీఖండమును, కొందఱు పాండురంగ మాహాత్మ్యమును, మఱికొందరు రాఘవ పాండవీయమును నెన్నుదురు. కాని మొదటి నాలుఁగు కావ్యములను గూర్చి పండితులలో భేదాభిప్రాయము లేదు – (పారిజాతాపహరణ పీఠిక – శ్రీ నాగపూడి కుప్పుస్వామయ్య. పే. 5)

6. "ఇచట (కథారంభమునందు) ఉత్తర కథావిస్తృతికి బీజములగు ప్రవరుని సౌందర్య సంశ్రిత ప్రతిత్వములు గవి నిపుణముగా నుంచినాఁడు. వాని చక్కదనమునందు వరూథినీయత్న వైయర్థమునకు మొదటి హేతువగు ప్రవర్ధ వైరాగ్యమును రూపించినాఁడు.

– తం. తేవప్పెరు మాళ్ళయ్య

7. మనుచరిత్రమున శృంగారమే అంగిరసమనియు నొక యభిప్రాయ మున్నది.

8. ప్రబంధములలో ప్రధానరసము శృంగారమైయుండుట సహజము. ఈ సందర్భమున "పెద్దన ప్రబంధ కవుల కాద్యుఁడును, మార్గదర్శకుఁడును. కాల ప్రభావమును బట్టియు నభిరుచి విశేషములను బట్టియు నా యుగమునందలి పలువురు కవులు శృంగారమునే ప్రధానరసముగా గ్రహించిరి. పెద్దనయు మనుచరిత్రమున దానినే యాభాస వియోగ సంభోగ రూపముల వైవిధ్యముతోఁ బోషించెను. ఆరంభమున దానికి శాంతముతో సంఘర్షణము కలిగించియు నంతమున మనుతపోఘట్టమున నచ్చమైన శాంతమును వర్ణించియు నాతఁడు కావ్యమున కపూర్వశోభ కల్గించెను. ఈ సన్నివేశములను సూక్ష్మముగాఁ

బరిశీలించినచో నాతc డా కాలప్రభావము నొకరీతిగా నధిగమింపcజాలెనని తోపకమానదు... ఇట పెద్దన శాంతశృంగారములకు, కర్మభోగనిష్ఠలకు, ధర్మకార్యములకు, ఆత్మేంద్రియానందములకు, సనాతనాధునాతనభావములకు విచిత్రమైన సంఘర్షణమును గూర్చి యొక యపూర్వసన్నివేశమును సృష్టించినాcడు." శ్రీ దివాకర్ల వేంకటావధాని – మనుచరిత్ర సందేశము భారతి మే 60 పే. 60–61

9. ఈ ముక్తకములకే తెలుcగున 'చాటు పద్యము' లని పేరు.

10. 'సంస్కృతభాషలో దృశ్య కావ్యములందుcదక్క శ్రవ్యకావ్యములందు వస్త్వైక్యము తఱచు కన్పట్టదు. శాకుంతల మృచ్ఛకటికాది రూపకములలోని యితివృత్తము ప్రధానపాత్రములగు నాయికానాయకుల వృత్తాంతముతోనే పర్యవసించును. నాటకమునం దితివృత్తమను హారమునకు నాయికానాయకులు కొలికి ముత్తెములుగా నుందురు. శ్రవ్య కావ్యమునందుc గొన్నిట నట్లు గాక యెక్కడకక్కడ నితివృత్తము తెంపుచెందుచున్నది.

దిలీపుని వృత్తాంతముతో నారంభింపcబడిన రఘువంశకావ్యము అగ్నివర్ణుని వృత్తాంతముతో ముగింపcబడుటచే వస్త్వైక్యము లేదు... ఆంధ్రసాహిత్యము నందు మిశ్రోత్పాద్యాన్యతరమగు నితివృత్తముతోc గావింపcబడుచు వచ్చిన పెక్కు శ్రవ్యకావ్యములందు, సంస్కృత నాటక క్రమమునc గొంత వస్త్వైక్యము గానవచ్చుచున్నది. పినవీరభద్రుని శృంగార శాకుంతలము, తిమ్మన పారిజాతాపహరణము మొదలగునవి వస్త్వైక్యముగలవియే.

కాని ఇట్టి వస్త్వైక్యము కలిగి తీరవలయు నను నిబంధన మీ తెలుcగు ప్రబంధములపట్టున నున్నట్లు చూపట్టదు. దీనికి నిదర్శనముగా రఘువంశాది కావ్యములలో వలె మనుచరిత్రము వస్త్వైక్యము లేక యున్నది. ఇందు రసోత్తరముగా రచింపcబడిన వరూథినీప్రవర వృత్తాంతము మూcడవ యాశ్వాసముతో ముగిసిపోవుచున్నది. నాలవయాశ్వాసమున నుపక్రమింపcబడిన స్వరోచివృత్తాంతము ఆఱవయాశ్వాసములో గొంతవఱకేగలదు. ఆవల స్వారోచిషమను వృత్తాంతముతోc బ్రబంధము ముగింపcబడినది. ఇట శ్రీ వేమూరి వారి యభిప్రాయమున వస్త్వైక్య మనcగా ముఖ, ప్రతిముఖ, గర్భాది పంచ సంధులతో నొప్పు కథయందలి ప్రకృష్ట బంధమని యర్థమగుచున్నది, విశ్వనాథుcడు దృశ్య కావ్యములలో వలె శ్రవ్య కావ్యమందును బంచసంధులను బాటింపవలెనని నిర్దేశించుట యిట గమనింపcదగియున్నది.

11. పురము, సముద్రము, శైల, ఋతు, సూర్యోదయ, చంద్రోదయ, సరఃక్రీడా, వనక్రీడా, వసంత, రతిప్రసంగ, విరహ, పరిణయ, పుత్రోదయ, నయవిరచన, (సంధి విగ్రహాదులు) దండయాత్రా యుద్ధదౌత్య ప్రభు వర్ణనములు అష్టాదశ వర్ణనములు.

క. "పుర, సింధు, నగ, ర్త్విన, శశి
సరసీ, వనమధు, రతిప్రసంగ, విరహముల్,
పరిణయ, తనయోదయ, నయ
విరచన, యా, త్రాజి, దౌత్య, విభవర్ణనముల్."

అని కావ్యాలంకార సంగ్రహకర్త. అప్పకవి వీనికి మఱి నాల్గింటిని జేర్చి మహాకావ్యమున నిరువది రెండు వర్ణనము లుండవలె ననినాఁడు. ఇందు కొన్ని లేకున్నను మహాకావ్యత్వమునకు భంగము రాదు.

12. 'ఆదిత్యం, అంబికాం, విష్ణుం, గణనాథం, మహేశ్వరం'

13. నన్నెచోడుడు, కుమారసంభవము–అవతారిక.

14. "ప్రేమ అనేది ఒక పవిత్రమైన హృదయశక్తి. అది హృదయంలో అప్రయత్నంగానూ, ప్రకృతిసిద్ధంగానూ జనించేదే గాని ప్రయత్నపూర్వకంగాగానీ, మరియే ఇతర విధంగా గాని ఉత్పన్నమయ్యేది కాదు. ప్రేమించి ప్రేమింపబడే రెండు పదార్థాలకూ పవిత్రాశయాలు, హృదయ నైర్మల్యమూ, స్వార్థరాహిత్యమూ ఉండాలి, ఉండి తీరుతుంది. ప్రేమకు గమ్యస్థానం ఆనందమే. సంకుచితమైనట్టి, కేవలం విషయవాంఛలనే ప్రధానంగా గలిగిన హృదయాలలో తాత్కాలికంగా ఉత్పన్నమయ్యే అనుభవవాంఛ 'ప్రేమ' అనిపించుకోదు. దానికి పవిత్రతగాని, స్థిరత్వంగాని ఉండటం దుర్లభం. దానిని మోహం అంటారు.

ప్రవరుఁడు పవిత్రుఁడు. నిర్మలుఁడు. మహత్తరాశయం గలవాఁడు. అతని ప్రేమ బాహ్య సౌందర్యాన్ని అపేక్షింపదు. పవిత్రతాది మహత్తర గుణాలన్నవాటి నన్నింటిని అతఁడు ప్రేమించాడు. ఈ గుణాలు గల తల్లిదండ్రులను, అనుకూలవతియైన భార్యను, 'తోడునీడలై క్రీడించు' సచ్ఛాత్రులను, అతిథులను, అగ్నులను, నిత్య కర్మలను ప్రవరుఁడు ప్రేమించాడు. వీటితో హిమవన్నగానికి వెళ్లినప్పుడు ఎడబాటు కలగటం వల్ల చెప్పరాని బాధలను అనుభవించాడు.

వరూథినిది మోహం. దానికి పునాది బాహ్య సౌందర్యం. ఆమె ప్రేమించినది ప్రవరుని ఆకారాన్ని. అతని 'మేనికాంతిని' అనుభవించుటయే ఆమె ఆశయం. ఆమె ప్రతి ఆశయంలోనూ విషయవాంఛ తొణికిసలాడుతుంది. వేషంలోను,

మాటల్లోను, చేష్టలోను వరూథిని మోహానికి అనుగుణమైనవాఁడు కపట విప్రుఁడు గంధర్వుఁడు. అతఁడు మోహపుముద్ద. ప్రేమగల వ్యక్తి, మోహం గల వ్యక్తి ఒకరితో ఒకరు కలవటం దుర్లభం. ప్రయత్నపూర్వకంగా కలపబూని ఉన్నట్లయితే కావ్యోద్దేశమే చెడి ఉండేది. మహాకవి పెద్దన ప్రేమకు, మోహానికి ఉన్న అఖండ భేదాన్ని లోకానికి వెల్లడించాడు. ప్రేమకు, మోహానికి స్పర్ధను కల్పించి ప్రేమ యొక్క ఔత్కృష్ట్యాన్ని స్థిరపరిచాడు. ప్రేమస్వరూపుడగు ప్రవరుణ్ణి అతనికి ప్రియతమములైన వస్తువులకడకు చేర్చాఁడు. మోహపూరితులైన వరూథినీ గంధర్వులను ఏకం చేశాడు" – ఇవి శ్రీ మొదలి వేంకటరామయ్యగారి 'ప్రవరుని ప్రేమ' అన్న వ్యాసం (భారతి – తారణ పుష్యము) లోని అభిప్రాయములు.

15. వరూథిని తన్నంటినందులకు ఆమె శరీరమందలి జవ్వాజివాసనలు శరీరమున కన్పట్టుటచే కడిగికొని వార్చి ప్రాయశ్చిత్తమొనర్చుకొని ప్రవరుఁడింటికి దిరిగివచ్చినాఁడు. ఆ విషయమును దెల్పిన పిమ్మట పెద్దన, విరహవేదనకు లోనైన వరూథినిపై పాఠకుల మనమును నిల్పుటకై 'తరుణి నన్యకాంత నతిదారుణ పుష్ప శిలీముఖవ్యథాభర వివశాంగి నంగభవుబారికి నగ్గము సేసి క్రూరుఁడై యరిగె మహీసురాధముఁ డహంకృతితో (యౌవనవతిని, ఇతరులకు భార్యకానిదానిని, అతిదారుణములైన మన్మథ బాణములచే వివశమైన శరీరము గలదానిని మన్మథున కొప్పజెప్పి యహంకారముతో నా క్రూరుఁడైన" (బ్రాహ్మణాధముఁడు) వెళ్ళినాఁడని సూర్యుఁడు కోపమున నెఱ్ఱవారినట్లు వర్ణించినాఁడు.

ఈ వాక్యము లాధారముగ గ్రహించి కొందఱు పెద్దనకు ప్రవరునికంటె వరూథినిపై గౌరవాదరాభిమానము లెక్కువయని యూహించినారు. ఒకరు ఇంటికి దిరిగివచ్చిన పిమ్మట ప్రవరుఁడు వరూథినిని గూర్చి మధురోహలు జనింప తలపోసినట్లు భావించినారు. కలికల్మషహరములైన కథలు జెప్పగడగిన పెద్దనకు, 'ధర్మబోధకులకు తాతయ్య' యనిపించుకొన్న పెద్దనకు, వరూథినిపై జాలి యుండవచ్చును గాని, ప్రవరుని కంటె గౌరవముండునా? 'మహీసురాధమ' శబ్ద ప్రయోగము కథాసందర్భమును బట్టి ఔచిత్యమును పోషించుటకుఁగాని ప్రవరుని నిందించుటకు కాదు. ఇంటికి వచ్చిన పిమ్మట ప్రవరుఁడు వరూథినిని గూర్చి మధురభావములు పోయి వెఱ్ఱినై పొందకపోతినే యని భావించి నట్లూహించుట మహాఘోరము!

# ప్రభావతీప్రద్యుమ్నము

## కవి కాలాదికము

ప్రభావతి వజ్రనాభుఁడనెడి రాక్షసుని కుమార్తె. ప్రద్యుమ్నుఁడు శ్రీకృష్ణుని పుత్రుఁడు. వీరిరువురి ప్రణయకథను ఆధారముగా గ్రహించి మహాకవి పింగళి సూరన శృంగారరస ప్రధానముగను, దృశ్యప్రబంధ లక్షణోపేతముగను రచించిన ప్రబంధరాజము ప్రభావతీప్రద్యుమ్నము.

ఆంధ్రసాహిత్య లోకమునఁ గల ఉత్తమ ప్రబంధములలో నిది యొకటి. ఇందలి సంభాషణ వైచిత్ర్యము తిక్కన భారతరచనను తలపించుచుండును. ఈ కావ్య రచనయందు సర్వతోముఖ చాతుర్యము గోచరించును. ఇందలి కథాకథన నైపుణ్యము కళాపూర్ణోదయము నందలి ప్రావీణ్యముతో తులతూగకున్నను, సామాన్య ప్రబంధముల కంటె నెంతయు మిన్నయైయున్నది. మృదుపదగుంభితమై కవిత ద్రాక్షాపాకముగ నొప్పారును. 'ప్రభావతీప్రద్యుమ్నము, చక్కని స్వభావోక్తులను కలిగి లలితపద ఘటితమై కథాచమత్కృతి గలిగి చదువువారికి కర్ణరసాయనముగా నుండెడి ప్రౌఢకావ్యము' (కవిచరిత్రకారుడు).

## పింగళి సూరన

'తిక్కన సోమయాజి తఱువాత నింత ప్రౌఢముగాఁ గవిత్వము జెప్పిన కవి మఱియొకఁడు లేఁ' డని విఖ్యాతిగన్న ఈ పింగళి సూరన మహాకవి, క్రీ.శ. 16 శతాబ్ది మధ్యకాలమున జీవించి తన కవితావ్యవసాయమును సాగించెను. ఈతఁడు తన రాఘవ పాండవీయమును ఆకువీటి పెదవెంకటార్యుని ప్రేరణమున క్రీ.శ. 1550 ప్రాంతముననను, కళాపూర్ణోదయమును క్రీ.శ. 1560 ప్రాంతమున నంద్యాల కృష్ణరాజునకు నంకితముగను రచియించెను. ఈ ప్రభావతీప్రద్యుమ్నమును తన పండబారిన వయసులో క్రీ.శ. 1580 ప్రాంతమున రచియించి, తండ్రియగు అమరనార్యున కంకిత మొసఁగెను.

పింగళి సూరన గౌతమగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడునైన బ్రాహ్మణుడు. ఈతని వంశమువారు నేఁటి గుంటూరు జిల్లా యందలి పల్నాడు తాలూకాలోని పిన్నలి

గ్రామవాస్తవ్యులు. ఈ వంశస్థులలో ఒక శాఖవారు ఒంగోలు తాలూకాలోని నిడమానూరు గ్రామమును చేరిరి. సూరనార్యుని తండ్రియగు అమరన్న యా గ్రామమున శ్రీకృష్ణరాయలిచ్చిన భూదానముల ననుభవించెను. ఈ వంశమున పండితులు, కవులు, రాజకీయవ్యవహర్తలు, బ్రహ్మవిద్యావేత్తలు ఎందరో జన్మించినట్లు ప్రభావతీ ప్రద్యుమ్నమునందలి పీఠిక వలన తెలియుచున్నది.

సూరనార్యుని తండ్రి అమరనార్యుఁడు – తల్లి అంబమ్మ, సూరన తల్లిదండ్రులకు ప్రథమపుత్రుఁడు. కావున వారీతని యెడ గాఢాభిమానము వహించి విద్యాబుద్ధులు నేర్పుటలో కడు శ్రద్ధ బూనిరి. సూరన అనన్యసామాన్య విద్వాంసుఁడుగా పరిణమించెను.

నాటకాలంకార సాహిత్య పాండిత్యమే గాక తర్క, మీమాంస సాంఖ్యయోగాది శాస్త్రపాండిత్యమును నీ మహాకవి సంపాదించెనని యీతని కృతులవలన వెల్లడియగుచున్నది. 'పూతక్రితయా', 'సౌవర' మొదలైన వ్యాకరణైక సమధిగమ్యశబ్దముల నీ కవీంద్రుఁడు ప్రయోగించి తన వ్యాకరణశాస్త్ర పాండితిని వెల్లడించినాఁడు. అన్నిటిని మించిన దీతని లోకజ్ఞత. బాహ్య, మానవ ప్రకృతుల రెంటితో నితనికి పరిపూర్ణ పరిచయమున్నది.

## సూరన కృతులు

రాఘవపాండవీయము, కళాపూర్ణోదయము, ప్రభావతీప్రద్యుమ్నము అను మూడు కృతులు నేఁడు సూరనార్యుని రచనలై కన్పట్టుచున్నవి. ఇవికాక సూరన గరుడ పురాణము, నితరకృతులను చెప్పినట్లు ప్రభావతీప్రద్యుమ్న, రాఘవ పాండవీయ పీఠికలను బట్టి తెలియుచున్నది. గరుడ పురాణము ఈతని తొలినాటి కృతులలో నొకటైయుండును.

పిమ్మట కీర్తి వహించిన కృతి రాఘవపాండవీయము. ఇది ఆంధ్రభాషయందలి తొలి ద్వ్యర్థికావ్యము. దీనిని సూరన ఆకువీటి పెద వెంకటాద్రి ప్రేరణమున రచియించెను. ఇది సూరనార్యుని భాషాపాండిత్యమునకు నికషోపలమైన (ఒరపిడిరాయి) గ్రంథము. సంస్కృత భాషలో క్రీ.శ. 8, 9 శతాబ్దములలో నిదే వస్తువుతో రెండు ద్వ్యర్థికావ్యములు పుట్టినవి. వీని కర్తలైన కవిరాజధనంజయులను పింగళి సూరన ఎఱుగునో ఎఱుగఁడో! భీమన పూర్వము రాఘవపాండవీయమును చెప్పెననెడి మాటయే గాని సూరనయే ప్రథమాంధ్ర ద్వ్యర్థికావ్యకర్త.[1]

రాఘవపాండవీయమునకు పిమ్మట కీర్తిగన్న సూరన కావ్యము, 'కల్పనాచాతుర్యము నందును, కథాకథనచమత్కారము నందును నద్వితీయమైన కావ్యము' కళాపూర్ణోదయము. ఇందలి అపూర్వకథ, పాత్రపోషణమును, శైలీప్రావీణ్యమును మనోజ్ఞములు. మూఁడవ ప్రసిద్ధకృతి ప్రభావతీప్రద్యుమ్నము. దారిద్ర్యముచే కుందింపఁబడు కాలమున నీతఁడు శైవవైష్ణవ ప్రభువుల చిత్తవృత్తుల కనుగుణములైన కావ్యములను రచియించి, వానితో తృప్తినొందక, వార్ధక్యమున స్వతంత్రుడై తన పిత్రాది వంశవర్ణనముతో నీ ప్రభావతీప్రద్యుమ్న కావ్యమును రచియించెను. ఈ కావ్యమునందును కళాపూర్ణోదయములో వలె 'ప్రబంధ కవులెవ్వరియందును గనఁబడని ప్రతిభయు, సందర్భశుద్ధియు, పాత్రోచితరచనయు కన్పట్టును.' కాలప్రభావముచే ప్రబంధములందు సామాన్యముగ కన్పట్టు రచనారీతిని గూడ సూరనార్యుఁడు ఆదరించుట ఈ కావ్యమునందును కన్పట్టును. మహాకవి పింగళి సూరన "రాఘవ పాండవీయ, కళాపూర్ణోదయ, ప్రభావతీప్రద్యుమ్నములు మూఁడు నొక్కొక్కరీతి కొక్కొక్కటి సుప్రసిద్ధములై వెలసిన రత్నములు" – (కవిత్వవేది)

కళాపూర్ణోదయమును రచించువేళనే పింగళి సూర్యనార్యునకుఁ బ్రభావతీ ప్రద్యుమ్నమును రచియింపవలె ననెడి కోర్కె యున్నట్లు విమర్శకాభిప్రాయము. (డా. చిలుకూరి నారాయణరావు – 125 భారతి వృష, శ్రావణము) కళాపూర్ణోదయ కావ్యకృతిపతియైన నంద్యాల కృష్ణ భూపతిని –

మ. "ఒక ప్రద్యుమ్నుని గాంచె తొల్లి యదువంశోద్భూతి పెంపొందుచున్,
సకలక్ష్మాసురులం గరంబపుడు శ్రీనంద్యాల కృష్ణక్షితీం
ద్రక రాజాన్వయసంభవంబు కతనన్ ప్రద్యుమ్నులం జేయుచున్,
బ్రకటంబయ్యెడు దానవారి యవతారం బంది ధాత్రీస్థలిన్."

– అని వర్ణించుట యిట్టి యూహకు మూలాధారము.

## ప్రభావతీప్రద్యుమ్నము – చరిత్ర

ప్రభావతీప్రద్యుమ్నము మూలమున సూరనార్యుఁడు తన కాలమునాఁటి రాజకీయ పరిస్థితులను గూడ వెల్లడించినాఁడని మఱియొక యూహ. కళాపూర్ణోదయమునకు కృతిపతి నందాల్య కృష్ణరాజు, ఇతఁడు సామంతుఁడు. ఇతని చక్రవర్తి సదాశివరాయలు. ఈ కాలమున సకలము తిమ్మయ యనెడి నిరంకుశుని దుశ్చేష్టలకు

రాజ్యము పాలుకాఁగా, అళియ రామరాయలు, తిరుమల రాయలు దానిని నుద్ధరించిరి. ప్రభావతీప్రద్యుమ్నము నందలి వజ్రనాభుఁడు సకలము తిమ్మయ యనియును, సదాశివరాయ లింద్రుఁ డనియును, అళియ రామరాయ, తిరుమలరాయ, వెంకటాద్రులు ప్రద్యుమ్న గదసాంబులుగ గన్పట్టుచున్నారనియును, జాకరూకతతో పరిశ్రమ యొనర్చి వెదకినచో మిగిలిన పాత్రలకును చారిత్రకవ్యక్తులు లభింతురనియును, నిట్టి చారిత్రక సంబంధమును జూపెట్టువారి యభిప్రాయము (చిలుకూరి నారాయణరావు – భారతి. వృష శ్రావణము – ప్రభావతీప్రద్యుమ్నము).

## ప్రభావతీప్రద్యుమ్నము – నామకరణము

వజ్రనాభవధకు సంబంధించిన రాజకీయవ్యవహారము, ప్రభావతీప్రద్యుమ్నుల ప్రణయవృత్తాంతముననను రెండు కథావస్తువు లీ కావ్యమున నున్నవి. ప్రబంధములు సర్వసామాన్యముగ శృంగారరస ప్రధానములై యుండుటవలనను, వజ్రనాభవధ యనెడి రాజకీయకృత్యము ప్రభావతీప్రద్యుమ్నుల ప్రణయసహాయమును పొందబడుటచేతను, కథాంతమున రాక్షసవంశ ప్రతినిధియైన ప్రభావతికిని, దేవతావంశ ప్రతినిధియైన ప్రద్యుమ్ననకును సఖ్యము చేకూరుట వలనను, సూరనార్యుఁడు తన కావ్యమునకు ప్రభావతీప్రద్యుమ్నమని నామకరణ మొనర్చినాఁడు.

ఈ కథావస్తువునే స్వీకరించి క్రీ.శ. 12వ శతాబ్దము నందు దృశ్యకావ్యముగ నొనర్చిన మలయాళ దేశరాజగు రవివర్మ, ఈ కథకు ప్రద్యుమ్నాభ్యుదయము అని నామకరణ మొనర్చినాఁడు. ఆధునిక విమర్శకు లొకరు (డా. చిలుకూరి) దీనికి శుచిముఖీవిజయమని పేరిడినచో సమంజసముగ నుండెడిదని సూచించినారు. సూరన శుచిముఖికి మిగిలిన పాత్రల కంటె విశేషప్రాముఖ్యమును కల్పించి, యా పాత్రముఖమున రాజకీయ ప్రణయకథల రెంటిని నడిపించుటచే, నా విమర్శకులిట్లు సూచించిరని భావింపవలసియున్నది. వజ్రనాభప్రళయమును తప్పించుకొనుటకై యత్నమారంభించిన ఇంద్రుఁడు కథాంతమున నాతని వధను పొందినవాడగుటచే దీనికి ఇంద్రవిజయమని నామకరణము చేయవచ్చునని కొందఱు భావించిరి. కాని శృంగారరసప్రధానమైన ప్రణయకథకే ఇందు విశేషప్రాముఖ్యమిచ్చి సూరన నడిపించుటచే, దీనికి ప్రభావతీప్రద్యుమ్నమను నామముగూడ సముచితముగనే యున్నదని మనము సరిపెట్టుకొనవచ్చును.

## ప్రభావతీప్రద్యుమ్నము – కావ్య గుణదోషములు

అపూర్వ ప్రతిభాన్వితుఁడును, కావ్యశిల్పదక్షుఁడునునై ఆంధ్రసాహిత్య ప్రపంచమున నొక దృష్టితో పరిశీలింపగా, తిక్కనార్యునకు పిమ్మట ద్వితీయస్థాన మాక్రమించిన కవిశ్రేష్ఠుఁడు పింగళి సూరన. ఈతని కృతులలో కళాపూర్ణోదయమనెడి కావ్యము సర్వశ్రేష్ఠగ్రంథమై, కథాకథనవైచిత్రికి దానితో తుల్యమైన కావ్యము మఱియొకటి లేదని ఖ్యాతిగన్నది.

ఇందు విమర్శకులు గుణదోష విచారమొనర్చి ఎన్ని దోషములున్నను నవి యల్పములనియును, గుణములే యధికములనియును నిర్ణయించిరి.

సూరనార్యుఁడు తన పండబారిన వయసున నిర్మించిన ఈ ప్రభావతీప్రద్యుమ్న కావ్యమందలి గుణదోషముల విషయమున పండితులు భిన్నాభిప్రాయులైయున్నారు. కొందఱు అల్పదోషముల నావల నుంచిన నిదియును సర్వోత్కృష్టమైన ప్రబంధమనియును, గుణవిశేషములలో నిది దేనికిని తీసిపోనిదనియును భావింతురు. అనేక ప్రబంధములనుండి గ్రహించిన కథావస్తువర్ణనాదులతో నిదియొక జల్లికూర్పనియును, నిందు సూరనార్యుని ప్రతిభ ప్రతిఫలించుట లేదనియు మఱికొందరి అభిప్రాయము. (డా. కట్టమంచి, డా. చిలుకూరి ప్రభృతులు)[2] ప్రభావతీ ప్రద్యుమ్నము నందును సూరనార్యుని కథాకథనదక్షత, పాత్రోన్మీలనప్రజ్ఞ, మానసికస్థితి నిరూపణము, నాటకోచితరీతి, అవసరోచిత వర్ణనలు మొదలగు గుణవిశేషములు, కన్పట్టుచున్నవి. ప్రబంధసామాన్యములైన నఖశిఖపర్యంత స్త్రీవర్ణనలు, చంద్రాది దూషణములు మొదలగు యాధునికులు పరిగణించు కొన్ని దోషములును కన్పట్టుచున్నవి.

### కథాకథనము

కథ చెప్పుటలోని శిల్పమునకు పింగళి సూరనతో సాటియైన కవిశేఖరుఁడు ఆంధ్ర సాహిత్యమున లేఁడని చెప్పవచ్చును. కథ చెప్పుటకు రెండు పద్ధతులున్నవి. కథయందు జరిగిన యంశములను బట్టి కాలక్రమానుసారముగా కథను చెప్పుట యొక పద్ధతి. దీనిని కాలక్రమ పద్ధతి యందురు. కాలక్రమమును వదలి సరసముగ నొక సందర్భమును గైకొని కథ నారంభించి, తఱువాత ముందు వెనుకగా కథను పెంచి పూర్తియొనర్చుట రెండవ పద్ధతి. దీనిని కార్యకారణ క్రమపద్ధతి యందురు. రసప్రధానములైన కావ్యములందు కార్యకారణక్రమముగ కథ చెప్పుటయే సముచితము.

ఆంధ్రభాషలో నీ మార్గము ననుసరించినవాఁడు సూరన తప్ప మఱెవ్వఁడును లేఁడు. కళాపూర్ణోదయమునం దీ మహాకవి ఇట్టిమార్గము ననుసరించుట వలననే నా కావ్యమునకంతటి విలక్షణత, విఖ్యాతి కలిగినవి.

ప్రభావతీప్రద్యుమ్నము నందును సూరనార్యుఁడు కథ చెప్పుటలో తాను కళాపూర్ణోదయమున ననుసరించిన కార్యకారణ క్రమపద్ధతినే యనుసరించినాఁడు. ఇందు వజ్రనాభరాక్షసబాధల వలన వేసారిన ఇంద్రుఁడు, వాని వధ కుపాయమును గూర్చి కృష్ణునితో నాలోచించుటకు ద్వారకకు వచ్చుటతో కథను సూరన ప్రారంభించినాఁడు. ప్రబంధములలో నిందు కనుపించునంతటి సుదీర్ఘమైన కథయే యుండదు.

ప్రబంధకవి ప్రభావతీప్రద్యుమ్నమునందలి కథను జెప్పవలసినచో, కాలక్రమ పద్ధతి ననుసరించి ముందుగనే వజ్రపుర వర్ణనముతోనో యారంభమొనర్చి, తదుపరి వజ్రనాభుని ఘోరతపమును, బ్రహ్మ ప్రత్యక్షమగుటను, వాని స్వర్గజైత్రయాత్రను, ఇంద్రుని నిర్వేదమును, ప్రభావతీజననమును, స్వప్నవృత్తాంతమును, ఇంద్రుఁడు ద్వారకకు వచ్చుటను కాలక్రమమున వర్ణించియుండెడివాఁడు. ఇట్టిపద్ధతి చరిత్ర కనువైనదిగాని రసవత్కావ్యరచనమున కనువైనది కాదని గ్రహించి, స్వతంత్ర మార్గమును ద్రొక్కుటకు జంకని సూరనార్యుఁ డీ మార్గముననుసరించి, తన కళాపూర్ణోదయ ప్రభావతీప్రద్యుమ్నముల రెంటను కథఁ జెప్పినాఁడు.

## పాత్రోన్మీలన సామర్థ్యము

మహాకవుల శక్తిసామర్థ్యములను వెల్లడించు కవితాగుణములలో పాత్రోన్మీలన సామర్థ్యము ప్రముఖమైనది. స్వీకరించిన కథలోని వివిధపాత్రల భావనాబలముచే నూహించి, వానికి రూపమునిచ్చి సజీవమూర్తులనుగా చిత్రించుటకు అసామాన్యశక్తి కావలయును. ఈ శక్తి ఏ మహాకవియందధికాంశమున గోచరించునో, యాతఁడు నిర్మించిన పాత్రలకు నిత్యత్వము కలిగి యా మహాకవికీర్తిని చిరస్థాయిగ నొనర్చును. ఆంధ్ర సాహిత్యమున నిట్టి పాత్రచిత్రణ సామర్థ్యము గల కవులెందరో లేరు. తిక్కన భారతమునందలి పాత్రలు వ్యాసునివే యైనను, యా కవిబ్రహ్మ వానిని పునఃసృష్టించినాఁడు. కావున తిక్కన భారతమునందలి పాత్రలు సజీవమూర్తులు. పెద్దన ఇదేరీతిగ తన మనుచరిత్రమునందు వరూథినీప్రవరాఖ్య పాత్రలను పునఃసృష్టించి కవితాపితామహుఁ డనిపించుకొనినాఁడు. పిమ్మట చెప్పదగినవాఁడు సత్యభామ పాత్రను తన పారిజాతాపహరణ కావ్యమున పునఃసృష్టించిన తిమ్మన.

పింగళి సూరన మహాకవికిని నిట్టి పాత్రోన్మీలన సామర్థ్య మనంతముగ నున్నది. కళాపూర్ణోదయమున ఈ మహాకవి యద్వితీయమగు కలభాషిణీపాత్రమును చిత్రించి విమర్శకుల జోహారులందుకొనినాఁడు. ప్రభావతీప్రద్యుమ్నమునందును నీ ప్రతిభ విశేషముగ గోచరించుచున్నది. ఇందు పింగళి సూరన సృష్టించిన పాత్రలలో నన్నిటికంటె నవరూపమైనది శుచిముఖి పాత్రము. మూలమందలి శుచిముఖికిని, దీనికిని నెట్టి సంబంధము లేదు.

సూరన తన అనంత ప్రతిభచే మేధ, వచోనిపుణత్వము, నీతి విదురత్వము, రాజకీయ ధౌరంధర్యము, స్వామిభక్తి, వినయవిధేయతలు, కార్యసంధానవిధాన తత్పరత్వము, మొదలగు నుత్తమ గుణములను, సమయోచిత సంభాషణలను, చేష్టలను దీనికి ప్రసాదించి, ఈ పాత్రమును ప్రభావతీప్రద్యుమ్నమునందలి పాత్రలన్నిటికి నాయక మణినిగా పునఃసృష్టించినాఁడు.

దేవతాయజ్ఞప్రియుఁడైన కృష్ణుని, శత్రుభీతిచే వికలచిత్తుఁడును, నిరాశాశోభితుఁడును, శ్రీకృష్ణోత్తేజితుఁడును, కార్యవిధానతత్పరుఁడునునైన ఇంద్రుని, పింగళి సూరనార్యుఁడు పాత్రోచిత ప్రవర్తనలిచ్చి కన్నులగట్టునట్లు పునఃసృష్టించినాఁడు. నవానురాగముచే శృంగారభావ శబలితచిత్తయైన ఈతని ప్రభావతి పాత్రము తన చేష్టాదికముచే తొలుతనే రసికుల దృష్టి నాకర్షించుచున్నది. అప్రధానపాత్ర యగు ప్రభావతి చెలికత్తెను చిత్రించుటయందును సూరనార్యుఁడు ప్రమత్తుఁడై మెలఁగలేదు. వజ్రనాభరాక్షసుని కూడ నిట్టి సామర్థ్యముతోనే ఈ మహాకవి చిత్రించి చూపినాఁడు. ఇంత యెందులకు? విష్కంభములందలి పాత్రలవలె తోచు భద్రనట బ్రహ్మచారుల పాత్రలును విశిష్టములై మన కన్నులకు గట్టుచు, మరపురాని చైతన్యముతో నొప్పుచున్నవి గదా! సూరనార్యుని పాత్రను లెల్ల సజీవ చిత్రములు.

## మానసికస్థితి నిరూపణము

సూరనార్యుని కథాకథన కౌశలమునందు కథానుసంధానముతో బాటు మానసిక నిరూపణము, పాత్రోన్మీలనము, సంభాషణవిరచనము లక్షణములై కన్పట్టుచున్నవి. కథలోని వివిధ సన్నివేశములను పూర్వోత్తర విరోధము లేకుండగ ననుసంధించుకొని, యందలి పాత్రలకు ఉచిత రూపములను కల్పించి, పిమ్మట సూరనార్యుఁడు ఆ యా పాత్రలు ఆయా సన్నివేశములందు ఎట్టి మానసికస్థితి వహించునో, కథాగమనము ననుసరించి యా మానసిక స్థితులెట్లు పరిణమించునో ప్రదర్శించి చూపుటయందు ప్రముఖ పండితుఁడు.

ప్రభావతీప్రద్యుమ్న కావ్యమునందలి పాత్రల మానసికస్థితి నిరూపణమిందుకు ఉచితమగు తార్కాణమై యొప్పుచున్నది. వజ్రనాభరాక్షసుఁడు దండెత్తివచ్చినపుడును పిమ్మటయును, నింద్రుని మనోవృత్తినంతటిని యుద్ధమున ప్రతిబింబింపజేసి చూపించినట్లు సూచన ప్రదర్శించినాఁడు.

వజ్రనాభుఁడు నందనవనమున సైన్యముల విడియింపగా నతని మనసెట్లు బాధపడినదియును, రాక్షసులు తమకు తగిన మర్యాదలు చేయలేదని నిందించినపుడు ఇంద్రపదవిని గూర్చి యాతనికెట్టి యూహలు గలిగినదియును, వాఁడు సింహాసనమాక్ర మించినపు డాతని కేమి తోచినదియును, ద్వారకలో కృష్ణునకు సర్వమును నివేదించిన పిమ్మట నాతని మానసమున నిరాశాభావమెట్లు క్రమ్మినదియును, కృష్ణుఁడిచ్చిన యుత్సాహముతో నతని మన మెట్లుత్తేజితమైనదియును క్రమముగ నూహించి, సూరనార్యుఁ డనంతప్రతిభతో నుచితజ్ఞుఁడై నిరూపించి తన కావ్యకళాశిల్పనైపుణ్యముచే మనల దిగ్భ్రాంతులఁ గావించినాఁడు.

ఇదేరీతిగ, ప్రభావతి ప్రియుని చిత్రపటమును చూచినది మొదలుగ అనురాగబీజము రూఢమగు నంతవఱకును నామె ముగ్ధహృదయమెట్లు పరిణమించినదో దానిని, పాత్రోచితముగ నతికోమల మధురఫణితిని నిరూపించి చూపినాఁడు.

సూరన మహాకవి కథాకథన నైపుణ్యమునకు మూలశక్తులైనవానిలో నీ మానసిక నిరూపణ మొకటి యనుటలో నెట్టి సంశయము లేదు.

## నాటకోచితరీతి

కథకులు రెండు తెఱంగులుగ నొప్పుదురు. ఇందొక తెగవారు తామే పూనుకొని పాత్రల రూపచేష్ట సంభాషణాదులు వర్ణించుచు కథ జెప్పెదరు. రెండవజాతివారు నాటకప్రదర్శనమునందలి సూత్రధారునివలె వర్తించి, కథనంతటిని కొన్ని యంకములుగను, దృశ్యములుగను విభజించి, పాత్రలను ప్రవేశపెట్టి తాము తప్పుకొనుచు, వానిచే నాయా సన్నివేశములందు గుణవస్తు కాలానుగుణముగ స్వేచ్ఛగ సంభాషణాదికమును జేయించుచు, సంధివాక్యము లవసరమైనపుడును దృశ్యములు మారునపుడును నెడనెడ కన్పట్టుచు కథ చెప్పెదరు. ఇందు రెండవజాతివారిని ఉత్తమ కథకులుగా రసికలోక మెన్నుచున్నది. మహాకథకుఁడయిన సూరనార్యుఁ డీ

రెండవజాతికి జెందిన కథకుఁడు. ఈ విషయమున ఈతఁడు సర్వవిధముల కవిబ్రహ్మ తిక్కనకు గురూత్తముని గుణములనెల్ల గ్రహించిన శిష్యోత్తముఁడు.

ప్రభావతీప్రద్యుమ్నము నందలి ప్రథమాశ్వాసము సూరనార్యుని నాటకోచితరీతికి చక్కని నిదర్శనము, ఈ కథాభాగమును సూరన కొన్ని దృశ్యముల క్రిందికి విభజించినాఁడు. – ఇంద్రుఁడు ద్వారకకు వచ్చుట, ఇంద్ర శ్రీకృష్ణుల సంభాషణము, ఇంద్ర శుచిముఖీసంభాషణము అనునవి ఇందలి దృశ్యములు. భద్రనటబ్రహ్మచారుల వృత్తాంతము ఒక విష్కంభకము వలె నొప్పుచున్నది. నాటకోచితరీతిని ఇందలి పాత్రలు ఎదుటకు వచ్చి నటించినట్లు కన్పట్టును. కవి ప్రతి దృశ్యము పిమ్మటను నూతన దృశ్యమునందలి పాత్రలను ప్రవేశపెట్టి తప్పుకొనుట కన్పట్టును. కొలదిమార్పులు గావించినచో నీ ప్రథమాశ్వాసమెల్ల చక్కని నాటకభాగమై యొప్పును. ఇట్లే మిగిలిన కథయును నడచినది.

## సంభాషణనైపుణ్యము

ప్రభావతీప్రద్యుమ్నమునందలి గుణవిశేషములతో సంభాషణనైపుణ్యమొకటి. ఇదియును పాత్రోన్మీలనముతో బాటుగ నాటకరీతిలోని యంతర్భాగము. సంభాషణలు నడుపుటలో సూరన తిక్కనకు దీటయినవాఁడు. పాత్రల అధికార ప్రాభవాది విభేదముల ననుసరించి ఔచిత్య మెఱిఁగి సంభాషణలు నడిపినాఁడు. ఇందలి ప్రధాన గుణములలో సంభాషణ మొకటియగుట చేతనే విమర్శకులు, ఈ ప్రభావతీప్రద్యుమ్నమున విశేషభాగము సంభాషణవైచిత్ర్యమే యనిరి. (తల్లాప్రగడ సూర్యనారాయణరావు, ప్రభావతీప్రద్యుమ్న పీఠిక–వావిళ్ళ ప్రతి).

రాక్షసబాధల వలన నిరాశాయుతుఁడయిన ఇంద్రుని దైన్యము అతని ప్రతిపదమున గోచరించునట్లును, స్వర్గమునకు నా రాక్షసదండయాత్రవలన కలిగిన కష్టనష్టముల కాతఁడెంతగా చింతించినదియును, నాతని రసికతయును ఇంద్రుని సంభాషణములందు ప్రతిఫలించినది.

శ్రీకృష్ణుని సంభాషణములందు అతని యజ్ఞప్రియత్వ దేవతాభిమానములు ప్రతిఫలించినవి. శుచిముఖి సంభాషణములు ఆ మహనీయపాత్రకుఁగల ధీశక్తిని, ఇతరగుణవిశేషములను ప్రదర్శించినది. సఖీప్రభావతుల సంభాషణములు సహజ కోమలములై యొప్పినవి.

నాటకోచితరీతిలో సంభాషణల నడిపించి, తన కావ్యమునకు ఈ దృశ్య ప్రబంధ లక్షణము నొక గుణ విశేషముగ సూరనార్యుఁడు కల్పించినాఁడు.

**సమయోచిత వర్ణనలు**

ప్రబంధములు వర్ణనప్రధానములు. వానియందు అష్టాదశ వర్ణనము లుండవలయునని నియమము. ఈ నియమమును అందముగ అనుకరించి ప్రతిభలేని ప్రబంధకవులు అనుకరణమయములైన కావ్యముల సృజించిరి. అద్వితీయ ప్రతిభాన్వితుఁడైన సూరన వర్ణనలను సహితము అవసరోచితముగ ప్రవేశపెట్టి యా వర్ణనములను కావ్యమునకు గుణములై యొప్పునట్లు రచించినాఁడు. ప్రభావతీప్రద్యుమ్నమున ప్రబంధ లక్షణముల ననుసరించి పుర, ఋతు, స్త్రీ, విరహాది వర్ణనలు కన్పట్టును. ఈ వర్ణనలను తానై వర్ణింపక, పాత్రల ముఖమున చేయించుట సూరన విశిష్టత. ప్రభావతీప్రద్యుమ్న ప్రథమాశ్వాసము నందలి ద్వారకానగర వర్ణనమును మాతలిచే చేయించుట ఇందుకు చక్కని నిదర్శనము. వర్ణ్యవస్తువు దొరికినది గదా యని సందర్భశుద్ధి లేక మైమరచి వర్ణించుట సూరనయందు గోచరింపదు.

ప్రథమాశ్వాసమందలి వజ్రనాభ స్వర్గయాత్రావర్ణనము, వసుదేవుని యజ్ఞవర్ణనము నిందుకు చక్కని నిదర్శనములు. కథకు ప్రయోజనకారులు కాని వర్ణనములిందుండవు. కొందఱు ద్వితీయాశ్వాసమున శుచిముఖి ప్రభావతిని గూర్చి చేసిన నఖశిఖపర్యంత వర్ణనమును విమర్శించిరి. కాని రసిక దృష్టితో పరిశీలించిన ప్రభావతి పట్ల ప్రద్యుమ్నుని హృదయము నాకర్షించుట కట్టి సుదీర్ఘ వర్ణన మవసరమేమో యనిపించును.

**అలంకారాభిరుచి**

సూరన తన కావ్యమును ప్రబంధోచిత ధోరణిని నడిపించినప్పటికిని వసుచరిత్ర, మనుచరిత్ర, నైషధములలో వలె కావ్యమున సర్వాలంకారముల నిముడ్చవలయునను నాతురత గలవాఁడు కాఁడు. ఈతని యలంకారములు సందర్భోచితములై, సహజములై యొప్పుచున్నవి. ఉపమ రూపక 'ఉత్ప్రేక్ష' అతిశయోక్తి సందేహాద్యలంకారములను సమయోచితముగ ప్రయోగించి, వానినిగూడ తన కావ్యమున గుణములుగనే సూరన భాసింపజేసినాఁడు.

అలంకారముల నిబిడత్వము చేత శాస్త్రపాండిత్య ప్రదర్శనమున కీతఁడు పూనుకొనినట్లు కన్పట్టదు. మాతలి ద్వారకను వర్ణించుచు సందేహమును పదేపదిగా

వాడుట సూరన యుచితజ్ఞతకు ఒక నిదర్శనము. 'శ్లేష'ము ఘటించుటలో నద్వితీయ పండితుఁడై రాఘవ పాండవీయకృతిఁ జెప్పిన యీతఁడు, తన రసవత్కావ్యమైన దీనియందు దానిని ఎచటనో తప్ప యుపయోగింపకపోవుట యీతని ఉచితజ్ఞతను వెల్లడించుచున్నది.

**రసోచితభాషాప్రయోగము**

"సూరనయందు ప్రబంధకవులకు గల వర్ణనశక్తితోడ వారికి లేని కథా కల్పనాశక్తియు వివిధములైన సందర్భములను సంధానమునకు దెచ్చు ప్రతిభయు సహవాసములు, మఱియు భానవాశక్తికిఁ దోడు భాషాశక్తియు నీతనికిఁ గలదు." (కట్టమంచి – కళాపూర్ణోదయపీఠిక). ప్రభావతీప్రద్యుమ్నమునకు గుణాధిక్యమును సంపాదించిన విశేషములలో నాతని భాషాప్రయోగ మొకటి. సామాన్యముగ నీతనికి సంభాషణవైచిత్ర్యముపై నభిమానము గావున నీతని వాక్యములు అలఁతియలఁతి తునియలుగ సాగుచు నాటకోచితరీతిని ప్రదర్శించుచుండును.

వర్ణనలం దీతని భాష నిబిడమై సమాసభూయిష్ఠముగ నుండును. వసుదేవ యజ్ఞమును వర్ణించుచు నీతఁడు చెప్పిన సీసపద్య మిందుకు నిదర్శనము. సహజముగ నీతని భాషయందు క్లిష్టత లేదు. పదమైత్రి అర్థసంపదలతో నొప్పును, ముత్తెపుసరులు పోహళించిన రీతిగా నీతని భాషలో శబ్దములు తమంతట తామే దొరయును, భాషయందు సహజమాధుర్యము గోచరించును. శుచిముఖియందు సహజవాణీ రామణీయకమున్నట్లు సూరనార్యుఁడు చెప్పిన వాక్యము, తన భాషకే అన్వయించునట్లు చెప్పినాఁడేమోయని మనమూహింపవచ్చును.

పై గుణములలోనెల్ల ప్రధానమైనది కథానుసంధానవైచిత్రితో గూడిన కథాకథనము. రాజకీయ, ప్రణయవృత్తాంతములతో రెండు ప్రత్యేకస్రవంతులుగా నడచు కథ నొక మహావాహినిగా నీ మహాకవి సంధానమొనర్చుట యిందలి గుణములలో నెల్ల నుత్తమమైనది.

**దోషములు**

విమర్శకులు ప్రభావతీప్రద్యుమ్నమునందు కొన్ని దోషముల నెన్నుచున్నారు. శుచిముఖి చిలుకలనెడి పక్షులను పాత్రలుగా స్వీకరించి, నాటక ప్రయోగమునకు భంగమును కలిగించుట యొక దోషము. ఇది నాటక ప్రయోగ సంబంధి.

శుచిముఖిపాత్రకు అనంతప్రాధాన్యము నిచ్చి ఇంద్రోపేంద్రులవంటి ప్రముఖులను అసమర్థులుగను, అవశులుగను చిత్రించుట రెండవ దోషము. శుచిముఖి యనెడు హంసను కృష్ణ ప్రద్యుమ్నుల పక్షమున నిల్పినట్లే, వజ్రనాభుని పక్షమున చిలుకను నిలిపి ఈ రెంటిచేత నెత్తుకు పై ఎత్తు వేయించిన బాగుండెడిదని యొక విమర్శకుని సూచన (డా. చిలుకూరి). ఇంద్రకృష్ణులకు, శుచిముఖికిని నికటసంబంధము నేటి కథలో లేదు. అట్టిదానిని కల్పించిన బాగుండెడిదని యొక యూహ. నేడు శుచిముఖి పూనుకొనినదంతయును నూసుబోని పనియని తోచుచున్నదట. ఇంద్ర రాజ్యములోని ప్రాణులగు హంసలకు దేవకార్యమునకుఁ బూనుకొనుట కర్తవ్యమగును గదా!

వసుదేవుని యజ్ఞము, అందు భద్రనటనాట్యము, వటుధూర్తత్వములు అనవసరములనియు నొక విమర్శ, కృష్ణునంతటి ధీశాలికి ధూర్తబ్రహ్మచారి వాక్యముల నుపశ్రుతిగ గల్పించుట యొక లోపముగ కొందఱెన్నెదరు.

ప్రద్యుమ్నుని అశ్వవిహార వర్ణన మప్రస్తుతమనియు, కవికి దానిని వర్ణింపవలె ననెడి కుతూహలము తప్ప దాని ఉనికికి తగిన హేతువు లేదనియు నొక యభిప్రాయము. ప్రద్యుమ్నుఁడు భద్రుని వేషమున పట్టణమునందున్నప్పుడు అతఁడేమి చేయుచున్నాఁడో గుర్తింపనంతటి మూర్ఖుఁడుగాను, అవివేకిగను వజ్రనాభుఁడు చిత్రింపఁబడుట యొకదోషముగ నెన్నఁబడుచున్నది.

ప్రభావతీప్రద్యుమ్నుల మితిమీరిన వర్ణనలు ఈ కావ్యమున పెద్దవై వస్తువునందలి బింకమును చెడగొట్టుటచే, వస్త్వైక్యము చెడుట యొకలోపముగ చెప్పఁబడుచున్నది.

ప్రభావతీప్రద్యుమ్నుల రతిని, ఉపరతిని విపులముగ వర్ణించి నడివీథిన బెట్టుట యొక లోపముగఁ జెప్పబడుచున్నది. ఇట్టి దోషము లెన్నియున్నను, ఇందలి గుణములు వాని ననేకరీతుల నతిశయించి ప్రభావతీప్రద్యుమ్నమునకు ఆంధ్రకావ్య ప్రపంచమున నొక మహనీయ ప్రబంధముగ విఖ్యాతిని గడించిపెట్టినవి.

## ప్రభావతీప్రద్యుమ్నము – మహాప్రబంధము

ప్రబంధ శబ్దమునకు ప్రకృష్టమైన బంధము గలదియని యర్థము. ఈ బంధము వస్తురస రీతులందు ఉండవలెను. తిక్కన మహాకవి భారత కృత్యాదియందు తన రచనలను ప్రబంధమండలిగా బేర్కొనినాఁడు. కాని యట తిక్కన వాడిన

ప్రబంధశబ్దమునకు అర్థము వేరుగ గోచరించుచున్నది. పురాణములందు వస్తు రస విన్యాసాదులలో ప్రబంధత యుండదు. ప్రబంధ జాతి రచనలను పరిశీలింపగా నందు విస్తు విషయమున నైక్యము (Unity of Plot) రసవిషయమున శృంగార వీరములలో నొకటి అంగిరసమై (ప్రధాన రసము) మిగిలినవని అంగరసములగుట, కన్పట్టును. వీనియందు అష్టాదశ వర్ణనలుండుట, అలంకార ప్రియత్వము, ప్రౌఢ చతురోక్తులు కన్పట్టును. ప్రబంధము దృశ్య శ్రవ్య విభేదములతో నొప్పును. నేఁడు మనము ప్రబంధములని వ్యవహరించు శబ్దము సామాన్యముగ శ్రవ్య ప్రబంధముల యెడనే యుపయోగింపఁబడుచున్నది.

పింగళి సూరన ప్రభావతీప్రద్యుమ్న గద్యమునందు "ఇది నిఖిలసూరి లోకాంగీకారకవిత్వ వైభవ పింగళి యమరనార్య తనూభవ సౌజన్యజేయ సూరయ నామధేయ ప్రణీతంబైన ప్రభావతీప్రద్యుమ్నంబను మహాప్రబంధంబునందు" అనుచోట తన కావ్యము మహాప్రబంధమని తెలిపినాఁడు. ఇందు ప్రబంధ లక్షణము లెంతవఱకున్నవో గమనింతము.

**వస్తువు**

ప్రబంధములందు సర్వసామాన్యముగా ప్రఖ్యాత ఉత్పాద్య మిశ్రములనెడి మూఁడురీతుల నున్న వస్తువుల (Story) లో ప్రఖ్యాతమే కన్పట్టును. సూరన కళాపూర్ణోదయమున అపూర్వ కథాసంవిధాన వైచిత్రీమహనీయమగు కథను కల్పించినాఁడు. అది ఉత్పాద్య (కవిచే కల్పింపబడినది) మైన దగుటచే సమకాలమున తగిన ఖ్యాతి రాకపోవుటవలననో యేమో, ప్రభావతీప్రద్యుమ్నమున ప్రఖ్యాతమగు నితివృత్తమును గ్రహించినాఁడు.

ప్రభావతీప్రద్యుమ్నమునకు మూలమైన కథ హరివంశములోనిది. సూరన దానిని స్వీకరించి సందర్భశుద్ధి లేనిపట్టులను సంస్కరించి, యొక కథాసంవిధాన మేర్పఱిచి మూలమునకు కొన్ని మార్పులు చేర్చి, మిశ్రకథగా నొనరించినాఁడు.

ఈ రీతిగా వస్తు విషయమున సూరన మూలములందు లేని ప్రబంధ గుణమును సాధించినాఁడు. కాని ఇందు వసుచరిత్రాదులకంటె ఎన్ని రెట్లుగనో ప్రబంధమున కవసరమైన దానికంటె కథ కన్పట్టును. ఇంతటి దీర్ఘమైన కథను గైకొని నిర్వహించుటకు పూనుకొనుటవలననే, మిగిలిన ప్రబంధములకంటె ప్రభావతీప్రద్యుమ్నము విశిష్ట స్థానమును పొందదగినదైనది.

కాని వసుచరిత్రలోవలె దీనికి వస్త్వైక్యము (Unity of Plot) లేదనుట అంగీకరించక తప్పదు. ఇందలి కథ ఒక మహాఖ్యాయికకు (A great novel) తగినంత విస్తృతిని కలిగియున్నది. మనుచరిత్రయందు వృత్తము ప్రబంధ లక్షణోచితముగ లేదు. శృంగార శాకుంతలము, నైషధములందును కథ ప్రబంధములలో నుండదగిన దానికంటె విస్తృతమై యున్నది.

**నామకరణము**

ప్రబంధములకు, ముఖ్యముగా దృశ్యప్రబంధములకు నామకరణమొనర్చుటకు కొన్ని నియమములున్నవి. సామాన్యముగ వీని నామకరణము నాయకుని బట్టి జరుగుచుండును – మనుచరిత్ర, వసుచరిత్ర, రాజశేఖరచరిత్ర యిత్యాదులు. కొన్నిట నాయికకును ప్రసక్తి గోచరించును – తారాశశాంకము. ప్రభావతీప్రద్యుమ్ననామకరణ మీ రెండవజాతికి చెందినది. ఇందు నాయికానాయకులిరువురి నామములను కూర్చి నామకరణమొనర్చుటయందును పింగళి సూరన ప్రబంధగుణమును సాధించినాఁడు.

**నాయికానాయకులు**

ఇందు నాయిక ప్రభావతి, వజ్రనాభ రాక్షసుని పుత్రిక. సర్వ శుభలక్షణ సంపన్న, రూపవతి, కన్య. నీకు తగిన భర్త ఈతఁడని శివ వ్రాసియిచ్చిన చిత్రపటమునందలి ప్రియునిరూపమును చూచినది మొదలుగ, నాతని యెడల ననురాగము వహించి యాతని పరిణయమాడిన అనుకూలవతి. నాయకుఁడు ప్రబంధములందు ధీరోదాత్తుఁడు, బలము, గాంభీర్యము, కృప మొదలగున వీ నాయకునకు ముఖ్యలక్షణములు.

ఈతఁడు సర్వసామాన్యముగ దేవతామూర్తియో, సద్వంశ క్షత్రియుఁడో యైయుండును. ప్రభావతీప్రద్యుమ్నమున నాయకుఁడైన ప్రద్యుమ్నుఁడు యదువంశమున బుట్టిన రాజపుత్రుఁడు. జగదేకవీరుడైన శ్రీకృష్ణుని కుమారుఁడు. ధీరోదాత్తుఁడు. ఈ రీతిగా నాయికానాయకుల విషయమున ప్రభావతీప్రద్యుమ్నము ప్రబంధలక్షణములతో నొప్పుచున్నది.

**రసము**

దృశ్య ప్రబంధములందు (నాటకములందు) వీర శృంగారములలో నొకటి అంగిరసముగ (ప్రధాన రసమున) నుండవలయుననెడి నియమమున్నది. ఈ

నియమమును కొన్ని దృశ్య ప్రబంధములు పాటింపకపోయినను, ఇది యొక సామాన్య లక్షణముగా గ్రహింపదగియున్నది. ఆంధ్రసాహిత్యమున ప్రబంధములందు శృంగారము ప్రధాన రసముగా గోచరించును. పింగళి సూరనకును శృంగారరసముపై ప్రీతి యధికము. కళాపూర్ణోదయమును గూర్చి తెలుపుచు నాతఁడు దానిని శృంగార రసప్రాయమని వర్ణించినాఁడు.

ప్రభావతీప్రద్యుమ్నమునందును శృంగారమే ప్రధానరసమని చెప్పనగును. ఇందు సూరన శృంగారమును ప్రధాన రసముగ గ్రహించినాఁ డగుటవలననే, నాయికా నాయకుల పరముగా కావ్యమునకు ప్రభావతీప్రద్యుమ్నమని నామకరణమొనర్చినాఁడు.

ప్రభావతి శివ వ్రాసి యిచ్చిన చిత్రపటము నందలి ప్రియుఁడగు ప్రద్యుమ్నుని చూచినపుడు యామెయందు బొడమిన శృంగార భావాదులను వర్ణించి యా రసమును నిక్షేపించినాఁడు. శుచిముఖి చేసిన ప్రభావతీవర్ణనమును విని 'వినుకలి' (వినుటచే నగు ప్రేమవలన కలుగు విరహము) కి చిక్కిన ప్రద్యుమ్నుని యందును రసమును సూరనకవి జాగరూకతతో నిక్షేపించినాఁడు. ఇరువురియనురాగమును పోషించి దాని పరిణామావస్థల ప్రదర్శించి ఈ ప్రభావతీప్రద్యుమ్న కావ్యమున శృంగార రసస్వరూప నిరూపణ మొనర్చినాఁడు.

ఇందు సర్వవిధములైన పూర్వరాగ విరహ రసాభాస సంభోగాది శృంగార విభేదములను చూపినాఁడు. ఇందుమూలమున రసవిషయమునను సూరన ప్రకృష్ట బంధతను (ప్రబంధతను) సాధించినాఁడు. ఇందు వీరాదు లంగరసములుగ నున్నవి.

## పంచ కార్యములు

నాయికానాయకుల యనురాగకథకును, వజ్రనాభవధకును తగిన ఆరంభయత్న ప్రాప్త్యాశ ఫలాగమము లనెడి పంచకార్యముల నడిపి, కథారచనమునందును సూరన ప్రబంధ లక్షణమును సాధించినాఁడు.

## అష్టాదశ వర్ణనలు

ప్రబంధమున కష్టాదశవర్ణనములుండుట ముఖ్యలక్షణము. ఈ వర్ణనములలో నెన్ని యధికముగ నున్న నా కావ్యము ప్రబంధలక్షణమంత యధికముగా సాధించిన దగుచున్నది. ఈ యష్టాదశ వర్ణనములు ఇవి :

క. “పురసింధు నగర్త్విన శశి
సరసీ వన మధు రతిప్రసంగ విరహముల్
పరిణయ తనయోదయ నయ
విరచన యా త్రాజిదౌత్య విభువర్ణనముల్.”

ప్రభావతీప్రద్యుమ్నమున ద్వారకానగర వర్ణనము, యజ్ఞవర్ణనము, అశ్వక్రీడావర్ణనము, హంసల వర్ణనము, స్త్రీవర్ణనము (ప్రభావతీవర్ణనము), విరహ వర్ణనము, చంద్రోపాలంభము, సూర్యోదయ వర్ణనము మొదలగు వర్ణనలెన్నియో యున్నవి. ఇందు ఇన్ని వర్ణనము లుండుటవలననే సూరన మహాప్రబంధమని చెప్పినాఁడాయనిపించును.

కాని ఈ వర్ణనములలో నెవ్వియును సామాన్యముగ ప్రబంధములందలి వర్ణనములవలె సుదీర్ఘములు కావు. ఈ రీతిగా సూరనార్యుఁడు తన కావ్యమున ప్రబంధ లక్షణములను పాటించియున్నాఁడు. కవితలలో వ్యంగ్యప్రధానమైన కవిత ఉత్తమకవిత. సూరన కావ్యమున వ్యంగ్యోక్తులు నెడనెడ కనిపించును. కొన్ని తావులందు శ్లేషలు ధ్వనులును నున్నవి, శృంగార రస ప్రధానమైన ఈ కావ్యమున ప్రధానముగ మాధుర్య ప్రసాదాదిగుణములు కైశిక్యాదివృత్తులు, వైదర్భిరీతి గోచరించును. శృంగారము ప్రధానరసమై అంగరసములలో అద్భుతము ముఖ్యమైనదై యొప్పు నీ ప్రభావతీ ప్రద్యుమ్నము మహాప్రబంధము.

## మూలకథ – మార్పులు

ప్రబంధములందు కథావస్తువు ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రమము అని త్రివిధము. ఇందు ప్రఖ్యాతము పురాణాదులందు ఖ్యాతిగన్న కథావస్తువు. ఉత్పాద్యము కవికల్పితమైన కథావస్తువు. ప్రఖ్యాతమైన కథనే గ్రహియించి సందర్భశుద్ధి ననుసరించి కవి మార్పుల నొనర్చిన కథావస్తువు మిశ్రమము. ఆలంకారికులలో ప్రఖ్యాతుఁడైన విశ్వనాథపంచాననుఁడు ప్రబంధములలోని కథావస్తువు ప్రఖ్యాతమైయుండవలయునని నియమించినాఁడు.

ఆంధ్ర సాహిత్యమునందు జన్మించిన ప్రబంధములలోని కథావస్తువు ప్రఖ్యాతము. ప్రబంధ కవులు భారతరామాయణాది పురాణములనుండియో లేక బృహత్కథాది మహాగ్రంథముల నుండియో కథను గ్రహించి, అష్టాదశవర్ణనములతో శృంగారరసము ప్రధానముగ కావ్యములఁ జెప్పిరి. పింగళి సూరనార్యుఁడు ప్రబంధకవు లెవ్వరిలోఁ

గన్పట్టని విశిష్ట ప్రతిభగలవాఁడు. ఈతఁడు తొలుత రాఘవపాండవీయ మనెడి భాష్య, కావ్యమును జెప్పి పిమ్మట నపూర్వమైన కల్పనాసామర్థ్యమును, కథాకథనదక్షతను ప్రదర్శించుచు, నుత్పాద్యమగు కథావస్తువుతోఁ కళాపూర్ణోదయమును రచియించెను. ఇది ఆంధ్ర సాహిత్య లోకమునందు అద్వితీయ మహాప్రబంధము. ఐనను ఆతని కాలమునాటివారికి ఈ ప్రబంధము కేవల కల్పితమగుటచే నచ్చలేదు. 'కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నములు' అన్న సూక్తి బయలుదేరినది. కావుననే పింగళి సూరన తన ప్రభావతీప్రద్యుమ్నమును మిశ్రకథగా నొనర్చెను. ఇందు సూరన మూలకథను హరివంశమునుండి గ్రహియించి, తన కావ్యరచనాశిల్పమున కనుగుణములైన మార్పులను గావించెను.

పింగళి సూరన ప్రభావతీప్రద్యుమ్న పంచమాశ్వాసము చివర –

తే. "అఘహరణహరివంశ కథాశ్రయంబు
నాత్మ పుత్త్రగుణ స్తవనాంకితంబు
నైన యీ కావ్యమునకు మహాప్రసిద్ధి
నిచ్చుగావుతఁ గరుణ లక్ష్మీశ్వరుండు" (5–221)

అను పద్యముచే తన ప్రభావతీప్రద్యుమ్నకథకు మూలము హరివంశమని చూపించినాఁడు. దీనినిబట్టి మూలగ్రంథమునందలి కథలోని ముఖ్యాంశములను గ్రహించి, సూరన దన యిచ్చ వచ్చినట్లు మార్పులు చేసి సందర్భశుద్ధి, పాత్రౌచిత్యము, సంభాషణనైపుణ్యము మెరయగా సర్వోత్కృష్టమగు కావ్యమును జెప్పినాఁడని మన మూహింపవలసియున్నది.

సమస్త పురాణములందలి కథలవలెనే హరివంశపురాణమునందలి ప్రభావతీ ప్రద్యుమ్న కథయును అసంగతములు, అసందర్భములునగు నంశములతోఁ గూడి అంగాంగీభావము బొత్తుగ లేక జల్లికూర్పు వలె నున్నది. ఈ హరివంశమందలి కథను ఇతివృత్తముగా గ్రహించి క్రీ.శ. 12వ శతాబ్దమందలి రవివర్మ (మలయాళ దేశపాలకుఁడు) ప్రద్యుమ్నాభ్యుదయ మనెడి యొక నాటకమును సంస్కృతభాషలో రచియించెను. అతఁడును సందర్భశుద్ధి లేనిదియును, నాటకోచితము కానిదియును నగు కథాభాగములను మార్చి కొన్ని నూతన కల్పనములు చేర్చి తన రూపకమును రచించెను. శుచిముఖిపాత్ర పక్షియగుటచే ప్రదర్శనానుగుణము కాకుండుట వలన దాని నతఁడు తొలఁగించెను. ప్రభావతీప్రద్యుమ్నుల మధ్య దూతకృత్యమునంతటిని

ఈ రవివర్మ భద్రనటుని మూలముననే నడిపెను. చిత్రపట ప్రదర్శన మూలమున నాయికకు అనురాగబీజము నారోపించుట రవివర్మ కల్పనము.

పింగళి సూరన రచన రూపకము కాదు, ప్రబంధము. కావున నీతఁడు తన శ్రవ్యకావ్యమున కనుగుణముగ హరివంశ మూలము నందలి కథను మార్చుకొనెను. సూరన నాయికానాయకుల మధ్య దౌత్యమును శుచిముఖి మూలముననే నడిపినాఁడు. భద్రనటుఁడు ఆడుచు పాడుచు మెలఁగెడి తేలిక మానసి. అట్టివాఁడు నాయికా నాయకుల మధ్య అనురాగమును పోషించుచు దౌత్యము నెఱపుట కనర్హుఁడని తోఁచి, రహస్య గోపనమునందు సమర్థమైన మూలమునందలి శుచిముఖిపాత్రనే సూరన గ్రహించినాఁడు. నాయిక పక్షమున పురుషునికంటె స్త్రీ దూతకృత్యము నెఱపుటకు తగినది గదా! భద్రనటదౌత్యము రసోచితము కాదని వేరె చెప్పవలసిన పనిలేదు. సూరనార్యుఁడు మూలమందలి శుచిముఖిని యథాతథముగ గ్రహింపక పునఃసృష్టి యొనర్చినాఁడు. దానికి అనంతధీశక్తి నిచ్చి కథారంగమున ప్రవేశపెట్టినది మొదలు సర్వవ్యాపారములకు సూత్రధారిని గావించినాఁడు. ఈ సృష్టియందు సూరన తన ఆత్మీయతను (Personality) ప్రతిబింబింపజేసినాఁడు.

మూలమునందు ప్రభావతీప్రద్యుమ్నుల ప్రణయమునకును, గద సాంబ సునాభపుత్రికల ప్రణయమునకును, నెట్టి సంబంధము లేదు. వారి ప్రణయము స్వాభావికపరిణామము నొందినట్లు కనిపించదు.

"ఒక దినమున వజ్రనాభుని తమ్ముఁడగు సునాభుని కుమార్తెలగు ప్రభావతి చెల్లెండ్రు ప్రభావతీసౌధమునకు వచ్చిరి. అపుడు వారు ప్రభావతి ప్రద్యుమ్నునితోఁ గూడియుండుటను జూచిరి. ప్రభావతి వారితో తన మంత్రప్రభావమును, దేవమానవుల నెవరినైనను తనకడకు రప్పించఁగలనని తెలుపఁగా, వారామె నా మంత్రమును జెప్పవలసినదని వేఁడుకొనిరి. ప్రభావతి ప్రద్యుమ్నుని తన చెల్లెండ్రకు దగిన భర్తల నిరువురఁ బేర్కొనుమనఁగా నతఁడు గదసాంబుల పేర్లు చెప్పెను. ప్రభావతి చెల్లెండ్రు మంత్రప్రభావమున వారిని బిల్పించుకొని వివాహమాడిరి."

అర్థరహితమగు దీనిని సూరనార్యుఁడు స్వీకరింపక చిలుక రాయబారమును కల్పించినాఁడు. దీని మూలమున ప్రధాన నాయికానాయకులైన ప్రభావతీప్రద్యుమ్నుల ప్రణయకథకును, వీరి ప్రణయకథకును, ప్రతియోగము (Contrast and Parallelism) కలిగినది. ప్రధాన నాయికానాయకుల ప్రణయదౌత్యమునకు మేధాసంపన్నయైన

శుచిముఖి పూనుకొనఁగా, ఉపనాయికానాయకుల ప్రణయ కార్యభారము నంతకంటె గొంతగ నల్పసామర్థ్యము గల వ్యక్తి పూనుకొనిన దన్నమాట! ఇట్లు రెండు శృంగారకథావాహినులను పింగళి సూరన తన కావ్యమున సంగమింపఁజేసినాఁడు (శ్రీ పింగళి). వజ్రనాభవధకును, ప్రభావతి వివాహమునకును మూలమున నెట్టి సంబంధమును లేదు. సూరనార్యుఁడు తండ్రి చావునకును, కుమార్తె వివాహమునకును అవినాభావసంబంధమును కల్పించి, ఏకసూత్రమున కథను నడిపించి కథకు నిబిడత్వమును జేకూర్చినాఁడు.

మూలమునందు వజ్రనాభవధానంతరము ఇంద్రుఁడు రాక్షసరాజ్యమును తన కుమారుఁడైన జయంతునికి, కృష్ణుని కుమారులకు, సోదరులకుఁ బంచి ఇచ్చినట్లున్నది. వజ్రనాభోపద్రవము నుండి తన్ను దాను రక్షించుకొనఁజాలక 'రక్ష రక్ష జనార్దన' యని తొలుత వేడుకొన్న ఇంద్రుఁడిపు డిట్లు కృష్ణుని సరకుగొనక స్వతంత్రించినట్లు వర్ణించుట పాత్రౌచితికి భంగకరము. కావున సూరనార్యుఁడు యుద్ధానంతరము లభించిన రాజ్యభోగములను బంచుకొనుటకు తనవారం బంపి, వజ్రనాభుని హతమార్చిన శ్రీకృష్ణుని మధ్యవర్తిగ నిలిపి, ఉచితిజ్ఞతను బాటించినాఁడు. మూలమునందు వజ్రనాభునికొక కుమార్తె (ప్రభావతి) కలుగునట్లు వరమిచ్చుటయే తప్ప, ప్రభావతి ప్రణయకథలో పార్వతికెట్టి సంబంధమును లేదు. సూరనార్యుఁడు రవివర్మనుండి గ్రహించియో, మఱి స్వయముగా నూహించియో ప్రభావతిస్వప్నమును, చిత్రపట సన్నివేశమును గల్పించినాఁడు. ఇది మనోజ్ఞమైన కల్పనము. దీనివలన సూరనార్యుఁడు ఎన్నో ప్రయోజనములను సాధించినాఁడు. వజ్రపుర ప్రవేశమొనర్చి, వానిని సంహరించువాఁడెవ్వఁడా యని ఇంద్రోపేంద్రు లూహించువేళ, శుచిముఖివలన చిత్రఫలక వృత్తాంతమును వినిపించి, ప్రద్యుమ్నుని మూలమున నీ కార్యమును సాధింపవచ్చుననెడి యాశను యింద్రునకుఁ గల్పించినాఁడు.

శృంగార ప్రబంధమగు నీ ప్రభావతీప్రద్యుమ్నమున ప్రభావతి ప్రథమదర్శనవేళనే యెంతటి యుత్కటానురాగము నొందినదో తెలిపినాఁడు. ఇట్లే భద్రనటునకును, ధూర్తవటువులకును జరిగిన సంభాషణమనెడి రసవత్సన్నివేశమును సూరనార్యుఁడే కల్పించెను. ధూర్తవటువుల వాక్యములను కృష్ణుఁడుపశ్రుతిగా గ్రహించి ప్రద్యుమ్నుని నటవేషమున వజ్రపురమునకు పంపుటయనెడి నిశ్చయమొనర్చుట కీ సన్నివేశము తోడ్పడుచున్నది. ప్రభావతికి ప్రద్యుమ్నుని భర్తగా మున్నే పార్వతి నిశ్చయించుటయను నంశము సూరన కల్పనయే.

అదేరీతిగ నామె చెల్లెంద్రగు చంద్రావతీగుణవతులకు గదసాంబులు భర్తలగునట్లుగా నారదుని దీవనను కల్పించినాఁడు.

కవి ఇందలి నాయికలైన అక్క చెల్లెంద్రనందఱ నొకే రీతిగ నన్ని సందర్భములఁ జూడఁదలచుటయే ఇందుకు కారణము. మూలమునందు వజ్రనాభుఁడు కశ్యపుని యజ్ఞము ముగిసిన పిమ్మట నాతనికడ కేగినట్లును, నాతఁడు స్వర్గ రాజ్యాధిపత్య సత్త్వము వానికి లేదని తెలుపఁగా నా రాక్షసుఁడు మఱల స్వర్గముపై దండెత్తినట్లును నున్నది. మహాకవి తిరిగి వజ్రనాభునిచే స్వర్గముపై దండెత్తింపఁ జేయుట కేవలము ఇంద్రునియెడ నీర్ష్యాభావము నాతఁడు ప్రదర్శించుటయే యగుటవలన, దానిని మాన్పించి సూరన యాతని దృష్టిని ప్రద్యుమ్నద్రోహము (తన యంతఃపురమునఁ బ్రవేశించి కన్యామానాపహరణ మొనర్చుట) వంకకు మరల్చినాఁడు.

ఇదే రీతిగ బరిశీలించిన మూలమును సూరన సూక్ష్మదృష్టితోఁ బరికించి మార్పు చేర్పుల నొనర్చుటయే గాక, తన యపారప్రతిభతో దానినొక యపరసృష్టి గావించినాఁడని వ్యక్తమగును.

## ద్వారకావర్ణనము

సముజ్జ్వలమహిమతో శ్రీకృష్ణుఁడు ద్వారకయందుండఁగా, నొకనాఁడు ప్రభువుకడకు ఇంద్రుఁడు వజ్రనాభదానవుని దుశ్చేష్టల వలన బాధనొందుచున్న లోకములకు మేలును జేకూర్చు కార్యమును గూర్చి పర్యాలోచనమొనర్చుటకు, స్వర్గమునుండి దిగివచ్చుచుండెను. అతనికి దూరమున భూదేవి ధరించిన సముద్రమనెడి మొలనూలునందలి రత్నపుమొగపో యనునట్లుగను, సముద్రమనెడి తలపాగను ధరించిన భూమియనెడి శివమూర్తి చిత్రతిలకమో యనునట్లుగను, పశ్చిమ దిక్కనెడి స్త్రీ కట్టుకొనిన సముద్రమనెడి వస్త్రపు కొంగునందలి జలతారు మొగ్గయో యనగను, వరుణుని గోపురమునకుఁ గట్టఁబడిన సముద్రమనెడి తోరణమునకు మధ్య వ్రేలాడు పూగుత్తియో యనునట్లుగను, అనేక మణిగృహముల కాంతిచే ప్రకాశించుచుఁ గన్పట్టెను. అప్పుడు ద్వారక తన్నుఁ జూచుటకు ఇంద్రుని వేయి కన్నులును జాలక యాశ్చర్యపడు నట్లింద్రునకుఁ దోచెను.

## ఇంద్రునకు మాతలి ద్వారకానగరమును వర్ణించి చూపుట

ఆ పట్టణసౌందర్యమును తిలకించి తలయూచి యాశ్చర్యమునొందుచున్న దేవేంద్రునిఁ జూచి, యాతని రథసారథియగు మాతలి “ఏమేమి? ప్రభువువారి కీ

నగర మింతటి యాశ్చర్యమును గొల్పుచున్నదా? స్వర్గాధిపతుల కాశ్చర్యమును గల్గించు నగరము భూమియందు కలిగినది. ఏమనవచ్చును? ప్రభూ! సముద్రమనెడి తెఱ వెనుకనుండి వచ్చి నాట్యమునకై రంగస్థలమున నిల్చిన నట్టువరాలి వలె (నర్తకి) యీ పురలక్ష్మి యింపులుగులుకుచు నున్నది. గమనించినారా? పడమటి దిక్కున సముద్రము యొక్కయు, మిగిలిన దిక్కుల వనసమూహముల యొక్కయు నలుపు అతిశయింపఁగా నీ పురలక్ష్మి విష్ణువు హృదయప్రదేశమున సుఖించుచున్న రీవితో నొప్పుచున్నది.

"దోహద ధూపధూమములతో నొప్పుచున్న యీ నగరమందలి వన సమూహమును జూచితివా, ఓ విబుధోత్తమ! నీటిని త్రావుటకై కుతూహలముతో వచ్చి పైన వ్రేలాడుచున్న మేఘమాలికతో నొప్పారు సముద్రమాయనెడి భ్రాంతిని కల్పించు నైపుణ్యముతో నతిశయించుచున్నది. తన శరీరవలయములే కోటలుగను, కిరీటములవలె ప్రకాశించు తన ఫణముల సమూహమే మేడల వరుసగను నొప్పి ఆదిశేషువు విష్ణువును విడువఁజాలక ఈ రీతిగ వచ్చి సేవించుచున్నాఁడేమోయన్న యూహ నాకు కల్గించుచున్నది. సౌధశిబిరములందలి మణుల కాంతులచే ననేకములైన వర్ణములను పొందినవై మేడలపైనున్న జెండా గుడ్డలచే నెఱుక పడక యీ ద్వారకానగరముపై భాగమున మేఘములు నిల్చినవి. ఓ ఇంద్రా! చూచితివా! ఇప్పటికిని నమ్మరాదు. అవి కాలాగరుధూపముల పొగలో లేక మేఘములో! ఆ కన్పించునది కెంపులతో గట్టబడిన మేడలచే ప్రకాశించునట్టి గరుడపచ్చల యరుగులతో నేలయో లేక లేఁజివురాకుల యెఱ్ఱందనము యొక్క యతిశయముచే తేజరిల్లు మామిడితోపో, ఆ బృహస్పతికైనను దగ్గరకు పోయి చూచినగాని నిశ్చయింప వీలులేకయున్నది.

"ఓ దేవతాధిపా! చూడుము, ఆ బంగారు కోటయందలి శృంగారోద్యానవనములో క్రీడకొఱకైన వెండికొండ కాఁబోలును, శివుని శరీరమువలె నొప్పుచున్నది. అది గొప్ప పుష్పములు గల సంపెంగ తోఁటలవరుస కాఁబోలును, శివుని పులితోలువలె ప్రకాశించుచున్నది. ఇంద్రనీలములతో నొప్పారు మెట్లవరుస కాఁబోలును. అది శివుని నాగహారమును బోలియున్నది. అది పవడములు గూర్పఁబడిన నీటిజాలు గాఁబోలును. జటాజూటకాంతితో నొప్పారుచున్నది. అది సరోవరము కాఁబోలును. ఆకాశగంగవలె నొప్పారుచున్నది. అది క్రీడానౌక కాఁబోలును. చంద్రకళవలె నొప్పారుచున్నది. విస్తారముగాఁ గదిలెడి నాచుతీవగుంపు యొక్క చక్కదనము తిరిగెడి పూఁదోటలవలెను, పెద్ద తరంగముల వరుస నడచునట్టి కోటలవలెను నురుగుముద్దయొక్క సొగసు

తిరిగెడి పూఁదోటలవలెను, మేడలగుంపువలెను, నీటితుంపురుల పెద్దజల్లు కాన్కలు పెట్టు ముత్యాలవలెను ఉండగా, నీ ద్వారకానగరపు కోటచుట్టు త్రవ్విన యగడ్త లాయా దిక్కులందలి గాలిపాటులచే నీ పురశ్రేష్ఠమును కొలుచుటకై శాసనపూర్వకముగాఁ గొనిరాఁబడిన శత్రుపురముల వరుసవలె ప్రకాశించుచున్నది.

'ఈ నగరమునకు పడమటి దిక్కునందు సముద్రమున్నది' అని యెఱిఁగిన పెద్దలు చెప్పుకొను మాట తప్ప నితరుల కీ పురమునకు నాల్గువైపుల నున్నట్టివి యగడ్తలో లేక సముద్రములో తెలిసికొనశక్యము గాదు. ఈ నగరమందలి స్త్రీలనెడి మెఱపులు సంచరించుటచే ధన్యమైన వనపంక్తి తన్ను మిక్కిలిగా మీఱుటను జూచియును మేఘము సిగ్గు లేక యిచ్చటికి వచ్చిన వచ్చుగాక, ఒకవేళ నది రాకున్నను నీ పురమందలి జనుల పైరు పంటలకు క్రింద ప్రవహించు పూఁదేనెల ప్రవాహములే చాలును. మేఘము రాకున్న నీ నగరమునకెట్టి లోపమును గలుగదు."

ఈ రీతిగా రథిక సారథులైన ఇంద్రుఁడును మాతలియును నాయా వస్తువులుఁ జూచినపుడు సమయోచిత సంభాషణలతో వినోదించుచు, కొంతదూరము గడచి భూమికి దిగిరి.

## ప్రథమాశ్వాస కల్పనలు – ప్రయోజనములు

శ్రీకృష్ణరాయల పరిపాలనకాలమునుండి (క్రీ.శ. 15వ శతాబ్ది పూర్వార్ధమున) నుండి ఆంధ్రసాహిత్య ప్రపంచమున ప్రబంధములనెడి నూతన కావ్యములు పుట్టినవి. వీని రచనకు తొలుత తన శృంగార నైషధ కావ్యరచనచే మార్గదర్శియైనవాఁడు శ్రీనాథుఁడు. తఱువాత పెద్దన, నందితిమ్మనాదులు ఈ ప్రబంధ రచనామార్గము ననుసరించిరి. వీనియందు కథకంటె అష్టాదశవర్ణనలకు ప్రాముఖ్యమధికము. ఈ దృష్టితోఁ జూచినచో భట్టుమూర్తి వసుచరిత్ర సమగ్రమైన ప్రబంధ లక్షణములు గల కావ్యము.

పెద్దన మనుచరిత్రయందును ప్రబంధమునకు వలసినదానికంటె కథ యధికముగా నున్నది. పింగళి సూరనార్యుఁడు కథాకల్పనముపై విశేషమైన మక్కువ గలవాఁడు. అతని కళాపూర్ణోదయమునందు కథ నానారీతుల పెరిగిపోయినది. ఆ లక్షణము కొంతగా ఈ ప్రభావతీప్రద్యుమ్నము నందును కన్పట్టును. వసుచరిత్రాది ప్రబంధములందలి కథలతో పోల్చినచో, ఈ కథయును దీర్ఘమైనదనియే చెప్పవలసివచ్చును.

ప్రభావతీప్రద్యుమ్నమున ప్రధానకథ రాక్షసరాజగు వజ్రనాభుని కుమార్తెయగు ప్రభావతి శ్రీకృష్ణపుత్రుఁడైన ప్రద్యుమ్నుని వలచి వివాహమాడుట. దీనికి వజ్రనాభవధ యనెడి రాజకీయ వ్యవహారము జోడింపఁబడినది. కావున కథ పెరిగినది.

వజ్రనాభరాక్షస వధవలన గాని జరుగనేరని ప్రభావతీప్రద్యుమ్నుల వివాహమును సాధించుటకు సూరనకెన్నియో కల్పనలావశ్యకము లైనవి.

సూరన మహాకవి తన ప్రభావతీప్రద్యుమ్న కావ్యమునందలి ప్రథమాశ్వాసమున కథాపర్యవసానమందు కలిగెడి వజ్రనాభవధోపేత ప్రభావతీప్రద్యుమ్న వివాహమునకు అవసరమైన బీజమును నాటవలసివచ్చినది. కథాకల్పనయం దద్వితీయప్రతిభగల సూరన, యొక వంక వజ్రనాభవధకును, మఱియొక వంక ప్రభావతి శృంగార జీవిత పరిణామమునకును బీజములను ఈ ప్రథమాశ్వాసమున అంకురింపఁజేసినాఁడు.

ప్రథమాశ్వాసమందు కన్పించు ప్రధాన సన్నివేశములు – మాతలితోఁగూడి ఇంద్రుఁడు ద్వారకకు వచ్చుట, ఇంద్రుఁడు వజ్రనాభ దుర్ణయముల శ్రీకృష్ణున కెఱింగించుట, వసుదేవయజ్ఞము, భద్రనట ధూర్తవటువుల సంభాషణము, శుచిముఖి ప్రభావతీస్వప్నానంతర వృత్తాంతమును ఇంద్రునకెఱింగించుట యను కల్పనములు. వీనివలన కవి సాధించిన ప్రయోజనము లేమియో గమనింతము.

వజ్రనాభుని వలన బహుబాధల నొంది ఇంద్రుఁడు వాని మదోద్ధతి నణచుటకు తగిన చర్య చేయింపఁదలచినవాఁడై, వాని దుశ్చరిత్రమును శ్రీకృష్ణునకు నివేదించు నుద్దేశముతో ద్వారకకు మాతలితోఁ గూడి స్వర్గము నుండి దిగివచ్చుచు ద్వారకను చూచి యాశ్చర్యమగ్నుఁడగుట, మాతలి ఇంద్రునకు ద్వారకను వర్ణించి చూపుట యనునవి ప్రథమాశ్వాసమునందలి సన్నివేశములు. వీని మూలమున కవియగు సూరన తన కథాకథనమును నాటకీయముగ నడుపుట యనెడి గుణమును సాధించినాఁడు.

సర్వసామాన్యముగ ప్రబంధములు పురవర్ణనముతో నారంభించుచుండును. సూరనయు నట్లె తన కావ్యమున ద్వారకను వర్ణించినను, ఈ నూతన మార్గమననుసరించి విశిష్టతను నిలుపుకొనినాఁడు. ఈ వర్ణనమువలన ఇంద్రుని మానసిక స్థితిని, మాతలి సంభాషణము మూలమున సేవాధర్మాది యుత్తమగుణములను సూరన వెల్లడించినాఁడు. ఇంద్రునంతటివానికిఁ దోడ్పడదగిన శ్రీకృష్ణుని యాధిక్యమును స్థాపించుట కాతని నగరము నిట్లు మహాద్భుతముగ వర్ణించినాఁడు.

రెండవ కల్పనము ఇంద్రుఁడు వజ్రనాభుని దుశ్చర్యలను శ్రీకృష్ణున కెఱింగించుట. మహాకవి సూరన ఈ సన్నివేశమున నింద్రుని దైన్యస్థితిని, వజ్రనాభుని గర్వోద్ధతిని మనోజ్ఞముగ నిరూపించినాఁడు. ఇంద్రునిచే నీతఁడు చేయించిన సంభాషణము సాధుజనరక్షణకు బద్ధకంకణుఁడైన శ్రీకృష్ణునే కాదు, పఠితలనుగూడ కరిగింపఁగలిగియున్నది. ఈ సన్నివేశము మూలమున సూరన ఇంద్రోపేంద్రులను మనోజ్ఞముగ చిత్రించి తన పాత్రోన్మీలనసామర్థ్యమును వెల్లడించినాఁడు.

వసుదేవయజ్ఞము శ్రీకృష్ణుని యజ్ఞప్రియత్వమునకు, దేవతాపక్షపాతమునకు నిదర్శనమైన సన్నివేశము. యజ్ఞధూర్వహుఁడగు కృష్ణుఁడు భవిష్యత్కాలమున వజ్రనాభ రాక్షస వధాభారము నెత్తికొనుటకు పూనుకొనునని తోఁచును. ఈ యజ్ఞాంతమున జరిగిన సన్నివేశము భద్రనట దుష్టవటువుల కలహము. సూరనార్యుఁడు ఈ విచిత్ర సన్నివేశము మూలమున, అతితీక్ష్ణముగ నడిచిన పూర్వకథాసన్నివేశముల తైక్ష్ణ్యమునుండి పఠితలమనసులను చతురహాస్యమువంకకు త్రిప్పినాఁడు. బ్రహ్మచారులిందు పలికిన –

సీ. “ఏము ముచ్చులమె? యూహింప ముచ్చుఁదనాల
పుట్టిన యిండ్లు మీబోంట్లె కాక !
యాటవాండ్రని నమ్మి యనుమతింపఁగ నెట్టి
పురమైన నశ్రమంబునను జొచ్చి
పగలెల్ల నాటల భ్రమయించుచును సందు
గొందులెల్ల నెఱింగికొనుచు, రేలు
కన్నగాండ్రగుచు నగళ్ళు ప్రవేశించి
యందు నెంతటివారలడ్డమైన

ఆ.వె. జక్కడఁచుచుఁ బేను గ్రుక్కిన పాటిగా
నిష్టమైన యర్థ మెల్లఁ బడసి
బ్రతుకుచునికి మీ స్వభావ మింతయును ద
ప్పదు యథార్థమనుచు బలుకుటయును” (1–108)

అను వాక్యములను ‘విప్రవాక్యం జనార్దన’ యనుమాట యథార్థమై పరగునట్లుగా గ్రహించుట జరిగినది. ఇంద్రుని కార్యము దెస లగ్నమైన మనసుతో నున్న శ్రీకృష్ణుఁడు, భద్రనటుని నిందించుచు పలికిన ఈ వాక్యములను ఉపశ్రుతిగ గ్రహించి, నర్తక

వేషముతో ప్రద్యుమ్నుని వజ్రపురమున బ్రవేశబెట్టి వజ్రనాభ వధాకార్యమును సాధింప నిశ్చయించుట, నా రాక్షసున కపజయమును, వధయును నిశ్చితము లగుచున్నవి.

ఈ సన్నివేశమువలన నివి సూరనార్యుఁడు కథ కొదవించిన పరమ ప్రయోజనములు :

ఇంద్రుఁడు గంగానదియందు విహరించు హంసలను తమకు వేగుపడవలసిన దని కోరుట, శుచిముఖి ప్రభావతీస్వప్న – స్వప్నానంతర వృత్తాంతములను ఇంద్రున కెఱిఁగించుట యనునవి తఱువాతి కల్పనలు. కృష్ణునితో సంభాషణ ముగించి వెడలునపుడు 'నీవు నుపాయాన్వేషణము గావింపుచునుండు మల్పకార్యం బదిగా దే వెఱవున దత్పురి చొరగావలయునొ యెవ్వరోర్వఁగలరో వానిన్' అని పలికినాఁడు. ఇంద్రుఁడు వజ్రనాభాపాయమునకు ఉపాయమును భావించి హంసలు వేగు నడుపగలవని వానిని రప్పించుట సహజము.

వజ్రనాభవధకు మార్గము నన్వేషించుచున్న ఇంద్రునకు, వాని రాజ్యసంపద తుదకు వచ్చినట్లు హంసలు తెలుపుట మిక్కిలి ప్రయోజనకారియైన యంశము. తఱువాత శుచిముఖి ఇంద్రునితో ప్రభావతీస్వప్న – స్వప్నానంతర కథలను విన్నవించినది. స్వప్నమువలన ప్రభావతీప్రద్యుమ్నులకు గలుఁగు కుమారుఁడు రాజ్యమేలవలసియుండుటచే కొన్ని విషయములు జరిగినవి. రాక్షసవనితయైన ప్రభావతికి ప్రద్యుమ్నుఁడు భర్తయని పార్వతి శాసించుట ఇంద్రకార్యమునకు ప్రయోజనకారియైన యంశము.

చిత్రపటమును తిలకించి ముగ్ధయగు ప్రభావతి మన్మథరాగమును వెల్లడించుచు శృంగారవిలాసములను బ్రదర్శించుటచే నామె ప్రద్యుమ్నుని గాఢముగ బ్రేమించుచున్నదనియును, అంకురించిన యామె ప్రణయము పరిణమించి సత్ఫలము నొసఁగు ననియును వెల్లడి యగుచున్నది. శుచిముఖి తెలిపిన వృత్తాంతమంతయును దేవకార్యమునకు ఉపయోగకారకము. ఈ కల్పనలందు సూరన కడుసామర్థ్యముతో ముగ్ధయైన ప్రభావతిని సమ్మోహనముగ చిత్రించినాఁడు. తఱువాత నొక వంక కృష్ణాదుల రాజకార్యమును, మరొకవంక ప్రభావతీప్రద్యుమ్నుల శృంగారజీవితమును కడు సమర్థతతో నిర్వహించిన శుచిముఖి పాత్రను సూరనార్యుఁడు కడుజాగరూకతతోఁ ప్రవేశపెట్టినది మొదలుగ, తుదివఱకును నీ యాశ్వాసమున పోషించినాఁడు. తఱువాతి కథయందు కన్పించు తంత్రనిర్వహణ ప్రావీణ్యము, అనంతధీశక్తి, సంభాషణ చాతుర్యము, ఉచితజ్ఞత, పరేంగితజ్ఞానము, విషయనిరూపణ సామర్థ్యము మొదలగు

శుచిముఖి గుణవిశేషములనన్నింటిని ప్రథమాశ్వాసమునందే సూరనార్యుఁడు స్థాలీ పులాకన్యాయమున ప్రదర్శించినాఁడు. ఈ ప్రథమాశ్వాసపఠమువలననే శుచిముఖి సూరనార్యుని అపూర్వమైన అపరసృష్టియని ద్యోతకమగును.

ఈ రీతిగ సూరనార్యుఁడు ప్రథమాశ్వాసమందలి కథాసన్నివేశముల మూలమున తఱువాతి కథకత్యావశ్యములైన ప్రయోజనములను సాధించుటయే గాక, పాత్రోన్మీలన సామర్థ్యముచే తన కథయందలి పాత్రకు విశిష్ట రూపరేఖలను కల్పించుటయు, వానికి స్వాభావికములైన మనఃప్రవృత్తులను, సంభాషణసామర్థ్యములను కల్పించి సజీవమూర్తులనుగా నొనర్చి, మహత్తర ప్రయోజనములను సాధించినాఁడు.

## ప్రభావతీప్రద్యుమ్నము - వర్ణనలు

### (నవ్యత – సార్థకత)

ఆంధ్ర సాహిత్యమునందలి ప్రబంధములు, వానిలో వస్తువేదైనను ఒకే మార్గము ననుసరించి నడిచినవి. సర్వసామాన్యముగ ప్రతి ప్రబంధమును పురవర్ణనముతో నారంభించి, చాతుర్వర్ణ వర్ణనము, పుష్పలావికాదివర్ణనము మొదలగు వర్ణనములతో సాగిపోయినవి. పింగళి సూరనార్యుడు ఈ పద్ధతి నచ్చకపోవుటవలన నొక నవ్యతను కనబరచవలెనని ఉద్దేశించినట్లు తోచును. స్వతంత్రబుద్ధిగల సూరన పూర్వసంప్రదాయమును పరిపూర్ణముగా విసర్జింపవలె ననెడి దృష్టి కలవాఁడు కాఁడు. ఆ సంప్రదాయమునే హృదయంగమమైన రీతిలో నిర్వహించుటకు నిశ్చయించినాఁడు. తన వర్ణనల నీ దృక్పథముతో నడిపించినాఁడు.

శిశుపాలవధను వ్రాసిన మాఘ మహాకవి తన కావ్యమును

'శ్రియఃపతిః శ్రీమతి శాసితుం జగ
జ్జగన్నివాసో వసుదేవ సద్మ ని
వసన్ దదర్శావతరంతమంబరా
ద్ధిరణ్యగర్భాంగభవం ముని హరిః ॥'

అని యారంభించినాఁడు. తఱువాత పాఠకుని ఇంద్రునితోఁబాటుగ నాకాశమార్గమునకుఁ గొనిపోయి అక్కడనుండి యాతనికి ఇంద్రమాతలుల ముఖమున ద్వారకానగర సౌందర్యమును చవిచూపించినాఁడు. ఇంతటి ఉన్నతస్థలము నుండి కథలోని ఒక పాత్ర వర్ణించి చూచునపుడు, పాఠకునకు విశాలములైన ప్రకృతి చిత్రములన్నియును నొకే మారు గోచరించి మనోమోదమును గూర్చును. కావ్యమందలి

ఒక పాత్ర తనకు ద్వారకను వర్ణించి చెప్పుటయనెడి యానందము నతఁడనుభవించును. ఇందువలన నెంతటి దీర్ఘవర్ణనమైన విసుగును గల్పింపదు. ఈ రీతిగ సూరన ద్వారకావర్ణనమున నొక నవ్యతను జూపినాఁడు. తన ప్రబంధ ప్రారంభమునందే యొక నవ్యత నిట్లు ప్రదర్శించిన ఖ్యాతి పింగళి సూరనార్యునిదే.

ఈ ద్వారకానగరవర్ణనమున ఉత్ప్రేక్ష సందేహములనెడి యలంకారములను సూరనార్యుఁడు విరివిగ వాడియున్నాఁడు. ఈ రెండును ఆశ్చర్యములతోఁ గూడిన యానందము నొసంగుటకు సమర్థములు. రాక్షసబాధ వలన మానసికవ్యథ ననుభవించు ఇంద్రుఁడు కృష్ణునిపై బుద్ధినిడి యాశతో వచ్చుచుండగా, నాతనికి శ్రీకృష్ణుని నగరమగు ద్వారక ఇట్టియానందమును కూర్చుట యొకరీతిగ భావిఫల ప్రదర్శకముగ నున్నదని చెప్పదగును.

ఇది సూరనార్యుని వర్ణనసార్థకతకు నిదర్శనమై యొప్పుచున్నది. ఇందు కొన్ని పద్యములు (తను తరుణి తటిద్విహృతిన్, భోగపుచుట్లు కోటలుగ, అవచూడోపలదీప్తి చిత్రితములై) ఇత్యాదులు ఆంధ్రప్రబంధములందలి నగరవర్ణనములందలి పద్యములలోనెల్ల నుత్కృష్టస్థాన మాక్రమింపదగినవై యొప్పుచున్నవి.

బ్రాహ్మణవర్ణనమునందును నవ్యత గోచరించుచున్నది. ఈ వర్ణనమును భద్రునిచేఁ జేయించుట వలన, పాఠకునకు దీనిని కవియే స్వయముగ నిట్లు వర్ణించినాఁడను భావము కలుగదు. ఔచితికి భంగము లేనిరీతిగ, అవసరవర్ణనమని పాఠకునికి అనిపించునట్లు చేసిన ఈ బ్రాహ్మణవర్ణనము హాస్యరసపూరితమై పాఠకునికుత్సాహమును గల్గించుచున్నది.

నవ్యమార్గము ననుసరించి యొనర్చిన ఈ బ్రాహ్మణవటు వర్ణనము వలన బ్రహ్మచారులు "ఆటవాండ్రని నమ్మి ... మీ స్వభావము" అని భద్రుని యాక్షేపించుటయు, ఇంద్రకార్యము దెస వర్తిల్లు చిత్తముతో నున్న కృష్ణుఁడు తనయపేక్షకు సమాధానముగ దానిని స్వీకరించుటయును, జరిగినవి. వటువుల వాక్యముల ననుసరించియే ప్రద్యుమ్న గదసాంబులు వజ్రనాభపురిని ప్రవేశించి వాని వినాశనమునకు కారణులైనారు.

భద్రవటుని బ్రాహ్మణవర్ణన మూలముగా వటువులు అప్రయత్నముగను, అన్యాపదేశముగను వజ్రనాభవధకు బీజమును నాటినారు. ఈ ఘట్టము కావ్యమునకు ప్రాణపదము.

ఇట్లు సూరనార్యుఁడు అతికౌశలముతో ప్రబంధ సంప్రదాయమును కాపాడుకొనుచు నవ్యరీతిని వర్ణనమును కావ్యబీజోత్పాదనమును చేయగలిగినాఁడు.

సరస్వతీబ్రహ్మల ప్రణయ సమయమున బ్రహ్మయొనర్చు మన్మథోపాలంభమును వర్ణించి, దాని మూలమున సూరన ప్రభావతీప్రద్యుమ్నుల సంయోగము నిశ్చితమని యుత్తరార్థమును సూరన సూచించినాఁడు. ఇందు పుష్పలావికల వర్ణనములను కావ్య వస్తుపోషకములుగా నొప్పుచున్నవి. సూరనకు ప్రబంధకర్తలు సామాన్యముగ స్త్రీపురుషవర్ణనము లందుపయోగించు ఉపమానవస్తువుల ప్రసక్తి రుచించినట్లు కనపడదు.

'నెత్తమ్ములనుచు గ్రొన్నెలలంచు వటఫల శ్రీలంచు తాబేటి చిప్పలనుచు... ఇట్టివి గదయ్య చెప్పఁబోయిన నుపమలు వీనిఁదడవ సిగ్గొదవు' అను ప్రభావతీవర్ణనమునందలి పద్యమిందుకు సాక్ష్యము.

స్త్రీల వర్ణించుటలో నుపమానవస్తువుల నన్నిటినొకచోటికి చేర్చిన నొక వికృతరూపము కలుగును. ప్రత్యేకాంగవర్ణనము శరీర సౌందర్యమునకు పుష్టిని కలిగింపదు. శరీరవర్ణనములలో నుపమానముల చొప్పించుట ఈతనికి నచ్చదు. సహజ సౌందర్యమును సహజధోరణియందే ఉపమానవస్తు నిరపేక్షకముగా వర్ణించుట ఈతనికిష్టము. సౌందర్య వర్ణనమునకు చంద్ర మన్మథమలయ మారుతోపాలంభములకు ఒకటి రెండాశ్వాసములను ప్రత్యేకించుట సూరనకిష్టము కాదు. ప్రబంధవర్ణనములందు నిరసనభావమున సూరన శుచిముఖికి 'ఉపమాతిశయోక్తి కామధేనువు' అను బిరుదమును ప్రసాదించినట్లు తోఁచును.

ఇదియంతయును సూరన నవ్యతను ప్రదర్శించుచున్నది. విప్రలంబ శృంగారవర్ణనము నందును సూరకవి ఒక నూతనమును, లలితమునునైన పద్ధతి ననుసరించినాఁడు. ప్రణయ కలహమువలన నాయికానాయకులకు తాత్కాలిక వియోగమును కల్పించుట ఒక సుకుమార ప్రయోగము. ప్రణయకలహమునకు గోత్రస్ఖాలిత్యమును (సవతి పేరును పలుకుట) కారణముగా నీతఁడు కల్పించి కథకు నవ్యతను, పుష్టిని చేకూర్చినాఁడు.

కొన్ని వర్ణనములలో చెప్పిన యన్ని యంశములు నొక రీతిగనే యున్నట్లు స్థూలదృష్టికి గోచరించును. కాని సూక్ష్మ ముగ పరిశీలింపగా, వానియందు సూరనార్యుని విశిష్టత, కళాకేళి అభివ్యక్తములగును. ఇందుకు స్వర్గముపై దండెత్తివచ్చిన

రాక్షసులింద్రుని పెట్టిన బాధల నాతఁడు కృష్ణునితో వర్ణించి చెప్పు సందర్భములోని క్రింది పద్యమొక చక్కని నిదర్శనము.

సీ. “తన కులుపా చాలదని మిట్టిపడఁగ న
 నామధేయపు దైత్యునకు నడంగి
తనవిడిదికి రంభ ననుపవైతని తిట్టు
 కిగ్గాడి యసురకుఁ గేలు మొగిచి
తనకుఁ బెద్దఱికంబు మును సేయవని దూఱు
 నధమ రాక్షసునకు నర్చలొసంగి
తనకమృతముఁ బోసి యనుపవంచు నదల్పుఁ
 బినుగు రక్కసునకుఁ బ్రియము చెప్పి

తే. పంకరుహనాభ! యేఁబడ్డపాటు లరయ
నెందు నెవ్వరుఁ బడరు నీకేమి చెప్ప?
నెంత పాపంబు చేసిన జంతువొక్కొ
యింద్రుఁడగునని యపుడాత్మ నెన్నుకొంటి.” (1-78)

ఇందు మొదటిపాదమున తిండికి, రెండవ పాదమున కామమునకు, మూడవపాదమున పెద్దఱికమునకు, నాల్గవ పాదమున దివ్యత్వమునకు రాక్షసులు క్రమముగా నాతనితో కలహము లొనర్చుట కననగును. అనగా వారు తుచ్ఛ వైషయిక భోగములు మొదలుగ దివ్యత్వము వఱకును కోరిరన్నమాట! ఇట్టి నిగూఢ కళాకేళి మహాకవుల కావ్యములందే గోచరించును.

ఈ రీతిగా ప్రబంధ నిర్మాణమునందు సూరన కొన్ని నూతన మార్గముల నాదేశించినాఁ డనుటకు ఎట్టి సందేహమును లేదు. స్వభావమునకు సాధ్యమైనంత సమీపముగా కథను నడిపించుట, వర్ణనలొనర్చుట ఈ మహాకవికిష్టము, అమానుష వర్ణనములు, సన్నివేశముల మూలమున పాఠకులకు విశ్వాసమును చేకూర్చి యానందమును కలిగించుటకు దుర్ఘటమని సూరన గ్రహించుటచేతనే, పూర్వప్రబంధ మార్గములను సంపూర్ణముగా ననుకరింపక నవ్యరీతులలో తన కావ్యమున వర్ణనల సాగించినాఁడు.

ఈ వర్ణనములందు నవ్యత సార్థకతలతోఁ బాటుగ, నీ మహాకవి భావనాబలము, భాషాపాండిత్యము, ప్రకృతి పరిజ్ఞానము మొదలగు నట్టి గుణములు వెల్లడియగుచున్నవి.

ప్రథమాశ్వాసమునందు ద్వారకయందలి యగడ్తల వర్ణించుచుఁ జెప్పిన 'ఆలోల శైవాలజాలాలిత్యంబు జంగమోద్యానవేషము వహింప' ఇత్యాది వర్ణనము భావనాబలమును, వసుదేవుని యజ్ఞమును వర్ణించుచు చెప్పిన 'నిఖిల దేశాయాతనృపతి భూషాకర్పరేణు సంపోషిత క్షోణికంబు' అనునది భాషాపాండిత్యమును, 'ముగ్ధయగు ప్రభావతి ప్రియుని చిత్రమును తొలిసారిగ జూచునపుడు "చిత్తరువన్న నిశ్చయముచే నెదురుండి మొగంబు చూడ మోమెత్తును" ఇత్యాది ప్రకృతి పరిజ్ఞానమును వెల్లడించుచున్నవి. ఇందలి వర్ణనము లే మహాకవి వర్ణనములకును దీసిపోవునవి కావు.

## ప్రథమాశ్వాస ప్రాముఖ్యము

ప్రబంధకవులెవ్వరియందును కన్పట్టని కథానుసంధానశక్తి, భాషాశక్తి గల మహాకవి సూరనార్యుఁడు. ఈతఁడు తన పండబారిన వయసులో కృతిపతుల కోరికలనెడి బంధములనుండి విడివడి చెప్పిన కావ్యము ప్రభావతీప్రద్యుమ్నము.

కథావస్తువిషయమునను, కవితాసామర్థ్య నిరూపణము నందును నీ కావ్యము నందలి ప్రథమాశ్వాసము విశేషప్రాముఖ్యము వహించియున్నది.

ప్రభావతీప్రద్యుమ్న ప్రథమాశ్వాస ప్రాముఖ్య కారణములలో మొదటిది కథానుసంధాన గుణము. వజ్రనాభ రాక్షసవధ, ప్రభావతీప్రద్యుమ్నుల ప్రణయమునను రెండు కథల కడు సమర్థతతో ననుసంధించి, సూరనార్యుఁ డీ యాశ్వాసమున రెంటికిని బీజములను నాటి కొంత నడిపినాఁడు. ఇంద్ర నివేదనముచే వజ్రనాభవధ యనెడి దేవకార్యమున కుద్యుక్తుఁడైన శ్రీకృష్ణునకు ధూర్త బ్రహ్మచారి వాక్యము లుపశ్రుతి యగునట్లు కల్పించి, సూరన బీజావాప మొనర్చినాఁడు. ఇంద్ర శుచిముఖీ సంభాషణమునందు ప్రభావతిచే శివ వ్రాసి యిచ్చిన చెలువుని చిత్రపటమును తిలకింపఁజేసి ఆమెయెడ ననురాగబీజావాప మొనర్చినాఁడు.

ఈ ప్రథమాశ్వాసమునకు వైశిష్ట్యమును గల్పించిన రెండవయంశము కార్యకారణ పద్ధతితో కథ చెప్పుట. వజ్రనాభ స్వర్గజైత్రయాత్ర, ప్రభావతీస్వప్నవృత్తాంతములు పూర్వము జరిగిన యంశములు. కథ జెప్పుటలో మేటియైన సూరన, సందర్భము ననుసరించి ఉచితజ్ఞుఁడై యా పూర్వ వృత్తాంతములను చెప్పవలసిన యవసరము వచ్చినపుడు చెప్పించినాఁడు.

దృశ్య ప్రబంధ లక్షణములతో కథ నడుచుట ఈ ప్రథమాశ్వాస ప్రాముఖ్యమునకు మఱియొక హేతువు. మిగిలిన యాశ్వాసములందలి కథయును కొంతగా దృశ్య కావ్యమార్గమునే యనుసరించినను, నీ యాశ్వాసములో వలె నందు రూపకోచిత లక్షణములు విరివిగ కన్పట్టవు. ఇందు సూరన కథను ఒక మహానాటకకర్తవలె కొన్ని దృశ్యముల క్రింద విభజించి, ప్రతి దృశ్యమునందును పాత్రల ప్రవేశపెట్టి, వానిచే నుచిత సంభాషణముల చేయించి పాఠకులకు చదువునది యొక దృశ్యకావ్యమా యని యనిపించినాఁడు. ఈ యాశ్వాసమున దృశ్యములు ఒకదాని వెనుక నొకట వేగవేగముగా సాగిపోయినవి.

ఈ యాశ్వాసమున సూరనార్యుఁడు ప్రభావతీప్రద్యుమ్న కథయందలి ప్రధానపాత్రలైన ఇంద్ర కృష్ణ శుచిముఖి ప్రభావతీప్రద్యుమ్నుల ప్రవేశపెట్టి, ఆ యా పాత్రలతో పఠితకు పరిచయమును కలిగించినాఁడు. ఇందలి పాత్రలెల్ల విశిష్ట రూపరేఖలతోను, ఉచిత సంభాషణ వైచిత్ర్యములతోను నతిసహజములై కన్నులయెదుట నటియించునట్లు కన్పట్టును. ఇదియును ప్రథమాశ్వాసమునకు ప్రాముఖ్యమును గూర్చు నంశములలో నొకటి.

పాత్రలలో నెల్ల ప్రముఖమైనది శుచిముఖి. ఈ శుచిముఖి భారతమున శ్రీకృష్ణుఁడెంతటి పాత్రమును వహించినాఁడో, ప్రభావతీప్రద్యుమ్నమున నంతటి పాత్ర వహించినది, అట్టి పాత్రతో పాఠకులకు ఈ ప్రథమాశ్వాసమునందే పరిచయము కలిగించి దాని ధీగుణాది విశేషములతో సూరన దిగ్భ్రమను కల్పించినాఁడు. ప్రథమాశ్వాస ప్రాముఖ్యమునకు ఇదియొక హేతువు. మానసికస్థితి నిరూపణము కూడ నీ యాశ్వాసమునకు ప్రాముఖ్యము నొడగూర్చు నంశములలో నొకటై యొప్పుచున్నది. పాత్రల మనస్సులు ఆ యా సన్నివేశములందెట్లు వర్తించునో భావించి చిత్రించుటలో సూరన తిక్కనకు బిమ్మట పేర్కొనఁదగినవాఁడు. ఇంద్రుని మనోవృత్తిని, ప్రభావతి మనోవృత్తిని ఈ యాశ్వాసమున కడు రమణీయముగఁ జిత్రించినాఁడు. ఈ యంకమునకుఁ బ్రాముఖ్యమొసఁగు నంశములలో నిది యొకటి.

ఈ అంకమునకు గొప్పదనమును గూర్చు నంశములలో వాదమునందు, నిర్మాణమందును గల నైశిత్యము (logical Exactness of arguments and structure) మఱియొక యంశము.[3] ఇందుకు ఈ ఆశ్వాసమున ఉదాహరణమైనది శుచిముఖి ఇంద్రునితో వజ్రనాభవినాశనము సత్యమని నిరూపించుటకు చేసిన వాదము – (ఆ యింతి ప్రద్యుమ్నుజాయగా బలికిన గౌరి మాటకు బొంకు గలుగదనుము)

మరియొక విశేషము ప్రకృత్యనుకరణ మహిమ. ప్రియుని చిత్రపటమును జూచినపుడు ప్రభావతి యెట్లు వర్తించినదో సూరన 'తన చిత్తరువన్న నిశ్చయముచే' అను పద్యమున 'బహిఃప్రకృతికి నట్టె యెత్తిన చిత్తరువువలె' రచియించి చూపినాఁడు.

కవితావిషయికముగను నీ ప్రథమాశ్వాసమునకు విశేష ప్రాముఖ్యమున్నది. ఇందలి వర్ణనములు సమయోచితములు, సరసములు, సకారణములునై యొప్పుచున్నవి.

వీనియందలి నవ్యత, ప్రబంధజాతి వర్ణనములకును, వీనికిని గల విభేదములు నీ యాశ్వాసమునకు విశిష్టతను గలిగించుచున్నవి. భాషావిషయికముగను నీ యాశ్వాసమున కొక ప్రత్యేకత యున్నది. ఇందలి పాత్రలు అనేకములైన యంతరములలోనివారు. వారివారికి తగిన పాత్రోచితభాషను సూరన ఇందు వాడినాఁడు. ఎందును శబ్దసంస్కారము జారినట్లు కన్పడదు. పదమైత్రి అర్థసంపదలతో పొదలుచున్నది. అక్లిష్టత దీపితమగుచున్నది. వాక్యములు మహాకావ్య తాత్పర్యమున కొనరఁ బలికింపఁబడినవి.

ఇందు కొన్ని చక్కని నానుడులు, జాతీయములు, తెలుగు పలుకుబడులు కన్పట్టును. – ఆపోతర మేమి చెప్పననుఁ బూరికిఁ గైకొనక, మెఱియలవంటి రక్కసులు; పులి నోరికండ విడివడ్డ గతిన్; తలనిండగ నర్థము పోసితేని; ఓడలు బండ్లవచ్చు; పేనుగ్రుక్కిన పాటిగా; పోతుటీగకున్ పొలయగరాని చోట; చిచ్చులేక చిముడు మచ్చురీడు – ఈ యాశ్వాసమునకు విశిష్టత చేకూర్చిన యంశములలో నొకటి. ఇట్టి గుణవిశేషములతో నీ ప్రభావతీప్రద్యుమ్నమునందలి ప్రథమాశ్వాసము మిగిలిన వానికంటె విశిష్టమైనదై, 'తెలుగు భారతి'కి కొత్త పోకడలదిద్ది, యుగకర్తలైనవారిలో నొక స్థానమును సంపాదించిన సూరనార్యుని కళాప్రతిభయను సువర్ణమునందలి మచ్చుతునకయై యొప్పుచున్నది.

## ప్రభావతీప్రద్యుమ్నము – దృశ్యప్రబంధ లక్షణములు

కవిబ్రహ్మ తిక్కన సోమయాజి భారతమున ననేక ఘట్టములను నాటకోచితరీతిలో నడిపినాఁడు. అతనికి పరోక్షశిష్యుఁడైన పింగళి సూరనకు నీ నాటకరీతిపై అభిమానము విశేషము. కాని ఈతఁడు తన కళాపూర్ణోదయకావ్యమున నీ నాటకోచితరీతికి విశేష ప్రాముఖ్యము నీయలేదు. ప్రభావతీప్రద్యుమ్నమున నీ కవితారీతిని మేటిగ ప్రదర్శించినాఁడు. విమర్శకులును నీ యభిప్రాయముతో పూర్తిగ

నేకీభవించుచున్నారు. ప్రభావతీప్రద్యుమ్న పీఠికాకర్త ఈ యంశమును గూర్చి ఇట్లు వ్రాసిరి.

"ఈతఁడు (పింగళి సూరన) రాఘవపాండవీయము వ్రాసి తన పాండిత్యప్రకర్షను గనుపరచినాఁడు. కళాపూర్ణోదయమును వ్రాసి తన కల్పనాచాతుర్యమును కథాచమత్కారమును వెలయఁజేసినాఁడు. రెండింటియందును గూడ దృశ్య ప్రబంధము నందుండదగిన లక్షణములు విశేషముగ లేవు. అట్టి కొఱంత బాపఁదలంచి ఈ శ్రవ్య ప్రబంధముననె దృశ్యప్రబంధ లక్షణము లన్నియుఁ బుట్టించి నాటక పాత్రములన్నియు నెదుటకు వచ్చి నటించినట్టు లీ గ్రంథమును రచించినాఁడు. ఈ ప్రభావతీ ప్రద్యుమ్నమున విశేషభాగము సంభాషణ వైచిత్ర్యమే. ఆ పట్టుల మనము శ్రద్ధతోఁ బరిశీలించి చదివితిమేని, దృశ్యప్రబంధ లక్షణములెంతవఱ కిందిమిడి యున్నవో తేటతెల్లముగాఁ గలదు. ఇందీతఁడు నెలకొల్పిన రంగస్థలముల జాగరూకతతో విడదీసి మధ్యమధ్య సందర్భములను విష్కంభరూపమున నమర్చుకొని కొలది మార్పులు గావించుకొనినచో, నిది యొక చక్కని నాటకమగును." (శ్రీ తల్లాప్రగడ)

పింగళి సూరనార్యుని గూర్చి ఆంగ్లభాషలో విమర్శ గ్రంథమును వ్రాసిన శ్రీ టేకుమళ్ళ అచ్యుతరావుగారును ప్రభావతీప్రద్యుమ్నమునందు దృశ్యలక్షణము లున్నవని భావించినారు.[4]

శ్రీ టేకుమళ్ళవారు చెప్పినట్లు ప్రబంధములందు దృశ్యకావ్య లక్షణములను బ్రవేశపెట్టిన మహనీయుఁడు పింగళి సూరన.

ఈ దృశ్యకావ్య లక్షణములేమో ఈతని ప్రభావతీప్రద్యుమ్నము ప్రథమాశ్వాసమును తిలకించి పరిశీలింతుము. నాటకములందెట్లు పాత్రల సంభాషణ మూలమున పూర్వము జరిగిపోయిన కథ వెల్లడియగునో, యిందును నట్లే ఇంద్రోపేంద్రుల సంభాషణము మూలమున వజ్రనాభ దుర్ణయములు, ఇంద్ర శుచిముఖి సంభాషణము మూలమున ప్రభావతీ స్వప్న – స్వప్నానంతర సన్నివేశములు తెలియవచ్చుచున్నవి.

ఈ ప్రథమాశ్వాసమంతయును కొన్ని రంగములవలె కన్పట్టును. ఇందు తొలుత కన్పించు 'ధాత్రి మహాదేవి... వెఱగుపడగ' అన్న పద్యము సూత్రధారవాక్యముగ స్వీకరింపఁదగియున్నది. పిమ్మట మాతలి ఇంద్రునకు ద్వారకానగరమును వర్ణించి చూపు దృశ్యము సహజ మనోజ్ఞమై యొక స్వగతము (Monologue) వలె నున్నది.

ఇందు ఇంద్రుఁడు కేవలము వినువాఁడు. ఆంగ్ల భాషలోని బ్రౌనింగ్ మహాకవి వ్రాసిన నాటకీయ స్వగతములు (Dramatic Monologues) ఇదే రీతిగ నడుచును. పిమ్మట రంగస్థలము ద్వారక. ఇంద్రుఁడు తన నిర్వేదమును శ్రీకృష్ణున కెఱిగించును. ఇదియొక దీర్ఘ సంభాషణము. ఇంద్రుని సంభాషణానంతరము శ్రీకృష్ణుఁడు సంభాషించును. ఇట కృష్ణుఁడు తన సంభాషణ మారంభించుటకు పూర్వము ఇంద్రుఁడు "నిన్నే కొల్చియుండెద" అని చెప్పిన మాట వినిన వెంటనే 'కర్ణంబులు మూసికొని' నట్లు సూరన చెప్పినాఁడు. ఇది రంగసూచిక (Stage Direction) వలె నున్నది.

తఱువాతిరంగము బ్రహ్మచారి, భద్రనటవృత్తాంతము. ఇది యంకమున నొక చిన్న హాస్యదృశ్యమువలె నొప్పుచున్నది. తరువాతి దృశ్యము స్వర్గమునందు. ఇంద్రుఁడు తొలుత హంసలతో సంభాషించును. శుచిముఖి వల్లభునితో నతడు సంభాషించుచుండ, నతఁడు తన భార్యయైన శుచిముఖిని ప్రవేశపెట్టి తప్పుకొనినాఁడు. శుచిముఖి ఇంద్రునితో దీర్ఘోపన్యాస మిచ్చినది.

ఈ ఆశ్వాసమునందలి దృశ్యములలోని సంభాషణములను పరిశీలింపగా శైలి నాటకీయము వాక్యరచనాదులు నాటకోచితములు. కాని సంభాషణము నాటకములందువలె వెంట వెంటనే పాత్రనుండి పాత్రకు మారుట గోచరింపదు. ఇందలి సంభాషణమును స్వల్పమగు మార్పులొనర్చి రంగస్థలమున బ్రదర్శించుట కవకాశమున్నదా యను ప్రశ్నకు లేదనియే సమాధానము చెప్పవచ్చును. కావున మనము సూరనార్యుని దృశ్య ప్రబంధ లక్షణములు కేవలము సంభాషణ యందలి వాక్యగమనమునకు, రంగస్థలవిభాగములకు కొన్ని రంగసూచికలకు మాత్రమే పరిమితముగాని కొలది మార్పులతో రంగస్థలమున బ్రవేశపెట్టుటకు యోగ్యములైనవని భావింపరాదు. అనగా చదువునపుడు కావ్యమున దృశ్యప్రబంధములందువలె పాత్రలు కంటి యెదుట కన్పట్టి సంభాషణాదుల నెఱపుటయేగాని, సూరన రచనను ఉన్నదున్నట్లుగాగాని, కొలది మార్పులతో గాని రంగస్థలమున నభినయింపనగునని కాదు.

## సూరన స్థానము

### పాత్రపోషణము

స్వీకరించిన కథలోని పాత్రలను భావనాబలముచే దర్శించి, వానికి తగిన రూపరేఖల కల్పించుకొని, వానిచే నుచితరీతిని అంతరములకు, మనోవృత్తులకు అనుగుణముగ నాయా సన్నివేశములసంభాషణచేష్టాదికములను జేయించుచు, నా

పాత్రలను సజీవమూర్తులునుగా నొనర్పజాలిన శక్తి అపురూపమైనది. అది కొందఱు మహాకవులకు మాత్రమే కరతలామలకమైన కమనీయ విద్య. అట్టి మహాకవులలో ఆంధ్ర సాహిత్యమున ప్రథమస్థాన మలంకరించి రసికలోకముల జోహారు లందుకొనజాలిన మేటి కవీశ్వరుఁడు కవిబ్రహ్మ తిక్కన సోమయాజి. సూరనార్యునిది ద్వితీయ స్థానము. ఈ మహాకవి పాత్రలును భారతమునందలి పాత్రలవలె నాయా సన్నివేశములందు సమయోచితరూప భాషాచేష్టాదికములతో వర్తించి పాఠకులకు మనోమోద మొడగూర్చుచున్నవి.

ఆంధ్రసాహిత్యమున తిక్కన భారతమునందలి పాత్రల దూరముగా నుంచిన పిమ్మట, అల్లసానివాని ప్రవర వరూథినులు, తిమ్మనార్యుని సత్య, పింగళి సూర్యనార్యుని కళాపూర్ణోదయములోని కలభాషిణి, సుగాత్రీశాలీనులు నిట్టి జీవమయమూర్తులు.

ప్రభావతీప్రద్యుమ్నమునందును పింగళి సూరన తన లేఖనీసామర్థ్యము మెఱయగా సజీవమూర్తులఁ గొన్నింటి చిత్రించినాఁడు. అట్టివానిలో ప్రథమాశ్వాసమున విశేష ప్రాముఖ్యమును గైకొనినవి ఇంద్ర శుచిముఖీప్రభావతుల పాత్రలు.

**ఇంద్రుఁడు**

సూరనార్యుఁడు ఇంద్రుని, యాతని గురువైన బృహస్పతిచే సుశిక్షితుఁడైన రాజనీతిజ్ఞునిగను, సమయాసమయజ్ఞునిగను, సంభాషణచతురునిగను, పరేంగితజ్ఞునిగను, కార్యదక్షునిగను చిత్రించి, యా పాత్రపై పాఠకులకు ఆదర గౌరవములు కలుగునట్లొనర్చినాఁడు.

వజ్రనాభ రాక్షసుఁడు స్వర్గముపై దండెత్తి వచ్చి యల్లకల్లోలమొనర్చి, యెట్లో ఇంద్రుని నీతినిపుణత కారణముగ కొంతకాలము స్వర్గాధికారమును స్వీకరించుట కోర్చియుందునని తిరిగి వజ్రపురమునకేగగా, మఱల నాతఁడెపుడు పై బడునో యను భయముచే రాక్షసాపాయమునకుఁ దగిన ప్రతిచర్య నొనర్చు నుద్దేశముతో ద్వారకకు వచ్చుటతో, నింద్రుఁడు కథలో ప్రవేశించినాఁడు. వజ్రనాభపీడవలన వ్యథితమైన యాతని మనసునకు ద్వారకానగర సౌందర్యమాహ్లాదమును గూర్చుటయే గాక, అబ్బురమును గల్గించినది.

ఇతఁడు తన రథసారథియైన మాతలితో నాయా వస్తువులను సందర్శించుచు సమయోచిత సంభాషణ లొనర్చి, మనసునకు గొంత సంతోషమును జేకూర్చుకొనినాఁడు.

ద్వారకానగర మెట్లు తన కాశ్చర్య మొనగూర్చి యానందమును కల్పించినదో, యట్లే తానేగుచున్న పనికిని శ్రీకృష్ణుని యంగీకార సహకారములు లభించి శుభము ప్రాప్తించునను నాశ యతనికి ద్యోతకమైయుండును.

ఇంద్రుఁడు త్రిలోకాధిపతి. సర్వైశ్వర్యసంపన్నుఁడు. మహాభోగి, రసికుఁడు. వజ్రనాభుఁడు తన సైన్యములను నందనవనములో విడియించినపుడు, వా రా వనమున కొనర్చిన కష్టపుపాటును జూచి ఆతని రసిక హృదయము పరితపించి పోయినది. ఈ రాక్షస దండయాత్రాకాలమున ముల్లోకములను శాసించు నీ ప్రభువతంసుఁడు ఎంతగనో మానసిక బాధ నొందినాఁడు. శ్రీకృష్ణునకు నాఁటి తన మానసిక స్థితిని నివేదించుచు రాక్షసులు తిండికి, కామమునకు, పెద్దఱికమునకు, దివ్యత్వమునకు తనతో తగాదా పడినపుడు,

తే. "పంకరుహనాభ! యేఁబడ్డ పాటులరయ
నెందు నెవ్వరుఁ బడరు నీకేమి చెప్ప?
'నెంత పాపంబు చేసిన జంతువొక్కొ
యింద్రుఁ డగు' నని యపుడాత్మ నెన్నుకొంటి." (1–78)

అని తెలిపినాఁడు. ఈ సందర్భమున ఇంద్రుఁడు దయనీయుఁడై శ్రీకృష్ణుని హృదయము నాకర్షింపగలిగి యొప్పుచున్నాఁడు.

ఇంద్రుఁడు పరేంగితజ్ఞుఁడు. తామసప్రవృత్తి గల వజ్రనాభుని హృదయము నాతఁడు గ్రహించినాఁడు. ఆ చండ దానవునితో నెట్లు పలికిన నాతని మనసున కెక్కునో గ్రహించినాఁడు. గురుభక్తితత్పరుఁడును, నీతిశాస్త్రనిపుణుఁడును, బృహస్పతిచే శిక్షితమైన వాగ్వైచిత్రి గల యీతఁడు ఆ రాక్షసునితో –

తే. "అక్క సెలియండ్ర సంతానమైన యట్టి
మనకు మనలోన నింత దుర్మత్సరంబు
వలదు మా పల్కు నీవు నీ పల్కు మేముఁ
జేసి బ్రతుకుట మేలు..." (1–76)

అని సోదరభావమును నటియించి వానిని 'శాంతసంరంభుని' గావించినాఁడు. రెండవ మారు మఱల నుద్ధతుఁడై వాఁడు తన యగ్రసింహాసనము నాక్రమింపగా, శాంతమును నటించి –

ఆ.వె. "నిగ్రహముల కేమి నీవును మేము న
న్యోన్యమైత్రిఁ బొదలునట్టి తెఱఁగు
నడపవలయుఁగాక యడసి పోనాడుకోఁ
దడవె వేగిరింపఁ దగునె యనఘ?" (1-89)

అని పలికి, వానిని కశ్యపునొద్దకు గొనిపోయి తగిన మాటలు జెప్పించి పంపి, బయట బడినాఁడు. పెనుచేటు తప్పినదని తాత్కాలికముగ నెంత సంతసించినను నాతనికి వజ్రనాభరాక్షసభయము వదలలేదు.

ఇంద్రుఁడు సంభాషణచతురుఁడు. తనకంటె నధికుఁడును లీలామానుష విగ్రహుఁడును నైన శ్రీకృష్ణునితో నీతఁడు సంభాషించునపుడు తన వాక్చాతుర్యమును ప్రదర్శించినాఁడు. తొలుత నాతఁడు కుశల మడిగినపుడు 'అఖిలవిదుఁడవు నీ వెఱుఁగని యదియుఁ గలదె' యని కృష్ణునిపై తన గౌరవమును ప్రదర్శించి, వజ్రనాభ వృత్తాంతమును దెలిపి పిమ్మట –

ఉ. "వారిజనేత్ర! యేనిపుడు వచ్చుచునుండి యలౌకికాద్భుత
శ్రీరుచిర త్వదీయ నగరీగరి మాతిశయావలోక లీ
లారసదూర ధూత సకల వ్యథచిత్తుఁడనై యథాపురా
కారత నీకుఁ దోచెదనొ కాని తనుద్యుతిఁ బాసితిం జుమీ!" (1-79)

అని పలికి, శ్రీకృష్ణహృదయమును తనపై కరుణకు నిలయమును గావించుకొనినాఁడు. వజ్రనాభుఁడు తన యగ్రమహాసనము బలిమిమై నాక్రమించిన వృత్తాంతమును దెలుపుచు, వాఁడు మఱల నెపుడు దండెత్తునో యని పలికి శ్రీకృష్ణునితో నాతఁడు 'సురపట్టణ రాజ్యసుఖాశ యేర్పడ న్విడిచితి నింక తలనిండగ నర్ఘము వోసితేని నేనడుగటుపెట్టగా వెఱతు నచ్యుత నిన్నునె కొల్చియుండెదన్" అనినాఁడు.

ఇందు ఇంద్రుని సమయోచిత సంభాషణము పరాకాష్ఠ నందుకొని కన్పించుచున్నది. ఇక కృష్ణుఁడు ఇంద్రునుపలాలించి సాయమొనర్తునని ప్రతిన యొనర్చుకుండు టెట్లు?

హంసలతో నింద్రుఁ డొనర్చిన సంభాషణము కూడ నాతని సముచిత సంభాషణ ప్రావీణ్యమును వెల్లడించుచున్నది. ఆ హంసలతో నతఁడు కార్యతత్పరబుద్ధియై సంభాషించినాఁడు. అతని సంభాషణమున పని చేయించుకొను నేర్పు విశేషముగా గోచరించుచున్నది. ఇట ఇంద్రుఁడు 'మీ విహారములారయ నేరికి నతి ప్రియంబులు

కావే' అని పలికి, వాని ప్రత్యేకతను గమనించినవానివలె కన్పట్టి, వానికుత్సాహము గల్పించినాఁడు. ఇట్టి ప్రభువునకు హంసలు తోడ్పడకుండుటెట్లు? ఈ రీతిగ సూరనార్యుఁడు ఇంద్రుని మనోజ్ఞముగ చిత్రించి తాఁ దలపెట్టిన వజ్రనాభ వధయనెడి కృత్యమును తప్పక నెఱవేర్చుకొనగల సమర్థునిగ ప్రథమాశ్వాసమున ప్రదర్శించినాఁడు.

**శుచిముఖి**

ప్రభావతీప్రద్యుమ్నమునందలి పాత్రములకన్నింటికిని నాయకమణి శుచిముఖి. ఈ పాత్రమును సూరనార్యుఁడు భారతమునందలి శ్రీకృష్ణపాత్రముతోఁ దుల్యముగ చిత్రించినాఁడు. ఈ పాత్రము యొక్క గుణాగుణములను విమర్శించితిమేని కవి యొక్క అపార శాస్త్రసాంగత్యము, పాండితీవిలసనము, రాజకీయకార్య ధౌరంధర్యము, సమయోచిత సంభాషణవిశేషము, కార్య సంధానవిధానతత్పరత, స్వామిభక్తి, వినయ విధేయతలు మొదలగు సల్లక్షణములు గోచరించును. దీనికి సర్వవిషయమున నాకళింపు విశేషము.

శుచిముఖి ధీశక్తి యనంతమైనది. మంత్రికుండవలసిన లక్షణములన్నియు దీనికడనున్నవి. దీని సమయజ్ఞత, సముచిత సంభాషణరీతులు, సద్యఃస్ఫూర్తి, ఆశ్చర్యజనకములు. బృహస్పతికిఁ దోచని విజయోపాయములు శుచిముఖికి స్ఫురించినవి.

ఇంద్రోపేంద్రులు మార్గమును మాత్రమే సూచించిరి గాని, కార్యము జరుగు నుపాయముల నన్నింటిని శుచిముఖియే యూహించినది. దాని చతురతా విశేషములు వర్ణనాతీతములు. ఇట్టి పాత్ర సూరనార్యుని పునఃసృష్టి మూలముననున్నది. ఇట్టి గుణవిశేషములతో నొప్పునిది రాజహంస కాదు; కేవలమొక పక్షి. సూరనార్యుఁడు శుచిముఖిని మహత్తర ప్రజ్ఞామూర్తిగ సృజించి పాత్రోన్మీలనము మూలమున తన కీర్తిని చిరస్థాయి యొనర్చుకొనినాఁడు.

ఒక పాశ్చాత్య విమర్శకురాలు స్త్రీ పాత్రలను ప్రేమమూర్తులు (Characters of Love), ప్రజ్ఞామూర్తులు అని రెండు రీతుల విభజించినది. ఈ దృష్టితో పరిశీలించిన శుచిముఖి ప్రజ్ఞామూర్తి – (శ్రీ పింగళి). ఈ శుచిముఖి పాత్రమునందు స్తుతియోగ్యములైన విషయములను, తన సృష్టి తనకే మోహము కలిగెనేమో, మహాకవి సూరనయే ఇట్లు తెలిపినాఁడు.

చ. “శుచిముఖి యంద్రు దానిని; వచోనిపుణత్వమునందు, సత్కథా
రచనలయందు, నీతి విదురత్వమునందు, బహుశ్రవావలో
కచణతయందు, నెందు సరిగానము దానికి; వేయు నేల దా
నిచతురతావిశేషములు నీవ కనన్వలయున్ మహాత్మకా!” (4-57)

వజ్రపురి విశేషములెట్లు తెలియగలవా యని యోజించుచు, హంసలు చారవృత్తికి యోగ్యమైనవని గమనించి, వానిని పిలిపించి యింద్రుఁడు ప్రసంగించుచుండగా శుచిముఖి కథలో ప్రవేశించినది. శుచిముఖి తానై ప్రవేశించలేదు.

‘వేడుకొనక నే పనికిని నియ్యకొను’ స్వభావ మీ రాజహంసికి లేదు. భర్తయే అది తనకు తెలిపిన వజ్రనాభుని రాజ్యావసానసామీప్యమును ఇంద్రునికి నివేదింపుమనఁగా, కథలో ప్రవేశించినది. తన్ను ప్రవేశపెట్టి వార్తలఁ జెప్పుమని కోరిన భర్త కార్య మా త్రిలోకాధిపతి ఇంద్రునిది.

కావున శుచిముఖి తన ప్రజ్ఞావిశేషములను బ్రదర్శించుకొనుటకుఁ జక్కని యవకాశము లభించినది. సంభాషణ నారంభించినది మొదలు తన వాణీరామణీయకమును, కార్య కామనీయకమును జోడించి ప్రసంగించినది.

శుచిముఖి కుశాగ్రబుద్ధి, తన సంచారమును గూర్చి ఇంద్రునికి సందేహము కలుగవచ్చునని ముందే యూహించినది. రాజనీతిజ్ఞత మెఱయఁగా “మేము విపక్షులము గాము పక్షులము. కావున మా రాక్షసదేశమందలి సంచారములు చెల్లును” అని సమర్థించుచు పలికినది. అయినను ఇంద్రునకు నమ్మకము పుట్టునో లేదో యని, జాలి కలుగునట్లు తాము వజ్రనాభుఁడు సర్వనలిన జాతులను అతని కేళీదీర్ఘికలందు నాటించుటచే మేతకై పోవలసివచ్చినదని చెప్పినది. ఈ రీతిగ తన స్థితిని తాను సమర్థించుకొని, పిమ్మట శుచిముఖి ఇంద్రునకు ప్రభావతీస్వప్నకథ చెప్ప నారంభించినది.

శుచిముఖి కథాకథనమున మేటి. కథ చెప్పు నేర్పు నెవరైన దానికడ నేర్చుకొనవలయును, ఏది యెంతవరకవసరమో యంతవరకే యది చెప్పును. ఇంద్రునకు స్వప్నకథను తెలుపునపుడు శుచిముఖి తా జెప్పుచున్న కథ ఇంద్ర కార్యోపయోగియని గమనించినది. దాని బుద్ధి చొరని చోటు లేకపోవుటయే ఇందుకు కారణము.

స్త్రీని గదాయని రాజకీయములతో నాకేల యని దూరముగ నుండలేదు. ఇంద్రుఁడు వజ్రనాభుని శిక్షించుటకై యత్నములొనర్చుచున్న సంగతిని గమనించినదగుటచేతనే, ప్రభావతికి పార్వతి కలలో వచ్చి చిత్రపటమిచ్చి పలికిన వాక్యములతో గూడ వెనువెంటనే సంగ్రహముగా తెలిపి, తాను వజ్రనాభుని కాలము చేరువైనట్లు నిశ్చయించితి నని పలికినది. తఱువాత దానిని వివరించి తనయూహ నిశ్చయమని, సందేహమునకు తావులేదని నిరూపించుటకు పలికిన –

సీ. "ఆ యింతి బ్రద్యుమ్ను జాయగాఁ బలికిన
గౌరి మాటకు బొంకు గలుగదనుము
దనుజవిరోధి పుత్త్రునకు నా దుష్ట దై
త్యుఁడు తనంతఁదనూజ నొసఁగఁడనుము,
ప్రద్యుమ్నుఁడట్లు ప్రభావతీ పతియైన
దానవునకుఁ బోరు తప్పదనుము,
వజ్రపురము ప్రభావతి కొడుకేలుట
యసురకు జయమైనఁ బొసఁగదనుము,

తే. చిత్రఫలకంబు ప్రత్యక్ష సిద్ధమగుటఁ
జేసి, యా కల యధిక విశ్వాస యోగ్య;
మదియు వేకువ కావున నచిరభావి
ఫలము దేవేంద్ర! నీవెంచి దెలిసికొనుము." (1–128)

అను వాక్యముల వలన శుచిముఖి బుద్ధిబలము, విషయ నిబర్హణశక్తి, తార్కిక ప్రతిభ, భావనాబలము వెల్లడియగుచున్నవి.

ప్రయోజనకారియైన యొక వృత్తాంతము నితరులకు తెలుపునపుడందలి వ్యక్తుల సంభాషణలు యథాతథముగను చెప్పుట యవసరము. వారి యభినయ విశేషములను గూడ కడు జాగరూకతతో తెలియపరచవలయును. శుచిముఖి యీ రహస్యమును గుర్తించినదగుట వలననే ప్రభావతికిని, చెలికత్తెకును జరిగిన సంభాషణమును యథాతథముగ చెప్పినది.

చిత్తరువును చూచునపుడు వారిరువురి చేష్టలను – ప్రధానముగ ప్రభావతి చేష్టలను, మనోజ్ఞముగ కన్నుల కట్టునట్లు వర్ణించినది. ఇట్లొనర్చుటలో నుద్దేశము ప్రభావతి ప్రద్యుమ్నుని యెడ గాఢచిత్తయైనయది యనియును, నామెకు చెలికత్తె

ప్రద్యుమ్నుని గొనివచ్చుటకు, వజ్రనాభుని వలని బాధలకైన వెఱువక, తోడ్పడుననియు నింద్రునకు సూచించుటయే.

ఈ యంశమును తుదకు స్పష్టముగను తెలియజేసినది. 'ప్రద్యుమ్ను శీఘ్రయానంబునకు నుద్యోగంబు తద్దయుఁ జేయుట సంభావితంబు' అనియును, 'ఇది దేవకార్యంబునకు నుపకారంబును వోలెఁ దోచుచున్నది' అనియును పలికినది.

ఇంతటి బుద్ధికుశలత, వచన రచనావిచక్షణత్వము, విషయ పరిజ్ఞానములతో శుచిముఖి యింద్రునితో సంభాషింప నతఁడు మెచ్చుకొనకయుండుటెట్లు? శుచిముఖి నాతఁడు 'నీవు విహంగయోషవు కావు. నీ సంభాషణమందలి భాషాప్రావీణ్యము చూడఁగా వాగ్దేవతవో లేక నాకె దిద్దిన కవివో' యని ప్రశ్నించినాఁడు.

శుచిముఖి సంభాషణము నందలి శబ్దసంస్కారమును పదమైత్రిని అక్లిష్టతను; పునరుక్తి దోషరహితతను ప్రకృతార్థభావమును పాదుకొనునట్లు పలుకుటయు, ఉపపత్తిని అత్యూర్జితముగ వాడకుండుటయు, పూర్వోత్తర విరోధములు లేకుండ పలుకుటయు మొదలగు గుణములను ప్రశంసించినాఁడు. ఈ శుచిముఖి ఇంద్రునకు ప్రథమాశ్వాసమున తన కార్యసాధనమున కొక యాశాజ్యోతియై కన్పట్టినది. శుచిముఖి కథారంగమున ప్రవేశించినది. ఇంద్రోపేంద్రు లిరువురును ప్రక్కకు ఒత్తిగిలిరి.

**ప్రభావతి**

ప్రభావతీప్రద్యుమ్నము నందు శుచిముఖి అద్భుతమును ప్రదర్శించు స్త్రీ పాత్ర అయినచో ప్రభావతి సరసమైన పాత్ర. ఈమె సహజ సౌందర్య సౌకుమార్యాది సద్గుణములు మూర్తీభవించిన కన్య, ఈమె పాత్రను చిత్రించుటయందు కవి తన సామర్థ్యము నణుమాత్రమైన సడలింపలేదు. ప్రభావతి సూరన చిత్రించిన ప్రేమమూర్తి (Character of Love).

నేటి విమర్శకులలో నొక తెగవారు ఈ ప్రభావతిపాత్రమును విమర్శించిరి. శ్రీ కట్టమంచివారి 'కవిత్వ తత్త్వ విచారమున' నొకచోట 'ఇఁక ప్రభావతియన్ననో నాకు జూడ నెంతయు నసహ్యరాలు' (పు. 103) అని వ్రాసియున్నారు. వీరికి పాశ్చాత్యనాయికలపై నభిమానము మెండు. పాశ్చాత్యసాహిత్యమున సర్వసామాన్యముగ గోచరించు స్త్రీ పాత్రల బోలిన కళాపూర్ణోదయమునందలి కలభాషిణిపై వీరికభిమానము విశేషము.

ప్రభావతి పట్ల వీరొనర్చిన విమర్శనము విశేషముగ పాటింపదగినది గాదు. ప్రభావతి యందు భారతీయ స్త్రీజాతి సుగుణములన్నియు వ్యక్తములగుచున్నవి.

ప్రభావతి దానవరాజపుత్రి. తండ్రి యామెను 'ఒక పోతుటీగ యైన పొలయగ రాని యంతఃపురమున' పెంచినాఁడు. అయినను నతఁడు సామాన్యదానవుఁడు కాఁడు. జైత్రయాత్ర వెడలి తన సైన్యముల నందనవనమునందు విడియించిన సమయోచితమగు సైనిక కర్కశత్వ మాతని యందు గోచరించినను, నతఁడు సమస్త సరోవరములందలి యుత్తమ నన జాతుల నెల్లనేర్చి తన కేళీదీర్ఘికల నలంకరించుకొనిన రసికుఁడు. అట్టివాని పుత్రికయగు నీమెకును సౌందర్యాభిమానము సహజగుణమై యొప్పియున్నది.

ప్రభావతి పార్వతివరమునఁ బుట్టినది. ఆమె యొక నోముల పంటగా భావింపఁబడినది. భక్తితాత్పర్యములతో పార్వతి నీమె కొలుచుటచే నా యగజ ఈమెపై నభిమానముగొని యనుగ్రహించి, రూపసౌందర్యాదికముల తుల్యుఁడగు ప్రియుని నిర్ణయించి చిత్రఫలకమున వ్రాసి యిచ్చినది. ఇంక నామె యదృష్టవతి యని చెప్పవలసిన పని లేదు.

ప్రభావతి పసిబిడ్డలవంటి తత్త్వముగలది. సహజోద్వేగము ఆమె లక్షణము. శివ వ్రాసి ఇచ్చిన చిత్రఫలకము నందలి ప్రియుని చూచిన తత్క్షణమే ముగ్ధయై యాతనికి తన హృదయము నిచ్చినది. అందలి మూర్తి యెవరో, యే జాతివాఁడో, తన తండ్రికి శత్రుమిత్ర వంశములలో దేనికి చెందినవాఁడో నిలకడగా నాలోచించి తన హృదయమియ్యవలె ననెడు బుద్ధి యామెకు కలుగనే లేదు. తండ్రికి జెప్పక నీతని ప్రేమించిన చిచ్చులేక చిముడు మచ్చరీఁడగు తండ్రి యేమొనర్చునో యన్న భయము గూడ నామెకు కలుగలేదు. ప్రణయము భయ వంశ గౌరవాదులకు అతీతమైనది కదా!

ప్రియుని చిత్రపటమును తొలుత అభిముఖియై ప్రభావతి చూడలేకపోయినది. ఇందులకు ఆమె సహజ ముగ్ధత్వము కారణము. కలకల నవ్వినట్లుగను, తెలికన్నుల నిక్కముగ చూచినట్లును, పలుకుటకు పూనుకొనినట్లును, భావగంభీరత లబ్బినట్లును, శివ వ్రాసి ఇచ్చిన చిత్రపటమందలి ప్రియుని, ఆశ్చర్యతర రూపలావణ్య గాంభీర్య శౌర్యాది గుణములచే నతిశయించు యువకుని ప్రథమదర్శనవేళనే చూచుటకు ఆమెకు పాశ్చాత్య సాహిత్యమందలి నాయికలకు వలె బహుపురుష పూర్వపరిచయము లేదు.

ప్రియుని అపురూపసౌందర్య మామె నాకర్షించినది. ఈమెపట్ల 'కన్యా వరయతే రూపం' అన్న ఆర్యోక్తి సార్థకమైనది. ప్రభావతికి ప్రద్యుమ్నునిపై నభిమానము కలిగినది. ఆమెయును సుందరియే. తొలుత నామెకును తన సౌందర్యముపై గాఢాభిమానగర్వ ముండియుండెను. భర్తృసౌందర్య మామెనాకర్షించిన పిమ్మట నది తొలగియుండును. కావుననే 'ఇచ్చెలువంబు గల్గు ఘనుఁ డెక్కడనే నొకఁడుండెనేని నేఁ దచ్చరణ ద్వయంబునకు దాస్య మొనర్పఁగ నైన నర్హనే' అని సఖితో బల్కినది. తన అనురాగము నిల్చినచోటున నామె సౌందర్యాభిమానగర్వములు తొలగిన వన్నమాట! ఇంత విస్పష్టముగ తన యనురాగమును చెలికత్తెయగు రాగవల్లరికి వ్యక్తము చేయగా, నా ప్రణయసఖి యామెను కాదనుటెట్లు? ఆమె ప్రియుని తప్పక కొనితెచ్చుటకు తగిన యుద్యోగమొనర్చును గదా!

ఈ రీతిగ ప్రథమాశ్వాసమందు ప్రభావతి కోమలహృదయగను, నవానురాగయైన ముగ్ధగను, ప్రణయోద్వేగగను కన్పట్టుచున్నది. తన మహాకావ్య తాత్పర్యార్థమునకు ఎట్టి భంగమును కలుగని రీతిగ, పింగళి సూర్యనార్యుఁడు పాత్రల కుచితవేష భాషాచేష్టాదికములొసఁగి వానిని జీవమయమూర్తులుగ చిత్రించి తన కళాప్రతిభలఁ బ్రదర్శించినాఁడు.

★

**అధఃసూచిక**

1. రాఘవపాండవీయమనెడి యీ భాషాకావ్యమును కళాపూర్ణోదయ కృతిపతి యిట్లు ప్రశంసించినాఁడు:

   మ. "ఇటమున్ గారుడ సంహితాదికృతు లీ వింపొందఁగా బెక్కొన
   ర్చుట విన్నారము చెప్పనేలయని, సంస్తుత్యోభయ శ్లేష సం
   ఘటనన్ రాఘవ పాండవీయ కృతి శక్యంబే రచింపంగ నె
   చ్చట నెవ్వారికి? నీక చెల్లెనది భాషా కావ్యముం జేయఁగన్."

2. కళాపూర్ణోదయంలో కనిపించే కల్పనాప్రతిభ ప్రభావతిలో లేదు. ప్రభావతీ ప్రద్యుమ్నం ఇతర కావ్యాలలోనుంచి సందర్భాలనుంచి యాదృచ్ఛికంగా అనాలోచితంగా కవి ఏర్చిన అతుకుల బొంతగ నాకు కనబడుతున్నది. (చిలుకూరి నారాయణరావు - భారతి, వృష, శ్రావణము)

'ప్రభావతీప్రద్యుమ్నము రచనావిషయమున కళాపూర్ణోదయమున కన్న మిన్నఁగాని బహుశః కవి వయసు ముదిరినవాఁడైనందువలన రాగములు కృశించె గాబోలు. భావనాశక్తి కొరవడినది. కళాపూర్ణోదయమునందు గల నూతన కల్పన లిందులేవు' (కట్టమంచి – కళాపూర్ణోదయ పీఠిక).

3. ''Another outstanding merit of this poem is the logical exactness of its argument and structure. The relationship of cause and effect has been maintained both in measure and quality and little or nothing is left to freak or accident. The element of blind chance has, practically speaking, no chance in this poem. For every incident, great or small, the cause can be sought for in the poem itself. No link is left to be supplied by imagination or conjecture. The whole fabric rests on the basis of inviodable reason''

Pingali Suranaraya - T. Atchyuta Rao p. 246

4. ''In his poetic art he, for the first time conceived of introducing in his poems, chiefly in his Prabhavati - Pradyumnum, the dramatic method of developing his plots, by planning out scene after scene and making his characters work out the story through monologues and dialogues and by complicating the plot in such a way that it gradually led to a denovement and their resolving the whole in such a way as to suit the sense of dramatic justice.''

# ఎఱ్ఱన మహాకవి కృత ఘోషయాత్ర

పంచమ వేదమై పరఁగిన ధర్మగ్రంథమగు భారతమును జెప్పుటకు ప్రతిభాపాండిత్యములకంటె విజ్ఞానవివేకములతో నొప్పు పవిత్ర ధార్మిక జీవనము ఏతద్గ్రంథ రచయితల కత్యంతావశ్యకము, అపేక్షణీయమునైన గుణవిశేషము. "A great work is the precious life blood of a master - sprit" అన్న ఆంగ్ల మహాకవి మిల్టన్ అభిప్రాయము నిట్టిదే. కవిత్రయము వారికి మూలమైన సంస్కృత భారతము కర్తయైన వ్యాసుఁడు "విద్వ త్సంస్తవనీయ భవ్య కవితావేశుఁడు", "విజ్ఞాన సంపద్విఖ్యాతుఁడు". "సంయమి ప్రకర సంభావ్యానుభావుఁడు" నైనవాఁడు. ఇఁక ఆంధ్ర భారతము నారంభించిన ఆదికవి నన్నయభట్టారకుఁడు సంహితాభ్యాసి, అవిరళ జపహోమ తత్పరుఁడు, నిత్యసత్య వచనుఁడు నైన వేదవేదాంగవేత్త. కవిబ్రహ్మ తిక్కన స్వయముగ క్రతుకర్మ నిర్వహించి సోమయాజియైన ధర్మదీక్షితుఁడు. ఇక ఎఱ్ఱయ శంభు దాసుఁడయ్యు గోవింద గుణాదర ధన్యుఁడై, ధర్మైక తత్పరాత్ముఁడైనవాఁడు. "తుదిఁ దాకిన ఉన్నతిగన్న" శంకరస్వామి సంయమీశ్వర పాదుకాధ్యాన పరత్వమునను, అనేక జన్మాంతరములలో నిరంతర మొనర్చిన అధ్యయనాధ్వరముల వలనను చిత్తశుద్ధి అధిగమించిన పరమయోగీశ్వరుఁడు, "ఈ ముప్పురిలో 'అద్భుత కృతార్థ' శబ్దములకు పుష్కలముగా వాచ్యుఁడగు వాఁడును ఇతఁడే" [ఎఱ్ఱాప్రగడ][1] కాని ఈ కవిత్రయము నిజముగా ముప్వురా? లేక మూఁడు కాలములలో మూఁడు మూర్తులు ధరించిన ఆంధ్రుల ధర్మతపఃఫలమా? శ్రీ నోరి – [భారతి రజతోత్సవ సంచిక పే. 372]

## కవిత్రయ దృక్పథము

ఎఱ్ఱననుగూర్చి స్వయముగఁ జెప్పికొననివియు, ఇతరులన్నట్లున్నవియు నైన వచనములు అతని గ్రంథములలో నీ రీతిగ నున్నవి. ఆరణ్యపర్వాంతమున "భవ్యచరిత్రుఁడు, గుణగరిష్ఠత నొప్పు ధన్యుఁడు, ధర్మైకతత్పరాత్ముఁడు, లోకైక విదితుఁడు, ధీర విచారుఁడు, సాధుజనహర్ష సిద్ధిఁగోరి కవీంద్రకర్ణపుట పేయముగా" ఆరణ్యపర్వ శేషమును పూరించెనని యున్నది. నృసింహ పురాణమున "గురుజన పరాయణుఁడు, సరస బహుపురాణ ధర్మశాస్త్ర కథావిస్తరవేది, వినయోదిత భరితుఁడు,

అతులానుభవభవ్యుఁడు" అనియున్నది. హరివంశమున "అంచిత చరితుఁడు, సకల భాషాకవిత్వ విశారదుఁడు, సాధుసమ్మతుఁడు, నిత్యసౌమ్యమతి, భవ్యుఁడు, ధీరోత్తముఁడు" అనియు నున్నది. ఇది యంతయును కవిత్రయములో నితరులు, తనకు పూర్వులు నైన నన్నయ తిక్కనలకు ఈతఁడు ఆర్షేయమైన ఆర్జవ గుణశీలముల విషయమున నెందును తీసిపోనివాఁడనియు, వారివలె భారతరచనకు యోగ్యతాధికారములు గలవాఁడనియు నిరూపించుచున్నది.

## జన్మాదికము

ఆపస్తంబ సూత్రుఁడు, కృష్ణయజుశ్శాఖీయుఁడు, శ్రీవత్సగోత్రుఁడు నైన ఎఱ్ఱన, పోతాంబా – సూరనార్యుల పుత్రుఁడు. వేగినాఁటిలోని కరావర్తి వృత్తిమంతుఁడు, అహోబిల నృసింహభక్తుఁడు, సంయమితుల్య వర్తనుఁడు, పూర్ణపురుషాయుషజీవియైన ఎరపోతసూరి ఇతని పితామహుఁడు. శంకరస్వామి సంయమీశ్వర పాదుకాధ్యాన పరుఁడైన యోగీశ్వరుఁడు. తండ్రియైన సూరనార్యుఁడు గొప్పకవి. కావున నతఁడే ఎఱ్ఱనకు కవితాగురు వనదగును. శివభక్తితత్పరతచే "శంభుదాసుఁ" డను బిరుదునామము వహించిన యితఁడు చెప్పిన కృతులెల్ల, శ్రీనారాయణావతార లీలలగుట విశేషము. దీనిని బట్టి ఇతని కత్యంతగౌరవము గల కవిబ్రహ్మ తిక్కనవలె నితఁడును హరిహరాద్వైతభావము వహించిన విజ్ఞానియని వెల్లడియగుచున్నది.

ఎఱ్ఱయ ఆరణ్యపర్వాంతమున తన నివాసస్థానము నెల్లూరు జిల్లా కందుకూరు తాలూకాలోని గుడ్లూరని చెప్పుకొనినాఁడు. విప్రనారాయణ చరిత్ర కర్తయైన చదలవాడ మల్లయ ఎఱ్ఱయను తన వంశకర్తగాఁ జెప్పికొనుటచే, ఈ ఎఱ్ఱనగాని, ఆతని సంతతివారు గాని గుంటూరు జిల్లా ఒంగోలు తాలూకాలోని (ప్రస్తుతపు ప్రకాశం జిల్లా) చదలవాడకో, అద్దంకి రెడ్డి ప్రభువైన ప్రోలయనుండి భూములను సంపాదించిన గుంటూరు జిల్లా తెనాలి తాలూకాలోని కొల్లూరునకు సమీపముననున్న చదలవాడకో కాపురము వచ్చుటచే, ఇతని సంతతివారు చదలవాడ వారై యుందురు.

క్రీ.శ. 1323లో కాకతీయ సామ్రాజ్యమైన పిమ్మట అద్దంకి రాజధానిగా "మధ్యాంధ్రదేశ క్షేమద కరవాలుఁడై", ధర్మరక్షకు దీక్ష వహించిన రెడ్డి ప్రభువరేణ్యుఁడు, రెడ్డి రాజ్య స్థాపనాచార్యుఁడు నైన ప్రోల వేమారెడ్డి (క్రీ.శ. 1325–1353) ఎఱ్ఱనకు పోషకుఁడు. ఈ రాజన్యుని సోదరుఁడు మహావీరుఁడు నైన మల్లారెడ్డి, తొలుత

గుండ్లకమ్మ యొడ్డున నున్న గ్రుడ్లూరు నందు ధర్మవర్తనుఁడై కవితావ్యవసాయము సాగించుచున్న ఎఱ్ఱనార్యుని ప్రతిభాపవిత్రవర్తనము లెఱిఁగి దర్శించి, "ఆతత శ్రీతోడం సముపేతుఁజేసి" అద్దంకికిఁ గొనివచ్చి, అన్నగారికి పరిచయ మొనర్చినాఁడు. అపూర్వమగు ఆశ్రయమిచ్చిన ఆ ప్రోలయ వేమారెడ్డికి చేతోమోద మొనర్చునట్లు మొదట రామకథ (రామాయణము) చెప్పి, అత్యుత్తమ ఖ్యాతిని గూర్చి, కావ్యారసాస్వాదనమున నింకను తృష్ణతీరక అభ్యర్థింపఁగా, హరివంశమును చెప్పి ఆ ప్రభువు పేర నంకితమిచ్చి, ఎఱ్ఱయ ఆంధ్రసారస్వత పోషకులలో అతనికి శేషగ్రంథమైన హరివంశముతోఁబాటు భారతమును బూర్తిఁ జేయించి, రాజరాజనరేంద్రుని మహాసంకల్పమునకు పూర్తిని గల్పించినవాఁడగుటయను అపూర్వస్థానమును గల్పించి ఋణవిముక్తుఁడైనాఁడు. ఎఱ్ఱయ క్రీ.శ. 1280–90 ప్రాంతమున భారతరచనకుఁ గడఁగిన తిక్కనకుఁ బిమ్మట, రమారమి ఏబది సంవత్సరములకు, క్రీ.శ. 1455 ప్రాంతమున జన్మించి, ఎనుబది ఏండ్లు జీవించి క్రీ.శ. 1335 కు ముందు శివసాయుజ్య మొందియుండును. (శ్రీ వేలూరి శివరామశాస్త్రి – హరివంశ పీఠిక పే. XVII)

## ఎఱ్ఱన కృతులు

చదలవాడ మల్లన తన వంశకర్తయైన ఎఱ్ఱనను స్తుతించుచు, నాతని రచనలను స్తుతిపూర్వకముగఁ దెల్పుచు నిట్లు చెప్పినాఁడు.

సీ. "ప్రతిభతో నారణ్యపర్వశేషముఁ జెప్పె
కవులకు చెవులు బండువులు గాగ,
వల్మీకభవు వచో వైఖరి రామాయ
ణంబు నాంధ్ర ప్రబంధంబు సేసె,
నారసింహునిపురాణ మొనర్చె హరిమెచ్చి
నన్ను నెన్నఁడు చూచినాఁడ వనఁగ,
ప్రౌఢిమై హరివంశ భాగముల్ రెండును
రచియించె సభలందుఁ బ్రాజ్ఞు లెన్న

ఆ.వె. దురితహరు ప్రబంధ పరమేశ్వరుని జెద
ల్వాడనిలయు నాదువంశకర్త
ధన్యమూర్తి శంభుదాసు నెఱ్ఱ ప్రెగఁడ
సన్నుతింప బ్రహ్మకును దరంబె?"

దీనిని బట్టి ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషము, రామాయణము, నృసింహ పురాణము, హరివంశములను నాల్గు కృతులను జెప్పినట్లు తెలియుచున్నది. పై పద్యమున ఎఱ్ఱన కృతులు పౌర్వాపర్యముల ననుసరించి పేర్కొనఁబడినవో లేదో చెప్పలేము. రామాయణము లభ్యమగుట లేదు. కాని ఇది హరివంశమునఁ జెప్పఁబడినది గావున దాని కంటె పూర్వకృతి. ఆరణ్యపర్వశేషము నృసింహ పురాణమున నుదాహృతమైనది గాన అది నృసింహ పురాణమునకు పూర్వకృతి. ఇఁక రామాయణము, ఆరణ్యపర్వ శేషములలో దేనిని ముందు చెప్పి వాని వెనుక క్రమముగ హరివంశ, నృసింహ పురాణములను జెప్పినాఁడో నిర్ణయించుట కష్టము. చరిత్రకారులు, సాహిత్యచరిత్ర కారులు, విమర్శకులు ఎఱ్ఱన రచనల పౌర్వాపర్యములను గూర్చి భిన్నాభిప్రాయములను వెల్లడించిరి.[2]

తొలుత రామాయణమును, పిమ్మట హరివంశమును జెప్పి, ఎఱ్ఱన హరివంశము భారతమునకు ఖిలగ్రంథము (పరిశిష్ట గ్రంథము) అగుటచే, దానిని చెప్పుటతో భారతరచన కొంతచేసిన వాఁడునగుటచే, ఆరణ్యపర్వ శేషము నెత్తుకొని దానిని పూరించి "ప్రబంధ పరమేశ్వర" బిరుదమంది, ఆ "ప్రబంధ పరమేశ్వర బిరుదమును" "వర్ణన ప్రధానమ్ ప్రబంధమ్" అన్న వాక్యమున కనుగుణముగ సహితము సార్థక మొనర్చుకొనుటకై, పిమ్మట వర్ణనబహుళమైన నృసింహపురాణమును జెప్పినాఁడనుట సమంజసము. అయినను పౌర్వాపర్యనిర్ణయ విషయమున లభ్యములగుచున్న ఆధారములు సంశయములను గల్పించినవై, దొరికిన మూఁడు గ్రంథములందును నున్నవి. ఎఱ్ఱన రచనలపౌర్వాపర్యములను నిర్ణయింప యత్నించినవారు, ఆ మహాకవి శైలీపరిణామమును నిశ్చయించు విషయమునను ఎట్లు భిన్నాభిప్రాయులైనారో శ్రీ వేలూరి శివరామశాస్త్రి క్రింది వాక్యముల వలన అభివ్యక్తము కాఁగలదు.

"ఇక రచనాప్రౌఢిలో ఆరణ్యశేష నృసింహ పురాణములకు హరివంశము లొచ్చు గాన రామాయణ హరివంశముల రచన మొట్టమొదటిదని కొందఱందురు. విరాటమును ఆనుశాసనిక పర్వమును ఉదాహరణముఁజూపి రచనాప్రౌఢికి ఆద్య ప్రయత్నమునే కారణముగాఁజెప్పి కొందఱు వెనుకటి వాదము నియ్యకొనరు. ఇతని (ఎఱ్ఱన) కవితారచన హరివంశముననే విశ్రాంతమైనదని కొందఱందురు. ఎఱ్ఱయ దేనిని జెప్పి ప్రబంధ పరమేశ్వరుఁ డాయెనో అట్టి ఆరణ్యశేషమునే సారహీనముగాఁ గొందఱు తలఁచిరి. "భిన్న రుచిర్హి లోకః" ఎవరి లక్ష్యకేంద్రము వారిదే. [హరివంశము పీఠిక XVII]

## ఆరణ్యపర్వ శేషోన్నయ ప్రాముఖ్యములు

### ఎఱ్ఱన కర్తృత్వము

ఆరణ్యపర్వ చతుర్థాశ్వాసము 142 పద్యములతో అనఁగా "శారదరాత్రులు" అనుపద్యముతో నన్నయభట్టు కవిత్వము సంపూర్ణము. ఇక్కడనుండి అనఁగా "స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి" అను పద్యము నుండి యెఱ్ఱాప్రెగ్గడ కవిత్వము అని ముద్రితగ్రంథము లందు కన్పట్టుచున్నది. ఆరణ్యపర్వమునందలి ఏడాశ్వాసములలోని 2898 గద్యపద్యములలో నన్నయవి 1298. ఎఱ్ఱనవి 1599. దీనినిబట్టి ఆరణ్యపర్వములో అధికాంశము ఎఱ్ఱన రచనయని తెలియుచున్నది. అయినను ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషమును నన్నయభట్టు పేరుమీఁదనే రాజరాజనరేంద్రున కంకితముగ పూరించినాఁడు. ఆరణ్యపర్వాంత మందలి "భవ్యచరిత్రుఁడు" [ఆ VI ప 469], "ధీరవిచారుఁడు" అను పద్యము వలన ఎఱ్ఱనార్యుఁడు "సకల లోకైక విదితుఁడైన నన్నయభట్ట మహాకవీంద్రు సరసపారస్వతాంశ ప్రశస్తి దన్నుఁ జెందుట"చే ఆతని కవితారీతియుఁ గొంత దోఁప తద్రచనయ కా నారణ్యపర్వశేషమును "కవీంద్ర కర్ణపుట పేయముఁగా బూరించె" నని వ్యక్తమగుచున్నది. అయిన నీ పద్యములు ఎఱ్ఱన తన్నుఁగూర్చి ప్రథమ పురుషలోఁ జెప్పుకొనినవా లేక ఏ కారణమునో నన్నయ విడిచిపుచ్చిన భాగమును తిక్కనకుఁ బిమ్మట (తిక్కన భారతరచన క్రీ.శ. 1280–90 ప్రాంతము) ముప్పది నలుబది సంవత్సరములకు పూరించి, ఆ మహాకవిమీఁది భక్తిపెంపున అతని రచనగనే వెలయించుటను జూచి, ఇంకెవరైన ఆరణ్యపర్వాంతమునఁ జేర్చిరా?[3] పెక్కు తాళపత్రప్రతులను పరిశోధించిన ఆనంద ముద్రాక్షరశాలవారి పరిష్కర్తత్వం. తేవ ప్పెరు మాళ్ళయ్యకు వానియందు పై పద్యములు కనిపింపలేదట. ఇవి ముద్రితప్రతులందు మాత్రము కనిపించినవట. [భారతి రక్తాక్షి – చైత్రము పు.20].

ఈ పద్యముల విషయ మెట్లున్నను ఎఱ్ఱన నృసింహపురాణమున [1–17] తానారణ్య పర్వశేష పూరణమొనర్చి "ప్రబంధ పరమేశ్వర" బిరుదమందినట్లు తెలియఁజేసినాఁడు. ఎఱ్ఱయ ఆరణ్యపర్వశేషమును పూరించినట్లును, కవిత్రయమున నొకఁ డైనట్లును, పూర్వకవిస్తుతులు, ఇతర నిదర్శనము లనేకములు కన్పట్టుచున్నవి. ''ఆరణ్యపర్వావశిష్టంబునందు భీమకవి శాపభయంబున జయము గోరి 'స్ఫురదరుణాంశు రాగరుచి' యని శంభుదాసుఁడు అరుణశబ్ద ప్రయోగ మొనర్చినట్లు చెప్పినాఁడు. [అప్పకవీయము. ఆ. IV – 73]; "ఈ త్రయి (కవిత్రయము) దాఁ బ్రబంధ పరమేశ్వరుఁడై విరచించె శబ్దవైచిత్రి నారణ్యపర్వమున శేషము" అని

విక్రమార్కచరిత్ర కర్త జక్కన, "ప్రతిభతో నారణ్యపర్వశేషముఁ గవులకుఁ జెవుల పండువులు గాగ" అని విప్రనారాయణచరిత్ర కర్త మల్లయ, "రెంటగలయన్ శివదాసుఁడు మధ్య నాయక శ్రీ రచియించె" అని రాధామాధవకర్త చింతలపూడి ఎల్లనార్యుఁడు, ఎఱ్ఱనను ఆరణ్యపర్వ శేషకర్తగా శ్లాఘించినారు. కావున నేటి వితండవాదము లెట్లున్నను ఎఱ్ఱన ఆంధ్రభారత రచయితలలో నొకఁడును, ఆరణ్యపర్వ శేషపూరఁకుడు నగుట నిశ్చయము.

## ఆరణ్య పర్వశేషోన్నయము

ఉ. "ఉన్నత సంస్కృతాంధ్రచతురోక్తి పదంబులఁ గావ్య కర్తవై
యెన్నికమైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వ శే
షోన్నయ మంధ్రభాష సుజనోత్సవ మొప్పగ నిర్వహించి తా
నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్"

అని నృసింహపురాణమునఁ దన్నుఁ గూర్చి ఎఱ్ఱన చెప్పుకొనినాఁడు. ఇందలి ఆరణ్యపర్వ శేషోన్నయ మందలి "ఉన్నయ" పదమును, ఆరణ్య పర్వాంతమందలి ధీరవిచారుఁడు లోని "పూరించె" అను పదమును, ఇతర సాక్ష్యములను విమర్శించి ఆరణ్య పర్వశేష పూరణము – నన్నయ వ్రాయని కథాభాగమును స్వతంత్రముగఁ జెప్పి పూరించుట, నన్నయ మూఁడు పర్వములును పూర్తిచేయఁగా, నందు కొంత భాగము (స్ఫురదరుణాంశు దగ్గర నుంచి) పోగా ఎఱ్ఱన దానిని తిరిగి వ్రాసి పూరించుట, నన్నయ వ్రాసిన ఆరణ్యపర్వములో కొంతభాగమున కొన్ని పద్యభాగములు, కొన్ని పదములు క్రిమిదష్టములు కాఁగా, వానిని మాత్రమే సరిజేసి పూరించుట అను ముత్తెఱఁగులుగ విమర్శకు లూహించిరి.

లోకమున ఆరణ్యపర్వ విఘ్నభీతి యుండుట, భీమకవి శాపము, రాజరాజనరేంద్రుని హఠాదస్తమయమున నైన రాజకీయ వైపరీత్యము, నన్నయ అకాలమృతిని గూర్చిన ఊహ మొదలగునవి ఆధారములుగా, నన్నయ భారతరచన ఆరణ్యపర్వమున సగమునందే ఆగిపోగా, తిక్కన విరాటారంభముతో స్వర్గారోహణము వఱకును భారతరచన యొనర్చిన పిమ్మట, నది పూర్తిగాకుండుటకు చింతించి మిగిలిన గ్రంథభాగమును పూరించినాఁ డనునది స్వయంపూరణ వాదము. తిక్కన విరాటారంభమున ఆదికవి నన్నయను స్తుతించుచు చెప్పిన "ఆదరణీయ సార వివిధార్థగతి స్ఫురణంబుగల్గి" ఇత్యాదియందు "అం దాది దొడంగి మూఁడు కృతు

లాంధ్ర కవిత్వ విశారదుండు విద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్" అని చెప్పుట వలనను, ఆ అభిప్రాయమునే మారన "సారకథా సుధారసము" అన్న మార్కండేయ పురాణ కృత్యాది యందు నన్నయను గొల్చుచు "భారత సంహితన్ మును ద్రిపర్వము లెవ్వఁడొనర్చె" అనుమాటల నాధారముగాఁ గొని, నన్నయ మూడు పర్వములను బూర్తిగా రచించెననియు, తిక్కన మారనల కాలమున నవి యున్నవనియు తలఁచి, వారికిఁ బిమ్మటి కాలమున ఆరణ్య పర్వశేషభాగ ముత్సన్నము కాఁగా దానిని ఎఱ్ఱయ పూరించెననియు శ్రీ శతఘంటం వేంకటరంగశాస్త్రి ఆనంద ముద్రణాలయ భారత పీఠికయందొక అభిప్రాయము బ్రకటించుటతో, రెండవదైన ఉత్సన్నభాగ పూరణవాదము పుట్టినది. నన్నయ పూర్తిగా రచించిన ఆరణ్యపర్వములో కొన్ని తాళపత్రములు కీటదష్టములగుటచే చిల్లులు పడుటవలన నా చిల్లులకే అతుకులు పెట్టి నన్నయపేరనే "తద్రచనయ కా" ఎఱ్ఱయ "ఉన్నయ" [4]మొనర్చినాఁడని శ్రీ నడకుదుటి వీరరాజు వింతలైన ఉపపత్తులను జూపి యొక ప్రతిపాదన మొనర్చుటతో [భారతి. రక్తాక్షి చైత్రము 9-22] శిథిల పురాణవాద మేర్పడినది. విజ్ఞులెల్లరు పరాస్త మొనర్చుటచే అణఁగిపోయిన ఈ వాదమును, మఱల శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు 1955లో తిరుగఁదోడి తమ తార్కిక ప్రతిభతో పునఃస్థాపింప యత్నింపఁగా, [ఆంధ్ర భారతోపన్యాసములు ఆంధ్ర సారస్వత పరిషత్ప్రచురణ - పుటలు 48- 100] శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి, శ్రీ వంతరాం రామకృష్ణరావు ప్రభృతులు యుక్తియుక్తముగ మఱల దీనిని ఖండించి [భారతి జులై 1959. ఫిబ్రవరి 62] ఆరణ్య పర్వశేషము స్వోపజ్ఞమైన ఎఱ్ఱన రచనయను ప్రాచీనాభిప్రాయమును ప్రోదిసేసినారు. "స్ఫురదరుణాంశు" అను పద్యమునకు, తనకు అరివర్ణచక్రము వైచిచూచుకొని అటనుండి ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషరచన ప్రారంభించినాఁడని నిరూపించుటకు శ్రీ కొండముది నరసింహము అరివర్ణ చక్రోద్ధారణమును త్రవ్వి యెత్తి చూపిరి. అదియునుగాక ఎంతటి కీర్తికాంక్ష గలవాఁడైన ఎఱ్ఱన, శిథిలపూరణ మొనర్చి అది తన రచన యని చెప్పుకొనుటయే గాక 'ప్రబంధ పరమేశ్వర' బిరుదము దానివలన లభించినదని ప్రకటించునంతటి నీచుఁడా మఱి?

## ఆరణ్యపర్వశేషము : తిక్కనకు పూర్వరచన

తిక్కనకు సమకాలికుఁడును, తిక్కన నివాసమైన నెల్లూరునకు 40-45 మైళ్ళ దూరముననున్న గుడ్లూరు నివాసియునైన ఎఱ్ఱన, తిక్కన భారతరచనకుఁ బూర్వమే ఆరణ్య పర్వశేషమును బూరించినాఁడనియును, దానిని తన వ్యక్తిత్వము

నుపసంహరించుకొని నన్నయ పేరనే వెలయించుటచేత, తిక్కన ఆ భాగమును నన్నయ కృతిగనే తలంచి నన్నయ మూఁడుపర్వములు రచించినట్లు చెప్పినాఁడనియును, [5]తిక్కన ఆ రీతిగా తన రచనయైన ఆరణ్యపర్వశేషమును నన్నయ రచనగా ముద్రవైచుటచే తిక్కన భారత రచనారంభమునకుఁ బిమ్మట తాను చెప్పిన నృసింహపురాణమునందలి "ఉన్నత సంస్కృతాంధ్ర చతురోక్తి పదంబుల" ఇత్యాది పద్యమున తన ఆరణ్యపర్వశేష గ్రంథకర్తృత్వమును సమర్థించుకొన వలసివచ్చినదనియు శ్రీ నిడుదవోలు వేంకటరావు ఒక సిద్ధాంత మొనర్చిరి. [పరిశోధన ఫిబ్రవరి–మార్చి 1956 పు.55] నన్నయ తిక్కనలపై ఎఱ్ఱన చెప్పిన "భాసుర భారతార్థముల భంగుల", "మించిన వేడ్క వీనులకు మిక్కుటమై" అను పద్యములలోని "ఆద్యులు" [తొలివారి] అను పదప్రయోగము అభ్యంతరమగుట, తిక్కనకు ముందే ఆరణ్యపర్వశేషము పూరించిన ఎఱ్ఱన, విరాటపర్వాదులను క్రమముగఁ జెప్పుకొనుచు పోలేదేల? యను సమస్య అడ్డుకొనుట మొదలైన చక్కని ఉపపత్తులను జూపి, శ్రీ వేలూరి ఈ విచిత్రసిద్ధాంతమును పరాస్తమొనర్చినారు. [హరివంశ పీఠిక xviii] కావున ఎఱ్ఱన ఆరణ్య పర్వశేష రచన తిక్కన భారత రచనకు (క్రీ.శ.1280–900) పిమ్మట – అథమము ఏ ముప్పది నలుబది సంవత్సరములకుఁ బిమ్మటనో (క్రీ.శ.1330–40) – జరిగినదనుటయే సమంజసము.

### ఆరణ్యపర్వశేష ప్రాముఖ్యము

అధర్మద్యూతమున దుర్యోధనాదు లోడించి అరణ్యములకంపఁగా ధర్మపరులైన పాండవులు అట జీవించుకాలమున మహర్షులవలన ఉత్తమరాజన్యుల కావశ్యకమైన విజ్ఞానము నార్జించుట, ధర్మవ్యతిరిక్తులైన రాక్షసులను ఓడించి తమ శక్తిసంపన్నతకుఁ బ్రచారమును గల్పించుకొనుట, దేవతలనుగొల్చి దివ్యాస్త్రశస్త్ర సంపాదన మొనర్చుట, నితర వరములను పొందుట మొదలగు కృత్యము లొనర్చిరి. వారు తమవలె ననేక కష్టములకు గురియై తుదకు సౌఖ్యము లనుభవించినవారును, విఖ్యాతచారిత్రులు నైన అనేక పూర్వరాజన్యుల చరిత్రలను, అనేకోపాఖ్యానములను దెలిసికొనిరి. భావికాలమున జరుగనున్న గురుక్షేత్రమందు ధర్మపక్షమొందు విజయమునకు సాధకులుగా జనించిన అవతారమూర్తులు గాన సైంధవాది దుర్జనుల పరాభవించి, వారి వినాశమునకు బీజములను నాటిరి. దుర్యోధన ఘోషయాత్రవలన గంధర్వ యుద్ధమున ముల్లోకవీరులని నిరూపించుకొనిరి. ఇట్లు పాండవులు మహావీరులుగను, దేవానాం ప్రియులుగను, ప్రియదర్శనులుగను, ధర్మకోవిదులుగను దీర్చుకొనుట వారికి

అరణ్యవాస జీవితమున గల్గినది. కావున భారత కథయందు ఆరణ్య పర్వమునకు విశేషప్రాముఖ్యమున్నది. ఇందలి ఘోషయాత్రవంటి వృత్తాంతములు కొంతవఱకు భవిష్యద్యుద్ధ హేతువులుగ పరిణమించుటయు నీ పర్వ ప్రాముఖ్యమునకు తోడ్పడుచున్నవి. ఆరణ్యపర్వ శేషమున మార్కండేయుఁడు పాండవుల కడకు వచ్చి బ్రాహ్మణప్రభావము, సరస్వతిగీతి, వైవస్వత వృత్తాంతము, ప్రళయ ప్రకారము, నారాయణ ప్రభావము, గలియుగ ధర్మములు, ఇంద్రద్యుమ్న చరిత్ర, కువలయాశ్వచరిత్ర, మధుకైటభుల చరిత్ర [ఆ. ౫ ప్రారంభము] పతివ్రతామాహాత్మ్యము, ధర్మవ్యాధచరిత్ర, అంగిరసుఁ డగ్నియగుట, ఇంద్రుఁడు కేశియను రాక్షసుని బాఱద్రోలుట, కుమార వృత్తాంతముల నెఱిగించుట, ద్రౌపది సత్యభామకు పతివ్రతాధర్మము లెఱింగించుట, ధృతరాష్ట్ర విషాదము, ఘోషయాత్ర, [ఆ. ౫ ప్రారంభము] దుర్యోధన విషాదము, ప్రాయోపవేశము, పాతాళలోక వృత్తాంతము, దుర్యోధన వైష్ణవయాగము, పాండవులు కామ్యకవనమున కేగుట, సైంధవ పరాభవము, రామాయణ కథలో రావణదుష్ట ప్రవచనములు [ఆ. ౫ ప్రారంభము] సీతాన్వేషణము మొదలు రామవిజయము వఱకు రామకథ. సావిత్రీచరిత్రము, కర్ణ జన్మ వృత్తాంతము, కర్ణునికవచకుండలము లింద్రుఁడు హరించుట, యక్షప్రశ్నలు, ధర్ముఁడు ధర్మజునకు వరము లిచ్చుట యనునవి కథావిశేషములు. ఆరణ్యపర్వ విశేషకథయును పూర్వభాగమువలె పాండవులను దైవబల మానవబల సంపన్నులుగా దీర్చిదిద్దుట, వారు దేవతావరము లొందుట, ఘోషయాత్ర, సైంధవ పరాభవముల వలన ముల్లోకవీరులని ప్రకటితమై భవిషద్యుద్ధ ఫలితమునకు సూచననిచ్చుట, పాండవులు మహర్షుల వలన బహువిషయములను విని తమను విజ్ఞానవంతులనుగాఁ దీర్చిదిద్దికొనుట యను విశేషములను గల్గి, తరువాతి కథ కెంతయు నుపకరించునదై విశేషప్రాముఖ్యము వహించియున్నది. అందుచే నిట్టి భారతభాగకథను పూరించి ఎఱ్ఱన ఆంధ్రమున భారతకథాశ్రవణ కుతూహలురగువారికి, నూతన కవితామార్గములను జూపి భావి (వక్ష్యమాణ) కవిలోకమునకు మహోపకార మొనర్చినాఁడు.

## ఘోషయాత్ర - నామసార్థక్యము

అరణ్య వాసక్లేశములను అనుభవించుచున్న పాండవులయెడ వాత్సల్యము, వారి తపోబల శస్త్రాస్త్రసంపత్తికి భీతియు వెల్లడించుచు, నొకనాఁడు ధృతరాష్ట్రుఁడు సభాముఖమున వారిని ప్రశంసించుట దుష్టచతుష్టయమునకు ఈర్ష్యాద్వేష మాత్సర్యములను ఉజ్జీవింపఁజేసినది. ధృతరాష్ట్రుని ప్రశంసలో సిరి, రాజ్యమిఁక

దివ్యతేజశ్శక్తుల నార్జించిన యర్జునునిదే అన్న యంశము, అతనికి ప్రతివీరుఁడైన కర్ణునకు సహింపరానిదైనది. ఆతఁడు పాండవుల నపహసింప ద్వైతవన ప్రయాణము నూహించి, వారియెడ నిత్య శత్రుభావము వహించిన రారాజు (దుర్యోధనుఁడు) బుద్ధి కెక్కించినాఁడు. ధృతరాష్ట్రు ననుమతిని బడయుటలోని పాండవాపహాసన ప్రయాణము ఘోషయాత్రారూపము నొందినది. నేత్రోత్సవముగ సకల బంధుమిత్ర పరివారముతో దుర్యోధనుఁడు గోకదంబమును దర్శించి, వేట ముగించుకొని ద్వైతవన సరోవర సమీపమున క్రీడాగృహములను నిర్మింపఁ జేయువేళ, నింద్రునాజ్ఞచే పాండవాపహాసన దురుద్దేశమును భగ్న మొనర్చుటకై వచ్చిన చిత్రసేనుని గంధర్వ భృత్యులు కర్ణ దుర్యోధనులను అడ్డుకొనుట, దుర్యోధనుఁడు బలప్రదర్శన మొనర్చి సరోవరప్రాంత మాక్రమింపుఁడని సైనికులను శాసించుటతో నది ఘోరసంగ్రామముగ పరిణమించుట జరిగినవి. పాండవాపహాసన యాత్రాపథక పరమేష్ఠి (స్రష్ట – బ్రహ్మ) యైన కర్ణుఁడు గంధర్వుల ధాటికి నిలువఁజాలక, రణభూమినుండి తొలఁగిపోయిన పిమ్మట, నొంటిగ పోరుచున్న కౌరవరాజు కాంతాపుత్ర సోదరామాత్య సహితముగ బంధితుఁడగుటయు, వారిని గంధర్వులు తీసికొనిపోవుటను జూచి భీతచిత్తులై కౌరవులు, పౌరామాత్యులు సమీపమున యజ్ఞదీక్షితుఁడై యున్న ధర్మజుని శరణుజొచ్చుటయు, అతఁడు సోదరులనంపి అమానుష పరాక్రమమున గంధర్వుల గెలిచి, వధూపుత్రానుజామాత్య సహితుఁడైన దుర్యోధనుని బంధవిముక్తుని గావించి బుద్ధులు సెప్పి పంపుటయు జరిగినవి. పిమ్మట మనస్వియైన దుర్యోధనుఁడు జుగుప్సావహమైన తన యవమానమును, అమానుషమైన పాండవపరాక్రమమును తలఁచి తలఁచి ప్రాయోపవేశ మొనర్చి, తుదకు పాతాళలోకవాసులైన రాక్షసులు కల్పించిన ఆశతో దానిని విరమించి, తన యభ్యుదయమున నైన సైన్య మహోత్సాహముతో హస్తినకుఁ దిరిగివచ్చుట మహాభారతారణ్యపర్వము నందలి యీ సందర్భ కథాంశములు.

ఇందు దుర్యోధనుఁడు ఆభీరపల్లికి సపరివారముగ సకల సామ్రాజ్య వైభవముతో నేగుట, ఆ ప్రయాణము వలనఁగలిగిన పరిణామములు విషయములు. వ్యాసమహర్షి సంస్కృత మహాభారతమున పై కథాంశముతోఁబాటు దుర్యోధనుఁడొనర్చిన వైష్ణవయాగము, కర్ణప్రతిజ్ఞ, అర్జునుని సంహరింప దుర్యోధనుఁ డొనర్చిన యత్నములకై ధర్మజుఁడు చింతించుట అను ఘోషయాత్రాకథానంతర పరిణామముల సహితము చేర్చి, ఇరువది రెండు అధ్యాయములు గల (236–257) ఘోషయాత్రాపర్వమును రచించినాఁడు. "ఘోషయాత్ర" అను నామ మీ యంశములుగల కథాఘట్టమున కెంత వఱకు సమంజసమో పరిశీలింతము.

"ఘోషయాత్ర" అనునది ఘోషః, యాత్రా అను రెండు వ్యస్తపదముల చేరిక వలన గలిగిన సమాసము. "ఘోష" శబ్దమునకు ఆభీరపల్లి, (గొల్లపల్లి – ఘోషంతి గావోஉత్రఘోషః ఘుషిర్ అవి శబ్దనే శబ్దే చ – దీనియందు గోవులు ఘోషించును) గొల్లవాఁడు, శబ్దము (ధ్వని), ప్రకటనము (Proclamation) అర్థములును, "యాత్రా" శబ్దమునకు (యాం తస్యా మితి యాత్రా – యా ప్రాపణే. దీనియందు కదలిపోవుదురు, యూయతే అనయా యానంచేతి యాత్రా – దీనిచేత కాలము త్రోయబడును) గమనము, భోజనాదివర్తనము, ఉత్సవము (యాత్రా దేవార్చ నోత్సవః శేషనిఘంటువు) అను అర్థములున్నవి. వీనిని బట్టి ఘోషయాత్రాకథాంశములను అన్వయించుచు, ఆ ఘట్టమున కా నామ మెంతవఱకు సార్థకమో పరిశీలింపవలసియున్నది. మహాకవి యెఱ్ఱన "మఱునాఁడు వివిధ గిరిగహనంబు లతిక్రమించి ఘోషంబు లున్న వనంబు సొచ్చి" అనియు [ఆ ౫ 374], "ఫణధరేంద్రకేతునాజ్ఞ కరిపురంబునం దెల్ల ఘోషింపఁబడియె ఘోషయాత్ర" [ఆ ౫ 374] అనియు, "ప్రకట శకట వైశ్యపణ్యాంగనాది సంకులము నుల్లసిల్లె ఘోషయాత్ర" [ఆ ౫ 374] ఆనియు నీ ఘోషయాత్రా శబ్దములను వ్యస్తములుగను, సమాసపదములుగను ప్రయోగించినాఁడు. "అట్లగుటన్ మీ గమనంబు నా మది ప్రియంబై తోప దెబ్బంగులన్" అను చోట యాత్రార్థస్ఫురణమును గన్పట్టుచున్నది.

దుష్టమృగ విధ్వంసమొనర్చి గోరక్షయొనర్చుటకై ధృతరాష్ట్ర నాజ్ఞవడసి దుర్యోధనుఁడు ఇందు ఘోషములున్న వనమునకు యాత్ర యొనర్చినాఁడు గావున, నిది ఘోషముకొఱకు (గొల్లపల్లె కొఱకు) అయిన ప్రయాణము [ఘోషాయ యాత్రా ఘోషయాత్రా] కావున ఘోషయాత్ర. గొల్లపల్లెయందు గోరక్ష యొనర్పవలసిన అవసరమున్నదని నిదర్శనము చూపినగాని ధృతరాష్ట్రుఁ డనుమతింపఁడు కావున, ఆ నిరూపణమునకు దుష్టచతుష్టయమునకు ఒక గొల్లవాఁడు అవసరమైనాఁడు. అతఁడే సమంగుఁడు. సమంగుఁడను గొల్లవాఁడు (ఘోషుఁడు) నిమిత్తముగా గలయాత్ర (సమంగఘోష నిమిత్తికా యాత్రా ఘోషయాత్రా) అనుటచేతను ఇది ఘోషయాత్ర.

నిజమునకు దుర్యోధనుని ఘోషయాత్ర ఘోషరక్షకై ఉద్దేశితమైనది కాదు. సామ్రాజ్యవిభవమున మెఱసి పాండవులను పరిహసించి, వారు దుఃఖితులు కాఁగా చూచి యానందించుట ఉద్దేశము. అందుకు ఊరక (ఎట్టి విషయమును లేక) రారాజు ద్వైతవనమునకు సైన్యపరివారముతో నేగుటకు ధృతరాష్ట్రుఁడంగీకరింపఁడు. ద్వైతవన ప్రయాణద్రష్టయైన కర్ణుఁడు "ఇప్పు డా ద్వైతవనంబునందు విదితంబుగ నున్నవి

గోకదంబముల్ ప్రీతిగఁ దద్విలోకనము పేరఁ జనందగు ధారుణీశ్వరుం డీ తెఱఁగైనఁ బొమ్మను" అని ఉపాయమును సైతమన్వేషించి ఘోషయాత్రాస్రష్ట యైనాఁడు. అందుచే నిది ఘోష దర్శన (రక్షణ) చ్ఛలము (మిష) తో "పాండవుల నవమానించు యాత్ర" (ఘోష దర్శన (రక్షణ) చ్ఛలేన పాండవాపహసన యాత్రా ఘోషయాత్రా) యైనది గావున ఘోషయాత్ర.

పాండవుల నపలాపించుటకు దుర్యోధనుఁడు సకలసంపత్తితో నేఁగవలయును. ఈ యాత్రలో సైన్యము, పరివారము, నెల్ల పౌరులు పాల్గొనవలయును. కావున ఈ యాత్రకు హస్తినానగరిలో (ప్రచురణ ప్రకటన – ఘోషణము) అవసరము. కావుననే ధృతరాష్ట్రు ననుజ్ఞ లభించిన "ఆ క్షణంబు కౌతుకాతిశయ వ్యగ్రహృదయుఁ డైన ఫణధర్మేంద్ర కేతునాజ్ఞ (దుర్యోధనుని శాసనమున కరిపురంబునం దెల్ల ఘోషింపఁబడియె ఘోషయాత్ర" ఇట్లు హస్తినానగరమున ఘోషణము (ప్రకటనము) నొందిన యాత్ర [హస్తినా నగరే ఘోషితాయాత్రా] గావున ఘోషయాత్ర.

విభవాతిశయముతో నేఁగి పాండవులపై నొకరీతి జయమును గొన అందు ప్రధానాంగమైన సైన్యఘోషతో నేగుచున్న దుర్యోధనునకు ఇదియొక జైత్రయాత్ర. అట్టి సైన్యఘోష (ఉత్సాహధ్వనితోఁ గూడినది దుర్యోధన సైన్య జైత్రఘోషఁ ప్రకటనాయాత్రా) గావునను నిది ఘోషయాత్ర. ఎల్లవారికిది ఘోషమందలి విలాసోత్సాహముగ ప్రకటితమైనది గావున నేఁడు ఘోషయాత్రయందు దుర్యోధనుని ప్రియబాంధవులు, ఉజ్జ్వలవిభూతితో సముచితవాహనులై యాతని కొలుచుచు వెంటనేఁగుట, ఆందోళికాది వాహనములలో వేలకొలఁది ప్రియప్రమదలు చేరుట, పడఁతులతోఁ గూడి పౌరులును నడుచుట, ఇది శకట వైశ్య పణ్యాంగనా సంకులమగుట, ప్రయాణానురూప చతురంగ బలములతో నేతెంచుట, వేటయు నీ యుత్సవమున నంతర్భాగము గావున వేటకాండ్రు, విటవిదూషక వందివైతాళికాది జనులు అనుగమించుట జరిగినవి. విలాసోత్సవ బుద్ధితో నేగినవారికి నేత్రాభిరామమగు గోకదంబ దర్శనము, గోరసాస్వాదన క్రీడ, వేట, వనవిహారాదులు సంప్రాప్తమైనవి కావున వ్రేపల్లెయందలి విలాసోత్సవయాత్ర [ఘోషస్య యాత్రా ఘోషయాత్రా – యాత్రాః ఉత్సవః] యైన ఇది ఘోషయాత్ర.

గంధర్వులు యుద్ధమున ప్రవేశించుటతో ఘోషయాత్ర గంధర్వయుద్ధ ఘోష యాత్రయైనది. వారు దుర్యోధనాదులతో ఘనముగ పోరుటవలన నైనదియు, అర్జునాది

పాండవవీరులతోఁ బోరుటవలన నైనదియునైన గంధర్వయుద్ధ ఘోషను ప్రదర్శించు యాత్ర [గంధర్వయుద్ధ ఘోష ప్రదర్శికాయాత్రా] యగుటచే నిది ఘోషయాత్ర యైనది. గంధర్వులతో పట్టుబడగా మిగిలిన కౌరవపౌరామాత్యులు దీనులై ఘోష వెట్టుచు ధర్మజుని శరణుజొచ్చుట కేగిరి. అట్టి కౌరవ పౌరామాత్యదైన్య ఘోష ప్రకటన గలది [కౌరవ పౌరామాత్య దైన్య ఘోష సంపాదికా (ప్రకటనా) యాత్రా] గావునను ఘోషయాత్ర యైనది.

ముల్లోకవీరుఁడైన బీభత్సుని అమానుష పరాక్రమముచే గంధర్వులు విజితులగుటయు, దుర్యోధనునకు ధర్మజుఁడు బంధవిమోచన మొనర్చుటయు, వారి కీర్తి త్రిలోకముల వ్యాపించుటయు జరిగినవి. ముల్లోకముల పాండవకీర్తి ఘోష వ్యాప్తి యాత్ర యగుటచేతను [లోకత్రయే పాండవకీర్తి ఘోష ప్రకటనాయాత్రా] నిది ఘోష యాత్ర యైనది. పాండవుల కీర్తి యెట్లు ముల్లోకములకుఁ బ్రాకినదో అట్లే దుర్యోధనుని ఘోరావమానోదంతమును స్వర్గమందలి దేవతలు, మర్త్యమందలి మానవులు, పాతాళమందలి రాక్షసులు తెలిసికొనిరి. అతని అపకీర్తి ఘోష ఇట్లు ముల్లోకముల వ్యాపించుట [లోకత్రయే దుర్యోధ నాపకీర్తి ఘోషరూప యాత్రా] కలది యగుట చేతను ఇది ఘోషయాత్ర. ఈ కథాంశము ముల్లోకముల విస్తరించి యుండుటచే ముల్లోకములందును ఘోషను కల్పించిన యాత్రయగుట వలన [లోకత్రయే ఘోష సముత్పాదికా యాత్రా] ఇది ఘోషయాత్ర యగుచున్నది. ఈ యాత్రకు పూర్వము మహాఘనులమని విఱ్ఱవీగుచున్న కౌరవులకు ఘోషత్వము – కీటత్వము) కలిగినది. అందుచే నిది కౌరవులను కీటకములుగాఁ జేసినయాత్రయై [కౌరవాణాం ఘోషత్వ (కీటత్వ) సంపాదికా యాత్రా] ఘోషయాత్ర యను సార్థకనామమును వహించుచున్నది.

తుదకు ఈ పాండవాపహసన యాత్ర దుర్యోధనునకు అపూర్వ నిర్వేదము (దుఃఖమును) ను గల్పించి ప్రాయోపవేశ మొనర్చు స్థితినిఁ దెచ్చినది. అందుచే దుర్యోధనుని హార్ద వేదనాఘోష ప్రకటనాయాత్ర చేతను ఘోషయాత్ర యగుచున్నది. ఈ యాత్ర కంతటికిని హేతువు ధృతరాష్ట్రుఁడు పాండవులను గూర్చి యొనర్చిన స్తుతి (రూప) ఘోష. అందుచే నిది ధృతరాష్ట్రుని పాండవ స్తుతి (రూప) ఘోష వలన కలిగిన యాత్ర కలదియై (ధృతరాష్ట్రవ్య పాండవస్తుతి ఘోషాత్ నిర్వృత్తాయాత్రా – ఘోషయాత్ర యగుచున్నది. ఈ రీతిగా కథాసందర్భముల ననుసరించి ఘోషయాత్రా శబ్దములకుఁ గల అర్థముల నన్వయించుచు ఎన్ని రీతుల పరికించి చూచినను, ఈ ఘట్టమునకు "ఘోషయాత్ర" అను నామ మెంతయుఁ దగియుండి వ్యాసభగవానుని కథాఘట్ట నామకరణౌచిత్యమును మనోజ్ఞముగ వెల్లడించుచున్నది.

## అధఃసూచిక

1. ఇతఁడు అన్నియెడల తన పేరు ఎఱ్ఱయ అనియే వ్యవహరించెను. ఐనను, భారత ప్రతులలో "ఇక్కడి నుండి ఎఱ్ఱాప్రగడ కవిత్వము" అని యుండుటచేత, పేరు చివర ప్రెగడ యను గౌరవనామము చేర్చియే వ్యవహరించుచుండిరని భావింపఁదగును. అనపోతా రెడ్డి కొల్లూరు శాసనములో ఉదహరింపఁబడిన 'యఱ్ర ప్రగడగారు' ఇతఁడే యైనచో, అది మరింత ధ్రువపడును. "తెలుఁగు విజ్ఞాన సర్వస్వము - పే.733 "స్ఫురదరుణాంశు" లోని 'అరుణ' తన పేరుగఁ జెప్పినాఁడా?

2. చదలవాడ మల్లన: ఆరణ్యపర్వశేషము, రామాయణము, నృసింహపురాణము, హరివంశము; కందుకూరి వీరేశలింగము : ఆరణ్య పర్వశేషములు, నృసింహపురాణము - ఆంధ్రకవుల చరిత్ర. పే. 158; శేషాద్రిరమణ కవులు : ఆరణ్యపర్వశేషము, నృసింహపురాణము, రామాయణము, హరివంశము - హరివంశము పీఠిక 1926 వావిళ్ళ ముద్రణము. కవిత్వవేది : రామాయణము, హరివంశము, ఆరణ్య పర్వశేషము. నృసింహపురాణము - ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము; మల్లంపల్లి సోమశేఖర శర్మ : ఆరణ్యపర్వశేషము, నృసింహపురాణము, రామాయణము, హరివంశము (History of the Reddy Kingdoms p. 497). చాగంటి శేషయ్య : ఆరణ్య పర్వశేషము, నృసింహ పురాణము, రామాయణము, హరివంశము - ఆంధ్ర కవితరంగిణి సంపుటము IV పుట 58; పింగళి లక్ష్మీకాంతము : రామాయణము, హరివంశము, ఆరణ్యపర్వశేషము, నృసింహపురాణము; ఆంధ్రసర్వస్వము పుటలు 275 - 302; నిడుదవోలు వేంకటరావు : ఆరణ్యపర్వశేషము, నృసింహ పురాణము, రామాయణము, హరివంశము; పరిశోధన ఫిబ్రవరి మార్చి 1956 - పుటలు 10-14; నోరి నరసింహశాస్త్రి : ఆరణ్యపర్వశేషము, నృసింహ పురాణము, రామాయణము, హరివంశము : తెలుఁగు విజ్ఞాన సర్వస్వము సం 3. పు. 734.

3. ఆరణ్యపర్వము విఘ్నకారి అను ప్రతీతి దేశమున (ఆంధ్రదేశముననే కాక భారత దేశమంతటను) నుండుటచే, ఎఱ్ఱన తనకును నన్నయకు వలె మతిభ్రమణమో, మరణమో కలుగునను భీతిచే, ఆరణ్య పర్వశేషమును పూరించి నన్నయభట్టు పేరనే వెలయించియు (భారతకవులలో నొకఁడను గావలెనన్న) కీర్తిప్రియత్వము వలన పర్వాంతమున నీ పద్యములను దానే చెప్పినాఁడనుట యుక్తిసహమని కొందఱందురు. "నన్నయభట్టు తెనుఁగునన్ మహాభారతసంహితారచన బంధురుఁ డయ్యె" అని నన్నయ తన్ను గూర్చి ఇట్లు ఎవరో చెప్పినట్లు చెప్పు కొనినాఁడని వారి అభిప్రాయము.

4. ఉన్నయశబ్దమునకు 'ఊహించుట', 'పైకివచ్చునట్లు చేయుట' వాక్యార్థము లైనను 'కడముట్టించుట' అను లక్ష్యార్థమున ఎఱ్ఱన ప్రయోగించినాఁడని, 'ఊర్ధ్వమును పొందించుట' అను అర్థముగల ఈ ఉన్నయ శబ్దము "ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబుల (పథంబుల) కావ్యకర్తవై" అన్న పద్యమున "నిర్వహించితి" తో అన్వయించుటచే, తుదముట్టించితి నన్నదే తాత్పర్యార్థమని శ్రీ వేలూరి శివరామశాస్త్రి 'హరివంశ పీఠిక'లో నిరూపించినారు.

5. తిక్కన, ఆయన శిష్యుఁడు మారన నన్నయ ''మూఁడు పర్వములను'' జెప్పినాఁడనుటను, భాసుని ఊరుభంగనాటకమున దుర్యోధనుఁడు బల రామునితో అన్న "ప్రతిజ్ఞా న సితే భీమే గతే భ్రాతృశ తే దివమ్, మయిచైవం గతే రామః విగ్రహః ఓ రామా! కిం కరిష్యతి?" నా తమ్ములు నూర్గురు గతించిరి నా స్థితి యిట్లుండెను! ఓ రామా! ఇంకను నాకు యుద్ధమెందుకయ్యా? అన్నచోట (తనతోఁ గలసిన కౌరవసోదరులు నూరుగురై యుండ నూర్వురు సోదరులు మరణించినా రనినపుడు) భ్రాతృశత శబ్దమును అర్థమొనర్చుకొనిన రీతిని అర్థ మొనర్చుకొనవలయునని సమంజసముగ శ్రీ దీపాల సూచించినారు. (భారతి జులై, 59. పు. 30).

# శివరాత్రి మాహాత్మ్యము

"శివరాత్రి మాహాత్మ్య" మను ఆంధ్ర ప్రబంధము శ్రీనాథ మహాకవి శ్రీశైలమందలి యొక శైవపీఠమున కధిపతియైన శ్రీ శాంతభిక్షావృత్తి యతివర్యుని కోర్కెపై, నాతని మూలభృత్యుఁడైన ఉప్పలపు – (పువ్వుల) ముమ్మడి దేవయ్య శాంతయ్య కంకితముగఁ జెప్పిన కృతి. ఇది ఐదాశ్వాసముల కావ్యము. దీనికి మూలము స్కాంద పురాణ మందలి ఈశానసంహిత. శివరాత్రి చరిత్రమైన దీనియందు "లింగోద్భవము, శివరాత్రి మాహాత్మ్యము (సుకుమార చరిత్ర), యమభట ప్రమథుల కలహము" అనునవి కథావిషయములు.

తొలుత ఈ కృతి శిథిలరూపమున నాలుగాశ్వాసముల గ్రంథముగా లభించినది. దీని ప్రథమ ముద్రణము 1918 ప్రాంతమునను, ద్వితీయ ముద్రణము 1930 లోను, కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ముద్రించినారు. ఈ నాలుగాశ్వాసముల గ్రంథమును జూచి పండితులలో కొందరు ఇది సంపూర్ణమనియు, కొంద అసంపూర్ణమనియు భావించిరి. వీరిలో ఈశానసంహితయందలి కథనుబట్టి మఱియొక యాశ్వాస కథ యున్నదనినవారి అభిప్రాయమే సత్యమైనది. తెలంగాణమందలి శ్రీ శంకు శంకరప్పగారి యింట లభించిన పూర్ణగ్రంథమును (అయిదాశ్వాసములతోఁ గూడినది) శ్రీ డాక్టర్ బి. రామరాజు 1966లో ప్రథమతః సుపరిష్కృత మొనర్చి ముద్రించినారు. వీరొనర్చిన మహోపకృతివలన కవిసార్వభౌముని శివరాత్రి మాహాత్మ్యమును సమగ్రరూపమున ఆంధ్ర పాఠకలోకము పఠించి యానందించు నవకాశము లభ్యమైనది. పూర్వము లభించిన గ్రంథమునందలి శిథిలభాగము లభించుటయే గాక, చతుర్థాశ్వాసాంతమున మహర్షులు "సుకుమారుని గూర్చి జరిగిన కలహమున ప్రమథులకూడి యముం డేమిసేసె పిదప" అని సూతునడిగిన ప్రశ్నకు సమాధానముగఁ జెప్పిన అయిదవ యాశ్వాసకథ లభించుట యీ ప్రతియందలి విశేషములు.

శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యరచనాకాలమును గూర్చియు పండితలోకమునందు భిన్నాభిప్రాయములు వెలసినవి. తొలుత లభించిన గ్రంథమున దోషములు విశేషముగా

నుండుటచే ఇది శ్రీనాథుని బాల్యకవిత యని శ్రీ నాగపూడి కుప్పుస్వామయ్య భావించిరి. శ్రీనాథ మహాకవి కర్ణాటదేశ సంచార మొనర్చి కవిసార్వభౌమ బిరుద మందుకొన్న పిదప నైషధ హరవిలాసములకుఁ దఱువాతను, భీమఖండమునకుఁ బూర్వమును నీ కృతిని చెప్పినాఁడని శ్రీ వీరేశలింగం పంతులు అభిప్రాయపడినారు. “సుతుని నుద్యుక్త శాంతాత్మునిన్, నేర్పరతఁడు, కాకోదర గ్రామణి కంఠగ్నివేయుఁడు” – మొదలైన దోషములు పీఠికాభాగమున మాత్రమే యుండుట చేతను, మిగిలిన గ్రంథమందలి శైలి శ్రీనాథుని యితర రచన కెందును దీసిపోకపోవుటవలనను, శ్రీ కుప్పుస్వామయ్య యూహగాని, వీరేశలింగం పంతులు ఊహగాని సమంజసమైనది కాదని శ్రీ కట్టి సాంబమూర్తి శాస్త్రి త్రోసిపుచ్చినారు. “క్రీ.శ. 1405లో శ్రీనాథుని పోషకుఁడు కొండవీటి రెడ్డి సామ్రాజ్య చక్రవర్తియునైన పెదకోమటి వేమారెడ్డి శివరాత్రి పుణ్యకాలమున నాతని గురువైన శంకరమేనికి ‘పినపాడు’ అను గ్రామమును దానమిచ్చినాఁడు. ఆ శాసనకర్త శ్రీనాథుఁడు. ఆ సందర్భముననే శ్రీనాథునకు శ్రీ శివరాత్రి మాహాత్మ్యకృతి చెప్పవలెనను భావము కలిగియుండవచ్చును. ఈ కవిసార్వభౌముఁడు పంచారామాప్సరః కురంగేశ్వరుల నామములను తొలుతనే భీమఖండమునఁ జెప్పియున్నాఁడు. అది శివరాత్రి మాహాత్మ్యమునఁ గన్పించుటచేతను, కాశీఖండములోని గుణనిధి చరిత్రమందలి “అరుణ గభస్తిబింబ ముదయాద్రి తటంబున” ఇత్యాది పద్యమును యథాతథముగా స్వీకరించి శివరాత్రి మాహాత్మ్యమున నుపయోగించు చేతను, ప్రాయము గైవ్రాలిన వెనుక నీ కృతిని చెప్పినాఁడని శ్రీ కట్టి సాంబమూర్తి భావించినారు. శ్రీనాథమహాకవి ఆశ్రయులు, దాతలు అడుగంటిన వెనుక చిత్తశాంతికై శ్రీశైలమున కేఁగినపుడు శాంతభిక్షావృత్తి యతీశ్వరుల యాదేశమున ఈ కృతిని క్రీ.శ. 1440 ప్రాంతమునఁ జెప్పినాఁడని శ్రీ సాంబమూర్తి శాస్త్రి అభిప్రాయము. శ్రీ ప్రభాకరశాస్త్రి, శ్రీ బండారు తమ్మయ్య, శ్రీ చాగంటి శేషయ్యలును నిట్లే తలఁచిరి. శ్రీ చెన్నాప్రగడ తిరుపతిరావు శ్రీనాథ కవిసార్వభౌముఁడు కాశీఖండమునకుఁ బూర్వము రచించినట్లు నిర్ణయించినారు. (పీఠిక– శ్రీ బి. రామరాజు శివరాత్రి మాహాత్మ్యము – ఆంధ్ర సారస్వత పరిషత్తువారి ముద్రణము).

శివరాత్రిమాహాత్మ్యమున శ్రీ శాంత భిక్షావృత్తి యతీశ్వరుని కోర్కెపై శ్రీశైలమున సభ గావించి శ్రీనాథ కవిసార్వభౌముని సత్కరించి, యా మహనీయుని ముఖ్యభృత్యుఁడై ముమ్మడి శాంతయ్య కృతినందుటచే పవిత్రగ్రంథ మనియును, కావ్యశైలీపరిగణనచే ప్రౌఢగ్రంథ మనియును వ్యక్తమగుచున్నది. ఈ గ్రంథమును శ్రీనాథ మహాకవీంద్రుని ఏకలవ్యశిష్యులలో నగ్రగణ్యుఁడైన ఆంధ్రకవితాపితామహుఁడు అల్లసాని పెద్దన పఠించి

అనుకరించినాఁడనుటకు, ఇందలి "కాయజ విక్రియం బడయు గాని కులంబున సంభవించి", "వ్రాలెం బశ్చిమశైల శృంగము పయిన్", "క్రుంకె విభాకరబింబము" ఇత్యాదులకు మనుచరిత్రమందలి సుప్రసిద్ధములైన "తరుణి నన్య కాంత", "శ్రేణుల్ గట్టి నభోంతరాళమున బాఱెంబక్షు" ఇత్యాదు లనుకరణములై యుండుట తార్కాణము. రామకృష్ణునకు నిగమశర్మ పాత్రచిత్రణమునందు కాశీఖండములోని గుణనిధితోఁ బాటుగ, సుకుమారుఁడును దోడ్పడియుండునని యూహించుటలో అసత్యముండదు. శ్రీనాథునియెడ భక్తిగలవారైనను రాయల యుగమందలి యనేక కవు లీ గ్రంథము నుండియు, శ్రీనాథుని అన్యగ్రంథముల నుండియు నెంతయో గ్రహించియు శ్రీనాథుని స్తుతింపకపోవుటకు, ఆతఁడు రెడ్లయాస్థానకవి యగుటచే రాయలకు కోపము వచ్చునను భీతి కారణమై యుండవచ్చును.

శివరాత్రి మాహాత్మ్యమునందలి 'ప్రథమాశ్వాసమున లింగోద్భవము, బ్రహ్మ విష్ణువులు సదాశివు నెఱుఁగుట, శివుఁడు వారికి శివరాత్రివ్రత మనుష్ఠింప వలసినదని వాని క్రమమును జెప్పుట' యనునవి కథావస్తువులు. శివరాత్రి మహిమను గూర్చి తెల్పుచు ఆశ్వాసాంతమునందు "అది బ్రహ్మహత్య, సురాపాన, వీరహత్యాది పాపములను పోఁగొట్టు" నని చెప్పి, కథకుడు "తొల్లియొక బ్రాహ్మణుండు మహాపాపంబులుచేసి శివరాత్రి దర్శనంబున శివపురంబునకుఁ జనియె" ననఁగా, శౌనకాదిమును లా కథను జెప్పకోరుటతో, ద్వితీయాశ్వాసమునుండి సుకుమార చరిత్ర మారంభ మైనది. ద్వితీయాశ్వాసమున రత్నపుర వర్ణనము, హేమాంగదరాజ వర్ణనము, యజ్ఞదత్తామాత్యచరిత్ర, సుశీలాదేవి పుత్రవిరహము, ఆమె గర్భవతియగుట, సీమంతోత్సవము, సుకుమారజననము, సుకుమారుని యౌవనారంభ దుర్వృత్తి, తండ్రి హితోపదేశములు కథాంశములు. సుకుమారుఁడు పరస్త్రీలను వినోదింప నిశ్చయించుట, హేమాంగద రాజతనిని దేశము నుండి వెడలఁగొట్టించుట, హూణ మండలమునకు వచ్చి వనమున నొక సరోవరము కడ మఱ్ఱిచెట్టు క్రింద నిద్రించి మేల్కొని, మాతంగకన్యను జూచి వలచుట, ఆమె కొఱకు యెఱుక పడకుండ బోయవీడున జీవించుట, భద్రకాళి యుత్సవములలో హూణమండలమును విడిచి దూరమున కేగుట, చండాలపత్ని ఇరువురు కుమార్తెలను, ఇరువురు కుమారులను గని మరణించుట, అతఁడు అరువదియేండ్ల వయసున కుమార్తెల నిరువురను జెఱచుట, బ్రాహ్మణు లాతని దుర్వృత్తినెఱిఁగి ఊరినుండి వెడలఁగొట్టించుట, అతఁడు శివరాత్రి పుణ్యకాలమునకు నాగేశమను తీర్థమునకుఁ జేరి కుడిచేత మాంసఖండములు, ఎడమచేత మద్యరససహితమైన కంచుకుడక పుచ్చుకొని మదముతో, వణఁకు నడకతో,

పుష్పవాటికలోని పూలుగోసి తన "ప్రియ-పుత్రిక"లకుఁ గొనిపోవుటకై నాగేశ్వరుని గుడికి వచ్చుట, ఆ గుడియందు జరుగు శివరాత్రి పుణ్యకలాపమును అర్ధరాత్రివరకును దర్శించి, ఇంటికేఁగి పిమ్మట కొంతకాలమునకుఁ జచ్చుట, శివరాత్రి జాగరణ, పుణ్యవ్రతావలోకన పుణ్యముతోఁ జచ్చిన పరమపాపియగు ఆతని నే లోకమునఁ జేర్చుటయను విషయమునుగూర్చి యమభటులు, ప్రమథులు వాదోపవాదము లొనర్చి రణము గావించుట, యమభటు లోడుట, శివలోకమును జేరిన సుకుమారుఁడు శివుని స్తుతించి కామగమనము, రుద్రకన్యాసహస్ర కలితమైన దివ్యవిమానమును, ప్రమథత్వమును పొందుటలతో చతుర్థాశ్వాసము ముగియును.

సుకుమారుని గూర్చి తన భటులకు ప్రమథులకు నైన యుద్ధమున తన భటు లోడుటను గూర్చి చిత్రగుప్తునితో యముఁడు సంప్రదించుట, "తన యశక్త్యాధికారము శివునకే విన్నవింప నిశ్చయించుకొని కైలాసమున కేగుట, కైలాస వర్ణనము, శివసందర్శనము, శివస్తుతి, యముఁడు సుకుమారుని పాపకార్యములను శివున కెఱిగించుట, శివుఁడు యమునకు శివరాత్రి మాహాత్మ్యము, శివభక్తుల లక్షణములను జెప్పుట, యముఁడు తన లోకమునకుఁ దిరిగివచ్చి తన భటులకు శివరాత్రి మాహాత్మ్యమును, శివభక్తుల లక్షణములు మరలఁ జెప్పుటతో పంచమాశ్వాసము ముగియుచున్నది."

శివరాత్రి మాహాత్మ్యమునందలి ఐదాశ్వాసముల కథకును స్కాంద పురాణాంతర్గతమైన "ఈశాన సంహిత" లోని నూఱుశ్లోకములు శ్రీనాథునకు తొలిమూలము. ఈ నూఱుశ్లోకము లాధారముగాఁగొని కవికుల గురుస్థానము, కల్పవృక్షము నైన బాణుని కాదంబరిలోని వర్ణన లాధారముగ గ్రహించి, శ్రీనాథుఁడు ఇంత పెద్దగ్రంథమును రచించినాఁడు. తొలియాశ్వాసమునకుఁ బిమ్మటి కథయైన సుకుమారచరిత్ర పరిమిత కథావస్తువు గలది. కావున దీనిని [ఈ శివరాత్రి మాహాత్మ్యమును] శ్రీనాథకవిసార్వభౌముఁడు సకల ప్రబంధలక్షణ సమన్వితము గావింపఁదలఁచినాఁడు." [శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి] తనకుఁ బ్రియమైన సౌందర్యదృష్టిని ప్రసరించుటకు, శృంగార రసప్రపంచనము (విస్తరించుటకు) నొనర్చుటకు, వర్ణనాత్మక ప్రౌఢసాహిత్య సౌరభములను వెదజల్లుటకు, శివశక్తి నిరూపణము, ఈశ్వరార్చన కళాశీలమును కనులఁ గట్టించుటకు నిది యోగ్యమైన కథావస్తువుగ శ్రీనాథునకుఁ దోఁచినది. అందుచే నిందు శ్రీనాథమహాకవి తన ప్రౌఢ కవితావిన్యాసములను రసికజనానందకరముగ విన్యసించినాఁడు. లేఖనికజనిత ప్రమాదాదులు కొన్ని యున్నను, కొందఱు భావించినట్లిది శ్రీనాథకవి సార్వభౌముని

అప్రౌఢరచనగాఁగాని, బాల్యరచనగాఁగాని గన్పట్టదు. ఇది శ్రీనాథుని యితర కృతులలోనెందును కవితాగుణములఁ దీసిపోనిదని నిస్సంశయముగఁ జెప్పవచ్చును.

శ్రీనాథమహాకవి శివరాత్రి మాహాత్మ్యమును తన కాశీఖండమందలి కుబేర పూర్తవృత్తకథన సందర్భమున గుణనిధి చరిత్రరూపమున [చతుర్థాశ్వాసము] వర్ణించినాఁడు. ఈ కవిసార్వభౌముని సంస్కృత కవీంద్రులైన శ్రీహర్ష, కాళిదాస, భట్టబాణ, భారవి, మాఘ, మయూరాదులు విశేషముగ చిన్ననాఁడే ఆకర్షించుటవలన, వారి సాహిత్యమునుండి చౌర్యబుద్ధితోఁగాక, ఆంధ్రజాతికి కాన్కలను చేకూర్చు తలఁపుతో నెన్నియో రమణీయభావములుగల శ్లోకములను, మనోహర పదబంధములను స్వీకరించినాఁడు. 'అద్భుత శాస్త్ర బహుకళాపారీణుఁడయిన కాదంబరీ రసాస్వాదన లోలుఁడైన శ్రీనాథమహాకవి దానిని అనువదించు నూహతో శివరాత్రి మాహాత్మ్యమును జెప్పినాఁ 'డని విద్వల్లోకమున నొకయభిప్రాయ మున్నది.

"పూర్వకవిముఖ్య విరచితాపూర్వ కావ్యభావరస సుధాచర్వణ ప్రౌఢుఁడైన శ్రీనాథమహాకవి కాదంబరీభాగముల నందందు బహుళముగ నీ శివరాత్రి మాహాత్మ్యమున జొప్పించినాఁడు. అంతేకాక "కాదంబరిలోని శూద్రకుఁడును తారాపీడుఁడును జేరి యిందు హేమాంగద రూపమునొందిరి. తారాపీడుని పట్టమహిషి విలాసవతియు శూద్రకుని యంతఃపురమున, నిందు యజ్ఞదత్తామాత్యుని భార్య సుశీలగాఁ బరిణమించిరి. కాదంబరిలోని శుకనాసుఁడిందు యజ్ఞదత్తుఁ డయ్యెను. అందలి చంద్రాపీడ, వైశంపాయను లిందు విద్యాభ్యాసకాలమున సుకుమారత్వ మొందిరి. కాదంబరిలో శుకమును దీసికొని 'వచ్చిన చండాలదారికా' రూపచ్ఛన్న యగు మహాలక్ష్మి యిందుఁ గథానాయిక యగు పంచమకన్యగా నవతరించినది. అందలి పక్కణమే యిందలి పక్కణము. అందలి శబరసేనాపతి మాతంగకుఁ డిందు మాలెతతోఁ గాపురమున్న సుకుమార భూమికఁ దాల్చెను. అందలి శబరసైనికు లిందు వృద్ధసుకుమారుని సహచరులు. కాదంబరిలోని తారాపీడుని మహిషి సంతతిలేక విచారించుట, భర్త యామె నోదార్చుట, తాంబూల కరండవాహిని గుట్టు చెప్పుట, శివాలయ పురాణశ్రుతి, దానధర్మాదు లాచరించుట, కుమారసంరక్షణము, శైశవక్రీడలు మొదలగున వెల్ల దీనియందట్లే సలక్షణముగ యజ్ఞదత్తుని భార్య విలాసవతి, వాని కుమారుఁడు సుకుమారుఁడు వీరి విషయమున వర్ణింపఁబడినవి." ఈ అంశముల నెల్ల నాలోచించిన శ్రీనాథమహాకవి ఈశాన సంహితయందలి నూఱుశ్లోకముల మూలము నెట్లు పెంచినాఁడో తెలియుచున్నది. [కాదంబరి యందలి ఆయా

గ్రంథభాగములను ఎట్లు ఆయా సందర్భముల ననువదించినాఁడో తెలియుటకు చూ. శ్రీనాథుని కవితావిశేషములు.]

నలుని మంత్రి సుమతియైయుండ దమనకుఁడనుట (ఆ౨.౧౫), దశరథుఁడు దిగ్గజంబులఁబోలిన కుమారుల నల్వుర అనుచోట (ఆ౨. ౩౫) దిగ్గజములు ఎనిమిదైయుండ నల్వురనుట, సచివు భార్యను పట్టపుదేవి యనుట (ఆ౨.౫౧), యజ్ఞదత్తుని భార్యకుఁ జేయవలసిన సీమంతోన్నయనము హేమంగదరాజు మంత్రిచే చేయించుట మొదలగు స్వల్పదోషములు గలవని యొకరు చూపిన దోషములు బాగుగఁ బరికింప, దోషములు గావనియును నిరూపించు నవకాశమున్నది.

ఈ రీతిగ శ్రీనాథమహాకవి ప్రబంధకావ్యత్వములను సంపాదించుచు అల్పమైన ఈశాన సంహితాకథను మనోజ్ఞవర్ణనాదికముతోఁ బెంచి, ప్రౌఢ సాహిత్యస్ఫూర్తితో శివరాత్రి మాహాత్మ్యమను ప్రబంధ పూర్వయుగమునఁ బుట్టిన యొక కావ్యరత్నముగఁ దీర్చిదిద్దినాఁడు. "శ్రీనాథుని తనము" ఇందు సర్వత్ర గోచరించుచు, కథకు సంబంధము లేకున్నను స్వతంత్ర ముక్తకములుగా నిలువఁదగిన శ్రీనాథముద్రగల పద్యములిందు ఎన్నియో యున్నవి.

## శ్రీనాథుని కవితావిశేషములు

సీ. "సంస్కృత ప్రాకృత శౌరసేనీముఖ్య
భాషాపరిజ్ఞాన పాటవంబు,
పన్నగపతిసార్వభౌమ భాషిత మహా
భాష్య విద్యాసమభ్యాస బలము,
నక్షపాద కణాద పక్షిలోదీరిత
న్యాయకళాకౌశలాతిశయము,
శ్రుతిపురాణాగమస్మృతి సాంఖ్య సిద్ధాంత
కబళనవ్యుత్పత్తి గౌరవంబు

తే. పూర్వకవిముఖ్యవిరచితా పూర్వకావ్య
భావరససుధాచర్వణ ప్రౌఢత"

గలిగిన విద్వత్కవియని సమకాలికుఁడైన దుగ్గన కవివర్యుచేఁ గొనియాడఁ బడినవాఁడు, "సకల విద్యాసనాథు" డైన శ్రీనాథకవిసార్వభౌముఁడు. ప్రౌఢ సాహిత్య నిర్మాత. ప్రబంధయుగ సూర్యోదయమున కరుణోదయమును గల్పించిన "పూర్వ

ప్రబంధ యుగకర్త", "ప్రబంధయుగ నాందీప్రవర్తకుఁడు", "ఆంధ్ర కవితారథమును ప్రబంధమార్గము"నకుఁ ద్రిప్పినవాఁడు, "చిన్నారి పొన్నారి చిఱుతకూకటి నాఁటి" నుండియు, సహస్రమాసజీవియై "దివిజ కవివరులగుండియల్ దిగ్గురనగ నమరపురి కేఁగు" నంతవఱకును అమృతభాండములవంటి అమర కావ్యముల నాంధ్రజాతికిఁ బ్రసాదించిన చిరస్మరణీయుఁడైన మహాకవి శేఖరుఁడు శ్రీనాథుఁడు. భట్టుమూర్తి కొనియాడినట్లుగ నీ మహాకవి "బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమును బ్రోచిన" వాఁడు.

ప్రబంధనామముతో వెల్వడిన గ్రంథముల నన్నిటిని పరిశీలించి చూడఁగా అది అష్టాదశ వర్ణనాత్మకమై, ఏకనాయకాశ్రయమై, వస్త్వైక్యమును (Unity of Subject Matter) గల్గి, శృంగారరసము ప్రధానముగను, అన్యరసములు గౌణములుగను నొప్పుచు, ఆలంకారికరచనను జీవముగాఁగల్గి యొక స్వతంత్రకావ్యమై యొప్పునని వ్యక్తమగుచున్నది. ప్రబంధపూర్వయుగ ప్రవర్తకుఁడైన శ్రీనాథ కవిసార్వభౌముఁడు దరిదాపుగ నీ లక్షణములన్నియును దన "సుకుమార చరిత్ర" మను నామాంతరముగల శివరాత్రి మాహాత్మ్యమునందుఁ గన్పట్టునట్లుగ కావ్యరచన మొనర్చినాఁడు. ప్రబంధ లక్షణమగు వర్ణనప్రాధాన్యమును జూపఁ దలపెట్టఁదలచినవాఁడు గావుననే కృత్యాది యందు "అష్టాదశ వర్ణనాగర్భంబుగా నత్యాశ్చర్యకరంబై యుండ నా రచింపబూనిన కథావిధానంబు" అని చెప్పియున్నాఁడు.

శ్రీనాథుఁడు ఎంతటి ఉద్దండపండితుఁడో అంతటి కవివర్యుఁడు. సర్వ పురాణములతో పరిచయము గల యాతఁడు, శివరాత్రి మాహాత్మ్యము కథావస్తువును స్కాంద పురాణాంతర్గతమైన ఈశాన సంహితనుండి స్వీకరించి, రసవంతమైన కావ్యధోరణితో నీ కావ్యమును జెప్పియున్నాఁడు. ఈశానసంహితయందలి 336 శ్లోకములు దీనికాధారము. శివరాత్రి మాహాత్మ్యమందలి కథ శ్రీనాథుని యితర కావ్యములైన భీమఖండ, కాశీఖండములలోని కథల సంపుటులవలెఁ గాక, అధికమగు వస్త్వైక్యముగల యొకే కథయై యున్నది. శృంగారరసప్రియుఁడును, శివభక్తి తత్పరుఁడును నైన శ్రీనాథునకు ఈ కథావస్తువునందు కొంత ఆత్మీయత గోచరించినది కావున దీనిని గ్రహించియుండును. దీనికిఁ దోడుగ శాంతభిక్షావృత్తి యతీశ్వరుని కోర్కెయును నితని నీ కృతినిర్మాణమునకుఁ బ్రేరేపించి యుండవచ్చును.

మహాకవి శ్రీనాథునకు బాణభట్టారకుని కాదంబరి ననువదించి ఆంధ్రులకుఁ బ్రసాదింపవలయునను కోర్కె యుండెడిది. నైషధమువలె దాని ననువదించు నవకాశము కలుగకపోవుటచే నందలి గుణవిశేషములను, సన్నివేశములను,

భావములను శివరాత్రి మాహాత్మ్యమున విశేషముగా స్వీకరించినాఁడు. శివరాత్రి మాహాత్మ్యము నందు 15, 17, 30, 96, 97, 98 పద్యముల భావములు కాదంబరి నుండి గ్రహించినవే.

'సుకుమార చరిత్రమను నామాంతరముగల శివరాత్రి మాహాత్మ్యమునందు శ్రీనాథకవి సార్వభౌముఁడు, తాను పూర్వము కాశీఖండమునందలి కుబేర వృత్తాంతమునందు (IV–76–163) సృజించిన గుణనిధిని; పాపకార్యము లొనర్చుట యందు వెన్నుఁదన్ని జనించినవానినిగా సృష్టించిన సుకుమారుని పాత్రను రమ్యముగ నిరూపించి తన పాత్రచిత్రణ సామర్థ్యమును ప్రకటించినాఁడు. సుకుమారుని తల్లియైన సుశీలాదేవిని సైతమీతఁడు మహాపతివ్రతగను, ఉత్తమ మాతృమూర్తిగను, అపార పుత్రవత్సలగను రూపొందించినాఁడు. యజ్ఞదత్తమంత్రివర్యుని సైతము నీ మహాకవి మఱపునకు రాని రూపరేఖలతో ప్రణయమనోహరములు, విజ్ఞానోపేతములు నైన సంభాషణలతోఁ జిత్రించి చూపినాఁడు.

ప్రబంధములలో సంభాషణలకు వర్ణనల కున్నంతటి ప్రాధాన్యముండదు. శివరాత్రి మాహాత్మ్యమునందును నీ విశేషము కన్పట్టును. అయ్యును యజ్ఞదత్తుఁడు సంతానము లేక కుములుచున్న దేవేరియగు సుశీలాదేవి నోదార్చువేళ నామెతో నొనర్చిన సంభాషణము, సుకుమారునకు బుద్ధులు సెప్పుచు నొనర్చిన సంభాషణము సందర్భోచితములు, ఔచిత్యశోభితములునై శ్రీనాథుని సంభాషణవిరచన సామర్థ్యమునకు నిదర్శనములై యున్నవి. (ఊరకనుండ నేమిటికి ఇత్యాదులు – 32)

శ్రీనాథ మహాకవి వైదిక లౌకిక సాహిత్యముల నామూలాగ్రముగఁ బరిశీలించిన విజ్ఞాని. అంతేకాక విపులముగ దేశసంచార మొనర్చి దేశమందలి యాచారముల నెల్ల నెఱిగిన లోకజ్ఞుఁడు. ఆ గుణవిశేషములు రెండు నాయన కావ్యములలో ప్రతిఫలించును. సీమంతోత్సవ వర్ణనమునందును, సూతికాగృహవర్ణన వేళయందు శివరాత్రి మాహాత్మ్యమున నీ మహాకవి యాతని శాస్త్రవిజ్ఞాన, లోకజ్ఞతలను ప్రకటించినాఁడు. "మంత్రి వేల్పించె గృహ్యోక్త మార్గమొప్ప" ఇత్యాది శాస్త్ర విజ్ఞానమునకును, "తల యంపి దవళ నిద్రాకుంభమిడువారు" ఇత్యాది లోకజ్ఞతలకును చిన్ని యుదాహరణములు. "అయ్య నీవు చతుర్భుజావతారుఁడ వన్న" ఇత్యాదిగ విత్త మదమత్తులైన వారిని గూర్చి చెప్పిన పద్యము శ్రీనాథుని మనస్తత్త్వ పరిశీలనకు (Study of Psychology) ఒక చిన్ని సాక్ష్యము.

ప్రబంధము వర్ణనప్రధానము. ఈ లక్షణమున కనుగుణముగనే సుకుమార చరిత్రము నందలి ద్వితీయాశ్వాసమున రత్నపురవర్ణనము, ఓంకార నాథవర్ణనము. హేమాంగద రాజవర్ణనము, సుశీలాదేవి వంధ్యాత్వ వర్ణనము, సుకుమారోదయవర్ణనము మొదలైన వానినెల్ల ప్రౌఢ ప్రబంధమార్గము ననుసరించి వర్ణించినాఁడు. ఇందలి రత్నపురవర్ణనము తఱువాతి కాలమునఁ బుట్టిన ప్రబంధములలోని ఏ పుర వర్ణనమునకైన మూలమనఁదగినంతగ భాషాభావముల విషయముల రెంటను ప్రౌఢముగ నడిచినది. ఈ వర్ణనలెల్ల రసోచితములై యొప్పినవి.

శ్రీనాథుఁ డెంతటి శైవాత్ముఁడో అంతటి శృంగారరసప్రియుఁడు. యజ్ఞ దత్తామాత్యుని యింట జరిగిన సీమంత పుంసవనోత్సవములకు పంచారామ లీలావతులు వచ్చినట్టుగాఁ జెప్పిన "ఆదన న్వచ్చిరి సంభ్రమంబునను పంచారామ లీలావతుల్" ఇత్యాదికి కారణ మీ శృంగారరసప్రియత్వమే. సుశీలాదేవి గర్భచిహ్నములు "జహదజహత్సమగ్ర పురుషాయితకేళి విజృంభణంబులై" విలసిల్లినట్లు చెప్పుటయును, "పంచారామ విలాసినీ ధవళదృక్ప్రాలీన జాలాయమానాంచత్కారు" నిగ సుకుమారుని వర్ణించుటయును నీ శృంగారరసప్రియత్వము వలననే.

మ. "చెవికిం గేలివతంసకోత్పలదళశ్రీలై కపోలంబులన్
నవకాలాగరుపత్ర రేఖలయి మేనం గమ్మకస్తూరి యై
ధవళాంభోరుహనేత్రపైఁ గురిసె నుద్యల్లీల సీమంతపుం
సవనాజ్యాహుతిహోమ సంప్రభవ చంచద్వహ్ని ధూమచ్ఛటల్."

అన్న సీమంతోత్సవ వర్ణనయందలి పద్యము శ్రీనాథమహాకవికి గల మనోజ్ఞమైన సౌందర్యదృష్టికి, నిశితభావనాబలమునకు (Power of imagination) నిదర్శనము. సుకుమారుఁడు బాల్యమున కక్ష్యావిభాగములను దాటువేళ నున్న తెరువును వర్ణించుచుఁ జెప్పిన "వలిచన్నుల్ వడఁకాడ" ఇత్యాది వర్ణనకును నీ సౌందర్యదృష్టియే హేతువు. ఈ గుణవిశేషమును బట్టియే మొల్ల శ్రీనాథుని "రసికుఁడైనట్టి శ్రీనాథు" అని ప్రశంసించినది. సుకుమారుని బాల్యముననే "పేరురమునందు ధరించిన దైత్య కైవడిగా" (ప. 78) వర్ణించుట యాతని భావికాల దౌష్ట్యమును వెల్లడించుటకే.

ప్రబంధకవులకు వర్ణనప్రియత్వముతోఁ బాటుగ నలంకార ప్రియత్వము నొక లక్షణము. పురాణకవులు, ఉపమ, రూపకములవంటి సామాన్యాలంకారములతోఁ గవిత చెప్పెదరు. ప్రబంధకవులకు ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, భ్రాంతిమంతము,

విరోధాభాసము మొదలైన అలంకారములపైఁ బ్రీతి విశేషము. పూర్వప్రబంధయుగ కర్తయగు శ్రీనాథుఁడు నీ గుణవిశేషములను తన ఇతర కావ్యములందువలె శివరాత్రి మాహాత్మ్యమునందును ప్రకటించినాఁడు. ఉత్ప్రేక్ష (8), ఉత్ప్రేక్ష (10), విరోధాభాసము (14) ఇత్యాదిగాఁ దన యలంకార ప్రియత్వమును ప్రబంధోచితలక్షణములతోఁ జెప్పినట్లు యిందుఁ బ్రదర్శించినాఁడు. "అప్పట్టణంబు చుట్టును జనపదంబు" లిత్యాది వచనములు కేవలము దీర్ఘసంస్కృత పదసమాసఘటితములై ప్రాబంధికశయ్యతోఁ నొప్పారుచున్నవి.

నానావిధములైన నడకలు గల సీసమున నొకరీతి గమనమును స్థిరీకరించి శ్రీనాథుఁడు అది తన సీస మనిపించుకొనినాఁడు. శివరాత్రి మాహాత్మ్యమునందలి "ప్రణతదేవ కిరీట మణిమయూఖచ్ఛటాపటల కిమ్మీరాంఘ్రి పంకజుండు" – ఇత్యాది సీసము లెల్ల శ్రీనాథుని సీసలక్షణములతోనే యొప్పి నడచినది.

ప్రౌఢశైలికి శ్రీనాథునిది పెట్టిన పేరు. ఈతని శయ్యకు "హర చూడాహరిణాంక వక్రత" (శివుని శిరమందలి చంద్రరేఖకుఁగల వంకరతనము) చండికాపరు షోద్గాఢ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యము గుణములైనట్లు అతఁడే చెప్పుకొనినాఁడు. ఈ మహాకవి భాషానిగుంభనములు పరిమళములతో నొప్పారునవి. రాధామాధవకవి శ్రీనాథుని "సూనాస్త్రప్రమదా మదస్ఫురిత వక్షోజాత కాఠిన్యమున్ బూనంజాలు వచోవిలాసములు" అని మెచ్చినాఁడు. చారు చంద్రోదయకర్త "బహుముఖ ప్రఖ్యాత మహితశయ్యా విశేష సనాథు శ్రీనాథు" అని స్తుతించినాఁడు. ఈతని "రుచిర పదసిద్ధ ధారానిరూఢ మహిమవలననే యితని కచ్యుతత్వము కల్గిన" దని పట్టమట్టకవి పలికినాఁడు. అన్ని తెలుఁగులతో నొప్పు శ్రీనాథశయ్యా విశేషములకును దగిన యుదాహరణములు శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యమున మనకుఁ గన్పట్టుచున్నవి. ఇందలి భాష పురాణ, ప్రబంధధోరణుల రెంటిని సమయోచితముగ బ్రదర్శించుచు హృదయాహ్లాదియైనది. ఇది శ్రీనాథుని అప్రౌఢరచన యనుట కవకాశము లేదు. శ్రీనాథుని కవితయందు గన్పట్టు సర్వగుణవిశేషములును నీ సుకుమార చరిత్రయందలి ద్వితీయాశ్వాసమున ప్రస్ఫుటములుగ గోచరించుచున్నవి. ఇందలి రచన శ్రీనాథుడు ప్రబంధపూర్వయుగ ప్రవర్తకుఁడనుట కెంతయు దగినట్లు నడచినది. శ్రీనాథుని దృష్టి భావమందును "అభిరామ రూపైక పాతకంబు." ఈ గుణవిశేషము చేతనే భట్టుమూర్తి చెప్పినట్లుగ నీ కవిసార్వభౌముడు 'బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమును' బ్రోచినవాఁడైనాఁడు.

## అధఃసూచిక

1. శాంతయ్య ఇంటిపేరు డాక్టరు రామరాజుగారికి లభ్యమైన ప్రతిలో "ఉప్పల" వారని యున్నది. ఇది "ఉత్పల" శబ్దమునకు వికృతియనియు, నిదియే శాంతయ్య యింటిపేరనియు శ్రీ రామరాజుగారు భావించుచున్నారు. ఇది తొలుత నాలుగాశ్వాసములు మాత్రమే లభింపగా శ్రీ కట్టి సాంబమూర్తి గారి పరిష్కరణతో ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు దీనిని ముద్రించినారు. పిమ్మట నైదవ యాశ్వాసముతో పూర్ణముగ లభించిన ప్రతిని పరిష్కరించి, శ్రీ డాక్టరు బి.రామరాజుగారు ఆంధ్ర సారస్వత పరిషత్పక్షమున దీనిని ముద్రించినారు. శ్రీ రామరాజు గారికి లభించినది సమగ్రప్రతి. పూర్వము ముద్రితములైన నాలుగాశ్వాసములలోని శిథిలభాగములు భద్రముగా నుండుటయు, అయిదవ యాశ్వాసముతో నొప్పుటయు దీని ప్రత్యేకత.

# గౌతమ వ్యాసములు

## పింగళి: 'సాహిత్యాది విమర్శ'

గౌతమ వ్యాసములు అప్పుడప్పుడు కార్యవశమున శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు వ్రాసిన వ్యాసములలో, గ్రంథపీఠికలలోఁ గొన్నింటిని సంకలన మొనర్పగా నేర్పడిన వ్యాససంపుటి. శ్రీ పింగళి ఆధునికయుగ మహాకవులలో నొకరు. ఆధునిక కావ్యప్రపంచమున నొక విశిష్టస్థానమును గడించుకొన్న 'సౌందర నంద' కావ్యకర్తలలో నొకరు. ఆధునికయుగకర్తలైన తిరుపతి – వేంకటకవుల ప్రముఖశిష్యులలో నొకరు. ఉత్తమపండితులు. వాఙ్మయచరిత్రకారులు. సాహిత్యాచార్యులు. ఆంధ్రసాహిత్య విమర్శకు స్థాపనాచార్యులు. కొంత కాలము మదరాసు విశ్వవిద్యాలయమున 'రీసెర్చి ఫెలో'గా ఉద్యోగమును నిర్వహించి, పిమ్మట ఆంధ్ర విశ్వవిద్యాలయమున ఆంధ్రశాఖాధ్యక్షులై, నేటి యువకవి పండితుల కనేకుల కాచార్యులై సాహిత్యభిక్ష పెట్టి, అభిరుచులు నేర్పిన ఆచార్యోత్తములు వీరు. ఆంధ్ర విశ్వవిద్యాలయమున ఆంధ్ర శాఖాధ్యక్షులుగా ఉద్యోగమును నిర్వహించుచున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయమున గురుపీఠమును వహించిన కాలమున వీరు సమగ్రమైన 'ఆంధ్ర సాహిత్య చరిత్రను' 'కావ్య విమర్శను' దర్శించి ఉద్గ్రంథరచన యొనర్చినారు. నేఁడు ప్రచారముననున్న 'యుగ విభజనము' సాహిత్యసిద్ధాంతములు, పరిభాషలు, విమర్శలోని పలుకుబళ్లు, తీరుతెన్నులు అన్నియు వీరు ప్రసాదించినవే. 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' విషయమున నింతటి ఆధికారికప్రవచన మొనర్పగలవారు మరొకరు లేరనుట అతిశయోక్తి కాదు. వీరి సాహిత్యచరిత్ర, కావ్యవిమర్శలు ముద్రితములు కాకపోవుట మన దురదృష్టము. అయినను వీరి అభిప్రాయములు స్థూలారుంధతీ న్యాయమున వీరి "ఆంధ్ర వాఙ్మయ స్థూలస్వరూపము', విజ్ఞానసర్వస్వము నందలి 'తెలుగు వాఙ్మయ' వ్యాసము మొదలగువాని వలనఁ దెలియుచున్నది.

సాహిత్యవిమర్శకునకు, సాహిత్యచరిత్రకారునకు నవసరమైన సమస్త వ్యుత్పత్తియు వీరికున్నది. సహజ ప్రతిభావంతులు. బహుగ్రంథద్రష్టలు, సామాన్యముగ వాఙ్మయ చరిత్రకారులలో ననేకులు కవులై యుండరు. సాహిత్యచరిత్ర ప్రధానముగ

కవికృతములైన కావ్యముల చరిత్ర, జాతి ఆంతరంగిక చరిత్ర, సంస్కృతి చరిత్ర. ఇట్టి స్థితిలో కవితతో పరిచయము లేని వాఙ్మయచరిత్రకారుల రచనలు కావ్యసంబంధులైన బాహ్యావిషయములపైననే నడుచునుగాని, వాని యథాశక్తిని గుర్తించినవిగా దోపవు. శ్రీ పింగళి ప్రథమతః కవులై యుండుటచే, వీరి రచనలో కవితాతత్త్వ మెఱిగిన అట్టి నిగూఢరహస్యములు కన్పట్టును. కవితాశిల్పవిశేషమును కవి యెఱిగినట్లుగ నన్యు లెఱుగరనుటకు వీరి వాఙ్మయచరిత్ర సంబంధములైన రచనలు చక్కని నిదర్శనలు. 'To Judge a poet one must be a poet' అన్న ఆంగ్ల విమర్శకవాక్యము సర్వత్ర, సర్వకాలములందును సత్యము. ఉత్తమ మధ్యమాధమ కవిత్వనిర్ణయమును కవియే ఎఱుగఁగలడు. సోమన ఎఱ్ఱనల కవితాతారతమ్య నిరూపణమున శ్రీ పింగళి యిట్టి స్వీయప్రతిభనే ప్రదర్శించినారు.

ఎక్కువమంది సాహిత్యవిమర్శకులు గ్రంథపీఠికలను, పత్రికలలో ప్రచురితములైన విమర్శ వ్యాసములను జదివి వాఙ్మయచరిత్ర రచనకు బూనుకొందురు. వారివలె గాక శ్రీ పింగళి సర్వమూలగ్రంథములను ఆమూలాగ్రముగఁ జదివి, అంతశ్శుద్ధితో పలుకుచున్నట్లు 'సర్వత్ర' గోచరించును. బహుకాలము రీసెర్చి ఫెలోగను, అధ్యాపకులుగను, ఆచార్యులుగను ఉద్యోగముల నిర్వహించుటచేతను, కొన్ని కవితోద్యమములతో సూటిగ పరిచయముండుట వలనను, నిట్టి యవకాశము వీరికి పుష్కలముగ లభించినది. వీరికి కేవలము శాబ్దికచర్చతో గూడిన ప్రాచీన విమర్శకులతోనే గాక, ప్రాచ్య పాశ్చాత్యములైన కవితావిమర్శలతోను గాఢ పరిచయమున్నట్లు వీరి విమర్శలు సర్వత్ర సాక్ష్యమిచ్చుచున్నవి. నన్నయ మొదలు నేటివరకును అవిచ్ఛిన్నముగ, ననేక రసప్రవాహముల సంగమమై స్రవించిన ఆంధ్ర సాహిత్య స్రవంతిని సమగ్రస్ఫూర్తితో దర్శించి, యాయా ప్రవాహముల మూల్యములను, వానివలన జేకూరిన ప్రయోజనాదికమును అవగాహన మొనర్చుకొని శ్రీ పింగళి సాహిత్య విమర్శయొనర్చినారు.

శ్రీ పింగళి విమర్శలో గన్పట్టునది సత్యదృష్టి, సమగ్రదృష్టి, సమన్వయదృష్టి. రంగనాథ రామాయణ కర్తృత్వవిషయమున లాక్షణికుల సాక్ష్యమును త్రోసిపుచ్చి, బుద్ధరాజే యేతద్గ్రంథకర్తయని నిర్ణయించుట సత్యదృష్టికి, కవితావిర్భావము ఆటపాట (Ballad) గ ప్రారంభమై పద్యకవితగ పరిణమించిన స్థితిని నిరూపించుటలో సమగ్రదృష్టికి, శ్రీనాథుని శైలి పురాణ ప్రబంధకవుల శైలులకు సమన్వయ మనుటలోను, రంగనాథ రామాయణకర్త సోమనాథుని కంటె మిన్నయనుటలో

నొనర్చిన విమర్శ సమన్వయదృష్టికి నిదర్శనములు. శ్రీ పింగళి గొప్ప భావనాబలము గలవారు. ఒక్క యుగకర్త కాలమును, సాంఘికాది పరిస్థితులను సమ్యగ్భావనాబలముచే నూహించి, కవితలో దానిని సమన్వయ మొనర్చుటలో వీరు అనన్యులు. కవిబ్రహ్మ తిక్కన భారతప్రశస్తిని నిరూపించువేళ తమ శక్తిని బహుళముగ ప్రదర్శించినారు. సాహిత్య కళానిర్మితికి శబ్దార్థములు రెండును సాధనములు. వీనిలో వీరికి శబ్దము కంటె నర్థముపై ప్రీతి యధికము. కవితాశిల్పము కంటె కొంత విజ్ఞానాధాయకత్వముపై నభిమాన మతిశయముగా నున్నట్లు గోచరించును. వీరి విమర్శలలో ఒక జాతి రసికుల దృష్టిలో నన్నయ, నాచన సోమన, శ్రీకృష్ణరాయాది మహాకవులు దెబ్బతిన్నారన్న భావమున్నది. దీనికి రుచియందలి భిన్నతయే గాని పక్షపాతాదికము కారణము కాదని తోచుచున్నది. అట్లని వీరు కేవల విజ్ఞానాధాయకత్వమును కళగా నుద్దేశింపరు. అధ్యక్షోపన్యాసమున సాంఘికనాటకములను గూర్చి చెప్పుచు, నీ విషయమును స్పష్టముగ వెల్లడించినారు. విజ్ఞానమిచ్చుట అను పనిని సినిమాలకు, పత్రికలకు నితరరీతి రచనలకు విడిచిపెట్టవలెనని వీరి మతము.

రజోగుణవిజృంభణము నడుపులో పెట్టగల సత్త్వప్రాధాన్యమును, వీరు కవులందు ప్రధానముగ నాసింతురు. నాటకీయతటస్థత (Dramatic Objectivity) తో పాత్రసృష్టి యొనర్పగల తిక్కన, పెద్దనాదులపై వీరికి ప్రీతి. కేవల వర్ణనప్రతిభ నిర్వేలముగ బ్రదర్శించుట వీరికి విశేషముగ గిట్టదు. వర్ణనప్రధానములైన ప్రబంధము లందును వీరు కథానిర్మాణము (Structure of the Plot), పాత్ర సంభాషణవిరచన సామర్థ్యము, శయ్యాసమతల వెదకెదరు. వీరికి శబ్దాలంకారములపై దృష్టి తక్కువ. భావన కిచ్చినంతటి గౌరవమును వీరు దాని ఆభాసరూపమైన ఊహ (Fancy) కు ఇవ్వరు. ఇది ఎంతయు నుచితమైన మర్యాద. వీరి విమర్శలందు వెదకినచో ఉత్తమ సాహిత్యవిమర్శకుఁడు సాహిత్యమున గమనింపవలసిన సార్వజనీనత, సార్వకాలీనత, మనోధర్మ నిరూపణము, పాత్రసృష్టి, సత్యప్రాధాన్యము ఇత్యాదులైన, ముఖ్యగుణ విశేషనిరూపణము గోచరించును. ఇట్టి ఉత్తమజిజ్ఞాసతో సాహిత్యవిమర్శ, వాఙ్మయచరిత్ర రచన మన ఆంధ్ర సాహిత్యమున నెలకొల్పినవారు శ్రీ పింగళి. కావుననే వీరిని 'ఆంధ్ర విమర్శ స్థాపనాచార్యులు' అనుట సమంజసము. నేటి విమర్శయంతయును వీరిచ్చిన గీటురాళ్ళతోనే (Touch-stones) సాగుచుండుట వీరీబిరుదమున కెంతయు తగినవారని నిరూపించుచున్నది.

నేటి వాఙ్మయచరిత్రకారులలోను, విమర్శకులలోను అన్యుల భావములను, అభిప్రాయములను స్వకీయముగా చెప్పికొనుట ఒక ఆచారమైనది. శ్రీ పింగళి

కృతజ్ఞతాబుద్ధితో నట్టి భావములకు మూలపురుషులను స్మరించుట (శ్రీనాథుని గూర్చి చిలుకూరి; తిక్కన పోతనలను గూర్చి ఉన్నవ ప్రసంగవశమున నన్న అభిప్రాయములను వారివిగనే ప్రదర్శించుట యిందు కుదాహరణము) వీరి రచనాస్వచ్ఛతకు నిదర్శనము. వీరి భాష నిబిడమైనది. వ్యర్థపదవిరహితము, అల్పాక్షరములలో అనల్పార్థము గలది. వస్తువు జిజ్ఞాసాపూర్వకమైనది, నిశితభావ స్ఫోరకమైనది, తారతమ్య నిరూపణాత్మక మైనది. పఠితలకు రచన కొలదియైనను మరింతగ నంతయు నీయగల్గినది.

## అధ్యక్షోపన్యాస విమర్శ

అధ్యక్షోపన్యాసమున నటనానుభవము పుష్కలముగ నున్న శ్రీ పింగళి వెల్లడించిన భావములు సమంజసములు, సత్యనిరూపకములు. నృత్త, నృత్య, నాట్య విభేదములను కనులకు గట్టినట్లు వీరొనర్చిన నిరూపణము, మార్గ – దేశి నాటకములను గూర్చి చేసిన ప్రసంగము వీరి నిశితావగాహనశక్తికి, చరిత్రాత్మకదృష్టికి తార్కాణములు. స్త్రీలే స్త్రీపాత్రధారణ మొనర్పవలెనన్న సిద్ధాంతము సమంజసము కాదని, వీరు 'రూపానురూపనాట్యము' వంకకు మొగ్గుచు, పాత్రధారణకు రేఖభావనను ప్రధానమనుట వీరి భావుకతకు, విజ్ఞతకు నిదర్శనములు. స్త్రీలే స్త్రీ పాత్రలు వేయవలెనన్న సిద్ధాంతము తుదముట్టదన్న వీరి వాక్కు వీరి దూరదృష్టిని వెల్లడించుచున్నది. వీరన్నట్లు ఇది తుదముట్టదని ఈ నాటికే నిరూపితమైనది. స్థానం, జగ్గరాజులను మించు నటీమణులు రంగస్థలమున ప్రవేశింపలేదు. రాజేశ్వరి, పూర్ణిమ, అనసూయలవంటి నటీమణులు కొందరు రంగస్థలమున ప్రవేశించి ప్రతిభను ప్రదర్శించినను, వారిలో సహజ స్త్రీత్వమూలకమైన ప్రదర్శనమేగాని, కళాత్మకమైన (రూపానురూప నాట్యాత్మకమైన) కళ కన్పట్టదని విమర్శకులనుచున్నారు. ఈ సిద్ధాంతము మూలముగా పురుషులు తొలినాటివలె స్త్రీ వేషధారణకు పూను కొనలేకపోవుట, స్త్రీలు విరివిగ రంగస్థలమున ప్రకాశింపకపోవుట, తన్మూలముగ (స్త్రీ వేషధారణము) నాటకప్రదర్శనలు మందగించుట జరుగుచున్నవి. పత్రికలు స్త్రీల రంగప్రవేశార్హత గృహస్థజీవితమునకు దెబ్బకాదని ఎన్ని వ్యాసములు వ్రాయించినను, అవి గృహస్థజీవితమునకు దెబ్బతీయుచునే యున్నట్లు అనుభవము వలన తెలియుచున్నది. అందుచే ఉన్నతవర్గములలోని స్త్రీలు రంగస్థలప్రవేశ మొనర్చుట లేదు. కావున శ్రీ పింగళి సూచించినట్లు పురుషులు కూడా స్త్రీ పాత్రధారణ యొనర్చుట కళ కొఱకును, ప్రదర్శనబాహుళ్యము కొఱకును నత్యవసరమని తోచుచున్నది.

ఉత్తమ నాటకములను పరిషత్తువారు పోటీపరీక్షలను పెట్టి సంపాదింప దలచుటను గూర్చి శ్రీ పింగళి చెప్పినదెల్ల సత్యము. వారన్నట్లు పేరును పణము పెట్టి జూదమాడవలసి వచ్చుటచే, ఉత్తమ రచయితలు పోటీలో పాల్గొనరు. నచ్చిన కవిని పిలిచి గౌరవించి, సంప్రదించి ఆయనచే నాటకమును వ్రాయించుకొనుటయే కర్తవ్యము. ఈ అభిప్రాయమును స్వీకరింపక పోవుటవలన నాటకకళాపరిషత్తు మంచి నాటక మొకటైనను వ్రాయించలేకపోయినది. నాటకము దృశ్యము, శ్రవ్యము రెండును కావలె. కావ్యగౌరవము లేక కేవల ప్రయోగానుకూల్యముగల నాటకము ఉత్తమ నాటకము కాఁజాలదు. సాహితీగుణములను లోపింపఁజేసి ప్రయోగార్హత మాత్రమే యుండునట్లు నాటకమును వ్రాయమని కోరినచో, కవి శబ్దవాచ్యుఁ డెవ్వఁడు నట్టిపని యొనర్పఁడని శ్రీ పింగళి చెప్పిన వాక్యము లెంతయు సత్యము. నేటి నటకులు కేవల ప్రయోగానుకూల్యము గల నాటకములనే వ్రాయుఁడని కోరుటతో, ఉత్తమశ్రేణి కవులెవరును రూపకరచన యొనర్పలేదు. సాంఘికేతివృత్తమును గూర్చి శ్రీ పింగళి చెప్పిన అభిప్రాయములును సత్యములు. నూతనవస్తువును గ్రహించునపుడు ప్రచారనాటకములను వ్రాయింపరాదని, అవి ఆ కార్యము కడముట్టిన వెనుక విస్మృతములగునని శ్రీ పింగళి తెల్పినారు. ఈ భావములు అనుభవమున సత్యములని నిరూపితములైనవి. అదియును గాక ఈ నాఁడు సంఘమున నే వర్గమువారి నేమియన వీలు లేకుండుట వలనను, కవి యొనర్చిన విమర్శ వ్యక్తులకు సంబంధించినదిగా ప్రేక్షకులు గ్రహింపలేకపోవుట వలనను సాంఘికేతివృత్తములతో నాటకములు మంచివి పుట్టుట లేదు. పద్యపఠనమును గూర్చి వ్యతిరేకభావముండుట, సంప్రదాయ మెఱుగకపోవుట, కేవల పాశ్చాత్య గద్యనాటకమున కొనర్చు నంధానుకరణము. ఈ విషయమున శ్రీ పింగళి "ఏ రసమునకు నే పద్యమునకు నే రాగమెంతవరకు తగునో తెలిసికొని నటుడు పాడుట జరుగవలెను గాని పద్యములనే తుడిచివేయుట వాంఛనీయమైన సంస్కారము కాదు" అని సెలవిచ్చినది సత్యము. ఈ భావమును త్రోసిపుచ్చుట వలననే నాటక పరిణామమున మూఁడు నాలుగు దశలలో నున్నట్లుగ పద్యమును భావయుక్తముగ పాడగల నటులు కరవైనారు. పద్యపఠనమునకు అవసరమైన పరిశ్రమయే సన్నగిల్లినది. నటులకు గాత్రశిక్షణ (Voicce - Culture) అవసరమన్న శ్రీవారి అభిప్రాయము ఉచితమైనది. పద్యమును గాని, వచనమును గాని రక్తికట్టునట్లనుటకు ఈ గాత్రశిక్షణ అత్యవసరము. పాశ్చాత్య నటనటీమణు లీ విషయమున నధికశ్రద్ధ వహించెదరు. నాట్యశాస్త్ర పరిచయము నటకులకు, నాటక ప్రయోక్తలకు నవసరమన్న శ్రీ పింగళి అభిప్రాయమును ఉచితమైనది. కృషి

నాటకరంగమున నిట్టి సూచనలనందుకొని జరుగకపోవుట వలననే నాటకకళకు నేఁడు దుఃస్థితి పట్టినది. ఉద్ధరణను గూర్చి వ్యర్థప్రచారములే గాని, జరుగుచున్న పని అల్పము. ఏ నాఁటికైన నాటకకళను ఉద్ధరించి పోషింపదలచినచో, నపుడైన శ్రీ పింగళి వారి సూచనలను అనుసరించుట తప్పదు. ఈ పింగళి విమర్శ కళారంగ మందును జిజ్ఞాసాత్మకము, సమన్వయమార్గానుసారిణి, ఉత్తమత్వదృష్టి గలది; కళాతత్త్వ విజ్ఞతతో నొప్పినది.

★

# నిగమశర్మోపాఖ్యానము

**(పాండురంగ మాహాత్మ్యము ఆ-1 (1-112)**

## కవి - కాలాదికము

'నిగమశర్మోపాఖ్యానము' పాండురంగ మాహాత్మ్యము ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడినది. "కృష్ణదేవరాయల యనంతరము వెలసిన ప్రౌఢకావ్యములలో పాండురంగ మాహాత్మ్యము ఆంధ్ర సారస్వత ప్రతిష్ఠకు నిధానములైన ఉత్తమరచనలలో నొకటి. ఈ గ్రంథము క్షేత్రమాహాత్మ్యమే యయ్యు ప్రౌఢాలంకారిక శైలినిబట్టి ప్రబంధ జాతిలోఁ జేరినది" (శ్రీ పింగళి లక్ష్మీకాంతము). "ఆంధ్ర పంచ కావ్యములలో నొకటిగఁ బేరెన్నిక గన్నది. ఈ పాండురంగ మాహాత్మ్యకృతికర్త తెనాలి రామకృష్ణకవి (క్రీ.శ. 1505-1575-80). పిన్న వయసున (రామలింగఁడు ఉద్భటారాధ్యచరితను చెప్పిన వేళ) "కుమార భారతి" బిరుదమును వహించినవాఁడును, చరమదశ (పాండురంగ మాహాత్మ్య రచనాకాలమున) "శారద నీ రూపము" (పుంభావ సరస్వతి) యనిపించుకొన్నవాఁడును నైన ప్రౌఢకవి, తెనాలి రామకృష్ణుఁడు. "తరణోపాయము గను, తన కవిత్వపరీక్షకు నికషోపలముగను ప్రౌఢప్రబంధమగు నీ పాండురంగ మాహాత్మ్యమును రచించెను" (శ్రీ బులుసు). పాండురంగ మాహాత్మ్యము పండరిపుర క్షేత్ర మాహాత్మ్యము. ఇందలి ద్వితీయాశ్వాసమునందు 'నిగమశర్మ కథ' యున్నది.

## పాండురంగ మాహాత్మ్యము

"పాండురంగ క్షేత్రమాహాత్మ్యమును ప్రతిపాదించు నీ ప్రబంధమునకు "పాండురంగ మాహాత్మ్య" మను పేరున్నట్లుగ ఆశ్వాసాంతములందలి గద్యమును బట్టి తెలియుచున్నది. రామకృష్ణకవి గ్రంథారంభమున "అభ్యుదయపరంపరాభివృద్ధిగా యొనర్పంబూనిన పౌండరీక మాహాత్మ్యమునకు" అని చెప్పుటచే పాండురంగ మాహాత్మ్యమునకు "పౌండరీక మాహాత్మ్య" మని మఱియొక పేరున్నట్లును దెలియు చున్నది. కాని ఆంధ్రదేశమున నీ కావ్యరాజమునకు పాండురంగ మాహాత్మ్యమను నామమే ప్రసిద్ధమగుచున్నది.

ఉ. “స్కందపురాణ నీరనిధి కౌస్తుభమై ప్రభవించు దేవకీ
నందను సత్కథోదయము నవ్యకవిత్వ కళాకలాపమన్
గుందనముం ఘటించి కడుఁగ్రొత్తగు సొమ్మొనరించి విష్ణు సే
వం దులకించు నప్పరమవైష్ణవకోటి నలంకరింపుమా!”

అని పాండురంగ మాహాత్మ్య కృతిపతియైన విరూరి వేదాద్రి మంత్రి రామకృష్ణకవితో బల్కిన పల్కులను బట్టి, యీ కృతికి స్కాంద పురాణమందలి కథ మూలమని వ్యక్తమగుచున్నది. ఈ పాండురంగ క్షేత్ర మాహాత్మ్యము పద్మపురాణమున నొక యధ్యాయముగ నున్నట్లును దెలియుచున్నది. (p.190 Mate - Temples and legends of Maharashtra) పుండరీకక్షేత్రమునకు విష్ణువు వచ్చిన హేతువు పద్మపురాణమునందు విపులముగ నున్నది. ఇందు విష్ణువును వలచి వచ్చి యపుడు తిరస్కరింపఁబడిన శచీదేవియే యాతని పొందునకై కృష్ణావతారమున రాధయైనట్లును, పుండరీకుఁడు తొలుత తల్లిదండ్రులను కష్టపెట్టి తరువాత పశ్చాత్తప్తుఁడై ఘనసేవ యొనర్చినట్లు మరికొన్ని విశేషములు నున్నవి.

పుండరీకుఁడను బ్రాహ్మణుఁ డొకప్పుడు విష్ణువును గూర్చి తపమొనర్చినంత, నతనికి విష్ణువు “పాండురంగఁ” డను పేరుతోఁ బ్రత్యక్షమై కోరిన వరములిచ్చి, పుండరీకుఁడు తపమొనర్చిన యా క్షేత్రతీర్థములకు పౌండరీకములని పేరు పెట్టి తానచ్చట నుండ నిశ్చయించినాఁడు. కావున నా ప్రదేశము, “తీర్థము, క్షేత్రము, దైవము” – అను మూఁటిని గల్గి ప్రఖ్యాతినొందినది. అచ్చటిది భీమరథితీర్థము. పుండరీకుఁడు క్షేత్రపాలకుఁడు. అచ్చటి దైవమగు పాండురంగనికి విఠలేశ్వరుఁడని పేరు. అచ్చటనే నృసింహతీర్థ మున్నది. నృసింహస్వామియు నున్నాడు. “తీర్థము, క్షేత్రము, దైవము – అను మూఁడును చెప్పు” మని కోరఁగా శివుఁడు పార్వతికి, కుమారస్వామికి, నారదునకు జెప్పినాఁడు. తీర్థ, క్షేత్ర, దైవము లొక్కచోట నుండుట యరిదిగావుననే పౌండరీకము గొప్పదనము. రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యమునకు మూలము స్కాందపురాణము.

## తెనాలి రామకృష్ణకవి : ఆతని కృతులు

తెనాలి రామకృష్ణకవి తెలుఁగు భాషయందలి మహాప్రౌఢకవులలో నొకఁడు. కౌండిన్య గోత్రుఁడు. లక్ష్మమాంబ – రామయల పుత్రుఁడు. తెనాల్యగ్రహార నివాసి. తొలుత వీరి యింటిపేరు గార్లపాటివారు. పాండురంగ మాహాత్మ్యాది కావ్యకర్తయైన

నాతనికి, సుదక్షిణాపరిణయకర్తయైన తెనాలి అన్నయ సోదరుఁడు. “సారస్వతములో తెనాలి రామకృష్ణుని పేరు అందఱకును దెలియును. ఆ తెలియుటకు కారణము ఆతని కవితాశక్తి కాదు. అతని గుఱించి ప్రచారములో నున్న యనేక హాస్యకథలు. దానికి కారణము అందులో నేవి రామకృష్ణునిచే చేయఁబడినవో, యేవి కల్పింపఁబడినవో విడదీసి చెప్పుటకు వీలు లేదు. కాని యొక్కటి మాత్రము నిజము. అతఁడు అమిత వాక్చమత్కృతి గలవాఁడు. ఈ చమత్కృతి యాతని కావ్యములం దెచ్చటను గానరాదు” (శ్రీ విశ్వనాథ).

తెనాలి రామకృష్ణకవి “ఘటికాచల మాహాత్మ్యము, ఉద్భటారాధ్య చరిత్రము, పాండురంగ మాహాత్మ్యము” అను కావ్యములను జెప్పినాఁడు. ఉద్భటారాధ్య చరిత్రకర్త రామలింగకవి యనియు, పాండురంగ మాహాత్మ్యకర్త రామకృష్ణకవి యనియు నున్నవి. ఇద్దరి పేరులు లింగ, కృష్ణ భేదములు కలిగి యుండుట, శైవ వైష్ణవ భేదములు కలిగియుండుట, ఉద్భటారాధ్యకర్త గురువు “పాలగుమ్మి భీమన” (దైవగురువు) అగుట వలన, పాండురంగ కృతికర్త గురువు “భట్టరు చిక్కాచార్యులు” (వైష్ణవగురువు) అగుటవలన, నీ రెండు కావ్యములను రచించిన కవులు భిన్నులను భావము కలుగుచున్నది. అదియును గాక రామకృష్ణకవి సోదరుఁడైన అన్నయ తన సుదక్షిణాపరిణయమున అన్న మతాంతరమును స్వీకరించినాఁడని యేమియు పేర్కొనక పోవుటయును గన్పట్టుచున్నది. కాని తరువాతి కాలమందలి తెనాలి కవులలో ప్రసిద్ధుఁడైన రామభద్ర కవి (ఇందుమతీపరిణయ కర్త) పాండురంగమాహాత్మ్య కృతికర్తయైన రామకృష్ణుని తన పెదతాతగను, సుదక్షిణాపరిణయకర్తయైన అన్నయను చినతాతగను జెప్పినాఁడు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రివంటి పరిశోధకవిద్వాంసులు రామలింగ, రామకృష్ణ కవుల కులగోత్రాదులను, ఉభయులు రచించిన కావ్యములలోని భావము లందలి సామ్యములను, సమకాలీనతను పురస్కరించుకొని, యిరువురు నొక వ్యక్తియేయని నిర్ణయించియున్నారు. దీనినిబట్టి శైవుఁడుగా నున్న కాలమున రామలింగకవి శైవగురు పీఠమైన ఉద్భటారాధ్యుని చరిత్రమును జెప్పినాఁడనియు, వైష్ణవుడైన పిమ్మట రామకృష్ణుఁడై పాండురంగ మాహాత్మ్యమును జెప్పినాఁడనియు నర్థమగుచున్నది.

## రామకృష్ణకవి – కాలము

రామకృష్ణకవి (రామలింగ కవి) ఉద్భటారాధ్య చరిత్రమును, కొండవీటి దుర్గాధ్యక్షుఁడైన నాదెండ్ల గోపమంత్రి కడ ముఖ్యోద్యోగిగా నున్న దేచమంత్రి

కంకితమిచ్చినాఁడు. గోపమంత్రి శ్రీకృష్ణరాయల శిరఃప్రధానియైన సాళువ తిమ్మరుసు మేనల్లుఁడు. శ్రీకృష్ణరాయలు క్రీ.శ. 1515లో కొండవీటి దుర్గమును జయించిన పిదప, తిమ్మరుసు తన మేనల్లుఁడైన గోపమంత్రిని దానికి పాలకునిగా నియమించినాఁడు. క్రీ.శ. 1517లో గోపమంత్రి దేచమంత్రి కొక యగ్రహారమును దానమొనర్చినాఁడు. దేచమంత్రి శైవాచారసంపన్నుఁడు. లొల్ల లక్ష్మీధర పండితుని యనుగ్రహమున శివపంచస్తవికి వ్యాఖ్య వ్రాసినవాఁడు. రామలింగకవి తన ఉద్భటారాధ్యచరిత్రను క్రీ.శ. 1535 ప్రాంతమున దేచమంత్రి కంకితమిచ్చి యుండును. పాండురంగమాహాత్మ్య కృతిపతి విరూరి వేదాద్రి మంత్రి కందాళ అప్పలాచార్య శిష్యుఁడు. ఈ కందాళ అప్పలాచార్యులకు గండికోట ప్రభువు క్రీ.శ. 1582న భూదానమొసఁగినాఁడు. రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యమున తన వైష్ణవగురువును "భట్టరు చిక్కాచార్యుఁ" దని పేర్కొనినాఁడు. పెదసంగ భూపాలుని మేనల్లుఁడు, కొండ్రాజు తిమ్మరాజు కుమారుఁడు అయిన వేంకటాద్రియును చిక్కాచార్యుల శిష్యుఁడు. వేంకటాద్రి క్రీ.శ. 1584లో కామందకమును కృతి నొందినాఁడు. దీనినిబట్టి తెనాలి రామకృష్ణకవి క్రీ.శ. 1565 ప్రాంతమున పాండురంగ మాహాత్మ్యమును జెప్పినట్లుగ నూహింపవచ్చును. పాండురంగ మాహాత్మ్యమున వసుచరిత్ర (ఆ 4 ప 242), ఆముక్తమాల్యద (ఆ 4 ప 242) సూచింపబడినవి. ఆముక్తమాల్యదకుఁ బిమ్మట పుట్టిన వసుచరిత్రయును క్రీ.శ. 1569–70 ప్రాంతమున పుట్టినది. రామకృష్ణకవి అష్టదిగ్గజములలో నొకఁడై శ్రీకృష్ణదేవరాయల యాస్థానమున నుండుట కవకాశమున్నది. కనుక నీ కవివర్యుఁడు క్రీ.శ. 1505 ప్రాంతమున జన్మించి క్రీ.శ. 1575–80 వఱకు జీవించి యుండునని నిర్ణయింపవచ్చును.

## రామకృష్ణుని మతము

రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యము వైష్ణవపరమైన గ్రంథము. అయినను కవి జన్మతః శైవుఁడై బహుకాలము శైవుఁడుగ వర్తించి, శైవమును వలచి ఉద్భటారాధ్య చరిత్రాది గ్రంథములు చెప్పినవాఁడగుట వలన, పాండురంగమాహాత్మ్యమందును శైవము విశేషముగఁ గన్పట్టుచున్నది. జన్మతః వైష్ణవుఁడైన రాయల ఆముక్తమాల్యద గ్రంథావతారికయందు నిత్యముక్తుల స్తుతులు మాత్రమే యుండఁగా, తెచ్చుకొన్న వైష్ణవము గల రామకృష్ణకవి పాండురంగమాహాత్మ్యమున శివస్తుతి, పార్వతీస్తుతి యున్న "ఈ చివురాకు నీ ప్రసవ మీ పువుదేనియ యెంత యొప్పెడున్" – అను పద్యమునందు శ్రీ విశ్వనాథ యన్నట్లు శివభక్తి కే మాత్రము కొదువలేదు. "పాండురంగ

మాహాత్మ్యమున శివప్రశంస యెందువచ్చినను కవియొక్క యూహావైభవ మంతయు గన్పించును'' (శ్రీ విశ్వనాథ). ఇవియన్నియు రామకృష్ణకవి వైష్ణవమును స్వీకరించినవాఁడుగా ధ్రువపరచును. ఈ సందర్భము నొక విమర్శకుఁడు "పిట్టగూడు విడిచి యెంత దవ్వేగినను తన గూటిమీఁదనే యొక కన్నుంచు నన్న విధమున వైష్ణవమత నవలంబించినప్పటికిని సహజమైన యీశ్వరభక్తి వీడలే" దని చెప్పినారు (శ్రీ నూరిగూచ్చి కృష్ణమూర్తి – భారతి క్రోధన – ఆశ్వయుజము).

## పాండురంగ మాహాత్మ్యము : నిగమశర్మోపాఖ్యానము

పాండురంగ మాహాత్మ్యము మనుచరిత్ర, పారిజాతాపహరణముల వలెఁ గాక మొదటినుండియు చివరవఱకును నొక పద్ధతిలోనే హృదయంగమముగ సాగినది. రమ్యములైన కథలు, వర్ణనలు అన్ని యాశ్వాసములందును నున్నవి. "మొదటి యాశ్వాసమున అగస్త్యముని, కుమార వృత్తాంతములును, ద్వితీయాశ్వాసమున నిగమశర్మోపాఖ్యాన, రాధికావృత్తాంతాదికమును, చతుర్థాశ్వాసమున రాధాతపశ్చరణ, సుశీలాదివృత్తాంతములును, ఐదవ యాశ్వాసమున సుశర్మోపాఖ్యానము, అయుతనియుత వృత్తాంతము చాలా చక్కగఁ గూర్పcబడినవి. ప్రతివృత్తాంతమున నొక ప్రత్యేకత యున్నది. కొన్ని విషయములు చర్వితచర్వణములే యైనను క్రొత్తఁదనము కలిగి, పాఠకులకు విసువు కల్గింపక ఆసక్తినే కూర్చుచుండును." (శ్రీ బులుసు)

శ్రీకృష్ణరాయల యుగమునఁ బుట్టిన ఆముక్తమాల్యద, పాండురంగ మాహాత్మ్యము ప్రౌఢప్రబంధములు, శ్రీకాళహస్తి మాహాత్మ్యము మధురకావ్యము. ఆముక్తమాల్యద, కాళహస్తి మాహాత్మ్య, పాండురంగమాహాత్మ్య కావ్యములు భక్తిప్రధానములు. భక్తిభావప్రతిపాదకములైన ఈ కావ్యములు బహుకథా సమ్మిళితములు. పాండురంగమాహాత్మ్యము, శ్రీనాథుని కాశీఖండ, భీమఖండముల వలెను, ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యమువలెను క్షేత్ర మాహాత్మ్యము.

"తెనాలి రామకృష్ణకవి ప్రతిష్ఠ సంపూర్ణముగా నతని పాండురంగ మాహాత్మ్యము మీఁద నాధారపడియున్నది. పలుమంది పెద్దన్నగారి మనుచరిత్రను సంపూర్ణముగా చదువునట్లే పాండురంగ మాహాత్మ్యము కూడా సంపూర్ణముగా చదువరు. కాని నిగమశర్మోపాఖ్యానము, అయుతనియతోపాఖ్యానము ప్రధానముగ చదువుదురు. ఈ రెండు కథలు తెనాలి కవి కవితకు మచ్చుతునకలు. అతని క్రొత్త పలుకుబడి, సర్వవైభవము నీ రెండు కథలయందు సంపూర్ణముగా నున్నది." (శ్రీ విశ్వనాథ)

సదాచార సంపత్తిగల బ్రాహ్మణకుటుంబమునఁ బుట్టిన నిగమశర్మ కామమునకు లొంగి సర్వభ్రష్టుఁడై, సంపదను, వంశమును గోల్పోయి మిత్రద్రోహియై, తుదకు బోయలలోఁ గలిసి, మాలపడుచును వివాహమాడి సంతానమును గని, యామెయు సంతానమును అగ్నిచే దగ్ధమై మృతి నొంద విలపించి, మతిచెడి, ఆహారనిద్రల మాని తుదకు శ్రీనృసింహక్షేత్రమును బ్రవేశించి ప్రాణములు విడిచినాఁడు. యమభటులు పెట్టు చెఱలకు దాళజాలక నిగమశర్మ గట్టిగ నరువఁగా విష్ణుచక్రము వారిని తఱిమి, నిగమశర్మ బంధనములను ద్రెంచివైచినది. అంతట విష్ణుదూతలు వచ్చి యతని శ్వేతద్వీపమందలి పరమపదమునకు గొనిపోయిరి. అట నిగమశర్మ విష్ణుసాయుజ్య మొందినాఁడు.

పాండురంగ మాహాత్మ్యము క్షేత్రమాహాత్మ్యము. క్షేత్రమాహాత్మ్యములందలి కథలలోని పరమార్థము ఎట్టి దురాచారవంతుఁడైనను, ఎన్ని పాపములొనర్చినను, ఎన్ని ఘోరములు చేసినను భగవంతుఁడు ప్రసన్నమైనచో, వానికి మోక్షము లభించుననుట. నిగమశర్మోపాఖ్యానము నందు దానికి మించిన సిద్ధాంతమున్నది. ఇందు శరీరపతనవేళ తాత్కాలికముగనైన భగవద్బుద్ధి లేదు. స్థలము, మరణకాలము, అచటి దేవతామాహాత్మ్యము సన్నిహితములై యుండుటచేత, యాదృచ్ఛికముగా జరిగిన యొక క్రియ భగవత్సేవగా పరిణమించుటచే, నిగమశర్మకు భగవత్సన్నిధానము చేకూరినది.

మనోవాక్కాయ కర్మల సంపుటి యుత్తమభక్తి లక్షణము. ఇట్టి యుత్తమభక్తితో నిగమశర్మ కెట్టి సంబంధమును లేదు. నిగమశర్మ కథ కేవలము పాండురంగ క్షేత్రమాహాత్మ్యార్థమును మాత్రమే నిరూపించుచున్నది. "ఆంధ్రభాషాసారస్వతమునందలి ప్రబంధము..... పాండురంగ మాహాత్మ్యము. ప్రౌఢశైలీనిర్మాణనైపుణ్యముచే కైలాసశిఖరము వంటి పాండురంగ మాహాత్మ్య కథాహారమునకు నిగమశర్మోపాఖ్యానము నాయకమణి."

## నిగమశర్మోపాఖ్యానము – సంఘవృత్తము

నిగమశర్మోపాఖ్యానమునకు నాయకుఁడైన నిగమశర్మ ప్రబంధనాయకులలో నొకఁడైన అవతారపురుషుఁడు గాని, మహారాజుగాని కాఁడు. సంఘమున నొక సంపన్న శ్రోత్రియకుటుంబమున జన్మించినవాఁడు. వేదాధ్యయనము నొనర్చినవాఁడు.

ఇతరవిద్యలు నేర్చినవాఁడు. ఇతని వృత్తము సామాన్యపాఠకుల కనుభవమునకు వచ్చునదై యున్నది. ప్రబంధ కథానాయకుల ధీరోదాత్తాదిగుణములు సామాన్యుల కనుభూతికి వచ్చునవి కావు. రామకృష్ణకవి సామాన్యపాత్రయైన నిగమశర్మ మూలమున సంఘమందలి కొంత మాత్రమైనను పాఠకుల కనుభూతికి సరిపోవునట్లుగ సామర్థ్యముతో వర్ణించి చూపినాఁడు. నిగమశర్మవలె అంగమర్దనము మొదలగు వానిని గావించుకొని పులుగడిగిన ముత్తెమువలె నొప్పుచు నఖక్షత, దంతక్షతములతో సఖులను, పరిహాసకులను వెంటనిడుకొని తిరుగువారు సంఘమున నెల్లవేళల నుందురు. అట్టివారు వ్యసనములకు లోనై యింటనున్న సొమ్మునంతటిని వ్యర్థమొనర్చి, పిదప శరీరము మీఁది సొమ్ములను కుదువఁబెట్టుట, తల్లి సొమ్ములను మెల్లగ దొంగిలించుట, తండ్రికి వ్రాసి ఇచ్చిన పత్రములను పోయినంత కమ్ముట, మితిమీరిన వడ్డికి పత్రములు వ్రాయుట, అమ్ముట మొదలగున వన్నియును నేఁడు సంఘమున కన్పట్టుచున్నవి. నిగమశర్మ వంటివారు నేఁడును సంఘమున నుండి అప్పులు మితిమీరినంత తిండికి, గుడ్డకు లేక యూరు విడిచి తిరుగుట, నీచులను వానికై వేడుట నొనర్చుచునే యుందురు. రామకృష్ణకవి నిగమశర్మ వృత్తమున సరసముగ సాంఘికవృత్తమును, స్మృతికిఁ దెచ్చినాఁడు.

నిగమశర్మ యక్కవంటివారు నేఁడును సంఘమున కన్పట్టుచుందురు. దుర్వ్యసనియైన తమ్ముని మూలముగా పుట్టిల్లు గుల్లయై పోవుచుండ సహింపలేక, చక్కదిద్ద యత్నించు జ్యేష్ఠ సోదరీమణులు నేఁడు నెందరో యున్నారు. అక్క చెప్పిన బుద్ధులను ఒక ప్రయోజనము సాధించుటకై విన్నట్లు విని కొంతకాలము "తేనె పూసిన కత్తివలె వర్తించి" తుద కర్ధరాత్రమున నిగమశర్మ వంటివారు నేఁడు సర్వధన మెత్తుకొని పోవుచుందురు. రామకృష్ణకవి యొక వంక సంఘవృత్తమును స్మరింపఁజేయుచు, నిగమశర్మ మూలమున చక్కని నీతిని సహితము బోధించినాఁడు.

రామకృష్ణకవి నిగమశర్మోపాఖ్యానమున శ్రోత్రియసంసారమును వర్ణించుటయే కాక, జానపదులైన పామరజనుల సంసారమర్మములను సైతము చక్కగ నెఱిగి వర్ణించి, తన సాంఘికవృత్తానుభవమును వెల్లడించినాఁడు. నిగమశర్మను ప్రాణాపాయస్థితి నుండి బయటఁ బడవైచి రక్షించి యింటనుంచుకొని గురునిగ, దైవముగఁ బోషించిన కాఁపు సామాన్యుఁడు కాఁడు. జానపదాగ్రగామియగు నాతనియింట నున్న వికారపుఁ గోడలి వంటి కోడలు ఈ నాఁడును గౌరవమర్యాదలు గల కుటుంబములలోఁ

బ్రవేశించుట కన్పట్టును. ఆమె నిగమశర్మను జూచి మోహపరవశురా లగుటయు, నతనిని గనినపుడెల్ల వెక్కిలియగుచు వికారచేష్ట లొనర్చుటయు రామకృష్ణకవి ప్రజ్ఞమీఱఁ జక్కగ వర్ణించినాఁడు. పామరజనుల యింటఁబుట్టిన యామె యంతకంటె నాగరకములైన విలాసచేష్టల నెఱుఁగదు. ఆమె విరహవర్ణనయు నతిసహజముగ నున్నది. విరహవేళ దొరలుటకు ఆమెకు హంసతూలికాతల్పములు, రహస్యముగ శీతలోపచారము లొనర్చుటకు చెలికత్తెలు నుండరు. ఆమె రాచపడుచు కాదు గదా! అదియును గాక నిజమెవ్వరికిని తెలియరాదు. కావుననే దృష్టిదోషము తగిలినదని మిష కల్పించుకొని, యింట నొకమూల కొంగు పరచుకొని కన్నీరుఁ గార్చుచు పండుకొనినది. పామరజనుల సంసారములందలి యిట్టి పడుచులు నేఁడును నిట్లే కనఁబడుచుందురు. చీటికి మాటికి వారు దృష్టిదోషము తగిలినదని పలుకుచుందురు. రామకృష్ణుఁ డిట్టి కాఁపు పడుచు నెచ్చటఁ జూచినాఁడో! రామకృష్ణుఁడు చెప్పినట్లు నేఁటికిని నిట్టి పడుచులకును, వారి ప్రియులకును చీఁకటి రాత్రులే విహరించుటకు శరణ్యములు. అన్యమనస్కలైన యిట్టి పడుచులు భర్తల యెడనొనర్చు చేష్టలను, "అర్ధమరేయి దాక పొలమారసి మారశిలీముఖాహతిన్" ఇత్యాది యందు రామకృష్ణుఁడు చెప్పినట్లు, ఈ కాలమందును నిట్లే సాగుచుండును.

ఈ కాలమునందును పామర స్త్రీలు రెండవమగని వెంట లేచిపోవుటకు, రామకృష్ణకవి సూచించినట్లుగ, గ్రామదేవతల పండుగలే తగినవి. అందు పశువులకు జాడ్యములు కలుగుటచే భక్త్యావేశమున మునిగియెల్లరును గ్రామదేవతలను గొల్చుచు నేమియుఁ బట్టించుకొనక యుండెదరు. లేచిపోవువారి కీ పండుగ పండుగగా నుండును. ఈ మర్మమును రామకృష్ణకవి యెచ్చట గమనించినాఁడో గాని, రమ్యముగ నిగమశర్మోపాఖ్యానమున వెల్లడించినాఁడు. ఈ సందర్భమున రామకృష్ణకవి గ్రామదేవతల జాతరలో జానపదుల యలంకరణరీతులను, భక్తితోఁ గూడిన వారి వర్తనలను మిక్కిలి స్వభావసిద్ధముగ వర్ణించినాఁడు. ఆ యుత్సవములలో పల్లెపడుచులు గోర్వెచ్చని నూనెతోఁ దలయంటుకొనుట, పసుపునీట స్నానమాడుట, చిన్న చిన్న గళ్ళు గల క్రొత్త కోకలను గట్టుకొనుట, కన్నులఁ గాటుకదిద్ది, నుదుట సిందూరతిలకమును ధరించుట, కొప్పులలో పూలను తురుముట, వేఁప పూదండలు ధరించుట మొదలగున వన్నియు రామకృష్ణకవి సహజముగ నా జాతరలలో పాల్గొన్న వానివలె వర్ణించినాఁడు. పల్లెవనితలు నాగరికత నెఱుఁగనివారు. పూలదండలు గ్రుచ్చి వానిని వారి జడలకుఁగాని, చుట్టిన కొండెసిగలకుఁగాని వ్రేలవేయుట నెఱుఁగరు.

నిక్కు కొప్పులందు ముడుచుకొనుటయే వారి పద్ధతి. ఈ పద్ధతి ననుసరించే రామకృష్ణకవి వర్ణించిన కాఁపు స్త్రీలు తమ నిక్కు కొప్పులందు పట్టినన్ని పూలను తురుముకొనిరే గాని, దండలు కట్టి యలంకరించుకొనలేదు. వారి మొరటుదనమును రామకృష్ణకవి "క్రుక్కి" రను పదముచేతనే సూచించినాఁడు. కాఁపులందఱు భార్యలను ముందిడుకొని గుడికేగుట, భక్తిగల యా స్త్రీలు తమ మ్రొక్కుబళ్ళను – సిడిమ్రానున వ్రేలుట, నిప్పుటేట నటించుట, అగ్ని గుండము త్రొక్కుట, అరఁటాకుపై నటించుట, మూపుగండలిచ్చుట మొదలగు పనులను రామకృష్ణకవి ఉపమాన సహితముగ (ప. 77) చక్కగ వర్ణించినాఁడు. జానపదజీవితముతోఁ దనకు గల సన్నిహిత పరిచయమును వెల్లడించినాఁడు. ఉత్సవాంతమున దేవతకు బలులిచ్చుట, తప్పత్రాగి స్త్రీలును మైమఱచుట మొదలగు వానిని సహితము రామకృష్ణకవి సహజముగ వర్ణించినాఁడు.

ఇదే రీతిగ కిరాతుల జీవితమును రామకృష్ణ కవీశ్వరుఁడు రమ్యముగ వర్ణించినాఁడు. జారదంపతులైన నిగమశర్మయు, కాఁపు పడతియు బోయలలోఁ గలసిపోయినపుడు వారి జీవితమును సహితము రామకృష్ణకవి చక్కగ వర్ణించినాఁడు. (ప 87) కాఁపుది వెదురు బియ్యపుటన్నమును వండి, వనమాంసములతో వ్యంజనము లమర్చి, మట్టి పాత్రలో వడ్డించుట, గవయమృగము నెయ్యి నమర్చుట, సొరకాయ డోకి గవయ మృగపు మజ్జిగ నుంచుట, తానును తోడుఁగ గూర్చుని రుచులడుగుచు సగము కొరికిన ముద్దలు పెట్టుట మొదలైన వన్నియు రామకృష్ణకవి కిరాతజీవితమును పరిశీలించి వర్ణించినట్లు కన్పట్టుచున్నవి. పిమ్మట మాలపడుచు తోడి నిగమశర్మ జీవితమును – జనపరంపర కెంపగు చూపుతో అంబూకృత మొనర్చుట మొదలైనవానిని సహజముగ నీ కవిశ్రేష్ఠుఁడు వర్ణించినాఁడు.

ఈ రీతిగ రామకృష్ణకవి నిగమశర్మోపాఖ్యానమున మిగిలిన ప్రబంధములందువలె మహారాజు జీవితమును గాక, ఉత్తమగృహస్థులయిన విప్రుల జీవితమును, మధ్యములైన కాఁపువారి జీవితమును, అధములైన బోయవారి జీవితమును వర్ణించినాఁడు. సంఘమందలి ఆయా జీవితములవారి అంతరములందలి మర్మముల నెన్నింటినో పాఠకులకుఁ జూపి, తానొక సాంఘికకవి యైనాఁడు. "సారస్వతము సాంఘిక జీవితమునకు ప్రతిబింబము" అన్న విమర్శకుఁ దగిన రచన యందొనర్చి చూపినాఁడు. పాఠకులకు సంఘజీవితమున నెన్నియో రమణీయదృశ్యములను, రహస్యములను వెల్లడించినాఁడు. రామకృష్ణకవి వలె సంఘమును బ్రతిబింబించి చూపిన కవులు ఆంధ్ర సాహిత్యమునందు కొలఁదిగనే యున్నారు.

## రామకృష్ణకవి - కవితావిశిష్టత

ఆంధ్ర సాహిత్య ప్రపంచమునందలి మిక్కిలి ప్రౌఢకవులలో రామకృష్ణుఁ డొకఁడు. కావుననే "ఆంధ్ర సారస్వతమున విశ్వామిత్ర సృష్టి యొనర్చినవారిలో నీతఁడొకఁడుగ బరిగణింపబడినాఁడు" ఇతనిని గూర్చి పాండురంగ మాహాత్మ్యకృతిపతి విరూరి వేదాద్రి మంత్రి "మహాంధ్ర కవితావిద్యాబలప్రౌఢి నీకెదురేరీ! సరసార్థ బోధ ఘటనాహేలా పరిష్కార! శారద నీ రూపము" అనియును, "సరస కవివి, నలుతెఱంగుల నెన్నఁగల కావ్యధారల ఘనుఁడవు. ఆశువునందు మేటివి. అఖిల కావ్య రస సుధామండన కుండలుఁడవు" మొదలుగ శ్లాఘించినాఁడు. ఆశ్వాసాంతగద్యము నందు రామకృష్ణుఁడే తన్ను "సరసకవితా సనాథుఁ" డని చెప్పుకొనినాఁడు. దీనియందు చాలసత్య మున్నది.

శ్రీకృష్ణరాయల కాలమున ఆంధ్ర సాహిత్యమునందొక నూతన పరిణామము కలిగినది. పూర్వయుగములందు వలె నీ కాలమున కవులు సంస్కృతపురాణముల ననువదింపక, వానినుండి కథలను గ్రహించి, మార్చి, పెంచి, చేర్చి రసవత్తరములైన ప్రబంధములను రచించినారు. ఈ ప్రబంధము లన్నియు నించుమించుగా శృంగారరస ప్రధానములై యున్నవి. "అష్టదిగ్గజము" లలో నొక్కఁడైన రామకృష్ణకవి స్వభావము పై కవితామార్గమునకు భిన్నమైనది. ఇతఁడు పలువురు పోయిన మార్గమునఁ బోవువాఁడు కాఁడు. నూతనమార్గమును ద్రొక్కి కీర్తి నార్జించుటయే ఘనమని తలఁచి రామకృష్ణకవివర్యుఁడు పాండురంగ మాహాత్మ్యమును రచించినాఁడని యూహింపవచ్చును. అందుచే నీతఁడు శ్రీహరిచరిత్రమును ప్రబంధముగా రచింపఁదలచినవాఁడై, తీర్థ క్షేత్ర దైవతములు అను మూఁడును గల ప్రదేశపు మాహాత్మ్యమును, వస్తువును స్కాందమునుండి గ్రహించి, శాంతమున కంగరసములగు భక్తిభావాదులను చక్కగ వర్ణించుచు, నీ గ్రంథము నొక ప్రౌఢ ప్రబంధముగ "ఆంధ్ర పంచ కావ్యము" లలో నొకటిఁగ బరిగణింపబడునట్లుగను రచించినాఁడు. ఈ పాండురంగకృతి సర్వవిధముల విలక్షణమైనది. అంకితము విషయమునను రామకృష్ణకవి ఈ విలక్షణమును పాటించినాఁడు. పాండురంగ కృతిపతియైన విరూరి వేదాద్రి మంత్రి కృతికర్తకు (రామకృష్ణకవికి) అగ్రహారము లిచ్చు రాజుగాని, రెడ్డిగాని కాఁడు. ముక్తినిచ్చు దైవతమును గాఁడు. ఎక్కువగ నీయఁజాలనివాఁడు. పెదసంగ భూపాలునికడ వ్రాయసగాఁడు మాత్రము.

## మూలము

పాండురంగ మాహాత్మ్యమునకు మూలము స్కాందపురాణమని రామకృష్ణకవి చెప్పియున్నాడు. "పాండురంగ మాహాత్మ్యము" అను క్షేత్ర మాహాత్మ్యమొకటి సంస్కృత భాషలో నున్నది. కాని అది రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యము ననుసరించి వ్రాయఁబడిన గ్రంథమనియు, రామకృష్ణకవి ప్రతిభను, శక్తిని కించపఱచుట కెవరో యట్టి మూలమును కల్పించి ప్రచారము నొందించుటకు యత్నించిరని విమర్శ కాగ్రేసరులు శ్రీ బులుసు వేంకట రమణయ్య అభిప్రాయపడుచున్నారు. సంస్కృత పాండురంగ మాహాత్మ్యమును, ఆంధ్ర పాండురంగ మాహాత్మ్యము నందున్న నిగమశర్మోపాఖ్యానము, రాధికావృత్తాంతము, సుశీల మున్నగువారి కథలు, సుశర్మోపాఖ్యానము, అయుతనియుతుల వృత్తాంతము అనునవి లేవు. మిగిలిన వృత్తాంతములు సంగ్రహముగఁ జెప్పబడినవి. దీనినిబట్టి రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యమునకుఁ బ్రతిష్ఠను దెచ్చిన కథావృత్తాంతమంతయు నతఁడు సేకరించుకొనినదే యని నిర్ణయింపవచ్చును.

## పాత్రపోషణ

రామకృష్ణకవి పాత్రపోషణమందు పూర్వుల కెందును తీసిపోవువాఁడు కాఁడు. అతని నిగమశర్మ అక్క, కాఁపుకోడలు వంటి పాత్రలు విశిష్టమైన రూపరేఖలతో విరాజిల్లుచున్నవి. "ప్రౌఢ భారతి అనఁదగిన నిగమశర్మ అక్కగారు వరూథినీ, కలభాషిణీ, సుగాత్రీ, సత్యభామలతో సహపీఠ మలంకరించిన సారస్వతాంధ్ర మహిళారత్నము. ఈ అక్కగారు లేనిచో నిగమశర్మ కథకు ఇంత ప్రఖ్యాతి వచ్చెడిది కాదు" (శ్రీ పింగళి). "నిగమశర్మ శ్రీనాథ మహాకవి కాశీఖండములోని గుణనిధి, శివరాత్రిమాహాత్మ్యములోని సుకుమారుఁడు, రామలింగని ఉద్భటారాధ్యచరిత్ర లోని మదాలసులకు సతీర్థ్యుఁడు" (శ్రీ పింగళి). కందుకూరి రుద్రయ మహాకవి నిరంకుశుని పుట్టుకకు హేతువైనవాఁడు. ఇందలి కాఁపు కోడలును విశిష్టమైన పాత్ర. ఇందలి పాత్రలన్నియును సంఘమున నీ నాఁడును మన మధ్య కన్పించు పాత్రలు.

## సంభాషణవిరచనము

రామకృష్ణకవి పాత్రనిర్మాణమున నెంతటి చతురుఁడో సంభాషణవిరచనము నందును నంతటి ఘటికుఁడు. నిగమశర్మోపాఖ్యానమునందలి నిగమశర్మ అక్క, నిగమశర్మకు సామదాన భేదోపాయములను బ్రయోగించుచు నొనర్చిన "ప్రారంభించిన

వేదపాఠమునకున్ బ్రత్యూహమౌనంచునో యేరా తమ్ముఁడ" ఇత్యాదియు, మాలభార్య మరణించినపుడు శోకించుచు నిగమశర్మ యొనర్చిన "ఈ కడజాతి నాతి కిహిహీ మహిదేవుఁడు చిక్కెనంచు'' ఇత్యాది సంభాషణము సమయోచితములు, పాత్రోచితములునై రామకృష్ణకవికి గల సరస సంభాషణవిరచన సామర్థ్యమునకు మచ్చుతునకలుగ నున్నవి.

**పాత్రల మనఃప్రవృత్తి**

వర్తనమున అపమార్గమునుఁ బట్టిన తమ్ముని చక్కబెట్టఁగల నని వచ్చిన చతురురాలగు అక్క మనఃప్రవృత్తిని, కూటికి గుడ్డకు అల్లలాడి యిల్లు చేరి తేనె పూసిన కత్తివలె వర్తించిన వేళను, కృతఘ్నుఁడై కాఁపు పడుచును వలచిన వేళను, బోయలలోఁ గలసినవేళను, మాలపడుచు మరణించినపుడు సిగ్గు విడిచిన వేళను నిగమశర్మ మనఃప్రవృత్తిని రామకృష్ణకవి నైజముగఁ బ్రదర్శించినాఁడు. జాతరవేళ కాఁపు పడుచు భయగాఢతర త్వరనేగుచున్న వేళ నామె మనఃప్రవృత్తిని – "మన్మథాస్త్ర కీలాకుల తప్తచిత్తలకు లక్ష్యమె తక్కిన నొప్పులెవ్వియున్" అని మనోహరముగఁ బ్రదర్శించినాఁడు. సంఘమునందలి అనేకములైన యంతరములలో వారిని పరిశీలించి చూచిన రామకృష్ణకవి మనోవృత్తుల లోఁతు లెఱిఁగి వర్ణించినాఁడనుటలో నాశ్చర్య మేమియును లేదు.

**వికటత్వము**

శ్రీకృష్ణరాయల కాలమునాఁటికి రామకృష్ణుఁడు యువకుఁడు. స్వభావము చేత స్వతంత్రుఁడు. వికటస్వభావము గలవాఁడు. హాస్యరసప్రియుఁడు. ఈ లక్షణములు ప్రౌఢవయసున నీతఁడు నిర్మించిన పాండురంగ మాహాత్మ్యమునందును గన్పట్టుచున్నవి. భగవంతుని స్తుతించువేళనే (బుద్ధావతార వర్ణనమున) యితఁడు తన వికటత్వమును జూపినాఁడు. నిగమశర్మోపాఖ్యానమునందు అతని యక్కను వర్ణించిన సందర్భమునను నీ వికటత్వము ద్యోతకమగుచున్నది. పద్మపీఠికఁ గొలువున్న పద్మవలె నాసీనురాలై బోధలొనర్చి తాత్కాలికముగనైన వానిని సన్మార్గమునకుఁ ద్రిప్పిన యామె, నిగమశర్మ కొంతకాలము తేనె పూసిన కత్తివలె సర్వధనములు సంగ్రహించి కాఁజేసి వెళ్ళినపుడు, అల్పమూల్యముగల ముక్కరకై యెవరోదార్చినను ఆగక దుఃఖించినదనుటయందు రామకృష్ణకవి పరిహాసమే వ్యక్తమగుచున్నది. బాగుగ నూహింపఁగా, నిగమ శర్మోపాఖ్యానకథయే రామకృష్ణకవి వికటమైన చతురహాస్యమునకుఁ దగిన కథగ నొప్పుచున్నది.

**లోకానుభవము**

రామకృష్ణకవి వేశ్యలయిండ్లలోఁ దిరిగి ఇల్లును, ఒళ్ళును గుల్లచేసి కొఁనినవారిని చూచి యుండవచ్చును. కావుననే అక్క ముఖమున (ప. 41) నట్టి వారికి దివ్యమైన సందేశము నిచ్చినాఁడు. అట్టి కామేచ్ఛ గలవారు కులాంగనల నెందఱినైన వివాహమాడి యనుభవింప వచ్చుననుట రామకృష్ణుని యభిప్రాయము గావచ్చును. "ఇచటి ధర్మము చింత్యము. వందమందిని పెండ్లాడి కామోపభోగము లనుభవింపవచ్చును. వారకాంతల తగులము పనికిరాదనుట సంపన్నుల కేర్పరచిన ధర్మ మనుకొనవలయును." (శ్రీ విశ్వనాథ)

**వర్ణనలు**

ప్రబంధకవులు కథాకథనమునందుఁగాక, పాత్రల స్వభావాదులను, ప్రకృతిని, ఇతర దృశ్యములను వర్ణించునపుడు తమ భావనాబలమున (Power of imagination) వర్ణించి, పాఠకుల మనసుల ప్రతిబింబించునట్లొనర్చి యానందమును గల్గింతురు. ఈ వర్ణనలు రసోద్బోధకము లగుచుండును. రామకృష్ణకవి ఇతర ప్రబంధకర్తల వలె రసప్రధానమైన కథను స్వీకరించి ప్రబంధమును రచింపక, భగవత్సంబంధమైన కథను గ్రహించి పాండురంగ మాహాత్మ్యమును రచించినను నిందలి వర్ణన లితర ప్రబంధములందలి వర్ణనల కీడుజోడుగ నున్నవి. ప్రధానముగ నీతని వర్ణనలు స్వభావోక్తి ప్రభావములు. కావుననే యొక విమర్శకుఁడు "స్వభావోక్తి చిత్రణములకే యీ గ్రంథము రచింపఁబడెనా యని తోఁచుచున్న" దనినాఁడు. (శ్రీ నూరిగుచ్చి కృష్ణమూర్తి). శ్రీ బులుసు "మానవుల స్వభావమును, దేశ కాల సంప్రదాయములను, కుటుంబపరిస్థితులను, నాగరికుల మనుకొనువారి నడవడులను, పెద్దలయెడఁ బాటింపవలసిన మర్యాదలను, వర్ణించుటలో రామకృష్ణకవి యద్వితీయుఁ" డనినాఁడు. నిగమశర్మోపాఖ్యాన మందలి వర్ణనలన్నియును నీ విమర్శకవాక్యముల కనుగుణముగ నున్నవి. విలాసపురుషుఁడై నగరవీథులలో నిగమశర్మ తిరుగుట రామకృష్ణకవి కన్నులకుఁ గట్టునట్లు (ప. 10) వర్ణించినాఁడు. "ఉహ్వాన హోమాగ్ని యూదనొల్లఁడు గాని, విరహజ్వరార్తుఁడై వెచ్చనూర్చు" – ఇత్యాదియైన నిగమశర్మ వర్తనవర్ణనము రామకృష్ణుని ప్రౌఢమైన ఉక్తిచాతుర్యమునకు నిదర్శనముగ నున్నది. "దినవెచ్చమునకునై తన మేనఁగల సొమ్ము" మొదలైనది లోకవృత్తమునకుఁ జక్కని ప్రతిబింబముగ నడిచినది. నిగమశర్మ యక్క అతని తలలోని పేలను దీయుట అతిసహజముగ వర్ణితమైనది (ప.30). ఆమె కావించిన సీత్కారము పాఠకుల చెవిని బడుచునే

యుండును. నిగమశర్మను గనినంతనే కాఁపు కోడలు వెక్కిలియగుచు నొనర్చిన చేష్టలు (ప. 62) రామకృష్ణకవి సహజముగ వర్ణించినాఁడు. కుదురు పాలిండ్లపై కొంగుజార్చుట, కొప్పు వీడుట, ఊరక వెఱ్ఱి నవ్వు నవ్వుట, ఏరాలి పట్టినెత్తి చెక్కిలి నొవ్వఁగా నణిచి వాఁడేడ్చినఁ గౌఁగిలించుట, మొదలగు వన్నియును పాఠకుల యెదుట జరుగుచున్నట్లే యుండును. దృష్టి తగిలెనని యామె తలకుఁ గుడ్డ కట్టి యొకమూఁల బరుండుట పాఠకుల యెదుటఁ బరుండినట్లే యుండును. గ్రామదేవత యుత్సవములలో పామర స్త్రీ అలంకరించుకొనుట, రామకృష్ణకవికిఁ గల జానపద జీవితానుభవమును వ్యక్తమొనర్చుచున్నది. బోయవారిలోఁ గలసిన పిమ్మట కాఁపుకోడలు, నిగమశర్మ సాగించిన సంసారపుతీరు పాఠకుల మనసున ప్రతిఫలించుచున్నది. రామకృష్ణకవి వారి కడకేగి వారి భోజనపుతీరును జూచి వచ్చెనా యన్నట్లుగ నా వర్ణన కన్పట్టును. ఆ కాఁపు పడుచు చెలువునితో పొత్తు కలిసి నవ్వుచు, చవులను హెచ్చరించుచు, సామిదష్టాన్న కబళములు సామికొసఁగుట మనోహరముగ వర్ణితమైనది. తన యిల్లు తగులఁబడిపోయినదని చదికిలఁబడి విచారించుచున్న నిగమశర్మ వర్ణన మిక్కిలి నైజముగనున్నది. పరమధామమున కేగుచున్న నిగమశర్మ విష్ణునితో సారూప్య మొందినట్లుగా నొనర్చిన వర్ణనయును మనోహరముగ నున్నది. ఈ రీతిగ నిగమశర్మ వర్ణనలు సమయోచితములు, పాత్రోచితములు, ప్రౌఢములు, సహజములు, రమ్యములు, కవి ప్రతిభావిశేష ద్యోతకములునై యొప్పుచున్నవి.

**అలంకారములు**

'ప్రబంధమందలి యలంకారములు ప్రబంధశరీరమైన శబ్దార్థములకు శోభను కల్గించుచు, ప్రబంధజీవితమైన రసమున కుద్బోధకము లగుచుండును. కనుకనే ఉత్తమ ప్రబంధకర్తలు ఆయా సందర్భములందు సరసములైన యలంకారములను వాడి తమ ప్రబంధములను రసవంతము లొనర్చుచుందురు. రామకృష్ణకవియు నిట్లే రసవంతములగు నలంకారములను ప్రయోగించినాఁడు. పులుగడు గంగబద్ద నునుముత్యము బోలుచున్ – అని నిగమశర్మ నిత్యశృంగారమును (9) చీమవలెఁ గూఁడబెట్టిచేత నాతని తాతతండ్రులు కష్టపడి డబ్బును గూడఁబెట్టిన తీరును (15) ఉరగ దష్టుని మేని నెత్తురును వోలె – అని నిగమశర్మ వేగముగ నా ధనము వెచ్చించిన రీతిని రామకృష్ణకవి యుపమానములచే రమ్యముగఁ దెల్పినాఁడు. "పద్మకర్ణికఁ గొలువున్న పద్మవోలె" నిగమశర్మ యక్క ఠీవిని, ఆమె ఉపదేశ గాంభీర్యమును, "తల లోపలి నాలుకవలె", కాఁపు నింట నిగమశర్మకుఁ గల చనువును – ఉపమానముల

మూలమున రమ్యముగ వస్తువులను వ్యక్తీకరించినాఁడు. ఉపమానములనే గాక రామకృష్ణకవి రూపములను సహితము మనోజ్ఞముగఁ బ్రయుక్తమొనర్చినాఁడు. ఇందు కుదాహరణములు "పడతి పాలిండ్లు రిక్తకుంభములు" ఇత్యాది, ప. 22లోని "పదను దివిసిన కస్తూరి." ఇందలి మొదటిదాని యందు రామకృష్ణుఁడు నిగమశర్మ భార్యావిముఖతను, వేశ్యాదాస్యమును సూచించినాఁడు. రెండవ దానియందు నిగమశర్మ యెట్లు గౌరవహీనుఁడైనాఁడో వెల్లడించినాఁడు. "ఉవిదలకు బుద్ధి పెడతలనుండుఁ గాదె!" (ప. 76) పూవులు ముడిచిన యంగళ్ళనె ఇత్యాది (ప. 2) యందు లలితాలంకారమును రామకృష్ణకవి సొగసుగఁ బ్రయోగించినాఁడు. 57, 93 లందు యమకము, 37 నందు అనుప్రాసము అను శబ్దాలంకారములును సుందరముగఁ గూర్పఁబడినవి.

**రసము**

నిగమశర్మోపాఖ్యానమునందు ముఖ్యముగఁ గన్పట్టునది శృంగారము గాక శృంగారరసాభాసము. ఈ కథకు నాయకుఁడైన నిగమశర్మ స్త్రీలోలుఁడై యిష్టము వచ్చినట్లు సంచరించి, చివరకు కాఁపువాని కోడలిని లేవఁదీసికొనిపోవు సందర్భముననను, మాలదానితో జీవించిన సందర్భముననను వర్ణితమైనది శృంగార రసాభాసము. ధర్మయుక్తమైన నాయికానాయకుల శృంగారమే రసము. కాఁపు వనిత పతియైన వానిని విడిచి ఉపపతియైన నిగమశర్మను ప్రేమించి, విరహవశయై వానితో లేచి వెళ్ళి బోయలలోఁ గలిసి రమించినది గావున, నీ శృంగారము రసాభాసము. రామకృష్ణకవి 64, 66 లందు ఈ శృంగారాభాసమును సైతము కడు చక్కగ వర్ణించినాఁడు. ఇందు కాఁపు పడఁతి యొనర్చిన సర్వచేష్టలును శృంగార రసాభాసములే. 69 యందు సంభోగ శృంగారాభాసమును సైతము కవి చక్కగ వర్ణించినాఁడు. మరణించిన మాలభార్యకై, ఆమె వలన కలిగిన పుత్రులకై నిగమశర్మ యొనర్చిన విలాపము (93,94,95,96) నందు కరుణము, 107లో చక్రము నిగమశర్మ బంధములను దెగఁద్రెంచు వర్ణనమున రౌద్రము, 108లో నృసింహక్షేత్రమున ఆ స్వామిని జూచిన తెఱఁగును వర్ణించిన తీరును, భక్తియు రామకృష్ణకవిచే మనోజ్ఞముగ వర్ణితములైనవి.

**శైలి**

తెనాలి రామకృష్ణకవి తొలుత శ్రీనాథుని శైలియం దనుకరించినాఁడు. "ఒక మార్గమున నంతటివాఁడైన శ్రీకృష్ణరాయలు తరువాత నుదయించెను. పెద్దన్న గారి

మనుచరిత్ర శ్రీనాథుని మాధుర్యమునకు వంకలు దిద్దినది. తెనాలి రామకృష్ణుఁడు వానిని చదివెను. అందుచేత అతనికి ప్రత్యేకశైలి యేర్పడెను. అది యొక స్వతంత్రమైన శైలి. ఈ శైలిలో ఆముక్తమాల్యదాలక్షణము లున్నవి. కాని దానికంటె భిన్నమయి యొక రమ్యత భాసించెను. ఈతని సీసపద్యముల శైలి శ్రీనాథుని లక్షణములు, ఆముక్తమాల్యద ప్రౌఢి కలసి యేర్పడినది" (శ్రీ విశ్వనాథ). విశిష్టమగు రామకృష్ణుని శైలి మరియొకరి కనుకరింప సాధ్యమైనది కాదు. ఇది సంస్కృతపద భూయిష్ఠమై, ప్రౌఢము, నారికేళపాకముగ నుండును. చదివినంతనే భావము పాఠకునకు గోచరింపదు. అతని శైలి నిర్గరళమై ధారాశుద్ధితో లోకోక్తులు, జాతీయములతో నొప్పియుండును. 40, 42, 61, 69, 86, పద్యముల శైలి నిరాఘాటముగా నున్నది. పాత్రల సంభాషణమునందు మృదుమధుర శైలి కన్పించును. 38 యందలి శైలి మనోజ్ఞముగ నొప్పి నిగమశర్మ యక్కకుఁగల సోదరప్రేమను వెల్లడించుచున్నది. 93,94,95,96 పద్యములలోని శైలి యిప్పటి నిగమశర్మ దుఃఖమును అనుభూతికిఁ దెచ్చునదై యున్నది. సీసపద్య రచనయందు కొంత శ్రీనాథుని బాణి కన్పించినను, రామకృష్ణుని విశిష్టతయును గోచరించును. ఇట్టి ప్రౌఢశైలి గలవాఁడగుట చేతను "పాండురంగ విభుని పదగుంఫనంబును" అన్న కీర్తి యితని కబ్బినది.

**లోకోక్తులు, జాతీయములు**

లోకోక్తులను బ్రయోగించుటలో రామకృష్ణకవి మేటి. "పూవులు ముడిచిన యంగళ్లనె కలకల వీడెల్ల నవ్వ కట్టెలు మోసెన్" (21) గుడినుండి గుడిరాళ్ళు తీయుకరణిన్ (68), "నరకే సతి కో దోషః మరణే సతి కిం భయమ్" (70) మొదలైన లోకోక్తులను రామకృష్ణకవి నిగమశర్మోపాఖ్యానమున నౌచిత్య మెఱిఁగి ప్రయోగించినాఁడు. రామకృష్ణుని కవిత్వమున భాషామర్యాదలను చాటు చక్కని జాతీయములు కన్పట్టును. నేతి బీరకాయ (13) తేనె పూసిన కత్తి, పడుపడుకకుఁ జెప్పక (49) చెట్టు కొకరుఁడై (54) కంట వత్తిడుకొని (56) మోహము లేర్లయి వర్తిలన్ (63) కనుగ్రంతల ముంతల బోసినట్లు మొదలైన జాతీయములను నిగమశర్మోపాఖ్యానమున రామకృష్ణకవి చక్కగ బ్రయోగించినాఁడు. స్వతంత్రుడగు నీ కవివర్యుఁడు కంచంత (ఇకార సంధి), చెలువిండ్ల (అకార సంధి), దినవెచ్చము (అనింద్యగ్రామము) మొదలగువానిని స్వేచ్ఛగా ప్రయోగించినాఁడు. రామకృష్ణకవి ఆంధ్ర సాహిత్యమందలి ప్రతిభావంతులైన మేటి కవులలో నొకఁడనుట కెట్టి సందేహమును లేదు. కావుననే యీ మహనీయుని పాండురంగ మాహాత్మ్యమును "ఆంధ్ర పంచకావ్యములలో నొకటిగఁ బ్రఖ్యాతి కెక్కినది." ప్రబంధకవులు కొంతవఱకు

ప్రయత్నపూర్వకముగ తమ శక్తిని ప్రదర్శించి యటుపిమ్మట సడలింతురు. కావుననే మనుచరిత్ర, వసుచరిత్ర, పారిజాతాపహరణములలో కొన్ని యాశ్వాసములే రసవంతముగానుండి, తక్కిన భాగము సామాన్యముగఁ గన్పట్టును. ప్రతిభావంతుఁడైన రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యమును మొదటి నుండి చివరి వఱకు నొక పద్ధతిలోనే నడిపినాఁడు. సంస్కృతాంధ్రములందు అసాధారణ పాండిత్యమును, కవితయందు ప్రతిభావ్యుత్పత్తులను గలిగి, ప్రౌఢప్రబంధమును జెప్పిన మహాకవి రామకృష్ణుఁడు.

## కథాసంగ్రహము

రాజనపు వరివిత్తును బోలిన ఉత్తమ బ్రాహ్మణవంశమునందు ఒకఁ డాహితాగ్నియై యొప్పుచుండెను. అతనిది సకలకళలును డాసిన రచ్చ. వేదములు పోసిన గాదె. శాస్త్రములు పుట్టిన యిల్లు అని యెల్లరు కొనియాడు చుండెడివారు. అతఁడు చంద్రునివంటి కాంతిమంతుఁడు. కళింగదేశమున కాభరణమైన పీఠికాపురము నధిష్ఠించి యా భూసురశ్రేష్ఠుఁడు శోభిల్లుచుండెను. అతని భార్య దేవతలను, బ్రాహ్మణులను కొలిచినంత నామెకు వారి కృపాతిశయముచే నొక పుత్రుఁడుదయించెను. అతనికి తండ్రి నిగమశర్మయని నామకరణ మొనర్చెను.

నిగమశర్మ యువతుల మనస్సుల నాకర్షించుటలో మన్మథుడు. జీవించియున్న తండ్రి గలవాఁడు. ప్రజలచేఁ గౌరవింపఁబడు పరిశుద్ధస్వభావము కలవాఁడు. కాంతియందు చంద్రునితో సమానుఁడు. లేఁబ్రాయపు యౌవనమున నొప్పినవాఁడు. అధికప్రసంగమున కడుదిట్ట. అతఁడు వేదాధ్యయన సంపన్నుల శిష్టవంశమున పుట్టినను, సకల వేదాంతరహస్యముల నెఱిఁగియున్నను, విధివశమున మూఁడవ పురుషార్థమైన కామమునందే మనసు నిలిపి విహరింపఁ జొచ్చినాఁడు.

## నిగమశర్మ కామవిహారము

నిగమశర్మ నిత్యము అభ్యంగ స్నానమొనర్చును. శరీరమును మర్దింపించుకొనును. శుభ్రవస్త్రములు ధరించును. చక్కని భోజన మారగించును. గంధములఁ బూసికొని పుష్పమాలలు ధరించి కపురపు తాంబూలములు సేవించుచు, నానావిధాభరణముల నలంకరించుకొనుచు, పులు గడిగిన ముత్తెమువలె పురమున సవిలాసముగఁ దిరుగుచుండెడివాఁడు. వైదిక కుటుంబమున జన్మించినవాఁడయ్యును, ఉన్నదా లేదా యని శంకింపఁ దగినట్టి యొంటి జందెమును ధరించెడి వాఁడు. అధికమైన కస్తూరి

వాసన వెదజల్లు వస్త్రపు చెంగు నేలఁ జీరాడునట్లు కట్టెడివాఁడు. తాంబూలరాగముచే నొప్పు నీతని పెదవు లెప్పుడును దంతక్షతములచే నావరింపబడి యుండెడివి. అట్లె యతని కంఠము నఖక్షతములతో నలరారుచుండెడిది. తన వెంట నెల్లవేళల చెలికాండ్రును, పరిహాసకులును కలిసిరాగా నిగమశర్మ రాజమార్గమున ఠీవిమెఱసి తిరుగుచుండెడివాఁడు. యువతుల ననుభవించుటచే (లేదా యువతు లనుభవించుటచే) నితఁడు మలినమైన వస్త్రమును ధరించుటకు ఏ మాత్రమును సిగ్గువడెడివాఁడు కాఁడు. ఈ నిగమశర్మ జాతిమాత్రోపజీవి. ఈతనికి భార్య పాలిండ్లు రిక్తకుంభములు. వేశ్య చనుదోయి నిండుకుండలు. కులవధువు నుదురు చవితినాటి చంద్రుడు (చూడఁ దగనిది). వేశ్యఫాలము ప్రతిపదిందుఁడు (పాడ్యమినాఁటి చంద్రుఁడు – పరికించి చూడఁదగినది). ఇతఁడు ఉహ్వాన హోమాగ్ని నూదుట కిష్టపడఁడు గాని నిరంతరము విరహార్తిచే వేడి నిట్టూర్పులు విడుచుచుండును. సంధ్యాదేవికి ప్రార్థనాంజలి పట్టఁడు గాని తనపై కోపగించిన కాంతల కాళ్ళకు ప్రీతితో మ్రొక్కుచుండును. శంఖమున బోయఁబడిన నీరమును (శంఖతీర్థమును) పుచ్చుకొనఁలేడు. కాని వారవనితల అధరామృతమును మాత్రము తప్పక త్రాగుచుండెను. శరీరమున తిరుమణి, తిరుచూర్ణాదులైన పుణ్యచిహ్నములను ధరించుటకు సిగ్గు పడును గాని, వేశ్యలర్పించిన నఖక్షతములను తాల్చుటకు ఏ మాత్రము సిగ్గుపడెడివాఁడుకాఁడు. ఈ రీతిగ చెడునడతలు గల యా పోకిరి దుర్విలాసముల కిష్టపడుచుండెను. వ్యర్థముగ జందెము ధరించినవాఁడైన ఈ బ్రాహ్మణబ్రువుఁడు నిగమశర్మయను పేరు నేతిబీరకాయ వలె నబద్ధపు కథ కాగా పురమునందు విచ్చలవిడిగా విహరించుచుండెను.

## నిగమశర్మ దుర్వ్యసనములు

పురమునం దీ రీతిగ నిగమశర్మ విహరించుట యెఱిఁగి తల్లిదండ్రులు వానిని శిక్షింప నారంభించిరి. అందువలన నతఁడు తన వ్యసనమును మానక మఱింత దిట్టయై, గడ్డిపోచ యంతైన చాటుమాని నిర్భయముగఁ దిరుగ నారంభించి, గృహమునందున్న ధనమునంతటిని వ్యయ మొనర్చుచున్నాఁడు. తరతరములుగా తాతముత్తాతలు, తండ్రి చీమవలెఁ గూఁడబెట్టిన ధనమంతయును అతని చేతికిఁ జిక్కి పాము కఱచినవాని శరీరమందలి నెత్తురు వలె నశించెను. ప్రతిదినమును జేయు చిల్లర వ్యయమునకై నిగమశర్మ తన శరీరము మీఁది సొమ్ముల నన్నింటిని కోమటియింటఁ గుదువఁబెట్టును. మెలమెల్లగాఁ దల్లినిఁ జేరి యాఁతచెట్టును మద్యమునకై గీచినట్టు కొంచెము కొంచెముగా తల్లి శరీరముపై బంగారము నంతటిని

అపహరించును. తండ్రి కితరులు వ్రాసి యిచ్చిన ఋణపత్రములను దొంగి లించుకొనిపోయి వచ్చినంతకు అమ్మఁజూపును. మృత్యురూపములైన సాహుకారుల యొద్ద పెద్ద వడ్డీకి (చక్రవడ్డీకి) ఋణములు చేయును. మాన్యములు, వృత్తిచేలు, ధాన్యము, గుత్తకుఁ దీసికొనిన పొలములు, పాతఱలు – అన్నింటిని జనుల కమ్మఁ జూపును. స్వేచ్ఛగా విహరించు నా నిగమశర్మ ముందేమి కానున్నాడో! కళింగ (దేశ) మునఁ బుట్టినవాఁడగుట వలననో ఏమో, అందఱును వ్రేలు పెట్టిచూపి నిందించుచుండగా కొంచెమైనను జంకక, యోగ్యుల మర్యాదకు దూరమైనవాఁడై యున్నాఁడు. (కళింగము – పుచ్చతీగ – కళింగోద్భవము – పుచ్చతీగయందుఁ బుట్టినది – పుచ్చకాయ. ఇది వేలు పెట్టి చూపినను మఱిగిపోదు) అంతేకాక యోగ్యుల మర్యాదకు ఇతఁడు దూరుఁడైనాఁడు. (పుచ్చకాయ నిషిద్ధవస్తువు. శిష్టులు దాని ముట్టుకొనరు – కళింగదేశీయులు అనాచారపరులని ప్రాచీనుల యభిప్రాయము).

దొరికిన చోటులం దెల్ల నప్పులు తీసి తీసి దివాణమునందు, బంధువుల యొద్ద యాచన చేసి, కూడు కూటములపై నాసక్తికి హద్దు నెఱుఁగక, బ్రాహ్మణుఁడైన యా నిగమశర్మ తిరుగుచుండెను.

తన మిత్రుల యిండ్లలో చెడు త్రాగుడులు త్రాగుచు, ఇంటికి వెళ్ళక జూదమున సంపాదించినదియు, దొంగతనము వలన చేకూరినదియు, అబద్ధములాడి పొందినదియునగు ధనములను పిసాళి వెచ్చములకు వ్యయ మొనర్చుచు, తన పూర్వ వైభవము నంతటిని కోలుపోయి నిగమశర్మ మిక్కిలి చులుకన యయ్యెను. గడువు దాటుటచే నప్పులవారు బాధింపఁగా గ్రామమున బ్రవేశింపక పైపైననే తిరుగు చుండెడివాఁడు. సమయమునందు కూడు లభింపక పోవుటచే నాకలి వలన గువ్వ గొంతువంటి హీనస్వరముతో నతఁడు బాధపడుచుండెడివాఁడు. అతఁడు వస్త్రమునకు, కూటికి నీచులను వేడుటకై మొండి చొరవ చేసికొని, పట్టణమంతయు నవ్వఁగ గౌరవదూరుఁడై పువ్వులు ముడిచిన యంగళ్ళయందే వీడెల్ల నవ్వునట్లు కట్టెలను మోసినాఁడు. దుశ్శీలరతుఁడైన అతనియక్క యొకతె మూర్ఖుఁడగు నాతని శిక్షించెదనని తన మగనిని, బాలురనుఁ గొని పుట్టినింటికి వచ్చినది.

## నిగమశర్మ అక్క నీతులుపదేశించుట

నిగమశర్మ యక్క ఐదారు యోజనముల దూర మందున్న తన యూరినుండి వచ్చి తండ్రి యింట కొన్ని ప్రొద్దులు గడిపినది. కుమారుని దుర్వర్తనమునకు

విచారసముద్రమున మునింగియున్న తల్లిదండ్రులకు చొరవ గల్గిన వచన రచనా చమత్కారములతోడను, గొప్ప సంతోషమును కల్గించెడి యుపచారములతోను కొంత దుఃఖమును తొలగించుచున్నది. గృహమందలి ముకుందారాధనమును, అతిథిసంతర్పణములును నేర్పుతో సాగింపించుచున్నది. తల్లి చూచుచున్న మూలధనమును, పోయినది పోగా మిగిలినదానిని, జాగ్రత్త చేయుచున్నది. పశువులను, శిశువులను తనవారిని గావించుకొని కష్టములనుండి తొలంగించుచున్నది. పుస్తక భాండాగారమున తన భర్తచేత అగ్నివలన చినిగిపోవుట, యాచకుల వలన కలుగు నుపద్రవములనుండి తప్పించి కాపాడుచున్నది. తొలగిపోయిన సర్వసన్నాహములను మఱల నింటికి చేకూర్చుచున్నది. చదువు సాగించి నడిపించుచున్నది. పాదుకొని ఏకభోగ గ్రామములను, పొరపాటున నిగమశర్మ దృష్టినుండి తప్పిపోయి ఉన్న చోట్లను తెలిసికొని, అవి యితరులకుఁ జెందకుండునట్లు చేసినది. మడి మల్ర చేను చెట్లున్న ప్రదేశముల నరసి, తన బిడ్డలను కాఁపు బెట్టి రక్షించుచున్నది. రహస్యమును బయటపెట్టక శ్రమనందుచు, అత్తమామల చిత్తములకు వచ్చునట్లు భక్తిశక్తులతో కష్టపడుచున్న మఱఁదలి సౌందర్యము, అనివార్య విజృంభణము గల క్రొత్త యౌవనము అడవింగాచిన వెన్నెల వలెను, గొడ్డు మొక్కలకు చేసిన దోహదము వలెను నుండుటకుఁ జింతించి, కలఁతవడి కడుపు కలయఁబెట్టుటచే సంకటపడుచున్నది. అట్టి సమయమున నిగమశర్మ చుక్క తెగిపడినట్లు ఎక్కడినుండియో నాకస్మికముగ చలిది భోజనమును తినుటకై వచ్చినాఁడు.

నిగమశర్మ అక్కను చూచినంతట మనసున సందేహించి జంకినాఁడు. పోవుటకు సాధ్యపడకపోవుటచే దగ్గరఁ జేరి, నమస్కరించి తలవంచుకొని యున్నాఁడు. అట్టి తమ్మునింగని యక్క దగ్గరకు చేరి చంద్రవంకలకుఁ దప్పుల దిద్దుచు నెత్తురుల చిలుకుచు, కుకవి పదబంధము వలె సకలప్రవృత్తములై మదోన్మత్తలైన స్త్రీలచే కూర్పఁబడిన కఠినములగు నఖక్షతముల మూలమున బిగువెక్కిన యాతని శరీరమును కౌగిలించుటకు వెనుదీసినది. ఆమె సరిజేసుకున్న మనస్సుతో పోకిరియగు నాతని నేర్పుగల మాట లొప్పగా "సీమంతపు పెండ్లి కొడుకువు గమ్మని" హేతుగర్భితముగ నాశీర్వదించినది. అతఁడు మోహమువలన తొందరపాటుతో పోవుటకు యత్నింపఁగా వాని అయిష్టతను గమనించి వినయము, సౌహార్దము, మార్దవములచే మధురములైన మాటలు పలికి, చంద్రబింబమును బోలిన తన పుత్రుఁడగు చిన్నివాని మేనల్లుని ఇడుగో యని చంక కిచ్చినది. "ఎచ్చటి కేగెదవు? మీ బావపంక్తి నారగింతువుగాక.

శాకపాకములు నిమిషములో నొనర్తు" నని వాని నాపినది. వెనుక దెస దూరముగ నున్న యాతని భార్యకు కనుసైగ యొనర్చినది.

నిగమశర్మ భార్య నిట్టూర్పు గాలుల వేడిమిచేత వేడియైన భర్త పాదద్వయమును చల్లని నీటితోఁ గడిగినది. దేవతలకంటెను విశేషముగ గౌరవింపఁదగిన గొప్ప చుట్టమునకు వలె తమ్ముని కాతని అక్క సర్వాన్నములను రెప్పపాటు కాలమున నమర్చినది. ఆమె తమ్మునికి అభ్యంజనము చేయించినది. మడుగు ధోవతిని కట్టనిచ్చినది. బాగుగా తల వెంట్రుకలయందు అప్పుడు పూచినపూలు ధరింపఁ జేసినది. శరీరమునకు చందనపుఁ బూత పూసినది. భర్త వెంట భుజింపఁగా ఇలువేల్పగు విష్ణువునకు నివేదించిన మృష్టాన్నమును బెట్టినది.

నిగమశర్మ అక్క యిడిన ఇష్టములైన వంటకములను భుజించి, ఆచమన మొనర్చి సంతోషమునొంది, యతని భార్య చుట్టియిచ్చిన తాంబూలమును బుచ్చుకొని మహాశివుని వలె తిన్నెపైఁ గూర్చొని, చిఱునవ్వులు వెదజల్లుచున్నాఁడు. అప్పుడు అతని యక్క ఉత్సాహముతో నిండు మనసు కలదై, చిన్న పెద్ద తన సంతానము వెంట నంటి సందడి చేయుచుండఁగా, చేరువగా సదభిప్రాయముతో తమ్ముని జుట్టుముడి విప్పి సీత్కారములతో పేలపిల్లలను క్రుక్కి, అంటుకొని పోయి జుట్టు పాయలను శోధించి, అంటుపేలను కొనగోళ్ళతో దిగద్రువ్వి, తూరుపెత్తి తలవెంట్రుకల నుండి తీసి వైచినది.

పిమ్మట ఆమె మెడమన్ను నలిచి, అలకలు ముడివైచి, వేగముగా హస్తపద్మములను గడిగికొని, తనకు మరదలు తాంబూల మిచ్చుచు, బంగారు విసనకఱ్ఱ వీచుచుండఁగా, దాసి తెచ్చియిచ్చిన పీఁటపై తామరదుద్దుపై లక్ష్మీదేవివలె గూర్చుండి, కుడివైపు చనుబ్రాలను బిడ్డకుఁ ద్రావనిచ్చుచు నిట్లు తమ్మునితో సంభాషించినది. "ఏమిరా తమ్ముఁడా! నీవారంభించిన వేదపాఠమున కాటంకము గల్గుననియా నన్నుఁ జూచుట కింతకాలము నుండియును రాలేదు? నిన్నెన్నాళ్ళనుండియో చూడకపోవుటచే నా కన్నులు కాయలు కాచినవి. సముద్రుఁడు చంద్రోదయమును గోరునట్లు మీ బావయు నీ రాకలు గోరుచుండును. మన తండ్రి సామాన్యుఁడు కాడు. చక్కని సంపదలు, నిత్యపరిశుద్ధియు, గుణాతిశయమును గలిగి హద్దుమీరిన ప్రకాశముతో నొప్పుచు సముద్రునివలె నున్నాఁడు. ఇఁక నీవా సముద్రమందుఁ బుట్టిన చంద్రునివలె నున్న యెడల, తండ్రికిఁ దగిన కుమారుఁడవై లోకుల మెప్పు నొందెదవు. అట్లుగాక ఈ రీతిగ ధర్మము విడచి దుర్వ్యసనముల పాలైనచో సాలగ్రామశిలలు పుట్టెడి గనియందు తక్కువజాతి రాళ్ళు పుట్టినట్లె గదా!

"నే నితరుల సొత్తునైనాను. వారి (తల్లిదండ్రుల) యితర సంతానము కసుగందులు. నీవే పెద్దవాఁడవు. నీ రక్షణము నాశించెడి వారికి నీ విట్లయినచో నెంతటి దుఃఖమో యాలోచింపుము. బ్రహ్మము నుండి నీ తరము వఱకు మిక్కిలి స్వచ్ఛమైన నీ వంశమును తలఁపవైతివి. మరణసమయమునకు వశమైయున్న వారిని అల్పుఁడవై సంతోషపెట్టవైతివి. అగ్నిసాక్షిగ వివాహమాడిన భార్యను, ఈ మనోహరమైన రూపము గలదానిని, ఒల్లవైతివి. ధర్మశాస్త్రార్థములను జర్చించు పండితులను ధనములిచ్చి సంతోషపెట్టి కీర్తి గడింపవైతివి. శీలము సర్వము పిల్లి శీలమనియు, చదువులన్నియును జిల్క చదువు లనియును, తలఁచుచు తోడివారలందరును నవ్వగా నో సోదరుఁడా! యేల బేలవైనావు? ఈ గుణము నీకెందులకు?"

నిగమశర్మ యక్క యాతని చెడునడతలకు చింతించి చలించిన మనసు గలదైనది. కోపముచే గట్టిగా నఱచుటచే కోకిలల కాకలీధ్వని నతిక్రమించిన కంఠధ్వని కలఁత పడినది. తన యుపదేశము వ్యర్థముగాఁ బోయినందుకుఁ గోపించిన దైనను, వానికిఁ కోపము గల్గెనేమోయని, శాంతింపజేసి ప్రయోజనము సాధించు నుద్దేశముతో, పరవశత్వమును, సామరస్యము, ఆనుకూల్యము శోభిల్లగా మరల నిట్లు నిగమశర్మ యక్క అతనితోఁ బ్రసంగించినది.

"మిక్కిలి శ్రమల నొందుచున్న కడు ముసలివారైన తల్లిదండ్రులను, భూమిపై కాలు పెట్టి తిరుగఁజాలని చిన్నవారైన తమ్ములను, క్రొత్తగా కాపురమునకు వచ్చిన భార్యను, నోరు లేని గోవులను, సేవకుని, పసులకాపరి కుఱ్ఱవానిని, త్రోసిపుచ్చక రక్షింపవలసిన భారమంతయును కర్ణుని శిరముపై భారతసంహిత నిల్చినట్లు నీపై నిలిచి యున్నది. "సత్పురుషులచేఁ గొని యాడఁబడెడి నీతిప్రశస్తియందు నా సోదరుఁడు బ్రహ్మాదులను మెచ్చుఁడు, నే నాతని యజ్ఞమునందును పూజ్యురాలనై వేదిక యలంకరింతును" అని అనేకుల ముందు పల్కుచుందును. నీ వేదియును లేక ఓ సోదరుఁడా! సర్వగుణహీనుఁడ వగుదువని నే నెఱుఁగను.

"వీరావేశమును దాల్చి సమస్తధనములను వెచ్చించిన దటుండనిమ్ము. ముక్కారులును పండు పంటకాల్వలు గల కాశ్మీరకేదార ఖండములను అమ్మవచ్చునా? నీవు భార్య లేనివాఁడవా? నీ వెనుక సోదరులు మొదలగు వారెవ్వరును లేరా? ఇట్లు కులధ్వంస మొనర్చుట నీఁకుఁ దగునా? కామవికార మాత్మలో నూతనాతిశయము నొందినచో నిర్భరశోభతో రూపకుల శీలగుణౌన్నత్యముగల వేయిమంది విప్రకన్యలను వరించి క్రీడింపరాదా? గృహస్థులు మునులు కారు గదా! కులస్త్రీలను గూడి సుఖించుట తప్పు కాదు.

"చాపల్యము వలన నిల్లు మొదలగు స్థిరాస్తియు, బంగారము మొదలగు చరాస్తియు నేల భోగస్త్రీలకై నాశము కావలయును? వెలయాండ్ర కీ రీతిగ వ్యయమొనర్చుటకు మహాప్రభువులును, ధనవంతులును జాలరు గదా! ఓ తండ్రీ! ఇందువల్ల నేమిలాభము? అని ప్రశ్నింప వారిని విడిచిపుచ్చుటయే లాభము. చెడునడవడికి నిలయమైన వారస్త్రీలను ఉత్తముఁడు లెక్కింపఁడు. అర్థాంతరములతోఁ గూడిన చమత్కారపు మాటలు, అతివినయములు, వింతలైన కపటపు మెత్తఁదనములు, నానావిధములైన నటనలు, నీచపుఁబనులు, పై మెఱుఁగులు, మోఱటు దనములు, ప్రేలుటలు, వంకర తలపులు, వలపించు నేర్పులు, ఇష్టము లేని యపేక్షలు, పరిహాసములు, కలుపుగోలుతనములు, తప్పుడాటలు, వంచించు కులుకులు, పొందిక గల మాటలు, మోసములు, భ్రాంతులు లేని మచ్చికలు మొదలైన గుణముల గుంపులు, ద్రోహమతులునైన వేశ్యలను జేరిన కీడు వచ్చును. ఇంకనైన నిట్టి అవివేకమును మానుము. నేఁ జెప్పెడి హితము ననుసరింపుము. నీకుఁ గావలసినచో హరి కౌస్తుభము నైనఁ దెచ్చియిచ్చెదను. అసాధ్యులయిన కుచ్చితపు దుష్టులను విడువుము. నీవు పూర్ణకాముఁడవు. నా తమ్ముఁడవు. ఇట్లొనర్చుట తగునా?"

అక్క యీ రీతిగా నీతి ప్రేమలు గలుగ ఆనతీయగా, అశుచియై బక్కచిక్కినవాఁడు గావున, నిగమశర్మ అన్న పానములమీఁది కోర్కెచే నామె యొనర్చిన హితోపదేశము నాదరించినాఁడు. తేనె పూసిన కత్తి వంటి బ్రాహ్మణుఁడైన నిగమశర్మ దివాణమునకు రాకపోకలు చేయుచున్నాఁడు. మరచిన చదువులును మరలఁ జదువుచున్నాడు. పూర్వపు చెలికాండ్రెదురైన తల వంచుచున్నాఁడు. ధర్మపత్ని నూరడించుచున్నాడు. గురుజనులను బ్రతిదినమును గౌరవించుచున్నాఁడు. దేవతావిగ్రహములకు నైవేద్యములు వెట్టుచున్నాఁడు. అపరాహ్ణమున వచ్చిన అతిథిసముదాయములనుఁ బూజించు చున్నాఁడు. పసుల మందను గాపాడుట, పైరు పచ్చలను జూచివచ్చుట లొనర్చుచున్నాఁడు. తండ్రి దోవతిని తానే యుదుకుచున్నాఁడు. అక్క పెనిమిటితో చిఱునవ్వుల నెమ్మదిగఁ జిలుకరించుచున్నాఁడు. అంగడికి వచ్చి గ్రామకార్యమును దీర్చుచున్నాఁడు.

## నిగమశర్మను దొంగలు దోచుకొనుట

నిగమశర్మ యీ రీతిగా సన్మార్గునివలెఁ గొంతకాలము గడపిన పిదప, నొకనాఁడు ఇంటియందున్న సొమ్ములనన్నిటి నేరి మూటఁ గట్టుకొని కాజేసి, రాత్రివేళ తాను పండుకొన్న పడకకును చెప్పక కాఱుచీఁకటియే తనకు తోడుగా మహారణ్యమధ్యమునఁ

బరుగెత్తిపోయెను. వృద్ధబ్రాహ్మణుఁడు తన తండ్రి యిచ్చిన దర్భముద్రిక పోయినందుకు మనసున గలఁగి చింతించినాఁడు. అత్తగారిచ్చిన హరి సుదర్శనపుఁబేరునకు ముత్తయిదువైన నిగమశర్మ తల్లి దుఃఖించినది. క్రొత్తగాఁ జేయించుకొన్న ముక్కరకై యాఁడుబిడ్డ విశేషముగా దుఃఖించినది. వ్యామోహము గొన్నవాఁడై యల్లుఁడు పోయిన నవగ్రహకర్ణవేష్టమునకై చింతించినాఁడు. ఎట్టి దుర్బుద్ధి! ఎట్టి దుర్భ్రాంతి!! దురాచారశీలుఁడైన ఆతఁడు సర్వము నూచముట్టుగాఁ దోఁచుకొనిపోయిన తెలియఁగలదా? మోయుటకు సాధ్యపడని పెద్దమూటగాఁ గట్టి యే దారియు తెన్నును లేని పేరడవిలోఁ బ్రవేశించి, యతఁడు చావునకు సంసిద్ధుఁడై వేగముగా నేగుచుండెను. ఒకనాఁటి సాయంకాలవేళ నొక పట్టణమునకు సమీపముగ నున్న భీకరారణ్యములో నతఁడు ప్రయాణమొనర్చుచుండెను.

అట్టివేళ దయారహితులు, కాఱుచీకఁటివలె నల్లనైన రూపము గలవారు, వస్తువులను గాఁజేయుటయందుఁ ద్వరగలవారు, అసాధ్యులు, ప్రపంచద్రోహులు నయిన దొంగలు చేతులెత్తినవారై, ఒక్క పెట్టున మార్గము నాక్రమించి, ఔమ్ము పగులునట్లుగా, ప్రకాశించు బాణముల సమూహముచే, కోపముతో నా బ్రాహ్మణ పుత్రుఁడైన నిగమశర్మను గొట్టిరి. ఆ బాణములు శరీరమున పెద్ద గాయము లొనర్చినను, వానికిఁగల ఆయుస్సువలన మర్మస్థానములను సోకలేదు. ఒక్కొక్క నెత్తురు బొట్టునకు వేయిమందిగా క్రమ్మి, బకాసురునివంటి యా దొంగలు భ్రష్టుఁడగు నాతని నతివేగముగా దోచుకొని, చెట్టు కొక్కరుఁడుగా పారిపోయిరి.

### నిగమశర్మ కాఁపుకోడలిని లేవదీసికొని పోవుట

దుష్టుఁడగు నా నిగమశర్మపై జాలిదలఁచి యొక కాఁపుకొడుకు ఇంటికిఁ గొని వచ్చినాఁడు. అతనికిఁ గలిగిన యాపదను నివారించు పనియందాసక్తి గొన్నవాఁడైనాఁడు. తండ్రిని విడిచి పుచ్చుట వలన వృద్ధి నొందిన పాపము పోవునట్లుగా నొత్తినాఁడో యన్నట్లుగా, నా కాఁపు బిడ్డ నిగమశర్మ వ్రేళ్ళనెత్తు రొత్తినాఁడు. నిద్రించుచున్న జీవులను మేల్కొలుపునట్లుగా గంట్లయందు పెరుగుతోఁటకూర కాడలను కలిపి వత్తులు పెట్టినాఁడు. సమయముగాదని యమకింకరులను త్రోసిపుచ్చినట్లుగ నాటుకొనిన యస్త్రములను పెఱికినాఁడు. పడుటకు సిద్ధముగానున్న శరీరమును పడకుండగా ఊతకఱ్ఱలను నిల్పునట్లుగా పొత్తి గుడ్డలు వెట్టినాఁడు. వట్టికూడు, వేన్నీళ్ళు పెట్టి యెఱ్ఱగలుగు తాంబూలము లిప్పించి, సమర్థుఁడైన వైద్యు నేర్పాటు గావించి, కంట వత్తిడుకొని యా కాపుకుమారుఁడు బ్రాహ్మణపుత్రుఁడైన నిగమశర్మను

జూచునట్లుగ నొనర్చినాఁడు. గాలి లేని చోట భద్రముగాఁ జూచుట, సుస్నేహపూరము, ఆయుస్థ్సితి, అను రెంటిబలమున – దైవపురుషబలములచే నిగమశర్మ దుర్దశ నొందక యుండెను.

ఆ కాఁపు పెద్ద తానే ప్రసంగము లారంభించి, యా కపటబ్రాహ్మణుని పూని రక్షించుట గొప్పఁగా గ్రహించినాఁడు. అతఁడు, అతని కులము, అతని భార్య నిగమశర్మను తమ గురువువలెను, పరమాప్తుని వలెను నమ్మెను. నిగమశర్మ కాఁపుకడ తల లోపల నాలుక వలె, పూసలలో దారము రీతి, పాలఁ జల్లిన నీరువలె వెలి యెరుఁగక అభేదముగా నుండెను. ఆ కాఁపు ఇంటియందు శశికళయనఁ దగిన యొక కోడలున్నది. అది యువకులనెడి కాటుక పిట్టలను అంతటం దిరుగుచున్న కడకంటి చూపులను యురితాళ్ళచేఁ గట్టివేయఁ గల్గినది. ఇంట అడ్డమని యెఱుఁగక నంతయు చరించువాఁడును, చేతితోఁ దాకిన కందిపోవు అవయవములు గలవాఁడును, కంటికి ప్రియమైన వాఁడును, అందమైన విప్పారిన కన్నులు కలవాఁడును పిసాళి బాపఁడగు నిగమశర్మను తన కుచపంజరమునకు చిలుకగా నొనర్చుకొనుటకు మనసునఁ గోర్కె పడినది.

మంచివయసు గలవాఁడగు, విప్రనందనుఁడగు నిగమశర్మను జూచి ఆమె వికారపు కలుపుగోలుతనముగల చూపులను ప్రసరింప జేయుచు మోహాధిక్యమున తత్తరపాటును పొంది కోర్కెను స్వేచ్ఛగా సంచరింపజేసినది. కుదురైన పాలిండ్లపై కొంగు జారఁగా కొప్పువీడగా, వె్రిన వ్వూరక నవ్వెడిది. తోడికోడలి బిడ్డను పైకెత్తి బుగ్గ నొచ్చునట్లు కఱిచి వాఁడేడ్చిన కౌఁగిలించెడిది. దగ్గర నుండు చెలికత్తె మెడలో కంఠమాల వైచెడిది. కమసాలిని సాహసించి మెట్టెలు బిగువనుచు తిట్టుచుండెడిది. ఇట్టి మదనవికారములు గల ఆ కాఁపు కోడలు మనసు నందలి సిగ్గువీడి వలపులేర్లయి ప్రవహింపఁగా నీతనితోఁ బరిహాసము లాడుచుండెడిది. దృష్టిదోషము తగిలినదని దేహమును చలింపఁజేయుచు నుదుటి భాగము కనుపడునట్లు వస్త్రము కట్టుకొని కన్నీరు కార్చుచు నొక మూలఁ బండుకొనును.

లఘువర్తనుఁడైన నిగమశర్మ ఆ కాఁపు కోడలి తేలిపోవు కనుదోయిని, బడలిక పడ్డ ముద్దుమొగమును, మాటిమాటికి మిక్కిలి వాడిపోవు సన్నని నడుమును, తాపముచే వ్యథ నొందుచున్న ఆ మగనాలి యందమును చూచి, మన్మథవికారము నొందినదానినిగ భావింప మొదలిడెను. పోకిరితనము గల యీ యౌవనవతి యెవని వలచినదో యని తలంచి, అది తలలో ముడిచిన పూవులు రువ్వుట తనయందే

యగుటచే నతఁడు మిక్కిలి సులభముగ నీ బంగారు కుండ చిక్కినదని చంకలు దాటించెను. కెంపు మోవిని యొడిసి పట్టుటకును, గుబ్బపాలిండ్లను బిట్టు కౌగిలించుటకును, ముఖసుగంధమును వాసన చూచుటకును, పిఱుదులపై నుత్పలపత్రములను గ్రుచ్చుటకును, మిత్రద్రోహియగు నా నిగమశర్మ యుబలాట బడుచుండెను. ఆ రెడ్డి తన తలపుండ్లు కడిగించి, దొంగలచేఁ గొట్టఁబడినపుడు తెచ్చి బ్రతికించినాఁడు. ప్రీతితో నింట కన్నబిడ్డల కన్న గౌరవమును చనువును నిచ్చినాఁడు. ప్రతి దినమును గ్రాసవాసః క్లేశములను తీర్చి ప్రేమతోఁ బెంచినాఁడు. గురువుగా, వేల్పుగా, కూర్పుచుట్టముగా భావించి భక్తియుక్తితోఁ గొలిచినాఁడు. మన్మథభీతిచే నిగమశర్మ యను చెడ్డబ్రాహ్మణుఁడు గుడినుండి గుడిరాళ్ళు తీయునట్లు రెడ్డియింటి యందుండి యాతనికి ద్రోహముఁ దలపెట్టినాఁడు.

కాఁపుకోడలును, నిగమశర్మయు మెత్తఁబడిన మనస్సులు, యెడఁదెగని కోర్కెలు, పారవశ్యము నొందిన నిశ్చలమైన చూపులు, దట్టమైన ఆనందమువలన గలుగు గగుర్పాట్లు, తీరిన సిగ్గులుఁ గలిగిన చీఁకటి రాత్రులందు దుష్టచేష్టలతో పరవశత్వము నొందిరి. నిగమశర్మ ప్రాణాపాయకరమగు సాహసమునకు సిద్ధపడినాఁడు. “నరకే సతి కో దోషః?” (నరకమునకు సిద్ధపడగఁ మీదఁ తప్పేమున్నది?) “మరణే సతి కిం భయం?” (చావునకుఁ దెగింపగా నిఁక భయమేమున్నది?) అతఁడు ఈ చదువును చదివి యుండవచ్చును.

మాయలాడియు, ధూర్తురాలును నగు నా కాఁపు కోడలు సగము రాత్రివరకును పొలము పనులు చూచుకొని, మన్మథబాణవ్యథ నొందుచున్న భర్తను గూర్చి ఒక్క మంచి మాటయును మాట్లాడదు. అతని కే సేవయును జేయదు. ఎల్లవేళల మనస్సునందు కన్పించు ప్రియుఁడైన నిగమశర్మనే చూచుచుండును. నిగమశర్మ సన్ననైన ఎఱ్ఱని పెదవి యందలి తీపి పొన్నాకుపై బడిన తేనెవలె యస్థిరమైనదని తలఁపక, యనేకమారులు పొగడెడివాఁడు. శరీరమును సంపంగి పూలదండ వాసన వసంత ఋతుపరీమళవ్యాప్తివలె నిలుకడ లేనిదని భావింపక, పలువిధములఁ గొనియాడెడివాఁడు. స్తనముల బిగువు, పడిపోవుటకు సిద్ధముగా నున్న ఫలసౌందర్యము వలె నస్థిరమని తలఁపక మాటిమాటికి భావించెడివాఁడు. సిగ చుట్టఁబడిన కొప్పు యొక్క ప్రకాశము మేఘకాంతివలె కలకాలము నిలువనిదని తలఁపక మాటిమాటికి మెచ్చెడివాఁడు. తృప్తి తీరని రతివలన, దాహము తీరని మోహము వలన పాపమునుసమకట్టి జారుఁడైన నిగమశర్మ తగిన సమయమునకై వేచి యుండెను.

ఆ పట్టణపు రాజు పశువుల గుంపు గాలి సోకుడు రోగమనెడి పిడుగు దెబ్బచే నశింపగా, గాలి రూపమున నున్న క్షుద్రదేవతలకై (గాలి గంగలు) జాతర చాటించెను. ఆ సమయమున పల్లెటూరి కాఁపు పడఁతులు ఆయా నియమముల నాదరించు యత్నములందు శ్రద్ధగలవారై గోరువెచ్చని నూనెతో శిరములంటుకొనిరి. పసుపు కలసిన నీటితో స్నాన మొనర్చిరి. చిన్ని చిన్న గడులు గల క్రొత్త వస్త్రములు గట్టిరి, కన్నుగవలందు కాటుకలు దీర్చిరి. సిందూరతిలకమును గుండ్రముగా దిద్దిరి. నిక్కు కొప్పులందు ప్రీతితోఁ బూలను ముడిచిరి. వేపచిగుళ్ళ మాలికలను ధరించిరి. వ్యత్యస్తముగ చిట్టిబొట్టను చిన్న మంగళసూత్రపు సొమ్ము ధరించిరి. బాగుగా తోముటచే ధగధగలాడు ముత్యాలవంటి పలువరుసపై లేత తాంబూలరాగమును కూర్చిరి. మోటుతనపు టలంకారములతో తమ భార్యలు ముందు నడువగా, వారి వెంట రెడ్లు ఊరి పొలిమేర యందు కట్టఁబడిన గ్రామదేవత గుడికి ప్రయాణమైరి.

ఆ మహోత్సవము అజప్రధానమగుటచే విబుధసభను బోలియు, మహా సురోదారమయి యున్నది. తమోవికృతి విధేయమగుటచే, విధుబింబమును బోలియు తారావియోగముదితమై యున్నది. బహుళధ్వని పరీతమగుటచే సత్కవిత్వమునుఁ బోలియు, నసాధువర్ణ సంబాధబంధురమై యున్నది.

ఆ సమయమున నొక తెఱవ మబ్బుక్రింద చలించు మెఱపు వలె, సిడిమ్రాను నందు వ్రేలాడినది. ఒక నెలఁత చెందమ్మి కొలనునందు శోభిల్లు హంసవలె నిప్పుల ప్రవాహమందు నాట్యమొనర్చినది. ఒక యింతి తొలు సంజ ఎండ యందు వర్తిలు జక్కవవలె పందిరిలోని నిప్పుగుండమందు ప్రవేశించినది. ఒక యతివ పాచిపై నిక్కు కలువ మొగ్గ వలె అరటియాకుపై నర్తించినది. ఒక కాంత మూపుఁగండ లిచ్చినది. ఒక మధురవాణి మారూగాలిచ్చినది. ఒక లలన నోరితాళము నిచ్చినది. ఇట్లు కాఁపు పడతులు భక్తిశక్తులతో శక్తి నారాధించిరి. భక్తులు వాఁడి యంచులు గల కత్తులతో పసుల గుంపుల తలలను నరికిరి. ఆ జంతువుల నెత్తురు ధారలు భీకరములగు ఆపదలను చీకట్లకు నెట్టిని క్రొత్త సూర్యకాంతులైనవి. అధికముగా కల్లుఁ ద్రాగుటవలన మత్తు స్త్రీల తల కెక్కుటతో బాటుగ చీఁకటి దిక్కుల తలకెక్కఁదొడగినది. దేవి గుడిలోన నొక్కొక్క దివియ గన్పట్టఁగా నాకసమునం దొక్కొక్క నక్షత్రము కన్పట్టినది.

కాఁపుకోడలు కంచంత కాపురమును, పాలవంటి కులమును చెరచి, మగనిని త్రోసిపుచ్చి ఉంకుమగని వెంట పారిపోయినది. స్త్రీలకు బుద్ధి పెడతల నుండును

గదా! ఆకు మఱుఁగు పిందెవలెను అంతఃపురమునం దున్నటులును నున్న పున్నమినాఁటి చంద్రుని వంటి చక్కనైన మోము గల యామె భీతివలనఁ బెఱికిన వేగిరపాటుచేత వెళ్ళుచున్నదే గాని లోపల నాకలిదప్పులను, సూర్యకిరణముల వేడిమిని లెక్కించుట లేదు. మన్మథుని బాణముల వంటి మంటల చేత కలతపడి తపించునట్టి మనసుగలవారికి ఇతరములైన నొప్పులెవ్వియైనను లక్ష్యమా? కాఁపుకోడలును, బ్రాహ్మణాధముఁడైన నిగమశర్మయు గాఢమైన యరణ్యమార్గములందుఁ బయనించి యొక బోయ పల్లెను జూచి శాంతి బొందిరి. ఎన్నియో జన్మలెత్తినఁగాని లభింపని భూదేవజాతిని నిముసములోఁ ద్రోసిపుచ్చి పాపాత్ముఁడైన నిగమశర్మ విపరీతముగ ద్రాగుచు మాంసము దినుచుండెను. దుర్వినీతురాలైన కాఁపు పడుచు గండుతుమ్మెదలు తన యూర్పుగాలి పరిమళములను వాసన చూడఁగా, వేటతమకముచే దానును, ప్రియుఁడును పెద్ద పులులు మొదలగునవి చరించు భయంకరమైన యరణ్యమునందు మెలఁగుచుండెను. నడక, నడుము, కుచములు, జుట్టు, చూపులు అనువాని వలన గలుగు గర్వమున నడ్డరానిదగు నా స్త్రీ వలన మర్యాద నశించినదని తలంచి, సారము లేని సంసారము నసహ్యించుకొని వీడఁదలఁచి నెమలి, సింహము, ఏనుఁగు, చమరీమృగముల గుంపు, ఏణములు ఆ కాఁపు పడఁతి వాఁడియైన బాణముల వలని యగ్నిజ్వాలకు మృతి నొందుచున్నవి.

వెదురు బియ్యమును తెల్లగ దంచి బువ్వులవలె చిన్ని లోవిలో వండి దింపి సిద్ధ మొనర్చిన యన్నమును బాగుగాఁ దోమబడిన మూఁకుటియందు వడ్డించి, యనేకరీతులైన యరణ్యపుమాంసములను చుట్టువారగ నుంచి, గవయమృగపు నేయి పోసి, ఆ గవయ మృగము మజ్జిగను సొరకాయ చిప్పలో నుంచి, యొక ప్రక్కన నిల్పి పంక్తిని గూర్చుండి యా సుందరి నవ్వుచు, నాయా రుచులను దెలియఁజెప్పుచు, సగము కొఱికిన యన్నపు బిడుచలను భర్తయైన నిగమశర్మకు నిచ్చుచున్నది.

## నిగమశర్మ మాలెతను వరించుట

కాఁపు పడఁతి మరణించిన పిమ్మట మోసమొనర్చి నిగమశర్మ మఱియొక చోట రూపాజీవయు, చంద్రముఖియు, చీఁకటి మ్రానియాకుల గుంపుతో సమానమగు నల్లని శరీరకాంతి గలదియు, క్రొవ్వినదియు, చక్కని పిఱుదులు గలదియు, తిత్తివంటి వీణావాద్యమును చేత ధరించినదియు నైన మాలపడుచుతోఁ గూడి, క్రీడించినాఁడు. ఆ మాల పడుచునందు నిగమశర్మకు అపవిత్రమైన పుత్రలాభము కల్గినది. ఈ రీతిగ బ్రాహ్మణత్వమును గోల్పోయిన నిగమశర్మ పాతాళలోకమునకుఁ బడునట్లుగా నా

మాలెతతోఁ గూడి యెన్నియో పాపము లొనర్చుచు జీవించినాఁడు. ఒక్క దినమున దగ్గఱనున్న యరణ్యమధ్యమున రెండు వేటకుక్కలను గొని వేటపై నాసక్తితో మదించిన జంతువులను జంపి, కంటికి నచ్చిన నానామాంసములు విశేషముగా గ్రహించి, కావడిలోఁ బెట్టుకొని సూర్యాస్తమయ సమయమునకుఁ దనయింటికి వచ్చెను. వచ్చునప్పటికి దైవయోగమున కోపించిన యముని దృష్టివలె భీకరమైన అగ్నిజ్వాలలో నాతని గృహము దగ్ధమై యుండెను. అందు కల్లు త్రాగుటచే మత్తుగొన్న అతని చండాలభార్యయు, పుత్రులు కాలి నశించి యుండిరి.

తన యిల్లీ రీతిగ బిడ్డలు, పశువులు, భార్య, ధనము, మొదలగువానితో కాలిపోఁగా జూచి యాశ్చర్యపడి, దుఃఖించి "వినిందితకుల వ్యవహర్త" యైన నిగమశర్మ కనురంధ్రములనుండి ముంతలతోఁ బోసినట్లు శీఘ్రముగ కన్నీటి ధారలను గ్రుమ్మరించినాఁడు. భూమి మీదఁ నెన్నియో పర్యాయములు చదికిలఁబడి, తలవ్రేల వేయుచు వికారముగ నున్న నోటినుండి లాలాజలములు తీగలు సాగగా, నతఁడు మిక్కుటమగు ప్రేమతో భార్యను గూర్చి యిట్లు విలపించినాడు : "అందరు నెల్లయెడల స్త్రీలను ధనములిచ్చి గ్రహింతురు. నేను పరమపవిత్రమైన వంశము నిచ్చి కొనినాను. ఓ ప్రియా! నల్లని నీ రూపము శాశ్వతమని నమ్మితిని. అది నిత్యమైనది కాక యిట్లు మెఱపు తీవవలె క్షణకాలము మెఱసి నశించునదని యెఱుఁగనైతిని. చిన్ని నల్లని మచ్చలు గల స్తనములపై పయ్యెద కొంగు జాఱఁగా కిన్నెరవీణ మోపి, శ్రుతికిఁ దగినట్లు మెట్లను సవరించి నీవు గానమొనర్పఁగా, నీ తిన్నని కంఠధ్వని నా చెవులకుఁ దేనియ లొల్కుటను స్మరింతును. మచ్చ లేని చంద్రుని రూపమునఁ బ్రకాశించు నీ మోమున నమృత ముండుటచే నీ కడజాతి నాతికి బ్రాహ్మణుఁడు చిక్కినాఁడని నేను వచ్చి పోవునపుడు జనులు కోపమునఁ జూచుచు, ఉమ్మివేయుటనైన సహించినాను. లోకమున పుత్రు లెందఱికి లేరు? నా వంశము నుద్ధరించువారు, నీ పుత్రులను బోలినవారు పూర్వ మెవ్వరికి నెన్నఁడును బుట్టలేదు. వారి ముఖకాంతి, దేహపుష్టి, భుజవిజృంభణము, మాటల సొంపు, తామరరేకుల వంటి వారి కన్నుల చక్కదనము, చూచువారిని పరవశులను గావింపదా?" ఇట్లు భార్యను, పుత్రులను గూర్చి దుఃఖించి నిగమశర్మ, వారినిఁ జూచి కాని భుజింపను, నీరు ద్రావనని నిర్మానుష్యప్రదేశమున సంచరింపసాగెను. ముందు పుణ్యాత్ముఁడు కాఁబోవువాఁడు దుఃఖభారమును సహించు రీతిని కాఱడవియందు ఊగులాడుచు, తూలుచు, పొదలలో దూరుచు, ఊరకయే పోవుచుండెను.

నిగమశర్మ నీచమైన శరీరమును పారవేయునట్లుగా నేలపైఁబడి, అంతము లేని విష్ణునిదయచే నరలోకమును విడిచి శ్రీవైకుంఠమును జూచుటకో యనునట్లుగా, తనంతట తానే మరల లేచినాఁడు. ప్రయోజనరహితముగా నెన్నియో యోజనములు అన్నపానములు లేక ఆ దురాత్ముఁడైన నిగమశర్మ కాఱడవులలోఁ దిరిగినాఁడు. తుదకొక నృసింహక్షేత్రమును జేరినాఁడు. మిక్కిలి సమీపించినదై, విశేషముగఁ బరిపక్వమైనదై తన్నుఁ జేరుచున్న పూర్వజన్మ తపఃఫలము వలన నృసింహస్వామికి స్థిరనివాసముగా నొనర్పఁబడిన సంగమతీర్థజలము లందు స్నానమాడి, వైకుంఠ ప్రభువగు నా నృసింహస్వామిని పెక్కుమారులు దర్శించినాఁడు.

నిగమశర్మ తాను విష్ణువు కాఁదలచినవాఁడై, (విష్ణుసారూప్యము నొందఁ దలచినవాఁడై) ముందే యా దేవుని పదియవతారములను ధరించినాఁడో యన్నట్లుగా ఇతరులను కొంచెమైనను ఱెప్పవ్రాల్చక చూచుచుండును (మత్స్యావతారము). తలకొట్టుకొని దుఃఖసముద్రమునందు మునుఁగును (కూర్మావతారము). రంధ్రమును తెఱువు మనుచు భూమిలోఁ జొరఁబారును (వరాహావతారము). మిక్కిలి యెక్కువయైన కొయ్యబారిన స్థితి వహించును (నరసింహావతారము). బిచ్చ మెత్తువాని వలె నలు దిక్కులకు చేతులు చాచును (వామనావతారము). కాఱుచున్న కన్నీటి సముద్రమున (అస్రాంబుధిని) మునుఁగును (పరశురామావతారము). భార్యను గుఱించి హా! పోయితే? యని దుఃఖించును (రామావతారము). బహువిధైరాసక్తిని విభ్రాంతి నొందును. (బలరామావతారము). సమీపింపలేని చూపు యొక్క స్థితిని (దర్శనస్థితి) వహించును (బుద్ధావతారము). బడబాగ్ని తోఁచుటను ఉదరమున వహించును (కల్క్యవతారము). ఎడతెగని యుపవాసములచే చెవులు వినిపింపక పోయెను. బహుకాలము గడువలేదు. అతఁడు ప్రాణము గోల్పోయినాఁడు.

## నిగమశర్మ వైకుంఠమున కేఁగుట

అతని నీచశరీరముపై కాకఘూకము లెక్కినవి. ఏనుఁగు పిండువలె నల్లనైన యమభటసమూహములు అతని యాతనాశరీరము నడ్డగించిరి. "స్త్రీల పెదవి చొంగతోఁ గలిసిన నానారకములైన మద్యముల నన్నింటి నతఁడు క్రోలినాఁడు. వావివర్తనలు లేక కంటి కింపైన స్త్రీని పొంది కామవికారముతో విజృంభించినాఁడు. ప్రజలు పురువులు గారునట్లు తన్ను దిట్టగా అవమానమును సహించి బందిపోటు గావించి బంగారమును సంపాదించినాఁడు. ఇళ్ళకుఁ గన్నములు వైఁచి లెక్కకు మించిన

బ్రాహ్మణశ్రేష్ఠులను జంపినాఁడు. ఇట్టి కర్మలొనర్చు క్రూరుల స్నేహమొనర్చినాఁడు. ఇంకను నితరము లైన పాపముల నెన్నింటినో యొనర్చినాఁడు. వీనిని చుట్టుముట్టి కట్టి వేయుఁ" డని యమదూతలు బాధింపఁగా, నిగమశర్మ భయమొందినాఁడు. దిక్కులు ప్రతిధ్వనించునట్లుగా మొఱఁపెట్టినాఁడు.

యమభటు లీ రీతిగా గోపమున నాక్రమించుకొను తొందరపాటుతో నుండఁగా, విష్ణువు పూర్వ మా నృసింహక్షేత్రమున కాఁపుగా నుంచిన సుదర్శనాయుధము పరాక్రమించి, వేయి సూర్యులవలె తీక్ష్ణమైనదై యమభటుల నావలకుఁ బాఱఁద్రోలి వారు నిగమశర్మకుఁ గట్టిన బంధనములను దెగద్రెంచెను. యమభటులు కొందఱు భీతినొందిరి. కొందఱు పాఱిపోయిరి. అంతట విష్ణుదూతల సమూహము సుదర్శనము, నందకము, పాంచజన్యములను నాయుధములతోను, శంఖములతోను నప్పుడచ్చటికి వచ్చిరి.

ఆ విష్ణుదూతలు యమలోకమునకుఁ బోవుటనుండి మరలించి, విష్ణుని గరుడ వాహనముపై నెక్కించి నిగమశర్మను శ్వేతద్వీపము (వైకుంఠము) వంకకు మరలించిరి. వేయి సూర్యకాంతులు గల విమానమెక్కి తేజస్సుచే మన్మథునకుఁ దండ్రియైన విష్ణువు వలె వైకుంఠమునకుఁ బోవుదారిలో, నాతని శరీరమునఁ బుట్టిన చెమటను గరుత్మంతుని ఱెక్కల నుండి పుట్టిన గాలి తొలగించుచున్నది. ఆదిశేషుడు పడగను ముత్యాల గొడుగుగాఁ బట్టి యతనికి నెండ తగులకుండు నట్లొనర్చుచున్నాఁడు. విష్వక్సేనుఁడు చేతి బెత్తముతో నెడమును గల్పింపగా నిలిచిన దేవతలను నిగమశర్మ కడకంటి చూపులతోఁ జూచినాఁడు. ప్రక్క భాగములందు భృగువు, భరద్వాజుఁడు మొదలైన మహర్షులు స్వస్తివచనములు పలుకఁగా, నా ప్రదేశములు ప్రతిధ్వనించినవి. ఈ రీతిగా నిగమశర్మ భగవత్సారూప్యమును బొందినాఁడు. నిగమశర్మ బాహువులు పచ్చలు తాపిన స్తంభముల వలెను, అతఁడు ధరించిన బంగరు పూలమాలలు మెఱపుల రీతిని, విశాలనేత్రములు తెల్లదామర పూరేకుల వలెను, ముఖము లేఁత సూర్యుని బింబము వలెను ఉన్నవి. నిగమశర్మ విష్ణుసాయుజ్యము నొంది శ్రీమహావిష్ణువునకు పార్శ్వచరులైన పుండరీక శంఖకర్ణాదులలో నొకఁడై, కుముదుఁడను పేరుతో విశేషగౌరవము నొందినాఁడు.

★

# వేమన

**శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ**

'వేమన' కర్తలు మహావిద్వాంసులు, కవులు, గాయకులు, విమర్శకులు, పరిశోధకులు నై ఆంధ్రదేశము నందే కాక బహుప్రాంతములలోఁ గీర్తికెక్కిన మహనీయులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు. ఇది, క్రీ.శ. 1928లో వీరు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వారి యాజమాన్యమున వేమనను గూర్చి యిచ్చిన ఉపన్యాసవ్యాసముల సంపుటి. రాయలసీమలోని అనంతపురము మండల మందలి రాళ్లపల్లి శ్రీ శర్మగారి జన్మస్థానము. జననము 1893. శ్రీ శర్మగారు బహుకాలము మైసూరు విశ్వవిద్యాలయమున ఆంధ్ర పండితులుగా పనిచేసి, పిమ్మట తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ప్రాచ్య విద్యాపరిశోధనాలయమున నుద్యోగించి, ప్రస్తుతము అచటనే విశ్రాంతులుగ నున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులై ప్రముఖపాత్ర వహించుచున్నారు. బహుభాషాకోవిదులైన వీరి యితర రచనలు తారాదేవి, మీరాబాయి, శాలివాహన గాథాసప్తశతి మొదలైనవి. వీరి సంగీత సాహిత్య విమర్శశక్తి అసామాన్యము. శ్రీ శర్మగారు అన్నమాచార్య కీర్తనలకు స్వరకల్పన మొనర్చిన సంగీతకోవిదులు. సంగీతసాహిత్య విషయములపై రసికతా సౌకుమార్యములు, విజ్ఞతావిశాలదృక్పథములు ప్రదర్శించుచు, వీరు వ్రాసిన వ్యాసములు అనేకములు.

## వేమన – కొన్ని విశేషములు

అతీంద్రియములైన తత్త్వములను దెలిసికొనవలెనను నాశ, అనుభవపూర్వకముగ వానిని సాధించు సాహసము, దానికి సాధనమైన రెండంచుల పదునుగల చురకత్తి వంటి కవిత్వశక్తి, దానికి మెఱుఁగిడు ప్రపంచవ్యవహారములలోని సూక్ష్మదృష్టి, తిట్టుచునే నవ్వించు హాస్యకౌశలము – అనునవి ఆంధ్రులలో అపూర్వవ్యక్తియైన వేమన సహజగుణములు. ఇతని తత్త్వజ్ఞానము అనుభవపూర్వకము. ఇతఁడు సత్యమని నమ్మిన తన జ్ఞానమును ఇతరులకు బోధించుటలో కాలనష్టమని తలచినవాఁడు కాఁడు. ఇతఁడు నీవు చెడిపోవుచున్నావని తిట్టినవాఁడు గాని, నాకివ్వలేదని

తిట్టినవాఁడు కాఁడు. ఇతని హాస్యము అనూహ్యమైనది కాదు. ఇది వెక్కిరింత లేని నయముతోఁ గూడిన హాస్యము. ఇన్ని గుణములు గలవాఁడు మరొకఁడు కనుపింపఁడు.

వేదకాలమున శిష్యులే గురువుల వెదకుకొనుచుఁ బోయి తత్త్వబోధ నొందిరి. తత్త్వజ్ఞుఁడితరులున్న చోటికిఁ బోయి బలవంతముగ నైన బోధయొనర్చుట బుద్ధునితో నారంభమైనది. శంకరుఁడు నీ మార్గమనుసరించినాఁడు. అద్వైతమత ప్రధానముగ వైదికమతబోధ యొనర్చిన యీ యాచార్యుని మతము ఆంధ్రదేశమున లేదు. ఇతఁడాంధ్రదేశమున సంచార మొనర్చినట్లు లేదు. వేదమతము, భక్తిప్రధానమైన విశిష్టాద్వైతమును బోధించిన రామానుజాచార్యులకు ఆంధ్రదేశమునందు సంచార మొనర్చు నవకాశము లభింపలేదు. శుద్ధకర్ణాటకుఁడైన ఆనందతీర్థులవారి మతము కర్ణాటమహారాష్ట్రములను, దాటి వ్యాపింపలేదు. నింబార్క వల్లభాచార్య లిరువురు నాంధ్రులైనను, వారి మతము ఆంధ్రదేశమునకు వెలుపలనే వ్యాప్తి నొందినది. బసవేశ్వరుఁడు ఆంధ్రుఁడు కాఁడు. ఆయన వ్రాతలు కన్నడములో నున్నవి. కాకతీయుల కాలమందును, విజయనగర రాజుల కాలమునందును ఆంధ్రులకు తత్త్వవిషయములను గూర్చి యోజించుట కవకాశము లభించినది. మతకర్తల మూలమున గాక వారి యనుయాయుల వలన, కాకతీయుల కాలమందు వీరశైవము, విజయనగరరాజుల కాలమున విశిష్టాద్వైతము ఆంధ్రదేశమున వ్యాప్తినొందినవి. కాని వీనికి నిలుకడ దొరకలేదు. మతతత్త్వవిచారములను మొదటి నుండియు పట్టుకొన్నవారు బ్రాహ్మణులు. వీరిలో మూఁడు పాళ్ళు అద్వైతులు. శంకర మతానుయాయులు బహుశః వలస వచ్చినవారు. ఆంధ్రదేశ మందలి ద్వైతా ద్వైతమతానుయాయులు ఆంధ్రులు కారు. బ్రాహ్మణేతరులలో వీరశైవమునకు గాని, వీరవైష్ణవమునకుఁ గాని ఆధారము లభింపలేదు. ఈ మతములను ప్రచార మొనర్చినవారు తమ తమ తత్త్వబలముచేఁ గాక, తామాశ్రయించిన రాజుల ఖడ్గబలముచే, మతవ్యాప్తి నొనరించిరి. వేమన పై విషయముల కన్నిటికిని అపవాదము.

వేమన తనకుఁ దోచిన తత్త్వమును వ్యాప్తి నొందించుటకు ఆంధ్రదేశమంతయు సంచార మొనర్చెఁనాఁడు. అచ్చటచ్చట మతములను స్థాపించి, తన మతమందు విశ్వాసము గలవారి నందు నిల్పినాఁడు. ఇతఁడు తాను బోధించిన మతమునకు కర్త కాఁడు. వేమన మతము పురాతనమైన అద్వైతమతమే కాని, పుస్తకపఠనము వలన సంపాదించినది కాదు. యోగసాధనచే అనుభవపూర్వకముగా గ్రహించినది. వేమన తాననుభవించి గ్రహించిన మతము మూలమున ఇతరులను దరింప

జేయుదలపెట్టినాఁడు. ఉదారాశయుఁడగు నీతని సిద్ధాంతమును కొందరు సందేహించినను బోధనయందలి నిష్కాపట్యమును సందేహింపలేదు. సందేహించు శక్తి లేనివారు నమ్మి భక్తులు, శిష్యులునైనారు. వేమన మతకర్త కాకపోయినను మతప్రచారకులలో మతకర్తకున్న విలువను సంపాదించిన ధీరుఁడు. ఇతని శిష్యుఁడైన కటారుపల్లె వేమన్న, ఏగంటివారు, పోతులూరి వీరబ్రహ్మము, సదానందయోగి మొదలైనవారు ఇట్టి మతమునే ప్రచార మొనర్చిరి. భక్తిప్రధానమైన వైష్ణవమును సామాన్యులలో వ్యాప్తి నొందించిన రామదాసు, త్యాగరాజు, తాళ్ళపాక వారు, శృంగారమూలమున విష్ణుభక్తిని వ్యాప్తి గావించిన క్షేత్రయ్య మొదలైన పదకర్తలు – అందఱును మతకర్తలుగాని మతప్రచారకులే. వీరిలో నెవ్వరికిని వేమన్నకుఁగల వ్యాప్తిగాని, చనువుగాని లేదు. కేవలము నమ్మకమేగాని అనుభవము లేకపోవుట, నచ్చచెప్పుటకు వాగ్ధాటి కొరవడుట, ఇతరుల కుపదేశింపవలెనను నుద్రేకము లేకుండుట, తమ గతి తాము చూచుకొనని స్వార్థత్యాగులు కాకుండుట యనునవి, వారికి వేమన్నకుఁగల వ్యాప్తి, చనువు లభింపకపోవుటకు హేతువులు.

స్వార్థత్యాగులకు పాండిత్యమున్నచో, గణపతిదేవుఁడు శివయోగ సారమందువలె తత్త్వజ్ఞానమును గ్రంథస్థమొనర్చును. త్యాగయ్య కీర్తనలలో భక్తిని పాండిత్యము మాటుపరచినది. సంగీతపు పాలెక్కువ. క్షేత్రయ్య పదములు శృంగారము మీఁదికి బుద్ధిని ప్రసరింపజేయును. హృదయమును పిండు కావ్యశక్తి లేని రామదాసు కీర్తనలు రచ్చ భజనలకే పనికి వచ్చును. వీనిలో భావసంగ్రహము లేదు.

వేమన్న పద్యములు చిన్ని పలుకులు. అచ్చతెనుఁగు పద్యపునడకతో, గుఱితప్పని చిక్కని చక్కని తెలుఁగు మాటలతో తెలుఁగువారెల్ల నేర్వఁదగినయున్నవి. వేమన్న తన తత్త్వమును బోధించుట కడిగినవారి కెల్ల పద్యములు చెప్పినాఁడు. కొన్ని తావులందు ప్రాఁతపద్యములకే క్రొత్త మలుపు లిచ్చినాఁడు. ఇతఁడు ఎట్టి సంకోచమును లేక, ఎవరికి బెదరక పలికినాఁడు గావుననే, సామాన్యుల కితనిపై విశ్వాసము, భక్తి కలిగినవి. పండితులును త్రోసి పుచ్చలేక పోయినారు.

మతకర్తలు గాని మతప్రచారకులను కవులలోఁ జేర్పనట్లే, శతకములు, కీర్తనలు మొదలైనవానిని వ్రాసినవారిని గూడ లాక్షణికదాసులైన పూర్వులు కవులలోఁ జేర్పలేదు. నవభావధురంధరులైన వీరేశలింగం పంతులుగారును వీరిని కవులలోఁ జేర్పలేదు. వేమన కిట్టి స్థితియే దక్కినది. వేమన పద్యములను శ్రమతో సంపాదించి, ప్రకటించిన బ్రౌనుదొరయును వేమనను కవియనలేదు. ఆంధ్రదేశమున వేమనకుఁగల

గౌరవమునకు, నతని బోధలు నేటికి నిలచియుండుటకు నతని కవితానైశిత్యమే కారణము.

వేమన పద్యములను జదివి యతని సిద్ధాంతములను నిరూపించుట కష్టకార్యము. అతని పద్యములేవో, కానివేవో తెలిసికొనుట కష్టము. వేదము, ఉపనిషత్తులు, పురాణములు, కాళిదాసాదుల కావ్యములు మొదలగువాని యందే మనవారు తమకుఁ దోచినవానిని జేర్చినారు. వేమన యొక గ్రంథమును వ్రాయలేదు. వ్రాతకందని పద్యములు వేల సంఖ్యలో చెప్పినాఁడు. ముఖ్యముగా కందములతో యోగరహస్యములను దెల్పు గ్రంథము నొకదానిని వేమన వ్రాయదలచినట్లు 'భువిరాజతారకంబులు' మొదలైన పద్యము వలన దెలియుచున్నది గాని, వేమన్న దానిని బూర్తియొనర్చినట్లు లేదు. 'శ్రీకరుండగు వేమన చెప్పినట్టి పద్యముల' "వేదాతీతుఁడు వేమన సుమ్మీ!" మొదలైనవి."ఫలశ్రుతి పద్యము" లనుట తగదు. ఆత్మప్రశంసకై అతఁడో లేక యతని శిష్యులో చెప్పినవై యుండును. 'వేమన సూక్తిరత్నాకర' మను బందరు ముద్రణలో వేమన తన చరిత్రను జెప్పికొన్నట్లున్న పద్యములు ఇతరప్రతులలో లేనందున అతనివని నమ్మ వీలు లేదు. "నూరు, వేయి, పదియునైదు వేలుగా" పద్యములను జెప్పినట్లు కొన్ని తావులందు గన్పించుటచే, వేమనకు ఇన్ని పద్యములను చెప్పితినన్న జ్ఞానమున్నట్లు కన్పింపదు. విశ్వకర్మ వంశీయులైన పూర్ణయాచారిగారి బందరు ప్రతి చూచిన పిమ్మట, వేమన పద్యములలో ప్రక్షిప్తములున్నవను భావము కల్గుచున్నది.

మొదటినుండియు వేమన పద్యమును వ్రాసినవారు అవ్యుత్పన్నులు. వీరు చేసిన దిద్దుబాట్లను జూచి బ్రౌను "తప్పు గమనించి వ్రాయు టుత్తమము" మొదలైన పద్యమును వ్రాసినాఁడు. "ఉప్పు కప్పురంబు" అన్న ప్రసిద్ధమైన వేమన పద్యమే యొక ప్రతియందు మిక్కిలి మార్పు నొందినది. వ్రాతప్రతుల కంటె నచ్చు ప్రతులు మరియు నసహ్యముగ నున్నవి. మూలమర్థము గానపుడు వీనిలో నెన్నియో దిద్దుబాట్లు జరిగినవి. బ్రౌను దొరయే యతి చెడినదని, "గూబ యెక్కినట్టి గృహము పాడుగఁ జేసి" లోని "గృహము"ను "గురముగ ముద్రించి, గురము గృహమునకు అశాస్త్రీయమైన తద్భవమని చెప్పినాఁడు. మూలమును సూక్ష్మపరిశీలన మొనర్చినచో వేమనయే నియమమునకు లోబడినవాఁడు కాఁడని తెలియును. విసంధులు, అతని నాఁటి వ్యావహారిక భాషారూపములు, ఛందోభంగములు మొదలైన వెన్నియో కన్పించును. అదియును గాక వేమనయే మనకర్థము గానట్లు వ్రాసిన పద్యములు నెన్నియో యున్నవి. తత్త్వవిషయములను దెల్పు పద్యములు సామాన్యముగ దుర్బోధములు. బ్రహ్మరంధ్రమందలి

సహస్రారచక్రమును "నందిదుర్గ" మని సంకేతించి వ్రాయుట యిందు ఒక ఉదాహరణము. మన కర్థముగాని "నీరు కారమాయె కారంబు నీరాయె" వంటి అర్థము గాని పద్యములు లెక్కలేనన్ని పాఠ్యాంతరములలో గూడ నున్నవి. వీనిలో గూఢార్థ మున్నదని యొక యభిప్రాయము. "చెప్పులోని రాయి, చెవిలోని జోరీగ" ఇత్యాదిగ నున్న పద్యమునకే గూడార్థమున్న దని సంప్రదాయజ్ఞులందురు. బ్రౌను దొరయును నిందంతరార్థమున్నదని భ్రాంతి నొందినాఁడు.

వేమన పద్యసంఖ్య నిర్ణయము, మూలపాఠములను గుర్తించుట, గ్రంథకర్త యర్థమును గమనించుటను చిక్కులు తెగునవి కావు. బందరు ప్రతిలోని పద్యములు నాల్గువేలు. ఇందులో లేని పద్యములు నూట యిరువదియైదు. "వేమనయోగి వేదాంతసిద్ధాంతమందును, మరికొన్ని వావిళ్ళవారి ప్రతియందును నున్నవి. విమర్శించిన అచ్చు ప్రతులలోనుండి వేయి పద్యములైన తీసివేయవలసి వచ్చును. కొన్ని రూపభేదములతోఁ గన్పించును. వేమన పేరు చిరస్థాయిగ నిలుచుటకు మూఁడువేల పద్యములు చాలును."

వేమన చెప్పినవి ఆటవెదులు. శైలీసామ్యమును బట్టి అతని యాటవెలదు లెవ్వియో చెప్పగలము. ముద్రితప్రతిలోని 691 కందములలో వేమనవి 102 మాత్రము. ముద్రిత ప్రతులలో 324 తేఁటగీతులున్నను వ్రాతప్రతులలో మిక్కిలి తక్కువగ నున్నవి. తత్త్వవిచార మొనర్చిన వేమన కందములు, తేటగీతములు చెప్పవచ్చును. అయినను అతని కందగీతములలో అనేకము లతనివి కావు. ఇంతేకాక చంపక మాలాది వృత్తములు, పాటలు కొన్నియున్నవి. ఇవి దరిదాపుగ వేమన పేర ప్రకటితము లైనవే. వేమన పద్యములలోని ప్రక్షేపములను జెప్పినపుడు, అర్థ భావములకన్న పద్యరచనా స్వరూపమును ముఖ్యముగా గమనింపవలయును. మూలపాఠములను గూడ వ్రాతప్రతుల సాయముతో నిర్ణయ మొనర్పవలయును. వేమన పద్యములలోని యర్థమును గమనించుటకు స్వశక్తి మాత్రమే యాధారము. వేమన పద్యములలోఁ గొన్నింటికి వ్యాఖ్య వ్రాసినవారు అయిదుగురు. 1. పూడిపెద్ది సాంబశివరావు (వేమన పద్య రహస్యార్థ బోధిని మొదలైనవి) 2. శ్రీ జ్ఞానానందయోగి (తత్త్వార్థబోధిని) 3. వావిళ్ళవారు ముద్రించిన ఆంధ్రతాత్పర్య గ్రంథకర్త 4. కరూరు బంగారయ్య (వేమనాచార్యుని పద్యపదశబ్దార్థము) 5. బ్రౌను దొర (వ్రాసి కొంతగ ప్రకటించిన ఆంగ్ల పరివర్తనము). మొదటి వ్యాఖ్యాతకు వేమనపై భక్తియధికము. మూలమునకు, వ్యాఖ్యకు సంబంధము తక్కువగనున్నది. కొంతవేలైనను రెండవ వ్యక్తి అనుమానములను పూర్తిగఁ దీర్పఁజాలఁడు. వావిళ్ళవారి వ్యాఖ్యాత వివరణ

మవసరమైన తావులందు చల్లగ తప్పుకొనినాఁడు. నాల్గవ వ్యాఖ్యాత లం : పృథివి, జ : పుట్టబడినది, పుష్పం – పుష్పము నందుఁ బుట్టు లక్ష్మి మొదలైన అర్థములను జెప్పుచు, తన వింత ప్రతిభను వెల్లడించినాఁడు. బ్రౌను మూలార్థమును దెలిసికొనుటకు స్వచ్ఛహృదయముతో యత్నించినాఁడు. ప్రకృతము పనికివచ్చు వాఖ్య లేదు కావున, నెవరి సామర్థ్యము కొలది వారే పద్యార్థ నిర్ణయమొనర్చు కొనవలసి యున్నది.

వేమన పద్యములకు మకుటమగు "విశ్వదాభిరామ" కర్థమేమి? విశ్వమును ఇచ్చువానికి (భగవంతునికి) ప్రీతిపాత్రుఁడని యొకరు, సమస్తము నిచ్చుటచేత అభిరాముఁడని యొకరు, 'విశ్వద' అను పేరుగల యుంపుడుకత్తె కభిరాముఁడు (వేమన) అని యొకరు, విశ్వమును సంహరించువానికి (శివునకు) ప్రియుఁడని మరియొకరు, 'విశ్వదాభిరామ' పాఠమును గ్రహించి ప్రపంచత్వము (అనఁగా సర్వము) తానెయైన వాఁడై యుండుచే నభిరాముఁడని శ్రీ రాళ్లపల్లి వారు నర్థములు చెప్పిరి. శ్రీ వంగూరి సుబ్బారావుగారు "సమస్తమును నిచ్చినవాఁడు గావున నభిరాముఁ" డని వాడుకలో నున్న యర్థము సమంజ సమైనదనినారు. ఇది యెచ్చటను వాడుకలో నున్నట్లు కన్పట్టదు. వేమన పద్యములు చదువు వారెవరును నాల్గవ పాదమందలి 'విశ్వదాభిరామ వినురవేమ' ను రోకఁటిపాటగా జదువుటయే గాని అర్థమును విచారింపరు. "తానే సమస్తమును అను అద్వైతానుసిద్ధి కలిగిన తరువాతనే పద్యములు వేమన వ్రాయవలసి వచ్చునుగాన" తమ యర్థ మనుచితమైనదని శ్రీ రాళ్లపల్లివారు తరువాత నంగీకరించిరి. వేమన గృహస్థుగ నున్నపుడే వ్రాసిన పద్యములు నున్నవి. "ప్రపంచమున నందరిని ఖండించినవాడగుటచే నభిరాముఁడు అని మరియొక చమత్కారమైన యర్థమును గూడ జెప్పవచ్చు"నని శ్రీ రాళ్లపల్లి వారనినారు. ఈ మకుటమునకు సంబంధించి బందరు ప్రతిలోని కథ నిరాధారమైనది. 'విశ్వదాభిరామ' శబ్దమునకు విశ్వకర్మ కులమున బుట్టిన అభిరామయ్య అను నర్థము పొసగదు. నిజమైన చివర వేమనతో బనిలేదు. కథ దీనికి సంబంధించిన నిజమైన, వేమన "విశ్వకర్మ వంశ్య వినుర రామ" అని చెప్పి యుండును. అభిరామయ్యను మోసగించినట్లే వేమన్న తనకు ప్రధానగురువైన శివయోగిని గూడ మోసగించినాఁడు. ఆ ప్రథమ గురువును వేమన కృతజ్ఞతతో స్మరింపకుండునా? అభిరామయ్య కథలోని "దేహశక్తియు లేనట్టి దీనునకును" అన్న పద్యమును బట్టి వేమన రోగి యగుచున్నాఁడు. అభిరామయ్య చేసిన బోధలు తెలియకున్నవి. అభిరామయ్య కథ విశ్వసనీయము కాదు.

"వేమన వాక్యము" లని పద్యపునడకలు గల కొన్ని వచనములున్నవి. ఈ వాక్యము ప్రతిదియు నొక చిన్ని వాక్యముల గుంపు. ప్రతి వాక్యము తుదను విశ్వదాభిరామ మకుటమున్నది. ఇవి ఆరు వాక్యములు. యోగ సాంఖ్య తత్త్వములు వీనియందలి ముఖ్యవిషయములు. ఇట్టి వచనరచనలు బసవేశ్వరుఁ డారంభించినాఁడు. అతని తరువాతి శైవులు, వైష్ణవులు నిట్టివానిని వ్రాసిరి.

వేమన గురువు లంబికాశివయోగి కాని, అంబికాశివయోగి కాఁడు. తెలుఁగులో అకార లకారములకుఁ గల సామ్యమే లంబికాశివయోగియని, అంబికాశివయోగియని కొందరు వ్రాయసగాండ్రు భ్రాంతి నొందుటకు హేతువు. వేమన పద్యముల నిజస్థితిని దెలిసికొనుటకు ప్రాచ్య పుస్తకశాలలోని వ్రాతప్రతులను జూడవలయును.

## వేమన – కాలదేశములు

మన చరిత్రలు విచిత్రసిద్ధాంతములకు నిలయములు. విశ్వాసపాత్రములు కావు. మనకు లభించు వేమన చరిత్రయు నిట్టిజాతిలోనిదే. పురాణచరిత్రలు రెండును కలిసి యున్న వేమన చరిత్రమునుండి సత్యమైన చరిత్ర యెదియో తెలిసికొన యత్నింతము. వేమన సూక్తి రత్నాకర పీఠికనుండి వేమన చరిత్ర యిట్లు తెలియుచున్నది. ఇతఁడు క్రీ.శ. 1328 మొదలు 1422 వఱకు కొండవీటి రాజ్యమును పాలించిన చివరిరెడ్డి రాజుకు తమ్ముఁడు. కొమరగిరి వేమారెడ్డి కుమారుఁడు. తల్లి మల్లమ్మ. అన్న భార్య నరసాంబ. వేమన్న వేశ్యాలోలుఁడై బొక్కసమంతయు నామెకు దోచిపెట్టుచుండ, తల్లివంటి వదినెయగు నరసాంబ అతని కా వేశ్యపై రోత గల్గునట్లొనర్చినది. కొండవీటి నగరి కంసాలియగు నభిరామయ్య తత్త్వోపదేశమునకై రహస్యముగ లంబికాశివయోగి సేవ యొనర్చుచుండెను. ఆ యోగి అభిరామయ్యతో ఒకనాఁడు మఱునాఁడుదయమున ఉపదేశము నొందుమని చెప్పుటను పొంచి విని వేమన, అభిరామయ్యను బలవంతముగ నగరియందే యుండునట్లొనర్చి తాను వెళ్ళి యోగితో "అభిరామయ్య తాను రాలేక నన్ను పంపినాఁ" డని చెప్పెను. యోగి "వాఁడు నిర్భాగ్యుఁ" డని పల్కి వేమన్నకే యుపదేశ మొనర్చి యెటకో పోయినాఁడు. వేమన్న జ్ఞానియై, అభిరామయ్యకు జరిగినది నివేదించి క్షమాపణ వేడి, విరక్తితో దేశములను దిరిగి పద్యరూపమున ప్రజలకుఁ తత్త్వోపదేశ మొనర్చుచు, తుదకు కటారుపల్లెలో సమాధియందు జేరినాఁడు."

వ్రాసినవారిది నిజమైన వేమన చరిత్రయని తలచిరి. కాని శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు రాచవేమారెడ్డి కోమటి వేమారెడ్డి కుమారుఁడగుట వలన, కుమారగిరి

రెడ్డికి పుత్రులు లేకపోవు నంశమును తెలిపి దీనిని ఖండించిరి. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు "కుమారగిరికి కుమారుఁడున్నను అతఁడు రాజ్యమునకు రాలే" దని వ్రాసిరి. అతఁడే బైరాగులలోఁ గలిసిన వేమన్న యనుకొంద మనినచో 'వేమన వాక్య' ములలో బంచమప్రతిలోని వచనమున నతని తండ్రి 'రెడ్డన్న' యని యున్నది. కుమారగిరికి రెడ్డన్న సామాన్యనామ మనుట పొసఁగదు. 'వేదాంత సిద్ధాంత' మున పీఠికలో కొమరగిరి యిరువురు పుత్రులలోని రాచవేమారెడ్డియే మన వేమన్న యైనట్లున్నది. కాని రాచవేమారెడ్డి నాలుగేండ్లు రాజ్యమొనర్చి, భృత్యునిచే చంపఁబడినట్లు కొండవీటి దండకవిలెలో నున్నది. కనుక కొండవీటి రెడ్డి రాజులకు, వేమన్నకు నెట్టి సంబంధము లేదు.

అంతరంగసాక్ష్యము ఈ అభిప్రాయమున కనుకూలముగ నున్నది. స్వానుభవ కవితాధర్మము తాండవ మాడుచున్న వేమన్న కవితలో ఆగర్భశ్రీమంతుని సంపత్సమృద్ధి వాసన కన్పింపదు. "కుక్క యిల్లు సొచ్చి కుండలు వెదకుట, పండిన చేలో పల్లేరు గాయలు త్రొక్కుట, గడ్డి వేసినను పోట్లగొడ్డు కొమ్మాడించుట, కడుపు నిండ తవుడు గంపలోఁ బెట్టుకున్న బర్రె చన్ను ముట్టనీయకపోవుట" మొదలగు కవి యనుభవము లాతని యువరాజని తెలుపజాలవు. ''రాచమూక'' నమ్మరాదనుట యితడు రాజవంశీయుఁడు కాడనుటకు సాక్ష్యముగ నున్నది. వేమన రెడ్డిరాజుల వంశమువాఁడు కానపుడు, క్రీ.శ. 14, 15 శతాబ్దాలలో జీవించినవాఁడును కాజాలఁడు.

"ఊరు కొండవీడు, ఉనికి పశ్చిమ వీథి, మూగచింతపల్లె మొదటి వీథి, ఎడ్డె రెడ్డికుల మదేమని తెల్పుదు" – అను పద్యమున కొండవీటి పశ్చిమ వీథికి, మూగచింతపల్లెకు సంబంధము తెలియుట లేదు. కొండవీటనేగాక కడపజిల్లాలోను మూగ చింతపల్లె యున్నట్లును, అట వేమన పుచ్చకాయలు పండించినట్లును కొందరు తెల్పుదురు. కొండవీట బుట్టి పై మూగచింతపల్లెలలో నొక దానియందు వసించి నాఁడనుకొందమనుకున్న, వేమన్న కర్నూలు జిల్లాలోని క్రిష్టిపాడు వాడని, గుంటూరులోని "ఇనుకొండ" వాఁడని, కడపలోని చిట్టివేలు వాఁడని బ్రౌను దొర విన్న ఉపపురాణము లున్నవి.

వేమన కటారుపల్లెలో సమాధియగుట నిశ్చయము కాదు. వేమన పద్యముల నచ్చు వేసినవారు, శార్వరి సంవత్సర చైత్ర శుక్ల నవమినాఁడు కదిరి తాలూకా కటార్లపల్లెలో జీవితమును చాలించినట్లు వ్రాసినారు. క్యాంబెల్ దొర దీనిని నమ్మినాఁడు.

బ్రౌనుకు కటారుపల్లె సమాచారము తెలియదు. శ్రీ రాళ్లపల్లివారు కదిరి దగ్గరనున్న "నల్ల చెఱువు" గ్రామమున పట్టెనామము గల వేమన చెక్క విగ్రహమున్న గుడిని చూచి, శివయోగియైన వేమన్నకు పట్టెనామము లేమని యాశ్చర్యపోయినారు. ఆ గుడికి పూజారియైన చెన్నయ్య శ్రీ రాళ్లపల్లివారికి "వేమన చరిత్ర" చెప్పినాఁడు.

వేమన్న కొండవీటిలోని పైడిపాల కొడిది రెడ్లవంశమువాఁడు. కనుగోళ్ళ గోత్రము. మొదటి పేరు పుల్లారెడ్డి. రాజైన సోదరునితో కలహించి తల్లితో నల్లచెఱువుకు వచ్చి సేద్యము చేసికొనుచుండఁగా తలపై పిడుగు పడుట, నిర్జీవుఁడగుట, తల్లికి స్వప్నమున కన్పించి ఏడునాళ్ళకు పిమ్మట బ్రతుకుదునని చెప్పి యట్లే యొనర్చుట, తన పేరు పుల్లారెడ్డి కాదు, వేమనయని చెప్పి, యనేక మహత్త్వములతో దేశము తిరుగుట, కడప జిల్లాలోని రాజంపేటలో తల్లి అచ్చమ్మకు, కుచ్చెర్లపాడులో భార్య ఆదిలక్ష్మమ్మకు సమాధులు కట్టించుట, చివరకు కటార్లపల్లెకు తిరిగివచ్చి సజీవసమాధి నొందుట – చెన్నయ్య చెప్పిన వేమన చరిత్రలోని ముఖ్యవిషయములు. వేమన్న పుల్లారెడ్డిగను, తల్లి మల్లమ్మ అచ్చమ్మగను మారుట, ప్రసిద్ధమైన వేశ్యలమాట లేకపోవుట నిందున్నవి. శ్రీ రాళ్లపల్లివారు కటారుపల్లె వెళ్ళి విచారింపగా, ధర్మకర్త చెన్నరాయుఁడు ఆ వేమన్న వేరని తమ తాటాకు గ్రంథమున నున్నట్లు చెప్పినాఁడు. వైకుంఠమునందలి చెన్నకేశవులు, ఆదిలక్ష్మి, వేమన్నను పిలిచి భూలోకమున జన్మింపుమనఁగా నతఁడు తుంగకేశవునకు, లక్ష్మమ్మకు (అచ్చమ్మ) కేశవనారాయణుల జ్యేష్ఠసోదరుఁడుగా కటారుపల్లెలో జన్మించుట, తరువాత కదిరి దగ్గఱ రేపల్లెకు పోవుట ఇందలి విశేషములు, చెన్నరాయుఁడు నేఁడును వేమన భక్తులు నెల్లూరు మొదలుగ నుండుటవలన, కొండవీటి సంబంధము కల్పుకొని వర్షాశనములు సంపాదించు చున్నామని శ్రీ రాళ్లపల్లివారికి చెప్పినాఁడు. దీనిని బట్టి వేమన్నకు కొండవీటితో సంబంధమున్నట్లు కటార్లపల్లెవారు నమ్మినారు. తుంగ వేమన మన వేమన్న కాఁడు. తుంగ వేమన "బాలచక్ర వేమ భవ్యనామ" మకుటముతో మన వేమనవలె కొన్ని ఆటవెలఁదులు చెప్పినాఁడు. అవియును మకుటము మార్పుతో వేమన పద్యములలోఁ జేరినవి.

తుంగ వేమన క్రీ.శ. 1780 శార్వరి చైత్రశుక్ల నవమినాఁడు జన్మించినట్లు, క్రీ.శ. 1869 వరకు జీవించిన ఇతఁడు, భార్య పుష్యమాసమున మరణించినట్లు కటారుపల్లె గ్రంథములో నున్నవి. ఈ వేమన కాలములు, మన వేమన కాలములు తారుమారైనవి. మన వేమన పుట్టుక, జీవితాంతము లెపుడో చెప్పఁజాలము.

మన వేమన్న కటారుపల్లెలో నుండి తన తత్త్వమును ప్రజలకు బహుకాలము బోధించినాఁడు. లేకున్న తుంగ పుల్లారెడ్డి తాను వేమనన్నని చెప్పి, వేమన్న యోగ సిద్ధాంతమును ప్రబోధించి, యవతారమూర్తిగ గౌరవింపఁబడుటకు వీలు లేదు. కాని బహుకాలమున్నాఁ డనినంత మాత్రమున మన వేమన కటారుపల్లెలో సమాధిస్థితి నొందినాఁడనుటకు నిదర్శనములు లేవు.

వేమన చరిత్రను తొలుత పరిశోధించిన శ్రీ వంగూరి సుబ్బారావుగారు వేమన వంశమును సందేహించిరి. కొండవీడు, దత్తమండలము, గోదావరీదేశములందు సంచరించినట్లు చెప్పిరి. కృష్ణరాయల సమకాలికుఁడైన ఎడపాటి ఎఱ్ఱన (క్రీ.శ. 16వ శతాబ్ది, తన మల్హణ చరిత్రలోను, తురగా రామకవి (16వ శతాబ్ది చివరభాగము) నాగరఖండమందును, పింగళి యల్లన (17వ శతాబ్ది) తోభ్యచరిత్రయందును వేమనను బేర్కొనుట చేత, వేమన క్రీ.శ. 15వ శతాబ్దిలో నున్నాఁడనియును, "పరగ రాయని కులబాచని ధన మెల్ల" మొదలైన పద్యము క్రీ.శ. 14వ శతాబ్ది దుదియందున రాయని భాస్కరుని గురించి వేమన చెప్పినదనియును, శ్రీ వంగూరివారు తలఁచిరి. వీరు పండితరాయని "అవసరపఠితావణీ" ఇత్యాది వేమన చెప్పిన "ప్రస్తుతంబు వేళ" పద్యంబు చదివిన సంస్కృతానువాదమనియును, ఒక పద్యమున వేమన్నకు గురువుగాఁ గన్పట్టు సోమశేఖరుఁడు పోతన మహాకవి గురువైన ఇవటూరి సోమశేఖరుఁడే యనిరి. శ్రీ వంగూరి వారి వేమన కాలనిర్ణయమును శ్రీ బండారువారు, శ్రీ వేటూరివారు ఖండించిరి. ఎవరు నంగీకరింపలేదు.

క్రీ.శ. 1623లో మరణించినట్లు చాటువు వలన స్పష్టముగఁ దెలియుచున్న ప్రసిద్ధుఁడగు గుంటుపల్లి ముత్తనను గూర్చి వేమన, "ప్రకటముగ నిట్టి లోకములో గంటి పల్లె ముత్తఁడెన్న బరమగురుఁడు" అని చెప్పుటచే, నతఁడు 17వ శతాబ్ది మధ్యవాఁడగును. మరి ఇంతకు పూర్వము వారైన పైడిపాటి ఎఱ్ఱన మొదలైనవారు వేమనను పొగడుట యెట్లు పొసఁగును? ఈ పొగడఁబడిన వేమన, పండితారాధ్య చరిత్రలోఁ గన్పట్టు చేటల వేమయ్య, లేదా బెలిదేవర వేమనారాధ్యుఁడుగాని కావచ్చును అని శ్రీ బండారువారు సమర్థించిరి. "పసరపు మాంసముఁ బెట్టియు మసకల సులతాను ముసలిమానులఁ జేసెన్" – ఇత్యాది పద్యములందు వేమన మహ్మదీయుల పాలనలో హిందువులు పడిన కష్టములను వర్ణించినాఁడు. ఇట్టి స్థితి విజయగనర రాజ్య పతనానంతరమే కలిగినది. కావున బ్రౌను దొరయును తలచినట్లు వేమన క్రీ.శ. 17వ శతాబ్ది కడపటి భాగమువాఁడు. మహమ్మదీయులకు వేమన స్వేచ్ఛగా మతబోధ

చేసిన పద్యములుండుట ఈ కాలనిర్ణయమున కనుకూలముగ నున్నది. "రంగధామమునకు హంగుగా తానేగి, కల్లుకంపు సొంపు గల్గియుండు" ఇత్యాదులందు వేమన వైష్ణవమును తీవ్రముగ ఖండించినాఁడు. తాతాచార్యముద్రలు స్థిరపడి, సామాన్యప్రజలను వైష్ణవులు రాజాశ్రయముతో వైష్ణవులుగ మార్చుట జరిగిపోయి, వైష్ణవులలో పరమార్థదృష్టి తగ్గి, పరార్థదృష్టియున్న కాలమున వేమన్న దుష్టవైష్ణవమును ఖండించినాఁడు. ఇదియును నతఁడు క్రీ.శ. 17వ శతాబ్ది వాఁడనుటకుఁ దగినట్లుగ నున్నది. శ్రీ వేటూరివారు ముత్తమంత్రి మరణించిన కొలఁది కాలముననే, క్రీ.శ. 17వ శతాబ్ది ప్రారంభదశలోనే వేమన మరణించెనని తలఁచిరి. "గజపతింట గ్రుడ్డిగవ్వలు చెల్లవా?" మొదలగు వేమన నిందించిన గజపతుల యాధిక్యము 17వ శతాబ్ది పూర్వభాగముననే గావున, వేమన కాలమును 17వ శతాబ్ది తుదకు ఈడ్చుట సాధ్యము కాదని వేటూరివారి మతము. 'షేకు సైదు' పద్యమును వేమన తురకల దొరతనము నశించిన పిమ్మటనే చెప్పవలయునుగాన, అతఁడు 17వ శతాబ్ది తుదివాఁడని శ్రీ బండారువారి యభిప్రాయము. బ్రౌను దొర చివరకు వేమన కాలము 17వ శతాబ్దిలో ఆదికాలమని భావించినాఁడు.

శ్రీ రాళ్లపల్లివారు వేమన క్రీ.శ. 18వ శతాబ్దియాది యందుండెనని తలఁచిరి. క్రీ.శ. 1770లో కటారుపల్లెలో జనించిన పుల్లారెడ్డి, తరువాత తాను వేమన యవతారమునని చెప్పుకొనుటకు, వేమనకును, నీతనికిని నడుమ ఎక్కువగా కాలమున్న సామాన్యజనము నమ్మరు గావున, ఇట్లూహించుటయే సమంజసమని వీరి యభిప్రాయము.

వేమన దత్తమండలమువాఁడని వావిళ్ళ ముద్రణము పీఠికలో నున్నది. కదిరి తాలూకావాఁడు. గండికోట, నందిదుర్గములఁ బేర్కొనినాఁడు. కడప జిల్లా జమ్మలమడుగు తాలూకా ముడియములో వేమన శిష్యుల పీఠమున్నది. పామూరను గ్రామమునకు దగ్గరనున్న కొండగుహలో వేమన చివరకుఁ బ్రవేశించినాఁడు. దక్షిణ దేశమంతయుఁ దిరిగినాఁడు. అరవ దేశమందును మఠములు స్థాపించినాఁడు. కాని దత్తమండలములో నున్నంత ప్రచారము ఇతనికి ఇతరప్రాంతములందు లేదు. మంకు, సంబళము, సొడ్డు, చాడి, దుడ్డులవంటి కన్నడ దేశముతో సంబంధము గల తెలుఁగు దేశములోని పదములు, రుద్దు, పీకు, కుళ్లుపోతు మొదలైన నల్లమల కీవలి దేశమందలి పదములు వేమన వాడియుండుటచే, నితఁడు దేశమంతయు తిరిగినాఁడని తెలియుచున్నది. వీరశైవ బసివిరాండ్రను, వైష్ణవమతానుసారులగు నిట్టివారిని, నామధారుల పలుమారు పేర్కొనుట, వీరు దత్తమండలముననే యొక

ప్రాంతమందుండుట వలన, వేమన దత్తమండలములలో నివసించినాఁడనుట సమంజసము. బసవేశ్వరునివలె వేమనయు నొక కాలజ్ఞానమును జెప్పియుండుటయు నిందుకు ఉపోద్బలకముగ నున్నది.

## వేమన - సంసార స్థితిగతులు

అతిశయోక్తులు, అభూతకల్పనలతోఁ గూడిన కవుల రచనలను బట్టి వారి చరిత్ర వ్రాయుట సాధ్యమా, అది సత్యమైన దగునా యను సందేహములు కలుగవచ్చును. కాని స్వానుభవము జీవగుణముగ నున్న కవిత్వమును జెప్పిన వేమన విషయమున నిట్టి యవకాశమున్నది. వేమన ఉదరపోషణకై నితరులను బొగడుచు, ఇతరుల ఖండనకు భయమొందుచు కవిత్వము చెప్పినవాఁడు కాఁడు. తోటకూరకు, దొగ్గలికి, తమిదకుడుముకు, తవుడుకు కావ్యములను జెప్పువారిని తిరస్కరించినవాఁడు. వేమన్న కాపు, రెడ్డి. రెడ్డియని యొకటి రెండు తావులలోఁ దప్ప మిగిలినచోట్ల కాపనియే ఇతఁడు అభిమానముతో చెప్పుకొనినాఁడు. పల్లెటూరి "ప్రభురెడ్ల" గుంపునకు జేరి అన్నవస్త్రములకు లోటులేక, గొడ్డు గోద గల కుటుంబమునకుఁ జెందినవాఁడు వేమన యని యూహించవచ్చును. లేకున్న "నేయి లేని తిండి నీయాన కసువది" మొదలుగా చెప్పలేఁడు.

పెట్టిపోయుట, చద్దిమిగుల్చుట, అప్పు లేకుండుట మొదలైన సంసారధర్మము లెఱిఁగినవాఁడు వేమన. చిన్ననాఁటి నుండి తమ యింటికి ఆశ్రితులుగా వచ్చిపోవు కవుల సహవాసము వలన సంస్కారము నొందినవాఁడు. పురాణములను తండ్రికి వినిపించి యుండును. అర్థమెఱిఁగి పురాణాదులను జదివినవాఁడు. కావ్యశాస్త్రముల జోలికి పోలేదు. తమ యాస్థానమునకు వచ్చిపోవు వారివలె కవిత్వము చెప్పఁ దలచిఁనాఁడు. ఆటవెలఁదిలో రచన మారంభించినాఁడు. నిష్కల్మషమైన పురాణశయ్య యలవడినది. "సంగీతమె చెవులకింపు, వాద్యంబులలోన వీణె" అని పలుకగలిగినంతగా సంగీతవిద్యయం దభిరుచి యేర్పడినది. "దున్నపోతునకును దోడిరాగం బేల?" అనుటను బట్టి చౌడప్పకు కాంభోజివలె వేమనకు తోడిరాగ మనిన ప్రీతియని తోచుచున్నది. అతృప్తి, జుగుప్స, దైన్యము, పట్టుదల, స్వాతంత్ర్యరక్తి మొదలైన భావములను దెల్పుటకు యోగ్యమైన యీ రాగము వేమన మనోధర్మమును చక్కగ వెల్లడింపఁగలదు.

వేమన చిన్నతనమందే కేశవద్వేషము ఎక్కువగ లేని శివభక్తి గలవాఁడు. లింగధారిగ గూడ నుండవచ్చును. ఉత్సవములు, పోతురాజుల పూజలలో తండ్రితోఁ

బాటు పాల్గొని వానియందలి ఆవేశములు, జంతుబలులయందు సత్యమున్నదా యన్న సంశయముల నొందినను, చిన్ననాఁడు ఎదుర్కొను ధైర్యము చాలక, పెద్దలయెడ భక్తిశ్రద్ధల వలన వానిని యణఁచుకొనినాఁడు. అయినను తప్పులు పట్టుట, మొగము ముందర దయారహితముగ చెప్పుట, చెప్పుటకుఁ దగిన వాగ్మిత్వము నతని సహజగుణములు. కట్టెలోన నగ్నిపుట్టిన విధమున పుట్టి మెట్టవలెనే గాని, పుట్టలోని చెదలవలె నిరర్థకముగా జీవింపరాదని యతని భావము. "పట్టి విడువరాదు పది లక్షలకు నైన" మొదలగు వ్రాతల వలన చిన్ననాఁటినుండి దృఢసంకల్పము గలవాఁడని తెలియుచున్నది.

యౌవనము వచ్చిన పిమ్మట కలిమి, దొరతనము, ఇత్యాది గుణములు గల యితనికి స్వేచ్ఛతో వర్తించు నవకాశము గలిగినది. పదునెనిమిదివ శతాబ్దమునాఁటి హిందూసమాజమున సర్వమైన సమష్టిజిజ్ఞాస నిలచిపోవుటచే, ఎవరికి వారుగ వర్తించుటకు తగిన కాలమైనది. సంఘమున విషయవాంఛలు, బాహ్యాడంబరము పెరిగినవి. అర్థరహితమైన యాచారములు ప్రబలినవి. బహుపత్నీత్వము, వేశ్యల యతిశయము, బసివిరాండ్రు పెరిగినవి. పరసతీగమనము, వేశ్యాసహవాసము సాధారణమైనవి. పెద్దలు వేశ్యాలోలురు, ఐశ్వర్యమత్తులు నగుట వేమన గమనించినాఁడు. తానును మొదట వేశ్యల తంత్రములకు లొంగినాఁడు. కాని "ఆడుదాని చూడ నర్థంబుఁ జూడంగ బ్రహ్మకైన నెత్తు రిమ్మ తెగులు" అని పూర్వము పురాణములలోఁ జదివిన జ్ఞానమువలన, సృష్టిసిద్ధములైన కామినీకనకములపై ప్రీతియును, దోషములను గమనించినాఁడు. అయినను ప్రవాహములోఁ బడి నడిచినాఁడు.

వేమనవంటి వేదాంతి గణికాలోలుఁ డైనాఁడనిన తప్పు కాదు. కాళిదాస శ్రీనాథులు వేశ్యాలోలురు కదా! అతఁడు కొంతకాలము విషయాధీనుఁడైనాఁడని భావించుటయే సమంజసము. కళాప్రియులకు విషయలోలత్వము నైజము కదా! "లంజ లంజకాని లావెల్లఁ గొనియాడు, లంజతల్లి వానిలజ్జ గడుగు", "తల్లి గలుగు లంజఁదగులుట చీకాకు" – మొదలైన వ్రాతలవలన వేమనకు వేశ్యల స్వరూపము బాగుగాఁ దెలియు ననవచ్చును. "సానిదాని పొందు సౌభాగ్య భాగ్యము" అనిన వేమన మహత్త్వమునకు, ఒకనాఁటి వేశ్యాపరిచయము వలన నెట్టి దోషము కలుగదు. ఒక్క వేశ్యతో నితఁడు జీవించినాఁడని కథ యున్నను, బహువేశ్యల ననుభవింపవలె నను పద్యములు కన్పట్టుచున్నవి. వేశ్యాప్రియత్వము వలన కష్టము లనుభవించిన యీతఁడు పడుపువృత్తిలో హార్దమైన స్నేహము లేకపోవుటను గమనించి, మనసును

ధర్మపత్నిపై మార్చినాఁడు. "ఇంటియాలి విడిచి యెట్లుండ వచ్చురా?" యని చెప్పినాఁడు. "ఇంటియాలి విడిచి యిల జార కాంతల వెంటఁదిరుగువాఁడు వెఱ్ఱివాఁడు, పంట చేను విడిచి పరిగ లేరినయట్లు" అని ప్రబోధించినాఁడు. తుదకు భార్యను జేరిన యితఁడు ఆమెనుగూడ సందేహించి "వరుఁడు చక్కనైన వజ్రాల గనియైన తళుకు మెఱపువంటి తత్త్వమున్న అన్యపురుషవాంఛ ఆడుదాని కుండు" నని నిశ్చయించినాఁడు.

భార్యకు స్వాతంత్ర్యమీయక తొలినుండి స్వాధీన మందుంచుకొనవలెనని నిర్ణయించి, "మాటవినని యాలు మరగాలని, ఆమెను విడచి అడవిలో నుండుట మేలని, కాంతను కావలేనపుడు చావవలెనని" బోధించినాఁడు. వేమనకు ఇల్లు నరకప్రాయమైనదేమో, ఎదురు తిరిగిన భార్యను గూర్చి "ఇట్టి భార్యతోడ నెట్లు వేగింతురా?" అని దేవునితో మొఱవెట్టినాఁడు. మానశాలియగు నితఁడు భార్యను జంపి మరొకదానిని పెండ్లాడఁ దలపెట్టు రాక్షసత్వము లేనివాఁడు. స్వయం కృతాపరాధమును గమనించి, తన యదృష్టమునకు దీనుఁడైనాఁడు. అనుకూలవతి గాని భార్యవలన వేమనకుఁ గలిగిన సంతానము స్వేచ్ఛగాఁ బెరిగి, స్వేచ్ఛగా వర్తించి సంతాపమును గూర్చిరనుటకు, "ఎండిన మ్రానొక టడవిని" ఇత్యాది నిదర్శనము.

వేశ్యాప్రియత్వము వలన ఆస్తిపోయి వేమనకు పేదఱిక మబ్బినది. పూర్వము తన్నాశ్రయించినవారు నడపీనుఁగని ఎగతాళి చేసిరి. ఇంటిలో భార్యయును మెచ్చక చీకాకు పెట్టినది. వేమన్న విసిగినాఁడు. ధనము లేమి వలన పుత్రులు తప్పు లెన్నుదు రనియు, భార్య స్పృశింపదనియు, అది తనను, ప్రక్కవారిని కాల్చు దావానలమనియు ననినాఁడు. పనికిరాని తన పుత్రులను జూచి చింతించి, యోగ్యులైన కుమాళ్ళను గన్నవారిని గూర్చి "ధనము లేని పేదతండ్రి గర్భంబున భాగ్యపురుషుఁ డొకఁడు పరగఁబుట్టి" ఇత్యాదిగ చెప్పినాఁడు. నిరంకుశ ప్రభువులు, పాళయగాండ్రు మొదలగువారు ధనమునకై ఊళ్ళు కొల్లగొట్టించుట మొదలగువానిని జూచిన వేమనకు, ధనము స్వార్థమునకుఁ గాదనియు, గతి లేనివారిని రక్షించుటకనియును దోఁచినది. దేశాటనమున మలమల మాడువారి నెందఱినో చూచిన యితఁడు, చేతనైనంతవఱ కట్టివారిని రక్షించుట ధర్మముగ భావించి, అన్నదానమహత్త్వమును ప్రబోధించినాఁడు. ధనికులు కుక్షింభరులై, లోభులై దుర్వ్యయము లొనర్చుటను జూచి "పరదేశికి పట్టెడన్నము పెట్టలేని లంజెదాని కొడుకు లంజెల కిచ్చు" నని అసహ్యించుకొనినాఁడు.

"ధనము వెంట రాదు, ధర్మము చేయు"దని ప్రబోధించినాఁడు. ఇతరులు విననప్పుడు "విత్తమొకరికిచ్చి చెఱిచినాఁడు, బ్రహ్మ చేఁతలన్ని పాడైన చేఁతలు" అని బ్రహ్మను నిందించినాఁడు. "తనది గాదనుకొని పెట్టినది పెట్టని" నాఁడు క్షామమందైన నెంగిలికూడు పెట్టినవాఁడు కుక్కగ పుట్టునని తలఁచినాఁడు. తన భార్య తన యాఁకలినేగాని పరుల యాఁకలి నెఱుఁగక పోవుటకు చింతించినాఁడు. వేమన అతిథిపూజకు కావలసిన ధనమునకై యొకదొరను గొల్చిన, నతఁడు మరింత నీయనపుడు "ఎఱుక లేని దొరల నెన్నాళ్ళు కొలిచిన బ్రతుకు లేదు వట్టి భ్రాంతిగాని, గొడ్డుటావు పాలు గోఁకితే చేపునా?" అని తనను మందలించుకొనినాఁడు. కష్టపడువారిని జూచి జాలినొంది తనయొద్ద నేమున్నదాని నిచ్చినాఁడు. అది పరుల ధనమనియైన చూడలేదు. సత్కార్యమునకు పరుల ధనమైన వెచ్చించుట పాపము గాదని యితని భావము. గోలకొండ గోపన్న, తిరుమంగై యాళ్వారులవలె మంచిపనికి చౌర్యసాహసము లొనర్చియైనను ధనమార్జించుటలో తప్పు లేదని, "ద్రోహబుద్ధినైన దొంగఱికముననైన" ఇత్యాదిగఁ జెప్పి ప్రబోధించినాఁడు.

త్రికరణశుద్ధి గల వేమనకు బహుకాలము గృహకృత్యములు నచ్చలేదు. ప్రపంచమే తనదిగ నొనర్చుకొనినాఁడు. "మాట సత్యమైన మఱి శతాయుష్య" మని భావించి, యితఁడు దుష్టమార్గములలో ధనసంపాదన యొనర్చుట కిష్టపడక, రసవాదవిద్యపై మనసు నిల్పినాఁడు. బైరాగులనో, కంసాలులనో ఆశ్రయించి బంగారము నొనర్చుట నేర్చుకొని, యందు సిద్ధినొందినాఁడు. రసవాదమును గూర్చి "బింబలములుండ బిగువైన పరసముండ" అను పద్యముల నితఁడు చెప్పినాఁడు. రసవాదములలో పరిశ్రమ యొనర్చిన వారికి "వాదభ్రష్టో వైద్య శ్రేష్ఠః" అను సూక్తి ననుసరించి వైద్యము వచ్చియుండవలయును గావున, వేమనకు వైద్యము తెలియుననుట సమంజసము. కావుననే కుక్క కాటుకు మందు చెప్పినాఁడు. "భూమి క్రొత్తలైన భుక్తులు క్రొత్తలా?" ఇత్యాదులవలన వేమనకు వైద్యము తెలియునని యూహింపవచ్చును. రసవాదవిద్య వలన లాభింపలేదు. ఆశ్రయించిన కంసాలిగురువు మోసము చేసినాఁడు. కావుననే "కంసాలులు దొంగ" లని, "కంసలికిని మించు కడజాతి లేదయా!" అని తిట్టినాఁడు. చివరకు బైరాగుల నాశ్రయించినాఁడు. వేమన గురువైన లంబికాశివయోగి యిట్టివాఁడు. ఇతనివలన వేమనకు రసవాదము, వైద్యములేగాక, జీవితమునం దెంతయో మార్పును గల్గించిన తత్త్వజ్ఞానమును చేకూరినది.

## వేమన కాలమందలి మతధర్మముల పరిస్థితి

భార్యాభర్తల కలహము, పుత్రుని నిష్ప్రయోజకత్వము, దారిద్ర్యము మొదలగు సంసారమందలి పరిణామముల కంటె ఉక్కుమనసు గల వేమన్నను అరాజకము, అజ్ఞానము, స్వార్థపరత్వము, వంచన మొదలైన యన్యాయములతోఁ గూడిన సంఘస్థితి విశేషముగా కళవళ పెట్టినది. వేమన నాఁడు నాల్గు పురుషార్థములలో కామసాధనమైన అర్థము ముఖ్యమైనది. ప్రాచీనులకు మోక్షదృష్టి విశేషము. అట్టి మోక్షదృష్టి గల ధార్మికవర్గములో వేమన జన్మించినాఁడు. వేమన కెంతో పూర్వకాలమునందే మోక్షధర్మములు స్థిరపడినవి. ఏ జాతిలోఁ బుట్టినవారికి వారి పెద్దలు నిర్ణయించిన ధర్మమే ధర్మము. వారి దృష్టిలో నితరము లసత్యములు, నీచములు. ధర్మములు అసత్యములని భావించుటయే పాపము.

వేమననాటిఁకి ద్వైతము, అద్వైతము అనునవి రెండును వ్యాప్తిలోనున్న ప్రధానమత సిద్ధాంతములు. బహుదేవతావాదులైన జైనులు ఆంధ్రదేశము నే నాఁడో విడిచి వెళ్ళిరి. బౌద్ధులు భరతఖండమునుండియే వలసపోయిరి. కన్పింపనిదెల్ల మిథ్య యని నమ్మిన బుద్ధికుశలులగు చార్వాకులు సర్వమతములవారికి శత్రువులై నశించినారు. సృష్టిస్థితి లయములకు హేతువైన చేతనమూర్తి యొకఁడు తనను భక్తితో గొల్చినవారిని నిర్ద్వంద్వులనొనర్చి తనకడ స్థిరముగా నుంచుకొనుననియు, నట్టి స్థితియే మోక్షమనియు పలుకు సగుణబ్రహ్మవాదులైన ద్వైతులందురు. చరాచర ప్రపంచ మంతయును మిథ్య యనియును, బ్రహ్మ సత్యమనియు, సర్వవస్తువులు మాయావృత బ్రహ్మమేయనియు, 'నేను బ్రహ్మ'నను జ్ఞానము నార్జించుటయే మోక్షమని అద్వైతు లందురు. నిర్గుణబ్రహ్మవాదులైన యీ యద్వైతులు మూర్తిని పూజించుట మొదలైనవి గలవారగుటచే, సిద్ధాంతమునం దద్వైతులనైనను వ్యవహారమున ద్వైతులు. సగుణోపాసకులకును, వీరికిని భేదము లేదు. ఈశ్వరుని గుణములను బట్టి ఉపాస్యదేవత లనేకు లేర్పడినారు. మతభేదము లేర్పడినవి. వానితో నాచారములు, మోసములు వచ్చిపడినవి. దంభము స్వభావమైనది. బ్రాహ్మణులు భూలోకదేవతల మనుకొనుట, జంగములు తాము సాక్షాత్తు జంగమ పరమశివుల మనుకొనుట, కావిబట్టలు గట్టిన సన్యాసులెల్లరు తమ్ము పూజింపవలయు ననుకొనుట జరిగినవి. ఇట్లు తత్త్వములు మతములుగా మారి అహంకారములను, అభిమానములను పెంపొందించినవి. రాజసభలలో మతవాగ్వివాదములు సహజమైనవి. బ్రాహ్మణ పండితుఁడు దేవళమునకుఁ బోయి తనకు మర్యాద జరుగనపుడు పూజారిని విడిచి, దేవునే బెదిరించు స్థితికి వచ్చినాఁడు. అయినను వేమన కాలమున నిజమైన విరాగులు,

తత్త్వదృష్టి గలవారు ఉన్నారనుటకు "భూమిలోన పుణ్య పురుషులు లేకున్న జగము లేల నిల్చు పొగులుఁగాక" అన్న వేమన వాక్యమే నిదర్శనము. ఇది వేమననాఁటి సంఘస్థితి.

వేమన శైవముపై ప్రీతిగల కుటుంబము లోనివాఁడు. బ్రాహ్మణులలోఁ గాక యితరజాతులలో వ్యాప్తిఁజెందిన వీర శైవమునకు సంబంధించినవాఁడు. వీరశైవము జాతిభేదమును తిరస్కరించుచు పుట్టినను, మఱియొక నూతనజాతిని సృష్టించి నిలిచిపోయినది. ఇది గాని, చుట్టును ప్రబలియున్న వైష్ణవముగాని, విచారణ చేసిగాని నమ్మని వేమనకు తృప్తినీయలేకపోయినవి. వేమన పురాణపురుషులైన రామాదులను భగవదతారములని నమ్మఁడు.

"కనకమృగము భువిని కద్దు లేదనకుండ
తరుణి విడిచిపోయె దాశరథియు
తెలివిలేనివాఁడు దేవుఁ డెట్లాయెరా?"

అని ప్రశ్నించినాఁడు. "ధ్యానములను శివుని ధ్యానమే శ్రేష్ఠంబు" అని సంప్రదాయానుసారముగఁ జెప్పినను, శివునిఁ గూడ నితఁడు సర్వశక్తునిగ తలపఁలేదు.

"కంటిమంటచేత కాముని దహియించి,
కామముననను తుదకు గౌరిఁ గూడె
ఎట్టి వారినైనఁ బట్టు ప్రారబ్ధంబు"

అని శివుని చులకన చేసినాఁడు. "కొడుకును బ్రతికించు కొనలేదు శంభుఁడు" ఇత్యాది యందు శివునికంటె కొడుకును బ్రతికించుకొన్న విష్ణువే ఘనుఁడని పలికినాఁడు.

బసవభక్తులు పాపులని, లింగధారికన్న దొంగలు లేరని, వైష్ణవులు ప్రజలను భ్రష్టులొనర్తురని పల్కి, శైవవైష్ణవ భక్తుల దాంభికవృత్తి నసహ్యించుకొనినాఁడు. ఇట్టివారి యాజమాన్యమున నడుచు పూజలు, యజ్ఞములు, యాత్రలు మొదలైనవానిని వేమన "రాతిబొమ్మ కేల రంగైన వలువలు" ఇత్యాదులందు తిరస్కరించినాఁడు.

"లంజకొఱకు మేకనంజుఁడు తినసాగ
యజ్ఞమెల్ల కామయజ్ఞమాయె,
మొదట సోమయాజి తుది కామయాజిరా!"

అని యజ్ఞకర్తల నిందించినాఁడు. పూజాదులకు మూలకర్తలైన బ్రాహ్మణులకు బ్రహ్మము నలుపో తెలుపో తెలియదనినాఁడు. సంఘదుఃస్థితికి వారిని బాధ్యులను గావించి బ్రాహ్మణులు ప్రబలులై యుండగా నితర జాతులకు గతులు లేవనినాఁడు. ఇవి తత్త్వదృష్టి, ధర్మబుద్ధి, న్యాయాభిమానములతో పల్కిన మాటలు గాని, నేఁటి బ్రాహ్మణేతరులకు వలె నసూయతోఁ బలికినవి కావు. కావుననే వేమన –

"జ్ఞాన మొసఁగి జనులఁ గడతేర్పఁ గలుగుచో
బ్రాహ్మణులకు సకల భాగ్యమీవచ్చు"

ననినాఁడు. అట్టి గుణములేని బ్రాహ్మణులకుఁ బెట్టినను, కుక్కకుఁ బెట్టినను ఒక్కటియే యనినాఁడు. ద్విజులే శూద్రుఁడైన తన్ను కోటానుకోట్లుగ కొల్చిరని చెప్పుకొనినాఁడు. నిజము కావచ్చును. నేడును నిష్కల్మషముగా అబ్రాహ్మణుఁడైన గాంధీ మహాత్ముని గొల్చువారిలో బ్రాహ్మణులే ఎక్కువ గదా!

మానవునకు మృత్యుచింత ఘనమైనది. ఎవరికిని చావు తప్పనిదని గమనించిననాఁడు, "చావు దెలియలేని చదువేటి చదువురా!" యని సంసారపుముడిని విడదీయుటకు యత్నించినాఁడు. ఈ చిక్కును గూర్చి పలుకుమని పలుమారులు భగవంతునితో మొఱ వెట్టినాఁడు. ప్రయోజనము లేక విసిగినపుడే, వేమనకు రసవాదవిద్యాభ్యాసము నందలి అభిరుచితో యోగుల పరిచయము గలిగినది.

సామాన్యులైన అద్వైతులు ద్వైతులుగానే నిలిచిపోవ, అద్వైతతత్త్వ మెఱుగుటకుఁ గొంద ఱరణ్యములను బట్టిపోయిరి. వీరే యోగులు. అద్వైతమున మన దేశమున శ్రీవైష్ణవము, వీరశైవము, శాంకరము అను మూడు భేదములున్నవి. శ్రీవైష్ణవా ద్వైతమునకు, యోగమునకు సంబంధము లేదు. శంకరుల యద్వైతమునకు, యోగమునకు విశేష సంబంధమున్నది. ఇందు మోక్షస్థితిని సాధించుటకు యోగము నాశ్రయింపవలసి యున్నది. అద్వైతానుభవవిషయమున శ్రీవైష్ణవులకును, శంకర మతానుయాయులకు మధ్య నున్నవారు వీరశైవులు. వీరికి శివసాయుజ్య మొందుటకు వలయు నఖండభక్తికి సాధనమైనది యోగము. ఇట్టి యోగ మనుభవించువారు శివయోగులు. అద్వైతము బ్రాహ్మణేతరులలో వ్యాప్తినొందినది. బ్రాహ్మణులు కర్మప్రధానులు. వీరిలో సన్యాసులైనను కర్మలకన్న నధికమైన పూజాదికము లొనర్పవలయును. కావున అద్వైతబ్రాహ్మణులలో యోగులు లేరు. వీరశైవులకు నిత్యకర్మలు లేవు. వీరు అఖండభక్తికై యోగము నాశ్రయించినారు. కొందఱు

శివయోగులు మఠాదులందు నివసించినను, అనేకులు అడవులలోను, కొండలలోను నివసించిరి. వీరికే స్వర్ణాదివిద్యలు లభించినవి.

వేమన పేదఱికమును బోఁగొట్టుటకు స్వర్ణమును తయారు చేయుటకై యోగుల నాశ్రయించినాఁడు. స్వర్ణవాదము రహస్యవిద్య. అందఱికిని చెప్పరు. స్వర్ణవిద్యపై నభిమానముతోఁ బాటుగ తత్త్వజిజ్ఞాస గలవాఁడై, యోగుల సేవ యొనర్చుచు, వారి నడవడి ననుసరించి, రసవాదముతోఁబాటు మరికొన్ని సిద్ధులను సంపాదించినాఁడు. యోగులలోఁ జేరుటకు ముందు

"ఇహమున సుఖియింప హేమతారకవిద్య
పరమున సుఖియింప బ్రహ్మవిద్య
కడమ విద్యలెల్ల కల్లమూఢుల విద్య"

అని నిశ్చయించి, లంబికాశివయోగి నాశ్రయించి, సరహస్యముగ వేమన యోగవిద్య కుపదేశము నొందినాఁడు.

## వేమన యోగసిద్ధి – మతప్రచారము

మనస్సు దేహమునకు, బహిస్సంసారమునకు కట్టుబడక అఖండముగా నిలచి కార్యమును నిర్వహించు మార్గమొకటి కావలయును. అది యోగము. ఎచట పంచేంద్రియములు మనసుతోఁ జేరి నిలుచునో, బుద్ధి యల్లాడదో అది పరమగతి. ఇట్టి యింద్రియధారణమే యోగము. పరబ్రహ్మానుభవము దీనికి పరమ ప్రయోజనము. యోగాభ్యాసికి హింస, అసత్యము, దొంగిలించుట లనునవి వీడుట, ఇంద్రియ లోలత్వమును వీడుట, కావలసిన దానికంటె నధికముగ దానము నిచ్చినను గ్రహింపకుండుట అనునవి మొదటి మెట్టు. పరిశుద్ధముగా నుండుట, సంతోషము, తపస్సు, వేదశాస్త్రములు, చదువుట, భగవద్భక్తి అను 'నియమము' లను యోగాభ్యాసి పిమ్మట సాధించును. దేహము, మనస్సు పరిశుద్ధములైన పిమ్మట ఆరోగ్యమునకు, శ్రమసహనమునకు 'ఆసనము' లతో వ్యాయామ మొనర్చును. దేహమును చలింపఁజేయుచు మనసుకు నిలకడ తొలగించు వాయువును స్థిరముగా నిల్పుటకు 'ప్రాణాయామ' మొనర్చును. పంచేంద్రియములను మనస్సు పోయిన వంకకుఁ బోవునట్లు చేయుట 'ప్రత్యాహారము' – ఇవి యైదును సాధనములు. తమకిష్టమైన వస్తువుపై మనసు నిలుపుట 'ధారణ'. దానిపై తప్ప నితరములపై మనసును నిలుపకుండుట 'ధ్యానము'. ధ్యానమును సాగనిచ్చిన పిమ్మట ధ్యానము చేయు వస్తువు

మాత్రమే నిలిచి, ధ్యాత (ధ్యానించువాడు), ధ్యానమను క్రియ రెండును నశించును. ఇది సమాధి. అంతయును కలిసి అష్టాంగయోగము.

సంప్రజ్ఞాతము, అసంప్రజ్ఞాతము అని సమాధి రెండు విధములు. ఇందు మొదటి దానియందు తొలుత ధ్యేయవస్తువు స్థూలరూపమున కనిపించి, క్రమముగా సూక్ష్మరూపమున స్పష్టముగఁ గోచరించును. మూలప్రకృతి కన్పట్టునపుడు "ఋతంభర" అను ప్రజ్ఞ కలిగి, దీనివలన యథార్థజ్ఞానము కలిగి సందేహములు తీరును. ఈ ఋతంభర శ్రుతి, అనుమాన ప్రమాణములవలన గలుగు తెలివికంటె గొప్పది. అన్ని విషయములును నిందు ప్రత్యక్ష, పరోక్ష, భూత, వర్తమాన, భవిష్యములను భేదములు లేక సాక్షాత్తుగ గోచరించును. అభ్యాసబలము వలన నీ సంప్రజ్ఞాతసమాధి క్రమముగా నశించి, అసంప్రజ్ఞాతసమాధిగా మాఱును. ఈ స్థితిలో ధ్యేయము స్ఫూర్తి యగుటయును నశించి, కేవల నిర్మలజ్ఞానముగా మిగులును. ఇదే కైవల్యావస్థ. ఇందలి యభ్యాసములలో ఈశ్వరుఁడేమైనాఁడో తెలియదు. ఈ యోగసాధనకు ఫలము యోగసాధనయే. ఈ యోగశాస్త్ర కైవల్యము జ్ఞాన మోక్షమగునా యని సంశ యించువారికి, హఠయోగ శాస్త్రజ్ఞులు మనస్సు ప్రాణములను జయించినపుడు వర్ణింపరాని యానందముండు నని తెలుపుదురు. యోగశాస్త్రకర్త పతంజలి యీ ఆనందమును చెప్పలేదు. భోజరా జీ యానందము లేదనినాఁడు. సుఖదుఃఖరూపమైన చిత్తధర్మ వినాశమే మోక్షమనినాఁడు. అద్వైతులు ముక్తావస్థలో సచ్చిదానంద రూపమగు బ్రహ్మ సాక్షాత్కారము – తానే బ్రహ్మముగా నుండుట కలుగుననిరి. శైవులగు నద్వైతులు నిట్లే భావించిరి. అసంప్రజ్ఞాతసమాధి ఆనందరూపమా, శూన్యరూపమా అను విషయమున భేదమున్నను, కేవలయోగులకు నద్వైతయోగులు రెండుగాక నొకటిగా నుండు విషయమున భేదము లేదు. ఈశ్వర సాక్షాత్కరమును ముఖ్యఫలముగా సాధన యొనర్చు నితరయోగు లందఱును సాధనావస్థలో ఆనంద మున్నదనియెదరు.

శాంతమార్గమున మోక్షమును సాధించుటకు చాలా కాలము పట్టును గావున, త్వరలో ముక్తి పొందగోరువారు దేహమును, మనస్సు నెక్కువ బలవంతపెట్టి లొంగదీయుదురు. ఇది హఠయోగము. హకారమన ఊర్ధ్వగతియగు ప్రాణవాయువు. ఠకారమన అధోగతి యగు అపానవాయువు. రెంటికిని ఐక్యమును సంపాదించి సాధించుట హఠయోగము. ఆసన ప్రాణాయామములు, ధౌతి, నౌళి మొదలగు కర్మలు, బ్రహ్మచర్యమును సాధించు వజ్రోళి వీరి సాధనములు. కుండలినీశక్తి పైకి లేచి షట్చక్రములను చలింపజేసి, భేదించి సహస్రారచక్రమును జేరఁగా, బ్రహ్మ

సాక్షాత్కారమై జీవన్ముక్తి కలుగును. కుండలినీశక్తిని లేపుట ముఖ్యము. హఠయోగము సాధనము. అసంప్రజ్ఞాతసమాధి సాధ్యము. ఇది రాజయోగము. ఇది ఆకాశసంచారము, కామరూపము, పరకాయప్రవేశము మొదలైన కొన్ని సిద్ధుల నిచ్చును. దీని నభ్యసించినవారికి మృత్యువు లేదు. మంత్రయోగము, లయయోగము లనునవి హఠయోగమునకు 'ఉప' యోగములు. మంత్రములను జపించి తన్మయుఁడగుట 'మంత్రయోగము.' అనాహతనాదమును వినుచు మనఃప్రాణములను లయింపఁజేయుట 'లయయోగము.'

వేమన్న గురువైన లంబికాశివయోగి హఠయోగుల జాతిలోనివాఁడు. లంబిక లంభికా శబ్దభవము. దీనికి దవడలని యర్థము. వారిపైనున్న శిరోరంధ్రమున నాలుకను జొనుపవలయును. నాలుకను భ్రూమధ్యమం దెడమ ప్రక్కనున్న చంద్రస్థానము నంట చేసినచో, నగ్ని పుట్టి, ఆ స్థానము కరిగి అమృతము స్రవించును. ఆ అమృతమును త్రాగినవారికి చావు, ఆకలిదప్పులు, మొదలైన వుండవు. అందుకై నాలుక పొడవుగా సాగుటకు క్రింది నరములను గోయుట, వ్రేళ్ళతోఁ బ్రక్కల కాడించుట, ఆవు చన్ను పిదికినట్లు పిదికి లంబికావివరములోనికి జొనుపవలయును. ఇది లంబికాయోగము, ఖేచరీముద్ర. ఇది బాహ్యఖేచరి యనియు, బాహ్యఖేచరియందు కనులు సగము మూసి నాసాగ్రమున దృష్టి నిలిపిన, మండలాకార తేజోదర్శన మగుననియు, నందు మనఃప్రాణములను లీనమొనర్చి ఱెప్పవాల్పక చూచువాఁడు జగద్గురుఁ డగుననియు, ఇదియే నిజమైన ఖేచరియనియు కొందరందురు.

లంబికాయోగ మొనర్చిన యోగి యొకఁడు వేమనకు గురువు. ఇతఁడును 'ఖేచరీ ముద్రకు కీలెఱుఁగగ' ఇత్యాదిగఁ జెప్పినాఁడు గావున లంభికాయోగ మొనర్చినాఁడు. పంచాక్షరీ, ద్వాదశాక్షరీ మంత్రములు కొన్నాళ్ళు పఠించినాఁడు. ప్రాణాయామాది సాధనలొనర్చినాఁడు. "నాదమలరజేసి నాదంబు పొంగించి" మొదలైన రచనల వలన, వేమన లయయోగ మనుభవించినాఁడనియు, షట్చక్రభేదనమగు కుండలినీయోగమును సాధించినాఁడనియు తెలియుచున్నది. ఆత్మపరమాత్మల స్వరూపమును విడివిడిగా దెలిసికొనుటకు యత్నించి కష్టపడినట్లు, కొన్ని రచనలు గన్పట్టుచున్నవి. తుదకు ఆకాశము వంటి బయలును అందు బ్రహ్మమును దర్శించినట్లు "బయలున సర్వము పుట్టును" ఇత్యాది వలన దెలియుచున్నది. "తన్నుఁ దా నెఱిఁగిన దానెపో బ్రహ్మంబు", "సర్వము బ్రహ్మ" మని గుర్తెఱిఁగినాఁడు. అద్వైతానుభవమును సాధించిన తరువాత, ఆసనప్రాణాయామాదులైన హఠవిద్యలను జెట్టిసాములని

త్రోసిపుచ్చినాఁడు. సిద్ధులను సంపాదించుటకుగాక, రాజయోగమున ఆత్మజ్ఞాన సంపాదనకై కష్టమగు హఠము నాశ్రయించుట వేమనయందు విశేషము.

గురుకరుణావిశేషమున వేమనకు బ్రహ్మసాక్షాత్కారమైనను, అతఁడు ఇతరులకు స్వప్రయత్నముల వలననే సాధింపవచ్చునని బోధించినాఁడు. రాజయోగి మహిమ రాజయోగికే తెలియుననినాఁడు. వేమన అసంప్రజ్ఞాతసమాధి మహిమ వలన తానే దేవుఁడనని తెలిసికొన్న తరువాత, నితరదైవతముల గొల్వ మానినాఁడు. ఇతరుల "బ్రహ్మఁజంపి విష్ణుభాగంబులో గల్పి, విష్ణుజంపి శివుని వీటఁగల్పి, శివునిఁ జంపి తాను శివయోగి గావలె" నని బోధించినాఁడు. వేమన రాజయోగమువలన తత్త్వజ్ఞుడైనాఁడా? బ్రౌను ఇతని సిద్ధాంతము అర్థము కాదనినాఁడు. కాని వేమన్న మాత్రము తాను తత్త్వజ్ఞుఁడ నైనానని గాఢముగ విశ్వసించినాఁడు.

వేమన ప్రపంచమునకు రోసి బైరాగి ప్రపంచములోఁ బ్రవేశింపగా, నట నెందఱో సామాన్యులను మోసగించు యోగిబ్రువులు కన్పట్టినారు. ఆ దుఃస్థితిని చూచి సహింపలేక "బ్రతుకు తెరువు లేని బడుగులందఱు పెద్ద" ఇత్యాదిగఁ జెప్పినాఁడు. వేమన సంసారము సారరహితము, దుఃఖమయము, మాయారూపము, దీనిని తప్పించుకొనుట మొదటి పురుషార్థము అని నేర్చుకొనినాఁడు. కర్మ, ఉపవాస, విగ్రహారాధనలవల్ల మాయ తెగదనినాఁడు. తత్త్వమెఱుఁగుటకు మమతలు విడిచి మనస్సును నిలిపి ధ్యానింపవలయును, అరణ్యములకు, కొండలకు పోనవసరము లేదు అని గమనించినాఁడు. పట్టణములు మోహనిలయములు గావున నచ్చట నుండరాదనినాఁడు. వేమన నేర్చుకొనిన మఱి కొన్ని విషయములు బ్రహ్మచర్యము సాధింపవలెను. హఠవిద్యల వలన గాక దుష్ఫలితముల నెఱిఁగి క్రమముగ కామమును జయింపవలెను. ఇంద్రియములను అంతర్ముఖముగా చేసి చూచిన జీవుఁడొక్కడే నిత్యమనియు, అతఁడే బ్రహ్మమనియు తెలియును. జాతిభేదములకు అర్థము లేదు. మైల, ఎంగిలి భ్రాంతులు.

వేమన ఉద్రేకి. యోగసాధనలచే సిద్ధులు కలిగినను, అతనికి మనశ్శాంతి చేకూరలేదు. తనమాట విననివారనినను, చెడు పనులు చేయువారనినను నితనికి జాలి లేదు. అసహ్యము. యోగానందము ననుభవించు నితఁడు బహిరంగవేషమును త్రోసిపుచ్చినాఁడు. తుదకు గోచిపాతను గూడ మాని సాక్షాత్పరమశివసారూప్యము నొందినాఁడు.

"తల్లి గర్భమందుఁ దాఁబుట్టినప్పుడు
మొదట బట్టలేదు తుదనలేదు;
నడుమ బట్టఁ గట్ట నగుబాటు గాదొకో"

అని దిగంబరత్వమును సమర్థించినాఁడు. ఇట్టి స్థితికిఁ బూర్వము బహిరంగ శుద్ధియును మంచిదని బోధించినాఁడు.

ఎంగిలిని గూర్చి వేమన యొనర్చినది వింత వాదము. ఉపవాసములను గూర్చి, తపసులను గూర్చి విగ్రహారాధనను గూర్చి

"ఒక్క ప్రొద్దులున్న నూరిపందైపుట్టు
పృథ్విఁ దపము సేయపేదయగును
నిగిడి శిలకు మ్రొక్క నిర్జీవులగుదురు"

అని సామాన్య జనాభిప్రాయములకు భిన్నముగ నితఁడు ఉద్రేకముతో దలచినాఁడు. స్త్రీ వ్యక్తిపై వేమనకుగల ఉద్రేక మతనిని విశేషముగా జెడగొట్టినది. వేమన, స్త్రీ భోగ్యవస్తువు, మగవానిని చెఱచుటకే సృజింపఁబడినది అన్న భావములు రూఢమై ప్రచలితములగుచున్న సంఘములో బుట్టినవాఁడు. తన మనోనిగ్రహము చెరచినవారివలన బాధలు పడుటచే, వేమన స్త్రీజాతిని పడదిట్టినాఁడు. 'పతులకు సతులవలన గతులు గలుగవనియు, ఆడుదనగ రోతయనియు' నిశ్చయించినాఁడు. ప్రభువొనర్చు చెడుగు ప్రజలకు రాదనినవాఁడు, పతి యొనర్చు చెడుగు సతికేల రాదని అన్యాయముగ తలచినాఁడు.

వేమన వీరశైవుఁడై పుట్టి, శివయోగులలోఁ జేరి హఠయోగము సాధించి, రాజయోగము వలన అద్వైతానంద మనుభవించి జీవన్ముక్తుఁడైనాఁడు. వేమన తాంత్రికుఁడను నభిప్రాయమున్నది. మద్యమాంసాది పంచమకార సేవనము, శ్మశానపూజాదులున్న వామాచారముతో వేమనకు సంబంధము లేదు. కాని వామాచారులకు ప్రమాణములైన "కులార్ణవతంత్రము", "మహానిర్మాణ తంత్రము" లను గ్రంథములలోని తత్త్వమునకును, వేమన తత్త్వమునకు కొంత సామ్యమున్నది. ఇరువురి మతము లద్వైతములగుటయే యిందుకుఁ గారణము. 'కులాచారము' రహస్యముగ నుంచఁదగినదని కులార్ణవము చెప్పగా, వేమన్న అందలి అభిప్రాయమునకు భిన్నముగ –

“వేదవిద్యలెల్ల వేశ్యలవంటివి
భ్రమలబెట్టి తేటపడగ నీవు
గుప్తవిద్య యొకటి కులకాంతవంటిది”

అనినాఁడు. వేదాది విద్యలు అందఱికి లభించునవి గావున వేశ్యల వంటివని కులార్ణవాదు లనఁగా, వేమన భ్రమపెట్టి తేటపడనీవనుట, కులవిద్య కులకాంతవలె దాచదగినదని కులార్ణవాదులనగా, వేమన కులకాంతవలె సులభముగా ననుకూలించునదని మార్పు చేయుట గమనింపదగిన యంశము. “పుట్టమీఁద గొట్ట భుజగంబు చచ్చునా?” మొదలైన వేమన యుపమానములు కులార్ణవాది తంత్రములలోఁ గన్పట్టుచున్నవి. వేమన వామాచారుల గ్రంథములను గొన్నిటిని చూచినవాఁడే గాని, తంత్రమార్గము నవలంబించినవాఁడు కాఁడు. ఇతని సిద్ధాంత మద్వైతము. హఠయోగసాధనలలో నితఁడు కొన్ని తాంత్రికమార్గముల ననుసరించి యుండును.

వేమన తన జీవన్ముక్తి మార్గమును బోధించుటకు అనేకదేశములు తిరిగినాఁడు. అవి యేవో స్పష్టముగ దెలియవు. తంజావూరు రాజులు బంగారము చేయు విద్యను నేర్వవలెనని వేమన్నను తమ యొద్దయుంచు కొనినారట. ఇప్పటికి తంజావూరునందు వేమన పటమున్నది. వేమన వెళ్ళిన చోట సాంఘికనీతులు, సామాన్యనీతులు మొదలగువానిని బోధించియుండును. ఇతని బోధలను చాలామంది త్రోసి పుచ్చియుందురు. పూజాదులు, ఉత్సవములు, మొదలగువానిని, కర్మలను నమ్మిన సామాన్యప్రజకు “నేనే దేవుఁడ” నన్న అద్వైతభావము కలుగుట కష్టము గదా! ఇతని సంస్కారపు నీతులైనను ఉన్న సాంఘికవర్తనల నన్నింటిని సమూలముగా ఛేదించునవినై యున్నవి. ‘‘ఊరివారికెల్ల నొక్క కంచము పెట్టి పొత్తు గలిపి కులముల నశింపజేయవలయు’’ నన్న యితని భావము సాధ్యమా? అన్ని విధముల ప్రపంచమునకు విరుద్ధముగ నడుచువాఁడు, ఉద్రేకియైన వేమన యితరుల నసహ్యించు కొనగలఁడేగాని, గుణములను దెలిసికొనలేదు. తన మాట తెలిసికొన లేనివానిని మెప్పె, ముప్పదేండ్లకయిన దెలిసికొన లేడనినాఁడు.

శ్రద్ధ వేమనలోని గొప్ప గుణము. గొప్ప తత్త్వమును గనుఁగొంటినని గాఢవిశ్వాసము, దాని నితరుల కెఱిఁగింపవలెనను పట్టుదల యితని కున్నవి. అప్పటి సాంఘికపరిస్థితులతోఁ దృప్తి పడనివారు కొందఱు తన్నాశ్రయింపగా, వేమన వారిని హఠయోగమున దింపక చిత్తశుద్ధితో శాంతిని పొందు మార్గ ముపదేశించినాఁడు. 1. దొంగతనము చేయకుండుట 2. నిరంతరము భూతదయ గలిగియుండుట

3. ఇతరుల మనసు నొప్పించకుండుట 4. ఉన్నదానితోఁ దృప్తినొందుట 5. ఇతరులతో మత్సరింపకుండుట 6. కోపము విడుచుట 7. ఎల్లప్పుడు నీశ్వరారాధన మొనర్చుచుండుట అను సప్తాజ్ఞలతో గూడిన మతమును కేవలశివాద్వైతి, జాతికులాభిమానముల కతీతుఁడైన వేమన స్థాపించినట్లు, శ్రీ కొమఱ్ఱాజువారు తెలిపినారు. వేమన సామాన్యజనులకు తత్త్వవిచారణ అందరానిదని నిశ్చయించి, ఈశ్వరుఁడొక డున్నాఁడని చెప్పి, పరోపకారాదుల మూలమున ఆ దేవు నెఱుఁగుఁడని బోధించినాఁడు. ఇతని శిష్యులు దీనిని ఎంతవఱ కాచరణలో పెట్టిరో తెలియరాదు. తుంగ వేమన మతము, వేమన మతము నొకటేయైన, కటార్లపల్లెలోని యాతని యుత్సవములలో పూజవేళ పశుబలి జరుగుచున్నది. శిష్యులు గురువునకు వ్యతిరేకముగా ప్రవర్తించుట సృష్టిరహస్యములలో నొకటి. వేమన అవసానదశయందు పామూరునొద్ద కొండగుహలోఁ బ్రవేశించి మరల బయటికి రాలేదనుట ప్రబలసాక్ష్యము దొరకువఱకును నమ్మదఁగియున్నది.

## వేమన వంటివారు

తమ తమ మతకర్తల మహత్త్వమునకు ఆశ్చర్యపడి, వారి నిర్ణయములే పరమసత్యములని నమ్మి స్వతంత్రముగ విమర్శించు శక్తిని పోఁగొట్టుకొనుట, తమకన్న నజ్ఞానులగువారు తమ యెడనట్లే వర్తింపవలయునని తలఁచుట, జనులలో సామాన్యముగ జరుగుచుండును. ఇట్టివారిని తమ స్వతంత్రవిమర్శచే మేల్కొల్పుటకు కొందఱు బయలుదేరుదురు. అట్టివానిలో ఆంధ్రులందు వేమన ముఖ్యుఁడు. వీరిలో వేమన్న తరువాత మొదటి తెలియదగినవాఁడు సర్వజ్ఞమూర్తి. ఇతఁడు వేమన్నకు ప్రతిబింబము వంటి వాఁడగుట, కన్నడము వాఁడగుట యిందుకు ముఖ్య కారణములు. కన్నడులు, తెలుఁగువారికి మిగిలినవారికంటె సమీపబంధువులు. మత ప్రచారాదులందు ఒకరికొకరు తోడ్పడినారు.

సర్వజ్ఞమూర్తి చరిత్రమున వేమన చరిత్రకున్నన్ని చిక్కులున్నవి. ఇతఁడు 'బసవరుసు' అను ఆరాధ్యబ్రాహ్మణునకు, 'అంబలూరు' గ్రామములోని కుమ్మరి విధవయగు 'మాళి' అనుదానికి జన్మించినట్టు కథయున్నది. ఇతఁడు కైలాసమున 'పుష్పదత్తుఁ' డననియు, పరమేశ్వర వర్తమున పుట్టినాఁడననియుఁ జెప్పుకొనినాఁడు. సర్వజ్ఞుఁడు తల్లిదండ్రులను లెక్కపెట్టలేదు. వేమనయును తొలుత తల్లిదండ్రులపై అభిమానముగలవాఁడైనను చివరకు "తన తల్లి గౌరి, తండ్రి శంభుఁడు, పుట్టినిల్లు కైలాసము" అని చెప్పినాఁడు. సర్వజ్ఞమూర్తి కాలము క్రీ.శ. 12 మొదలు 18వ

శతాబ్ది వఱకును నేదైన కావచ్చును. 16వ శతాబ్దివాఁడనిన శ్రీ ఉత్తంగి చెన్నప్పగారి యూహయును నిశ్చయము గాదు. జన్మను బట్టి తన్ను జనులు పరిహసింపఁగా, నితఁడు జాతిని బట్టి వ్యక్తిని తిరస్కరించువారిపై కత్తిగట్టినాఁడు.

వేమనకువలెనే సర్వజ్ఞమూర్తికి ఆత్మశక్తిపై విశ్వాసమధికము. సర్వజ్ఞుఁడన్న పేరు తల్లిదండ్రులు పెట్టినది కాదు. ప్రభువిచ్చిన బిరుదు కాదు. 'వీఁడు సర్వజ్ఞుఁడా?" అని యితరు లాక్షేపింప, నిజమే సర్వజ్ఞుఁడ నని యా నామమునే ఇతఁడు గ్రహించినట్లు కన్పించును. వేమనవలె నితఁడును ఉద్రేకి. చదువుసంధ్యల నిర్బంధములు ఎఱుఁగని వాఁడు. సహజమైన కవితాశక్తి గలవాఁడు. హాస్యప్రియుఁడు. వేమన్నకంటె తృప్తితో నిహసౌఖ్యము లనుభవించినాఁడు. వేమనకంటె భోజనప్రియుఁడు. "మంచి సాంసారికజీవితమున్న స్వర్గమునకు నిప్పంటించు" మనినాఁడు. వేమనవలె జారస్త్రీలకు, వేశ్యలకు లొంగినవాఁడు. బంగారు పేఱుచే స్త్రీలు వశులగుదురని యెఱిఁగినాఁడు. వట్టిమాటలతో వేశ్యలను మరులు కొల్పి దగా చేసినవాడే జాణయని తలఁచినాఁడు. సర్వజ్ఞుఁడు జొన్నన్నము, మీఁగడ పెరుగు, వేళకు వచ్చు భార్యయున్నచో వేశ్యను కొఱత వేయుమనినాఁడు.

సర్వజ్ఞుఁడు వేమనవలె ఆ తృప్తితో బ్రహ్మను పలుమారు తిట్టలేదు. తెలియని వాని జోలికి, సాధ్యము గాని వాని జోలికి పోక, శివుఁడు చూపినట్లుండు మని బోధించినాఁడు. వేమన్న కంటె శాంతమూర్తి. నెమ్మదితనము, ఉదాసీనత ఇతనియందు విశేషము. వేమనవలె చురుకైన మాటగలవాఁడైనను, నితఁడు అతనివలె ప్రపంచము నసహ్యించుకొనలేదు. వేమన కాటవెలఁదిపై ప్రీతి. ఇతనికి సంగీతమున పనికివచ్చు యిష్టము త్రిపది, అతనికి తోడిరాగముపై నభిమానము. ఇతనికి నాటరాగముపై నభిమానము. స్వాతంత్ర్యము, అసహ్యము మొదలగువానిని, దానివలెఁ జూపవచ్చును గాని దీనిలో దైన్యము లేదు. వేమనకు జన్మదుఃఖ మున్నది. సర్వజ్ఞునకు ఉన్నన్నినాళ్లు తనకు, నితరులకు సుఖముగా బ్రతికి చత్తమను భావమున్నది.

సర్వజ్ఞుఁడు యుద్ధవేళ శౌర్యప్రతాపములను ప్రశంసించినాఁడు. బ్రహ్మ యెదురు పడినను బిరుదు చెప్పి పొడువవలె ననినాఁడు. ఇట్టి శౌర్యమున వేమనయును తీసిపోఁడు. శౌర్య, సంసారసుఖములందు ఆశగలవాఁ డగుటచే, సర్వజ్ఞుఁడు రాజసేవ చేసినాఁడు. వేమన రాజులఁ గొల్చినను బహుకాలము సాగలేదు. 'రాచమూక పొందు పాముతోడి పొందని' తలఁచి విడిచినాఁడు. సర్వజ్ఞుఁడు రాజుల చిత్తవృత్తి ననుసరించి వినయవిధేయతలతో సేవించినాఁడు. స్వామి కార్యమునకు చచ్చి తీరవలె నన్న భావము

గల సర్వజ్ఞుఁడు, రాజుల జారచోరత్వాది గుణములకు విసిగినాఁడు. మనవి విననివాని గొలుచుటకంటె సన్యాసము మేలని నిశ్చయించినాఁడు.

సర్వజ్ఞుఁడు మొదటినుండి లింగధారి శైవుఁడు. ఎవరో శివయోగి నాశ్రయించి సన్యసించి జంగమైనాఁడు. మొదట యోగసాధనకు బాహ్యవేష మవసరమని తలఁచినాఁడు. విభూతి, రుద్రాక్షలు, లింగము ధరించినాఁడు. శివార్పణమొనర్చి భుజింపుమని, జంగములు శివస్వరూపులని, వారికిచ్చిన శివునికిచ్చినట్లే యని, తిరిపమెత్తియైన జంగమునకుఁ బెట్టుమని, శివభక్తుల కిచ్చు దానము శ్రేష్ఠమని బోధించినాఁడు. సర్వజ్ఞునకు వేమనకంటె శివపక్షపాతము విశేషము. ఇతరదేవతలపై అనాదర మధికము. యోగసాధన యొనర్చిన పిమ్మట నీ బహిరంగ భావములు నశించినవి. ఆలయమందలి శివలింగము సంభారమును నూరుటకు పనికివచ్చు గుండని తలఁచినాఁడు. వేదసారము వేమనకుఁ దక్క నితరులకుఁ దెలియదని వేమన యన్నట్లుగ, సర్వజ్ఞుఁడు వేదములనుండి క్షీరమును గ్రహించు శక్తి శివయోగికిఁ దప్ప లేదని భావించినాఁడు.

జ్ఞానికి వాదముతోఁ బనిలేదు, ఊరకుండ వలయును, చర్చించుట దొంగిలింపఁ బోయి తుమ్ముట వంటిదని సర్వజ్ఞుని భావము. వేమనవలెనే యితనికి యజ్ఞయాగాదులపై, ధర్మచ్యుతులైనారని బ్రాహ్మణులపై ద్వేషము. “తల్లి శూద్రురాలు తానెట్లు బాపఁడు?” అని వేమన్న యడిగినట్లే, సర్వజ్ఞుఁడు నడుగు జందెములు లేని భార్యతోఁ గలిసియున్నను అట్టి శూద్రులను తాకని బ్రాహ్మణుఁడు, ఏటి బ్రాహ్మణుఁడని ప్రశ్నించినాఁడు. కులభేదములను, జన్మచే వచ్చు నాధిక్యములను నితఁడు కాదని నాఁడు. స్వర్గమున మాలవాడ లేదనియు, దేవునికి కులభేదము లేదనియు నితని గాఢవిశ్వాసము. సర్వజ్ఞుని దేవుఁడు ఏకైకప్రభువు. శివుఁడు నిరాకారుఁడు. సర్వవ్యాపి. ‘జీవులకు అజ్ఞానరూపమైన మాయ యున్నది దేవునకు లేదు’ అని అతని భావము. సర్వజ్ఞునకు వేమనవలె పరిపూర్ణమగు నద్వైతానుభవము కలిగినట్లు తోచదు. ‘తన్ను తా నెఱిఁగిన తానె పో బ్రహ్మ’ మని ఇతఁడు వేమనవలె నిశ్చయముగా చెప్పలేదు. “అద్వైతమునకై తిరుగుట యున్నది పోఁగొట్టుకొనుట” అని చెప్పుటచే, సర్వజ్ఞుఁడు బ్రహ్మాద్వైతమును సాధించుటకు యత్నింపలేదని తెలియుచున్నది. నిరంతరము శివధ్యానానంద మనుభవించుటతోఁ దృప్తి నొందినాఁడు. మనసులో ధ్యానించువానికి ఇల్లు, మఠము, కొండ, కోన – అన్నియు నొకటే యని సర్వజ్ఞుని నిర్ణయము. వేమన దృష్టియు నిదియే.

సర్వజ్ఞుఁడు వేమనవలె వ్రాతకందని పాటలు వేలసంఖ్యలోఁ దొరికిన విషయముపై నెల్లఁజెప్పినాఁడు. ఇతని భావములన్నియు అనుభవపూర్వకములు. వేమనవలె దేశసంచార మొనర్చి తన తత్త్వమును ప్రజలకు బోధించినాఁడు. వేమనకంటె సర్వజ్ఞునకు లౌకికము విశేషము. వేమన తన మాటలను విననివారిని పడదిట్టినాఁడు, సర్వజ్ఞుఁడు మూర్ఖులతో కలహము వలదని బోధించినాఁడు.

వేమన కవిత్వతత్త్వములు ధారాళమైన శయ్య, ఎల్లర కర్థమగు భాష, సాధారణమైన ఉపమానములు, మఱుఁగులేని మాటలు, హాస్యములు గల్గియున్నవి. జ్యోతిష, వైద్య, శకున, కామశాస్త్రాదులందు సర్వజ్ఞునకు వేమనకంటె నధిక పరిచయమున్నది. రసవాదవిషయమున నిరువురకు సమమైన విశ్వాసానుభవము లున్నవి. ఇరువురును 'కూట' పద్యములు వ్రాసిరి. స్వభావసంబంధమైన అల్పభేదములున్నను, వేమన సర్వజ్ఞులిరువురు నొకరికొకరు తీర్చిన ప్రతిమలు. ఇరువురును కలిసి మాటాడుకొని సమముగ వ్రాసినట్లున్న పద్యములు - బందెతాళ్లు దెచ్చి బంధించికట్టంగ ఇత్యాదులు, ఎన్నియో యున్నవి. వేమన 17వ శతాబ్ది చివరి భాగమువాఁడు, సర్వజ్ఞుడు 16వ శతాబ్దివాఁడునైనచో వేమనయే సర్వజ్ఞు ననుసరించినాఁడనవలెను. వేమన కన్నడదేశ సమీపమందున్నను ఆ దేశమున దిరిగినట్లు కన్పట్టదు. సర్వజ్ఞుఁడు తెలుఁగు దేశములో సంచరించినాఁడు గాని యతని పదములకు తెలుఁగు దేశమున వ్యాప్తి లేదు. వేమన పద్యములకు కన్నడమున వ్యాప్తి యున్నది. వేమన వాసనయే సర్వజ్ఞునకుఁ దగిలియుండవచ్చును. ఎవరికెవరు గురువులైనను నిరువురు గురుత్వమును వహింప యోగ్యులు.

కన్నడ వచనకారులు సర్వజ్ఞుని వలెనే యోగమార్గము ననుసరించి, శివ సాక్షాత్కారమునకై ప్రయత్నించిరి. వీరిలో మహాదేవి అక్క మొదలైన కొందఱు స్త్రీలు నున్నారు. వీరు తమ సిద్ధాంతములను వీరశైవమతకర్తయైన బసవేశ్వరునివలె వచనములలో వ్రాసిరి. వీరు సర్వజ్ఞ వేమనల వలె సర్వవిషయముల మీఁదికి పోలేదు. అందుకుఁ దగిన కవితాశక్తి లేనివారు. బాహ్యాచారఖండనము, స్వమత మందలి భక్తి, శివపారమ్య మందలి విశ్వాసము, శివయోగ సాధనవిధానములు వీరి వచనములకు ముఖ్యాంశములు. వీరందఱును శివాద్వైతులు. వీరి వచనములు కన్నడమున అసంఖ్యాకములు. వేషభాషలు, జాతి భేదములు మొదలగువాని నసహ్యించుకొని, అట్టి తమ భావములను, భక్తిని పామరజనులలో పాటల మూలమున ప్రచార మొనర్చిన విష్ణుభక్తి గల కన్నడ మాధ్వులలో పురందరదాసు, కనకదాసు

మొదలైన దాసభక్తు లెందఱో యున్నారు. వీరి దేవర నామములు మన రామదాసు, త్యాగయ్యల కీర్తనల వంటివి. దంభాచారములపై వీరు కత్తిగట్టి ప్రబోధించినారు. పామరులలో పరిశుద్ధమైన భక్తి, విశ్వాసము, సౌశీల్యము మొదలైన గుణములు నిలిచియుండుటకు వీరి ప్రచారములే కారణములు.

అరవవారిలో తిరువళ్ళువరు "తిరుక్కురళ్" మిక్కిలి వ్యాప్తినొందినది. వేమన పద్యములకును 'తిరుక్కురళ్' గ్రంథమునకును సామ్యము తక్కువ. తిరువళ్ళువరు క్రీ.శ. 1వ శతాబ్దివాఁడని అనేకులు తలఁచెదరు. తిరువళ్ళువరు మైలాపూరు నివాసి, భగవంతుఁడను బ్రాహ్మణునకు, ఆదియను చండాల స్త్రీకిని బుట్టినవాఁడు. 'కురళ్' ఆటవెలఁదిలో సగముండు ఛందము. ఇతని తిరుక్కురళ్ ధర్మార్థకామములను మూఁడు పురుషార్థములను గూర్చిన శాస్త్రగ్రంథము. ఉపోద్ఘాతమందును, సన్యాస ప్రకరణ మందు నితఁడు భగవంతుని గూర్చి, మోక్షోపాయములను గూర్చి సంగ్రహముగాఁ జెప్పుటచే, బ్రాహ్మణుఁడు కానందున మోక్షమును గూర్చి చెప్పుటకు తన కధికారము లేదని యితఁడు దానిని గూర్చి వ్రాయలేదను కథ నమ్మఁదగినది కాదు.

తిరువళ్ళువరు సుఖియైన సంసారి. అతిథిపూజాదులు గల కర్మనిష్ఠుఁడు. సత్యము, నీతి మొదలైన లౌకికధర్మములను నెఱపుచు భక్తియుక్తుఁడై జీవించినవాఁడే గాని వేదాంతవిషయముల జోలికి పోలేదు. తిరువళ్ళువరు ధర్మార్థకామములలోని యంగములను విభజించి, ప్రతిదానికి పది పద్యముల ప్రకారము, 1330 పద్యములు వ్రాసినాఁడు. ఇట్టి విషయవిభాగశక్తికి తోడుగ నితనికి మంచి కవితాశక్తి యున్నది. ఇతని కవిత వేమనవంటి ఆశుధార కాదు. తిక్కనవలె తీర్చిదిద్దిన రచన. మార్దవము, ఓర్పు, నెమ్మది గలది. ఇతనివి సామాన్యనీతులు. క్రొత్త లేదు. ప్రతి విషయముపై పది పద్యములు వ్రాయు నియమమువలన అచ్చుటచ్చుట కవిత పలచబడినది.

తిరువళ్ళువరు సంసారకవి; వేమనవలె విరక్తుఁడు కాఁడు. వేమన్న 'చిన్నబిడ్డలను ముఱికి ముద్ద' లని 'చంకనెత్తి ముద్దిడనేల' యని యనఁగా, నితఁడు "చిన్న బిడ్డలు చేతితోఁ జెఱచిన యన్నమమృత" మనినాఁడు. వేమన స్త్రీలకు విధిలేక లొంగినను తిరస్కరింపఁగా, తిరువళ్ళువరు వారియెడ అభిమానముతో గౌరవముతో వర్తించి, "ప్రియులైనవారి కౌగిలికంటె బ్రహ్మసృష్టిలో సుఖమేమున్న" దనినాఁడు. ఈ కారణమున పండితులు ఇతని గ్రంథమును పొగడి వ్యాఖ్యలు వ్రాయుట, దీనికి ఉత్తరవేదమని గౌరవము లభించుట జరిగినవి. ఏ దేవతను పేర్కొనక భగవంతునికి నమస్కరించి గ్రంథారంభ మొనర్చుటచేతను, సామాన్యనీతులను మాత్రమే చెప్పుట చేతను

తిరువళ్ళువరు ఎల్లరకుఁ బ్రీతిపాత్రుఁడైనాఁడు. ఇతని తిరుక్కురళు 150 సంవత్సరములకుఁ బూర్వమే జర్మను, ఫ్రెంచి, యింగ్లీషు భాషలలోనికిఁ బరివర్తన మొందినది.

సామాన్యనీతుల విషయమునఁ దప్ప వేమనకు, తిరువళ్ళువరుకు సామ్యములు లేవు. వేమన దుర్నీతిని ఖండింపఁగా, తిరువళ్ళువరు నీతిస్వరూపమును దెలిపినాఁడు. ప్రపంచముపై విరక్తి, రక్తులే యిందుకుఁ గారణములు. "అతిథులకుఁ బెట్టి మిగిలిన దారగించు నరుని పొలమునందు విత్తులు నాటఁబడలేదు. ఇతరుల తప్పులను ఓర్చుకొనవలెను. మరచుట మఱియు మేలు, కని, విని, మూర్కొని, తాకి, తిని తెలిసికొనఁదగిన తీపులన్నియు స్త్రీ శరీరమందుఁ జేరి నిలచినవి" – ఇవి తిరువళ్ళువరు నీతిస్వరూపమును దెలుపు కొన్ని యుదాహరణములు.

వేమన మతమును, భావములను గలిగి, యోగసాధనమూలమున అద్వైతమున సాధించినవారు తెలుగువారిలోనే యనేకులున్నారు. వారిలో పోతులూరు వీరబ్రహ్మ మొకఁడు. ఇతఁడు కంసాలి. జననము 17వ శతాబ్ది మధ్యభాగము. పోతులూరువాఁడు, కర్నూలు మండలమందలి బనగాలపల్లెలోని గరిమరెడ్డి వెంకటరెడ్డి యింట చిన్నతనమున పసుల కాపరిగ నున్నాఁడు. చచ్చినవారిని బ్రతికించుట, జాతరలలో నందఱి యెదుట చండికావిగ్రహముచే నాజ్ఞాపించి చుట్ట కాల్చుకొనుటకు నిప్పు తెప్పించుకొనుట మొదలైన యద్భుతకార్యము లొనర్చినాఁడు. విగ్రహారాధన, జాతిభేదములు, జాతరలు మొదలగువానిని ఖండించి జనులకు బోధచేసినాఁడు. ఇతఁడు సంసారి, సన్యాసి కాఁడు. భార్య గోవిందమ్మ. అయిదుగురు కొడుకులు, ఒక కుమార్తె. ఇతని శిష్యులలో ప్రసిద్ధుఁడు సిద్ధయ్య. సిద్ధయ్య చిన్నతనముననే తల్లిదండ్రులను, తన మతమును విడిచి తన్నాశ్రయింపఁగా, వీరబ్రహ్మము శిష్యునిగా స్వీకరించి జ్ఞానోపదేశ మొనర్చినాఁడు. ఇఁతడు సిద్ధాయను మకుటముతో శిష్యునకై 'సిద్ధబోధము' అను గ్రంథమును వ్రాసినాఁడు. "నీవును నేనును తానును భావింపఁగా నొక్కఁడనుచు బరఁగెడుఁ గాదె" ఇత్యాదులు అందులోనివి. వేమనవలె వీరబ్రహ్మము సర్వసమత్వముగల అద్వైతమును బోధించు పద్యములను, పాటలను ఎన్నింటినో వ్రాసినట్లు తెలియుచున్నది. "సంసారైనా నొకటే, సంసారము విడిచిన నొకటే, హంస నటించే విధమెఱిగింటే, సంశయములు తనమది విడిచుంటే" – "చిల్లర రాళ్ళకు మ్రొక్కుచునుంటే చిత్తము చెడునుర నోరే నోరే" వంటి రచనలు చూడఁగా, వీరబ్రహ్మము రచనల యందు వేమన్నలోఁగల వేగము, అచ్చుకట్టు ఉన్నట్లు తోచదు. హఠయోగసిద్ధి

నొందిన వీరబ్రహ్మము కందిమల్లయ పాలెములో జీవసమాధి నొందినాఁడు. ఈతని పౌత్రి ఈశ్వరమ్మ బ్రహ్మచారిణియైన యోగినిగా కీర్తికెక్కినది. వీరబ్రహ్మము శిష్యుడైన సిద్ధయ్యయును కొన్ని పాటలు వ్రాసినాఁడు.

అద్వైతమును బోధించు పాటలగు "ఏగంటివారి వచనాలు", "ఏగంటి లక్ష్మయ్య గారి వచనాలు" ఆంధ్రదేశమున వ్యాప్తిలో నున్నవి. వీనిని పండితుల కంటె పామరులు గమనించి, బోధ నాచరణలోఁ బెట్టినారు. భాషాసౌష్ఠవము, విషయ సంగ్రహశక్తి, ధారాళశయ్య, ఏగంటివారి పదములకు లక్షణము. "ఆనందమయుఁడు గావలెను, మనసు పదిలము చేయవలెను" మొదలైన పాట ఈ గుణవిశేషములను దెలిసికొనుట కొక యుదాహరణము. కన్నడమందలి 'దేవర నామము' ల వలె తెలుగుఁలో అద్వైతబోధ యొనర్చుపాట లెన్నోయున్నవి.

వేదాంతమును పద్యరూపముగ వ్రాసిన శతకకర్తలు తెలుఁగున అసంఖ్యాకులుగ నున్నారు. అట్టివారిలో "సదానందయోగి" శతకకర్తయైన ఆనందవరద రాజయోగి యొకఁడు. వేమన యందలి భక్తితో "వేమనజ్ఞాన మార్గపద్యము" ల నేరి ప్రకటించిన నెల్లూరి జిల్లా నారాయణరెడ్డి పేట రామస్వామి యోగి కుమారుఁడు, దిగంబరయోగి శిష్యుఁడు అయిన ఆధునికుఁడు ముత్యాల నారసింహయోగి "జీవతత్త్వ ప్రబోధకుసుమావళి" అను పేరుతో వేమన మతమును దెలుపు కందపద్య గ్రంథమును వ్రాసినాఁడు. వేమన్నకుఁ గలిగిన అన్యమనస్కసమాధి యిట్టివారి కెంతవఱకు కల్గినదో చెప్పుట కష్టము. వీరిలో కొందఱు అనుభవము లేకున్నను, గురువుల మాటలపై నమ్మకముతో బోధించువారుందురు.

## వేమన కవిత్వము, హాస్యము, నీతులు

ప్రజాభిరుచి నెఱిఁగి వారికిఁ దృప్తిగా వ్రాయక పోవుటవలనను, కవి గొప్పతన మెఱిఁగి గౌరవించు ప్రజలు లేకపోవుట వలనను, వేమన పేరుపడ్డ కవి కాలేక పోయినాఁడు. ఇతఁడు ఇతరుల మేలుకోరి వ్రాసినవాఁడే కాని, యితరుల తృప్తికి వ్రాసినవాఁడు కాఁడు. కీర్తికిఁగాని, ద్రవ్యమునకుఁగాని పొగడ్తలొనర్చుట కిష్టపడనివాఁడు. చూచిన దానియందెల్ల తప్పు పట్టుట, తిట్టుట ఇతని స్వభావము. పేదఱికమునందు ద్రవ్యార్జనకు బయలుదేరినపుడు ధనికులను బొగడినాఁడేమో యన్న పద్యము "పడుచునిచ్చు వాని పద్యమిచ్చువాని" ఇత్యాది యొకటి కన్పించుచున్నది.

ఇదియును ముఖస్తుతి యొనర్చునది కాదు. ఆత్మను జంపుకొని స్తుతించినవాని కేమియును నీయనపుడు చూచి, కష్టపడి, చెప్పినదనవచ్చును.

బహిరంగద్వేషియగు వేమన భక్తి లేని పూజ ఫలములేదని, భక్తిగలవాఁడు ఆలయమున కేగి పత్రి, తులసి వ్యయ మొనర్పక మంచాననే మ్రొక్కుననిఁ నాఁడు. ఇతఁడు ప్రాజ్ఞుఁడు, సమర్థుఁడు నైన వానివలె బహిరంగము, అంతరంగములను రెంటిని పరస్పర సహాయకములుగా సమన్వయించుకొన లేకపోయినాఁడు. వేమన కవిత్వమందును తన తప్పు సిద్ధాంతము నుపయోగించినాఁడు. కవిత్వమునకు భాష, ఛందస్సు మొదలైనవి బహిరంగములు. అర్థభావము లంతరంగములు. ఇవి విశిష్టరీతిలో తీవ్రముగా నున్నపుడే కవిత్వమను పేరు వచ్చును. "పైరు నిడినవాని ఫలమే సఫలమగును" అన్న ఇతని పద్యమున కవిత్వము లేదు. "ఉక్కు తండములైన పూదించి నలగొట్టి" ఇత్యాదియందు ఛందము దెబ్బతినినది. అనేకములైన ఆటవెలఁదులు, సీసపద్యపు నడకలు నడిచినవి. సుశబ్దప్రయోగమునకుఁ గాని, సంధులను గలుపు టకుఁగాని యితఁడు యత్నింపలేదు. అసభ్యపదములు, అర్థములు లెక్కకు మిక్కిలిగ ప్రయోగించినాఁడు. సామాన్యప్రజలకు బహిరంగము ముఖ్యము. వేమన్న కవిత్వమున నది లేదు.

కవిత్వమును విని సంతోషించు ప్రజలలో పామరులు పరులకు దాసులు, పండితులు స్వయందాసులు. పామరులు వేమన కవిత్వమును విని సంతోషించినను, రాజాస్థానకవులతో వేమనను పోల్చి చూచు ధైర్యము వారికి లేదు. పండితులు వేమనను లెక్క చేయలేదు. వేమన పండితులను లెక్క చేయలేదు. వేమన పురాణకవులను చదివినవాఁడే గాని తఱువాతి ప్రబంధ కవుల రచనామార్గ మెఱుఁగడు. తన కవిత్వమును దప్పు పట్టినవారిని,

"ఆదికవులవోలె అల్పుండు తానెఱిగి,
చెప్పలేఁడు గాని తప్పుబట్టు,
త్రోయనేర్చు కుక్క దొంతులు పెట్టునా?"

అని వేమన తిట్టినాఁడు. ఎప్పటికైనా అర్థమొనర్చుకొని తన్ను నిలువఁ బెట్టవలసినవారు పండితులే గాని పామరులు కాదని యతనికిఁ దెలియును. వేమన కవిత్వము గాలివలె సర్వవ్యాపిత్వము గలది. అది అన్ని చోట్ల దొరుకుట చేతనే, యతనిని పిలిచి యెవ్వరును మహాకవి యనలేదు.

"సతుల గవయనేల? సుతులఁ బడయనేల?
వెతలు పడఁగనేల? వెఱ్ఱితనము
నేలమీఁది రాయి నెత్తికెత్తినయట్లు" –

ఇట్టి వేమనకవి యభిప్రాయములతో మన మేకీభవింపలేము. అతని యభిప్రాయము లధికభాగ మిట్టివే. అతని కవిత్వమును ఆదరించుటకు సహృదయుల మైన మన నాగరకత యడ్డువచ్చుచుండును. అతఁడు మన జాతి నాగరకతలను తిరస్కరించి తిట్టినాఁడని, యసాధారణమైన వేమన కవిత్వము వలనఁ గలుగు నానందమును గోల్పోవుచున్నాము. భావముల తీవ్రత వేమన కవిత్వమందలి అసాధారణగుణములలో ముఖ్యమైనది. ఈ తీవ్రతకు అతఁడు చెప్పు భావము లన్నియు నతనివగుట హేతువు. భావము విషయమున వేమన కెట్టి పారతంత్ర్యమును లేదు. భావదాస్యము లేక సహజమైన దగుటవలన వేమన భాష కొంక బిగువు, బలము కలిగినవి. వేమన కవిత్వమున భావము, భాష ఒకదానితో నొకటి పందెము వేసికొన్నట్లు హృదయమునుండి యుబికివచ్చును. ఈ వేగమును ఆపుటకు ఛందస్సు, యతిప్రాసల నిర్బంధములు చాలవు. కొన్ని సందర్భములందు వేమన లేని నిర్బంధములను గల్పించుకొని 'దొమ్మరి లఘువులను' చూపించును. ప్రాస నిర్బంధము లేని చిన్ని ఛందమగు ఆటవెలఁదులకు ప్రాసనియమును గల్పించుకొని,

"చదువులందు పాడి మొదవులందును స్త్రీల,
పెదవులందు రాజ్య పదవులందు,
ఆశలుడిగినట్టి అయ్యలు ముక్తులు"

వలె చెప్పిన పద్యము లిందు కుదాహరణములు.

అర్థము గాని వేమన కవితారహస్యములలో ఆటవెలఁది యొకటి. ఇంత చిన్ని పద్యములో గొప్ప భావములను, యతిస్థానములు విడువక, తిరుగుడులు మొదలైనవి లేక యెట్లు వేమన చెప్పఁగలిగినాఁడని యాశ్చర్యమును గల్గును. చిక్కు లేక చెప్పఁగోరు వేమన పెద్ద వృత్తము జోలికి పోలేదు. ఇతఁడు వాడిన తేఁటగీతులకైనను, ఆటవెలఁదికి వచ్చిన ముద్దు, చెక్కిన చక్కదనము, బిగువు, లఘువు రాలేదు. వేమన యతికి సంపాదించిన మర్యాద, అందము ఆశ్చర్యకరములైనవి. వెదకి చూడవలసినట్టుగ యతిని ప్రయోగించు తిక్కనకు ఎదురు తిరిగినట్లు, వేమన యతి యుండవలసిన చోటికి పదమును, అభిప్రాయమును తెంచి ప్రయోగించినాఁడు. తన తెనుఁగు భాషాస్వరూపమును జెఱచు రెండవ భాష (ప్రాచీనులకు సంస్కృతము) యితనికి

రాదు. యోగరహస్యములను జెప్పునపుడు కొన్ని పారిభాషికపదములను వాడుట తప్ప వేమన ఇతరమైన కవిత్వమునంతటిని తేఁట తెలుఁగున చెప్పినాఁడు. తెలుగుఁ నేర్చినవారందఱికిని అర్థమగునట్టి సౌలభ్యము అను గుణమునందే వేమన కవితాశక్తి యిమిడియున్నది. వేమన కవిత్వమందలి భావములతో నేకీభవింపకున్నను, అతని కవితను విని పండితుఁడు గాని, పామరుఁడు గాని మఱువలేఁడు. ఇతని కవిత సంపంగి పూల వంటిది.

వేమన కవిత్వమునకు మెఱుఁగు పెట్టి అడ్డుకొనరాని శక్తిగా నొనర్చిన గుణము హాస్యము. మనకు నయముతోఁ గూడిన హాస్యము లేదు. ప్రాచీనులు హాస్యమును నవరసములలోఁ జేర్చినను అసహ్యములను, అసభ్యములను వర్ణించుటతోఁ దృప్తినొందినారు. సంప్రదాయమునకు దాసులై భావస్వేచ్ఛ లేనివారి యందు హాస్యముండదు. హాస్యమునకు మూలప్రకృతి యితరుల యందు తప్పుబట్టుట. సామాన్యులకు తప్పుతోచని చోట తప్పును బైట పెట్టినచో నా హాస్యము మిక్కిలి బలమైనది. సూక్ష్మదృష్టి గల వ్యక్తి తనలోని తప్పులను గూడ చూచుకొని నవ్వుకొనును. వేమన సంస్కర్త, బోధకుఁడు కావున అసభ్యరచనలు గల యతని హాస్యము ఎడనెడ మలినమై యుండును. అయినను స్వతంత్రబుద్ధి కలవాఁడగుటచే కొన్ని తావులందు కర్తవ్యమును మఱచి యితఁడు పరిశుద్ధమైన హాస్యమును ప్రకటించును,

"పాలసాగరమున పవ్వళించిన వాఁడు
గొల్లయిండ్ల పాలు కోరనేల?
ఎదుటివారి సొమ్ము లెల్లవారికిఁ బ్రీతి"

ఇందుకొక యుదాహరణ.

ఇతరులను ఖండించునపుడు వలయు తరవడితోఁ దృప్తినొందక వేమన కొసరు మాటలు చేర్చి నవ్వు పుట్టించును.

"గొడ్డుటావు బితుకఁ గుండఁగొంపోయిన
పండ్లు రాలఁదన్ను పాలనీదు
లోభివానినడుగ లాభంబు లేదయా!"

ఇందుకొక నిదర్శనము. సామాన్యన్యాయమును గంభీరముగ రెండు పాదములలోఁ జెప్పి, క్రొత్త త్రోవకు మరలించి హాస్యమును బుట్టించుట యితని హాస్యప్రీతికిఁ గల మఱియొక శక్తి.

"కూడు బెట్టకున్న కుక్షిలో జఠరాగ్ని
భక్షణంబు చేయుఁ గుక్షిమలము
కూడు విడిచి మలము గుడుచురా ఉపవాసి"

ఇందు కుదాహరణము. దీనికి పెక్కురు నొచ్చుకొన్నను సంతోషించు రసికులు నుందురు.

"సకల తీర్థములకు సకల యజ్ఞంబుల
తలలు గొరుగకున్న ఫలము లేదు
మంత్రజలముకన్న మంగలి జలమెచ్చు"

అన్నదానికి ప్రతివారును నవ్వెదరు.

కవితాధార, హాస్యముతోఁబాటు వేమన పేరును సుస్థిరముగ నిల్పినవి నీతులు. ఇతని నీతులు, స్వార్థములు, పరార్థములు అని రెండు విధములు. ఇవి అనుభవమూలములు.

"విన్నవానికన్న కన్నవాఁడధికుఁడు
కన్నవానికన్న కలియువాఁడు"

అనునది యితని నీతులకు అన్వయించును. మంచిచెడ్డల మథించి చెప్పువాఁడగుటచే నితని నీతులకు తీవ్రత యెక్కువ. వేమన పరార్థనీతులందు పూర్వ నీతిగ్రంథములలో వలె స్వార్థము లేదు. ఇతరులకు సుఖముగ గల్గించిన తనకు సుఖము గల్గునని, పూర్వనీతి. లంచ మాశపెట్టుట, భయపెట్టుట లొనర్చి పరోపకారము చేయించుటకు వేమన యిష్టపడఁడు. పుణ్యపాపములు వేమన దృష్టిలో మానవ నిర్మితములు. ఇందుకు "మేనమామ బిడ్డ మెరసి పెండ్లామాయె" ఇత్యాది నిదర్శనము.

వేమనకు ఔదార్యమన నెక్కువ యిష్టము. ఇతని దృష్టిలో అడుగకయే దాన మొనర్చువాఁడు దాత. లోభులపై నితనికి అసహ్యము. "లోభివాని జంప లోకంబు లోపల", "పిసినివాని యింటఁ బీనుఁగు వెడలిన" అను పద్యములలో లోభివాని యెడ నీతని కెట్టిభావమున్నదో తెల్పినాఁడు. ఔదార్యమున్నను వేమన పాత్రాపాత్రత నెఱుఁగును. ఇచ్చుటకు కులము, జాతి, గుణము మొదలగునవి కావు; పేదఱికమే వేమన ప్రధానముగ గణించును. ఈ అభిప్రాయమును "దోసకారియైన దూసరికాఁడైన" ఇత్యాదియందు వెల్లడించినాఁడు. కన్యాదానము గూడ పేదకే యొనర్పవలెనను తన

మతమును "కలిమిఁజూచి యియ్య గాయమిచ్చినయట్లు" ఇత్యాదియందుఁ దెలిపినాఁడు.

"జీవి జీవిఁ జంప శివుని జంపుటెయగు" ఇత్యాది వలన వేమన అహింసా ప్రియుఁడని వెల్లడియగుచున్నది. అందువలననే యితఁడు యజ్ఞములను నిందించినాఁడు. శత్రువును గూడ హింసించుట కితఁ డిష్టపడఁడు. కావుననే –

"చంపఁదగినయట్టి శత్రువు తన జేతఁ
జిక్కె నేని కీడు చేయరాదు;
పొసఁగ మేలు చేసి పొమ్మనుటే చాలు"

నని బోధించినాఁడు. వివేకియగు వేమన "అనువుగాని చోట అధికులమనరాదు, కొంచెముండుటెల్ల కొదువగాదు" అని శౌర్యమును ప్రదర్శింపవలసిన స్థానమును చెప్పినాఁడు. "చాకి కోకలుదికి చీకాకు పడఁజేసి" ఇత్యాదియందు తనకు మేలును గూర్చుచో దండనకు సహింపవలసినదే యని నీతిగఱపినాఁడు.

నీతులను సాక్షాత్తుగఁ జెప్పుటయే గాక, ఆ నీతుల ననుసరించుట, విడుచుట వలన గల్గు ప్రపంచస్థితులను జెప్పి, వ్యంగ్యముగాఁ దెలుపుటయను మార్గముపై వేమన కాసక్తి, శక్తి యధికములు.

"ఆలిమాటలు విని అన్నదమ్ముల రోసి,
వేఱెపోవువాఁడు వెఱ్ఱివాడు" –

ఇది సాక్షాత్తుగ జెప్పు మార్గము.

"ఆలివంకవారు ఆప్తబంధువులైరి
తల్లి వంకవారు తగినపాటి
తండ్రి వంకవారు దాయాది పగవారు"

ఇట్లు చెప్పుట ధ్వనిమార్గము. పలుకుబడి, మర్యాదాదులను సంపాదించుటకు ధనము ముఖ్యమనుచు వేమన –

"కులము గలుగువారు గోత్రంబు గలవారు
విద్య చేత విఱ్ఱవీగువారు
పసిఁడి గల్గువారి బానిస కొడుకులు"

అన్నదియును నీ వ్యంగ్యమార్గమునకు మఱియొక నిదర్శనము. ఇట్టివే "పనస తొనల కన్న పంచదారల కన్న", "జారపురుషునకును జాజిపూవుల తోడ" – మొదలైనవి. ఉపమానములనే చెప్పి విషయమును జెప్పక వ్యంజించుట యను విచిత్రమైన వేమన కవితామార్గమునకు –

"తిరుమలకును బోవ తురక దాసరిగాఁడు
కాశికేగఁ బంది గజముగాదు
కుక్క సింగమగునె గోదావరికిఁ బోవ"

యొక తార్కాణము.

ధర్మము, తత్త్వము, నీతి, పరమతఖండనము మొదలైన యే విషయములఁ జెప్పునపుడైన వేమన కవితలో సారళ్యము, ధారాళత, చెక్కడపు పని, నిర్లక్ష్యము మొదలగు గుణములు గన్పట్టును. భగవద్దత్తమైన ఆకర్షణశక్తి ఇతని కవితకు విశేషము. ఈతని పద్యము విన్నపుడు ఆకర్షింపబడక యుండుట తెలుఁగువానికి అసాధ్యము. వేమన్నది అచ్చతెనుఁగు కవిత్వము!

★

# ఇతర వ్యాసాలు

**ఇందులో....**


| | | |
|---|---|---|
| 1. | కులాసా కబుర్లు | 835 |
| 2. | ప్రశస్త రాసభము | 841 |
| 3. | సాహిత్యంలో చంద్రుడు | 849 |

# కులాసా కబుర్లు

ఉదాత్తమైన విషయాల మీద నిలిచి ఆలోచించటానికి మనసు 'మొరాయించి' నప్పుడు ఉబుసుపోక కొందరు ఉత్తములు కూడా కులాసా కబుర్లు చెప్పుకుంటారు. ఇది కేవలం కించిత్కాలక్షేపార్థం. కొందరు ఆ పని తప్ప మరో పని చెయ్యలేరు. 'అసిధారా వ్రత దీక్షితుడి' వలె జీవితాన్ని ఆద్యంతమూ ఈ 'మహోత్కృష్ట' కర్మలోనే వారు గడుపుతారు. అయితే వారికి వ్రతుల మన్నమాట తెలియకపోవచ్చు. దీనికి మూలకారణం జీవితాన్ని 'సింహావలోకన' చేసే జిజ్ఞాసకు బుద్ధి నిరంతరమూ నిద్రావస్థను పొందటమే. వారి వృత్తికి మనస్సు ఎన్నడూ 'మరణ బాధ' పొందనవసరం లేదు. ఆలోచనా, పర్యాలోచనల మధ్య 'డోలాయమానం' కావటం అది స్వప్నావస్థలోనైనా అనుభవించి ఉండదు. విసుగు లేకుండా, అణుమాత్రమైనా 'టెంపో' చెడకుండా 'చిన్మయ జ్యోతి' దర్శించేటప్పుడు పొందే 'చిదానందానుభూతిలో' శ్రోతలను ఆకట్టే ప్రజ్ఞ దానికి అవసరం. దానికీ సహజ ప్రతిభ ఉండాలి. వ్యుత్పన్నతను ఆది లోకానుభవ పరిశీలనలవల్ల అజ్ఞాతంగానూ, అననుభూతంగానూ పొందుతుంది. ఇంత మాత్రం చేత ఈ కబుర్ల రాయుళ్ళ మనస్సుకు మాంద్యం లేదని కాదు. అది ఊర్ధ్వంగా, ఎగరలేని పక్షివంటిది; పని చేయదని కాదు. 'మందమైన మనస్సు పిశాచాలకు ప్రియమైన కర్మాగారం' అనే ఇంగ్లీషు సామెత ఇందుకోసమే పుట్టింది. ఇటువంటి 'మందబుద్ధులలో నుంచే సైతాను అతని శిష్యులను స్వీకరిస్తాడు.' క్రీస్తు 'కర్మ యోగులలో నుంచే అతని అనుచరులను గ్రహిస్తా'డని ఓ తాత్త్వికుడన్నాడు. ఇందులో అనంత సత్యం గర్భితమై ఉంది; అందువల్లనే కులాసా కబుర్లు చెప్పేవారు నిరంతరమూ శ్మశాన జీవితం గడుపుతారని తాత్త్వికులంటారు.

స్వతస్సిద్ధంగా ఉత్తమ విషయాన్ని గురించి ఆలోచించక కులాసా కబుర్లు చెప్పుకునే వారిలో ఉండే మాంద్యం కొన్ని విధాలైన కార్యశూరుల్లోనూ ఉంటుంది. ఇటువంటివారు ఒక్కొక్కప్పుడు ఉత్తమ క్రియాదక్షులనూ, జిజ్ఞాసువులనూ చూచి పరిహసిస్తుంటారు. జాన్సను రాత్రిళ్ళు ఏకాంతంగా కావ్యకర్మలో మేల్కొని ఉదయానంతరం నిద్రపోతుండేవాడు. ఆయన్ను చూచి ఒకప్పుడు ఇటువంటి వారు కొందరు పరిహసించారు. ఆ మహాశయుడు ఈ కోటిలో చేర్చదగినవారిని గురించి

జిజ్ఞాస చేసి 'ఒకడు సాలీళ్ళను పట్టుకొని సూక్ష్మదర్శితో దానికెన్ని కళ్ళున్నవో పరిశీలించటానికి జీవితమంతా వ్యర్థం చేస్తున్నాడు; మరొకడు అందమైన పూలలో పుప్పొడిని విడదీసి విచ్ఛేదయంత్రమందు కాలం గడుపుతున్నాడు. కొందరు గాలుల రాకపోకలను పరిశీలించి వాటిని 'ఉల్టా సీదా' చెయ్యవచ్చు ననే తృప్తితో చనిపోతున్నారు. ఇంతకంటే ప్రముఖులు కొందరు రంగులేని రెండు పానీయాలను కలపటంవల్ల కొత్త రంగు వస్తున్నదని గమనించి, ఒక మహత్తర విషయాన్ని దర్శించి లోకోపకారం చేశామన్న తృప్తితో దేహయాత్ర చాలిస్తున్నారు. వీళ్ళందరినీ మనోమాంద్యులని అనవలసిన స్థితికి నన్ను పురికొల్పుతున్నారు' అని అన్నాడు. ఆయన చెప్పినట్లు ఇటువంటివారిలో మానవత్వం లుప్తమైపోతుంది; పైశాచిక జఠర ఉంటే ఉండవచ్చు.

నిశితంగా ఏ విషయాన్నైనా ఆలోచించవలసిన అగత్యం లేని ఖాళీ మనస్సూ, అతివాచాలమైన జిహ్వా రెండూ ఏకోదరాలు. గోరంతలను కొండంతలు చేసి ఆలోచించటం శూన్యమైన మానసానికీ, నీలాపనిందలకు రెక్కలు కట్టి లోకంలో ఎగరవెయ్యటం వాచాల జిహ్వకూ లక్షణం. కులాసా కబుర్లు మాత్రమే చెప్పగల వాడికీ రెండూ తప్పకుండా ఉండితీరుతవి.

కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసే ఏ 'బృందం' దగ్గరికైనా వెళ్ళి ఓ చిరునవ్వు పారేసి 'ఏమండోయ్ ఏం మాట్లాడుకుంటున్నా?' రని ప్రశ్నిస్తే, రింగు లీడరును చూపించి 'మనవాడు ఏమేమో కోసేస్తున్నాడండీ' అని అతని ముఖాననే అనేస్తుంటారు. దానికి అతని అంగీకారం ఉండీ, ఉండనట్లు 'కబుర్ల రాయుడు' స్మేరాననుడౌతాడు. ఏ దేశంలోనైనా కబుర్లు చెప్పుకునే వాళ్ళు బృందాలుగా ఏర్పడి, విషయాన్ని బట్టీ, కాలాన్ని బట్టీ వ్యక్తులు మారిపోతూ కాలక్షేపం చేస్తుంటారు. వారి మధ్య 'గ్రహరాట్టులా కబుర్ల రాయుడు'. అతని 'వాచామగోచర వాచాల విన్యాసాలతో', శ్రోతల దృక్సరోజతోరణ మాలాలంకృతుడౌతూ, ఉన్నతాసనాన్నీ, ఉత్తమ గౌరవాన్నీ పొందుతుంటాడు. అతగాడు 'వాక్రుచ్చే' అన్నీ సర్వాబద్ధాలనీ, చట్టసమ్మతాలు కానివనీ 'మనో వాక్కాయ కర్మలా' వ్యక్తీకరిస్తున్నా అతనిని మానమనటం గానీ, శ్రోతలు వినకపోవటం గానీ జరగదు. ఇందుకు ప్రధాన కారణం అతని మాటల్లో ఉన్న 'అయస్కాంత శక్తి'. అది అతడికి ఎలా లభించిందని ప్రశ్నించి చూస్తే వినేవాళ్ళు ఇచ్చిందే! ఉబుసు పోకకు కబుర్లు చెప్పే వ్యక్తులు ఆ సంఘాలు గానీ, మానవ సమాజంగానీ ఇచ్చే గౌరవ మర్యాదలను పరిశీలిస్తే మానవజాతికి కట్టుకథలన్నా, అసత్యవాక్పాటవమన్నా ఎంత ఆసక్తో అవగతమౌతుంది. అందుకనే ఎక్కువ మందికి కులాసా కబుర్లే 'ఖుషీ'గా

ఉండటమున్నూ, చెప్పేవాడు బట్టతలలకూ, మోకాళ్ళకూ ముడి పెట్టుతున్నా ముచ్చటపడి విని మురిసిపోవటమున్నూ. విశేషంగా మానవజాతిలో ఉన్న ఈ దౌర్బల్యం గమనించటం వల్ల కబుర్ల రాయుళ్ళు జైత్రయాత్ర సాగిస్తున్నారు. లోకాలను జయిస్తున్నారు. వారు చెప్పేమాటలు, 'గగన కుసుమాలనీ' అజాగళస్తనాలనీ, నేతిబీరకాయలనీ గ్రహించినా ఏమీ వెరపు లేదు. అతడు 'ప్రియ వాది'. 'అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః!' అన్న ఆర్యోక్తిని తెలుసుకోకపోయినా సారాంశాన్ని గ్రహించి వ్యవహరించటం అతని లక్షణం.

కబుర్ల రాయుడు లోకం సమస్తం అతనికి అవగతమైనట్లే మాట్లాడుతుంటాడు. అతడి 'అనర్గళ వాగ్ధోరణీ సారణాల్లో' అనేకులు మహాపురుషులూ, మహాత్ములూ 'ఖూనీ' అవుతుంటారు. 'అందుమూలంగా అతను 'ఆత్మహత్య' చేసుకుంటున్నాడన్నమాట' అని తాత్త్వికులంటేనేం? ప్రసిద్ధి పొందినవాళ్ళమీద ఇతని 'వాగ్బాణాలు' పడ్డా పరవాలేదు. ఇటువంటి 'గరుడాస్త్రాలకు' నాగాస్త్ర ప్రయోగం చెయ్యగలిగిన 'నరనారాయణులు' వాళ్ళు. ఇంకా పేరు ప్రఖ్యాతులు ఎరగని వాళ్ళమీద 'కబుర్ల రాయుళ్ళు' విసిరే 'అంపగమి'కి ఉక్కిరి బిక్కిరై పోతుంటారు. అందుకనే ఓ ప్రఖ్యాత రచయిత వీరిని 'అగ్నితుల్యు' లన్నాడు. అగ్ని 'తనూనపాత్తు' – పుట్టిన దేహమంతా తానే ఐ ఉంటాడట. వీరూ అంతే – నిలువునా 'ఖుషీ' ఉంటుంది. దాన్ని కబుర్ల రూపాన లోకంలో వెలిబుచ్చి 'అశుచీక్షణు' లౌతుంటారు. అగ్నికి నల్లని జాడ అంటి ఉంటుంది – అందువల్ల ఆయన కృష్ణ వర్త్మ ఐనాడు; వీరూ కృష్ణవర్త్మలే – వీరిని అపకీర్తి వెన్నాడుతుంటుంది. ఆయనవలె వ్యక్తులను 'పరశురామ ప్రీతి' చేసే శక్తి వీరికి లేదు గాని దాహకులు.

ప్రఖ్యాతులైన వ్యక్తుల మీదుగానో, ఇరుగు పొరుగు గృహస్థుల మీదుగానో కబుర్ల కమనీయ జిహ్వారథం నడుస్తుంది. అవహేళన అతని రథానికి కట్టిన అశ్వం. దాని కాంతీ, సటాచ్ఛటలూ, హేషితాలూ శ్రోతలను ఆకర్షిస్తవి. ఈ ఆకృష్టులైన వ్యక్తులకు కబుర్ల రాయని జిహ్వాజగన్నాథ రథ చక్రాల క్రింద నలిగిపోతున్న ప్రఖ్యాతుల ప్రజ్ఞా ప్రతిష్ఠలు గానీ, సామాన్య గృహస్థుల సమతా సౌమనస్యాలుగానీ ఎన్నడూ అర్థం కావు; అయితే వారికి బాధలేదు, ఆ ప్రయత్నమేలేదు గనక. వీరు 'జిహ్వా గ్రే వర్తతే లక్ష్మీ, జిహ్వాగ్రే మిత్ర బాంధవా' అన్న ప్రమాణానికి విపరీతార్థాన్ని కల్పించే శక్తిగల 'కబుర్ల రాయని' 'గారాబు శిష్యులు'. వీరి గురువర్యుడు 'సర్వజ్ఞుడు.' ఆయన లోకం సమస్తాన్నీ ఆకళించుకొన్న అఖిలజ్ఞుని వలె ప్రసంగిస్తాడు, ప్రవర్తిస్తాడు. అది సాహసమని గానీ, సత్యేతరమని గానీ అతడెరగడు. అతనిది దివాంధ దృష్టి.

'విన్న విషయాల్లో ఎక్కువ భాగం నమ్మకు. నమ్మినవాటిలో అతి స్వల్పాలు గాని సత్యాలు కావు' అని పూర్వం ఓ గురువర్యుడు శిష్యునికి బోధించాడట. ఇది నగ్న సత్యం. 'కబుర్లరాయని' 'జిహ్వాతూలిక' చిత్రించిన ఓ 'సహస్ర ప్రియ' సత్యానికి 'ప్రియవిరహ, కావచ్చును. అతడు 'ప్రియారహితగా' చూపించిన కురూపిని వేయిమంది ప్రేమించనూ వచ్చు, లోకంలో. సత్యాలకూ కులాసా కబుర్లలోని సత్యాలకూ ఇంత అంతరముంటుంది.

కబుర్లకు అపప్రథలూ, అపకీర్తులూ, అసత్యాలూ తాబేదార్లు. వీటికి ప్రచారం కల్పించే వాళ్ళు కులాసా కబుర్ల రాయుళ్ళు. కులాసా కబుర్లలో వ్యక్తులమీద గానీ, వస్తువుల మీదగానీ ఉండే ఈర్ష్య, క్రోధం, వైరం, వలపూ ఇత్యాదులు వ్యక్తమౌతూ ఉంటవి. ఈ సహజావ బోధలకు కళ్ళాలు వేసి లొంగ దీసుకున్న వ్యక్తులు ఇటువంటి వాటిలో పాల్గొనరు. అథవా ఏ కారణం చేతనైనా ఆ దుస్థితి సంభవిస్తే మానసికంగానైనా హర్షించరు. సాధ్యమైనంత త్వరలో కులాసా కబుర్లరాయుని ఆస్థానమనే 'బలిపీఠం' దగ్గరినుంచీ బయటపడే యత్నం చేస్తారు. అయినా ఎంత మోతుబరి పెద్ద మనుషులకైనా, జీవితాని కొకమాటే కావచ్చును. ఇటువంటి కబుర్ల 'గోష్ఠి'లో చేరటం తప్పటం లేదు. దానికి అన్నివైపులా అలముకొని ఉన్న వాతావరణ కారణం. అందులో కొందరు భాగస్వాములై క్రమంగా ఏదో లాభం ఒలికి పోతుందని, అటు తరువాత బయటపడలేక పోవటమూ జరుగుతుంటుంది.

'అసత్యకథాకల్పనం చేసేవాళ్ళు నీచులు; వాటిని ప్రచారం చేసేవాళ్ళు నీచాతినీచులు, అన్నారు పెద్దలు. కులాసా కబుర్ల రాయుళ్ళలో ఎక్కువ భాగం ఇటువంటివారే. ఎప్పుడైనా యిటువంటి కులాసా కబుర్లకు మనమే గురి అయినామని గ్రహించిన పెద్ద మనుషులు పట్టించుకోనట్లు ఓ చిరునవ్వు విసిరేస్తుంటారు. అంతకంటే ఉదాత్తులు "నా మీద అసత్య ప్రకటన చేసినందుకు నాకు బాధలేదు; కానీ 'సంతసంబగును కల్గన్ భుక్తి అవ్వానికిన్" అంటారు. జిజ్ఞాసువులు 'అయ్యో! పాప' మని వాళ్ళ దైన్య స్థితికి నిట్టూరుస్తారు. కులాసా కబుర్లు చెప్పేవాళ్ళు ఆత్మశక్తిని గానీ, స్వభావాన్ని గానీ గ్రహింపలేనివారేమో? – అని వారి చింత. వీరి మాటలవల్ల కలిగే ప్రయోజనము బహుస్వల్పంగా ఉంటుంది; దానికి లెక్క జేసి వారితో మైత్రినాశించవలసినంత అవసరం లేదు. వారి ప్రచారం వల్ల సంభవించే నష్టానికి భయపడవలసిన పని కూడా ఉండదు. పొరపాటున అటువంటి స్థితి సంభవించిన వ్యక్తికి దైహిక, మానసికారోగ్యాలు క్రమక్రమంగా లుప్తమైపోతూ ఉంటవి. 'సత్‌శీల

భానూదయం’తో వీరి ‘వాఙ్మిహికాజలధు’ లను ఆపోశనించగలనన్న అంతశ్శక్తి కలవాణ్ణి అవి అణుమాత్రమైనా కలత పెట్టలేవు.

కబుర్ల రాయుళ్ళు ఒక్కొక్కప్పుడు వాళ్ళను గురించే కోసేస్తుంటారు. ఆత్మస్తుతి కంటే ఆనంద ప్రదమైన విషయం ఏముంది గనక! అందరి గొప్పదనాన్ని గురించీ అవహేళనైతేనేం, వాళ్ళు భంగ్యంతరంగా పలుకుతుంటారు. వాళ్ళ మంచి చెడ్డలమాట ఎవరూ తలపెట్టకపోవటం, వాళ్ళ మనస్సును క్షుభితం చేయటం వల్ల ఈ పనికి పూనుకుంటారు. ‘ఎవరూ చెప్పనప్పుడు మన మైనా చెప్పుకోకపోతే ఎలాగనే వారి భయం. అనేకానేక సందర్భాలలో ఇటువంటివారికి ‘ఆత్మ విశ్వాసాన్ని’ అంటగట్టటమూ, ఆధిక్యమును గుర్తించటమూ లోకంలో గమనిస్తుంటాము. ప్రజాయుగంలో ‘స్వోత్కర్ష’ లేనిదే పైకి రాలేమేమో అన్నంత అనుమానం కలిగేటట్లు చేయగలిగారీ ‘ఆత్మ ప్రశంసాపరులు!’

కులాసా కబుర్లు చెప్పటమన్నా, వినటమన్నా, ‘మహిళాలోకం’ మహా ఆదరాన్ని చూపిస్తుంది. స్థూలంగా ఇవి వారి వినోదాలేనని ఏకగ్రీవంగా అంగీకరించవచ్చు. ‘కులాసా కబుర్లకు’ ఒక అధిదేవతను సృజించమని ఏ శతశిల్పిని కోరినా అతడు ‘స్త్రీ మూర్తినే’ సమాధినిశ్చలుడై దర్శించి తీరుతాడు. ‘వర్ణికాభంగం’లో అతనికి కొంత అనుమానం కలుగక తప్పదు. మూల ప్రకృతి వర్ణాన్నే భావిస్తాడు; విను “శిష్య భ్రువులను” చూచి నిశ్చలంగా వికటాట్టహాసం చేసే వికృత రూపినా, కాదు, విమలతేజోమూర్తిని సృజిస్తాడు.

స్త్రీలోకంలో కబుర్లు చెప్పటం ప్రారంభమైతే, పెళ్లి చేసుకున్న తరువాత ఆమె అంత అధమస్థురాలు ప్రపంచంలో లేదని ప్రతి అర్ధాంగీ ప్రారంభిస్తుంది. అంతటి నిస్పృహకు ఏదో నిగూఢమైన కారణం ఉండి ఉంటుందని ఏ మానసిక వేత్తా మనస్సును క్లేశపెట్టుకో నవసరం ఉండదు. సర్వసామాన్యంగా ప్రక్కయింటి ఆవిడ క్రొత్తగా చేయించుకున్న నెక్లెసో, ‘పెట్టి పూజ’ చేయను పెద్ద యింటి ఆవిడ కొనుక్కున్న క్రొత్త పేటంచు చీరో ఐ ఉంటుంది. అంతగా మనం పొరబాటు పడితే, తత్తుల్యమైనదే మరొకటి తప్పకుండా అయి తీరుతుంది. ఏమైనా ఒకటి సత్యం. ఇద్దరి మధ్య పచ్చిగడ్డి భగ్గుమనే అత్తాకోడళ్ళనూ విడివిడిగా పిలిచి కబుర్లు చెప్పించి, ‘పుల్లింగాలు’ పెట్టి వాళ్ళు కాట్లకుక్కలవలె పోట్లాడుకుంటుంటే మనసారా చూచి ఆనందించడం ఆంధ్రదేశంలో ప్రతి అత్తా కోడలికీ అర్థంగాని ఓ సరదా!. ఆధునిక యువతీ మణులలో,

కులాసా కబుర్ల పరిణామంగా 'ప్రేమ వసంతమూ, పెళ్ళి గ్రీష్మమూ' అని అనేక గోష్ఠుల్లో తేలిపోతున్నట్లునూ ప్రత్యేక విలేఖర్లు పదే పదే వ్రాస్తున్నారు.

లోకంలో ఇతరుల ప్రణయ, ప్రళయాలూ, ఆశనిరాశలూ, పాండిత్యా పాండిత్యాలూ, భయభక్తులూ కులాసా కబుర్లకు వస్తు విశేషాలు చెప్పేవారికి, త్రినయనాగ్నికి 'త్రిపురాలూ' దహించుకో పోవలసినదే. అనేక మాట్లు అతగాడొక్కడే 'స్వయం వ్యక్తి'గా శ్రావణ బెళగొళలోని గోమతేశ్వరుడివలె కొండమీద నిలిచిపోతాడు. ఇతరులెంతెంత వారూ 'ఇంద్రాదు' లౌతారు. వారు ఉత్తమానుత్తమాన్ని గానీ, పవిత్రతా పవిత్రతలను గానీ పాటింపని 'పరమా ద్వైతులు'. వీరివల్ల బాధపడ్డ ఒక జిజ్ఞాసువు అనాలోచితంగా అన్నాడు : 'కులాసా కబుర్లను చెప్పేవాళ్ళనూ, వినేవాళ్ళనూ శిక్షించే అవకాశమే నాకుంటే, ఒకరి నాలుకను – వక్త గనక – చిల్లి పొడిపించి చెట్టుకు కట్టిస్తాను; ఒక కర్ణ రంధ్రానికి తాడు కట్టించి ఏటవాళ్ళ కొండకొమ్మునుంచీ క్రిందికి జారవిడిపిస్తా' నన్నాడు. అటువంటి స్థితి వచ్చినా గట్టి న్యాయవాదులుంటే, ఈ 'అన్న వ్యక్తి' ముందు తన్ను తానే శిక్షించుకొని తరువాత ప్రతివాదులను శిక్షించేటట్లు అంగీకారం ఇప్పించవలసిందని కోర్టువారిని కోరి, అంతంలో అనంత దిగ్విజయం పొందగలరని నమ్మవచ్చు. ఈ వ్యసనానికి ఎప్పుడో ఒకప్పుడు పాలుగాని వాడుండడు. అందువల్ల ఇటువంటి 'అవకాశాన్ని' ఏ 'అభ్యుదయుడూ' కోరడు. ఇది నిశ్చయం.!

మంచి చెడ్డలమాట అలా ఉంచితే కబుర్లు చెప్పటం మటుకు అందరికీ చేత నౌతుందనుకోటం పొరబాటు. సహజ ప్రతిభతో పాటు వ్యుత్పన్నత ఉండి తీరాలి. కులాసాగా కబుర్లు చెప్పటమూ ఒక కళ. కళలు 'కాంతా సమ్మితాలు' అనంతాలూ అత్యద్భుతాలూ ఆనంద ప్రదాలు 'ఓమ్... తత్... సత్'

*– ఆంధ్రపత్రిక జనవరి **5, 1948***

# ప్రశస్త రాసభము

మహాసభ కార్యక్రమం అనంతంగా ఉంది, మళ్ళీ నిద్రకు అవకాశం దొరుకుతుందో లేదో, అది "చిత్తం ప్రసాదయతి, జీవన మాదధాతి, ప్రత్యంగ ముజ్జ్వలయతి ప్రతిభావిశేషం" ఇత్యాదిగా ప్రశస్తి గన్నది అని నిశ్చయించాను. దిఙ్మాత్రంగా ఆంజనేయ దండకాన్ని అరక్షణంలో మానసికంగా తిరగవేసి మైరేయ మాదకత్వంతో మేను శయ్యమీద వాల్చాను. అది జాగ్రదవస్థో' స్వప్నావస్థో చెప్పలేను. నలుదిక్కులను నల్లని పొగలు క్రమ్ముకోవచ్చి నా కళ్ళముందు కారుచీకట్లు ఆవరించాయి. ఆ అంధకార మధ్యాన్ని చీల్చుకొని వచ్చి ఓ చిక్కని కుచ్చుతోక ముచ్చటగా ముమ్మారు ఆడి నిలిచింది. ఏ ఉచ్చైశ్రవ దర్శనమో అవుతుంది. "మా పతిత జనోద్ధరణ సంఘాని"కి శుభపరంపరలు రానున్నవని మహానందపడుతున్నాను. పతిత జనోద్ధరణ పేరుతో హంగామాలు చేసి పత్రికాముఖంగా ప్రచారాన్ని సంపాదించి పైకి రాదలచుకున్న వాళ్ళుగాని, అందుమూలంగా అర్థకామాల ఆకలి తీర్చుకోదలచుకొన్న వాళ్ళుగాని మా సంఘంలో సభ్యులుగా మచ్చుకైనా ఒక్కరూ లేరు. అందు స్వార్థరహితులు కేవల కరుణాపరులు. దీనజనుల దుఃస్థితికి వసివాడి మనోవాక్కాయ కర్మలా వారిని ఉద్ధరించవలెననే అపేక్ష అతిశయంగా ఉన్నవాళ్ళు. అందుకు తమ శక్తిసామర్థ్యాలు ధారవోయటానికి సర్వసంసిద్ధులైనవాళ్ళు.

అపూర్వ దృశ్యంగా నా ముందు నిలచిన పృచ్ఛం లీలాప్రాయంగా రెండుమూడు చాలనాలను చేసి ఒక చక్రభ్రమణం చేసే స్ఫూర్తి చూపించేటప్పటికల్లా విచిత్ర భారీ కర్కశరాగ స్వరాలతో హారాలతో మూర్తిగొన్న కరుణగా నా మీద ఒక చతుష్పాత్తు నిలిచింది. నెమ్మదిగా దాని వెనక తుల్య సత్వరూపరేఖలతో అదే జాతి జంతువులు చిన్నవీ, పెద్దవీ కొన్ని గుంపు చేరి నిలిచాయి.

అప్రయత్నంగా నా నోట్లో నుంచి "చక్రీవంతః" అన్నమాట వెలువడింది. "చక్రం సమూహహస్తద్వంతః చక్రీవంతః" గుంపై ఉండేవి అన్నాను, చదువుకున్ననాటి సంస్కారంతో. జగత్సృష్టిలో చక్రీవంతాలు కాని జంతువు లేమున్నవి, మనుష్య జంతువులు చక్రీవంతాలు కావా? అన్నవి ఆ గుంపులో కొన్ని పెద్ద నోళ్ళు విప్పి.

వెంటనే నేను "ఖరాః" అన్నాను. "ఖం ముఖాంతర్వర్తి మహదాకాశ మేషా మస్తీతి ఖరాః" – ముఖంలో గొప్ప బయళ్ళు కలవన్న నా శబ్దార్థాన్ని గమనించి, పెద్దనోళ్ళు ఉండటం చేత ముఖంలో గొప్ప బయళ్ళు ఏర్పడటం మానవ జంతువుల్లో కొన్నిటికి లక్షణమై ఉండటం మీరు గమనించే ఉంటారన్నవి మరికొన్ని. ఇంతలో మొఱ పెట్టినట్లుగా ఒక చక్రీవంతం ఓంద్ర పెట్టింది. నేను "గర్ధభాః' రాసభాః – రాసంతే ఉచ్చైరితి రాసభాః గర్దంత్యుచ్చైరితి గర్దభాః" – బిట్టు మొఱపెట్టేవి అన్నాను. మహారణ్యాల్లో మహనీయ స్వేచ్ఛాసంచారం చేస్తూ మనోజ్ఞమైన జీవనం చేస్తున్న మమ్మల్ని మచ్చిక చేసుకొని ఆశలు ప్రేరేపించి తెచ్చి తమ మధ్యకు తెచ్చి మా వల్ల పొందదగ్గ మహోపకారాలన్నీ పొంది, ఇంకా కొన్నిటినీ పొందుతూ కూడా చిత్తచాంచల్యంతో, గజ హయాదులకు గౌరవ స్థానమిచ్చి మనస్సు మార్చుకొన్న మీ మనుష్య జంతువు తెచ్చిపెట్టిన తీరని దుఃస్థితికి శోకించి శోకించి మా కంఠాలిలా మారిపోయాయి. అన్నాడొక గార్దభ నేత.

మహాసభకు ముందు ఈ రాసభాదర్శన మేమిటని ఒక వంక కలవరం పొందుతూనే "ఇలా నన్ను చూడరావటంలో మీ ఉద్దేశ మేమి" టన్నాను సౌజన్యంతో. "మీ పతిత జనోద్ధరణ సంఘ దృష్టిని మా గార్ధభ జాతి సముద్ధరణం మీద కేంద్రీకరించవలసిందని అభ్యర్థించటానికి ఇలా సమూహంగా వచ్చాము. మాది పతిత జనోద్ధారణ సంఘం గదా! మీరు జంతువులు కదా ఇది ఎలా కుదురుతుందనుకోవద్దు. మనుష్యులు ఎంతటి జంతువులో మేమూ అంతటి 'జనులము.' జంతు శబ్దం మీకు కూడా రూఢమైనట్లు జన శబ్దాన్ని మాకు కూడా మీ సంఘ భవిష్యత్కార్యక్రమం ద్వారా రూఢం చెయ్యండి. మా పూర్వోన్నతిని, నేటి దుఃస్థితిని భావించి సమర్థించగల సామర్థ్యం మీకున్నదని మా గాఢ విశ్వాసం" అన్నాడు గార్దభ నేత. రాసభాలన్నీ ఐక్యకంఠంతో నాకు జయపెట్టినట్లు ఓంద్రపెట్టాయి. సెలవు తీసుకొంటున్నట్లు ఉన్నమిత పుచ్ఛాగ్రచాలనం చేసి కోలాహల ధ్వనులతో గార్ధభాలన్నీ తిరోగమించాయి.

సద్దుకు మెలకువ వచ్చి శయ్యపై కూర్చున్నాను. ఆలోచన ప్రారంభమైంది. జన శబ్దాన్ని జంతుపరంగా అన్వయించవచ్చా? తప్పేముంది? శబ్దవేత్త లంగీకరిస్తారు. లోకం అంగీకరిస్తుందా? లోకం క్రొత్త మాటలను ఎన్నిటిని అంగీకరించటం లేదు; ఎన్ని శబ్దాలకు క్రొత్త అర్థాలను కల్పించుకోవటం లేదు? ఏమైనా సరే 'జన' శబ్దాన్ని 'జంతు' పరంగా అన్వయించి మా పతిత జనోద్ధరణ సంఘదృష్టిని గార్దభ జనసముద్ధణకే కేంద్రీకృతం చేయాలని నిశ్చయించాను.

మా సంఘ సభ్యులంగీకరిస్తారా? లోకంలో గార్దభమంటే అణుమాత్రమైనా గౌరవం లేకపోగా, తిరస్కార దృష్టి ప్రబలంగా ఉంది. ఎవర్నైనా గట్టిగా తిట్టాలంటే గార్దభం పేరు ముందు వినిపిస్తున్నది.

"ఆడిన మాటం దప్పిన
గాడిద కొడుకంటు దిట్టగావిని అయ్యో!
వీడా నా కొక కొడుకని
గాడిద యేడ్చెంగదన్న ఘనసంపన్నా!"

అన్న చాటూక్తి ఈ తిట్టుకు మరింత ప్రాచుర్యాన్ని కల్పించింది. (దేశ) ద్రిమ్మరిని కంచర గాడిదలా తిరుగుతున్నాడంటున్నారు. ద్రిమ్మరితనం చేతకాకనేమో, ఆదరించి తిండి పెట్టేవాళ్ళు లేని కారణం వల్ల కలిగిన గార్దభానికి గాలిగాడన్న పేరు పెట్టారు. గార్దభానికి మందబుద్ధికి మారు పేరుంది. కొండవీటి రెడ్డిరాజన్యుల శ్వేతచ్ఛత్రచ్ఛాయల్లో "కవితాసతి వీర విహారం చేస్తున్న రోజుల్లో "బూడిద బుంగలై... కొండవీటిలో గాడిద నీవునుం గవివి గావుకదా అనుమానమయ్యెడిన్" అన్నాడు మహాకవి శ్రీనాథుడు ఒకనాడు. గోధనమని చెప్పుకొన్నట్లు, గార్దభ ధనమని చెప్పటం ఏ కాలంలోనూ ఉన్నట్లు కనిపించదు.

గజాదుల్లో భద్ర, మంద్ర, మృగీ జాతులున్నట్లు గార్దభాలలో భద్రాది జాతులున్న విషయాన్ని ఏ శాస్త్రకారుడూ పరిశీలించినట్లు కన్పించదు. పైగా "కుట్టకుంటే కుమ్మర పురుగనటం లోకలక్షణం." పేదకోపం పెదవికి చేటనే సామెత కనుకూలమైన స్థితిలో నేడు ఉండటంవల్ల కరవకపోతేనేం, శుద్ధసత్త్వ స్వభావం వల్ల గార్దభం కరవక పోవటం చేత మనుజలోకానికి కడు చులకనై పోయింది. ఎంత చులకన కాకపోతే "కరవగవచ్చునే బలిమి గాడిదలకున్ పులితోలు గప్పినన్?" అని అలికంబున యక్షిని దాచినట్టి సర్వజ్ఞుడు నాచన సోమనాథు డంతటి వాడంటాడా?

మాతా రుద్రాణాం దుహితా వసూనామ్
స్వసాదిత్యానా మమృతస్య నాభిః
ప్రణువోచం చికితేషు జనాయ
మాగా మూగా మదితు వధిష్ట ! — ఋగ్వేదం – మండలము VII

"రుద్రులకు మాత, వసువులకు దుహిత, ఆదిత్యులకు భగిని. అమృత స్వరూపమైన దుగ్ధానికి స్థానము అయిన గోవును ఓ మనుజులారా! వధింపకుడు.

ఇది బుద్ధిమంతులైన జనులకు నేను చెప్పుతున్నాను" అని గోజాతి మీద ఋగ్వేద కవి ప్రకటించిన అభిమానాన్ని ఏ కవీ ఎన్నడూ ప్రకటించినట్లు కనిపించదు.

సర్వజననిరాదరణ వల్ల వస్త్రభారవహనం, కుగ్రాసము లక్షణాలైనందు వల్ల కూడా గార్దభం పరిహాసపాత్రమైంది. లేకపోతే అన్యాపదేశంగానైనా ఒక కవి –

శా. "రేరే రాసభ! వస్త్రభారవహనాత్ కుగ్రాస మశ్నాసి కిం
రాజాశ్వావసథం ప్రయాహి చణకా బ్యూషాన్సుఖం భక్షయ ।
సర్వాన్ పుచ్ఛవతో హయా ఇతి వదం త్స్రత్రాధికారే స్థితాః
రాజా తై రుపదిష్టమేవ మనుతే సత్యం తటస్థాః పరే ॥"

ఓ రాసభమా! వస్త్రభారాన్ని వహిస్తూ ఈ చెడుతిండి తినటమెందుకు? రాజాశ్వశాలకు పోయి సుఖంగా సెనగలను భక్షించు. అచటి అశ్వాధిపతులు పుచ్ఛవంతాలన్నింటినీ హయాలనే అంటారు. రాజు వారి మాటలనే విశ్వసిస్తాడు. ఇతరులు తటస్థులుగా ఉంటారు. (నీకు ఏ భయమూ ఉండదు. దేశ ద్రిమ్మరితనం వల్ల నొప్పితో ఎప్పుడో కాళ్ళీడుస్తుంటే చూచినవాడల్లా అడ్డకాళ్ళ పెద్దమ్మలను గాడిద కాళ్ళవాడన్నాడు. 'గాడిద చెవులు' అన్న జాతీయం కూడా ఇలాంటిదే. త్రిస్థాయి సంగీతాన్ని వినిపించటంలో దివ్యశక్తి గల గార్దభాన్ని పట్టుకొని 'గాడిద చెవులు' అనటం కేవలం అన్యాయం! పాశ్చాత్యలోకంలో కూడా గార్దభ శ్రవణశక్తిని గురించిన ఈ అపోహ ఎందుకో కలిగింది. తాను పట్టుకొన్నదల్లా బంగారమయ్యే వరాన్ని పొంది, అత్యాశ చేత తన చుట్టూ ఉన్న సర్వస్వాన్ని స్వర్ణం చేసి, ఆకలితో అలమటించిన 'మైదాస్' రాజులు ఇతనికీ, 'పాన్' అనే సస్యదేవతకూ జరిగిన సంగీతం పోటీలో విజయాన్ని 'పాన్'కు కట్టబెట్టడం కోసం ఇతని చెవులను గార్దభాశ్రవస్సులుగా మార్చినట్లు కనిపించడం ఇందుకు తార్కాణం.) ఉత్సాహరాహిత్యానికి, మాంద్యానికి, మంకు పట్టుకు, మర్యాదావిహీనతకు సంకేతమైపాశ్చాత్య దేశాలలోను గార్దభం గౌరవప్రతిష్ఠలను ఏ కాలంలోనైనా ఆర్జించుకున్నట్లు కనుపించదు.

రూపరేఖల్లోగాని, బుద్ధివర్తనలలో గాని లోకంలో ఇంత వ్యతిరేకత ఉన్న గార్దభ జాతి సముద్ధరణకు స్థిరసంకల్పుండనైన నాకు "క్రియాసిద్ధిస్సత్త్వే భవతి మహతాం నోపకరణౌ" – మహాత్ములకు పని నెఱవేరటం ప్రభావం వల్ల కలుగుతున్నది. ఉపకరణాల వల్ల కాదు. అమంత్ర మక్షరం నాస్తి నాస్తి మౌషధం. అయోగ్యః 'పురుషోనాస్తి యోజక స్తత్ర దుర్లభః – మంత్రం కాని అక్షరం లేదు, ఔషధం గాని మూలిక లేదు.

యోగ్యత లేని పురుషుడు లేడు – కాని వాటిని 'సంఘటిత పరచువాడు లేడు అన్న పెద్దల సూక్తులే ఉద్బోధకాలు.

మర్నాడు సభాప్రారంభం కాకముందే వైయాకరణ సార్వభౌముడితో మాట్లాడి జంతు శబ్దాన్ని, మనుష్యులతో సహా సర్వజంతువులకు సామాన్యపరంగా వాడినట్లే 'జన' శబ్దాన్ని సర్వజంతు సామాన్య పదంగా ప్రయోగించే రూఢిని కల్పించవచ్చునని అనిపించుకున్నాను. మా సంఘంవారి అంతర్వలయంలోని (Inner Circle) ప్రధాన సభ్యులొకరిద్దరికి నా ఉద్దేశాన్ని సూచించాను. "ఆత్మవత్ సర్వభూతాని" అన్న అంశం మీద నాకంటె విశేష ప్రత్యయము గలవాళ్ళు, ఉదార కరుణామూర్తులు, వైచిత్రియెడ విశేషాసక్తి గలవారు అయినవారు రాసభసముద్ధరణ విషయంలో సర్వవిధాలా తోడ్పాటిస్తానన్నారు. నేను కొంత సాధనసామగ్రి సంపాదించుకున్నాను.

ఉపన్యాస ప్రారంభంలో దేవతాభక్తి విశ్వాసాల మీద విశేషత గమనించి "శీతలాదేవికి శ్రీవాహనోన్నతి చెలువొందె నేజాతి కాలము సామి" అన్న పంక్తికి మా సనాతన సభ్యుడొకడు సంతోషాన్ని ప్రకటించటం గమనించాను. గార్దభానికి ఉన్న సత్త్వప్రీతిని, శాంతిరస ప్రణయాన్ని ప్రత్యేకించి వివరించాను. రాసభ, గర్దభ, శబ్దోత్పత్తులు చెప్పి గార్దభానికి గల శబ్ద ప్రాధాన్యాన్ని ఉటంకించటం కొంత రక్తి కట్టింది. త్రిభువన భాండ నిర్మాణానికి కులాలుడు, మృత్తికలతో బాటుగా గార్దభము సహాయ కారణమైంది అన్న నా వాదం విన్నమీదట, ఒక తార్కిక శిరోమణి ఇది గొప్ప విషయమన్నట్లు నేత్రాలను విస్ఫారితం చేశాడు. విధాతృని ప్రధాననిర్మాణాలలో ఒకటి కావటం చేత శబ్ద ప్రధానము, సత్త్వ విస్ఫురితము అయిన రాసభము, పరిశుద్ధులకు గాని పట్టుబడనని అభివ్యక్తం చేయటం కోసము నేడు రజకుల నాశ్రయిస్తున్నది అన్న అంశం ఒక వర్గంవారికి మనోరంజకమైందన్న విషయాన్ని గమనించాను. ఉన్నదో, లేదో వేదంలో గర్దభప్రశస్తి కనిపిస్తున్నదన్న నా బుకాయింపు రాసభానికి శబ్ద ప్రామాణ్యాన్ని చేకూర్చటమే కాక కొంత వైశిష్ట్యాన్ని చేకూర్చింది.

"గంగి గోవుపాలు గరిటడైనను చాలు, కడివెడైన నేమి ఖరము పాలు?" అని వేమన్న తిరస్కార పూర్వకంగా ఏ దృష్టితో అన్నాడో గాని, ఖరము పాలు కడివెడు లభించటమంటే సామాన్యమా? ఖరము పాల ఘనత సర్వసన్యాసి వేమన్నకేం తెలుసు? కాని సౌందర్యపోషకాలున్న సంవర్ధకమైన ఖరక్షీరాన్ని స్నానద్రోణులతో నింపుకొని స్నానమాడి జగదేకసుందరిగా రూపొందిన క్లియోపాత్రా నడిగితే తెలుస్తుంది. ఈ సందర్భంలో గాడిదను పాలిచ్చి పొమ్మని తల్లి జోల పాట పాడటం, "పాటిమీద

పోయె ఓ పల్లెగాడిదా! పరిగెత్తి అబ్బాయికి పాలిచ్చి పోవె” అన్న జానపద సాహిత్యంలో పేర్కొనదగ్గది.

కృష్ణావతారం సమయంలో గార్దభం చేసిన మేలు లోకం ఎన్నడూ మరువజాలదు. చెరసాలనుంచి చిన్ని కృష్ణుని గోకులానికి చేర్చేటప్పుడు వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్న విషయం పురాణప్రసిద్ధం. ఎప్పుడో రజకుని ఇంట దొంగలు పడ్డారని ఓండ్రపెట్టి మేల్కొలిపిన సందర్భాన్ని అపార్థం చేసుకుని, వసుదేవుడు తొందరపడి గాడిద కాళ్ళు పట్టుకున్నాడేగాని దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం పరమాత్మ అవతరించిన అంశాన్ని అర్థం చేసుకోలేనంతటి అవ్యక్తప్రాణి కాదు గార్దభం.

ప్రాచీన రాజవంశీయులలో గౌరవప్రదమైన జంతువులను తమ వంశచిహ్నంగా ఉంచుకోవటం కద్దు. దేవగిరి యాదవ రాజవంశీయులు మేషశిరాన్ని తమ రాజవంశ చిహ్నంగా నిలుపుకున్నారు. అలాగే గార్దభ వంశీయులు రాసభశీర్షాన్ని తమ రాజచిహ్నంగా స్వీకరించి ఉంటారనటంలో చరిత్రకు వ్యతిరేకత ఎక్కడా ఉండదనుకుంటాను.

అజ్ఞాని ఐన రజకుడు అపార్థం చేసుకుని కుర్కురాన్ని శిక్షించే బదులు గార్దభాన్ని చంపుకొని అప్రతిష్ఠ తెచ్చిపెట్టాడే గాని, ఆ కథాసందర్భంలో కూడా తప్పిదం గార్దభానిది కాదనే మా మతం. “సాదురేగిన తల పొలమున గాని నిలువదన్నట్లు” అప్పుడప్పుడూ గగ్గోలుగా ఓండ్రపెట్టినా గార్దభం అతి సత్త్వప్రధానమైన జంతువు. కనుకనే జీసస్ ప్రభువు ధర్మవిజయం కోసం జెరూసలెంకు ధర్మ జైత్రయాత్రకు బయలుదేరేటప్పుడు గార్దభవాహనారూఢుడై పయనించాడు.

ఎవరెన్ని రీతుల తిరస్కరించినా బిడ్డల తిరస్కారాన్ని పొందని జంతువులు లోకంలో గార్దభాలే. అందువల్లనే “బాలేయా” లన్న పేరు ఈ జంతుజాతికే దక్కింది. బాలేఖ్యువత్సే భవ్య హితాః బాలేయాః – తమ పిల్లలకు హితమైనవి. మనుష్య జంతువులతో సహా ఇలా బాలేయా లనిపించుకోదగ్గవి లోకంలో మరొక జంతుజాతి శశవిషాణం!

ఈ ప్రయాణసమయంలోనే గార్దభ పృష్ఠప్రదేశంలో నీలిమచ్చ ఏర్పడ్డది. అక్కడి కేశాలు ఒకటి రెండు పెరికి కోరింత దగ్గు ఉన్న పిల్లలకు మెడలో తావీజు కట్టితే, అది చేతితో తుడిచినట్లు తగ్గిపోవడం ఈ నాటికీ పశ్చిమాసియాలో స్థిరమైంది. అన్నట్టు ఆసియా సమైక్యతకు అత్యంతకృషి చేస్తున్న మనకు గార్దభం ‘ఆసియా జంతువు’

అని తెలుసుకోవటం, దాన్ని సముద్ధరించే కార్యక్రమవిషయంలో అత్యంతావశ్యకమైన అంశం. "కరవగ వచ్చునే బలిమి గాడిదకున్ పులితోలు గప్పినన్" అని తరువాతి కాలంలో చులకనగా చూడబడటం తటస్థించినా, ఒకనాడు స్వేచ్ఛా సంచారం చేస్తూ కదుపులు కదుపులుగా ఆసియా మహారణ్యాలల్లో గార్దభం విశృంఖల విహారం చేస్తున్న దినాలలో, అవి జగదేకవీరుడు సీజర్ మహాశయుని హయరత్నాలను వెన్నాడి పట్టుకొని హతమార్చి మిగిలినవాటిని త్రిప్పి పంపినట్లు యాత్రాగ్రంథాలవల్ల తెలుస్తున్నది.

ఇంతేకాదు, ప్రాచీనులైన ఈజిప్ట్ దేశీయులకు, రోమనులకు, గ్రీకులకు గార్దభం అతి పవిత్రమైన జంతువు. వారి దృష్టిలో ఇది ఎప్పుడో రసోద్రేకం కల్గినప్పుడు ఓంద్ర పెట్టటం తప్ప తెలివి తక్కువతనం లేని జంతువు. అంతేకాదు, మేధాసంపత్తి గల ప్రాణి. అమితమైన ఆధివ్యాధి నివారకములైన నంత విచిత్రశక్తులు గల జంతురాజము. పరోపకారం చేయటంలో, అన్యుల బాధను తాను అనుభవించటానికి అంగీకరించేది. వృశ్చికం కుట్టినవాళ్ళు దానిపై నెక్కి చెవిలో "నన్ను తేలు కుట్టిం" దని చెపితే వెంటనే ఆ బాధను తాను పుచ్చుకొని అవతలి వ్యక్తికి వ్యథానివృత్తి కలిగిస్తుందట!

అన్నీ చెప్పి రసరాజమైన శృంగారం విషయంలో గార్దభానికున్న ఘనతను కప్పిపుచ్చటం శ్రేయస్కరం కాదు. రాసభ భోగరాసిక్యాన్ని –

"ఆఘ్రాయాఘ్రాయ గంధం వికట ముఖపుటో దర్శయన్ దంతపంక్తిం
ధావత్యున్ముక్త నాదో ముహురపి చ రసాత్ భ్రష్టయా పృష్ఠలగ్నః ।
గర్దభ్యాః పాదఘాత ద్విగుణిత సురతప్రీతి రాకృష్ట శిశ్నో
వేగాదారుహ్యాముహ్యాన్ అవతరతి ఖరః ఖండిత శ్చిరేణ ॥"

అని ఇలా వర్ణించటంలో అతిశయోక్తి అణుమాత్రం లేదు. "గర్దభ్యాః పాదఘాత ద్విగుణిత సురతప్రీతిః" అన్నది శృంగార రాసిక్యవిషయంలో పరాకోటినందున్న స్థితి అనటం ఛిన్న సంశయం. సత్యభామాపాదతాడిత శిరోరసికుడైన శ్రీకృష్ణుడే ఇందుకు సాక్ష్యము.

కామాంగ దైర్ఘ్యం వల్ల గార్దభం లైంగిక చిహ్నం (Sexual Symbol) గా రోమక లోకంలో విఖ్యాతి గన్నది. ప్రేమికులు శుభం కోసం గార్దభశీర్షాలను శయ్యలపై వ్రేలాడదీయించేవాళ్ళట! ఆఫ్రొడైట్ సయోనీసస్‌ల పుత్రుడైన వెరియపస్ అనే రోమక దేవత 'దుష్టో' కామోద్రేకవిజృంభణం నుంచి తన్ను తప్పించినందుకు 'ర్షియా' గార్దభాన్ని శ్రవఃకింకిణులతో అలంకరించి తన ఆలయాలలో గౌరవస్థానాన్ని కల్పించింది. చెడ్డ

తప్పిదాలను చేసినవారిని, అవమానించదలచినవారిని గాడిదపై ఎక్కించి ఊరేగించటం అన్ని దేశాలలోనూ ఆచారంగా ఉన్నదనటానికి, మహాజ్ఞాని సోక్రటీస్ అజ్ఞానులైన గ్రీకులవల్ల పొందిన శిక్ష నిదర్శనముగా ఉంది.

మానవజాతి సాంస్కృతిక చరిత్రలో గోయుగం, దాన్ని త్రోసిపుచ్చి, అశ్వయుగం, అశ్వయుగాన్ని త్రోసిపుచ్చి యాంత్రిక యుగం వచ్చినట్లు స్పష్టరూపంగా గోచరిస్తున్నది. కాని మానవచరిత్రలోనే ఆదిగ్రంథమైన ఋగ్వేదంలో గోయుగం మహోన్నతంగా, ప్రస్ఫుటితమౌతున్నది. అంతకు పూర్వమైన ఆధారాలేవి లభించినా, గార్దభయుగం ఒకటి ఉండి తీరుతుందని, మానవుడు సాంస్కృతికంగా కళ్ళు తెరువక పూర్వమే గార్దభం అతడికి అనంతంగా సేవ చేసిందనీ మా దృఢనిశ్చయం. ఈ జాతి అదృష్టం మానవజాతి అజ్ఞానం వల్ల తారుమారైంది. 'Symbol of cow is a purity and a live epic of India' – అన్నాడు మహాత్ముడు. నేడు ఈ జాతి నుద్ధరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ నాడు నాకు ఇంత గార్దభాభిమానమున్నదని చెప్పుకోటానికి సంశయించలేదు. మనకు రాన్ బ్రీవెర్ అనే జర్మనీ దేశీయుడు మార్గదర్శి సౌత్ హాల్‌లో గార్దభ ఘోషాన్ని నడుపుతూ 'ధూమపత్రరాజు', 'స్వర్ణరాజు' ఇత్యాదిగనే తాను తన్ను "గార్దభ రాజు" నని నిర్భీతితో వ్యవహరిస్తున్నాడు. మీరు గార్దభ జనోద్ధరణకు పూనుకొంటారనీ మా పతిత జనోద్ధరణ సంఘం మీకు సర్వవిధాలా సహకరిస్తుందని మనవి చేస్తూ, సభాసభ్యుల హర్షధ్వానాలను అందుకొని నా ప్రశస్త రాసభోపన్యాసాన్ని పూర్తి చేశాను.

# సాహిత్యంలో చంద్రుడు

"వెండిగిన్నెల్లోన వెన్న పెట్టుకొని,
పమిడి గిన్నెల్లోన పాలు పోసుకొనీ,
తేరుమీదా రావె తేనెపట్టూ తేవె,
కొండమీదా రావె కోటిగిన్నె తేవే,
చందమామా రావె జాబిల్లి రావె –"

అని తన కోసమూ, తమ్ముడి కోసమూ, ఆకాశవీథిలో నిత్యయాత్ర చేసే చంద్రుణ్ణి తెలుగు ఆడబిడ్డ అనాదినుంచీ ఆహ్వానిస్తూనే ఉన్నది. అయితే చందమామ తెలుగు బిడ్డలకు ఏ నాటి మామ? ఎలా మామ? – జగదేకమాత లక్ష్మీదేవితోబాటు క్షీరసముద్ర గర్భాన జన్మించటం వల్లనేనా అతడు మామ?

"స్త్రీలకు నేనంటే ప్రీతి. జానపద పదాలు పాడుకుంటూ నా వెన్నెట్లో వాళ్ళు రాటం త్రిప్పి నూలు వడుకుతుంటారు"; "నేను వెలుతురు నీకివ్వకపోతే నీకు బ్రతుకే లేదు" అని సూర్యచంద్రులిద్దరూ ఒకరినొకరు ఎద్దేవా చేసుకుంటారు. సూర్యుడు చంద్రముఖాన ఇసుక చల్లుతాడు. ఆమె ముఖాన మచ్చలు ఏర్పడతవి. కొంతకాలానికి సంధి కుదిరి ఇద్దరూ పెళ్ళి చేసుకుంటే సంతానం కలిగింది. మళ్ళీ మనఃస్పర్ధలు. చంద్ర సూర్యుడికి విడాకులిచ్చి ఇంట్లో నుంచి లేచిపోయి బిడ్డలను ముక్కలు ముక్కలుగా చేసి పైకి విసురుతుంది. ఆకాశంలోకి వెళ్ళినవన్నీ నక్షత్రాలూ, నేలమీద పడ్డవి జలచరాలూ, జంతువులూ అయినవి. – ఇవి ఫిలిప్పైన్ జాతివారి సూర్యచంద్ర కథనంలో ముఖ్యాంశాలు.

నీగ్రోజాతి పుక్కిటి పురాణాల్లో సూర్యచంద్ర లిద్దరూ స్త్రీ మూర్తులు. అన్యోన్యం వారి సంతానాన్ని చంపుకొని తినటానికి సంధి చేసుకున్నారు. దానికి విరుద్ధంగా చంద్ర సంతానాన్ని సూర్య కంటికి కనబడకుండా పగలు దాచిపెట్టి, రాత్రిళ్ళు బయటకు తీసుకోవస్తుంది. వాళ్ళే నక్షత్రాలు.

ఆదియుగంలో సూర్యుడు భూమి మీదనే నివాసం చేస్తుంటే 'టిట్రరే' అనే రేచుక్క వెంబడించి అతణ్ణి మింగేస్తుంది. అతని ఎముక ఒకటి ఆకాశంలోకి ఎగిరి "కొడవలి"

ఆకారంతో చంద్రుడై క్రమక్రమంగా పూర్ణరూపాన్ని పొంది ప్రకాశిస్తుంది. నాయకుడి డాలుమీద చిత్రితమైన చంద్రరూపం రాత్రిళ్ళు ఆకాశంలోకి ఎగిరి వెన్నెల కాస్తుందని ఒప్పోజా గుంపువారి నమ్మకం.

'త్సుకియోమి' చంద్రదేవత 'ఇజానగి' (పింటోవారి పరమాత్మ) దక్షిణ నేత్రం నుంచి ఉద్భవించాడని జపానువారి నమ్మకం. 'హెంగో' అనే చైనావారి చంద్రుడు పూర్ణంగా అమృతపానం చేయలేకపోవటం వల్ల స్వర్గానికి వెళ్ళుతూ దారిలో ఆగిపోయిన 'త్రిశంకువు'. రాత్రిళ్ళు మాత్రమే ప్రకాశించే అతణ్ణి పట్టుకొని అహర్నిశలూ అమృతప్రదానం చేసేటట్లు చేసుకోవాలనే సంకల్పంతో, 'చిన్' జాతిపూర్వులు ఆకాశాన్ని అందుకునే మేడలు కట్టడానికి ప్రారంభించారు. వినికిడి వల్ల చంద్రుడిది తెలుసుకొని ఒక పెద్దవెన్నెల తుపాను రేపి ఆ సౌధాల నన్నిటినీ నేలమట్టం చేశాడు.

దొంగలకూ, గూఢచారులకూ అధిదేవత ముసల్మానుల 'షాహూర్' అనే చంద్రదేవత. త్రిమూర్తులలో ఒకడు. బాబిలోనియా జాతి త్రిమూర్తి గణంలో 'సిన్' అనే చంద్రదేవత, ప్రథమ – షమాస్ (సూర్యుడు) 'ఇష్ తార్' లతో బాటు.

గ్రీకుల చంద్రదేవత 'సెలినీ' యౌవన ప్రదాయిని; హృద్రోగాలకు కారకురాలు. సూర్యుడు (హెలియస్) ఉషస్సు (ఇవోయస్) లకు తోబుట్టువు.

ఈ నాగరక, అనాగరక పురాణాలూ, పుక్కిటి పురాణాలూ పురస్కరించుకొని ఆయా జాతుల్లో అనంతంగా సారవత్సాహిత్యమూ, జానపద సాహిత్యమూ పుట్టినది; నేటికీ పుడుతూ ఉన్నది.

సీ. "ఒక వేయి తలలతో నుండ జగన్నాథు
బొడ్డుదమ్మిని బ్రహ్మ పుట్టె మొదల,
నతని గుణమ్ముల నతని బోలిన దక్షు
డగు నత్రిసంజాతు డయ్యె నత్రి
కడగంటి చూడ్కుల కలువల సంగడీ
డుదయించి విప్రుల కోషధులకు,
నమర ధరాతతి కజుని పన్పున నాథు
డైయుండి రాజసూయంబు సేసి

తే. మూడు లోకముల –"

చంద్రుడు గెల్చినట్లుగా మన భాగవతపురాణం పలుకుతూ ఉన్నది.

భారతీయుల అనేక ఆచార వ్యవహారాలు చంద్రుడిమీద ఆధారపడ్డవి. చాంద్రమానమే కర్మకాండకు ఆధారము. కృచ్ఛ్రచాంద్రాయణమూ, సూర్యచంద్రుల నోములూ మన ఆచారాలు. రెండు సంక్రాంతుల నడుమ గౌణచంద్రుడూ, ముఖ్యచంద్రుడూ ఇద్దరూ కనిపిస్తే కొన్ని కర్మలు ఆగిపోతవి.

'కుముదాప్త బాంధవుని కొమ్ము తరిగితే కాటకం తప్ప'దని ముసలమ్మల నమ్మకం. జాతకచక్రాలలో "చంద్ర లగ్నాత్" చూడవయ్యా ఎలా ఉందో నంటాడు శాస్త్రవేత్త తోడి జ్యోతిష్కుడితో. హృద్రోగాలు పెరిగి వైద్యులతరం కాకపోతే "కాస్త చంద్రుడికి జపం చేయించి, మానెడు సోలెడు యవలు దాన మిప్పించండి, నయం కాక దాని తాతకు అచ్చామా?" అనే ధీమాతో సలహా చెబుతాడు సిద్ధాంతి.

"ఆదిత్యాత్ చంద్రమసం చంద్రమసో వైద్యుతమ్" అని ఛాందోగ్యోపనిషత్తు పలుకుతున్నది. అయితే ఈ చంద్రలోకం వేరని చెబుతున్నారు వేత్తలు. అగ్నిహోత్రాది కాలైన వైదికకర్మలుగానీ, సప్త సంతానాదికాలు గానీ చేసినవారు చంద్రలోకాన్ని పొందుతారట! ఉత్క్రాంతి చెందిన జీవుడు రాత్రి దగ్గరకూ, రాత్రి కృష్ణపక్షం వద్దకూ, అది దక్షిణాయనం దగ్గరకూ తీసుకోపోతాయి. జీవుడు అక్కడనుంచీ భౌతికాకాశాన్నీ, దానినుంచి చంద్రలోకాన్నీ చేరి ఉదకశరీరాన్ని పొంది, కర్మ క్షయమయ్యేవరకూ సుఖంగా ఉండి, తరువాత ఆకాశాన్నీ, వాయువునూ పొంది మబ్బై వానగా మళ్లీ అవని మీద అవతరిస్తాడు.

చంద్ర చంద్రికల మీద మమకారం చేతనే శాస్త్రకర్తలు సహితమూ గ్రంథాలకు చంద్రిక, కౌముది ఇత్యాదిగ నామకరణం చేశారు. మేఘవిజయ కవి హైమకౌముది, భట్టోజీ దీక్షితుని సిద్ధాంత కౌముది, జయదేవుని చంద్రాలోకము – ఇత్యాదులు నిదర్శనాలు.

ప్రణయవిహ్వలులైన నాయికానాయకుల చేత అనేక అచేతనాలను దూతలుగా ఆహ్వానించేటట్లు చేసింది కవిలోకం. మేఘుని ఆహ్వానించి మేఘదూతమూ, శుకాలకూ, హంసలకూ అనంత వాక్ప్రౌఢిమను ప్రసాదించి శుకదౌత్యాలూ, హంసదౌత్యాలూ నడిపించారు కవులు. కృష్ణ చంద్రతర్కాలంకారుని సీత రామచంద్రునితో దౌత్యం నెరపటానికి చంద్రుణ్ణి ఆహ్వానించింది. ఆధునికులలో విశ్వనాథవారి 'శశిదూతము' 'సహస్రశీర్షా పురుష' వలె వేయి పడగలు విప్పినది.

– అంటే మనకు చంద్రుడంటే ఎంతో అభిమాన మన్నమాట. అతనికి నామకరణం చేయటంలోనే 'చది' (ఆహ్లాదనే) ధాతువును గ్రహించారు శబ్ద మహర్షులు. ఓషధీశు డతడేనని ఆంతరంగికంగా ఆమోదించారు.'అబ్జ' శబ్దంతో అతన్ని నీటబుట్టినవాడన్నారు. అతడు జైవాతృకుడు – పైరుపచ్చలను బ్రతికించేవాడు. అమృతతుల్యమైన సోమాన్ని ప్రసాదించడం వల్లనే సోముడైనాడు. స్థితిని బట్టి శశిధరుడూ, మృగాంకుడూనూ. 'వాగ్వై బృహతీ తస్యా ఏష పతి స్తస్మాదు బృహస్పతిః' అయిన బృహస్పతికి శిష్యుడు. తారాజారుడు. ఐతేనేం? శంకర శీర్షానికి అవతంసమైనాడు.

వైదిక సాహిత్యంలో చంద్రుడు 'సూర్యచంద్రమసు' లనే దేవతాద్వంద్వంలో ఒకడు. సోమయాగ విశేషాలను చెపుతూ "వాగ్దేవత కోసం స్థూలశరీరుడైన పశు వును ప్రాణపంచకాన్ని వరుణుడికీ, నేత్ర ద్వయాన్ని సూర్యుడికీ, మనస్సు చంద్రుడికీ, శ్రోత్రాలను దిక్కులకూ, జీవాత్మను ప్రజాపతికీ ఇవ్వవలసిం"దని తైత్తిరీయ బ్రాహ్మణంలోని ఒక అనువాకం అనుశాసిస్తున్నది.

చంద్రుడు గంధర్వుడు. "సుషుమ్నః సూర్యరశ్మి శ్చంద్రమా గంధర్వః" అని శ్రుతి. 'గాంధరిత్రేతి గాంధర్వః' అని నైఘంటికులు. ఇక్కడ సూర్యకిరణమే గోవు. సుషుమ్న మనే సూర్యకిరణాన్ని ధరిస్తున్నాడు కాబట్టి చంద్రుడు గంధర్వుడు. నక్షత్రాలనే అప్సరసలతో మిథునభావాన్ని పొంది చంద్రుడు క్రీడిస్తున్నాడని శతపథ బ్రాహ్మణఋషి కల్పన.

సూర్యచంద్రులిద్దరూ అశ్వినీ దేవతలు. 'అశ్వ' శబ్దానికి యాస్కాచార్య నిరుక్తం ఇలా ఉంది –

"కిం చంద్రమాః ప్రత్యుపకారలిప్సయా
కరోతి గోభిః కుముదావబోధనమ్ ।
స్వభావ ఏవోన్నత చేతసాం సతాం
పరోపకారవ్యసనం హి జీవితమ్ ॥"

"చంద్రుడు ఏ ప్రత్యుపకారాన్ని కోరి కలువలకు వికాస మిస్తున్నాడు? గొప్పవారు పరోపకారాన్ని చెయ్యటంలోనే జీవితాన్ని వినియోగిస్తారు" అని కవి ప్రకృతిసిద్ధమైన ఒక రహస్యం మూలంగా మానవజీవితం మీద నిశితవిమర్శ చేశాడు.

చంద్రుడికి కుముదినీప్రియత్వంతో బాటు పద్మవైరమూ కవిలోకసిద్ధము; మహా కవి భట్టుమూర్తి ఒక విరహిణి నోట –

శా. “ఈ వబ్జుండవు నీటబుట్టితిసుమీ యేనంచు మోమోటపుం
ద్రోవ ల్సెప్పగ సిగ్గుగాదె; – మరి, నీ తోబుట్టు శ్రీదేవి లీ
లావాసంబుసిరుల్ హరింతు వనుచో నయ్యో కళాదుండు చే
తోవీథిన్ సహజాధనాపహరణోద్యోగంబు నెగ్గించునే”

అని అనిపించాడు.

విరహిణులకూ, విధుమండలానికీ చుక్కెదురు. తాపాపనోదన మౌతుందని తరిపి వెన్నెలలోకి వెళ్ళితే, అది సంతప్తాగ్ని కావటం ప్రబంధనాయికలకు పరిపాటి. చంద్రోపాలంభం చెయ్యని చేడియ అరుదు. ఒక అంగన “ఇంతులను ఏచే పాతకమే నీకు అజహత్కళంకమైన” దని ఆడిపోసుకుంటుంది చంద్రుణ్ణి. విప్రలంభనాయికల దృష్టిలో చంద్రుడు కటిక కసాయి. “గోవధ చేసే తురకల దైవంబవు నీవు మొదల దక్కక పాంథ స్త్రీ వధము సేయ రోయుదె?” అని ఒక అతివ అర్థాంతరీకరిస్తుంది. పాపము! చంద్రుడు వారి నోట తినరాని తిట్లు తింటాడు. అందరికంటే అతిగడుసరి వరూథిని.

తే.గీ. “త్రిపుర సంహార మొనరించునపుడు హరుడు
బండి కల్లుగ నీమేను గండిచేసె
నదియు సెలవారి తెగటార వైతి చంద్ర
యకట! రోహిణియెడ నపథ్యమునజేసి.”

అని అతని చావును కోరుకున్నది. త్రిలోకకంటకుడవైన నీవు ఎప్పుడో ఒకప్పుడు నశింపకపోవని –

చ. “ఒక పెను బాపరేడు చలమొప్ప రసాతలసీమకున్ చకో
రకములు భూతధాత్రికి సురల్ దివికిన్ పగ దీరునట్లుగా
మెకమెకపాటుతోడ నిను మ్రింగకపోరెపుడున్, త్రిలోకకం
టకుడవుగాన నీ యొడలు నజ్జుగ జేసె కురంగలాంఛనా!”

అని అతనిని బెదిరిస్తుంది.

ఒక ఆషాఢమాసవిరహిణి “కురంగం నీవద్ద ఉన్నా శక్రచాపానికి గురి కాకపోవడమూ, మెరపు వేడికి భయపడి పారిపోకపోడమూ చాలా చిత్రంగా ఉన్న” దని ఆశ్చర్యపడుతుంది.

నాగరకవృత్తాన్ని అనుసరించి 'యక్షరాత్రి' నాడు మదిరాపానం చేసి మదోన్మత్తమైన ఒక నాయిక సురాచషకంలో ప్రతిబింబించిన చంద్రునితో చేసిన ఉన్మత్త ప్రలాపాన్ని ఒక మహాకవి –

"ఓ చంద్రుడా! ఎందుకీ మధుపాత్రలో ప్రతిఫలిస్తావు? మీ రోహిణీదేవిని తలవెంట్రుకలు లేనిదానినిగా చేయిస్తాను. పాత్ర జోలికి వస్తున్న వారిని ఈ మద్యముతో కలిపి నిన్ను గూడా మింగుతాను జాగ్రత్త! దగ్గరకు రాకు. మా రాజు కోపానికి, రోహిణీ దేవి కోపానికీ గురి ఔతావు. మా గుంపులో దేనినో కామించి వస్తున్నట్లున్నావు. లేక పోతే నీకీ క్షయ ఎక్కడినుంచి వస్తుంది? నీవు ఇతర స్త్రీలంపటుడ వని నీ భార్యలకు అనుమాన మున్నట్లున్నది. లేకపోతే మధు పాత్రలో ప్రతిబింబించిన నిన్ను ఈ తారలు ఎందుకు అనుసరిస్తున్నవి? నిన్ను ఎవ్వతో రమ్మని ఆశపెడుతున్నట్లున్నది. అందుకనే ప్రతి రాత్రీ పశ్చిమదిక్కుకు వెళ్లుతున్నావు" అని అతిరసస్ఫూర్తితో భావించాడు.

చంద్రుణ్ణి మహాకవులు నానావిధాలుగా ఊహించారు. ఒకరు 'అత్రిమునిలోచన భూషికా' అంటే, మురారి మహాకవి 'జ్యోత్స్నా కరంభ' మన్నాడు. తెల్లవారు జామున చంద్రుణ్ణి పేలపిండి కలిపిన పెరుగు ముద్ద అన్నాడు భోజనప్రియుడైన ఒక కవి రాజు. 'నభస్సీమంతినీ సిందూర రేఖ' అనీ, 'గగనసరోవరహంస' మనీ, 'ప్రాక్సతీలలాట తిలక' మనీ, 'గగనకాసార పోత' మనీ, 'అప్సరస్త్రీ కరసరోజ చమక' మనీ అనేకంగా పోలికలు కనిపిస్తున్నవి. సరోజినీదేవి అతణ్ణి 'A castemark on the azure brow of heaven' అని అన్నది. ఒకానొక ఆధునిక కవి అష్టమి చంద్రుణ్ణి చూచి 'అప్సరఃప్రణయినీ కబరీచ్యుత మాల' అన్నాడు. ఉదయించే చంద్రకాంతిని 'అభినవఖరయోషిత్క షాయకంఠ కాంతి' అని ఉపమిస్తే, తెలుగు కవి ధూర్జటి చంద్రోదయసమయాన 'శీతగభస్తి బింబశివాలింగంగా దర్శించి' పూర్ణోపమగా ఇలా ప్రస్తరించాడు :

మ. "ఉదయగ్రావము పానవట్ట మభిషేకోదప్రవాహంబు వా
ర్ధి, దరీధ్వాంతము ధూపధూమము. జ్వలద్దీప ప్రభారాజి కౌ
ముది, తారానివహంబు లర్పిత సుమంబుల్గా, తమోదూర సౌ
ఖ్యదమై శీతగభస్తిబింబ శివలింగ బొప్పు ప్రాచీదిశన్."

సాహిత్యంలో చంద్రుని సమగ్రస్ఫూర్తిని బహిర్గతం చేసేటట్లు 'అల్లసాని అల్లిక జిగి బిగువు'లతో కూర్చిన వర్ణన :

సీ. ‘కలశపాథోరాశి గర్భవీచిమతల్లి
కడుపార నెవ్వాని కన్నతల్లి
యనలాక్షు ఘనజటావనవాటి కెవ్వాడు
వన్నెవెట్టు ననార్తవంపు పువ్వు,
సకలదైవతబుభుక్షాపూర్తి కెవ్వాడు
పుట్టు గానని మేని మెట్టపంట,
కటికిచీకటి తిండి కరముల గిలిగింత,
నెవ్వాడు తొగకన్నె నవ్వజేయు

తే.గీ. నతడు వొగడొందు మధుకైటభారి మరది
కళల నెలవాడు, మించు చుక్కలకు రేడు :
మిసిమి పరసీమ వలరాజు మేనమామ
వేవెలుంగుల దొర జోడు. రేవెలుంగు.”

*– సాహితీ సమితి గోష్ఠిలో చదివిన వ్యాసము,*

*భాద్రపదము, భారతి, సర్వజిత్ (ముద్రితము)*